# THIRUMOOLAR
# THIRUMANDIRAM IN TELUGU

# తిరుమంత్రము

(తమిళ మూలమునకు తెనుగు తాత్పర్యము)



"ప్రేమే శివం"

"ఒక్కడే దైవము – ఒక్కటే కులం"

"నేను పొందిన బ్రహ్మానందము పొందనీ ఈ జగత్తంతా"

అనువాద కర్త

**క్రిష్ణ శెవ్వాన**

# THIRUMOOLAR
# THIRUMANDIRAM IN TELUGU
## For Tamil Moolam – Telugu Meaning

Telugu Translation by
**Krishna Sevvana**

First Edition:

Address: S.R. Krishna Rao
H 303, Aparna Cyber Commune
Nallagandla, Hyderabad 500019.
sevvanakrishna@yahoo.com
Mobile: 97046 55002

Cover Design
*YasasriNath Graphics - Hyd.*

Price: Rs.

పూజ్య మాతా, పితలకు

**కీ॥శే॥ శెవ్వాన నాగరత్నమ్మ** గారికి

**కీ॥శే॥ శెవ్వాన రంగనాయకులు** గారికి

హృదయ పూర్వక పాదాభివందనములు

# ఓం గం గణపతయేనమః

## గురు స్తుతి

గురుర్బహ్మః గురుర్విష్ణుః గురుర్దేవోః మహేశ్వరః గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః
అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవేనమః

షోడశాక్షరీ మంత్రోపదేశము చేసి
అనువాదము చేయుటకు ఆజ్ఞ ఇచ్చి
శిష్యునిపై తాబేలు వంటి దృష్టి సలిపి
హిరణ్య గర్భమున పరబ్రహ్మను దర్శించిన
సాంఖ్యయోగి, మృదుభాషి, మితభాషి
అన్ని ధర్మముల కన్న గృహస్థాశ్రమమే గొప్పదని
చాటి చెప్పి, తనూ అదే అనుసరించుచున్న

**కీ॥శే॥ పూజ్య శ్రీశ్రీశ్రీ నిత్యానంద్ గురువుగారికి**
కపిల కృష్ణ మఠము
చూలై, చెన్నై-600112

హృదయ పూర్వక పాదాభివందనములు

## దైవ స్తుతి

ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై
ఎవ్వని యందుడిందు, పరమేశ్వరుడెవ్వడు
మూల కారణం బెవ్వడ నాది మధ్యలయుడెవ్వడు
సర్వముతానయైన వాడెవ్వడు, వాని, నాత్మ
భవునీశ్వరు నేశరణంబు వేడెదన్!!

# రక్ష

షోడశాక్షరీ మంత్రోపదేశము చేసి
అనువాదము చేయుటకు ఆశీర్వదించిన
నా జ్ఞాన గురుదేవులును,
ప్రపంచమును రక్షించుచున్న
ధర్మము యొక్క నాలుగు పాదములైన
సత్యము, అహింస, దయ, శాంతి
ఈ పుస్తకమునకు శ్రీరామరక్ష.

# అంకితము

నా వేద ఉపనిషత్తుల గురుదంపతులు
నిష్టాగరిష్టులు, నిస్వార్థపరులు, సౌశీల్యులురు
సర్వధర్మపరిరక్షణకు, ధర్మవ్యాప్తికి
నిర్విరామముగా కృషి చేయుచూ శిష్యుల
ఆధ్యాత్మిక ఉన్నతి కొరకు అలుపెరుగక
బోధనలు చేయుచున్న
పూజ్యశ్రీ **కస్తూరి వీరరాఘవరావు** గారు
పూజ్యశ్రీ **మద్దూరి/కస్తూరి రాజ్యశ్రీ** గార్లకు
హృదయపూర్వక పాదాభివందనములతో
**"తిరుమంత్రము"** అనువాద గ్రంథము
సవినయ సమర్పణ.

# స్పందన

మహాజ్ఞాని, యోగసిద్ధులు శ్రీ తిరుమూలర్ నాయనార్ గారు రచించిన తమిళగ్రంథం యొక్క అనువాదము ఈ గ్రంథం. మూడువేల మంత్రములు కలిగిన మహాగ్రంథము ఇది. మంత్ర, యంత్ర, తంత్ర శాస్త్రములు, యోగశాస్త్రములతో బాటుగా వేదవేదాంగములు కూడా పొందుపరిచినది. ఈ విధంగా కర్మ, భక్తి, జ్ఞానములు కలయిక ఈ గ్రంథము. సంస్కృతభాషలో ఉన్న శాస్త్రములు శివుని ఆజ్ఞ మేరకే తాను తమిళంలో వ్రాసితినని వారు తెలిపారు. వారి జీవితము అత్యంత ఆశ్చర్యకరము. ఇట్టి ఈ గ్రంథాన్ని తెలుగులోకి అనువదించినవారు శ్రీ శెవ్వాన కృష్ణగారు.

శైవసిద్ధాంత ప్రబోధకమైన ఈ పుస్తకంలో సాధకునికి ఎంతో విలువైన విషయ సంపద లభ్యం అవుతుంది. శుద్ధశైవము, అశుద్ధశైవము గురించి అనువాదం చక్కగా ఉన్నది. అలాగే కాశ్మీరశైవము గురించి అక్కడక్కడ ప్రస్తావన ఉంది. అజపా వివరణ, పంచాక్షరి వివరణ పటములతో వివరించిన పద్ధతి పాఠకునికి తేలికగా అర్థమయ్యేటట్టుగా ఉంది.

ఉపదేశ సారాంశముతో మొదలుపెట్టి పాఠకుడిని లోతులలోకి తీసుకుని వెళ్ళారు. యజ్ఞోపవీత వివరణ వల్ల అంతరార్థం తెలిసినది. హఠయోగములోని కుండలినీ, షట్చక్ర నిరూపణ, ఇడ పింగళ సుషమ్న నాడుల వివరణ, సాధన, ప్రాణాయామాల ఓంకారోపాసన, నాదోపాసన ద్వారా సహస్రము చేరు విధానము మొదలైనవి చర్చించారు. పూర్తి ఆగమ, శివ సాంప్రదాయముతో ఉన్న ఈ గ్రంథము వామాచార ఖండనము ద్వారా, ఏది ఉత్తమమార్గమో తెలిపినది.

ఇట్టి అపూర్వమయిన తమిళగ్రంథాన్ని తెలుగువారు అయిన శ్రీ శెవ్వాన కృష్ణారావు గారు తెనిగించడం, అదీ ఎంతో నైపుణ్యంగా భావం చెడకుండా వ్రాయడం ఎంతో గొప్ప విషయం. కొన్ని మంత్రాలకి బ్రాకెట్టులో వివరణ వల్ల బాగా అర్థం అవుతోంది. శ్రీ శెవ్వాన కృష్ణగారు ధన్యులు.

ఆరోగ్యం సహకరించకపోయినప్పటికీ ఎంతో దీక్షతో ఈ అనువాదం పూర్తి చేసారు. వారు మరింత ఆధ్యాత్మిక ప్రగతి పొందాలని ఆ సర్వేశ్వరుని ప్రార్థిస్తున్నాను.

శుభం భూయాత్

ఇట్లు

నల్లగండ్ల బుధజన విధేయుడు

8 జనవరి 2023 **డా॥ జి.ఎస్.ఎన్. మూర్తి**

# కృతజ్ఞతలు

ఈ పుస్తకము డి.టి.పి. మరియు ప్రచురణకు ఆర్థిక సహాయము చేసిన పుత్రుడు శెవ్వాన సురేంద్రనాథ్ మరియు పుత్రిక శెవ్వాన/సిద్ధాబత్తుల శోభన వారికి, వారి కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి ఆయురారోగ్యములతో సర్వఐశ్వర్యములు, ఆధ్యాత్మిక చింతన, జ్ఞానప్రాప్తి కలగాలని, సర్వాభిష్టములు నెరవేరాలని దేవాదిదేవుణ్ణి ప్రార్థిస్తున్నాము.

డా॥ గరిగిపాటి సత్యనారాయణ మూర్తిగారు, మా గురు దంపతులు శ్రీ కస్తూరి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యశ్రీ గార్లు బోధించు వేదాంత గ్రూపులోని సహాధ్యాయులు. వీరు నా సహపాఠియే గాని వీరు ముందుగా ఆధ్యాత్మిక సాధనలు చేసిన చాలా అనుభవజ్ఞులు. డా॥ మూర్తిగారు వైద్యవృత్తి నిర్వహించుచూ, గృహస్థాశ్రమమునందుండే ఉత్తర భారతదేశములోని కొన్ని ఆధ్యాత్మిక శిబిరములలో పాల్గొని కొంతకాలము అచ్చట బసచేసి సాధనలు, బోధనలను ఔపాసన పట్టి ప్రగతి సాధించినవారు.

వీరి గురువుగారు శ్రీ నిర్వికల్పానంద భారతీస్వామివారు (గుడివాడ). తన గృహస్థ సద్ధర్మములను తీరుబాటులేక నిర్వహించుచున్ననూ, నా వ్రాతప్రతులలోని అక్షర, పదదోషములను సరిదిద్ది, కొన్ని శాస్త్ర సాంకేతిక పదములకు సలహాలు ఇచ్చుచూ, నా వెన్నుతట్టి ప్రోత్సహించుచూ, డి.టి.పి. చేసినవాటిని ప్రూఫ్ రీడింగ్ చేసి తప్పులు సరిదిద్దిన విశాల సహృదయులు. ఊతక్రరగా నాకు తోడుండి నడిపించిన నా శ్రేయోభిలాషి. ఇటువంటి ఆధ్యాత్మిక అనుభవమున్న సహాధ్యాయులు నాకు సలహాదారుగా దొరకడము ఆ సర్వేశ్వరుని అనుగ్రహమని నేను భావించుచున్నాను.

ఆ సర్వేశ్వరుడే వారికి మరింత ఆధ్యాత్మిక ప్రగతి, ఆయురారోగ్యములు కలిగించాలని కోరుతూ, వారికి నా హృదయపూర్వక నమస్కారములతో కృతజ్ఞతలు తెలుపుతూ...

విశేషార్థముల కొరకు కొన్ని శాస్త్ర సాంకేతిక పదముల వివరణల కొరకు, కొందరి మహనీయుల తమిళ ప్రసంగములు వినడం, పుస్తకములు పరిశీలించడం జరిగినది. వారందరికీ నా కృతజ్ఞతాపూర్వక శతకోటి పాదాభివందనములు తెలుపుతూ...

డి.టి.పి. సకాలమున చేసియిచ్చిన శ్రీ రాజేంద్రకుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ...

గుండెపోటు, బైపాస్ నుండి తేరుకొని వ్రాస్తున్న నేను నీరసము కాకుండా సకాలములనందు అన్నపానీయాదులు సమకూర్చి సంరక్షించిన భార్యామణి సౌ॥ అనురాధ, కోడలు సౌ॥ రజనిలకు హృదయపూర్వక కృతజ్ఞతలు, ఆశ్వీరచనములు తెలుపుతూ...

ఈ అనువాద గ్రంథములో భాషాపాండిత్యము, శాస్త్రపరిజ్ఞానములను గణింపక, భావన మాత్రం గ్రహింపవలెనని మనవి చేస్తూ, సాధారణ తెలుగు పాఠకుల కొరకు బహు సులభశైలిలో తత్సమ, తద్భవములు విడనాడి, గ్రామ్య, వచన పదములతో వ్రాయబడినదని తెలుపుతూ...

ఇందు తప్పులున్నచో వాటికి ఈ అనువాదకర్తయే కారణమని తెలుపుతూ, వాటిని మన్నింపగోరి, చేర్పులు, మార్పులను పునఃప్రచురణలో చేసెదమని సవినయముగా మనవి చేయుచున్నాను.

పేరు పేరున ప్రస్థావన ఎందుకంటే వారందరూ నాకు మంచి చేసిన పుణ్యాత్ములు, సహృదయులు.

**"ఎందరో మహానుభావులు వారందరికి నా పాదాభివందనములు"**

**"వారు లేక నేను లేను"**

**శుభం భూయాత్**

ఇట్లు
సుధీజన విధేయుడు
అనువాదకర్త
**కృష్ణ శెవ్వాన**
(S.R. Krishna Rao)

# పన్నెండు తిరుముఱైలు

తిరు+ముఱై=దివ్య+విధివిధానములు, పద్ధతులు. దైవమును పొందుటకు అవలంబించవలసిన పద్ధతులు (Protocol) నియమ, నిష్ఠలు, నిర్దేశించబడిన స్తుతులు, కీర్తనలు, దేవాలయ నిర్మాణ ఆగమములు, ప్రార్థనా పద్ధతులు మొదలగునవి. శైవులు దర్శించిన దర్శనములు, అనుభవములు క్రోడీకరించినది ఈ తిరుముఱై.

సంస్కృత వేదములు, ఆగమములే శైవసిద్ధాంతములుగా తమిళములో రూపు దిద్దుకొని దక్షిణ భారతములోను, శ్రీలంకలోను ప్రసిద్ధి పొంది వ్యాపించినవి.

ఇవి మొత్తము పన్నెండు (12). వృత్తము ఛందస్సులో, నాలుగు వరుసలలో వ్రాయబడి, పెక్కు రాజుల ఆదరణలు పొంది, క్రీ.శ. 6 శతాబ్ది నుండి క్రీ.శ. 12 శతాబ్ది వరకు కొనసాగిన, 63 శైవభక్తుల (నాయన్మార్లు) జీవితచరిత్రలు, వారి దర్శన, అనుభవసారముతో నిండినది.

| తిరుముఱై | గ్రంథము పేరు | రచయిత-కాలము |
|---|---|---|
| 1, 2, 3 | తిరుక్కడై కాప్పు | శ్రీ సంబందర్ - క్రీ.శ. 7 శతాబ్ది 16 సం॥లే జీవించి, బాల్యములోనే శివదర్శనం, సాయుజ్యము పొందిరి. |
| 4, 5, 6 | తేవారం | శ్రీ తిరునావుక్కరసర్ (లేక) అప్పర్‌గా పిలువబడిన 7వ శతాబ్ది చెందిన శివభక్తాగ్రేసరుడు. |
| 7 | తిరుపాట్టు | శ్రీ సుందరర్ - క్రీ.శ. 8వ శతాబ్ది చెందిన శివభక్తుడు |
| 8 | తిరువాచగం<br>తిరుక్కోవైయార్ | శ్రీ మాణిక్యవాచగర్ క్రీ.శ. 9వ శతాబ్ది హరిమర్తన పాండ్యరాజు వద్ద ప్రధానమంత్రిగా పదవి. |
| 9 | తిరువిశైప్పా &<br>తిరుపల్లాండు | తొమ్మిదిమంది నాయన్మార్లచే వ్రాయబడినది. క్రీ.శ. 9వ శతాబ్ది చెందిన శివభక్తుల చరిత్రలు. |
| 10. | తిరుమందిరము | తిరుమంత్రము-శ్రీ తిరుమూలర్ నాయన్మార్ - క్రీ.శ. 8వ శతాబ్ది (ప్రస్తుత గ్రంథము) |
| 11 | తిరుశివ ప్రబంధము | పన్నెండుగురు నాయన్మార్లచే - క్రీ.శ. 5వ శతాబ్ది నుండి క్రీ.శ. 6వ శతాబ్ది వరకు కారైక్కాల్ అమ్మన్ - |

| | | |
|---|---|---|
| | | చేరమాన్ పెరుమాళ్ మొ॥వారిచే వ్రాయబడినది. |
| 12 | పెరియ పురాణము | శ్రీ సేక్కియార్ - క్రీ.శ. 1135 కులోత్తుంగ చోళన్-II వద్ద ప్రధానమంత్రి పదవి. |

మొదటి మూవురు వ్రాసినవి - 1 నుండి 7 వరకున్న తిరుముర్రైని "తేవారం"గా పిలువబడినది. తే(3) వారం = దేవారం = దేవ+అరం = దేవుని మాలగా అమరినవని అర్ధం.

ప్రాచీనకాలములో తిరుమందిరము "తిరుమందిరమాలై"గా పిలువబడినది. తిరు మంత్రములో అన్ని పద్యములను "మాలామంత్రము"గా గ్రహించవలెనన్న భావనలో చెప్పబడినది.

ఈ తిరుముర్రైల కంతటికి కార్యకర్త "**శ్రీ నంబియాండార్ నంబి**". ఈ నంబి చిదంబరం సమీపమున తిరునారైయూర్‌లో జన్మించి అచ్చటనున్న శివాలయములో అర్చక స్వాములుగా వృత్తి సలిపిన మహాశివభక్తుడు. చిదంబరం శివాలయంలోనున్న 2వ ప్రాకారమున భూగర్భములో చెదలు పట్టియున్న ప్రాచీన తాళపత్రములను పైకితీసి, శుభ్రపరచి, విభజించి, క్రోడీకరించి మొదటి ఏడు తిరుముర్రైలను ''తేవారము"గా నామకరణము చేసిన ఘనుడు. పైగా 11వ తిరుముర్రైలోని ప్రబంధ శివకీర్తనలు వ్రాసి వాటితో చేర్చిరి. మరియు అవి నాయన్మార్ల జీవితగాధలను ఏరికూర్చి పద్ధతి ప్రకారం కూర్పు చేసి మహారాజగు "రాజరాజ చోళన్ (క్రీ.శ. 985-1013)" కు సమర్పించి రాజాదరణ పొందిరి. దీనినే "తిరుతొండర్ తిరు అందాది" అనగా "శైవభక్తుల దివ్య దర్శనము"లన్న గ్రంథముగా పేరుగాంచినది. దీనివలన రాజు కూడా ప్రజాదరణతో "తిరుముర్రై కండచోళన్" తిరుముర్రై గ్రంథములను ప్రవేశపెట్టిన చోళరాజుయని బిరుదు పొందిరి.

అనతికాలములో 8, 9, 10, 11 తిరుముర్రైలు తేవారముతో చేర్చబడినవి. శ్రీ సేక్కియార్ వ్రాసిన "పెరియ పురాణము" 12వ తిరుముర్రైగా చేర్చబడినది (దాదాపు వంద సం॥ పిదప).

ఈ శైవసిద్ధాంత తిరుముర్రైలు మొత్తము 99 అధ్యాయములలో 10 విభాగములుగా చెప్పబడియున్నవి.

అవి 1) దేవుడు, 2) ఆత్మ, 3) బంధము, 4) అనుగ్రహము, 5) గురువు, 6) విధి విధానములు, 7) మంత్రము, 8) జ్ఞానోదయము, 9) దర్శనం, 10) ముక్తి (మోక్షం).

సర్వం శివార్పణమస్తు

# శ్రీ తిరుమూలర్ సంగ్రహ జీవితచరిత్ర

తిరుమంత్రము వ్రాసిన శ్రీ తిరుమూల నాయనార్‌కి కైలాసములో వీరి పేరు సుందరమూర్తి. వీరి కాలము దాదాపు క్రీ.పూ. 5000 గా చెప్పబడినది. వీరి తల్లిదండ్రుల వివరణ కానరాదు. ఋషిమూలము, నదీమూలము చూడరాదందురు కదా!! 3000 సం॥ పైబడి కాయకల్పము తీసుకుని (రసాయన మూలికల మిశ్రమము తీసుకొనుట) చాలాకాలం జీవించినట్లు చెప్పబడినది.

కైలాసంలో శివుని పాదముల వద్ద కూర్చుండి, ప్రజాపతులగు సనక, సనంద, సనాతన, సనత్కుమారులు నలుగురు కలిసి మరియు శివయోగనాధుడు, పతంజలి ముని, వ్యాఘ్రపాదుడు, సుందరమూర్తి మొత్తము ఎనమండుగురు శివుని నుండి ప్రత్యక్షముగా వేద ఆగమ శాస్త్రములను శివునినే గురువుగా తలంచి ఉపదేశము పొందిరి (మంత్రము 71).

సుందరమూర్తికి శిష్యులు (మంత్రము 69) మూలాంగన్, ఇంద్రుడు, సోముడు, బ్రహ్మ, రుద్రుడు, కాలాంగినాధుడు, గంజగిరి అను ఏడుగురు.

సోమ, సూర్యాగ్నుల ప్రకాశముతో సూక్ష్మరూపములో నెలకొని కొన్ని కోట్ల సం॥ భగవంతుని పాదములందు కూర్చుని, శివుని (మం. 80) నాట్యమును దర్శించుచుండిరి.

శివునిచే 7 కోట్ల 1 లక్ష ఆగమములు - 9 విభాగములుగా వీరికి బోధించ బడినవి (మం. 60-63). శివుని దివ్యనాట్యము దర్శించుచూ (మం. 74) శివుడే తనలో ఇమిడియుండుటచే ఒక కోటి యుగములు బ్రహ్మానందములో (మం. 75) మునిగి జీవించియుండిరి.

తాను బోధించిన ఆగమ శాస్త్రములు లౌకికులు ఎరిగి ఉన్నతి పొంది శివ సాయుజ్యము పొందవలెనను ఉద్దేశముతో, శివుడు వీరికి ఆజ్ఞ ఇచ్చి, లోకనుగ్రహనార్థము భూలోకమునకు వెళ్ళమనిరి (మం. 85).

సుందరమూర్తి శివాజ్ఞను శిరసావహించి, తాను పొందిన ఈ బ్రహ్మానందము జగత్తంతా పొందవలెనను సదుద్దేశముతో మరియూ అగస్త్య మహామునిని చూడగోరి దక్షిణభారత భూభాగమునకు తరలివచ్చుటకు సూక్ష్మరూపము ధరించి బయలుదేరిరి (మం. 83).

సూక్ష్మరూపము ధరించిన సుందరమూర్తి ఆకాశమార్గములో వచ్చుచూ, పశుపతినాథ్, కేదారములు దర్శించి, గంగానదీ ప్రవాహము దాటి, వింధ్య పర్వతములు దాటి, శ్రీకాళహస్తిని, కంచి ఏకాంబరనాధుని దర్శించుకొని కావేరి నదీతీరమున నున్న

తిరువావడుదురైలో కొంతకాలం బసచేసి, పొదిగైమలైలో నున్న అగస్త్య మహాముని దర్శింపగోరి (మం. 91) వచ్చు తరుణంలో పొన్ని నదీతీరములో ఆవుల ఏడుపు వినబడగా, అచ్చుటికి వచ్చిచూచిరి.

అచ్చట ఆవుల కాపరియగు "మూలన్" చచ్చిపడియుండెను. వానిచుట్టూ ఆవులు, మేకలు ఏడుస్తూ వాని శవమును నాకుచున్నవి. సుందరమూర్తి ఇది ఏమి అని జ్ఞానదృష్టితో చూచి, మూలన్ పాముకాటుకు చనిపోవుటచే ఆవులు, మేకలు ఏడుపుకు కారణమని గ్రహించి, మనస్సు చలించిపోయి దయతో, జీవకారుణ్యముతో, కాపరి లేకపోతే మూగజీవులు బ్రతకజాలవని తమతమ ఇళ్ళు చేరజాలవని గ్రహించి, తానెరిగిన అష్టమా మహాసిద్ధులలోని "ప్రాకామ్యము" (పరకాయ ప్రవేశము)తో మూలన్‌లో తాను ప్రవేశించి ఆవులకు స్వాంతనను చేకూర్చనెంచి, ముందుగా తన శరీరమును ఒక పెద్ద మర్రిచెట్టు తొర్రలో పదిలపరిచి, తను మూలన్ శరీరములో ప్రవేశించెను.

మూలన్ లేచి నిలబడిన వెంటనే గోవులు అమితానందము పొందినవి. మూలన్ గోవులను గ్రాసము మేసిన పిదప పక్కనున్న వాటి గ్రామమైన సాత్తనూర్‌కి తీసుకు వెళ్ళుటచే గోవులన్నియూ యథాప్రకారముగా సంధ్యాసమయమున వారి ఇళ్ళకు చేరినవి. తాను మాత్రము వీధి చివరనున్న రాతిమండపములో కూర్చుండిపోయిరి.

గోవులన్నియూ తమతమ ఇళ్ళు చేరినవి, తన భర్త మాత్రము ఇల్లు చేరలేదన్న తలంపుతో మూలన్ భార్య ఊరంతా వెతకి చివరకి వీధి చివరన రాతిమండపములో కూర్చున్న తన భర్తను గాంచి, ఇంటికి వెళ్ళుదమని రమ్మని చేయిపట్టి లాగెను. అంతట మూలన్ తాను ఆమె భర్తగాదని, ఆమె భర్త పాముకాటుకి ఊరి చివరలో చనిపోయెననియు, ఆవుల మీదనున్న కారుణ్యముతో తను మూలన్‌గా పరకాయ ప్రవేశం చేసిన శివయోగినని చెప్పెను. కాని ఆ భార్యామణి ఇది నమ్మక, ఊరిపెద్దలతో రేపు పంచాయితి పెట్టెదనని చెప్పి ఏడుస్తూ ఇల్లు చేరుకొనెను.

మరునాడు ఉదయమున పెద్దల పంచాయితీ మొదలైనది. బ్రాహ్మణుల అగ్రహారములతో నిండిన సాత్తనూర్ పెద్దలు బహువిధములుగా మూలన్‌ని ప్రశ్నించిరి. వారికి మూలన్ తాను శివయోగినని, తాను భూలోకమునకు వచ్చిన కార్యకారణములను చెప్పెను. ఎంత చెప్పినా వారు విననందున, తాను మరలా ఒక చచ్చిన మేకలో పరకాయ ప్రవేశం చేసి నిరూపించి, వారిని నమ్మించెను.

ఆ నిరూపణను నమ్మిన పంచాయితి పెద్దలు మూలన్‌గా ఉన్నవానిని "తిరుమూలన్"గా స్తుతించి, మన్నింప వేడుకొని, ఆ భార్యామణిని ఒప్పించి పంపివేసిరి. తిరుమూలర్ మహాయోగి, జ్ఞాని, సిద్ధులలో మహాశ్రేష్ఠుడు.

పిదప తిరుమూలన్ తను దాచిపెట్టిన శరీరము పొందుటకై ఆ మర్రిచెట్టు వద్దకు వచ్చి చూచి, ఆ శరీరము కానరాక దిగ్భ్రాంతి చెందెను. జ్ఞానదృష్టితో జరిగినదేమని గ్రహించి, నవ్వుకొని ఇది తమ గురునాథుడైన "శివుని లీల"యే అని గ్రహించి, అచ్చట నుండి బయలుదేరి తిరువావడుదురై చేరుకొని, అచ్చట దేవాలయములో నున్న మహావృక్షమైన రావిచెట్టు క్రింద కూర్చుని ఆగమశాస్త్రములను మూలన్ భాషయగు తమిళములో వ్రాయుటకు పూనుకొనిరి.

మానవాళి శ్రేయస్సు కొరకు తను వచ్చిన కారణమును గ్రహించిన తిరుమూలర్ శివధ్యానములో నుండి సంవత్సరమున కొక మంత్రము చొప్పున (మం. 79) 3000 సం॥ పైగా జీవించి 3000 మంత్రరాజములను వ్రాసిరి. దీనిని "తిరుమంత్రమాల"గా నామకరణము చేసిరి. లౌకికబంధములను విడిపించుకొని ఎట్లు దైవమును చేరుకొనుట యను సత్యతత్త్వములతో నిండిన "తిరుమంత్రమాల"గా పేరొందినదై, వేద ఆగమములతో కూడినదై, యోగ, భోగ, మంత్ర, యంత్ర, తంత్ర శాస్త్రములతో నిండియున్నది.

తిరుమూలర్ ఈ తిరుమంత్రమాలను తిరువావడుదురై గోమటేశ్వరర్ ఆలయములో ధ్వజస్థంభము క్రింద తన తాళపత్ర గ్రంథమును భద్రపరచి, శివునిలో ఐక్యమైరి.

తిరుమూలర్ 63 నాయన్మార్లలో 31వ నాయనార్. అనతికాలంలో తిరుజ్ఞాన సంబందర్‌చే (క్రీ.శ. 637-653) ఈ తాళపత్రములు బయటకు తీయబడి ప్రజల ప్రాచుర్యము పొందినవి.

శ్రీ తిరుమూలర్ దివ్యపాదములకు శరణం

సర్వం శివార్పణమస్తు

# శ్రీ తిరుమూలర్ అనుగ్రహించిన ముఖ్య ఉపదేశసారము

ఈ "తిరుమంత్రమాల" యను తిరుమంత్రమును ప్రతిరోజు ప్రాతఃకాలమున అర్థమెరిగి పఠించిన వారికి జన్మబంధము తొలగి, ముక్తి తప్పక పొందగలరన్నది శ్రీ తిరుమూలర్ యొక్క దివ్యవాక్కు.

శ్రీ తిరుమూలర్ ఉపదేశించిన ముఖ్య వాక్యములు ఎప్పటికీ అన్ని కాలములకు ఆచరణీయమే కాక, అవి ఇప్పటి శాస్త్ర, సాంకేతిక యుగములో పరిశోధనల మూలంగా కనుగొన్న విషయములను తాను దాదాపు 7000 సం॥ పూర్వమే (క్రీ.పూ. 5000 + క్రీ.శ. 2000) నుడివియున్నారనగా ఆయన దివ్యజ్ఞాన దర్శనం, తపోమహిమలే సాక్ష్యములు.

తిరుమంత్రములో వేద ఆగమములే తమిళములో చెప్పబడినవి. ఎట్లు వేదపూర్వ భాగము కర్మకాండగాను, అంతిమభాగము జ్ఞానకాండగాను (ఉపనిషత్తులుగా) చెప్పబడినదో, అట్లే తిరుమంత్రములోని మొదటి వరుసగా 5 తంత్రములు కర్మకాండగాను, చివరి 6-9 తంత్రములు జ్ఞానకాండను బోధించునదిగా అమరియున్నది.

శ్రీ తిరుమూలర్ నాయనార్ ముఖ్య ఉపదేశములలో అతి ముఖ్యమైనవి.

- ప్రేమే శివం.
- ఒకే కులం ఒక్కడే దేవుడు.
- నేను పొందిన ఈ పరమానందంను పొందనీ ఈ జగత్తంతయూ.
- జీవుడు శివునితో ఏకమగుటయే జన్మలక్ష్యము కావలెను.
- హృదయమే దైవము - భూతకాయమే దేవాలయము.
- పాత్రనెరిగి భిక్ష వేయుమన్న తమిళనానుడిని మార్చి, వారు, వీరు అని చూడక అందరికీ దానము చేయవలెను.
- ఎడమప్రక్క గుండెస్థానమనియూ, గుండెపోటు ఎడమవైపు ఏర్పడుననియూ, గర్భస్థ శిశువు ఆడ మగ లింగభేదము తెలుసుకొన వచ్చుననియూ, శిశువు ఆరోగ్యస్థితిని బట్టి దాని జీవన ఆయుస్సును గణించుట మొ॥నవి తన మంత్రముల ద్వారా తెలిపియున్నారు. ఈయన మహా రసవాది కూడ (Alchemist).

ఈ మహోన్నత గ్రంథరాజము తమిళ వాఙ్మయములో తలమాణిక్యము వంటిది. "**తిరుమంత్రమునకు మరు మంత్రము లేదు**" అన్నది తమిళ నానుడి.

మానవుని జీవాత్మ పరిమాణము తన మంత్రము ద్వారా (మం. 2011) తెలిపి యున్నారు. ఒక ఆవు యొక్క రోమము కొనను (సాంకేతిక పరిమాణం 100 micron = 0.1 mm) తీసుకొని దానిని 100 విభజించి, దానిలో ఒకదానిని మరలా 1000గా విభజించి, వచ్చినదానిని మరలా 100000 విభజించినచో వచ్చు పరిమాణము వేయికోట్ల భాగము 1000,00,00,000. ఈ అణువును ఇప్పటి సాంకేతికముగా చెప్పవలెనన్న 0.00000000001 మిల్లీమీటరు. ఇది విజ్ఞానశాస్త్ర సాంకేతికముగా చెప్పవలెనన్న ఒక హైడ్రోజన్ పరమాణువు చుట్టుకొలత 0.000000212 మి.మీ. చెప్పబడియున్నది. కాని తిరుమూలర్ పరమాణువుని పరమాణువుగా జీవుని ఆత్మ శరీరములో నెలకొని యున్నదని తన సంఖ్యాసాంకేతికతో చెప్పియున్నారు.

పరమాణువునకు పరమాణువుగా దానికి అవతలగాను శరీరములో నెలకొనియున్న పరమాత్మను గ్రహించి సృజించవలెనని (మం. 2008) చెప్పియున్నారు.

తిరుమంత్రములోని అన్ని శ్లోకములు మంత్రములుగానే పిలువబడియున్నవి. వేద ఉపనిషత్తు ఆగమములు తమిళములో వ్రాయబడినవి కనుక మంత్రములుగానే పరిగణించబడినవి.

వేదమంత్రములు అపౌరుషేయములు. బ్రహ్మ నోటి నుండి జాలువారిన మంత్రాక్షరములు. సత్యనిష్ఠతో, ధర్మనియతితో, జీవనము సాగించిన సత్యస్వరూపులైన మహాపురుషుల యొక్క స్వీయ అనుభవ దర్శనముల పాఠములే ఉపదేశ మంత్రములుగా చెప్పబడినవి. అఖండ మానవాళి శ్రేయస్సు కొరకు సత్యపురుషులచే చెప్పబడిన సూక్ష్మ, శబ్ద అమరికయే మంత్రములని పిలువబడినవి. (తల్లి స్వీయ అనుభవ పాఠములే సొంత పిల్లలకు బోధించునట్లు.)

రచయిత ద్వారా తిరుమంత్రములో చెప్పబడినది ఏమి? ఎవరికి? ఎట్లు? ఉపయోగము : (అనుబంధ చతుష్టయం)

| | | |
|---|---|---|
| చెప్పబడిన విషయము | : | యోగ, భోగ, మంత్ర, యంత్ర, తంత్ర శాస్త్రములు, స్తోత్రములు. సాధకునికి పరిపక్వత తగ్గట్లు విషయానుకూలము. |
| ఏమి ప్రయోజనము | : | చర్యలు, క్రియలు, యోగ జ్ఞాన సాధనల ద్వారా పరమాత్మను తెలుసుకొనుట. జీవ-ఈశ్వర ఐక్యజ్ఞానము. |
| ఎట్లు సంబంధం | : | శ్రేష్టమైన గురుముఖముగా ఉపదేశము పొంది, సాధనలను అభ్యసించి గురోపదేశ సారముగా ఆచరించి ఆధ్యాత్మిక ఉన్నతి సాధించి ఆత్మ/ఈశ్వర జ్ఞానము పొందుట. |

ఎవరు అర్హులు : అర్హతకు జాతి, కుల, భాష, లింగ భేదములు లేవు. తీవ్రమైన మోక్షాపేక్ష గల సద్ధర్మచారి, సత్యవంతులు, భక్తి, శ్రద్ధలు (శాస్త్రము, గురువు, దైవము యెడ) గలవారు, అనన్య భావనలు లేనివారు అర్హులు.

**"స్తోత్రము, శాస్త్రము రెండు గలిగియున్నది ఈ తిరుమంత్రము"**. కావున ఉపాసనా సౌలభ్యము కొరకు స్తోత్రమంత్రములుగా, తత్త్వవిచారణ కొరకు శాస్త్రముగాను ఈ తిరుమంత్రములోని విషయములు అమరియున్నవి.

ఓం తత్సత్

సర్వం శివార్పణమస్తు

# తిరుమంత్రము - 9 తంత్రముల కూర్పు

తిరుమంత్రము పన్నెండు తిరుమురైలలో 10వ తిరుమురై. ఇది తొమ్మిది తంత్రములతో (అధ్యాయములు) - 3047 మంత్రములతో (ప్రతి నాలుగు వరుసల పద్యము మంత్రముగా పిలువబడినది) కూడినది. ఇది పురుషార్థములను పొందగోరువారికి ఉపాయముగా చెప్పబడినది.

**ఒక్కొక్క తంత్రములో చెప్పబడిన వివరణలు:**

1వ తంత్రము : శరీరము, సంపద, యవ్వనం అశాశ్వత, మాంసభక్షణము వీడుట, కామ్యములను నిరోధించుట, బ్రాహ్మణుని ధర్మము, ధర్మశ్రేష్టత, ప్రేమ, సేవ, సహాయము చేయుట, శాస్త్రశ్రవణము, మనస్సు రాగద్వేషాలను అరికట్టుట, మొ॥ వివరణములు.

2వ తంత్రము : అగస్త్య మహాముని యొక్క దక్షిణదేశ బాంధవ్యము, శివుని అష్ట క్షేత్రములు, లింగోద్భవము, దక్షయజ్ఞము, ప్రళయ వివరణ, శివుని పంచకృత్యములు, శక్తి, శివలీలలు, త్రివిధ మహాత్ములు, దేవాలయ విచ్ఛిన్నము, శివనింద, దాసుల నిందలు, మొ॥ వివరణలు.

3వ తంత్రము : పూర్తిగా యోగ వివరణలు, పతంజలి యోగమే కాక, అష్టాంగ యోగ అభ్యాస సాధనలు, ఫలములు చెప్పబడినది.

4వ తంత్రము : మంత్రశాస్త్రం, ఉపాసన మార్గం, అజప, జాబాలి మంత్రం, మొ॥ యంత్ర చక్రములు - తిరువంభళ, త్రిపుర, భైరవ, శాంభవీ, భునాధిపతి, నవాక్షర చక్రముల వివరణలు.

5వ తంత్రము : శైవ సిద్ధాంత విభాగములు, సరిగై, కిరిగై, యోగ, జ్ఞానమార్గములు, బాహ్య మతములను త్రోసిపుచ్చి, అంతరమత స్వీకరణ మొ॥ వివరణలు.

6వ తంత్రము : ప్రాణనాడి, శివగురు దర్శనము, పాదములందు శరణు, జ్ఞానముతో గ్రహింపదగు జ్ఞేయము, జ్ఞాత, సన్యాసము, తపస్సు, పొందిన అనుగ్రహము, సత్పురుషుల తత్వము, దుర్మార్గుల తత్వము, విబూది మహత్, మొ॥ వివరణలు.

7వ తంత్రము : ఆరు ఆధారములు, ఆరు లింగములు, మతబోధన, పంచేంద్రియముల నిగ్రహం, గురువర్ణన, దుష్టుల సాంగత్యము, మొ॥ వివరణలు.

8వ తంత్రము : సిద్ధాంత వివరణ, కార్యకారణ ఉపాధులు, పరోక్ష దూషణ వర్జితం, శివనింద వర్జితం, సత్యం పలుకుట, ఆశ త్యజించుట, మొ॥ వివరణలు.

9వ తంత్రము : గురువు, గురుమతము, గురుదర్శనము, వైష్ణవ సమాధి, స్థూల, సూక్ష్మ, అతిసూక్ష్మ, పంచాక్షరీ మంత్రముల వివరణలు, నటరాజుని నాట్యభంగిమలు, జ్ఞానోద్భవము, జ్ఞానశ్రేష్టత, శూన్యసంభాషణలు, మౌన, సమాధి, శివైక్యం – మొ॥ వివరణలు

ఓం తత్సత్

సర్వం శివార్పణమస్తు

# నా మార్గదర్శకులు

## (1) పూజ్య తల్లిగారు

అందరికీ మాతపితలే మొదటి గురువైనా నాకు నా తల్లి శెవ్వాన నాగరత్నమ్మ గారి చనువు, బోధ బహు విశిష్టము. నా తండ్రిగారు శెవ్వాన రంగనాయకులు (శ్రీకాకుళం – హీరమండల వాస్తవ్యులు), నా తల్లిగారు పర్లాకిమిడిలో (శ్రీకాకుళం–ఆంధ్ర–ఒరిస్సా సరిహద్దు టౌన్) పుట్టి పెరిగి, చదువుకొని మెట్టింట మద్రాసులో అడుగుపెట్టారు. తను పర్లాకిమిడి గజపతి మహారాజు హైస్కూలులో చదువుకున్నానని, తనకి గిడుగు రామమూర్తి పంతులుగారు 'మా మాస్టర్' అని గొప్పగా అప్పుడప్పుడు చెప్పుకునేవారు. నేను పెద్దయ్యాకనే ఆమె చెపుతున్న పంతులుగారు ఎవరనేది నాకర్థమైనది. "ఈనాడు" పత్రికలో తెలుగు భాషాదినోత్సము శీర్షికలో వచ్చిన శ్రీ గిడుగు వెంకటరామమూర్తి పంతులు గారు – తెలుగు వ్యవహారిక భాష, గద్యరచన, పర్లాకిమిడిలోని కోయల సవరభాషకి ఆద్యుడని – "గిడుగు పిడుగు" అని అర్థమైనది. తనకు తెలుగున ఎంతటి చక్కని ప్రావీణ్యత గలదో అట్లే ఓఢ్రము కూడా (ఇప్పటి ఒరియా) సరళముగా మాట్లాడేవారు.

మా తల్లిగారు, మా నాన్నగారు, మేనత్తగారు వీరు మువ్వురు దాదాజీ గురువుగారి (శ్రీ మాధవసింగ్–మరాఠి బ్రాహ్మణులు) వద్ద శ్రీమద్భగవద్గీత పారాయణము చేస్తూ, వాటి అర్థములు వినేవారు. ఈ నలుగురు కలిసి పక్షమున కొకమారు RK Mutt–మద్రాసుకి వెళ్ళి ఉపన్యాసములు విని, వారికి నచ్చిన పుస్తకములు తెచ్చుకొని చదివేవారు. మా మద్రాసు ఇంట్లో అన్నిటికన్నా RK Mutt పుస్తకాలే ఎక్కువ సంఖ్యలో ఉండేవి.

అమ్మగారి ద్వారానే కొన్ని ముఖ్యమైన భగవద్గీత శ్లోకములు కంఠస్థం అయ్యాయి. రామాయణం, భాగవతం పూర్తిగా మా అమ్మగారు చెపితే వినేవాడిని. వీటితో కొన్ని శతక పద్యాలు, నీతి, సుభాషిత పద్యాలు కూడా కంఠస్థం అయ్యాయి. అంతా ఆమె నేర్పినవే. వారివల్లనే నాకు శ్రీ రామకృష్ణులు, శ్రీ శారదదేవి, శ్రీ వివేకానంద, దేవీభవతారిణి యందు భక్తిశ్రద్ధలు ఏర్పడినాయి.

చిన్నప్పటి నుండి నాకు పై నలుగురు అంటే ప్రేమ, భక్తి, శ్రద్ధలే. నాకు రామకృష్ణులు, శారదాదేవి, భవతారిణి ఉపాసనలతో, వంశపారంపర్యంగా వచ్చిన మా కులదైవము వరాహ శ్రీలక్ష్మీనృసింహస్వామి యొక్క కొన్ని మూలమంత్రములు ఉపాసనలతో, కొన్ని దేవతల గాయత్రిలు కూడా నాకు చిన్నతనమునే అమ్మగారిచే బోధింపబడినవి.

నన్నెప్పుడు ఐశ్వర్యవంతుడవ్వాలని తను దీవించలేదు. డబ్బుతో ఏముంది? డబ్బున్నవాళ్ళని ప్రక్కవీధిలోని వారికే తెలియదు కాని నీవు 'మంచిగా' ఉంటే ఆ మంచియే నిన్ను నాలుగు ఊర్లు పిలిచేటట్లు చేస్తుంది అనేవారు. నా జీవితంలో అక్షరాలా ఆమె చెప్పిన మాటలే సత్యాలై ఫలించినవి.

నాకు డెబ్బది సం॥ దాటిననూ ఇప్పటికీ ఆమె చెప్పిన మాటలు, ఆమె చెప్పిన జాగ్రత్తలు నా మదిలో ఇంకా మెదులుతూనే ఉన్నవి. నా పెద్దల అలవాట్లు వారి భక్తి, శ్రద్ధలే, వారు నూరిపోసినవే, నాకు అబ్బినవి.

ఇక నా పాఠశాలకు వెళ్దాం... రండి...

## (2) పాఠశాల

నేను The Hindu Theological High School (Mint Street, Sowcarpet, Madras) యొక్క విద్యార్థిని (1961–1967). మా పాఠశాల గురించి ఎంత చెప్పినా, ఇంకా కొరతగానే ఉంటుంది. సగర్వంగా చెప్పబడిన ఈ పాఠశాల శ్రీ శివశంకర పాండ్యాజీ గారిచే క్రీ.శ. 1889న స్థాపించబడి, శ్రీరంగస్వామి ఐయ్యంగార్‌చే వృద్ధి చేయబడి, Kulapathi Dr. S. Balakrishna Joshi గారిచే మూడుపువ్వులు ఆరుకాయలుగా మారి పాఠశాలకు స్వర్ణయుగముగా పేరొందినది.

శ్రీ జోషిగారు (1910) తన బాల్యమున ఈ పాఠశాలలోనే విద్య పూర్తి చేసుకొని పచ్చయప్పన్ కళాశాలలో పట్టభద్రుడై క్రీ.శ. 1929 ఇదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా వృత్తి ప్రారంభించి, క్రీ.శ. 1944లోనే Head Master గా ఏకగ్రీవముగా ఎన్నుకొనబడి 1970లో పదవి నుండి విరమణ పొందిరి. వీరు ఇంగ్లీషు మాస్టర్. వీరి బోధనాశైలి బహు విశిష్టము. వీరికి Shakespearean Scholar అని పేరు. వీరి బోధనాశైలి, పాఠశాల నిర్వహణ, భక్తిశ్రద్ధలు బోధించడంలో ఆకుంఠితదీక్ష బహు శ్లాఘనీయం. అన్ని రంగములలోను పాఠశాల రాణించి వృద్ధి చెందినది.

శ్రీ జోషిజీ దక్షతకు లభించిన సన్మానములు కొల్లలు. అతి ముఖ్యమైనవాటిలో కంచి కామకోటి శ్రీ చంద్రశేఖర సరస్వతీస్వాములు (పెరియవా) వీరి "కులపతి" బిరుదుతో సన్మానించిరి (1964). అదే సంవత్సరంలో "National Award for Teachers" బంగారు పతముతో "Dr. Radhakrishnan President of India" గారిచే సన్మానించబడిరి. శ్రీజోషిజీ మతతత్వములను బోధించుట, నీతిని, దేశభక్తిని విద్యార్థుల మదిలో పదిలమగునట్లు బోధించుటలో మహాదిట్ట. "హిందూ ధర్మ ప్రచారకరత్న" అన్న బిరుదు కూడా వీరికి ఇవ్వబడినది.

వీరి పదవీకాలంలో ఎందరో మతపెద్దలు, మహనీయులు, ఆశ్రమ పీఠాధిపతులు విచ్చేసి మా prayer hallలో విద్యార్థులకు ఉపన్యాసములు ఇచ్చియున్నారు. ఉదా॥ కంచి కామకోటి పీఠాధిపతులు మూవురును, శ్రీ శంకరాచార్యులు–పూరీ, శృంగేరి, శ్రీ శివానంద–రుషీకేశ్, స్వామీ రామదాస్–కనగాడ్, ఉడిపి, బందరకేరి, పేజావర్ ఆశ్రమ పీఠాధిపతులు, రామకృష్ణమఠం పీఠాధిపతి–కలకత్తా, శ్రీ మహేశ్‌యోగి–ఉత్తరకాశి, స్వామి చిన్మయానందాజీ, స్వామి ప్రేమానందాజీ మొదలగువారు.

**పాఠశాల యొక్క కొన్ని విశిష్టతలు**

- 1895లో స్వామి వివేకానంద విదేశాల పర్యటనలు ముగించుకొని వచ్చిన వెంటనే Ice Houseలో బస చేసినపుడు, ఆహ్వానంపై వచ్చి విద్యార్థులకు బోధనలతో మా పాఠశాలలో ప్రసంగించిరి.
- మా పాఠశాల Prayer Hallలో చలువరాయితో చేసిన సరస్వతి విగ్రహము శ్రీ కంచి కామకోటి స్వాములచే (పెరియవా) శాస్త్రోక్తముగా ప్రతిష్ఠించబడి, నిత్యపూజలు అందుకుంటోంది.
- 500లకు పైబడిన దేవతామూర్తుల చిత్రపటములు వరుసక్రమముగా మా Prayer Hallలో ఉంచబడి, నిత్యము పూజించబడుచున్నవి.
- 1961లో నాలుగు మీడియంలలో బోధనలు జరుపబడినవి.
- విద్యార్థులకే యూనిఫారం కాక, మాస్టర్‌లకు, స్టాఫ్ కూడా పంచెకట్టు, జుబ్బా, కండువా, నుదుట బొట్టు అందరికీ తప్పనిసరి. లేకుంటే స్కూలు లోపలికి వెళ్ళనీయరు.
- ప్రతివారములో రెండు పీరియడ్లు Theology క్లాసు ఉండేది. అన్ని నీతికథలు, పురాణగాథలు, మహనీయుల జీవితచరిత్రలు, దేశభక్తి, పురుషార్థములను, ధార్మిక, వైదిక జీవనమును విద్యార్థులకు పదిలమగునట్లు బోధించేవారు.
- ప్రతి విద్యార్థి Prayer Book - Rs.2/– తప్పక కొని పారాయణము చేయవలయును. అన్ని దేవతామూర్తుల పద్యములు – తెలుగు, తమిళము, హిందీ, ఇంగ్లీషులో నాలుగు భాషలలో ఉండును.
- ఎంత సంస్కార, సంప్రదాయ బోధనలు చేసినా ఏమాత్రం ద్వేషంలేని సమత్వభావన బోధించేవారు మా ఉపాధ్యాయులు.
- శ్రీ బులుసు వెంకట రమణయ్యగారు POL (ఆంధ్రప్రభ వారపత్రిక–ధర్మపథం–Columnist) నా తెలుగు ఉపాధ్యాయులు.

- శ్రీ జోషిగారు రచించిన కొన్ని పుస్తకములు ఇప్పటికీ కొన్ని Teachers' Training & Adm. School లోను, Govt. Education Dept. లోను, University Education Dept. లోను దిశానిర్దేశములుగా వాడబడుచున్నవి.
- శ్రీ జోషిగారి కాలంలో ఉండి, వీరి బోధనలను ప్రత్యక్షంగా విని, కని, ఉన్నత గురువులచే ప్రేరణ పొందినవారిలో నేనుండడము నా పూర్వజన్మ సుకృతముగా భావించుచున్నాను.

**యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః ।**
**స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥** భగవద్గీత 3.21

శ్రేష్ఠమైన పురుషుని ఆచరణములనే (ప్రవర్తనలు) ఇతరులు ఆచరింతురు. అతను ప్రతిష్ఠించిన ప్రమాణములనే లోకులందరూ పాటించెదరు. శ్రేష్ఠమైన పురుషుడు ఏది ఆచరిస్తే, ఇతరులు అదే ఆచరిస్తారు.

శ్రీ గురుభ్యోనమః

ఇక నా ఆధ్యాత్మిక గురువుల వద్దకు వెళ్దాం... రండి...

## (3) పూజ్య గురుదేవులు

**అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయ**
**చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవేనమః**

నా మంత్రోపదేశ గురుదేవులు పూజ్యశ్రీ నిత్యానందులవారు. పేరుకు తగ్గట్టే బహు సౌమ్యులు. ఎప్పుడూ సంతోషంగా, ప్రశాంతంగా ఉండేవారు. ఏ కాలములోను అతనిలో చింత, కలత నేను చూచి ఎరుగను. గృహస్థాశ్రమమునందుండే యోగము చేసి జ్ఞానము వృద్ధి చేసుకొనవలెనని బోధించేవారు. హిరణ్యగర్భమున (ధ్యానములో దర్శించబడు బంగారురంగు చంద్రబింబము) పరబ్రహ్మను దర్శించిన సాంఖ్యయోగి, మితభాషి, మృదుభాషి. భవతారిణి, శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ శారదామాత, శ్రీ వివేకానందుల ఉపాసకులు. వారి బోధనలను మార్గనిర్దేశకము చేసుకొన్న యోగి.

గురువుగారితో పరిచయమైన మొట్టమొదటిరోజున (1973) వారు తన పూజా గదికి తీసుకువెళ్ళారు. అక్కడ ఉన్న పై నలుగురి భవతారిణి, రామకృష్ణాదులను చూచి నేను తటాలున “ఆహా! నావారే యున్నారే ఇక్కడ” అన్నాను. వెంటనే వారు “అందులకే మనమంతా ఒకటిగా కలిసాము” అని అన్నారు. అదే వారు నాతో మాట్లాడిన మొదటి మాట. నాకు ఎనలేని ఆనందం. నేను (నా పెద్దలతో సహా) కొలిచే దైవం వీరికీ దైవమంటే నా సంతోషమునకు హద్దులు లేకుండా పోయింది. వారి గదిలోనున్న పుస్తకాల సమూహం చూచి వారు విద్యావంతులే కాక సంస్కారవంతులని గ్రహించాను.

మా కుటుంబము ఎట్లు శ్రీకాకుళము నుండి మద్రాసుకు 100 సం॥ క్రితం వలస వచ్చిందో, అట్లే వీరి తల్లిదండ్రులు కూడా దాదాపు 150 సం॥ పూర్వము కాకినాడ నుండి మద్రాసుకు వలస వచ్చినవారే. తెలుగువారైనను, తెలుగే చదువుకున్ననూ, తమిళ వాఙ్మయములో మహాదిట్ట. ఎప్పుడూ ఏదో ఒక గ్రంథము ఆయన చేతులలో ఉండేది. నాకు తమిళగ్రంథములే ఎక్కువగా చదువుటకు ఇచ్చేవారు.

గురువుగారితో పరిచయమైన సంవత్సరమే నేను నా బాల్యస్నేహితుని కూడా (కీ॥శే॥ బత్తుల రామగోపాల్) గురువుగారికి పరిచయం చేసితిని. ఇద్దరికి 1973 సం॥ ఒక శుభముహూర్తాన (ఏకాదశి, శుక్ల, ఉత్తరాయణం పగలు) షోడశాక్షరీ మంత్రోపదేశము చేసిరి. నా 22వ ఏట ఉపదేశము పొంది, ధ్యానయోగము, సరశాస్త్రము (శ్వాసకళాభ్యాసములు) కుండలినీ యోగసాధనలు అభ్యసించితిని. ఆయన, మేమందరము శిష్యులు కలిసి తరచుగా RK MUTT-Mylapore-Madras కి వెళ్ళి ఉపన్యాసము విని వచ్చేవారము. కొన్ని శైవసిద్ధాంత బోధనలు కూడా చేసేవారు. ఎక్కువగా తొమ్మిదిమంది సిద్ధులు, వారి శిష్యులైన తొమ్మిదిమంది ఉపసిద్ధులు మొత్తము కలిపి 18 మంది సిద్ధుల యొక్క గ్రంథమైన "పదినెట్టు సిద్దర్ పెరియజ్ఞానకోవై" యోగశాస్త్రమును విడమర్చి అర్థముతో శిష్యులకు బోధించేవారు.

అప్పుడు అనగా నా 22వ ఏట పట్టుకున్న వారి కాళ్ళను వారు పరమపదించు వరకు (2018 - తన 88వ ఏట శివసాయుజ్యము పొందిరి) పట్టువీడక, నేను వృత్తిపరముగా ఎక్కడయున్ననూ వారిని, వారి సత్సంగము వీడకనే యున్నాను.

- వీరికి దాదాపు 200 మంది శిష్యబృందము కలదు.
- శ్రీ నిత్యానందులు తమిళము మూలగ్రంథమైన కపిలమహర్షి "**సాంఖ్యయోగము**"ను సులభశైలిలో తమిళంలో వ్రాసి సత్సంగ సభ్యులకు ఉచితముగా అందజేసిరి. దీనిని నాకు తెలుగున అనువదించమని ఆజ్ఞ చేసినందున తదనుగుణంగా నేను అనువాదము చేసి ఆయనకు సమర్పించితిని. దీనితో కూడా శ్రీ తిరువళ్ళువర్ యొక్క "**తిరుక్కురల్**" తమిళ ప్రసిద్ధమైన ఆణిముత్యమైన గ్రంథంను నేను తెలుగున అనువదించి గురువుగారికి "**అంకితము**" చేసితిని.
- 1973లో నాకు ఉపదేశము ఇచ్చిన కొద్దినెలలకే "కృష్ణా! నీకు బుధ మహాదశ జరుగునపుడు నీవు పుస్తకములు రాస్తావు" అని ఆశీర్వదించిరి. ఆ మాట అట్లే సత్యమైనది.
- మా గురువులు "కపిల కృష్ణమఠము" చెన్నై మహాబలిపురములో స్థాపించిరి. ప్రతి పౌర్ణమిరోజున సత్సంగ సభ్యులచే పూజలు చేయబడుచూ, అన్నప్రసాదములు పంచబడుచున్నది.

నిర్మాణాత్మకమైన వయస్సులో ఇటువంటి పూజ్యగురువులు దొరకడం నా పూర్వజన్మ సుకృతముగా భావించుచున్నాను. వీరి ఆశీస్సులు, వీరి బోధనలే నాకు దిశానిర్దేశకములైనవి. 1973-1993 వరకు మద్రాసులో సదా వారితోనే ఉండేవాడిని. వారి మాటలు, బోధనలు, ఆశీర్వచనములు, ప్రేరణలన్నియూ నా శ్రేయస్సుకు కారణములైనవి.

**న గురోరధికం తత్త్వం న గురోవధికం తపః**
**తత్వజ్ఞానాత్పరం నాస్తి తస్మై శ్రీ గురువే నమః**

శ్రీ గురుభ్యోనమః

ఇక నా వేద ఉపనిషత్తుల గురువుల వద్దకు వెళ్దాం... రండి...

**(4) పూజ్య గురుదంపతులు**

**సదాశివ సమారంభామ్ । శంకరాచార్య మధ్యమామ్ ।**
**అస్మదాచార్య పర్యంతామ్ । వందే గురుపరంపరామ్ ॥**

ఈ గురుదంపతులు పూజ్యశ్రీ కస్తూరి వీరరాఘవరావు గారు, పూజ్య శ్రీమతి మద్దూరి/కస్తూరి రాజ్యశ్రీ గార్లు నాకు వేద ఉపనిషత్తు గురువులు. వేదశాస్త్రములను అధ్యయనము చేయలేదన్న మలిదశలో ఏర్పడిన ఆర్తిని తీర్చిన గురుదంపతులు. వీరు పూజ్యులు, నిష్ఠాగరిష్ఠులు, నిస్స్వార్థపరులు, సౌశీల్యురు. ఈ పుణ్యదంపతులు స్వతహాగా కాలేజీలో సీనియర్ లెక్చరర్లు. పూజ్యశ్రీ దయానంద సరస్వతీ-ఋషీకేశ్ వారి ముఖ్య శిష్యులైన పూజ్యశ్రీ స్వామీజీ పరమార్థానంద - చెన్నై ప్రసంగించిన ఇంగ్లీషు ఆడియోలను విని ముగ్ధులై, వారి బోధనల స్ఫూర్తి, ఆశీస్సులతో వాటిని తెలుగున అనువదించి, ఆర్షవిద్యాతరంగిణి సభ్యులైన హైదరాబాదులోని దయాసత్సంగము, ఆర్షఆనంద కుటీరము, వేదాంత గ్రూపు సభ్యులకు తాము ప్రచురించిన పుస్తకములను ఉచితముగా పంచిపెట్టుటయే కాక, ఇంగ్లీషు, తెలుగున వారమునకు ఐదురోజులు ప్రసంగించుచూ తత్త్వబోధనలు (దాదాపు 500 మంది దేశ, విదేశ సభ్యులకు) చేయుచున్నారు.

శ్రీ కస్తూరి వీరరాఘవరావు గారు కాలేజీలోని గణితశాస్త్ర సీనియర్ లెక్చరర్. గణితశాస్త్రములో మాస్టర్ డిగ్రీతో కొన్ని విశేష డిప్లోమాలు పొందియున్నారు. బహు సులభశైలిలో గణితము బోధించుటలో సిద్ధహస్తులని కొన్ని ప్రశంసలు కూడా పొంది యున్నారు. వీరి ఆధ్యాత్మిక జీవితము ఇప్పటిది కాదు. దాదాపు 20 సం॥లకు ముందే ఈ మార్గమునకు అంకురార్పణ చేయబడినది. వీరు చిన్మయా మిషన్‌లో ఉపనిషత్తు బోధనలు, శ్రీ దయానంద సరస్వతి-ఋషికేశ్‌లో నిర్వహించు వేదాంత శిబిరాలలో

సాధనలు అభ్యసించిరి. శివానంద ఆశ్రమం వారి ప్రచురణలు బ్రహ్మసూత్రాలను ఔపోసన పట్టినవారు. వీరికి భగవద్గీత అంటే ఎనలేని ప్రేమ మరియు బోధించుటలో కూడా సిద్ధహస్తులు. వీరు "తెలుగు భక్తి పేజస్" వెబ్‌సైట్ స్థాపించి దేశ, విదేశాల వారికోసం తెలుగు స్తోత్రాలు, శతకములు, శ్లోకాలు, ఉపనిషత్తులు, భక్తుల జీవితగాథ, భాష్యాలు, విశ్లేషణలు పొందుపరచి సమాజసేవ చేయుచూ ధర్మపరిరక్షణ చేయుచున్నారు.

పూజ్యశ్రీ శ్రీమతి మద్దూరి/కస్తూరి రాజ్యశ్రీ గారు కాలేజీలో ఇంగ్లీషు సీనియర్ లెక్చరర్‌గా వృత్తి చేసి విరమణ పొందినవారు. వీరు ఎం. శేషాచలం కంపెనీ (EMESCO Publisher) మద్దూరి శ్రీ ఎం.ఎం.రావు గారి మూడవ పుత్రిక. ప్రచురణ వారసత్వం పుణికిపుచ్చుకొన్నట్లు కొన్ని వందల పుస్తకాలకు సంక్షిప్తం, వెనుక కవరు–పేజి వ్రాసిన ఘనులు. దాదాపు 45 పుస్తకాలు ఇంగ్లీషు నుండి తెలుగుకు అనువదించిరి. మంతెన డా॥ రాజుగారి ఆరోగ్య పుస్తకాలన్నిటినీ ఇంగ్లీషులో అనువదించి ప్రశంసలు, సన్మానములు పొందిరి. ఇదేకాక, వీరు సరళ ఇంగ్లీషు వ్యాకరణము, గణిత గుణకార పట్టిక, ఇంగ్లీషు నీతికథలు వ్రాసిన ధీరవనిత. తెలుగు ఇంగ్లీషులో ప్రావీణ్యులు. వీరు వ్రాసిన ఉపనిషత్తులలో తర్కవిశ్లేషణలు, నిరూపణలు బహు శ్లాఘనీయములు. వీరి వ్రాతలు, బోధనలు బహు సులభశైలిలో ఉండి ఆలోచనలు పురికొల్పునవే.

ఈ పుణ్యదంపతులు ఉమ్మడికృషితో వెలువడిన తెలుగు అనువాద రత్నాలమాల–

అద్వైత వేదాంత పరిచయము – తత్త్వబోధ, భజగోవిందం, దృక్‌దృశ్య వివేకం, పది ఉపనిషత్తులు, శ్రీ మద్భగవద్గీత మూడు షట్కములుగా (2400 పేజీలు), వేదాంత జీవన విధానము, బ్రహ్మసూత్రములు.

పై పుస్తకాలను ప్రచురించడమే కాక, సత్సంగ సభ్యులందరికీ ఉచితంగా పంచిపెట్టి, వారు అధ్యయనము చేసినదే కాక, సత్సంగ సభ్యులకు అధ్యాపనమును బహుసులభ శైలిలో, పద్ధతి ప్రకారం, అద్వైత మాధుర్యమును శ్రవణ, మననముల ద్వారా రుచి చూపుతున్నారు. స్వాధ్యాయనము కొరకు శ్రీసూక్తం, పురుషసూక్తం, గణపతి అధర్వ శీర్షము మరియు బ్రహ్మసూత్రంలోని చతుస్సూత్రి కూడా బోధించిరి.

ఇటువంటి శ్రోత్రియ బ్రహ్మనిష్ఠయైన గురుదంపతుల వద్ద శిష్యత్వం పొందడం నా పూర్వజన్మ సుకృతముగా నెంచి, శ్రీ పోతనామాత్యుని, శ్రీ కవిసార్వభౌముని నేను ఒకే గృహమున దర్శించుచున్నాను (C804-Aparna Cyberzon).

ఎప్పటికీ వారు సేవ్యులై, ధర్మపరిరక్షణ, ధర్మవ్యాప్తికి నిర్విరామముగా, నిస్వార్థముగా కృషిచేస్తూ, దినకృత్యములతో గృహస్థాశ్రమము నందుండే ఈ సద్బోధనలు చేయు ఈ ఆదర్శ గురుదంపతులకు సకల అభీష్టములు నెరవేరి, ఆయురారోగ్యములు కలగాలని

ఆ సర్వేశ్వరుని ప్రార్థించి ఈ "**తిరుమంత్రము**" అనువాద గ్రంథమును సవినయముగా వారికి '**అంకితము**' చేయుచున్నాను.

గురోః పరతరం నాస్తి సత్యం సత్యం న సంశయః
గురోః పాదోదకం పీత్వా గురోర్నామ సదాజపేత్

గురురాదిరనాదిశ్చ గురుః పరమదైవతం
గురోపరతరం నాస్తి తస్మై శ్రీ గురవేనమః

మోక్షమూలం గురోర్కృప

ఓం తత్సత్

సర్వం శివార్పణమస్తు

# విషయసూచిక


క్ర.సం విభాగము

1. మాతాపితలకు నమస్కారములు
2. గురుస్తుతి
3. దైవస్తుతి
4. రక్ష
5. అంకితము
6. స్పందన
7. కృతజ్ఞతలు
8. తిరుమురై–12
9. తిరుమంత్రం – ముఖ్యోద్దేశము
10. శ్రీ తిరుమూలర్ – జీవితచరిత్ర
11. నా మార్గదర్శకులు – నలువురు
12. విషయసూచిక

**ఉపోద్ఘాతం**

1. దైవస్తుతి
2. వేదశ్రేష్ఠం
3. ఆగమశ్రేష్ఠం
4. గురు పరంపర
5. శ్రీ తిరుమూలర్ జీవితచరిత్ర
6. నమ్రత
7. తిరుమంత్రం యొక్క మహత్యం
8. గురు పరంపర
9. త్రిమూర్తుల తత్త్వం

**1వ తంత్రము**

1. ఉపదేశము
2. శరీర అశాశ్వతత్త్వం
3. సంపద ఆశాశ్వతం
4. యవ్వనం అశాశ్వతం
5. ప్రాణం అశాశ్వతం

క్ర.సం విభాగము

6. హత్య చేయకుండుట
7. మాంసం భక్షింపకుండుట
8. ఇతరుల భార్యలపై నిర్మోహం
9. స్త్రీ అధమము
10. దారిద్ర్యము
11. అగ్నికార్యం
12. బ్రాహ్మణుల సత్ప్రవర్తన
13. రాజు కీడు
14. వర్షమహిమ
15. దానమహిమ
16. ధర్మాత్ముని మహిమ
17. ధర్మమెరుగనివాని గుణము
18. ప్రేమతత్వం
19. ప్రేమ సలుపువారిని శివుడెరుగు
20. విద్య
21. ప్రశ్న–స్వాంతనం
22. అవిద్య
23. మధ్యస్థము
24. మద్యము సేవించకుండుట

**2వ తంత్రము**

1. అంతర్వాణి
2. అష్టవీర స్థలములు
3. లింగ పురాణం
4. దక్షుని యజ్ఞం
5. ప్రళయము
6. చక్రము పొందుట
7. ఎముకలు, కపాలము
8. పాదం, శిరం వెతకుట

9. సర్వసృష్టి
10. స్థితి
11. సంహారం
12. తిరోభావం
13. అనుగ్రహం
14. గర్భక్రియలు
15. త్రివిధ జీవవర్గం
16. పాత్రలు
17. అపాత్రలు
18. తీర్థం
19. దేవాలయములకు కీడు చేయుట
20. అధోముఖ దర్శనం
21. శివనింద
22. గురునింద
23. మహేశ్వర నింద
24. తితిక్ష
25. జ్ఞానుల సాంగత్యం

**3వ తంత్రము**

1. అష్టాంగయోగం
2. యమము
3. నియమము
4. ఆసనం
5. ప్రాణాయామం
6. ప్రత్యాహారం
7. ధారణ
8. ధ్యానం
9. సమాధి
10. అష్టాంగ యోగసిద్ధి
11. అష్టమహాసిద్ధులు
12. కళల స్థితి
13. శరీరస్థితి ఉపాయం
14. కాలచక్రం
15. ఆయుర్ పరీక్ష
16. వారసరం
17. వారశూలం
18. కేసరియోగం
19. పర్యంకయోగం
20. అమురిధారణ
21. చంద్రయోగం

**4వ తంత్రము**

1. అజపః
2. తిరువంబళ చక్రం
3. అర్చన
4. నవగుండం
5. శక్తిభేదం-త్రిపురచక్రం
6. భైరవి మంత్రం
7. పూర్ణశక్తి
8. ఆధారం - ఆధేయం
9. ఊర్ధ్వముఖ చక్రం
10. భైరవచక్రం
11. శాంభవి మండల చక్రం
12. భువనాపతి చక్రం
13. నవాక్షరి చక్రం

**5వ తంత్రము**

1. శుద్ధ శైవం
2. అశుద్ధ శైవం
3. మార్గశైవం
4. తీవ్రశుద్ధ శైవం
5. చర్యలు
6. క్రియ
7. యోగం
8. జ్ఞానం

9. సన్మార్గం
10. సహమార్గం
11. సత్పుత్రమార్గం
12. దాస్యమార్గం
13. సాలోక్యం
14. సామీప్యం
15. సారూప్యం
16. సాయుజ్యం
17. శక్తినిపాతం
18. బాహ్యమత దూషణ
19. నిరాకారం
20. అంతరమతం

**6వ తంత్రము**

1. శివగురు దర్శనం
2. దివ్యపాదములు పొందుట
3. జ్ఞాత, జ్ఞానం, జ్ఞేయం
4. సన్యాసం
5. తపస్సు
6. తపోధూషణం
7. అనుగ్రహంతో జ్ఞానం
8. నకిలీ వేషం
9. తపోవేషం
10. విభూది
11. జ్ఞానవేషం
12. శివవేషం
13. అపక్వుడు
14. పక్వుడు

**7వ తంత్రము**

1. ఆరు ఆధారములు
2. అండలింగం
3. పిండలింగం
4. సదాశివలింగం
5. ఆత్మలింగం
6. జ్ఞానలింగం
7. శివలింగం
8. సంప్రదాయం
9. దివ్యానుగ్రహం ప్రతిష్టించుట
10. అనుగ్రహ ప్రకాశం
11. శివపూజ
12. గురుపూజ
13. మహేశ్వరపూజ
14. దాసుల గొప్పతనం
15. భోజన విధానం
16. భిక్షా విధానం
17. ముద్రల భేదములు
18. పూర్ణగురతత్త్వ సమాధి
19. సమాధి క్రియలు
20. బిందుత్పన్నం
21. శుక్రజయం – భోగసరచలనం
22. ఆదిత్యుని స్థితి – అండాదిత్యుడు
23. పిండాదిత్యుడు
24. మనోఆదిత్యుడు
25. జ్ఞానాదిత్యుడు
26. శివాదిత్యుడు
27. పశువు వివరణ
28. పురుషుడు
29. జీవుడు – ఆత్మ
30. పశువు – జీవుడు
31. బోధకుడు
32. పంచేంద్రియములను అణచు మహత్వం
33. పంచేంద్రియములను అణగద్రొక్కుట
34. అసద్గురువు తత్త్వం

35. సద్గురువు తత్త్వం
36. అపవిత్రమైన ప్రవర్తన
37. కీడును తలంచి దుఃఖించుట
38. హితోపదేశము

**8వ తంత్రము**

1. దేహ పంచ భేదములు
2. శరీరము త్యజించుట
3. అవస్థల భేదం – అధోముఖం
4. మధ్య జాగ్రదావస్థ
5. అధ్వాలు – మార్గములు
6. శుద్ధ జాగ్రదాది అవస్థలు
7. కేవల, సకల, శుద్ధ స్థితి
8. పరావస్థ
9. త్రిగుణ, నిర్గుణం
10. అండాది భేదము
11. పదకొండవ అవస్థ
12. చేర్పు విడుపడుట
13. నిర్మలావస్థ
14. బుద్ధోదయం
15. షడాంత్యములు
16. పతి పశుపాశం భేదరహితం
17. దివ్యచరణములను గ్రహించుట
18. త్రిదోషములు
19. త్రిపదములు
20. త్రిపరములు
21. పరలక్షణం
22. త్రితురీయములు
23. త్రిముక్తిలు
24. త్రిస్వరూపములు
25. త్రికరణములు
26. త్రిపదముల శూన్యస్థితి
27. త్రివిధ నాశనములు
28. కార్యకారణ ఉపాధి
29. ఉపశాంతం
30. బాహ్యాప్రవర్తన
31. అష్టదళ కమల త్రిగుణావస్థ
32. నవావస్థలు – నవాభిమాని
33. శుద్ధాశుద్ధం
34. మోక్షనింద
35. లక్షణత్రయం
36. తత్త్వమసి వాక్యం
37. విశ్వగ్రాసం
38. సత్యం
39. జ్ఞాని వృత్తులు
40. ఆసక్తి త్రెంచుట
41. భక్తితత్త్వం
42. ముముక్షత్వం
43. శోధన

**9వ తంత్రము**

1. గురుమఠ దర్శనం
2. జ్ఞానగురు దర్శనం
3. ప్రణవ సమాధి
4. ప్రకాశము
5. స్థూల పంచాక్షరం
6. సూక్ష్మ పంచాక్షరం
7. అతిసూక్ష్మ పంచాక్షరం
8. దివ్యనాట్య దర్శనం
శివానంద నాట్యం
సుందరనాట్యం
స్వర్ణపది నాట్యం
బంగారు తిళ్ళై నాట్యం
అద్భుత నాట్యం

9. ఆకాశస్థితి పొందుట
10. జ్ఞానోదయం
11. సత్యజ్ఞానానందం
12. స్వరూప ఉదయం
13. విధి
14. శివదర్శనం
15. శివరూప దర్శనం
16. ముక్తిభేదం – కర్మ నిర్వాణం
17. శూన్య సంభాషణ
18. మౌనసమాధి
19. హద్దులు లేని శ్రేష్టత
20. ఐక్యమైన వారి సహజత్వం
21. స్తోత్రం
22. సర్వవ్యాప్తి
23. ఆశీర్వచనములు
స్వీయ పరిచయము

**"యస్య దేవే పరాభక్తిః యదా దేవే తదా గురౌ**
**తస్యైతే కథితాః అర్థాః ప్రకాశన్తే మహాత్మనః"** – శ్వేత. ఉప॥ 6.23

(ఇష్టదైవం వలె గురువుని ఆరాదించగలవారికి మాత్రమే ఈ శాస్త్రప్రవచనాలు స్పష్టంగా అర్థం కాగలవు)

తిరుమంత్రమాల యను తిరుమంత్రము యను గ్రంథరాజమును
మనకందించిన రచయిత
పూజ్య తిరుమూల నాయనార్ గారికి
శతకోటి పాదాభివందనములు
ఇక గ్రంథములోనికి వెళ్ళుదాం రండీ...

# తిరుమంత్రము

## వినాయక రక్ష

ఐదు భుజములు (చతుర్భుజములు + తొండము), ఏనుగు ముఖము, నెలవంకను పోలిన దంతము గలవానిని, శివకుమారుని, జ్ఞానశేఖరుడుగా వెలుగొందు వినాయకుని చిత్తమునందు నిలిపి, ఆతని పాదపద్మములను స్తుతించుచున్నాను.

## ఉపోద్ఘాతం

### 1. దైవస్తుతి

1. ఏకమైనవాడు, శక్తితోగూడి రెండైనవాడు, బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులతో కలిసి మూడైనవాడు, నాలుగు పురుషార్థములు, చతుర్వేదములను ఎరిగినవాడు, పంచేద్రియములను జయించినవాడు, షట్చక్రములలో (ఆరు ఆధార చక్రములు) వ్యాపించినవాడు, ఊర్ధ్వముగానున్న ఏడవ స్థానమునగు సహస్రదళమున నెలకొన్నవాడు, పంచభూతములు సూర్య, చంద్ర ఆత్మలతోగూడి అష్టమూరియై విరాజిల్లువాడు.
2. ప్రేమతో అన్ని జీవులలో ఇమిడిన నిర్మలుడు, నాలుగు దిక్కులను పరిపాలించు పరాశక్తికి పతియైనవాడు, తూర్పుదిక్కున ఉదయించు సూర్యునివలె చీకటిని పారద్రోలువానిని స్తుతించుచున్నాను.
3. అన్నిటికీ తోడుగా నున్నవాడు, అమరులైన దేవతలకు దిగంబరుడుగా కనిపించువాడు, పక్కన నిలుచున్న బ్రహ్మ, విష్ణువు, మొదలగు దేవతలకు అగోచరుడగువాని దరిచేరి ప్రణమిల్లి వినయముతో స్తుతించుచున్నాను.
4. సమస్త జీవులకు జ్ఞానమూర్తి, ఆకాశమండలమునకు మూలమైనవాడు, శరణు పొందినవారిని చేరదీయువాడు, రాత్రి పగలకు అతీతుడు, సదా మార్పుచెందు ఈ జగత్తున అజ్ఞానమునకు అతీతముగా నిలుచున్నవాడు.
5. శివ మహాదేవునికి సమానమైన దేవుణ్ణి ఈ బాహ్యప్రపంచమున ఎటు వెదికినను కానరాదు. ఇక ఆతనికి సమానమైనది అండపిండ బ్రహ్మాండమునందు కూడ ఏదియూ లేదు. వాడు అఖండములకు అతీతముగా, మేలిబంగారము వలె ప్రకాశించువాడును, ఎర్రటి రంగుతో ఊర్ధ్వదళమగు శిరోసహస్ర దళమందు వెలుగొందుచున్నాడు.
6. శివుని మించిన దేవతలు లేరు. వాడులేని తపస్సు లేదు. వాడు కాక, బ్రహ్మ, విష్ణువు, రుద్రుల ద్వారా పొందునది ఏదీలేదు. అతని ద్వారా కలగని ముక్తిని

నేను మరెవరి ద్వారా పొందలేను. (శివుడే అన్ని జీవరాశుల ముక్తికి మూలకారకుడని ఎరుగవలెను.)

7. మేలిమిబంగారు వలె సహస్రదళమందు నొప్పారువాడు, సనాతనముగా త్రిమూర్తులకు పూర్వీకుడును, తనకు ఎవ్వరూ సాటిలేనివాడును, తనను ఎవరైన **తండ్రీ** అని పిలిచినచో తండ్రివలె రక్షించువాడు. (అధర్వణవేదం, అధర్వశిర ఉపనిషత్తులో ఈశానమూర్తియే సృష్టి, స్థితి, లయకారకునిగా, **జోతిషాం జ్యోతిగా** అన్ని జీవరాశులందు వెలుగొందుచున్నాడని **ఆగమములు** చెప్పుచున్నవి.)

8. క్రిందికి వ్రేలాడు కురులతో (దీర్ఘ జటాధారి) శివుడు, నిర్మలుడు, శుభప్రదుడు, ఆప్తులకు నీటికన్నా చల్లనివాడు, పసివాడువలె నిష్కళంకుడు, దగ్గరగా నున్నవాడు, తన ఆప్తులను తల్లికన్నా కరుణతో చూచువాడు, కాని ఇన్ని సుగుణములున్ననూ ఈశ్వరుని కరుణను ఎందరో ఎరుగక యున్నారు!!

9. బంగారమువలె మెరుయు కురులు గలవాడు, వెనుక భాగమున (వెనుక భాగము: ఇది శిరస్సు వెనుక భాగములో పెద్ద, చిన్న మెదడులోని మధ్యభాగమున నున్న సూక్ష్మగ్రంథి, శంఖు ఆకారములోనున్న వినాళగ్రంథి – Pineal Gland. ఇదియే ప్రాణశక్తికి వారధిగా ఉండి సూక్ష్మశరీరమును, స్థూలశరీరమును, బుద్ధితో సంధానపరచు పీఠమగును. శివాలయములో "లింగోద్భవుడు"గా వెనకభాగమున ఉండుటకు ఇదే ప్రతీక. (Pineal Gland - light sensitive. రాత్రి పగలుకు ప్రకాశకిరణము అనుసంధాత. జ్ఞానప్రదాత శివుడు. తనే అన్ని దేవతలకన్నా మిన్న.) ఉండువాడును, అతని నామము **నంది**, నాచే స్తుతింపబడువాడు, శివుడు తప్ప మరెవరూ లేరు. కాని ఆ మహామహుడుకి సమానముగా ఆరాధించు దైవము, దేవతలు గాని మరెవ్వరూ లేరు.

10. శివుడే ఈ భూలోకము భారమును మోస్తూ, ఆకాశ రూపములో నున్నాడు. అతనే ఉష్ణముతో నిండిన అగ్నిగా, సూర్యుడుగా, చంద్రుడుగా యున్నాడు. అతనే జ్ఞానప్రదాతగా, వర్షముగాను, సత్యస్వరూపుడుగాను, విశాలమైన పర్వతముగాను, చల్లని సముద్రముగాను ఉన్నాడు.

11. సుదూరముగాను, దగ్గరగాను, మన పూర్వీకుడుగాను ఉన్న ఆ దేవుని మహిమను తలచినచో సాటిలేని దైవముగాను, ప్రయత్నముగాను, ప్రయత్నఫలముగాను నొప్పాడుచు, అంతటా వర్షించు మేఘముగాను ఉన్నాడు. వాని పేరు **నంది** అనబడును. (నంది=శివుడు)

12. ముక్కంటి శివుడు మహోన్నత కరుణతో ఉండువాడు. ఎందరో దేవతలు గాని, భూలోకములో నివసించువారు గాని, ఊర్ధ్వలోకములోని వారుకాని, ఈ శివుడే

అక్షరుడని, అనుగ్రహ ప్రదాతయని తెలుసుకొనక అజ్ఞానముతో ఉన్నారే!!

13. భూమిని కొలిచిన మహావిష్ణువు, విష్ణువు నాభిస్థానము నుండి జన్మించిన బ్రహ్మ మొదలగు దేవతలందరు శివుని కొలవలేనివారే అగుదురు. శివుడు ఊర్ధ్వలోకము, భూ, అధోలోకములను తన కంటితో కొలిచి అందరికి అతీతముగా వెలుగుచున్నాడు. (అంతటా శివుడే వ్యాపించియున్నాడు.)

14. స్వాధిష్ఠాన అధిదేవతయైన బ్రహ్మను, మణిపూరకస్థాన అధిదేవతయైన మహావిష్ణువుని, అనాహతస్థాన అధిదేవతయైన రుద్రుని, ఈ ముగ్గురుని అధిగమించి శిరస్సుపై నుండి అందరిని పరిపాలించుచున్నాడు.

(వెన్నెముకలోని షట్చక్రస్థాన అధిదేవతలైన బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు... వీరందరిని దాటి, శివుడు సహస్రదళము నందుండి అన్ని జీవులను పరిపాలించుచున్నాడు.)

15. శివుడు ప్రపంచమునకు సృష్టి, స్థితి, లయకారకుడుగాను, వాటికి అతీతముగా వెలసిల్లు పరంజ్యోతిగాను, వారివారి కర్మానుసారముగా ఫలం నొగసు ఫలప్రదాతగాను, తాను మాత్రం ఎప్పటికి నిత్యుడుగా ఉన్నాడు.

16. రేల పుష్పము ధరించిన జటాధారిగాను, అందము, ప్రకాశముతో కూడిన నుదురు గలిగిన పార్వతిదేవికి అర్ధనారీశ్వరునిగా నొప్పారు శివునిపై అసూయ గుణము గలిగిన దేవతలు శివుని ప్రశంసింపజాలరు.

17. స్థూలశరీరము, సూక్ష్మశరీరము ఒకటిగా కలిపియున్ననూ, మాయకు సంబంధించినది స్పందన సూక్ష్మశరీరములోనే ఎక్కువగా ఉండును. ఆ స్పందనము – అనగా శబ్దాది ఇంద్రియచేష్టలు మనస్సున ఇమిడినను, ఆత్మ తనను ప్రకాశరూపముగా చూచి, శరీరముతో బంధము వీగిపోయి, ఆకాశతత్త్వముతో శివైక్యము చెందును. (ఆత్మ చైతన్యముగా ఉండి చివరకి స్థూల, సూక్ష్మశరీరములకు అతీతముగా శివైక్యము చెందును.)

18. శివుడు ఉత్తర దిక్కునకు అధిపతి చేసిన కుబేరుణ్ణి తలంచి భక్తితో మన మనస్సున ధ్యానించిన యెడల, ధ్యానం సఫలము నొందించి, నీవును **అధిపతి అగుదువుగాక** అని శివుడు ఆశీర్వచనమొసంగును.

(శిరస్సుకు ఈశాన్యభాగమైన ఎడమకంటి దగ్గరిస్థానము, అది శబ్దస్థానముగా చెప్పబడినది. శివుడే కుబేరుణ్ణి ఉత్తరదిశకు అధిపతిగా నియమించెను.)

19. శివాజ్ఞచే ఉత్తరదిక్కున నియమించబడిన కుబేరుడు పంచేంద్రియ విషయ వాసనలను పురికొల్పి, ఏడు ఆధారములను చెడిపి పాడుచేసిన తరుణమున, అనాదిగా అధిపతిగా ఉన్న శివుని యందు మనస్సు లగ్నముచేసి ధ్యానించినచో

అన్ని పాపములు వారినుండి తొలగించి వారిలో నెలకొనియుండును.

20. జనన, మరణములను పిండోత్పత్తికి పూర్వమే నిర్ణయించిన శివుడు, తన స్థానమగు (నేత్ర కమలములకు పైభాగమైన శిరస్సును) సహస్రదళమును తలంచి ధ్యానించినచో ప్రకాశమును, శబ్దమును అనుభవించవచ్చును.
(పంచభూత నాయకుడు – సదాశివుడు – శిరస్సు స్థానం – ఆకాశతత్త్వం. ఇది అనుభవపూర్వక మగునపుడు నాదబిందు కళాది నమోః నమోః ధ్యానముతో ఉరుములు, మెరుపులు, నాదము, ప్రకాశము, సాధకుడు అనుభవించును.)

21. ఆకాశములోని మేఘమువంటి ఛాయగలిగిన విష్ణువు మరియు బ్రహ్మ మొదలగు దేవతల యొక్క కర్మఫలములను పోగొట్టువాడును, అహంకారమను అడవిలో తిరుగాడు మదపుటేనుగును చీల్చి చెండాడిన శివుని స్తుతించి ప్రార్థించిన యెడల అన్ని కర్మఫలములు తొలిగి జన్మరహితమగునే!!
(అహంకారమను మదపుటేనుగును తొలగించి మరుజన్మ లేకుండా చేయగలిగినవాడు శివుడే అగును.)

22. పంచభూతాత్మక శరీరములో ఏర్పడు ఆలోచనలు శివుడు ఎరిగిననూ, తనకు ఆ ఆలోచనలతో సంబంధము ఏర్పరచుకోకుండా, వాటికి అతీతమై ఉండును. ఇది చూచి **దైవమునకు నాయందు కరుణ లేదందురు** సామాన్య జీవులు. కాని దైవము తన కరుణను ఏ లోటు లేకుండా సమానముగా అన్ని జీవులందును, ప్రాణమునకు ప్రాణమై యుండి కాపాడుచున్నాడు.
(దైవము నిష్పక్షపాతముగా అన్ని జీవరాశులందును కరుణ చూపును.)

23. సర్వశక్తిమంతుడునైన ఈశుడు, అగ్నిదేవతను సముద్ర మధ్యమున నియమించి న్యాయ పరిపాలితుడయ్యెను. దైవము లేదని చెప్పవద్దు. సృష్టి, స్థితి, లయ కారకుడై రాత్రి, పగలుగా ఉండి, అన్ని జీవరాశులను కాపాడి అనుగ్రహించుచున్నాడు.
(బడబాగ్నిని సముద్రములో నియమించి, జఠరాగ్నిని జీవుని శరీరములో నియమించి వారివారి పనులు (కర్మానుష్టానములు) నిర్ణయించి, వాటి హద్దులు మీరకుండా పని చేయునట్లు చేసి, అన్ని జీవరాశులను కాపాడుచున్నాడు.)

24. స్తుతించి, ప్రార్థన చేసి నిర్విరామముగా శివుని కొలిచి, ఆతని దివ్య పాదపద్మములను కొనియాడి, అన్ని సంపదలు, ఐశ్వర్యములు వాని ఆశీర్వాదమువలనే గలిగినవని తలంచి, తన కృషేమీ కాదని ఎంచవలెను.
(బాహ్యవస్తువులందు ఉండు భ్రమను తొలగించుకొని అన్నియు ఈశ్వరార్పణము మరియు ఈశ్వర కటాక్షమని తలంచెడి వారియందే శివుడు తోడై నిలబడును. ఈశ్వరార్పణ ప్రణిధానం ప్రసాదమని భావించవలెను.)

25. అజః (జన్మరహితుడు), నిర్వికారుడు, అనుగ్రహప్రదాత, శాశ్వతుడు, శుభ ప్రదాతయైన శివుని నమస్కరించుట వలన అన్ని విధములైన శుభములు పొంది మరుజన్మరహితము పొందగలము.
(అనుగ్రహ ప్రదాతను కొలిచినచో పునర్జన్మ ఉండదు. అజ్ఞానము వీడును. అనగా జ్ఞానమువలన జీవన్ముక్తి పొందగలుగును.)

26. శివుడు ఆత్మరూపములో కొలువై, అన్నింటా వ్యాపించినవాడు. విశాలమైన జగత్తులో ఆవరించినవాడు. సహస్ర (శిరస్సు) దళపద్మమునందు కొలువైన వాడు. వానిని స్తుతించి, వాని పాదపద్మములను పట్టుకొనెదము గాక!!
(శివుడు జగత్తును సృష్టించి, దానికి అతీతమై, అన్నింటా, అన్ని జీవులందును చైతన్యుడైయున్నాడు. జీవులలోని చైతన్యము ఆత్మ ఒక్కటే.)

27. కలయికకు స్థానమైన స్వాధిష్ఠానం పుష్పము యొక్క ప్రకాశముతో నొప్పారు ముఖముతో, నిర్విరామ కరుణకు పాత్రులమైనట్టు ఆ మహాపురుషుని ప్రతి దినము కొలిచిన వారి యొక్క చిత్తములో (జ్ఞానముగా) నెలకొనియుండును.
(స్వాధిష్ఠాన అధిష్టాన దేవతామూర్తిని కొలిచినచో బుద్ధి (జ్ఞానం) వికసించి అనుగ్రహ పాత్రులగుదురు.)

28. అన్నింటా ఉన్ననూ శివుడు అంతటికి అసంగుడుగాను, అన్ని ఆత్మలలో చైతన్యముగా ఉన్నాడు. అన్ని కాలములలో ఉన్ననూ విభుండుగా ఉన్నాడు. దేవలోకమును పాలించు శివుడు తనకు ఎటువంటి వికారము లేక (ఏ మార్పు లేనివాడు) తనను భక్తితో కొలుచువారికి మార్గదర్శకుడుగా ఉన్నాడు.

29. శివునియందు గాఢమైన భక్తి సలుపువారి మనస్సులో ఉండి, తాను తల్లివేరు వలె కాపాడువాడు, జీవయాత్ర యంతటకు తోడుగా ఉండి కాపాడువాడు, శివుడు తప్ప వేరొకరు లేరు. కావు. కావున శివుని నేను దైవశ్రేష్టుడుగా కొలుచుటకు, నేను సిగ్గుపడజాలను.
(చెట్టుకు తల్లివేరు వలె, బండిచక్రమునకు ఇరుసువలె ఉండి జీవనయాత్ర సాగించువారి మదియందు నిలచి కాపాడువాడు శివుడు.)

30. ఆకాశతత్త్వమే శివతత్త్వము. తనంతట తానే వర్షించు మేఘమువలె, తానే వచ్చి అనుగ్రహించును. ఎట్లనగా లేగదూడ అరచిన వెంటనే తల్లి ఆవు తన బిడ్డ కొరకు పరుగెత్తివచ్చి సంధించినట్లు.
(లేగదూడ కొరకు పరితపించిపోవు తల్లి అవువలె, లోకజనులు కొరకు ముందే తానే వచ్చి జ్ఞానమును వర్షమువలె ప్రసాదించును.)

31. భూలోకవాసులకు తాను మానవరూపములో (సాకారమూర్తిగా) వ్యక్తమగును.

భువర్లోకవాసులకు తాను ఆకాశరూపములో ప్రకాశముగా వ్యక్తమగును. సువర్లోకవాసులకు కూడ దైవరూపమున వ్యక్తమై అనుగ్రహించును. సిద్ధులుగా కోరువారికి సిద్ధుడుగా ఉండి అనుగ్రహించును. పూర్ణ మనస్సు గలవారికి నాద (శబ్ద) స్వరూపునిగా ఉండి అనుగ్రహించును. నేను వానిని జ్ఞానస్వరూపునిగా కొలిచి, ప్రేమ సలిపితిని.

32. శివుడు దేవతలందరికి అధిపతి. మానవులకు అధిపతి. వాడు జీవకోటి సర్వమునకు ఊర్ధ్వముగాను, అధోముఖముగాను ఉండి అష్టదిక్కులకు అధిపతిగా ఉన్నాడు. సర్వత్రా వ్యాపించిన నీటితో ఏడు లోకములకు అతీతముగా ఉన్నాడు. వాని తత్త్వమును ఎరిగినవారెవరూ లేరు. ఇట్లు వ్యాపించిన ఆ మహామహుని నేనెట్లు వివరించగలను?

(అఖండవ్యాప్తియైన శివుని అనంత తత్త్వమును ఎరుగ ఎవ్వరికి శక్యము గాదు.)

33. కొలుచుటకు పలు దేవతలు ఈ లోకములో నున్నారు. ఆయా దేవతలను కొలుచుటకు కర్మానుష్టానము ఏర్పరచుకొని, సత్యస్వరూపుడగు శివుని మరిచెదరు. స్తోత్రపారాయణము చేయువారు శివుని నిజమైన తత్త్వమును తెలియనివారే అగుదురు. మనస్సునందు నిజమైన శాంతిని కోల్పోయినవారే అగుదురు. (సత్యస్వరూపుని తత్త్వము ఎరుగక చేయు కర్మానుష్టానము, స్తుతించు స్తోత్రములు ప్రయోజనము కానివే అగును.)

34. శివుడు దేవతలకు అనుగ్రహించిన సత్యతత్త్వము, గంధము కస్తూరి సువాసనలతో వీచెడి శివతత్త్వపు గాలివలె శివతత్త్వమును బోధించు అతని సహస్రనామముతో గూడిన శబ్దం, ప్రకాశము అన్ని దిశలందును సదా వ్యాపించుచునే యుండును.

35. మరెవ్వరికి సాధ్యముకాని సన్మార్గ తత్త్వమును బోధించు శివుని స్తుతించండి! స్తుతించి, పొగడి కొలవండి! అట్లు స్తుతించిన ఎడల అధోదిక్కు చూచు, శిరస్సులో తలక్రిందుగా అమరియున్న అష్టదళ పద్మమును ఊర్ధ్వముగా చూచునట్లు (ఈశానం) తను (శివుడు) చేయును!!

(అధోముఖముగా చూచు శిరస్సున లౌకికతత్త్వముతో కూడి అమరిన అష్టదళ పద్మము శివతత్త్వముచే ఊర్ధ్వదిశగా చూచునట్లు మారును. ఊర్ధ్వదిశ శివుని పంచముఖములలో **ఈశానం** ముఖమగును.)

36. ప్రాణమునకు తండ్రి, సర్వేశ్వరుడు, వెగటులేని అమృతము వంటివాడు, తనకెవరు సాటిలేనివాడు, కోరినవారి కోరికలు తీర్చు గుణమున్నవాడు, సహాయము చేయుటలో మొదటివాడు, ఎట్టైనను అతనిని ప్రార్థించండి. అట్లు ప్రార్థించిన యెడల ఈశుని నుండి తప్పక అనుగ్రహం పొందుదురు.

(కర్మ, ఉపాసన, ధ్యాన, యోగము, ఎట్లు పూజించినను తాను వచ్చి అనుగ్రహించును.)

37. నిలకడగా ప్రతిదినము నేను ఈశ్వరుని ప్రార్థించుచున్నాను. అగ్ని స్వరూపునిగా ప్రత్యక్షమై నిలుచున్నాడు. ఆకాశములోని చంద్రునివలె తన కళలతో నిలుచున్నాడు. తను జీవి శరీరములో శిరస్సుయందు సహస్ర దళములో ప్రాణరూపముగా వెలుగొందుచున్నాడు.

(బ్రహ్మాండములోని చంద్రప్రకాశమువలె పిండాండములోని శిరస్సున సహస్ర దళమున తేజోమయుడై శివుడు ప్రకాశించుచున్నాడు.)

38. శ్రేష్టుడు, మహాశక్తివంతుడైన శివుని సదా స్తోత్రించుదును. తల్లి గర్భమున జన్మించనివాడును (అజః), సాకారుడునైన శివుని సదా ప్రార్థించుదును. ఆ మహామహుని ఎల్లవేళలలో స్తుతించుదును. ఎల్లప్పుడు ఆతని స్తుతించుచున్న నేను ఒక గొప్ప తపస్వి కాగలను.

(ఎల్లప్పుడు ఈశ్వరుని స్తుతింతుటయే గొప్ప తపస్సుగా మారును.)

39. నోరార స్తుతించువారి మనస్సున వెలయు జ్యోతివలె, తాపములను తొలగించు తీర్థమువలె, ఆకాశమండలములో వెలుగు ఆ మహామహుని స్తుతించుచు **నా దేవాది దేవా** అని నమస్కరించి, ఆతనియందు భక్తి సలుపువారికి అతని అనుగ్రహము పొందుట సులభతరమగును.

40. జీవుల కొరతలను తీరిపోవుటకు సర్వేశ్వరుని యొక్క శబ్దించు పాదపద్మముల దరిచేరండి. అది సంపూర్ణమైన మేలిబంగారపు కాంతివంటిది. వంచన లేని గాఢమైన భక్తి సలుపు వారి యొక్క హృదయమున ప్రవేశించి, శరీరము ఒక బాహ్యవస్తువుయని బోధించును. (శరీరము జడమని – ఆత్మయే సత్యమన్న బోధ). (వంచన లేని గాఢభక్తి సలుపు భక్తుడికి **నీవు వేరు, శరీరము వేరు** అని విడదీసి ఆత్మతత్త్వము బోధించును.)

41. పాలసముద్రమున పెల్లుబుకిన విషమును త్రాగిన ఆ మహాదేవుడిని శుద్ధి చేయబడిన భూమివలె నిర్మల మనస్సుతో ధ్యానించువారికి నాదశబ్దముతో గూడిన ఉమాదేవి భాగస్వామిగాను, ఆడజింకను చూసిన మగజింకవలె చేరి అర్థనారీశ్వరుడుగా ప్రత్యక్షమగును.

42. శివునియందు శరణాగతి నొంది స్తుతించువారు పొందు ఫలం ఏదనగా, చతుర్ముఖబ్రహ్మ సృష్టించిన ఈ మాయాలోకంలో పునరపి జననం, పునరపి మరణమని ప్రారబ్దమును అనుభవించిననూ, సంసారసాగరములో కొట్టు మిట్టాడినను, తెల్లటి వెదురు వంటి భుజములు గలిగిన, ఉమాదేవికి పతియైన,

శివుడు వచ్చి వారిని ఆదుకొనును.

43. ఈశ్వరుని స్తుతించి, ప్రేమతో మనస్సు కరిగి, నిర్విరామముగా కొలిచి, భావదీక్షనొంది, బుద్ధి సాధనతో జ్ఞానమును సదా తన చిత్తమునందు నిలువు వారికి శివుడు (జీవుని) మనస్సును పండించి, పూర్ణత్వమును ప్రసాదించును. (సదా ఈశ్వరధ్యాసలో ఉండువారికి, వారి చిత్తమునందు పరిపూర్ణత్వముతో శివుడు నెలకొనియుండును.)

44. దేవతలు త్రినేత్ర స్థానాధిపతి యైన ఏకపాద శివుని ప్రార్థించుదురు. రాక్షసులు శివుని వర్థిల్లమని చెప్పుదురు. మానవులు శివుని పాదపద్మములకు ప్రణమిల్లి స్తుతించుదురు. కాని నేను (రచయిత) శివునిని ప్రేమతో నా చిత్తము యందు నిలుపుకొందును.
(జ్ఞాని ప్రేమతో చిత్తమునందు ఆ మహామహుని నిలుపుకొనుటయే.)

45. ఈ జగత్తు (లోకము) కర్మానుష్టానము ననుసరించి ఒక పద్ధతి ప్రకారము జరుగుచున్నది. ఈ విధివిధానములో ఎటువంటి మార్పు ఉండదు. జ్యోతి స్వరూపుడైన ఈశుని స్తుతించిటయే పరమావధి. కాని శివసూర్యునిని సదా చిత్తమునందు నిలిపి స్తుతించువారికి ముక్తినొసగి అనుగ్రహించును.
(శివసూర్యుని ధ్యానించిన వారికి ముక్తినొసగి అనుగ్రహించును.)

46. ఈశ్వరుని మనస్సున నిలిపి ఆ ధ్యాసలో నుండువారు, ఓ మంగళస్వరూపి! ఓ సర్వేశ్వరా! ఓ ఎఱ్ఱటి శరీరఛాయ గలవాడా! అని స్తుతించెదరు. ఓ సనాతనా! ఓ ఆదిమధ్యాంత రహితుడా! ఓ మహోన్నతుడా! అని నేను (రచయిత) శివుని జ్ఞానప్రకాశునిగా కొలుచుటచే నా మదియందు సదా ఇమిడి అనుగ్రహించును. (సాకార ఈశ్వరునిగా కొలుచుటయు, నిరాకార ఈశ్వరునిగా కొలుచుటయు, ఎవరెవరెట్లా కొలిచినను అట్లే అనుగ్రహించు ననునది భావన. జ్ఞానులు కొలుచునది నిరాకార ఈశ్వరుడినే.)

47. సంసారములో ఉండి ఈశ్వరధ్యాసతో నున్నవారు మహాతపస్సు చేసినవారికి సమానము. నిరంతరము ధ్యానములో లీనమైనవారు ఈశ్వరకృపకు పాత్రులగుదురు. తాటిచెట్లపై నున్న గ్రద్ద తన ఆహారము కొరకు క్రిందకు ఎగిరివచ్చు సమయము తప్పించి, మిగతా సమయమంతా తాటిచెట్టుపై కాలము గడిపినట్లు, లౌకిక జీవితమునకు ఎంత సమయమో అంతవరకు వెచ్చించి, మిగతా సమయమున ఈశ్వరధ్యాసతో ఉండనివారికి ఈశ్వరుని కృపకు పాత్రులు కాజాలరు.

48. దాసానుదాసులు నమస్కరించు దేవాదిదేవుడికి నా శిరస్సు వంచి నమస్కరించి,

ఆ మహామహునిని తలంచి, భూలోకవాసులను అనుగ్రహించు శ్రేష్ఠుడైన వానిని, ఆరని దీపమువలె సదా ప్రకాశించువానిని నేను (రచయిత) శరణునొందితిని. (రాత్రి, పగలనక సదా ప్రకాశించుచున్న ఆ స్వయంప్రకాశకుడు, శ్రేష్ఠుడు, మహామహుడుని శరణు నొందవలెను.)

49. అనాదిగా వచ్చు జీవుని బంధములకు నాధుడైన శివుని తలంచి, జీవుని తత్త్వము, బంధకత్త్వములు నెరిగి శివుని యందు ధ్యాస యుంచినచో, అలల వలె పొంగివచ్చు పాపకర్మలను, సముద్రమును ఈదించి, భవబంధములను త్రెంచి ముక్తి నొసగి దరిచేర్చును.
(భవబంధములైన అహంకారము, కామ్యకర్మలు, మాయయును, మలములు నెరిగి, వాటిని త్రెంచి ఈశ్వరధ్యాసతో నున్నవారికి ముక్తి సులభమగును.)

50. ఈశ్వరుని దివ్యపాదపద్మములను శిరస్సుపై దాల్చెదను. **నాయకుడా** అని స్తుతించెదను. పలు పుష్పములు అర్పించి వినయముతో, ఆనంద నాట్యమాడెదను. నాట్యమాడి, తనే దేవాదిదేవుడని స్తుతించి, ఇట్లు ఈ రోజంతయూ కాలము గడిపెదను.
(ఈశ్వరకృప పొందుటకు దైవము యొక్క పాదములు శిరస్సుపై దాల్చి, స్తుతించి, పూలు అర్పించి, సదా ఆ మహామహుని ధ్యాసలో ఉండవలెను.)

## 2. వేదశ్రేష్టం

### (వేదముల యొక్క గొప్పతనము)

51. వేదములలో చెప్పబడని ధర్మం ఏదియు లేదు. మనము పఠించి, నేర్వవలసిన ధర్మం అంతయు వేదమున గలదు. కావున అనుభవజ్ఞులందరు తర్కవాదనను విడిచి, అన్ని విషయ పరిజ్ఞానము గల వేదములనే పఠించి ముక్తినొందిరి.
(ఋక్, యజుర్, సామ, అధర్వణ వేదమను నాలుగు వేదములు. ప్రతి వేదములో సంహితలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు అని నాలుగు విభాగములు. కర్మ, ఉపాసన, జ్ఞానవిషయ పరిజ్ఞానము గలవి. విద్ నుండి వచ్చినది కనుక వేదముగా పిలువబడినది. వీటిని తర్కం వదిలి పఠించి ముక్తినొందియున్నారు.)

52. వేదములు శబ్దస్వరూపములైనవి. దానిని శబ్దజ్ఞానముతో పలుకవలెను. వేదమును బోధించిన దైవము బ్రహ్మపదార్థమును ఎరుగవలెనను ఉద్దేశముతో చెప్పబడినది. బ్రాహ్మణులు యజ్ఞయాగాదుల ద్వారా లోకకళ్యాణము కొరకు పఠించిరి. ఆత్మజ్ఞానమును బోధించుటకు వేదములు చెప్పబడియున్నవి.
(బ్రహ్మపదార్థము వివరణ తెలుసుకొనుటకు, ఆత్మజ్ఞానమును బోధించి లోక కళ్యాణార్థము వేదములు దైవముచే కూర్చబడినవి.)

53. మంత్రరూపములో గల అనంతమైన వేదములును, మనస్సును, రమింపజేసే సత్యస్వరూపములైన వేదమంత్రములును, అన్ని శంకలను నివర్తింపజేయు సామర్థ్యముగల వేదశాస్త్రములును, సూక్ష్మరూపమున వెల్లివిరిసినవి, ఆ త్రినేత్రుడైన శివుడే అగును.

(బ్రహ్మం, ఆత్మస్వరూపముగా, పరాణువుగాను, సూక్ష్మరూపముగాను, ఏకంగాను, సత్యస్వరూపునిగాను, అన్ని శివుడే అని చెప్పబడినది.)

54. దైవత్వము అనునది జ్ఞానము, అజ్ఞానములకు అతీతముగా ఉన్న ఈశ్వరుడే అని తలంచి, గురుకృపతో దైవమును తెలుసుకోదగినది ఒక గొప్ప తత్త్వమగును. ఇదే గొప్ప ఆత్మతత్త్వమని వేదముల యొక్క అంతిమ భాగమైన ఉపనిషత్తులు (జ్ఞానమును) చెప్పుచున్నవి.

(వేదపూర్వభాగం = కర్మ, ఉపాసనలు; అంతిమభాగం = జ్ఞానకాండం తెలుపునది.)

55. ఆరు అంగములుగా విభజించి వేదములను అనుగ్రహించిన వానిని, శరీరముతోనే తను ఒక అంగముగా ఉన్నాడని ఎరుగక, వేరుగా బాహ్యముగా ఉన్నాడని తలంచి, స్తుతించువారు తమతమ కామ్యములను వృద్ధి చేసుకొని చెడుపు చేసుకొనుచున్నారే!!

(శివుని బాహ్యముగా ఉన్నాడని తలంచి తమతమ ఇష్ట కామ్యకర్మములలో పడి కొట్టుమిట్టాడి, ప్రారబ్ధమును పొందుచున్నారే అని రచయిత వాపోవుట.)

(వేదములలో ఆరు అంగములు: శిక్షా, కల్పమ్, వ్యాకరణము, ఛందస్సు, జ్యోతిషము, నిరుక్తమ్ అనునవి వేదము పఠించు విధివిధానములు తెలుపునవి.)

56. పాటలు, దానికి తగ్గట్టు సంగీతము, నాట్యము ఆడువారి నాట్యచిందులతో విరామములేని ఈ లోకంలో వేదతత్త్వము చూపి నిజతత్త్వము తెలియజేసిననూ, యజ్ఞయాగాది విధివిధానము అనుసరించనివారు బాహ్యవిషయ, వస్తు వాసనలతో మిళితమై చెడి నశించుచున్నారే!!

(వేద విధానములను అనుసరించువారు, ఆచరించువారు సత్యస్వరూప మెరిగిన మహాశ్రేష్టులని చెప్పబడినది.)

## 3. ఆగమశ్రేష్టం

### (ఆగమముల యొక్క గొప్పతనము)

57. నల్లని ఛాయ గలిగిన ఉమాదేవిని తన ఎడమప్రక్కన నిలుపుకొన్న శివుడు, ఆగమములు ఇరువది ఎనిమిదింటిని (28) తన భక్తులైన అరవై యారుగురికి (66) తన ఐదవ ముఖమైన **ఈశానం** నుండి బోధించెను.

(శివునికి ముఖములు ఐదు. అవి తూర్పు చూచునది – తత్పురుష రుద్ర; దక్షిణం – అఘోర; పడమర – సద్యోజాత; ఉత్తరం – వామదేవ; ఊర్ధ్వ చూచునది – ఈశానం. తన అరవైయారుగురు యోగపురుషులకు ఇరువది ఎనిమిది (28) ఆగమశాస్త్రములను బోధించెను.)

ఈశ్వరుని ఊర్ధ్వముఖమగు ఈశానం నుండి 66 యోగపురుషులకు ఆగమములు (28) బోధింపబడినవి. యోగపురుషుల పేర్లు –

| | | |
|---|---|---|
| 1. | కామికం | – ప్రణవుడు, త్రికాలుడు, హరుడు |
| 2. | యోగజం | – సుధా, భష్మడు, విభుడు |
| 3. | శింధియం | – సుదీప్తరడు, గోపతి, అంబిక |
| 4. | కారణం | – కారణుడు, సర్వరుద్రుడు, ప్రజాపతి |
| 5. | అజితం | – శుశలుడు, శివుడు, అచ్యుతుడు |
| 6. | దీప్తం | – ఈశర్, ఈశానుడు, ఉదాసీనుడు |
| 7. | సూక్ష్మము | – సూక్ష్ముడు, వైశ్వరుడు, ప్రపంచనుడు |
| 8. | సహస్రం | – కాలుడు, భీముడు, ధర్ముడు |
| 9. | హంసుమాన్ | – హంసమనుడు, అసురుడు, రవి |
| 10. | సుప్రేతం | – దేశసుడు, విఘ్నేశ్వరు, శశి |
| 11. | విజయం | – అనాధిరుడు, పరమేశ్వర్ |
| 12. | నిశ్వారం | – ధశారుడు, శైలజుడు |
| 13. | స్వయంభువం | – నితనేశ్వరుడు, బ్రహ్మ |
| 14. | అనలం | – వ్యాముడు, అగ్ని |
| 15. | వీరం | – తేజస్సు, ప్రజాపతి |
| 16. | రౌరవం | – బ్రహ్మేశ్వర్, నందికేశర్ |
| 17. | మకుటం | – శివర్, మహాదేవుడు |
| 18. | విమలం | – సర్వాత్మకుడు, వీరభద్రుడు |
| 19. | చంద్రజ్ఞానం | – ఆనందుడు, గృహస్పతి |
| 20. | బింబం | – ప్రశాంతుడు, దధీచి |
| 21. | పుర్గోతం | – శూలి, కవచుడు |
| 22. | వలితం | – లయడు, ఆలయుడు |
| 23. | శిత్తం | – బిందు, చండికేశ్వరుడు |
| 24. | సంతానం | – శివనిష్టుడు, వాయువు |
| 25. | సర్వోక్తం | – సోమదేవుడు, నృసింహుడు |

26. పరమేశ్వరం - శ్రీదేవి, ఉచనస్సుడు
27. కిరణం - దేవవిభుడు, సంవర్తకుడు
28. వాదుళం - శివరుడు, మహాకాలుడు

58. దైవము జీవాత్మలపైనున్న కరుణ వలన ఆగమశాస్త్రములను చెప్పి అనుగ్రహించెను. లెక్కించుటకు వీలుకాని విధముగా పెక్కు ఆగమముల మొత్తం ఇరువదిఎనిమిది కోట్ల, ఒక లక్ష అగును. దీని మూలమును వినిన దేవతలు ఈశ్వరుని వేయినోళ్ళ కొనియాడిరి. దీనినే నేను (రచయిత) సర్వదా అనుసరించి, శాస్త్రాధ్యయమును నమస్కరించుచున్నాను.

59. జ్ఞాని అనువాడు పదునెనిమిది భాషలను తెలిసినవాడు. అటువంటివాడు ఆగమములు యొక్క తత్త్వములు నెరిగినవాడే. జ్ఞానులు చెప్పు పద్దెనిమిది భాషలు కూడ జగత్ సృష్టిలో అన్ని అండముల సృష్టికి మూలపురుషుడైన శివుడు బోధించినదే అగును.
(దైవము నోటినుండి వెలువడినవి కనుక వాటికి భాషతో పనిలేదు. అపౌరుషేయం కనుక భావప్రకటనయే ముఖ్యము. కావున ఏ భాషలో చెప్పిననూ ఆ భావన ఒక్కటే అగును.)

60. దైవము అనుగ్రహించిన ఆగమములు దైవత్వముతో నిండినవి. ఇవి దేవలోక వాసులైన దేవతలకు స్వీయ అనుభవములోకి రావు. ఇవి ఎన్ని కోట్ల సంఖ్యలో నున్ననూ, ఆగమములు అనుభవములోనికి రానప్పుడు నీటిలోని రాతలవలె ఫలితములు పొందజాలదు.

61. పరజ్ఞానము, అపరాజ్ఞానములను రెండింటిని బోధించి, జగత్తును తన భుజములై మోస్తున్నవాడైన శివుడు, దేవతలచే కొలువబడి, తానే జ్ఞాన స్వరూపిగా అన్ని ఆగమములలోను వెలుగొందుచున్నాడు.
(పరజ్ఞానము – శివతత్త్వమెరుగుట; అపరాజ్ఞానము – అరువదినాలుగు కళలను ఎరుగుట. రెండింటిని బోధించిన శివుడు జ్ఞానస్వరూపిగా నొప్పారు చున్నాడు.)

62. పరమశివుడైన పరమాత్మ నుండి శక్తి, సదాశివులు, మహేశ్వరుడు, రుద్రుడు, నారాయణుడు, బ్రహ్మ వారివారి జ్ఞానశక్తుల కొలది పొందిన ఈ తొమ్మిది ఆగమములు, మన గురునాథుడైన నందీశ్వరుడు పొందియున్నాడు.
(**నందీశ్వరుడు** అని చెప్పబడునది –
1. నంది = వాహన నందీశ్వరుడు శివ అంశమే.
2. నందీశ్వరుడు = శివనామములలో ఒకటి.
3. నంది = రచయిత గురువుగారైన నందిదేవర్.

సమయానుకూలముగా పాఠకులు గ్రహించవలెను.)

63. గురు పరంపరగా పొందిన ఈ తొమ్మిది ఆగమములు. కారణం, కామ్యము, శింధియం, శుభ్రం – అనునవి శివభేదమనియు; వీరం, వాధుళం, కాళోత్తరం, మకుటం – అనునవి రుద్రభేదం అనియు; యామళం – అనునది తంత్రశాస్త్రమనియు బోధించబడియున్నది.

64. దైవ అనుగ్రహముచే వచ్చిన ఈ శివ ఆగమములు, లెక్కకి అందనివిగా కోట్ల సంఖ్యలో చెప్పబడిననూ, దైవము చెప్పినది సత్యస్వరూపములని పరిగణించకున్నచో, అవియున్ననూ నీటి మీది వ్రాతలవలె ఉపయోగపడక పోవును.

(ఆగమశాస్త్రార్థములన్నిటిని దైవజ్ఞానముతోనే గ్రహించవలెను. ఏలననగా అది దైవము నోటినుండి వెలువడినదని నొక్కి వక్కాణించుచున్నారు.)

65. వర్ష, గ్రీష్మ, హేమంతఋతువులు సరిగ్గా లేక, చెఋవులు, నదులు ఎండి, బీడుభూములుగా మారిన కాలములో సంస్కృతములోను, తమిళములోను ఏకకాలములో చల్లగా ఉపదేశించి, సృష్టి ప్రారంభమునకు పూర్వమే ఉమాదేవికి ఆగమములను శివుడు అనుగ్రహించెను.

66. ఆత్మను బంధము నుండి విడిపించుట, బంధము కల్పించుట, జీవ వ్యవహారములంతటిని కేవలం తన కంటి రెప్పపాటు కాలములో చేయగల శివుని సంస్కృత, తమిళభాషల పాండిత్య పరిజ్ఞానముచే అర్థము చేసుకోగలమా? (చేసుకోలేము)

(భవబంధములను త్రెంచుట, కల్పించుట చేయగలిగిన శివుని వట్టి ఆగమ శాస్త్రజ్ఞానముతో తెలుసుకొనలేమని ఎరుగవలెను.)

## 4. గురు పరంపర

### (గురు విధానము)

67. దివ్యనందీశ్వరుడు (నంది–శివుడు) అనుగ్రహించుటచే, ఉపదేశసారముతో పునీతులైనవారు సనక, సనందన, సనాతన, సనత్కుమారులు అనువారు. నలుగురును మరియు శివయోగ మహాముని, కనకసభ (బంగారుసభ)లో దివ్యనాట్యమును దర్శించిన పతంజలి, వ్యాఘ్రపాదుడు, నాతో (రచయిత – తిరుమూలర్) కలిపి ఎనమండుగురము.

(శివుని వద్ద ఉపదేశము పొందినవారందరు **నంది** అనే పిలువబడిరి.)

68. శివుని అనుగ్రహముచే గురునాధుడను స్థానము పొందితిమి. వాని అనుగ్రహముతో పరకాయ ప్రవేశము చేసి, ఆవులకాపరి మూలన్ రూపము

పొందితిని. జగత్తులో శివుని అనుగ్రహము వలన అన్నియూ నెరవేరును. శివుడు దారిచూపి అనుగ్రహించుటచే ఆవులకాపరి దేహముతో నున్న నేను ఈ దక్షిణదేశమునకు శివతత్త్వమును బోధించి దైవమనుగ్రహించిన దారిలో వెళ్ళితిమి. (శివుడు అనుగ్రహించుటచే మూలన్ శరీరములో చేరి, అనుగ్రహముతో శివుడు చూపినట్లు నడుచుకొంటిని.)

69. తిరుమంత్రము ఉపదేశము పొందినవారు నారాయణుడు, ఇంద్రుడు, సోముడు (చంద్రుడు), బ్రహ్మ, రుద్రుడు, కాలంగినాధుడు, గంజగిరితో కలిపి ఏడుగురు. నాతో ఈ విధానములో వచ్చిన విద్యార్థులగుదురు.

70. సనకాది నలుగురు నాలుగు దిశలకు ఒక్కొక్క దిశానాధుడుగాను, వారు పొందిన అనుభవజ్ఞానముతో, తాము పొందిన జ్ఞానము ఇతరులు కూడా పొందవలెనను సదుద్దేశముతో ఇతరులకు బోధించి, తమను తాము ఉద్ధరించుకొని ఉన్నతి పొందిరి.

71. శివయోగ మహామునికి, పతంజలికి, వ్యాఘ్రపాదునకు, ముగ్గురికి, సనకాది మునులకు శివునిచే బోధింపబడిన జన్మరాహిత్య సిద్ధాంతము మహాశ్రేష్టమైనది. అనాదిగా ఉండు ఎర్రనైన సోమసూర్యాగ్నివంటి ప్రకాశ స్వరూపుడైన పరమేశ్వరుడు తక్కువైన కీర్తిని ఇచ్చువాడు కాదు.

(ఎనమండురుకి శివుడు ఆత్మబోధ చేసి జననం, మరణం లేని స్థితి తత్త్వమును అనుగ్రహించెను. ఇక్కడ ఒక సూక్ష్మము గలదు. సనకాది మునులగు నలువురికి అలౌకికముతో కూడిన నివృత్తి మార్గమగు – సన్న్యాసమును, శివమహాముని మొదలు పతంజలి, వ్యాఘ్రపాదుడు, రచయిత తిరుమూలర్ నలువురికి లోకప్రజలతో మామేకమై లోకకళ్యాణార్థము ప్రవృత్తిమార్గములను అనుసరింపజేసి తుదకు శివజ్ఞానముతో తనలో ఐక్యమగు తత్త్వమును బోధ పరచెను. ఈ రెండు విధములైన తత్త్వములను ఏకపరచుటయే రచయిత ఉద్దేశమగును.)

(మరింత పరిశీలించినచో శివుడు ఈ ఎనమండుగురికి ఏ భాషలో బోధించి యుండునన్న ప్రశ్న మనస్సునందు ఉదయించవచ్చును. దానికి సమాధానము: జగత్తు అంతయూ 1) శబ్ద ప్రపంచము, 2) అర్థ (వస్తు) ప్రపంచముతో కూడినది. శబ్దప్రపంచము అన్ని భాషలకు వర్ణము, పదము, మంత్రములుగా కలది. ఇది బుద్ధిలో శుద్ధమాయతో ఉదానవాయువు కారణముగా వాక్కుగా – **చత్వారి కరణము**గా వెలసిల్లియున్నది. వాక్కు మూలాధార చక్రములో వల్లభశక్తి – నాదము (సూక్ష్మముగా) **పరా**గా ఉన్నది. దానికి పైనున్న మణిపూర స్థానమగు నాభిలో **పశ్యంతి** (సూక్ష్మంగా) అక్షరహీనముగా నెలకొనియున్నది. అనాహత స్థానమగు

హృదయములో **మధ్యమ** సంగీతంగా తనకు మాత్రము వినపడేటట్లు నెలకొనియున్నది. విశుద్ధి స్థానమగు కంఠమున **వైఖరి**గా అక్షరబద్ధమగు శబ్దముగా నెలకొనియున్నది. ఇందు సూక్ష్మవైఖరి – గుసగుసలు, స్థూలవైఖరి – బాహ్య శబ్దములతో శబ్దించును. ఇడ, పింగళ సుషుమ్న నాడుల రాపిడితో శుద్ధమాయ వలన ఏర్పడిన సూక్ష్మశబ్ద చలనముల సమూహము మూలాధారము, నాభి, హృదయము దాటి కంఠమునకు వచ్చి బాహ్యశబ్దముగా ఏర్పడును. కావున కంఠమునకు వచ్చుటకు ముందే ప్రతి శరీరములో నాదముగా నెలకొని గ్రహించబడును.)

(కావున ఈ గ్రహింపునకు భాషతో పనిలేదు. **పరా** సూక్ష్మనాద గ్రహింపు తపస్సుతో గలిగినది మనస్సులో వచ్చిచేరునది. మనస్సు నుండి బాహ్య శబ్దముగా కంఠము నుండి వారివారి భాషలలో వెలువడును.)

72. ఎనిమిది దిక్కులందు భారి వర్షము కురిసి సముద్రములు పొంగి పొరలిననూ ప్రగతినిచ్చు ధర్మ, అనుగ్రహకర్మలే చేయవలెనని చెప్పి, ఈశ్వరుని శిరస్సుపై నున్న పగడమువంటి ఎర్రనైన జటాఝూటంలో ప్రేమతో నెలకొని, నొప్పారు సనకాది మునులైన నలుగురికి అనుగ్రహభాష్యము శివుడు నొసంగెను.

(ఎటువంటి ఇక్కట్లున్ననూ, సదాశ్రేయస్సు ఉద్దేశించిన ధర్మాచారపు సత్కర్మలు చేయుచూ ఉండవలెనని సనకాది మునులకు పరమేశ్వరుడు ప్రేమతో ఆజ్ఞాపించెను.)

## 5. శ్రీ తిరుమూలర్ జీవితచరిత్ర

### (రచయిత జీవితగాథ)

73. నా గురుదేవుడైన నంది (పరమేశ్వరుడు) పాదపద్మములను నా శిరస్సుపై దాల్చి, జ్ఞానమును మనస్సున నిలిపి, నమస్కరించి, త్రినేత్రముతో వెలయు చంద్రశేఖరుడైన శివుని పాదపద్మములను తలంచి, ప్రతిరోజు ధ్యానించి, **తిరుమంత్రమ**ను ఆగమమును చెప్పుటకు ప్రారంభించుచున్నాను.

(శివుని అనుగ్రహముచే **తిరుమంత్రం** ఆగమమును చెప్పుటకు ప్రారంభించు చున్నానని (రచయిత) చెప్పుట.)

74. శివాగమము చెప్పుటకు అర్హత పొందిన పిదప, ఆ అర్హత అనుగ్రహించిన నా గురునాధుని పాదపద్మములను పొందిన పిదప, శిరస్సుపై లెక్కలేనన్ని మహాప్రకాశ అణువుల చలనములను దర్శించిన పిదప, సాటిలేని ఏడు ఆధారములలో ప్రకాశముతో వెలుగొందియుంటిని.

(చిదాకాశమున (శిరస్సు సహస్ర దళమునందు) ప్రకాశించుచున్న కోటానుకోట్ల అణువుల ప్రకాశరూపములో నుండి తన గురునాథుని (శివుడు) దర్శించు చుంటినని చెప్పుట.)

75. ఇంద్రుడా! ఏడు ఆధారములలో ప్రకాశముతో వెలుగొందిన కారణము అడుగుమా! ఆ ఒక్కొక్క భువనములకు అధిపతియైన తపస్విని (భువనాధిపతి యైన పరాశక్తి), చిదాకాశ బ్రహ్మాండ ప్రకాశముతో భక్తితో ఆమెను దర్శించిన పిదప ఆమె అనుగ్రహముతో నేను (రచయిత) తిరిగి వచ్చితిని.

(శరీరములోని షట్చక్రస్థానములతో, సహస్రదళము కలిపి ఏడు స్థానములను ఏడు భువనములుగా ప్రకాశమునకు నెలవుగాను, వాటి అంతటికి పరాశక్తి అధిపతిగాను వర్ణించి అచ్చట వెలుగొందు ప్రకాశములలో తాను (రచయిత) నెలకొన్నట్టు చెప్పియున్నాడు.)

(రచయిత శ్రీ తిరుమూలర్ మహాజ్ఞాని, అష్టాంగ యోగి, సిద్ధుడు, అన్ని సిద్ధిలీలలు అభ్యసించి, అనుష్టించినవారు.)

76. సదాశివ తత్త్వము-ముత్తమిళం (మూడు+తమిళం= గ్రంథ, సంగీత, నాటక తమిళ భాషాపరముగా చెప్పుట) - వేదము కనుక ఈ కాలములలో నేను (రచయిత) మితమైన ఆహారము తీసుకొని, కొన్ని సమయములలో ఆహారము లేకయు, మరియు ఇష్టా ఇష్టములను విడనాడియుంటిని. దీనివలన నా మనస్సు తేటనై సత్యజ్ఞానతత్త్వంను గ్రహించితిని.

77. నారాయణా! ఈ దక్షిణదేశ దిశగా నేను వచ్చిన కారణము ఏదనగా, నీల వర్ణముతో నొప్పారు శరీరఛాయ గలిగిన పార్వతిదేవితో కలిసి మూలాధార స్థానాధిపతియైన తేజోశివుడు తన పంచకర్మ నాట్యభంగిమలో ఆడు తత్త్వము కూడిన వేదమును లోకులకు విశదీకరించి చెప్పుటకే!!

(శివుడు పార్వతిదేవితో కలిసి ఆడు నాట్యతత్త్వమును లోకులకు బోధపరచుటకే వచ్చితినని రచయిత చెప్పుచున్నారు.)

78. ధర్మప్రదాత, మహానందదాయినియైన ఈశ్వరీ, నా జన్మ కారణబంధము త్రెంచి ఆకొట్టుకొనెను. ఆమె ఎల్లలు లేని కరుణ శ్రేష్టములను గలిగినది. తను శివునితో కలిసి జీవులను పరిపక్వము చేయు కారణముగా జీవుల వెన్నెముక స్థానములో కలిసి నెలకొన్న శక్తిస్వరూపిణి. ఆమె పాదపద్మములందు నేను శరణొందితిని.

(అష్టాంగయోగములో వెన్నెముకలోని షట్చక్రములు ఒక్కొక్కటి ఒక్కొక్క దైవముతో స్థానబలిమి గలిగినవి. దీనినే రచయిత పార్వతి పరమేశ్వరునితో కలిసియున్న స్థానములో తను శరణునొందితినని చెప్పుట.)

79. అర్థనారీశ్వరుని రూపములో నున్న శివుని కొలిచితిని. శివుడు జీవులను పరిపక్వమొనరించు ఉద్దేశముతో వారి శిరస్సున గల సహస్ర దళములో నెలకొనియుండుటచే నేనూ ఆతనితో కలిసియుంటిని. శివబోధ జ్ఞాననీడలో కలిసియుంటిని. అట్లు ఎల్లవేళలా శివుని నామస్మరణలోనే ఉంటిని.
(రచయిత ఎల్లవేళలు శివతత్త్వమందే తన్మయత్వం చెందియుండిరి.)

80. ఈ శరీరముతో ఎంతోకాలము నెలకొనియుంటిని. రాత్రి పగలు లేని స్వయంప్రకాశ ప్రదేశములో ఉంటిని. దేవతలు వచ్చి శివుని స్తుతించు స్థానములో నేను కూడా ఉంటిని. నా గురునాథుడైన నందీశ్వరుని పాదపద్మముల క్రింద అమరియుంటిని.

81. ఉన్నతమైన జన్మను ఎట్లు పొందగలరు? వారు పూర్వజన్మమున బాగుగా తపస్సు చేసినవారై యుందురు. నన్ను తమిళములో ఆగమములను చేయుమని చెప్పుటచే, నాకు మంచి జ్ఞానమును సమకూర్చి దైవము నా జన్మను సార్థకము చేసెను.
(సంస్కృతభాషలో గల ఆగమశాస్త్రమును తమిళములో వ్రాయుటకొరకే శివుడు తనకు జ్ఞానము, మేధస్సు గలిగిన జన్మ ఇచ్చెననియు, బృహత్కార్యమును అప్పచెప్పిరని రచయిత చెప్పుచున్నారు.)

82. జ్ఞానప్రదాత, నాయకురాలైన పార్వతీదేవితో కలిసియున్న శివపురములో ప్రవేశించి, ఏ వైకల్యములు లేని తొమ్మిది స్థానచక్రముల సంధిలో నిలచి, స్తోత్రించి, అభిషేకించి, దైవమును పూజించి, మంచి జ్ఞానస్వరూపముతో నిండిన శివుని పాదములందు అమరియుంటిని.
(శరీరములోని షట్చక్రములతో గూడిన, సహస్ర దళముతో శుక్ర, శ్రోణితములు మొత్తము తొమ్మిది కలిసి సంధిస్థానముగాను, వైకల్యము లేనివిగాను ఇందు చెప్పబడినది. శరీరఅండము నుండి అఖండములో నుండిరి.)

83. దివ్యకైలాసం నుండి వచ్చు మార్గములో శివుని తలంచుకుంటూ, మన్మథుని జయించుటలో జ్ఞానముతో నిండిన మహామునిగా, ముప్పది ముక్కోటి దేవతలు, రాక్షసులు, మనుష్యులు మధ్య, నాయందున్న సూక్ష్మదీక్షతో ఆకాశమార్గము ద్వారా ఈ లోకమునకు వచ్చితిని.
(కామము జయించిన జ్ఞానిగా, ఆకాశమార్గమున సూక్ష్మరూపములో ఈ లోకమునకు వచ్చితినని రచయిత చెప్పుచున్నారు.)

84. చిత్తములోను, చిత్తము గురించి వివరించు గ్రంథములు, మహాశ్రేష్టమైనవిగా చెప్పబడు వేదములు, శరీరము నుండి **వాక్కులు**, వాని నుండి ఉత్పన్నమగు **అర్థములు** దైవము, తన కృపతో నాకు ఇచ్చుట అనుగ్రహించిరి.

(శివుడు కృపతో వేదశాస్త్రములోని ముఖ్యపదములు, వాటి సూక్ష్మ అర్థములు రచయితకు అనుగ్రహించిరి.)

85. **దైవచింతన చేసి నేను పొందిన ఈ సుఖము (దివ్యానుభూతి) ఈ లోకమంతయు పొందుగాక!** ఆకాశతత్త్వములో ఇమిడియున్న జ్ఞానస్వరూపమగు శివుని తత్త్వము చెప్పుటలో, అది శరీరమునకు సంబంధించిన మంత్రమే అగును. ఆ ధ్యాసను (శివునిపై ధ్యాస) నిర్విరామముగా తనలో తలంచిన ఎడల శివుడు వచ్చి నీలో ఇమిడిపోవును.

(ఆకాశతత్త్వము నుండే అన్ని భూతములు జన్మించెనని చెప్పునది వేదోక్తి. ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి అప్పు (నీరు), నీరు నుండి పృధివి (భూమి), పృధివి నుండి చెట్లుచేమలు, చెట్లు చేమల నుండి అన్నము, అన్నము నుండి పురుషుడు, జీవులు (ద్విపదే, చతుష్పదే). మానవ శరీరవే పంచభూతాత్మకమైనది. పంచభూతములతో ఏర్పడినది, పంచీకృతములను గలిగియున్నది. దీనినే రచయిత వేదార్థము (గూఢము) శరీరమునకు సంబంధించినదే అని చెప్పిరి. వేదార్థమును లోకులందురు చిత్తమునందు ఉంచుకొని, తీవ్రధ్యాసతో తనవలె ఉన్నతి పొంది శివసాయుజ్యము పొందవలెనని కోరిరి.)

86. జనన, మరణములు లేని ఆ మహామహుడు **నందీశ్వరుడు** (శివుడు) అను నామము గలవాడు. శ్రేష్టులైన దేవలోకవాసులు వెళ్ళి, చేతులు జోడించి, నమస్కరించి, హృదయమున విరామము లేక మంత్రములను భక్తితో జపించు చుందురు.

87. శరీరమును అనుగ్రహించిన దైవము, ఆ శరీరములో అగ్నిని హద్దుమీరకుండా ఉంచి నియంత్రించెను. భూలోకము మొదలు ఏడు లోకములందును నాశనము కల్పించని అగ్నిని ఉంచెను. సంశయమునకు తావులేని విధముగా తమిళ ఆగమమైన **తిరుమంత్రము**ను ఉంచెను. అన్ని వేదార్థములు ఈ గ్రంథమున ఉండునట్లు పొందుపరచెను.

(అంతరాగ్నియైన జఠరాగ్ని – శరీరమును నియంత్రించుట కొరకు, బాహ్య అగ్నియైన బడబాగ్ని – సముద్రము, జగత్తును నియంత్రించుట కొరకు, జ్ఞానాగ్ని – శివుని దరిచేరుటకు. వీటిని దైవము కల్పించెను.)

88. దైవము యొక్క దివ్యశిరస్సును, దివ్యపాదములను చూడగోరి బ్రహ్మ, నారాయణుడు బయుదేరి, చూడశక్యముగాగ, తిరిగివచ్చి దివ్యపాదములను చూడశక్యము కాలేదని నారాయణుడు పలుకగా, దివ్య శిరస్సును జూచితినని బ్రహ్మ అబద్ధమాడెను.

(శివుని శిరస్సు, పాదములు చూడజాలక నారాయణుడు బ్రహ్మయు వెనుదిరిగిరి.)

89. వృషభమును, జింకను తనకు తోడుగా ఉంచుకొన్న దైవము, అశాశ్వతమైన, మిథ్యయైన ఈ చరాచర జగత్తు విచ్ఛిన్నము కాగలదని ఎరిగి నా నాథుడైన నందీశ్వరుడు తన దివ్యపాదములను నా శిరస్సుపై నుంచి అనుగ్రహించెను.

(శాశ్వతము కాని ఈ ప్రపంచము యొక్క నాశనమును ఎరిగి శివుడు తనను (రచయితను) ఆదుకొనెను.)

90. జ్ఞేయం - తెలుసుకొనే వస్తువు, జ్ఞానము - తెలుసుకొనుట, జ్ఞాత/జ్ఞాని - తెలుసుకొనువాడు అన్నియు మాయ యొక్క వివరములే. మహామాయయైన (శుద్ధమాయ) యందు పరం, ఆది, ఇచ్ఛ, జ్ఞానము, క్రియలగు శక్తి సమూహముగా వెలుగొందిన శివుని ఆకారస్వరూప ప్రభావమును ఈ గ్రంథములో వివరించియున్నాను.

(మహామాయ (శుద్ధమాయ) శక్తి స్వరూపములన్నియు అవ్యక్తములుగా నున్నను అవి శివస్వరూపములేనని (రచయిత) వివరించియున్నారు.)

91. అవ్యక్తముగానున్న విత్తనము యొక్క స్థితి, అది బ్రహ్మం అనే పూర్ణజ్ఞానముతో నిండిన ఆత్మతత్త్వమే అగును. అటువంటి స్థితి గలిగిన ఆ నందీశ్వరుడు (శివుడు) పూర్ణముతో నిశ్చలమైన ఆనందస్థితిలో నాట్యమాడువాని ఆనతిపై (ఆజ్ఞపై) కైలాసం నుండి ఈ ప్రదేశమునకు వచ్చితిని.

(శివుని ఆజ్ఞపై తాను (రచయిత) కైలాసం నుండి దక్షిణ భారతమున నున్న తమిళ దేశమునకు వచ్చితినని చెప్పుట.)

92. శివనాథుని (శివుని) అనుగ్రహముచే మూలాధార చక్రమున నున్న రుద్రుని పొంది, పిదప గురుకృపతో సదాశివమూర్తిని పొందితిని. శివగురు అనుగ్రహంతో సత్యజ్ఞానమును (ఆత్మతత్త్వము) పొందితిని. శివగురు అనుగ్రహముతో నేను అనుగ్రహవంతుడై నిలకడ పొందితిని.

(మూలాధార చక్రములో నున్న దేవత అనుగ్రహముతో షట్చక్రములు దాటి శిరస్సున నున్న సదాశివమూర్తిని పొంది సత్యజ్ఞానం పొందితినని చెప్పిరి.)

93. ఋగ్వేదము లెక్కలేనన్ని మంత్రముల సమాహారము. అవియన్నియూ సూక్ష్మమైన ప్రణవములో (ఓంకారము) ఇమిడిపోవును. సూక్ష్మమైన ప్రణవ నాదము (శబ్దము) శిరస్సున సూర్యచంద్రాదులు తమయొక్క ప్రకాశమును ఆత్మజ్యోతిలో ప్రకటించుటచే, ఆ స్థితియందు బంగారు వర్ణమువలె వాటి కిరణములు ప్రకాశించుచుండును.

(శిరస్సున వెలయు సహస్రదళమున ప్రణవ శబ్దమును దాటి, నాదాంతముగా

వెలుగు సూర్యచంద్రుల ప్రకాశకిరణములు ఆత్మజ్యోతిగా (జ్యోతిషాం జ్యోతిః) ప్రకాశించుచుండును.)

94. నందీశ్వరుని సదా సర్వకాలము నా మదియందు నిలిపి స్తుతించుచున్నాను. రాత్రి పగలనక నా హృదయమునందు నిలిపి ధ్యానించితిని. స్వయంప్రకాశకుడు, నా నాయకుడైన వాని అనుగ్రహము కొరకు తపించు చుంటిని. వాడు స్వతహాగా ప్రకాశరూపుడే!! (అని పరవశించి పెక్కు విధములుగా చెప్పిరి).
(రచయిత పరవశించి ప్రకాశస్వరూపుడైన నందీశ్వరుని (శివుడు) కొలిచి, పలు విధములుగా తన సఖ్యతను చాటుకొనిరి.)

## 6. నమ్రత

**(శివుని గొప్పతనమునూ, తన అల్పత్వంను వినయముగా చెప్పుట)**

95. నా శివమహామహుని గొప్పతనమును పూర్తిగా ఎరిగినవారెవరు? వాని పొడవు వెడల్పులు కొలుచువారెవ్వరు? తనకొక నామము, రూపము లేక జ్యోతిగా నున్నవానిని, వాని మూలము వేరు (చెట్టుకు తల్లివేరు) ఎటు వెళుతున్నదో తెలియక నేను వాని గురించి చెప్పుటకు ప్రయత్నించుచున్నాను.
(శివుని యొక్క ఆకారము ఆదిమధ్యాంతములు తెలియక, వాని గొప్పతనము తెలియక, చెప్పుటకు తను (రచయిత) ప్రయత్నించుచున్నానని వినయముగా వాపోవుచున్నారు.)

96. శివుని స్తోత్రించువారి దారిలో వెళ్ళి స్తోత్రించలేదు. భక్తి పరవశముతో నిండి నాట్యమాడువారు రీతిలో నేను నాట్యమాడనైతిని. పొందగోరువారు అనుసరించు విధానమును నేను అనుసరించనైతిని. జ్ఞానముతో తత్త్వవిచారణ చేయువారి విధముగా వెళ్ళి నేను పరిశీలించనైతిని.
(శివుని నానావిధ తత్త్వములను గ్రహించని నేను (రచయిత) ఎట్లు ముక్తి పొందగలను? వాపోవుచున్నారు.)

97. వేదశాస్త్రములోని నాదరూపమున నున్న పరబ్రహ్మను స్తోత్రించువారి స్వరములో నున్న శబ్దస్వరూపియైన ఈశ్వరుని (ఓంకారము), సూక్ష్మప్రపంచము నుండి స్థూలప్రపంచమును సృష్టించిన చతుర్ముఖ బ్రహ్మ కొలుచు ఆ మహామహుని (శివుడుని) మనము గ్రహించగలమా? (గ్రహించలేము).
(ఆ పరబ్రహ్మను మనము గ్రహించగలమా? గ్రహించలేము – అని రచయిత తన వినయమును ప్రదర్శించుచున్నారు.)

98. దివ్య కైలాసము యొక్క దిగువభాగమునకు వచ్చి శివమహామహుడు గురువుగా రూపము దాల్చి, తత్త్వజ్ఞానమును బోధించెను. ముక్తిని కోరి తపస్సు చేసిన

మునులకు, ఋషులకు బోధించెను. ఈ తత్త్వజ్ఞానమును అన్యభావనతో స్తుతించువారు ఈ జ్ఞానమును గ్రహించజాలరు.
(అహంకార మమకారములు లేనివారు, దైవముయెడ అన్యభావన లేనివారు ఈ తత్త్వజ్ఞానమును పొందగల అర్హులని నొక్కి వక్కాణించుట.)

## 7. తిరుమంత్రము యొక్క మహాత్వము

99. **మూలన్** అనే నేను చెప్పిన ఈ మూడువేల మంత్రములు (పద్యరూపమైన మంత్రములు) లోకులు ఎరిగి ఉన్నతి పొందవలెనను సదుద్దేశముతో నందీశ్వరుని అనుగ్రహముతో చెప్పబడినవి. ఈ మంత్రములను దినము ప్రాతఃకాలమున లేచి అర్థమెరిగి పఠించిన యెడల మహామహుడైన శివుని అనుగ్రహము పొందగలరు.
(మూలన్=శ్రీ తిరుమూలర్ నాయనార్ (రచయిత) సంగ్రహ జీవితగాథ చదువగలరు. తను రచించిన మూడువేల పద్యములను మూడువేల మంత్ర రత్నములనియు, ప్రతి ఉదయమున అర్థమెరిగి చదివిన యెడల శివుని అనుగ్రహము పొందుట తథ్యమని చెప్పియున్నారు.)

100. తిరుమంత్రములోని మొత్తము అధ్యాయములు తొమ్మిది. తొమ్మిది తంత్రములని పిలువబడినది. ఈ మూడువేల పద్యములు ఆఖరిది ముక్తికి సంబంధించి చెప్పునది. బుద్ధిపూర్వకముగా చెప్పిన ఈ మూడువేల మంత్రములు పాఠకులకు గొప్ప మహత్తును ఇచ్చునది.
(మొత్తము తొమ్మిది తంత్రములో మొదటి ఐదు తంత్రములు పూర్వపక్షములనియు, కడపటి నాలుగు తంత్రములు ఉత్తరపక్షం శ్రేష్టములని చెప్పబడినది. ఈ రెండు విభాగములును పఠించువారికి ఇహము, పరము శుభములు కలుగును.)

## 8. గురుపరంపర

101. కైలాసమునుండి పరంపరగా వచ్చిన ఏడు మఠములు శైవశుద్ధ సన్మార్గమును బోధించునవే. వీటికి ముందే అవతరించిన తిరుమూలర్, అనంతరము వచ్చిన మఠాచార్యుల వరకు తొమ్మిది తంత్రములలో చెప్పబడిన మూడువేల మంత్రముల సారమును అనుసరించునట్లు శ్రేష్టములైన ఆగమములను తమిళములో వివరించియున్నారు.
(ప్రాచీన మఠములకు నాయకులైన తిరుమూలర్ ఆగమశాస్త్రములను సంస్కృతము నుండి తమిళమునకు అనువదించిరి.)

102. కాళాంకర్, గోరకర్, భువనదేవర్, నాథాంతకర్, పరమానందర్, భోగదేవర్,

తిరుమూలర్ ఈ ఏడుగురు ఏడు మఠాధిపతులైరి. వీరందరు శైవ సిద్ధాంతమును బోధించిరి. వీరేడుగురు జన్మరహితులు, సంపూర్ణ సిద్ధులు, జ్ఞానులు.

## 9. త్రిమూర్తుల తత్త్వము

103. హద్దులు లేని యవ్వనం, అందమైన రూపము, హద్దులు లేని ముగింపుయు (మంచి ఫలితములతో), మంచి ఫలితమునిచ్చు తగిన కాలము (సమయానుకూలము) ఈ నాల్గింటిని ఇచ్చి జీవాత్మలకు సుఖమును ఇచ్చునది శివుడే అగును. తన దాసులు నొందు ఈ గొప్పతనమును బ్రహ్మగాని, నారాయణుడు గాని ఇవ్వగలరా?
(శివుడు నొసంగు సుఖములను బ్రహ్మగాని, నారాయణుడు గాని ఇవ్వలేరు. అందులకే శివునికి **మంగళకరుడ**ని నామము. అందులకే శివుని **మనవాడే** నని శ్రీమాణిక్యవాచగర్ కొనియాడియున్నారు.)

104. మూలకారకుడైన – రుద్రుడు, మణిపూర్వక స్థానములో – నీలరత్నము వలె రంగు గలిగిన నారాయణుడు, సృష్టికి కారణభూతుడైన బ్రహ్మ – స్వాధిష్టాన చక్రములలో ఉండి జరిపించు కార్యక్రమములన్నిటిని పరిశీలించినచో, ఇవి అన్నియు ఒక క్రమానుసారముగా ఒకరినొకరు అనుసరించి జగత్తు కొరకు చేయునదే అగును కాని లోకులు వీరిని వేరు వేరని తలంచి మాట్లాడుకొనుట వారి అజ్ఞానమును తెలుపునదే అగును.

105. ద్వికర్మ ఫలితముగా (పాపము, పుణ్యం) దేహము అనుగ్రహించిన శివుడు సృష్టి, స్థితి, లయ కారకులుగా ఉన్న త్రిమూర్తులను దాటి అవతలనున్నవాడు. త్రిమూర్తులను సృష్టించిను మూలకారకుడైన శివుడే లోకమునకు మహోమహుడగును. నీచులు దైవమును అదని, ఇదని పిచ్చిగా తలంతురు. నిష్కళంకులు, పరిశుద్ధులు ఆదిమూలమైన శివునినే పరబ్రహ్మమని గ్రహించిరి. (త్రిమూర్తులకు అతీతముగా శివుడే ఆది అంతములేని వాడుగా, శివుడే అనాదిగా ఉన్న పరబ్రహ్మము.)

106. శివుడు ఆదిమూలముగా, త్రిమూర్తులుగా, పంచమూర్తులుగా, బంగారపు దివ్యకైలాస సభలో అమరియున్నాడు. ఆ సభ షట్చక్రములలో (వెన్నెముకలోని ఆరు ఆధారములు) కలసి రెండు పద్మములు ఊర్ధ్వముగాను, రెండు పద్మములు అధోముఖంగాను ఉన్నవాటితో కలిసి పదియగును. అందులో నాద, బిందు (శుక్ర, శ్రోణితములు)గా ఉండి ఆ దివ్యసభకు నాయకుడుగా ఉన్నవానిని **శంకరుడు** అని పిలువబడెను.

(శివుడు తన ఉనికిని అన్నింటా ఉంచి, తనను మూల ప్రకృతిగాను, సృష్టిగాను ఉన్నాడని ప్రకటించుకొనెను. లౌకికముగా ఉన్నప్పుడు అధోముఖముగాను, పరములో నున్నప్పుడు ఊర్ధ్వముఖముగా, సహస్రదళము మారును.)

107. జీవులు పొందగోరు ఉన్నతిని ఎరిగి తగిన సద్భావనతో నున్న బ్రహ్మయు, నారాయణుడును శివునికి అన్యులు కారు. వారు త్రినేత్రముతోనున్న శివుని మార్గముననే అనుసరించి త్రికర్మలను (సృష్టి, స్థితి, లయము) చేయువారే. వారు నందీశ్వరునికి (శివునికి) చుట్టములు కావున ఆ దేవతల ద్వారా కూడా ఉన్నతి పొందవచ్చును.

(బ్రహ్మయు, నారాయణుడును శివుని చుట్టములు కావున శివుని అనుసరించి వారు త్రికర్మలు చేయుటచే, లోకులు వారిని కూడా కొలువవచ్చును.)

108. మరణములేని ఈ తత్త్వము నెఱిగిన దేవతలతో నిండిన శివుని దివ్యసభ యందు, పాలవంటి శ్వేతవర్ణము గలిగిన ఆ మహాదేవుడిని నమస్కరించుటచే నీవు నారాయణునికి ముందుగా సృష్టి చేయు బ్రహ్మకు సమానవైనవాడవు. కావున నీవు భూలోకములో తత్త్వజ్ఞానమును బోధించి అనుగ్రహించుము అని నన్ను ఆశీర్వదించెను.

(శివుడే తనను (రచయితను) భూలోకవాసులకు తత్త్వజ్ఞానము బోధించమని ఆశీర్వదించెను.)

109. దేవతలని, మానవులని తారతమ్యము గల వీరు, తేనామృతము వెదజల్లు పుష్పము వలె శివుని అనుగ్రహము తప్ప వేరొక దైవము లేదని గ్రహించిరి. త్రిమూర్తులన్ననూ, పంచమూర్తులన్ననూ, అన్నింటా, అందరిలోనూ నెలకొని యున్నది శివుడొక్కడే అని గ్రహించవలెను.

(ఊర్ధ్వలోకస్తులు, భూలోకస్తులు గాని అందరి శరీరములో నెలకొనియున్నది శివమహాదేవుడని (పరమేశాం అని) గ్రహించవలెను.)

110. దివ్యప్రకాశమును వెదజల్లు **జ్యోతిషాం జ్యోతి**గా ఉండు శివుడు బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు అని త్రిమూర్తులుగాను; బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు సదాశివుడని పంచమూర్తులుగాను ఉండి, **ఏకం** అయినవానిని మూఢులు వేరువేరని తలంచి తమ అజ్ఞానములు వెలిబుచ్చుచున్నారే!!

(బ్రహ్మే=చతుర్ముఖ బ్రహ్మే; బ్రహ్మ=బ్రహ్మం, పరమాత్మ, పరమశివుడు)

111. ఉన్నతస్థితిలో మహోన్నతుడు శివునిగా, అన్నింటా బాహ్యముగా, అంతరముగా, సంకల్పించుటలో నారాయణునిగా (స్థితి), సృష్టించుటలో బ్రహ్మగా ఒక్కడే వారివారి అర్హతలు తగ్గట్లు వేర్వేరు దేవతలుగా, తనను (శివుడు) బహిర్గతము కానీయక

గూఢముగా నుండి రుద్రునిగా సంహార క్రియ (లయము) చేయుచున్నాడు.

112. శివుని పరం అంశమైన సదాశివునిగా, ఆకాశతత్త్వములో ఇమిడి, అన్ని తత్త్వములను పనిచేయించిననూ, తాను అసంగుడుగాను ఉన్నాడు. వాడే శరీరములో ప్రాణరూపముగా, చైతన్యముగా, చలనముగా (స్పందనరూపము) ఉన్నాడు.
(శివుని అంశమైన సదాశివుడే అన్ని జీవరాశులలో ఇమిడి ప్రాణ, చైతన్య, ఉపకారిగా ఉన్నాడని గ్రహించవలెను.)

ఇంతటితో తిరుమంత్రములోని ఉపోద్ఘాతము ముగిసినది.
మొత్తము తొమ్మిది తంత్రములు గలవు.
ఇక మొదటి తంత్రములోనికి వెళదాం!!

# మొదటి తంత్రము

## 1. ఉపదేశము

113. పరమాత్మ తన ఊర్ధ్వలోకము వీడి క్రిందికి దిగివచ్చి, జీవాత్మలు వారి కర్మ ఫలముల తగ్గట్లు పొందిన శరీరంపై, తన శీతల పాదపద్మములను జీవాత్మల రక్షణార్థం యెరిగి వారిపై ఉంచి, వారి హృదయములో ప్రవేశించి, ద్రవింపజేసి, సత్యజ్ఞానమును బోధపరచి హద్దులులేని పరమానందమును చవిచూపి, వారియందున్న **ముమ్మలము**ల బంధమును (అహంకారము, ప్రారబ్ధము, కర్మఫలితము, మాయ) త్రెంచి అనుగ్రహించెను.
(ప్రారబ్ధమునకు తగ్గట్లు జీవాత్మలకు స్థూలదేహము ఇచ్చిన దైవం వారిలో ప్రవేశించి, వారిని ద్రవించజేసి, ఆత్మతత్త్వమును బోధపరచి, భవబంధములు త్రెంచి శాశ్వతానందమునకు దారి చూపును.)

114. త్రినేత్రుడైన ఆ శివుడు అహంకారము మొదలగు భవబంధములను త్రెంచి అనుగ్రహించుటయే కాక తన అనుగ్రహ వీక్షణశక్తిని ప్రతిష్ఠించి, సత్యతత్త్వం బోధపడునట్లు అనుగ్రహించెను. మరలా బంధముల గాఢాంధకారము వచ్చి చేరకుండునట్లు తన ప్రకాశమును చొప్పించి, తన ఎర్రనైన పగడము వంటి జ్యోతి ప్రకాశమును ప్రసరింపజేసి అనుగ్రహించెను.)

115. పతి-శివుడని, పశు-జీవుడని, పాశము-బంధము అని చెప్పబడు ఈ మూడింటిలో, శివునివలె జీవుడు, బంధము కూడా అనాదియైనను ఇవి రెండు శివునిలో చేరజాలవు. కాని శివుడు జీవుని యెడ కృపతో ఇముడటచే జీవుని యొక్క జీవత్వము, బంధత్వము వీగిపోవును.

(అఖండ స్వరూపియైన శివుడు (సదాశివమూర్తి) జీవుని అనుగ్రహించి ప్రవేశించినచో, జీవుని తత్త్వముతో జీవబంధత్వము కూడా నివృత్తియగును.)

116. వెదురుచెట్లు తమకు తామే ఉత్పత్తి చేయు అగ్నివలె (రాపిడి వలన) ఈ శరీరమను దేవాలయములో నెలకొనియున్న నందీశ్వరుడు (శివుడు) తల్లి, తన బిడ్డ యొక్క మలములను పరిశుభ్రము చేయునట్లు, సముద్రము నుండి ఉదయించు సూర్యుని వలె జీవుని ముమ్మలములను తాను (శివుడు) దయతో శుభ్రపరుచును.

(ఒకదానితో ఒకటి రాపిడి చేత వెదురుచెట్లు కాలిపోవునట్లు శివుడు పరిపక్వము నొందినవారిలో తానే నెలకొనియుండి, జీవుల యొక్క ముమ్మలములను కాల్చి నివృత్తి చేయును. అష్టాంగయోగం చేయుటవలన శరీరములో ఏర్పడు యోగాగ్నిని ఇట్లు చెప్పబడినది.)

117. జీవుడు, జీవిలో నిగూఢముగా యుండును. బంధము దూదివలె, జీవుడు చికుముకి రాయి పోలినది. ఇవి రెండును తనకు తానే కాల్చబడవు. కాని సూర్యరశ్మి సోకినచో చికుముకి రాయి చుట్టూయున్న దూదిని కాల్చివేయును. అట్లే జీవునికి ఆచార్యుని (సద్గురువు) వలనే జ్ఞానము పొంది మలములన్నియు కాల్చబడి (నివర్తించి) బంధముల నుండి నివృత్తి అగును.

(గురుకృపతో, గురోపదేశముతో జీవుని బంధములు తొలుగును.)

118. ఐదు మండములలో నెలకొనియున్న సదాశివుడు మొదలగు ఐదుగురును, ఐదు మలములును నివర్తియగునట్లు చేసి, చిదాకాశములో నెలకొనియున్న నందీశ్వరుడు బాహ్యముగా వెళ్ళదగు మనస్సుచే ఏర్పడిన ఇంద్రియ విషయ వాసనలను త్రెంచి అనుగ్రహించెను. శరీరములలో ప్రాణముతో నెలకొని యున్న ఆ మహామహుడు (శివుడు) అంతర విషయవాసనలన్నిటిని పోగొట్టును. (ఐదు మలములు: అహంకారము, కామ్యకర్మ, మాయ, మామేయం, తిరోదాయి).

(పరిపక్వము పొందిన జీవులయెడ (శివయోగులు) తానే (శివుడు) పంచముఖ భేదమూర్తులుగా ఉండి, వారి అంతఃకరణములో నెలకొనియున్న విషయ వాసనలను పోగొట్టి అనుగ్రహించును. పంచముఖ సదాశివులు: శివ, అమూర్త, మూర్త, కర్తృ, కర్మసదాఖ్యములు.)

119. జీవునకు జ్ఞానము ఐదు ఇంద్రియములతో ఏర్పడినది కావున అది దారి తెలియక వరదలో కొట్టుకుపోతునట్లుండును. అంతరమున గల స్వల్ప జ్ఞానము మహాజ్ఞానములో చేరి లయమొందుటకు, గురువైనటువంటి వారి తేటనైన జ్ఞానముచే సరైన మార్గములో తీసుకువెళ్ళగలదు.

(పంచజ్ఞానేంద్రియముల ప్రజ్ఞలైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధముల విషయ

వాసనల ప్రవాహములో కొట్టుకుపోతున్న జీవుని సద్గురువు ఉపదేశము వలన తేటనైన జ్ఞానముతో సరైన గమ్యమునకు చేర్చగలదు.)

120. ఆవుపాల నుండి నీటని విడదీసి పాలను మాత్రము త్రాగు హంస వలె, చిదాకాశమునందు మహాప్రకాశములో నాట్యమాడు శివుని మహానాట్యము జీవుల నుండి ప్రారబ్ధమును (కర్మ ఫలితములను) విడదీయగలదు. కావున కీడుతో కూడిన కర్మ ఫలితముల పాపపుణ్యములు ఏడుజన్మలలో వెదజల్లిననూ, కాల్చిన విత్తనము ఎట్లు మొలకెత్తదో, అట్లే ఫలితము లేకపోవును.
(శివుని మహానాట్యము జీవుని ప్రారబ్ధమును, దాని ఫలితములైన పాప, పుణ్యములను జీవుని నుండి విడదీసి నశింపజేయును.)

121. జన్మకు కారణభూతమైన కర్మవాసనలను నశింపజేసి ఉన్నతిని గలుగజేసి, జాగ్రదావస్థలోనే నిర్మలమైన తురీయమును పొంది బంధములను నివృత్తి జేసి అణగిన ఇంద్రియములు, ప్రాణశక్తి ఒక్కటై, ఇంద్రియ విషయవాసనలను నిరోధించి శివయోగులు నిష్క్రియలోను ఉందురు.
(శివయోగులు ఉన్నతి కారణము వారు స్థూలముగా జాగ్రదావాస్థలోనుండి తురీయమునకు లేచుటచే ప్రపంచవాసనలు లేనివారై నిష్క్రియాభావనతో (అకర్తగా) ఉందురు.)

122. శివయోగమనునది సత్ (జ్ఞానము) అసత్ (అజ్ఞానం) వివేకముతో, తపో యోగముతో గ్రహించి, అక్కడ కనిపించు మహాప్రకాశములోనికి ప్రవేశించి, అక్కడే నిలుచుండి, మరోమార్గము (యోగము) వెతకక, అవలంబించక, ఉన్నతి పొందదగు శివరాజయోగ్యమును నందీశ్వరుడు (శివుడు) కరుణతో మనకి అనుగ్రహించెను.
(తపోయోగము అనునది ఇచ్చట శివరాజయోగముగా పేర్కొనబడినది. షట్చక్ర స్థానములోని జీవశక్తిని మూలాధారము నుండి పైకి ప్రాకించి, సహస్రదళమునకు చేరునట్లు చేయుట. భూమధ్యస్థానము నుండి శిరస్సుకు తీసుకువెళ్ళు రాజ/హఠయోగమును గురునాధునిగా (శివుడు) కరుణతో అనుగ్రహించెను. సత్=జ్ఞానము, శివుడు, పరబ్రహ్మ; అసత్=అజ్ఞానము, జగత్తు, అనాత్మ, మిధ్య.)

123. ప్రపంచమంతయు **శివమయం** అను తత్త్వమును మనమందరము గ్రహించునట్లు అనుగ్రహించెను. దేవతలు కూడ ఎరుగలేని ఆనంద ప్రపంచమును మనకు ఇచ్చి అనుగ్రహించెను. చిదాకాశ మహాప్రకాశములో నాట్యమాడు తన పాదపద్మములను మనపై దాల్చి అనుగ్రహించెను. బ్రహ్మానందభరితమైన అనుగ్రహ ప్రకాశమును మనకిచ్చి అనుగ్రహించెను.

(మహానంద ప్రకాశము ఇచ్చట విభజించలేని, బంగారు రంగులోనున్న శివ, శక్తి స్వరూప ఆనందస్థితి తెలుపునది.)

124. శివునిగా నొప్పారు చిదాకాశ మహాప్రకాశములో ఆకాశమయమైన ఆత్మ కలిసిపోవు విధము, శివుని ఇచ్ఛలో ఆత్మ ఇచ్ఛ కూడ కలిసిపోవు విధము, శివప్రకాశములో ఆత్మప్రకాశము కలిసిపోవు విధము, జ్ఞానపూర్వకరముగా నెరిగినవారు శివసిద్ధులే అగుదురు. (మరెవరు కారు.)

(ఆత్మ యొక్క ఇచ్ఛ, జ్ఞానము, క్రియలన్నియు చిదాకాశములోని శివుని ఇచ్ఛలో, జ్ఞానములో క్రియలో లీనమగునని శివసిద్ధులే ఎరుగుదురు. సాత్వికమై తుదకు ఆత్మయే శివం అగుట.)

125. శివలోకములో పొందదగిన మహానందమును శివసిద్ధులు ఇచ్చటనే (భూమిపై) సమాధిస్థితిలో (మహాతురీయం) పొందుదురు. నాదము, నాదాంతమును (నిశ్శబ్దము-ఆనందము) తమలోనే దర్శించుదురు. వారు అక్షరులుగాను (క్షీణత లేనివారు), నిష్కళంకులుగాను ఉండి, నిరామయులై బ్రహ్మానందమును అనుభవించుదురు. అటువంటి ఉన్నతస్థితిలోనున్న సిద్ధులకు ముక్తికి మూలమైనది ముప్పదిఆరు తత్త్వములగును.

(పంచభూతములు - 5 - ఆకాశము, వాయువు, అగ్ని, నీరు, పృధివి
జ్ఞానేంద్రియములు - 5 - చెవి, చర్మము, కన్ను, నాలుక, ముక్కు
కర్మేంద్రియములు - 5 - వాక్కు, చేతులు, కాళ్ళు, పాయు, ఉపస్థ
పంచప్రజ్ఞలు - 5 - శబ్ద, స్పర్శ, రూప, రస, గంధం
అంతఃకరణములు - 4 - మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారం.
ఈ 24 తత్త్వములు స్థూల, సూక్ష్మ శరీరములనబడును. వీటితో విద్యాతత్త్వములు - 7 - కాల, కళ, నియతి, రాగ, విద్య, మాయ, పురుషుడు
శివతత్త్వములు - 5 - పరతత్త్వములు ఐదు. శివం, శక్తి, శతాక్యం, మహేశ్వరం, శుద్ధవిద్యా.
కలసి మొత్తము 36 తత్త్వములనునది అంతకరణములగును.)

126. ఆగమములు చెప్పు ముప్పదియారు తత్త్వములే ముక్తికి నిచ్చెనవంటిది. ఎల్లలు లేని శివానంద ప్రకాశములోనికి వెళ్ళి, వాక్కునకు అతీతమైన, మహోన్నతమైన, అరుదైన శివత్వమును దర్శించి సత్యజ్ఞానమెరిగి, ఆతని సృజించిన శివసిద్ధులు శివునివలె నొప్పారిరి. (జీవాత్మయే శివతత్త్వముగా నెలకొనుట.)

127. శివసిద్ధులు శివానందమును పొంది అన్నింటా విడదీయలేని శివస్థితిలో నెలకొనియుండిరి. అన్నియూ శివసంకల్పములు, చేతనలేయని తలంచియుండిరి.

త్రికాల పరిస్థితులను ముందే (దీర్ఘదృష్టితో ఎరిగియుండిరి. వారు స్వంతంగా ఎటువంటి చర్య లేనివారై యుండిరి.

(శివానందతత్త్వం పొంది, శివదర్శనము చేసిన సిద్ధులు అకర్తగా సొంత సంకల్పములు లేక, అన్నింటా శివుని తత్త్వములనే దర్శించి, అన్ని కాల పరిస్థితులను ఎరిగియుండిరి.)

128. ఆత్మశుద్ధి పొందిన శివసిద్ధులు ప్రాకాయమునందు నెలకొనియుందురు. వారు ఆ స్థితిలో చేతనావస్థ లేకయుందురు. వారి స్పృహ నాదమునకు (ఓంకార నాదము) అంత్యమైన నాదాంతస్థితిలో (నిశ్శబ్దము-బ్రహ్మానందం) వ్యాపించియుండును. ఆ సిద్ధులు నాదమును గమనించుచు (ఓంకారము) యోగనిద్ర చేయుదురు.

(నాదాంతస్థితి అనునది - 36వ తత్త్వముయొక్క నాదము-శివతత్త్వములో కడపటిది-ఆకాశతత్త్వము-శబ్దమునకు విశేషణ-ఓంకారము నాదము దాటి అంత్యస్థితి నిశ్శబ్దము మహానందములో రమించుచుందురు.)

129. నాదాంతము అందుకొన్న సిద్ధులు శివలోకమునకు తమ యోగనిద్రలో చూచిన వారగుదురు. అట్లు యోగనిద్రలో నుండువారు తమలోనే శివునితో కూడియుందురు. వారే శివభోగమను మహానందమును తమలోనే పొంది యుందురు. వారి పరిస్థితిని అనుభవము లేనివారెట్లు గ్రహించగలరు? (వాక్కునకు అతీతమైన అనుభూతి.)

(శివసిద్ధులు తమలోనే శివుని చూచు భాగ్యమును పొందియుండిరి.)

130. జ్ఞానమునకు పరాకాష్టగా నున్న శివునియందెట్లు శరణు నొందుదురో, వారికి తగ్గట్లు తాను దిగివచ్చి, దరిచేరినవారిని అనుగ్రహించును. అనాదియైన శివుడు తనకేదియు సాటిలేని శివసభలో శక్తితో (ఉమాదేవి) చేరి నాట్యమాడుట, ఎర్రనైన ఆకాశము కన్నా ఎర్రనైన ప్రకాశమగు మాణిక్యమగును.

(శివుడు జీవాత్మల జ్ఞాన పరిపక్వము తగ్గట్లు వారిని అనుగ్రహించును.)

131. మాణిక్యము వంటి ఎర్రనైన ప్రకాశముతో మరకతము వంటి పచ్చటి ప్రకాశము, మాణిక్యములోనే పచ్చటి మండప పీఠముగాను, ఎటువంటి మలినము లేని మేలిమి బంగారపు పసుపుఛాయలో నాట్యమాటు ఆ మహామహుని (శివుని) చూచి, స్తుతించు ఎంతటి మహాభాగ్యమును పొందిరో ఈ శివసిద్ధులు!! (శివునికి-ఎర్రని రంగు; శక్తికి-పచ్చని రంగు)

132. మేలిమి బంగారపు ప్రకాశములో రమించు శివసిద్ధులు ప్రపంచమును వీడి వెళ్ళక లౌకికులకు సహాయపడు (లోక సంగ్రహ) తత్త్వమును గలిగియుండిరి.

ప్రపంచములోనే యుండి లౌకికులకు సహాయపడుతూ, బంధకత్వమును వీడియుండుటచే (అకర్త, అభోక్తగా) పునర్జన్మ లేనివారై యుండిరి. ఇటువంటి వారు ఆనంద నాట్యమాడువాని (శివుని) చరణ కమలములందే సదా నిమగ్నులై యుండిరి. ఆనంద తాండవమును తిలకించుచూ మౌనస్థితిని దాల్చియుండిరి. సామాన్యుల వలె కాక పూర్ణత్వం పొందియుండిరి.

133. మన శివమహామహుని వలె అండములను, అణువులోను నిండి, మహోన్నతమును, స్వల్పమును ఒకటితో ఒకటి చేర్చు తత్త్వమును ఎరిగిన వారెవరు? యోగసాధనతో (తాబేలు వలె) పంచేంద్రియముల బాహ్యావృత్తిని నిరోధించి, లోపలికి తీసుకొనుటను, మహత్తును, స్వల్పమును దోషరహితముగా శివసిద్ధులు ఎఱిగియుండిరి.

(కీడుగలుగునప్పుడు ఎట్లు తన అవయవములను తాబేలు ముడుచుకొనునో అట్లే, మనోఇంద్రియ నిగ్రహముతో ద్వంధములను దోషరహితము, పునర్జన్మ రహితం చేసుకొనుటను శివసిద్ధులు గ్రహించియుండిరి.)

134. తోడుపెట్టని కాచిన చిక్కటి పాలలో నెయ్యి కలిసియున్నట్లు, చంచల స్వభావ రహితం, నిర్మలమైన మనస్సుతో నివృత్తిమార్గమును అనుసరించి ఆచార్యుని (గురువు) యొక్క బోధనలన్నీ, ఆత్మజ్ఞానముగా తలంచి స్వీకరించిన వారికి, ఈ స్థూలశరీరము ఈ లోకములో విడిచిననూ, ఎల్లలులేని అఖండజ్యోతిలో కలిసి **సత్** అగుదురు.

(**సత్** శివమగుట - శాశ్వత పురుషుడగుట. శ్రోత్రియ బ్రహ్మ నిష్ఠయైన గురు ఉపదేశమే జీవాత్మకి జీవన్ముక్తిని కల్పించును.)

135. అజ్ఞానముతో కూడిన శబ్దాది ఇంద్రియతన్మాత్రలు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు) ఏర్పడినది అజ్ఞానముతో నిండిన అహంకారములో లయమగుటకే. కాని జ్ఞానపూర్వమైన ఆత్మ జ్ఞానమయమైన శివునిలో లయ మగుటకే తప్ప వేరే గమ్యం ఏదైన ఉన్నదా? పరమాకాశ ప్రకాశములో శివతత్త్వములో ఆత్మ తత్త్వము చేరును. కావున నన్ను నీ వస్తువుగా తలంచి అనుగ్రహ అప్పుతో (శుద్ధనీటితో) శుభ్రపరచి చేర్చుకొందువుగాక!! (అనుగ్రహపు జలము: మణిపూర్వక స్థానము-నాభి-విష్ణువు-స్థితి-కామ్యకర్మలు)

(అనుగ్రహపు జలముతో శుద్ధిచేసి నన్ను శివునిలో చేర్చుకోవలెనని కోరుకొనుట. గురోపదేశముతో కామ్యకర్మలు వీడి యోగసాధనతో సహస్రదళము చేరుకొనుట.)

136. సముద్రపు నీటిలోని ఉప్పు తత్త్వము ఆదిత్యుని (సూర్యుని) ఉష్ణము వలన ఉప్పు అను పేరుపొంది ఘనపదార్థరూపముగా మారినను, దాని రూపమును మరల

నీటిలో వేసినచో నీటిలో కరిగి తన ఘనత్వము కోల్పోయినట్లు అన్ని జీవాత్మలు (పరం) శివునిలో లయమవవలసినవే!! జీవుని గమ్యం శివం.

(ఈ మంత్రము నిగూఢముగా చెప్పబడినది. కనబడని తత్త్వమును ఉష్ణముతో (కుండలినీ సాధనతో) కనపడుశక్తిగా మార్చి షట్చక్రములలో శిరస్సున సహస్ర దళపద్మములో ఐక్యమగుట. జీవుడు శివుని తత్త్వములో లయమై జీవన్ముక్తికి సుగమనమగుట.

రెండవ పరిభాష: కనపడని తత్త్వము కనపడే వస్తువుగా మారినను, అది వ్యవహారికకు సాకారము చెంది, సాధనతో పరమార్థికతను పొందవలెననుట. సూర్యుని ఉష్ణము వలన మారిన మేఘపునీటిలో ఉప్పు ఉండదు. ఉప్పు లౌకికముగా జగత్తులో ఉండునట్లు, జీవుడు సరైన సాధనతోనే శివఐక్య గమ్యము పొందవలెను. అఖండ శివవ్యాపకములో జీవుని గుణములన్నీ వీగిపోవును.)

137. అన్నింటిని తనలో ఇముడ్చుకొను ఈశుడు పరిమితములేని మహావ్యాపకము లోను, జీవుని పరిమితములైన అండకోశములోను ఇమిడియున్నాడు. ఇట్లు బ్రహ్మాండములో జీవుని అండకోశములోను వెళ్ళి ఇమడనిచోటు వేరేదైనా ఉన్నదా? (లేదు.) శరీరము పొందిన జీవులన్నీ తాము చేరవలసిన చోటు ఏదన్నచో అధిష్టానమైన (అన్నిటికి ఆధారమైన) శివుని దివ్యచరణ పద్మములే అగును. (దేనినుండి వేరై వచ్చినదో మరలా దానిలోనే ఐక్యమగుట. సాధనతో పరిపక్వమొందిన జీవుడు – ముక్తికి చేరవలసిన గమ్యం శివుని దివ్యపాద పద్మములే తప్ప మరేదియు కాదు.)

138. పరిశీలించి చూచినచో ప్రకాశదర్శనమే శుద్ధ శివమగును. సాధకుడు దర్శించిన మహాప్రకాశమే శివలోకము. ఆ మండలమంతయు నిండిన ప్రకాశమే శివుని తత్త్వముతో నిండిన స్థలము. జ్ఞానులు చెప్పు తత్త్వము కూడా ఆ ప్రకాశమే – శివుని పొందగల తత్త్వమగును. అంతరదృష్టి గల సాధకులకు ప్రకాశమే గమ్యస్థానమగును.

139. జ్ఞానపూర్వకమైన కర్మ ఏదనగా గురురూపము చూచి నమస్కరించుట. జ్ఞానమనునది గురువు యొక్క దివ్యనామమును స్మరించుట. జ్ఞానపూర్వకమైన గురువు దివ్యబోధనలను శ్రద్ధగా వినుట. గురువు రూపమును సదా చిత్తమున నిలుపుకొనియుంచుట వలన తేటనైన జ్ఞానము పొందనగును.

(గురువుకు నమస్కరించుట, దివ్యనామమ ఉపదేశములను శ్రద్ధగా వినుట, సదా స్మరించుట, ఎల్లవేళలా గురువుని మనస్సున నిలిపి, అదే ధ్యాసలో నుండుట. జ్ఞాన గురునాధుని బోధనల వలన జీవునికి దేహము వేరు, జీవాత్మ వేరన్న

జ్ఞానమేర్పడి (జీవన్ముక్తికి) ముముక్షత్వమునకు దారి సుముఖమగును.)

140. జీవాత్మ తన తత్త్వములను వీడి శివుని దరిచేరుటచే, పంచప్రజ్ఞలైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు మనస్సును వీడి ఆత్మవశమగును. పంచేంద్రియములన్నిటి (చర్మము, నోరు, కన్ను, ముక్కు, చెవి) విషయ వాసనలు వీగిపోవును. ఆ పంచప్రజ్ఞలే ఆత్మతో కలిసి తుచ్ఛ ఇహభోగములను వీడి, శ్రేష్టపర భోగమును ఇష్టపడును.
(ఆత్మ శివుని దరిచేరుటచే శరీరపు ప్రజ్ఞలన్నియు చేష్టలుడిగి శివునిలో లయమగును.)

141. నిరంతరము శివుని దివ్యచరణములందు చేరియుండుట, సదా చింతనలో శివుని దివ్యశరీరము, సదా నాలుకపై వాని నామమును స్తోత్రించి, నమస్కరించుట, నా చిత్తములో నిలుచున్నది ఆ శివుని దివ్య అనుగ్రహజ్ఞానమే అగును.
(ఎల్లవేళలా విరామములేని శివునియందు ధ్యాస, అతని సామీప్యము, చింతన, మైమరచిన స్థితివలననే ఆతని (శివుని) దివ్యపాద అనుగ్రహము పొందనగును.)

142. ఉన్నతమైన జ్ఞానమును నొసగునది ధర్మాత్ముడైన శివమహోమహుడే. జ్ఞానమును చిత్తమున నిలుపుకొన్న పుణ్యపురుషులు, నాదమే రూపమైన వానియొక్క నాట్యము కళ్ళార తనివితీర చూచి, నాదసామీప్యము పొంది ఆకాశమండలములో వెలుగొందిరి.
(నందీశ్వరుని (శివుని) సదా చింతన చేయుటచే జ్ఞానమునొంది, శివుని నాట్యము తిలకించినవారై, ఆకాశమండల ప్రకాశములో నాదములో కలిసి నొప్పారుచుందురు.)

## ఉపదేశము: సారాంశము

ఉపదేశ అధ్యాయములో చెప్పబడినదంతయూ రచయిత శ్రీ తిరుమూలర్ యొక్క స్వీయ అనుభవములే అగును. శివుని ద్వారా తాను ఉపదేశము పొంది, తాను అనుభవించిన పరమానంద అనుభూతులు లోకులందరూ పొందవలెనన్న సదుద్దేశముతో **నేను పొందిన ఈ పరమానందము పొందనీ ఈ జగత్తంతయూ** అని చెప్పిరి.

1. గురువు శిష్యులకు చెప్పునదే ఉపదేశము. గురువు తాను గ్రహించిన జ్ఞాన దర్శనములను దరిచేరిన, శరణునొందిన, సద్ధర్మపరులకు నిత్యానిత్యవస్తు వివేకము, ఆత్మానాత్మ వివేకము బోధపరచి, అంతరనేత్రము తెరిపించి జ్ఞానమును తేటతెల్లము చేయును. సద్గురువే జ్ఞానదీపిక. శ్రోత్రియ బ్రహ్మ నిష్టయైన గురువే ఆత్మజ్ఞానప్రాప్తికి మార్గదర్శకుడు.

2. దైవము ఆత్మపరిపక్వతకు తగినట్లు (సంచిత, ప్రారబ్ధ, ఆగామికర్మల ఫలితములు) శరీరమునిచ్చి, జ్ఞాన ప్రతిష్టించి, భవబంధములను త్రెంచును.
3. జీవ–జగత్తు–ఈశ్వరుడు తత్త్వములో పరిపక్వమొందిన జీవులు కర్మ, ఉపాసనతో గురోపదేశముతో, జ్ఞానయోగ్యత పొంది శివంలో చేరుకొందురు.
4. శివజ్ఞానము జీవులను ప్రవృత్తి మార్గమునుండి నివృత్తిమార్గమునకు దారి చూపును.
5. జంతు–మనిషి నుండి, మనిషి–మనిషిగా ఎదిగి, మనిషి–మనీషీ ఎదుగుటయే సరైన ఉన్నతి.
6. సద్గురువు కృపయే జీవుని బంధముల నుండి (సంసారం, ముమ్మలములు) విడిపించి, నివృత్తికి దారిచూపును.
7. శివుడే జీవుని షట్చక్రస్థానములో నెలకొని శివయోగులను పరిపక్వమొనర్చి ఇంద్రియ విషయవాసనలు వీగిపోవునట్లు అనుగ్రహించును.
8. శివయోగుల కర్మఫలితములు నాశనమగుటచే వారు కాల్చబడిన విత్తనము వంటివారు, (కాల్చబడిన విత్తనము ఎట్లు మొలకెత్తదో) పునర్జన్మ రహితులు.
9. శివయోగులు సదా తురీయంలో నుండుటచే అకర్తగా (కర్మఫలితం లేనివారు), అభోక్తగా (భోగఫలము లేనివారు) సత్ (ఆత్మతత్త్వం), అసత్ (అనాత్మతత్త్వము–దేహేంద్రియ మనోబుద్ధులు–మిధ్యాజగత్తు) గ్రహించి, సత్యమెరిగి మిధ్యాతత్త్వమునకు అతీతముగా ఉండిరి.
10. ఏకరూప ఈశ్వరుడే అన్నిటికీ మూలముగాను, అనేక రూపనాయకుల ఈశ్వరునిగా జగమంతా నిండియున్నాడని సృజింపచేసి, తాను అరూపముగా పరబ్రహ్మముగాను ఉన్నానని బోధపరచి, జీవుడు తాను వేరుగాదని, తానే జీవులలో శివమై నెలకొనియున్నాడని గ్రహింపజేసి, జీవులకు పరమానందమొసగి, తనలో ఐక్యపరుచుకొనును.
11. శివసిద్ధుల ఇచ్ఛ, జ్ఞానము, క్రియలన్నీ శివుని ఇచ్ఛ, జ్ఞానక్రియలలో తుదకు ఇమిడిపోవును. శివమగుట – విడదీయలేనిదిగా, వేరువేరుగా కాక, అనన్యముగా, ఏకముగా ఉండుట, శివం – శుద్ధం – మంగళం.
12. శివసిద్ధులు, శివుడు వేరుగాదని గ్రహించి అంతా శివమయమన్న స్పృహలో ఉండుటచే, లోకకల్యాణార్థము (లోకసంగ్రహము) లోకులకు అన్ని విధముల సహాయపడుతూ అకర్తగాను, వాటికంతటికి అసంగముగాను ఉండి మౌనము దాల్చియుండిరి.
13. అష్ట మహాసిద్ధులైన అణిమాది సాధనలు చేసి లౌకికముగా హఠయోగ సాధన సిద్ధులు పొందినవారు **సిద్ధుల**నబడిరి. కాని ఆత్మజ్ఞానము పొంది తనలో

నెలకొనియున్న జీవాత్మను పరముతో ఐక్యపరచి తామే శివమైన వారిని **శివసిద్ధులు**గా పిలువబడిరి.

14. శివతత్త్వమెరిగిన శివసిద్ధులు నాదముతో తేటనైన జ్ఞానముపొంది నాద సామీప్యములో సదా నెలకొనియుండి, పూర్ణ, నిత్యపురుషులై ఉండిరి.

15. తేజోవంతమైన శివపాదపద్మములే పరములైన శివమగును.

16. నీటిలో ఉప్పు కరిగియున్నట్లు, జీవునిలో శివుడు ఇమిడిపోవును.

17. శివసిద్ధులు తమకని విడిగా ఏ వృత్తులు లేక అన్నియూ ఈశ్వరార్పణమనియూ, కలిగినవన్నీ ఈశ్వరప్రసాదమని భావించియుండిరి.

18. ఓం నమశివాయః – స్థూలపంచాక్షరి – ధార్మికమగు లౌకిక కామ్యములను జీవునికి (ధన, వస్తు, కనక, వాహన, కీర్తి, ప్రతిష్ఠలు) కలుగజేయును. ఓం శివాయనమః – సూక్ష్మ పంచాక్షరి – పరతత్త్వము పొందజేసి, జీవుని మలములను నివర్తింపజేసి, పునర్జన్మరహితము చేయును.

19. జీవులలో **అహం**ను (మోహం, మమకారాది వాసనలతో) నింపి అజ్ఞాన ఆవరణతో కప్పబడిన ఒంటరిస్థితి **కేవలస్థితి**. రెండవది ఇంద్రియ కరణములతో విషయవాసనలు అనుభవింపజేసి, కర్మఫలితములు పొందు స్థితి **సకలంస్థితి**. పై రెండు స్థితులు ఆచార్య ఉపదేశముతో, సాధనల వలన, దైవకృప తోడై అహం, మలములు వీడిన స్థితి **శుద్ధస్థితి**. పరంనందు నెలకొనుట – శివమగుట.

## 2. శరీర అశాశ్వతత్త్వము

143. మాయ అయిన మట్టి ఒకటి గలదు. అందు ద్వందకర్మ (ప్రారబ్ధము) ఫలముచే పుట్టినది శరీరమనబడు పాత్ర. ఆ పాత్ర అగ్నితో కాల్చబడినచో గట్టిపడి, దృఢముగా ఉండును. అదే పాత్ర కాల్చబడకుండినచో వర్షపునీటితో తడిసి, మట్టిగా కరిగిపోవునట్లు, లెక్కలేనన్ని మనుజులు శరీరము చెడి భువిలో కలిసిపోవుచున్నారే!!

144. సుఖదుఃఖ, భోగములు మొదలగునవి అనుభవించుటకు పుట్టిన ఈ దేహము, వాటిని అనుభవించిన తరువాత మరణించినచో, మరణించినవాడితో కలిసి, అనుభవించిన భార్య, పుత్రులు వాడితో వెళ్ళజాలరు. కాని వాడి జీవిత కాలములో చేసిన పుణ్యము, జ్ఞానము వానితో వెళ్ళునే కాని మరేదియూ వెళ్ళజాలదు. (మరణానంతరము మనతో వచ్చునవి మన జీవితకాలములో చేసిన పుణ్యము, జ్ఞానములే తప్ప మరేదియూ రాజాలదు.)

145. శరీరము మరణానంతరము ఊరివారందరు ఒక్కటై గుమిగూడి ఏడ్చి, అంతవరకున్న పేరును మార్చి **శవము** అని పేరుపెట్టి, దట్టమైన అడవిలో

తీసుకువెళ్ళి శవమును కాల్చి, నీటిలో స్నానమాడి, అట్లొకరు జీవించిరని స్మరణను కూడా మరచితిరే!!

146. దేహమును ఇంటికి రెండు కాళ్ళు, శిరస్సు, ఆధారముగా ఒక పొడవాటి వెన్నెముక, ఛాతి పక్కటెముకలలో ముప్పదిరెండు గుల్లలు ఉండును. వీటినంతటిని మూసివుంచిన మాంసచర్మాదులు ఒకప్పుడు వీగిపోవలసినవే. మాంసచర్మాదులు దేహమునుండి వీగిపోయిన పిదప ప్రాణము అందులో మునుపటివలె ప్రవేశింపజాలదు.

147. కఫవాతము కంఠమున కప్పబడినది. పలు జన్మలలో చేసిన కర్మఫలితములు సమిసిపోయినవి. శరీరము పడిపోయినది. అస్థికలు మెత్తబడినవి. నాసికలో శ్వాస నిలిచిపోయినదని ఎరిగి శరీరమును వస్త్రముతో కప్పిరి. శరీరమును శ్మశానమునకు తీసుకువెళ్ళి కాకులకు, గ్రద్ధలకు వేయుదురు.

148. బాగుగా నలపాకమువలె వంట వండబడినది. అట్లు వండిన వంటను ఇంటి యజమాని భుజించెను. భార్యతో విరహ, సరస, సల్లాపముతో ఐక్యమయ్యెను. ఛాతి ఎడమభాగమున నొప్పి పుట్టెనని భార్యతో చెప్పెను. చెప్పిన వెంటనే తిన్నగా పరుండి, పడుకున్నట్లే చనిపోయెను.

149. యజమాని గొప్పగా భవనములు కట్టి సుఖసంపదలతో తులతూగెను. అందరు చూచునట్లు పల్లకిలో ఊరేగింపుగా వెళ్ళెను. పట్టణకూడలిలో నూతన వస్త్రములను మూవురికి దానముగా ఇచ్చిరి. తన ప్రాణము పోయిన పిదప బంధువులు, ప్రజలు **నాన్నా** అని ఏడ్చిరే కాని పోయిన ప్రాణమును తీసుకు రాలేదుకదా!!
(మూవురికి దానమును ఇచ్చుట అనునది: బీదలకు, బంధువులకు, సహచరులకు తెలుపునది)

150. నిశ్చితార్థము చేసి పెళ్ళి చేసుకొన్న భర్త తన భార్యపై మోహముచే, ప్రేమాభిమానముచే అన్నింటిని మరచి ఆమె ధ్యాసలోనున్ననూ, అతను చనిపోయిన పిదప పాడెకట్టిపై పరుండబెట్టి పరితపించి, బంధములను త్రెంచుకొని, పిండప్రదానము చేయుదురే!! ఎంతటి పరితాపము!!

151. నాడి పరీక్ష చేసి ఇక ప్రయోజనము లేదని చెప్పగా, స్పృహ కోల్పోయి ప్రాణము పోవు తరుణములో, నేతితో భోజనము చేసిన నాలుక రుచి (జిహ్వా) కోల్పోయి, కంటికి కాటుక రాసుకున్న ఇల్లాలు, సంపదలన్నియు ఇచ్చటనే (భూమిపై) ఉండగా, శరీరము వీడి ప్రాణము వెళ్ళిపోవు విధానము ఇదే అగును.
(భార్య, సంపదలను విడిచిపెట్టి, పంచేంద్రియముల తమ ప్రజ్ఞలను కోల్పోయి, ప్రాణము దేహమును విడిచిపెట్టును.)

152. శరీరమను పందిరి (మూసి ఉంచినది) చెదిరినది, అంతస్తులు చెదిరి పోయినవి. తొమ్మిది ద్వారములు కర్మించడము మానుకున్నవి. దుఃఖమును తెచ్చు కాలము సమీపించినది. బంధువులు, దగ్గరివారు, ఇతరులు శోకసముద్రములో మునిగి, ప్రాణము పోయినదానిని సాగనంపిరే!!
(తొమ్మిది ద్వారములు: కళ్ళు రెండు, చెవులు రెండు, నాసిక ద్వారములు రెండు, నోరు, మూత్ర, పురీషములను కర్మేంద్రియములు పనిచేయడము మానుకున్నవి.)

153. దేశమునకు నాయకుడు, మన ఊరికి పెద్దగా ఉన్నవాడు, చనిపోయిన పిదప పాడెపై ఎక్కించి, కాటికి తీసుకుపోతూ ఊరివారందరు వెనుక నడవగా, డప్పు వాయిద్యము ముందు వాయించిరి. దేశనాయకుడైనను కాటికి వెళ్ళు విధానమిదియే అగును.

154. ముప్పది, ముప్పది, ముప్పది ఆరుగురును (అనగా తొంభైఆరు తత్త్వములు) బాగుగా తయారుచేయబడిన దేహాలయములో నివసించువారు. దేహాలయము చెడిపోయిన పిదప, ఆ దేహాలయము వీడి అందరూ ఒక్కసారిగా పరుగిడి పోయిరే!!
(ఈ శరీరము పంచభూతాత్మకము. పంచభూతములు వాటి స్థూల, సూక్ష్మ, పంచీకరణములు వాటి తన్మాత్రలు మొదలగువాటితో ఈ శరీరము తయారుచేయబడినది. వాటి వివరణ –)

**1. అంతఃకరణ తత్త్వములు**

ఆత్మతత్త్వములు – 24 (వివరణకు మంత్రము నెం. 125 చూడగలరు)
శివతత్త్వములు – 5
విద్యాతత్త్వములు – 7

అంతఃకరణ తత్త్వములు: 36 – తత్త్వములు (36)

**2. బాహ్యతత్త్వములు**

పంచభూతకార్యములు – 25
పంచభూత వాసనలు – 5

----
30
----

3. వాయువులు - 10
నాడులు - 10
వాక్కులు - 4
ఏషణలు - 3
గుణములు - 3
----
30
----

మొత్తము 96 తత్త్వములతో కూడిన శరీరము.
దేహము క్షీణతతో ఈ తొంభైఆరు తత్త్వములు శరీరమును వీడిపోవును.

155. నిండైన తేనెను గలిగిన పుష్పరాశులను జడయందు ధరించిన ఇల్లాలిని, సంపదను, ఇంటిని, ఈ ఊరియందే విడిచిపెట్టి, ప్రాణమువీడిన శరీరమును పాడెపై ఎక్కించి, ఊరి సరిహద్దుల ఆవలనున్న శ్మశానమునకు తీసుకువెళ్ళి, పాడెను చితిలోవుంచి తరలిపోయిరే!!

156. పై వాటిలో (ముందు మంత్రములో) చెప్పినట్లు శ్మశానములో ఉంచి అందరూ వెడలిపోయినది చూచియూ జనలు ప్రాణము శరీరమును వీడి వెళ్ళదని ఎంచి కోరుకొను విషయవాంఛలందు మోహము నొంది, వాటిని పొందగోరు భ్రమలోపడి ఉన్నతిని మరచి దుఃఖించుచున్నారే!!
(శరీరము అశాశ్వతమని తెలిసికూడా ప్రజలకు భ్రమ వీడుటలేదు.)

157. పరితపించుతూ, గోల పెట్టుచున్న బంధువులు, భార్యయు, సంతానము ఊరిబయటనున్న శ్మశానములో చేరి మయాన సంస్కారములు పూర్చితేసి, జీవితమునకు శ్రేష్టముగానున్న శిరస్సును మూసి, అగ్నిసంస్కారములు చేసి, స్నానమాచరించి బంధమును ముగించుకొందురు!!

158. ఈ మహెూన్నతమైన జగత్తునందు సృష్టికి మూలకారకమైనది మొదలుకొని అన్నియు చెరువులోని మట్టిని తీసి కుమ్మరి కుండ చేసినట్లు చేయబడినది. చేసిన కుండ పగిలిపోయినచో కనీసము పెంకు ఉపయోగపడునని ఉంచుకొందురు. కాని శరీరమను కుండ విరిగిపోయినచో ఎంతకాలమూ ఇంట్లో ఉంచజాలరు!!

159. ఈ శరీరములో పంచేంద్రియములు, ఆరు ఆధారములు కలవు. అస్థికలు (కలియకలు) ముప్పది. వాటికి చేరియున్నవి పదునెనిమిది. పందిరిలో తొమ్మిది ద్వారములు (చక్కగా మూయబడిన చర్మములో తొమ్మిది ద్వారములు) వరుసగానున్న ఎముకలు పదునైదు. వీటితో చేరిన శరీరము అగ్నిలో కాలి

బూడిదైనది. వీటిలోనున్న ప్రాణము యొక్క తత్త్వమును తెలుసుకోలేకయున్నారు!!

160. అత్తిపండు (శ్రోణితము) ఆకుకూర (శుక్రము) కలిపి కలగూర వండిరి. ఈ కలగూర శిశువుగా పెరిగినది. చివరకు వండినది (శరీరము) అందరి సమక్షమున శ్మశానమునకు వెళ్ళిపోయినది!!
(శుక్ర, శ్రోణితములు గర్భసంచిలో కలసి, కలగూరగా మారి శిశువుగా తయారై పూర్ణపరిణామము చెందిన ఈ శరీరము శ్మశానమున కాలి బూడిదైనదని, శరీరము అశాశ్వతమును తెలుపునది.)

161. దేహమను ఇంటికి పైకప్పు లేదు (శిరస్సుపై మూత). క్రింద త్రిప్పి త్రెంచుటకు ఏదియూ లేదు (కటిభాగమును). క్రిందిభాగమున రెండుకాళ్ళు మాత్రము కలవు (ఇడ, పింగళ నాడులు). మధ్యన ఒక కాలు గలదు (సుషుమ్న నాడి). ఇటువంటి ఇంటిని తాటాకులతో చేసినవాడు, మధ్యన ఉన్న కాలుతో గట్టిగా కట్టకుండా అందముకోరి తెచ్చికొన్నచో తెల్లటి దేహాలయము మాత్రమే అగును.
(దేహమునందు వెన్నెముకలో గల ఇడ, పింగళ నాడుల మధ్య ఏర్పడిన సుషుమ్ననాడితో జీవశక్తిని గట్టిగా కట్టకపోయినచో శరీరము నశించవలసినదే అని చెప్పు గూఢార్థము. శరీరము అందము పనికిరాదని చెప్పుట. వెన్నెముకలోని సుషుమ్నలో జీవశక్తిని పైకి లేపు సూక్ష్మము అష్టాంగయోగములో వివరణ గలదు.)

162. కూటము చెదిరినది (ప్రాణము ఇన్నాళ్ళు నాట్యము చేసిన దేహమను కూటము చెదిరినది). (కూటము=రెండు గదులకు మధ్యనుండు విశాలస్థలము). ముగ్గులు ఇచ్చట లేవు (ప్రాణమున్నప్పుడు ఉన్న అందము ఇప్పుడు లేదు). ఆడు ఆకులు లేవు (ప్రాణశక్తి తిరుగాడుట ఇక లేదు). ఓదార్చుటకు కొందరు బంధువులు, దగ్గరివారు పరితపించుచుందురు. నిప్పు రాజేసి, అందులో శరీరమును ఉంచి కాల్చిరి, వెళ్ళిపోయిరి.

163. మూడువందల రోజులలో గ్రుడ్డు పుట్టినది (గర్భస్థ పిండము శిశువుగా మారినది). ఈ శరీరము ఏదైన మన ఇష్టమైన రీతిలో అమరినదా? లేదే!! బుద్ధిహీనులారా! పన్నెండు సంవత్సరములకు ఆ శరీరము లౌకిక వాసనలను గ్రహించుతత్త్వము పొందినది. డెబ్బది సంవత్సరములలో పాడై చెడినది (శరీరము నుండి ప్రాణము పోయినది). ఇటువంటి నిలకడలేని స్థితిని గ్రహించగలరు.

164. శరీరమను ప్రమిదను ఉంచి ప్రాణమను దీపమును కాలుడు తీసుకుని వెళ్ళిపోయెను. బుద్ధిహీనులు కథ ముగిసినది తెలియక పరితపించుచున్నారే (శరీరము అశాశ్వతమని తెలియకున్నారే!). పుట్టుక పగలు, మరణము రాత్రియనియు మారిమారి వచ్చునని ఎరుగక ఉన్నారే! అశాశ్వతమైన శరీరము

శాశ్వతమని తలచి బంధములను పెంచుకొని పరితపించుచున్నారే!

165. పసుపుపచ్చటి కోల పుష్పమాల ధరించినవాడు, మాయలన్నిటికి ఆధార భూతమైనవాడు ఆ శివుడు. అతను సృష్టించిన ఈ శరీరములో ప్రాణముతో కలిసియున్న వాని యొక్క రూపమును స్తుతించక, ప్రేగులు తెగునట్లు మహా కోరికలు కోరుకుని, బంధువులు పరితపించునట్లు చేసి, దుఃఖము పెంచుకొని కుంభీపాకమను ఏడవ నరకములో పడి చచ్చుచున్నారే!!

(ఏడు విధములైన నరకములు: రోద, రౌరవము, కుంభీపాకం, గూఢశాలం, చెత్తుదానం, భూతి, మాభూతి అనునవి. శరీరములో నెలకొనియున్న జ్యోతిని నమస్కరించక మూర్ఖులు నరకములో పడిపోవుచున్నారే అని వాపోవుట).

(మరొకచోట ఈ విధముగా కలదు. రత్న, శర్కరో, వాలుకా, పంక, ధూమ, తమో, మహా తమః ప్రభ. గరుడపురాణమున 21 పేర్లు ఇచ్చినారు.)

166. చితచ్ఛత్రముతో ఎత్తైన యుద్ధ అశ్వముపై ఎక్కి రాజదండముతో చుట్టూ రాజ్యప్రజల సమూహమున నడుమ నడిచివెళ్ళునప్పుడు, అవసానదశ సమీపించినచో, ప్రాణము ఆతని ఎడమవైపు నుండి వెళ్ళిపోవునే!!

(రాజాధిరాజైనను, చతుర్దళాల పరివారమున్ననూ ప్రాణము నిలుపుట ఎవరికి సాధ్యము కాదు.)

167. ఈ శరీరమను తోలుసంచిలో దూరి ప్రారబ్ధకర్మలను అనుభవించ చేయుచున్న నాట్యకాడు (ప్రాణము) అవసానకాలములో బయలుదేరి శరీరమును వీడి వెళ్ళిపోయిన పిదప, ఈ శరీరమను కట్టెను కాకులు తిన్ననేమి? ఎవరు పొగిడిన ఏమి? ఎవరు దూషించిన ఏమి? కాలిన ఎముకలపై పాలు పోసినా ఏమి?

(నాట్యకాడు (ప్రాణము) వీడిపోయిన పిదప ఈ శరీరము కట్టెతో (జడము) సమానము.)

## 3. సంపద అశాశ్వతము

168. అనుగ్రహించిన రాజపదవి, రథ, గజ, తురగ, పదాతి, దళ సంపదలు ఉన్ననూ వాటిని ఇతరులు మననుండి పొందుటకు పూర్వమే, శాశ్వతమైన, ఉత్కృష్టమైన జ్ఞానసంపదతో పరమేశ్వరుని దరి పొందలేనిచో, తరువాతి కాలములో మహా తపస్సును చేయజాలడు.

(ప్రాణమున్నప్పుడే శివుని దరిచేర ప్రయత్నించవలెను.)

169. ఆకాశములోనున్న చంద్రుని ప్రకాశము దినాభిక్రమమున తగ్గిపోవుచున్నట్లు, శరీరము నీరసించుననని, సంపదలు తరిగిపోవునని ఎవ్వరికి చెప్పనక్కరలేదు. విషయ, వస్తు మోహము వీడి దేవదేవుని దరి చేరండి. నీటితో నిండిన మేఘము

వలె మహానంద సంపద చేకూరును.
(ఈశ్వరుడే శాశ్వతమైన సంపద అగను.)

170. నీ ఛాయ నీకు సహాయపడదు. సంపాదనంతయు తనకు ఉపయోగపడునని తలంచువాడు మూర్ఖుడు. పుట్టినప్పుడు నీ ప్రాణము నీ శరీరముతో వచ్చిననూ, ప్రాణము నిన్ను వీడునపుడు శరీరము నాశనమగును. కావున శరీరములో శాశ్వతమైన (ప్రాణమున్నప్పుడే) అంతర్ ప్రకాశముగా వెలుగొందు ఈశ్వరుని దర్శించవలెను.

171. పుష్పవాసనతో వెతికివెళ్ళి, తేనెను స్వీకరించి, దానిని కొమ్మలో భద్రపరచిన తేనెటీగలు, బలమైనవాడు వచ్చి తేనెటీగలను తరిమివేసి ఆ తేనెను పొందినట్లు, కూడబెట్టినదంతయూ పరుల వశమగునే!!
(సంపదలు ఉన్నవానికి, సంపద ప్రయోజనపడక పోవుటయే కాక హాని కూడ కలిగించునని నొక్కి వక్కాణించుట.)

172. సంపద నిలకడ లేనిదని ఎరుగవలెను. ఎరిగిన పిదప భీతి అనవసరము. నదీప్రవాహము వలె అశాశ్వతమైన పొంగివచ్చు సంపద చూసి మోహము చెందకుము. నీ యొక్క తుచ్ఛ సంపదపై మోహము వీడి శాశ్వతమైన సంపదపై దృష్టి సలుపుము. శాశ్వతమైన సంపద (ఈశ్వరధ్యాస) కాలుని (యముడు) కూడ తరిమి వేయగలదే!!
(మహాజ్ఞానసంపద (ఈశ్వరధ్యాస) యముని భయమును దరిచేరనీయదు.)

173. అనుభవించుచున్న పారంపర్య ఆస్తులు, తన సంపాదనలన్నియు, నదీ ప్రవాహములో కొట్టుకుపోతున్న పడవ వంటిది. అట్లే అశాశ్వతమైన శరీరమును శాశ్వతమైన పొదుపుగా మార్చుకొని (గమ్యం) ఒడ్డుకు చేరవలెను.
(శరీరము పొదుపు: జీవుని ఉన్నతికి తోడ్పడు అష్టాంగ యోగములు, కుండలిని ప్రక్రియ, రాజయోగము, కాయకల్ప విధానములు అభ్యసించి శరీరమును పటిష్టము చేయుట. ఇచ్చట రచయిత గూఢముగా చెప్పియున్నాడు. గమ్యము శివసాయుజ్యం ఒక్కటే.)

174. ప్రాణస్థిరత్వమునకు తోడ్పడునని, లౌకిక సంపదలు, భార్య, సంతతి, తోబుట్టువులతో తనకు ఎనలేని భద్రత లభించగలదని లోకులు భావింతురు. కాని అసలైన భద్రత శివధ్యాసతో జ్ఞానసంపదను పెంపొందించుకొన్నవారికి ఆ ఉన్నతమైన పరమాత్మ స్వరూపము పిలిచి ఆదుకొనునే!!

175. లౌకిక జీవితముపై ఆశలు పెంచుకొని జ్ఞానసంపదపై (ఈశ్వరధ్యాస) లేకుందురు. శరీరమును స్థిరత్వము చేయు తాళము (సుషుమ్న) నాడి యందున్నది. కాని

దీనిని చెఱుపుటకు తొమ్మిది అంశములు కలవు. బంధుత్వము ఏర్పరచిన తల్లి, తండ్రి వంశమువారు వచ్చి నమస్కరించి, పిదప శ్మశానమునకు దారిచూపించి వెళ్ళిపోవుదురే!!

(భ్రూమధ్యముల గల (సుషుమ్న) నాడి ద్వారా ధ్యానము, యోగములు సిద్ధించుననియు, దానిని చెఱుపుటకు నవద్వారములు (కళ్ళు, చెవులు, ముక్కు, నోరు, నాభి, విసర్జనములు) ఇంద్రియ విషయవాంఛనలు కలవని చెప్పుట.)

176. జీవిత మధ్యమున శరీరమును వీడి ప్రాణము వెడలునప్పుడు సాధించ వలసినది ఏమీయుండదు. ఈశ్వరుని తలంచండి. ఈశ్వరధ్యాస తప్ప మరేదియూ మిగలదు. అదియే భద్రతకు, దుఃఖనివృత్తికి సులభమార్గమగును.

## 4. యవ్వనం అశాశ్వతము

177. ప్రాతఃకాలమున తూర్పున సూర్యుడు ఉదయించి సంధ్యాసమయమున పడమట అస్తమించుట చూచియూ, లేగదూడ పుట్టి, పెరిగి, అందమైన ఆవుగా యవ్వనశోభ పొంది, పిదప కాలక్రమమున చనిపోవుట చూచియూ, అజ్ఞానులు యవ్వనము అశాశ్వతమని ఎరుగక యున్నారే!!

(ఉదయించు, అస్తమించు సూర్యుడిని, లేగదూడను అశాశ్వతములని రచయిత దృశ్యప్రమాణములుగా చెప్పియున్నారు.)

178. కొన్ని సంవత్సరములు మనకు తెలియకనే గడిచిపోయినవి. ప్రాణేశ్వరుని తనయందు నిలుపుకొని అఖండ ప్రకాశమును చూచువారు లేకపోయిరి. చాలాకాలము లోకమందు నివసించిననూ, వెలుగుచున్న దీపములో వత్తి కొనను పైకెత్తి ప్రకాశింపజేయకుండిరే!!

(ప్రమిద, నెయ్యి, వత్తి, జ్యోతి ప్రకాశము - నాలుగుగా ఉన్ననూ వత్తి కొనను పైకెగదోసి ప్రకాశవంతము చేయుననునది పూర్తిగా మానవప్రయత్నమే. మానవప్రయత్నము ఒక్కటే ఈశ్వరధ్యాసకు చేయూతనిచ్చి గమ్యమును చేర్చునది.)

179. యవ్వనము కొంచెము కొంచెముగా దినదినాభిక్రమములో తరిగిపోయి, పూర్తిగా మాయమగును. వార్ధక్యము ఆవరించిన పిదప, అద్భుత కార్యములు చేయజాలరు. కాబట్టి ప్రాణము శరీరములో నున్నప్పుడే, గంగానది ప్రవహించు జటాధారుడు నందీశ్వరుని (శివుడు) గుర్తెరిగి, వారి శరణు పొందవలెను.

180. సున్నితమైన శరీరము గల స్త్రీలు చెఱకును పిండి రసమును గైకొనునట్లు యవ్వనమునందు నన్ను స్వీకరించిరి. తామరమొగ్గ వంటి వక్షశోభితము గలవారై నన్ను ఆకర్షించినవారే, యవ్వన చెఱకురసము గైకొని, ముదిమిన నన్ను ముషిడిపిక్క (నల్ల జీడిపిక్క)గా త్రోసివేసిరే!!

(యవ్వన శోభితము అశాశ్వతమే కాక ముదిమి కూడ చేదుగా మారును.)

181. బాల్యము, యవ్వనము, వార్థక్యము అను వేర్వేరు స్థితులలో మారిన ఈ శరీరమును చూచియు అజ్ఞానులు గ్రహించలేకున్నారు. కాని భూలోకమును దాటి ఊర్ధ్వముగానున్న అండములలో నెలకొనియున్న ఆ సర్వేశ్వరుని యందు నేను సదా నెలకొని యుండుటకు ఇష్టపడుదునే!!

(అన్ని అండములు ఈశ్వరుని అంశమే. సకల చరాచరములు ఈశుని కృపయే. యవ్వనమునందే దీనిని ఎరిగి పరమాత్మని ధ్యాసతో దర్శింప ప్రయత్నింపవలెను.)

182. దినమూ ప్రాతఃకాలమున నిద్ర నుంచి లేవడము, మరలా సాయంసమయమున నిద్రకు ఉపక్రమించుట వంటి దినచర్యలతో ఆయువు పట్టు కోల్పోవుట, రుద్రమూర్తి యొక్క కోపోగ్రతయే. అట్లుకాక అతని సాన్నిధ్యమును పొందగోరు వారికి తాను ఆశీర్వదించి అనుగ్రహించునే!!

(జీవితకాలము వృధా చేయక ఈశ్వరకృపకు ఉపక్రమించవలెనని చెప్పుట.)

183. బలంగా గ్రుచ్చి, ఛేదించగల ఐదు సూదులు అను పంచేంద్రియములు, ఈ సంచివంటి శరీరములో కలవు. ఇవి ఐదు కాకివలె ఎగిరివెళ్ళి చెడ్డవాటిని గ్రహించి తినగలిగినవి. ఈ ఐదు ఇంద్రియములు నిగ్రహింపబడి శిరస్సుపై వెలుగుచున్న ప్రకాశముతో ఐక్యమైనచో, శరీరపు ఇంద్రియ ప్రజ్ఞలన్నియూ తొలగిపోవునే!!

(ధ్యానాభ్యాసముచే ఇంద్రియ నిగ్రహణతో జీవశక్తిని షట్చక్రములను దాటించి ఆఖరుదియైన శిరస్సున సహస్రదళమునందు లీనమైనచో పంచేంద్రియ విషయ వాసనలన్నియు శరీరమునుండి తొలగిపోవునే!!)

184. చల్లని చంద్రుడు, ప్రకాశవంతుడైన సూర్యుడు లోకుల శరీరములో ఇమిడి, వారి జీవితకాలమును నిర్ణయించుచున్నారని లోకులు ఎరుగరు. ఆకాశ తత్త్వము పొందువారుగా, విధివశమున చిక్కుకొని వినాశము తెచ్చుకొనువారుగా, సూర్యచంద్రులిద్దరు ముప్పది సంవత్సరములలోనే వారిని వేరుపరచుచున్నారు.

(కుండలినీ యోగములో ఇడ (చంద్రుడు) పింగళ (సూర్యుడు) సుషుమ్న నాడుల శ్వాసప్రక్రియలు గ్రహించి, అభ్యసించి, జీవశక్తిని షట్చక్రములు దాటించి, సహస్రపటలమునందు గల ఆకాశతత్త్వమును చేరినవారికి సిద్ధియు, అట్లు అభ్యాసము చేయనివారికి విధివినాశము తెచ్చుకొనివారుగా చెప్పబడినది.)

185. పొందుపరచిన పదునారు కళలు తోడుగా నిలబడిననూ, అధములు కళల ద్వారా వెళ్ళి, శిరస్సున గల ఈశ్వరుని పట్టుకొనజాలరు. కాలుడు (యముడు) యమపాశము వేసిన పిదప, మరల పునర్జన్మలో వెళ్ళి పడుదురు. వీరు వ్యామోహము తీరనివారే అగుదురు.

(దీనినే ప్రసాద ధర్మమందురు. షోడశకళలతో అష్టాంగమార్గమును అనుసరించి ఈశ్వరుని అనుగ్రహమునకు పాత్రులు కావలెను. అట్లు కానివారు వ్యామోహముతో పునరపి జననం పునరపి మరణంతో లోకములో కొట్టుమిట్టాడుచుందురు.)

186. ప్రసాదధర్మము ననుసరించియున్న కాలములో యవ్వనము వీడకముందే, శృతులు, స్తోత్రము కీర్తించి, ఈశుని స్తుతించి (నాదస్తుతి) అట్లు లేచిన ప్రాణశక్తిని గ్రహించి, ఉన్నతమైన ధ్యానస్థితిలో సత్యమును నేను గ్రహించ గలిగితిని.
(యవ్వనము వీడకముందే నాదస్తుతి, ధ్యానము ద్వారా ఈశుని కృపను పొందుటకు ప్రయత్నించవలెనని వక్కాణించుట.)

## 5. ప్రాణము అశాశ్వతము

187. చిగురించిన లేతచిగుళ్ళు, చల్లనైన పుష్పవిరాజితములు, ఉత్పన్నములైన వన్నియూ క్షీణించుట చూచియూ, ప్రాణమున్నప్పుడే సమున్నతమైన ఈశ్వరుని పాదపద్మములను పట్టుకొనజాలరు. అవసానకాలము దరిచేరి యముడు పిలుపు వచ్చునని గ్రహింపక ఉన్నారే ఈ అజ్ఞానులు!!

188. బ్రహ్మాది దేవతలైదుగురికి (బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, సదాశివ) కర్మించుటకు శరీరమను ఒక భూమి దొరికినది. వీరు ఐదుగురు ఈ శరీరమునకు కర్మానుసారపు విధి భోగములను కల్పించిరి. వీరి నాయకుని (శివుని) వద్ద నుండి ప్రారబ్ధకర్మలు ముగిసినదని చీటీ వచ్చిన పిదప ఈ ఐదుగురు శరీరమును వీడి వెళ్ళిపోవుదురే!!

189. మట్టియైన శరీరము ఒకటి. తాళములు రెండు (శరీరములోని రేచక, పూరక శ్వాసలు). దానిలో నివసించురాజు (శివుడు) అక్కడేయున్నాడు. అచ్చట నివసించు శివుడు శరీరమును వీడి వెళ్ళినచో, ఈ శరీరము మరలా మట్టిగా మారిపోవునే!!
(ప్రాణము వీడి వెళ్ళిన శరీరము మరలా మాయమైన మట్టిలోనే కలిసిపోవును. మట్టినుండే తయారైనది కనుక శరీరము (పంచభూతాత్మకమైనది) అనగా జగత్తులో పృథివి నుండి ఔషధములు, అన్నము జనియించి, అవే మానవునికి ఆహారముగా, ఆహారవే శరీరములో మాంసముగా మారినది. కావున శరీరము సమసిపోవునపుడు ఆఖరున మట్టిలోనే కలిసిపోవుచున్నది. కావున, ప్రాణము, శరీరము, భూమి అన్నియూ అశాశ్వతములే. మిథ్యాప్రపంచము అని చెప్పబడినది.)

190. శిరస్సున ఈశాన్యదిశ యందు నొప్పారువానిని (శివుని), వాక్కునకు అధిపతిగా నున్నవారి నటనతో (బ్రహ్మ), ఆ నటనలో అగ్నితత్త్వముతో కూడిన వాడును యైన ఈశుని, క్షీణింపదగినది ఈ శరీరమని తెలియక, శరీరములో నున్నది ఆ సర్వేశ్వరుడేయని గ్రహింపక ఉన్నారే ఈ పామరులు!!

191. శివసూర్యులు శరీరములో ఊర్ధ్వముగా, అధోదిశగా, ఎనిమిది దిక్కులకు

వ్యాపించియున్నందున, శరీరమంతయు సృజనాత్మకశక్తిగా మారియున్నదని లోకులు గ్రహించలేకున్నారు. ఈ భువిలోనున్న జనులు తమ అహంకారముతో శరీరము అశాశ్వతమని గ్రహించకున్నారే!!

192. ఏర్పడిన దారపు ముడులను చక్కగా విడదీసి, శుభ్రముగా పగ్గమున నేసిన పట్టువస్త్రము చిరిగిపోవుటను చూచియూ, మార్పునకు కారణమని లోకులు ఎరుగకయున్నారు. శిరస్సున జుట్టు నల్లగానున్నది తెల్లగా మారుట, జనన మరణములు క్షణభంగురమని లౌకికులు ఎరుగకయున్నారే!!
(క్షణకాలములోనే జీవితములో అన్నియూ మార్పు చెంది క్షీణించునని గ్రహింప జాలకున్నారేయని వాపోవుట.)

193. సుషుమ్ననాడులతో కూడిన పొయ్యి, శరీరమను కుండను, శుక్లము ఒక్కటే, బియ్యము, పొయ్యి (సోమాగ్ని) అను మూడు నాడులకు పంచవాయువులే ఇంధనములు. వీటితో బియ్యం సరిగ్గా వ్యర్థము కాకుండా వండబడవలె. నిర్ణయించిన దినములు (ఆయుష్షు) గడచిపోవుచున్నవే!!
(శుక్లము శరీరమున వ్యర్థము కాకూడదు. దినములు గడచిపోవుటకు ముందే శివయోగము పొందవలెను. పంచప్రాణములు: ప్రాణ, అపాన, సమాన, వ్యాన, ఉదానలు.)

194. మోహముతో సుఖముకోరి పుష్పములపై వ్రాలి తేనెను మనస్ఫూర్తిగా గ్రోలు తేనెటీగలు వలె, జీవుడు మనోపద్మముయందు సుఖము కోరినట్లైతే, జీవి యొక్క సోమ, సూర్యాగ్ని స్వయంప్రకాశములో నొప్పారు శివుడు బాహ్యముగా వెళ్ళు మోహపు మనస్సునందు నిలువజాలడు.
(శివుడు బాహ్యముగా వెళ్ళు మోహపు మనస్సునందు నెలకొనజాలడు. సాధకుడు అంతర్ముఖుడు కావలెనని చెప్పుట.)

195. జన్మలోనే శాశ్వత ఆనందము నిచ్చు ధర్మమార్గమును బూని, నిబద్ధతతో మెలగండి. పైమండలములలో మహాప్రకాశముతో నొప్పారు ఈశ్వరుని స్తుతించండి. మానవజన్మము ఎత్తిన అదృష్టవంతులకు విధిగా చెప్పవలసినది ఏదియూ లేదు సుమా!!
(మానవజన్మమే మహోన్నతమైనదనియు, ధర్మమార్గము అనుసరించి ఈశ్వర కృపకు పాత్రులు కావలెననుట.)

196. వంచనలతో మాట్లాడి ధర్మము చెడునట్లు మెలగవద్దు. దుర్మార్గుడవై ఇతరుల వస్తువులను మోహించవద్దు. కలిమిచే బాగా భుజించునపుడు ఎవరైన వచ్చి నీ వద్ద నిలిచిరేని వారికి కాస్త భోజనము ఇచ్చి నీవు భుజించుదువు గాక!!

(ప్రాణము అశాశ్వతమని గ్రహించి ధర్మమార్గములో నిబద్ధతతో నడవవలెనని బోధించుట.)

## 6. హత్య చేయకుండుట (అహింస)

197. బంధత్వము నొసగు శ్రేష్టగురుపూజకు (శివునకు) అన్ని పుష్పజాతులుగా నున్నది శ్రేష్టమైన అహింసయే. (అణువైనను జీవియే). కంటిలో ప్రకాశమే పుష్పమాల. చంచలము లేని చిత్తమే శ్రేష్టమైన దీపము. వీటినన్నింటిని పూజించు ప్రాణము ఉండు స్థలము శిరస్సే అగును.

(శివగురుపూజకు అహింసయే పుష్పరాజము. ప్రాణము ఉండు స్థలము శిరస్సున సహస్రదళ పటలమని చెప్పునది. అణువైనను జీవియే కాబట్టి హింసింపరాదని చెప్పు మంత్రము.)

198. **చంపు**, **గుద్దు** మని చెప్పు ప్రజలకు కాలుని (యముడు) భటులు బలమైన తాడులతో కట్టి, **వెళ్ళు**, **నిలువు** అని మందలించి, అగ్నిజ్వాలలతో మరుగుచున్న నరకములో నిలబెట్టునట్లు ఆజ్ఞాపింతురు.

## 7. మాంసము భక్షింపకుండుట

199. నికృష్టమైన మాంసభక్షణము చేయు నీచప్రజలను అందరూ చూచునట్లు యమభటులు పురుగును పట్టునట్లు పట్టి, చీల్చి, అగ్నిజ్వాలలతో మండుచున్న పాత్రలో వీపుపై పరుండజేయుదురు.

200. హత్య, ఆస్తేయం (దొంగతనము), కామము, అబద్ధము, మద్యం సేవించుట అనునవి పంచమహాపాతకములు. వీటిని విడనాడి శిరస్సున సహస్ర పటలమందున్న శివునికృప పొందినవారికి పాపములు అంటజాలవు. మహానందము నొసగు జ్ఞానానందములో తులతూగుదురు.

## 8. ఇతరుల భార్యలపై నిర్మోహము (మోహించకుండుట)

201. ప్రియమైన భార్య ఇంట్లో ఉండగా, మరొకరి రక్షణలో ఉండు ఇల్లాలును కోరు కాముకుడు ఇంట్లోని చెట్టుకు కాచి, పండియున్న పనసపండును తినక, అడవిలో పండిన ఈతఫలమును తినుటకు కోరునట్లే అగును.

202. బాగా ఎదిగిన మామిడిచెట్టుకు పండిన తీపియైన మామిడిపండును పొదుపు వస్తువుగా తలంచి ఇంట్లో దాచిపెట్టి, పోలికలు అసలే లేని చింతచెట్టెక్కి చింతపండు కోయునది, ఆలోచనారహితుడై తన ప్రాణశక్తిని వృధా చేసి ఆవేదన చెందుతున్నాడే!!

(ఇతరుల భార్యలను మోహించువాడు తన భార్య చెడి, తాను చెడును.)

203. సంపదపై కాంక్షయున్నవానికి అజ్ఞానముతో కప్పియున్న చీకటిలో కనిపించిన చిన్న విద్యుత్తుకాంతిని గొప్పదని తలంచునట్లు, మోహపుచూపులు గల స్త్రీలయందు వశపడుదురు. అట్లు మోహములో పడి మనస్సును మార్చుకోలేని వారగుదురు.

## 9. స్త్రీ అధమము

204. ముషిడిచెట్టు ఏపుగా పెరిగి ఆకులు, కాయలతో విరగబూసిననూ, భలే ఆకర్షణతో ముషిడికాయలు చెట్టంతా నిండియున్ననూ, వాటిని మానవులు తినుటకు పనికిరావు. అట్లే వక్షోజముల అందముతో ఆకర్షింప ప్రయత్నించు స్త్రీల వలలో చిక్కక, తప్పించుకొనవలెను. దానివలన ఏర్పడు మనోచంచలములను కట్టివేయవలెను (నిగ్రహించవలెను.)

205. ఇతరుల గృహములోని ఇల్లాలును కోరి మోహముతో వెళ్ళినచో, ఎత్తైన జలపాతము నుండి పడు నీటిప్రవాహములో చిక్కుకుని జారిపడి కామపు సుడిగుండములో పడునట్లే అగును. కలవలె ఆ స్త్రీ సఖ్యత క్షణకాలపు ప్రేమయే. నిజమైన గాఢ ప్రేమ అని తలంచరాదు.
(క్షణకాల భ్రమను త్రోసిపుచ్చవలెను. దానికి బలికారాదు.)

206. అందముతో కూడిన యవ్వనస్త్రీలు, వర్షముతో నిండిన గడ్డివలె చల్లనైనవారు. వారు మోహించిన ధనవంతుడు ఎవరైన వచ్చినచో, ముందున్నవారిని బయట వేచియుండమని చెప్పి, మరేమైన సాకులు చెప్పి తప్పించ ప్రయత్నించుదురు.

207. లోకములో స్త్రీ సాంగత్యముతో ఏమి ఒనగూరును? అంతర్ముఖులైన ఆత్మజ్ఞానులు ఇదే ప్రశ్నను ప్రశ్నించుచున్నారు. ఆ స్త్రీల సమూహము బాహ్యముగా చెఱకుగడల రసము వంటిది. లోనికి తీసుకొన్నచో వేపరసము వంటిది.
(స్త్రీల సాంగత్యము, ముందు చెఱకురసం మధురముగాను పిదప చేదైన వేపగా మారును. దీర్ఘప్రయోజనము ఇవ్వజాలదని జ్ఞానుల ఉవాచ.)

208. బుద్ధులై, సంఘబద్ధులై, ప్రజల సుఖకరమైన జీవితమునకే ఈ జన్మ. అట్లు కాక దొండపండును (శుక్రమును) బజారు స్త్రీల సాంగత్యముతో మలినముతో నిండిన గొయ్యిలో (గర్భసంచి) పారవేయుటను, ఉత్తమపౌరులు అడ్డుకోవలెను. అట్లు అడ్డుకోని యెడల సంఘము చెడిపోవును.

## 10. దారిద్ర్యము

209. ధరించిన వస్త్రము చిరిగి ఉపయోగపడకుండునట్లు జీవితమను వస్త్రము దారిద్ర్యము వలన ఉపయోగపడక పోయినది. అనుకూలించిన బంధువులు కూడా ప్రేమను వీడి వెళ్ళిపోయిరి. ఇచ్చిపుచ్చుకోవడము ఏమియూ లేదు. సంబరము ఏమీలేదు.

ఒక ఊరిలో ఉన్ననూ ఊరివారి మన్ననలు ఇకలేవు.

210. ప్రొద్దు పొడిచినది – ఇక కడుపు నింపుకొనుటకు పాట్లుపడి, కావలసిన వస్తువులను సమకూర్చుకొందురు. ఏ విధముగా పొట్ట నింపుకొనిననూ, ఈశ్వరుని దరిచేరు మార్గమును స్తుతించి అన్వేషించవలెను. జన్మకు కారణమైన ప్రారబ్ధకర్మ వీగిపోయినచో అసలైన పొట్ట నిండిపోవునే.

(జన్మకు సార్థకము: ఇక పునర్జన్మ లేకుండుటయే. దానికి ప్రయత్నించవలె.)

211. లోకులు పొట్టను నింపుకొనుటకు బంగారమును వెతుకుదురు. ఎంతకీ నిండని, నిండినా తృప్తిపొందని ఆ పొట్టను నింపుటకు లోకులకు సాధ్యము కాదు. ఆ పొట్టను తృప్తిపరచుటకంటే, ఈశ్వరుని పాదపద్మముల జ్ఞానము పొందినచో, జన్మకు కారణమైన కర్మలు వీడి పొట్ట నింపుటను నివృత్తి చేయునే!!

(అశాశ్వతమైన కార్యమునకు ప్రయత్నించుట కంటే శాశ్వతానందమునిచ్చు ఈశ్వరధ్యాసకు ప్రయత్నించవలెను.)

212. పెక్కు జన్మలతో నిరంతరము మనతో వచ్చు చుట్టములు (మనస్సుతో వచ్చు అసంపూర్ణ ఇంద్రియవాసనలు) శుభము కలుగజేయుట కంటే, కీడును చేయునవే. జీవితకాలము ముగిసి శరీరము నుండి ప్రాణము వీడకముందే లౌకిక వాసనలను విడచి సత్యజ్ఞానము పొందుటకు ప్రయత్నించువారికి పునర్జన్మ నివృత్తితో ఆకలిదప్పులు తీరునే!!

213. షడ్రుచులతో ఇష్టపడి తినునది విషయవాసనలను ఏర్పరచినవే కాక, వాటి సన్నిహితము పలు దుఃఖములను, బంధములను ఏర్పరచినవే. ఇవేకాక ఆ పంచములు (పంచేంద్రియ వాసనలు) కూడ శరీరముతో కలిసి, ఎనలేని దోషములను ఏర్పరచినవి. పలు కర్మఫలితములను ఏర్పరచినవి. వీటిపై విసిగి ఈశుని దరిచేరవలెను.

(ఈశ్వరధ్యాసయే అన్నిటికి విరుగుడు. అదియే శాశ్వతము.)

## 11. అగ్నికార్యము

214. దోషరహిత ఊర్ధ్వలోకవాసులకు, భూలోకవాసులకు నాలుగు దిశలందు నివసించువారి, దిక్కులను పరిపాలించు రాజులందరి మేలుకోరి వేదమూర్తులైన బ్రాహ్మణులు యజ్ఞము చేయుటవలన అందరూ సుఖముగా జీవించుదురు.

(బ్రాహ్మణులు వైదికకర్మలు, యజ్ఞయాగాదులు చేయుటచే ఊర్ధ్వలోకులు, అన్ని దిక్కులవారు, భూలోకవాసులు సుఖించెదరు.)

215. యజ్ఞయాగాదులు చేసియూ, వేదములు చదువుట వలన బ్రాహ్మణులు స్వర్గమును కోరి అగ్నికార్యములన్నింటిని (అగ్నిహోత్ర నియమాదులు) చేసి దానములు

ఇచ్చి, తాము భుజించుదురు. తమ విధిని తామే నిశ్చయించకొన గలిగిన ఆత్మజ్ఞానమును కలిగియుండువారు. వారు ప్రజలను శిరస్సుపై (సహస్ర పటలముపై) నుంచి జీవించుదురు.

(ఇచ్చట ప్రవృత్తి ధర్మము, నివృత్తి ధర్మము చెప్పబడినదని గ్రహించవలెను.)

216. గృహస్థాశ్రమములో నున్న బ్రాహ్మణులు బాహ్యముగా నున్న అగ్నితత్త్వమును అంతర్ముఖముగా నెరిగి తమ ఇల్లాలితో కలసిచేసి, దాని సత్యజ్ఞానమును ఎరిగినవారై, శివశక్తిగా తొలిజాములోనే ఈ క్రియ చేయుట ఒక అద్భుతమైన ధర్మమగును.

(స్వధర్మపత్నితో కలిసి యజ్ఞయాగాదులు చేయుట చాలా అద్భుతమైన శాస్త్రధర్మము.)

217. ఆడ, మగ కలయిక అనుగ్రహమును కోరి కలవవలెను. అప్పుడు కుండలినీలో జీవశక్తి ఊర్ధ్వముగా పైకెక్కి, గొప్ప శక్తిగా మారి చీకటిని ఛేదించుకొని ప్రకాశముగా మారును. అట్లుకాక, శుక్ల శ్రోణితముల కలిసినవని తలంచి గలిగిన ఆడమగ పక్షులు, మార్పులు చెందిన పిండములే అగును.

(ఆడ, మగ కలయిక దైవమును తలంచి జరగవలెను.)

218. ఆడ, మగ కలయికతో సృజించినది, ఊర్ధ్వముగా వెళ్ళి, కంటి భ్రూమధ్యమున వెలుగు జ్యోతి తత్త్వముగా గ్రహించినవారికి, ముమ్మలములు తొలగించుకొను శుభదినమగును. ఎప్పుడు శరీరములో నిలకడగా ఉండగలిగిన సంపద **శివ అగ్ని** అదేయగును.

219. యోని గుండములో దివిటీవలె మండుచున్న అగ్నిని (షట్చక్రములలో) పైకి ప్రాకునట్లు చేసినచో, అనుభవించుచున్న ప్రారబ్ధకర్మలు, వ్యాధులు నివృత్తి అగును. క్రింద వెలుగుచున్న అగ్ని, ఊర్ధ్వములో నిలకడ పొందినచో, జన్మ కర్మలతో ముడిపడియున్న అన్ని విధివిన్యాసములు కాల్చబడి మరియు అవి ఏర్పడకుండా అడ్డుకొనును.

(మూలాధారము నుండి అగ్ని ఎగబాకి శిరస్సునయున్న సహస్ర దళపటలము చేరి అచ్చట నిలకడ పొందవలెనని చెప్పుట. బృహదారణ్యక ఉపనిషత్తులోని నాల్గవ ప్రకరణములో దీనికి వివరణ కలదు.)

220. బంగారము, సంపదలు కీడు కలిగించుటకు ముందే, అనుగ్రహించిన మహోన్నతమైన జ్ఞానసంపదను ఇచ్చిన నాయకుడైన ఆ శివుని పొందండి. ఉత్కృష్టమైన శివాగ్ని శిరస్సుపై ఉత్పన్నమైనదని తలంచి జ్ఞానసంపద పొందుటకు అగ్నికార్యములన్నిటిని చేయుచున్నారు.

(యజ్ఞయాగములు చేయుట శివాగ్నిని పొంది శివకృపకు పాత్రులగుటకే.)

221. ప్రకాశ స్వరూపుడు, అక్షరుడు (నాశనము లేనివాడు), జ్యోతిస్వరూపుడై నా మనస్సున పుట్టి కంటి ప్రకాశముగా వెలుగువాడు, ఏడు లోకములు దాటి మహాగ్నిజ్వాలగా యున్నవాడు అయిన శివుడు, హోమమునకు నాయకుడు కూడా వాడే సుమా!!

222. శరీరములో అన్ని అగ్నికార్యములకు శివుడు అధిపతిగా యుండి సహాయపడు చున్నాడు. చనిపోయిన పిదప కూడ సూక్ష్మశరీరములో నెలకొనియుండును. మగ్గములో నేయబడిన వస్త్రము ఎట్లు పటిష్టమగుచున్నదో అట్లే వాసన రూపములైన కర్మలు విధిసంద్రమున బలముగా చిక్కుకొనుచున్నవి. ఆత్మ శివుని గోరి చేయు నాదశబ్దముల ప్రకంపనల వలన, విధికర్మలు వీడిపోవునే!!

(నాదశబ్దములు: హోమములో చేయు మంత్రోచ్చారణలు.)

223. అగ్నిని శిరస్సునకు తీసుకువెళ్ళు సామర్థ్యము నెరిగినవారు వైదికాగ్నిని ధర్మపత్నితో చేసిన వారగుదురు. అంత్యమున (పరములో) బ్రహ్మలోకము మొదలగువాటిలో ఉండి విశ్రాంతి పొందును. ఇహములోను ఉత్తమమైన గొప్ప కీర్తి ఆయనకు ఏర్పడును.

(భార్యభర్తలిద్దరు కలిసి అగ్నిహోత్ర కార్యములు చేసినవారు ఇహములోను, పరములోను ఆనందము పొందుదురు.)

## 12. బ్రాహ్మణుల సత్ప్రవర్తన

224. ధర్మాత్ములైన బ్రాహ్మణులు జన్మను నివర్తించు వృత్తిని గలిగినవారు. యజ్ఞ యాగాదులు, అగ్నిహోత్రములు చేసియూ, మూడు వేళలందు తమకు విధించిన నియమాదులను తప్పక పాటించి, తపస్సు చేసియూ, సంధ్యా వందనము, శాస్త్రపఠనములు మొదలగు హితములను చేయుదురు.

225. వేద అంతిమభాగము (వేదాంతము)గా పేర్కొనబడిన ఉపనిషత్తుల సత్య రూపమును ఎరిగినవారు, ఇష్టపడి త్రిపదములు అయిన (తత్+త్వం+అసి) **తత్త్వమసి** యొక్క అంతిమమైన **ఓంకారం**లో ప్రవేశించి, నాదాంత, వేదాంత, బోధాంత నాధుడైన శివుని అనుగ్రహముతో త్రిపదములను దాటి తురీయావస్థలో నెలకొనియుందురు.

(అగ్నిహోమాదులు చేయు బ్రాహ్మణులు మహావాక్యపదమునకు అంతిమముగా తగినట్లు ఓంకారములో సదా నెలకొనియుండును.)

226. **గాయత్రి**గా పిలువబడి, సూర్యుడైన సావిత్రి యొక్క మంత్రమును జపించుటకు బ్రాహ్మణులు ఇష్టపడుదురు. ప్రేమ అను రథమును ఎక్కి శివుని అనుగ్రహము

పొంది, మాయ యొక్క విన్యాసములను జయించి నిలుచుదురు.
(బ్రాహ్మణులు యజ్ఞయాగాదులచే, గాయత్రి మంత్రపఠనముచే మాయను జయించిన వారగుదురు.)

227. మోక్షమునకు మూలమైనది ప్రణవమంత్రమని గ్రహించి, సద్ గురోపదేశము పొంది, మహావాక్యములకు భాషణములకు అర్థమెరిగి అద్వైత ధర్మమును అనుసరించి, సర్వోత్తమ బ్రహ్మస్వరూపులైరి దోషరహితులైన బ్రాహ్మణోత్తములు.
(ప్రణవము పదమునకు మౌనమని అర్థము గూడ కలదు. ఇది అ-ఉ-మ-బిందు-నాదము ఐదుభాగములుగా గలది. ఓంకారం ఉచ్చారణ మూలాధార చక్రమున మొదలుకొని శిరస్సు వరకు ప్రాకి ప్రకాశముగా వెలిగినది యోగులు దర్శించిరి. కంఠము నుండి ఓంకారం వాక్ఘోషగా బాహ్యముగా ప్రాకినది స్థూలప్రణవమనియు, కంఠమునుండి లోపలికి అనగా కపాలమునకు ప్రాకినది సూక్ష్మప్రణవమని యోగులు దర్శించి నిర్దేశించిరి.)

228. ఆత్మజ్ఞానమును అంతర్ముఖమున దర్శించి, వాసనాది ఇక్కట్లు ఏర్పరచదగు ఇంద్రియ వృత్తులను నిరోధించి, పాపపుణ్య ఫలితములకు అతీతముగా జ్ఞానము పొంది, బంధములను త్రెంచుకొని తాను వానిగా మారి బ్రహ్మంబగుదురు.
(తాను వానిగా మారుట: సత్యనిష్ఠతో, మహాతపస్సుతో ఆత్మజ్ఞానము పొందిన వారికి పాప, పుణ్య ఫలితము నశించి, తమకని నిర్దిష్ట కర్మలు ఇక లేక, అన్ని ఈశుని చర్యలుగా ఎంచుటచే, తానే బ్రహ్మగా మారుట. ఇది ఉపనిషత్తులోని **అహం బ్రహ్మ అస్మి** మహావాక్యమగును. నేనే బ్రహ్మంగా ఉన్నాను (అద్వైత బ్రహ్మభావన.)

229. వేదములకు అంతములైన ఉపనిషత్తులను తెలుసుకొనగోరి బ్రాహ్మణులు, వేదాంతములను వినిన పిదప వారివారి ఆశలను విడవకుండిరి. ఆశలు (కోరికలు) లేకుండుటయే అసలైన వేదాంతమగును. కావున వేదాంతముల సరైన అర్థమెరిగినవారు తమ ఆశలను (కోరికలను) విడిచిన వారగుదురు.
(వేదాంతమును అర్థమెరిగి వినవలెను. వినిన పిదప కొద్దికొద్దిగా అనుభవములోకి తెచ్చి, పూర్తిగా కోరికలు లేనివారుగా మారవలెను.)

230. ఛాతికి జంధ్యము, శిరస్సున పిలక పెట్టుకొన్నచో బ్రాహ్మణులనబడుదురా? జంధ్యము వట్టి ప్రత్తిదారముతో చేయబడినది. పిలక కేశమగుట, శిరస్సున గల రోమములే కదా? కాని జంధ్యము యొక్క వేదాంతము - ఇడ, పింగళ, సుషుమ్న మూడు నాడుల కలయిక అనియు, పిలక, శిరస్సున నొప్పారు బ్రహ్మనాడి యొక్క శ్రేష్టమును తెలియజేయు జ్ఞానమనియు బ్రాహ్మణులు గ్రహింపవలెను.

231. ఆత్మజ్ఞానము పొందక, తనకు తాను తెలుసుకొను జ్ఞానము లేక, మనస్సుతో కూడిన ఇతర ఇంద్రియముల విషయవాసనలు విడవలెనను జ్ఞానము లేక, నిజమైన భక్తి లేక, పరమాత్మఁడొకడున్నాడన్న చింతన లేక, అజ్ఞానముతో కూడుకున్న మూఢులు బ్రాహ్మణులనబడుదురా? (అనబడరు.)
(లౌకిక సుఖములను విడనాడి ఆత్మజ్ఞానము కలవారే బ్రాహ్మణులగుదురు.)

232. ఉత్కృష్టమైన ప్రణవ (ఓంకారము) ధర్మమెరిగి సత్, అసత్ నెరిగి, శ్రేష్ఠమైన గురోపదేశముతో అతని చరణములందు చేరి, ప్రణవమార్గములో వెళ్ళుటచే బాహ్య క్రియలన్నియు పూర్తిగా సద్దుమణిగిపోవును. ఇట్లు ఉండు నిష్ఠాగరిష్ఠులైన పరిశుద్ధ బ్రాహ్మణులు **తురీయం**లోని ప్రకాశముతో సమాధిలో ఉందురు.
(సత్, అసత్: నిత్యానిత్య వస్తుతత్త్వము, కార్యకారణ తత్త్వము, ఆత్మానాత్మ తత్త్వము, సత్యం–మిథ్యాతత్త్వము, మొ॥ వాటిని తెలుపునది.)

233. వేదములను అర్థమెరిగి పఠించువారే బ్రాహ్మణులనబడుదురు. కాని వేదాంతములు (ఉపనిషత్తులు) గూఢముగా ఉన్ననూ అవి సత్యమైన, శుద్ధ తత్త్వముతో కూడుకున్నవి. వేదము కాని, ఇతర గ్రంథములు పఠించుట అంత శ్రేష్ఠము, శ్రేయస్సు కాదని తలచి త్రోసివేయువారే సరిగా వేదము చదివిన బ్రాహ్మణులగుదురు.

234. అన్ని జీవరాశులను సమభావనతో చూచు ప్రేమగల మనస్సువారు, మహోన్నత్తమైన వేదమంతయునైన శివుని నిర్విరామముగా కొలుచువారైన బ్రాహ్మణులు, పొందునది సుభిక్షమైన పృధివి. ఎటువంటి అనావృష్టి, అతివృష్టి లేని రాజ్యము, మంచి ధర్మాత్ముడైన రాజు, ప్రాతః సంధ్యాకాలములో ఆహుతులు (యజ్ఞము) అర్పించు భాగ్యములు మొదలగునవి అగును.
(అనుగ్రహం పొందిన బ్రాహ్మణులు ఎచ్చట ఉండినను ఆ ప్రదేశము సుభిక్ష మగును. లోకము మహోన్నతమగును.)

235. వేదాంత మార్గమున (ఉపనిషత్తుల భాష్యమెరిగి) వైరాగ్యముతో బడయు జ్ఞానమార్గమును అవలంబించువారికి, నాదాంత (**ఓంకార** నాదశబ్దమున నెలకొను ధ్యానయోగము) మార్గమున ప్రయత్నించువారికి, సంపూర్ణ జ్ఞానమార్గమున తత్త్వవిచారణతో జ్ఞానము పొంది పరమాత్మను పొందుగోరు వారికి **సిద్ధి**తో కూడ **ముక్తి** ఒనగూరును.

236. ప్రాణము, ఉచ్ఛ్వాస, నిశ్శ్వాసలు ఐక్యమగు కాలమున సంతోషముగా ఉండి, అన్ని శుభములు కలుగుచున్ననూ, అన్నిటికి అతీతముగానుండు శివునికృపను కోరి ఉన్నతమైన ముక్తిని పొందువారగుదురు.

(శివభక్తులు లౌకిక వ్యవహారములో కలిసి ఉన్ననూ ఉన్నతమైన ముక్తిని పొందుదురు.)

237. శివునియందు ధ్యాస వలన అంతర్బంధము (**నేను** అనునది). బాహ్యార్బంధము (**నాది** అనునది) రెండును వీగిపోవును. అహంకారము వీగిపోవును. పిదప ఏ ఒక్కటిని కోరి వెతకజాలరు. భువిలో ఉద్భవించిన చతుర్ముఖబ్రహ్మ వలె పుణ్యమును బడయగోరి ఆహుతిలో వేయబడు హవిస్సును భుజించువాడగును (శివుడగును). (ఆహుతులు భుజించుటచే బంధములు వీడును.)

## 13. రాజుకీడు

238. విద్యాశూన్యుడైన రాజు, యముడు ఒక్కటే. కాని విద్యాశూన్యుడైన రాజుకన్నా యముడు ఎంతో మంచివాడు. చదువులేని రాజు ధర్మమార్గము ఆచరింపక **చంపుము** అని ఆజ్ఞాపించును. కాని ధర్మమార్గమాచరించు వారి వద్దకు యముడు కూడ దరిచేరడు.

(ధర్మమార్గమాచరించని రాజుకన్నా ధర్మమార్గమాచరించు యముడు చాలా శ్రేష్టుడు.)

239. ప్రతిదినమూ రాజు తన దేశమున ధర్మార్థములు బాగుగా పరిశీలించి తగు న్యాయపరిపాలన చేయనిచో, కాలక్రమములో దేశసంపద తరిగిపోయి, దేశ ప్రజలలో మూఢత్వము పెరిగిపోయి, కాలక్రమములో రాజు, రాజ్యసంపదలు క్షీణించిపోవునే!!

240. పాత్ర ధర్మమును పోషించగోరువారు అంతఃప్రవర్తనలోనూ, బాహ్యములోనూ పాటించవలెను. అట్లు పాటించని ఎడల ఆ పాత్ర ఏల? పాత్ర ధర్మమెరిగి జీవనము గడుపువారే నిజమైన పాత్రధారి. పాత్రధారులు వారివారి పాత్రకు తగ్గట్టు ధర్మమును నిర్వర్తించునట్లు చూడవలసినది బలవంతుడైన రాజు యొక్క ధర్మమగును.

241. అజ్ఞానము వీడనివారు పిలక, జంధ్యము మొదలగువాటితో వేషములు వేసినచో భూలోకవాసులు చెడిపోవుదురు. మహాజీవనము గడుపు రాజు యొక్క కీర్తి కూడ చెడిపోవును. కావున వేషము యొక్క ధర్మమును గ్రహించి, ఆడంబరముల కొరకు ధరించు పిలక, జంధ్యములను తొలగించుకొనుట రాజ్యమునకు, రాజుకు శ్రేయస్కరమగును.

242. జ్ఞానము ఇంకా పొందక జట, జంధ్యము, పిలక మొదలగు వాటిని ధరించి జ్ఞానులవలె నటించువారిని, జ్ఞానుల ద్వారానే రాజు వారి నిజరూపమును శోధించి, వారు జ్ఞానము పొందునట్లు చేసినచో, అది రాజ్యమునకు సుభిక్షమగునే!!

243. గోవులను, స్త్రీలను, ధర్మమార్గము అవలంబించు ఉత్తమశీలురులను దేవతలు కూడా కీర్తించునది నిజమైన దివ్యవేషధారులను!! వీరిని రాజు ఎటులైన రక్షించి తీరవలెను. అట్లు రక్షించలేనిచో రాజు పరలోకములో నిత్య నరకము అనుభవించును.
(దివ్యవేషధారులు: అంతరము, బాహ్యమును ఒక్కటిగా గలవారు.)

244. ఉన్నతమైన పరలోకప్రాప్తికి ముక్తియు, ఇహలోకమునకు సంపదయు, రాజు ఎల్లప్పుడూ రాజ్యములో ధర్మము నెలకొనునట్లు చేయవలెను. చుట్టూ సముద్రము ఆవరించబడిన రాజ్యములో ఉండు ప్రజలు చేయు సత్కర్మలు, దుష్కర్మలు వాటి ఫలితములు రాజుకు కూడా తన వంతుగా కొంత వచ్చిచేరునే!!
(ఇహ, పరలోక సుఖప్రాప్తి కొరకు ఇహలోకములోనే రాజు తన ప్రజలను ధర్మమార్గమున ఆచరింపజేయవలెను. వారి కర్మఫలితములకు రాజు కూడా భాగస్వామియే అని నొక్కి వక్కాణించునది.)

245. రాజు దేశమును రక్షించు విధము చాలా బాగుందిలే!! (హేళన భావన). అందున్న ప్రజలు కూడ రాజును బోలియే నడుచుకొందురు. వ్యత్యాసముగా ఉన్న ఈ దేశమును శత్రువులు స్వాధీనము చేసుకొనుటయు, ఈ రాజు యుద్ధఫలితమెరగని పైకి దూకు పులివంటి గుణముగల క్రూరుడే అగును.
(రాజు ప్రజల సుఖశాంతులు కోరవలెను.)

246. జీవశక్తిని తన వశము చేసుకొను ప్రయత్నములో, మూలాధార చక్రములో నెలకొనియున్న అగ్నితత్త్వమును, శిరస్సున పైకెక్కింపచేసి (వెన్నెముకలో నున్న ఆరు (షట్) ఆధార చక్రములు: మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధి, ఆజ్ఞాచక్రములు ద్వారా పైకి లేపి) అక్కడ దర్శనమిచ్చు పాలవంటి తెల్లని ప్రకాశమును దర్శించి, అదే చంద్రమండలమని (సోమం) నెరిగి, అక్కడ స్రవించు ఆనందమధువును త్రాగక, ఆనందమిచ్చునని తలంచి కల్లు త్రాగు ప్రజల యొక్క అలవాటులను ప్రారద్రోలుట (మద్యం నిషేధణ) రాజు యొక్క ధర్మమగును.
(జీవశక్తిని నియంత్రించి నిర్వికల్ప సమాధిస్థితికి వెళ్ళు సిద్ధులకు కొండనాలుక నుండి చిక్కటి పాలవంటి చుక్కలు స్రవించునని రాజయోగమున చెప్పబడి యున్నది.)

247. వారివారి ఆధ్యాత్మిక ధర్మములను ప్రజలు పాటించని యెడల, శివుడు చెప్పిన ఆగమశాస్త్ర ధర్మము ప్రకారము మరుజన్మలో ఎంతటి దండననైనా నొసంగి వారిని మార్చును. కాని ఈ జన్మలోనే సరైన దండన నొసంగి మార్చునది, రాజకర్తవ్యమగును.

## 14. వర్షమహిమ

248. అమృతమువంటి సమృద్ధినిచ్చు వర్షము బాగా కురియుటచే రుచికరమైన కొన్ని చెట్లు, చేమలు భూమిపై ఉద్భవించును. వక్క, లేతకొబ్బరి, చెఱకు, అరటి మొదలగునవియు, అమృతమొసగు సమాధిస్థితికి తోడ్పడు **ముషిడి** మూలికలు మొదలగునవియూ పైరగునే!!

249. శిరస్సు అను పర్వతము నుండి ఉప్పొంగి ప్రవహించు ప్రకాశమైన (తెల్లని) ఆకాశగంగ వర్ణించుటకు వీలుకానిది. అది మనోమండలము నుండి ప్రేమతో ఊటగా ప్రవహించును. పొంగు, బుడగలు లేనిది. మలినములు లేనిది కనుక స్వచ్ఛమైనది. ఎటువంటి పాపములనైననూ పోగొట్టగలిగిన ఆ నీరు అఖండమైన దగుటచే ఎటువంటి తీరము (ఒడ్డు) లేనిది.
(శిరస్సు నుండి ప్రవహించునది, మనోమండలమను ప్రేమతో కూడినది ఆకాశగంగ, సరిహద్దులు లేనిది.)

## 15. దానమహిమ

250. ఎవ్వరికైనను ఇవ్వండి. వారు వీరు అని చూడక అందరికి ఇవ్వండి. ఎవరైన ఆకలితో అలమటించి వస్తున్నారా? అని చూచి భుజించండి. పాత భోజనమును భద్రపరచకండి. ఇహము, పరమునందు ఓ ప్రీతిగలవారా! అతివేగముగా (తొందర తొందరగా) భుజించకండి! కాకులు తినే ముందు మిగతా కాకులను పిలిచి తినుట గమనించితిరా?
(ఇతరులకు పెట్టి తాము భుజించవలెను. దానమన్నింటిలోను అన్నదానమే అతి శ్రేష్టమని, అన్నమును ఎన్నుకొని చెప్పబడినది.)

## 16. ధర్మాత్ముని మహిమ

251. తన్ను తాను తెలుసుకున్నవాడు ఈశ్వరుని పాదపద్మములను కొలుచువాడు. ధర్మతత్త్వములో నిలుచున్నవాడగును. తన్ను తెలుసుకొన్నవాడే సత్యమును గ్రహించినవాడగును. తన్ను ఎరిగినవాడికి దైవమే బంధువగును.
(సర్వేశ్వరత్వమును కొలిచి ధర్మమాచరించువారికి ఈశ్వరుడే వానికి చుట్టమగును.)

252. భుజించుటకు ముందు ఈశ్వరునకు ఒక పచ్చాకు (బిల్వపత్రము) పెట్టి పూజించడము అందరికి సాధ్యమే! అట్లే పశువుకు (గోమాతకు) ఒక పిడికెడు గడ్డి పెట్టుట అందరికి సాధ్యమే! అట్లే భుజించుటకు ముందు ఇతరులకు కొంత పెట్టుట అందరికి సాధ్యమే! కాని ఇతరుల మనస్సు నొప్పించక మాట్లాడుట అందరికి సాధ్యపడదా? (చేస్తున్నామా?)

(అందరికి సాధ్యపడు ధర్మనిరతిని బోధించినది ఈ మంత్రము.)

253. ద్వందబంధములను రెంటిని (లౌకిక బాహ్యాబంధము, స్వార్థబంధము) వీడిన శివయోగులకు ఆహారము ఇచ్చుటయే మహాధర్మమని పెక్కు గ్రంథములలో చెప్పబడియున్నది. లౌకికవిద్యతో ఏర్పడిన జ్ఞానముగల మనుజులు ప్రత్యేకించి బావిచుట్టూ, చెఱువుగట్టున నివసించు శివయోగులను గమనించి వారిని పిలిచి ఆహేము పెట్టుట తెలియకనున్నారే!!

(బంధములు వీడిన జ్ఞానులకు ఆహారము కల్పించుటయే గృహస్థుని ఉత్తమమైన ధర్మముగా చెప్పబడియున్నది.)

254. ఓ ధర్మము ఆచరించని హృదయము గలవారా! కామము, అజ్ఞానములను, మలములను వీడి జ్ఞానమును వృద్ధిపరచలేదు. సంపదలు గలిగిన రోజులలో ధర్మము చేయలేదు. ప్రపంచం దృష్టిలో కాలమును వెళ్ళబుచ్చుచూ ఏమి చేయదలచితిరి? ఈ శరీరము కాల్చి బూడిదైన పిమ్మట ఏ దానధర్మము చేయక కాపాడినవి ఏమగునో?

255. నీ స్థితిగతులు ఎరుగడు. నీవు మంచివాడవని ఎరుగడు. నీవు దుఃఖములో అనుభవించునది ఎరుగడు. నీవు వయస్సులో చిన్నవాడవని ఎరుగడు. సర్వగతుడైన కాలుడు (యముడు) వచ్చి నీ ప్రాణమును శరీరము నుండి పెకలించువేయుటకు మునుపే, నీవు చేయగలిగిన మంచి తపస్సు చేయవలెను సుమా!!

256. సన్న్యసించినవారికి ఈ లోకములో ఏ బంధుత్వముండదు. మరణించిన వారికి ఈ లోకములో వస్తువిషయములుండవు. ఇహములో ధర్మము చేయక మరణించినవారికి ఈశ్వరుడు తోడురాడు. ఈ ముగ్గురు ధర్మము చేయు తత్త్వము ఎరుగనివారే అగుదురు.

(మంచి కోరువారు ఎప్పటికి ధర్మనిరతియే గొప్పదని గ్రహించవలెను.)

257. జ్ఞానమే ఈశ్వరుడని తలంచు మనుజులు, పూర్వజన్మములోనే తపస్సుచేసి ఉన్నతి సాధించినవారు. శరీరమే దైవమని తలంచి జీవించు మనుజులు **నేను దైవమ**ని చెప్పి దరిచేరు యముని రాకను గ్రహించజాలరు!!

258. మనల్ని ముంచుతున్న ప్రారబ్ధకర్మములను సంద్రములో ఒడ్డుకు చేర్చగలిగిన తెప్పగా ఉండి రక్షించుటకు మన చుట్టూ మనకి రెండు మార్గములు కలవు. అవి క్షీణతలేని శాశ్వతమును కల్పించునదినైన **తపస్సు, ధర్మము** అగును. ఇవి పరమునకు కూడా తోడ్పడునే!!

(యోగజీవితము ద్వారా లౌకిక జీవితములోనున్న వారికి ధర్మము,

సన్న్యాసములోనున్న వారికి వారి తపస్సును రక్షణ కల్పించి తోడ్పడును.)

259. ఆ శివమహామహునితో బంధము ఏర్పరచుకున్నచో ఆత్మజ్ఞానమును గలిగించును. లోకులను నిందించక ధర్మమార్గమున నడచి మిగతా మార్గములకు వెళ్ళక, నిలబడి, మీరు పరులకు చేసిన దానమే మీకు తోడై వచ్చును. ముక్తి పొందుటకు శివుడు చేయు మార్గనిర్దేశము అదియే.
(శివుని పొందు మార్గములు ఇతరులను దూషించకుండుట, ఇతరులకు దానము ఇచ్చుట. ఇవే ముక్తికి మార్గదర్శకములు.)

## 17. ధర్మమెరుగని వాని గుణము

260. నిర్దేశించిన ధర్మమార్గములో కాక, సంపదను ఇతర మార్గములలో ప్రోగు చేయుట, ముషిడిచెట్టు (విషపుచెట్టు) కాయలు బాగుగా పండి క్రింద రాలిననూ ఎవ్వరికి పనికిరానట్లే అగును. వడ్డీ డబ్బులు తీసుకొని కూడబెట్టిన సంపద వంచనతో, పాపముతో కూడబెట్టిన సంపద అగునని మూర్ఖులు ఎరుగకయున్నారే!!
(వడ్డీతో కూడిన సంపద, ధర్మమార్గములో సంపాదించినది కాదని ఎరుగక యున్నారే ఈ పాపులు అని వాపోవుట.)

261. ఎన్నో సంవత్సరములు గడిచిపోయినవి. ఎన్నో ఉపాధులతో కాలం చెల్లినది. ఎన్నో మనఃసంకల్పములు వీగిపోయినవి. జీవితకాలము శుష్కించినది. రసము వీడిన పిప్పివలె ఈ శరీరములు దుఃఖములు ఏర్పరచునవియూ, ఏ ప్రయోజనము లేకుండానే క్షీణించిపోవుట చూచియూ ధర్మము యొక్క ఉన్నతిని ఎరుగకయున్నారే!!
(మరొకరికి **ఇచ్చునదే** శ్రేష్టమైన లోకధర్మమని శాస్త్రము చాటుచున్నది. సంపద వృద్ధికి కారణము మరొకరికి దానము ఇచ్చి ఆదుకొనుటయే.)

262. లోకములో ఎందరో ధర్మమిదని ఎరుగకయున్నారు. ధర్మఫలితముగా సర్వేశ్వరుని (శివుని) పాదమును కొలుచు మార్గమును తెలియకయున్నారు. శివలోకము ప్రక్కనుండు స్వర్గాది తత్త్వములను తెలుసుకోలేకయున్నారు. లోకులు సూచించు అసత్యమార్గములో నడుచుకొని పాపకార్యములకు ఒడిగట్టి జనన, మరణ చక్రములో చిక్కుకొని కూరుకుపోతున్నారే!!
(దానగుణము లేనివానికి పునరపి జననము పునరపి మరణము.)

263. దగ్గు, ఆయాసము, కఫము, జ్వరము మొదలగు రోగములు ధర్మము చేయని వాని దరిచేరును. ఉరుములు, మెరుపులు, పాముకాటు, కంఠవాతము, గర్భవణము మొదలగువాటి ద్వారా ఏర్పడు తక్షణ మరణములు కూడా ధర్మము చేయనివారికే గలుగును.
(ధర్మము చేయనివానికి రోగములు చుట్టుముట్టుకొనును.)

264. లోకులు తనను పొగిడితే ఉప్పొంగిపోయి తమ కీర్తిపై వ్యామోహంతో ఈశ్వర ధ్యాస లేనివారైయుందురు. పైగా తమను కోరి, యాచించి వచ్చినవారికి పిసరంతైనను దానం ఇవ్వజాలరు. అలసివచ్చిన బాటసారులకు స్వాంతన పరచుటకు తోటలు, నీటివనరులు ఏర్పరచి కనీసము శరీరకష్టము చేయుటకు కూడ పాల్పడరు. ఇంతటి మంచి గుణములు గలవారా!! నరకములో శాశ్వత నివాసం కోరుకుందురా? ఏమో!!

265. ధర్మమార్గమున నడవనివారు, దేవలోకపు సద్గతి కూడ దక్కకుండా నడుచు కొందురు. చీకటిలోకములో (నరకములో) ప్రవేశించుదురు. కామము, మోహము మొదలగు మలములను విడనాడి, వాటిని తమ దరిచేరనీయక నుండువారు సన్మార్గమున నిలిచినవారై, వారి విధిని జయించినవారగుదురు.

266. అన్ని ప్రాణులందును ప్రేమ, కరుణ, దయ చూపువారు ఈశ్వరుని పాద పద్మములను కాంచుదురు. విరక్తిభావము చెంది, లౌకిక విషయములపై బంధము విడనాడి తపస్సు చేయువారు శివసాయుజ్యమును (శివుని) పొందెదరు. లౌకికవాంఛలను మనస్సున నింపుకొని, ధర్మము పాటించనివారు మార్గదర్శకుడైన శివుని అనుగ్రహము పొందక చచ్చుదురే!! కాలుని (యముడు) కోపమునకు బలియై నరకములో పడుదురు.

267. లోకము కష్టసుఖములను రెంటిని కలిగియున్నదే. వారివారి పూర్వజన్మపు సత్కర్మలు, దుష్కర్మల ఫలితమే ఈ రెండును. ధర్మము వలన సుఖము ఏర్పడునని తెలుసుకొనియు ఇచ్చుటకు ముందుకురాని అజ్ఞాన మనస్కులు ధర్మమును పూర్తిగా ఎరుగనివారే అగుదురు.

268. చెడిపోవుట, బాగుపడుట రెండును ఈశ్వర అనుగ్రహము వలనే జరుగును. ధర్మము కాని చేష్టలు చేసి సుఖము పొందుటకు అనుమతించడు. కావున అర్హత ఉన్నవారికి సహాయపడుటయు, అర్హత లేనివారికి ఇవ్వకుండుటయు సరియే. కాని ఇతరుల సుఖము చెడునట్లు నడుచుకొనుట మృగతత్త్వమగును.
(చెడు చేయుట మానవ ధర్మమునకు చేటు.)

269. అశాశ్వతమైన సంపదను చూచి, వారికి, వీరికి జీవితములు బాగుపడి పోయినవని తలంచక, గొప్పలు, గర్వము చెందక, అక్షరమైన (క్షరము కాని) సంపదయైన ముక్తిని నొసగు ఈశ్వరుని తలంచి స్తుతించండి. విలుకాడు వదిలిన బాణము ఎట్లు లక్ష్యము ఛేధించుచున్నదో, అట్లు మీ దారిద్ర్యము పోగొట్టి శాశ్వతానందము ఈశుడే ఇచ్చునే!!

## 18. ప్రేమతత్త్వము

270. తెలివిలేనివారు శక్తిని ప్రేమగాను, శివుని జ్ఞానముగాను భావింతురు. ప్రేమకు పరాకాష్ట శివం అని, అదే జ్ఞానముగా మారునని అందరూ గ్రహింపజాలరు. ప్రేమ ఒక్కటే శివుని ఎరుగునట్లు చేయునని గ్రహించిన పిదప, ప్రేమే శివరూపమని, శివం ఆనందతత్త్వమని అనుభవపూర్వకముగా గ్రహించుదురు.
(ప్రేమ ఒక్కటే శివుని సృజించగలదు. శివుడే మంగళము.)

271. బంగారుఛాయకన్నా, పులిచర్మపు పసుపు వర్ణములో వెలుగొందువాడు, మెఱుపుకన్నా ప్రకాశమైన తెల్లటి వర్ణముతో నొప్పారు నెలవంక ప్రకాశముతో నెలకొన్నవాడైన శివునితో కలిసియున్నది నా ఉత్కృష్టమైన ప్రేమయే కదా!!

272. ఎముకలను ఇంధనముగాను, మాంసమును కోసి నిప్పులో వేసి బంగారము కరిగించినట్లు కరిగించిననూ, ప్రేమతో స్తుతించినవారు తప్ప నావంటివారు దైవత్వము పొందజాలరు.
(శివుని ప్రేమతో ఆరాధించవలెననియు, ప్రేమే అతి శ్రేష్టమని చెప్పుట.)

273. పరమాత్మను పొందగోరి ప్రయత్నము, ఆర్తి, ప్రేమ గలిగినవారు శివుని పొందగలరు. ప్రేమ, దయ గలవారు శివపాదములు చేరగలరు. సంసారమను భారము మోయువారు జనన, మరణమను చక్రములో చిక్కుకొందురు. ప్రేమలేనివారు దుఃఖమను అడవిలో చిక్కుకొని అవస్థలు పడుదురు.

274. ఎన్నెన్నో చెప్పి ఏమి ప్రయోజనము? ప్రేమతో మనస్సును కరిగించి ఈశ్వరుని స్తుతించి ప్రార్థించండి. శ్రేష్టమైన ప్రేమతో దేవాదిదేవుని దరిచేరండి. అట్లు చేసిన నాకు నా గురుదేవుడు (నందీశ్వరుడు) బంధమునుండి విడిపించి, తన కరుణనను నాయెడ చూపునట్లు చేసెను.
(ప్రేమ ఆర్తితో కొలిచినచో ఈశ్వరుని అనుగ్రహం పొందగలము.)

275. శివుడు అద్వైతం, ఏకంగా **స్వయంభు**గా నెలకొన్నవాడని తలంచి ఆరాధించి, శివుని ఆకాశములో నొప్పారువానిగా స్తుతించుటచే, మీకు తోడుగా వచ్చి నిలబడి, ఆదుకొనును. తేనెవంటి సుఖమును ఇచ్చు ఉమాదేవిని ఒక్క ప్రక్క నిలుపుకొన్నవాడై బంగారపు ఛాయ మహాప్రకాశములో నెలకొన్నవాడును, తానే ఒక ప్రకాశముగా ఒప్పారువాడును అయిన శివుడు నా ప్రేమవలలో చిక్కుకొన్నాడే!!
(ఆకాశతత్త్వంలో శివతాండవమాడు **నటరాజు**గా పేరుగాంచెను.)

276. జగత్తుని సృష్టించి, అందులో అన్ని సుఖములను పొందుపరచినది ఆ పరమేశ్వరుడు. అన్ని జీవరాశులందు ప్రేమను నింపి వాటికి నాయకుడైన ఆ పరమేశ్వరుని తెలుసుకోలేకయున్నారు. సర్వశక్తివంతుడైన ఈశ్వరుడు ఈ

బ్రహ్మాండములో ప్రేమను, సుఖములను నింపి తానే అఖండ జగత్తుగా నున్నాడే!!

277. చిత్తములో పదిలమైయున్న బంగారుఛాయ వంటి ప్రకాశముతో ప్రజ్వలించుచున్న జ్యోతిస్వరూపుని తలంచి, ఆహ్వానించి, ప్రతిష్టించి **నాయకుడు**న్ని స్తుతించి, హృదయములో ప్రేమను నింపుకొని ఎవరు అనుగ్రహము కోరినను దేవాదిదేవుడైన ఆ మహామహుడు (శివుడు) తన శివప్రకాశమును వారిలో ప్రకాశింపజేయునే!!

278. జీవరాశులలో వారివారి విధిప్రకారము, దినచర్య, జనన, మరణములను ఏర్పరచునది, విధివశమున చిక్కుకొన్నది, ప్రజలు ఎరిగియున్ననూ లౌకిక భోగములపై ఇచ్ఛ కలిగియున్నారే కాని మహామహుని తలంచి శివుని దరి చేరుటలేదు కదా!!

(లౌకిక భోగవిషయ వాంఛలను విడనాడి ఈశ్వరధ్యాసతో ఆత్మజ్ఞానము పొందగోరవలెను.)

279. ప్రేమమూర్తులలో శివుడు నెలకొనియుండును. అట్లే బాహ్యముగా నెలకొని యున్నవాడు అతనే. ప్రేమను శరీరముగా పొందియున్నవాడు. జగత్తు సృష్టికి ముందున్నవాడు అతనే. మునులు, ఋషులకు అతనే ప్రాణము. అతని వద్ద ఎవరు ప్రేమ కనబరిచెదరో వారియందు నెలకొనియుండును. ప్రేమ మార్గమనుసరించువారికి తోడై వచ్చునే!!

## 19. ప్రేమ సలుపువారిని శివుడెరుగు

280. జీవులు స్వాభిమాన ప్రేమను, అహంనందు సత్యమైన ప్రేమను గలిగి యుండుట దైవమెరుగును. శ్రేష్టుడైన ఆ నాయకుడు (ఈశుడు) వాటికి తగ్గట్టు అనుగ్రహించును. చల్లటి లేత చిగురాకుల వలె చిగురించిన ప్రేమ సలుపువారిని సంతోషించి, ప్రేమ సలిపినందుకు తగ్గట్టు అనుగ్రహమొసగునే!!

281. ప్రజలు మహదానందము పొందుటకు జన్మతగా కొన్ని సాధ్యములను ఏర్పరచి ఇచ్చిన ఆ దైవము, దుఃఖము నిండిన ఈ జన్మలో ఏ కర్మలు చేసిననూ, అవి ప్రేమ స్వరూపుని కృపయను ధ్యాసతో చేసినచో, ఆదినాధుడైన ఆ దైవము ప్రసాదించిన ఈ జన్మమును సార్ధకము చేయునే!!

(ఈశ్వర ప్రణిధానమను భావన దుఃఖములోనూ ఆది ప్రాణనాధుని యందు ప్రేమ సలిపినచో ఎటువంటి జన్మమైనను దైవకృప వలన జన్మ సార్ధకమగును.)

282. ప్రేమతో నిండిన చిత్తములో నెలకొనియున్న శివమను ప్రకాశము సుఖము నొసంగు వీక్షణముతో (దృష్టితో) భక్తుని చేరదీసి అనుగ్రహించి ఆదుకొనును. అట్లు చేరదీసి అనుగ్రహించినవానికి పంచేంద్రియముల చేష్టలు వీగిపోవును. అప్పుడు శుభకరమైన చిత్తముతో ఈశ్వరధ్యాసతో ప్రేమస్వరూపునితో దుఃఖ

కారణములన్నియూ వీగిపోయి నిలబడుదురే!!

283. మైథునంలో స్త్రీలతో పొందిన క్షణిక సుఖానుభోగములో పొందిన స్పర్శ అనుభూతికన్నా, శిరస్సున ఉదయించిన స్పర్శ అనుభూతియందు చిత్తముంచిన ధీరులకు ఉద్రేకముతో ఊగిసలాడు స్త్రీ స్పర్శ క్షణికానందము, సమమగునే? సమము కాదనుట.

(అష్టాంగయోగ అభ్యాసకులు (ధీరులు) ప్రాణతత్త్వమును మూలాధారము నుండి పైకి ప్రాకించి శిరస్సున గల సహస్రపటలము చేరుటలో గలిగిన పరమానందభరితము పొందుట ఇచ్చట చెప్పబడినది. శివానందమోదములో మునిగినవారికి స్పర్శలన్నియు ఏకమగునే!!)

284. ముందు మంత్రములో చెప్పినట్లు పరమానందములో మునిగియున్నవారిలో నెలకొనియున్న ప్రకాశస్వరూపుడైన పరమాత్మని, సిద్ధులు చేయువారెవరు పరిశోధనతో ఎరుగజాలరు. కాని భక్తితో శరణునొందు తన దాసులకు ముక్తినొసగుటలో తాను ముందు నిలుచుండునే!!

(సిద్ధులు చేసి జనులను ఆకర్షించుట శాస్త్రసమ్మతము కాదు. అది తపోశక్తిని వృథా చేయుటయే. పరమాత్మకు భక్తియే, ప్రేమే పరాకాష్ట.)

285. సువాసన వెదజల్లు పసుపు రేలచెట్టు పువ్వులు వంటి హిరణ్యవర్ణ ప్రకాశము వెదజల్లువానిని చూచితిని. నల్లటి మదపుటేనుగును చీల్చిచెండాడిన వాడిని చూచితిని. కమలమునందు (తామర) నెలకొన్నవాడిని చూచితిని. నా ప్రేమలో ఆతని దివ్యచరణములు నెలకొనియున్నది నేను చూచితిని.

(నల్లటి మదపుటేనుగును చీల్చి చంపి, ఏనుగు చర్మమును ధరించినవాడు – శివుడు – శివపురాణము. వెన్నెముక – షట్చక్రములో మొదటిదైన మూలాధార చక్రమునకు తామరపుష్పము ప్రతీక. ప్రేమతో శివుని పొందగలమని నొక్కి వక్కాణించుట.)

286. నమ్మికస్థుడు అన్నింటా తానైయున్నవాడు, ఊర్ధ్వలోక దేవతలచే స్తుతించబడు నాయకుడు, సుఖము, మంగళాకారుడు, జీవుల సుఖసంతోషాలలో నెలకొని యుండి సదా సంతోషించు ప్రేమ స్వరూపియైన దైవమును (శివుని) ఎవరూ గ్రహించకున్నారే!!

(ఆనందమయుడైన శివుడు మంగళస్వరూపి. శివ (మంగళం), శివతర (మరింత మంగళం), శివతమ (మహామంగళం) పేర్లున్నవాడు.)

287. నందీశ్వరుడు (శివుడు) సుఖమువలన కలిగిన పూర్వజనన, మరణము లేనివాడు (అనాది, అయోనిజః). జనన, మరణము లేనివానిగా గుర్తించిన జ్ఞానులు వానిని

నమస్కరించి **ప్రేమతో దైవమును పూజించి మేము ఆతనిని గ్రహించుయున్నాము** అని చెప్పిరి. అట్లు చెప్పిననూ లోకులు వానిని గ్రహించి జనన, మరణములను పోగొట్టలేకయున్నారే!!

(శివుడు జనన, మరణము లేని **స్వయంభువుడు**. శివానుగ్రహముతో పునః పునః జననములను పోగొట్టుకొనవచ్చును.)

288. రాత్రి, పగలు తనయందు ప్రేమ సలిపి స్తుతించువారిని ఈశ్వరుడెరుగును. కావున వాని అనుగ్రహ ప్రకాశము పొంది ఇతర ధ్యాసలు లేక, కర్మానుబంధము లేనివారికి దైవము అనుగ్రహించి వారియందు సదా ఎడబాటు లేక తోడైయుండునే!!

(శివుని నిర్విరామముగా ప్రేమతో కొలుచువారికి ఎల్లప్పుడు శివుడు పట్టువీడక తోడైయుండును.)

289. మహామహుడైన ఆ జ్యోతిస్వరూపునితో పట్టువిడుపులెందుకు? వానిని అంటి పెట్టుకొని, వానితోనే వెళ్ళుదును గాక!! అచ్చట ఎల్లలు లేని మహానందమును పొందెదను గాక!! నా ప్రాణముతో ప్రాణముగా కలిసిపోయిన ఈశుని యందు నేను మహదానందముతో కలిసిపోయి, జలకాలాట లాడుదును!!

(జ్యోతిస్వరూపునితో ప్రేమతో కలిసి, పట్టు సడలకుండుటయే మహానందమగును.)

## 20. విద్య

### (శివానుభవమొక్కటే విద్య)

290. శరీరము ఏర్పడిన విధము నేనెరుగుదును. ప్రాణము ఆ శరీరముతో చేరినది నేనెరుగుదును. దేవాదిదేవుడైన ఆ ఈశ్వరుడు ఎటువంటి ఆటంకములు లేక నా మనస్సును తన వశము చేసుకొని నాయందే నెలకొనెను. వివక్ష లేని, వికల్పము లేని అనుభవజ్ఞానమును పొందితిని.

(జన్మసార్థకమునకు ఈశ్వరానుభూతితో కూడిన అనుభవజ్ఞానమొక్కటే విద్య.)

291. సత్యమైన విద్య పొందినవారు ఆలోచించి చూచినచో, వారి స్పృహలో జ్ఞాననేత్రం నెలకొనియుండును. అట్లు వారు తెలుసుకొన్నది (సత్యజ్ఞానము) బాగుగా ఆలోచించి ఇతరులకు బోధించెదరు. రాతిస్తంభమువలె చలనము లేనివారికి కూడా బోధించి వారికి జ్ఞాననేత్రమును గ్రహింపజేయుదురు.

(నిజమైన విద్యావంతులు వారి జ్ఞానమును ఇతరులకు పంచుదురు.)

292. జన్మమెత్తినందుకు శరీరమునుండి ప్రాణము వీగిపోవుటకు ముందే, శరీరము అశాశ్వతమని యెరిగి, దృఢనిశ్చయముతో, శాశ్వతమైన ఈశ్వరజ్ఞానమును పొందుటకు ప్రయత్నించండి. మీ పాపములు తొలగిపోవును. నాదస్వరూపుని

(ఓంకార స్వరూపశివుడు) స్తుతించండి. అట్లు స్తుతించుటచే ఎల్లలు లేని, ఉపమానములు లేని, స్వయంజ్యోతి ప్రకాశుడైన శివుడు దర్శనమిచ్చునే!!
(ఓంకారనాద స్వరూపుని పొందుటకు మార్గము ఓంకార ఉచ్ఛారణతో ధ్యాన, జ్ఞానమార్గము లవలంభించవలెను.)

293. సత్యమైన ప్రణవజ్ఞానము లేక లౌకిక విద్యను అభ్యసించినవారు ప్రణవమును వీడి వేరే మార్గమున వెళ్ళుచున్నారు. బల్లి (ఉడుము) పట్టువలె వీడక ఉన్న లౌకిక బంధము వలన పాము (కుండలినీ) సామర్థ్యమును ఎరుగకయున్నారు. రాత్రి పగలనక నిర్విరామముగా దైవమును స్తుతించవలెను. రసవాది అపరంజని చేసి పొందినట్లు, కుండలినీ యోగము అక్షరమైన (క్షీణము లేని) ప్రణవశరీరమును పొందవచ్చునే!!
(బల్లిపట్టు: ఉడుము పట్టు గట్టిగా పట్టుకొనును. పాము: కుండలినీ యోగము చేయుటచే జీవశక్తి వెన్నెముకలో మధ్య సుషుమ్ననాడి ద్వారా పైకెగబాకుట. రసవాది అపరంజి – శుద్ధమైన జ్ఞానతత్త్వమని గ్రహించవలెను.)

294. భక్తితో దైవకార్యములు చేయువారికి శుద్ధమైన ప్రకాశము తోడైవచ్చును. శుద్ధ ప్రణవము (ఓంకారనాద ఉపాసన) వారికి తోడై మెలగును. శుద్ధ, సువాసన గంధము (శుక్రము) శరీరమును పుష్టిగా ఉంచి ప్రకాశముగా నిలబడును. శుద్ధ విద్య (ప్రణవముతో ఏర్పడిన ఆత్మజ్ఞానము) జన్మమంతటికి తోడుగా యుండి ముక్తికి దారిచూపును.

295. తాడు పట్టుకొని పైకెక్కి తాడు కొనను చేరుకోలేనివారు (వెన్నెముకలో గల సుషుమ్ననాడి ద్వారా పైకెగబ్రాకి శిరస్సున గల బ్రహ్మరంధ్రము చేరజాలనివారు), కామవికారమునకు లోనైనచో శివయోగఫలము పొందజాలరు. బెత్తము పట్టుకుంటే అన్ని పక్షులు ఎగిరిపోవునే!! (వెన్నెముక ద్వారా శిరస్సున గల సహస్రపటలము చేరినచో అన్ని ఇంద్రియచేష్టలు (పక్షులు) వీగిపోవునే!!) ఇది తెలుసుకోలేక నీచతత్త్వములలో కొట్టుమిట్టాడి, లౌకికమోహముతో శ్రేష్టమును గ్రహింపజాలకున్నారే!!

296. సుషుమ్ననాడి ద్వారా శిరస్సున గల సహస్రదళమును చేరిన వారికి శివుడు నాదస్వరూపుడుగా నొప్పారును. నాదమున నొప్పారు శివుడు పరిశుద్ధ ప్రకాశమును ప్రజ్వలింపచేయును. ఇట్లు వారికి చంద్రమండల అనుభూతిని పొందుటకు తగిన అర్హత, వారి శుద్ధమనస్సుతో కూడిన సుషుమ్ననాడియే (తాడు) నిచ్చెనగా మారును.
(ఆత్మజ్ఞాన విద్యను పొందినవారికి సుషుమ్ననాడియే నిచ్చెనగా మారి

చంద్రమండల అనుభూతియైన జ్యోతిప్రకాశములో నెలకొందురు.)

297. జన్మమను రోగమునకు ఔషదముగా ఉన్న జ్ఞానమార్గమును అవలంభించుటకు ముందు, లౌకికవిద్యతో విద్యావంతులైన వారిని అనుసరించిరి. కాని మహామహుడైన శివుడొక్కడే చిత్తమునందు పదిలమైన జన్మకర్మల వాసనలను సమూలముగా త్రెంచి తోడగువాడు. దైవస్వరూపము పొంది ఏడు లోకములకు వెళ్ళుటకు కూడా తనే తోడగునే!!

298. జీవితములో ఊతకర్రగా ఉండొక దైవము మనకు తోడుండవలెనని తలంచినచో, శ్రేష్టుడైన దేవాదిదేవుడైన శివుని స్తుతించండి. ఆదిదైవమైన శివుని అనుగ్రహము పొందినచో అన్నిటిని పొందినట్లే. ఉపాధినొనగు క్షుద్రదేవతలు అనుభవపూర్వకమైన యోగము సిద్ధించినవారికన్నా మెరుగైనవారో? (కారు, కాలేరు)

(అనాదియైన శివుని అనుగ్రహము ఒక్కటే మేలైనది.)

299. విశాలమైన సముద్రమును తనయందు ఇముడ్చుకొన్నవాడు, అట్లే మహా ఏత్తైన పర్వతమును గలవాడు, జగత్తులోగల పంచభూతములన్ని తన శరీరముగా గలవాడు, కొన్ని భూతములు నశించినపుడు (ఈశ్వరునిలో లయమగునపుడు) ప్రకాశస్వరూపుడై ఎడమప్రక్క నొప్పారువాడు, ఆతనిని (శివుని) నిర్విరామముగా తలంచి తమ చిత్తమునందే పదిలము చేసుకొన్న వారికి వారి హృదయములో జ్యోతిస్వరూపునిగా వెలిగి అనుగ్రహించును.

## 21. ప్రశ్న - స్వాంతనము

300. ధర్మము, నీతి నియమాలను విని, బ్రాహ్మణులు చెప్పు హితములను విని, పాపనిషిద్ధములు ఇవియని చెప్పు గ్రంథవాక్యములు విని, దేవతోపాసన మంత్రములను విని, అన్యమత గ్రంథములను కూడ విని, బంగారుఛాయతో (ప్రకాశించుచున్న) మహామహుడు శివుని తత్త్వములను విని పొందదగినదే శివగతి.

(అన్యమత గ్రంథములను పఠించుట వలన 6 ఆస్తికవాదము, 6 నాస్తిక వాదము, వాదోపవాదనలు, దర్శనముల వివరణలు తెలుసుకోగలము.)

301. అన్ని దేవతలకు నాయకుడైన దివ్యమంగళమూర్తియు, ప్రకాశరూపుడైన శివుని ఎవరు ఎరుగుదురు? ఆ దివ్యస్వరూపుని గ్రహించిన పిదప శివగ్రంథములను పఠించండి. పఠించిన పిదప సత్యఅర్థమును గ్రహించండి. పఠించినది, గ్రహించిన వాటితో స్వీయ అనుభవముపొంది సృజించండి. స్వానుభవముతో పొందిన సత్యజ్ఞానము గ్రహించినవారు, నిష్టతో కూడిన శివతత్త్వముతో నొప్పారి ఉన్నతులవుతారు.

(పఠించుట, శ్రవణము, మననం, స్వాధ్యాయము, నిదిధ్యాసనము, నిష్ఠ చేకూరుట ఇవియన్నియూ శివజ్ఞానము గలుగజేయును.)

302. మహేశ్వరుని కొలిచినచో మహావిష్ణువు సహాయపడును. శివునికి కార్యములు చేసినచో బ్రహ్మ దానికి తగ్గట్టు నడుచుకొనును. శివుని ఆజ్ఞను శిరసావహించి దేవతలందరు నడుచుకొందురు. శివుని ఆజ్ఞను శిరసావహించి చేసినచో, శివపాదపద్మములు మనకు నిరంతరము తోడగునే!!

303. మహోన్నతమైన నాయకుడు ఇతనే (శివుడు) అని స్తుతించి సత్యమైన, నిశ్చయమైన జ్ఞానము పొందిన మానవులు అనతికాలములో దేవతలగుదురు. మహాతపస్వియైన మా శివమహామహుడు మానవులుగా, దేవతలుగా ఎదిగి వచ్చి ఉన్నతస్థితిని చేరుకున్న తపోధనులను దిగివచ్చి అనుగ్రహించును.

304. మరణము, జననములను దైవము వారివారి విధిప్రకారము అనుగ్రహించినదే. ఇది గ్రహించి ఎటువంటి ప్రేలాపనలు చేయక ఆతనియందు భక్తి, ప్రేమ సలిపి యుండండి. వారు శివజ్యోతిగా ఉండి స్వాధిష్టానమైన పద్మమునందు శుక్ల సువాసనతో నిండి అనుగ్రహము నొసగుచున్నాడే!!

(వెన్నెముకలోని షట్చక్రములో రెండవదైన స్వాధిష్టాన చక్రములో శివుడు రుద్రజ్యోతిగా నెలకొని సృష్టి, లయము చేయుచున్నాడు. కామము, మోహము, బంధము, సృష్టికి పురికొల్పునది స్వాధిష్టానము.)

305. శివుని గొప్పతనము, దానిపై ఉదయించిన ప్రశ్నలు, ప్రశ్నలకు తగిన సమాధానములో ఉత్పన్నమైన జ్ఞాననిరతితో, మనస్సున ఆలోచించు కాలములో ఎటువంటి తడబాటు (శంకలు) లేక కృతనిశ్చయజ్ఞానముతో నున్నచో, దేవాదిదేవుడైన శివుడు ఎటువంటి లోటు లేకుండా దీర్ఘకాలమునకు తోడై అనుగ్రహించును.

306. లౌకిక బంధముతో ఉంచుకొని ఈశ్వరానుభవము గలుగునని భావించుట, చిన్నపిల్లలు ఇసుకతో ఇల్లుకట్టి, ఇసుకనే ఆహారముగా వండి భుజించుట వంటిది. చర్మచక్షువులతో అఖండవ్యాపియైన శివుని చూడజాలరు. తమ ఆత్మ స్వరూపమును కూడ చూడజాలరు.

(శివుని అఖండ వ్యాపకములో తమను గ్రహించువారే సత్యమైన అనుభవజ్ఞులు.)

307. శరీరమునకు తగిన తోడు ప్రాణము. ప్రాణమునకు తోడుగానున్నది జ్ఞానుల నుండి పొందిన జ్ఞానము. ఆ జ్ఞానము శివుని పాదపద్మములందుంచిన ధ్యాసయే సరైన తోడు. ఇటువంటి తగిన తోడువ వలన గలుగు ఫలశృతి జన్మరహితమగుటయే!!

308. స్తుతించి, పొగడబడిన బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు మొదలగువారి కంటే అనాదియైనవాడు, సనాతనుడు నా దైవము (శివుడు). తనను కించపరచి మాట్లాడువారికి దుఃఖహేతువు. అనాదియైన, ఆదిమూలమైన నాయకుని సంతోషముతో, వాని గొప్పతనమును గ్రహించక, స్తుతించక, వీడి నిలుచున్న వారికి వాడొక రాతితో చెక్కిన గోవువలె ఉపయోగపడజాలడు.

309. ఆత్మలందు తన (శివుడు) శక్తిని (చైతన్య) ఉంచి ప్రజ్వలింపజేయువాడు, ఆ శక్తితోనే మనస్సుతో జీవితములను చక్కదిద్ది అందు నెలకొన్నవాడు, వాని ఆకారము ఒకదానితో ఒకటి పోల్చజాలము. అట్లున్ననూ శరీరములోనున్న మనస్సు ఏదో ఒకకాలములో వ్యాకోలము చెందిననూ, ఆదియైన శివుని కోరి నిలుచువారికే వానివల్ల శుభములు గలుగును.
(శివుడు – సాకార, విశ్వాకార, నిరాకారములుగా మూడుగా ఉన్నవాడు.)

## 22. అవిద్య

### (శివానుభవము లేనిది అవిద్యయే)

310. ఆచార్యుల వద్దకు వెళ్ళి పద్ధతిగా విద్య నేర్వనివారు, చిరకాల తపస్సుతో చిత్తమున దైవదర్శనము చేసుకొన్నవారు, దైవకృప వలన అనుగ్రహము పొందిన వారగుదురు. ఇటువంటివారు (అనుభవమున్నవారు) లౌకికబంధము లేక శివునితో అనుబంధమేర్పరచుకొన్నవారు. పద్ధతిగా విద్య అభ్యసించిననూ కూడ స్వీయానుభవరహితులుగా ఉన్నచో అభ్యసించనివారి వలె శివానుభవమును పొందజాలరు.

311. శివానుగ్రహము పొందినవారు సత్యజ్ఞానమును నిశ్చయబుద్ధితో ఎరిగి ఆ ధర్మమునందే జీవించుదురు. శివానుగ్రహము పొందనివారు లోకములో ఎన్నో ధర్మమార్గములున్నవని చెప్పుదురు. కాని ఆ దైవమే అన్ని ధర్మములలో అంతర్లీనమైయున్నాడని లౌకికవిద్య అభ్యసించినవారు గ్రహించజాలరు.
(శివుడు సర్వాత్మకుడు, సర్వాంత్యరామియని తెలుసుకోవలెను.)

312. అశాశ్వతములను శాశ్వతములని తలంచి, శాశ్వతములేని శరీరమును శాశ్వతమని మనస్సున తలంచువాడా!! అన్ని జీవరాశులు దైవమే అను సత్యము వారి హృదయమున గ్రహించజాలకున్నారే!!
(లౌకిక బంధముతో ముడి వేసుకున్నవారిని శివుడనుగ్రహించడు.)

313. దైవధ్యాసలో నిలువలేదు కావున విధివశమున చిక్కుకొంటిని. శివునిలో లీనమగు యోగమును నేర్వలేదు. అజ్ఞానముతో మోహసంబంధమునకు అలవాటుపడితిని.

అన్నీ ఇవ్వగల దైవము, మహోమహుని ధ్యానించనైతిని. బాహ్యముగా లోకానుభవముతో తిరుగాడుతున్నానే!!

(రచయిత మహాయోగి, మహాసిద్ధుడు, తపస్వి. తనను ఒక సాధారణ వ్యక్తిగా చిత్రించుకొని లౌకిక, వ్యవహారబంధ బాధలను చెప్పుట.)

314. జీవుడు శరీరములో నిలబడక వీడిపోవునను సత్యమెరిగినవారు, శివానుగ్రహము పొందుటకు దాన, ధర్మ, ధ్యానమార్గములను అవలంబించి ధర్మమార్గమున జీవించుదురు. లోకములో శివానుగ్రహము పొందని నీచులు, తీవ్రమైన విధివిన్యాస, భోగ, దుఃఖములో మునిగిపోవుదురు.

315. ధరాకాశములో నెలకొనియున్న శివమను సత్యస్వరూపి, కళ్ళలో (సూర్య, చంద్రులుగా) అంతరదృష్టిగా ఇమిడియున్నాడు. లోకజీవితమును గొప్పగా భావించి అందులో లీనమైనవారు, వట్టి ఊహతో దైవతత్త్వమును పెక్కు విధములుగా వివరించి వ్రాసి వ్యర్థము చేయుచున్నారే!!

(జ్ఞానసాధనలో కంటిలోని వెలుగు (అంతరదృష్టి) మహాజ్యోతిని చూచిన అనుభవజ్ఞులు చెప్పునది సత్యజ్ఞానమగును. మిగతా వివరణలన్నియు వ్యర్థములే అగును.)

316. జ్ఞానసాధన సంపత్తి పొందినవారు తప్ప ఇతరులు శివమహిమను పొంద జాలరు. ఈ సాధన చేసినవారికి తప్ప ఇతరులకు దర్శనభాగ్యము ప్రాప్తించదు. జ్ఞానసాధనలో పొందిన అనుభవ సత్యార్థమును గ్రహించి ఒప్పారుదురు. ఈ విద్యను (జ్ఞానసాధన) గ్రహించివారే అసలైన విద్యావంతులు.

317. విద్యనేర్చి, అనుభవములేని మూఢులను చూడకూడదు. వారి మాటలను వినుట కూడ కర్తవ్యము కాజాలదు. అనుభవములేని మూఢులు కంటే అసలు అక్షరజ్ఞానము లేనివారే ఎంతో మంచివారు. (వారివల్ల ఎటువంటి ఉపద్రవము ఉండదు.) అనుభవలేమి ఈశ్వరజ్ఞానమును గ్రహింపజాలదు.

318. పెక్కు గ్రంథములను చదివి అనుభవజ్ఞానము లేని దుర్మార్గులు కీడు గలిగించు మమ్మలములను (గర్వము, కర్మవాసనలు, మాయ) విడువజాలరు. కీడును వదిలించుకోనివారు జ్ఞానులను సమీపించి సత్యమును గ్రహించుటకు ప్రయత్నించరు. కాని శివజ్ఞానము పొంది శివునియందు ప్రేమ సలుపువారే లెక్కలోనికి వచ్చుదురు.

319. అందరికి నాయకుడు, ఆది, పురాతనుడు (శివుడు) దేవతలకు కూడ పరంజ్యోతిగా వెలుగొందువాడు. ఆత్మజ్యోతి దర్శనము పొందిన జ్ఞానులకు కూడా దైవముగా ఉండువాడు శివుడు. ఆ మహోమహుని గురించి అన్ని తెలుసుకోగలమని

చెప్పుదురు కాని వారి లోపలే ఉండి, వారిని ఎట్లు నడిపించుచున్నాడని గ్రహింపజాలరే!!

(శివజ్ఞానము లేనివారు వారిలోనే అంతరజ్యోతిగా, అంతరాత్మగా ఉండి నడిపించు తీరును, సామర్థ్యమును ఎరుగజాలరే!!)

## 23. మధ్యస్థానము

320. శిరస్సున మధ్యస్థానమైన సహస్రదళమునందు ప్రకాశించుజ్యోతిని గ్రహించని వారికి జ్ఞానము సిద్ధించదు. మధ్యస్థమైన సహస్రదళజ్యోతిలో నొప్పారువారికి నరకము లేదు. అట్లు మధ్యస్థమున నిలుచువారు దైవరూపమును పొందుదురు. ఇట్లు ఈ సంప్రదాయములో మధ్యస్థమున ఉండు జ్ఞానుల విధానములో నేను అభ్యసించి నిలిచితిని.

321. సహస్రదళజ్యోతిలో నీలమేఘశ్యాముడైన విష్ణువు నిలిచెను. అందులో చతుర్వేదములను గ్రహించిన బ్రహ్మయున్నాడు. అందులో కొంతమంది గొప్ప జ్ఞానులు ఉన్నారు. మంచి నమ్మకస్థుడైన శివుడు కూడ అందులో నెలకొని యున్నాడు.

322. ఈ జన్మలోనే జ్ఞానులవవలసినవారు కొందరు శిరస్సున సహస్రదళమును సృజించి ఉండిరి. అట్లు సహస్రదళమున నిలచి ఒప్పారువారు దైవత్వము పొంది దేవతలైరి. అందులో కొందరు ఆ తత్త్వమును వీడి నిలబడిరి. నేను సహస్రదళమున జ్యోతి ప్రకాశమును సృజించి జ్ఞానుల సమూహముతో కలిసియుంటిని.

(దైవత్వము/దేవతలగుట: శివయోగమున అనుభవజ్ఞులైనవారు సహస్ర దళమున జ్యోతిస్వరూపమును దర్శించినవారు (జ్ఞానధీరులు), అధికారముతో కూడిన ఉన్నతస్థితి (పండిన)యైన అక్షర శివతత్త్వములో ఐక్యమైనవారు. అక్షర - క్షీణములేని తత్త్వము.)

323. జగత్తులో ఉత్పన్నమైన అన్నిటిని నాశనము (లయము) చేయగలవాడు శివ మహామహుడు. సహస్రదళమున వెలుగు జ్యోతిలో నెలకొని ఎప్పటికీ కృతజ్ఞుడుగా యున్నాడు. జ్ఞానులు శివుని పాదపద్మములను పొందవలెనని ఉద్దేశముతో ప్రయత్నించిరి. మరియు వారు శివుని దివ్యనామములను నిర్విరామముగా భజించి, యోగనిద్రలో మునిగియుండిరి (సమాధిస్థితి).

## 24. మద్యము సేవించకుండుట

324. పశువులకు శుభ్రమైన, హితమైన వరినీరు (బియ్యంనీరు) దాహమునకు ఇచ్చినచో, అవి దాహమునకు అల్లాడి, అశుభ్రమైన చెరువునీటిని త్రాగవు. వరినీరు

పుష్టినిచ్చునది, పశు శరీరమునకది నిలకడనైన ఆహారము. అట్లే జీవితమునకు, సంవృద్ధికి హితమైన నీరు శివానందబోధమను మద్యము. శివానందబోధమును సేవించక మూఢులు నిష్ప్రయోజకమైన మద్యమును (కల్లు) సేవించి నడత చెడుపుకుంటున్నారే!!

325. చిత్తమును శివునియందుంచి, శివసమాధి తత్త్వములో నెలకొని, శివానందమను శాశ్వతమైన మద్యమును శుద్ధస్థితితో తీసుకొనినచో, శివానందము మనల్ని వీడి వెల్లజాలదు. దీనిని వదిలి శివస్థితి లేకయున్న స్థితి తుచ్ఛస్థితియే అగును. (శివానందము ఒక్కటే పరమానంద స్థితిని ఇవ్వగలదు.)

326. కామము, కల్లు అధములే వాడుదురు. అహంకార మలము ఆధ్యాత్మికతను ఎరుగదు. మత్తును కల్పించి, చెడిపోవు బుద్ధిని కల్పించును. కాని ఉన్నతులకు శివమహామహుని పాదపద్మములందు పొందువలన గలిగినది ఓంకార మయమైన (ప్రణవ) శివానందమను తేనె అగును.

327. శక్తిని (దేవీపూజలు చేయువారు) సంతృప్తిపరచు ఉద్దేశముతో తాము మద్యం త్రాగి చెడుదురు. కాముకులు కామమను కల్లు త్రాగి దుఃఖించెదరు. మహాదేవా! అన్ని హోమములు చేయువారు శిరస్సున నున్న సహస్రదళ జ్యోతిలో నెలకొని, సృజించి, ఆనందములో నుందురు. శివనామ మహిమతో నున్నవారు శివునిలోనే ఏకమై సుఖమును, అమృతత్త్వము పొందుదురు.

328. వేద (ఆగమ) శాస్త్రములు పఠించి సత్యమును గ్రహించనివారు జీవఈశ్వర బంధమును ఎరుగరు. తాను కోరినవన్ని ఇచ్చి అనుగ్రహించు శివమహామహుని అనుగ్రహము తోడు పెట్టుకొని జీవించజాలరు. తేటనైన సత్యమైన శివయోగమునందు నిలువజాలరు. బాహ్యముగా దొరుకు నీటికల్లును (మద్యం) ద్రావి సత్యమును తెలుసుకోలేని వారగుదురు.

329. మోహము, మత్తు గలిగించు, మతపరమైన కీడుచేష్టలు చేయు మూర్ఖులు, మతము పేరుతో మద్యమును సేవింతురు. ఇటువంటి మహామూఢులు మంచిదారిన నడువజాలరు. మత్తును గలిగించు మహామాయ కూడ మాయాతత్త్వమునకు స్థానమే అగును. మత్తు నుంచి విడిపోయినను **వామాచార** మార్గము మత్తును మరల కోరునే తప్ప శాశ్వతమైన శివానందమును ఇవ్వజాలదు.

(మత్తుతో స్పృహ కోల్పోవుస్థితిలో దైవము ఆనందమయం ఇచ్చునట్లు కన్పించునది కూడ ఒక విధమైన మాయాక్రీడయే. దీనిని కొందరు సిద్ధాంతులు (వామాచారులు) సమర్థించిరి. కాని ఇది మాయాసంబంధమైన అవస్థయే తప్ప, నిత్యానందమునిచ్చు శివతత్త్వము కాజాలదు.) (వామాచారులు శాక్తేయులు – శక్తిపూజ చేయువారు.)

330. సేవించినవారికి మత్తునిచ్చి, మరణించినవారిని తలుస్తూ దుఃఖపడునట్లు చేయునది కల్లు (మద్యం). సత్యమును మరిపించును. మత్తు కామసుఖము కోరునట్లు పురికొల్పును. ఇట్లు మధ్యమును సేవించువారు జ్ఞానము గురించి యోచింపరు. ఇటువంటివారికి శివానందయోగము దొరుకునా? (దొరకదు.)

331. రాత్రి పగలను బేధము వీడి తనను మరచి జాగ్రదావస్థకు అతీతముగా ఉండి, వేరెందున చిత్తములేక శివానందమను తేనెను లోకులు సేవించజాలరు. రాత్రి పగలు లేని శివపాదపద్మములందుండి రాత్రిపగలను అశుద్ధమాయ, శుద్ధ మాయలను రెంటిని నేను వీడియుంటిని.
(శివానందమను తేనెను గ్రహించిన యెడల రాత్రి పగలు లేని **తుర్యాతీత** ఆనందస్థితిలో ఉండనగును.)

332. శక్తిని ఉపాసించి సిద్ధులు పొందగోరువారు శాక్తమతస్థులు (శక్తిని కొలుచువారు) మద్యమును సేవించువారు. (వామదేవులు - వామాచారులు అని పెక్కు నామములతో పిలువబడిరి.) మద్యము సేవించి మత్తులో తన్ను మరచి ఉండుట వలన తమ బుద్ధిని కోల్పోయి చెడుదురు. శక్తి అని చెప్పునది కూడ శివజ్ఞానమును సృజించి అందు నెలకొని సత్యజ్ఞానాందమును పొందునదే!!
(శాశ్వతమైన సకలజ్ఞానమును, మహానందమును ఇచ్చునదే శివజ్ఞానమగును. ఇది మద్యం సేవించుటచే పొందజాలము.)

333. మహామహుని శివుని అనుగ్రహము పొందినచో, శక్తి అనుగ్రహము కూడ పొందనగును. అట్లే తల్లి పరాశక్తి అనుగ్రహము పొందినచో తండ్రి శివుని అనుగ్రహము తనంతట అదే గిట్టును. పరాశక్తిని, శివుని చిత్తమునందు నిలిపి ధ్యానించువారు కచ్చితముగా అష్టమాసిద్ధులను పొందగలరే!! (అర్థనారీశ్వర తత్త్వమును తెలుపునది.)
(అష్టమహాసిద్ధులు: 1. అణిమా (సూక్ష్మీకరణం), 2. మహిమా (వ్యాపింప జేయుట), 3. గరిమా (బరువెక్కుట), 4. లఘిమా (బరువు తగ్గి తేలికగుట), 5. ప్రాప్తి (తలంచినది పొందుట), 6. ప్రాకామ్యము (పరకాయ ప్రవేశము - దీని మూలముగానే రచయిత కైలాససిద్ధుడు చనిపోయిన గోవుల కాపరి యైన **మూలన్** శరీరములో ప్రవేశించి ఈ గ్రంథరాజము **తిరుమంత్రము**ను తమిళభాషలో వ్రాయడమైనది), 7. ఈశత్వము (అతి ఉన్నతస్థితి–ఈశ్వరః), 8. వశిత్వము (వశీకరణము). ఇవి ఎనిమిది సిద్ధులు.)

334. శివానందమను తేనె, ముప్పది ఆరు తత్త్వములతో కూడిన ఈ శరీరమును అతీతముగా దాటించి, తత్త్వములు తానే అను అల్పజ్ఞానమును పోగొట్టి

శివమయమై, అజ్ఞానమును పోగొట్టి, సత్యమైన శివభోగమందుంచి, సృష్టించిన జగత్తులోని కర్మలను పోగొట్టి, మేలైన పరమానందస్థితిని (శివానందము) పొందునట్లు చేయునే!!

(శివానందబోధము లౌకికకర్మలు, వాటి ఫలితములను పోగొట్టి, శరీరపు అల్పజ్ఞానమునుండి విడిపించి, శాశ్వతానందమైన పరమానంద స్థితిని కల్గించును.)

335. శివయోగులు ప్రాణశక్తిని వశపరుచుకొని చంద్రమండలములోని శివానందమను జ్ఞానామృతమును సేవించుదురు. అష్టమహాసిద్ధులను పొందగోరువారు కల్లును త్రాగి మూఢులుగా మారి మోహముతో పురికొల్పబడిన బంధముతో చిక్కుకొని బుద్ధిని కోల్పోవుదురు.

(ప్రాణశక్తి వశపరుచుకొనుట: మూలవాయువు (మూలాధార చక్రము నుండి) క్రిందికి ప్రాకివెళ్ళి పోకుండా ధ్యానసాధనతో వెన్నెముక ద్వారా శిరస్సున సహస్రదళపటలము స్థానమునకు (చంద్రమండలము) చేర్చవలెను. కుండిలినీ యోగసాధకులు ఇడ, పింగళ, సుషుమ్న నాడుల్లోని జీవశక్తిని శ్వాసాభ్యాసము ద్వారా చైతన్యపరచి వెన్నెముకలోని షట్చక్రములలో పైకి ఎగబాకించి జీవశక్తిని శిరస్సుకు చేర్చవలెను. వీటి వివరణ మున్ముందు అధ్యాయములలో చూడగలరు.)

336. మరణమును కూడ మార్చునదైన అంతర్జ్యోతి ప్రకాశమును పొంది అనుభవించకుండిరి. శివగురునాధుని దివ్యచరణములందు చిత్తమును నిలుపలేదు. సమాధిస్థితి (ధ్యాన ఉచ్ఛస్థితి)లో శివజ్యోతిలో ఉండి రమింప కుండిరి. అనుగ్రహమిచ్చునది, ఆనందము నొసగునదైన అంతర్‌చక్షువుల జ్యోతిని పట్టుకొని ప్రాణశక్తి వెళ్ళుదారిని (సుషుమ్ననాడి) గ్రహించవలెను.

(ధ్యానయోగులు అంతర్‌చక్షువులలో కనిపించు జ్ఞానజ్యోతిని దర్శించినచో శిరస్సుకు శ్వాస వెళ్ళుట, వచ్చుట చూడనగును. ఆ జ్యోతియందే నెలకొని యుండినచో శ్వాస బంధనము ఏర్పడును. సమాధిస్థితి సిద్ధించును.)

ఈ అంతర్‌చక్షువులతో చూచు జ్యోతినే ఇచ్చట చంద్రమండలములోని శివానందమని పేర్కొనబడినది. జన్మపరమార్థము కావలెనన్న సత్ప్రవర్తనతో శ్రోత్రియ బ్రహ్మనిష్ఠయైన సద్గురువు దరిచేరి యోగమార్గము అనుష్టించి, అనుభవజ్ఞుడై, సత్య ఆత్మజ్ఞానమును పొంది, శివానందమను శాశ్వతమగు అమృతము పొందుటయే ఈ మొదటి తంత్రము వివరణ.

మొదటి తంత్రము సమాప్తము

ఓం తత్సత్ – సర్వం శివార్పణమస్తు

# రెండవ తంత్రము

## 1. అంతర్వాణి

అంతర్+వాణి=అంతర్వాణి. శరీరమున నెలకొనియున్న నాదము. వాణి అనగా వాక్కు, శబ్దము, నాదము, డప్పు, వీణ మొదలగునవి. వాక్కును అగ్ని అని ఉపనిషత్తులో పేర్కొనబడినది. ఆ అగ్ని శరీరమును ఆదుకొనియున్నది. జీర్ణక్రియను సక్రమపరచుచున్నది. ఈ అగ్నిస్వరూపము నాదమగును.

337. అన్ని జీవరాశులకు మహానాయకుడా! ఈశ్వరా! ఈ లోకములో జీవించు జీవులు భ్రూమధ్య (సుషుమ్న) మార్గమందు నిలువక, లౌకిక ముఖముగా అధమమార్గము నెంచుకొని ప్రాణశక్తిని కోల్పోవుచున్నారే!! (అని రచయిత వాపోవుట) సర్వేశ్వరుడు ఆ ప్రాణశక్తిని **మధ్యస్థమున (సుషుమ్న) నొప్పారు నాదమే! నీవు త్వరగా వెళ్ళి జీవుల శిరస్సు పూర్వభాగమున నిలబడి జీవులను కాపాడుదువు గాక!!** అని ఆజ్ఞాపించెను.

(ఇది అగస్త్య మహామునికి శివుడు ఆజ్ఞాపించినట్లు పురాణంలో చెప్పబడియున్నది. జీవులు సుషుమ్న నాడి (మధ్యనాడి) మార్గముననుసరించి భ్రూమధ్యము ద్వారా శిరస్సున ఊర్ధ్వముగా వెళ్ళి నెలకొనవలెను.)

338. అగ్నితత్త్వ స్వరూపమైన నాదమును శిరస్సు ముందుభాగమున ఒప్పారునట్లు చేయు సామర్థ్యమెరిగిన సాధకుడు అగస్త్య మహాముని; దానిని శిరస్సు వెనుక భాగమునకు ప్రాకునట్లు చేయుటచే, అది శిరస్సు ఎడమ భాగమునకు వ్యాపించి తపస్విగా నొప్పారి, మరలా శిరస్సు అంతటా వ్యాపన పొంది మహా ప్రకాశమవలె ప్రకాశించునే!!

(యోగసాధకునకు మూలాధారమునందు ఉత్పత్తియైన అగ్నితత్త్వము నాదముగా మారి సాధకుని శిరస్సున వెనుక భాగమునకు చేరి పిదప ఎడమ వైపుగా వ్యాపించి, పిదప శిరస్సు అంతట వ్యాపించి బోర్లాపడియున్న సహస్ర దళమును నిటారుగా నిలబడునట్లు చేసి మహాప్రకాశవంతముగా మారి ఒప్పారును.)

## 2. అష్ట వీరస్థలములు

శివుని వీరత్వమును తెలియజేయు అష్ట స్థలములను శివపురాణమందు చెప్పబడినవి. అవి: 1. తిరువదిగై, 2. తిరుకడవూర్, 3. తిరుకొరుగై, 4. తిరువయువూర్, 5. తిరుకోవళూర్, 6. తిరుపఱ్రిళూర్, 7. తిరుకండియూర్, 8. తిరువిర్కుది. ఈ స్థలములందు జరిగిన పురాణ వీరగాథలను రచయిత తత్త్వ దర్శనములుగా

వివరించియున్నారు. (తిరు=మంగళం, శుభం, దివ్య. ఉదా: తిరుపతి, తిరుమల)

339. జీవులయొక్క భావనలోనున్న **అంతఃకుడు** (రాక్షసుని పేరు) అజ్ఞానమను రాక్షసుడు, ఊర్ధ్వలోకవాసులందరిని (దేవతలు) తన తపోశక్తిచే పొందిన వరములతో హింసించుట వలన, దేవతలందరు ఈశ్వరుని వద్దకు వెళ్ళి వేడుకొనగా, ఈశ్వరుడు తన ప్రజల్వించుచున్న జ్ఞానమను శూలము చేతబూని ఆ అజ్ఞానమను అసురుని (రాక్షసుని) వధించి ఊరట కల్పించెను.

(అంతకుడు బాహ్యముగా లేడు. జీవుల ప్రతియొక్కరి భావనలో అజ్ఞాన ప్రవృతియే అసురుడు. జీవుల వెన్నెముకలో, ఊర్ధ్వముగా శిరస్సున గల చివరిదైన వెన్నుపూసకు సమీపమున గల చిన్న మెదడుకు, పెద్ద మెదడుకు మధ్యనున్న భాగములో నాదరాపిడి వలన గలుగు తరంగ చలనములచే ఉత్పత్తియైన సోమాగ్ని, సూర్యాగ్ని, ఆత్మ ప్రకాశమను మూడు ప్రకాశముల ద్వారా అజ్ఞానమును నివృత్తి చేయగలగిన **శివప్రకాశమ**ని రచయిత యోగ పరిభాషలో చెప్పియున్నారు. ఈశ్వరుడు అజ్ఞానమగు అంతఃకరణమును జ్ఞానము అనే శూలముచే నశింపజేయును.)

340. స్వాధిష్ఠాన చక్రములో శుక్రమును నాశనము చేయుచున్న చతుర్ముఖ బ్రహ్మను, శుక్రక్షయం నొందనీయక అడ్డుకొన్న ఈశుడు అగ్నికార్యములకు జీవుని శుక్రము జయము పొందునట్లు జేసి, అదే సమయమున జగత్సృష్టికి బ్రహ్మ ముఖ్యమని తలంచి, వాని చేష్టలను తొలగించి జగత్తుకి సుఖమును అనుగ్రహించెను.

(రచయిత కొన్ని విషయములను యోగపరిభాషలో చెప్పియున్నారు. ఈశ్వరుడు జీవుల సుఖము కోరి, పరిపక్వమొందిన జీవులను బ్రహ్మ అధీనము నుండి విడిపించి వారి శుక్రము జయము పొందునట్లు చేసెను. జయము పొందునది అనగా - యోగసాధనలో స్వాధిష్ఠానము సృష్టికి ఆధారము. దాని అధిదేవత చతుర్ముఖబ్రహ్మ. అందు ఉత్పత్తి అగునది శుక్రము, శ్రోణితములు. శుక్రక్షయము కాకుండా అడ్డుకొని దానిని యోగసాధన కొరకు ఊర్ధ్వముగా వెన్నెముకలో ఒక్కొక్క స్థానములకు పైకి ప్రాకునట్లు చేసి ఉష్ణశక్తిగా మార్చు సాధనలలో జయము పొందునట్లు చేసి అనుగ్రహించెను.)

341. అన్నింటా వ్యాపించి, అఖండ లోకములకు ఆధారభూతముగా నుండి అన్నియూ వానియందు లయమగు స్థానమైన ఈశ్వరుని పాదపద్మములను ఎరిగిన దేవతలు, పరిపక్వమొందిన జీవులు, లౌకిక భోగములను అనుభవించు కాలమున బ్రహ్మచేష్టలు చెడునట్లు చేసి, మణిపూర్వక స్థానమున నుండి కామాకర్షణను పురికొల్పుచున్న నారాయణుని నిరోధించి, ఈశ్వరుడు జీవులను అనుగ్రహించెను.

(మణిపూర్వక స్థానము వెన్నెముకలోని షట్చక్రములలో మూడవది. దీని అధిదేవత నారాయణుడు. లౌకిక సుఖభోగములు, స్థితి ప్రదాత. యోగసాధనలో సుషుమ్నానాడి ద్వారా ఊర్ధ్వముగా శిరస్సునకు జీవశక్తి ప్రాకునపుడు క్రింద నున్న మణిపూరకములో, స్వాధిష్టానములో రక్తప్రసరణము తగ్గి జననాంగములను నిర్వీర్యమొందించి లౌకిక సుఖ, భోగములపై ఆకర్షణ, మనస్సు లేకుండా నిరోధించి, ఈశ్వరుడు జీవులను అనుగ్రహించెను.)

342. నా ప్రాణములో నెలకొని ఈ శరీరమునకు మహానాయకుడునైన, నాదతత్త్వములలో సదాశివమూర్తిగా నొప్పారు వానియందు జలమును ముఖముగా గల అపానుడైన జలంధరుడు అధోముఖుడునితో పోరు సలిపి, అట్లు అధోముఖమును నిరోధించి, యోగసాధనతో ఊర్ధ్వముగా ప్రాకునట్లు చేసి సహస్రదళముతో కలిసి ఆ పద్మమును వృత్తాకారముగా వికసించునట్లు చేసి యోగసాధక భక్తులను ఈశ్వరుడు అనుగ్రహించెను.

(నీటి ప్రదేశమునుండి అపానవాయువును (జలంధరుడు) యోగసాధకుడు దానిని బయటకు మళ్ళించక, వెళ్ళనీయక, నిరోధించి ఊర్ధ్వముగా శిరస్సున సహస్రదళ పద్మమునకు ప్రవహింపజేసి, ఆ పద్మమును వికసింపజేయుట ఒక యోగసాధన. యోనిముద్ర లేక షణ్ముఖి ముద్రలు సంప్రదాయ జ్ఞాన సాధకులకు చెప్పబడినది. వీటిని సాధకుడు గురుముఖమున నేర్వవలెను.)

343. గంగను ధరించిన, ఎర్రనైన జటలున్న, ఆదిపురాతనుడు, త్రిపురములను నశింపజేసిన వాడని అందురు కొందరు అజ్ఞానులు. ఆ ముప్పురములు (మూడు పురములు) అనునవి మూడు మలములగు మాయ/అజ్ఞానము, కామ్యము, కర్మలను నశింపజేయుటయే. ఇట్లు ఆ పురములను నాశనమొనర్చినది ఎవరైన గ్రహించగలరో?

(చిత్తములోని గర్వము, అహంకారము **నేను, నాది** అను భావన, కామ్య కర్మలు చిత్తములో పదిలమగునవి, అజ్ఞానము ఆవరించిన చిత్తము (మాయ యొక్క విక్షేపణలు, ఆవరణశక్తులు జ్ఞానమును మూసివేసినది) ఈ మూడింటి ప్రభావములను ఈశ్వరుడు నశింపజేసి భక్తులను అనుగ్రహించెను.)

344. మూడు అగ్నులను రగిలించి నాదమును బహిర్గతము చేయు అగ్నిహోత్రములు, ఏనుగువంటి నల్లనైన కారుచీకటిని ఛేదించిన ప్రకాశమే ఈశ్వరుడను సత్యమును గ్రహించగలిగిన వారెవరు? (ఎవరు గ్రహించలేదు) క్షుద్రగుణములను గలిగిన కొన్ని క్షుద్రదేవతలు ఆ అగ్నిప్రకాశములో శివుడు బహిర్గతమైనప్పుడు శివుడుని జూడజాలక నశించిపోయిరి.

(బాహ్యముగా ఉన్న మూడు అగ్నులను రగిలించి అగ్నిహోత్రములు చేయునట్లే, శరీర అంతర్గతముగా ఉన్న మూడు అగ్నులు (జఠరాగ్ని, కామాగ్ని, జ్ఞానాగ్ని) సద్వినియోగ, సంయమము పరచి శిరస్సునందు జ్ఞానజ్యోతి వెలిగించగలిగిన సాధకులకు మూడు ఏషణలు తొలగిపోవును.)

345. మూలాధార స్థానమునుండి సుషుమ్ననాడి ద్వారా ఊర్ధ్వముగా ప్రాకునట్లు చేసిన మూర్తిని, బ్రహ్మరంధ్రము ద్వారా ఊర్ధ్వదృష్టిని చూడగలిగిన వారికి, యముని తలదన్నగలిగనవారై, శరీరమను (తిరుకడవూర్) జగత్తుకు అతీతముగా శిరస్సున గల సహస్రదళమను ఊరిలో శాశ్వతముగా ఉండగలరు!!

(శాశ్వతముగా ఉండగలరనుట: యోగసాధనలో కుండలినీశక్తిని సహస్ర దళమునకు చేర్చినవారు, ధ్యాననిమగ్నులై సమాధిలో జీవన్ముక్తులై శాశ్వతానందము పొంది, మరణానంతరము విదేహముక్తులగుదురు.)

346. మనోనిగ్రహముతో మనస్సును శివునియందే నిలిపి, జననాంగముల ద్వారా సహజముగా క్రిందికి వెళ్ళునది నిరోధించి, కీడు జరగకుండునట్లు శుక్ర క్షయము నిలిపి, కాముని వలలో చిక్కక, అక్కడ భార్యాసమేతముగా నొప్పారినదే తిరుకొరుగ్గై ప్రదేశము. ఇదొక అద్భుతమైన యోగము. పరియంగ యోగమని పిలువబడినది.

(పరియంగ యోగము: శుక్రక్షయము కానీయక జీవశక్తిని ఊర్ధ్వముగా ఎగబ్రాకించి సహస్రదళపటలమునందు చేర్చునది. శుక్రము గట్టిపడి వజ్రము వలె తయారగును. యోగ ఉపనిషత్తు కూడ దీనిని సమర్ధించి యోగి శరీరమును మంచి సువాసన కలుగజేయునని చెప్పియున్నది. రసవాదులు దీనిని పాదరసమునకు పోల్చి కూడ వర్ణించియున్నారు. సిద్ధులు శుక్రము, ఓజస్ గాను, తేజశ్విగాను మార్చి శరీరమును శాశ్వతత్త్వముతో పుష్టిపరుచునని వ్యాఖ్యానించియున్నారు. కొందరు దీనిని **స్కంధము** అని కూడా చెప్పియున్నారు. ఈ యోగము నందు శుక్రము జయమునొంది కామము దహనమగును. శరీరమును శాశ్వతము చేయుటను సూక్ష్మముమైన నాదము ప్రధానమని చెప్పి అది శిరస్సున నెలకొని ఒప్పారునపుడు పశుపతి (ఈశ్వరుని) కృప పొంది ఆశలు, బంధములను వీడి శివానందతత్త్వము పొందదగును. ఈ యోగమును పరమేశ్వరుడు శక్తికి వివరించినట్లు రచయిత తన మంత్రముల ద్వారా తెలిపియున్నారు.)

## 3. లింగ పురాణము

**(లింగము సృష్టి, లయములకు కారణ అనుగ్రహ చిహ్నము. దాని పురాతనము)**

347. శివమహాముని పాదపద్మములను చేరి తీరుదునని శక్తి (పార్వతిదేవి) ఆతని దిక్కుగా, శరీరములో శిరస్సున వెలుగొందు శక్తిగా, (శిరస్సు ఎడమ భాగమున అమరియున్న శక్తిని) శివుని చేరవలెనను దృఢనిశ్చయముతో తపస్సును బూని, పద్ధతితో అర్చించి, స్తుతించి, పూజించెను.
(క్రియాశక్తియైన మూలాధారపు కుండలినీ శక్తియే శివశక్తిగా మారి శిరస్సున గల శివుని తలంచి పూజించెను.)

348. అన్నిటియందు తిరుగాడుచున్న ముమ్మలములను (అజ్ఞానము, కామ్యము, కర్మలు) నశింపజేసిన మహామహుడు (ఈశ్వరుడు) ఆశ్రయము పొందుటకు మహోన్నతుడనుటలో సంశయమునొంద అక్కరలేదు. ఆ సర్వేశ్వరుడు ప్రేమ సలుపువారికి మోసగించువాడు కాదు. వాడు తన్ను ప్రేమించు జీవులందరిని కరుణతో వారివారి అర్హత తగ్గట్లు అనుగ్రహించి ఆదుకొనునే!!

349. స్వాధిష్టానములో, మణిపూరకములో కొలువైయున్న చతుర్ముఖబ్రహ్మ, నారాయణుడు ఇరువురును, పద్ధతితో మూలాధారచక్రమును ప్రదక్షిణము చేయగా, అచ్చట కొలువైయున్న ప్రకాశముతో వెలుగొందు రుద్రమూర్తి నారాయణునకు సహస్రదళ చక్రములో వెలుగొందుటకు అనుగ్రహించి, బ్రహ్మకు ప్రకాశమును అనుగ్రహించి ఆదుకొనెను.

350. మొత్తము ఇరువది (గుణములు-10, కర్మేంద్రియములు-5, జ్ఞానేంద్రియములు-5) భుజములను దాల్చి విశాలమైన పర్వతమును తన స్వీయప్రయత్నముతో పైకెత్తిన పురుషుడైన రావణుడు, సాటిలేని తన ధీరత్వము వీగిపోయినపుడు, అచ్చటనే తన అల్పత్వమెరిగి **దేవాదిదేవా! కాపాడుము** అని కోరిన వెంటనే శాశ్వతమైన భక్తి గలుగుకాక అని శివ మహామహుడు అనుగ్రహించెనే!!

351. తనకు సంభవించబోవునది కారణ, కార్యత్వమెరిగిన ధీరుడు చండీశ్వరుడు, తెల్లనైన ప్రకాశము స్వీకరించి, పునర్జన్మను వీగిపోవునట్లు పంచ జ్ఞానేంద్రియములైన ఐదు పశువులను బాహ్యావిషయాదులపై మేయక నిరోధించి, మాయా కల్పితమైన శరీరము ఆ పరమాత్మను చేరుటకు మార్గమెంచుకుని, అగ్నితత్త్వమెరిగి, ఇడ, పింగళ నాడుల చేష్టలు నశింపజేసి శివదాసుడుగా మారెను. (ఇడ, పింగళనాడుల కార్యములు శరీరాంతర స్థితిగతులు తెలుపునది. అట్లు కాక సుషుమ్ననాడి ద్వారా క్రియ సలిపినవారికి తెల్లనైన ప్రకాశముతో నొప్పారి

సహస్రదళము నందు నెలకొని శివునకు ప్రీతిపాత్రులగుట. అది చండీశ్వరుని వృత్తాంతములోనిది. జీవుని స్పృహ సహస్రదళము దాటి వెళ్ళునప్పుడు శరీర స్పృహలు నశించిపోవును.)

352. ఏకీకృత మనస్సుతో దేవతలందరు గుమిగూడి శివుని వద్దకు పరుగెత్తుకొచ్చి, విచార వదనములతో శరణునొంది, సర్వేశ్వరా! అని స్తుతించి వేడుకొనిన, సాటిలేని మహోన్నతుడు శివమహామహుడు లేచి మీరందరు పైకి (శివ లోకమునకు) వచ్చి చేరండని ఆజ్ఞాపించి, అనుగ్రహించి ఆదుకొనెను.

## 4. దక్షుని యజ్ఞము

దక్షుని యజ్ఞము అని చెప్పబడునది – స్త్రీ, పురుష సంగమము. శివుని తలంచక చేయునది శుక్రక్షయము, ఫలితములివ్వని సంగమము – యజ్ఞము నాశనమగుటయే.

353. స్త్రీ, పురుష సంగమమను దక్షుని యాగము శివమహామహుని తలంచక చేయుటచే తాను కోపోద్రిక్తుడయ్యెను. కామాగ్నితో దహించబడి శుక్రక్షయము నొందుటచే, దేవతలు తలంచినట్లు పూజ సరైన ఫలితమొందలేదు. శివుని కోపోద్రేకము వలన దేవతల కార్యములన్నీ చెల్లాచెదురై, వారందరు యజ్ఞమును వీడిరి. (శివుననుగ్రహము లేకున్నచో శుక్రజయము పొందలేరు.)

354. స్త్రీ, పురుష సంగమము అగునట్లు పురికొల్పిన నారాయణుడు జగత్తునందు సృష్టించునది శివుడు కాదు. **నేనే అని** చెప్పి దంబము చాటిరి. దానివలన ప్రారబ్ధకర్మలతో కొట్టుమిట్టాడి బంధసముద్రములో పడి విచారించిన పిదప శివుని తలంచి ధ్యానించగా, అనంతమైన మహామహుడు (శివుడు) విష్ణుతత్త్వము ఉన్నతి పొందుగాక అని అనుగ్రహించెను.
(విష్ణుతత్త్వమే స్త్రీ, పురుషులలో ఇచ్ఛాశక్తిని పురికొల్పి సృష్టిని కల్పించుచున్నది. సంగమమే సృష్టికి మూలకారణము. కాని సంగమము రాజసము (రజోతత్త్వ జనితము) కాక సాత్వీకము (సత్త్వగుణ జనితం)గా మారినచో కామఇచ్ఛ ఈశ్వరప్రసాదముగా రక్షింపబడును.)

355. యజ్ఞాధిపతిగా బ్రహ్మ కామ్యకార్యమైన దక్షయజ్ఞమునకు తానే నాయకుడని తలంచెను. అట్లు కామాగ్ని పైకి లేచి ప్రజ్వలించినను దాని తత్త్వమెరిగిన శివుడు అందులోనే సమ్మిళతమై సక్రమముగా పేరుప్రతిష్ఠలుగా వెలుగొంది పరిపాలించుచున్నాడు.
(శివుడు అణువులలో పరమాణువుగా ఉండి, సృష్టిలో బ్రహ్మకు సహాయ పడుచున్నాడు.)

356. ఆ విధముగనే బ్రహ్మ, నారాయణుడు మొదలగు దేవతలు వారివారి తత్త్వములు పొందుటకు కారణభూతుడు శివుడే. అట్లు అగ్నితత్త్వమును అన్నింటిలో ఇమిడ్చి వెలుగొందు శివుడు అగ్నితత్త్వములో విడదీయరాని అనుబంధము గలిగి రక్షణగా ఉండి అన్ని జీవరాశలను పరిపాలించుచున్నాడు.
(బ్రహ్మాది దేవతలందరు శివప్రకాశత్వము గలిగియుండుట శివుని వలనే అని ఎరిగియున్న జీవులందరిని రక్షించి అనుగ్రహించును.)

357. దేవతలందరు చిదాకాశ నాయకుడైన శివమహామహుడే. అన్నింటా వ్యాపించి, ఏది విడిచిపెట్టక అన్నింటిలోను ఇమిడియున్నాడని తలంచి, స్తుతించగా, ఆరు ఆధారములోని (క్రిందనున్న) మూలాధారచక్రము నుండి అగ్నితత్త్వము (జీవశక్తి), సుషుమ్న ద్వారా శిరస్సుకు పంపి ఎర్రనైన, ఉన్నతమైన ప్రకాశముతో నిండిన సహస్రదళమును చేరినందువలన ఇదియే అత్యున్నతమైన ఆనందమార్గమని తలంచిన దేవతలను శివుడు పరిగెత్తుతూ వచ్చి అనుగ్రహించెనే!!

358. నారాయణుడు, బ్రహ్మ, దక్షుడు, సూర్యుడు, చంద్రుడు, సరస్వతి, అగ్ని, ఇంద్రుడు మొదలగువారు శిరస్సు, ముఖము, ముక్కు (నాసిక), చేయి, భుజములు మొదలగు అవయవములను శివ అనుగ్రహము లేక పోగొట్టుకొని పిదప అందరూ వాటిని పొంది, తుదకు మంచివారైరిరే!!

359. జపించదగిన మంత్రములను జపించి శివుననుగ్రహము పొందిన దేవతలు, వాక్కుతో పలుకలేని ప్రణవనాదము – ఓంకారముతో మూలాధారమునందు అగ్నితత్త్వమును పైకిలేపి, నాదము వెలువడునట్లు చేసి, అందు వారు నెలకొనినట్లు చేసి చూచునది, మనస్సును ఏకాగ్రతకు తోడ్పడునదైన ఇటువంటి మహామంత్రములు కీడుగలిగించునా ఏమి? (కలిగించదు)

360. మంచివారికి వారి నవద్వారముల గోళకములు సక్రమముగా క్రియ సల్పుటకు పలు దేవతలు శివుని సమీపించి అనుగ్రహించవలెనని వేడుకొనుటచే, క్రూరమైన రాక్షసులు నశించునట్లు ప్రణవము (ఓంకారనాదము) అను ధనస్సుతో అహంకారము మొదలగు ముమ్మలములను కాల్చివేసి అనుగ్రహించెను.
(నవద్వారములు: కన్ను, ముక్కు, చెవి, నోరు, మూత్ర పురీషాదులు సక్రమముగా పనిచేయుటకు శివుడు ముమ్మలములను అహంకారము, కామ్యము, కర్మలు) నశింపజేసి అనుగ్రహించెను.)

361. కోపించి, పిదప అనుగ్రహమును పొరించిన నాదస్వరూపి అగు ఓ పరమేశ్వరా! తన్ను తలంచక, కొలువక జరిపిన దక్షుని కామయజ్ఞమును నశింపజేసెను. కాని ప్రేమ సలిపి, వానిని స్తుతించినచో తప్పక అనుగ్రహించును. కావున

గ్రంథకర్తలు చింతించిననూ నీవు చింతించవద్దు.
(శివధ్యాసతో అహంకారాదులను వీడి, ప్రేమ సలిపి, యజ్ఞయాగాదులు చేసినచో శివ అనుగ్రహము తప్పక పొందనగును.)

## 5. ప్రళయము

**(ప్రళయము వినాశము, లయమునకు మూలకారకుడు శివుడేయగును)**

362. సృష్టి హద్దులను మూసివేసి, మణిపూరక చక్రములో నున్న జలమండలముతో బ్రహ్మ, నారాయణుడు ఒకరికొకరు సహకరించుకొనకుండినచో (సృష్టికి–బ్రహ్మ, స్థితికి–నారాయణుడు) మణిపూరక స్థానములో జ్ఞానమయమైన సూర్యుడు పైకి లేచి **శివసూర్యుడై** శిరస్సున కపాలమునందు నిలబడి ఇద్దరిని (బ్రహ్మను, నారాయణుని) అనుగ్రహించెను.
(పరమాత్ముడైన శివుడు ఒక్కడే జ్యోతిగా నిలబడి బ్రహ్మను, నారాయణుని అనుగ్రహించెను.)

363. శివుడు సముద్రప్రదేశమును (మణిపూరక స్థానమునుండి చీల్చుకొని పైకి వచ్చి, అండము యొక్క ఎల్లలు దాటి సకల తత్త్వములకు తానే) నాయకుడను పేరుప్రతిష్టలు పొందినవాడునై, జగత్తులోనున్న వారందరు కామాగ్నిలో పడిపోకుండా చూచి దుఃఖతరంగములలో కొట్టుమిట్టాడు ప్రపంచజీవితంలో మునిగిపోకుండా కాపాడి **భయపడకండీ** అని అభయము చెప్పి అనుగ్రహించెనే!!

364. శీతలముతో నిండిన మణిపూరక స్థానమను సముద్రమును దాటి జ్ఞానమయి అగు సూర్యుడుని అమరత్వమైన పితృదేవతులును, ప్రకాశమండల వాసులును, శిరస్సున అష్టదిక్కులలో సముద్రము వంటి ప్రకాశమయమైనది శివుడేయని కొలిచి స్తుతించుదురు. ఆకాశమును సముద్రమువలె చేసిన ఆ మహామహుడు అంతర్చక్షువులకు మహాప్రకాశ స్వరూపిగా దర్శనమిచ్చునది వారు ఎరుగజాలరు.
(ఆకాశమండలము దాటి మహాప్రకాశములో వెలుగొందు సదాశివుని దేవతలు ఎరుగజాలరు.)

365. అన్ని తత్త్వములను సృష్టించువాడును, తానే స్వయంభువైయున్నవాడిని, స్తుతించి, తమ చిత్తమునందు పదిలపరచుకొనుట అలవర్చుకొన్నవారు ఈ భూలోకవాసులే అగుదురు. సముద్ర అలల పొంగులో ఏర్పడు నాదము వలె, ఉన్నతముగా వ్యాపింపదగిన కామాగ్నిని హద్దు మీరకుండునట్లు ఆ స్వయంభుమూర్తియే అనుగ్రహించి అణచియుంచెను.
(ఊర్ధ్వమండల వాసులకు స్థూలశరీరములు లేవు. భూలోకవాసులే స్థూల శరీరము గలిగినవారై నందువలన స్వయంభుమూర్తిని పొందగలరు. కామాగ్నిని

సక్రమమార్గములో ఉపయోగించుట తెలిసినవారికి స్వయంభుమూర్తి (శివుడు) వారియందు నెలకొనును.)

366. సత్ధర్మ నడవడికను చెడుపునదైన కామలీలలకు లోనగునట్లు చర్యలు చేస్తున్న స్వాధిష్టాన చక్రములో నెలకొనియున్న బ్రహ్మను (శివునితో సఖ్యతను చెడుపునదైన) వెతికి వెళ్ళి, వాని ఊర్ధ్వముఖ శిరస్సు చిదాకాశమును నిందించకుండునట్లు చర్య తీసుకొని అనుగ్రహించెను.

(స్వాధిష్టానము సృష్టికి మూలకారకమైనది. శుక్ర క్షయము – శివుని స్నేహము చెడుపునది బ్రహ్మ. ఆ నింద మోపకుండా చూచి బ్రహ్మ యొక్క ఊర్ధ్వముఖ శిరస్సును ఖండించి, బ్రహ్మయొక్క చేష్టలను పరిపక్వమొనర్చెను.)

## 6. చక్రము పొందుట

367. మత్తును కలిగించునదైన (ఇహ సుఖములందు మోహపరవశుని చేయుట) ప్రజ్ఞలు విష్ణుతత్త్వములు. ఇచ్చట అవి పనిచేయకుండునట్లు చేసి, అందమైన సుషుమ్నానాడి ద్వారా మణిపూరక చక్రములోనున్న శక్తిని సహస్రదళ చక్రమునకు చేర్చినందున వెండిపర్వతమైన అమరావతి – తెల్లనైన మహా ప్రకాశమున వెలుగొందు దేవాదిదేవుడు భూమి మొదలగు ఏడు లోక సుఖములను సృష్టించి, వాటిని అనుగ్రహించుచున్నాడే!!

(ఇహసుఖవాసనలు ఇచ్చునది మణిపూరక స్థానదేవత విష్ణువు అనియు, పురుష తత్త్వములో నెలకొనువాడనియు, అదే మణిపూరకము నుండి సహస్ర దళము చేరినచో దానినే సదాశివమూర్తిగా పిలువబడును.)

368. చక్రము పొందిన దామోదరుడు, పొందిన చక్రమును భరించలేనివాడై, ఉన్నతుడైన శివమహామహుని ప్రేమతో కొలువగా శివుడు తన వ్యాపకశక్తిలో కొంత శక్తినిచ్చి భరించగలుగునట్లు చేసెను.

(సహస్రదళ పద్మము చేరిన శక్తికి లోకానుభవమున్నంత వరకు (బంధము) తగినశక్తి లేకుండును. కావున సహస్రదళ పద్మము తలక్రిందులగనే (బోర్లాపడి) యుండును. శివానుగ్రహముతో తగిన శక్తి అందుకొన్న పిదప అదే పద్మము ఊర్ధ్వముగా దిశమారి విరబూసి ప్రకాశముతో ఒప్పారును.)

369. విభజించి ఇచ్చుటకు అమర్చిన మేలైన చక్రమును నారాయణునికి ఒక భాగము ఇచ్చెను. అట్లే మరొక భాగము తన పత్నియైన శక్తికి (పార్వతి) భాగించి ఇచ్చెను. ఇట్లు నారాయణనికి, శక్తికి తన అనుగ్రహ వ్యాపకమును విభజించి ఇచ్చెను. (నారాయణుడు, శక్తి ఇద్దరూ శివమహామహుని అనుగ్రహము, శక్తిని పొందిన వారగుదురు.)

370. దక్షుని యాగమును చెల్లాచెదురు చేసిన వీరభద్రునిపై ఆ యజ్ఞమునకు ముఖ్య అతిథియైన నారాయణుడు తన ఆజ్ఞాచక్రమును వీరభద్రుని చంద్ర కిరణముపై వదలగా, వాయువేగము వలన ఆ అగ్నిశక్తి నిర్వీర్యమైనది.

(అన్ని పద్యములలో శివమహామహుడని పిలువబడినవాడు సాక్షాత్తూ పరమ శివుడు. దేవాదిదేవుడు, పరమాత్మ తత్త్వము. శివుడే ఆదిదేవుడు, పరమం, బ్రహ్మం, పరబ్రహ్మం అని పెక్కు నామములన్నియూ ఒక్కడివేనని ఎఱుగవలెను.)

## 7. ఎముకలు, కపాలము

(ఆకారమునకు, జ్ఞానమునకు ప్రతీకలు. బ్రహ్మ, విష్ణువుల ఎముకలను శివుడు ధరించియున్నాడన్న తత్త్వము.

371. ఎముకలు, కపాలములను ధరించి లేచిన శివుడు, కిరీటము, ఆభరణములు ధరించిన నారాయణుడు మొదలగు దేవతల యొక్క ఆకారమగు ఎముకలు, జ్ఞానమగు కపాలములను (తెలుపు–సూక్ష్మతత్త్వము) ధరించకుండయున్నచో, జన్మకు వచ్చు మనుజులకు పూర్వ ఆకారము, జ్ఞానము కొనసాగక పోవునే!!

(మనుజులు మరణించిననూ (స్థూలశరీరం) వారి జ్ఞానము, కర్మలు నాశనము కాక, వారి సూక్ష్మశరీరం, కారణ శరీరములో ఇమిడియుండును. ఈ కారణం శివునియందు కలదు. పునర్జన్మ ముందు అవి వచ్చిచేరును. సృష్టి, స్థితి, లయములగు కార్యములు, కారణముగా శివునియందు కలవు.)

## 8. పాదము, శిరస్సు వెతుకుట

శివుని పాదమును, శిరస్సును వెతుకుట – శివుడు అఖండజ్యోతి స్వరూపుడు. కావున గర్వముతోను, కాంక్షతోను శివుని పాదము, శిరస్సు చూడగోరిన బ్రహ్మ, విష్ణువులకు చూడశక్యము కాలేదను తత్త్వమును విశదీకరించునది.

372. బ్రహ్మ, విష్ణువులు ఇద్దరూ శివుని వ్యాపకము లోనికి కట్టుబడినవారైననూ, వారి అజ్ఞానము వలన వారిరువురూ తామే నాయకులమని అహంకరించుకొని, ఉన్నతుడైన శివుడు అఖండజ్యోతి బింబముగా వారి ముందే దర్శనమిచ్చిననూ, ఆ అఖండజ్యోతి శివప్రకాశపు పాదము, శిరస్సు అని గ్రహించక వెతకసాగిరి.

373. ఏడు లోకములలోనూ నిలిచి నొప్పారు మా నాయకుడు (శివుడు) తానే ఏడు లోకములలో అగ్నిరూపుడై వ్యాపించియున్నాడు. ఆకాశభూతములో ఏడు లోకముగా నెలకొన్న నీలకంఠుని, వాని పరిపాలనాదక్షతను వాని అనుగ్రహముతో నేనెరిగితిని.

374. శివమహామహుడు శరీరముగాను, ప్రాణముగాను, శరీరపు ప్రజ్ఞలుగాను (ఇంద్రియప్రజ్ఞలు), అగ్నిగాను, బ్రహ్మవిష్ణువులు తెలుసుకోలేని కాల, దూరపు వస్తువుగాను, ఆకాశమంతట వ్యాపించిన జ్యోతిస్వరూపుడుగాను, అండము లంతటికి ఆధారస్తంభముగాను, వాటిని భ్రమణము చేయించు సూర్యచంద్రులకు అతీతముగాను, పరిపాలించు అఖండములంతట వ్యాపించి యున్నాడే!!

375. సర్వ అండములను శివుడు తనయందు ఇముడ్చుకొని మహోన్నతుడుగా నిలబడెను. శివుడు అఖండజ్యోతి ప్రకాశుడుగా నిలబడిన కాలములో వాని దివ్యశరీరము చూచి భ్రమించినవారై, వాని శిరస్సు, పాదములను చూడగోరి బ్రహ్మ, విష్ణువులు వెళ్ళగా, శివుడు పైపైకి తన శిరస్సును పెంచుకుంటూ వెళ్ళుటచే శుభము, మంగళము, సుఖము నొసగునదైన శివ అనుగ్రహమును పొందలేకపోయిరే!!

(గర్వముతో ప్రయత్నించినవారు శివ అనుగ్రహపాత్రులు కాజాలరు.)

376. ఎర్రనైన పాదపద్మములను స్తుతించుచున్న దేవతల సమూహము, మూడు అడుగులు ఇవ్వమని బలిచక్రవర్తిని అడిగిన వామనుడు మొదలగు మునులు, గీతరూపములో మంత్రములను జపించి విజయము సాధించవచ్చు అను అభిప్రాయమున్న బ్రహ్మయు, ఆతని చుట్టూ తిరిగినచో వానిని చేరగలరా ఏమి? (చేరలేరు)

377. స్వాధిష్ఠానచక్రములో చతుర్ముఖ బ్రహ్మయు, మణిపూరక చక్రములో కృష్ణవర్ణ (నీలివర్ణం) సముద్రమునందుండు విష్ణువును, మాంసముతో తీర్చిదిద్దిన శరీరములో ప్రాణముగా నొప్పారుచూ పెద్ద మెదడు, చిన్న మెదడు మధ్య భాగమును పరిపాలించు సదాశివమూర్తిగా అగుదురో? (కాజాలరు)

378. అన్నింటిని తనయందు ఇముడ్చుకొని ఉద్భవించిన పరంజ్యోతి స్వరూపమును, ఆత్మ ఉన్నతికి ఇచ్చుట నిర్దేశించిన సత్యజ్ఞానమును నెరిగినవారై, అన్ని తత్త్వములను సమ్మేళనపరచి, దానికి అతీతముగానున్న శివమహామహుని పంచ శివ సతాఖ్యము పొందవచ్చునే!! (పరమశివుని పొందువచ్చును.)

(పంచ సతాఖ్యములు: కర్మ సతాఖ్యము, కర్తృత్వ సతాఖ్యము, మూర్తి సతాఖ్యము, అమూర్తి సతాఖ్యము, శివ సతాఖ్యము. ఇవి అన్నియూ కలిసినచో సదాశివరూపము అగును. అన్నింటా వ్యాపించియున్న శివ సతాఖ్యము అనుగ్రహము పొందవచ్చును.)

379. తమకు ప్రకాశమును అనుగ్రహించిన శివమహామహుని స్తుతించిన దేవతలు, బానిసలై తలొగ్గి, మావలె, వారు ఈశ్వరుని గ్రహించలేదు. తననే మాకు ఇచ్చి

శివభోగమును నొసంగి, మేము ఉన్నతులగునట్లు చేసి, పటిష్టమైన తన పాదపద్మములను మాకొసంగిన ఆ శివమహామహుని దేవతలు ఎరుగక పోయిరే!! (గ్రహించలేదు)

(సేవకులకు సేవకుడుగా వచ్చి తన శరీరముతో సహాయము చేసిన శివుని (శివపురాణములోని ఒక పేద ముదుసలి గాథ) దేవతలు సరిగ్గా గ్రహించలేదు. శివుడు ప్రేమతో వచ్చి చేసిన సహాయమును ఎరుగక ఉండిరి.)

380. లయం (యుగాంతమున ప్రళయం)తో చేయు కర్మను పొందియున్న రుద్రమూర్తిని నిర్దేశించుచున్న పరమశివుడు, భ్రమతో జీవించుచున్న బ్రహ్మ భ్రమించి నిలుచున్న సమయమున **మీ ఆజ్ఞను శిరసావహించనున్నాన**ని బ్రహ్మ చెప్పగా, అన్నిటిని లయము చేయుచున్న పరమశివుడు మహాప్రకాశ బింబముగా వెలుగొంది నిలచి సృష్టికార్యమును బ్రహ్మకు అనుగ్రహించెను.

## 9. సర్వసృష్టి

సర్వసంహార కాలము ముగిసిన పిదప పరమశివుడే మరలా సృష్టికాలమును తలపెట్టునను తత్త్వము.

381. ఆది, అంతము లేని ఉన్నతుడైన పరమాత్మ (శివుడు), జ్ఞానస్వరూపుడు, విడదీయలేని పరాపరం (పరము, అపరము), జ్యోతిగా నిలబడెను. పరము వ్యక్తమైన వెంటనే కీడు కలిగించని అపరము వ్యక్తమగును. ఆ పరాపరం నుండే నాదము ఉద్భవించును.

(పరాపరము అనునది విడదీయలేని శివ, శక్తి. పరమాత్మ నుండి విడదీయ లేనివి. ప్రకాశరూపము కనుక జ్యోతి అని పిలువబడి, సృష్టికి కారణమగుసరికి **పరం, అపరము** (బ్రహ్మం, మాయ) అనియు పిలువబడినది. పరమాత్మ నుండి నాదతత్త్వము ఉద్భవించి సృష్టికి కారణమైన విధానము తెలుపునది.)

382. ముందు చెప్పబడినట్లు నాదము నుండి విత్తు (కారణము) పుట్టును. ఎటువంటి మలినములు లేని శుద్ధమాయ నుండి శివుడనియు, శక్తి అనియు విభజించి జ్ఞానశక్తి, క్రియాశక్తిగా విధానము ఏర్పరచి, జగత్తు సృష్టి ఏర్పరచవలెనను సంకల్పముతో **ఇచ్ఛ** కారణముగా అన్నియూ శుద్ధమాయ నుండి ఉద్భవించునే!!

(శుద్ధమాయ బంధమును ఏర్పరచదు. జ్ఞానమయమైనది **శివుడు – జ్ఞానశక్తి**గా పిలువబడి, క్రియామయమైనది **శక్తి – క్రియాశక్తి**గా పిలువబడి, **ఇచ్ఛ** అనునది పరమాత్మ సంకల్పము, **ఇచ్ఛాశక్తి**గా పిలువబడినది. ఇచ్ఛ కారణము వలనే అన్నియూ శుద్ధమాయ నుండి పుట్టిన కార్యములుగా విశదీకరించియున్నవి.)

383. అన్ని తత్త్వములు ఉద్భవించుటకు స్థానమైన శక్తి, పరాశక్తి నుండి మాయ ఉద్భవించి, నవరత్నమువలె ప్రకాశముతో కూడినదైన ఆత్మతో కలిసి వ్యాపకము చెందియుండును. మహాశక్తి సామర్థ్యములతో క్రియించదగినదైన ఆ శక్తి యొక్క మహిమను చెప్పుటకు అలవికానిది.
(శుద్ధమాయా శక్తిని వివరించుటకు అలవికానిది.)

384. అగోచరమగు, ఊహాతీతమగు పరమాత్మయే (బ్రహ్మం) ఊహాజనితమైన శక్తిగా మారి, ఇచ్ఛ కారణముగా ఉద్భవించిన నాదముతో కూడిన విత్తుగా, పంచకర్మలుగా నున్న పృధివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము అను పంచభూతముల భారమును వహించి, సర్వశక్తిగా నొప్పారి, సదాశివమూర్తిగా వెలుగొందుచున్నాడు.
(పరమాత్మ (బ్రహ్మం) + శుద్ధమాయ = ఈశ్వరుడు (సదాశివమూర్తి)గా నొప్పారి పంచభూత కార్యములను నిర్వహించు మహాశక్తివంతుడుగా నున్నాడు. పంచభూత కార్యములు సదాశివమూర్తిగా చేయుట వలన పరమాత్మ (బ్రహ్మం) ఉనికికి కారణముగాను నున్నాడు.)

385. అశుద్ధమాయతో ఆకాశము నుండి వాయువు పుట్టినది. వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలము, జలము నుండి కఠినమైన పృధివి పుట్టినది. పంచీకరణ న్యాయముతో ఒక్కొక్క భూతములతో మిగతా నాలుగు భూతములు కలిసి భూః అను వ్యాకృతితో ప్రపంచము ఏర్పడెను. (భూమి అన్ని జీవ రాశులకు నిలయమైనది).
(ఒక్కొక్క భూతములోని సగభాగము (50%), మిగతా నాలుగు భూతముల లోని ఎనిమిదవ వంతు (12.5%+12.5%+12.5%+12.5%) కలిసి ఏర్పడిన వాటిని తన్మాత్రలు అందురు. పంచీకరణ న్యాయం వలనే ఒక్కొక్క భూతములోను 5 భూతముల సమ్మేళనముండును. ఉదా. భూమి=భూమి 50% నీరు + 12.5% + అగ్ని 12.5% + వాయువు 12.5% + ఆకాశం 12.5%. అందులకే భూమికి **విశ్వస్యధారిణి** అని పేరు.)

386. భువనము - ప్రపంచమును (జగత్తు) సృష్టించినది శివశక్తి (పరమాత్మ లేక బ్రహ్మం). వారికి చతుర్ముఖ బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివమూర్తి ఐదుగురు పుత్రులు. ఇట్లు సృష్టించు శివశక్తి స్వరూపమే చతుర్ముఖబ్రహ్మ, ప్రపంచమును సృష్టించదగ్గ పుణ్యమూర్తి అగును.

387. శివుడు జ్ఞానస్వరూపిగా అన్ని భువనములందు (ప్రపంచము) ఇమిడి, చల్లనైన మాయా కార్యములన్నిటిని రక్షించి అనుగ్రహించును. శక్తియూ చల్లనైన దృష్టితో (కరుణ నిండిన) అన్నింటా కలిసి, ఆధారభూతమై, భూవ్యాకృతిలో

వ్యాపించియుండును.

388. జలప్రదేశమగు మణిపూరక స్థానములో (నాభి) పురుషునికి ఇచ్ఛ ఏర్పడును. అగ్నిగా నొప్పారు అనాహత స్థానము (హృదయము వద్ద)లో కాంతి ప్రకాశ కిరణములు పుట్టును. వాయువుగా నొప్పారు విశుద్ధి స్థానములో ఉన్నతమైన ప్రాణశక్తి ఏర్పడును. ఆకాశముగా నొప్పారు ఆజ్ఞస్థానములో నాదశక్తి ఏర్పడి యుండును. జలప్రదేశమునకు పృధివికి మధ్యస్థానమైన స్వాధీస్థానము (సృష్టికి) ఉత్పత్తికి కారణమగును.

(శరీరములో ఏర్పడు పంచభూత కార్యములను విశదీకరించియున్నది.)

389. ప్రపంచమును లయమొందించి, సృష్టించగలిగినవాడు నారాయణుని తోడు ఉంచుకొని, అన్ని అండములలో జీవించు దేవతలందరికి నాయకుడగు పూర్వీకుడైన శివమహామహుడే. తనే ప్రపంచసృష్టికి చతుర్ముఖ బ్రహ్మను తోడు ఉంచుకొని, అనాదిగా ఈ లోకములంతటిని సృష్టించుచున్న సత్య స్వరూపియగును.

(శివమహామహుడే (పరమశివుడు) చతుర్ముఖ బ్రహ్మను, నారాయణుని తోడు ఉంచుకొని, వారికి తగిన ఆజ్ఞలు ఇచ్చి, సృష్టి, స్థితి కార్యములంతటిని అనాదిగా కొనసాగించుచున్నాడు.)

390. సృష్టికి కారణచక్రము సముద్రప్రదేశమగు (జల) మణిపూరక చక్రమునందు నారాయణుడుతో, శిరస్సునందు తెల్లనైన మహాప్రకాశములో నొప్పారు పరమాత్ముడైన శివమహామహుడు వికసించుచున్న స్వాధిష్టాన చక్రమున నొప్పారు బ్రహ్మయు, అచ్చట శరీరముతో ప్రాణమును ఇమడ్చగల తత్త్వమును ఎరిగియుండిరి. అన్ని జీవులలోనున్న ఆత్మతత్త్వము సదాశివమూర్తియే అగును.
(కైలాసనాధుడైన శివుడు, బ్రహ్మయూ శరీరములో ప్రాణమును ఇమడ్చగల తత్త్వమెరిగియుండిరి. పిండోత్పత్తికి పిదప ప్రాణమును చొప్పించునది వాయుతత్త్వముగా వెలుగొందు మహేశ్వరుని చర్యయగును.)

391. సకల అండ చరాచర సృష్టికి కారణభూతుడైన సదాశివమూర్తియే ప్రేమతో అన్ని వస్తువులందు కలిసియున్నవాడు. నారాయణుడుగా దేహపు మధ్య భాగమైన నాభిస్థానమందు నెలకొనియుండును. వాడే భువనము (లోకము)లను ప్రేమతో సృష్టి చేయుచున్న చతుర్ముఖ బ్రహ్మగాను ఉన్నాడు. వాడే వాక్కు ప్రపంచముగాను, వస్తు ప్రపంచముగాను ఉన్నాడు.

(సదాశివమూర్తియే బ్రహ్మ, నారాయణుల రూపమున అన్ని భువనముల (లోకములు) వస్తువులకు వాక్కు, స్థితి కారణతత్త్వమును పొందియున్నవాడు.)

392. అన్ని ప్రయోజనపు కార్యములను సులభతరముగాను, శుభముగాను చేయ గలిగన మహామాణిక్యముగా నొప్పారుచు, మంగళమునొసగు స్నేహితుడొకడు యున్నాడు (శివుడు). ఆ మహామహుడు బ్రహ్మకు ప్రకాశమును ఇచ్చి సృష్టి కార్యములను నివర్తించునట్లు చేయుచున్నాడు. వాని సహాయముతో కార్య ఫలితములన్నిటిని సులభతరము చేయగలిగిన కారణమును నేనెరిగితిని.

(బ్రహ్మ యొక్క సృష్టికి కారణ సంభూతుడు, మంగళకరుడు, శుభకర స్నేహితుడునైన వాడు శివుడని ఎరుగవలెను.)

393. లయము, సృష్టి, శివుని అనుగ్రహముతో జరుగు స్థితియు సృజించు కాలములో శిరస్సు చుట్టూయున్న అష్టదిశలందు కరుణామూర్తి, తన మహాప్రకాశము వ్యాపింపజేసి అనుగ్రహించును.

(పరమాత్ముడే (శివుడు) మూడు కార్యములను (సృష్టి, స్థితి, లయము) చేసి అనుగ్రహించుచున్నాడు.)

394. జీవుల ప్రాణమునందు ఇమిడి వారిని పరిపక్వమొనర్చిన నిర్మలుడైన శివుడు, మంచిగా ప్రాణశక్తిని నా శరీరములో ఇమిడ్చి నొప్పారి, ప్రారబ్ధము వలన గలిగిన శరీరమునకు తోడుగా నిలబడి, మధ్యనాడి గుండా (వెన్నెముక, సుషమ్నానాడి ద్వారా) శిరస్సున నిలబడి అనుగ్రహించుచున్నాడే!!

(నిర్మలుడు శివుడు శరీరములో ప్రాణముగా ఇమిడి ప్రారబ్ధముతో కలిగిన దుఃఖమును తొలగించి అనుగ్రహించుచున్నాడు.)

395. జగత్తును సృష్టించు కారణమున పామును, పసుపు పూలమాలను మెడపై ధరించి, మరుగుచున్న అపరంజి (పసుపు వర్ణము) శరీరఛాయతో అందమైన శరీరము గల శివమహామహుడు, జన్మించబోవు జీవుల శరీరముగాను ఉన్నాడు. వాడే జీవులయందు శివంగాను ఉండి అనుగ్రహించుచున్నాడు.

(కరుణామూర్తియగు శివుడు జీవుల శరీరము, ప్రాణముగా ఉన్నాడు.)

396. ఏకమైనవాడు శివుడు, ఏకమైన పరాశక్తి ఇరువురు నాట్యమాడిరి. వారిరువురి నాట్యము అన్నింటినీ సృజించగలిగనది. ఋతువులు ఏర్పడుటచే వాటితో జగత్తుకు ఉపయోగములైనవి. అట్లే వారి అనుగ్రహముతో పరిపక్వములకు తగినట్లు లోకులకు ఫలితములు కూడా దక్కినదే!!

(శివశక్తి నాట్యముచే జగత్తుకు ఋతువులు, పాడిపంటలు, మొ॥ శుభములు ఏర్పడి, వారిచే లోకులు అనుగ్రహము కూడ పొందగలిగిరి.)

397. భువనములకు (లోకములకు) అధిపతియైన రుద్రునిలో ప్రవేశించి జగత్తును వినాశము (లయము) చేయుచర్యను శివుడెరుగును. వాడే జగత్తులో నుండు

లౌకిక బంధములు ఏర్పరచు స్థితికారకుడైన నారాయణునిలో ఇమిడి నారాయణుని కార్యముల నెరుగును. వాడే చతుర్ముఖబ్రహ్మలో ఇమిడి సృష్టి కార్యములను కూడా తానెరుగును. ఇట్లు అన్నీ ఎరిగిన శివుని పరిపాలనకు తగ్గట్లే వారు తమ కర్తవ్యములను సరిగ్గా నిర్వహించుచున్నారు.

(శివుడే సృష్టి, స్థితి, లయ కార్యములను తన అధీనములో ఉంచుకొని అందరిచే చేయించుచున్నాడు.)

398. గర్వమను మలమును కలిగిన బ్రహ్మాది దేవతలు ఐదుగురు. అన్ని అర్హతలు కలిగిన ఉన్నతుడు కారణ ఈశ్వరుడనియు, క్రిందనున్నవారు కార్య ఈశ్వరులనియు పిలువబడుదురు. దైవము (శివుడు) తన ఇచ్ఛ, సంకల్పముతో పంచకార్యము కొరకు శుద్ధమాయలో పుట్టినవారు ఐదుగురును గర్వమను మలమును కలిగినవారే అగుదురు.

(సృష్టి, స్థితి, లయము మొదలగు పంచకార్యములు నొనర్చు బ్రహ్మ, నారాయణుడు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు – వీరందరును అధికార మలమును (గర్వమును) కలిగినవారే అగుదురు.)

399. మాయ అను శక్తి ఏకముగా ఉన్ననూ అది శుద్ధమాయ, అశుద్ధమాయ, ప్రకృతి మాయగా అని మూడుగా ఉన్నది. సాధాక్యము, మహేశ్వరము, శుద్ధమాయగా అను మూడును మాయ యొక్క కార్యములే అగును. ఈ మాయను దాటి ప్రకాశము నాదముగా నుండి చలనశక్తిగా రూపుపొందునది, శక్తితో కూడిన శివుడు అనాదిగా వచ్చుచున్న ఈ క్రీడయే సృష్టికి మొట్ట మొదటిదగును.

(మాయలో నెలకొన్న అన్ని తత్త్వములకు మూలకారణముగా నున్నది ఈ శివశక్తి క్రీడలే అగును. శివశక్తి ఇచ్ఛకు తగ్గట్లు లీలలు సలుపుట – సృష్టి, స్థితి, లయ కార్యములు సలుపుట.)

400. ఆకాశము మొదలగు పంచభూతములను నిర్వహించు సదాశివుడు మొదలగు ఐదుగురును ఎప్పుడు మాయాశక్తితో నాలో ఇమిడి శరీరములోనూ, ప్రాణములోనూ క్రీయించుచున్నారు. మహోన్నతులైన సదాశివమూర్తి, మహేశ్వరుడు, రుద్రుడు, నారాయణుడు, బ్రహ్మ మొదలగు ఐదుగురును పృధివి, ఆకాశము, అన్ని లోకములు సృష్టి అగునట్లు చేయుచున్నారు.

(సదాశివమూర్తి మొదలగు ఐదుగురును అండము, పిండములను సృష్టించి పాలించుచున్నారు.)

401. కరుణతో నిండిన ముక్కోణ పీఠములో కేంద్రబిందువు (శుక్రపీఠము)గా నొప్పారునది. కరుణా సహృదయమున్న అన్ని మండలములకు నాయకురాలు,

అనుగ్రహమొసగు సదాశివమూర్తిగాను ఒప్పారును. ఆమెయే కృపతో పంచ కార్యములను అన్ని జీవులయందును నిర్వహించి అనుగ్రహమున పాలించును. (త్రిపుర నాయకురాలుగా సదాశివమూర్తుల వారి పంచకార్యములను నిర్వహించును.)

(కేంద్రబిందువు: పరబిందు, అపరనాదము, అపరబిందు – ఈ మూడును మూడు త్రిభుజముల మధ్యనుండు స్థానమున గల చుక్క. చుట్టూయున్నవి త్రిభుజ పీఠములుగాను, త్రిపుర నాయకురాలు – అగ్ని, సూర్య, చంద్ర ముమ్మండలముల నాయకురాలుగా చెప్పబడినది. ఈ గ్రంథమునందు కొన్ని యంత్ర, తాంత్రిక పరిభాషలో చెప్పబడిన మంత్రములగును. పంచ కార్యములు: సృష్టి, స్థితి, లయ, అనుగ్రహము, తిరోధానము.

402. సూర్యచంద్రులను వక్షోజములుగా కలది. సదాశివమూర్తికి నాయకురాలు. మంగళనాయకి. జగత్తున అన్ని నిర్వహణులకు కారణభూతురాలు. ప్రాణము ఇచ్చు సృష్టికి మూలకారకురాలు. ఓంకార శబ్దరూపిణి. దేవతలందరు స్తుతించు, కీర్తించు మోహిని. పూర్ణురాలు. జ్ఞానమునకు అతి ఉన్నతమైనది యగు జ్ఞానాశక్తిగాను నొప్పారుచున్న తల్లి పరాశక్తి.
(వారణి, ప్రణవ స్వరూపిణిగా పిలువబడుచున్నది.)

403. సదాశివునితో కలిసి నిలిచియున్న మహేశ్వరుడు (పై చక్రములకు అధిపతులైన సదాశివమూర్తి, మహేశ్వరులు) క్రింది చక్రములకు అధిపతులైన రుద్రుడు, నారాయణులతో కలిసి స్త్రీ, పురుష సంగమములను కల్పించు స్వాధిష్టాన చక్ర అధిపతియైన బ్రహ్మ మొదలగువారితో కలిసి శరీరములో నెలకొని యుండును.
(ఆజ్ఞ చక్రమునకు అధిపతి సదాశివమూర్తి శిరస్సున గల ఆరవ చక్రం.
విశుద్ధి చక్రమునకు అధిపతి మహేశ్వరుడు కంఠమున గల ఐదవ చక్రం.
అనాహతం చక్రమునకు అధిపతి రుద్రుడు హృదయమున గల నాల్గవ చక్రం.
మణిపూరకం చక్రమునకు అధిపతి విష్ణువు నాభిలో గల మూడవ చక్రం.
స్వాధిష్టానం చక్రమునకు అధిపతి బ్రహ్మ మొలతాడు భాగం గల రెండవ చక్రం.
మూలాధారం చక్రమునకు అధిపతి విఘ్నేశ్వరుడు మొలతాడు క్రిందిభాగం గల మొదటి చక్రం.)

404. శివుడు ఒక్కడే ఊర్ధ్వమున గల ఏడులోకములను కార్యదేవతలతో కలిసి సృష్టించెను. అట్లే శివుడే ఏడులోకములను రక్షించుచున్నాడు. ఆ మహామహుడే ఏడులోకములను లయమొందించుచున్నాడు. వాడే జగత్తుగాను, ప్రాణముగాను నొప్పారుచున్నాడు.

(కారణుడైన శివుడొక్కడే కార్యదేవతల సహాయముతో సృష్టి, స్థితి, లయ కారకుడుగాను, జగత్తుగాను, ప్రాణముగాను ఒప్పారుచున్నాడు.)

405. ఎర్రతామరల వంటి ఎర్రనైన రంగు గలిగిన మహేశ్వరుడు, నీలమేఘము వంటి నీలవర్ణము కలిగిన నారాయణుడు లోకులలో మోహమును, లౌకిక బంధములను కల్పించి, శిరస్సున పూలచెండు ధరించిన స్త్రీల సమూహమున నెలకొని, కోరివచ్చి లోకోత్పత్తిని పురికొల్పి అనుగ్రహించుచున్నారే!!

(శివుడే రుద్రుని, నారాయణుని, కార్యములందు లీనమై లోకస్తులను మోహ, భోగ, బంధములందు ముంచుతున్నాడు.)

406. అష్టదిక్కులందు వెతికి వెతికి, అల్లాడు జీవులకు వారి శరీరములో ప్రాణమును నెలకొల్పి జన్మించునట్లు చేసిన శివుడు, యవ్వనస్త్రీల యువకుల హృదయమున ఇచ్ఛను పురికొల్పునట్లు చేయు విధానమును నేనెరుగుదును. (శివుడే సృష్టి ఇచ్ఛను స్త్రీ, పురుషులయందు పురికొల్పి అనుగ్రహించుచున్నాడు.)

407. శివశక్తి (పరమాత్మ=శుద్ధబ్రహ్మ+శుద్ధమాయ) సంగమము వలన ఏడేడు లోకములను సృష్టించి, అట్లు సృష్టించిన లోకములను రక్షించి (స్థితి కార్యము), అట్లే ఏడేడు లోకములను నశింపజేయునది కూడా (లయ కార్యము) అదియే. సంగమము జగత్తులోని అన్ని జీవరాశులలో ప్రాణమై నెలకొనియున్నది.

408. నాదస్వరూపియగు శివమహామహుడు ఏకం. శిష్యులకు సహాయ మొనరించుటలో మహేశ్వరుడు, సదాశివుడుగాను, శుద్ధమాయ, అశుద్ధ మాయ రెండింటిలోను ప్రకాశమండలము నుండి కారణతత్త్వముతో అమరినవాడు. వాని ఆజ్ఞ కొరకు ఎదురు చూస్తున్న బ్రహ్మ, విష్ణువులకు ఆదియైన శివుడే శక్తి, సామర్థ్యములను నొసగి (చైతన్యం) అనుగ్రహించుచున్నాడు.

409. ఇట్లు సృష్టించిన సృష్టియందు ఎనభైనాలుగు లక్షల జీవరాశుల యోనిభేదములలో సత్యస్వరూపిగా, ప్రాణమునందు నెలకొనియుండును. ఇది అసత్యమని చెప్పు మూఢజనులను గాఢాంధకారమగు అజ్ఞానములో (అహంకార, మమకార తత్త్వములు) ముంచివేయును.

(శివుని సృష్టిభేదములను అసత్యవాక్కులని నమ్మువారిని అజ్ఞానములో త్రోసివేయును.)

410. సూర్యుడు, చంద్రుడు, అష్టదిక్పాలకులు, నాదబోధియగు ఆకాశము, బ్రహ్మాండమైన జలమయము, పృథివి (భూమండలము), జ్ఞానేంద్రియములైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ తన్మాత్రలు, కర్మేంద్రియములైన వాక్కు, పాణి, పాదము, పాయు, ఉపస్థ, అంతఃకరణములైన మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములు, మాయతో కూడిన

బిందు (శుక్రము) మండలమునకు చెందినవి.

(అష్టదిక్పాలకులు: ఇంద్రుడు, అగ్ని, యముడు, నైరుతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, ఈశానుడు. బ్రహ్మాండమునందు బాహ్యముగా నుండునది అంతయూ పిండాండములోను ఇమిడియున్నదను తత్త్వము.)

## 10. స్థితి

411. అనుగ్రహించగలిగిన సదాశివమూర్తియే అనుగ్రహ ప్రకాశముగాను (జ్ఞానము), చీకటిగాను (అజ్ఞానము) అన్నింటా నిండియున్నాడు. వాడే జ్ఞానులయందు ఉన్నతి నొసగు జ్ఞానతత్త్వముగాను, మూఢులందు అధమమునొసగు అజ్ఞాన తత్త్వముగాను ఉన్నాడు. వాడే శరీరముగాను, ప్రాణముగాను నెలకొని యున్నాడు. అట్లు కలిసిపోయియున్నవాడే **మహత్** అను బుద్ధి తత్త్వములో ఇమిడియున్నాడు.

(సూక్ష్మమైన వాయుభూత రూపములో జీవుల ప్రాణమునందు ఇమిడి వారివారి ప్రారబ్ధ క్రమానుసారముగా స్థితిగతులకు తగ్గట్లు ఊర్ధ్వముఖము (శివుని పంచమ) ద్వారా (ఈశానం) జ్ఞానమొసగునది. అజ్ఞానమనునది కర్మాను సారముగా లౌకికబంధములు (మాయ యొక్క ఆవరణశక్తిచే ఏర్పడునదగు అహంకార, మమకార, రాగ, ద్వేషము మొదలగునవి) నొసగునది.

412. సదాశివమూర్తియే అన్ని దిశలందు వ్యాపించి దేవతలుగా నిలుచున్నవాడు. వాడే చిదాకాశ కూర్పు వలన దేహమునందు దేహతత్త్వములుగాను, ప్రాణమునందు ప్రాణతత్త్వముగాను ఉండి వెలుగొందుచున్నాడు. వాడే సముద్రముగాను, పర్వతము గాను, ఇతర స్థిరపదార్థములోను నెలకొనియున్నాడు. కావున సదాశివమూర్తియే నాయకుడగును. స్థావర, జంగమ నాయకుడు అతనే సుమా!!

413. శిరస్సున (సహస్ర దళమునందు) నెలకొని ప్రకాశమగు ఆకాశముగా నొప్పారు అనుగ్రహమూర్తి, శరీరముగాను, ప్రాణముగాను, జగత్తుగాను, సముద్రముగాను, నల్లటి వర్షింపదగిన కారుమేఘముగాను, వాటికి మధ్యగాను, అక్షరుడుగాను (క్షీణము లేనివాడు) అంతటా నిండి ఉన్నతుడుగానున్నాడు.

(శిరస్సున, మధ్యగాను అను వాక్యములు యోగపరిభాషలో చెప్పబడినవి. శిరస్సున గల సహస్ర దళమునకు షట్చక్రములలో అమరిన మూలాధారము నుండి, మధ్యనాడియైన సుషుమ్నానాడి ద్వారా జీవశక్తిని పైకి ప్రాకించి బ్రహ్మరంధ్రమును చేర్చి ఉన్నతస్థితిని చేరుట అగును. శిరస్సున గల ఆ జ్ఞానచక్రమునకు అధిపతి సదాశివమూర్తియే.)

414. ఈ మంత్రపు తాత్పర్యము 406నకు వ్రాసిన తాత్పర్యమును బోలినదే. కావున 406వ మంత్ర టీకాను చూడగలరు.

415. సదాశివమూర్తియే జగత్తును నాశనము (లయమొందించుట) చేయు తరుణమున తీవ్రమైన అగ్నిజ్వాలతో నిండిన సూర్యుడుగా మారి అనావృష్టి కల్పించి లోకనాశనము చేయును. తానే ప్రచండ మారుతముగా (భీకరమైన గాలి) మారి నాశనము చేయును. తానే అతివృష్టిని కల్పించి ప్రళయమును ఏర్పరచును. తానే ఒక సమయమున నారాయణుడుగా ఉండి లోక రక్షకుడగును.

416. ఆ సదాశివమూర్తియే ప్రేమ, తెలివి, అణకువ మొదలగు సలక్షణములుగా యున్నాడు. శృంగారమునకు శృంగారముగా ఉండి, కలియికకు కారణభూతుడుగా యున్నాడు. తానే కాల పరిమితులను నిర్ణయించుట వలన కాలమును ముగించువాడుగాను (కాలుడు) ఉన్నాడు. తానే శుభము లొసగు శుద్ధ మాయాతత్త్వములగు (నాదము, బిందు, సతాఖ్యము, మహేశ్వరం, శుద్ధవిద్యలగు) పంచతత్త్వములలో ఇమిడి, పంచభూత కార్యములు నిర్వహించుచున్నాడు.

417. ఆ మహామహుడే జగత్తును మాయనుండి సృష్టించును. అతనే జీవరాశులకు జన్మ ఇచ్చి అనుగ్రహించును. బ్రహ్మాండములోని లోకములను, చిన్న అండమైన ఘటము (కుండ)ను కుమ్మరివలె మట్టి నుండియే తన సంకల్పముతో అందముగా తయారుచేయుచున్నాడు.
(కుమ్మరి ఎట్లు తన సంకల్పముతో మట్టి నుండి కుండ, ఇతర అందమైన మట్టి వస్తువులు తయారు చేయుచున్నాడో, అట్లే ఈశ్వరుడు మాయ తోడుతో తన సంకల్పముతో జగత్తును, భువనములను (అన్ని లోకములు) సృష్టించి, అనుగ్రహముతో పాలించుచున్నాడు.)

418. నందీశ్వరుడే (శివుడు) దేహమందు శ్వాసక్రియగా ఉండి అది సక్రమముగా కొనసాగునట్లు చేయుచున్నాడు. వాడు తత్త్వములకు అతీతముగా ఉండి (జన్మకు ముందున్న స్థితి), ఆకాశమును స్థానముగా ఏర్పరచుకొని ప్రకాశముతో ఉండి నొప్పారుచున్నాడు. అట్లున్నను తాను దేహమందు చలనశక్తి ఇచ్చు శుద్ధ చైతన్యముగాను ఉండి, ఇంద్రియప్రజ్ఞలందు వ్యాపించియుండి, ప్రాణు దేహమునుండి వీగిపోక కాలపరిమితులు ఏర్పరచి, అనుగ్రహించి రక్షించు చున్నాడు.

419. అట్లు దేహమును రక్షించు కాలములోనైనా సరి, దేహమునకు కాలపరిమితులు ముగిసిన కాలములో ప్రాణము విడదీయు సమయమునైనను సరి, వానివలె రక్షించు వారెవరు లేరు సుమా!! ముమ్మొందు ఏర్పడు ఏడు జన్మములకు తుర్యాతీతమగు స్థితికి ఆకాశభూత నాయకుడైన ఆ సదాశివుడే ఆధారభూతుడుగా ఉండి అనుగ్రహించి, ముక్తి నొసగువాడైయున్నాడు.

420. అన్ని జీవరాశులందును ఇమిడియున్న ఆ పరమాత్మ, బాహ్యముగా వెళ్ళి, వానిని వెతికినివారికి తాను దూరమగును. అట్లుకాక ఒక్కొక్కరిలోనున్న అగ్నికణజాలము (జీవశక్తిని) రగిల్చి, దానితో బ్రహ్మరంధ్రము (శిరస్సున కపాలస్థానం)నకు వెళ్ళి పరమాత్మను స్తుతించినచో, తను అనుగ్రహించును. జగత్తునందు ఎన్నో జన్మలు ఎత్తి పరమాత్మను స్తుతించినను, ఆ జన్మమంతయూ తోటి జీవరాశులకు సేవ చేసినచో పరమాత్మ ఉన్నతమైన దేహాదులను ఇచ్చి అనుగ్రహించునే!!

(పరబ్రహ్మం నుండి (శివశక్తి) బ్రహ్మను మొదట సృష్టించి, అతని ద్వారా సమస్త సూక్ష్మ, స్థూల పంచభూతములను సృష్టించి, వాటి ద్వారా సకల జీవరాశులను సృష్టించి, వారిని ఒక పద్ధతిపై క్రమబద్ధీకరించి, కార్యములు నిర్వహించుటకు బ్రహ్మాది దేవతలను నియమించి జగత్తుకు సృష్టి, స్థితి, లయ కార్యములు చేయుచున్నాడు. యోగపరిభాషలో కుండలినీ యోగసిద్ధుల మూలధార చక్రమునుండి సహస్రారమునకు జీవశక్తిని ప్రాకించినవారు శివమహా ప్రకాశముతో నొప్పారి, ఉన్నతమైన మానవజన్మను పొందగలరు.

## 11. సంహారము

నాశము చేయుట అనునది సృష్టించిన అన్నింటిని ప్రళయ సమయమున పరబ్రహ్మంనందు లయమొందించుట. ఇది శివుని పంచమహాకార్యములలో ఒకటి. శివుడే రుద్రునిగా సంహారకార్యమును చేయుచున్నాడు.

421. బ్రహ్మాండమైన అగ్నిని రగిల్చి దైవము (శివుడు) విశాలమైన జగత్తును కాల్చి వేసెను. అట్లే అగ్నితో మహాసముద్రములను కూడ ఎండిపోవునట్లు చేసెను. ఆ అగ్నితోనే సమస్త రాక్షసులను నశింపజేసెను. ఆ అగ్నియే దైవము చేతిలో నెలకొనియున్న బాణమగును.

(పృధివి స్థానము – స్వాధిష్టానమును. అలల సముద్రము – జలము – మణిపూరక స్థానములలో పురికొల్పు కార్యములగు కామ, ఇతర ఇచ్ఛలను సమూలముగా నశింపజేయుట. రాక్షసుల సంహారము – శరీరపు ముమ్మలములను నశింపజేయుట. సంహారము బాహ్యముగాను, అంతరముగాను జరుగునని తెలియజేయుట.)

422. దినప్రళయము, మధ్య ప్రళయము, మహాప్రళయము అను మూడు విధములగు ప్రళయములు కల్పాంతమున వచ్చు ప్రళయము వంటిదే. ఈ లోకములన్ని స్థానభ్రంశమునొంది నశించినది నా జ్ఞాననేత్రములతో చూచితిని. కల్పాంతమున అన్నము ఉడుకునపుడు కుండలోని బియ్యం అగ్నిజ్వాలల వలన ఎట్లు క్రిందికి

మీదికి తల్లడిల్లి ఉడుకునో, అట్లే ఈ లోకములన్నీ తిరుగును. విశాలమైన భూమితో సహా అన్ని మండలములు ఉడికి నశించును.

(యోగపరిభాషలో: దినప్రళయము – జీవుడి గాఢమైన నిద్ర (సుషుప్తావస్థ) వలన మనోఇంద్రియాదాలకు అతీతముగా కారణ శరీరములో లయమొందుట. మధ్యప్రళయము – శరీరాదులు నుండి ప్రాణము వీగిపోయి చైతన్యమునందు లయమొందుట. మహాప్రళయము – జగత్తుననున్న అన్ని జీవరాశులు పరమేశ్వరునిలో లయమొందుట.)

423. జీవులను పరిపక్వమొందించు పృథివియూ (భూమి), మంచుతో నిండిన ఎనిమిది పర్వతములు, ప్రశాంతమొనర్చు సప్త సముద్రములు మొదలగునవి అంతటిని ఉడుకునట్లు చేయగలిగిన అగ్నిని రగిల్చి నిర్వీర్యము చేసి శూన్యము చేయుట అన్నది పరమాత్మకు ఏమి క్లిష్టమైన కార్యము కాజాలదు.

424. శిరస్సున ఉన్న ప్రకాశమండలము నుండి క్రిందికి దిగివచ్చిన ఆదిశక్తి, శరీరము చుట్టూయున్న ప్రకాశమయమైన అండకోశములో నెలకొని, తిరోధానశక్తికి లోనైన జీవులను పరిపక్వమొనరింపకూడిన ప్రణవమగు (ఓంకారము) మూలాధార చక్రములో కుండలినీ శక్తిని పైకి ప్రాకునట్లు చేసి, ఆ అగ్నిని తనలో ఇముడ్చుకొని శివమహామహుడు వెలసిల్లెను.

(శివుడు, శక్తిని జీవులకు ఇచ్చి అనుభవములను ప్రాప్తింపజేసి, వారినే పరిపక్వమొనర్చి, తానే మరలా తనలో లయము చేసుకొంటున్నాడు.)

425. **నిద్ర సంహారము** అనునది నిద్రలో ఏదీ అనుభవములోనికి రానిది (గాఢ నిద్ర – సుషుప్తి). ఇట్లున్న సంహారము శరీరములో జ్ఞాన, కర్మేంద్రియ, కరణములన్నియు విడుపడియున్న స్థితి అగును. **శుద్ధ సంహారము** అనునది ఏ కార్యవృత్తులు లేని (క్రియా రహితము) స్థితియగును. **ఉన్నత సంహారము** అనునది శివానుగ్రహముతో కూడుకున్న ధ్యాస సత్యమైన సంహారమగును.

(దినచర్యగా జీవులు ప్రతిదినము అనుభవములోకి వచ్చునవి: జాగ్రదావస్థ, స్వప్నావస్థ, సుషుప్తావస్థ. ఇవికాక జ్ఞాన సాధకులకు తురీయం, తురీయాతీతం అను మరిన్ని రెండు అవస్థలు కలవు. శివానుగ్రహముతో అన్ని అవస్థలందును యోగనిద్రలో నెలకొనియుండుట **సంహారము**గానే పరిగణింపబడును.)

426. నిద్ర సంహారము అనునది స్థూల, సూక్ష్మ శరీరముల రెంటిని జీవుడు తనయందు అంటిపెట్టుకొని యుండును. ఈ సంహారము మాయతో కూడుకున్నదగును. శుద్ధ సంహారములో మనస్సు మనోతీతముగా నుండి ఎటువంటి వృత్తులు (క్రియా రహితము) లేని స్థితియే. శివానుగ్రహముతో అమరినదే సత్యసంహారమగును.

(అన్ని స్థితులందును మనస్సు అణగిపోయి అభావస్థితి వృత్తులు లేని స్థితియే సత్య సంహారమగును. నిద్ర సంహారము – గాఢనిద్రలో ప్రాణమున్ననూ దేహాది ఇంద్రియములు, మనోబుద్ధి, అంతఃకరణములన్నియూ వృత్తులు లేక చలనము లేకయుండును.)

427. నిద్ర సంహారము జన్మదుఃఖమును పోగొట్టునట్లు మనోకరణములు ఉన్నత (శ్రేష్ట) సంహారములో శరీరమును, ప్రాణమును విడదీయు స్థితిని ఏర్పరచును. ఇట్లు ఏర్పరచిన సంహారము ఆత్మకు శుద్ధకైవల్య స్థితియగును. శివమానంద స్థితి నొసగు సంహారమే సత్యమైన సంహారము.
(ఆత్మకు కైవల్యస్థితి యనగా, అన్ని స్థితిలందునూ శుద్ధ చైతన్యపు ప్రకాశముతో నెలకొనియుండి, ప్రకాశములోనే లయమొందుట.)

428. నిద్ర సంహారము దీర్ఘనిద్రలో (గాఢనిద్ర)లో యుంచునది. అణగారిన సంహారములో మనోబుద్ధి అంతఃకరణములను అణిగి ఉండునట్లు చేయునది. శుద్ధ సంహారములో కూడ అన్ని ఇంద్రియ అంతఃకరణములు అణిగిపోయి పరమాత్ముని అనుగ్రహముతో ఇంకా పూర్తిగా కలయిక యుండునది. పరిశీలనతో చెప్పవలెనన్న ఇంద్రియ, కరణములన్నింటిని త్యజించి పరమాత్మ యందు లయించినదే శ్రేష్టమైన నాల్గవ సంహారమగును.
(పరమేశ్వరుని చర్యలలో సంహారములు నాలుగు విధములైనవి.)

429. అంతఃకరణములు పరిపక్వమొందనిది (త్యజింపనది) పాడైన పంట వంటిదే. అది ఇంద్రియ వాసనలకు లోనై చెడి మరలా మారినను పూర్వపు స్థితిని పొందజాలదు. ఎటువంటి ఫలితము నివ్వని సంహారమగుటచే జీవులు నారాయణుని వృత్తులకు లోనై పునర్జన్మయందు కొట్టుమిట్టాడుదురు. అహంకారమలము నిర్వీర్యమైన (నివృత్తియైన) వేపిన విత్తనము ఎట్లు పంట కాజాలదో, అట్లే శివుని వ్యాపకములోనే అణిగియుండును.

430. పోగవుతున్న కర్మ ఫలితములు నశించుపోవునట్లు శివుని ధ్యాసయందు నెలకొనియుందురు గాక!! ఇట్లు కర్మ నాశనము చేయదగినవాడు నెలకొని యుండు స్థానము సహస్రదళమగును (జీవుని శిరస్సు). దానిని శరీరములోనే ఉంచినాడు. తగురీతిన విచారణ చేయువారిలో ప్రకాశమును నెలకొల్పి అనుగ్రహించెను. వాటికి ప్రజ్ఞలను ఏర్పరచినాడు.
(వాని కరుణను (శివుని) ఏమని చెప్పుదుము?)

## 12. తిరోభావము

జీవులలో (అజ్ఞానములో ముంచి విషయభోగాసక్తిని కల్పించి, సత్యజ్ఞానమును మరిపించియుంచుట) ప్రారబ్ధమును త్వరగా తీరిపోవునట్లు చేయుట కూడ శివుని లీలయే అగును.

431. ప్రాణములో ప్రాణమైయున్నవాడు, మనోమండలములో ప్రకాశముతో నొప్పారువాడు, హృదయమునుండి ఎప్పటికి వీగిపోని మహామహుడు, జీవుల హృదయములోనే తోడై నెలకొనియున్ననూ, మనస్సును మలము కప్పివేసి నందున ఆ మహామహుని ఇటువంటివాడని గుర్తించజాలకున్నామే!!
(జగత్తులోని విషయభోగముల వాసనలో మునిగియున్న జీవులు దైవము తమయందే యున్ననూ, ఎఱుగజాలకున్నారు.)

432. సుఖభోగములను అనుభవించుటకు జన్మమిచ్చిన దైవము, దుఃఖమునిచ్చు బంధములను కూడా జీవులలో నెలకొల్పెను. వాడు జీవుల అస్థుల (ఎముక)లో చేరి, మాంసము, అంగములపై కప్పబడిన చర్మమును అమర్చిఇచ్చి, వాటిని పునీతము చేసి ఆఖరున ముక్తిని కూడ ప్రసాదించి అనుగ్రహించునే!!

433. రుద్రుడు, నారాయణుడు సుఖము అమర్చిఇచ్చినవారు. బ్రహ్మతో కలిసి మూవురు ఒక్కటై ఐక్యముగా ఉండి, దైవము (శివుడు) అమర్చియిచ్చిన ఈ మహోన్నతమైన యాంత్రిక శరీరములో రహస్యముగా పొందుపరిచిన ఎన్నో తత్త్వములను వారు ఎరుగజాలరు.
(రుద్రుడు మొదలగు దేవాదులు శివుని యాజ్ఞానుసారముగా నడుచుకొనువారే తప్ప శివుని తత్త్వములను పూర్తిగా ఎరుగజాలరు.)

434. చూచుచున్న కంటిలో వెలుగుగా (ప్రకాశం) యుండి నొప్పారు అనుగ్రహ స్వరూపుడు ఈశుడుని (శివుడు), పురుషునిగా, స్త్రీగా, నపుంసకుడుగా నొప్పారు ఆదియైన శివుడుని, భుజించుటకు ఉపయోగపడు నాలుక (జిహ్వా)తో మనస్సున స్తుతించి, శిరస్సుపైన్ను ఆకాశ మండలములోని ప్రకాశమయమైన తటాకములో మునగజాలకుండిరే!!
(జీవుల కంటిలో ప్రకాశముగా నొప్పారు ఈశుని, మనస్సు ద్వారా శుద్ధ తత్త్వమును ఎరుగకున్నారే అని వాపోవుట.)

435. తేటనైన సత్యతత్త్వమును ఎరిగిన జీవులకు, మహాప్రకాశమండలములో నివాసులగు దేవతలకు, సుఖములను ఒనగూర్చు గుణమున్న ఆదియైన సదాశివుడు, స్వల్పప్రకాశము గలిగిన చంద్రుడునకు, చీకటిని ఛేదించగలిగిన మహాచీకటిగా యుండు జీవుల అండకోశమున అజ్ఞాతముగా ఉండి సకల

వృత్తులను తానే (చైతన్యముగా ఉండి) చేయించుచున్నాడు.

436. తత్త్వముల యొక్క శబ్దము మొదలగు తన్మాత్రలు, వాటివలన ఏర్పడు ఇచ్ఛ, వాంఛలు, ఒకదాని కొకటి వేరుపడి అనేక నామరూపములలో జగత్తు నంతటిని పెక్కు కార్యములుగా నిర్వహించి, వాటిని మరిపించి పరిపాలించునది దైవమే అగును (శివుడే అగును.) దైవము జీవులకు మరిపించు శక్తిని (తిరోధానశక్తి) ఇచ్చి అనుగ్రహించుచున్నాడు. తిరోధానం, తిరోభావము, ఆవరణశక్తి అన్నియూ పర్యాయపదములే.

(దైవము జీవులకు దైవతత్త్వములన్నింటిని ఎరుగకుండునట్లు వాటిని మరిపించి యుంచు తిరోధానశక్తి ఇచ్చి అనుగ్రహించును.)

437. నేను దైవమును అంతరమున సృజించి, స్తుతించి, పూజించితిని. ఆ మహామహుడు తక్షణమే నాకు బాహ్యముగా ప్రత్యక్షమై అనుగ్రహించెను. ఇట్లు ఆనందముతో మహోన్నతమైన ప్రేమను సలిపి బాహ్యముగా వానిని స్తుతించి పూజించిననూ, తను (శివుడు) సంతోషించునే!!

(శివుడు బాహ్యముగా చేయు అనుగ్రహమునకు, మనము వానిని అంతరమున నిలిపి కొలుచుటయే చాల శ్రేష్ఠమని శృతివచనం.)

438. అన్నిటిలోను తానే అజ్ఞాతముగా ఉండి, అన్ని కార్యములను నిర్వహించుచున్న మహేశ్వరుడు, అధోముఖముగా ఉండి నిర్వహించు రుద్రుడు, నారాయణుడు స్వాధిష్టాన కమలములో ఆశీనుడైన శుభమొనర్చు బ్రహ్మలగు మూవురితోనూ కలిసి జీవులను మరిపించి సకల జగత్తు కార్యములను నిర్వహించుచున్నారు.

(సృష్టియందు నెలకొన్న మాయాశక్తిలో ఉత్పన్నమైన **ఆవరణశక్తి** వలన జీవులు తమ సత్యతత్త్వము ఎరుగక అజ్ఞానముతో కప్పబడి, తమతమ ఉపాధి, వృత్తులను చేయుచున్నారు.)

439. బంధమును విడనాడి (అభావస్థితిలో యుండి) ఉత్తమమైన శివతత్త్వమునెరిగి, ఎత్తైన గంగ ఒడ్డున నిలబడి జీవులు తమ ఆత్మానుభవము పొంది, జన్మ కారణత్వము ఎరిగియున్న తరుణములో ఆకాశగంగ ఒడ్డులో చేరియుండినచో ప్రారబ్ధ మలములను (అజ్ఞానమును) తొలగించుకొనగలరు.

(మాయాజనిత – ఆవరణశక్తి (జ్ఞానమును కప్పియుంచు శక్తి) వలన ఏర్పడిన కేవలము దేహమనోబుద్ధులను భావమును తొలగించుకొని, అభావస్థితితో, సంకల్ప రహితమగు మనస్సుతో నెలకొని, శివతత్త్వమెరిగి, ఆత్మానుభూతి పొందినవారికి ప్రారబ్ధ మలములు (అజ్ఞానము) తొలగి ఉన్నతి పొందగలరు.)

440. మట్టి (కారణము) ఒక్కటే కాని కార్యములు అనేకము. మట్టితో చేయబడిన

కుండ, పాత్ర, ప్రమిద, కూజా మొదలగునవి తయారగును. అట్లే సకల జీవరాశుల యోనిభేదములందు అంతరమునయున్న వాడొక్కడే కారణమగును (శివుడే కారణభూతుడు). కన్ను ఒక్కటే, అది అన్నింటిని చూచుచున్నది, కాని కన్ను తన్ను తాను చూచుకొనజాలదు. అట్లే మహామహుడు శివుడు అన్నింటిలో తాను ఇమిడి అన్నీ నిర్వహించిననూ తను మాత్రము అగోచరముగానే (చూడజాలకుండుట) నెలకొనియున్నాడు.

(శివుడు అన్నిటిలో ఇమిడి కారణభూతుడుగా (మదాత్మ సర్వభూతాత్మ/జీవాత్మ) యున్ననూ, జ్ఞానమువలే గోచరమగును. కాని సామాన్యులగు లోకులకు దృగ్గోచరుడు కాజాలడు.)

## 13. అనుగ్రహము

అనుగ్రహరూపమున శివుడు తన ఆజ్ఞచే శాసించినదానిని సదాశివమూర్తి జీవుల జన్మదుఃఖము, మలములను పోగొట్టి అనుగ్రహించునది.

441. అష్టదిక్కుల నుండి వీచు గాలితో గుండ్రముగా అమరిన భూమి, చుట్టూ యున్న నీరు, అగ్ని, ఆకాశము మొదలగు పంచభూతములను ఒక్కటిచేసి, ప్రాణస్థితిని శరీరమను సంచిలో ఇమిడ్చియు, దానిని విడదీయగలిగినట్లు అమర్చినది సదాశివమూర్తియే అని గ్రహించవలెను.

(సదాశివమూర్తి జీవుల పంచభూతాత్మమైన శరీరములో ఇమిడి ప్రాణముగా నెలకొని, దానిని శరీరము నుండి విడదీయుశక్తిగా నెలకొని, జీవిలో ప్రాణ తత్త్వము వేరు చైతన్యం వేరుగా అనుగ్రహించుచున్నాడు.)

442. శిరస్సులోని బ్రహ్మరంధ్రములో నెలకొనియున్న నాదమును ఎరిగి దాని ఉన్నతిని కోరి పాటుపడువారికి మరణము లేదు. ఉన్నతముగా ఎగిసిన జ్వాల అగ్ని, సూర్య, చంద్రులగు మూవురిని ఐక్యపరచి జీవుల సమున్నతి పొందుటకు సహాయపడునది ఆ సదాశివమూర్తి అనుగ్రహమే అగును.

(యోగపరిభాషలో జీవులలోని అగ్నిని (ప్రాణశక్తిని) ఉత్తేజపరచి ఇడ, పింగళ నాడుల ద్వారా (చంద్ర, సూర్య కళలగు శ్వాస ప్రక్రియ) వెన్నెముక ద్వారా కపాలములోని బ్రహ్మరంధ్రముచేరి, నాద (ఓంకారం) సామీప్యము పొందినవారు మరణము లేక శివసాయుజ్యము పొందుటకు సదాశివమూర్తియే అనుగ్రహించును.)

443. కుమ్మరి మట్టిచక్రము క్రింద సేకరించిన మట్టితో తను సంకల్పము (మనస్సుకు తోచినట్లు) తగ్గట్లు విధవిధములుగా పాత్రలు చేయును. కుమ్మరి తలంచినట్లే

మా నందీశ్వరుడు (సదాశివమూర్తి) కూడ తలంచి జడముగాయున్న ఈ జగత్తును చైతన్యముతో నిండిన ఆత్మగా మార్చి అనుగ్రహముతో పాలించుచున్నాడే!!
(కారణభూతుడైన శివుడు జడమైన జగత్తులో తన కార్యములన్నిటిని చైతన్యము వలన తనకు తగ్గట్లు కారణ, కార్యములో ఇమిడి, సంకల్పించి వ్యవహారములను నిర్వహించుచున్నాడు.)

444. ప్రకాశమును వాహనముగా గలిగినవాడు, వికృతుడు (వివిధ కార్యములు చేయువాడు), అపరిమితమైన భువనాధిపతులను (భువనములు – లోకములు – లోకాధిపతులు) గలిగినవాడు, తన సంకల్పము తగ్గట్లు జగత్తును సృష్టించువాడు, కోరివచ్చిన వారికి దానగుణముతో అష్టగుణములు గలవాడు, ప్రకాశకిరణములతో ప్రజ్వలించుచున్న ఆ మహామహుడు (శివుడు) జీవుల ఆలోచనలలోను ఇమిడియున్నాడే!!

445. దైవము (జీవులు జీవించవలెనను తలంపుతో) ఏడులోకములను కోరి సృష్టించెను. అట్లే కొన్ని ప్రళయములను కోరి చేసి అనుగ్రహించెను. అట్లే పంచభూతములైన ఆకాశము, వాయువు, అగ్ని, అప్పు (నీరు), పృధివి (భూమి)లను కోరి సృష్టించెను. తాను కోరి తానే దేహములోను, ప్రాణములోను సృజించి జీవకోటికి సహకరించెను.
(సోకామయత బహుస్యాం ప్రజానాం సృజేయేతి – శృతివాక్యం)

446. ఏడు లోకములను సృష్టించి తానే అందులో నెలకొనెను. అందులో ఎన్నో దేవతలను సృష్టించి వారిని పరిపాలించసాగెను. వాడే కొన్ని జీవులను ముందే సృష్టించి వారిని కొన్ని దేవతలతో పాటు సంబంధమేర్పరచెను. అట్లు సృష్టించి అన్నిటిని ఆకట్టుకొని వారికి నాయకుడుగాను కొనసాగెను.

447. ఆదిశక్తితో చేరి సదాశివుడు పంచభూతములను సృష్టించి, మలినములు లేని (శుద్ధతత్త్వముగా) కొన్ని వృత్తులను ప్రాణుల శ్రేయస్సు కొరకు తానే చేసి అనుగ్రహించెను. లెక్కలేనన్ని దేవతలను సృష్టి చేసినది కాక, వారికి ఆధారభూతుడుగాను కొనసాగెను.

448. అఖండమైన భువనలోకములు ఏడింటిలోను తాను ఏకముగా ఉండి సృజించి యున్ననూ, వాటికి అసంగముగాను (వాటికి అతీతుడు) కొనసాగుచున్నాడు. అట్లు వాడు అన్నింటిలోనూ సృజించియున్ననూ సామాన్యముగా చూచినవారికి అతను అగోచరమే అగును. శివుడే పెక్కు రూపముగానున్న జీవులలో వ్యాపించి, అతనిని కోరువారిలో తాను నమ్మకస్థుడై అనుగ్రహించునే!!

449. అంతరమున ప్రజల్వించుచున్న జ్యోతియే ప్రాణముగా నెలకొని శరీరమగును.

ఊర్ధ్వలోకస్థులైన దేవతలు సహితము కోరుకొను శ్రేష్టమైన వస్తువగుచున్నది. మర్త్యలోకవాసుల (భూలోకవాసులు) పరిపక్వమొందిన ఉత్తమమైన, శ్రేష్ఠ శరీరము, వారి కంట్లో వెలుగుచున్న రత్నమే గొప్ప జ్ఞానముగాను ఉన్నది.
(శరీరములో వెలుగుచున్న జ్యోతి ప్రకాశమే గొప్ప జ్ఞానకారణముగా ఉన్నది.)

450. ఎవ్వరూ ఎరుగలేని అండములోని దివ్యరూపమును, భూమి మొదలగు పంచ భూతములతో తయారైన ఈ శరీరములో నీటిలో పాలువలె కలిసియున్న తత్త్వమును, ఖచ్చితముగా చూచు భాగ్యమును నేను (రచయిత) కలిగియుంటినే!!
(శివుడే భూలోక జీవులయందు కలిసియున్న తత్త్వమును ఎరిగియుంటినని (రచయిత) నొక్కి వక్కాణించుచున్నాడు.)

## 14. గర్భక్రియలు

(దైవము జీవుల గర్భమునందు ఇమిడి, రక్షించు తత్త్వమును బోధించునది.)

451. మరణమునందు శరీరమును వీడిన ఇరువదిఐదు శరీరతత్త్వములను సృజించి, ఆదియైన దైవము శ్రేష్టమైన ప్రాణమును ఆ శరీరతత్త్వములతో చేర్చుచున్నాడు. తను తల్లి గర్భసంచిలో ఇమిడి ప్రాణులకు సహాయమొనరించి, శరీరవృద్ధికి కావలసినంతయు తాను చేయుచున్నాడు.
(ఆదియైన దైవము ప్రాణము 25 శరీరతత్త్వములతో కూడిన గర్భపిండాకృతి వృద్ధికి సహాయమొనరించి కాపాడుచున్నాడు.
(ఇరువది ఐదు శరీరతత్త్వములు: పంచభూతములు (5), వాటి తన్మాత్రలు (5), కర్మేంద్రియములు (5), జ్ఞానేంద్రియములు (5), అంతఃకరణములు (4), పురుషుడు (1). మొత్తం 25. తన్మాత్రలు: శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు)

452. యోగులు గ్రహించిన మూలాధారముపై అగ్నియు, నీరును కలిసియున్న జ్ఞానభూమికపై, తన దివ్యపాదమును అమర్చి (పిండమునకు రక్షణ, వృద్ధి అమర్చి), ఓపికగా, మహోన్నతమైన ప్రాణమును పిండములో చొప్పించినట్లు సంకల్పించి, గర్భసంచియందు పదినెలల పాటు పెరుగుదలకు కాల నిర్ణయము దైవము ఏర్పరచియున్నాడే!!
(మూలాధారచక్ర స్థానమునందే అగ్ని, నీరు సహాయముతో పిండోత్పత్తి జరుగును. పిండమునకు తగిన భద్రతతో రక్షించి, వృద్ధిచేసి, ప్రాణమును చొప్పించి పదినెలల పాటు గర్భమునకు కాలము నిర్ణయించినది దైవమే.)

453. చిదాకాశములో వెలయు దైవము, స్త్రీ పురుషులిద్దరు సంగమము సమయమున జీవుడు పూర్వజన్మమందు విడిచివెళ్ళిన వాసనలు అనుభవించుట కొరకు

దుఃఖమిశ్రమైన దేహమును, పరిపక్వమొందవలసిన కాలము, జీవుడు భూమి యందు ఉండవలసిన కాలపరిమితి, వీటన్నిటిని స్త్రీపురుషులిద్దరు ప్రేమతో సంగమమైన సమయముననే నిర్ణయింపబడినదే!!

454. పిండమును త్రోసిపుచ్చినవారు (జ్ఞానులు: పునర్జన్మ లేనివారు) ఎరిగినట్లు, ఇరువది ఐదు తత్త్వములను పురుషశరీరములోనే తయారు అయినదని ఇతరులు ఎరుగజాలరు. ఆ కణములు పిదప స్త్రీ గర్భసంచిని వెదకివెళ్ళి, అమరి, పురుష స్త్రీగాను రెండింటి లక్షణములతో కలిసి దూసుకుపోయినదే!!

(పిండోత్పత్తికి ముందు పురుష కణములలోనే స్త్రీ కణములు, పురుష కణముల విభజన ఉన్నదని రచయిత వక్కాణించిరి. ఇది సరిగ్గా ఇప్పటి x క్రోమోజోములు, y క్రోమోజోములు విజ్ఞానముతో సరిపోతున్నది.)

455. స్త్రీపురుష సంగమములో శుక్ర శ్రోణతములు కలయికలో పురుషుని తత్త్వముచే ఏర్పడిన తన్మాత్రలు ఐదింటిలోనూ జ్ఞాన, కర్మేంద్రియములు ఐదింటిలోనూ కలిసి, తన్మాత్రలతో కలిసి పంచభూతములును, అంతఃకరణములలో చేరి శిరస్సున కపాలములో (సహస్ర దళములో) ప్రకాశించినదే!!

(గర్భసంచియందు చేరిన దేహము యొక్క ఇరువదినాలుగు తత్త్వములు మొదట పురుషుని బుద్ధికి చెందినదే అగును. అది పురుషుని శిరస్సు – కపాలములో నెలకొనియుండును.)

456. పుష్పము యొక్క వాసనను వెదజల్లు గాలి, జగత్తునంతటా వ్యాపించియున్నట్లు, గర్భసంచిలో ప్రవేశించిన జీవకణములో మెల్లగా పొడవటి **ధనంజయమ**ను వాయువు సరైన సమయము చూచి లోనికి ప్రవేశించును.

(శరీరదశ వాయువులో ఒక వాయువు – **ధనంజయమ**ను వాయువు గర్భసంచిలో నుండు పిండకణములో సరైన సమయములో ప్రవేశించును.)

457. బాహ్యముగా వెళ్ళదగు అష్ట ప్రజ్ఞలతో కూడిన శరీరము, శరీరము లోపలికి ప్రవేశించదగు దశ వాయువులును, అష్టగుణములతో అమరిన పురుషుని శరీరమును నవద్వారములతో, కుండలినీ శక్తియను పాము, నాదములతో కలిసి పన్నెండు స్థానములకు వెళ్ళదగు ప్రాణమగు అశ్వమును (గుర్రము), అశ్వారూఢుడగు దైవము సరైన పద్ధతులతో శరీరములో చొప్పించకుండినచో పంది (మలముతో అశుభ్రము చేయునట్లు) చెడిన జన్మమే అగును.

(బాహ్యప్రజ్ఞలు (8): శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ, మనస్సు, బుద్ధి, అహంకారము. శరీరము లోపలికి ప్రవేశించు (10) వాయువులు: ప్రాణ, అపాన, ఉదాన, వ్యానయాన, సమాన, నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయ. శరీరం

లోపలికి వెళ్ళు (8) గుణములు: కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము, దుఃఖము, అహంకారం. శరీరం (9) ద్వారములు: రెండుకళ్ళు, రెండు చెవులు, రెండు నాసిక ద్వారములు, నోరు, పాయువు, ఉపస్థ. ప్రాణశక్తి లోకులకు కంఠము క్రిందయున్న ఎనిమిది భాగస్థానములకు (భాగస్థానములు: పురాతన కాల కొలతలు - వ్రేలి కొలతలు, జాన, బెత్త, మూరలు అనునవి) ప్రాణశక్తి యోగులకు కంఠము పైకియున్న నాలుగు భాగస్థానములకు వెళ్ళును. మొత్తము 12 భాగస్థానములు పేర్కొనబడినవి.)

458. స్త్రీపురుషుల సంగమమున శుక్ర, శ్రోణిత కలయికలో శుక్రము ఎదిరించి వెళ్ళి కలిసినచో జన్మించబోవు బిడ్డ దైవము వలె ఉండును. మారుగా శ్రోణితము ఎదిరించి వెళ్ళి కలిసిన బిడ్డడు నారాయణుడు వలె ఉండును. శుక్ర శ్రోణితములు రెండును సమశక్తితో కలిసి జన్మించిన బిడ్డడు బ్రహ్మవలె యుండును. మూవురి తత్త్వముతో కలిసిన బిడ్డడు మహాచక్రవర్తిగా మహా సామ్రాజ్యమేలును.

459. ఎన్నో భువనములందు (పలు లోకములలోని జన్మలు) తిరిగి వచ్చిన స్త్రీ, పురుషుల యొక్క సమ్మేళనములతో పిండోత్పత్తి అగును. పెక్కు జన్మలలో పెక్కు శరీరములో దూరిన ఆ పిండము చక్కగా ఈ తల్లి గర్భమునందు కుదురుకున్న పిమ్మట, మాయతో కూడిన ఇరువురి (స్త్రీ, పురుషుల) మనస్సు అందులో ఇమిడిపోవునే!!

460. గర్భమునందు ఏమీ తెలియని పిండమునకు మాయాతత్త్వములు వచ్చి చేరును. మొదటగా పిండము యొక్క తురీయం (ఉన్నతమైన శుద్ధస్థితి) వదిలిపోయి, జ్ఞాపకము మొదలగును. శక్తివంతమైన మాయా కార్యములగు అష్టగుణములు వచ్చి చేరును. శుద్ధ మాయాశక్తితో నాలుగు రకములగు వాక్కులు (మాటలు) కలుగును.

(పిండ స్థితియందే శిశువునకు జ్ఞాపకము, గుణము, వాక్కు అమరును. అష్ట గుణములు: ధర్మము, జ్ఞానము, వైరాగ్యం, ఐశ్వర్యము, అధర్మము, అజ్ఞానము, అవైరాగ్యం, అనైశ్వర్యము.

వాక్కులు నాలుగు రకములు:

నాభి నుండి వెలువడు శబ్దము - పరా

ఛాతి నుండి వెలువడు శబ్దము - పశ్యంతి

గొంతుక నుండి వెలువడు శబ్దము - మధ్యమా

నాలుక నుండి వెలువడు శబ్దము - వైఖరి)

461. అస్థులను జతచేర్చి, నరములు, నాడీమండలములతో నేయబడి, రక్తముతో కలిసిన మాంసపు ముద్దలను చక్కగా తీర్చిదిద్ది దేహమను ఇంటిని తయారుచేసి,

సుఖములను పొందదగు ఈ శరీరములో ప్రాణమును ప్రేమతో నింపిన ఆ దైవమును, ఆ మహామహుని దరి నేను చేరుచున్నానే!!

462. జీవులను పరిపక్వమొనర్చు ఉద్దేశముతో పాలవంటి సూర్యప్రకాశ శరీరఛాయ కలిగిన సదాశివుడు, శరీరములో నెలకొని అన్ని మంచి కార్యములే చేయును. గుదస్థానము నుండి (మూలాధారము నుండి) పురికొల్పి నడిపించు మూలాగ్ని (అపానవాయువు) వేగమును తగ్గించునట్లును, సుఖము పొందునట్లు నియతిని ఏర్పరచి అనుగ్రహించెను.
(సదాశివుడు శరీరములో నెలకొని మూలాగ్ని యొక్క తీక్షతను తగ్గించు నెపమున, జీవులకు సుఖజీవితమును (శృంగార జీవితమును) అమర్చి అనుగ్రహించెను.)

463. ప్రేమానుబంధము వలన కొన్ని నిందాకార్యములు చేసి, దానిలో చిక్కుకున్న పిండమును కొన్ని చక్రబంధముల నుండి విడిపించి, నాశము కాక కాపాడి, తానే అందులో ఇమిడి, కొన్ని విధములగు శుద్ధములను చేరి, శిశువు ఉన్నతుడగునట్లును, కొన్ని కర్మఫలములు వీగిపోవునట్లు, దైవము చేసి ఆదుకొనును.

464. స్త్రీపురుష సంగమములో శుక్రనాడియందు ఉత్పత్తియైన తెల్లని శుక్రము, అట్లే యోనియందు ఉత్పత్తియైన ఎర్రనైన శ్రోణితము, ఎనిమిది వ్రేలి కొలతలతో ఉత్పతియైన శుక్రము నాలుగు వ్రేలికొలతలతో ఉత్పత్తియైన శ్రోణితం లోపలికి ప్రవేశించును. అపుడు పంచభూత కరణములైదును (5), **అ**కారమగు నాదము (శ్రోణితం) **ఉ**కారమగు శుక్రము, **మ**కారమగు మాయయు ఒక్కటిగా కలిసి శిశువు శరీరము ఏర్పడి, తరువాత ఎనిమిది జానలుగా వృద్ధి చెందునే!!
(పంచభూత కరణములు: భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము.
పంచభూత బీజాక్షరములు: ల, వ, ర, య, హ
ఎనిమిది జానలు: జానెడు (అరచేతి కొలత) ప్రతి మనుష్య శరీరమును వారివారి జానలతో కొలిచినచో ఎనిమిది జానలే వచ్చును. ఇది పురాతన కొలతలు.)

465. శృంగారమునందు ఇమిడిన దైవము, గర్భమునందు పిండము చక్కగా ఏర్పడునట్లు సహాయమొనర్చెను. స్త్రీపురుష సంగమములో ముప్పది ఒక్క తత్త్వములు చేర్చి, ఇరువురి మత్తు సమయమున పిండమను గ్రుడ్డును ఇచ్చి అనుగ్రహించెను.
(ముప్పది ఒక్క తత్త్వములు: 24 ఆత్మతత్త్వములు (451 మంత్రము చూడవలెను) + 7 విద్యాతత్త్వములు (451 మంత్రము చూడవలెను).
ఇట్లు శివతత్త్వ దైవమే శృంగారకారకుడు, జన్మకారకుడై సృష్టిని కల్పించుచున్నాడు.)

466. పిండమైన ఈ శరీరములో అజ్ఞానముతో నిండిన ఇంద్రియములు ఐదును,

శరీరము ముందు జన్మలో మరణించునపుడు క్రియారహితముగా నశించి పోయినవి శరీరము చుట్టూయున్న అండకోశము లోపలయుండు జీవుడు పరిపక్వమొందినపుడు నాదతత్త్వముతో నెలకొనియుండును.

(అండకోశము: శరీరము చుట్టూ (పిండము దశలో) గ్రుడ్డుపెంకువలె ఆకాశము మూత మూసినట్లుండునను తత్త్వము.)

467. దేవుని మాయచే తయారైన ఈ శరీరమును కొలతల కర్రతో కొలుచునట్లు శివతత్త్వములోని అకార, ఉకార, మకార, నాద, బిందు, ప్రణవ తత్త్వములతో పిండమును నిర్వహించి, జీవుని నిలకడ చేయుటకు ఆత్మతత్త్వములు ఇరువది నాలుగును, విద్యాతత్త్వములు ఏడింటిలోనూ జీవుని సంస్కారవాసనలకు తగ్గట్లు చేర్చి, శరీరమను యంత్రములో తొమ్మిది ద్వారములను కూడ అమర్చి అనుగ్రహించెనే!!

468. అల్పసంతోషముతో తల్లిదండ్రుల ఇరువురి కలయికతో గలిగిన దేహము, మట్టియైన, దుఃఖమయమైన, కుండలో చేరినది ఆత్మ ఒక్కటే. దానితో తొమ్మిది ద్వారములలో క్రియించునది, అష్టగుణములతో కూడినదై, జ్ఞాన, కర్మేంద్రియముల పదింటితోనూ, మొత్తము పదునెనిమిది కలిగిన కలశమనునది ఆ గర్భసంచియను కొలిమి (పచ్చి ఇటుకలు, కుండలు కాల్చు కొలిమి) లో ఉడికి, కాలి పరిపక్వమొందినదే!! (మంత్రము 457 చూడగలరు.)

469. శరీరములోనే నెలకొనియున్న ఆరు రకములైన దుఃఖహేతువులను ఎఱుగదు. దాని మనస్సులో నెలకొనియున్న తామస, రాజస, సాత్త్విక గుణములను ఎఱుగజాలదు. అందు సిద్ధితత్త్వములు ఇమిడియున్నవని ఎఱుగజాలదు. ఇట్లు అందు (గర్భసంచిలో) పదినెలలు నిండిన పిండమగునే!!

(ఆరు దుఃఖహేతువులు: పొందుట, పోగొట్టుకొనుట, దుఃఖము, వ్యాధి, క్షీణత, మరణము. శరీరతత్త్వములు ఆరింటిని ఇట్లు శ్రుతి వర్ణించియున్నది: “అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతే.”

స్థూల శరీరము తత్త్వము: ఉనికి, పుట్టుట, పెరుగుట, మార్పు చెందుట, క్షీణించుట, నశించుట.

సిద్ధితత్త్వములు: అష్టమహాసిద్ధులు, అణిమాది మొదలగునవి – 1. అణిమా, 2. మహిమా, 3. గరిమా, 4. లఘిమా, 5. ప్రాప్తి, 6. ప్రాకామ్యం, 7. ఈశత్వం, 8. వశీత్వం.)

470. శరీరము మాయాజనితమైనది. శరీరములో ప్రాణమును ఉంచి, కవాటములతో కూడిన (తెరుచుట, మూయుట) తొమ్మిది ద్వారములను ఏర్పరచి, దృఢముగా

సహస్రదళములతో కూడిన తామరను శిరస్సుయందే ఏర్పరచి, అందు అగ్నిని (ప్రకాశమును) నింపిన దైవము సుషుమ్న ద్వారా చేరుకొనుటకు మార్గము చూపి అనుగ్రహించెనే!!

471. ఎచ్చటను (ఏ లోకమునందును) తనకు ఎటువంటి వికారము లేనివాడైన, ప్రకాశరూపుడైన పరమాత్మ (శివుడు) పిండములన్నింటికి పిండముగాయున్న ఆది సృష్టిని (తన శక్తి-మాయాశక్తితో కూడి) జగత్తును సృష్టించుచున్నాడు. ఆ మహామహుడే జీవుల గర్భములో జావగాయున్న పిండములో సూక్ష్మముగా ప్రాణమును చొప్పించుచున్నాడు. ఆ పిండమును పెంచి పోషించి, పెద్దదిగా ఎదుగునట్లు చేసి అనుగ్రహించినది నేను (రచయిత) విని నిలిచియుంటిని.
(శివుడు శక్తితో కలిసి జగత్తు సృష్టికి (మొదటి యోనిస్థానముగా చెప్పబడినది) లౌకికపిండ సృష్టికి, దాని వృద్ధికి తోడ్పడి త్రివిధ వృత్తులతో అనుగ్రహించు చున్నాడు.)

472. పుష్పమువంటి యోనియందు మొగ్గవంటి లింగాకారము నెలకొనుట వలన పుష్పించిన పిదప, శుక్ర, శ్రోణితముల మిశ్రమము వలన ప్రకాశవంతమైన జీవకణము తయారగును. అంతటా జలమయమైన గర్భసంచి అను ముంతలో తయారగు పిండశరీరము (పుర్యష్టక శరీరము: శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ, మనస్సు, బుద్ధి, అహంకారము - 8) నందు జీవ అణువులు అంతటా వ్యాపించియుండును.

473. ముందు చెప్పబడినట్లు అష్టఇంద్రియములగు శరీరము, నోరు, కన్ను, ముక్కు, చెవి అను ఐదింటిలోనూ మనస్సు, బుద్ధి, అహంకారమను మూడు అంతఃకరణములు కలిసి, వాటితో ఆశాపాశములకు తగ్గట్లు ఏర్పడిన శరీరములో ఆ మహామహుడే (శివుడే) ముందు వాటితో చేరి పిదప వాటిని విడిపించుట మీరు గ్రహించగలరు.
(శివుడు సూక్ష్మము, స్థూల, కారణములందు తానే ఇమిడి మరలా జీవుని వాటినుండి విడిపించుటయూ ఆతని ఆజ్ఞయే అగును.)

474. దైవముయొక్క నామమైన ప్రణవము (ఓంకారము)ను కలిపి, శరీరములో నాదముగా నొప్పారునట్లు చేసి, పశుతత్త్వము (అహంకారం) బంధతత్త్వము సంసారము అజ్ఞానము వీడునట్లు చేసి, వేదముల వలె శబ్దించు నాలుగు పద్మరేకులతో కూడిన మూలాధారచక్రమునందు గ్రహింపజేసిన వ్యాపకమును పృధివీతత్త్వమునుండి మొదలగునట్లు నియతిని అమర్చియున్నాడే!!

475. శక్తి లేక శివుడు లేడు. అట్లే శివుడు లేక శక్తియు లేదు. కాబట్టి శ్రేష్టమైన ఆ ప్రాణమునకు శరీరమును ఇచ్చు సమయమున ఇరువురి శక్తిని (కుండలినీ శక్తి (క్రియాశక్తి) + జ్ఞానశక్తి (బుద్ధి) రెండూ జీవునికి ఆవశ్యకము) జీవునిలో శివుడు ప్రేమతో అమర్చి అనుగ్రహించెనే!!

476. వారివారి కర్మఫలితములు తగ్గట్లు అమరిన ఈ జన్మలో శ్రేష్ట శక్తిని, జీవి అర్హత తగ్గట్లు విభజించి, చీకటి అను అజ్ఞానమును పోగొట్టి, ప్రకాశ స్వరూపుడైన దైవము (శివుడు) పెక్కు విధములైన సామర్థ్యములు కలిగిన ఇంద్రియప్రజ్ఞలను చొప్పించి, వాటిని కాపాడి, నిలుచున్నది ఆ మహామహుడే కదా!! (ఆ పరమశివుడే కదా!)

(జీవులయందు శివుడు, శక్తి – ఇద్దరూ నెలకొని కాపాడి అనుగ్రహించు చున్నారు.)

477. శ్రేష్టముగా వృద్ధి అగుచున్న ప్రకాశముతో నిండిన ప్రాణమును, పురుషుడుగా లేక స్త్రీగా లేక నపంసకుడుగా చూచునది కల్పనయే అగును. అది తల్లిదండ్రుల తత్త్వమునే పొందియుండును (శరీరమునకే లింగతత్త్వము గాని ప్రాణమునకు కాదుకదా!). ప్రాణమునకు తగ్గట్లు శరీరమును సృష్టించునది ఆ ప్రకాశస్వరూపుడు దైవము యొక్క మహానిత్యమే!!

(జ్యోతి స్వరూపుడైన దైవము తల్లిదండ్రుల ద్వారానే శరీరము సృష్టించెను.)

478. సంగమములో మిశ్రమమునకు తగ్గట్లు పురుష కణజాలం ఎక్కువైనచో శిశువు పురుషుడుగాను, స్త్రీ కణము ఎక్కువైనచో స్త్రీగాను, సమమైనచో నపుంసకుడుగాను అగును. దృఢమైన మనోసంకల్ప బలముతో కూడిన శ్రేష్టమైన సంగమము (స్త్రీపురుష కలయిక) వలన భూమండలమంతటిని పరిపాలించదగిన శిశువగును. అధమ సంకల్పము సంగమము వలన శుక్రక్షయయే అగును.

479. శుక్రము పురుషుని నుండి విడువడి ఐదు కొలతలు (వ్రేలి కొలతలు) శరవేగముతో దూసుకుపోయినచో శిశువుని ఆయుస్సు వంద సంవత్సరము లగును. నాలుగు కొలతలతో దూసుకుపోయినచో ఆయుస్సు ఎనభై సం॥ లగును. శుక్రమును ప్రయోగించుటలో వాయుతత్త్వముతో కూడిన ప్రాణశక్తిని బాగా గ్రహించిన వారికి, అనగా ధ్యానయోగులకు ఇది సాధ్యమగును.

(శుక్రము వాయుతత్త్వ వేగముతో కూడిన ప్రాణశక్తి ప్రయోగము వలన శిశువు ఆయుస్సు నిర్ణయింపబడును.)

480. శుక్రప్రయోగమున వాయుతత్త్వబలిమి తక్కువగా ఉండినచో శిశువు పొట్టిగా యుండును. విడువడు వాయుతత్త్వబలిమి పలుచగా (సన్నముగా) ఉండినచో శిశువు అంగవిహీనమగును. విడువడు వాయుతత్త్వము నిరోధకమైనచో శిశువు

గూని (నడుము వంక)గా అగును. ఈ విషయమున స్త్రీకి వాయు విడువడు తత్త్వము లేదు.

(శుక్రము విడువడునపుడు వాయుతత్త్వ బలిమిని బట్టి శిశువు యొక్క అంగ సౌష్టవము ఏర్పడును.)

481. తల్లి గర్భమున పిండముగా అమరిన శిశువునకు, తల్లి గర్భమున మలము నిల్వలు ఎక్కువైనచో శిశువునకు మందబుద్ధి ఏర్పడును. తల్లి గర్భములో నీటి నిల్వలు ఎక్కువైనచో మూగ ఏర్పడును. గర్భములో మలము, నీటి రెండింటి నిల్వలు ఎక్కువైనచో ఆ శిశువునకు గ్రుడ్డి ఏర్పడును.

(గర్భస్థ శిశువునకు తల్లి గర్భమున మలము, నీటి నిల్వలు అమితము కాకుండా చూచి శిశువునకు అంగవైకల్యం నివారించవచ్చును.)

482. సంభోగసమయమున పురుషునికి కుడినాసిక ద్వారా శ్వాసక్రియ (సూర్యకళ) జరిగినచో శిశువు మగబిడ్డడగును. ఎడమనాసిక ద్వారా శ్వాసక్రియ (చంద్రకళ) జరిగినచో ఆడశిశువు అగును. శుక్రము విడువడునపుడు ప్రాణ వాయువుతో అపానవాయువు (మూలవాయువు) ఎదురైనచో శుక్రము చెదిరి రెండు శిశువు లగును. సూర్యకళ, చంద్రకళ రెండు నాసికలలోనూ సమానముగా వెలువడినచో ఆ శిశువు నపుంసకుడగును.

(శ్వాసక్రియలకు తగ్గట్లు (సంభోగమున) పిండము లింగతత్త్వము ఏర్పడును.)

483. ప్రాణవాయువు సంభోగించు ఇరువురికి సమానముగా ఉన్నచో గర్భస్థ శిశువు చాలా అందముగా తయారగును. ఆ సమయమున ఇద్దరికి ప్రాణవాయువు తారుమారుగా జరిగిన ఆ స్త్రీలో గర్భమునందు పిండోత్పత్తి జరుగుటకు అనుకూలించదు.

(శక్తి, వేగము, ప్రాణవాయువు చలనము తగ్గట్లు గర్భము ఏర్పడును.)

484. స్త్రీ గర్భాశయమున నెలకొనియున్న శిశువు కొండనాలుకపై నెలకొనియున్న జ్యోతివంటిది. అది స్త్రీ లేక పురుషునిగానైన వృద్ధిచెంది, సూర్యుని బంగారు కిరణమువలె పూర్ణశరీరము పొంది, రూపముగా తయారగును.

(ప్రాణతత్త్వము సరైన విధానముతో శుక్లము విడువడుట పద్ధతిగా జరిగినచో శిశువు స్వర్ణవిగ్రహము వలె తయారగును.)

485. పూర్ణరూపము ఒక పద్ధతిలో పదినెలలు గర్భములో నుండి పొందును. పక్వమొందిన పిదప ఆ శిశువు భూమిపై జన్మించి వృద్ధినొందును. మాయాశక్తి వలన తన తల్లితోడుతో పెరిగి పెద్దదగును. కాని ఆ శిశుశరీరములో నెలకొనియున్న ప్రాణము అరూపమని ఎవరు ఎఱుగుదురు? (ఎవరూ ఎఱుగజాలరు)

(శరీరమునకు వేరుగా జీవుడు అరూపుగా ఉన్నాడని ఎఱుగవలెను.)

486. విత్తనము వెదజల్లిన వానికి తెలియదు (విత్తనము వేసిన తండ్రికి శిశువు ఏమని తెలియదు). పొందిన తల్లి గ్రహించజాలదు (తల్లికి శిశువు గురించి తెలియదు). కంసాలికి తెలిసిననూ ఎవ్వరికీ చెప్పలేడుగా!! (కారణమునకు తగ్గట్లు కార్యము జరిపించు బ్రహ్మ (కంసాలి) కూడా ఎవ్వరికి చెప్పలేడుగా!) నియతి చెప్పు పరమాత్మ అచ్చటనున్నాడే!! సృష్టియను నియతిని ఏర్పరచి ఇచ్చిన పరమాత్మ (సదాశివుడు) అచ్చటనున్నాడే! వింటినే ఈ మాయ అధమత్వమును ఈ విధముగా!!

(ఈ మాయ యొక్క తత్త్వము వింటినే!! **"మాయతత్త్వం అనిర్వచనీయం"** – శృతివాక్యము. మాయ వలన జగత్ సృష్టి–సమిష్టిత్వము; జీవుల సృష్టి–వ్యష్టిత్వము జరిగిననూ మాయను నిర్వచించుట ఎవ్వరికి సాధ్యము కాదు. ఆవరణశక్తితో అంతటిని కప్పివేయును.)

487. స్త్రీ పురుషులిరువురు ప్రేమతో, కోరికలతో కలిసిరి. దుఃఖము ఏర్పరచు బంధముతో ఏర్పడిన శిశువు దుఃఖముతోనే వృద్ధిపొందిన పిదప, ఉన్నతి పొందగోరి, లోకమంతటికి అనాదిగా నెలకొనియున్న పురాతనమైన దైవమును బడయుగోరి దైవమును మనసార స్తుతించినదే!!

488. కోకిల గ్రుడ్డుతో కాకి గ్రుడ్డును కలిపియుంచినచో ఎటువంటి శంక లేక కాకి పొదిగి పెంచునట్లు, ఎటువంటి విధానములు లేక, ప్రవృత్తులు లేక, ఎందుకు అన్న ప్రశ్నయూ లేక తల్లి మాయాశక్తికి లోనై శిశువు శరీరమును పెంచుచున్నది. (గర్భమున వృద్ధి చెందించుచున్నదే!!)

489. స్థావరములైన చెట్లు, చేమలు మొదట దుంపగానుండి, మొలకలెత్తి, ఆ మొలకలు పొదలై, పెద్దచెట్లుగా మారి ఫలములను అందించటం, వాటికి అవే సుఖములను పొందునట్లు, అన్నిటిని ఈ జగత్తులో (స్థావరములు, జీవులను) సృష్టించి, రక్షించి, ఫలవంతముగా చేయునదే భగవంతునికి (ఆది దైవమునకు) ఇష్టమైన శుభకార్య మగును. తాను కోరిచేసినవే అగును.

490. ఇతర దేవతల కన్నా శ్రేష్టమైన, మహోన్నతుడైన నా దైవము పరమేశ్వరుడు అజ్ఞానదేహములో నున్న లోటుపాట్లతో తానే ఏకమై వెలుగొందుచున్నాడు. అటువంటి దేవదేవుని ఊర్ధ్వలోకస్తులు (దేవతలు) కూడ ఎఱుగజాలరు. కాని లోకస్తులు (లోకములోనున్న ప్రజలు) తమతమ తపోశక్తితో చూడగలరు!!

(అజ్ఞానదేహము: ముమ్మలములతో కూడిన దేహం (అహంకారం, కామ్యం, మాయ.)

491. మహోన్నతుడైన ఆ పరమాత్మయందు సూక్ష్మముగా ఇమిడిన శ్రేష్టుడు, మరలా పరిపక్వము తగ్గట్లు ఫలము పొందగోరి, అలల సముద్రములో సూర్య ఉష్ణముతో ఉప్పు తయారై, నీరే ఉప్పురూపము పొందినట్లు, దైవానుగ్రహముతో మరలా శ్రేష్టుడుగా స్థూలశరీర పిండములో పెరుగుచున్నాడే!!
(మహోన్నతుడైన ఆ పరమాత్మ జీవుల పరిపక్వమొందవలెనను ఉద్దేశముతో వారికి ఉన్నత శరీరములను ఇచ్చి సహాయమొనర్చుచున్నాడు.)

## 15. త్రివిధ జీవవర్గము

విజ్ఞులు: అహంకారమను మలము మాత్రము కలిగినవారు.
ప్రళయారులు: అహంకారము, కామ్యం అను రెండు మలములు కలిగినవారు.
సకలురు:అహంకారము, కామ్యం, మాయ అను ముమ్మలములను కలిగినవారు.

492. శివుడు, శక్తియు ఇరువురు వినోదముగా ప్రాణమును జీవుల సూక్ష్మ శరీరములో నెలకొల్పి, శుద్ధ, అశుద్ధ మాయా రెంటిని జతచేర్చి శుద్ధమాయ యందు **తురీయం** నెలకొల్పి, జీవుల చిత్తమునందు **తురీయ** స్థితిలో శివరూప పొందుటకు అనుగ్రహించెను.
(ప్రాణమును జీవులందు నెలకొల్పిన ఉద్దేశము జీవులు ఎప్పటికైననూ తమ సత్యతత్త్వమును తెలుసుకొనుటకే. వ్యవహార క్రియాసహితమగు (సర్వకార్యములకు హేతువు) అశుద్ధమాయతో (తమో, రజో) జ్ఞానముతో కూడినదైన శుద్ధమాయను (సత్త్వం) సమాంతరముగా రెంటిని జీవుల చిత్తమునందు ప్రవేశపెట్టినది మొదలుకొని, జీవుల పూర్వవాసనలు (జన్మవాసనలు) దాటి, మేలైన **తురీయం** కైవసం చేసుకొని, జీవులు శివరూపమగుటకే. ఇది శివుడు, శక్తి కరుణతో కూడి కల్పించిన వినోదమగును (లీలలు). విజ్ఞులు – విజ్ఞానముతో, తేటనైన జ్ఞానముతో కార్య, క్రియారహితము పొందినవారు. ప్రళయారులు – ప్రళయమునందు కార్య, క్రియాశూన్యము పొందినవారు. సకలురు – అన్ని స్థితులందును ముమ్మలములతో కూడుకున్నవారు. సత్యజ్ఞానము ఎరిగి ఆత్మోద్ధారణ పొంది శివసాయుజ్యం అందరికీ పరకాష్ట. దీనినే అజ్ఞాననివృత్తి, సంసారనివృత్తి మొ॥ వాటితో ఆత్మజ్ఞానము పొందుట, జీవ, బ్రహ్మ ఐక్యముగా చెప్పబడినది. జీవుడు శివరూపమగుటకు ఇవే ఆచరణములు.)

493. విజ్ఞులు నాలుగు విధములైనవారు – తేటనైన జ్ఞానము కలవారు. ప్రళయ కాలములో ఆ జ్ఞానము పొందువారు. ప్రళయారులు మూడు విధములైనవారు. లోక వ్యవహారములో నెలకొని అజ్ఞానముతో కూడిన సకలురు మూడు

విధమములైనవారు. ఈ మూడు విధములైనవారు మొత్తము కలిపి పది విభాగములైరి.

(విజ్ఞులు నలువురుగా చెప్పునది: శరీరముతో నెలకొని యుండియే శివంను చిత్తమునందు పదిలము చేసుకొన్నవారు – జీవన్ముక్తులు. శరీరము వీగిపోయిన పిదప శివంతో నెలకొన్నవారు ఉత్తములు, మధ్యములు, అధములుగా మూవురుగా ఉండి, మొత్తం నలువురిని విజ్ఞులుగా చెప్పబడినది. ఇక ప్రళయారులులో కూడ ఉత్తమ, మధ్యమ, అధములుగా మూవురిని చెప్పబడినది. ఇక సకలురులో కూడ అజ్ఞానముతో కూడిన ఉత్తమ, మధ్యమ, అధమములుగా మూవురిని కలిపి మొత్తము త్రివిధ జీవవర్గస్తులను పది తారతమ్యములతో చెప్పబడియున్నది.)

494. విజ్ఞులు అహంకార మలము తప్ప మిగత తమ జన్మమలములను (వాసనా ఫలితములు) వదిలినవారు. నాలుగు వర్గములవారు –

a) అణుసదాశివులు (పది): ప్రవణులు, శాతాఖ్యులు, తీర్థులు, కారణకులు, సుశీలురు, ఈశులు, సూక్ష్మకులు, కాలురు, దేహేశ్వరులు, అంకుశులు.

b) అష్టవిద్యేశ్వరులు (8): ఆనందులు, సూక్ష్మకులు, శివోత్తములు, ఏకనేత్రులు, త్రిమూర్తులు, శీఖండి, శిఖండి.

c) మంత్రేశ్వరులు: యజ్ఞయాగాదులందు నమః, సువః, స్వాహా, వౌషట్, వషట్, ఫట్, హుం, మొదలగు ఏడు అద్యంతములుగా (చివరి ఉచ్ఛారణ) మంత్రోచ్ఛారణ, ఉపాసనలు చేసినవారు.

d) ఆత్మజ్ఞానులు: ఎత్తిన జన్మమునందే మరణానంతరము శివునిలో లయమగువారు.

495. విజ్ఞులలో పరిపక్వము కొంత కొరతనున్నవారు దేహముతో కూడియున్న సమయమున జీవన్ముక్తి పొందక మరుజన్మలో శివుని పొందుదురు. అట్లే ద్విమలములున్న రెండవ విభాగమువారు ప్రళయారులు రెండు జన్మలందును నూటఎనిమిది రుద్రుల పదము పొందినవారగుదురు. ఇక బలీయమైన మాయావశమున చిక్కుకున్న సకలురు ముమ్మలములను వీడనివారగుదురు.

496. ముమ్మలములున్న సకలురులలో కూడ కొందరు చిత్తములో శివుని సృజించినవారై జ్ఞానస్వరూపియైన శివంను పొందిరి. జ్ఞానము, క్రియలను (నిష్ట, అనుష్టానం) కలిపి సదాశివస్థితిని సృజించి నిలిచినవారు జ్ఞానరూపియై ముమ్మలములను దాటి నిలుచున్నవారగుదురు. జ్ఞానము, క్రియలు కలిగియు ముమ్మలములను విడువనివారు నాదతత్త్వమెరుగని ప్రకృతి, మాయలోనున్న సకలురు అగుదురు.

497. శివమయమై ఐదు రకములైన బలమైన మలములను జయించినవారు,

క్షయములేని సిద్ధులై ముక్తిపొంది క్షీణతలేని స్థితియందుండువారు. జీవ బంధము తొలగించుకొని పునర్జన్మ లేనివారైయుందురు. వారు శివుని నవతత్త్వములను, స్థితులను (భేదములను) గ్రహించినవారగుదురు.

(ఐదు రకములైన మలములు: అహంకారం, కర్మ ఫలితములు, మాయా – అశుద్ధ మాయ (మాయేయం), ఆవరణశక్తి – తిరోధానం.)

(పునర్జన్మ లేనివారై శివ నవతత్త్వములు గ్రహించినవారు: శివం, శక్తి, నాదం, బిందు, సదాశివం, మహేశ్వరం, రుద్రం, నారాయణం, బ్రహ్మం.)

(ముక్తిపొందుట = శివసాయుజ్యం పొందుట.)

498. విజ్ఞులు అహంకారమను మలము మాత్రము కలిగినవారు (అణు సదాశివులు). విజ్ఞులు వలే శుద్ధమాయలోనున్న ప్రళయకరులు రెండు మలములున్నవారు (అష్టవిద్యేశ్వరులు). పూర్తి అజ్ఞానముతో కూడుకున్నవారు సకలురు మూఢులు. వీరి ముప్వురులోను మరలా ఉత్తమ, మధ్యమ, అధమ విభాగములతో కూడుకొని తొమ్మిది విభాగములు కలవు (మంత్రము 493వ టీకా పోలినది).

499. విజ్ఞులు ఉన్నతమైన జ్ఞానసమున్నతమును అంతరమునందు నెలకొన్నవారుగా, ప్రళయకరులు అంతరమున సమున్నతము పొందక శుద్ధవిద్యామండలము నందు నెలకొనియు, సకలురు జ్ఞానసమున్నతము కొద్దికొద్దిగా పొంది శరీరముతో పునరపి జన్మములు పొందినను చిట్టచివరకు సత్యమైన ఆత్మజ్ఞానముతో శివసాయుజ్యము పొందుట నిశ్చయమేనగును.

(త్రివిధజీవులు చివరికి శివసాయుజ్యము (ముక్తి) పొందుటయే శివునికి ప్రీతియగును.)

500. అహంకారము కూర్పుతో కూడిన అజ్ఞానమును చిత్తము నుండి విడుపించు కొనినవారు ఈ దేహమున్నప్పుడే సకల పరిస్థితులను (సిద్ధులు) చూడగలరు. కాని అహంకారమను మలమును పొందియున్న సకలురు మలము నివర్తించుకొన్న పిదప ఉన్నతమైన శివతత్త్వం పొందుదురు.

## 16. పాత్రలు

ఆధ్యాత్మికతో సంపాదించిన పుణ్యఫలములను ప్రోగుచేయు పాత్రలు – అర్హులు శివయోగులే.

501. ఎంత బంగారము (దానధర్మములు) శివయోగులకు ఇస్తే, దాని ఫలితము ఇచ్చువానికి ఇహమునందును సిద్ధియూ, భోగమును, వార్ధక్యమునందు ముక్తియు నొసగును. భూమియంత బంగారము అజ్ఞానులకు ఇచ్చినచో ఫలితము

లేకుండుటయే కాక వార్ధక్యమందు కూడ సుఖముండదు.

(సత్‌పాత్ర ఎరిగి దానము చేసినచో ఇహమున సుఖము, పరమున సద్గతి పొందుదురు.)

502. కాలము వచ్చువరకు వేచియుండి ప్రాణమును పెకలించుకొని పోవుటకు వచ్చిన కాలుని (యముడు) పాశమునుండి విడిపించి, తన వశము చేసుకొను గుణవంతుని (దైవమును) చక్కగా, స్థిరముగా అవగాహన చేసుకొని, అంతరములోనే ఉన్నాడన్న ఎరుకతో సృజించి, ప్రాణముతో ప్రాణముగా కలిసియున్న ఆ దైవమును గ్రహించినవారు దేవలోక నివాసితులగుదురు.

(ప్రాణంలో నెలకొన్నవానిని బాగుగా గ్రహించినవారు దేవతలగుదురు.)

503. నేను (రచయిత) తల్లి గర్భమున పిండముగా నున్నప్పుడే శివజ్ఞానమును పట్టుకొనియుంటిని. ఆత్మజ్ఞానముతో దైవముయొక్క పాదపద్మములను శరీరముతో నున్నప్పుడే వీడకయుంటిని. పిమ్మట అశాశ్వతమగు శరీమును విడచి శాశ్వతమైన ప్రకాశస్వరూపుని పాదపద్మములను వెదకితిని. నెయ్యి పోయకనే అది వెలుగు జ్యోతి అగునే!!

(అదే స్వయంప్రకాశజ్యోతి.)

504. భోగవస్తువులు అవసరము తగ్గట్లు అవే వచ్చిచేరును. నశించు కాలమున అవే తనకు తానే నశించిపోవును. వీగిపోవలసిన కర్మఫలములు వెళ్ళిపోవును. మనకు చేరవలసినవి, అనుభవించదగినవి తనంతట తనే వచ్చి చేరును. ఇదంతయు మనల్ని రక్షించు పరమాత్ముని నంది (శివుడు) అనుగ్రహమని తలంచువాడు ఆ దైవయాజ్ఞను శిరసావహించు అర్హత గలవాడగును.

(సర్వము శివమయమని, అన్నియూ వాని అనుగ్రహమని, అన్నిటిని శివప్రసాదమని, ఈశ్వర ఋణిదానమని తలంచువారు ఈశ్వర కృపకు పాత్రులగుదురు.)

## 17. అపాత్రలు

### (అర్హత లేని పాత్రలు)

505. అందమైన గొడ్డావు (పాలివ్వని ఆవు)ను చక్కగా సింగారించి, బాగుగా గ్రాసము వేసి పాలుని పితికి త్రాగునట్లే, శీలము, వ్రతములు లేనివారికి ఇచ్చునది (దానమొసగునది ఫలితమివ్వని దానమగును), పైగా ఋతువులు తప్పి వేసిన పైరుపంటలవలె ఫలితం శూన్యమగును.

(సత్ప్రవర్తన, శీలము లేనివారికి వస్తువిచ్చునది ఫలితశూన్యమగును.)

506. యోగసాధనకు తగిన యమ, నియమములను (చేయకూడనివి, చేయదగినవి

– నిషిద్ధ, విహిత కర్మలను) గ్రహించి, ప్రేమ, దయ కలిగినవారికి దానము చేయవలెను. అట్లు ప్రేమ చూపనివారికి దానము చేయునది పెద్ద తప్పే యగునని లోకులు గ్రహించవలె!!

507. పంచమహాపాతకుడు సజ్జనులకు, సత్ప్రవర్తనలకు దానమిచ్చు తత్త్వమెరుగక చెడి పాడగును. కాని నిర్మలులైన జ్ఞానగురువులకు, పరిశుద్ధులైన పెద్దలకు, కామాది మోహములను విడిచినవారికి దానమిచ్చి, వారివారి సత్కర్మలందు నిమగ్నులైనట్లు చేయువాడు జ్ఞానము పొందుటయే కాక, పంచమహాపాతకుడు పడు నరకములో పడకుండును.

508. కొండంత పరిమాణం పోలిన వస్తు సంపదను దానమిచ్చిననూ, శివుడే ముందుండి అనుగ్రహించుచున్నాడను భావనతో రెండు చేతులు జోడించి (అంజలితో) నమస్కరించక దానమిచ్చినవానికి, ఆ దానము తీసుకున్నవానికి, ఇరువురు ఏడు విధములైన నరకములో పడి కొట్టుమిట్టాడుదురు.
(ఈశ్వరకృప, ఈశ్వర అనుగ్రహమని తలంచి దానమీయవలె. ఈశ్వర ప్రణిదానమని దానము తీసుకొనవలె. లేకుంటే మహాపాతకమగును.)

## 18. తీర్థం

పునీతమైన నీరు తీర్థమనబడును. ఇది బాహ్యమునే కాక అంతఃశరీరములో కూడా మూలాధారచక్రము నుండి సహస్రదళ (శిరస్సున) స్థానము వరకు నెలకొనియున్నది. ఇది గ్రహించి అందు స్నానమాచరించవలెను.

509. భూమండలము బోలిన ఈ శరీరమున మూలాధారచక్రము మొదలుకొని సహస్రదళము వరకు ఏడు తీర్థములు గలవు. తమ కర్మఫలితములను (ప్రారబ్ధమును) పోగొట్టుకొనుటకు ఇందు నెలకొని స్నానమాచరించరు. ధర్మమార్గ మెరుగని మూఢులు భూమండలములో (బాహ్యముగా నున్నది) గొయ్యిలైన తీర్థములను, పర్వత శిఖరములైన మెట్టభూములను వెతికి వెళ్ళి అల్లాడుదురే!!
(జ్ఞానులు అంతరమున నున్న తీర్థస్థలములందు స్నానమాచరించి, అందు నెలకొనియుందురు.)

510. తేటనైన జ్ఞానమున్నవారి చిత్తమున నెలకొనియున్న శివుడు దివ్య దేవాలయము లందు ప్రార్థన చేయువారికి చల్లనైన తత్త్వముతో దర్శనమిచ్చును. కామ గుణములతో నెలకొన్నవారు ఎప్పటికీ శివుని పొందజాలరు. ప్రాణయామాది యోగాభ్యాసకులు ఎప్పటికైన దైవము (శివుని)ను ఒక సమయమున పొందగలరు.

511. మనోమండలమునందు సృజించియున్న మహిమాన్వితమైనదానిని, అధర్మ

మార్గమవలంబించు కల్మషులు ఎప్పటికి ఎరుగజాలరు. నీటి ప్రవాహమును ఒకని చెడు ప్రవర్తనతో దారి మళ్ళించు కార్యము అన్నది, పల్లపునీటిని కన్నములతో నిండిన తోలుసంచితో ఎత్తి పోయునట్లే అగును (నిష్ప్రయోజనమగును).
(కల్మష మనోభావమున్నవారు శివుని చిత్తమున నెలకొని ఉన్నతిని పొందజాలరు.)

512. ప్రకాశమండల వాసులు ఆకాశమండలములో నెలకొనియున్న ప్రాణమండలము (చిదాకాశము) నందు ఇమిడియున్న ఆదిపురుషుడైన శివుని ఎరుగుదురు. కామకళలను నిరోధించుటలో జయము పొందుట వలన, మహాప్రణవ ఘోషతో పెల్లుబికివచ్చు గంగా ప్రవాహములో ఇంద్రియ నిగ్రహముతో జీవులు స్నానమాచరించుటచే పునీతులైరి.

513. సముద్రములో వస్తువులను పడవేసి చెఱువులో వెతకినట్లు శరీరమునందే చూడవలసినది విడచి బాహ్యముగా వెతుకునది వట్టి మూఢత్వమే అగును. ఖచ్చితముగా శివమహామహుని అనుగ్రహము మనలో నున్నదని మనమెరుగక యున్నామే!!

514. శరీరములో ఏర్పడిన ఈ మిశ్రమనీరు (సూక్ష్మ పంచ భూతముల తన్మాత్రల - పంచీకరము) తామసతత్త్వమునకు వశపడునపుడు నల్లగాను, రాజస తత్త్వమునకు వశపడునపుడు ఎర్రగాను, సాత్త్విక తత్త్వమునకు వశపడునపుడు తెల్లటిఛాయగా, చిదాకాశత్వము పొందును. అట్లు కలిసిన నీటిలో అగ్నియొక్క ప్రకాశము, గాలియొక్క వాయుతత్త్వములు ఇమిడియుండును.
(అప్పు (నీటి) తత్త్వము, ఆకాశము (శబ్ద), వాయువు (స్పర్శ), అగ్ని (రూప / ప్రకాశము) పంచీకరణ తత్త్వముతో సూక్ష్మభూతములు ఇమిడియున్నవి.)

## 19. దివ్య దేవాలయములకు కీడు చేయుట

### (దివ్య దేవాలయములకు కీడు చేయుట వలన కలుగు భ్రష్టత్వము)

515. దేవాలయములో దివ్యసాకార శరీరరూపిగా నెలకొనియున్న శివలింగమును పెకలించి వేరొకచోటున ఉంచుట, దానిని స్థాపించుటకు ముందే పరిపాలన నాశనమగును. మరణమునకు ముందే కుష్టురోగముతో పీడించబడును. ఇట్లు నా ప్రాణనాథుడైన మహానంది (శివుడు) చెప్పియున్నాడే!!

516. శాస్త్రోక్తముగా కట్టబడిన దివ్యదేవాలయ గోడల మధ్యనుండి ఒక్క రాయి పెకలించినచో, అట్లు చేసినవాడు మకుటము (కిరీటం)తో అభిషిక్తుడైన రాజైనను సరే వానిని నరికి క్రిందపడవేయును. వాడు గొప్ప మునివర్యుడైనను తపోఫలము సిద్ధించదు. వాడు గొప్ప వేదపండితుడైన నరికి క్రింద పడవేయుననునది నా శివుని ఆజ్ఞయైయున్నది.

(దివ్య దేవాలయములకు ఎటువంటి కీడును తలపెట్టరాదు. దేవాలయ ఆస్తి అపహరణ కులక్షీణతకు దారితీయును.)

517. యముని కాలితో తన్నిన దైవము ఉద్భవించిన (స్వయంభువుగా) దేవాలయములలో వేద ఆగమముల విధానములతో నెలకొల్పబడిన శాస్త్రోక్తములైన పూజా, నిత్య, నైమిత్త్య కర్మ విధానములు తప్పినచో, భరించలేని వ్యాధులు దరిచేరును. భూమిలో అనావృష్టి ఏర్పడును. ప్రతిష్టతో రాజ్యమేలు రారాజు కూడా యుద్ధము చేయలేని శక్తివిహీనుడగును.
(దివ్య దేవాలయములలో నిత్యనైమిత్త్య పూజలు సదా జరుగవలెను.)

518. ఆదియైన పరమాత్ముని దేవాలయములందు పూజలు సరిగ్గా జరుగక పోయినచో, ఆ రాజునకు పలు కీడులు ప్రాప్తించును. వర్షపునీటి కొరత (అనావృష్టి) ఏర్పడును. భూలోకములో కన్నముపెట్టి దొంగలాడుట వృద్ధియగునని నా నందీశ్వరుడు చెప్పియున్నాడే!!

519. అర్హత పొందక (శివదీక్ష)నే పేరొందిన బ్రాహ్మణుడు శివమహామహునికి పూజలు చేసినచో, యుద్ధ సన్నాహము చేయు రారాజుకి తీవ్రమైన వ్యాధి ప్రాప్తించును. తన రాజ్య మొత్తమునకు క్షామము (కరువు) ఏర్పడునని, శ్రేష్టుడైన నందీ మహామహుడు చెప్పియున్నాడే!! (నందీశ్వరుడు - శివుడని గ్రహించవలెను.)

## 20. అధోముఖ దర్శనము

సదాశివమూర్తికి తత్పురుషం, అఘోరం, వామదేవం, సద్యోజాతం, ఈశానం అను పంచముఖములే కాక అధోముఖము కూడ కలదు. అధోముఖ దర్శనము ఇందు వివరించబడినది.

520. ఓ మహామహుడా! దేవా!! మేము దుఃఖించుట సరియేనా? అని ప్రకాశ మండలవాసులను (దేవతలను) చీకటి మండలవాసులు (రాక్షసులు) పెట్టు బాధలను ఓర్వలేక వేడుకొనగా, పగడము వంటి (ఎర్రనైన) శరీరఛాయ కలిగిన షణ్ముఖుడు (కుమారస్వామి/సుబ్రమణ్యుడు - ఆరుముఖములు గలవాడు)ని, **నీవు నేనిచ్చు సైన్యమును తీసుకువెళ్ళి దేవతల శత్రువులను నాశనము చేయుమ**ని శివుడు ఆజ్ఞాపించి దేవతలను రక్షించెను.
(శివుని ఆజ్ఞను శిరసావహించి షణ్ముఖుడు దేవతల బాధను తీర్చి దేవతలను రక్షించెను.
యోగపరిభాషలో: హృదయగుహ యందుండు ప్రకాశమే షణ్ముఖుడనియు, కంఠములోనున్న శబ్దము ఓంకారనాదమగు గణేశుడనియు, మూలాధార చక్రము

మొదలగు సహస్రదళము వరకున్న ఆరుచక్రములను దాటి కుండలినీ జీవశక్తి సదాశివమూర్తిని (సహస్రదళ పటలమున నుండు) చేరుకొనుటచే, కీడులను సంహారమొనర్చి సుఖములను, శాంతిని చేకూర్చునదిగా చెప్పబడినది.)

521. తెల్లనైన పుష్పమాలను శిరస్సునందు ధరించిన జటార్ఝూటము గలిగిన శివమహామహుడు సకల అండములను అష్టదిక్కులను తనపై భరించుచున్న అధోముఖము యొక్క కంఠము నల్లగా మారినది ఎవ్వరూ గ్రహించలేదు. తాను విషమును త్రాగుటచే కంఠము నల్లనైనదని గ్రహించజాలరే!!
(మూలాధారములోనున్న శివుని అధోముఖము జీవులు ప్రకాశము పొందునట్లు అనుగ్రహించునది.)

522. నల్లనైన కంఠముతో నొప్పారు మహామహుని, మహాసముద్రములతో చుట్టబడిన భూలోకములోని లోకస్తులు అసత్యవాక్కులే పలుకుచున్నారు (తత్త్వమును మరిపించి పురాణములను చెప్పుట) అసత్యము బదులుగా సత్యతత్త్వము పలికినవారికి దేవతల స్థానమును వారికి అనుగ్రహించును. ఈ అండములను సృష్టించిన తాను అసత్యమును, సత్యమును బాగుగా ఎరుగునే!!
(నీలకంఠ మహామహుని సత్యతత్త్వమెరిగిన వారికి దేవతలు కూడ స్తుతించునట్లు తాను అనుగ్రహించునే!!)

523. మూలాధారము నుండి రుద్రుడు సుషుమ్ననాడి ద్వారా పైకి ప్రాకి శిరస్సులో నున్న ఎర్రనైన ప్రకాశముతో గల శివునిలో కలిసి, నొప్పారునపుడు, నివృత్తి క్రియతో భ్రమించు అండముల యొక్క గతిని మార్చి, గెలిచి పైకి వచ్చి నిలబడునట్లు చేసి ముగింపు పలుకునది శివుని యొక్క అధోముఖమే అగును.
(నివృత్తి ప్రక్రియ అండములను క్రిందకు లాగు శక్తి దీనికి అడ్డువేసి, నిరాకరించి, గెలిచి, తమతమ స్థానములోనే అండములు సక్రమముగా భ్రమణమగునట్లు చేయునది శివుని అధోముఖ శక్తియే అగును. జగత్తు సృష్టి ప్రకటన మగునపుడు ప్రవృత్తి క్రియలు - జగత్తు లయము పొందునపుడు నివృత్తి క్రియలు ఆధారములగును.)

524. అధోముఖమనునది కడపటి చక్రములోనున్న ప్రణవమగు అండములోని పురాతనుడు (అనాది). వానికి సూక్ష్మశరీరములోనంతటికి వెళ్ళగలిగిన శక్తి కలదు. సత్ అయిన ఓంకార ప్రణవరూపమున ప్రకాశముతో నొప్పారిన పరాశక్తితో కలిసిన పరమాత్మయగును. వాడే అధోముఖముగా ఉండి, జీవుల యొక్క ప్రారబ్ధమును గలిగించువాడగును (ప్రణవము = అ, ఉ, మ, బిందు, నాదము అను ఐదగును.)

525. బోర్లించిన ముఖముగానున్న పెద్ద పుష్పము యొక్క కథను వినండి. శిరస్సున బోర్లించిన (అధోముఖముగా నున్న) సహస్రదళ చక్రస్థానము నుండి వంద నాడులు క్రిందకు చూచునట్లున్నవి. బోర్లించిన నాడుల స్థానములో నున్న నాశములేని శక్తులతో అధోముఖమైన మహామహుడు (దైవము) నెలకొనియున్నాడు.

(వంద నాడులు అధోముఖముగా నున్న సహస్రదళ స్థానమను పుష్పము నుండి క్రిందకు ప్రాకి వెన్నెముకలో గల ఒక్కొక్క పూసయందు శివ, శక్తికి మారుపేరుగా నెలకొని క్రియించుచున్నవి. దీనిని యోగసాధకులు ఎరుగగలరు.)

## 21. శివనింద

**(చిత్తమున శివుడే అనాదియను తత్త్వము ఎరుగక ఉండుటయే)**

526. పూర్వీకులు తేటనైన జ్ఞానముతో చిత్తమునందు, దేవలోక అధిపతియైన శివుని దరిచేరి అనుగ్రహము పొందిరి. ఇట్లుండగా శివుని క్షుద్రదేవతయని హేళనము చేయువారు, చిలుక పిల్లికి చిక్కి నాశనమగునట్లే అగును.

527. రాలిపోయిన దేవతలు, రాక్షసులందరు కామము వలన నాశనమైపోయినవారే. వారి శరీరములో అధోముఖముగా నొప్పారు సత్యస్వరూపుని గ్రహింపజాలరు. ప్రేమతో ఊటగా స్రవించు అమృతము వంటివాడును, ఆదియైన మహామహుని (శివుని) దేహమునందే ఇమిడ్చి, దేవాలయమని గ్రహించినవారు తప్ప, మిగతావారు ఎరుగజాలరు.

(శివ మహామహుడే – పరమేశాం, పరమశివుడు.)

528. అసురులు, దేవతలు ఈశ్వరనింద వలన తీరని పగచే ఉన్నతి పొందలేక జీవితపు మధ్యలోనే నాశనమైరి. ఈశ్వరుని యందు ఎటువంటి పగ ఉంచుకొన్ననూ, ఆతనిని పొందజాలరు. ఈశ్వరుని చులకన చేయుట, పగబూనుటతో కీడు (పాపఫలము) ఒకటికి అది పదింతలగునే!!

(ఈశ్వరనింద, హేళనము చేసినచో, పాపఫలము పదింతలైన కీడును కల్పించును.)

529. వైదికునిగా జన్మించిననూ, స్త్రీ భోగమును, శరీరమును తలంచి, ఆగమములను తమ చిత్తమునందు నిలుపుకొనక, మనమే బ్రహ్మం అని, ధర్మాత్ములని తలంచువారు దైవముపై భక్తి, ధ్యాసలు వారి చిత్తమునందు పదిలము చేసుకొనజాలరు.

(తామే బ్రహ్మమనియు, ఇతర బ్రహ్మంలు మరేవీ లేవను కల్పనలో నున్నవారు ఈశ్వరుని దరిచేరని, ఈశ్వరనిందయే అగును.)

## 22. గురునింద

గురునింద – గురువుపై చేయు దూషణ, నిందించడం. దానివలన ఏర్పడు కీడులు.

530. అధములు జ్ఞానము పొందినవారి దరిచేరి అనుసరించలేరు. పైగా తమతో కూడియున్న వారిని కూడ దుఃఖపడునట్లు చేయుదురు. జ్ఞానుల దరిచేరి వారి సాంగత్యముతోనే జ్ఞానము పొందగలరు, కాని మరే మార్గములోను పొందజాలరని ఎరుగకయున్నారే!!

531. **ఓం** అను ప్రణవము, దానియొక్క అర్థము శిష్యుడు గ్రహించునట్లు చేసి, మహోన్నతమైన నాదశబ్దార్థమును బోధపరచిన గురువు మనస్సు నొప్పించునట్లు చేసినచో, ఊరు చుట్టూ తిరుగు కుక్కగా జన్మించి, పిమ్మట ఒక యుగము వరకు భూమిలో పురుగువలె సంచరించుదురు.

532. గృహస్థ ధర్మమాచరించు జ్ఞానులకు, తత్త్వజ్ఞానులకు మనస్సు బాధించునట్లు కీడు చేసినచో సంపదయు, ప్రాణమును ఒక్క సంవత్సరములో కోల్పోవుదురు. ఇది సత్యము. సదాశివుని యొక్క పై ఆజ్ఞ (దైవాజ్ఞను తెలుపునది).

533. ఏకాక్షరమే భాషగా యైన ప్రణవమును ఉపదేశించిన మహాతపస్వియైన గురువునకు మనస్సు బాధ కలుగునట్లు కీడు చేసినవారికి, చీదరించుకొను కుక్కగా వంద జన్మలు ప్రాప్తించును. పిమ్మట అధమ జన్మములు ఎత్తి మట్టిలో మాడి నశించుదురు.

534. శివయోగుల మనస్సు నొప్పించినచో దేశము, రాష్ట్రము, మిగత క్షేమం అంతయు నాశనమగును. ఇంద్రుని పరిపాలన మహాచక్రవర్తి సామ్రాజ్య పరిపాలన పీఠమంతయు నాశనమగును. ఇది మా నందీశ్వరుని (శివుని) ఆజ్ఞ కదా!!

535. సన్మార్గమును బోధించు సద్గురువు ముందు అసత్యము పలికినచో, ముందు చేసిన జపతపాదులు చెడి, సద్గురువు ద్వారా పొందిన జ్ఞానోపదేశము కూడ నిలబడదు. పూర్వపు ఉపదేశము, ధర్మములు మరచి, ఆత్మోద్ధారణకు వలసిన ధర్మములు చెడి, బీదరికము దాపురించునే!!
(గురువు ముందు పలుకు అసత్యముల వలన జ్ఞానము చెడి బీదరికము కూడ దాపురించును.)

536. చేతిలో పెట్టిన మహామాణిక్యము వదిలిపెట్టి, కాలికి తగిలిన రాతిని ఎత్తుకొని మోయువాని ప్రారబ్ధము వలె, చేతిలో స్వచ్ఛనేయి, పాలు, పెరుగు ఆహారముగా యున్ననూ, దానిని వదిలి తనకు హితముకాని పిడికిలిలో నున్నదానిని తినుటవలె, జ్ఞానమార్గమును వదిలి కర్మమార్గమాచరించుట అగునే!!
(కర్మమార్గము కన్నా జ్ఞానమార్గమే శ్రేయస్కరమని సూచించుట.)

## 23. మహేశ్వర నింద

**(మహేశ్వరుని పూజించువారు ఆయనను నిందించడము, దానికి తగ్గ ఫలితములు)**

537. శివుని పూజించు శివయోగులు సాధారణ జగత్తు కార్యములకు వేరుపడినవారు. శివయోగులు ఆకలిదప్పులు వేసినప్పుడు భిక్షాటనము చేసి తమ ఆకలిదప్పులు తీర్చుకొనెదరు. అటువంటి శివయోగులను నీచమైన మాటలతో దూషించిన యెడల తమకు తావే అధోగతియైన నరకములో పడుటకు దారి వెతుక్కున్నవారగుదురు.

538. శివజ్ఞానులను దూషించువారు, మంచివారని శివజ్ఞానులను పొగడువారును పాపపుణ్య ఫలితములను రెండింటిని పొందువారగును. పాపపుణ్యములు రెండును రెండు సంకెళ్ళు వంటివే. ఆ శివజ్ఞానుల దరిచేరినచో రెంటిమధ్య ఫలితములు తొలగించి శివభోగమును బోధించి అనుగ్రహించుదురే!!

(పాపపుణ్యములు రెండునూ పునర్జన్మకు కారణహేతువులే. రెండింటిని పోగొట్టుకొనుటకు ప్రయత్నమే శివజ్ఞానులు దరిచేరి శివబోధను పొందవలెను. (శివజ్ఞానము పొందవలెను.)

## 24. తితీక్ష

**(సహిష్ణుత్వము - సహింపు - శరీరములోని అమృతము వృధా కానీయకుండుట)**

539. ఆత్మజ్ఞానము జారిపోకుండా నిలబెట్టు యోగులకు కూడ వారి హృదయములో ఆత్మజ్ఞానముతో కలిసి కొన్ని ఆలోచనలను బల్లివలె (బల్లి పట్టిన దానిని అంత సులభముగా విడువదు. అట్లే ఆలోచనలు కూడ) అంటుకొని ఉన్నది. ముక్కును, నాలుకను ఒకటిగా చేర్చు పద్ధతిని అవలంభించిన వారికి, మారుచున్న మనోమండలమంతయూ కాంతివంతమై అమృతమును శరీరమునందు పెంపొందించుట చక్కని ఓపికతో కూడుకున్న చర్యయగును.

(ముక్కును, నాలుకను ఒక్కటిగా చేర్చునది: నాలుకను లోపలికి మడచి కొండనాలుకను తాకునట్లు చేసినచో, ప్రాణవాయువు క్రిందికి వెళ్ళకుండా శిరస్సునందే బంధించునట్లు చేయుట వలన, చిత్త నిరోధకము ఏర్పడి అమృతమను జ్ఞానము వృద్ధిపొందును. ఇది యోగసాధకుల అభ్యాస ప్రక్రియ.)

540. తెల్లటి ప్రకాశముతో ప్రజ్వలించుచున్న శివుని పాదపద్మములను నమస్కరించి ఉన్నతి పొందగోరి, ఆతని సభాస్థానములో కొలువుదీరిన అనేకమంది అమర్తులగు దేవతల వద్ద ఈ ఓర్పుగల గొప్ప జ్ఞాని నారాయణునికి, ఆది బ్రహ్మకు కూడ నాయకుడగును. ఇంకా లోకమునకు కూడ గొప్ప శ్రేష్టుడని చెప్పి

శివమహామహుడు అనుగ్రహించెనే!!

(ఓర్పుతో నున్న జ్ఞాని దేవలోకమునకు, భూలోకమునకునూ మహా శ్రేష్టుడగును.)

541. ఆత్మజ్ఞానము కైవసము చేసుకొన్నవారు జీవులందరికి రారాజు అగుదురు. అటువంటి జ్ఞానిని గోళక, ఇంద్రియ ప్రజ్ఞల సేనలు ధీటుగా ఆతనిని ఆక్రమించుకొన్ననూ, అతని దేహమును సృష్టించగలగిన దేవదేవుడు కూడ అతని విధిని మార్చి జ్ఞానము నొసంగి అనుగ్రహించగలడు.

(ఆత్మజ్ఞానము పొందిన సహన (ఓర్పు) శీలురు దేవాదిదేవుని కూడ (పరమాత్మను) పొందగలరు.)

542. జీవాత్మల పరిపక్వము తగ్గట్లు, వాని శరీరములోను, హృదయములోను, పలు విధములైన సుఖదుఃఖములను ఏర్పరచి, వాటిని అనుభవింపజేసి శివుడు పరిపక్వమొనర్చును. మూలాధారము నందు నిలుచుండి ఆధార, నిరాధార కళలలో నాట్యమాడు ఆ నటరాజ మహామహునికి ఆ నాట్యఫలముగా అపరిమితమైన లయముతో పరిపూర్ణ సంయమత్వమేర్పడునే!!

(శివుడు జీవులకు తగ్గట్లు వారిని పరిపక్వమొనర్చి అనుగ్రహించును.)

## 25. జ్ఞానుల సాంగత్యము

543. తీర్థయాత్రలు చేయువారితో కలిసి నేనునూ స్థలయాత్రలు చేసెదను. కీర్తనలు చేయువారితో చేరి శ్రవణానందము పొంది క్షేమముగా జీవించుదును. సమున్నత అంతర్ జ్ఞానము బడయుగోరు జ్ఞానులను అనుగ్రహించు మహాదేవునితో నెలకొనియున్న వారితోచేరి, వారి పాదపద్మముల యందు చేరియుందునే!!

(ఉన్నతమైన యోగుల సాంగత్యముతో దైవమును పొందగోరుట.)

544. ఎటువంటి ఊతకర్ర లేని చెట్టుకొమ్మ మంటలలో చిక్కుకుని మాడిపోయినట్లు, మనోదృఢమైన వారు కూడ ఉన్నతమైన (స్వాంతనము కలిగించునదైన) మనస్సుయందు ప్రేమ సలిపి, దానితో వెళ్ళడము లేదు. ఓ మనస్సా! నీవు ఒంటరివై ఏమి సాధించగలవు? దైవమును పొందగోరి వెళ్ళునపుడు నాతో వచ్చుదువు గాక!!

(మనస్సునకు బుద్ధిమతి చెప్పి దైవము వైపు త్రిప్పుట.)

545. సత్యజ్ఞానము (ఆత్మజ్ఞానము) పొందగోరు జ్ఞానులు దేవదేవుని కొలిచి వానియందు సదా నెలకొనియుందురు. ఆత్మజ్ఞానము, విద్యాజ్ఞానములను దాటివెళ్ళి శివతత్త్వములో ఇమిడియుందురు. సత్య, ధర్మమార్గమున నున్నవారికి నేను ఉపదేశించునదేమనగా జ్ఞానులతో కూడిన సాంగత్యమే మహానందమొసగును.

(సజ్జన, యోగుల సాంగత్యము ధర్మమార్గమును చూపునదే కాక మహానందమును కూడ నొసగును.)

546. జ్ఞానులతో సాంగత్యము నున్నవారు దీర్ఘమైన ప్రకాశకిరణములు గలిగిన ఆ శివమహామహుని బంధువులగుదురు (చుట్టములగుదురు). లౌకికముగా నున్ననూ సన్మార్గమును పాటించువారు నా నాయకుని (శివుడు) పాదపద్మములను పొందుదురు. మౌనము పాటించి ఆత్మనిష్ఠలో నెలకొన్న వారికి అనుగ్రహించునది, శివుని పొందదగు శివతత్త్వము మొదలగునవి ఈ జ్ఞానుల సాంగత్యము వలనే కలుగును.

(జ్ఞానుల సాంగత్యము శివతత్త్వమును గలుగజేయును.)

(శివమహామహుడు, పరమశివుడు, దేవాదిదేవుడు, పరమాత్మ, పరబ్రహ్మం, భగవంతుడు పర్యాయపదాలే. అన్నియూ ఒక్కటేయని ఎరుగగలరు.)

547. సర్వగతుడగు శివుని పొందిన జ్ఞానులకు దాసానుదాసుడనై, శివజ్యోతిలో నెలకొని శివపురములో ప్రవేశించితిని. శివపురములో ద్వారమునందు నిలుచున్నవారు నన్ను చూచి శివమహామహునికి విన్నవించగా, శివమహామహుడు నన్ను లోపలికి రమ్మని ఆజ్ఞాపించి, అభయహస్తమును జూపించెను.

(శివజ్ఞానులకు దాసానుదానుడైన సాంగత్యము శివపురము చేర్చును.)

548. జ్ఞానుల సాంగత్యము వలన కళాజ్ఞానమును (పదహారు కళల జ్ఞానము) కూడ పొందగలరు. మహోన్నతమైన జ్ఞానమును పొందినవారై జన్మ చక్రబంధము నుండి విడివడుదురు. హక్కుతో తన వశము చేసుకొను శివుని నా ఆత్మయందు పదిలము చేసుకొని పరమానంద జీవితము గడిపి, శ్రేష్టత, మహత్వము, హక్కు, ఇవన్నియూ ఈ జ్ఞానుల సాంగత్యము వలన పొందిన వాడైతినే నేను!!

(సజ్జన, జ్ఞానుల సాంగత్యము కళాజ్ఞానమును నొసగునదే కాక జన్మరహితము కూడ ఏర్పరచునది.)

రెండవ తంత్రము సమాప్తము

ఓం తత్సత్

సర్వం శివార్పణమస్తు

# మూడవ తంత్రము

## 1. అష్టాంగయోగము

అష్టాంగయోగము = యమ, నియమ, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి అను ఎనిమిది యోగ అభ్యాసములు. ధర్మాచరణలను బోధించి, పిదప దైవత్వమును బోధించిన గురువర్యులు ఆ దైవమును పొందుటకుగాను విధివిధానములను మొదలగునవి బోధింప ఆయత్తమగుచున్నారు.

549. పలు విధములుగా వర్ణింపబడు ఈ ప్రాణ (శ్వాసక్రియ) సక్రమ మొందుటకు గాను, అది 12 వ్రేలికొలతలుగా (వ్రేలికొలత = సుమారుగా ఒక అంగుళము నిడివి) కంఠమునకు క్రిందగాను, పైగాను ప్రక్రియ జరుపునను విషయమును అష్టాంగయోగములో చెప్పబడి, నా గురునాథుడు నందీశ్వరుడు **యమము** (చెడుపును పారద్రోలుటయు), **నియమము**లను (హితములు – మంచివి అవలంభించుటకును) విధానములను బోధించి అనుగ్రహించెనే!!

(12 అంగుళముల నిడివిలో జరుగు ప్రాణశక్తియగు శ్వాసక్రియను సక్రమ పద్ధతిలో జరుగునట్లు అష్టాంగయోగమును నందీశ్వరుడు బోధించెను.)

(రచయిత యొక్క గురునాథుని పేరు నందీశ్వరుడు. శివుని వాహనము నందీశ్వరుడు. శివుడే నందిగా ఉద్భవించెననుటయూ పురాణగాథ. కావున శివుడే నందిగాను, నందియే శివుడుగాను ఉన్నారని పాఠకులు గ్రహించవలెను.)

(శివమహోమహుడు = పరమశివుడు, పరమాత్మ, పరబ్రహ్మం, ఆదిదేవుడు, అనాది, భగవంతుడు, బ్రహ్మం, పరమేశం, దేవాదిదేవుడు మొదలగునవన్నియూ ఒక్కరి యొక్క పర్యాయపదములే అగును.)

550. ముందు చెప్పినట్లుగా అనుష్ఠించవలసిన యమ, నియమాదులను ఆచరించి, సమాధిలో నెలకొని ఉన్నతి పొందుటకుగాను, ముందుండి దారి చూపుటయు, వెనకనుండి రక్షించుటకు మా తల్లి పరాశక్తి తోడుతో కవచ, న్యాస, ముద్రలు ఎరిగి సత్ప్రవర్తనతో జరుగుటకు నేను బోధించుదునే!!

(యమము = చెడుప్రవర్తనల నిగ్రహణ (నిషిద్ధములు – చేయకూడనివి)
నియమము = సత్ప్రవర్తనలు (చేయదగిన హితములు)
సమాధి = తనను తాను మరచిన ధ్యానస్థితి (తురీయము)
పరాశక్తి రక్షణ = **శివయవశి** అను మంత్రమున **య** కారమగు ఆత్మకు ఇరువైపుల పరాశక్తి యుండి రక్షించుట.

(రక్షణ) కవచము = మంత్రోచ్చారణలతో రక్షణ ఏర్పరచుట.
(కర, అంగ) న్యాసము = శరీర అంగములందు దేవతాభావన చేయుట.
(చేతి) ముద్రలు = మనస్సులోని ఆలోచనలను బలపరచు విధానము.)

551. దైవమును పొందుటకుగాను ఆ ధర్మము, ఈ ధర్మములని తలంచక అష్టాంగ యోగధర్మమును ఆచరించి సమాధియందు నెలకొనినచో, వారికి జ్ఞానయోగము ప్రాప్తించి శివునియందు నెలకొందురు. అట్లు పరిపూర్ణ జ్ఞానము సిద్ధించక పోయిననూ, పునర్జన్మము లేకయుందురు.
(అష్టాంగయోగమును అభ్యసించి సమాధియందు నెలకొన్నవారికి శరీరముతో పుట్టుట–పునర్జన్మ మరియుండదు.)

552. యమము. నియమము, పలురకములైన శరీర ఆసనములు, శ్రేష్టమును కల్పించు ప్రాణాయామము, ప్రత్యాహారము, విజయము నొసగు ధారణ, ధ్యానము, సమాధి మొదలగునవి సత్ప్రవర్తన గలవారు చేయవలసిన ఎనిమిది రకములైన శరీరయోగ అభ్యాసములగును.
(అష్టాంగయోగమున గల ఎనిమిది విధానములను తెలుపునది.)

## 2. యమము

### (నిషిద్ధములను మానుకొనుట)

553. అష్టదిక్కులందు భారి వర్షము కురిసిననూ చల్లదనమిచ్చు యమములను తప్పక పాటించవలెనని చెప్పి, పరమశివుడు దట్టమైన పగడము వంటి ఎర్రనైన, చల్లని జటాజూటధారియై నొప్పారు సనకాది మునులైన నలుగురికి అనుగ్రహమును పొరించెను.
(అష్టాంగయోగములోని యమమును నిర్విరామముగా తప్పక పాటించవలెనని బోధించుట.)

554. దేనిని హింసించకుండుట (అహింస పరమధర్మము), అసత్యమాడకుండుట (సత్యమును పాటించుట), దొంగలించకుండుట, అష్టగుణములు కలవారు, మంచివాడు, వినయవంతుడు, నీతిమంతుడు, ఇతరులకు ఇచ్చి తాను భుజించువాడు, నిష్కళంకుడు, కల్లు త్రాగనివాడు, కామరహితుడు మొదలగువారు యమమును పాటించువారగుదురు.

## 3. నియమములు

### (హితములన్నిటిని పాటించుట)

555. ఆదియైనవాడు, వేదములోని శబ్దస్వరూపుడైనవాడు, జ్యోతిస్వరూపుడు, మూలాధార చక్రములో అగ్నిరూపములో ఉన్నవాడునైన శివునితో విడదీయరాని బంధమేర్పరచుకొన్న పరాశక్తిని గ్రహించి, ప్రాణముతో ప్రాణముగా నున్న ధర్మములను పాటించువాడే నియమునందు శ్రద్ధ గలవాడగును.
(ఆదియైన శివుడు పరాశక్తితో చేరి అనుగ్రహ ప్రదాతగా నున్నాడని గ్రహించినవాడే నిజమైన నియమదారుడు.)

556. శౌచము (శుభ్రము), దయ, మిత భోజనము, ఓర్పు, ధర్మము, సత్యము ఆచరించుట, దృఢనిశ్చయము గలిగియుండుట మొదలగు సద్ధర్మములను పెంపొందించుకొని, నిషిద్ధములైన మోహము (కామవికారం), దొంగతనము, హత్య మొదలగువాటిని త్యజించిన (వదిలిన)వాడు పది గుణములు గల గుణవంతుడని చెప్పదగును.
(నియమములగు పది రకగుణములు గలవానిని గుణవంతుడని చెప్పవచ్చును.)

557. తపస్సు, జపము, దైవనమ్మకము, తనంతట తానిచ్చు దానము, సంతోషము, శివవ్రత మాచరించుట (శివరాత్రి) త్రిపుటిజ్ఞానము, యజ్ఞము, శివపూజ, దివ్యజ్యోతి దర్శనము మొదలగు పది ధర్మములను ఆచరించువాడు నియమ ధర్మములను పాటించువాడగును.
(త్రిపుటిజ్ఞానము = జీవ, జగత్తు, ఈశ్వర జ్ఞానము. నియమధారుడు పాటించవలసిన పది ధర్మములు చెప్పబడినది.)

## 4. ఆసనము

### (శరీర సర్వాంగముల పుష్టికి యోగమునకు ముందు చెప్పబడిన ఆసన విధానములు – వాటి ఫలితములు)

558. పద్మాసనము మొదలుకొని వివరములతో కొన్ని ఆసన విధానములు కలవు. అటువంటి ఆసనములలో ఎనిమిది అతి ముఖ్యమైనవి. నీరసము కొద్దిగా కూడ లేకుండా చేయునది **స్వతికం** అనబడు సుఖాసములో నుండుటయే.
(స్వతికాసనం, సుఖాసనము, మటము వేసుకొనుట అన్నియూ పర్యాయ పదములు. ఒక్కటినే సూచించును.)

559. ఒక ఆసనముపై కూర్చొని తొడలను దగ్గరకు చేర్చి ఒక తొడపై ఒక కాలును పెట్టుట. రెండు తొడలపై రెండు కాళ్ళు వచ్చునట్లు మటము వేసి దగ్గరకు

చేర్చుకొన్న రెండు చేతులను తొడలపై పెట్టి పద్మమువలె విప్పారినదే లోకము మెచ్చుకొను **పద్మాసనం** అందురు. అన్ని ఆసనములకు శ్వాస ప్రక్రియాభ్యాసము అతిముఖ్యము.

560. రెండు కాళ్ళను నేరుగా చాచి, పిదప మడిచి రెండు పాదములను దగ్గరకు చేర్చి పాదములు ఒకదానినొకటి చూచునట్లు చేసి కూర్చున్న శరీరమును, వెన్నెముకను నిటారుగా ఉంచి, చేతులతో పాదముల బొటనవ్రేలు రెంటిని పట్టుకొనినచో నీరసించు శరీరము కూడ ఉత్తేజము నొందును. ఇట్లు చేయు ఆసనము **భద్రాసనము** అందురు.

561. పద్మాసనములో కూర్చుండి, రెండు అరిచేతులను భూమిపై నొక్కిపెట్టి శరీరమును కొద్దికొద్దిగా పైకి లేపి తుదకు పూర్తి శరీరము రెండు చేతులపైన నిలబడునట్లు చేయుటనే **కుక్కుటాసనము** అందురు. చేతుల మీద పూర్తి శరీరమును నిలుపుటచే చూపరులకు కోడివంటి ఆకారముగా కనిపించును. కుక్కుటము అనగా కోడి. అందులకే **కుక్కుటాసనం** పేరు వచ్చినది.

562. పాదకొనలను భూమిపై ఆనించి మోకాళ్ళు మడిచి, మోకాలుపై నిలబడి, అరచేతులను భూమిపై ఆనించి ముఖమును నేరుగా చూచునట్లు ఉంచి, కళ్ళను నాసికాగ్రమును చూచునట్లుంచి, నాలుకను లోపలికి మడిచి, నోరు తెరచియుంచినచో సింహము వలె కనిపించుటచే దీనిని **సింహాసనము** అని పేరు గాంచినది.

563. ఆసనములలో **భద్రం, గోముఖం, పంఘయం, కేసరి, స్తోత్రము, వీరం, సుఖాసనం** – ఈ ఏడును అతి ముఖ్యమైనవి. మొత్తము నూటఇరువది ఆసనములు ఉన్ననూ వాటి మొత్తము మరింత వందలలో నున్నదని (తత్త్వప్రకాశము గ్రంథములో) కొన్ని గ్రంథములలో చెప్పబడియున్నవి. శ్వాసాభ్యాసము అతిముఖ్యము. (చాలా పురాతన కాలపు ఆసనములు, వాటి పేర్లు నవీనలోకమునకు పోల్చుటకు సాధ్యముకాక యున్ననూ ముఖ్యమైన ఆసనములు మాత్రము లోకుల ప్రాచుర్యములో కలవు.)

## 5. ప్రాణాయామము

**(ప్రాణాయామము – ప్రాణమును (శ్వాస) సక్రమ పద్ధతిలో క్రమబద్ధీకరించుట. ఆసనములు వలె ప్రాణాయామము కూడ కొన్ని పద్ధతులలో చెప్పబడినది)**

564. పంచేంద్రియములకు నాయకుడు, ఆ శరీరమునకు నాయకుడైన ఆత్మ ఉన్నతి పొంది పైకి వెళ్ళుటకు మనస్సుతో కలిసి ప్రాణము అను (శ్వాస) గుఱ్ఱమొకటి కలదు. అది శరీరమును మరచి అఖండములో నెలకొన్నవారికి వశపడును.

సత్యజ్ఞానమునకు కాక ఇతరములతో నెలకొన్నవానికి ఆ ప్రాణ (శ్వాస) వశపడక క్రిందకు త్రోసివేయునే!!

(ప్రాణాయామము చేయు సాధకులకు ప్రాణజయము కలుగును.)

565. మనస్సను ఆర్యుడు (నీతిమంతుడు) చాలా మంచివాడు. వాడు స్వారీ చేయు రెండు గుర్రములు ప్రాణము, అపానము. వాటిని బాహ్యముగా పంపించి లోపలికి తీసుకొని నిలుపు తత్త్వమెరిగిన వారెవ్వరూ లేరు. ప్రాణజయము గలిగించు గురునాధుని అనుగ్రహము పొందినచో ప్రాణ, అపానములగు గుర్రములను చేర్చి పట్టుకొనిన ప్రాణజయము గలుగును.

(ప్రాణజయము పొందుటకు గురువు తోడు ఆతను అనుగ్రహము ఆవశ్యకములు.)

566. పక్షికన్నా వేగవంతమైన ప్రాణణ (శ్వాస) యొక్క చలనము శిరస్సుకు ప్రాకి పైకి వెళ్ళినచో, కల్లు త్రాగకుండానే (మద్యము) సంతోషమేర్పడును. బద్ధకము తొలగిపోవును. హుషారుగా ఉండును. ప్రాణణ (శ్వాస), మనస్సును రెంటిని శిరస్సునకు సరిగ్గా ప్రాకించిన వారికి ఈ సత్యమును చెప్పితిని.

(ప్రాణాయామ సాధనలలో సాధకునకు బద్ధకము వీడిపోయి ఉత్తేజము కలుగును.)

567. నామరూప భేదమైన ప్రపంచమును తలంచనివారికి ప్రాణణ మనస్సుతో అణిగి (శిరస్సున లయమగువారికి), ప్రాణలయముతో జనన, మరణము లుండవు. ప్రాణణ పైకి వెళ్ళక క్రిందకు (కంఠము క్రిందకు) వెళ్ళినచో, వైఖరి వాక్కు ఉత్పత్తియై జననమరణ చక్రములో పడుదురు.

(శ్వాస బంధనమున శిరస్సున గల సహస్రదళ పద్మములో లయమైనచో పునర్జన్మ రహితమగును.)

568. ఎడమ నాసిక ద్వారము గుండా 16 మాత్రకాలము (1 మాత్ర = 1 క్షణం, లేక నవీన – సెకండు సమయము) గాలిని ప్రశాంతముగా లోపలికి (శ్వాస) పీల్చుటకు **పూరకము** అందురు. పీల్చిన గాలిని శరీరములోనే 64 మాత్రకాలము నిలుపుట **కుంభకము** అగును. పిదప నిలిపిన గాలిని అతి నెమ్మదిగా 32 మాత్రకాలము కుడినాసిక ద్వారము గుండా బయటకి పంపుట **రేచకము** అందురు. దీనిని పైన చెప్పిన విధమున కాక మార్చివేసినచో వంచన (తప్పు) యగును. చేసినది నిష్ప్రయోజనమగును.

(16 మాత్రకాలము పూరకము, 64 మాత్రకాలము కుంభకము, 32 మాత్రకాలము రేచకము చేయుటకు సాధకులకు మొదట్లో సాధ్యపడదు. కావున ఈ శ్వాస అభ్యాసము గురుముఖమున నేర్వవలెనని, సాధన కొంచెం కొంచెముగా కాలక్రమమున అలవాటు పడునని రచయిత యొక్క అభిప్రాయము.)

569. సాధకులు గాలి పీల్చి దానిని తన వశము చేసుకొన్నచో శరీరము కంచువలె తయారై వార్ధక్యమును కూడ త్రోసిపుచ్చి ఎప్పటికి యవ్వనరూపముతో ఉండనగును. ఈ ప్రక్రియతో కూడ సమర్థగురువు అనుగ్రహము పొందినచో, వాని శరీరము గాలికన్నా బహు మహత్తుగా ఎచ్చటికైనా వెళ్ళదగిన ఉన్నతి పొందుదురే!!

570. ఎచ్చటనున్ననూ ఎడమనాసిక ద్వారా **పూరకము** చేయవలెను. అట్లు పూరకము చేయుట వలన శరీరమునకు క్షయము లేదు. అట్లే కుంభకము చేయుటచే ఆ ప్రాణణ (శ్వాస) పైకి వెళ్ళునప్పుడు **శంఖునాదము** శంఖుశబ్దము ఏర్పడి ఉన్నతి పొందనగును.

571. ఇడకళ (చంద్రకళ – ఎడమనాసిక శ్వాస – వెన్నెముకలోని ఇడనాడి), పింగళ (సూర్యకళ – కుడినాసిక శ్వాస – వెన్నెముకలోని పింగళనాడి) ద్వారా శ్వాస పీల్చి పూరించి, గాలిని పట్టుకొను లెక్కలను ఎరిగినవారు లేరు. పీల్చిన గాలిని కుంభకము చేయుట కూడ ఎరుగజాలరు. అట్లు కుంభకము చేయు విధివిధానములు తెలిసినవారు కాలుని కూడ తన్నుటకు లక్ష్యవంతులగుదురు. (కుంభకము చేయు పద్ధతులు ఎరిగినవారు దీర్ఘఆయుష్షువంతులగుదురు.)

572. పద్ధతిగా గాలిని (పూరకంలో) కంఠములోను, మూలాధారములోను, ఛాతియందు నిలుపునట్లు చేసి, పిదప రేచకములో (గాలిని బయటకు పంపుట) ఆ అవయవములందు ఒకదానితో ఒకటి చొచ్చునట్లు చేసి, కుంభకములో ఉదరమును నిండునట్లు చేసినచో హలాహలం త్రాగినవాని (నీలకంఠుని–శివుని) అనుగ్రహము పొందగలరు.
(కుంభకములో కడుపులో నింపిన గాలివలన ఆయా అవయవములు గాలితో మరింత ఉబ్బి, అట్లే రేచకములో గాలిని బయటకు పంపునపుడు కుంచుకు పోవును. కుంభకము ద్వారా అనుగ్రహప్రాప్తి యగును.)

573. ఇడకళలో (ఎడమనాసిక ద్వారా) 16 మాత్రాకాలము పూరకము చేసి, పిదప పింగళలో (కుడినాసిక) రేచకము 32 మాత్రాకాలము చేసి, గాలి వదిలిన పిదప కుంభకములో 64 మాత్రాకాలముండవలెను.
(గాలిని వదిలిన పిదప మరలా గాలిని వెంటే పీల్చరాదు. కుంభకములో నుండవలెననుట.)

574. తయారుచేయబడిన ఈ శరీరము నీరసించకుండునట్లు రేచకము చేసి, దశనాడులు పూరించునట్లు గాలిని లోపలికి పీల్చి (పూరకము చేసి) నింపి, ప్రాణ, అపాన వాయువులను ఒకటిగా చేయునట్లు నిటారుగా అమరియుండినచో ఇక యమభయముండదు.

575. విచ్చలవిడిగా బాహ్యముగా తిరుగాడు ఈ గాలిని (శ్వాసను) విధివిధానములతో ఒక పద్ధతిగా కుంభకముతో లోపల శుద్ధిచేసినచో అవయములు ఎరుపగును (రక్తప్రసరణతో శుద్ధి – ఎర్రగా మారుట). తల వెంట్రుకలు నలుపగును (నల్లగా మారి శోభించును). కిరణములతో నొప్పారు ఆత్మ శరీరములోనే నెలకొని ఒప్పారును.

576. శరీరమునే ఉనికిగా ఏర్పరచుకొన్న ఈ ప్రాణశక్తి చిన్నవయస్సులో 12 అంగుళముల శ్వాస పొడవుతో పోవుట, వచ్చుట జరిగినది. వ్యార్థక్యమందు శిరస్సులో 4 అంగుళముల పొడవు తగ్గిపోయి 8 అంగుళముల పొడవే క్రియించినది. శిరస్సున నిలచిపోయిన 4 అంగుళముల పొడవు శ్వాసను క్రియింపజేసినచో, సాధకులు **పంచాక్షర** స్వరూపులగుదురు.
(యోగసాధకుల కంఠము పైకి శ్వాస ప్రాకించు పద్ధతి వలన ప్రాణశక్తి శిరస్సున ప్రాకి సహస్రారమున నున్న శివశక్తితో ఏకమై, జ్యోతి స్వరూపుని అనుగ్రహమును పొందనగును.)

577. 12 అంగుళముల నిడివితో చలించుచున్న ప్రాణణయైన (శ్వాస) సూర్యునికి పగలు, రాత్రి అను కాలములు కలవు. ముక్కు నుండి కంఠము క్రింది భాగమునకు శ్వాస ప్రాకుటచే శిరస్సున నున్న ఆత్మకు సృజించడము లేదు. క్రిందిముఖముగా పోనీయక పైకి ప్రాకునట్లు చేసి, ఆత్మ సృజించునట్లు చేసినచో ప్రాణణయైన సూర్యునికి పగలు రాత్రులు అను భేదము లేక ఎప్పుడూ ప్రకాశించుచునే ఉండునే!!
(ప్రాణణ (శ్వాస) తత్త్వము ఎరిగిన సాధకునకు పగలు రాత్రులు లేక ఎప్పటికి తురీయభూమికలో ఉండనగును.)

## 6. ప్రత్యాహారము

బాహ్యముగా వెళ్ళు మనస్సును లోపలికి లాగి నిలుపుటకు చేయు సాధననే ప్రత్యాహారమందురు. దీనిలో హఠయోగము, లయయోగము, లంబికాయోగము, మంత్రయోగము, రాజయోగము, శివయోగములను విభాగములకు తగ్గట్లు సాధనలు కలవు. ఈ ప్రత్యాహారమును గురువు మంత్రోపదేశముతో శ్వాసను లోపలికి లాగి సాధన అభ్యసించవలెను.

అష్టాంగయోగములో యమ, నియమ, ఆసన, ప్రాణాయామములను పూర్వపక్షమనియు; ప్రత్యాహారము, ధారణ, ధ్యాన, సమాధి మొదలగు నాల్గింటిని ఉత్తర పక్షమనియు చెప్పబడియున్నది.)

578. బాహ్యముగా తిరుగాడు మనస్సును అంతర్ముఖునిగా ఒప్పారునట్లు చేసినచో ఆ దృశ్యము చేత కొంచెము కొంచెముగా చీకటి తొలగి ప్రకాశము పొందనగును (లౌకిక విషయములలో మనస్సు పరుగెత్తక శాంతిపొందుట). కోరి, వెతకి, పురాతన వేదములలో చెప్పబడిన తత్త్వములను ధరించిన ఈ శరీరమంతరమును చూడనగును!!

(మనస్సును అంతరదృష్టికి మరలించినచో పురాతన తత్త్వమైన ప్రకాశరూపుని (శివుని) సృజించనగును.)

579. నాభికి క్రింద 12 అంగుళముల దూరములో మూలాధారములోనున్న కుండలినీశక్తిని పైకి లేపు మంత్రమైన **ప్రసాదమంత్రము**ను (అజపగాయత్రి – హంస మంత్రము) ఎవ్వరూ ఎరుగజాలరు. అట్లు లేపు మంత్రమును గ్రహించిన పిదప వారికి శివుడు నాదస్వరూపునిగా శిరస్సున నెలకొని నిలిచియుండునే!!

(ప్రసాద మంత్రమునకు **అజపగాయత్రి** లేక **హంసం** మంత్రమను మారు పేర్లు గలదు. శివుడు మూలాధారపు అక్షరమగును. ఉచ్ఛ్వాస **సం** అను అక్షరముగా, నిచ్ఛ్వాస **హం** అను అక్షరముగా శబ్దించును. ఈ **హంసం** అను మంత్రమును శ్వాసించు అన్ని జీవరాశులును జపించుచున్నవి. గురుముఖముగా ఈ మంత్రమునే **సోహం**గా ఉపదేశము పొంది పూరక, రేచకముల ద్వారా మంత్రభోగముగా జపించినచో మూలాధారమున నెలకొన్న ప్రాణశక్తి శిరస్సునకు సుషుమ్నానాడి ద్వారా పైకి ప్రాకి శివప్రకాశముగా ఒప్పారును.)

580. మూలాధారమునకు రెండు వ్రేళ్ళు కొలత పైకి, బాహ్యముగా కనబడు లింగమునకు రెండు వ్రేళ్ళు కొలత క్రిందయున్న స్థానములో పామువలె గుండ్రముగా చుట్టుకొనియున్న ఎర్రనైన జ్యోతిగా కుండలినీ నాభిస్థానమునకు నాలుగువ్రేలి కొలతతో క్రిందికి అమరియున్నది.

(మూలాధారమునకు పైకి, నాభికి క్రిందభాగమున కుండలినీ ఎర్రటిజ్యోతి అమరియున్నది. ముందు మంత్రములో చెప్పినది బాహ్యపు–ఆధునిక కొలతలు. ఈ మంత్రమున చెప్పినది శరీరపు లోపలి పూర్వీక కొలతలు. వ్రేలి కొలతలు సుమారు 1 అంగుళము కొలత)

581. నాసికకు 12 అంగుళములు అధోముఖముగా నున్న హృదయమున నీవు మనస్సును లాగి నిలిపి ఎర్రనైన జ్యోతిని తలంచినచో, అష్టసిద్ధులు, రాజయోగము కైవసమగును. ఇటువంటి (ధ్యాస) ధ్యానము శరీరమునకు ఎటువంటి, ఎప్పటికీ కీడు కలుగదు.

(హృదయమున చిత్తముంచి ధ్యానించువారికి శరీరక్షయమవదు.)

582. రెండు విద్యుత్తీగలు (మెరుపుతీగలు) ఒకదానికొకటి పెనవేసుకొని పరుగెత్తునట్లు ప్రకాశము కనపడినచో, సత్యమైన ఉన్నత ఆనందమనియే తలంచండి. ధర్మమును బోధించు కంఠస్థానమున చంద్రప్రకాశం కనిపించినచో ప్రత్యాహార సాధన చేయు సాధకునికి శరీరములో ఆనంద పరవశము కలుగునే!!

583. మూలాధార స్థానమున నున్న గుదస్థానములో వాయు చలించకుండునట్లు మాలాధార ముద్రవేసి, మనస్సును శిరస్సు (కపాలమున) యున్న బ్రహ్మరంధ్రమున నెలకొనునట్లు చేసి, శూలమువంటి కన్నులను బాహ్యముగా చూచునట్లు అమర్చి ధ్యానించుటచే (భ్రూమధ్యమును సగము మూసిన కళ్ళతో చూచునట్లు) కాలమును జయించి చిరకాలము జీవింపనగును.

584. గుదద్వారమునకు రెండు వ్రేలికొలతల (సుమారు 1 అంగుళం) మీదకు, గుహ్యస్థానం క్రిందకు రెండు వ్రేలికొలతతో నున్న స్థానమున, రూపము ధరించగలిగిన కుండలినీ స్థానమునందు చిత్తమునుంచి, తలంచువారికి సృష్టికి మూలమైన మహేశ్వరుడు జ్యోతిరూపమై నిలుచునే!!

585. సుషుమ్ననాడి స్థానమగు భ్రూమధ్యమునందు ఉపాధులైన వాటిని (దుఃఖబంధ మేర్పరచు మాయకార్యములగు చీకటి నింపు జాగ్రదా, స్వప్న, సుషుప్తి, తురీయం, తురీయాతీతంలను) త్యజించి, భ్రూమధ్యమున నిలుచు జ్యోతిని వేరుయని గ్రహించి, ఆ జ్యోతినే చిత్తమందు నిలిపి నెలకొన్నవారు ప్రత్యాహార మహిమను బాగా గ్రహించినవారగుదురు.

(జీవబోధము విని జ్యోతిలోనే నెలకొనుటయే ప్రత్యాహారమగును.)

586. బయటకు వెళ్ళు వాయువు (శ్వాస–గాలి) మరలా లోపలికి రాకయుండుట, సామర్థ్యముతో అంతర్జ్యోతియందే నిలిచియున్నచో (మనస్సు నిలకడయై జ్యోతియందే నెలకొని) మనస్సు బలమైనదగును. అపుడు మనలో నెలకొన్నవాడు దైవము (జ్యోతిగా). ఆ జ్యోతియందే స్థానుడై మరెచ్చటికి వెళ్ళక సాధకునియందే నిలిచిపోవునే!!

(మనస్సును శ్వాసకు అతీతముగా భ్రూమధ్యమందు నిలపగలిగిన సాధకునకు శ్వాస చలనము (పూరక, రేచక, కుంభకములు) లేక చిత్తము జ్యోతిలోనే నిలబడి, చిత్తమే శివమయమగును.)

587. ఇది గుర్తించి నిలిపినవారికి ప్రత్యాహారములో ప్రపంచమంతటిని ఉన్న స్థానము నుండే గ్రహించబడును. త్యజించవలసిన అజ్ఞానమను చీకటిని తొలగించుకొని, గుర్తించగలిగిన జ్ఞానముతో శివుని కోరండి. శివుని కోరు మహనిత్యమును చిత్తమునందు పదిలము చేసుకొన్నచో, శివజ్ఞానములో నెలకొన్న అమరులగుదురే!!

(దేవతలు అగుదురు)

(శివుని ధ్యాస చిత్తమందే నెలకొల్పుకున్న వారికి అమరత్వము (మరణము లేనిది) పొందనగును.)

## 7. ధారణ

ధారణ యనునది ధరింపజేయునది. ప్రత్యాహార సాధనలో లోపలికి లాగిన మనస్సును నిలకడ (పదిలపరచుట) చేయుట ధారణయగును.

588. వికల్పము లేని మనస్సును (బాహ్యముగా వెళ్ళనీయక నిరోధించిన చంచలరహిత మనస్సును) అధోముఖముగా వెళ్ళనీయక అడ్డగించి, మధ్యనాడి ద్వారా (సుషుమ్ననాడి) ప్రాణశక్తితో మనస్సును లయించి ఆకాశముఖముగా (ఊర్ధ్వ–శిరస్సునకు) దృష్టి సలిపి, చూడని కళ్ళు, వినని చెవులతో (ఇంద్రియ ప్రజ్ఞలను నిరోధించిన) ఉన్నవారికి జీవితకాలమను ఆయస్సు క్షయమును నిలుపు ఉపాయమగును.

(మనస్సును ధరింపజేసి ఊర్ధ్వముగా దృష్టి సలిపిన వారికి ఆయుస్సు వృద్ధియగును.)

589. పర్వతము పోలిన శిరస్సున ఆకాశగంగ ఎప్పుడూ ప్రవహించుటను సుషుమ్ననాడి ద్వారా వెళ్ళి పరనాధ శబ్దముతో గలిగిన దేవసభలో ఆనందనాట్యమాడు, పరమానందమొసగు, జ్యోతి ప్రకాశమును దర్శించితిని!!

(శిరస్సునందు వెలుగొందు దేవసభలో నాదముతో కూడిన జ్యోతిని ధారణలో చూడనగును.)

590. శిరస్సునందు నెలకొనిన శక్తి, మార్పులు చేయగలిగిన దేవియగును. మూలాధారములో కుండలినీ క్రియాశక్తితో కూడినది మూర్తి. ధారణ అభ్యాసముతో ఆ మూర్తిని శిరస్సునకు ప్రాకించి శక్తితో చేరునట్లు చేసినచో, వార్ధ్యకములో నున్నవాడు కూడ బాలకుడగుట చూసి తరించండి. ఇది నందీ (శివుని) ఆజ్ఞయగును.

(మూలాధారములోనున్న శివుని పైన ప్రాకించి శక్తితో ఐక్యపరచు సాధన చేసినచో యవ్వనము తొణికిసలాడును.)

591. మూలాధారమును నిరోధించి అందుండు కామవాయువు లేక అపానవాయువును పైకి ప్రాకింపజేసి, మధ్యనాడియైన సుషుమ్ననాడి యందు మనస్సును నిలిపి, ప్రవహించు నీటి ప్రవాహములో కాచుకొనియున్న కొంగవలె, ధ్యాసను వీడక, ఓపికగా నున్నవారికి దేహము క్షీణత లేక కలకాలము ఉండగలరు!!

(సాధకుడు ఊర్ధ్వదృష్టి సలిపి ఓపికగా ధారణలో ఉన్నచో, జ్యోతిని (ప్రకాశమును) దర్శించి చిరకాలము ఉండనగును.)

592. శరీరముతో ప్రాణము కలిసియున్న కాలపరిమితి ఎరుగుటకు, ఆ కాల పరిమితి ప్రాణణ (శ్వాస) చలనక్రియతో అమరియున్నది. అటువంటి ప్రాణముతో ముడిపడియున్న శ్వాస చలనక్రియను పట్టి నిరోధించినచో, ప్రాణముతో ముడిపడియున్న కాలము కూడ క్షీణత లేకయుండునే!!

(ధారణ సాధనతో శ్వాసక్రియ చలనము లేక లయమైనచో, ఆయుర్ కాల పరిమితులను కూడ దాటగలము.)

593. నోరు తెరవక మౌనముగా ఉన్నవారికి మనోమండలములో ప్రాణణయను సంపద ఒకటియున్నది. అట్లు కాక నోరి తెరచి మాట్లాడుచూ యున్నవారు ప్రాణణను వ్యయము చేయువారగుదురు. మాట్లాడక మౌనిగా ఉన్నవారు మనోమండలములో ప్రాణణను చొప్పించి జ్యోతిని చూడగలరు. సహస్రదళ పటలమను ఉన్నతమైన ఆభరణముల పెట్టెను తెరచి చూడలేనివారు మూఢులే అగుదురు.

594. హృదయములో చొచ్చుకువెళ్ళి క్రియించగలిగిన వాయువును వెలుపలికి వెళ్ళనీయక మధ్యనాడియందు (సుషుమ్ననాడి) నెలకొనునట్లు మనస్సు సలిపినచో, ఏడు ద్వారములను (కళ్ళు రెండు, చెవులు రెండు, ముక్కు రంధ్రములు రెండు, నోరు ఒకటి) రెండు మహాద్వారములును (పాయు, ఉపస్థ) గలిగిన దేవుని దేవాలయము (దేహము – శరీరమే దేవాలయము) లోని గర్భగృహమునందు (శిరస్సులోని సహస్రదళమున) చాలా కాలము జీవించనగును.

(దేహో దేవాలయః ప్రోక్తః – శృతి వాక్యము. దేహమునే దేవాలయముగా చెప్పబడి సహస్రదళమునే గర్భగృహముగా పోల్చబడినది. ప్రాణణ సుషుమ్న నాడి ద్వారా సహస్రదళమునందు నెలకొనినచో, ప్రకాశముతో నొప్పారు అన్ని తత్త్వములను ఎరుగగలరు.)

595. ఇంద్రియప్రజ్ఞలతో నిండియున్న పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములైన పదింటిలో పంచజ్ఞానేంద్రియములు వీగిపోయినచో, ఓ పేదా! (జ్ఞానశూన్యుడా!) నీవు విచారించి ఏమి ప్రయోజనము పొందగలవు? ఇంద్రియప్రజ్ఞలకు అతీతముగా నిలబడువారికి మనస్సను కోతి శరీరపు చేష్టలు లేకుండా ఉండగలదే!!

(ఇంద్రియప్రజ్ఞలకు లోనుగాక, వాటికి అతీతముగా ఉండగలిగిన సాధకునకు మనస్సులోని చేష్టలు ఏమీ చేజాలవు.)

596. పూర్వము జన్మించిన వారందరు ధారణ సాధన చేయక మరణించి నశించి పోయిరి. పిదప వచ్చినవారు మరణింపరని ఏమి ప్రమాణము? అట్లు

మరణించువారి గురించి మాట్లాడినచో లెక్కలేనన్నివగును. ఏమీ ఆశ్చర్యము? నదియొక్క కరకట్ట దినదినము దిగజారి కూలిపోవునట్లు శరీరము దిగజారక అట్లే నిలిచియుండునా ఏమీ?

(ధారణ సాధనతో నిలకడలేని శరీరమును నిలకడనైనదిగా (శాశ్వతమైనదిగా) చేసుకొనవలెనని నొక్కి వక్కాణించుట.)

597. పంచేంద్రియప్రజ్ఞల తీవ్రత (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు) వలన పాడైన ఈ శరీరము పంచభూతములలోని (ఆకాశతత్త్వమునకు చెందిన) శబ్దమూలమైన తన్మాత్రలో నెలకొనునట్లు చేసినచో, విచారణ చేయదగు మనస్సు మొదలగు అంతఃకరములన్నియూ నాదమునందు లయమై, అంతర ఆత్మ **తత్** పరమైన శివుని యందు నెలకొనుటయే ధారణయగును.

(పంచభూతములు (ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథివి) యొక్క తన్మాత్రల (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు) చేష్టల వలన పాడైన ఈ శరీరమును ఆకాశతత్త్వమునకు చెందిన తన్మాత్ర–శబ్దము (నాదము) బహు సూక్ష్మమైనది, బహుశ్రేష్టమైనది. ఈ నాదములో చిత్తము నెలకొనినచో అంతఃకరములన్నియూ సమసిపోవును. ఇక మిగిలియున్నది ఆ **తత్** పరము ఒక్కటే. అదే శివపరము. దానిని పొందినవారు ధారణ పొందినవారగుదురు.)

(తత్+త్వం+అసి = తత్త్వమసి. ఆ పరమాత్మ+నీవు+ఉన్నావు = ఆ పరమాత్మే నీవుగా ఉన్నావు – శృతివాక్యం, చాంధోగ్యోపనిషత్, సామవేదం. తత్=జీవాత్మ, చిత్, పరబ్రహ్మం, పరమాత్మ, పరమశివుడు, శుద్ధచైతన్యం అగును.)

## 8. ధ్యానము

నిర్విరామపు ధ్యాసయే ధ్యానమనబడునది. విరామముతో నున్నది ధారణ. ధ్యానములోని కొన్ని విధములను బోధించునది.

598. జీవాత్మలోని ద్విఅష్టములను (పదహారు = ప్రకృతి భూతములు 5, ఇంద్రియములు 5, అంతఃకరణములు 4, మాయ 1, జీవుడు 1 – 16) తలంచి ధ్యానించునది ఆత్మధ్యానము. శ్రేష్టమైన బుద్ధిని ఇంద్రియముల వశము కానీయకుండుట. సాకారముతో కూడిన ధ్యానములో శక్తిని ఉన్నతముగా తలంచి చేయునది **పర** ధ్యానమనబడును. కాంతితో నెలకొనియున్న శివుని తలంచి చేయునది **శివ** ధ్యానమని ధ్యానములను రెండురకములుగా యోగమందు చెప్పబడియున్నది. (శివధ్యానము, పరధ్యానమని రెండు రకములుగా ఉన్నది.)

599. కన్ను, నాలుక, ముక్కు, చెవి, మొదలగు జ్ఞానేంద్రియములు కూడియున్న కూడలిలో

నాదమును ఉత్పన్నము చేయగలిగిన పురాతనమైనది ఒకటియున్నది (పరబ్రహ్మం). అది కొండనాలుక పైభాగమున ఉండి అఖండమైన (బ్రహ్మాండమైన) ప్రకాశమును చూపించి, మనస్సును బాహ్యముగా సంచరించ కుండునట్లు చేసి మనల్ని కాపాడుచున్నదే!!

(కొండనాలుకకు బ్రహ్మరంధ్రమునకు మధ్యన ప్రకాశము సంచరించుటకు మార్గము గలదు. పరబ్రహ్మం కొండనాలుక పైభాగమున ఉండి, ప్రకాశమును చూపించి మనస్సును నిశ్చలము చేయుచున్నది.)

600. భ్రూమధ్యమున (సుషుమ్ననాడి స్థానము) జ్ఞాననేత్రములో నెలకొన్న జ్యోతిని (ప్రకాశమును) రెండుకళ్ళతో వీక్షించి (చూచి) అచ్చట నిశ్చల మనస్సుతో నెలకొన్నచో, శిరస్సులో ఆకాశగంగ ప్రవహించునట్లు భావనతో చిదాకాశ ప్రకాశములో నిలుచున్న స్వయంభుమూర్తిని చూడగలరే!!

(రెండు కళ్ళను సుషుమ్న యందు కేంద్రీకరించి మనస్సును నెలకొల్పినచో చిదాకాశ ప్రకాశములో జ్యోతి స్వరూపుని చూడనగును.)

601. శరీరముతో సమ్మేళనమైన ప్రాణమును ఒకనాడు తలంచనివారు, ప్రాణముతో ప్రాణణగా నెలకొనియున్న శివుని ఒకసారైనను తలంచనివారు, శివుడే చిత్తమునందు నెలకొనియున్నాడన్న భావన లేనివారు, చంద్రమండలములో నాదమయముగా నొప్పారు శక్తిని తలంచనివారు ఏమిటీ వీరి అజ్ఞానము!!

(ప్రాణముతో ప్రాణముగా కలిసి శివుడు చిత్తమునందు ఉన్నాడని ఎరిగి ధ్యానించువారికి శివానుగ్రహము కలుగును.)

602. మనస్సులో నొప్పారు జ్యోతిని మహిమ, గొప్పదనము పొందునట్లు శిరస్సుకు ప్రాకించి, కోపమను అగ్నిని మనస్సునుండి పారద్రోలి, అన్నింటియందు నెలకొనియున్న శివప్రకాశమను సుషుమ్నను (భ్రూమధ్యమున) వత్తిని పైకెత్తునట్లు చేసినచో మనస్సున నెలకొనియున్న శివుడు ఎప్పటికి వీగిపోని దీపమగునే!!

603. వెయ్యేండ్లు యోగము అభ్యసించిననూ, కంటిలో జ్యోతిరూపముగా నున్నవానిని ఎరుగజాలకున్నారే!! మనోమండలమను హృదయమున (మనస్సున) ప్రకాశించుచున్నదానిని అంతరముగా చూడగలవారికి, అద్దములో రూపమును చూచుకొనునట్లే హృదయమున కూడ కలిసియున్నది చూడగలరు.

604. రెండు కళ్ళచూపును నాసికల యందు (నాసిక చివరి స్థానము – రంధ్ర స్థానము) కేంద్రీకరించినచో శరీరమునకు క్షీణత (నాశనము) లేదు. మనస్సు చంచలపడదు. ఇంద్రియములన్ని అణిగి, ఇక తానన్నది కూడ లేకుండును. బాహ్యముగా వెళు ్ళ చిత్తచంచలము లేక తానే శివమగును. దీనిని **శాంభవీ** ముద్ర యందురు.

(సాధకుడు ధ్యానము చేయునపుడు కంటిచూపును నాసికాద్వారములందు (కొస) కేంద్రీకరించినచో చిత్తము శాంతించి శివమయమగును.)

605. రెండు కళ్ళచూపును నాసికాగ్రము అను భ్రూమధ్య భాగమున ఉంచి, శ్రేష్ఠమును కలిగించు ప్రాణవాయువును లోపలికి అణచి, దుఃఖహేతువగు మనస్సును నిరోధించి, యోగనిద్ర చేయువారికి జన్మమొసగిన ఈ శరీరము లాభించును. మరియు ప్రపంచము పీడించునను భయము కూడ ఉండదు. దీనినే **కేసరీ** ముద్రయందురు.

(సాధకుడు ధ్యానము చేయునపుడు కంటిచూపులను భ్రూమధ్యమున కేంద్రీకరించవలెను.)

606. గంటలు, సముద్రము, ఏనుగు, వేణువు, మేఘము (ఉరుము), భ్రమరము, తుమ్మెద, శంఖు (నాదము), ఢంకా, యాలి (ప్రాచీనకాలపు వీణవాద్యము) మొదలగువాటి యొక్క శబ్దములు పదింటిని ధ్యానముతో నున్నవారు తప్ప వేరెవరూ గ్రహించజాలరు.

(దశవిధ నాదములు ధ్యానములో నిమగ్నులైనవారు వినవచ్చును.)

607. సముద్రము యొక్క ఘోష, మేఘము యొక్క ఉరుములు, ఏనుగు యొక్క ఘీంకారము, తీగ మీటడము వల్ల కలుగు వీణనాదము, ఆకాశములో ఇమిడియున్న వేదఘోష, వేణునాదము, బిగబట్టి ఊదగలగిన శంఖు, దృఢ మనస్కులగు యోగులకు తప్ప మిగతావారు గ్రహించజాలరు.

(సాధకులకు సముద్రపు ఘోష వంటి మహాశబ్దము మొదలుకొని, వీణ నాదమగు బహుసున్నిత శబ్దములగు రెండు రకములైన శబ్దభేదములు సాధనా ప్రక్రియయందు వినగలరు.)

608. దైవము యొక్క స్వాభావికము – దేవతలతో సఖ్యత, ప్రేమతత్త్వము, బంధమునకు అతీతముగా నిల్చునది నాదమేయగును. దీనిని గ్రహించగలిగిన వారికి భువినుండి (పృథివి) వెలువడు గంధము (వాసన) వలె నాదములో నెలకొనియున్నాడని (శివుని) ఎరుగగలరు.

(ఈశుడు అన్నిటిలోను నాదముగా నెలకొని క్రీడించుచున్నాడు. పృధివికి గంధము (వాసన), జలమునకు రుచి, అగ్నికి రూపము, వాయువుకు స్పర్శ, ఆకాశమునకు శబ్దము తన్మాత్రలగును. దైవము నాదస్వరూపుడనుట ఓంకారము ప్రతీక. ఓంకారము ఒక సంక్షిప్తం. ఇది భూః, భువః, సువః మూడులోకముల నుండి అ, ఉ, మ (వ్యాహృతులు) వచ్చింది. దాని కలయికే అ+ఉ+మ=ఓంకారము. అదే నాదశబ్దము.

609. నాదతత్త్వం ముగుయుచోట పరాశక్తి యున్నది. నాదాంతమునందు (నాదము+అంతము) మంచి యోగము ప్రాప్తించును. నాదాంతము నందు మనస్సు లయమగునపుడు, అచ్చటనే నీలకంఠ పెరుమాళ్ళు (మహామహుడు) నెలకొని యుండుట నేను చూచితిని!!

(నాదాంతమునందే పూర్తి యోగము సిద్ధించును.)

610. ఆరు ఆధారములలో (వెన్నెముకలోని మూలాధారము నుండి ఆజ్ఞచక్రము వరకు గల ఆరు స్థానములు) ఉత్పన్నమైన ఐదు రకములైన అగ్నులు (మూలాగ్ని, జఠరాగ్ని, సూర్యాగ్ని, చంద్రాగ్ని, మెరుపుల అగ్ని)తో స్తుతించ దగిన ప్రకాశము నుండి నీలిరంగును విడదీసి, నిర్వహించుచున్న ఐదు తన్మాత్రలు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధము) అన్నియూ శబ్దమను నాదమున లయమగుటచే బంగారుఛాయ కలిగిన ప్రకాశముతో నొప్పారుచున్న ఈశుని పాదపద్మములను చేరగలరు.

(నీలిరంగు విడదీసి అనునది అజ్ఞానమను అపరాశక్తిని మినహాయించి నాదములో నెలకొనియుండుట.)

611. పరావృత్తము (శిరస్సునందు స్వయంప్రకాశపు వృత్తిలోనుండు పరము)నకు ప్రకాశము ఉండునే తప్ప చీకటి యుండజాలదు. ఆ గదియందు నొప్పారు ప్రకాశమును ఏ అగ్నులు దహింపజాలవు. ఇటువంటి ప్రకాశమును గ్రహించుట ధ్యానముతోనే సాధ్యమగును. చీకటి అసలు లేనందున ఉదయించుట అనునది ఉండజాలదు.

(ధ్యాన నిమగ్నులైన వారికి నీలిరంగు గల ప్రకాశము కూడ తెల్లగా మారిపోవునే!!)

612. దీక్షతో చంద్రమండలమును సాధించవలసిన లక్ష్యములకు ఎటువంటి ఆటంకములు రానీయక, వెన్నెముక మధ్యనాడి సుషుమ్నానాడి ద్వారా పైకి శిరస్సుకు ఎగబాకిన యోగికి అగ్నిమండలము, సూర్యమండలము, చంద్ర మండలము మూడింటియందు నెలకొనునట్లు ఉన్నతి పొంది, జన్మమెత్తిన శరీరమును ప్రపంచమున్నంత వరకు జీవుడు విడచిపోజాలదు.

613. వారికి వారే మండలములుగా మార్చుకొను తత్త్వమొకటి ఉన్నది. అగ్ని, సూర్య, చంద్ర మండలములకు బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు నాయకులు. వారి మండలములలో వారిదే ఆధిపత్యము అయిననూ, మరొక మండలము వారికి సహాయము చేయగలిగిన సద్గుణములున్నవారు.

(బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు జీవునియందుండి సహాయము చేయుచున్నారు.)

614. లౌకిక వాంఛలతో కొట్టుమిట్టాడుతున్న హృదయ గుహయను చీకటిగదిలో

ఉదయించుచున్న మూడు మండలములలో నెలకొని, బ్రహ్మరంధ్రము ద్వారా శివుని యందు గాఢమైన ప్రేమ సలిపి సరైన సాధన, ప్రగతి సాధించినచో, శోకము వీగిపోయి, శిరస్సునందు ఉషోదయము వంటి మహాప్రకాశమును చూడనగును.

615. తామస, రాజస, సాత్త్వికమను త్రిగుణములగు చీకటి వీడుటకు మూలాధారములోనున్న అపానవాయువుని పైకి ఎగబ్రాకించి కుడిప్రక్క శ్వాసయైన సూర్యకళను, ఎడమప్రక్క శ్వాసయైన చంద్రకళ నెలకొనునట్లు ఉదయమున 1 గడియ (సుమారు 24 నిముషములు) శ్వాసాభ్యాస సాధన చేసినచో, జీవుడున్ని శరీరము నుండి వీడిపోక శివుడు పదిలపరుచును.
(త్రిగుణములు చీకటి వీడి శిరస్సున ప్రకాశము వెలసిల్లును.)

616. చలనములు ఏర్పరచుచున్న నాభిచక్రమునకు నాలుగువ్రేళ్ళ కొలతలు (4 అంగుళములు) ఊర్ధ్వముఖముగా (పైకి) మాట–వాక్కు వెలువడు కంఠ చక్రమునకు రెండువ్రేళ్ళ కొలతలు (2 అంగుళము) క్రిందనున్న అనాహత చక్రములో సముద్ర అలల పొంగిపొర్లు శబ్దము (నాదము)ను ధ్యానములో వినగలగినవారు శరీరమునందు ఆత్మను గ్రహించిన వారగుదురు.
(నాదమును ధ్యానములో వినగలిగినవారు ఆత్మదర్శనమునకు తగిన సాధన చేసినవారగుదురు.)

617. జ్ఞానమగు ఆత్మ, జ్ఞానము లేని ముప్పదిఆరు దేహతత్త్వములను (దేహ తత్త్వములు – అసత్తు – జడము) తొలగించి, సమ్మేళనమైయున్న మాయను దైవానుగ్రహముతో నాశనమొనర్చి, శివునియందు విడదీయరాని అనుగ్రహమను సత్తును పొంది శివతత్త్వములో నెలకొనియున్న యోగ్యులే సత్యస్వరూపమును గ్రహించిన వారగుదురు.
(ధ్యానములో శివునియందు నెలకొనియున్నవారు అజ్ఞానము వీడి, ప్రకాశము పొంది బ్రహ్మానందము పొందుదురు.)

## 9. సమాధి

### (ప్రాణము, దైవము ఒకటిగా నిలుపుట)

618. యమము మొదలగువాటిని సక్రమముగా పాటించి సమాధి వరకు వెళ్ళి విధి విధానములు చెప్పుట ఏమనగా, యమము మొదలుకొని ధ్యానము వరకు సక్రమముగా పాటించబడినదని గ్రహించినచో, అప్పుడే ఎనిమిదవదైన సమాధి

చేకూరును. ఈ అష్టకూర్పులను నియతిగా చేయువారికి అష్టాంగ యోగములోని చివరిదైన సమాధి చేకూరును.

619. ప్రకాశము, శబ్దము, శిరస్సులోని సహస్రదళమునందు అమితముగా నెలకొనినచో, యోగమయమైన సమాధిలో జీవుడు నెలకొనును. అప్పుడు చివర జ్ఞానస్వరూపుడైన శివుడు, అందమైన ప్రకాశస్వరూపుడుగా కనిపించును.

620. తలంపులు ఉంచిన మనస్సు ఎక్కడయున్నదో (ఆలోచనలతో నిండిన) అక్కడ వాయువు (శ్వాస) యుండును. మనస్సున తలంపులు లేకుండినచో, వాయువు చలనము ఉండదు. ఆ మనస్సునందే ఆలోచనలను విడచి ఆనందములో నున్నవారికి ఆలోచించదగిన మనస్సే ఆలోచనలు లేని మనస్సుగా మారి, మనస్సు అణగిపోవును (మనోలయమని చెప్పబడినది).
(అంతరదృష్టి సలిపి ఆనందములో నున్నవారికి మనస్సుతో కూడ ప్రాణణ కూడ సద్దు అణిగిపోవును.)

621. పగిలి బహిర్గతమైన ప్రకాశమును, జలప్రవాహముతో కూడిన శివమను జ్ఞానారణ్యములను దర్శించి, సృజించి అందే నిమగ్నులై యున్నవారు, శిరస్సు అను శిఖరమున, ప్రాణణయను గుర్రమును మనస్సను తాడుతో కట్టి వేయుదురే!!
(శిరస్సుయందే శివుని సృజించి నెలకొన్నవారికి ప్రాణణ (శ్వాస) అణిగిపోయి సమాధి నెలకొనును.)

622. శివంను అనుసరించి, శిరస్సున నున్న సహస్రదళము చుట్టూ నాలుగు ద్వారముల మధ్యలో ఉన్నవారు (నాలుగు ద్వారములు: కళ్ళు ప్రజ్ఞ, చెవి ప్రజ్ఞ, జిహ్వ (నాలుక) ప్రజ్ఞ, నాసిక ప్రజ్ఞలు) వికసించిన సహస్రదళ పద్మమున అఖండమును దర్శించిన పిదప మీకు కాలుడను (యముడు) పదము కలలో కూడ కలుగనేరదు.
(శిరస్సున సహస్రదళపద్మమున అఖండమును దర్శించినవారికి ఇక మరణ భయము కలలో కూడ కలుగదు.)

623. పృధివి మొదలగు ఐదు మండలములు (వెన్నెముకలోని ఐదు చక్రస్థానములు), పన్నెండు కళలు (చంద్రుని యొక్క పదహారు కళలలో నాలుగు కళలగు వ్యాపిని, వ్యోమరూపిని, అనంతా, అనాథ మినహాయించి), ఆధారచక్ర స్థానములలో నెలకొనియున్న అధిష్టాన దేవతలతో, మనోవికాసతత్త్వము వలన గ్రహించి శాంత్యాతీత కళలో నెలకొని, అంతటా వ్యాపకముగా యున్న ఈశుని పాదపద్మములందు నెలకొని శివయోగులు అనుభవించుదురు.
(శివైక్య పంచకళలలో చివరిదైన శాంత్యాతీత స్థితి. 1) నివృత్తికళ, 2) ప్రతిష్ట కళ, 3) విద్యాకళ, 4) శాంతికళ, 5) శాంత్యాతీతకళ.)

624. బావిలో నీరు చేదుతున్నప్పుడు తాడు ఎట్లు పైకి క్రిందకు పోవునో అట్లే శరీరములో పైకి క్రిందకు పోవు వాయుచలనమును నిలకడపరచి బ్రహ్మరంధ్రములో నెలకొనునట్లు చేసి, చలనము నిరోధించి మెలకువగా యున్నవారికి శివమను (మామిడి) పండును పొంది నిశ్చలమగుదురే!!
(శివయోగులు బాహ్యస్పృహ లేక అంతర్స్పృహ యందు నెలకొనియుందురు.)

625. ఆత్మస్వరూపమును గ్రహించుటకు శ్రేష్టమైన విధానమొకటి గలదు. పూర్వము దేవతలు పాలకడలి మధించి అమృతమను సుఖమును పొందిరి. కాని దేవతలు శిరస్సున నెలకొని అమృతపానము సేవించజాలరు. కావున మనస్సు అణిగి (లయమొంది) శిరస్సున (సహస్రదళమున) శ్రేష్టముగా నెలకొనుట వలనే స్వరూపదర్శనము పొందగలరు.

626. నమ్మకస్తుడు, ఆదియు (అనాదిగా యున్నవాడు) చతుర్వేదములను సృజించిన వాడు, ఎర్రనైన ప్రకాశములో నెలకొన్న జ్యోతిస్వరూపుడైన పరమశివుని యందు ప్రేమను పెంపొందించుకొని, ఆశలను త్యజించి, సహస్రదళ పద్మమున నెలకొని సాధకుడు నిష్టతో కూడియుండును.
(సాధకుడు సమాధిలో నాదము, ప్రకాశము మయమైన దైవమునందు ప్రేమతో నెలకొనియుండును.)

627. కుండలినీ నాలుగు పద్మరేకులతో కూడిన మూలాధారచక్రములో త్రిభుజాకారముగా నున్నది. అది తన స్వాభావికమైన అపానముతో చేరక ప్రాణవాయువుతో చేరినచో, శ్రేష్టమైన నెలవంక (చంద్రుని రూపము) నుదుటి మధ్యభాగమున అర్థచంద్ర రూపమున తన పన్నెండు కళలతో దర్శనమిచ్చునే!!
(కుండిలినీ శక్తియే ప్రాణతో కలిసి శిరస్సుకు ప్రాకి వివిధ కళలతో నుదిటిపై సాధకునకు సమాధియందు దర్శనమిచ్చును.)

628. జీవసంకల్పములను (జీవభావన) విడనాడి, మూలాధారశక్తితో పైకి (శిరస్సుకి) వెళ్ళి, శిల్పతత్త్వములతో పెక్కు భువనానాదులను (పెక్కు లోకముల సృష్టి) సృష్టించి ఇచ్చిన మహాప్రకాశముతో నొప్పారు పరమశివుని దరిచేరి చంద్ర మండలములో నెలకొని, తానని, శివమని భేదము (అభేదతత్త్వము) లేక శాంతములో నెలకొనియుండుటయే సమాధి అగును.
(చిత్త సంకల్పములను విడచి, ప్రాణశక్తిని శిరస్సుకు ప్రాకించి, మహా ప్రకాశములో నెలకొనియున్న శివునియందు లయమై అభేదబుద్ధితో నెలకొని యుండుటయే సమాధి అని చెప్పబడుచున్నది.)

629. పైన వాటితో జీవితము మార్చుకొన్నవారికి ఆత్మ నిలకడనై యుండును. ఆత్మ

శివుని సృజించి యుండుట అనుగ్రహశక్తి కూడ అతనిలో పెనవేసుకొని యుండును. అనుగ్రహశక్తికి ఎదురులేక కామక్రోధాదులు కూడ వీగిపోవును. సమాధి చేకూరిన వారికి సమత్వభావన కూడ వచ్చిచేరును.
(సమాధి చేకూరునపుడు కామక్రోధాదులు వీడిపోయి సమత్వము ఏర్పడును.)

630. మహాప్రకాశముతో కూడిన అగ్నిజ్వాలగా వెలుగొంది నిలబడు శివుడు, ఆదియైన శక్తియు, అంతరమున (శరీరమున) నెలకొనియున్న నిర్మలమైన, నిష్కళంకమైన ఆత్మయు సమాధియందు ఒకటే అగును. సృష్టికి మూలకారకుడు చతుర్ముఖ బ్రహ్మయు, నీలమేఘశ్యాముడు నారాయణుడును ఆదియైన శివునికి శిరసావహించి, ఆతనియందు ఎప్పటికీ ప్రేమ సలుపుదురు.
(జీవుడే శివమయమైనపుడు అన్ని దేవతలు ఆ జీవనజ్యోతితో సంగత్వముతో నుందురు.)

631. సమాధిలో నున్నవారికి కొన్ని యోగములు సిద్ధించును. ఎప్పుడూ దైవము నందే (పరమునందే) నెలకొనియుండుటచే ఇక సమాధులు కూడ అక్కరకు రాదు. ఆత్మయైన తాను శివమే అయినచో సమాధులతో అవసరము లేదు. సమాధి వలన అరువది నాలుగు (64) కళలు, వాటి జ్ఞానము వచ్చి ఇమిడిపోవును.
(తానని, శివమని భేదము చిత్తమునందు లేనందున ఇక సమాధి అవసరము లేదు.

**యస్య బ్రహ్మణి రమ్యతే చిత్తం, నన్దతి, నన్దతి, నన్దత్యేవ!!**
ఎవ్వని చిత్తము సదా (ఎల్లకాలము) బ్రహ్మమునందు రమించునో, వానికి ఆనందమే ఆనందము - శృతివాక్యము.
పరమాత్మ, తాను వేరను భావము లేకుండుటచే, అన్ని సిద్ధులు తన వశమగును.)
(పరము, బ్రహ్మ, పరమశివుడు, పరబ్రహ్మ, చైతన్యము, చిత్, పరమేశాం అన్నియూ ఒక్కటే.)

## 10. అష్టాంగయోగసిద్ధి

### (అష్టాంగయోగము వలన ప్రయోజనములు)

632. శిరస్సున సహస్రదళపటలమందు కోరి అమరియున్న శివుని (ప్రకాశము కిరణములతో కూడిన జటాధారుడు) పాదపద్మములను కోరువారికి, ఎవరెట్లు కోరినచో అట్లే అమరావతికి (ఊర్ధ్వలోకము) వెళ్ళగలరు. ఉమాదేవి సమేతము నాట్యమాడువాడు ప్రకాశకిరణములనే వాహనముగా గలిగినవాడు, సాధకుడు ఏది కోరి వచ్చితే దానిని అనుగ్రహించునే!!

(ప్రకాశకిరణములను వాహనముగా కలిగినవాడు: ప్రకాశకిరణముల గుణము శక్తి. ఆ శక్తియే ఉమాదేవిగా కలిగి ఆమెతో నాట్యము చేయుట.)

633. దివ్యపాద పద్మముల దరిచేరి, అందులో నెలకొని వాటిపై ప్రేమ సలుపు వారికి, శివుని మహిమను సదాచిత్తమునందు స్తుతించి పదిలము చేసుకొన్న వారికి, మునులు, ఋషులందరు లేచి గుమిగూడి ఎదురువెళ్ళి ఆహ్వానము పలుకగా తేటనైన, ఖచ్చితమైన శివపదము వశమగునే!!

634. పరమశివుడుని తలంచి, స్తుతించి, తపస్సు ఆచరించినవారికి దేవలోకమునకు రాజుయై, దేవలోకమునకు వెళ్ళదగిన అర్హత గలవాడని పేరుగాంచి, శీతలము ఒనగూర్చు సన్నని పిల్లనగ్రోవి శబ్దించగా, దైవకృపతో ఈ లోకములో నుండే సుఖమును పొందుదురు – జీవన్ముక్తులగుట.

(శివయోగము సిద్ధించినవారికి ఇహమునందే సుఖము పొందగలరు.)

635. బంగారువర్ణ ప్రకాశముతో నొప్పారు **శివగతి**ని పొందు తరుణములో, పూర్ణ కుంభముతో కూడిన దేవతల సమూహము అతనికి ఎదురువెళ్ళి ఆహ్వానము పలుకగా, మన బంగారు (మండలమను బుద్ధి) మండలమునకు నాయకుడు ఇతనే అని చెప్పి పొగడగా, సుఖములన్నియూ ఒనగూరునే!!

636. శివగతి పొందు సమయమున శ్రేష్టులగు దిక్పాలక దేవతలు **ఎవరు వీడు?** అని అడుగగా, పరమశివుడు **నేనే వీడని** చెప్పగా, అందమైన, ఉన్నతమైన దేవతలందరు ఎదురువెళ్ళి ఆహ్వానము చెప్పగా, నీలకంఠుని (శివ మహామహుని) సాధకుడు సాక్షాత్తుగా దర్శించెనే!!

(పరిపక్వమొందిన సాధకునకు శివపథము గిట్టును!!)

637. నాదసామీప్యము పొంది, యముని మార్గమును కూడ మార్చగలిగిన ఈ ప్రణవ (ఓంకార) ఉపాసకులు అపరిమితమైన త్యాగ, దాన, శ్రేష్టగుణములు కలిగిన ఈ యోగులు దేవలోకములలోని అష్టదిక్కులకు వెళ్ళిననూ, ఎటు వెళ్ళిననూ అన్ని మార్గములు తమకు తెలిసినవిగానే ఉండును.)

(నాదసామీప్యము నొందినవారు ఏ లోకమునకైననూ వెళ్ళగలిగిన సిద్ధి పొందుదురు.)

638. జ్ఞానస్వరూపుడగు నారాయణునకు, ఏడేడు లోకములను మరలా సృష్టించ గలిగిన బ్రహ్మకు, మహాశక్తితో నాశనము (లయమొందించుట) చేసియూ తాను మాత్రము ఎటువంటి క్షీణత పొందకుండా నిలుచున్న రుద్రుడునకు, అమృతము త్రాగి నిద్రించుచున్న దేవతలందరికి శివగతి పొందినవాడే నిలయమగును.

(శివగతి పొందిన శివయోగులందు నారాయణుడు మొదలగు దేవతలందరు నివాసము చేయుదురు.)

639. ఆత్మలకు (శివగతి పొందినవారికి) అహంకార మలమను ఆవరణశక్తి వలన ఏర్పడిన ఏడు ఉపాధులు తొలగి, ఆర్ష శివతత్త్వములు ఏడు ఉపాధులు వచ్చిచేరి, పరంపరగా వచ్చుచున్న (పెక్కు జన్మల వాసనలు) శుద్ధమాయ నాశనమై, ధ్యాన ఉచ్ఛస్థితిలో **తత్పరం**తో చేర్చుటయే సమాధి యొక్క సత్ఫలమగును.

(ఆవరణశక్తి – జీవులందు నిజ బ్రహ్మతత్త్వమును మరిపించుయుంచుట (అహంకార మలము): 1) అదైవభావన, 2) స్వల్పజ్ఞానము, 3) పరిమితత్త్వము, 4) మాయాతత్త్వము, 5) స్వల్పశక్తిత్వము, 6) అస్వతంత్రము, 7) కామము. ఆర్షశివతత్త్వములు ఏడు: 1) దైవత్వము, 2) పూర్వజ్ఞానత్వము, 3) విశ్వతత్త్వము, 4) నిర్మలము (ఎటువంటి మాయామలము లేకుండుట), 5) అతీత్వము (పరిమితి లేనిది), 6) తన్మత్వము, 7) ఏకం (ద్వైతభావన వీడి అద్వైతభావనతో నుండుట.)

## 11. అష్టమహాసిద్ధులు

ఎనిమిది మహాసిద్ధితత్త్వములు యోగఫలము వలనను, ఈశ్వరుని అనుగ్రహము వలనను గిట్టునది. అవి: అణిమా, మహిమా, గరిమా, లఘిమా, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము, వశీత్వము.

1. అణిమా : అణువు వలె అతి సూక్ష్మమగుట
2. మహిమా : పర్వతము వలె అతి పెద్దదగుట
3. గరిమా : మహాఘన రూపమగుట (బరువెక్కుట)
4. లఘిమా : దూది వలె బహు తేలికయగుట
5. ప్రాప్తి : అన్నింటా తాను నెలకొనియుండుట. అన్నింటిని పొందగలుగుట
6. ప్రాకామ్యము : పరిమితము లేని ఇచ్ఛకు తగినట్లు తానే అది అగుట
7. ఈశత్వము : పంచతత్త్వములందు నెలకొని అట్లే కర్మించుట
8. వశీత్వము : అన్ని తత్త్వములు తానే అగుట, వశీకరించి అంతటా వ్యాపించియుండుట

ప్రాకామ్యము అనునది – పరకాయ ప్రవేశము. అవసరమునకు తగ్గట్లు ఏ, ఎవరి శరీరమునైననూ ధరించవచ్చును. తద్ధర్మ సుఖఫలములను అనుభవించ వచ్చును. మేలైన శరీరాదులను కూడ పొందవచ్చును. ఈ పరకాయ ప్రవేశము చేసియే ఈ రచయిత **మూలన్**గా పశువుల కాపరిగా మారి తిరుమంత్రమను ఈ మహాగ్రంథరాజమును రచించి శ్రీతిరుమూలనాయనార్‌గా పేరొందిరి. ఎనలేని తమిళ సంస్కృతితో, లోకకళ్యాణార్థము వేదశాస్త్రమును, లోకమునకు శివబోధగా బోధించిరి.

640. చిత్తము పరమమునందు లయమగుటచే, అష్టదిక్కులందును నెలకొనియున్న పరమమును, వాడే పరమపురుషుడన్న భావనతో, అష్టదిక్కులకును ప్రణమిల్లి, అచ్చట అష్టమాసిద్ధులు తామే పొందునట్లు చేసుకొని, అన్నింటా అష్టసిద్ధులు నెలకొనునట్లు చేసికొనును.
(పరమమే అతి ఉన్నతమైనది, శాశ్వతమైనదను భావనతో స్తుతించడము వలన అష్టసిద్ధులు అవియే వచ్చిచేరును.)

641. ప్రకాశమండల వాసులకు వారివారి పరిపక్వము తగ్గట్లు అనుగ్రహమొసగు పరమపురుషుడి పాదపద్మములందు నేను శరణునొంది, నిష్కళంకమైన పరమ ప్రకాశమును చూచితిని. కావున సాధ్యము కానిది నాకేమియు లేదు. అష్ట సిద్ధులను నాకు తానే కోరి ఇచ్చి ఆ మహామహుడు నాకు జన్మరహితము చేసెను.
(పరమపురుషుని యందు శరణు పొందినందున అష్టసిద్ధులు తనకు నొసగి జన్మరహితము చేసెనని రచయిత చెప్పుచున్నారు.)

642. గురువు అనుగ్రహముతో మూలాధారచక్రములో నున్న కుండలినీ శక్తిని జీవశక్తితో నిలిపి మంచితరుణము చూచి సుషుమ్నానాడి ద్వారా శిరస్సు ఆజ్ఞాచక్రమునకు ప్రాకించి, ధ్యానవిధానములలో యున్న **శాంభవి** ముద్రతోనైన గాని (604వ మంత్రము – టీకా) లేక **కేసరీ** ముద్రతోనైన గాని (605వ మంత్రము – టీకా) ఏదో ఒకదానిని అవలంభించి, గొప్పదైన శివగతిని పొంది దాని మారుపేరైన అష్టసిద్ధులను పొందవచ్చునే!!
(గురువు అనుగ్రహము కలిగియున్నవారు శివానుగ్రహము పొందనగును.)

643. ఆకాశము మొదలుకొని పంచభూతతత్త్వములు, కళలు, కాలము, మాయా తత్త్వములతో కూడినదైన ఈ శరీరపు అసత్తు వీడవలెనన్న ఆత్మతత్త్వమను జ్ఞానములో నెలకొని అనాదిని వీడిపోకుండా శక్తితో కట్టినచో శాశ్వతమైన, శ్రేష్టమైన శరీరము పొందగలరు.
(అసత్తును తొలగించి సత్తును నెలకొల్పినచో పరకాయమగును.)

644. నెలకొనిన కర్మయోగమున ఇరువదివేల ఎనిమిదివందల భేదములు కలవు. ఇట్లు వచ్చి నెలకొనినది శరీరకాష్టమగును. ఇట్లు అమరినది అష్టాంగ యోగమునకు సహాయమొనర్చి, అష్టసిద్ధులను కూడ ఒనగూర్చగలిగిన శక్తివంతమైనది.

645. చంద్రనాడియగు ఎడమనాసిక ద్వారా శ్వాస (చంద్రకళ) – పన్నెండు అంగుళములు పూరకము చేసిన ప్రాణణలో (శ్వాసలో), పింగళనాడి – కుడినాసిక రంధ్రము ద్వారా (సూర్యకళ) నాలుగు అంగుళములు రేచకము చేసిన పిదప, మిగతాయున్న ఎనిమిది అంగుళముల శ్వాస లోపలే ఉండి పోవును. దీనిని

పన్నెండు సంవత్సరములు లౌకిక బంధము వీడి గమనించుచూ వచ్చినచో, ఖచ్చితమైన అష్టసిద్ధులు పొందగలరు.
(సాధకునకు పన్నెండు సంవత్సరముల సాధనలో సుషుమ్న తెరవబడి శ్వాసము బ్రహ్మరంధ్రము చూసి ప్రాకి **కేవల కుంభకము** సిద్ధించును.)

646. నేను, నా బంధువులు, నావారు, నాది అను భావనల వలన మనల్ని బంధము ఆకట్టుకొనును. అపరిమితమైన కళాజ్ఞానము, సూక్ష్మజ్ఞానము, విషయ, శాస్త్ర, మేధా, పరిజ్ఞానములు వీటివలన అష్టసిద్ధులు పొందలేరు. ఇందులకు భేదమైన నాదశబ్దం (శిరస్సున ఝంకారించు నాదము)ను పన్నెండు సంవత్సరములు వినుటవలనే సిద్ధి పొందగలరు.

647. నాదదర్శనము పొందిన ఏడేళ్ళకు ప్రచండ మారుతమువలె మాటలతో వేగమును పొందుదురు. మాటతీరులో సరళము, వివిధ యోచనలు చూపించు సామర్థ్యము ఏర్పడును. ఎనిమిదవ సంవత్సరములో జుట్టురంగు మారుట, శరీరము ముడతలు పడి కృశించుట జరుగవు. తొమ్మిదవ సంవత్సరములో పరకాయ ప్రవేశము (శరీరక్షీణత లేక) చేయగలుగును.

648. పది సంవత్సరముల ధ్యానశక్తి వలన అధోముఖముగా వెళ్ళు శక్తులన్నిటినీ ఊర్ధ్వముఖముగా వెళ్ళునట్లు (అనగా శిరస్సునకు) చేసుకొని రుద్రుడువలె సాధకుడు వెలసిల్లును. పదకొండవ సంవత్సరమున యోగ అష్టసిద్ధులు ఒక్కొక్కటిగా లెక్కించునట్లు సిద్ధించును. పన్నెండవ సంవత్సరమున సర్వవ్యాపియై ఎచ్చటికైననూ వెళ్ళగలిగి, పూర్ణముగా నిలబడు అర్హత సాధకుడు పొందగలడు.

649. తానే అణిమాగా, ప్రపంచము అంతటి గొప్పదైన మహిమాగా, కొలవలేని ఘనముగా, అన్నింటా వ్యాపియైన ఆకాశమువలె బహుతేలికనైనదిగాను, క్షీణత లేని శరీరము పొందునదిగాను, పరకాయప్రవేశము చేయగలిగిన సామర్థ్యమును, నిజతత్త్వమును (శివుని) ఈశత్వమును, సర్వవ్యాపియైన వశీయత్వము అగు అష్టసిద్ధులను పొందగలరు.
(శివయోగులు పొందు అష్టసిద్ధులు ఇందు వర్ణించబడినవి.)

650. శివయోగియైన తాను అణుతత్త్వము పొంది కొన్ని జీవరాశులలో నెలకొనియున్న కాలములో, వారిలో ఇమిడియున్న కాలములోనూ ఏ మార్పూ లేదు. ఏలననగా సిద్ధి పొందిన జీవులలో అప్పటికే ప్రణవనాదము (ఓంకారము) ఊర్ధ్వముఖముగా పైకెక్కి సహస్రదళపటలము చేరియుండుట వలన ముక్తికి ముందున్న వారైరి (అర్హత పొందిరి). (ముక్తి, మోక్షము, శివైక్యము, శివసాయుజ్యము అన్నియూ ఒక్కటే.)

(ప్రణవయోగమే పునర్జన్మ రహితము చేయగలిగిన శక్తియగును.)

651. సూర్యోదయమునకు ముందు మూడువందల అరువది నిముషములు ఆకాశతత్త్వమునకు చెందినది. పగటిపూట 30 గడియలు, సృష్టిక్రమమున ఆకాశముతో మొదలై వాయువు, అగ్ని, జలము, పృధివి, ఒక్కొక్కటి 6 గడియలు చొప్పుననూ రాత్రిపూట 30 గడియలు పృధివితో మొదలై జలము, అగ్ని, వాయువు, ఆకాశముతో ముగిసి ఒక్కొక్కటి 6 గడియలు చొప్పున లయ కాలపరిమితి గలదు. సాధకుడు ఈ తత్త్వమెరిగి సూర్యోదయమునకు ముందు 6 గడియలు, సూర్యోదయము పిమ్మట 6 గడియలు ప్రణవయోగమున ఆకాశతత్త్వములో నెలకొనియుండి సూర్యుని సహస్రదళమనకు ప్రాకించినచో నాదము, ప్రకాశము రెండూ తనకు చేకూరును.

(ప్రణవయోగములో ఆకాశతత్త్వములో నెలకొనుట చాలా శ్రేష్టము.)

652. చిత్తము బాహ్యముగా వెళ్ళక మారుగా శివమై, పరము (బ్రహ్మం) నందు నెలకొని ప్రణవోపాసనతో శివుని చేరి జీవన్ముక్తులగుదురు. వారు పంచేంద్రియములతో వృత్తులు లేనివారైనందు (నిరోధము) వలన అంతర్‌శుద్ధి పొందిన వారగుదురు. వారు బుద్ధి, మనోకాశము తత్త్వములు విడచినవారై శివములోనే నెలకొనియుందురు.

653. ఒక్కొక్కరిలోను అతిగాకాక, తక్కువ కాకుండా క్రమానుసారముగా తొమ్మిది వాయువులు చలించుచున్నది. ఈ తొమ్మిది కాక పదవదైన **ధనంజయమ**ను వాయువు మిగతా తొమ్మిదింటితో కలిసి, క్రియించి, శరీరమునుండి ప్రాణము వీడకుండునట్లు కాపాడుచున్నది.

(దశవాయువులు (ప్రాణ, అపాన, వ్యాన, సమాన, ఉదాన, నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయ) సమముగా ఉండి క్రియించుట వలన దేహములో ప్రాణము చాలాకాలము నెలకొనియుండును.)

654. ధనంజయ వాయువు మిగతా వాయువులును క్రియించు నాడులలో నెలకొని యుండును. అది రెండువందలు ఇరువదిమూడవ భువనమగు **అనంతమ**ను మండలములో నెలకొనియుండును. ఈ వాయువు నెలకొని ఉండనిచో ఈ శరీరము (వ్యాకోచించి) ఉబ్బిపోయి పగిలిపోవును.

(రెండువందల ఇరువది నాల్గవ భువనము **అనాశ్రితము** అగును. ఈ అనాశ్రితము దేనికి ఆశ్రయమివ్వదు. శరీరము నుండి ఆఖరున వీడునదైన ధనంజయ వాయువును యోగులు వీడక కాపాడుకొనుదురు. ఇక నాడులు:

1. ఇడనాడి – ఎడమ చంద్రనాడి – వాతము (గుణము)

2. పింగళనాడి – కుడి సూర్యనాడి – పిత్తము (గుణము)
3. సుషుమ్నానాడి – మధ్యనాడి – శ్లేష్మము (గుణము)
4. పురుషనాడి – కుడికన్ను నాడి
5. గాంధారినాడి – ఎడమకన్ను నాడి
6. హస్తినాడి – కుడిచెవి నాడి
7. అలంబుషనాడి – ఎడమచెవి నాడి
8. శింగువనాడి – కొండనాలుక నాడి
9. షంగినినాడి – ఉపస్థ – ఆడ, మగ లింగనాడి
10. గురునాడి – పాయు (గుదము) నాడి

ధనంజయమున్నంతవరకు శరీరము క్షీణము కాదు.)

655. వాచిపోయిన గర్భవ్రణము, చర్మవ్యాధులు, కుష్టము, ఆయాసం, కాలిలో వాపు, గూని, నడవలేనితనము, కంటిలోని కొన్ని వాపు వ్యాధులు ధనంజయ వాయువు మార్పుల వలన ఏర్పడినవే అగును.

656. బాగుగా పరిశీలించి చూచినచో ధనంజయ వాయువు మార్పుల వలనే కొన్ని వ్యాధులు ఏర్పడియున్నవి. కంటిలో ఏర్పడు శుక్లము మొదలగు పలు వ్యాధులు ధనంజయ వలన ఏర్పడినవి కావు. అది కంటిలో కూర్మవాయువు నెలకొనినచో కొన్ని కంటివ్యాధులు సంభవించి కంటి ప్రకాశము కోల్పోవును.

657. నయనములందు (కళ్ళలో), హృదయమున, నాడుల శబ్దమున్నది. చిన్న అగ్నికణములతో తయారగు చిన్న వెలుగు మహాప్రకాశరూపమును వెదజల్లు చున్నది. అందే దేవతల నాయకుడైన రుద్రుడు, విష్ణువు, బ్రహ్మ మొదలగు దేవతలు నిర్విరామముగా అందు నెలకొని క్రియించుచున్నారు.

(హృదయమున స్పృహయుంచి ధ్యానించువారికి శిరస్సున నాదశబ్దము వినబడును. కళ్ళయందు ధ్యాసయుంచి అంతర్ముఖులైన వారికి శిరస్సున ప్రకాశము, నాదము ఏర్పడును.)

658. నవ ద్వారములు కలిగిన ఈ పిండదేహమున (కళ్ళు 2, చెవి 2, నాసికలు 2, నోరు 1, పాయు 1, ఉపస్థ 1 = 9) ఇడ, పింగళ అనబడు తొమ్మిది నాడులు ఇమడగలిగిన చోటు సుషుమ్నానాడి (భ్రూమధ్యమున) ఒకటియున్నది. ఇది గ్రహించి అచ్చట తలంపు ఉంచి ధ్యానించనివారికి తొమ్మిది ద్వారములు గల ఈ శరీరకొలిమికి క్షేమము ఏర్పడదు.

(సుషుమ్న ధ్యానము వలన నవద్వారములతో కూడిన ఈ దేహమునకు శుభమేర్పడును.)

659. శ్రేష్టమగు కుండలినీ శక్తిని మూలాధారము నుండి సుషుమ్నానాడి ద్వారా ప్రాకించినవారికి పూరకము ద్వారా లాగిన ప్రాణమును (శ్వాసను), చంద్రకళలో (ఇడనాడి) పరుగెత్తునట్లు చేసినచో, ఏడులోకములను మోయదగిన యోగ విధానమును బోధించిన వాడినైతిని.
(గురువు ద్వారా ప్రణవ ఉపదేశము పొంది కుండలినీ అభ్యాసమొనర్చిన వారికి ఈశానుని మూలలో (శిరస్సున) చంద్రకళ నెలకొనును.)

660. బ్రహ్మరంధ్రములో నెలకొనియున్న శివశక్తుల అనుగ్రహము పొంది, వలలో చిక్కుకొని ఎచ్చటకీ పోజాలని జింకవలె, చంద్రకళ (ఇడనాడి) సూర్యకళ (పింగళనాడి)లలో ప్రాణమును (శ్వాస) వెళ్ళనీయక సుషుమ్నలో నిలిపిన వారికి, వ్యాపారమునకు, భోజనమున కొరకు భద్రపరచుకొన్న విత్తనముల వలె లాభించును. (పంట విత్తనములను భద్రపరచుకొని విధానము తెలుపునది.)
(సుషమ్న (భ్రూమధ్యమున) ధ్యానము చేయువారు తమ క్షేమమే కాకుండా ఇతరులకు కూడ క్షేమమును ఏర్పరచగలరు.)

661. మూలాధారము నుండి శిరస్సున గల సహస్రదళ పటలమునకు ప్రయాణించి శివమను పదార్థమును దర్శించినవారు, అచ్చట నాడులలోనున్న నాదమును ఏర్పరచి, ఇంకా వెతకి వెళ్ళి (అమృతమును) తేనెను రుచిచూచి, శరీరములో బంధము ఏర్పరచునదైన అరిషడ్వర్గములను (కామము, క్రోధము, లోభ, మోహ, మద, మాత్సర్యాదులు) బంధించగలరు.
(ప్రణవ ఉపాసనలు శరీర బంధత్వము ఏర్పరచునదైన అరిషడ్వర్గములను తొలగించును.)

662. సహస్రదళ పటలముతో పెనవేసుకొనియున్న సుషుమ్నానాడిలో జీవులను లౌకిక బంధములలో ఇరికించువారైన నవశక్తులు, జీవులు పరిపక్వ మొందుటచే వారి చేష్టలు అణిగిపోయి పరాశక్తియందు శరణు పొందిరి. అపుడు మూలాధారములో క్రియించుచున్న కుండలినీ కంఠస్థానమగు విశుద్ధి చక్రము ద్వారా పైకి వెళ్ళి భ్రూమధ్యమున వెలయు ఆజ్ఞాచక్రమునకు చేరి పూర్ణత్వము (పూర్ణశక్తిగా మారి)ను పొందెనే!!
(నవశక్తులు: 1) వామ, 2) జేష్ట, 3) రౌద్రి, 4) కాళి, 5) బలవికరణి, 6) కళావికరణ, 7) బలప్రదమణి, 8) సర్వభూతమణి, 9) మన్మోమణి. ప్రాకాయము పొందినవారు భ్రూమధ్యమున మహాప్రకాశము నెలకొనిన దానిని సృజించగలరు.)

663. పరిపూర్ణ పరాశక్తి ఏడుకన్యలుగాను (బ్రహ్మి, నారాయణీ, మహేశ్వరీ, కౌమారి, వరాహీ, రుద్రాణి, ఇంద్రాణీ), ఇచ్ఛా, క్రియ, జ్ఞానశక్తులతో కూడి మొత్తము 21

కన్యలుగా నెలకొని (7 కన్యలు × 3 శక్తులు = 21 క్రియాశీలక కన్యలు) పంచకర్మలుతో (సృష్టి, స్థితి, లయ, అనుగ్రహ, ఆవరణశక్తి) కలిసి 105 కన్యలైరి. (21 కన్యలు × పంచకర్మలు = 105 కన్యలు).

(బ్రహ్మ, నారాయణుడు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు వీరి ఐదుగురి వృత్తులకు సహాయమొనర్చు కారణీయులుగా 105 కన్యలు నిలబడిరి.)

(జీవుల సృష్ట్యాదులకు పరాశక్తి యొక్క క్రియాశీలత, ప్రమాణములను వివరించినది ఈ మంత్రము.)

664. ఇట్లు వ్యాపించి జీవులలో ఇమిడి, పలువిధములైన, భోగములను పురికొల్పిన పరాశక్తి, నిగూఢముగా శ్రేష్టమైన శివునిలో భాగమై, ఇమిడి, పంచభూతములగు భూమి మొదలగువాటిలో ఇమిడి, లయమైయుండునే!! కావున నీవు శిరస్సున వెలయు నాదములో నెలకొనియుందువు గాక!!

665. నాదమునందు మనస్సు నెలకొనియున్న వారికి ఇడ, పింగళ మూసుకొని సుషుమ్న (భ్రూమధ్యము) తెరచుకొనును. శ్వాసలు వారికి నెమ్మదిగా జరుగును. ఆరు ఆధారములునూ, శక్తులు ఏడునూ విహీనమై, చంద్ర మండలమున భ్రూమధ్యమున (సుషుమ్న క్రియాశీలత నొందుటచే) బిందు స్థానములో విద్యుత్లత ప్రకాశములో నీవు లయమగుదువు గాక!!

(విద్యుత్లత వంటి ప్రకాశము దర్శనము వలన ఆరు ఆధారములోని శక్తులన్నియూ విహీనమగును.)

666. మనస్సు ఏకాగ్రత పొంది భ్రూమధ్యమున కేంద్రీకరించినచో, ప్రాణణ (శ్వాస) అందులో అణిగిపోవును. బాహ్యముగా కాక అంతర్ముఖులైనందున వారి ప్రాణములో నాట్యము చేయుటకు పరమేశ్వరుడే తనను ప్రదర్శించుకొనును.

667. సుషుమ్న ప్రాకు ప్రదేశములో నెలకొనియున్న నాదశబ్దముతో కలిసివెళ్ళి అచ్చట కొలువైయున్న శివశక్తితో నెలకొని, బంధత్వమును ఏర్పరచు శత్రువును జయించి, అచ్చట (సుషుమ్నలో) నున్న శ్రేష్టనాధుని దరి చేరుటయే మహాగొప్ప విషయమగును.

668. అణిమా మొదలగు సిద్ధులను బోధించునదైనది: అణువులో పరమాణువు గాను, పెద్దదిలో పెద్దదిగాను, కదిలించుటకు వీలుకాని బహుఘన పరిమాణముగాను, పొగవలె బహుతేలికాగను, ఊర్ధ్వములోనున్న ఆకాశమును తాకునదై, అన్ని పంచభూతములలోను వ్యాపించినదై, అన్ని జీవరాశులలో ఇమిడిపోవుటయు, అన్నిటిని తన వశము చేసుకొని అన్నింటా తానై నెలకొని యుండుట, మొదలగునవి అష్టమములగును. (అష్టసిద్ధుల వివరణ).

669. అష్టమహాసిద్ధులను, అష్టాంగయోగము వలన అణిచి, పాలించలేని ప్రాణ వాయువును అణిచి సాధన చేసినచో అణిగిపోవును. మూలాధారములోని సుషుమ్నానాడి ద్వారా అగ్నిమండలము, సూర్యమండలము దాటినచో, చంద్రమండలము నందు అమృతమును భుజించనగును.

670. పైన చెప్పబడిన అష్టాంగయోగము వలన కలిగినది అష్టమహాసిద్ధులే కాక, జ్ఞానాతత్త్వములన్నియూ ఒనగూరును. అష్టమహాసిద్ధులకు తానే నాయకియైన త్రిపురాశక్తి కరుణతో అనుగ్రహముతో సిద్ధియూ, బుద్ధియూ కలుగును. (అష్టాంగయోగమునకు ఫలమును అందించునది త్రిపురశక్తియే.)

## అణిమా

671. ఈ అష్టమహాసిద్ధులతో శ్రేష్టమైన పరమును (బ్రహ్మజ్ఞానము) కైవసము చేసుకొన్న వారే (శివయోగ) సిద్ధులనబడుదురు. వీరు శివలోకము (శివగతి) పొందినందున, శివుని దర్శించి, శివధ్యాసలోనే యుందురు. అష్టసిద్ధులు కూడా తామే వచ్చిచేరును. (శివజ్ఞానము పొందినచో సిద్ధులన్నియూ తామే వచ్చి చేరును.)

672. మందర, మేరు పర్వతములనబడు శిరస్సున చంద్రకళ (ఇడనాడి – ఎడమ నాసిక ద్వారా శ్వాస) సూర్యకళలను (పింగళనాడి – కుడినాసిక ద్వారా శ్వాస) మార్చిమార్చి అభ్యాసము చేసి సుషుమ్న (భ్రూమధ్యమున) నందు ధ్యాసయుంచి శుక్లవ్యయము చేయకుండువారికి తిరిగిరాని శ్రేష్టమైన పుణ్యలోకమును పొందుదురు. ఆ లోకము అణిమాది సిద్ధులను ఒనగూర్చునది.
(చంద్రకళ, సూర్యకళల శ్వాసలు సక్రమముగా అభ్యసించి సుషుమ్న యందు ధ్యాస యుంచినవారికి తిరుగులేని పుణ్యలోకము ప్రాప్తించును.)

673. శుక్లక్షయము కాకుండా నిరోధించి ఒక్క సంవత్సరము యోగాభ్యాసము అభ్యసించిన వారికి, గ్రంథములలో శ్రేష్టమని చెప్పిన అణిమాసిద్ధి కైవస మగును. సిద్ధి పొందినవారు కూడ సన్నగా, నాజూకుగా తయారై దూదివలె సున్నితుడగును. వీరిని జయించుటకు వీలుకాదు.
(ఒక్క సంవత్సరమున అనునది (సౌర్య) సూర్యకాలమానమగు 12 నెలల కాలము కాదని, గురువు (బృహస్పతి) కాలమానమగు 12 సంవత్సరములుగా కొన్ని గ్రంథములలో పేర్కొనబడినది.)

## లఘిమ

674. అంతర్జ్ఞానమును నొసగునదైన పరాశక్తియే మూలాధారము మొదలుకొని వెళ్ళు అన్ని చక్రతత్త్వములో ఆ శక్తియే ఇమిడి, ఆధారమై, వ్యయమగు కాలములో కూడ (తానే) ఇమిడి, ఆ కాలమును సఫలమగునట్లు చేసి, ఐదు సంవత్సర

కాలములోనే శ్రేష్టమైన లఘిమా సిద్ధించును.
(ప్రకాశము సాధకుల శరీరములో నెలకొనుట వలన వ్యయమగు కాలమునకు కూడ అతీతముగా ఆ ప్రకాశము నెలకొని సాధకుడు ఐదు సంవత్సరములలోనే లఘిమాసిద్ధి పొందును.)

675. లఘిమాసిద్ధి పొంది, అందమైన నాయకుని (శివుడుని) దర్శించిన పిదప, తాను ప్రకాశముగా ఒప్పారి ఆ పరంజ్యోతిలో నెలకొనియుండును. ఇట్లు పాలవంటి తెల్లనైన ప్రకాశములో అన్నింటా వ్యాపించి నిలిచిన ఆత్మ, అన్నింటికన్నా మిన్నయైన మహాప్రకాశ స్వరూపుడైన శివమహామహుని (పరమశివుని) దర్శించునే!!
(లఘిమాసిద్ధి పొందినవారు పరంజ్యోతిని దర్శించుదురు.)

## మహిమా

676. సత్యజ్ఞానమును (ఆత్మజ్ఞానము) గ్రహింపజేసిన అనుగ్రహశక్తితో **తత్** అను పరమమును చూచించు శివతత్త్వమును నెరిగి, అవ్యక్తముగా నుండు మహిమా సిద్ధిని పొందుట ఒక్క సంవత్సరములోనే అరచేతిలోని వస్తువువలె సిద్ధించును. (దైవ అనుగ్రహముతో ఆత్మజ్ఞానమును పొందినవారు **తత్** (తత్ = పరం, పరబ్రహ్మం, పరమాత్మ, శుద్ధచైతన్యము, పరమేశాం, పరమశివుడు మొదలగునవన్నియూ పరబ్రహ్మమును సూచించును.) ఆ తత్త్వములో నెలకొన్న వారికి మహిమా (అఖండమును బోధించునది) ఒక్క సంవత్సరములోనే సిద్ధించును. **తత్త్వమసి** – తత్ + త్వం + అసి = ఆ పరబ్రహ్మం + నీవుగా + ఉన్నావు అన్నది శృతివాక్యము – ఛాందోగ్యం – సామవేదము. శివతత్త్వము (అద్వైతము) సిద్ధించినవారు వారే శివం అగుదురు. (బ్రహ్మం=ఆత్మ=ఒక్కటే.)

677. ఇడనాడి, పింగళనాడుల రెండింటి కేంద్రీకరణ సుషుమ్నానాడి ద్వారా శిరస్సు పైకి వెళ్ళి అందు నొప్పారు ప్రకాశమును దర్శించిన పిదప, వ్యయము చెందదగిన కాలము (ఆయుస్సు) వ్యయము కాజాలదు. ఇక రాబోవు కాలము (ఆయుస్సు) ఇక అట్టే ఉండి, కాలతత్వములన్నియూ తన వశమగునే!!
(మహిమాసిద్ధి పొందినవారు కాలతత్వమునకు కట్టుబడజాలరు. అనగా ఆయుస్సు క్షీణముండదు.)

678. మహిమాసిద్ధి పొందినవారి నుండి జ్ఞానము పెల్లుబుకును. తన ద్వారా లోకమునకు దుఃఖము వీగిపోయి, క్షేమము ఏర్పడును. తన ద్వారా సుభిక్షమగునదంతయూ తన వశమై తాను శివానుగ్రహమునకు వశపడి యుండును.
(మహిమాసిద్ధి పొందినవారు శివుని వశపడియుండుటచే జగత్తంతయూ తన వశమై క్షేమము కలిగియుండును.)

## ప్రాప్తి

679. తత్వనాయకురాలు పరాశక్తియందు స్థూలముగా కనిపించుచున్న జగత్వస్తువులన్నియూ సూక్ష్మరూపములో ఇమిడియున్నవి. అటువంటి సూక్ష్మమైనవాటి ప్రకాశమును దర్శించి, ఒక్క సంవత్సరము పాటు ధారణ చేసినచో, ఆ ధారణ ద్వారా పొందిన సిద్ధియే ప్రాప్తి అనబడునది, పొంది కోరినది కోరినట్లే అమరును. (స్థూల, భూత వస్తువులన్నియు సూక్ష్మరూపముగా, ప్రకాశముగా నొప్పారియున్నవి. అటువంటివాటిని ధారణ శక్తిచే దర్శించుటచే శాంత్యాతీత స్థితిని నొంది ప్రాప్తి అను కోరినవన్నీ సిద్ధించును.)

## గరిమా

680. అటువంటి విద్యుత్ప్రకాశమును చూచిన పిదప, వికసించిన సహస్రదళ కమలములో జగత్తు వస్తువుల వ్యాపకమును చూడనగును. ఆక్రమించుకొను కాలతత్వము బాహ్యముగా నిలబడును. వ్యయమగు కాలతత్వము ఇక వ్యయము కాజాలదు.

(విద్యుత్ప్రకాశమును దర్శించినవారు కాలతత్వమును జయించిన వారగుదురు.)

681. ఆ మహాప్రకాశమును దర్శించినవారు మరొకచోటికి ఇక వెళ్ళవలసిన అవసరముండదు. పోవుట లేనందున తిరిగి రావడముండదు. మరణించుట ఉండదు. మరణించుట లేనందున జన్మము కూడ ఇక ఉండదు. తామసాది త్రిగుణములు ఉండవు. సత్యమైన ఆత్మతత్త్వము బ్రహ్మరంధ్రములో నెలకొని యుండుటచే, సుషుమ్నునందు (భ్రూమధ్యమున) ఏర్పడు ప్రకాశములు ఇక ఏర్పడజాలవు.
(ప్రాణశక్తిని విడదీసి మహాప్రకాశములో ఐక్యపరచి శిరస్సున నెలకొన్నవారికి ఇక శరీరపు చేష్టలుండజాలవు.)

682. అటువంటి మహాప్రకాశరూపినియగు పరాశక్తిలో ఆత్మ నెలకొనియుండుటచే వివిధ తత్త్వములను నిర్ణయించు భూతగుణములన్నియూ వీగిపోవును. మనస్సు ఐక్యమై పరాశక్తితో ఒక్క సంవత్సరముండినచో మహా వ్యాపకమగు పరకాయ ప్రవేశము సిద్ధియగును.

(పరాశక్తి లోపల స్థితి పొందినందున పరకాయ ప్రవేశము (తలచిన శరీరమును దాల్చుట) సిద్ధించును. ఇతరుల దేహములో ప్రవేశించుట, ఈ పరకాయ ప్రవేశము వలనే రచయిత **మూలన్** పశువులకాపరి శరీరములో ప్రవేశించి ఈ గ్రంథరాజమును వ్రాసిరి. ఇవ్వబడిన సంగ్రహ జీవితచరిత్ర చదువగలరు.)

## ప్రాకామ్యము

683. శరీరము వేరు, ఆత్మ వేరని గ్రహించగలిగి మహాప్రకాశము కలిగియున్నామని ఎరుగజాలరు. మూలాగ్ని (మూలాధార చక్రములో జనించు మూలఅగ్ని) కలిగియున్నామని గ్రహించి, అదే సర్వవ్యాపియని దర్శించువారికి శిరస్సున వెలుగొందు శివప్రకాశమునందు నెలకొని అచ్చట నుండి విడిపోవునది (ముక్తి పొందునది) కూడ సులభమగునే!!

(మూలాధారచక్రమున నున్న అగ్నియే (ప్రాణశక్తి), మహాప్రకాశమండలమును కలుగజేయునను జ్ఞానమును **మాయ** మరిపించి యుంచినదని లౌకికజీవులు గ్రహించజాలరు. ప్రాణశక్తిని అభ్యాస, సాధనల ద్వారా శిరస్సున చేర్చిన వారికి శబ్దము (నాదము), ప్రకాశములతో దర్శించినవారై ముక్తిని సులభము చేసుకొందురు. ప్రాకామ్యము సర్వవ్యాపకమగు ఇచ్ఛ, ద్వాదశాంతమును పొందునది.)

## ఈశత్వము

684. జీవులలో ఎల్లప్పుడు నెలకొనియ్ను సదాశివ నాయకితో, సూక్ష్మదృష్టికి కనిపించు ప్రకాశ అణువులంతయు, శిరస్సు యందుండు నాదమండలములో నెలకొని వివిధములగు ప్రకాశకిరణములు ప్రసరించుటచే, ఒక్క సంవత్సర కాలము సామీప్యము చేయువారికి పురాతనమైన, శరీరములో నెలకొనియున్న సదాశివ తత్త్వము ఒనగూరును.

(శిరస్సున ఆకాశ సామీప్యము చేయువారు సదాశివ తత్త్వము పొందుదురు.)

685. శుక్లపక్షమి చంద్రుని వృద్ధివలె తన నుదుటిపై జ్యోతిని నెలకొన్నవాడు, ఆ చంద్రుని వలె ప్రకాశవంతుడగును. వృద్ధియగు చంద్రునివలె పూర్ణత్వము పొంది, చంద్రపూర్ణముతో జీవుడు సదాశివ స్థితియగు ఈశత్వము పొందును.

(ఆకాశమున కంటికి కనిపించు చంద్రుని ప్రకాశము తన నుదుటిపై నెలకొన్నవాడు శరీరము, హృదయము చల్లనై, మనోవేగము నశించి, లోతైన సముద్రమువలె ప్రశాంతతతో ఈశత్వము పొందినవాడగును.)

686. ఈశత్వము పొందినవారు తామే సృష్టి చేయగల వారగుదురు. తామే స్థితి సంహారము (లయం) చేయగలవారగుదురు. వారు తమకు తామే సాటి యనిపించుకొందురు. ఈశత్వము గొప్ప మహిమాన్వితమైనది.

(సదాశివతత్త్వము పొందినవారు త్రికర్మలు చేయగలిగిన వారగుదురు.)

687. చల్లనైన కిరణములతో కూడినదైన చంద్రప్రకాశముతో, వివిధ వ్యాపకములుగా ఒప్పారు పంచభూతముల అణువులను (ఆకాశ, వాయువు, అగ్ని, జలము,

పృధివి తత్త్వముల అణువులను) వివిధ తత్త్వములుగా గాంచక ఒక్కటిగా నీలకాంతిలో ఒక్క సంవత్సరకాలము దర్శించినవారికి సత్యజ్ఞానమను ఆత్మ జ్ఞానము శిరస్సున జ్యోతివలె ప్రకాశించును.

## వశీత్వము

688. ధారణ మొదలగువాటి సాధనలతో ఏర్పడిన ఉన్నతమైన సిద్ధి ఏమనగా, మంచి సిద్ధియని ప్రశంస పొందిన వశీకరత్వమే. తన ఇచ్ఛకు తగ్గట్లు నడుచుకొనునట్లు అన్ని జీవరాశులను చేయగలిగినదే. తానే శివమైన తత్త్వమును సాధకుడు పొందును.

(వశీత్వము పొందినచో శివమహాతత్త్వములను పొందును.)

689. శివమహాతత్త్వములను పొందినవారు మహాప్రకాశవంతులగుదురు. మహా సూక్ష్మమైన ఆత్మజ్ఞానమును దర్శించిన పిదప, బంగారు వర్ణముతో కూడిన ప్రకాశము పొంది, ఇంద్రియచేష్టలన్నియూ వీగిపోయి, జగత్తునకు లోక కళ్యాణము ఏర్పరచు శ్రేష్టమైన సదాశివ నాయకిని దర్శించును.

690. శ్రేష్టమును, లోకకళ్యాణము ఏర్పరచు సదాశివ నాయకి తోడుతో ఆ శక్తిని తనలో నెలకొల్పుకొని ఒక్క సంవత్సరముపాటు ధ్యానించినవారికి బంగారు వర్ణములతో కూడిన భువనములన్నిటికినీ (లోకములన్నిటికీ) తలంచినంత మాత్రమున వెళ్ళిరాగలిగనవారై, ఎర్రనైన ప్రకాశములో వెలుగొందు కామేశ్వరుని తత్త్వమును పొందుదురు.

(సదాశివ నాయకి (శక్తి యొక్క) అనుగ్రహం పొందినవారు అన్ని లోకములకు వెళ్ళిరాగలరు.)

691. అన్నిటినీ వశీకరణము చేయు శక్తి వచ్చిన పిదప, సహస్రదళమున వాసనా రూపములో నిలిచియున్న తన్మాత్రరూపములోనున్న ప్రకాశములన్నియూ వాటి తత్త్వములకు తగ్గట్లు భువనములుగా వ్యాపించి నిలుచుచుండును. మహత్తు పొందినవాడా! అనురీతిలో వశీత్వము పొందినవారిలో కలుగును. శక్తితో ఎటువంటి భేదము లేక వాక్కురూపమును, ప్రకాశము పొందిన నాయకుడుగా పేరొందుదురు.

(వశీత్వము పొందినవారిలో మహత్తు ఏర్పడి సంకల్పించినంత మాత్రముననే శబ్దము, ప్రకాశముతోను కూడిన భువనములను (లోకములను) సృష్టించ గలిగిన వారగుదురు.)

692. అన్నిటికీ శ్రేష్టమైన, ఉన్నతమైన శివజ్యోతిని దర్శించిన పిదప ఆ జ్యోతియే తల్లి ఇల్లుగా తలంచి మహాసంతోషముతో అక్కడే నెలకొనియుందురు. అన్ని

భువనములకు వెళ్ళిచూచిన పిదప, శరీరములో నెలకొనియున్న పిశాచములగు కామక్రోధాదులను వాటిని సిద్ధి పొందినవాడు క్షుద్రలోకములను దర్శింపవెళ్ళునా? వెళ్ళడు. (ఏషన భువనములకు వెళ్ళజాలడు)

(మహాప్రకాశమును దర్శించి, సిద్ధిపొంది, అన్ని భువనములను సృష్టించ గలిగినవాడు క్షుద్రలోకములను దర్శించడు.)

693. మహాప్రకాశమును రూపముగా గల దైవమును లోకప్రకాశమును (సాధారణ ప్రకాశము) చూచునట్లు ఎటువంటి వణుకు లేక చూచిన పిదప, ఆత్మ ప్రకాశముతో భూమండలమంతయు విశ్వవ్యాపిగా ఒకే ప్రకాశముగా నెలకొనియున్న ప్రాణప్రకాశమును దర్శించును.

(మహాప్రకాశమును దర్శించినవారు ప్రాణప్రకాశమే అన్నింటా వ్యాపించి యుండుటను చూచెదరు.)

694. సుషమ్నానాడి కలయికలో (భ్రూమధ్యమున) ఎట్లు ప్రాణము కలిసియున్న దనగా, సుషమ్నయందు విద్యుచ్ఛక్తిగా వెలుగొందునది పరాశక్తి ప్రకాశము అగును. సుషమ్నతో కలిసియున్నది మొత్తము ఐదువందల పదమూడు నాడులు. దీని వలననే సుషమ్నయందు ప్రాణతత్త్వము ఇమిడియున్నది.

(సుషమ్నలో ప్రాణము ఇమిడియున్నందున ఆత్మ ప్రకాశము పిండము నందునూ, (బ్రహ్మగా) అండమునందునూ నెలకొనియున్నది. 513 నాడుల సమ్మేళనము: 1) ఇడనాడి, 2) పింగళనాడి, 3) సుషమ్నానాడి ప్రధాన నాడులు. ఈ మూడింటికి సహాయముగా దశనాడులు. వీటికి సహాయకారిగా (654వ టీకాలో దశనాడుల వివరణ) ఐదువందల సూక్ష్మనాడులు కలవు. కావున మొత్తము 500+10+3=513 చెప్పబడినవి. శరీరములోనున్న ఆత్మ బ్రహ్మాండములో నున్న బ్రహ్మం ఒక్కటే.)

695. అమృతమును వృద్ధిచేయునది శిరస్సున నున్న నిరోధిని కళయేయగును. అమృతమును వృద్ధిచేసి మార్పు చేయుటకు వెయ్యిమూడువందలఐదు (1305) నరముల కూర్పు కలదు. శిరస్సున గల సహస్రదళ పటలమునకు వెళ్ళుటకు ఇది దారిగా అమరియున్నది. దీని ద్వారా ప్రాణమును కాపాడునది శివశక్తి అగు వీరిరువురే!!

(శివశక్తి ఇరువురు కలిసి ప్రాణమును పరిపక్వమొనర్చి ఉన్నతికి తీసుకు వెళ్ళుదురు. నిరోధిని – చంద్రుని యొక్క పదహారు కళలలో ఆరవది అగును.)

696. శివతత్త్వములలో శుద్ధ విద్య మహేశ్వర తత్త్వమునకు పైన శతాఖ్యములో వెలుగొందునది మనోన్మణియైన సదాశివ నాయకురాలు. ఇడ, పింగళ నాడుల

కలయిక శిరస్సునకు వెళ్ళి నెలకొనునదియు, ఆ రెండు నాడులు సహస్ర దళమునకు చేరి వ్యాపించుటకు ముందుగా యాబదిఒక్క (51) అక్షరములుగా పిలువబడు ఆరు ఆధారచక్రములను దాటి వెళ్ళినదే అగును. ఆ స్థితియందు సాధకుని కాలమును దాటించి వెళ్ళునది పంచముఖములతో గల సదాశివుని నాయకురాలే అగును.

(శతాఖ్యతత్త్వమనునది: నుదుటి నుండి బ్రహ్మరంధ్రము వరకున్న భాగములో అనుగ్రహము పాలించునది – ఆకాశతత్త్వమైన సదాశివుడు – మనోన్మణి (శక్తిరూపిణి) అగును. (ఆజ్ఞాచక్ర అధిపతులు) ఆరు ఆధారచక్రములలో యాబదిఒక్క (51) బీజాక్షరములతో కూడినది.

కాలమును దాటి వెళ్ళునది: కాలమునకు అతీతముగా గలది పంచముఖ తత్త్వరూపిణి. కాలము దేహమునకే గాని ప్రాణమునకు కాదుకదా!! శిరస్సునకు వెళ్ళిన ప్రజ్ఞ అచ్చటనున్న దేవతకు తగ్గట్లు అనుగ్రహము పొంది కాలాతీతమగు చున్నది. పంచముఖ రూపములైన సద్యోజాతము, తత్పురుషము, అఘోరము, వామదేవము, ఈశానం సదాశివమూర్తికి చెందినదై శక్తితో క్రియించుచున్నది.)

697. పది దిశలకు (నాలుగు దిక్కులు + నాలుగు మూలలు + ఊర్ధ్వ + అధో) పది ముఖములతో సదాశివ నాయకి, ప్రాణాది వాయువులైన దశవాయువులే ఆయుధములై, పంచముఖ శక్తిరూపిణికి శిరస్సున బోర్లించిన సహస్రదళ పద్మములును, పైకి వికసించిన సహస్రదళ పద్మములు రెండు రకముల ఆయుధములతో, దశదిక్కులు, దశవాయువులకు అతీతమై సర్వవ్యాపకముగా నొప్పారును.

(శిరస్సున వికసించిన పద్మదళములలో నెలకొని పాలించునది సదాశివశక్తియే అగును.)

698. అఖండరూపిణియైన పరాశక్తి బోర్లించిన సహస్రదళముగాను, పైకి వికసించిన సహస్రదళముగాను రెండు విధములుగా నెలకొనియున్నది. పైకి వికసించి యున్నది పంచముఖరూపిణియై సాకారరూపిణిగాను, బోర్లించిన సహస్ర దళమును నిరాకార రూపముగాను నిలచి, అనుగ్రహించి, సాధకునకు కాలాతీతమును ఒనగూర్చుచున్నది.

699. శిరస్సు ముందు భాగమున ఊర్ధ్వసహస్రమున అమరియున్న పరతో (శక్తితో), సుషుమ్నలో ప్రాకి వెళ్ళు ప్రాణశక్తి (వాయువు) ఆరు ఆధారచక్రముల లోని యాబదిఒక్క అక్షరములను సృజించి, వాటినిదాటి వెళ్ళి పరాశక్తితో చిత్తము కలిసిన పిమ్మట సుషుమ్నానాడిలోని ప్రాణ (వాయువు) చలనము ఇక నిలిచిపోవును.

(వశీత్వము సిద్ధించిన సాధకునకు వాయువు చలనమిక ఉండజాలదు.)

700. పరిశోధనలతో తెలుసుకోలేనిది, పొందలేనిది, పరాశక్తితో కూడి పరిశోధించ దగిన వాయువు (శ్వాస) కొలతలు చెప్పవలెనన్న ఐదువందల ముప్పైతొమ్మిది (539) శ్వాసల కొలతలకు తగ్గినచో, శ్రేష్టమైన పరాశక్తి అనుగ్రహము కలిగినదని గ్రహించవచ్చును.

(అనగా ఒక మనుజుడు ఒక రోజునకు మొత్తము శ్వాసలు 539 శ్వాసలకు పరిమితము కావలెను. అనగా మొత్తము శ్వాసలలో 40వ వంతుకు తగ్గవలెను. సరాసరి మనుజునికి శ్వాసలు (పూరక, రేచకములు) ఒకరోజుకి 21,600 అగును. దీనిని 40వ వంతునకు కుదించినచో అది 540 శ్వాసలు అగును. ఇది ఒక కఠినమైన ప్రాణాయామ ప్రక్రియ సాధనతోనే సాధ్యమగును. ఇది సాధ్యమైన పిదప దైవశరీరము పొందనగును. ఆదియైన పరలో (శక్తితో) శ్వాస లయమగుటచే ఆయుర్వృద్ధి కలుగును.)

701. మహాసంపదయైన మహాప్రకాశమండలమును దాటి నెలకొనియున్న శివుని యందు మహాసంపదగా జరుగు శ్వాసప్రక్రియలు రెండువందల ముప్పది ఎనిమిదిగా (238) తగ్గినచో సాధకునకు ఏకాక్షరమగు ఓంకారమున జరుగునదే అగును.

(ప్రకాశమండలమును దాటి ప్రణవమగు ఓంకారములో లయము పొందిన వారికి, వారి దినశ్వాసలు 21600లో 90వ వంతుకు తగ్గి, అనగా 240గా పరిమితమగుటచే చిత్తము (సంపూర్ణ ధ్యాసతో) శివునియందు నెలకొని యుండును.)

702. మూలాధారము నుండి ఎగిసివచ్చుచున్న జ్యోతిలో వెలసిన పరాశక్తితో సుషుమ్న ద్వారా వెళ్ళు శ్వాసవాయువులు ఎట్లుండునన్నచో ఏడువందల ఇరువదితొమ్మిది (729) నాడులతో కలిసియున్నది. నాలుగు పద్మపటలములుగా (పద్మరేకులుగా) అమరియున్న మూలాధారచక్రముననున్న అగ్నియే (ప్రాణశక్తి) ఇట్లు జ్యోతిగా ప్రకటితమైయున్నది.

(మూలాధారచక్రముననున్న ప్రాణణ (ప్రాణశక్తి) వాయువే పైకి ప్రాకి – ఊర్ధ్వముగా వెళ్ళి నాడులలో నెలకొనియున్నది.)

703. ఆరవ కళయైన **నిరోధిని** (పదహారు చంద్రకళలలో ఆరవది) శక్తిని నుదుటిపై ధ్యానించుటచే పొగవంటి రంగు ఏర్పడును. ఏడవ కళయైన **నాదకళ** ప్రకాశములో వ్యక్తమై సాధకునకు ఆనందము రెండింతలగును. ఎనిమిదవ కళయైన **నాదాంతము**లో మనస్సునకు తలంపులు లేక స్పృహ మాత్రముండును. తొమ్మిదవ

స్థానము **శక్తి** కళలో ఇంతవరకు శరీరమును నడిపించుచున్న ప్రాణవాయువు అణిగిపోవును.

(చంద్రకళల పదహారు పేర్లు: 1) అకారము, 2) ఉకారము, 3) మకారము, 4) విందు (బిందు), 5) అర్ధచంద్ర, 6) నిరోధిని, 7) నాదము, 8) నాదాంతం, 9) శక్తి, 10) వ్యాపిని, 11) వ్యామోరూపిణి, 12) అనంత, 13) అనాత, 14) అనాశ్రిత, 15) సమాన, 16) ఉన్మణి.

తెలుగు సాహిత్యమున సంస్కృతమును అనుసరించి చంద్రకళలకు వేరే పేర్లు కలవు. కాని శ్రీ తిరుమూలర్ గ్రంథరచయిత పెక్కుమార్లు పెక్కు పద్యములందు ఈ తమిళ పేర్లనే వాడినందున, అనువాదకర్త కూడ ఈ తమిళ పేర్లను పోల్చుకొనుటకు, అనుకూలతకు వాడియున్నారు.)

704. చంద్రుడు, సూర్యుడు, తత్‌పరము (ఆత్మ–జీవాత్మ) ఈ మూడు నెలకొనియున్న వికసించిన సహస్రదళమునందు చంద్రకళగా నొప్పారు తత్వము, జగత్తున జీవమున్నప్పుడే జీవిప్రకాశము శివప్రకాశముతో కూడి నెలకొన్న సమాధి స్థితి పొందిన యోగియే, సుషుమ్న ద్వారా బ్రహ్మరంధ్రమును సృజించి, శివమహాతత్త్వం పొందినవాడగును.

705. ఇచ్ఛను (ఆసక్తి) నాశనమొనర్చుట, బంధుమిత్రాదుల నుండి వీడియుండుట, వినయమునిచ్చు శివజ్ఞానముతో కూడి, పరమాత్మ తత్త్వము పెంపొందించుకొని, మాటలు తగ్గించుకొని, అనుగ్రహ, నిగ్రహశక్తి పొంది, సుదూర ప్రాంతపు శబ్దములను వినగలిగి, సూక్ష్మముగా నెలకొని, ప్రాణభయము (శ్వాస, ఇంద్రియ నియంత్రణ) పొంది,

706. మరణమును, వార్ధక్యమునకు అతీతముగా, పరకాయ ప్రవేశము చేయగలిగిన, మరణించినవారికి స్వర్గలోకప్రాప్తి చేయుశక్తి పొంది, సాధకమైన శ్రేష్టమగు ప్రణవ దేహము కలిగి, శివసూర్యుల జ్ఞానము పొందినవాడు, పైన చెప్పిన పలు తత్త్వములను ఒకయోగి పొందియుండును.

(యోగులు పైన చెప్పిన మహత్తులను పొందియుందుదురు.)

707. సముద్రమావరించిన మొత్తము లోకమును (ప్రదక్షిణము) చేసివచ్చిననూ, కాళ్ళు అరుగునట్లు స్థలయాత్ర చేసిననూ, ఒనగూరు ఫలము ఏదియూ లేదు. ప్రేమతో దైవమును దర్శించి సుఖమును పొందునది, దైవము ఎందు గలడను నిశ్చయ జ్ఞానము పొంది, గ్రహించి, స్తుతించినవారు ఫలములు పొందువారగుదురు.

(దైవము అంతరమున గలడను జ్ఞానము పొందుటయే శ్రేష్టమగును.)

708. మూలాధారమునకు పైన స్వాధిష్టానములో బ్రహ్మయు, మణిపూరక స్థానములో

నారాయణుడును, అనాహతమునందు రుద్రుడు నెలకొనగా, దానికి పైగా నుదుటి నుండి శిరస్సు వరకు వ్యాపించియున్న శివాంశమైన సదాశివుడును, ఆ సదాశివునికి పైగా పరబిందువగు శ్రేష్టమైన పరనాదము, నాదాంతమును దాటి అనుగ్రహము పాలించినది శివశక్తిల పాదపద్మములే అగును.

(నాదము నెలకొన్న నగరము – నాదాంతమును దాటి చిదాకాశ మహా ప్రకాశమగును.)

709. ఆధారచక్రములలో నెలకొనియున్న బ్రహ్మాది దేవతలతో కూడివెళ్ళి, శ్రేష్టమైన పర (శక్తి)లో నెలకొనియున్న పరముతో (శివ) మేధస్సు మొదలగు పదహారు కళలతో నొప్పారు ప్రసాదతత్వపు ప్రకాశముతో వాక్కు, మనస్సు వీగిపోయి, చిత్తము నాశనమైన స్థితియే శ్రేష్టమైన ఆనందయోగమగును.

(ప్రసాదతత్వముతో శిరస్సు పైకి వెళ్ళి ప్రకాశములో నెలకొని వాక్కు, మనస్సు అణిగి చిత్తములో సంకల్పరహిత స్థితియే ఆనందస్థితి – బ్రహ్మానందస్థితి.)

710. ఇడ, పింగళలు ఒక్కటై సుషుమ్న శిఖరముతో చేరి శివుని స్తుతించి, ధ్యానించు వారికి ముందుగానే దేవతానుభవము కలిగినవారు (సాకార, సగుణ ఈశ్వర ధ్యాసలో నున్నవారు). ప్రసాదతత్వపు (ఓంకారోపాసనతో) విధివిధానములతో క్రమముగా ముముక్షుత్వమును కోరువారు, నిలకడనైన, శ్రేష్టమైన ముక్తి నొసగు పరము (పరమశివుడు) కూడ తోడుండి సహాయపడి అనుగ్రహించును.

(ప్రణవయోగము వలన ముక్తి కలుగును. ముక్తికి మూలం ఓంకారోపాసన.)

711. ప్రాణణను (శ్వాసలను క్రమబద్ధీకరించుట, నిరోధించుట సాధనలు) కట్టగలిగినవారు ఎచ్చటనైనను అదృశ్యమగుట, ప్రత్యక్షమగుట (ఈశత్వం) చేయగలరు. తీపి నిండిన తామరనైన స్వాధిష్టానము, మూలాధారము ఒక్కటిగా కలియుటచే, బ్రహ్మరంధ్రమును ముట్టడిచేసి, ఇంద్రియచేష్టలన్నియూ వీగిపోయి, సుషుమ్నలో నెలకొని అచ్చట నాట్యమాడు శివుని గ్రహించిన వారికి యముడు ఇక ఉండజాలడు.

(ప్రాణలయము చేయగలగి ఈశత్వము పొందినవారికి యముని భయము ఇక ఉండదు).

## 12. కళల స్థితి

చంద్రకళ, సూర్యకళ, అగ్నికళల వివరణ. గురువు అనుగ్రహముతో శరీరములో నెలకొనియున్న చంద్ర, సూర్యకళలతో చేర్చి అగ్నికళలో జీవుడు ఇమిడియుండు స్థితిని తెలియుజేయునది. అగ్నికళయగు సుషుమ్న–భ్రూమధ్యములో జీవుడు నెలకొనియున్నప్పుడు ప్రాణ (శ్వాస) లయము పొంది ప్రకాశమండలము ఏర్పడును.

మంత్రయోగము, ప్రసాదయోగము, ప్రణవయోగము (ఓంకారతత్త్వములో ధ్యానించుట) అన్నియూ పర్యాయపదములే. ప్రణవయోగమున రెండు విధానములు గలవు. ఒకటి క్రియాయోగం, జ్ఞానయోగం. క్రియాతత్త్వమనునది షట్చక్రములలో గల ఆరు ఆధార దేవతల ఉపాసనలతో ఒక్కొక్క ఆధారముగా మెట్లెక్కినట్లు ఎక్కి సహస్రదళమును చేరుకొనుట. జ్ఞానతత్త్వమనునది నిరాకార ధ్యానముతో రూపమూర్తులను విడచి (అరూపముతో) సదాశివ స్థానమునకు వెళ్ళువారు. ఇది జ్ఞానుల మార్గమగును. వీటి వివరణలు ఇందు పొందిపరిచియున్నవి.)

712. కామమునకు కారణభూతమైన స్వాధిష్ఠానము నుండే పురికొల్పుతున్న త్రినేత్ర మహామహుని యందు ప్రేమ సలిపి, కళ్ళ రెంటితో పైకి (శిరస్సుకు) ఊర్ధ్వముగా దృష్టి సలిపినచో, ప్రేమతో కూడిన గంగవంటి ప్రకాశ ప్రవాహము వృద్ధియగును. అట్లు ప్రేమ సలుపుట వలన శరీరములో నెలకొనియున్న ప్రాణము క్షీణించక రక్షించనగును.

(చంద్రకళ, సూర్యకళ యను రెండు కళ్ళతో పైకి దృష్టి సలుపుట. ఇడకళ, పింగళనాడులు గంగ, యమున నదులుగాను, సుషుమ్నానాడి అంతర్వాహిణి యైన సరస్వతినదిగా కొన్ని యోగగ్రంథములలో చెప్పబడియున్నది. జీవుడు ఎప్పుడు సుషుమ్నానాడియందే క్రిందికి పైకి పరుగిడుచుండును. ఎపుడు సాధకుడు సుషుమ్నానాడియందు ఉపాసన చేయగలిగి, అందు తన చిత్తమును పదిలము చేయునో, అప్పుడే తన ప్రాణము సుషుమ్నానాడిలో నెలకొనును. ఇడనాడి, పింగళనాడుల అధిదేవతలు చంద్రసూర్యులు కూడ సుషుమ్నలో ఇమిడిపోవుదురు. ప్రాణము ఇమిడిపోవుట, చిత్తము లయమై తన వేగము తగ్గిపోవుటచే, ఈ ఉపాసకునకు తన ఇంద్రియకరణములన్నియూ ఐక్యస్థితి పొందినవాడై, యోగవృద్ధి పొంది, అన్నిటా తాను నెలకొను స్థితి పొంది, ఆనందస్థితి అనుభవించును – ఇట్లు యోగోపనిషత్తునందు చెప్పబడియున్నది.)

713. అంతఃకరణముల నాల్గింటినీ (మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములు) బంధకత్వమునకు బలికాక, పతిమార్గము (శివతత్త్వము)నకు పోనిచ్చి కాపాడనగును. అంతఃకరణములన్నియూ సహాయమొనర్చుటచే చంద్రకళలోని పదహారు కళలను రక్షించనగును. ప్రాణవాయువు కూడ శివతత్త్వములో లయమై రక్షించబడును. కావున నీ స్పృహ కూడ అఖండమైన ఆకాశతత్త్వములో పదిలమై నిలుచుండును.

(కళలన్నియూ వృద్ధిపొంది వ్యాపకము చెందుటచే మనస్సు, ప్రాణము లయము పొందును.

రచయిత పలుచోట్ల, పలుమార్లు పశు, పతి, పాశంలను పేర్కొనియున్నారు.

పశు = పశువు – జంతువర్గము – చతుష్పది = నాలుగుకాళ్ళ జంతువులు. ద్విపది = రెండుకాళ్ళ జంతువులు – మానవుడు, పక్షులు (వయాంసి) (మొదలగునవి)

పతి = పశుపతి, దైవము, పరము, పరమాత్మ, శుద్ధచైతన్యం, బ్రహ్మం, అనాది, శుద్ధ, సత్వ, సర్వగతుడు, సర్వజ్ఞుడు, సత్యం.

పాశం = పాశవలయం, బంధం, అనురాగ, మమకారములు, సంసారం, బంధకత్వం, అజ్ఞానము, అధ్యాస, శరీర అనాత్మలపై బంధము.

బ్రహ్మం ఒక్కటే. సత్యం, అది పరము, శుద్ధం, అసంగము, ఏకం, నిత్యం సారం, సర్వవిభుం, సర్వచైతన్యం, పరమశివంలను ఎన్నో నామములున్ననూ ఆ తత్త్వము ఒక్కటే. బ్రహ్మం నుండే మాయాశక్తి వలన జగత్తు, జీవ, ఈశ్వరుడు వ్యక్తమైయున్నది.)

714. సుషుమ్న ద్వారా వెళ్ళు వాయువు (ఊర్ధ్వవాయువు – ఇది సుషుమ్న నుండి బ్రహ్మరంధ్రము వరకు వెళ్ళునది) నిలకడ పొందినది. దీపము వలె (ప్రకాశించునదైన), పర్వతము వలె (నిలకడపొందిన, నిశ్చలమైనదిగా) నిలచినది. చంద్రకళలు పదహారును శివశక్తియందు నెలకొన్నదని గ్రహించుటచే, మనస్సు వివిధములుగా అల్లాడక నిశ్చలముగా నుండు తత్త్వము ఇదియే అగును.

(సుషుమ్నలో వాయువు నిశ్చలత్వము పొందుటచే మనస్సు పరమునందు లయపొందును.

(పదహారు కళలు చంద్రకళలుగా పేర్కొనబడినదే కాక ఇతర గ్రంథములలో పలువిధములుగా చెప్పబడియున్నది.)

715. అంతటా నిండి, వ్యాపించిన భూతనాధుడు చిన్నచిన్న నాడుల ద్వారా వెళ్ళక, ప్రాణణ (శ్వాస)తో మధ్యనాడియగు సుషుమ్ననాడిలో నెలకొని నిలుచుండుటచే, కిరణములనే జటాధారుడుగా గలిగిన శంకరనాధుడు చంద్రమండలములో (శిరస్సున) వృషభవాహనమెక్కి ఆశీనుడైయున్నదే!!

716. సమాధిస్థితిలో కాలమును సాధకుడు ఎరుగజాలడు. ఇక గడపవలసిన కాలము (శేష జీవితకాలము)లో ఉన్నతస్థితి వైపు పయనించి, సుషుమ్నలో కేంద్రీకరించుటచే (చంద్రకళ, సూర్యకళ ద్వారా శ్వాస చేయక సుషుమ్నలో నిరోధించి, ఇమడజేసినందున) ప్రాణణ ప్రకాశముతో నిండి సహస్రదళమను పరమున (మహాప్రకాశములో) ఇమిడియుండుటచే ఎటువంటి సంక్షోభమునకు లోనుకాక సాధకుడుండును.

(ప్రాణణ సహస్రదళమున నెలకొనియుండుటచే సాధకునకు సమాధిస్థితి నిలకడ పొందును.)

717. ఇట్లు సాధకమైన సూక్ష్మతత్త్వమెరుగుటచే మహాతపస్సు చేసినవారై (శిరస్సున గల చంద్రమండల ప్రకాశములో నెలకొనుట) ప్రాణణను కపాలములోని సహస్రదళపటలములో ఇమిడ్చియుండుటచే శరీరము ముప్పు వలె (వేధగం) తయారై ఎటువంటి దోషములు లేని మేలిమిబంగారుగా మారును.

(ముప్పు: ఇది రసాయన ప్రక్రియకు ఉపయోగపడు మిశ్రమము. మూడు+ఉప్పు) రసవాదము చేయువారు అనగా హీనలోహమును అతి ఉన్నత లోహముగా మార్చుటకు (ఉదా: బంగారముగా) ఉపయోగించు మిశ్రమము. దీనికి వేధగము, రసగులిక అను పలు నామములు కలవు. ఇది పాదరసము, మూలికల మిశ్రమం. ఎటువంటి దోషములు లేక శరీరము బంగారము వలె తయారగును. ఇది ఒక యోగ, రసాయన పరిభాష. ఎందరో సిద్ధులు రసవాదతత్త్వ మెరిగినవారు - **కాయకల్పం**. అందులకే కాయము (శరీరము) కల్పమునకు పోల్చబడినది.)

718. అట్లు ఉత్పన్నమైన మూడు ఫలములు ఇహసుఖము, పరసుఖము, ముముక్షుత్వము లోపలినాడి ద్వారా పొందినదే, జీవుని (సుషుమ్ననాడి ద్వారా సహస్రదళము చేరుటచే) సహస్రదళమున నున్న ఆ జ్యోతియందు ఐక్యమై (శివజ్యోతిగా) తానేయై ఏకమై నిలుచున్నదే!!

(తానే అగుట = పరంజ్యోతియైన శివంనందు ఐక్యమై, శివంలోనే జీవుడు ఏకమై నెలకొనుట. మరి ఇక ద్వైతభావన (దైవము వేరు, జీవుడు వేరు అన్న భావన) ఉండజాలదు.)

719. ఇట్లు తనకు ఏదియూ ఆధారముగా కాక, అన్నిటికీ తానే ఆధారభూతముగా, కారణకార్యత్వముగా నున్న ఆ పరాశక్తి ఈ శరీరమును పక్వమొనర్చి, అందులోనే నెలకొనియుండును. దేవలోకస్తులను సృష్టించినది, తల్లి వంటిదైన ఆ పరాశక్తి ఇష్టపడి ఈ దేహమునందు నెలకొనుట యనునది క్షేమము ఏర్పరచగలిగిన ఆ మహాప్రకాశములో విలీనమైన శివయోగికి తేనె త్రాగిన దేహము శివాలయమగును.

(సాధకునకు ఆగమశాస్త్ర విహితమైన ప్రసాదయోగము - శివగతిని ఇచ్చునది - జన్మ సాఫల్యమొనర్చునది - తేనె త్రాగుట - (అమృత ఈశ్వర ప్రసాదము పొందుట) దేహమే శివాలయమగుట.)

720. నెలకొన్నట్లే అన్నింటా వ్యాపించియున్న ప్రాణణను లయమొందుటను పూర్తిగా గ్రహించిన వారెవరూ లేరు. ప్రాణణలయ విధానమును గ్రహించిన పిదప,

వాయువు లయమైన ఆకాశమండలములో (శిరస్సు - సహస్రదళమున) నందీశ్వరుడు (శివుడు) ప్రకాశముతో నెలకొనగలడు.

(వాయువు లయమును గ్రహించి, పొందినవారు శివప్రకాశముతో వెలుగొందురు. శరీరమునకు స్థితికారకము వాయువు. అటువంటి వాయువును సుషుమ్నయందు నెలకొనునట్లు చేయు విధానము (స్థితిని పెంపొందించుకొనుట), లయము చేయు విధానము (శివంలో ఐక్యమై) వలన మహాప్రకాశములో (శివునిలో) నెలకొనగలరు.)

721. నేను చెప్పునది (రచయిత) ఏమనగా పరిశీలించి చూచునది ఒక సత్యమైన నిశ్చయజ్ఞానమే అగును. ప్రకాశమయమగు ప్రాణమైన శివుడు కుండలినీ శక్తిని వదిలి, వీడి ఊర్ధ్వముగా వెళ్ళి శ్రేష్టమైన జ్ఞానముతో (శిరస్సున) లయమగుటచే శివయోగ సమాధి సాధకమగును. శివగురువుని నమస్కరించి, మహాధనము పొందినట్లు దానిని గౌరవించి తీసుకొందురుగాక!!

(అనగా ఆత్మ, పృథివి మొదలగు షట్చక్రమములన్నిటిని దాటి, వాటితో అమరిన ముప్పదిఆరు (శరీర) తత్త్వములకు అతీతముగా తాను ఇదికాదని గ్రహించి, ఊర్ధ్వముగా వెళ్ళి సహస్రదళమున జ్ఞానములో ఐక్యమగుటయే సమాధి సాధకముగా చెప్పబడినది. మహాధనము: తత్త్వాతీత స్థితి. శరీర తత్త్వములను వీడి ఆత్మ ఆ పరబ్రహ్మంలో స్ఫృజించి యుండడము. ఆ భావన, స్ఫృహయే తత్త్వాతీత స్థితిగా స్తుతించబడినది.)

722. ఇడనాడి (చంద్రనాడి), పింగళనాడి (సూర్యనాడి) రెండుజతల నాడుల సమ్మేళనముతో (షట్చక్రముల గుండా) పైకి ప్రాకిన ప్రాణణగు గుర్రమును శిరస్సునందు చలనము లేక కట్టివేసిన సాధకునకు నీటిపై వెయ్యి సంవత్సరములు, భూమిపై వెయ్యి సంవత్సరములు సమాధిలో నున్ననూ శరీరమునకు నాశనము లేదు. ఇది నా నాయకుడైన నందీశ్వరుని (శివుని) ఆజ్ఞ, ఒట్టు.

(ప్రాణాయామ సిద్ధి యొక్క పరాకాష్ట పూర్ణసమాధి స్థితియగును.)

723. నిర్మలమైన జ్యోతియైన శివుడు, కుండలినీ-శక్తిని ప్రాణణయగు వాటిని తననుండి వీడిపోవు కాలమున (అనగా సమాధిస్థితిలో చేష్టలు లేక) **శబ్దము** అగు ఆకాశభూత తన్మాత్ర ద్వారా వెలువడు శబ్దము, స్పర్శ, ప్రకాశము, వాసన, కాల్చుట, కూర్చుట, రుచి మొదలగు ఏడుకళలు, **రూపం** కంటిలోని ప్రకాశము ద్వారా వెలువడు ప్రకాశం, వాసన, మెరుపు, కాల్చుట, రుచి మొదలగు ఐదుకళలు, నాసికయందు ఇమిడిన వాసన, గ్రహణ, శ్వాస మొదలగు మూడుకళలు, నాలుక ద్వారా కలిగిన భుజించుట, రుచించుట యగు రెండు కళలను నిరోధించి అనుగ్రహించెనే!!

(సుషుమ్నయందు నెలకొన్న సమాధిలో శరీరప్రజ్ఞలు కొన్ని వీగిపోవును.)

## 13. శరీరస్థితి ఉపాయము

**(శరీరస్థితి – మృత్యుంజయ సిద్ధి – శరీరము క్షీణించక కాపాడుకొను ఉపాయము)**

724. శరీరము నశించిన ప్రాణము వీడిపోవును. శరీరబాధలు వలన ఆత్మజ్ఞానమును కూడ పొందలేకుందురు. శరీరమును పరిపక్వమొనర్చు ఉపాయము తెలుసుకొని, శరీరమును కాపాడుకొని, ప్రాణమును రక్షించుకొంటిని.

(జన్మ సార్థకమగు ఆత్మజ్ఞానమునకు శరీరపుష్టి బహు ఆవశ్యకము. శరీరమే దేవుని ఆలయము. కావున, శరీరపుష్టికి, వృద్ధికి కావలసిన ఉపాయమెరిగి, ప్రాణమున్నప్పుడే శరీరముతో ఉన్నత ఆత్మజ్ఞానము పొందితీరవలెను. దేహమే దేవాలయము. అందున్న జీవుడే సనాతనుడు (పరబ్రహ్మం) – శృతివాక్యము.)

725. పూర్వము శరీరము దోషముతో కూడుకొన్నదని తలంచియుంటిని. కాని ఈ శరీరములోనే శ్రేష్టమైనది శాశ్వతమగు శివుని చూచితిని (ఆత్మతో విడదీయలేనిదిగా నొప్పారుచున్న శివప్రకాశమును దర్శించుట). ఈ శరీరములోనే ఉత్తముడైన దైవము దేవాలయము చేసుకొని యున్నాడని గ్రహించి, నేను శరీరమును కాపాడుకొనియున్నాను.

(శరీరము శివుని స్థానము, దేవాలయమగుటచే రక్షించి తీరవలెను.)

726. బాహ్యముగా తిరుగాడు మనస్సు దిశమార్చి, శివునియందు ధ్యాస యుంచుటచే శుద్ధి (చిత్తశుద్ధి) బహిర్గతమగును. శివచింతనతో దోషములు నివర్తింపజేసి, కమలములను (బోర్లించియున్న షట్చక్రములోని పద్మమును) వికసించునట్లుజేసి, అధోముఖముగా వెళ్ళు దృష్టిని ఊర్ధ్వముఖముగా వెళ్ళునట్లు చేయగలిగిన ధీరులకు ఉష్ణం వీగిపోయి, శీతలమైన ప్రణవ (ఓంకార) దేహము అమరును.

(శివచింతనతో సహస్రదళపద్మములను వికసింపజేసి ప్రకాశమును దర్శించ వలెను.)

727. సంధ్యాకాలమగు సాయంసమయమున ఈ యోగము సాధన చేసినచో శరీరములోని దోషమగు కఫము వైదొలగును. మధ్యాహ్నము చేయు యోగ సాధన వలన తీవ్రమైన వాతరోగము తొలగిపోవును. ప్రాతఃకాలమున యోగ సాధన చేసినచో పిత్తరోగము తొలగిపోవును. దోషములు నివృత్తి చేసుకొనుటకు చెప్పినవే కాక అని శరీరపు ముడతలు, తెల్లని వెండ్రుకలను (అనగా వార్ధక్యమును) మార్చును.

(యోగసాధనల వలన వాత, పిత్త, శ్లేష్మ రోగములను నివర్తించి, యవ్వనమునతో వికసింపజేయును.)

728. శరీరములో వెన్నెముక చుట్టూ మూడుముడులందు (మూలాధారము, స్వాధిష్ఠానము - బ్రహ్మగ్రంథి; మణిపూరకము, అనాహతము - విష్ణుగ్రంథి; విశుద్ధి, ఆజ్ఞ - రుద్రగ్రంథి అను మూడు ముడులు) ఇడనాడి (చంద్రకళ), పింగళనాడి (సూర్యకళ) రెండు పాములవలె ఒకదానితో ఒకటి పెనవేసుకొని యున్నవి. యంత్రమువలె పనిచేయు ఈ శరీరమునకు కారణమైనది పన్నెండు అంగుళములలో క్రియించుచున్న ప్రాణణ (శ్వాస) యగును. అధోముఖముగా చూచు చంద్ర, సూర్యులగు రెండు కనుగుడ్డుల (రెండు కన్ను గోళకములు) చూపులను ఏకముచేసి (గురు ఉపదేశముతో) ఊర్ధ్వముగా చూచునట్లు చేసి, నిలకడ పొందినచో ప్రాణలయము ఏర్పడి శరీరము క్షీణమును అరికట్టగలము. (గురు అనుగ్రహ ఉపదేశముతో రెండు కళ్ళచూపులను ఏకము చేసి, ఊర్ధ్వముగా వీక్షించు ఉపాయము గ్రహించినచో శరీరమును రక్షించనగును.)

729. వంద నాడులు, అరువది తత్త్వములు, ఆరు ఆధారములలో పింగళనాడి సంచరించుటయు, ఇట్లే ఆరు ఆధారములో ఇడనాడి సంచరించుటయు, అవియన్నియు యోగసాధన వలన శుద్ధి పొంది మారి అమరినచో సాధకుడు వీటికి అతీతముగా ఊర్ధ్వముఖముగా వెళ్ళనగును. (ఇది ఆకాశ సామీప్యమగును.)

(అరువది తత్త్వములు:

| | |
|---|---|
| ఆధారములు | 6 |
| మండలములు | 3 |
| నాడులు | 10 |
| వాయువులు | 10 |
| గుణములు | 3 |
| దోషములు | 3 |
| రాగములు | 8 |
| అవస్థలు | 5 |
| ఏషనలు | 3 |
| కోశములు | 5 |
| విసర్జనలు | 3 |
| బుద్ధి | 1 |
| | --- |
| | 60 |
| | --- |

మారి అమరుట: శిరస్సు నుండి అధోముఖముగా వెళ్ళు నాడులు వంద. ఒక్కటి మాత్రము ఊర్ధ్వముగా వెళ్ళును. దీనిని యోగసాధన ద్వారా శుద్ధి పొంది మార్చుట – వంద నాడులను ఊర్ధ్వముఖముగా శిరస్సునందు నిలకడ పరచుట. అరువది తత్త్వములు, ఆరు ఆధారములు శుద్ధినొంది శిరస్సునందు లయపొందుట అనునది ఆకాశసామీప్యముగా చెప్పబడియున్నది. ఇట్లు ఆకాశ సామీప్యము చేరుకొన్నవారు అన్ని దేహేంద్రియ తత్త్వములకు అతీతముగా ఉందురు.)

730. చంద్రకళను సూర్యకళతో ప్రదక్షిణ చేయునట్లు సాధన చేసినచో మధ్యాహ్నములో ప్రణవఘోష విననగును. సుఖము, శ్రేష్టమునొసగు శివనాట్యమును కూడ దర్శించనగును. దైవముపై సత్యము చేసి చెప్పుచున్నాను.

(రచయిత – శ్రీతిరుమూలర్ చెప్పుట)

(చంద్రకళ – ఇడనాడి శ్వాస యొక్క ప్రకాశశక్తి ఎడమవైపు నుండి కుడివైపునకు – సూర్యకళతో (పింగళనాడిని) చుట్టివచ్చునట్లు చేసినచో సాధనలో సాధకునకు ప్రణవ శ్రేష్టత్వము సిద్ధించును.)

731. బహుశ్రేష్టమైన ప్రకాశముతో కూడిన 'అ'కారముతో (అం) నెలకొనునట్లు భావించి 'స'కారమును (సం) జపించండి! అట్లు చిత్తమునందు 'అం' 'సం' చేయునదే మంత్రమగును. అట్లు పూర్ణంను తలంచి (భావించి) పొందు నాదమే యోగిని మార్గదర్శకమూర్తియగును.

(సాధకుడు 'అం' 'సం' హంసం శబ్దమనో ఉచ్ఛారణయే ప్రాణణయగును. ఈ హంసం స్మరణ లేక మననం చేయుట వలన ప్రాణణ కంఠమునుండి సదాశివ స్థానమైన శిరస్సుకు చేరి బాగుగా వ్యాపించిన నాదము అగును. దీనినే **హంసవిద్య, అజప** గాను పిలుతురు.

దీనినే హంసగాయత్రిగాను – అజప గాయత్రిగాను వివరణ హంసోపనిషత్తున కలదు. అహం+సః=నేను+అతనుగా యున్నాను. అతను = పూర్ణబ్రహ్మంగా చెప్పబడియున్నది. అహంబ్రహ్మాస్మి=నేనే బ్రహ్మగా యున్నాను అన్నది – శృతివాక్యం)

732. నాభియందున్న కమలములోని ప్రాణణను (సూర్యుని) అంసం అను మంత్ర బీజముతో చిత్తమున జపించి, పైకి ప్రాకించి ముందున్న భ్రూమధ్యమున నిలిపి ధ్యానించి, పిదప పైనుండి అధోముఖముగా నున్న అపాణను మేల్కొన చేయుటచే తానే శివమగును.

(స్పృహను భ్రూమధ్యన నిలిపి **అంసం** జపముతో ధ్యానించుట మొదటిది. రెండవది – ఊర్ధ్వము నుండి శిరస్సు వెనకభాగము నుండి అపాణ వాయువుని

మూలాధారచక్రమునకు చేర్చుట. మూడవదశ – ప్రాణ, అపానతో కలిసి కుండలినీతో కూడి బ్రహ్మరంధ్రము చేర్చు విధానము (ప్రణవయోగ దీక్షగా చెప్పబడియున్నది.)

733. నిత్యము మలముతో కూడుకొనియున్న మలద్వారమునకు రెండువ్రేళ్ళ కొలతలు (రెండు అంగుళములు) పైకిని, చెప్పలేనంత కామమును ప్రేరేపించు లింగమునకు క్రిందనున్న మూలాధారచక్రమున ధ్యానము చేయుట శరీరమునే ఉపాధిగా కలిగియున్న జీవులను నడిపించు **శివం** అచ్చటనున్నది. సంప్రదాయ పద్ధతిలో గ్రహించబడునది గనుక, మంత్రోపదేశమును పొంది ముందు చెప్పినవాటిని దర్శించండి.
(మూలాధారచక్ర స్థానములో నెలకొనియున్న దైవమును గ్రహించి సంప్రదాయ పద్ధతిలో గురోపదేశము పొంది శివంను పొందవలెను.)

734. నీలిప్రకాశమున వెలుగొందియున్న శక్తితో పూర్తిగా నెలకొని ఆమెయందే శరణాగతి పొందినవారికి లౌకిక జీవులకు అనుభవమునకు వచ్చు వెంద్రుకలు తెల్లవగుట, చర్మము ముడతలు పడుట యనునది మారి యవ్వనము తొణికిస లాడును. ఇది శివుని ఆజ్ఞయగును (ఒట్టు). (ఆనై (తమిళపదము)=ఒట్టు/ఆజ్ఞ).
(నీలిప్రకాశమును దర్శించి, అందు నెలకొన్న సాధకునకు ముదిమి వీడిపోయి యవ్వనము ఏర్పడును.)

735. లింగము ద్వారా సృష్టి లేనిచో మానవునకు ఎటువంటి నష్టము లేదు (కామము తగ్గినచో శరీరము పాడుకాదు). శరీరము శుష్కించుటచే (సన్నగా తయారగుట వలన) ప్రాణము చాలాకాలము జీవించును. ఆహారము నియంత్రణ వలన చాలా లాభము పొందనగును. ఈ పద్ధతి అనుసరించిన సాధకుడు నీలికంఠము, కపాలము చేతబూనిన శివునివలె తయారగును.

736. శరీరములో నెలకొనియున్న మూలాధారచక్రములోని కామవాయువుని శిరస్సున గల సహస్రారదళమునకు తరలించు సాధనను చేసిన యెడల, తేనెటీగలు ఇష్టపడు సువాసనలతో నిండిన పుష్పములు ధరించు స్త్రీలు కూడ మోహవశపడునట్లు అందమైన శరీరము తయారగును.

737. కాలమును త్వరితపరచి దొర్లించగలిగిన యమునిని తీక్షణముగా వీక్షించి, ప్రకాశములో నెలకొని, సంగమమున (కలియకలో) మూలాధారములోని అధోముఖచక్రములో నెలకొన్న శివుని శబ్దించు పాదపద్మములను దర్శించినచో ఇహలోకమునందు పరలోకమునందునూ జీవించనగును.
(అధోముఖచక్రములోని శివుని దర్శించినచో కాలుని (యముని) జయింపనగును.)

738. నేను (రచయిత) దర్శించిన అగ్నికళయైన శివం, చంద్ర, సూర్య, అగ్ని, నక్షత్రమను నాలుగు విధములుగాను, ఏడు ఆధారములుగాను (వెన్నెముకలోని ఆరు ఆధారములు + సహస్రారదళము = 7) దర్శించినది శరీరమంతా నెలకొనియున్న ప్రాణణగాను, శరీరమునుండే బహిర్గతమైన స్పృహయే (భావన, తలంపు) అమృతమై, జీవునియందు యవ్వనశోభను నింపి రక్షించుచున్నాడే!!

(శివం, స్పృహమయమై శరీరమునందును, ప్రాణమునందును నెలకొని, జీవుని ఉన్నతుని చేసి సుఖమొనర్చుచున్నాడు. చిత్తమునందు శివం పదిల పరచునది భావనరూపమే. భావనాశక్తియే అమృతమై, ఔషధమై, జీవుని రక్షించుచున్నది.)

739. ఆకుంశనముద్రలో బహిర్గతమగు వేదశక్తిని (మార్పు కలిగించే శక్తి) నీవు ప్రేమతో స్వీకరించి, వ్యవసాయములో వడ్లను మరలా వెదజల్లు విత్తనముల కొరకును, ఆహారము కొరకును విడివిడిగా పొదుపు చేయునట్లు ఎనలేని సాధనల వలన చీకటికి, ప్రకాశమునకు జరుగు ఘర్షణలో (పోరాటములో) చీకటి వీగిపోయి ప్రకాశము వెలుగొందుటలో నీవు నెలకొందువు గాక!!

(ప్రణవయోగము వలన చీకటి తొలగిపోయి, స్థితిమారి, ప్రకాశములో నెలకొందురు (సాధనలన్నిటికి గురువు ముఖముగా నేర్వవలెను.)

ఆకుంశన ముద్ర: పద్మాసనములో కూర్చుండి రెండు అరచేతులు ఒడిలో ఒకదానిపై ఒకటి ఉంచి, శ్వాసను మూలాధారచక్ర స్థానముననున్న గుదస్థానము నుండి పైకి లేపునట్లు భావనాయోగము.)

## 14. కాలచక్రము

కాలము ముగింపు లేనిది. నిరంతరము చక్రమువలె మారిమారి వచ్చు తత్వము గలది. కావున మనుజులు కాలాతీతమగుటకు తగు ఉపాయము చెప్పబడినది.

740. చంద్రమండలములోని కళలగు వ్యాపిని మొదలగు ఐదు కళల తత్త్వమెరిగి వాటికి అతీతముగా శిరస్సున గల ద్వాదశాంత ప్రకాశముతో నెలకొనుటచే, శివశక్తి యొక్క సంకల్పము వలన ఆశీర్వదించబడి, ఆ కాలశక్తి పరిపాలనకు అతీతముగా నెలకొను స్థితిని శోధించి తెలుసుకొంటిని.

(శిరస్సున నెలకొన్న శివశక్తుల అనుగ్రహమును గ్రహించుటచే జన్మమును సఫలము చేసుకొనగలము.

చంద్రుని ఐదు కళలు: వ్యాపిని, వ్యామరూపిణి, అనంత, అనాశ్రిత, ఉన్మణి మొదలగునవి.)

741. శబ్దాది మొదలు పంచజ్ఞానేంద్రియముల ప్రజ్ఞలతో గ్రహించుట, ఈ పంచ ప్రజ్ఞలే

కాక ఆరవదియైన **బుద్ధిజ్ఞానము**తో గ్రహించుట, వస్తువులందు మంచి చెడు గ్రహించబడు ఏడవ జ్ఞానమైన **విచక్షణాజ్ఞానము**, విద్య వలన పొందదగు ఎనిమిదవది **విద్యాజ్ఞానము**, వీటితో కలిసి అనుభవము తోడగునపుడు **అనుభవజ్ఞానము**, వీటియన్నిటికి ఆధారమైన పదవది శివశక్తి అనుగ్రహము వలన ఒనగూరునది. **పతిజ్ఞానము** ఎప్పటికీ వీడక రక్షించునది. వీటి తారతమ్యములు ఎరుగక, గ్రహించజాలక జీవులు నశించుచున్నారు.
(పదవ జ్ఞానమైన **పతిజ్ఞానము** పొందినవారు వినాశము పొందరు.)

742. మనుజుల ఆయుస్సునకు నాలుగు విధములైన కాలనిరోధకములు (గండములు) చెప్పబడియున్నవి. అవి ఇరువదిఐదు సంవత్సరముల నుండి ఇరువదిఎనిమిది వరకును, ముప్పది సంవత్సరముల నుండి ముప్పదిమూడు వరకును, ఆయుస్సు తిరోగమనం అరవై నుండి అరువదిరెండు వరకును, ఇక వంద సంవత్సరముల కొక నిరోధకమును, దానిపై ఎటువంటి ఎల్లలు (హద్దులు) లేకయుండును.

743. పుట్టినరోజు, ఆ దినమున యున్న నక్షత్రమే జన్మనక్షత్రముతో కూడినరోజు. ఇక జన్మనక్షత్రముతో పదహారు దినములు కలిపి పదిహేడవరోజున క్షుణ్ణముగా పరిశీలించి చూచి ఎటువంటి ఆటంకములు లేక యోగసాధనలు (అభ్యాసమును) ప్రారంభించవచ్చును.
(యోగసాధన ప్రారంభమునకు దినమును సూచించునది.)

744. నీ హృదయమున నెలకొన్న జ్ఞాననేత్రమును చూడగోరి యోగసాధనలను ప్రారంభించుదురు గాక!! ఇరువదిఐదు తత్త్వములను పన్నెండు రాశులలో పయనించు సూర్యుని జ్ఞానముచే తన తత్వము తెలుసుకొని పక్వపడి శివుడు క్రియింపజేయు ఆరు ఆధారచక్ర క్రియారూపములను దాటి అతీతముగా వెళ్ళునప్పుడు శివం, శక్తి, నాదము, బిందుగా నాలుగింటిని తెలుసుకొనగలవు.
(ఇరువదిఐదు ఆత్మ తత్త్వములు: పంచ కర్మేంద్రియములు, పంచ జ్ఞానేంద్రియములు, పంచభూతములు, పంచప్రజ్ఞలు (ఇంద్రియతన్మాత్రలు), నాలుగు అంతఃకరణలు, ఒక పురుషుడు = మొత్తం 25.
పన్నెండు రాశులలో సంచరించు సూర్యుడు: మేషము మొదలు మీనము వరకు గల 12 రాశిచక్రం.
బుద్ధిలో నెలకొన్న సూర్యుడు పురుషునిలో జ్ఞానము ఏర్పరచుట. శివుడు నెలకొన్న ఆరు ఆధారచక్రములన్నీ క్రియించుటచే ఒనగూరు క్రియాజ్ఞానము రూపసహితమైనది కావున అదే జ్ఞానము పరిపక్వమై శిరస్సునకు ప్రాకి లయము పొందునపుడు అరూపమై శివశక్తి నాదము బిందుగా గ్రహించబడును. (నాదబిందు

కళాది నమో! నమో! – స్తోత్రం. శబ్దము, ప్రకాశము మాత్రమే చివరికి మిగులును.)

745. రూపము నాల్గింటిని దాటి, రూపములు, అరూపములు, తొమ్మిదింటిగా నొప్పారు నుదుటిని దాటి, ఇరువదిఐదు ఆత్మతత్త్వములను దాటిన ఆ గుణవంతుని, విషపుతత్త్వములైన విధిని (పాపపుణ్య ఫలితములు) నొసగు ఆరు ఆధారచక్రములను దాటి ఆత్మయైన సూర్యుని ఎవరైన ఎరుగగలరా?

(రూపములు నాలుగు: బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు రూపములు. రూప అరూపము – సదాశివం. అరూపములు నాలుగు: నాదము, బిందు, శివం, శక్తి.

తొమ్మిదింటిని: తొమ్మిది భేదములు – నవాంతర భేదములు.

అన్నింటిని దాటియున్న ఆత్మజ్యోతిని దర్శించవలెననుట.)

746. ఆరు ఆధారచక్రములలో నలుబదిఎనిమిది (48) తత్త్వములతో కూడిన పద్మములను గ్రహించండి. రెండవదైన సూర్యుడు ఇరువదిఆరుగా (26) అమరియున్నది. అకారమైన చంద్రుడు ఇరువదిఏడుగా (27) అమరియున్నది. ఇక బాహ్యముగా వేర్వేరు దినక్రమములను అమర్చియున్నాడు.

(ఆరు ఆధారచక్రములలో ఆజ్ఞాచక్రములోని రెండు రేకులను విడచి నలుబది ఎనిమిది (48) తామర పద్మరేకులగును. మూలాధారచక్రమున 4 పద్మరేకులు; స్వాధిష్టానమున–6; మణిపూరకమున–10; అనాహతం–12; విశుద్ధి–16; మొత్తము 48 పద్మరేకులు.

సూర్యుని ఇరువదిఆరు తత్త్వములు: మణిపూరకంలోని 10 + విశుద్ధిలోని 16 పద్మరేకులు కూడినది సూర్యతత్త్వముగా అమరును. ఎడమకంటిపైన చంద్రతత్వములు ఇరువదిఏడు (27). అవి ఈశాన తత్త్వములు చంద్ర వృత్తములో ఉండుటచే శిరస్సు చుట్టూ ఇరువదిఏడు నక్షత్రములుగా వెలసిల్లినవి.)

747. సక్రమముగా ఇరువదిఎనిమిది తత్త్వములను అగ్ని, సూర్యుడు, చంద్రుడని మూడు ఖండములుగా గ్రహించవలెను. వాటిలో ముప్పదిమూడు తత్త్వములుగా విభజించినది ఎరుగవలెను. పది, ఎనిమిది, భూమిలో నెలకొన్న అంశములుగా గ్రహించవలెను. అవి నాలుగు, మూడు, రెండు, ఒకటిగాను క్రమపరచి గ్రహించవలెను.

(అనాహతములోని 12, విశుద్ధి 16 గా మొత్తము 28గా సూర్య, చంద్ర, అగ్ని తత్త్వములుగా ఉన్నవి. శతాఖ్యం, నాద, బిందు మూడింటిని మినహాయించి మిగతావి ముప్పదిమూడుగా (33) పేర్కొనబడినది. పృథివి నుండి వాయువు 4వ అంశము, అప్పు (జలము) నుండి వాయువు 3వ అంశము, అగ్ని నుండి

వాయువు 2వ అంశము, వాయువులోని వాయువు 1వ అంశము, వాయువుకి అధిదేవత మహేశ్వరుడుని ధ్యానించి గ్రహించవలెను. పది–యకారము–పురుషుడు; ఎనిమిది–అకారము–చంద్రుని తత్త్వం.
ఈ తత్త్వములన్నియూ వాటి అధిదేవతల పరిపాలన లన్నింటిని గురువు ద్వారా (గురుముఖముగా) నేర్వదగినవి. సూర్య, చంద్ర, అగ్ని తత్త్వములు ఎరిగి, అగ్నితత్త్వ కళను సుషుమ్న మధ్యనాడి గుండా ప్రవేశించి బ్రహ్మరంధ్రమునకు ప్రాకించు విధానమును వివిధ మార్గములో రచయిత వివరించియున్నారు. చెప్పబడిన సాధన విధానములన్నియు గురుముఖముగా పొంది, నేర్చి సంశయరహిత నిశ్చయజ్ఞానము పొందవలెను.)

748. గురోపదేశాను క్రమములో సాధన చేయనిచో, దైవతత్త్వమును పొందుట కష్టతరమగును. నిగూఢముగా చెప్పబడినవన్నియూ గురుముఖముగా ఉపదేశాను క్రమములో పొందవలెనను ఉద్దేశమే తప్ప వేరొకటి లేదు. దైవజ్ఞానమును వినయ విధేయతలతోనే పొందవలెను.
(సాధనలన్నియూ గురు ఉపదేశముతోనే పొందితీరవలెను.)

749. నిగూఢముగా చెప్పబడిన వాటిని తమకు తామే ప్రయత్నించువారు మూర్ఖులు. వికసించిన సహస్రదళమను ప్రమిద (దీపం)తో ప్రకాశము పొంది, చీకటిని ఛేదించి, ఆలోచనలగు తైలమును పోసి (నూనె), సుషుమ్నను పురికొల్పి ప్రకాశమును ప్రజ్వలింపజేయు విధానమును గురుముఖమున అభ్యసించిన వారికి, క్షీణమగు ప్రపంచమున క్షీణము లేక కలకాలముండగలరు.
(సాధన విధానములన్నిటినీ గురోపదేశముతోనే పొందవలెను.)

750. చిటికెనవ్రేలు నుండి మధ్యవ్రేలు వరకున్న మూడువ్రేళ్ళను, రెండుచేతులతో రెండు కళ్ళను, కనుబొమ్మల వరకు అదిమిపట్టి ఉంచి, ప్రాణ, అపాన, వాయువులను హృదయమునందు నెలకొనునట్లు భావించుటచే, శిరస్సున అగ్ని, సూర్య, చంద్రులగు మూడు మండలములు స్థితిపొంది అచ్చట అట్లు చూడదగు ప్రకాశములో చలనములేని చిత్రమువలె నెలకొందురు గాక!!
(ఈ ముద్రనందు శక్తి చలనము, సాధకమగును.)

751. అందమైన స్పృహను (భావనను) గ్రహించండి. పాపులు దీని ప్రయోజనమును ఎరుగజాలరు. కీడుకు కారణభూతమైనవి శరీరములోని మూడు మండలములునూ సుషుమ్న ద్వారా సహస్రదళములో నెలకొనుటచే ప్రకాశముగా నొప్పారి సత్ఫలము నొసగగలవు.
(బ్రహ్మదండమనబడు సుషుమ్నయందు మూడు గ్రంథులు (ముడులు), మూడు

మండలములు కలవు. సహస్రదళమును గ్రహించినవారు ఈ మూడు గ్రంథుల ముడులు విడిపడి, మూడు మండలములలో ప్రకాశవంతముగా శిరస్సునందు వెలుగు పొందుదురు.)

752. వీణదండము వలె గల వెన్నముక దండములో ఇమిడి, పెనవేసుకొని, పైకి ప్రాకి బ్రహ్మరంధ్రమునకు చేరిన యోగికి మండలములు మూడును (సూర్య, చంద్ర, అగ్ని) సంతసించి మొత్తముగా కలిసి శుభమును చేకూర్చును. ఈ సత్యమును గ్రహించి, చూచినవారే ఆత్మజ్ఞానులు. దీనిని గ్రహించనివారి విధివశమున చిక్కుకొని శరీరాదులు చెడిపోవునట్లు మార్పులు ఏర్పడి నశించుదురు.

(ఈ మూడు మండలములను గ్రహించిన జ్ఞానులు నశింపజాలరు.)

753. ఇట్లు మార్పు ఏర్పడి శరీరము నశించునది ఎట్లనగా: సూర్యుడగు బుద్ధితో కూడిన కుండలినీ ద్వారా కామకార్యము సలిపినచో, స్తుతించబడవలసిన జీవితము చెడి, శునకము (కుక్క) ఎట్లు మలము తినుటలో ఆసక్తి చూపునో, అట్లే కామకార్యములో ఇచ్ఛ పొంది చెడుదురు.

754. కామవశపడి అల్లాడువారికి సహస్రదళమునందు వెలుగొందు దైవపాద పద్మములను గ్రహింపజాలరు. తన స్వయంప్రకాశములో నెలకొనక అధోముఖముగా నున్న అగ్నిమండలములో పడి నశించుచున్నారు. పాద పద్మముల యొక్క అందెల శబ్దమును గ్రహించి, దాని మార్గమున వెళ్ళదగిన నేర్పరికి సుషుమ్నయందు నటరాజుడు (పరమేశ్వరుడు) నెలకొనునే!!

(అందెల శబ్దము: కాలికి ధరించిన అందెల శబ్దము. నాట్యమాడు శివుడే నటరాజుగా స్తుతింపబడెను.)

755. నటరాజుని గుర్తెరిగి (నాదము – నాదసామీప్యము) సామీప్యం పొందుటచే పెక్కు శుభములను పొందినవారు కలరు. ఆత్మజ్ఞాన తత్త్వములు గ్రహించి అనుభవించియున్నారు. ఇట్లు అంతర్ముఖులైన ధ్యానులకు వాడు (శివుడు) ఇష్టుడై (వారిలోనే నెలకొని) సాధకునకు, తనకు భేదమే లేనట్లు ఏకమై నిలుచుండును. (నాదసామీప్యములో నెలకొన్న ఆత్మజ్ఞానులలో శివుడే ఇష్టపడి నెలకొని సాధకునకు, తనకు ఎటువంటి భేదము లేనట్లు ఏకమగును. జీవుని ఆత్మయే శివమగును. ఆత్మ, బ్రహ్మం ఒక్కటే అగును.

**"జీవోబ్రహ్మైవ నా పరః"** – శ్రుతివాక్యం

**"అయమాత్మ బ్రహ్మ"** – శ్రుతివాక్యం)

756. ముందు మంత్రములో చెప్పినట్లు దైవముతో విరామము లేక నెలకొని యుండుటచే

ఆయుర్వృద్ధియే కాక నాశనము అనునది వీగిపోవును. లౌకికముగా పూరక, రేచక, కుంభకముల వలన ఆయుస్సు తగ్గుతూ పోవును. కాని పూరక, రేచక, కుంభకములు ముప్పది (30) గడియలు (1 గడియ = 24 నిముషములు) సమాధిస్థితిలో యుండినచో, సహస్రదళ పద్మమున బంగారువన్నెలో నటరాజు నెలకొనును.

(దైవముతో 30 గడియలు సమాధిలో నెలకొనియున్నచో ఆయుర్వృద్ధితో కూడ దైవదర్శనము బంగారువర్ణయుగా దర్శించనగును.)

757. నాట్యకాడు (శివుడు) నడిపించు ఈ దేహమున ప్రాణణ యొక్క స్థితి గ్రహించగలిగి, అందు యున్న అకార, ఉకార, అష్టదళ పద్మములో నెలకొనునట్లు చేసి, అందు నెలకొన్న శివుని దర్శించి శుభములొందిన పిదప, ఈ శరీరముతోనే వంద సంవత్సరములు జీవింపనగును.

(శివుని దర్శించినవారు వంద సంవత్సరములు జీవింపనగును.)

758. చెప్పినట్లు వంద సంవత్సరములు నున్నవారు, ఈ శరీరమును వెయ్యి సంవత్సరములు కూడ చెడిపోకుండా కాపాడగలరు. ఇట్లు ఈ శరీరముతో నెలకొని వెయ్యి సంవత్సరములు జీవించినవారు, పలు యుగముల సంగతిని కూడ గ్రహించి జీవించగలరు.

(శివునితో ఏకమగుట వలన పొందు సిద్ధిని చెప్పబడినది.)

759. అట్లు పలు కాలములు శివునిలో ఏకమై, అపరిచ్ఛిన్నమైయుండి, మనస్సులో నెలకొన్న శివుని వీడక ధ్యానసమాధిలో యున్నవానికి శివుడు వేరు, తాను వేరన్న ద్వైతభావన లేక ఏకమైన (అద్వైతభావన) స్థితిపొంది పెక్కు కాలము జీవించి ఉన్నతిని (జీవన్ముక్తి) పొందుదురు.

(చాలాకాలము ధ్యానసమాధిలో నున్నవారికి శివమహాతత్త్వమును పొందుదురు.)

760. ఇట్లు శివమహాతత్త్వమును పొంది ఉన్నతి పొందినవారే లోకస్తులతో కూడి ప్రయోజనము పొందిన వారగుదురు. కొందరు ఈ సత్యమును ఎరుగక కొన్ని లౌకికకర్మలను పైబడిపైబడి చేసి కర్మబంధములో చిక్కుకొందురు. కొందరు ఇటువంటి ఉన్నతిస్థితిపై ఇచ్ఛ లేకయే చేపవంటి ఎప్పటికీ కనురెప్పలు ఆర్చని కన్నులు గల పరాశక్తిని గ్రహించజాలరు.

(లోకస్తులతో కూడి ప్రయోజనము పొందుట: ఒక జ్ఞాని ఉన్నతిస్థితి అందుకొని లోకులకు సహాయము, సేవ నొనర్చి వారి ఉన్నతికి కూడ పాడుపడుదురు. వారి తలంపులలో సద్ధార్మాత్మపు లోకసేవయే పరమార్థమగును. **మానవసేవయే మాధవసేవ**గా తలంచి లోకులకు సన్మార్గము బోధించుటలోనూ, వారి శ్రేయస్సు

కోరి పాటుపడుటలోనూ పాల్గొనుదురు. అట్లు సేవజేసి జీవన్ముక్తి నుండి విదేహముక్తి పొందుదురు.)

761. పరమప్రకాశమును దర్శించనివారు జన్మసాఫల్యము పొందక నశించుదురు. సిగ్గులేనివారు అనుభవలేమితో శాస్త్రతత్త్వములను మాట్లాడుదురు. పరమ ప్రకాశమును (జ్యోతిషాం జ్యోతి) దర్శించక, దానిని పొందక, ఆత్మతత్త్వమును చూడజాలక, సేవయూ చెయ్యక, దూరమైపోవుదురు.
(దివ్యదర్శనము (మహాప్రకాశమును చూచుట) పొందినవారే సర్వజ్ఞత్వము పొంది లోకులకు సేవ చేయగలరు.)

762. బంధకత్వము ఏర్పరచదగిన లోకవస్తువులను బాహ్యచక్షువులతో చూడనివారు, తొలగిపోదగిన వస్తుతత్త్వమును అంతరచక్షువులతో చూడగలరు. తొలగిపోవలసిన వస్తుతత్త్వములను మనోసంయముతో చూచిన ఎడల అన్ని వస్తువులందును ఎన్నటికీ వీడిపోని శివతత్త్వమును దర్శించనగును.
(సర్వజ్ఞత్వము పొందినవారు అన్ని వస్తువులందును శివతత్త్వము దర్శించనగును. అన్నియూ పరబ్రహ్మం నుండి పుట్టి, అందులోనే లయమగును. వస్తు నామ, రూపములను మినహాయిస్తే ఇక మిగిలేది బ్రహ్మం ఒక్కటే.
**"మయ్యేవ సకలం జాతం; మయి సర్వం ప్రతిష్ఠితం; మయి సర్వం లయ మేష్యతి"**
– శ్రుతివాక్యం.)

763. త్రినేత్రుడు, జన్మరహితుడు, ఆదిగురువైన నందీశ్వరుని (శివుడు) ప్రాణములో నెలకొన్నవానిగా గ్రహించుము. గ్రహించబడిన దశదిక్కులలో (4 దిక్కులు+4 మూలలు+ఊర్ధ్వం+అధో) నున్నవాడిగానే కాక, ఏకముగా నిలుచుండుటయూ దర్శనమగును. దృఢత్వము నొసగు శివగతి కూడ అనుగ్రహమగును. బాగుగా పరిశోధించి చూచినచో యోగులకు గిట్టునది కూడ ఇదేయగును.
(శివగతి యనునది జీవులకు ముక్తినొసగునది. జీవుడు శివునితో ఏకమై నెలకొనుటచే విడిగా వ్యక్తములేని వ్యాపకము పొందును.)

764. ఇట్లు అంతర్ముఖులై, నందీశ్వరుని పొందగోరువారికి మరణము లేదు, దుఃఖము లేదు. శివునిలో ఏకమై నెలకొన్నవారు ప్రజలకు నాయకుడు కావచ్చు. రారాజు కావచ్చును. ఇవన్నియు ముందే అనుభవించినవారి సత్యవాక్కులు. శివమహామహుని చేరవలెనను కాంక్ష యున్నవారికి మాత్రమే దీనిని ఉపదేశము చేయవచ్చును.
(అంతర్ముఖులైనవారు, ధర్మాత్ములు, ఈశ్వరుని చేరవలెనను తీవ్రజిజ్ఞాస యున్నవారికి ఈ యోగమును ఉపదేశించవచ్చును.)

765. అర్హత యున్న శిష్యునికి చెప్పవలసిన తత్త్వము **అకార, ఉకార**మే అగును. తేటనైన అకార, ఉకారములు మనస్సున – చిత్తమున స్థితిపొంది, పదిలమైనచో, గ్రహించవలసిన **మకార**ము సుషుమ్నానాడి (భ్రూమధ్యపునాడి) ద్వారా పైకి వెళ్ళి నాదమై (అ+ఉ+మ=ఓంకారము శబ్దరూపమై) వెలుగొంది మాయాకార్యములైన ఆరు ఆధారచక్రముల యొక్క చేష్టలు వీగిపోవునట్లై, శివం నెలకొని ప్రత్యక్షమగునే!! (ప్రణవతత్త్వమును విశదీకరించినది: ఎడమకంటిలో **అకారము**, కుడికంటిలో **ఉకారము** స్థితిపొంది **మకారమ**గు అగ్నితత్త్వము మూలాధారచక్రము నుండి శిరస్సున గల సహస్రదళమునకు సుషుమ్నానాడి ద్వారా ప్రాకి పైకివెళ్ళి శివతత్త్వమును పొందుట. ఇది మంత్రయోగము, ప్రణవయోగమగును. ఈ అభ్యాసములో శిరస్సులో సాధకునకు **శివం** దర్శనమిచ్చును.)

766. పరమేశ్వరుడు స్థితిపొంది నెలకొనియున్న స్థానమును ఎవ్వరూ గ్రహించలేరు. ఆ మహామహుడు (శివుని) నాదముగా, ప్రకాశముగా నెలకొనియున్న స్థానమును గ్రహించినవారికి, తాను వారి హృదయము నుండి వీడిపోక అనుగ్రహించును. అట్లు వానిని (శివుని) దర్శించినవారు కూడ శివమగుదురు.
(ఈశ్వరధ్యాసతో సదా సర్వకాలము నుండువారికి, శివం దర్శనము పొందుటయే కాక, శివదర్శనము పొందినవారు కూడ శివతత్త్వమగుదురు.)

767. **శివుడే తానగుట** తత్త్వమును ఎరిగినవారెవరూ లేరు. అట్లు శివమగు తత్త్వమును నీవు వినగోరిన యెడల శివుడు, ఆత్మ యొక్క సూక్ష్మవాక్కులోను (శబ్దము), సూక్ష్మప్రకాశములోను నెలకొనియుండును. శివుడు, జీవియొక్క ఆకాశతత్త్వములో (శిరస్సున గల చంద్రమండలమగు సహస్రదళమున) నెలకొనియుండును.
(శివుడు జీవుని ఆత్మలో సూక్ష్మపశ్యంతి అనబడు వాక్కులోనూ, నివృత్తియాది కళారూపమగు సూక్ష్మప్రకాశములోను నెలకొని, చంద్రమండల తత్త్వమును పొందియుండును.
చత్వారి వాక్కులు చెప్పబడినవి: పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి – శ్రుతివాక్యం)

768. ఆధారచక్రములైన వృత్తములు ఏడును (ఆరు ఆధారచక్రములు + సహస్ర దళము) వికసించును (అధోముఖముగా నున్న చక్రములలోని పద్మములు ఊర్ధ్వముఖములై వికసించుట). అచ్చట మహోన్నతుడైన శివుడున్న స్థానమును గ్రహించుదురు గాక!! ఉపాయముతో శివునియందు నెలకొనుటచే, శుభమొనగూర్చు స్థానమును ఎరుగుదురు గాక!!

769. ముందు మంత్రములో చెప్పినట్లు ఆధారచక్రములలోని పద్మములు వికసించుటచే బ్రహ్మను, నారాయణుని దర్శించనగును. నీలకంఠుడు, మహేశ్వరుడు

మొదలగువారిని చూడనగును. సదాశివుని, శక్తిని దర్శించ నగును. నీ శరీరములోనే శరీర ప్రాణాదులతో కలిసి, ఇమిడియున్న దేవత లందరిని దర్శించనగును.

(ఉపాయము ఎరిగినవారు అన్ని దేవతలను శరీర ప్రాణములలోనే దర్శించనగును.)

## 15. ఆయుర్‌పరీక్ష

జీవితకాలమును నిర్ణయించు పరీక్ష; ఆయుస్సు సరిహద్దును నిర్ణయించుట; ప్రాణణ (శ్వాస) గమనము బట్టి ఆయుర్ నిర్ధారణ. శ్వాసలు ఎక్కువగా, నిడివిగా వెళ్ళినచో ఆయుస్సు తగ్గును. శ్వాసలు నిడివి తక్కువగా వెళ్ళినచో ప్రాణణ పొదుపుచే ఆయుర్‌వృద్ధి అగును. శ్వాసలు తగ్గుటచే జీవితకాలము పొడిగించబడును.

770. శిరస్సున అమరిన శ్వాసకళ (నాసికా ద్వారమైనను, శిరస్సు అనునది దేహము నంతటికి ప్రధాన స్థానమగుటచే పంచజ్ఞానేంద్రియముల సమూహము శిరస్సునందే ఉండుట, సకలయోగ శాస్త్రమునకు సంబంధించినది శిరస్సునందే ఉండుట వలన శిరస్సు ప్రధాన ప్రాణణగా చెప్పబడినది). ఎక్కువ దట్టముగాను (మందము), ఎక్కువ పలుచగాను కాక ఒక క్రమరీతి అమరినచో శుభములు ఏర్పడును. దట్టముగా, నిడివిగా వచ్చినతో ఆరునెలలలో మరణము సంభవించును. మరీ దట్టముగాను, నిడివి రెట్టింపు అయినచో ఒక నెల సమయములోపునే మరణము ఏర్పడును.

(ఆయుర్ క్షీణతను వివరించుయున్నది. ఇందు ప్రాణణను శబ్దము, మాటలు, వాక్కుగా చెప్పబడినది.)

771. మనస్సు నుండి వెలువడు వాక్కు మొదలగు శబ్దములు ఈశునికి చెందినవే అగును. నాదము, శబ్దమును దాటినవారు ఈశునితో నాదాంతములో నెలకొనియుందురు. నాదాంతములో నెలకొన్నవారికి ఈశుడు హృదయములో ఇమిడి శబ్దముతో కూడిన ప్రజ్ఞగా వెలసిల్లును. (అంతర్వాణియే శివతత్త్వమగును.)

(జీవుడు ప్రకాశమునందే కాక వాక్కు మొదలగు ప్రజ్ఞలలో కూడ ఈశుని (శివుడి) తత్త్వమును పొందియుండును. చత్వారియగు నాలుగు విధములైన వాక్కులు పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి యనునవి నాభి, హృదయ, కంఠం, నాలుక నుండి దైవానుగ్రహం వలన వెలువడునవే.)

772. క్షీణమగునదైన నాలుగు అంగుళముల వాయువు (శ్వాసను) క్షీణము కాకుండునట్లు కొండనాలుక పైభాగమున నున్న సహస్రదళమున నెలకొనునట్లు చేసినచో, అది

పుష్పించిన కమలములో స్థితిపొంది, బోధకము (జ్ఞానము) వచ్చిచేరును. అట్లు జ్ఞానము పొందినవాడు ప్రపంచ నాయకుడగును.

(క్రమబద్ధీకరించిన శ్వాస క్షీణము కాక, సహస్రదళ కమలములో నెలకొని, దానిని వికసించునట్లు చేయుటచే జ్ఞానము జ్ఞానిలో వచ్చిచేరును. శరీరపు ఇంద్రియప్రజ్ఞల ద్వారా గ్రహించునది ఇక నిలబడిపోయి, జ్ఞానము ద్వారా విషయపరిజ్ఞానము ఏర్పడును. శ్వాసయే నాదమై, నాదమే శివమై లోక నాయకుడగును.)

773. నాయకుడున్న (శివుడు) స్థానమైన ఎడమకంటి నుండి కుడికంటి స్థానమును (శక్తి స్థానము) చూడగలవారు చాలా అరుదు. అట్లు కుడికంటిని చూచి నెలకొనినచో ప్రకాశముతో నొప్పారు శక్తిని దర్శింపనగును. ఈ సాధనతో పంచజ్ఞానేంద్రియములన్నియూ ఒక నియంత్రణకి వచ్చి సాధకుని జీవిత కాలము వంద సంవత్సరములగునే!!

(ఎడమకన్ను–శివుడు; కుడికన్ను–శక్తిస్థానము. ప్రాణాయామ సాధనలో గురు ఉపదేశానుగ్రహముతో కుడికంటి, ఎడమకంటి దృష్టి మారిమారి దర్శించు సాధనలో పంచజ్ఞానేంద్రియముల ప్రజ్ఞలు నియంత్రణలోనికి వచ్చి, సాధకునకు వంద సంవత్సరములు జీవితకాలము కాగలదు.)

774. 6 అంగుళముల నిడివితో శ్వాస బయటకి వచ్చినచో ఆయుర్కాలము ఎనభై (80) సంవత్సరములగును. అదే శ్వాస 7 అంగుళములైనచో అరవైరెండు (62) సంవత్సరములగును. ఇట్లు పరిశోధించి చెప్పబడినది గ్రహించగలరు.

775. ఇట్లు శ్వాస 8 అంగుళముల నిడివియైనచో యాభది (50) సంవత్సరములే. అదే 9 అంగుళములలో శ్వాస వెలువడినచో ముత్యము క్షీణించు కాలము ముప్పదిమూడు (33) సంవత్సరములే అగును.

(ముత్యము: ఇందు శుక్లశోణిత సమ్మేళనపు జీవితము ముత్యముగా చెప్పబడినది.)

776. పది అంగుళముల నిడివితో శ్వాస బయటకు వచ్చినచో ఆయుర్కాలము ఇరువదిఎనిమిది (28) సంవత్సరములే అగును. పదిహేను (15) అంగుళములైనచో ఇరువదిఐదు (25) సంవత్సరములే అగును.

777. పగటి సమయమున ముప్పది గడియలు సూర్యునికి చెందినదైననూ దానిని చంద్రునిలో చేర్చి నిలిపినచో, శిరస్సున ఈశానదిక్కున స్ఫృహను ఏర్పరచ గలము. దీనివలన సుషుమ్నానాడిలో భ్రూమధ్యమున శ్వాస వెళ్ళునట్లు చేసి, అకార, ఉకార కళలను ఉత్తేజము పరుచునట్లు చేసి, పదవదైన అగ్నికళను దర్శించనగును.

(పగటిపూట సూర్యకళ (కుడిశ్వాస) జరుగుటను చంద్రకళ (ఎడమవైపు శ్వాస)గా మార్చి భ్రూమధ్యమున మనస్సును కేంద్రీకరించి ధ్యానించుటలో అగ్నితత్త్వములను దర్శించుట.)

778. ముందు మంత్రములో చెప్పినట్లు రెండురోజుల వరకు సుషుమ్ననాడి భ్రూమధ్యములో ప్రాణణ (శ్వాస) నెలకొనుటచే, అధోముఖమైన అపాన వాయువు వ్యాపకుడైన చంద్రుడు జీవునకు ఎటువంటి విరోధము లేక సహకరించును. ఇట్లు అధోముఖముగా వెళ్ళు శక్తిని తగ్గించి మూడురోజులు అట్లే నెలకొనుట వలన ఆయస్సు సుదీర్ఘమగునని ఇక చెప్పనేల?
(అధోముఖుడైన అపానము కామకార్యములను పురికొల్పునది. ఈ తత్త్వమును తగ్గించి భ్రూమధ్యమున ప్రాణణను నిలుపుటచే అది నిర్వీర్యము చేయక జీవుని శరీరనిలకడకు తోడ్పడును.)

779. ఇట్లు భ్రూమధ్యమునందే ప్రాణణ నెలకొని నాలుగు దినములు నిష్టలో గడిచినచో, వివరించదగినదైన శివం, శక్తి, నాదము, బిందు నాలుగింటిని దర్శించనగును. ఐదురోజులు ఇట్లు ధ్యాననిష్టలో నెలకొనుటచే నిష్కళంకమైన శివం, శక్తి, ఆత్మ మూడింటిని దర్శించి శుభములు పొందనగును.

780. ఇట్లు పైన చెప్పబడినట్లు పదిరోజులు జ్ఞాననిష్టలో భ్రూమధ్యమునందు నెలకొని యున్నవారికి తనతోనే ఇమిడియున్న శివ, శక్తిలను చూడగలరు. ఇట్లు పదిహేనురోజులు ధ్యాననిష్టలో నెలకొన్నవారు శివం ఏకతత్త్వమును దర్శించుదురు.
(భ్రూమధ్యమున జ్ఞాననిష్టను నెలకొన్నవారు శివతత్త్వమును దర్శించగలరు.)

781. నిర్ణయించిన ప్రకారము జ్ఞాననిష్టతో భ్రూమధ్యమునందు నెలకొని ఇరువది (20) రోజులున్నవారికి ఆకాశతత్త్వమును ఆరు ఆధారములలో గ్రహించ బడును. అట్లే ఇరవైఐదు (25) దినములు కొనసాగించినచో పంచభూత ఆకాశతత్త్వములోని భూతాకాశము, గుణమయ ఆకాశము రెండును త్రొక్కబడి (నిర్వీర్యము చెంది) తేయు (అగ్ని), వాయువు, ఆకాశములు మూడింటి అసలు తత్త్వము ఎరుగనగును. పైబడి ఇరవైఆరు (26) దినములు నిష్టలో నెలకొన్నవారికి నిర్ణయించబడిన అగ్నితత్త్వము, వాయుతత్త్వములు శ్రేష్టమగును.
(ఆకాశమొక్కటే ఐదు తత్త్వములగుట: అవి భూతాకాశము – అధిదేవత బ్రహ్మ; గుణమయ ఆకాశము – విష్ణువు; గుణరహిత ఆకాశము – రుద్రుడు; సూర్యాకాశము – మహేశ్వరుడు; చిదాకాశము – సదాశివుడు క్రియాశీలురై యున్నారు. జ్ఞాననిష్టలో యున్న జ్ఞాని శివుని తలంచి నిష్టలో నున్నందున ఈ ఐదుగురి క్రియలకు అతీతముగా మారి చిదాకాశములో నెలకొనును.)

782. ముందు చెప్పబడినట్లే జ్ఞాననిష్టలో నెలకొన్న జ్ఞాని ఇరవైఏడు (27) దినములు కొనసాగినచో జ్యోతిస్వరూపమైన శివుని ఇతరులకు సృజించ చేయనగును. అట్లే

ఇరవైఎనిమిది (28) దినములు కొనసాగినచో, పదవస్థితియైన ఊర్ధ్వ సహస్రదళమున నెలకొనియున్న ఆత్మను ఇతరులకు సృజించచేయనగును.
(జ్ఞాననిష్టలో చాలా కాలము నెలకొన్న జ్ఞాని శివంను, ఆత్మను ఇతరులకు కూడ తాను సృజించచేయనగును.)

783. ఇట్లు ఇరవైతొమ్మిది (29) దినములు జ్ఞాననిష్టయున్న యోగికి (జ్ఞాని) లౌకికులకు కాలము సుదీర్ఘమైనదిగా నున్ననూ అదే యోగికి పదిదినములుగా తోచును. ప్రేమతత్త్వముతో ఇమిడి దైవముతో ముప్పది (30) దినములు నెలకొన్న జ్ఞానికి ఆ ముప్పది దినములు ఒక వారము గడిచిపోయినట్లు తోచును.
(లౌకికులు సుఖదుఃఖములతో నెలకొనుటచే కాలము సుదీర్ఘముగాను, జ్ఞానులకు ప్రేమ, దైవతత్త్వము, ఉత్తమస్థితిలో నెలకొనుటచే కాలము చాలా తక్కువగా తోచును. జ్ఞానులకు కాలము గడచిపోవునదే తెలియకుండును.)

784. దైవముతో నెలకొన్న దినములు ముప్పైఒక్క రోజులైనచో జ్ఞానికి అది మూడు రోజులు గడిచినట్లుండును. అట్లే ముప్పదిరెండు రోజులు గడిచినను జ్ఞానికి రెండురోజులు గడిచినట్లుండును.
(దైవముతో జ్ఞాని నెలకొనుటచే కాలము చాలా త్వరితముగా గడిచి నట్లుండును.)

785. మూడునెలల కాలము నిష్టలోయున్న జ్ఞానికి శివం, ఆత్మ అభేద తత్త్వముతో ఏకమై, సహస్రదళపద్మమున సూక్ష్మవాక్కు జనించునట్లు చేసి, దానిలో నెలకొనునట్లు చేయునే నా నందీశ్వరుడు (శివుడు)!! ఎటువంటి కర్మలు లేక (క్రియారహితమైన స్థితి) పరమాకాశమున నెలకొన్నవారికి తనతో సమానమైన శివమే అగునట్లు చేయును.
(క్రియారహితము - కర్మఫలరహితము, ఫలరహితము - పునర్జన్మ రహితం, సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలు వీగిపోవుట. పునర్జన్మ రహితం - శివమే అగుట.
కర్తృత్వభావము, భోగత్వము లేకుండుటచే కర్మఫలములగు అదృష్ట, దృష్ట ఫలములు లేకుండును. ఫలముల వలన ఏర్పడు కర్మఫల త్రయములగు సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలు లేకుండును. ఫలత్రయం లేనందున ఇక పునర్జన్మ ఉండదు.)

786. మహాప్రకాశ మండలములో సూక్ష్మస్థితిలో కలిసియున్న అగ్ని మొదలగు భూతములను ఎవ్వరూ ఎరుగజాలరు. కలిసియున్న వాయుభూతమును ఎవ్వరూ ఎరుగజాలరు. అన్నిటిని తనలో ఇముడ్చుకొనునట్లు చేయు (లయము చేయుట) శివత్వమును ఎవ్వరూ ఎరుగజాలరు. ఇతరులు ఎరుగజాలని వన్నింటిని, జ్ఞానమును నేను శివునితో నెలకొని గ్రహించితిని.

(శివునితో, శివునియందే నెలకొనుటచే సమస్త తత్త్వములను గ్రహించగలరు.)

787. వాయువుతో కూడిన ఐదు తన్మాత్రల జ్ఞానము గ్రహింపబడుట శివుని గ్రహించు జ్ఞానము అగును. ఆ శివంయే జగత్తంతటికీ తెలుసుకోదగిన జ్ఞానమగును. కావున శివంను వేరుచేసి వేరొకటిగా చూడక ఒక్కటిగా (ఏకత్వముగా) చూచినచో, ఆ శివతత్త్వమే అన్ని జీవులలో జీవుడుగా నెలకొని, అన్ని వస్తు, జీవజాలములు గ్రహింపబడి తానును గ్రహింపబడును.

(ఐదు తన్మాత్రలు జ్ఞానము: ఐదు జ్ఞానేంద్రియములు (సూక్ష్మ శరీరపు) ప్రజ్ఞలు. అవి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ ప్రజ్ఞలు. అన్ని ప్రజ్ఞలు శివతత్త్వముతో కూడినవై పంచభూతములైన ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథివి చెందినవి. శివం అన్ని జీవులలోని ప్రజ్ఞలలోనే ఇమిడి పంచభూతాత్మక శరీరమును జగత్తు వ్యవహారమునకు తగ్గట్లు నడుపుతున్నాడు.)

788. ఆ శివం అనుగ్రహించిన జగత్తు, అజ్ఞానులకు మాత్రము మాయతో కప్పబడిన దగును. జ్ఞానులకు ప్రతిదినము జ్ఞానాగ్నితో కాల్చబడి సత్యజ్ఞానము ఉత్పన్న మగును. శుభము లొనగూర్చు సహస్రదళమున నెలకొనియున్న పరాశక్తి ఇటువంటి జ్ఞానులకు సహాయపడును. అందువలన జ్ఞానులు శివమే అగుదురు. (పరాశక్తి జ్ఞానమే శివమై, జ్ఞానులకు అనుగ్రహింపజేయును.)

789. జగత్తు సృష్టిని మహత్కార్యముగా తలంచిన నందీశ్వరుడు (శివుడు) అభిన్నముగా చూచువారి యొక్క దేహమునే శాశ్వత నిలయముగా చేసుకొనును. ఈ తత్త్వమెరిగిన వారికి బంధము వీడును. ఇచ్ఛ (ఆసక్తి) తొలగిపోవును. పిదప ఇచ్ఛకు కారణభూతమైన మోహము కాల్చబడి, తొలగునట్లు చేసి, జ్ఞానమును వర్థిల్లజేయును.

(నందీశ్వరుడైన శివుడు జ్ఞాని శరీరమునే తన శాశ్వత నిలయముగా చేసుకొనుటచే అన్ని శరీరబంధములు వీడిపోవును.)

## 16. వార సరం – దినశ్వాస

పలాన దినములలో ప్రాణణ (శ్వాస) చలనము, పలానా నాడి ద్వారా (కుడినాడి లేక ఎడమనాడి) జరుగవలెనని తెలుపు విభాగము. వార దినములలో శ్వాస – రేచకమునే పరిగణించబడినది. కుడినాడి – కుడిశ్వాస – పింగళనాడి – సూర్యకళ మొ॥ పర్యాయపదములే. అట్లే ఎడమనాడి – ఎడమశ్వాస – ఇడనాడి – చంద్రకళ మొ॥ పర్యాయపదములే.

790. శుక్ర, సోమ, బుధవారములలో ఇడనాడి (ఎడమనాసిక) ద్వారా శ్వాస చలనము (రేచకము) జరుగవలెను. శని, ఆది, మంగళవారములలో శ్వాస చలనము కుడినాడి (కుడినాసిక) ద్వారా (రేచకము) జరుగవలెను. గురువారం శుక్లపక్షముగా ఉన్నచో ఇడనాడి ద్వారాను, కృష్ణపక్షముగా ఉంటే కుడినాడి ద్వారా శ్వాస చలనము జరుగవలెను. (రేచకము మాత్రమే పరిగణించవలెను.)

(శ్వాస చలనము సూర్యోదయమునకు ముందు నుండే గమనించవలెను.)

791. సోమ, బుధ, శుక్రవారములలో ఇడనాడిలో (చంద్రకళగా) శ్వాస చలన ముండినచో ప్రకాశముతో నిండిన శరీరమునకు క్షీణతయుండదని ధ్యానప్రదాతయైన గురునాధుడు తన మానవసమూహమునకు సంతోషముతో ఉపదేశించియున్నారు.

792. మంగళవారము, కృష్ణపక్షమి గురువారము, శని, ఆదివారములలో శ్వాస కుడిప్రక్క (పింగళనాడి - సూర్యకళ)గా రావలెను. అట్లు చేసిన యోగి దైవతత్త్వము పొందనగును. ఈ రోజులలో శ్వాస మారి వచ్చినచో, దానిని గ్రహించి వెంటనే కుడిశ్వాసగా మార్చుకొనవలెను. అట్లు గ్రహించి మార్చినవానికి ఆనందమేర్పడును.

793. చంద్రుడు, సూర్యుడు, ఇడనాడి, పింగళనాడిలో మారిమారి క్రియ సలుపుదురు. ఆ సమయమున శ్వాస ఇడనాడి ద్వారా లోపలికి వెళ్ళి (పూరకము), పింగళనాడి ద్వారా బయటకి వచ్చును (రేచకము). ప్రాణణ మధ్యనాడిలో సృజించి వెళు ౣను. ప్రాణణలో శివుడు నెలకొనినది బాగుగా తేటజ్ఞానముతో గ్రహించండి.

(ఇట్లు మారి జరుగుటను గ్రహించి ధ్యానము చేయుటచే మనస్సు ఏకాగ్రత సాధించగలదు. చిత్తఏకాగ్రత సాఫల్యమగుట.)

794. శ్వాస కుడిప్రక్క (పింగళనాడి ద్వారా) ఉదయించి, ఎడమప్రక్కగా (ఇడనాడి ద్వారా) బయటకి వెళ్ళునట్లు మారి జరుగునపుడు, ఒకప్రక్క మందముగాను, మరొకప్రక్క చాలా పలుచనగాను పరుగిడును. అట్లు పరుగిడు శ్వాసను క్రమబద్ధీకరించి, శ్వాస మందముగా వెళ్ళు దానిని బట్టి అది సూర్యకళ లేక చంద్రకళగా తెలుసుకొనవలెను.

(పలుచగా పరుగిడు శ్వాసను విడచి, మందముగా బలముగా వెళ్ళు శ్వాస ఎటువైపు వెళ్ళుచున్నదన్ని గ్రహించి, అది సూర్యకళయా లేక చంద్రకళయా అని నిర్ధారించవలెను.)

795. సరిగ్గా సుషుమ్ననాడిలో ఇమడక, ఎడమగానో లేక కుడిగానో పరుగిడు శ్వాసను యోగియనువాడు బాగుగా దానిని గ్రహించి నాడులన్నీ కేంద్రీకరించి యున్న భ్రూమధ్యమునందు శుభములొనగూర్చు కుండలినీలో చేర్చినచో సుషుమ్నమైన

మధ్యనాడి ద్వారా శిరస్సున దీపప్రకాశము ఏర్పడునని నందీశ్వరుడు (శివుడు) అనుగ్రహించియున్నాడు.

(శ్వాస మధ్యనాడి ద్వారా శిరస్సుకు ప్రాకినచో ప్రకాశము ఏర్పడును.)

796. బాగుగా పరిశోధించి గ్రహించవలసిన తత్త్వమైన శివం, అందమైన నేత్ర పద్మములకు పైగాయున్నాడు. ఆ శివుని తలంచి శ్వాసకళను మార్చి చేసినచో, షోడశకళలతో కూడిన చంద్రుడు అర్థమగును. ఆ కళ బలిష్టముగా వెళ్ళి మనస్సును చెడుపునది, ఆధారమైనదైనది, ఆయుర్కాలమును, ధ్యాన కాలమును ముహూర్తకాలముగా మార్చివేయును.

(శ్వాస చలనమును బట్టే ఆయుర్కాలము హెచ్చుతగ్గులు నిర్ణయించబడుచున్నవి.)

## 17. వారశూలము

**(వార దోషములు – పయనించుటకు దోషములు ఇచ్చట చెప్పబడినవి)**

797. వార, దినములలో శూలము (దోషములు) వచ్చు దిశలను ఇందు చెప్పబడినది. సోమ, శనివారములలో తూర్పు వెళ్ళుట శూలమగును. మంగళ, బుధ వారములకు – ఉత్తరము దిక్కు శూలమగును. ఆది, శుక్రవారములకు – పడమర శూలమగును.

798. గురువారమునకు దక్షిణదిక్కు శూలమగును. శూల దిక్కునకు ఎడమప్రక్కకు గాని, వెనుకవైపుకు కాని ప్రయాణించుట శుభమగును. కాని శూలదిక్కునకు కుడిప్రక్కకు కాని, ముందుకు కాని పయనించినచో, పైబడిపైబడి ప్రయాణములో కీడులే ఏర్పడును.

## 18. కేసరి యోగము

కేసరి అనగా సింహము, ఆకాశము. యోగము అనగా ఐక్యము. సింహము వలె దృష్టిని ఊర్ధ్వముగా చూచునట్లు చేయుటచే, యోగసాధనలో సాధకునకు ఆకాశసంచారము చేయు సామర్థ్యము ఒనగూరును. ఈ యోగంలో ప్రాణణ జయము పొంది, శరీరక్షీణత లేకుండును.

799. ప్రాణణ (శ్వాస)ను క్రిందకు వెళ్ళనీయక కొండనాలుకతో కట్టి, పిమ్మట అగ్నిస్థానము (పొయ్యి)గా చెప్పబడిన అపానమును పాయు, ఉపస్థ ద్వారా (గుదము, లింగ, యోని ద్వారములు) పోనీయక నిరోధించి, రెండు కంటి చూపులను ఏకపరచి, మనస్సును సుషుమ్న ద్వారా ప్రాకు ప్రాణణను భ్రూమధ్యమున నిలుపుకొన్నవారికి శరీరక్షీణత లేకుండును.

(గురోపదేశాను క్రమమున దీనిని అభ్యసించవలసినది. కేసరి యోగము సాధనతో క్షీణత లేని శరీరమును పొందగలరు.

క్రిందటి మంత్రములలో చెప్పినట్లే కేసరి యోగమనునది: వజ్రాసనము వేసుకొని కూర్చుండి చేయునది. ప్రాణణ యగు శ్వాసను క్రింద శరీర భాగమునకు వెళ్ళనీయక (మూలబంధనము చేసి) కొండనాలుకతో కట్టి (జలేంద్ర బంధనము) నిలిపి రెండుకన్నులు కేంద్రీకరించి భ్రూమధ్యమును చూచునట్లు నిలిపి ధ్యానములో నిలుచుండువారికి శరీరక్షీణత యుండదు.)

800. చాకలి ఒంద్రుమట్టి కలిపి, బట్టలను ఉడకబెట్టి, దానిని నదిలో ఒకరాతిపై ఉతికి బట్టలలోని మురికిని తొలగించునట్లు సాధకుడు మూలబంధనమను కరణముతో తపస్సు అను జ్ఞానాగ్నిలో ఉడికించి, ముందు భాగపు మెదడులో నాదముతో కొట్టి ఇరుకంటితో భ్రూమధ్యమున మనస్సును కేంద్రీకరించుటచే దోషమగు మలము తొలగి, శిరస్సున నాదము, ప్రకాశము ఏర్పడి అజ్ఞానము తొలగును.

801. ఇడకళ, పింగళకళ నాడుల ద్వారా వెళ్ళు ప్రాణణ క్రియను మార్చి, సుషుమ్న నాడి ద్వారా ప్రాణణను చొప్పించువారికి ఇక శరీర నీరసముండదు. నిదురించు కాలమున మేలుకొను ఉండు అభ్యాసము చేసినవారికి మరణము లేక, క్షీణత లేక జీవింపనగును.

(సుషుమ్న ధ్యానము సూర్యోదయమునకు ముందు ఆరు గడియల కాలము చేయవలెను. 6×24 ని॥ = 144 నిమిషములు లేక 2½ గంటలు.)

802. పరిశోధించి చూచినచో ఈ సాధనల వలన అమృతస్థితి పొందును. వస్తున్న కాలములో అది స్థిరమైన నాదమును ప్రయోగించును. నాదరూపమై, చంద్ర మండలమై, ప్రయోగి, పాలించి, అవి శరీరమునకు, జీవునకు రక్షణగా మారును. (సుషుమ్న ధ్యానము వలె పెక్కు శ్రేష్టములు కలిగి, అమృతము స్రవించి, రక్షణగా కూడ మారును.)

803. సాధకుడు సుఖాసనము వేసుకొని కూర్చుండి, నాలుకకొసతో కొండనాలుకపై తాకి రాపిడి ఏర్పరచినచో జీవుడు, శివుడు అక్కడ నెలకొని ప్రత్యక్షమగుదురు. ముగ్గురితో (బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు) ముప్పదిమువ్వురు దేవతలు అక్కడ ప్రత్యక్షమగుదురు. శరీరమునకు మరణము లేక వందకోట్ల సంవత్సరముండ గలదు.

(బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు; రుద్రభవన (మండలము/లోకము)ములో మహాదేవుడు మొదలగు ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, అష్టవసువులు, ఇద్దరు అశ్వనీ దేవతలు, మొదలగువారు ముప్పదిమూవురు (33). లంబిక=కొండనాలుక; దీనిని

లంబిక యోగమందురు – హఠయోగ విధానము. దీనిని గురుముఖముగా సాధన చేయవలెను. ఈ సాధన వలన సాధకునకు సమస్తము ఒనగూరును.)

804. పంచభూతాత్మక శరీరములో ఎరుగదగిన జ్ఞానమంతయూ ఎరుగుటకు నెలకొనియున్న శిరస్సు బ్రహ్మరంధ్రములో ఆకాశమండలముగా వెలుగొందునది గ్రహించువారు ఎవ్వరూ లేరు. ఆకాశమండలములో నెలకొని గ్రహించగలిగినవారికి అమృతం త్రాగి తేటనైన జ్ఞానము పొందగలరు.

805. నోటిలోని కొండనాలుక ప్రదేశములో తగిన సాధనతో ప్రాణ, అపానములను రెండు వాయువులను నెలకొనునట్లు చేసినచో, కాలుడు ఇక లేడు (మరణ దేవత రాదు). దేహక్షీణత ఇక లేదు. బ్రహ్మపురము తెరవబడి సాధకుడు ఉన్నతి పొందును. లోకులు ఎరుగదగు వెంట్రుకలు పండిపోవుట, చర్మము ముడతలు పడుట ఉండజాలదు. బాలకుడగును (యవ్వనముతో శోభిల్లుదురు). నా పరానందీపై సత్యము.

(నందీశ్వరుడు (1) శివుడు, పరానందీ – పరమేశ్వరుడు. (2) రచయిత గురువు కూడా నందినాధుడు)

806. ఈ సాధన ద్వారా శివుని తలంచి అతనిపై ధ్యాసతో నాలుకతో కొండనాలుకపై కెక్కునట్లు చేసి, అచ్చటనున్న మధ్యనాడితో కలిసిన సాధకుడు ప్రపంచ మంతటిని పరిపాలించగలడు. శరీరబంధముతో నెలకొనియున్న జ్ఞానము వీడిపోగా, శివుని ధ్యాసలో నున్నవారే అసలైన అగ్నికార్యము (అగ్ని యజ్ఞయాగాదులు) చేసిన వారగుదురు.

(శరీరబంధము వీడుట: దేహేంద్రియ మనోబుద్ధులుపైనున్న మమకారం, ఆసక్తి, వాటినే ఆత్మగా తలంచు అధ్యాసభావన, తొలగించుకొనుట, శివధ్యాసలో నున్న సాధకుడే అగ్నిహోత్రము చేసిన వాడగును.)

807. కీడువిధానములన్నీ కలిసి తమను జయింపజేసుకొనదలచి, వాటిచే బుద్ధిని అజ్ఞానముతో కప్పబడిన జీవులు, నాలుకతో చేయు ఈ సాధన చేసినచో కాలునికి (యముడుకు) ఇక పనియుండదు. బలిష్ట విధిప్రభావమును గ్రహించి వాటి అప్రయోజనత్వమెరిగినవారు, ఈ దైవప్రక్రియ చేయుటచే వాటి ప్రయోజనమువైపు ఆకర్షితులైరి.

(నాలుక చేయవలసిన ప్రక్రియ చేసి సాధించి, విధిని జయించినవారు ఎన్నో శుభములు పొందిరి.)

808. తియ్యటి చెరకుగడ వంటి విధిని పొందవలెనన్నచో సుషుమ్నునాడియగు చెరకుగడతో నాలుక ప్రక్రియ సలిపి, మధ్యనాడి వంకరలను సక్రమము చేసి

ఈ పాంచభౌతిక శరీరముతోనే అమృతమును సేవింపనగును (త్రాగవచ్చును). (కొన్ని యోగసాధనల వలన సిద్ధి పొందినవారు శివతత్త్వముతో లీనమగుటయే కాక, వారికి కొండనాలుక నుండి పాలవంటి చుక్కలు (ద్రవము) స్రవించును. దీనివలన సిద్ధి పొందిన యోగులకు అన్నపానాదుల (ఆకలిదప్పులు లేక) ఆవశ్యకములుండవు. ఈ పాలవంటి ద్రవమునే ఇచ్చట అమృతమని రచయిత చెప్పియున్నారు. బ్రహ్మానందమును కైవల్యప్రాప్తి (మోక్షసిద్ధి)ని కూడ శ్రుతులు అమృతమనే చెప్పియున్నవి.)

809. నాలుకతో కొండనాలుకపై రాపిడి ఏర్పరచి, అందుండి స్రవించు ద్రవమగు అమృతమును సేవించి **శివాయనమః** అని ధ్యాసతో స్మరించువారికి రక్షణ కల్పించునదైన ప్రకాశము నీటిప్రవాహమువలె మోమునందు (ముఖముపై) ప్రవహించును. ఆ ఆకాశగంగను పొంది అనుభవించండి.

(దైవతత్త్వమగు శివాయనమః: ధ్యాసతో స్మరించుటలో **శి**కారము = ప్రకాశము; **వ**కారము = ప్రకాశపు శక్తి/వీర్యము; **య**కారము = ఆకాశతత్త్వం/ఆత్మ; **న**కారము = ఆవరణశక్తి; **మ**కారము = అజ్ఞానమలము. శికారము ముందుండి నడిపించుట వలన ప్రకాశము ఉత్తేజమై చీకటి తొలగును.)

810. చిత్తమును శివతత్త్వముతో నిలుపుకొని అంతర్పూజ చేయువారికి ముమ్మలములను కాల్చునదైన అనుగ్రహశక్తి నాదము (శబ్దము), ప్రకాశము (బిందు) రూపముగా అనుగ్రహించును. అట్లు అనుగ్రహించిన నాదము ప్రకాశము చిత్తమున నెలకొని క్రిందకు దిగకుండా జలేంద్ర బంధనము అమర్చుకొని, అచ్చటనే స్థితిపొంది, ధ్యానించువారికి ఈ శరీరమే శివాలయ మగును. (జన్మమెత్తిన శరీరమే దేవాలయమగును.)

(దేహో దేవాలయ ప్రోక్తః ॥ జీవో దేవ స్సనాతనః ॥
త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యం ॥ సోహం భావేన పూజయేత్ ॥
ఎవరి చిత్తమున అజ్ఞానం నిర్మూలించబడి, శివతత్త్వమునందు నిర్విరామముగా నెలకొనియుండునో, వారి శరీరము దేవాలయమగును. ఆ జీవుడే దైవమగును, సనాతనుడగును. సః+అహం=సోహం = దైవమే నేనుగా.)

811. ఆ దేవాలయమునే నివాసముగా చేసికొని జీవించు జీవులు, సమస్త జగత్తుకు తల్లికన్నా కరుణ కలిగినవారగుదురు. ఎవరైన వీరిని గాయపరచిననూ మంచినే చేయుదురు. కాని గాయపరచిన వారియొక్క దుష్కర్మ (విధి) వారిని అగ్నికన్నా మహాతాపమై నాశనమొనర్చును.

812. శివుడు, మూలాగ్నిని ప్రజ్వలింపజేసి (మూలాధారపు కుండలినీ స్థానఅగ్ని)

యోగము చేయువారికి వారి శిరస్సున అమరును. అతనిని సహస్రదళముతో సృజించువారికి స్వర్ణ (బంగారు) కాంతిమండలములో నెలకొనియుండును. నిర్విరామముగా భావన చేయువారికి శివుడు భావన తత్త్వముగా అమరును. శివయోగము చేయువారికి వారి బుద్ధియందు నెలకొనియుండి అనుగ్రహించును. (శివుడు శివయోగుల స్థితి ఎరిగి అనుగ్రహ ప్రదాతగా అనుగ్రహించును.)

813. చంద్రుని నుండి వెదజల్లు పదహారు కళలు (షోడశకళలు) వలె పదహారు రేకులు కలిగిన విశుద్ధి చక్రమునుండి రెండువందల ఇరువదినాలుగు భువనములుగా (లోకములుగా) మారి శరీరక్షేత్రములో ప్రకాశ కిరణములను వ్యాపింపజేసి, వాటి తత్త్వములు ఒకదానికొకటి విరుద్ధము గాకుండా శివుడు పరిపాలించును. (శివుడు బుద్ధియందు నెలకొని శివయోగులకు, జ్ఞానులకు సహాయ మొనర్చును.)

814. చిద్రూపిణియైన పరాశక్తి కూడ విశుద్ధి చక్రమున నున్న కిరణములలో అమరియున్నది. ఆమెయే ఆ కిరణముల నడుమ నెలకొని, ఆత్మతత్త్వములలో చంద్రుడుగా వెలుగొందియున్నది. ఆమెయే భోగములందు ఇమిడి శుభములను ఒనగూర్చుచున్నది.
(బుద్ధిమయమైన శివునికి తగినట్లు శక్తిమయమైన పరాశక్తి కూడ నెలకొని యున్నది.)

815. ఆకాశము మొదలుకొని నెలకొనియున్న పరాశక్తి కురిపించిన తెల్లటి వర్ణము (శుక్రము) బంగారువర్ణము (శ్రోణితము)లో కలిసి ఇమిడి అవి క్రీడించ దగినదైన స్వాధిష్టానచక్రములో నెలకొనియున్నది. అచ్చట నిర్వీర్యము కాక కాపాడుకొను సామర్థ్యమున్నవారికి, అదే శరీరమును కాపాడదగు పచ్చాకు మందగును (మూలికల రసాయనమగును). అదే విశుద్ధి చక్రము యొక్క ఉపయోగమగును. (పరాశక్తిని గ్రహించినవారికి సామర్థ్యము తరగక శరీరమును కాపాడుకొన దగును.)

816. కామజయమును కల్పించునదైన తీగవంటి కుండలినీశక్తి (ఇడ, పింగళ నాడుల సమ్మేళనముతో తీగవలె ఊర్ధ్వముగా ప్రాకునదైన) శిరస్సుకు చేరి ఆకాశమండలమగు సహస్రదళమున శివునితో చేరుటచే శుభములు నొనగూర్చి, అష్టమాసిద్ధులను పొందదగు సత్యజ్ఞానమును ఏర్పరచును. కుండలినీ యోగ గుణతత్త్వమైన శ్రేష్టమైన శక్తితో, జ్ఞానమయమైన శివుడు బుద్ధిలో కలిసి నెలకొని ఒప్పారును.
(కేసరి యోగము వలన సత్యజ్ఞానము ఏర్పడును.)

817. విశుద్ధి చక్రము నుండి అధోముఖముగా దిగజారు ప్రాణణ కంఠము నుండి

అది అంతర్ముఖమై పైకి ప్రాకివెళ్ళును. శరీరమును స్థిరపరచునదైన వెన్నెముకను దాటి ఆకాశమండలము చేరి (శిరస్సున చేరి) బోర్లించియున్న పద్మమును (సహస్రదళ పద్మమును) ఊర్ధ్వముగా చూచునట్లు చేసినచో, చంద్రమండల వృద్ధియే కాక, భూమండలములో కూడ చాలాకాలము జీవింపనగును.
(కేసరి యోగము వలన చాలాకాలము జీవింపనగును.)

818. చంద్రమండలమగు శిరస్సున మనస్సును చుట్టుకొనియున్న ఒడ్యాణ పీఠము (మనస్సును చుట్టుకొనియున్న సహస్రదళమును ఒడ్డాణ ఆభరణముగా చెప్పబడినది)ను గమనించి మనస్సును అధోముఖముగా వెళ్ళనీయక అందే నిలిపి (జలేంద్ర బంధనము ద్వారా నిలిపి) అనాదియైన ఆనందమయ కోశములో సూర్యప్రకాశము వెలుగొందగా, కుండలములు ధరించిన నాట్యకాడు (నటరాజు – శివుడు) ఎటువంటి చలనములు లేక అచ్చటనే నెలకొనునే!!
(నాదాంతమునకు వెళ్ళినవారికి మనః చలనములు తొలగిపోయి ఆనందమును పొందుదురు.)

819. ముందు మంత్రములో చెప్పినట్లు అధోముఖముగా వెళ్ళు వాయువును నిలిపి కొండనాలుక పైభాగమున స్థితి పొందునట్లు బంధనము చేసినట్లైతే వాయువు క్షీణము కాక రక్షించినట్లుగును. అట్లు చేయుట వలన ప్రకాశము నిలకడ పొంది సహస్రదళమున నెలకొని అచ్చటనున్న దివ్యపాదములను స్తుతించుటచే శరీరమను సంచిని (పంచకోశముల తిత్తి) వీడి నిలుచుందురుగాక!!
(మనస్సు ప్రకాశమగు దివ్యపాదములను పట్టుకొనుటచే శరీరమను బంధమును వీడియుందురు గాక!!
శరీరపు పంచకోశముల తిత్తి: పాంచభౌతిక శరీరములో (1) అన్నమయ కోశము, (2) ప్రాణమయకోశము, (3) మనోమయకోశము, (4) విజ్ఞానమయ కోశము, (5) ఆనందమయకోశములు. ఇది ఐదు కోశములతో నిండిన తిత్తి – తోలుసంచి. దీనిపై బంధము వీడి దైవము యొక్క దివ్యపాదములపై ధ్యాస యుంచుట.)

820. శరీరతిత్తిలోనున్న మూలాధారచక్ర స్థానద్వారము (గుదద్వారము)ను గట్టిగా పట్టి మూయుటచే (వజ్రాసనము వేయునప్పుడు) శరీరములో ప్రకాశము నెలకొనును. నాడిలో నున్న అపానవాయువు ఉగ్రముగా పైకి ప్రాకునపుడు మలములతో కూడిన జీవుడు ప్రకాశముతో నెలకొన్నవాడుగా మారును.
(మూలాధారచక్ర స్థానమున గల గుదస్థానమును మూలబంధనము చేయుటచే ప్రాణణ పైకి ప్రాకి, సహస్రదళమును చేరి ప్రకాశముతో నొప్పారును. మూలబంధనము వలన చీకటితో నిండిన జీవుడు ప్రకాశ వంతముగా మారును.)

821. మూలబంధనమున పైకి ప్రాకిన వాయువును తలంచి (భావనచే) యుండుటచే, పీడనముతో కుదించబడిన విశుద్ధిచక్రము పైభాగమున స్తుతించబడదగిన చంద్రమడలము ఏర్పడును. అగ్ని, సూర్యమండలములన్నియు కుదించబడుటచే, చంద్రమండలము ప్రకాశవంతమగును.
(పీడనముతో కుదించుట: కేసరిముద్రతో మూలబంధనము, జలేంద్రియ బంధనముతో శరీరములోని అగ్ని, సూర్యమండలములు కుదించబడి, మూలబంధనము వలన ప్రాణణ, అపానములు కలిసి పైకి ప్రాకి సహస్ర దళము చేరుటచే చంద్రమండల ప్రకాశము నెలకొనును.)

822. ఆకాశభూతములో వాయుభూతము కలిసియున్నదని గ్రహించవలె. పైగా అగ్ని, జలము, పృధివి (భూమి)యు కలిసియున్నదని ఎరుగవలె. ఆకాశము మొదలగు పంచభూతములన్నియూ ప్రకాశమయమగు ఆకాశములో నెలకొని యున్నదని ఎరుగవలె. ఇట్లు ఇవన్నియూ ఇమిడియున్నదని గ్రహించి సృజించినవారు దూరదృష్టి పొందుదురు.
(పంచభూత తత్త్వములన్నియూ ఆకాశతత్త్వములో నెలకొన్నదని గ్రహించిన వారికి దూరదృష్టి అలవడును.)

823. దూరదృష్టి గురించి చెప్పునదంతయు మీ అనుభవములోనే పొందగలరు. మేఘము వంటి అనుగ్రహము నొసగు కన్నులు గల తల్లి పరాశక్తితో నెలకొనుటచే ఏర్పడునదైన జ్ఞానశక్తి అంతరమున నెలకొనుటచే, అందమైన జ్యోతియందు (శివుని యందు) చిత్తముంచుటచే, భూమి మొదలగు అన్ని లోకములు పగటి వెలుతురులో చూచునట్లు బాగుగా దర్శనమగును.
(శివజ్ఞానము పొందుటచే సాధకునకు అన్ని లోకములలో జరుగునవి అన్నియూ తేటగా, పగటిపూటలో చూచునట్లు కనబడను.)

824. నాభికమలమునకు పన్నెండు (12) అంగుళముల క్రిందనున్న మూలాధార చక్రమున అనేక గడియలలో స్తుతించబడు వేదములోని సూర్యునిగా చెప్పబడిన పురుషుడు ఒకడున్నాడు (వేదవాఙ్మయంలో పిలువబడు పురుషుడు నాభిస్థానములోనివాడు సూర్యుడు – శిరస్సున నెలకొన్నవాడు జీవుడు – ద్వాదశాంతమున నెలకొన్నవాడు ఆత్మగా పలు నామములతో పిలువబడు చున్నవన్నీ ఒక్కటే). కుండలినీ బంధించుటచే పైకి ప్రాకిన నాదము బుద్ధిలో మనస్సు నెలకొనుటచే, ఆత్మయైన ఈ దేవాలయములో శివుడు ప్రకాశించునే!!
(నాదమైన బుద్ధిలో చిత్తము పదిలమగుటచే ఆత్మలో శివుడు ప్రకాశించును.)

## 19. పర్యంక యోగము

పర్యంకం అనగా మంచము, యోగం అనగా ఐక్యం. మంచముపై స్త్రీతో మైధునంను యోగముగా మార్చుకొనుటయే పర్యంకయోగం అనబడును. లౌకిక, భౌతిక శృంగారమునే యోగంగా మార్చుకొనుట. భోగమే యోగమగుట. అల్పసుఖమే మహాసుఖమై యోగసాధన సాధించుట. ఇదియే ప్రకాశమును పొందదగు దగ్గరి దారియని టిబెట్టు బౌద్ధ గురుశ్రేష్టులైన నరోప్పా మరియు ఎందరో సిద్ధులు కూడ చెప్పియున్నారు.

825. రాసుకోవలసిన వాసన ద్రవ్యములన్నింటిని తన శరీరమునకు రాసుకొని పురుషుడు, పలు సువాసనలతో నిండిన పూలమాలను ధరించి స్త్రీతో భోగమున నెలకొని, చిత్తమును సూది రంధ్రమువలె నొప్పారు బ్రహ్మరంధ్రమున నిలిపి, భోగమును సలిపినచో, చేయు భోగము విఫలము కాజాలదు.
(చిత్తమును బ్రహ్మరంధ్రములో నెలకొనునట్లు చేసి, దైవధ్యాసతో నుండిన యెడల భోగము సఫలమగును.)

826. పై మంత్రములో చెప్పబడినట్లు శిరస్సు - బ్రహ్మరంధ్రమున నెలకొన్న జ్ఞానరూపియగు శివునియందు చిత్తమును నిలిపి పురుషుడు సంభోగించినచో వాని కామవాయువు త్వరితముగా తన పనిని చేయక నీటితత్వముగల శుక్రము స్త్రీ యొక్క శోణితముతో కలువజాలదు. మత్తు కలిగించు జూదము వలె కరణములుగా (పనిముట్లు) స్థనభరితములు కలిగిన స్త్రీయు, రథము నడిపించు పురుషుని వలె ఈ సంగమమున వెలువడిన (బహిర్గతమైన) శుక్రము శోణితము ప్రకాశముగా, నాదముగా మారి శిరస్సున నెలకొనునే!!
(శుక్ర, శోణితములే నాద, బిందుగా మారి శిరస్సున నెలకొనును. కామ వాయువు మూలాధారము నుండి ప్రయాణము చేసి అన్ని చక్రములు దాటుకొని శిరస్సున నెలకొనును.)

827. నాయకుడు, నాయకి కోరిచేయు సంభోగయోగములో అగ్ని, సూర్య మండలములు దాటుకొని చంద్రమండలములో నెలకొనియున్న ప్రకాశమును ఇద్దరూ గ్రహించుదురు. శరీరమను రథమును పైపైకి పయనింపజేయుగా చంద్రమండలములోని ఆకాశగంగ ప్రకాశముతో వృద్ధి పొందుటచే, శరీరములోని అంగఅవయములు, వెన్నెముక ఎప్పటికీ నీరసించజాలవు.
(కోరి సలుపు పర్యంకయోగమున ప్రకాశము వృద్ధి పొందుటచే శరీరము నీరసించదు.)

828. అట్లు సలుపు సంభోగ కారణముగా కామాగ్ని శరీరము నుండి జలరూపమున నున్న శుక్రమును జారవిడుచును. అట్లు జరుగనీయక (శుక్రక్షయము) యోగముతో

(యోగసాధనతో) దానిని రక్షించి, విజయము సాధించినవాడే యోగులందరికీ జయము పొందిన నాయకుడగును.

(శుక్రక్షయము యోగసాధనతో అరికట్టి కాపాడుకొనవచ్చును.)

829. ముందు మంత్రములో చెప్పబడిన శుక్రజయము పొందిన నాయకుడు ఆత్మను గ్రహించిన వాడగును. అతను కోరిన శివయోగమంతయూ వచ్చిచేరును. అతను తనను వశపరచుకొని పరిపాలించు నాయకుడగును. అతను కోరినట్లే పంచభూతములు కూడ నడుచుకొనును.

(ఆత్మజ్ఞానము పొంది, శివానందములో నెలకొన్న యోగికి తను కోరుకున్నట్లే శరీరము, పంచభూతములు మొదలగునవి అన్నియూ తన వశమైపోవును.)

830. పర్యంకయోగము ఐదు (5) గడియలు మాత్రమే చేయవలెను. దానికి పైబడి సలిపినచో ఆరవ గడియలో నాయకురాలు నాయకునితో సలపు భోగము అధికమై హృదయారవిందమై, అల్పసుఖములో మునిగిపోవును. ఐదు గడియలు చేయు భోగమే పర్యంకయోగముగా నిర్ణయింపబడును.

(పర్యంకయోగము యొక్క కాలపరిమితి ఐదు గడియలే అగును.)

831. ఐదు గడియలు మనో, దృఢనిశ్చయముతో దైవధ్యాసతో బహు కఠినమైన ఈ పర్యంకయోగము సలుపువారికి మాత్రమే దైవము వారిలో ఇమిడి అనుగ్రహించునే తప్ప, విరహతాపముతో చేతులలోని గాజులు కూడ క్రిందకు దిగజారిపోవునట్లున్న సన్నని దేహము, చందనము వంటి వాసన ద్రవ్యములు రాసుకొన్న స్థనములు గల స్త్రీలతో సలుపు సల్లాపములు తుదకు అల్ప సుఖములోనే మునిగిపోవుదురు.

832. ఇటువంటి కఠినమైన యోగమును చేసి తనలో ఇముద్చుకొన్న వారెవరన్నచో, ఆకాశగంగను తన జటాఝూటములో ధరించిన పరమశివుడే అగును. ఏలనగా అది అల్పసంతోషము కొరకు సాధించినదిగా కాక, నాదముతో కలిసిన ప్రకాశమును తలంచి అదే ధ్యాసలో ఉండి, సగుణ స్వరూపుని కాక నిర్గుణ, రూపరహిత ఈశ్వరుని ధ్యాసతో ఉండవలెననునదే పర్యంకయోగము యొక్క ఉద్దేశము.

(భోగమునందు కూడ శివధ్యాసతో నిరాకార రూపమును భ్రూమధ్యమున చిత్తముతో నెలకొనుట.)

833. పర్యంకయోగమునకు తగిన వయస్సు స్త్రీకి ఇరవై, పురుషునకు ముప్పది సంవత్సరములు. ఈ యోగములో అనుభవసాలురకు మిక్కిలి ఆనందమును కలుగజేయును. స్త్రీలలో పంచజ్ఞానేంద్రియములు మహానందములో సంపూర్ణముగా మునిగి తేలుటచే పురుషునకు శుక్రక్షయముండజాలదు.

834. శ్వేతవర్ణము గల శుక్రము కరిగి బంగారుఛాయ కలిగిన శోణితముతో కలిసి పోకుండా, కపటియైన కంసాలి ముప్పుతో మాసివేయునట్లు శివుడు అనుగ్రహించి, ఇమిడి, పక్వపరచి, నిప్పుయైన అగ్నికళను ఏర్పరచి, తన సహాయముతో సుషుమ్న ద్వారా చంద్రమండలమునకు చేర్చి బంగారుయైన చంద్రుని, రాగియైన కొండనాలుకలో ఇమిడ్చెనే!!

(ముప్పు: రసవాదములో కంసాలి బంగారును పుటం వేయుటకు (శుద్ధిచేయు ప్రక్రియ) ఉపయోగించు రసాయన పదార్థ సమ్మేళనము (మిశ్రమము). స్వర్ణంను కంసాలి పక్వపరచునట్లు శివుడు జీవునిలో ఇమిడి, పక్వపరచుట, శివధ్యాసతో యుండి భోగము చేయుటచే శుక్రము అతిత్వరగా శ్రోణితములో కలవనీయక, అగ్నికళయగు ప్రాణణ సుషుమ్ననాడి ద్వారా పైకి ప్రాకించి సహస్రదళమున నెలకొనుటచే కొండనాలుక యందు అమృతమువంటి తెల్లని ద్రవము స్రవించునట్లు చేసి జీవుని పక్వమొనర్చి ఉపదేశించి ఆదుకొనును.)

835. ఇట్లు శుక్రక్షయము కాక సంభోగించుటచే ఇద్దరికీ తమలో సుఖానుభూతి పొందుటయే కాక, కామవశులు కాక దైవకార్యమని తలంచుటచే, ఆనంద స్థితిలో, పదిదిశలలో, పదునెనిమిది (18) దేవతలకు నాయకునిగా శివ సూర్యునిగా వెలుగొందుదురు.

(చిత్తము శివునియందు పదిలమగుటచే పర్యంకయోగములో శివ సూర్యునిగా వెలుగొందుదురు.)

836. ఇచ్ఛను పురికొల్పి సూర్యుడు, జన్మమును పురికొల్పు ఉపస్థకు మధ్యస్థానము నుండి, స్త్రీ పురుషులిద్దరు తమ సంభోగములో శుక్రము, శ్రోణితము విడువ జాలకుండుటచే ఇరువురునూ ఆనందము పొంది, చంద్రమండలములో వారి చిత్తము పదిలమై నెలకొనుటచే, ఎర్రనైన, శక్తియైన నాదములో నెలకొందురు. (నాయకి, నాయకుడు చంద్రమండములోని నాదములో నెలకొందురు.)

837. పర్యంకయోగము ద్వారా బుధతత్త్వమగు తెలివిని చంద్రమండలములో నెలకొనునట్లు చేయుటచే, సర్వవ్యాపకబుద్ధి యందు నెలకొన్నవారవుదురు. నాయకితో కూడియుండు నాయకునకు లోకములో ఎటువంటి దుఃఖముండదు. శరీరము నుండి శుక్రము బహిర్గతము కాకుండటచే శుక్రము ఊర్ధ్వరేతస్సుగా పైకి ప్రాకును.

(దైవము నందు ధ్యాస యుంచుటచే వారి చిత్తము చంద్రమండలములో నెలకొని, నాయకునికి శుక్రము ఊర్ధ్వముఖముగా పైకి ప్రాకుటచే ఊర్ధ్వ రేతస్సు అని పిలువబడును.

భోగము సంతతి వృద్ధికే తప్పు, వట్టి కామకలాపాలుగా ఉండరాదనునది శాస్త్రీయ వచనము.)

838. మూలాధారము నుండి స్వాధిష్టానము ద్వారా కామాగ్నిని భ్రూమధ్యమునకు ప్రాకించిన యెడల అగ్ని ముందు మైనము కరిగిపోవునట్లు సాధకునకు శరీరతత్త్వము కరిగిపోయి, శిరస్సున శివతత్త్వములో జ్యోతిని దర్శించి, మహా ప్రకాశమును గ్రహించిన వారికి లౌకిక బంధములలో మరల తగుల్కొనజాలరు. (ఆకాశతత్త్వమగు చిదంబరమును (చిత్ + అంబరము = ఆకాశం) గ్రహించిన వారు నిరాకార తత్త్వములో నెలకొని మహాప్రకాశయమ మగుదురు.)

839. ఆకాశతత్త్వమును ఎరిగి, అచ్చట వెలుగొందు మహాప్రకాశమును గ్రహించి, మనస్సు వికల్పమునొందక చిత్తమునందు తేటనైన ఆత్మజ్ఞానమును పొంది, పరమశ్రేష్టుడైన నందీశ్వరుని అనుగ్రహముతో పరమము, నిరాకారము అగు మహాప్రకాశమును గ్రహించితిని. ఇంతకు మించి మరేదియూ లేదు.

840. ఊర్ధ్వలోకములో నెలకొన్న వారిలో మేలైన వారెవరనగా నారాయణుడు, బ్రహ్మ, రుద్రుడు మొదలగువారు. తురీయం భూమికలో నెలకొన్న శివం అగు పరమశివుడు వీరందరికి గృహస్థములో శివుడే పరమపురుషుడని వారివారి ఇల్లాలులకు పర్యంకయోగము ద్వారా ఉపదేశించియున్నారు.

841. పర్యంకయోగములో మెరుపుతీగ వంటి నడుము గల శక్తియు, ఆమెను పాలించు పరమశివుడు, వీరిద్దరిని మహాప్రకాశమండలములో దర్శించి, ఆ కూటమిలోనే యోగి తన ఆత్మను నెలకొనునట్లు స్థిరము చేసినందున ఈ లోకములో చాలాకాలము జీవింపనగును.
(శివ, శక్తి మధ్యన మహాప్రకాశములో యోగి తన ఆత్మను నెలకొల్పుటచే తాను మహా ఆయస్సువంతుడగును.)

842. బాహ్యముగా వెళ్ళదగు కామవాయువును వెళ్ళనీయక నిరోధించి, దాని వలన శుక్రక్షయము అరికట్టి, ఊర్ధ్వరేతస్సుగా ప్రాకించు సామర్థ్యము, ఉపాయములను అందరూ ఎరుగజాలరు. అట్లు మార్చదగు ఉపాయము ఎరిగినవారు శ్రేష్టమైన శివతత్త్వమునందు తనను తాను ఆహుతి చేసుకొన్నవారగుదురు.
(శుక్రక్షయము అరికట్టి ఊర్ధ్వరేతస్సుగా దానిని శిరస్సునకు ప్రాకించు ఉపాయము తెలిసినవారు, వారు శ్రేష్టమైన శివతత్త్వము పొంది, ఆత్మను అర్పణ చేసిన వారగుదురు.)

843. పర్యంకయోగము ద్వారా తన్ను తాను ఆత్మ అర్పణ చేసుకొని, సహస్ర దళమున నెలకొనుటచే, దాని ద్వారానే శిరస్సుపైనున్న రోమములన్నియూ నల్లవిగా

మారును. జీవుడు చేయవలసిన శుభములన్నీ చేయుటకు పరాశక్తి సహాయపడును. పరిపక్వము తగ్గట్లు సాధకునిలో నున్న పృధివి చక్రస్థాన కార్యమును మార్చి అనుగ్రహించును.

(పృధివి చక్రకార్యము మార్చుట: కామవాయువు చేష్టలగు పునరుత్పత్తి, అధోముఖ చలనములను నిరోధించి, మార్చి, ఊర్థ్వముఖముగా పైకి సహస్ర దళమునకు చేర్చుట. ఇట్లు నెలకొనుటచే పరాశక్తి బిందు జయమును (శుక్ర జయము) అనుగ్రహించును.)

844. సహస్రదళపద్మము యొక్క వివరణ ఈ మంత్రమున ఇవ్వబడినది.

శిరస్సున సహస్రదళపద్మము (వెయ్యిరేకులు గల పద్మము) ఒకటినున్నది. ఆ తామర జ్ఞానప్రకాశములో నెలకొనియున్నది. కావున భూమిగాని, నీరుగాని లేవు. ఆ తామరకు మొగ్గగాని, వేరుగాని లేదు. దాని ప్రకాశము అఖండముగా వ్యాపించియుండుటచే దానికి పరిమితులు లేవు. ఇది ప్రకాశమునకు కారణమై అంతటా వ్యాపించియున్ననూ దీనికి స్థానముగాని (ఆధారము), కొస (ముగింపు) గాని లేక వెలుగొందుచున్నది.

(సహస్రదళములో, చిదాకాశములో, నాదముగా, జ్ఞానజ్యోతి ప్రకాశముగా వెలుగొందుచున్నది.)

పర్యంకయోగము: జీవుడు ఎంత లౌకికముగా నున్ననూ, భోగములోనున్ననూ సాధనతో తన చిత్తము శివతత్త్వములో, శివధ్యాసలో నుండుట వలన ఆ దైవమే ఆ యోగమునకు సత్ఫలమును ఇచ్చి, సాధకుని ఆదుకొని అనుగ్రహించును.

శ్లో: యోగరతోవా, భోగరతోవా, సంగరతోవా, సంగవిహీనః
యస్య బ్రహ్మణి రమతే చిత్తం, నందతి, నందతి నందతి ఏవ

తా॥ యోగములో ఉన్నా, భోగంలో ఉన్నా, సంగములో ఉన్నా, సంగవిహీనుడుగా నున్ననూ, ఎవరి చిత్తం సదా ఆ బ్రహ్మమునందు నెలకొనియున్నదో వానికి ఆనందమే ఆనందము – శంకరుల సూక్తి – భజగోవిందము.

## 20. అమురి ధారణ

అమురి=అమృతము; ధారణ=ధరించుట (పొందియుండుట). శరీరములో నున్న కామనీరు – వీర్యమును యోగము ద్వారా నిరోధించి ఊర్థ్వముఖముగా ప్రాకించి సుషుమ్న ద్వారా సహస్రదళమున శివధ్యాసతో నెలకొనునట్లు చేయుటచే అది నాదము, ప్రకాశముగా నొప్పారి, అమృతమును కొండనాలుకలో వర్షించును. ఇది యోగసాధనలో గురుముఖముగా నేర్వవలసిన కళలు.

845. త్రాగుటకు వీలుకాని ఉప్పునీరు కలిగిన సముద్రము దగ్గరలో ఒక బావి త్రవ్వి నీరు చేదినచో ఎట్లు శుభ్రమైన త్రాగునీరు లభించునో, అట్లే ఈ శరీరమునందు విసర్జించదగిన పలురకముల ఉప్పు గలిగిన నీరుయున్ననూ, మూత్రపునీటి నిలువ దగ్గరలోన మహా ఉత్కృష్టమైన అమృతము నీరు ఒకటి కలదు. అది మూత్రముతో కలిసి విసర్జనము కాకుండా, ఊర్ధ్వముఖముగా సుషుమ్ననాడి ద్వారా సహస్రపటలమునకు తీసుకువెళ్ళినచో ప్రాణము శరీరమును వీడక చాలా కాలముండునే!!

(మూలాధారములో నున్న కామవాయువుతో పురికొల్పబడిన శుక్రము అధోముఖముగా వెళ్ళనీయక ఊర్ధ్వముగా ప్రాకించి శివధ్యాసలో సహస్ర దళమునకు చేర్చినచో ఆ జీవి శుక్రము అమృతమగునే!!)

846. ఇటువంటి శివజలము అనబడు అమృతమును త్రాగినచో, ఒక్క సంవత్సరము కాలములో ప్రకాశమును దర్శించనగును. ఎటువంటి కీడులు జరుగనేరవు. ఇది వాయువుతో కలిసి పైకి ప్రాకుటచే ఎనిమిది సంవత్సరములులో మనస్సు అధోముఖముగా వెళ్ళక ఊర్ధ్వములో నెలకొనును. సర్వసంతోషమొసగును. కాయం (శరీరము) కనకమగునే!! (బంగారుగా మారును)

(శివనీరు వలన శరీరమార్పుతో కూడ మనస్సు కూడ మార్పు చెంది శివతత్త్వం పొందును.)

847. వంద మిరియాలు కొలతంత అమురినీటి (శివనీరు, అమృతము అన్నియూ పర్యాయ పదములే) శ్వాసించు వాయువుతో కలిసి సుషుమ్ననాడి ద్వారా శిరస్సుకు ప్రాకించి, స్థితిపొందినచో, శరీరము బంగారువలె మారును. శరీరముతోయున్న యోగులకు దీనికంటే మరొక ఔషధము లేదు. జనులు ఈ సూక్ష్మమును గ్రహించి శిరస్సుకు ప్రాకించినచో, పండిన రోమములు కూడ నల్లగా మారి, నిగనిగలాడుట చూడగలరు.

848. అజ్ఞానులు సముద్రపు అలలతో వచ్చు ఉప్పునీటిని ఉప్పుగా మార్చి ఉపయోగించు కొనుట తెలియనట్లే, మూత్రసంచికి చాలా దగ్గరనుండు శుక్రమును విసర్జించుట ఉత్తమమందురు. కాని ఈ శుక్రమును అగ్నిచే శుద్ధిచేసి సుషుమ్న నాడి ద్వారా ఊర్ధ్వమునకు ప్రాకించు యోగులకు అచ్చట స్థితిపొంది, శరీర బలమునే కాక, వెంట్రుకలు నల్లవిగా మారి, బాహుభుజములు బలవంతమై, యవ్వనము తొణికిసలాడును.

(అమురియను అమృతమును ధరించుట వలన యవ్వనముతో ఉండుటయే కాక, యముని భయముండజాలదు.)

849. ఓ అందమైన శిరోజములున్నదానా! ఆశ్చర్యము ఒకటున్నది. ఈ శరీరములో నిగూఢముగా నున్న అమురినీరు (శుక్రము)ను పరిపక్వమొందించి, శిరస్సుకు చేర్చి, స్థితిపొందిన సమయమున మిరియాలు, ఎండు ఉసిరిముక్కలు, కస్తూరి పసుపుముక్కలు, వేపగింజలు అన్నింటిని కలిపి మెత్తగా నూరి కపాలమున మర్ధన, స్నానం చేసినచో శరీరము పుష్టినొంది, యవ్వనముతో శోభించి, వెంట్రుకలు నల్లగా మారునే!!

(అమురిధారణ చేయువారు పై వస్తువులను మర్ధనచేసి, స్నానము చేయవలెను.)

850. అన్ని జీవరాశులలో అమరిన వీర్యము (జీవసృష్టికి మూలము) కాబట్టి వీర ఔషధం అనియూ, ఆకాశమండలములో జ్యోతిస్వరూపముగా వెలుగొందుటచే దేవఔషధం అనియూ, స్త్రీతో మైధునంకు ఉపయోగపడుటచే నారీఔషధం అనియూ నా గురుదేవుడు నందీశ్వరుడు అనుగ్రహ భాషించెను. ఇదియే ఆదిఔషధమని యోగులు ఎరుగుదురు. ఇది సహస్రదళపద్మమున శివతత్త్వములో నెలకొనుటచే మహాజ్యోతి మయమైనది. దీన్ని మహత్యము సామాన్యులకు చెప్ప వీలుకానిది. (అమురినీరు: పురుష, స్త్రీలో శుక్ర, శ్రోణితములే అగును. ఇది జీవసృష్టికి కారణమైనందున కొన్ని మంత్రములలో దీనిని **శివనీరు** అని పిలువబడి యున్నది. ఈ **శివనీరు** యొక్క మహత్యము వివరించినది.)

## 21. చంద్రయోగం

చంద్రుని దేహమందు నెలకొనునట్లు చేయుట. బాహ్యముగా బ్రహ్మాండములో నున్న సూర్య, చంద్ర, అగ్నులు మొదలగు ప్రకాశములు అంతరము (దేహము)లోనూ ఉన్నవి.

851. చంద్రకళ స్థూలశరీరము నుండి సూక్ష్మశరీరమునకు ఎక్కి, సూక్ష్మశరీరము నుండి స్థూలశరీరమునకు దిగివచ్చును. ఇట్లు స్థూల, సూక్ష్మ శరీరములలో మారిమారి ఎక్కి దిగి వచ్చుచుండును. ఇది బాహ్యచంద్రునికి గల శుక్లపక్షమి, కృష్ణపక్షమి వంటిది. ఈ చంద్రకళను వివరించుటతో సూక్ష్మశరీరము శుద్ధి పొందుటకు తగ్గట్లు స్థూలశరీరమునకు కూడ శుద్ధి ఏర్పడును.

852. శరీరములో చంద్ర, సూర్య, అగ్ని అను మూడు ఉన్నవి. ఇవి చంద్రకళ (ఎడమనాసిక ద్వారా శ్వాస)కు పదహారు కళలుగా (16), సూర్యకళ (కుడి నాసిక ద్వారా శ్వాస)కు పన్నెండు కళలుగా (12), మూలాధారచక్రములో కుండలినీలో అగ్నికి పది కళలు (10)గా ఉన్నవి. ఈ సూర్య, చంద్రకళల ద్వారా మధ్యనాడియైన సుషుమ్ననాడి ద్వారా కుండలినీ పైకి లేపు అగ్నితత్త్వమును

ఎరిగి, గ్రహించినవారు యోగులు.
(యోగి సాధనలో చంద్ర, సూర్య, అగ్ని యొక్క కళలను ఎరుగును.)

853. పన్నెండు కళలతో ఉన్న సూర్యుడు చంద్రునితో కలిసి అందు ఇమిడిపోవును. చంద్రుని యొక్క పదహారు కళలతో చేరిన సూర్యుడు యొక్క పన్నెండు కళలు, అగ్నికళలగు పదింటిలో ఇమిడిపోవును. ఇట్లు సూర్యచంద్రాదులు అగ్నిలో ఇముడుట వలన జగత్తు (లౌకిక) పరమైన అన్నియు సాధకుని వశమగునే!!
(సూర్య, చంద్ర తత్త్వములు (కళలుగా చెప్పబడినవి) అగ్నితత్త్వములో ఇమిడ్చి సాధకుడు శిరస్సున ప్రకాశమును దర్శించుటచే లౌకిక విషయములన్నియూ తనకు సాధకమగును.)

854. సూర్యకళలను పైకి తీసుకువెళ్ళు కొలత పన్నెండు అగును. అట్లే చంద్రకళలను పైకి తీసుకువెళ్ళు కొలత పదహారు అగును. ఈ రెండును కుండలినీ అగు అగ్నికళలతో పైకి ప్రాకి సర్వవ్యాపకములో (శిరస్సున గల చంద్రమండలము) నెలకొనుటచే అది అరువదినాలుగు (64)గా అగును. వీటిని గురునాధుని ద్వారా యోగవిధానములను ఎరిగి గ్రహించండి.
(సూర్య, చంద్రులు అగ్నితో చేరుట వలన అరువదినాలుగు (64) కళలతో ప్రణవము ఉదయించును.)

855. అగ్ని వలన ఉత్పన్నమైన అరువదినాలుగు కళలను, సూర్యునితో కలిసియున్న పన్నెండు కళలు, బిందు (శుక్రము) జయముతో ఏర్పడిన చంద్రుని పదహారు కళలు. ఇవి అన్నియూ కలిసి ఒకటిగా క్రియించిననూ, అవి విడివిడిగా ఉనికి కలిగియుండును.

856. అగ్నికళలగు అరువదినాలుగు (64), సూర్యుని ఆదరించిన పన్నెండు కళలు (12), శుక్రజయముతో పొందిన చంద్రకళలు పదహారు (16)ను, వీటితో కలిపి మూలాధారములోని నాలుగు (4) నక్షత్రకళలతో కూడి మొత్తము తొంబదిఆరు (96) కళలగును.
(నక్షత్రకళ: జీవప్రకాశమగు నాలుగు పద్మరేకులు. భూమితత్త్వము కలిగిన మూలాధారచక్ర స్థానములోనిది. మొత్తము తొంబదిఆరు (64+12+16+4) కళలు కలిసి దేహమున 96 తత్త్వములుగా నెలకొనియున్నవి.)

857. చంద్ర, సూర్యకళలు (ఎడమనాసిక శ్వాస, కుడినాసిక శ్వాస) ఇడనాడి, పింగళనాడి ద్వారా అధోముఖము (శరీరము క్రిందిభాగమునకు) వెళ్ళదగినవి. అట్లుకాక శ్వాసమార్గము నిరోధించి మధ్యనాడి సుషుమ్ననాడిలో నెలకొని, పైకి ప్రాకించి శిరుస్సునగల సహస్రదళ పద్మమునందు నెలకొనుటచే శ్రేష్టమైన యోగులు

శివధ్యానములో మునిగియుందురు.

(కళల సాధన వలన శివధ్యానములో శివుని పాదములందు నెలకొని యుందురు.)

858. మూలాధారములోని అగ్నిని (ఇడనాడి, పింగళనాడి) చంద్రకళ, సూర్యకళల శ్వాసల ద్వారా చలనము ఏర్పరచుటచే చంద్ర, సూర్యకళలు నక్షత్రముల వలె కాంతిని పొంది మూలాధార చక్రము నుండి సహస్రదళము వరకున్న ఏడు చక్రములు దాటుకొని, చంద్ర, సూర్య, అగ్ని మండలము దాటి ప్రణవ నాదముగా శబ్దించి, నక్షత్ర ప్రకాశముతో కూడిన చంద్రమండలముగా వెలుగొందును. ఆ మహాప్రకాశమే పరమధామమై భూమియందు ఒప్పారును.

(బ్రహ్మాండములో నున్నవన్ని పిండాండములోను ఉన్నవి. ఆకాశమండలములోని గ్రహములు, నక్షత్రములన్నియూ శరీరములో ఇమిడియున్నవి. ఈ తత్త్వమును యోగులు యోగసాధన, అభ్యాస మూలమున గ్రహించి, అభ్యాస సాధనల ద్వారా చంద్ర, సూర్య, అగ్ని మండలము దాటి ద్వాదశాంతములో (మహా ప్రకాశమండలములో) నెలకొనుటచే వారే దైవతత్త్వములన్నింటిని పొందిన శివం అగుదురు.)

859. పృథివి (భూమి,) జలము, అగ్ని, వాయువు, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, అగ్ని, నక్షత్రములు మొదలగు తొమ్మిది (9) మార్పు చేయదగు జీవప్రకాశము లగును. మార్పుపొందిన జీవి శివానుగ్రహముతో ప్రణవతత్త్వముగా మారిపోవునే!!

(పంచభూతముల తత్త్వములు (5); సూర్య, చంద్ర, అగ్ని, నక్షత్రములు (4) తత్త్వములను ఎరిగి, వాటి ప్రకాశములే మూలాధార తత్త్వమును మార్చివేసి శరీరములో నున్న జీవిని ప్రణవస్వరూపునిగా చేసివేయును.)

860. ఆకాశములోని నక్షత్రములు చంద్రుడు (కృష్ణపక్షము అనుసరించి) అధోముఖముగా శరీరములో పయనించునపుడు నక్షత్రములన్నియూ ప్రకాశవంతమై వెలుగును. చంద్రుడు (శుక్లపక్షమి దినము వలె) మూలాధార చక్రము నుండి శిరస్సుకు ప్రాకి వెళ్ళునపుడు సహస్రదళమున నున్న ఈ చంద్రుని ప్రకాశము వలన నక్షత్రముల ప్రకాశము మందగించును. ఈ మూలాధారచక్రమున నున్న ప్రకాశము అన్ని యోనులలోనున్నది (అన్ని జీవరాశులలో). అంతర్ ప్రకాశము అన్ని జీవరాశులకు తమ ప్రకాశ స్వరూపముగా నున్నది.

(సకల జీవరాశులకు మూలాధారచక్రమున వెలుగు ఉన్ననూ, యోగులు కుండలినీ యోగము ద్వారా శ్వాసను శిరస్సునందు లయపరచుటచే యోగులకు శిరస్సునందే మహాప్రకాశమ వెలుగొందును.)

861. చంద్రుడు మొదటి పక్షమున (శుక్లపక్షమి రోజులు) దినదినాభి క్రమములో

ప్రకాశవంతుడగును. అట్లే (కృష్ణపక్షమి రోజులలో) రెండవ పక్షమున దినదినాభి క్రమములో క్షీణించి ప్రకాశము కోల్పోవును. అట్లే చంద్రయోగము చేయు యోగులు కుండలినీలో మొదటి పక్షమున ప్రకాశవంతులై, పిమ్మట పక్షమున శిరస్సున గల సహస్రదళము ప్రకాశముచే ఈ చంద్రుని ప్రకాశము కోల్పోవుదురు. ఈ మహత్వమును ఎరిగిన యోగులు ఎనలేని శివమహిమను గ్రహించిన వారగుదురు.

862. అంతరయోగము ద్వారా మూలాధారచక్రమున నుండి లేపిన అగ్నిని సూర్య మండలములో నిలుచుటకు పదిరోజులు చంద్రయోగమున చంద్రకళయగు వాయువు నక్షత్రకళగా మారి, శరీర, అన్ని ఇంద్రియములు వాటి ద్వారా వెళ్ళనీయక, చిత్త ఏకాగ్రతతో ఒక్కటై దైవ (శివ) ధ్యానములో నుండి సహస్ర దళమునందు నెలకొనుటకు మరొక ఐదురోజులును కలిపి మొత్తము పక్షమును అగ్ని, సూర్య, చంద్రుడు కలయికచే చంద్రయోగ దర్శనముగా చెప్పబడినది.

863. ఈ చంద్రయోగము వలన శరీరములో చంద్రుని పదహారు కళలు (16) నెలకొనియుండుట, వాటి ప్రకాశమును, సత్యమును అజ్ఞానులు గ్రహించ జాలకున్నారు. దీనిచే కోపిష్ఠి అగు యముడు శరీరము నుండి ప్రాణమును విడదీయుటకు అనుమతినిచ్చి, మరలా జన్మచక్రములో పడుటకు అవకాశము కల్పించుకొనువారగుచున్నారు. ఈ తబ్బిబ్బులకు లోనై మతిభ్రంశము చెందుచున్నారు.

(చంద్రుని షోడశకళలు దాని యోగ అమరిక, జ్ఞానము లేనందున నీచులు యముని వశమున చిక్కి నాశనమగుచున్నారు.)

864. కుండలినీతో (మూలాధార చక్రములో) నున్న మూలాగ్ని చంద్రకళలోని శ్వాస బ్రహ్మరంధ్రము వైపు ప్రవహించునపుడు మణిపూరకములోని సూర్యునిచే కలిసి, ఒక్కటై బ్రహ్మరంధ్రము వైపు పయనించి, అచ్చట స్థితి పొందుటచే, సోమసూర్యాగ్నితో కూడిన ప్రణవము ఏర్పడును. ఆ స్థితియే సకలము అగును. (ఇందు సూర్య, చంద్ర, అగ్నిలు కలయిక ఉపాయము చెప్పబడినది. దైవశక్తితో ఇమిడి అన్నిటిలోను యోగులు వెలుగొందురు.)

865. పన్నెండు కళలు గలిగినది సూర్యకళ స్త్రీ కళ అగును. పదహారు కళలు గలిగినది చంద్రకళ పురుష కళ అగును. ఈ రెంటిని బాహ్యముగా వెళ్ళనీయక నిరోధించి, యోగసాధన వలన మూలాగ్నిని పరిపక్వమొనర్చి, శిరస్సునకు ప్రాకించుటచే ముఖమునందు వెలుగుచున్న ప్రకాశములో చేర్చినచో, వెగటులేని దైవ పాదపద్మముల సుఖము, స్థితి పొందినదై శాశ్వత సుఖముగా వెలుగొందుదురు.)

(పరిపక్వమొనర్చిన యోగసాధనలో ప్రణవ ప్రకాశము సాధకుని ముఖమునందు ఉదయించును. శాశ్వతకు దారిచూపును.)

866. గురు ఉపదేశాను క్రమములో (గురు ముఖము నేర్పదగిన సాధనలు) చంద్రకళ ఎడమనాసికలో వెళ్ళు శ్వాసను కుడినాసిక ద్వారా (సూర్యకళ) వెళ్ళునట్లు చేయుట, సూర్యకళయగు కుడినాసిక శ్వాసను ఎడమనాసిక (చంద్రకళ) ద్వారా వెళ్ళునట్లు చేసి, ఎటువంటి దోషములు లేక గురు ఆజ్ఞానుసారముగా సాధనలు పాఠించిన సాధకునకు సత్ఫలముగా వెయ్యి సంవత్సరములైనను శరీరము చెడిపోక నిలిచియుండును.

(సూర్య, చంద్ర శ్వాసలను మార్చిమార్చి చేయు సాధనల వలన జీవితము నిలకడయగును.)

867. జీవకళ తొమ్మిదవదైన సహస్రదళమునకు వెళ్ళునపుడు శిరస్సున నాదము ఉద్భవించును. ఆ నాదంలో పరాపరుడైన దేవాదిదేవుడు మహానందముతో నెలకొనును. ఈ స్థితికి ముందుగా సూర్యకళ, చంద్రకళలు కుడి, ఎడమ వైపున దీపపు జ్యోతిగా ప్రకాశించుదురు. సూర్యుడు ఉదయించుటకు ముందు శంఖునాదముతో ప్రజలను లేపునట్లు, నాదము మొదటి ఉద్భవించి అన్నిటికీ ముందుగా వచ్చి నిలబడును.

(జ్ఞానభానుడు (సూర్యుడు) ఉదయించుటకు ముందుగా నాదము ఘోషించును. తొమ్మిదవది: జీవకళ శిరస్సునగల అష్టదిక్కులను దాటి తొమ్మిదవదైన సహస్ర దళమునందు నెలకొనునదిగా చెప్పబడినది. కొన్ని గ్రంథములలో శరీరములోని జీవకళ షట్చక్రములు (6)ను దాటి, ఏడవదైన సహస్రదళమును, ఎనిమిదవదైన ద్వాదశాంతము దాటి, తొమ్మిదవదైన మహాప్రకాశములో ఇమిడిపోయి అండచరాచరములన్నిటిలోను పరాపరముతో సాధకుడు నెలకొనునట్లగును.)

868. సూర్యకళ, చంద్రకళ విడివిడిగా ఉన్నంతకాలము జీవులు కాలగమనమునకు (పరిమితికి) లోనైయుందురు. కాని చంద్రయోగము అభ్యాసము ద్వారా సాధకులు చంద్ర, సూర్యకళల నాడుల గమనమును మార్చిమార్చి అభ్యసించినచో, సుషుమ్నానాడి ద్వారా జీవకళ ఊర్ధ్వముగా ప్రాకి సహస్రదళమున ప్రణవనాదముగా మారి అమృతము ఏర్పడును. నాదసామీప్యము చేయువాడు నాదముతో కూడి అండములోని ఎల్లలు దాటి, శిరస్సుకు పైనున్న ద్వాదశాంతము దాటి, మహాప్రకాశములోనున్న శివునితో శివ అనుగ్రహముతో సమానముగా నెలకొనును.

(చంద్రయోగము చేయువారికి కాలనియతి ఉండజాలదు.)

869. నాభి కమలమగు మణిపూరక చక్రస్థానములో ఉద్భవించు జ్యోతియే పొందదగు ప్రణవము యొక్క అసలైన జ్యోతియని ఎవ్వరూ గ్రహించకున్నారు. ఎవ్వరేని ఆ ప్రణవమును గ్రహించిన పిదప, వానికి తండ్రికి ముందు కొడుకు పుట్టినట్లగును. (నాభి కమలము (మణిపూరకము) సూర్యుని స్థానము. స్వాధిష్టానము చంద్రుని స్థానము. ఇవి రెండు కలిసి సూర్యుడు నాదమై, చంద్రుడు బిందు ప్రకాశముగా ఊర్ధ్వమునకు ప్రాకి వెళ్ళునపుడు శిరస్సున ప్రణవనాదము ప్రకాశముగా నొప్పారును. దీనినే శివజ్యోతిని తండ్రిగా, జీవజ్యోతిని కొడుకుగా వర్ణించియున్నది. శివజ్యోతి సాధకునకు అనుభవములోనికి వచ్చుటకు ముందే జీవజ్యోతి తనయందే మణిపూరకములో అమరియున్నదే!! అని వక్కాణించి యున్నది. మణిపూరక చక్రములోని జీవజ్యోతిని ముందుగా గ్రహించవలెను.)

870. సత్యఫలము ఏదని ఎరుగజాలరు. ఆ సత్యమును ఎవ్వరేని చెప్పిననూ, విశదీకరించిననూ, లేక వారే చదివిననూ, గ్రహించలేని అజ్ఞానులు. చంద్రకళ యొక్క (చంద్రయోగం) ఆదియు, అంతమును ఎరిగినవారికి వైదికుడు (శివుడు) అచ్చట ప్రత్యక్షమగునే!!
(చంద్రయోగము ద్వారా ముందు మంత్రములో చెప్పినట్లు అభ్యసించిన సాధకుడు శివతత్త్వము పొంది శివమయమగును. శివుడే పలు శైవయోగులకు శివపురాణంలో వైదికునిగా వచ్చి దర్శనమిచ్చి యున్నాడు.)

871. కుండలినీ అను సర్పము (పాము) స్వాధిష్టానములో ఉండి చంద్రకళను వృద్ధిచేయక శుక్రక్షయమునకు సహకరించును (పాము చంద్రునికి సహజ పగ కనుక). దీనికి తోడు సూర్యుని (మణిపూరక స్థానము) యొక్క తీక్షణమైన ఉష్ణము కూడ తోడగును. అట్లుకాక దైవచింతనతో (ధ్యాసతో) కుండలినీని షట్చక్రముల ద్వారా పైకి ప్రాకించి శిరస్సుపై నున్న శివప్రకాశమండలములో నెలకొనునట్లు చేసినచో, ఈ మూడింటి పగ (పాము, చంద్ర, సూర్యుల పగ) తొలగుటయే కాక కరుణామయుడైన పరమశివుని అనుగ్రహముచే సాధకునికి శివమహత్వము వీడక వెన్నంటి ఉండునే!!

872. కుండలినీతో వెళ్ళిన చంద్రుడు శిరస్సునందే స్థితిపొందు వరకు సాధకుడు అప్రమత్తుడుగా, బహుజాగరూకుడై ఉండవలె. అట్లు స్థితిపొందిన చంద్రుడు క్రిందికి దిగివచ్చు సమయమున నిదురించియు, అనుగ్రహము పాలించిదగిన ప్రకాశమండలమును మనస్సునందు నిలుపుకొనియుండుటచే చంద్రుని పూర్ణతత్త్వమును సాధకుడు పొందనగును.

873. చంద్రఅంశము శిరస్సున ఉదయించునట్లు ప్రాతఃకాలమున (ఉదయమున) లేచిన

వెంటనే ధ్యానించవలెను. చంద్రుడు ఉదయించిన పిదప తన ఆహారము (అమృతము) తీసుకొని, చంద్రుడు శిరస్సున సంచారము చేయునంతవరకు వేచియుండవలె. చంద్రుడు శిరస్సు నుండి దిగివచ్చిన పిదప ఇంతవరకు (యోగసాధనతో) చంద్రయోగము చేసినది నిలిపి నిదురించవచ్చును.

(చంద్రయోగము ద్వారా పొందిన సాధనతో సాధకుడు కొంతకాలము మహా ప్రకాశమండలములో నెలకొని యుండవలెననుట.)

874. ప్రారబ్ధములో ప్రాణము వీడిపోకుండా కాపాడుకొనువారు యోగులు. అటువంటి యోగులు యముని కాలమును కొన్ని గడియలుగా లెక్క పెట్టగలవారు. వీరు యోగసాధనల వలన పంచకృత్యము నెరవేర్చు సదాశివ మూర్తులగుదురు. వీరు లోకములో అహంకార రహితమై, శివుని ఆదిదేవునిగా గ్రహించి, శివమహా ప్రకాశములో నెలకొనియుందురు.

ప్రారబ్ధమునందే ఉన్ననూ యోగులు అహంకార, మమకార రహితమై శివ మహాతత్త్వ ప్రకాశములో నెలకొనియుందురు. పంచకృత్యములు శివుని ఐదు కర్మలు:

1) సృష్టి : జగత్తు – సృష్టి
2) స్థితి : జగత్తు – రక్షించుట
3) తిరోధాన : మాయాశక్తిచే జీవుని సత్యజ్ఞానమును మరిపించి యుంచుట. దీనినే ఆవరణశక్తిగా శ్రుతులు చెప్పియున్నవి.
4) అనుగ్రహం : సత్యజ్ఞానము అనుగ్రహించి ముక్తి నొసగుట.
5) లయము : సంహారము, లయము–ముక్తినొసగి తనలో చేర్చుకొనుట.

875. చంద్రయోగములో శీతలముతో నిండిన చంద్రుడు యోగి సహస్రదళమును చేరుకొని, లౌకిక జీవనములో ఎదుర్కొను భూత, వర్తమాన, భవిష్యకాలముల మూడింటి కారణములను ఎరిగించి, పూర్ణచంద్ర మండలమును దర్శించిన పిదప, దానినుండి ఉద్భవించి, వెలుగొందుచున్న అమృతమునకు ఇక పరిమితి ఉండజాలదు (అమృతము = అమరత్వము/బ్రహ్మానందము).

(చంద్రయోగము ద్వారా యోగులు సూర్యచంద్రకళల ప్రభావము వలన, వాటి గమనముల వలననూ జగత్తులో ఏర్పడు త్రికాలములను ఎరిగి చంద్రమండల ప్రకాశములో నెలకొని సదా అమృతమును పొందుచుందురు.)

876. వృద్ధిపొందు సూర్యకళలు ఆరు, క్షీణత పొందు చంద్రకళలు ఆరును శ్వాస ప్రక్రియల వలన కంఠమునకు క్రిందిభాగమున ఎనిమిది (8) అంగుళం నిడివిలోను, కంఠమునకు పైభాగము శిరస్సువరకు నాలుగు (4) అంగుళం

నిడివిలో జరుగుటను, పిదప వాటిని సహస్రదళమునకు చేర్చి, వికసింపజేసి శరీరమంతటికి వ్యాపింపజేయు యోగక్రియలను జనులు ఎరుగజాలకున్నారే!! (యోగులు పన్నెండు అంగుళముల నిడివిలో శ్వాస వెళ్ళునది గ్రహించగలరు.)

877. శరీరమునకు, యోగమునకు వృద్ధి పొందు దినములు శుక్లపక్షమి రోజులే! శరీరమునకు కృష్ణపక్షమి రోజులలో చంద్రుని క్షీణత వలన కామచేష్టలు (శుక్ర క్షయము) కలిగించును. కాని యోగులు వీటికి అతీతులు కావున (వీటి చేష్టలకు లోనుకాక) శుక్రక్షయముండజాలదు. మూలాధారమునందే ఇది కట్టడి చేయబడును. కావున ప్రణవముతో ఇమిడిన చంద్రమండలములో వారి చిత్తమంతయూ సదాశివంనందు పదిలమైయుండును.

878. కుండలినీ నుండి మహాఉత్కృష్టమైన ఎర్రని కిరణములు కలిగి జ్ఞానమునకు ప్రతీకయైన ఆరు సూర్యకళలతో, మూలాధారములోని అగ్నికి సంబంధించిన నాలుగు కళలు (4 పద్మరేకులతో కూడిన చక్రము)లతో చేరి, మహా శీతలమును ఒనగూర్చునదైన చంద్రుని ఆరు కళలను, అన్నియూ ఒక్కటిగా కలిసి, పదహారు కళలు (6+4+6=16) శిరస్సున చంద్రమండలమును చేరునపుడు, యోగులు అన్ని బంధముల నుండి విడువడి దైవస్థితిలో నుండి పరమానందమును అనుభవించుదురే!!

879. బుద్ధిపూర్వకమైనది (బుద్ధిలో) సృజించియున్నది (ప్రజ్ఞ). నాదము, ప్రకాశముతో (ఇమిడి) చేరినచో, సూర్యుని తీక్షణశక్తి వీచును. అదే సూర్యుని తీక్షణము తగ్గినచో (చంద్రయోగము వలన – చంద్రుని ఆధిపత్యము వలన) శిరస్సుపై ప్రకాశము వెలుగును. ప్రకాశవంతమైన ప్రజ్ఞ (సూక్ష్మశరీరము) స్థూలశరీరముతో ఇమిడి నిలుచున్నచో, ప్రకాశవంతమైన ప్రజ్ఞ స్థూలశరీరము నుండి ఎప్పటికి వీడజాలదు. (జీవునికి వాహనమైన సూక్ష్మ, స్థూలశరీరములలో ప్రకాశవంతమైన ప్రజ్ఞ ఇముడుటచే స్థూలశరీరమునకు క్షీణత యుండజాలదు.)

880. చంద్రయోగము ద్వారా మనస్సును బాహ్యముగా వెళ్ళి చంచలపడనీయక నిరోధించుటచే శ్వాస సుషుమ్నానాడి ద్వారా మెదడు ఎడమభాగమున (సహస్ర దళమున) స్థితిపొంది పలు విధములైన శబ్దములతో కూడి శ్రేష్టమైన శివశంఖు ఘోష (నాదము) యోగులకు వినబడును. బహుబలీయమైన పంచేద్రియముల చేష్టలన్నీ అణిగిపోవును. యోగికి తగినట్లు అన్నీ నడుచుకొనును. వెగటులేని అమృతము తన నోటిలో (కొండనాలుక ద్వారా) స్రవించుటచే ఎప్పటికీ ఆనందస్థితిలో ఉందురు. ప్రణవముతో కట్టుబడనివారి దీనిని పొందలేరు.

881. చంద్రమండల ప్రకాశమగు ప్రవాహముతో కూడి ఇమిడిన సహస్రదళము, దాని

పద్మరేకులు విచ్చుకొని వికసించియుండుటచే అచ్చట జ్ఞానము (శివుడు), శక్తి (పరాశక్తి), నాదము, ప్రకాశము, జీవుడను పంచజ్యోతులను ఏకము చేసి, మూలాగ్నిని వీణలాంటి వెన్నెముకలో ప్రవహింపజేసి జ్యోతులను దర్శించువారికి ఇక యమ (కాలుని) భయమేమి లేదు.

(మూలాగ్నిని వెన్నెముక ద్వారా ప్రవహింపజేసి, సహస్రదళమునందు పంచ జ్యోతులను దర్శించువారికి శరీరనాశనము కలుగజాలదు.)

882. అనుభవింపదగిన అమృతపు ఊటను తెరచి, ప్రపంచ (లౌకిక) చేష్టల వలన మార్పులు పొందువాటిని నిగ్రహించి, సూర్యచంద్రులు నెలకొను సహస్రదళ పద్మమునందు ఇమిడి, తేటనైన జ్ఞానముతో సమాధియందు నెలకొని, ఎల్లలు లేని ఆనందమును, శివంను తెలియపర్చు తత్త్వమును ఈ కళల మార్పు యోగము (చంద్రయోగము) వలన పొందండి.

(శివయోగులకు, సాధకులకు రచయిత యొక్క సూచన మార్గదర్శకము.)

883. శివయోగులకు, సాధకులకు ఇచ్చు సూచనలు:

చంద్రకళ, సూర్యకళలు (ఇడనాడి చలనము, పింగళనాడి చలనము) చంద్రయోగము ద్వారా అధోముఖముగా వెళ్ళనీయక నిరోధించి, ఎటువంటి దోషములు లేక వాటి గమనమును సుషుమ్నానాడి (మధ్యనాడి)లో నెలకొనునట్లు చేసి వెన్నెముక గుండా పైకి ప్రాకించి, శివధ్యాసతో చిత్తమును పదిలపరచి, సహస్రదళ పద్మములో నెలకొనునట్లు చేసినవారికి అమృతము (బ్రహ్మానందమునే ఇచ్చట అమృతముగా చెప్పినది) ఎప్పటికీ ప్రవహించి, శరీరక్షీణత లేక, పరమానందములో నెలకొనుటయే కాక, ప్రపంచమున కంతయు సుఖజీవనములగును.

మూడవ తంత్రము సమాప్తము

ఓం తత్సత్

సర్వం శివార్పణమస్తు

# నాల్గవ తంత్రము

## 1. అజపః

అజప: జపించకుండానే ప్రాణన (శ్వాస)తో చేరి వృత్తి చేయు మంత్రమగును. దీనిని ప్రణవ మంత్రమని, జ్ఞానమంత్రమని పిలవబడుచున్నది. శ్వాస గాలి "హ" అను శబ్దముతో నిశ్వాసగాను "స" శబ్ధముతో ఉచ్ఛ్వాసగాను జరుగుచున్నది. ఈ అజప మంత్రమును అన్ని ప్రాణులు జపించుచున్నవి.

884. మహా ప్రసిద్ధియైన శివజ్ఞానమును నాయందు (నా చిత్తమునందు) పదిలపరుచు కొంటిని. మనస్సునందు జగన్నాయకుడు అగు పరమశివుని పాదపద్మముల తోడుతో వెలసితిని. సురక్షితమగు శివయోగ తత్త్వమును మీకు బోధపరచుదును గాక!! మహామహుడైన పరమశివుని ఏకాక్షర మంత్రమును జపించుచున్నానే!! (ఏకాక్షర మంత్రము: "ఓం"=అ+ఉ+మ్ అక్షరముల కలయిక. ఈ ప్రణవమును తలంచుట, భావించుటయే తప్ప జపించుటకు కానందున "అజప"గా పిలువబడినది. ప్రణవమే జ్ఞానముగాను, జ్ఞానమును పొందదగు తత్త్వముగా నున్నదని ఎరుగవలెను.)

885. 'అకారము'మగు ఏకాక్షరముతో జగత్తంతయూ వ్యాపించి, అది తానై నెలకొనగా, 'ఉకారము'తో రెండు అక్షరములతో శరీరములో శివశక్తిగా ఇమిడి, మూడవ అక్షరమైన 'మకారము'తో ఉత్పన్నమైన మహాజ్యోతిగాను, మాయ వలన మత్తుతో కప్పబడినట్లు చేసినదే!! (అకారము: జాగ్రదావస్థ; ఉకారము: స్వప్నావస్థ; మకారము: సుషుప్తావస్థ; సుషుప్తి అవస్థలో మనస్సు లయమైపోవును. ఈ మూడు అవస్థలు దాటినదే **తురీయం**. ఇది అక్షరము లేనిది, అమాత్ర, నిశ్శబ్దం, శూన్యం, ఆనందస్థితి, నిర్గుణస్థితి, అధిష్టానం. ప్రణవమే ప్రపంచసృష్టి, స్థితి, లయ కారణమగును.)

886. దేవతలు వెలుగొందు స్థానమే ప్రకాశమండలము. అది శిరస్సున కుడిభాగమున ఇమిడియున్నది (భ్రూమధ్య స్థానముగా చెప్పబడినది). దేవాదిదేవుడు ఇమిడియున్న స్థలమే చిదాకాశ ప్రకాశమండలము. అదియే చిత్+అంబరము=చిదంబరము. జ్ఞానము ప్రకాశించు స్థలము. అదియే పరమశివుని జ్ఞానసభ.

887. ముందు చెప్పబడినట్లు దేవాదిదేవుడైన పరమశివుని జ్ఞానసభయందు (బంగారు వన్నె గల జ్ఞానసభలో) జీవుల ఉన్నతి కొరకు ఐదురకములైన నాట్యభంగిమలు చెప్పబడినవి.

అద్భుత తాండవము: జీవులందు బుద్ధిని నింపి సృష్టించు నాట్యము.

ఆనంద తాండవము: జీవులకు ఆనందమొసగు నాట్యము.

అనవర్త తాండవము: జీవులలో శ్వాసను నింపి, తానే ఆధారముగా ఇమిడి చేయు నాట్యము.

ప్రళయ తాండవము: జీవులకు ప్రతిరాత్రి నిద్రను కల్పించి విశ్రాంతినొసగు నాట్యము.

సంహార తాండవము: జీవులను పరిపక్వమొనరించి తనలో లయమొనర్చుకొను నాట్యము.

888. ఈ తాండవము (నాట్యము) మహాద్భుతమును ఏర్పరచునది ఏకాక్షరమైన ఓంకార ప్రణవమే అగును. అది ఆది అంతము లేనిది. సకల జీవరాశులకు శుభమొన గూర్చునది. ఇది అనుగ్రహమును మొదటి కార్యముగా కలిగి అన్నీ చేయుచున్నది. అదే అన్నిటికీ మేలైన శివపదము అగును. ఈ నాట్యమును బంగారు ఆకాశములో (పొన్+అంబళము) చూడనగును.

889. ఆది అంతములేని శివతత్త్వమే (పరమేశం) మహాప్రకాశములో వెలుగొందు పరంజ్యోతి తత్త్వరూపిగా జగత్తంతటా ఇమిడి వ్యాపించియున్నది. అదియే ప్రణవ కరణములైన అకార, ఉకార, మకారముగా యుండి సృష్టి, స్థితి, లయ కారణముగా ఉన్నది. ఆ పరంజ్యోతియే అన్ని తత్త్వముల నొసగునదై, తనకు వేరేదియు ఆధారముగా లేక, తనకు తానే ఆధారముగాను ఉండి అన్నిటిని చైతన్యపరచు చున్నది.

(శివుడు అండ చరాచరములన్నిటికీ ఆధారముగాను, అన్నిటికీ అతీతముగాను ఉండి వృత్తులు చేయుచున్నాడు.)

890. అండ చరాచరములన్నింటిలోని జీవరాశులకు ఆధారభూతముగా నుండి ఆది అంతములేని ఆ శివతత్త్వము, జీవరాశులలో **నమశివాయ**గా ఇమిడి, మూలాధార చక్రములో దాని చుట్టూ యున్న అగ్నిమండలములో **నమవాశియ**గాను దేహము చుట్టూ యున్న సూర్యమండలములో **నవాశియ** అనియు, శరీరమును దాటి యోగస్థితిలో చంద్రమండలములో ప్రకాశరూపముతో **యవాశి** అనియు మంత్ర బీజాక్షరములను గలిగియున్నది.

(అన్ని జీవరాశులలో ఇమిడియున్న శివతత్త్వమగు **నమశివాయ** అబీజాక్షరములు. మూలాధారములో అగ్ని మండలము చుట్టూ **నమవాశియ**గా (నాభి) స్వాధి, మణిపూరములో సూర్యమండలము చుట్టూ **నవాశియ**గా అనహత, ఆజ్ఞా

చక్రములు దాటి చంద్రమండలము చుట్టూ **యవాశి**గా బీజాక్షరములు గలదని చెప్పబడినది.)

891. బ్రహ్మాది దేవతలు జీవాత్మలయందు బుద్ధి, భావన తగ్గట్లే వారిలో బంధము ఏర్పరచుట, బంధముల నుండి విడిపించుట చేయుదురు. ప్రణవములోని **అకారము** శివుని తత్త్వము, **ఉకారము** శక్తి తత్త్వమగును. ఈ అకార ఉకార తత్త్వములు ఒక్కటిగా కలిసి చంద్ర సూర్యకళల ద్వారా పరమునందు లయమగునపుడు తత్త్వములకు అతీతముగా వెళ్ళి శివగతి పొంది బ్రహ్మానందము గలుగును!! (ఆత్మ శ్రేష్టమగు పరమునందు లయమైనపుడు అన్ని చేష్టలు వీగిపోయి శివగతి యగు పరమానందము గలుగును.)

892. ఆనందమునొసగు అ, ఉ, మ కారములగు మూడక్షరములు బుద్ధియగు నాదబిందుతో కలిసి ప్రణవమగును. ఇక శికారమును న, మతో కలవనీయక ఆత్మతో ఇమిడినట్లు చేసినచో శివానందము పొందదగునని అందరికీ తెలియదు. ఈ **శివాయ** అను తత్త్వము ఎరిగినవారికి శివుడు ఆనంద నాట్యకారుడనియు, వాని ఆనంద నాట్యమును కూడ దర్శించనగును. (నాదము=శబ్దము; బిందు=ప్రకాశము).

(మూలాధారం – ఓం – విఘ్నేశ్వరుడు అధిదేవత
స్వాధిష్ఠానం – న – బ్రహ్మ అధిదేవత
మణిపూరకం – మ – విష్ణువు అధిదేవత
అనాహతం – శి – రుద్రుడు అధిదేవత
విశుద్ధి – వా – మహేశ్వరుడు అధిదేవత
ఆజ్ఞా – య – సదాశివుడు అధిదేవత

**న, మ** అక్షరము విడిచి **శివాయ** బీజాక్షరములతో శివతత్త్వం ఎరుగగలరు, ఆనందమును పొందగలరు.)

893. యోగులు, జ్ఞానులు తమ అనుభవపూర్వకముగా గ్రహించిన దైననాదము (శబ్దము) బిందు (ప్రకాశమును) తమ సహస్రదళమందున్న బ్రహ్మరంధ్రమున గ్రహించగలరు. ఓంకారముతోనైనను, పంచాక్షరితోనైనను నాద, బిందు వెలుగు గురుమండలమే అగును. ఈ తత్త్వమును విశదీకపరుచునదే **సంహార తాండవము**. ఇది త్రికోణ రూపములో సహస్రారదళమందు నెలకొనియున్నది.

(పంచాక్షరీ యోగమగు **శివాయ** అజపమగునపుడు ప్రణవము పుంజుకొని నాద, బిందుగా సహస్రారదళమున నెలకొనును. అన్ని జీవరాశులలోని షట్చక్రములలో ఈ ప్రణవము, పంచాక్షరి నెలకొని వృత్తులు చేయుచున్నవి.

894. ఇట్లే సదాశివమూర్తి ద్వారా అనుగ్రహించబడిన ఈ వేదతత్త్వములన్నియూ శైవసిద్ధాంత తత్త్వములకు ఎటువంటి భేదము లేక చెప్పబడిన ఆగమములగును. ఇట్లే శివగతితో మిక్కిలి అనుభవపూర్వకమగునపుడు అన్ని బంధములు వీగిపోవును. శైవ ఆగమములో చెప్పబడినది కూడా ఈ సత్యవాక్యములే అగును. ఇదే అందరూ చేరవలసిన గమ్యముగా (శివగతి), సద్గతిగా, అమూల్యమైన (నిర్మలము) శివముగా ఉన్నది.

(శివ వ్యాపకమునందుండుటచే అన్ని బంధములు తొలగిపోవును. అమలము-నిర్మలమైన శివగతి. నిర్మలమైన శివగతిని పొందు తత్త్వమునే ఆగమములు చెప్పుచున్నవి.)

895. నిర్మలమైన శివమే పతి, పశు, పాశములకు తారకమగును. నిర్మలమైన శివమే తిరోధానంనకు (మరిపించియుంచుట - ఆవరణశక్తిగా సత్యమును కప్పియుంచుట) ఆనందమునకు తారకము. నిర్మలమైన శివమే అహంకారము, మాయ, కామ్యకర్మలకు తారకమగును. నిర్మలమైన శివం నెలకొనియున్నది - సంహార తాండవము చేయుటలోనే!!

(పతి-దైవం; పశు-జీవులు; పాశము-బంధములు, సంసారము, అనాత్మ తత్త్వములు, అజ్ఞానము; తిరోధానం-జీవులలో సత్యమును తెలియనీయక జ్ఞానమును మరిపించి యుంచుట. సంహార కారణమైన శివుడే అమలమునకు తారకమగును. అన్ని మలములు వీడిన స్థితియే అమలము (నిర్మల శివం).)

896. ఆ శివమే అన్నిటికీ నాయకుడుగా నిలిచియున్నాడు. ఆ శివమే తన ఉనికికి మహా పర్వతముగా నెలకొనియున్నాడు. ఆ శివమే అన్నింటిలోనూ కలిసియున్ననూ, తన తత్త్వము క్షీణించక వెలుగొందుచున్నాడు. ఆ శివమే తనకు తానే అధిష్టానముగాను ఉన్నాడు.

(శివుడే శ్రేష్టమైన నాయకుడుగాను, తన్ను శరణు పొందినవారికి అనుగ్రహము పారించిననూ తనకు ఎటువంటి క్షీణత లేక యున్నాడు.)

897. జీవులలో ప్రాణమును నెలకొల్పుటలో నాయకుడైనది ఆ నిర్మలశివుడే. వాటినన్నిటిని మోయగలిగి, ఆధారముగానున్న నాయకుడు శివుడే అగును. సహస్రదళములో జ్ఞానమును నొసగు నాయకుడు కూడా శివడే అగును. సూర్యచంద్రులకు కూడ తన పాదపద్మములను నొసగిన నాయకుడగును.

(నిర్మలమైన శివుడే జ్ఞానమును నొసగి, తన పాదపద్మములను లోకక్షేమమునకు నొసగిన నాయకుడగును.)

898. పోల్చుటకు వీలుకాని ఆతని పాదపద్మముల రూపమే అకార, ఉకార,

మకారములతో పంచాక్షరియైన న, మ, శి, వా, యతో అష్ట అక్షరములుగా (8) ఉన్నది. ఆ పాద పద్మములే జీవులలో దశవిధ వాయువులుగాను (10), జీవులలో 51 రేకులతో కూడిన షట్చక్రములలో 51 యోగనాడులుగా ఇమిడి, ఏడువేల (7000) మంత్రములకు మూలముగాను ఉన్నవి.

899. ఏడువేల మంత్రములన్నియూ మూలముగానున్న ఇరువది (20), ముప్పది (30) బీజాక్షరములన్నియూ చివరన ఏడు అక్షరములతో ముగియునవే అగును. ఏడువేల మంత్రములన్నియూ లెక్కలేనన్ని భేదములుగా విభజించియున్నవి. ఏడు అక్షరములతో అంత్యములుగా నున్నవన్నియూ రెండుతో నాదము (శబ్దము), బిందుగా (ప్రకాశముగా) ముగుయును.

(ఇరువది, ముప్పది బీజాక్షరములు ప్రాణశక్తితో కూడినవి. ఇవి షట్చక్రములో ఇమిడి యున్నవి. ఏడు అంత్యములుగా ఉండి ముగుయుచున్నవి. "నమః, సువహా, స్వాహాః, వషట్, వౌషట్, హూం, హూంపట్" అను ఏడు ముగింపు అక్షరములగును.)

900. అజపమైన (ఉచ్చరింపనిది) ప్రణవమే ఏడువేల మంత్రబీజములుగా ఉన్నవి. ఇవే అన్నిటికీ ఆధారభూతముగా యున్నవి. ఇవి శివుని స్వరూపము అగును. అజపయే అన్నిటిలోను ఇమిడి తానైయున్నది. అజప మంత్రములుగాను, మంత్రవస్తువులుగాను యున్నది.

901. తనను ఎవరూ ప్రేరేపించక తనకు తానే నాట్యమును ఆడును. తానే అకారము, ఉకారముగా నెలకొని, తననుండి లోకసృష్టి కొరకు శక్తిని విడిగా ప్రేరేపించును. తానే "హ్రీం"కార తత్త్వముగా, మహామాయని ప్రేరేపించి, పంచకృత్యములను నెలకొల్పి, తన నాట్యమును కొనసాగించును.

("ఓం" అను ప్రణవము శివశక్తి విభజన కాని తత్త్వము. "హ్రీం" అనునది పంచ కృత్యములగు – సృష్టి, స్థితి, తిరోధానం, లయ, అనుగ్రహము – కొరకు ఐదుగురుకి (బ్రహ్మ, విష్ణువు, రుద్ర, మహేశ్వర, సదాశివ) పనులను అప్పగించి తాను వేరై యుండుట – శక్తిని లోకకళ్యాణార్థమునకు వినియోగించుట.)

902. శివుని నాట్యములలో ముఖ్యమైనది రెండు విధములు. అవి – 1) అద్భుత తాండవము – జీవులలో బుద్ధిని నింపి సృష్టించునది. 2) సంహార తాండవము – జీవులను పరిపక్వమొనరించి తలో ఐక్యపరచుకొనునది. ఈ రెండు నాట్యములను సమముగా అనగా సుఖముగాని, దుఃఖముగాని లేక శివతత్త్వమే ప్రణవముగా తలంచి శివలింగమునే మూర్తిగా భావించియున్న యోగులు, జ్ఞానులకు ఈ తాండవము మంచి ఫలితములు నొసగును. వారి రాగి వంటి

శరీరము బంగారముగా మారి ప్రకాశవంతమగునే!!

903. "శివాయనమ" అను దివ్య అక్షరముల ఉపాసనచే రాగిగా యున్న శరీరము (మలములు వీగిపోయి) బంగారువలె తయారగుటయే కాక, జీవాత్మ యొక్క మలములగు అహంకారం, కామ్యము, మాయ వీగిపోయి పరిశుద్ధి పొందును. అప్పుడు బుద్ధిపూర్వకమైనది పరమున అమరును. "శ్రీం", "క్రీం" అని జపించుట వలన కూడ శరీరము బంగారుగా మారును. రాగి బంగారుగా మారునట్లే శివతత్త్వము ప్రాణములో ఇమిడి ప్రాణదోషము వీడిపోయి శివాకారమగును. (ముందు మంత్రములో నెం. 892 చెప్పినట్లు "న,మ,శి,వా,య" అను షట్చక్ర స్థానముల బీజాక్షరములలో "నమ" వదిలి క్రిందయున్న శక్తిని విడిచి పై ఆధారములో నున్న శి,వా,య అక్షరముల ఉపాసనచే శివతత్త్వము పొందనగును. "శివాయనమ" ఉపాసనతోనైనను లేక శ్రీం, క్రీం ఉపాసనతోనైననూ మలదోషములన్నియూ నివర్తి యగును. "శ్రీం, క్రీం" శక్తి యొక్క బీజాక్షరములగును.)

904. తిరువంబళము (తిరు+అంబళము) అగు (దివ్యచంద్రుడు) శ్రేష్టమైన చక్రమున, నిలువుగా ఆరుగీతలు, అడ్డముగా ఆరుగీతలు గీచినచో, ఇరువది ఐదు గళ్ళు (25) ఏర్పడును. ఆ ఇరువది ఐదు గళ్ళలో పంచాక్షరములను సక్రమముగా నింపి ఉపాసన చేయవలెను.

| | | | | |
|---|---|---|---|---|
| శి | వా | య | న | మ |
| మ | శి | వా | య | న |
| న | మ | శి | వా | య |
| య | న | మ | శి | వా |
| వా | య | న | మ | శి |

905. **శివాయనమ, శివాయనమ** యని నిర్విరామముగా జపించి ధ్యానించువారికి ఇక పునర్జన్మ యుండదు (ముక్తి పొందుదురు). ఇట్లు ధ్యానించుచూ వచ్చిన యెడల దైవము యొక్క శ్రేష్టమైన ఆనంద నాట్యమును కూడ చూడనగును. ఇట్లే నిర్విరామముగా జపించినచో, అన్ని మలములు తొలగిపోయి శరీరము బంగారుచాయగా మారిపోవును.

(**శివాయనమ** నిర్విరామముగా జపించుట వలన జన్మరహితమగుటయే కాక పరమానందమును కూడ పొందగలరు.)

906. **శివాయనమ** అను బంగారువంటి మంత్రమును పెదిమల ద్వారా ఉచ్చరించక, శ్వాసతో జపించవలెను. ఇట్లు జపించుట వలన శ్వాసతో వాయువు శరీరమంతటికి ప్రాకి పంచేంద్రియముల ప్రజ్ఞలన్నీ శుద్ధి చేయబడి, సాధకుని యొక్క శరీరమే శివుని యొక్క పాదపద్మములగును.

(పొర్పాదము=శివుని బంగారు పాదములు.)

907. బంగారు పాదపద్మముల దర్శనము లభించును. పంచాక్షరి (శివాయనమ) జపించుట వలన ఉన్నతమైన ఆచార్యుడుగా అయి, శిష్యబృందము ఏర్పడును. శివానుగ్రహముతో శిష్యుల మలదోషములు కూడ నివర్తి అగును. బంగారు పాదపద్మములను దర్శించదగు నిర్మల దేహమగును. దివ్య పాదపద్మముల నాట్యమును చూచుటకు నిర్విరామముగా ఈ మంత్రరాజమును జపించండి. (శివజ్ఞానము పొందదగు ఆలోచనలతో చిత్తము మారిపోవును.)

908. శివుని బంగారు పాదపద్మములు దర్శించినవారు శ్రేష్టమైన మరొక శరీరములో కూడ ప్రవేశించి, అందుకూడ సుఖము పొందగలరు. వీరు వశీకరత్వము పొందియుండుట వలన వీరు అందరిని ఆకర్షించగలరు. వీరు చెప్పినంత మాత్రమున లోకులకు వారి ఆశాబంధములు తొలగిపోవును. ఇవియన్నియు దివ్యనాట్యమును దర్శించిన సూక్ష్మములగును.

909. సూక్ష్మమైన ఈ మంత్రరాజమును మానసికముగా వెయ్యిసార్లు జపించినచో, శ్రేష్టమైనది, బహుసున్నితమైనది సహస్రారదళమున నెలకొన్నదానిని దర్శించనగును. సూక్ష్మములైన వాసనా రూపములుగా పదిలమైన పూర్వజన్మ కర్మఫలములను తొలగించవచ్చును. సూక్ష్మమైన శివానందము వృద్ధియగును. (వెయ్యిసార్లు మానసిక జపము వలన గిట్టు ఫలములు: పూర్వజన్మ కర్మఫలములు నశించుట మరియు శాశ్వతానందము పొందుట.)

910. జీవుని సహస్రారదళమును దాటి శివునితో ఏకమగునపుడు ఏర్పడునదే ఆనందము, ఆనందము. ఇట్లు శివుని సమిష్టి తత్త్వముతో జీవుని వ్యష్టి తత్త్వము కూడినది విడదీయరాని తత్త్వమగును. పంచభూతములు ఆధారచక్రముల ద్వారా "ఆ,ఈ,ఊ,ఏ,ఓ" - అను అక్షరరూపముతో నెలకొనియున్నది. ఈ ఐదు బీజాక్షరములన్నియు నాదాంతమున (శిరస్సున) నెలకొనుట వలన మరింత ఆనందమగును. ఈ ఐదు బీజాక్షరములే శబ్ద, రూపమగునపుడు షట్చక్రములు దాటి శిరస్సున "అం, హ్రీం, హం, క్షం, హాం"గా వెళ్ళునపుడు మహానందము ఏర్పడును.

(మూలాధారం-పృథివి-ఆ; నాభి-జలం-ఈ; హృదయం-అగ్ని-ఊ; కంఠము-వాయు -ఏ; భ్రూమధ్యము-ఆకాశము-ఓ;

ముందుగా ఉత్పన్నమైనవి: "అ,ఇ,ఉ,ఎ,ఒ" కారములు శివుని తత్త్వములు

తరువాత ఉత్పన్నమైనవి: "ఆ,ఈ,ఊ,ఏ,ఓ" కారములు శక్తి తత్త్వములు

పై రెండును సమిష్టిగా శివుని యందును, వ్యష్టిగా జీవుని యందును నెలకొని శివ- శివుడు; శివా-శక్తిగా వృత్తులు సలుపును. "అం"=శివబీజము;

"హం"=శక్తిబీజము; "హ్రీం"= మహామాయ; "క్షం, హాం" అనునవి భ్రూమధ్యమున నెలకొన్న హాకినీ, మోహినీ బీజములు).

911. స్థూలశరీరము, సూక్ష్మశరీరము ఒకదానితో ఒకటి విరుద్ధముగాక, ప్రకాశ మండలముల ద్వారా ప్రకాశమును పొంది ఎటువంటి వికారములు లేక నిలుచుండుట వలన స్థూల, సూక్ష్మ శరీరములు రెండును "ఊ–ఆ–ఈ–ఏ–ఓ'' గా నిలిచి, అవి రెండును "ఈ–ఓ–ఊ–ఆ–ఏ"గా నొప్పారునదే దివ్యనాట్యమగును (శివానంద తాండవము).

(ముందు మంత్రములో చెప్పినట్లు ఆధారములలోని బీజాక్షరములలో శ్వాసజపము చేసినచో (అజప–పెదవితో ఉచ్ఛారణ చేయనదిగాదు)

| **ఆధారస్థానము** | **పంచభూతములు** | **ఆధారబీజాక్షరము** | **అధిదేవత** | **పంచాక్షరి** |
|---|---|---|---|---|
| 5. భ్రూమధ్యము | ఆకాశము | ఓ | సదాశివం | య |
| 4. కంఠము | వాయువు | ఏ | మహేశ్వరం | వా |
| 3. హృదయం | అగ్ని | ఊ | రుద్రుడు | శి |
| 2. నాభి | జలము | ఈ | విష్ణువు | మ |
| 1. స్వాధిష్టానం | పృథివి | ఆ | బ్రహ్మ | న |

చంద్రకళ (శ్వాసజపం) హృదయమును తాకి (ఊ) స్వాధిష్టానంను (ఆ) చుట్టి, నాభి కమలము (ఈ) తాకునదగును (ఊ,ఆ,ఈ). అధోముఖ చలనం సూర్యుడు నాభి నుండి "ఈ,ఊ,ఏ,ఓ" ఆధారములను తాకుతూ ఊర్ధ్వముగా వెళ్ళునది, ఊర్ధ్వముఖ చలనం చేసి ఆధారములను దాటి శిరస్సునందు సహస్రారదళములో ఐక్యము చెందుట. శ్వాసజపముతో జీవుని ఆత్మ, శివునితో సహస్రమున నెలకొని పరముతో తదాత్మ్యము చెందుట. దీనిని స్థూలము, సూక్ష్మములగు బీజాక్షరముల సహాయముతో విరుద్ధము కాక, వికారములు లేక నెలకొనుటగా, జీవుడే శివంమగుటయని చెప్పబడినది.)

912. 904 మంత్రములో అమరిన పంచాక్షరి బీజాక్షరములను గైకొని ఆయాధారములలోని బీజాక్షరముతో అజప–శ్వాసజప చేయుటతో శివతత్త్వమగు పంచాక్షరియూ, శక్తి తత్త్వమగు దీర్ఘాక్షరముల మహిమానిత్వము పొందనగును. స్థూల ఆధారములలోనే సూక్ష్మములగు బీజాక్షరములు ఇమిడి శివతత్త్వమును పొందుటగా చెప్పబడినది.

అగ్నితత్త్వముతో మొదలిడి ప్రకాశజ్ఞానము పొందునది: శివాయనమ – ఊ,ఏ,ఓ,ఆ,ఈ

వాయుతత్త్వముతో మొదలిడి ప్రకాశజ్ఞానము పొందునది: వాయనమశి – ఏ,ఓ,ఆ,ఈ,ఊ

ఆకాశతత్త్వముతో మొదలిడి ప్రకాశజ్ఞానము పొందునది: యనమశివా – ఓ,ఆ,ఈ,ఊ,ఏ

పృథివితత్త్వముతో మొదలిడి ప్రకాశజ్ఞానము పొందునది: నమశివాయ – ఆ,ఈ,ఊ,ఏ,ఓ
జలతత్త్వముతో మొదలిడి ప్రకాశజ్ఞానము పొందునది: మశివాయన – ఈ,ఊ,ఏ,ఓ,ఆ
ఈ శ్వాసజప చేయుటచే నాదమే ప్రకాశముగా మారి శివతత్త్వము సిద్ధించును.

913. దైవము యొక్క నాట్యమే జగత్తుకు స్థితికారణమగుచున్నది. ఈ నాట్యమే పంచాక్షరి వివరణలతో ప్రకాశము పొందుచున్నది. ఏకముగా నున్నది ఆకాశభూతము, రెండుగా ఉన్నది వాయుభూతము (ఆకాశతత్త్వం+వాయుతత్త్వం), మూడుగా నున్నది అగ్నిభూతము (ఆకాశ+వాయువు+అగ్ని తత్త్వముతో కలిసియున్నది) ఈ మూడును దైవము యొక్క నాట్యమునకు తగ్గట్లు చలనము చెంది ఆకాశములో ప్రకాశముగా వెలుగొందుచున్నది. ఇట్లగుటచే పృథివి, అప్పు (జలం), అగ్ని, వాయు, ఆకాశభూత అణువులు, బిందు, నాదము అణువులు మొత్తము ఏడును పై మూడింటి ప్రకాశములో కలిసి ఆడుట, శివుడు ఏకముగాను, తానే శక్తి, నాదం, బిందు, శతాఖ్యం, మహేశ్వరం, రుద్రుడు, విష్ణువు, బ్రహ్మ మొదలగు తొమ్మిది తత్త్వములతో చిద్+అంబరములో – చిదాకాశములోని ఎర్రని ప్రకాశములో మాణిక్య నాట్యమాడెనే!!

## 2. తిరువంబళ చక్రము

చిదాకాశములోని మహాప్రకాశమండలములో ఆనంద నాట్యము చేయు దైవము (శివుడు) శక్తితో కలిసి మంత్రాక్షరములుగా నెలకొనియున్న చక్రమగును.

914. ఈ చక్రములో పన్నెండు దీర్ఘగీతలు అడ్డముగా, నిలువుగా గీచినచో మొత్తము 11 గదులు నిలువుగాను, 11 గదులు అడ్డముగాను ఏర్పడి మొత్తము 121 గదులుగా అమరును. వాటిని మంత్ర అక్షరములతో మారిమారి నింపుటచే మధ్యన నున్నది శివుడు నెలకొని శివాగ్రమైన 'శి' కారమగును.

915. శివుని తత్త్వములో నెలకొన్న బీజాక్షరం – మంత్రాక్షరము 'శి'కారమగును. తాను ఇమిడిపోవుటకు తగిన అక్షరములు 'వయనమ' నాల్గక్షరములగును. నాలుగు మూలలలో తన అధీనములోనున్నది తన పంచాక్షరములగు **శివయనమ** అగును. అన్నింటా విడివిడిగా ఉన్ననూ అన్నియూ తనకు చెందినవిగానే నెలకొనియున్నది. (చక్రము కేంద్రభాగమున మరియు అన్ని మూలలలోను, దిక్కులలోను తన శివతత్త్వమే నెలకొని అన్నిటికీ కవచముగా యున్నది.)

916. **హరహర** నామమును సాధన చేసినవారికి అన్నియూ తమకు అనుకూలమగును. ఇట్లు శ్రేష్టమైయున్ననూ మనుజులు **హరహర**ను జపించి ఫలితము పొందలేదు. జపించినవారు శాశ్వతమైన ప్రకాశమును పొందగలరు. మరియు కర్మఫలితములు లేనందున పునర్జన్మ రహితమగును.

917. నా నాయకుడు (శివుడు) నెలకొనియున్నది పైన చెప్పబడిన చక్రములోని నాలుగు దిక్కులలో, నాలుగు మూలలలోను మరియు కేంద్రము (మధ్యన)గాను ఉన్నాడు. ఈ ఎనిమిది (దిక్కులు + మూలలు) లోను ఓంకారముతో (అ+ఉ+మ)తో **శివయనమ** కలిపి అష్టముగా నెలకొని, పదునాలుగు భువనములను పాలించు శివశక్తిగాను, ఉపాసకుని సహస్రారదళమున (శిరస్సు) నాదం (శబ్దము) బిందు (ప్రకాశము)గా నెలకొని, మంత్రము **వాక్రూపి**గా సిద్ధి నొసగును.
(బాహ్య, అంతరమున ఈ చక్రపూజ వలన ఉపాసకునికి సిద్ధి లభించును.)

918. జీవులకు తమలో సహస్రదళ పద్మమున (వెయ్యి తామరరేకులు పోలినది) దైవము శివశక్తిగా నెలకొని వీక్షించుచున్నదానిని ఎరుగజాలరు. తిరువంబళ చక్రములో తెలుపబడినట్లు బహిర్గతము కాని **ఓంకారము**, బహిర్గతమైన **శివయనమ** (చక్రములో వ్రాయబడినది) ఒకటిగా చేర్చి మనశ్శుద్ధితో ఉపాసన చేసిన సాధకులకు వారి సహస్రదళ పద్మం వికసించి మరణము లేని అమృతసిద్ధి పొందుదురే!!

919. తిరువంబళ చక్రములో తెలుపబడిన పంచాక్షరి మంత్రము వలన ఆ చక్ర ఉపాసనయే సాధకునకు దేవాలయమగును. స్థూలముగా అమరిన దేవాలయములో సూక్ష్మముగా అమరిన ప్రకాశములో శివుడే నెలకొని అనుగ్రహించును.
(స్థూలముగా అమరిన పంచాక్షరి బీజాక్షరములు శరీరములో నెలకొనినది. ఓంకారము+పంచాక్షరి మంత్రోపాసనచే శిరస్సున నెలకొనునది ప్రకాశము. ఇది సూక్ష్మమైనది. ఈ స్థానము శివుని దేవాలయమగును.)

920. 904వ మంత్రము చెప్పబడినట్లు ఆరుగీతలు నిలువుగా, అడ్డముగా గీయుటచే ఏర్పడిన ఇరువదిఐదు (25) గళ్ళలో పంచాక్షరములను నింపుటచే ఏర్పడిన చక్రరాజము వలన సిద్ధించునది ఆధారచక్రములలో బీజాక్షరముల ఉపాసనతో ప్రాణశక్తి మూలాధారమునుండి పైకి ప్రాకి ఆయా ఆధారముల బీజాక్షరములను తాకి, వాటిని కలుపుకొని సహస్రారమున ప్రకాశము పొంది బ్రహ్మరంధ్రమును చేరుకొనుటకే చెప్పబడినది.

921. "మకార" స్థానము నాభికమలము. "ఓ+అ+ఉ" కారములు నెలకొనియున్న స్థానము భ్రూమధ్యము. న,మ – స్వాధిష్టానం, మణిపూరకంలు – అధోముఖ తత్త్వములు. కావున "శి,వా,య" స్థానములగు ఊర్ధ్వతత్త్వముల సహాయముతో స్వాధిష్టానమునుండి ప్రాకిన అపానము 'న'కారముతో కూడినదై కంఠములో నెలకొనియున్న 'వ'కారముతో కలిసి భ్రూమధ్యము దాటి శిరస్సునందు లయ

మొందుటచే సూక్ష్మమైనది ఇమిడిన దేహమే శివాలయముగా మారిపోవును. (గురుముఖముగా దీక్ష పొంది, సాధన చేసినచో సాధకునకు దేహమే శివాలయముగా మారిపోవును.)

922. ప్రణవమును ఆజ్ఞాచక్రములో నిలుపుకొని ఇరువైపుల శివాగ్నులతో రెండు కళ్ళతో చూడండి. అది చలనమును ఏర్పరచి సాధకుని నోట్లో నెలకొనును. అపుడు కొండనాలుకలో ఒక విధమైన రాపిడివంటి చర్య ఏర్పడునదే "న,మ,శి,వా,య" యగును. పిదప అది వృద్ధి పొంది శిరస్సు అంతటిని ఆవరించి ప్రకాశవంత మగునది 'శివాయనమ' అను, ప్రణవయోగమగును.

(శిరస్సు చుట్టూ ఆవరించి వ్యాపించునదే సోమవృత్తము (చంద్రవృత్తము)గా పిలువబడు "శివాయనమ"యగును.)

923. 904వ మంత్రము చెప్పినట్లు తిరువంబళ చక్రములోని 25 గళ్ళలోనున్న "నమశివాయ"ను అక్షరములను మార్చిమార్చి ఉపాసన చేయు విధానము.

శివాయనమ

మశివాయన

నమశివాయ

యనమశివా

వాయనమశి

ఈ చక్రములో 'శి'కారముతో మొదలిడి 'శి'కారుతో ముగుయునట్లు అమరును.

924. 904వ మంత్రము చెప్పినట్లు తిరువంబళ చక్రములోనున్న 25 గళ్ళలో "న,మ,శి,వా,య" మార్చిమార్చి నింపిన పిదప ఒక్కొక్క గదిలోను రెండేసి అక్షరములతో నింపినచో 25 గళ్ళలో 50 అక్షరములు నెలకొనును. దానిని చుట్టూ ఓంకార అక్షరముతో పెద్దదిగా వ్రాసి దానిని మధ్యభాగమున "క్షం" అక్షరముతో నింపిన మొత్తము 51 అక్షరములగును. ఇది ఆరు ఆధారములోని బీజాక్షరములకును, గ్రంథఅక్షర వర్ణమాలకు పోల్చబడినది.

(ప్రాచీన ద్రావిడభాష యొక్క అక్షరములు తెలుపబడినవి. ప్రస్తుత తెనుగు అక్షరములకు పోల్చబడలేదని సవినయ మనవి.)

925. 924వ మంత్రములో చెప్పినట్లు 25 గళ్ళలో 51 అక్షరములు నింపిన పిదప, దానిచుట్టూ మూడు వృత్తములు గీసి, బాహ్య (కడపటి) వృత్తములో "హరహర" అని, మధ్యవృత్తములో "హరిహరి" అని, లోపలి వృత్తములో "హంసం" – అజప మంత్రంను "హంసం, సోహం"గా రాసి, చక్రం గీతల కొసలందు త్రిశూలము గీయవలెను.

926. ఇట్లు గీసిన పిదప చక్రం గీతల కొసయందు గీసిన ఒక్కొక్క త్రిశూలముపై శక్తిబీజ మంత్రమైన "హ్రీం" వ్రాయవలెను. పిదప ఒక్కొక్క త్రిశూలము మధ్య భాగమున పంచభూతములను గుర్తించునదైన "అ,ఇ,ఉ,ఎ,ఒ" ఒక్కొక్క అక్షరముగా చుట్టూ వ్రాయవలెను. పిదప లోపలి వలయమునకు ముందుగా "అ,ఇ,ఉ,ఎ,ఒ" అక్షరములన్నిటిని రక్షించునట్లు మొత్తం చక్రముపై పెద్ద "ఓం"కారము గీయవలెను. ఈ తిరువంబళ చక్రస్థానమే అండచరాచరములకు నాయకుడైన శివుడు నెలకొను స్థానమగును.

927. 926వ మంత్రములో చెప్పినట్లు త్రిశూలములకు మధ్యభాగమున వ్రాయబడిన అకార, ఇకార, ఉకార, ఎకార, ఒకార పంచాక్షరములే శివుని నివాస స్థానముగా అమరును.

928. 926వ మంత్రములో చెప్పినట్లు ఈ "అ,ఇ,ఉ,ఎ,ఒ"కార అక్షరములు శివుని పంచాక్షరములగు "శివాయనమ"కు ఆధారభూతమైనవి. కావున దీనిని నిష్ఠతో ఉపాసన చేసినచో సాధకునకు సంపత్తు కలుగును.
(శివతత్త్వ సిద్ధియూ లభ్యమగును.)

929. సక్రమముగా ఈ తిరువంబళ చక్రము యొక్క పూర్తి ఫలము పొందవలెనను ఉద్దేశ్యములో నా గురునాధుడు పంచభూతముల యొక్క రూపము, వాటి బీజాక్షరముల క్రియలను పంచాక్షరి మంత్రముతో వ్రాయబడిన గళ్ళలోనే నింపవలెనని, కలిపి ఉపాసన చేయవలెనని ఉపదేశించియున్నాడు.

| | | | |
|---|---|---|---|
| 1. పృథివి (భూమి) | – చతురస్రము | □ | లం = యనమశివా |
| 2. అప్పు (జలం) | – నెలవంక | ◡ | వం = వాయనమశి |
| 3. తేయు (అగ్ని) | – త్రికోణం | △ | రం = నమశివాయ |
| 4. వాయువు | – షట్కోణం | ✡ | యం = మశివాయన |
| 5. ఆకాశం | – వృత్తము | ○ | హం = శివాయనమ |

(ఈ చెప్పబడిన పంచభూతముల యొక్క బీజాక్షరములు పంచభూతాత్మకమైన శరీరములగు జీవరాశిలో (అక్షరములగుట ముందే) రూపసహితముగా వాటిలో నెలకొని వృత్తులు చేయుచున్నవని గ్రహించవలెను. ఆ రూపములనే చక్రములో పదిలపరచి లోకకళ్యాణార్థము ఉపాసనకు నిర్దేశించబడినది.)

930. తిరువంబళ చక్రములో చెప్పబడిన 51 అక్షరములలో (ద్రవిడభాషలోనున్న) 48వ అక్షరము (చక్రపటమును చూడగలరు) అగు "స"కారముతో 6వ అక్షరమగు "ఊ"కారము చేర్చినచో "స+ఊ=సూ" అగును. "స"కారముతో 14వ అక్షరమగు "ఔ"కారము చేర్చినచో "స+ఔ=సౌ" అగును. 'సౌ'కారము శక్తియొక్క బీజాక్షరము.

నాదము బిందు అగు “ఓం”కార మంత్రముతో “శివాయనమ”ను జోడించి “ఓం సౌ శివాయనమ” అని జపించిన వారికి ముమ్మలములు (అహంకారము, కామ్యము, మాయ) అన్నీ తొలగిపోవునే!!

931. 930వ మంత్రములో చెప్పినట్లు “సౌ” మంత్రాక్షరములో శివుడు కూడ అకార రూపములో నెలకొనియున్నాడు. ఉమాదేవి (శక్తి) కూడ ఆ అకారములోనే నెలకొని యుండును. ఈ విధముగా శివశక్తులు ‘‘ఈశానం’’లో నెలకొని లోక కళ్యాణార్థమునకే అని పుణ్యశీలురు మాత్రమే గ్రహించగలరు.

(ఈశానం: శిరస్సు వెనుక మెదడు భాగములో అ+ఉ కారములు చేరిక వలన ఉత్పన్నమైన నాదఘోషను పుణ్యశీలురైన సాధకులు మాత్రమే గ్రహించగలరనుట.)

932. ముందు మంత్రములో చెప్పబడినట్లు ఈశాన దిశయందు చేరి అచ్చట “హర” అను శివాగ్నిని రగిల్చి, “హరి” అను జ్ఞానలింగము నెలకొని నిలుచును. మకారము కంఠమున నున్న విశుద్ధి చక్రమును దాటి సుషుమ్న మార్గమున గొంతుక పై భాగమున ప్రాణవాయువు ప్రాకిపోవునది గ్రహించినచో “ధంధం” అను నాట్య శబ్దముతో ప్రకాశుడైన నాట్యకారుడుని (శివుడు) చూడనగును.

(హరి–నీలవర్ణ–పరాశక్తి, హర–శివుడు. శివశక్తులు రూపం యోగసాధనతో శిరస్సునందు ప్రకాశరూపములో దర్శనమగుట.)

933. ముందు మంత్రములో చెప్పినట్లు శివలింగము ఏర్పడుటలో “హంసం” అక్షరముల ద్వారా గుర్తించబడిన లోకవస్తువులన్నియూ ఈ సూక్ష్మరూపములో ఏర్పడియున్నవి. ఇట్లు కారణ రూపముగా నున్నదానిని ఎవ్వరు గుర్తించడము లేదు. ఇట్లు కలిసియున్నవని ఎరిగిన వారికి శక్తితో నెలకొన్న శివంగా కాక, ఏకముగానున్న సదాశివుడుని గ్రహించగలరు.

(“హంసం” అన్నిటలో ఇమిడియున్నదని గ్రహించవలెను.)

934. తిరువంబళ చక్రమును ఏకాగ్రతతో ధ్యానించువారికి వారి మదిలో పంచాక్షరిని దైవము ఆకారముగా కలిగియున్నాడని, ఐదు అక్షరములలోనే తాను ఇమిడి యున్నాడని, హరి, హర చక్రముగాను, ఐదు అక్షరముల సూక్ష్మరూపముగాను తాను నెలకొన్నాడని గ్రహించగలరు.

శి, వా, య, న, మ – గాను

అ, ఇ, ఉ, ఎ, ఒ – గాను

హరి, హర, హం, సం, హ్రీం – గాను

అ, ఉ, మ, నాద, బిందు – గాను

అన్ని ఈ ఐదు అక్షరరూపములలోనే దైవము నెలకొనియున్నాడు.

935. దివ్యనాట్యమాడు నాట్యకారుని (శివుడు) దర్శించుటకు ఎన్నో మార్గములున్నవని మాట్లాడుకొన్ననూ, వానిని నామములలో మొదటి అక్షరమును (శి కారము) ఉచ్ఛరించినవారు ఆతనిని (శివుని) అనుసరించి వెళ్ళినవారగుదురు. ఇదే ఆ నాట్యకారుని దర్శించదగు సులభమార్గమగును.
('శి'కారమే శరీరములోని శివాగ్నిని రగిల్చి జీవులను ముక్తిమార్గమునకు దారి చూపునది. శివతత్త్వమగు ఆ అగ్ని ప్రకాశము, శివుడు వేరువేరుగాదని, ఒక్కటే అని గ్రహించవలెను.)

936. అకారముగా నెలకొనియున్న మూలాగ్నిని (మూలాధారములో నెలకొనియున్నది) రగిల్చి అందు నెలకొనియున్న 'న'కారమును గ్రహించి, దానినుండి జనించు శూలాగ్నిని సాధకులు వృద్ధిపరచి నలుదిక్కులందును వ్యాపింపజేసి, అందులో మరిగియున్న శివుడుని గ్రహించి తనలో ఆతనిని పదిలపరచుకొనవలెను.
(రచయిత తాను శివుడుని పదిలపరచుకొంటినని చెప్పుచున్నారు. చక్రము ద్వారా "నమశివాయ" మంత్రమును ధ్యానించువారికి మరిగియున్న శివుడు బహిర్గతమై అనుగ్రహించును.)

937. మూలాధార చక్రములోని కుండలీని శక్తి (మూలాగ్నిని రగిల్చి) లేపినచో, అది తనంతట అనుగ్రహము నిచ్చును. ఆ శక్తి పైకి వెళ్ళు (సహస్రదళమునకు) మార్గమున తానే ఇచ్చిన శక్తితో 'మ'కారమును జపించినచో ('మ'కారము–అర్ధ మాత్ర ప్రణవము) తానిచ్చిన కొండంత ప్రకాశము శిరస్సున వెలుగొందును.

938. కొండంత ప్రకాశమగు శివం ఉత్తరదిక్కున (శిరస్సు ఎడమభాగమున) వెలుగొందునపుడు, ఆ ప్రకాశము ఇంద్రదిశయగు దిగువభాగమున అనగా ముఖమునందు ప్రతిఫలించెను. ప్రతిఫలించిన ప్రకాశము 'శి'కారము వలన ఏర్పడిన అగ్నితత్త్వమైన శివుడే కావున రత్నమువలె ఎర్రనైన ప్రకాశముగా నాకు దర్శనమిచ్చెను.
(శివుడు రచయితకు ఎర్రనైన ప్రకాశముగా ముందూ, వెనుకగా దర్శనమిచ్చెనని చెప్పుచున్నారు.)

939. తానే (ఇతరులతో ప్రేరేపింపబడక) పరిపక్వమొందిన అర్హులకు (శివయోగులకు) చల్లని జ్వాలగా దర్శనమిచ్చును. తానే (ఇతరులచే బోధింపబడని) వేదముగా, జ్ఞానముగా నెలకొనును. తానే (ఎవ్వరు నేర్పని) ధర్మబద్ధతతో కూడిన మంత్రోచ్చారణగాను (ముందు మంత్రములలో చెప్పిన "న,మ,శి" కారముల వలన) నెలకొని, తానే (ఇతరులు ఎరుగకుండా) మరిగియుండి అన్నియూ అర్హులగు శివయోగులకు అనుగ్రహించువాడగును.

940. శివమహాతత్త్వము (నాదమును ఆకారముగా గలవాడు)ను పొందగోరువారు, శివపంచాక్షరియైన "న,మ,శి,వా,య" ఉపాసనతో, ఆ పంచాక్షరియే శివస్వరూపముగా మారి ఉపాసకులకు అనుగ్రహించి, ఎత్తిన ఈ జన్మమునందే శివమహాతత్త్వమును పొందగలరు!!

941. ముందు మంత్రములలో చెప్పినట్లు పంచాక్షరియే శివుని రూపముగా మారుననునది: శరీర అమరిక పంచాక్షరియే అగును.
'న'కారము స్వాధిష్టానము మొదలు పాదముల వరకు.
'మ'కారము మణిపూరకము - నాభిస్థానము మొదలు ఉదరము వరకు.
'శి'కారము అనాహతము - చాతి నుండి భుజముల వరకు.
'వా'కారము విశుద్ధి - కంఠమునుండి నోరు వరకు.
'య'కారము ఆజ్ఞా- భ్రూమధ్యముల నుండి శిరస్సు బ్రహ్మరంధ్రము వరకు.
("న,మ,శి,వా,య" మంత్రోచ్చారణ చేయు శివయోగులకు తిరువంబళ చక్రము ద్వారా శివుని దర్శనమగుటయే కాక, వారి పరిపక్వత వలన వారి ఆత్మలో 'య'కారముగా - ప్రకాశంగా శివుడు నెలకొనును.)

942. ముందుగా చెప్పబడిన తత్త్వములను గ్రహించి రెండుగాను, మూడుగాను ఉన్న పంచాక్షరిని తత్త్వములనెరిగి ఉపాసన చేయువారికి నందీశ్వరుడు (శివుడు) వారిలో నెలకొనును. "ఓ"కారమును గ్రహించి ప్రకాశములో నెలకొని ధ్యానించువారికి అండ చరాచరములలో నాదముతో కూడిన అన్నింటా వ్యాపించి దర్శనమిచ్చునే!! (రెండుగా, మూడుగా అన్నది: పంచాక్షరిలో మొదటి రెండు అక్షరములు "న,మ" **విడువదగినది**. "శివాయ" అను మూడు అక్షరములు **తీసుకోవలసినది**గా చెప్పబడినది. పంచాక్షరియే రూపముగా గల దైవమును ప్రణవముగా (ఓంకారం) ధ్యానించినవారికి నాదముగా నెలకొని అనుగ్రహించును.)

943. ప్రణవము యొక్క నాదము అండచరాచరములలో వ్యాపించియున్నది. అన్ని జీవరాశులలో ఇది ఇమిడి, వారికి సమస్తము ఒనగూర్చునది. పూర్వజన్మ కర్మ ఫలితములు శత్రువులవలె ఇచ్చిన అజ్ఞానమును పోగొట్టునది. శ్రేష్టమైన ఈ ఓంకారమును దీక్షతో ధ్యానించుదురు గాక!!

944. శ్రేష్టమైన ప్రకాశమును ప్రణవయోగముతో ఏర్పరచి, ఆ ప్రకాశమండలమే తానని గ్రహించి ఏర్పరచి, సుషుమ్నలో వెలుగొందు ప్రకాశమే నందీశ్వరుడని (శివుడని) గ్రహించినవారు చిదాకాశ మహాప్రకాశ మండలమును దర్శించి పరమానందము పొందినవారగుదురు.
(ప్రతి జీవునిలో వెలుగొందు ఆత్మయే ప్రకాశముగా, జ్యోతిగా, కాంతిగా,

చైతన్యముగా నున్నదని గ్రహించి, దానిని గురుముఖమున దీక్షతో గ్రహించి, ప్రణవయోగము ఉపాసించువారికి శివుడు వారి ప్రకాశము దర్శింపజేసి మహానందము ఏర్పరచును.)

945. ముందు మంత్రములలో చెప్పిన తిరువంబళ చక్రములో పంచాక్షరియూ అందమైన శ్రేష్టమైన ఆధారచక్రములలోని ఐదు స్థానములో వర్ధిల్లి, యాబదిఒక అక్షరములగు అచ్చులు, హల్లులు ఆధారచక్ర స్థానములో ఇమిడియున్న తరుణమున శివ మహామహుడు శ్రేష్టముగా ప్రకాశముతో నెలకొనునే!!

946. పరమైనది పంచాక్షరి **శివాయనమ**. దాని మధ్యమున "య" కారము, శివాయనమ అనునది మార్చిమార్చి ఉపాసన చేయవలెననునది. "శివా–దేవి; నమ–దైవం; య–ఆత్మ; సూచించును.

య, న, వ, శి, మ
మ, వ, య, న, శి
శి, య, న, మ, వ
వ, శి, మ, య, న

మంత్రము యొక్క ఉన్నతమైన తత్త్వమును గ్రహించవలెను.

947. పంచాక్షరి అక్షరములే పంచభూతములను పరిపాలించునవి. అందు న–పృధివి; మ–నీరు; శి–అగ్ని; వా–వాయువు; వ–ఆకాశం; అందు నెలకొన్న అక్షరములే వాటి రూపములుగానున్నవి. సరైన ఒక పద్ధతిపై నెలకొన్న అక్షరరూపములే శివుని ఆకార, స్వరూపముగా నెలకొనును.
(941వ మంత్ర వివరణలో చూడగలరు.)

948. చిదాకాశములో నెలకొనియున్న నాదమయమైన చక్రము - జగత్తంతటికీ వ్యాపింపగల సామర్థ్యము గలది. అట్లే "చిత్"గా ఒప్పారు తిరువంబళ చక్రమునే స్థానముగా చేసుకొని మరిగి ఉండు లోకనాయకుడగు శివుడు, లేగదూడకు ఆవు తన పాలను ఇచ్చునట్లు, ఉపాసకుని (శివయోగ ఉపాసకులు) శిరస్సున నిలచి సత్ఫలితమగు అమృతమును (పరమానందమును) ఇచ్చును.
(జగత్తంతటికి వ్యాపించునది: చక్రములోని మంత్ర బీజాక్షరములే పదములై, పదములే వాక్యములై, వాక్యములే భావనలై, జగత్తంతయూ నాద (శబ్దరూపముగా) రూపముగా వ్యాపించి నెలకొనునది.
నాదము = సూక్ష్మరూపమైన శబ్దము – అంతరమున నెలకొనునది.
శబ్దము = స్థూలరూపమైనది – బాహ్యముగా నెలకొనునది.
అట్లే బిందు = సూక్ష్మరూపమైన ప్రకాశము – దేహాంతరమున నెలకొనునది.

జ్యోతి, వెలుగు = స్థూలరూపమైన ప్రకాశము – బాహ్యముగా గ్రహించబడునది.)

949. శిరస్సున వెలుగొందుచున్న "చిత్" సభలో ఏర్పడు సద్గుణములలెన్నో. చక్రములో రూపములుగా నెలకొన్నవారు బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు – ఐదుగురు. ఈ చక్రములో నెలకొన్నది నాట్యకారుని (శివుని) సూక్ష్మ పంచాక్షరియగు ప్రణవము, స్థూల పంచాక్షరియగు "న,మ,శి,వా,య" అగును. నాట్యకారుని నాట్యము కూడ ఈ చక్రములోనే తాండవము చేయుచున్నది.

(చక్రములో నెలకొన్న పంచభూతముల గుణములు (తన్మాత్రలు): పృథివి–గంధము (వాసన); అప్పు–నీరు–రుచి; తేయు–అగ్ని–రూపము; వాయువు–స్పర్శ; ఆకాశము–శబ్దము మొ॥)

950. చిదాకాశ మహాప్రకాశ మండలముగానున్న సహస్రదళ పద్మమున 'ఉ'కారము (934వ మంత్రములో వివరణ)తో చుట్టబడిన అగ్నితత్త్వము నెలకొని యున్నది. మూసుకు పోయియున్న సహస్రదళమును వికసింపజేసి, ఊర్ధ్వముగా చూడగలుగునట్లు చేయునది కాలా కొమ్ము. ఈ చర్య వలన శిరస్సున నాదబిందు తేటనైన జ్ఞానము పొందజేయునది శివమంత్రమే అగును.

(గురుముఖముగా నేర్వవలసిన యోగసాధన: దీక్ష పొంది, క్రమపద్ధతిలో సూర్యచంద్ర కళల శ్వాసాభ్యాసముచే, ప్రణవ ఉపాసనచే, అగ్ని, సూర్యచంద్రుల కలయికచే, సహస్ర దళపద్మమును నిటారుగా చేయగలిగిన ఉపాయము ఈ శివమంత్రముతోనే లభించును.

కాలాకొమ్ము: ప్రణవ ఉపాసన – ఓంకారతత్త్వము – విఘ్నేశ్వరుని కొమ్ము (దంతము)తో చీకటియను అజ్ఞానమును పారద్రోలి, జ్ఞానమను ప్రకాశమును నింపునదే – కీడును తొలగించి మంగళమును (శుభమును) ఏర్పరచునదే ఈ ప్రణవ ఉపాసనమగును.)

951. రెండు కళ్ళకు మధ్య భ్రూమధ్యమున – అకార, ఉకార, శికార మధ్యమున, వకార స్థానము – విశుద్ధి చక్ర సహాయముతో ఆరు ఆధారములు దాటి శివాగ్నిలో నెలకొని ధ్యానించు వారికి ప్రణవ నాయకుడైన (ఓంకారము) సదాశివమూర్తి కోరివచ్చి అచ్చట నెలకొనునే!!

(అకారము–ఎడమకన్ను–చంద్రాగ్ని; ఉకారము–కుడికన్ను–సూర్యాగ్ని; శికారము–భ్రూమధ్యము–శివాగ్ని; వకారము–విశుద్ధి స్థానము; మూలాధారములో మొదలైన మూలాగ్ని ధ్యానముచే (మూలవాయువు) ఆరు ఆధారములు దాటి సహస్ర దళము చేరుకొని ప్రకాశవంతమగుటచే అచ్చట సదాశివమూర్తి నెలకొనును.)

952. శరీరభావన దాటి వెళ్ళి, అకారమగు చంద్రకళలో నెలకొన్న వారికి, చంద్రకళ ద్వారా చిదాకాశ ప్రకాశమండలములోని తత్త్వమును బోధపరచుటకై, జీవాత్మలలోని ప్రాణ దోషములగు అజ్ఞానమగు చీకటిని పారద్రోలి ఎర్రనైన ప్రకాశస్వరూపుడు (శివుడు) వెలుగొందును. అతనే తన శక్తితో దోషములను నివర్తింపజేసి బంగారు వలె మార్చగలిగిన గుళికయగును.

(ప్రణవ నాయకుని దర్శనముచే జీవులలోని దోషములు నివర్తియగును. గుళిక: రసాయన గుళిక – బంగారు, రాగి, ఇత్తడి, ఇతర లోహములలో కిలుము (దోషములు) తొలగించి శుద్ధిచేయు రసాయన ప్రక్రియ. అట్లే శివుడు జీవులలో నెలకొని ముమ్మలములను తొలగించి పరిపక్వమొనర్చి శుద్ధిచేయును.)

953. ప్రణవ ధ్యానముతో (ఓంకారములోని "అ+ఉ+మ" కారముల "అజప" ఉపాసన చేసినవారికి) దాని ఫలితములను తెలుపుట. అకారముతో శివజ్ఞానము, ఉకారముతో శక్తిజ్ఞానము, మకారముతో అగ్ని ప్రకాశము నొసగునదైన ఆచార్య బోధచే గురు మండలమును పొందునది. పరమేశ్వరుని యొక్క ప్రకృతి (పూర్ణం) అంశములోనిదే అగును. ఈ ఓంకార ఉపాసనతో సాధకునకు ముక్తికి సాధకమగును.

954. నీటిపై వ్రాసిన రాతలవలె ఈ లౌకికజ్ఞానము అశాశ్వతము. చిదాకాశ మండలము – ఆకాశములో నెలకొనియున్న ఓంకారమగు ఏకాక్షరమును గ్రహించువారు లేరు. ఎవరైతే ఈ ప్రణవమగు ఓంకారమును గ్రహించిరో వారు బ్రహ్మచే వ్రాయబడిన వ్రాతను కూడ మరలా పొందజాలరు. అనగా లోకములో మరలా పుట్టజాలరు.

(ప్రణవయోగము గ్రహించి ఉపాసనచేయు శివయోగులకు ఇక పునర్జన్మ ముండజాలదు.)

955. సుషుమ్నలో నెలకొన్న శివుడు ఇడనాడి (చంద్ర), పింగళ (సూర్య) నాడులతో కూడి సమ్మేళనమై శరీరములో యాబది (50) అక్షరములతో ఆరు ఆధారములలో వ్యాపించి యున్నాడు. శిరస్సు మధ్యమున ఓంకారము నెలకొనునపుడు ఈ 50 అక్షరములు వీగిపోవును. వేదశ్రేష్టమని కొనియాడిన ప్రణవమగు ఓంకారమును శిరస్సు సహస్ర దళమున నెలకొనునపుడు సాధకునకు శివుడి ముక్తి నొసగి అనుగ్రహించును!!

(శివయోగులకు శివుడే సహాయకారిగా యుండి ముక్తి నొసగును.)

956. నకారమునకు దిగువన (నకారము – స్వాధిస్థానము – పృథివి స్థానము) అనగా మూలాధారమున ఓంకారమను అక్షరము కలదు (మూలాధారస్థానము – విఘ్నేశ్వరుడు – ప్రణవం – ఓంకారము నెలకొన్న చక్రము). ఈ అక్షర

మహిమలను పాపులు ఎరుగజాలరు. ఆ బ్రహ్మదేవుడు కూడా ఎరుగజాలడు. ఆ అక్షరములో దేవియు, శివుడు శ్రేష్టముగా నెలకొనియున్నారే!!
(ఆధార చక్రములోని అధిదేవతలు - 892వ మంత్రము చూడగలరు.)

957. "హంసం" ఒక మంత్రము-అజప-ఒక రక్షణ మంత్రము-కవచము లాంటిది. హంసం మంత్రము మహామంత్రమని ఎవ్వరూ ఎరుగజాలరు. "హంసం" మంత్రమును గ్రహించినవారు అది శరీర ఉత్పత్తికి పూర్వమే "అనాది"గా యున్నదని గ్రహింతురు (ఔ+సౌ=హంసంగా చెప్పబడినది).
("హంసం"-మూలాధారములో త్రికోణముగా గలది. ఇది అజపగా - ప్రణవముగా - సూర్యకళ, చంద్రకళల ఉచ్ఛ్వాస, నిశ్వాసలుగా శ్వాసచర్యలుగా, ప్రాణరక్షణగా, అన్ని ప్రాణుల శ్వాసలో ఇమిడి "అనాది"గా ఉన్నదని చెప్పుట.)

958. ప్రసాదకళయగు చంద్రకళ ద్వారా శరీరములో మూలాధారములో ఇమిడియున్నదానిని పైకి లేపుట. అది నీ నాభి స్థానములో అగ్నితత్త్వముగా ఉదయించుచున్నది. ఉదయించునది సంధ్యాదేవి. సంధ్యావందనములు చేయువారు సూర్యకళ, చంద్రకళల ప్రభావితము చేయు వేళలను తెలియనివారే. సంధ్యాదేవిని పూజించునట్లు బాహ్యముగా ఆహార్యములు చేయువారు దాని సత్యమైన ఫలమును జారవిడచినవారే అగుదురు.
(శరీరములో ఏర్పడు సూర్యకళ, చంద్రకళల ప్రభావితము గ్రహించక, బాహ్యముగా వ్యవహరించి ఫలితములను జారవిడుచుచున్నారే అని రచయిత వాపోవుచున్నారు.)

959. "హంసం" మంత్రము-అజప-ఉపాసన వలన శరీరము అన్ని దిక్కులకు వెళ్ళదగు సామర్థ్యము పొందును. ఇది మూలాధార చక్రములో మొదలిడి, అన్ని ఆధారములలో ఇమిడి ప్రాణతత్త్వమగుచున్నది. ఇది ప్రకాశ (కాంతి) రూపకము కావున ఇక వచ్చునది, వెళ్ళునది లేవు. ప్రకాశమును తలంచి ధ్యానించు వారి ప్రాణముతో కలిసి, పంచేంద్రియములగు మదపుటేనుగును అణగద్రొక్కు అంకుశముగా మారును.
(అజప ధ్యానము వలన పంచేంద్రియములన్నియూ వశపడి ఎచ్చటకైనను సంచారము చేయు సామర్థ్యమును పొందనగును.)

960. కంటికి గోచరము కాని ప్రజ్ఞగా అంతరిక్షములో ఏర్పడునది నాదము. అట్లు ఏర్పడి నిలచిన శబ్దముతో కూడినది ప్రకాశమైన బిందు. ఆత్మయైన 'య'కారము, 'శి'కారముగా అయి, రెండుకళ్ళ మధ్యభాగమును ధ్యానించువారికి ప్రణవము, దాని ప్రభావితముతో శ్రేష్టముగా వెలుగొందును.

961. శిరస్సున ఉత్తరభాగమున - ఎడమవైపు మెదడు భాగమున ప్రకాశము, శబ్దము

ఏర్పడినచో, పరమాకాశములో మహా ప్రకాశముతో నిండిపోవును. ఉపాసించుచున్న మంత్రమే ప్రణవమే వారికి ఆహుతిగా మారును.
(దీక్షతో ఉపాసించు ప్రణవ మంత్రమే ఉపాసకుని యజ్ఞమునకు ఆహుతిగా మారును. యజ్ఞములో సమర్పించు హవిస్సుగా మారును.)

962. ఆరు అక్షరములను జపించుటకు (ఓం, న, మ, శి, వా, య) తెలిసినవారు దాని వలన పొందదగు నిజమైన స్థితిని ఎరుగజాలరు. పంచాక్షరిని ధ్యానించుటలో ఏకాక్షరమగు ఓంకారమును ఉద్భవింపచేయజాలరు. ప్రణవ అక్షరముతో వేరే అక్షరమును చేర్చక, ప్రణవ విద్యను ఎరిగినవారు ఆ ప్రణవముతోనే ప్రాణతత్త్వ వివరణను పొందగలరు. – ప్రణవ విద్య–మౌనవిద్య–అజప అగును.

963. అక్షరములకెల్ల మొట్టమొదటి అంగములైన అచ్చులు పదిహేనును (15), ప్రాచీనమైన అక్షరములలో హల్లులు ముప్పదిఐదును (35) కలియుటచే అవి యాబది (50)గా అయినవి. జ్యోతిని ఏర్పరచునదైన 'అ'కారకళలో మిగతా అక్షరములన్నియూ సూక్ష్మముగా ఇమిడియున్నవి. నాద అక్షరమగు 'ఉ'కారమును దానితో చేర్చి గ్రహించవలెను.

964. బిందు నుండి నాదము ఆకాశమండలములో ఉద్భవించి స్పందన ఏర్పరచును (అకారమే–బిందు–ప్రకాశము). ఆ స్పందనలో అది 16 కళలతో వెలసిల్లినది శక్తి యొక్క అంశమే అగును. ఆ శక్తియే మెడ, చేయి, కాలు, శరీరభాగములుగా అయినవి. ముగింపులేని యాబదిఒక్క అక్షరములుగాను (తిరువంబళ చక్రములో చెప్పబడిన శక్తి అంశము) అవే కరణములుగాను ఏర్పడినవి.

965. తిరువంబళ చక్రములో చెప్పబడిన ఆ యాబది (50) అక్షరములే వేదములుగా ఉన్నవి. ఆ యాబదియే ఆగమములుగాను ఉన్నవి. ఈ యాబది అక్షరముల ద్వారా గ్రహించబడుదైనది ప్రణవమే అని గ్రహించిన పిదప అదే శివస్వరూపమైన పంచాక్షరి అగును.
(వేద ఆగమములను గ్రహించినవారు శివస్వరూపమగు పంచాక్షరిని గ్రహించిన వారగుదురు.)

966. పంచాక్షరియైన "న,మ,శి,వా,య"తో పంచభూతములగు పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము ఉద్భవించినవి. ఈ పంచాక్షరితో అండచరాచరములు ఉద్భవించి, సకల యోనులు (సకల జీవరాశులు) పుట్టినవి. అంతటా వ్యాపించిన జగత్తుకు ఈ ఐదు అక్షరములే వాటికి ఆధారశక్తిగానున్నది. ఈ ఐదు అక్షరములే అన్ని జీవరాశులలో నెలకొని వృత్తులు చేయుచున్నది.
(శివుని పంచాక్షరియే అన్ని భూతములలో, అన్నిటికీ ఆధారముగాను, అన్ని

జీవులలో ఇమిడి రక్షించుచున్నది. శివుడు అన్నిటిలో తానే నెలకొని సహాయకారిగా యున్నాడని గ్రహించవలెను.)

967. వికర్తయైన (వైవిధ్యము గలవాడు) దైవము యొక్క తిరునామమును (పంచాక్షరిని) చిత్తమునందు పదిలపరచుకొని నిర్విరామముగా జపించువారికి, నాయకుడైన జటాధారి (శివుడు) వారి ఆత్మలకు అంటియున్న పూర్వజన్మ కర్మవాసనలను తొలగించి, వాటివలన ఏర్పడిన తాపములను పోగొట్టి, "నాతో రండని" తనతో తీసుకువెళ్ళును.

968. నిర్విరామముగా సాధన చేయు శివయోగులకు శివపంచాక్షరి భుజించుదగ్గ అమృతముగాను, క్షీణతలేని కాలస్వరూపుడుగాను, ఇంపైన సంగీతముగాను, అందు జనించు గానముగాను, ఊర్ధ్వలోకస్తులు స్తుతించదగ్గ పాదపద్మములుగాను, లెక్కకు అందని అక్షరములుగాను నున్నది ఈ పంచాక్షరి రూపమైన "న,మ,శి,వా,య" మంత్రమే అగును.
(పరిశీలించి చూచినచో అన్నియూ శివతత్త్వమగు పంచాక్షరియే శివుడు. శివుడే అక్షరరూపముగా నెలకొనియున్నాడు.)

969. అంతటా వ్యాపించిన జగత్తుగా దర్శనమిచ్చునది "నమశివాయ" అను ఐదక్షరముల మహత్త్వమే. దేవాలయముగా నెలకొనియున్నది కూడ పంచాక్షరి యొక్క శ్రేష్టతత్త్వమే. ధర్మనియతితో ధర్మమార్గములో వెళ్ళునీయునది కూడా పంచాక్షరియే. పంచభూతములలో నెలకొని వాటిని పాలించువాడుగాను ఉన్నది - శివుడే.
(దేవాలయముగా నెలకొనియున్నది: ఆలయ గర్భగృహం-'శి'కారము; అర్ధ మండపము-'వ'కారము; నందిపీఠము-'య'కారము; శివుని (నటరాజుని) బంగారుసభ-'న'కారము; బలిపీఠము-'మ'కారమని ఆగమములు చెప్పుచున్నవి.

970. చెట్టుకు తల్లివేరువంటిదగు ఓంకారముగా (అకారము, ఉకారములుగా కలిసి) ఆకాశతత్త్వమగు నాదముగా నెలకొనియున్నాడు. జలతత్త్వమగు 'మ'కారముగా, పృథివితత్త్వమైన 'న'కారముగా అందు నెలకొనియున్నాడు. శ్రేష్టమగు 'శి'కారము అగ్నితత్త్వముగా, ప్రాణతత్త్వమైన 'య'కారముగా, ప్రణవస్వరూపునిగా, అఖండ జ్యోతిగా శివుడు నెలకొని పాలించుచున్నాడే!!
(అన్ని భూతములలో తాను నెలకొని, తానే అన్ని భూతముల అక్షర రూపములో అండచరాచరములను పరిపాలించుచున్నాడు శివుడు.)

971. "నమశివాయ" పంచాక్షరిలో నాల్గవ అక్షపమైన 'వ'కారము శక్తి అక్షరము-శక్తి యొక్క కార్యము మాయ-మాయ నుండే జగత్తు సృష్టించబడినది. 'వ'కారములోనే ఈ జగత్తంతయూ లయమగును. నాల్గవ అక్షరమగు 'వ'కారము జపించువారికి

అదే శ్రేష్టమైన తత్త్వమునకు దారిచూపును.

('వ'కారము-శక్తి అంశము-శక్తి కార్యము మాయ-మాయ నుండే జగత్తు ఉద్భవించినది-శక్తియే జగత్తుకు ఆధారపమై, జీవులకు సన్మార్గమును చూపును. కావున లయక్రమానుసారములో జీవులన్నీయు జగత్తున లయమై, జగత్తు మాయలో లయమై, మాయ శక్తిలో లయమగును. చివరకు శక్తి కూడ శివుని (పరమేశాం-పరబ్రహ్మం)లో లయమగును.)

972. ముందు మంత్రములో చెప్పినట్లు శివశక్తి మంత్రమగు 'వ'కార ఉపాసనతో నా చిత్తమున ఎల్లప్పుడు, నిర్విరామముగా నెలకొనునట్లు చేసుకొంటిని (రచయిత). ఆ ఉపాసనను కోరి శక్తి అందులో నెలకొనినది. 'నమశివ' సత్ఫలితముచే మనమందరము శివశక్తులకు బానిసలమని ఎరుగుటచే, నా లోకబంధములన్నియూ వీగిపోయినవి. ఇక నా సంచలములన్ని తొలగిపోయి తేటనైన జ్ఞానము పొంద గలిగితిని.

(రచయిత తన భవబంధములన్నీ జ్ఞానము పొందుటచే తొలగిపోయినవని చెప్పుచున్నారు.)

973. జీవులు జీవించుటకు తగినట్లు ఆహారధాన్యములలో ఇమిడి అన్నమయముగాను, హోమగుండమువలె శరీరములోని జఠరాగ్నిగా నెలకొని అన్నము జీర్ణించుకొన దగిన శక్తిగాను నున్న జగన్మాత పరాశక్తి నామమే "నమశివ" అగును. ఈ ''నమశివ''ను నిర్విరామముగా ధ్యానించువారిలో తాను క్రియాశక్తి నాయకురాలుగా నెలకొని తోడుండి కాపాడునే!!

974. ఇట్లు నిరంతర ధ్యానముచే సత్ఫలితముగా శక్తిరూపిని ఇచ్చు బహుమానము నాయకుని మంత్రమగు "నమశివాయ" అను పంచాక్షరియే. దీనిని రాత్రి, పగలనక నిర్విరామముగా ధ్యానించు యోగులకు తిరువంబళ చక్రములోని మధ్య స్థానమైన 'శి'కార తాండవమును తమలో గ్రహించి, ఆ నాయకుడే (శివుడే) అష్టమూర్తిగా (8) నెలకొనియున్నాడని ఎరుగనగును.

(అష్టమూర్తిగా (8): శివుడు పంచభూతములైన పృథివి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశముగాను (5), సూర్య, చంద్ర, అగ్ని ప్రకాశములలో (3) తానేనని అష్టమూర్తిగా నెలకొని పరిపాలించుట.)

975. అకారము-ప్రాణముగా, ఉకారము-పరముగా (దైవము), మకారము-మలముగా ప్రణవము ఇట్లు మూడు పదములుగా వచ్చును. ఈ ప్రణవమగు ఓంకారములో "శివయ" కూడ ఇమిడియున్నది. శికారము-శివుడు, వకారము-వకారరూపిణి యగు శక్తి, యకారము-ప్రాణమయ జీవులను సూచించునది.

(మకారము–మలము: అజ్ఞానము, మాయ, బంధము, భ్రమ, అధ్యాస, ఆవరణశక్తి, మొ॥. 'అ,ఉ,మ' – వ్యష్టి ప్రణవము – జీవులలో. 'ఓం' (శివాయ) – సమష్టి ప్రణవము – జగత్తులో.)

976. భ్రూమధ్యమున నకారము, నుదుటియందు మకారము, కంఠమున 'అజప' శక్తియగు ఉచ్ఛ్వాస, నిశ్శ్వాసలలో ఇమిడ్చి, ప్రణవనాధుని సుషుమ్నలో ఇమిడ్చి, అగ్నికి ప్రతిరూపమైన శికారము–శివుడు, జీవుల నుండి వేరుగాక స్థితిపొంది యున్నాడు.

(అజప మంత్రమును (ఉచ్ఛ్వాస, నిశ్శ్వాస ద్వారా) చిత్తమునందు పదిలపరచుకొన్న వారికి శివుడు ఎప్పటికీ వారిలో నెలకొనియుండును.)

977. దేహమను అడవిలో ఐదు ఏనుగులను ఇంద్రియములు జీవించుచున్నవి. ఆ ఐదు ఇంద్రియములగు ఏనుగులను అణగద్రొక్కునది "నమశివాయ"యే అంకుశముగా అగును. ఈ ఐదు అక్షరముల తోడుతో ఏకమై అణగద్రొక్కు సామర్థ్యులకు ఐదు అక్షరములకు మూలమైన వానిని పొందనగును.

(పంచాక్షరి తోడుతో మదగజములుగా పేరుగాంచిన బలీయమైన ఇంద్రియములను వశపరచుకొనగలగినవారు ఆత్మతత్త్వమగు దైవమును గ్రహించగలరు.

| | పంచాక్షరి | పంచభూతం | తన్మాత్ర | కరణములు (గోళకములు) |
|---|---|---|---|---|
| 1. | య | ఆకాశము | శబ్దము | చెవి |
| 2. | వ | వాయువు | స్పర్శ | చర్మము/శరీరము |
| 3. | శి | అగ్ని | రూపము | కళ్ళు |
| 4. | మ | జలము | రుచి | నాలుక |
| 5. | న | పృథివి | వాసన | ముక్కు |

పంచాక్షరితోనే బలీయమైన ఇంద్రియవాసనలను వశపరచుకొనగలము.)

978. గురుముఖముగా దీక్షపొంది యోగసాధనలు అభ్యసించిన శివయోగులు మూలాధార అగ్నికళను శిరస్సున గల నాదబిందులతో చేర్చిన పిదప బాహ్య శరీరకర్మలిక అవసరము లేదు. నివృత్తి మొదలగు పంచకృత్యములు, మేధ మొదలగు చంద్ర అంశములైన పదహారు కళలతో చేరి శిరస్సున నెలకొనునపుడు, 'న'కారాదులను మార్చి, 'మ'కారాదులతో కూడి మూలపురుషునితో చేరి నాద, బిందు ప్రకాశములో నెలకొనువారికి బాహ్యకర్మలిక అవసరముండదు.

(పంచకృత్యములు: నివృత్తి–ఫలము నొసగునది. ప్రతిష్ట–మంత్రము స్థితి పొందుట. విద్యా–శక్తి పొందుట. శాంతి–శాంతము ఏర్పడుట, శాంత్యాతీతం–శబ్దము/ నాదములో ఇముడుట.

'న'కారాదులు: ఆధారచక్ర వరుసక్రమము తెలుపునది. న–స్వాధిష్ఠానం, మ–మణిపూరకం, శి–అనాహతం, వా–విశుద్ధి, య–ఆజ్ఞాచక్రములు తెలుపునది. నకార స్థానము: పృథివీ అంశము–కామాదులను, కాంక్షలను ప్రవృత్తిని పురికొల్పునది–వీడదగినవి.

'మ'కారాదులు: మ–నాభిస్థానము–స్థితి పొందునది–మకారముతో మొదలిడి శిరస్సుకు చేరుకొను నివృత్తి మార్గము. కామాదులను త్రోసిపుచ్చి స్థితిని పురికొల్పు మార్గమును ఎన్నుకొనవలెను.)

979. 'శి' అను శివునితో 'వా' అను అనుగ్రహశక్తితో 'య' అను ప్రాణము ఇమిడి యుండుటయే శ్రేష్టమగు శివభోగము, శివజ్ఞానమగును. మలములు, కామ్యకర్మలు వీగిపోయి ప్రాణులు పైన చెప్పిన మంత్రము (శివాయ లో) యొక్క దివ్యానుభూతిలో తేలియాడి తుదకు తావే శివపథము అగుటయే పరమపదమగును.

(ప్రాణశక్తి 'నమ'లను విడచి 'శివాయ'తో సహస్రదళమున నెలకొనుటయే చేరవలసిన శ్రేష్టమగు పరమపదము. అదే శివభోగము, శివజ్ఞానమగును. శివశక్తితో నెలకొనుటయే గమ్యము కావలెను.)

980. బహుశ్రేష్టమును ఒనగూర్చునదైన దివ్యపంచాక్షరి యొక్క సత్యజ్ఞానమును గ్రహించిన పిదప, మనస్సునందే పరము అపరమైన సదాశివుడు అనగా శివశక్తులు ఇమిడిపోవుదురు. నేను (రచయిత) చెప్పునదంతయూ సత్య పలుకులే. దేహమునకు ఇక క్షీణత యుండదు. శివుని శరణు పొందుటయే శివుని పొందు శ్రేష్టమైన మార్గమని నేను చెప్పుచున్నాను.

(శివుని శరణు పొందినచో, శరీరమునకు క్షీణత యుండజాలదు.)

981. 'శివాయ'తో + 'ఔ' (957వ మంత్రమున చెప్పినట్లు ఔ+సౌ) చేరుటయే చంద్రతత్త్వ ఫలముతో తేటనైన జ్ఞానమని గ్రహించవలెను. దీనితో శివానుగ్రహము పొందగలరు. చంద్రమండలములో (శిరస్సున) సత్యజ్ఞానమును పొందగలరు. (ప్రాణము నెలకొనియున్న నాద, బిందు స్వరూపములే ప్రణవమని గ్రహించవలెను.)

982. "శివాయనమ" పంచాక్షరిలో 'య' మధ్యస్థమును గ్రహించి, ప్రణవమగు సుషుమ్నలో ఇమిడియున్న 'ఓ' గ్రహించినచో, అజప మంత్రమునకు నాయకుడైన శివుడు వీరికి బహిర్గతమై నిలుచుండునే!!

('మ'కారములో అగ్నిగా వెలుగొందువాడు శివుడు, నాదమునందు నెలకొన్నవాడు శివుడు, అజపలో నెలకొన్నవాడు శివుడు, ఇడనాడి, పింగళ నాడులలో నెలకొన్నది శివుడే. అన్నింటా బహిర్గతమైనది శివుడే.)

983. ఇష్టకామ్యకర్మలు నెరవేరుటకు 'నమశివాయ' మంత్రమును జపించండి. అందు మూలపురుషుడైన రుద్రుడు (శి) అన్ని కర్మలు చేసి ముగించును. 'శి' కారమును తమయందు ఇముడ్చుకొని దానిని గ్రహించినవారికి సదాశివుడే వారికి తోడుండి అన్ని కార్యములు రుద్రునిచే చేయించి ముగించును.
('న' కారము-బ్రహ్మ; మ-విష్ణువు; శి-రుద్రుడు; వా-మహేశ్వరుడు; య-సదాశివుడు. 'శి'కారమున గల రుద్రుడు అష్టకామ్యకర్మలను చేయగలిగిన దైవమగును.)

984. సఖ్యతతో శివందు ప్రాణము ఇమిడినచో, ప్రాణము పరముగా మారును. శరీరమును క్షీణింపజేయు తపస్సులతో ఇక పనిలేదు. శివంలో తాను నెలకొనుటచే తను అనుగ్రహశాలియగును. ఆ శివమే తానన్న తేటజ్ఞానము ఏర్పడును.
(శైవసన్మార్గ శివతత్త్వములో శివసఖ్యతతో ఆత్మ నెలకొనునపుడు ఆ జీవాత్మయే 'పరము' అయి, శివుడే ఆ సఖ్యతను అనుగ్రహించి తన స్థితి నొసంగి ఐక్యపరచుకొనును. జీవాత్మ పరమాత్మ వేరుగాదని తానే నిరూపించుకొనును. సామీప్యము, సారూప్యం, సాలోక్యము, సాయుజ్యములలో ఇది సాయుజ్యస్థితి యగును. ఇది శుద్ధస్థితి = పరమునందు నిలుచుటచే అహంకారము, మాయ, కామ్యము లన్నియూ తొలగిపోయిన స్థితిగా పరమాత్మలో ఐక్యము పొందిన స్థితియగును.)

985. బాహ్యముగా వెదుకుచున్న దైవము తమలోనే ఉన్నదన్న సత్యమును సాధకులు ఎరిగి అకారము-ఎడమకన్ను, ఉకారము-కుడికన్ను భ్రూమధ్యమున చేర్చి ప్రణవమును ధ్యానించుటచే యకారమగు శివుడు అనుగ్రహించి వారి బుద్ధిలో జ్ఞానరూపుడుగా నెలకొని, ఇదివరకు పలు విధములైన ఆటంకములు కలిగించిన పంచేంద్రియముల చేష్టలను తొలగించి, సరైన తేటనైన జ్ఞానమును గ్రహించుటకు మార్గమును సులభము చేసెను.
(ప్రకాశములో మనస్సు లయమగుటచే పంచేంద్రియ చేష్టలు వీగిపోయి జ్ఞానమునకు సుగమమగును.)

986. ఎనిమిది, రెండు అను సంఖ్యలు మహానందమును నొసగునవి. దీనిని మూఢులు ఎరుగజాలరు. ఎనిమిది, రెండుగా ఉన్ననూ, ఆరుతో నాలుగును కలిపిన పది సంఖ్యయే అన్నిటికీ మూలమని శైవసిద్ధాంత సన్మార్గము తెలుపుచున్నది.
(శివుడు-అకారము-అష్టమము, మూడుగాను (బ్రహ్మ, విష్ణువు, రుద్రుడుగాను) ఐదుగాను పంచమూర్తులుగాను ఉన్నాడని చెప్పబడినది. అదే శివుడు జీవునిలో ఆరు ఆధారచక్రములలోను + మహేశ్వరం, సదాశివుడుగాను, బోర్లించిన సహస్రదళముగాను (లౌకికములో ఉన్నప్పుడు), వికసించిన సహస్రదళముగానూ (శివముఖముగా అయినప్పుడు) మొత్తము పదిలో నెలకొనియున్నాడని ఈ తత్త్వమనే

శైవసిద్ధాంతములో చెప్పబడియున్నది.

బిందు-ప్రకాశమండలము-మహేశ్వరుని మండలముగాను, నాదము-శబ్ద మండలము-సదాశివ మండలముగాను, శివతత్త్వములో చెప్పబడియున్నది.)

987. ఎనిమిది గీతలు నిలువుగాను, ఎనిమిది గీతలు అడ్డముగాను గీచినచో నలభై తొమ్మిది గళ్ళు (49) ఏర్పడును. దాని మధ్యగదియందు శివుని అక్షరమగు 'శి' కారము వ్రాసి మిగతా అక్షరములను మిగిలియున్న నలభైఎనిమిది గళ్ళలలో వ్రాసి పంచాక్షరిని జపించుదురు గాక!!

988. దానవులగు నైరుతి మొదలగు అష్టదిక్పాలకులు, భైరవులగు అష్టమూర్తులు, నంది మొదలగు అష్టశివగణాలు, ఈ మూడు విధములైన వారే మార్గదర్శకులగుదురు. వెలుపలి గదులలో వీరి బీజాక్షరములను నింపి, లోపలనున్న గదులలో పంచాక్షరితో కలిపి అకారము మొదలుకొని అచ్చులను నింపి, నాద, బిందు అక్షరములతో కూడిన ఈ సేనయే శివచక్రమగును.

(1. దానవులగు అష్టదిక్పాలకులు: 1) నైరుతి, 2) వరుణుడు, 3) వాయువు, 4) కుబేరుడు, 5) ఈశానుడు, 6) ఇంద్రుడు, 7) అగ్ని, 8) యముడు.

2. అష్టభైరవులు: 1) అసిత భైరవుడు, 2) రురుభైరవ, 3) ఛండభైరవ, 4) క్రోధ భైరవ, 5) ఉన్మత్త భైరవ, 6) కపాల భైరవ, 7) భీషణ భైరవ, 8) సంహార భైరవ.

3. శివగణాలు: 1) నంది, 2) మహాకాలుడు, 3) భృంగి, 4) వినాయకుడు, 5) వృషభుడు, 6) స్కంధుడు, 7) దేవి, 8) చండికేశ్వరుడు.

పంచాక్షరితో కలిపి నింపిన బీజాక్షరములు ప్రాచీన ద్రవిడభాషకు చెందినవిగా ఉండుటచే వాటికి సమానమైన తెలుగు అక్షరములు వ్రాయవీలు కాలేదు. పటమును (Image-49 letters) చూడగలరని మనవి.

989. ఆరు ఆధారచక్రములన్నీ ఒక్కటిగా కలిసి 'పరాపరము' అగుటయే గొప్ప తపస్సగును. (పరాపరమున సదాశివుడు నెలకొనుటచే) దానిని గ్రహించినవారు శివునియందు శరణాగతి పొందినవారు (తమను శివునికి అర్పించుకొన్నవారు). కావున అన్ని కార్యములలో ఈశ్వరుని కరుణయే నిండియున్నదని భావించి చెప్పుదును. మరేదియూ నాకు తెలియదు.

('శివాయనమ' అని పంచాక్షరి ఉచ్ఛారణతో అన్ని కార్యములకు శివుని కరుణయే తప్ప వేరొకటి తనకు తెలియదని రచయిత నమ్రతతో చెప్పుచున్నారు.)

990. శివుడు మూవురుగాను, ఐదుగురుగాను దివ్యబంగారు సభలో నెలకొనియుండును. ఆ బంగారుసభగా నున్నది ఏదనగా షట్చక్రస్థానములును, మహేశ్వరం, సదాశివుడుగా నెలకొనియున్న బోర్లించిన సహస్రదళమొకటి, వికసించిన సహస్ర

దళమొకటి. వాటిలో నాద, బిందులు ఇముడుటచే ఆ స్థితికి 'శంకరుడు' అన్న నామమగునే!!
(శంకరుడు అన్న నామమునకు ప్రాణమును తనలో చేర్చుకొని జీవులకు సహాయకారిగా మారుట.)

991. బిందుమయమైన (ప్రకాశ/తేజోవంతమైన చంద్రమండలము) చంద్రకళని పృథివి నుండి గణించి, చంద్రకళలైన పదహారుని (16) నిలకడపరచి, పిదప మరొక స్థానమునునైన సూర్యకళల పన్నెండుని (12) కలిపి, పది కళలతో కూడిన అగ్ని కళలు (10) ఏర్పడును. ఇదియే బ్రహ్మమును గ్రహించదగిన 'క్రియా' అగును. (16 కళలగు సోమ (చంద్ర) కళలతో 'అ'కారమును, 'ఉ'కారమగు సూర్యుని 12 కళలతో కలిపినచో, పది కళలతో కూడిన అగ్నితత్త్వమేర్పడును. 'అ'కార, 'ఉ'కార కలియికయే బ్రహ్మతత్త్వమునకు మార్గమగు క్రియగా చెప్పబడినది.)

992. సహస్రదళమున శివమహామహుని దర్శించి లేచితిని (సహస్రదళ కమలము వికసించుటచే) నేను అంతరమున శివునితో నెలకొనియుండి, ఎటువంటి దేహ క్షీణత గలగని శివుని మార్గముననే వెళ్ళి, శివతత్త్వమును, బహు ఉత్కృష్టమైన దానిని సృజించియుంటిని.
('అ'కార, 'ఉ'కార ఉపాసనచే సహస్రదళపద్మము వికసింపజేసికొని దైవమును అంతరమునందు లయముపొంది, శివతత్త్వములో నెలకొనియుంటినని రచయిత చెప్పుచున్నాడు.)

993. పుణ్యస్తులైన ఊర్ధ్వలోకస్తులు అచ్చట కూడ (ఊర్ధ్వలోకములో) వారు శివుని పూలతో అర్చించి కొలువుదురు. శివమహామహుని దివ్యమంత్రమును సదా జపించుచుందురు. తామందరు కృతజ్ఞతా సద్భావముతో శివునికి బానిసలమని తలంచుదురు. దైవము యొక్క దివ్యనామమును కంటిని కాపాడునట్లు కాపాడుకొని, శివుని నిష్ఠలో నిలిచియుందురు.
(ఊర్ధ్వలోకస్తులు కూడ శివ పంచాక్షరిని సదా జపించి శివతత్త్వములో నెలకొని యుందురు.)

994. 962వ మంత్రములో చెప్పినట్లు ఆరు అక్షరములకు (ఓం,న,మ,శి,వా,య) ఆరు ఎల్లలు (మార్గములు) గలవు. ఆరుని నాలుగుతో గుణించిన దానినే ఇరువది నాలుగని అందురు (24 ఆత్మతత్త్వములను తెలుపునది). సావిత్రి మొదటి అక్షరము ప్రణవమైన ఏకాక్షరమే (ఓం). దీనిని గ్రహించగలిగినవారు జన్మరహితులగుదురే!!
(ఆరు అక్షరములు–ఓంకారముతో చేరిన పంచాక్షరి. ఆరు ఎల్లలుగా చెప్పబడినది. ఆరు విధములైన అనుష్టానం – ధ్యానం, జపం, పూజ, చక్రజపం, జ్ఞానం,

బుద్ధి (విజ్ఞానః). శరీరముయొక్క అమరిక పంచాక్షరి అగును. ఇరువది నాలుగు – ఆత్మతత్త్వములను సూచించునది. సావిత్రి–ప్రణవ తత్త్వమును గ్రహించినవారు గాయత్రి మంత్రపు 24 అక్షరముల మహిమ గ్రహించినవారు కావున పునర్జన్మ యుండదు.)

995. నిలువున నాలుగు గీతలు, అడ్డముగా నాలుగు గీతలు వ్రాసినచో మొత్తము తొమ్మిది గదులు ఏర్పడును. మధ్యగదిలో 'శి'కారము అక్షరము వ్రాసి, దాని చుట్టూయున్న ఎనిమిది గళ్ళలో స్వరరూపమయమైన ప్రణవ అక్షరములు వ్రాసి (పటమును చూడగలరు), దానిచుట్టూ ఓంకారమును కవచమువలె గీసి, తీవ్రముగా ఉపాసన చేయువారికి ఉమాపతి దర్శనమగును.

996. "నమశివాయ" అని స్థూల పంచాక్షరితో ధ్యానము చేసినచో అకారము మొదలగు ఎనిమిది అక్షరముల మహత్తు గ్రహించి అందులో ఇమిడిన వారికి (995వ మంత్రపటములో చూపన ఎనిమిది గదులు + శికారముతో 9 గదులు) ఉకారముతో కలిపి ఉచ్చరించు (అజపగా) వారియొక్క కపాలరంధ్రమున (బ్రహ్మ రంధ్రము) ఉకారమునకు కార్యస్వరూపియైన శక్తి నాయకునితో (శివునితో) కూడి నెలకొనునే!!

(అకార కళను, ఉకార కళను గ్రహించి ధ్యానించువారికి, వారి శిరస్సున నాయకుడు, నాయకురాలు నెలకొనునది సృజించనగును.)

## స్థంభనము

997. పచ్చి రావిచెట్టు బెరడు (ఎండిపోయిన చెట్టుది కాదు) పలకను శుభ్రపరచి, బాగా చదనుచేసి, దానిపై "మశివాయన" అని వ్రాసి, అట్లే తాటిఆకుపై (తాళ పత్రము) శుభ్రపరచి, "మశివాయన" అని వ్రాసి, ఆ తాటిఆకుపై తేనెపట్టు యొక్క మైనపు జిగట రాసి, తాటిఆకు బాగుగా పక్వపడునట్లు చేసి, అగ్నిపై వేడిజేసి, ఆట్లు పక్వపడిన తాటిఆకును రావిపలకపై అతికించి, బీజాక్షరములు వ్రాసిన "మశివాయన" జపించుచు సాధన చేసినవారికి స్థంభనసిద్ధి పొందనగును. (స్థంభనసిద్ధి: కట్టుట–ఆటంకపరచువాటిని కట్టిడి చేయుట. యోగసాధనలకు అడ్డుతగులు వాటిని స్థంభన పరచు క్రియ. భువనకటకము గ్రంథములో సప్త విధములైన స్థంభనములను వివరించియున్నది. అవి: భూ, జల, శుక్ర, అగ్ని, సృష్టి, శత్రు, భూత (జంతు/స్థావర) స్థంభనములు.)

## మోహనము

998. రేలచెట్టు (అరగ్వద) యొక్క బెరడుతో తయారుచేయబడిన పలకను దక్షిణదిశగా ఉంచి, దానిపై (997వ మంత్రంలో చెప్పినట్లు) "మశివాయన" వ్రాసి, దానిపై

పంచకాయము: శొంఠి, ఆవాలు, మిరియాలు, వెల్లుల్లి, ఇంగువ మిశ్రమమును బాగుగా పూసి, పలకను పక్వపరచి, భూమిలో తలక్రిందుగా పాతిపెట్టి, దానిపై కూర్చుండి బీజాక్షరములను పఠించు సాధకునకు మోహనము సిద్ధించును.
(మోహనము: మోహముతో మరిపించుట. భువన కటకములో (పంచ మోహనములు: లౌకిక, ప్రాపంచిక, స్త్రీ, శత్రు, జంతు మోహనములు) వివరములు చెప్పబడియున్నది.)

**ఉచ్ఛాటనము**

999. వాయవ్యదిశకు అధిపతియైన వాయువును తలంచి, మోదుగచెట్టు పలకపై ఒక తాళపత్రమును ఉంచి, అందు "ఓంకారము" చక్కగా కనిపించునట్లు వ్రాసి, నిప్పుపై వచ్చు పొగలో వేడిపరచి, పరిపక్వమొనర్చి, దానిపై కొంచెము విషము పూసి, దానిపై వ్రాసిన ఓంకారము యంత్రము జపించుట వలన ఉచ్ఛాటన సిద్ధించును.
(ఉచ్ఛాటన: వాయవ్యదిశలోని వాయువుని కొలవబడుటచే అన్ని దోషములు (నివర్తియై) తరిమివేసినట్లు అగును. భువనకటకమునందు సప్తవిధములైన ఉచ్ఛాటనలు: దైవ, రాజ, ప్రాపంచిక, వ్యాధి, ప్రజా, శత్రు, జంతు, మొ॥నవి చెప్పబడియున్నది. అన్ని దోషములను తరిమివేయుటయే దీని ఫలం.)

**మారణము**

1000. మిట్టమధ్యాహ్నమున ఆగ్నేయదిక్కున, పచ్చని తాటియాకు (తాళపత్రం)పై పంచకాయపు పూత పూసి, (పంచకాయములు: శొంఠి, ఆవాలు, మిరియాలు, వెల్లుల్లి, ఇంగువ కలిపిన మిశ్రమము) తాటియాకును పక్వపరిచి, మూడు చతురస్రముల మధ్యలో భూమిలో పాతిపెట్టి, మంత్రోపాసన చేసినచో, అన్ని విధములైన ఆటంకములు, దోషములు, శరీర దోషములు సమూలముగా నిర్మూలింపబడును.

**వశీకరణము**

1001. పచ్చటి తాటిఆకుపై తాళకం (అరితారము–yellow arsenic) పూతపూసి, దానిపై అకారము, ఉకారములు వ్రాసి, దానిని సకలసిద్ధి కలిగించు బిల్వబెరడుతో చేసిన పలకపై ఉంచి, మంత్రబీజాక్షరములను 80,000 సార్లు జపించి, ఉపాసన చేసిన సాధకునకు వశీకరణసిద్ధి పొందనగును.
(వశీకరణ: వశ్యము చేసుకొనుట. శత్రువులను కూడ స్నేహితులుగా మార్చి వశపర్చుకొనుట. ద్వేషించువారు కూడ ప్రేమ సలుపునట్లు చేసుకొనుట. భువన

కటకమునందు షడ్వశీకరణములు: ప్రాపంచిక, రాజ, స్త్రీ, పురుష, శత్రు, జంతు వశీకరణలను ఆరు విధములుగా చెప్పబడియున్నది.)

### ఆకర్షణము

1002. గురువార శుభదినమున తాటిఆకుపై ఉకారమును వ్రాసి, దానిపై పుటము వేసిన భస్మము చేసిన వెండిగుండ (పొడి)ని బాగుగా పదిలమగునట్లు పూసి, తెల్లనేరడిపండు బెరడుతో తయారుచేసిన పలకపై ఉంచి, రెంటిని పశ్చిమదిశ చూచునట్లు ఉంచి, తాటియాకుపై వ్రాసిన ప్రణవ మంత్రమును 8,000 సార్లు ఉపాసన చేసిన సాధకునకు ఆకర్షణసిద్ధి ఒనగూరును.

(ఆకర్షణ: తన వద్దకు వచ్చిచేరుట. ఎంత దూరములోనున్నను తనను వచ్చి కలుసుకొనును. ఈ ఆకర్షణలు సప్తాకర్షణలు: ప్రాపంచిక, రాజ, స్త్రీ, పురుష, నీరు, శత్రు, జంతు – ఏడు విధములుగా చెప్పబడియున్నది.)

(పైన చెప్పిన విధివిధానములన్నియూ సత్ధర్మపరులకు, సద్భావనతో, సత్కార్యములకు ఆచరించవలసినవే తప్ప, ఎటువంటి కక్షలకు, ప్రతీకారచర్యలకు ఉపయోగింపకూడదని శాస్త్రవచనము.)

## 3. అర్చన

అర్చన: పూజ, దేవారాధన. ఇచ్చట యంత్రములలో మంత్రరూపమున దైవానుగ్రహమును ధ్యానించుటచే పొందు ఫలము చెప్పబడినది.

1003. యంత్రమును మంత్రబీజాక్షరములతో నింపి తామర, మొగలిపువ్వు, మల్లిపూవు, చామంతి, మందార మొదలగు సువాసనలతో నిండినవి, దినుసునకు ఒక్కొక్కటి చొప్పున యంత్రముపై అర్చించి పూజించవలెను.

1004. విధివిధానములతో పునుగు, కస్తూరి, చందనము, కుంకుమపూవు, పచ్చ కర్పూరము, మొదలగు సువాసన ద్రవ్యములను అన్నిటిని చేర్చి, దంచి, యంత్ర చక్రముపై రాసి ప్రేమతో అర్చన చేయవలెను.

1005. ప్రేమతో అమృతమును నివేదించి, బంగారుజ్వాల కలిగించు దీపమును వెలిగించి, అష్టదిక్కులను దిగ్బంధించి (అంగన్యాసము, కరన్యాసము తన చుట్టు చేసుకొని), ధూప దీపములు వెలిగించి (చక్రమునందున్న దిక్పాలకులను స్తుతించి, దేవతా భావనను నెలకొల్పి, ప్రాణప్రతిష్ఠ చేసి) స్తుతించి పూజించువారికి ఇహసుఖము పొంది ముదిమిలో ముక్తి పొందుదురు.

1006. ఇట్లు నిర్విరామముగా పూజలు చేసినవారికి 'ఇది కలుగలేద'న్న కొరత ఉండజాలదు. ఇటువంటి ప్రార్థనలచే ఇంద్రుని సంపదలు పొందుటయే కాక

అష్టసిద్ధులు కలుగును. ముదిమిలోను ముక్తియు సిద్ధించును.

(పైన చెప్పిన అష్టసిద్ధులన్నియూ తిరువంభళ చక్రము పూజలో ఆఖరున చెప్పిన అష్టసిద్ధులే తప్ప అష్టమహాసిద్ధులు కావనియు, స్వర్గపదవి ముక్తి (జీవన్ముక్తి – విదేహముక్తి), మోక్షము కాదని గ్రహించవలెను. ఈ సిద్ధులు లౌకిక కామ్యకర్మల కొరకు, పుణ్యఫలముల ద్వారా స్వర్గలోకము ప్రాప్తించినను పుణ్యఫలములు క్షీణించిన పిదప మర్త్యలోకమునకు (భూలోకమునకు) రావలిసిందే.)

1007. తానే కోరివచ్చిననూ పరుల భార్యను కోరని మనోనిగ్రహము గలవాడు, మనోశుద్ధితో చేయబడు నైవేద్యము, సదా అనుసంధానము (నిర్విరామముగా చేయు ధ్యానం)లో నున్నవాడు, పంచాంగ నమస్కారము (రెండు చేతులు, రెండు కాళ్ళు, శిరస్సు భూమిని తాకునట్లు చేయుట) చేయువాని మనస్సు వాని ప్రాణముతో లయమై నిలుచుటచే పంచేంద్రియములను జయించినవాడగును.

(పంచేంద్రియములను జయించి చేయు జపతపాదులు వాని మనస్సు లయము చెందును – దైవమునందు ఇముడును.)

1008. విమలుని (పరమేశ్వరుని) వద్ద తమను అర్పించుకొన్నవారు ఎటువంటి కామ్య కర్మలు చేయరు. ఏలననగా కామ్యకర్మలు బంధములు ఏర్పరచునవి. కావున వాటియందు ఇచ్ఛ (ఆసక్తి) లేక ఉందురు. ఇటువంటి శివయోగులు జ్ఞానముతో దైవ అనుసంధానమై యుండుటచే కర్మలు చేయకుందురు. ఏ విధమైన ఉపాసనలు కోరక శివునియందు ప్రేమతో నెలకొని ఆతని అనుగ్రహ పాత్రులగుదురు.

1009. శివయోగము బుద్ధిపూర్వకముగా పొందదగు జ్ఞానము. కాని బాహ్యముగా వెళ్ళి మూర్తి పూజలు, ద్రవ్యము, మంత్రజపములతో ఎన్నో కర్మలతో వెదకుచున్నారు. క్షేత్రములోనే (శరీరములోనే) నెలకొనియున్న వానిని ఒక పద్ధతి ప్రకారము బుద్ధితో (వివేకముతో) గాంచిన ఎడల ప్రకాశముతో నెలకొన్న మణిలోని వెలుగు జ్యోతివలె దైవమును చూడగలరు.

(బాహ్యేంద్రియ వృత్తుల ద్వారా వెళ్ళక, శరీరములోనే నిలకడగా (ఆత్మతత్త్వం) నెలకొనియున్నవానిని వివేకబుద్ధితో, శృతుల ద్వారా ఎరుగవలెను.)

1010. మనస్సు చీకటి, ప్రకాశముల వంటి రెండు తత్త్వములు గలది. ప్రకాశము ద్వారా అనుగ్రహమును, మత్తు అను చీకటి ద్వారా అజ్ఞానము పొందును. మత్తును (అజ్ఞానము) పారద్రోలకుండటచే జ్ఞానము మందగించును. కావున మత్తును వీడగలిగినవారే శివయోగులగుదురు.

(శివయోగులందరు మత్తు అను అజ్ఞానమును వీడి జ్ఞానము పొందినవారు.)

1011. తానే శివం, శివంలో తాను. ఇట్లు రెండు విధములుగా శివం చేసుకొనుట.

శివంనందు ప్రేమ సలిపి, తన మనోబుద్ధులను శివంలో లయపరచుటచే శివ సాయుజ్యం పొందగల మార్గము ఇదే అగును. ఈ సిద్ధి పొందిన శివయోగులు శివమే తమను అన్ని కర్మలు చేయించుచున్నాడని తలంచి తాము నిష్కామముగా, నిష్క్రియగా ఉందురు.

(మంచి, చెడులు ఇకలేక శివయోగులు నిష్క్రియగా శివంగా అమరియుందురు. శివయోగుల జ్ఞానము అతి ఉన్నత స్థితిని – సాయుజ్యము చెప్పబడినది.)

('సాలోక్యం' – దైవమున్న స్థలమునందు ఉండుట.

'సామీప్యం' – దైవమునకు సమీపమున ఉండుట.

'సారూపం' – దైవమునకు ప్రతిరూపముగా ఉండుట.

'సాయుజ్యం' – దైవమునందే ఇమిడిపోయి ఉండుట.)

1012. పొత్తికడుపు క్రింది భాగమున నున్న మూలాధారచక్రమున ప్రకాశముతో కూడిన కుండలినీ శక్తి (అగ్ని) మనోనిశ్చలత్వముతో, ఏకాగ్రతతో కూడిన ధ్యానముతో దాని పైకి లేపి స్వాధిష్ఠానము మొదలు అన్ని చక్రములను దాటించి, కంఠమునందు గల విశుద్ధికి చేర్చినచో భ్రూమధ్యమున ప్రకాశము జనించును. ఆ ప్రకాశము నాదము, బిందుగా (శబ్దము, ప్రకాశముగా) నెలకొని ఆజ్ఞాస్థానం – భ్రూమధ్యము నుండి శరీరమంతయూ వ్యాపించి శరీరమునే శివంగా మార్చి అనుగ్రహించును.

1013. జీవులు తమ కామ్యకర్మలు, అహంకారము, మాయల వలన పునర్జన్మలకు కారణమగుచున్నవి. దీనికి తోడు తిరోధాన భావన (సత్యమును మరిపించి యుంచుట)చే జీవులు తమ షట్చక్రములోని స్వాధిష్ఠాన, మణిపూరక స్థానములైన 'న'కారము, 'మ'కారములతో కలసి, పశుప్రవృత్తికి లోనగుచున్నది. 'న', 'మ' కారములు వీడి 'శి,వ,య' కారములను ధ్యానించుటచే శివతత్త్వమునకు మార్గము సుముఖమై సత్యమైన శివసిద్ధిని పొందగలరు. ఈ సిద్ధి వలెనే "శివం" అగు ఉపాయము చెప్పబడినది.

(తిరోభావన – మాయ యొక్క రెండు శక్తులతో (విక్షేపణశక్తి, ఆవరణశక్తి) ఆవరణశక్తిని చూచించును. ఇది జీవుని సత్యజ్ఞానము నుండి మరిపించి లౌకిక కామ్యకర్మలను పురికొల్పును. దేహేంద్రియ మనోబుద్ధులు తాను కాదను జ్ఞానము పొంది, శివంను చిత్తమునందు సదా నిలుపుకొని తానే శివం మగుట.)

1014. దేహేంద్రియ మనోబుద్ధులు తాను కాదను జ్ఞానము పొందిన దినమునుండి, జీవుని అండములో శివప్రకాశము జ్వలించును. ప్రకాశము వచ్చు కాలములో అది చంద్రకళగా వెలుగొందును. ప్రకాశము వచ్చు సమయములో విడదీయ లేనిదిగా నున్న జీవుని స్థితిని (దేహము, ఆత్మ) శివునితో ఏకమైనపుడు, జీవ

ప్రకాశము శివప్రకాశముతో కలిసి ఇమిడిపోవునే!!

(దేహభావన వీడినవారికి, జీవుని సత్యమైన, స్వాభావికమైన తన పూర్ణత్వము ఆత్మతత్త్వము తేటనగును. ఇదియే శివంలో నెలకొనుట.)

పైన చెప్పిన యంత్రపూజలు – బీజాక్షర మంత్రములతో, సువాసన పుష్పములు, సుగంధములతో అర్చించి చేయునవన్నియూ లౌకిక కామ్యకర్మల సిద్ధి కొరకే గాని ఇవి జీవునికి మోక్షప్రాప్తినొసగజాలదు. శివయోగసిద్ధి చిత్తశుద్ధితో జ్ఞానము పొందునది. శరీరతత్త్వమునకు (అనాత్మ – దేహేంద్రియ మనోబుద్ధులకు) అతీతముగా ఆత్మయందు నెలకొనుటయే శివయోగసిద్ధి. ఆత్మ శివమగుటగా చెప్పబడినది.

## 4. నవగుండము

మంత్రసిద్ధి పొందినవారు వారి వృత్తులు తగినట్లుగా హోమగుండములు అమర్చి, వాటికి తగిన ద్రవ్యపదార్థములతో హోమము చేయుటకు చెప్పబడిన నవ (9) విధములైన గుండములు. అవి చతురస్రము, ఆకు, నెలవంక, సమభుజ త్రిభుజము, వృత్తము, షట్కోణము, అష్టకోణము, పద్మము, లంబకోణ త్రిభుజముగా చెప్పబడినవి. వీటిని తూర్పు, ఆగ్నేయము, దక్షిణము, నైఋతి, పడమర, వాయవ్యము, ఉత్తరము, ఈశాన్యం మరియు ఈశాన్యమునకు తూర్పునకు మధ్యన ఒకటి. తొమ్మిది దిక్కులలో అమర్చినది. ఇట్లు బాహ్యముగా కొలుచునది, శరీర అంతరదృష్టితో కొలువవలెనని చెప్పునది.

1015. నవగుండముల గురించి నేను (రచయిత) చెప్పునది ఏమనగా నవగుండముల లోపల దీపమువలె జ్యోతి ఏర్పడి నిలుచును. అటువంటి నవగుండజ్యోతి వలన ఎన్నో ప్రయోజనములు పొందనగును. ఆ ప్రయోజన నవగుండముల గురించి నేను వివరించుచున్నాను.

1016. పైన చెప్పబడిన గుండముల పూజచే శివానుగ్రహముతో పృథివియందు నలు మూలలలోను సంతోషము ఏర్పడును. దీనివలన సృష్ట్యాది పంచక్రియలకు (సృష్టి, స్థితి, లయ, తిరోధానం, అనుగ్రహం) శుభమేర్పడును. అహంకార మొదలగు ముమ్మలములు (అహంకారము, మాయ, కామ్యకర్మలు) శివానుగ్రహముచే వీగి పోవును. (మూలాధారము నుండి) అగ్ని జనియించి ఊర్ధ్వముగా ప్రాకి, పైనున్న సూర్యచంద్ర మండలములను దాటి వెళ్ళును.

(గుండములోని ఏర్పడు అగ్ని జీవుని అన్ని మలములను పోగొట్టి ఊర్ధ్వముగా మూడు మండలములను దాటివెళ్ళును. బాహ్యముగా ఇది అండములో జరుగనదే పిండములోను (జీవునిలోను) యోగసాధనలో జరుగునని గ్రహించవలెను.)

1017. అన్ని మండలములను కూర్చి నెలకొన్న ఆకాశతత్త్వముగా వెలుగు ఆ పరమాత్మను

తలంచి ఇమిడిపోవుటచే, భావనలో ఇమిడిన ఎఱ్ఱనైన జ్యోతిస్వరూపము పృథివి మొదలగు అండచరాచరములను దాటి నిలచినది. నేను (రచయిత) అటువంటి ఎఱ్ఱనైన ప్రకాశమును గ్రహించి, అది పైకి లేచునది సృజించితిని.

(ముఖమునకు ముందు వెలుగు ఎఱ్ఱనైన ప్రకాశమును గ్రహించి స్తుతించవలెను.)

1018. ఇట్లు అంతరమున ఏర్పడినదే గుండములో ఏర్పడిన ప్రకాశరూపము. ఏడేడు మండలములను సృష్టించుట, సంహారమును గూడ చేయవచ్చును (లయం). సనాతనమైన వేదవాఙ్మయములోని గుండముల యొక్క మహిమ నేను వివరించుటకు పూనుకొనుచున్నాను.

1019. ఇట్లు అమర్చిన ఆ గుండములో షోడశకళలు ఏర్పడి నెలకొనును. మూలాగ్ని తత్త్వమగు కాముని జయించి అన్ని ఆధార షట్చక్రములు దాటి, సుషుమ్నానాడి ద్వారా ఊర్ధ్వముగా వెళ్ళునది గ్రహించినవారికి అగ్నితత్త్వము ద్వారా గలుగు దోషములు ఇక వచ్చిచేరవు.

(షోడశకళలు చంద్రుని అంశమైనది – బాహ్యముగా ఏర్పడినదే శరీర అంతరమున ఏర్పడునని చెప్పుట.)

1020. ముక్కోణ గుండములో (మూలాధారచక్ర పురూపము ముక్కోణ రూపమే) అగ్నియే ఐదుగా బాహ్యముగాను, అంతరముగాను నిలుచును. బాహ్యముగా నున్నది బ్రహ్మాది ఐదుగురు (బ్రహ్మ, విష్ణువు, రుద్ర, మహేశ్వర, సదాశివం). ఇక శివుని తత్త్వములు తెలుపు పంచముఖములు ఐదు: తత్పురుషం, అఘోరము, సద్యోజాతం, వామదేవం, ఈశానం. వీరు శరీరములోను, బాహ్యముగాను నున్నారు. శిరస్సులో సూర్యుని వృత్తమగు పన్నెండు రాశులను తలంచి ధ్యానించుటచే అనుగ్రహము వలన శిరస్సున శివసూర్యుడు నెలకొనును.

1021. నవగుండముల పూజల వలన వృత్తాకారపు ముఖము, ప్రకాశముతో కూడిన శిరస్సు ఏర్పడును. ఇడనాడి, పింగళనాడి రెండు చేతులతో పోల్చునదై సుషుమ్న నాడి మహాప్రకాశముతో ప్రకాశించును. శరీరములో నున్న అన్నమయకోశముగా నున్నది శివలింగ రూపమే. దీనినుండి ఉద్భవించు ప్రకాశ కిరణములే శుభము కలిగించునని అంబాళ్ (పరాశక్తి తల్లి) చెప్పినది.

(నవగుండపు పూజల వలన శరీరశుద్ధి ఏర్పడి ప్రకాశము పొంది, శరీరమే దివ్య శివలింగముగా నొప్పారును. దీనినే అమూర్తి సథాఖ్యము అందురు.)

1022. దివ్యలింగమే శుభమేర్పరచునదై ప్రకాశరూపమగు పరాశక్తి సమస్త జీవులలో నెలకొని (శిరస్సు నుండి పాదముల వరకు) అనుగ్రహము పారించుచున్నది. దీనిని గ్రహించక మంత్రములు మాత్రము పఠించినచో వట్టి బాహ్యక్రియయే

అగును, మరియు పరాశక్తి వారి చిత్తమున (బుద్ధిలో) నిలువజాలదు.
(ప్రకాశస్వరూపిణియగు పరాశక్తిని సృజించక చేయు కార్యములన్నియూ సత్ఫలితము లివ్వజాలవు. బాహ్యక్రియలన్నియూ అంతర్ముఖముగాను గ్రహించి చేయవలెను.)

1023. వంచిన ధనుస్సును పోలినదై, నెలవంక గుండములోని పూజలో ధనుస్సు రెండు కొనలందు పామువలె వంగిన వాటినుండి ప్రకాశము శరీరమంతటికి వెదజల్లును. ఈ రెండు కొనల నున్న ప్రకాశం యోగ పరిభాషలో ఇడనాడి, పింగళనాడుల ప్రజ్వళనగా చెప్పబడి, అది షట్చక్రముల ద్వారా పైకి ప్రాకి సహస్రదళమును చేరుకొని జీవునికి సత్ఫలితములిచ్చును.
(నెలవంక ఆకారగుండపు పూజ బాహ్యముగా చేయునది. దానినే శరీరమునకు మలిచినచో అంతరమున యోగసాధన చేయువారికి సహస్రదళమునందు శుభ ఫలితము పొందగలరు.)

1024. మానసికముగా శరీరమును యాగగుండముగా భావించి చేయు సాధన చెప్పబడినది – మూలాధారమున నెలకొన్న శివజ్వాల పింగళకళకు నొప్పారునది. ఇది సూర్యకళగా పైకి ప్రాకునది. జలం–అప్పు స్థానమైన మణిపూరక చక్రము నుండి చలనమేర్పరచునది ఇడనాడియగు చంద్రకళ. దేహమగు మండలములో ఇడనాడి, పింగళనాడుల చలన ప్రక్రియలచే శివజ్యోతి పైకి ప్రాకి, ఆరు ఆధారములను దాటి సహస్రదళము చేరుకొనుటచే సాధకుని ముఖమునందు శివజ్యోతి జ్వలించును.
(గుండములో ప్రజ్వలించు అగ్నిజ్వాలలే ప్రతి ఒక్కరి శరీరములోను శివజ్వాలగా ప్రజ్వలించుచున్నదని గ్రహించవలెను.)

1025. సోమసూర్య అగ్నుల మూడింటిని కన్నులగా గల (త్రినేత్రుడు) శివుడే శివజ్వాలగా ప్రకాశించువాడు. అట్లు కన్నులు గలిగిన జీవుడు (పరిపక్వమొందిన సాధకుడిని చెప్పబడినది) తన అన్ని తత్త్వములను అణగద్రొక్కి తనలో ఇముడ్చుకొన్నవాడగును. ఇటువంటి జీవుడే అన్ని దిక్కులందును కన్ను గలవాడై అన్నింటిని చూచువాడగును. అన్ని రకములైన దేవతలకు, గణనాధులకు నాయకుడై తన సామర్థ్యముచే తన గుప్పెటలో పెట్టుకొనును.
(ఇందు పరిపక్వమొందిన సాధకుడు తానే శివమగుట చెప్పబడినది. తానే అగ్నిజ్వాలగా, అన్ని తత్త్వములకు అతీతముగా వెళ్ళువానిగా, అష్టదిక్కులు తన వశమందు యుంచుకొన్నవానిగా, సకల సామర్థ్యములు పొందినవానిగా స్తుతించబడినది.)

1026. శరీరమునే నవగుండముగా భావించి అందులోనున్న షట్చక్ర స్థానములో అగ్నిని రగిల్చి చేయు యాగములో జనియించిన ఆరు అగ్నిరవ్వలే కలిసి ఒక్కటై శివకుమారునిగా రూపుదాల్చినదిగా చెప్పబడినది – నా నాయకుడైన పరమశివుని నుండి ఆరు అగ్నిరవ్వలు ఆరు వృత్తములైనవి. దానినుండి ఆరు ముఖములు గల షణ్ముఖుడు ఉద్భవించెను. అట్లు ఉద్భవించినవానిలో శివుడు కలిసియుండుటచే షణ్ముఖుడు శివునికి కుమారుడయ్యెనని గ్రహించగలరు.

(పరిపక్వమొందిన జీవుడే శివకుమారుడుటయు, ఆత్మయే తన తనయుడగుట చెప్పబడినది.)

1027. నవగుండ పూజలో పఠించుచున్న వేదమంత్రోచ్చారణలతో పైగి ఎగబ్రాకిన అగ్నిజ్వాలలు శరీరములోని ఇడనాడి, పింగళనాడుల సమ్మేళనములతో సుషుమ్న నాడిలో ఉద్భవించిన అగ్నికణములకు బోలినది. ఇవి పరిపక్వపడి అగ్నికళలుగా వెలుగొంది సహస్రమున నెలకొనుట వలన సాధకులు ప్రకాశము పొంది దేవతలగుదురు.

1028. పై మంత్రములో చెప్పినట్లు ప్రకాశము పొందినవారి శరీరమే దివ్యమణిగా మారి ప్రపంచమంతయూ సంచరించదగ ప్రకాశముతో కలిసి నెలకొనియుందురు. పరిపక్వమొందిన తన స్థూలశరీరమంతయూ ప్రకాశముతో జ్వలించును. ప్రణవమును ఉచ్చాటనచే తన కళ్ళలో ప్రకాశము నెలకొని, ఇతరులకు అనుగ్రహ మొసగుదగు కళ్ళుగా మారి పరాశక్తి యందు నెలకొనును.

(ప్రకాశముతో నిండినవారు ఇతరులకు తన కంటితోనే అనుగ్రహము, దీక్ష నొసగగలరు.)

1029. ఈ మంత్రములో నవగుండములలో షట్కోణరూప గుండమును (6 కోణములు) తెలుపుచున్నది. ఇది శరీరములోని షట్చక్రములను తెలుపునది. నవగుండ యోగములో చక్రములు వృత్తముగా భ్రమించి (చుట్టి) ప్రణవముతో కలిసి ముప్పది ఆరు (36) శరీరతత్త్వములతో కూడినదై పైకి ప్రాకును. ఈ ముప్పదిఆరు తత్త్వములు అండములోను కలదు, పిండము (శరీరము)లోను కలదనుట గ్రహించిన వారెచ్చటికైనను తమను వ్యాపించజేయగలరు.

(వారు శరీరముతో వ్యోమరూపిని, వ్యాపిని (చంద్రుని షోడశకళలలోనివి)తో కలిసి ఎచ్చటకైనను శరీరముతో వెళ్ళదగు సిద్ధి పొందిన వారగుదురు.)

1030. అనంతమైన (ఆది అంతము లేనివి) ప్రణవమునకు పాదములు మూడు. సూటియైన ముఖములు రెండు, ఆరు కళ్ళు, ఉచ్చరించు నాలుకలు ఏడు, కొమ్ములు నాలుగు, ఈ అగ్నిగుండము నుండి ఉద్భవించునదగును.

యోగపరిభాషలో: అగ్నిగుండము నుండి లేచు అగ్ని కణములు 1. ప్రకాశము, 2. గాలి, 3. శబ్దముగా (3) పాదములు.

1) ఇడనాడి, 2) పింగళనాడులుగా (2) ముఖములు.

వెన్నెముక ఆరు ఆధారచక్రములలో నున్నవి (6) చక్రములు.

శివాగ్ని ఆరు ఆధారచక్రములను దాటి వెళ్ళి సహస్రదళము చేరుటలో (7) ఉచ్చాటణ

మూలాధార చక్రములో చెప్పబడిన (4) పద్మరేకులే (4) వేదములు.

ఋగ్వేదములోని మంత్రమొకటి వృషభమును ఇట్లు వర్ణించియున్నది. నాలుగు కొమ్ములు, తలలు రెండు, చేతులు ఏడు, మూడు రకములైన తాడులతో కట్టబడిన వృషభము గర్జించినది. ఇట్లు శబ్దబ్రహ్మయైన దైవము మానవునిలో ప్రవేశించెను. ఈ మంత్రదేవత అగ్నిగాను, సూర్యునిగాను, శబ్దబ్రహ్మముగాను చెప్పబడియున్నది.

1031. ఇట్లు నవగుండము నుండి పైకి లేచు అగ్నిజ్వాలలు దైవశక్తితో నిండినది. అది అండమంతయూ నిండియున్నది. దానిని కొలుచు (గణించు)టకు ఎవ్వరికి సాధ్యము కాదు. దైవశక్తిని నింపు మంత్రములకన్నా మించినది మరొకటి లేదు. ఇటువంటి మేలైనది, నవగుండము ద్వారా పొందిన ఎరుక, అది శరీరములోను నెలకొనియున్నదని గ్రహించవలెను. ఆత్మతత్త్వము కూడ దైవమువలె అక్షరమైనది (నాశనము లేనిది) అనంతమైనది. (ఆత్మ, బ్రహ్మం రెండు ఒకే తత్త్వము.)

1032. ఇట్లు గ్రహించిన దైవశక్తిని రెండు కళ్ళలో అకార, ఉకారములను భ్రూమధ్యమున ఒక్కటిగా చేర్చి అందు అష్టమమైన (8) చంద్రకళలతో (అకారముతో) స్వాధిష్టాన చక్రములోని ఆరు పద్మరేకులును, మూలాధారచక్రములోని నాలుగు రేకులు మార్పులు (పరిపక్వము) పొంది, తేనెవంటి అమృతమును ఇచ్చునదైన స్వాధిష్టాన చక్రము వికసించగా, నాదము, బిందువు జయము పొంది, షట్చక్రములు దాటి వెళ్ళి శక్తిగా సహస్రదళమున పార్వతీదేవితో నెలకొని నిలుచునే!!

(నవగుండముల యొక్క పూజా ఫలితము – శరీరములో తుల్యమైన యోగసిద్ధి కూడ పొందదగు మార్గము సూచించబడి, సాధకుడే శివమగుట చెప్పబడినది.)

1033. సాధకుడే శివమైన తరుణములో శరీరములో దైవము ఒక్కొక్క భాగముగా నెలకొన్నది గ్రహించగలదు. మూలాధారచక్రములో నాలుగు కళలుగా (వ,క్ష,ష,శ), పంచప్రాణములకు నాయకుడు, పది ముఖములు, ఇరువది కళ్ళు (పంచ భూతములలో శివ, శక్తులుగా నెలకొనినది) స్వాధిష్టానములో ఇమిడియున్న ఇడనాడి, పింగళనాడులు రెండు పాదములు, ప్రకాశము వెదజల్లు శిఖయొకటి, ఇడ, పింగళ నాడుల చలనముచే పంచభూతములలో ఏర్పడు నాదములు పదింటితో, శివశక్తుల తత్త్వములు ఇరువది ఐదు (25)గా ఇమిడియున్నది.

(యోగసాధనలలో శరీర తత్త్వములు ఇరువది ఐదు (25) వివరణ: పంచ భూతములు (5), పంచ తన్మాత్రలు (5), జ్ఞానేంద్రియములు (5), కర్మేంద్రియములు (5), అంతఃకరణములు (4), పురుషుడు (ఆత్మ) (1) = 25. శరీరములో నెలకొన్న సదాశివమూర్తిని చెప్పబడినది.)

1034. ఐదు కోశములుగా గలది (అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములు) ఇతరులచే చెప్పబడునదైన ఇరువది ఐదు (25) స్థూల, సూక్ష్మ శరీర తత్త్వములు, మంచుపటలమువలె వ్యాపించియున్న సహస్రదళము (శిరస్సున) దూదివలె తెల్లటి కిరణములతో వెలుగుచున్న పరంజ్యోతిని గ్రహించి, అందు ఆత్మజ్యోతి లయమగుటచే పొందదగు పరమానందమే ముక్తియగును. (శిరస్సున సహస్రదళమున నున్న అగ్నితో పరంజ్యోతితో ఆత్మ నెలకొనుటయే ముక్తిగా – పరమానందంగా కొనియాడబడినది. అండపూజ ఫలితముకన్నా పిండ (శరీరము) పూజ ఫలితము శ్రేష్టమైనది.)

1035. అనాదిగా, ముక్తిప్రదాతగా, జ్యోతిగా, పూర్ణునిగా వెలుగొందు పరమాత్మతో కలిసిన పిదప, లౌకికజ్ఞానము ఎన్ని పొందియున్ననూ అవి అన్నియూ వీగిపోయి ఆత్మజ్ఞానమే శ్రేష్టముగా అన్నిటికి అసంగముగా ఒప్పారును. లౌకిక ఆలోచనలు, భావనలు తొలగిపోయి సర్వవ్యాపకమైన పరంజ్యోతితో ఏకమై, శివమై (ద్వేషము, బంధములను వీడి) ప్రేమతో కలిసి విడదీయలేని అనుబంధము కలిగియుండును. (సహస్రమున ఆత్మతో కలిసిన జీవుడు (సాధుకుడు) అభావనతో ద్వేషము, బంధములు వీడి శివమై పరమానందములో మునిగియుందురు.)

1036. నివృత్తి మొదలగు పంచకళలతో కూడిన ప్రణవముగా ఒప్పారు ఈ గుండములో (ఊర్ధ్వమున గల సహస్రదళమున) అది స్థితి పొందుటకు తగిన దిక్కులందు నెలకొనును. అధోముఖ ప్రవృత్తి గల పంచభూతముల చేష్టలు గలిగిన మూలాగ్నిని సమ్మూలముగా తిరస్కరించినవారై ప్రణవమునందే నెలకొనియున్న వారగుదురు. (సహస్రదళమైన ప్రణవ గుండమును చేరినవారు ఇక ఎటువంటి లౌకికచర్యలకు పాల్పడరు.)

1037. మహాసముద్రములతో చుట్టబడిన ఏడు లోకములను స్థితి పొందునట్లు చేసి, ప్రణవము కానివాటిని తొలగించినవానిని స్తుతించి, వాని దరి చేరండి (శివుని చేరండి). ఫలితములను ఆశించి చేయు యజ్ఞయాగాది పుణ్యకర్మల (పొందిన సిద్ధి, లౌకికజ్ఞానము)ను వీడి ఫలితములు ఎదురుచూడక, బహుశ్రేష్టమైన ఆత్మజ్ఞానమే పరాకాష్టయని దేవతలు పొందిరి. క్షీణము లేనిది, వికారము లేనిది శివతత్త్వముతో (పరమాత్మతో) ఏకమై నెలకొని యుండిరి.

(ఏడు లోకములు: భూః, భువః, సువః, మహః, జన, తప, సత్యలోకములు. లౌకికసిద్ధి, జ్ఞానమును వీడి శాశ్వతమైన సత్యజ్ఞానమును (ఆత్మతత్త్వం) గ్రహించవలెను.)

1038. తామర వలె వికసించిన సహస్రదళమున నెలకొన్న ఉన్నతుడు, శ్రేష్టుడు పరమాత్మ, ఇడ, పింగళ నాడులే రెండు దివ్యరూపములుగా, సుషుమ్న నాసికగా, వికసించిన మహా ఎర్రని ప్రకాశమే ముఖముగా, సోమ, సూర్య, అగ్నులే త్రినేత్రములుగా (సోమ=ఎడమకన్ను, సూర్య=కుడికన్ను); అగ్ని=త్రినేత్రము). ఇట్లు శిరస్సుపై ఉత్తముడైన శివుని ధ్యానించవలెను.

1039. ఉత్తముడై శివుడు మూలాధారచక్రమున ఉన్నపుడు బాలుడుగా, మధ్యప్రాయమగు యవ్వనము పొందునపుడు సహస్రదళమున ఈశానమూర్తిగా, పశ్చిమదిక్కునకు (శిరస్సు వెనుకభాగము) వచ్చునపుడు జ్ఞానము పెళ్ళుబికి బ్రహ్మరంధ్రము చేరుటయు, షట్చక్రములు దాటి వెళ్ళిన అగ్నికళయే ఆత్మతో చేరి సకలజ్ఞానము, సామర్థ్యము కలుగజేసినదని గ్రహించవలెను.

1040. మూలాధారమునుండి వెన్నెముకలో షట్చక్రములు దాటివెళ్ళి సహస్రదళమును (చిత్రాణి నాడి ద్వారా) చేరి, ప్రణవగుండముగా వెలసిన శివాగ్ని ప్రకాశము సహస్రదళము వరకు ఒకటిగానే గోచరించును. దానిని గ్రహించినవారు ఆ ప్రకాశమును మహాసంపదవలె కాపాడుకొనవలెను.

(ఒక్కొక్క ఆధారచక్రములు ఒక్కొక్క లోకములుగా "ఉత్తర గీత" వర్ణించియున్నది.)

1041. మహాసంపదగా వృద్ధి చెందుచున్న మూలాగ్నిని సాధనల ద్వారా వృద్ధి చేయదగు గురువు (ఆచార్యులు) ఎప్పటికపుడు ఉపదేశములు చేయదగిన సామర్థ్యముతో, లౌకికపాతక చర్యలకు లోనుకాకుండా, లోకులను కాపాడి, అనుగ్రహించి, ప్రేమతో వారిలోని అగ్నిని కాపాడి వృద్ధిచేయును.

(లౌకికులు గురువు ఉపదేశములు, ఆజ్ఞలను సర్వదా పాటించి గురువు ప్రేమకు, అనుగ్రహమునకు పాత్రులు కావలెను.)

1042. ఎందు చూచిన అందే అన్నింటా వ్యాపించిన పరంజ్యోతిగా యున్న శివుడున్ని, ప్రేమతో పరిశీలించి చూచిన బుద్ధిమంతులు ఎవ్వరూలేరు. అటువంటి పరంజ్యోతిని తన దేహమగు హోమగుండములో నున్నదని గ్రహించి ధ్యానించువారు బుద్ధిలో మహాశ్రేష్టజ్ఞానము పొందినవారై కోటియుగములు చూచు వారగుదురు.

(ఆ పరంజ్యోతిని సంపూర్ణముగా గ్రహించినవారు దేహక్షీణత లేక చాలా కాలముందురు.)

1043. కోటియుగములు జీవించదగిన శరీరము పొందిన సాధకుడు ఒక యోగి అగును. ఆ యోగి నవగుండములను తన శరీరములోనే గ్రహించి ప్రతి గుండమునందు అగ్నిని రగల్చగలడు. గర్భస్థపిండ ఉత్పత్తికి ప్రాణశక్తి ఎట్లు తోడ్పడుచున్నదో, అట్లే జగత్తు నంతటిని తన అంతరమున చూడదగు సామర్థ్యమును యోగి పొందును. (బ్రహ్మాండములోనిదంతయూ తనలో చూచును.)

(శరీరములోని నవగుండములు: షట్చక్ర స్థానములు – ఆరు (6); సహస్రదళములు – రెండు (2) (ఊర్ధ్వపటలము, అధోపటలము); యోని – 1 (పురుష, స్త్రీ ఉపస్థ). మొత్తము నవగుండములు (9).)

1044. జగత్తునంతటిని తనలో చూచు యోగి సాధనలు: నాలుగు – చతురస్రము గుండము ఆకారము; మండు అగ్నులు మూడు – త్రిభుజాకార గుండము, వంచిన ధనుస్సువలె నెలవంక – అర్ధచంద్రాకర గుండము, ఆదిఅంత్యములు లేని వేదములు – వృత్తాకార గుండము; శక్తి నెలకొన్న ఆరు ఆధారచక్రములు – షట్కోణ గుండము; జగత్తు యొక్క అష్టదిక్కులు తెలుపునది – అష్టకోణ గుండము; ఆకురూపములో నున్నది – యోనిగుండము; పంచేంద్రియముల తన్మాత్రలు ఐదు – పంచకోణ గుండము; తామర రూపము – పద్మరూపగుండము; ఈ నవగుండ రూపములో యోగులు ఆదికి మూలమైన పరమేశ్వరుని యందు లయమై చిరకాలము జీవించుదురు.

(బాహ్యముగా ఉన్నదంతటిని యోగి తనలో చూచుచు, పరంజ్యోతియందు – బ్రహ్మానందు సదా నెలకొనియుందును.)

## 5. శక్తిభేదం – త్రిపురచక్రము

శక్తిభేదం అనగా శక్తియే సరస్వతి, లక్ష్మీ, పార్వతిగా నున్నది. త్రిపురం – మూడు మండలములకు నాయకురాలు. ఈమే పరమేశ్వరునితో కలిసి అభిన్నముగా నుండి పంచకృత్యములు చేయు సామర్థ్యురాలు. దీనిని గురించి వివరించునది.

1045. శుద్ధమాయగా, అశుద్ధమాయగా, శుక్రముగా, వైఖరి వాక్కుగా, ఓంకార ప్రణవముగా, ప్రకాశముగా (శరీరము లోపల), ఆరు ఆధారచక్రములలో తానే మంత్రముగా, శక్తిమూర్తిగాను ఉండి వాటంతటికీ అతీతముగా (అసంగముగా) నెలకొనియున్నది త్రిపురాదేవి.

(శక్తి తాను అన్నింటిలోను ఇమిడి, వాటంతటికీ అతీతముగానున్నది. శివునికి అభిన్నశక్తిగా నెలకొనియున్నది.)

1046. అగ్ని, సూర్యుడు, చంద్రుడను మూడు మండలములుగా నెలకొన్నది మహా సౌందర్యవంతురాలు, ఆకాశరూపమైనది, జగత్తును రక్షించు ఎర్రనైన ప్రకాశములో

ఇమిడియుండి, నారాయణుడుకి స్థితికార్యమును నిర్వహించుటకు మాయాశక్తి ఇచ్చినది, మహేశ్వరునికి శక్తిగా వెలుగొందు నల్లనైన ఛాయ గలది, సదాశివుని మనస్సునందు నెలకొన్న మనోన్మణిగా, ఇట్లు త్రిపురాదేవి ఒక్కరే పలు శక్తులుగా వెలసియున్నది.

1047. ప్రకృతిగా అమరిన ముమ్మండలములలో (మూడు పురములు - శిరస్సున అమరిన బిందు మండలము) తనకు తానే మూవురిగా అమరిన శక్తిగా, తానే బంగారు, ఎర్ర, తెల్లని రంగుల ప్రకాశముతో కూడినదిగా, విద్యా, భోగ, మోక్ష ప్రదాయిణిగాను వెలసియున్నది.

(మూవురిగా వెలసినది: త్రిపురశక్తియే సరస్వతి–తెల్లని వర్ణం–విద్యా; లక్ష్మీ–బంగారువర్ణం–ఐశ్వర్యము; ఉమ–ఎర్రని వర్ణం–మోక్ష ప్రదాతగా వెలసియున్నదని గ్రహించవలెను.)

1048. త్రిపురాదేవి నాదమును దాటి నాదాంత స్థితిని కూడ అనుగ్రహించగలదు. అంతటా వ్యాపించిన అండములలో పరబిందువుగా నెలకొని జగత్తు అంతటిని అనుగ్రహించగలదు. పరము, అభిరామి (సౌందర్యవతి), అగోచరి (వాక్కుకు, మనస్సుకు అతీతమైనది) యైన తల్లి జీవులను ప్రేమతో అనుగ్రహించి బుద్ధిని, జ్ఞానమును నొసగి కరుణతో ఆదుకొనును.

(నాదాంతస్థితి = పరమానందస్థితి; పరబిందువుగా = దైవానుసంధానముతో కూడిన ప్రకాశముగా.)

1049. త్రిపురాదేవికి అందమైన కాలిఅందె, ఎర్రని పట్టుచీర, వక్షస్థలము మూయు బంగారు ఆభరణములు, పువ్వులతో కట్టిన బాణము, చెరకుగడ ధనుస్సుగా, శక్తినిచ్చు అంకుశము, అందమైన కిరీటము, నల్లటి నీలిరంగు గల కుండలములు, ఆమె వస్తువులగును.

1050. కుండలములను కర్ణములకు ధరించిన శక్తి, శిక్షించదగు కనుబొమ్మలు కలది (కనుబొమ్మలు ధనుస్సువలె వంగినవి), ఎర్రనైన శరీరఛాయ గలిగినది, భుజ, కంఠాభరణములతో ప్రకాశించుచున్న శిరోజములలో చంద్రుని గలిగిన చండికా దేవిగా, నాలుగు దిక్కులకు వ్యాపించిన దేశములను రక్షించునది.

(త్రిపురాశక్తి పలు భేదములతో రూపము దాల్చునది: చండికాదేవి రూపమును వర్ణించినది ఈ మంత్రము.)

1051. జీవుల ప్రాణముతో ప్రాణముగా నెలకొన్న తల్లి త్రిపురాదేవి - స్థితి పొందిన (జగత్తుకు రక్షకురాలు) పురాతనురాలు (సనాతనము), క్షీణతలేని సౌందర్యవంతురాలు, జీవులలో శిరస్సున నెలకొని రక్షించు నాయకి, బాగుగా

వీక్షించు నేత్రములు గల నాయకి (కరుణాకటాక్షము నొసగునది), నాలుగు దిశలకు వ్యాపించి, వాటికి ఆధారభూతముగా నుండు నాయకి, శుద్ధమైన తామరలో (సహస్రదళములో) నెలకొన్న శుద్ధ విద్యాదేవి.

(త్రిపురాదేవి యొక్క వర్ణనలు.)

1052. నిర్మలమైన, కల్మషము లేని స్తుతులనే మాలగా ధరించిన తల్లి త్రిపురాదేవి. సర్వసుఖములకు ఆధారభూతమైన తల్లి వస్తువు ప్రపంచమంతటిలో (జగత్తులో నున్న వస్తువులన్నిటిలో) ఇమిడి జీవులను ఆదరించు మహాశక్తి. మహా పరాపరమైన శక్తి. అణువులో అణువుగా బహుసూక్ష్మముగా నెలకొని, అన్నిటిని తానే సృష్టించి, అందులో తానే నెలకొని జ్ఞానస్వరూపిగా ఉండి, అందరిని అనుగ్రహించు మహాశక్తిగా వెలసియున్నది.

(త్రిపురాదేవియే పరాశక్తి కనుక తన సామర్థ్యములు కరుణలను ఇందు వర్ణింప బడినది.)

1053. పరాశక్తిని ఎరుగని దేవతలు లేరు. పరాశక్తిని త్రోసిపుచ్చి చేయు ఎటువంటి మహాతపస్సు లేదు. ఆమే లేకుండా పంచమూర్తులు (బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు, రుద్రుడు, సదాశివుడు) తమ పంచకృత్యములు చేయలేరు. కావున పరాశక్తి అనుగ్రహము లేకుండా ముక్తి పొందుటకు దారి కూడ నాకు (రచయితకు) తెలియకున్నది.

(పంచ కృత్యములు: సృష్టి, స్థితి, లయ, తిరోధానం, అనుగ్రహం.)

1054. జ్ఞానులు తల్లి పరాశక్తిని మహా ఆనందస్వరూపిణి అని చెప్పుదురు. జ్ఞానులు ఆమెని జ్ఞానమే పూర్ణస్వరూపముగా నెలకొన్న జ్ఞానస్వరూపిణి అందురు. మనము చేయు పనులన్నియూ ఆమె ఇచ్ఛ ప్రకారమే జరుగుచున్నవని చెప్పుదురు. పరమ శివుడు కూడ ఆమెతో ఇమిడి అనుగ్రహించువాడేయని జ్ఞానులు చెప్పుదురు.

(స్థూల, సూక్ష్మమన్నింటిలోను ఆమె ఇమిడి అనుగ్రహము పాలించుచున్నది.)

1055. శివుడు ఎచ్చటనున్నాడో అచ్చట పరాశక్తి సౌందర్యరూపములో నుండును. ప్రారబ్ధ శరీరము ఎచ్చట నున్నదో అచ్చట ప్రాణరూపములో పరాశక్తి రక్షకురాలిగా ఉండును. ఆకాశము ఎచ్చటనున్నదో దానికంతటికి అతీతముగా ఊర్ధ్వప్రకాశ మండలములో నెలకొనియుండును. ఇట్లు నాయకురాలైన పరాశక్తి యొక్క గుర్తులను గ్రహించండి.

(శివుడు, శక్తి ఇద్దరూ కలిసియే వృత్తులు జరిపించుచున్నారని గ్రహించవలెను.)

1056. పరాశక్తి అన్ని విధముల మేలైన శక్తివంతురాలు. అన్నింటిని తాను భరించుచూ, వాటికి ఆధారభూతముగా – ప్రాశక్తిగానున్నది. అంతటా వ్యాపించినది కూడా

ఆమెయే. అన్ని జీవరాశులలో విధివిన్యాసములు కల్పించి, అనుగ్రహించు త్రాశక్తిగా కూడ ఆమెయే. పుణ్యఫలమగు భోగమును (సుఖం) అనుగ్రహించు రాశక్తిగా కూడ ఆమెయే.

(ప్రాశక్తి, త్రాశక్తి, రాశక్తిగా అన్ని కలిసి పరాశక్తిగా అన్నిటిని రక్షించి, అనుగ్రహించు చున్నది.)

1057. జీవులకు భోగమును అనుభవించజేయునది. కుండలినీ శక్తిలో ఇమిడి జీవులను పరిపక్వమొనర్చు ప్రాశక్తిగాను నెలకొనియున్నది. జ్ఞానులకు దినదినాభివృద్ధి పొందు ప్రకాశ శరీరము నొసగి వారిని పరిపక్వమొనర్చదగు జ్ఞానశక్తిగాను, అధిష్ఠానముగానున్నది.

(పరాశక్తియే భోగమును, జ్ఞానమును ఇచ్చునదనుట.)

1058. జ్ఞానము నొసగుటలో తానే అధిష్ఠానముగా వెలసినదియు, సౌందర్యవంతమైన వక్షోజములు గలదియు, తేనెలు కారు పుష్పములను ధరించిన శిరోజములు గలదియునగు త్రిపురాదేవి దేవతలు కోరి వెతుకు నాయకురాలిగా, ఎర్రనైన పగడమువంటి శరీరఛాయ గలదానిని, నేను పరమలక్ష్యముగా (గమ్యముగా) నా చిత్తమునందు పదిలపరచుకొంటిని.

(త్రిపురాదేవి కృప పొందుటయే పరమలక్ష్యముగా తలంచి, చిత్తమునందు పదిల పరచుకొంటినని రచయిత వక్కాణించుచున్నారు.)

1059. జగత్తును సృష్టించి, అందు వస్తుసముదాయమంతటినీ ఏర్పరచి అందులో సకల జీవరాశులు నెలకొనునట్లు చేసి, పది దిశలలో (4 దిశలు + 4 మూలలు + ఊర్ధ్వ + అధో) పదిముఖములతో పాలించి రక్షించునదైన త్రిపురాదేవి, తానే పరము, పరాపరముగాను, అంతఃకరణములు నాల్గింటిని వృత్తులు చేయునట్టి చేసిన ఆ దేవి "శ్రీవిద్యా" నాయకురాలు.

(స్త్రీ దేవతలు మూలముగా లభించు జ్ఞానము "శ్రీవిద్యా" అనియు, పురుష దేవతల ద్వారా పొందదగు జ్ఞానము "కల్పము" అని పేర్లు.)

1060. శ్రీవిద్యకు నాయకురాలు, విశాలమైన వక్షోజములు గలిగిన దేవి, శాశ్వతమైన, పరిశుద్ధమైన తత్త్వమును బోధించిన నెమలిపింఛము వంటి మృదువైన, సౌమ్యమైన దేవి, సకల కళలను నేర్చి సాధించిననూ యవ్వనముతో విరాజిల్లు కన్య, నా చిత్తమునందు పరిపూర్ణముగా నెలకొనినది.

(శ్రీవిద్యాదేవి శివయోగులకు పరిశుద్ధ తత్త్వము బోధించి, వారి చిత్తములోనే నెలకొనియున్నది.)

1061. ఇట్లు "చిత్రాణి" నాడి ద్వారా శ్రీ పరాశక్తి పూర్ణకళలతో నా చిత్తమున నెలకొని,

ఏడు లోకస్తులు స్తుతించదగినట్లు నా సహస్రదళములో ఏకమై, మనోన్మణిగా, మంగళరూపిణిగా, నేను వేరు ఆమె వేరని విభజించుటకు వీలుకానిదిగా ఏకమై నాలో నిలుచుండెను.

(త్రిపురాదేవి యోగులందు కరుణతో అనన్యముగా ఏకమై నిలచినది. "చిత్రాణి నాడి: వెన్నెముక మూలాధారచక్రము నుండి మొదలిడి ఏడవది సహస్రదళము వరకు ప్రాకియున్న నాడి. ఇది తామర దారము వలె (ఎండిన తామర కాండము నుండి తీయు వత్తివంటి సన్నని దారము) సున్నితమైన సహస్రమును చేరి యోగసిద్ధి కలుగజేయును.)

1062. అట్లు ఏకమై ఇమిడియున్న సహస్రదళ పద్మమునందు పరాశక్తి, తన ఆజ్ఞ ప్రకారమే నడుచుకుంటున్న నాయకుడైన శివుని కోరి ఆయనతో కలిసి మనోన్మణిగా, మంగళకరమైన శివశక్తి రూపముగా అన్ని కార్యములకు ఆధారముగా ఉన్నదానిని చిత్తమునందు పదిలము చేసుకొనక జీవులు భ్రమించు చున్నారే!!

(జీవులు సత్యజ్ఞానము ఎరుగక ఉన్నారే అని వాపోవుట.)

1063. శివప్రకాశములో ఇమిడి, అన్నిటిని గ్రహించి తోడుగా నిలుచున్న, సుగంధ వాసనలు వెదజల్లు పుష్పములను శిరోజములందు అమర్చిన పరాశక్తితో తాను కూడిన స్థితిని సత్యజ్ఞానముతో గ్రహించినవారికి (యోగులకు) వారి భావన తగినట్లు అనుగ్రహమొసగ గలదు!!

1064. ఇట్లు కరుణతో అందరియెడ నెలకొన్న పరాశక్తి ఆనందమే స్వరూపముగా గల సుందరి. చింతపండు పెంకువలె నున్న నా తత్త్వమును చూసి, ఎరిగి, పరిపక్వమును నాలో (రచయిత) ఏర్పరచి, శివగతి చూపించి, తన ప్రకాశముతో ఒక్కటిగా చేర్చుకొనెను!!

(పరాశక్తి జీవులలో పరిపక్వమేర్పరచి తనలో ఐక్యపరచుకొనును. ఉపమానము: చింతపండు పండక ముందు (పరిపక్వము పొందుట) దాని పెంకు గుజ్జును అంటిపెట్టుకొనియుండును. కాని బాగుగా పండిన చింతపండుకు పెంకు వేరై, గుజ్జు వేరుగా నుండును. చింతపండు పెంకు విడువడునట్లు పరిపక్వము పొందిన పిదప శరీరభావన వీడి ఆత్మతత్త్వములో నెలకొందురు.)

1065. లోకస్తులు 'ఉన్నది' అనియు, లేదు అనియు చెప్పిన ఆ పరాశక్తి అన్నిటా కారణముగా నున్న సూక్ష్మమే కార్యమైన స్థూలములను ఏర్పరచుచున్నది. సహస్ర దళమునందు కుడిభాగమున తాను నెలకొనియున్నది. ఇదియే బంధ, మోక్షములకు కారణమని జనులు ఎరుగకయున్నారు. ఆత్మలో ముమ్మండలములగు సూర్య,

చంద్ర, అగ్ని మండలముల నాయకురాలుగా నెలకొని, అన్ని కార్యములకు కారణభూతముగా నున్నది.

1066. తల్లి పరాశక్తియే జీవులలో శరీరములో ప్రాణమై నెలకొనియున్నది. శివగతిలో ఐక్యమగుటకు జీవునిలో చంద్రమండలము గమ్యముగా ఊర్ధ్వమునకు ప్రాకినది. తను నా శరీరములో నున్నప్పుడు నా స్పృహతో సృజించియుండును. తను వేదమగు వాక్కులో నెలకొనియున్న ప్రకాశ స్వరూపురాలు.

(వాక్కు దేవిగా - సరస్వతీ - బ్రహ్మ యొక్క భార్యగా స్వాధిష్టానములో - స్పృహతో నెలకొనినది. మూలాధార స్థానములో - కామవాయువుగా నెలకొని జీవసృష్టి కార్యకలాపాలు చేయును. సహస్రదళములో - శివగతితో ఐక్యమగుట. శ్రీ పరాశక్తి శరీరములోను, ప్రాణములోను ప్రకాశరూపిణిగా నెలకొనియున్నదని గ్రహించవలెను.)

1067. వాక్కు రూపములో వెలసిల్లిన దేవి. నా తల్లి పరాశక్తి త్రినేత్రధారిణి (మూడు కళ్ళు గలది). స్పటికమువలె తెల్లని (శ్వేతవర్ణ) రంగు గలది. తెల్లని పద్మమునందు (సహస్రదళ పద్మము-శిరస్సున) కోరి నెలకొనునది. నాదముగా వెలుగొందునది. ఈమెను మీ శిరస్సున గ్రహించండి. నిర్విరామముగా ఈమెను స్తుతించండి. (వాక్కురూపిణియగు శ్రీ త్రిపురసుందరిని ఉపాసన చేయుట.)

1068. స్తోత్రించి, స్తుతించి, ఆమె దివ్యపాద పద్మములగు సూర్య, చంద్రులను నమస్కరించి, మీలో నాదము, ప్రకాశము నెలకొనునట్లు చేసుకొనండి. ధ్యానములో అంకుశము, పాశము, పచ్చటి చెఱకుగడ ధరించిన సన్నని శరీరము గల దేవిగా ఆదినాయకురాలుగా దర్శించండి.

1069. సృష్టి వృద్ధి పొందుటకు గాను చల్లని ప్రదేశమగు సముద్రముపై పవళించిన నారాయణుని చెల్లెలు నారాయణిని సహస్రదళముపై పద్మమున నెలకొన్న దేవీ మంత్రముతో (హ్రీం) శివశక్తిగా తలంచి, చిరకాలము ధ్యానించినచో, సూక్ష్మ శరీరము జ్యోతిమయమై, త్రికాలములను (భూత, వర్తమాన, భవిష్యత్ కాలములను) దర్శించనగును.

(శివబీజాక్షరములలో ప్రణవము (ఓం) ఎంత ప్రాముఖ్యయో, దేవి ఉపాసనలలో శక్తిబీజము (హ్రీం) అంత విశిష్టమైనది. దేవి ఉపాసకులకు త్రికాలజ్ఞానము దర్శనమగును.)

1070. అకారము మొదలుకొని షోడశకళలతో విరాజిల్లు రూపిణిగా దేవి అమరియున్నది. వేదశాస్త్రములలో పరముగాను, అపరముగాను స్తుతించబడిన నాయకురాలు. సమస్త జీవుల స్థితికారకురాలు మరియు వాటికి ఆధారభూతురాలు, నాదము,

నాదాంతములో వెలసిల్లిన శివునికి ఈమెయే అనుగ్రహ ప్రదాతయగును.

1071. ఆత్మజ్ఞానమును అనుగ్రహించుటలో అది తనకే సాధ్యమన్న రీతిలో అనుగ్రహించు తల్లి, అన్ని భువనములకు నాయకురాలు శ్రీ త్రిపురాదేవి. మోహం కల్పించు జగత్తు తత్త్వమును మార్చి, నాలో బంధములను తొలగించిన ఆ భువన నాయకి దివ్యపాద పద్మములను నమస్కరించుదును. ఓ జనులారా! ఈ సత్యము మీరెరిగి, మీ అనుభవమును ఇతరులకు చెప్పుటకు ముందుకు రండి!!

(శ్రీ త్రిపురాదేవి జీవులలో మోహతత్త్వమును తొలగించి అనుగ్రహము నింపి శుభమేర్పరచును.)

1072. తల్లి పరాశక్తిని ఆవరించియున్న సప్తశక్తులలో "వారాహి" ఒక శక్తి (వరాహ ముఖముతో కూడిన రూపము ఆమెది) రూపము. పరాశక్తిని ధ్యానించువారికి ఆమె వారాహి రూపములో జనుల అధోతత్త్వమును రోకలితో దంచి, నాగలితో తవ్వించి, చెడుభావములను కలుపు మొక్కలను వేరుపరచునట్లు తొలగించి, తెల్లనైన, ముఖ చిరునవ్వును గలిగి, ధ్యానించుమదిలో నెలకొని జయమును అనుగ్రహించును.

1073. "ఓం" అను ప్రణవమంత్ర రూపమున "ఓంకారి"గా నున్న స్త్రీశక్తి. ఎప్పటికి మారని మరకత (పచ్చరంగు) ఛాయ ఆమె శరీరము. ఆమె అహంకార రూపిణిగా పంచకృత్యములు నొనరించు (సృష్టి, స్థితి, లయ, తిరోభావ, అనుగ్రహం) దేవతలకు (బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు) తన శక్తిని, అనుగ్రహమును నొసగిన నాయకురాలు. హ్రీంకార శబ్దరూపములో అనగా "హ్రీం" బీజాక్షరములో ఇమిడి అనుగ్రహము పారించు నాయకురాలు.

(నిర్గుణ రూపములో అన్ని తత్త్వములకు అతీతముగా యున్న శక్తి (పరాశక్తి)యే పంచకృత్యములు నొనర్చుటకుగాను అహంకార రూపిణిగా సగుణరూపమును ధరించి అనుగ్రహము పాలించుచున్నది.)

1074. తానే అన్నిటికి నాయకురాలైన పరాశక్తి, తానే వాక్కు రూపములో నున్న పదునాలుగు విద్యలకును, దేవలోకములను, మనోమండలములను, సూక్ష్మాతి సూక్ష్మమైన విజ్ఞానమండలమును, వాటికి అతీతమైన నాదాంతమును, తానే శివగతిని అనుగ్రహించదగు నాయకురాలు అగును.

(పదునాలుగు విద్యలు: వేదములు–4; అంగములు–6; న్యాయ, స్మృతి, మీమాంస, పురాణము–4=14 విద్యలు. భువన చక్రములో చెప్పబడినది ఈ పదునాలుగుతో కలిపి "పంచాక్షరి, శ్రీం" కలిపి పదహారుగా చెప్పబడినవి గమనించగలరు – భువనచక్రంలోని మొదటి మంత్రములో.)

## 6. భైరవి మంత్రము

భైరవిదేవి యొక్క మంత్రము – ఉపాసనలు

1075. అచ్చుల వరుసలో పన్నెండవ అక్షరమగు 'ఐ'ని సృజించునపుడు ఆదిభైరవి బీజముతో 'అ'కారమగు ప్రణవమును, మాయయగు 'మ్'లను చేర్చి ఉచ్చరించునపుడది "ఓం ఐం" పదునాలుగు అగును. వీటితో నాదము, ప్రకాశము చేరునపుడది పదహారు కళలతో నొప్పారి పూర్ణభైరవి మంత్రమగును.

(పన్నెండు కళలతో (వృత్తులతో) కూడిన ఆదిభైరవి, ప్రణవము (సృష్టి), మాయ (తిరోధానం)తో రెండింటితో కలిసి సృజించుటలో అది నాదము, ప్రకాశములతో కూడి షోడశకళలతో కూడిన దేవతగా ఉపాసకులకు అనుగ్రహించును.)

1076. ముందు మంత్రములో చెప్పినట్లు పదునాలుగు అక్షరములతో కూడిన భైరవియే కర్మజ్ఞానేంద్రియము అంతఃకరణములగు పదునాలుగుగా జీవులలో ఇమిడి సృష్టి, స్థితి, లయ కార్యములు జరిపించి, చిత్తమగు పద్మముయందు నెలకొని మహాశక్తి రూపిణిగా, ఆది అంతములుగాను నెలకొనియున్నది.

(భైరవియే సృష్టి, స్థితి, లయ కార్యములు చేసి, జీవుల చిత్తమగు పద్మములో నెలకొనియున్నది.)

1077. భైరవి ఉపాసనలో బ్రహ్మ, విష్ణువు, రుద్రులు ముప్వురూ ఇమిడియుందురు. సృష్టి, స్థితి, లయ కారకములైన పంచభూతములలో కూడిన ఈ పంచభూతాత్మక శరీరము పొందిన జీవులు క్షీణత పొందుదురు. కావున వీటికి అతీతముగా జీవులు సహస్రదళమున నెలకొనిన నాదాంతమును కొలుచుటచే పుణ్యపురుషులగుదురు.

(భైరవిదేవి పంచభూతాత్మకమైన శరీరముతో ఇమిడినది. సహస్రదళములో పరాపరముతో కూడిన మహాశక్తిగా కొలుచుటచే పుణ్యం చేకూరునని చెప్పబడినది.)

1078. పుణ్యుడగు నందీశ్వరుడు నిర్మలుడు (శివుడు) నాదశక్తికి నాయకుడగును. తను నెలకొనిన సహస్రదళమందు గ్రహమండలములో చంద్రుడు చుట్టివచ్చు 27 నక్షత్రములు ఒక వృత్తాకారము లాంటిది. ఇట్లు చుట్టివచ్చుటలో సూర్య, చంద్రునికి ఒక వృత్తమైనచో అచ్చట అగ్నికళగా నెలకొనును. ఆ అగ్నికళని గ్రహించి, ధ్యానించువారి చిత్తములో శివుడు నెలకొనును.

(నాదశక్తిని చిత్తమునందు గ్రహించి ధ్యానించువాడు తామే శివమగుదురు.)

1079. దివ్యకైలాస పర్వతమును అన్ని లోకములవారును స్తుతించి నమస్కరించుదురు. మహాగురువుగా అన్నిటికి కాపలాదారుడుగా (రక్షకుడుగా) నెలకొన్న శివునితో

అన్నింటా తను వ్యక్తమై, వ్యాపించిన శక్తిగా (హ్రీం శక్తి) నున్న త్రిపురశక్తి చేరి నెలకొనియున్నది. అట్లే భైరవి ఉపాసనతో నిర్విరామముగా ధ్యానించు సాధకుల మదిలో, కైలాస పర్వతములో నున్నట్లే శివశక్తులు ఏకమై సాధకుని సహస్ర దళములో బంగారుఛాయలో నెలకొందురు.

1080. కోరి గురుమండలములో ధ్యానించువారికి, వారి నిజతత్త్వమును బోధపరచు పరాశక్తిగా, న్యాయపరముగా వేదతత్త్వమును జీవునికి ఎరిగించు బోధకురాలుగా (గురువుగా) వచ్చి బోధించును. ఆ తత్త్వమును 27 దినములు నిర్విరామముగా ధ్యానించువారికి భైరవిదేవి అనుగ్రహించి జ్యోతిరూపమున శూలము ధరించి వచ్చి ఆదుకొనునే!!

(సాధకుల పరిపక్వత మెరిగి భైరవిదేవి జ్ఞానమొసగి ఆదుకొనును. గురు మండలము = శిరస్సున (శివ) సహస్రదళపద్మము. శూలము = సోమ (చంద్ర), సూర్య, అగ్నుల కలయిక.)

1081. శూలమును, కపాలమును చేతిలో ధరించిన దుర్గకు నాలుగు చేతులు. రెండు చేతులలో నాగపాశము, అంకుశమును ధరించియున్నది. నారాయణుడు, బ్రహ్మ ఎరుగని శివరూపమునకు శ్రేష్టమైన అంగముగా వెలసియున్నది శూలియైన దుర్గాదేవి.

(శూలమును ధరించిన వీరవనిత కావున శూలిగా పిలువబడి, ఆమెని శివుని మేలైన అంగముగా చెప్పబడినది.)

1082. సౌమ్యవంతురాలు, అధోముఖముగాను, ఊర్ధ్వముఖముగాను వ్యాపింపగలిగిన శక్తివంతురాలు. ధర్మము తప్పినవారిని, తప్పు చేయువారిని శిక్షించురాలు. అన్ని కళలలోను నున్న జ్ఞానమును పొందిన వనిత. పుష్పమువంటి ఎర్రని రంగు గలది. రత్నములో ప్రకాశించునటువంటి ప్రకాశము గలది. ఆమె శరీరము నానారకములైన రత్నశోభితముల వస్త్రములతో అలంకరింపబడినది.

1083. (భైరవి యొక్క రూపవర్ణన ఇంకా చెప్పబడినది.) అసాధారణ కళలతో నొప్పారుచున్న ఆమె దివ్యకేశములు, కొన్ని రత్నములతో అలంకరించబడినది. శోభితమైన ఆకాశతత్త్వమును కర్ణములుగా కలది. తోడైయుండు కన్య. మంచి శోభితములైన సూర్యచంద్రులను కళ్ళుగా గలది. బంగారు ప్రకాశముగా వెలసిల్లు మహాప్రకాశము అంతటా తాను వ్యాపించియున్నది.

1084. శిరస్సునందు వికసించియున్న అష్టదళ పద్మమునందు, శ్రేష్టమైన దైవత్వముతో నిండి త్రిపురాదేవి (మనోన్మణిగా) గలదు. అచ్చట ఆమె చుట్టూ అష్టకన్యలు గుమిగూడి ఆవరించియున్నారు. అట్లు వారిచే (ఒక్కొక్క శక్తికి అష్టశక్తులతో

(8×8=64) అష్టకన్యలకు) వ్యాపించియున్నవారు అరువదినాలుగు శక్తులు. అట్లు గుమిగూడి త్రిపురాదేవిని దర్శించుచూ నిలబడియున్నారు.

(అష్టశక్తులు: వామ, జేష్ట, రౌద్రి, కాళి, కళవికరిణి, బలవికరణి, బలప్రదమణి, సర్వభూతమణి. ఈ ఎనిమిది శక్తులు ప్రణవములో కలదు. అష్టకన్యలకు అష్ట శక్తుల తోడుతో అరువదినాలుగు పృధివాది వృత్తులు త్రిపురాదేవి చేయుచున్నది.)

1085. ఆమె ధరించియున్నవాటిని పరిశీలించి చూచినచో, అవి గండపేరండము, గాజులు, శంఖు, చక్రము. అష్టదిక్కులందును వ్యాపించి, ఇమిడియున్న యోగిని, పరాశక్తి. అన్ని అండములను, అన్ని దిక్కులను మోయుచున్న దైవస్వరూపిణి. శిరస్సునందు ఉంచి (సహస్రదళమున) ఆమెను పూజించుటకు అర్హురాలు.

(పేరండము, గాజులు, శంఖు నాదమును ఉత్పత్తి చేయుతత్త్వము గలవి. చక్రము ప్రకాశమును, శక్తిని ఉత్పత్తి చేయును. వీటితో జనుల పాపవృత్తులను తొలగించి అనుగ్రహించు శక్తి త్రిపురాదేవి.)

1086. పూజకు తగిన సామాగ్రి, పృథివి అంశమైన గంధము, సుగంధ పుష్పములతో, మామిడి తోరణములతో, నిర్విరామముగా చేయు ఉపాసనతో ఆ దేవి అనుగ్రహముతో ఒక విధమైన నాదము వినబడును. ఆ వినబడు నాదమే పఠనము చేయని (నోటితో ఉచ్చరించని) శ్రేష్టమైన మంత్రమగును. దీనిని గ్రహించి ప్రకాశ రూపిణియగు త్రిపురాదేవిని దర్శించగలరు.

(బాహ్యముగా చేయు పూజా విధానములోనే, యోగపరిభాషలో అంతర ధ్యానముతో బుద్ధిలో స్పృహతో గ్రహించబడు నాదము, ప్రకాశములతో దేవిని దర్శించవలెనని మానసిక పూజ చెప్పబడినది.)

1087. ఇట్లు చూడబడు దేవతలు ఎందరో కలరు. ఎన్నో రకములుగా చేయబడిన ఆభరణములలో ఉన్నది ఒక్క బంగారు లోహము. ఎన్నో రకములైన ఆభరణములు వారివారి ఇచ్ఛకు తగినట్లు బంగారముతో చేయబడిన భేదమే, పలు దేవతలు వంటి దేవి భేదములుగా గలరు. శ్రేష్టముగా కొలువబడు శివుడు, బ్రహ్మ, విష్ణువులు ఉన్ననూ, వారందరికి వృత్తులకు కారణకర్తగా ఉండి జరిపించునది పరాశక్తియే అని గ్రహింపగలరు.

1088. అన్ని మంత్రములకు కారణమైన సూక్ష్మ ఓంకారిణి ధ్యానించు పద్మములో (సహస్రదళమందు) ఇమిడినది, శ్వాసరేచకము చేయునపుడు గలిగిన పూర్ణ కుంభములో వెలసిల్లినది నారాయణి (నారాయణుని చెల్లెలు)యేనని, నందీశ్వరుడు (గురునాధుడు) చెప్పి అనుగ్రహించినది వేదాంతముగా (ఉపనిషత్తుల ఉపదేశముగా ఉన్నది.

అన్నిటికి కారణ కార్యములుగా నున్న దేవియే కేవల కుంభకములో (యోగ పరిభాష)ను ఉన్నదని, ఆమే అన్నిటికీ అంతముగాను (చేరుకోవలసిన గమ్యము గాను), వేదాంతముగాను (ఉపనిషత్తుల వాక్యముగాను) నున్నదని నంది – గురునాధుని అనుగ్రహము వలన గ్రహించబడినది.)

1089. చిటికెన వ్రేలు మొదలిడి మధ్యవ్రేలి ముగుయు వరకున్న ఆరుగదులలో గురునాధుడు ఉపదేశించిన "షటాక్షరి"తో ఉచ్చరించి, మరలా మధ్యవ్రేలి నుండి మొదలిడి చిటికెన వ్రేలి వరకు షటాక్షరి మంత్రోచ్చారణ చేసినచో, ఆదే తమిళ తత్త్వము శక్తులని గురునాధుడు ఉపదేశించిన దేవి ఉపాసన కొత్త సాధనయగును. (చిటికెనవ్రేలు – పృథివి అంశము; ఉంగరము వ్రేలు – జల అంశము; మధ్య వ్రేలు – అగ్ని; చూపుడు వ్రేలు – వాయువు; బొటనవ్రేలు – ఆకాశ అంశము; చిటికెన వ్రేలు నుండి మొదలుపెట్టి – మధ్యవ్రేలితో ముగుయునది – ఆరు గదులలో షటాక్షరంను నింపుట (పృథివీ తత్త్వముతో ప్రారంభించినది). మధ్య వ్రేలు నుండి మొదలుపెట్టి – చిటికెన వ్రేలుతో ముగుయునది అగ్నితత్త్వముతో ప్రారంభించినది. దీనిని యోగ ఉచ్చారణలో మార్చిమార్చి చేయవలెనని గురునాధుడు ఉపదేశించి యున్నారు.)

1090. భైరవిదేవి నవశక్తుల కలయిక – మనోన్మణిగా పిలువబడి, ఆమె తత్త్వములో నెలకొనిన పన్నెండు వృత్తులను గ్రహించి, ఆ ధ్యాసలో నుండి ధ్యానించువారికి గురునాధుడే ఆమెకు అవసరమైన విధివిధానములను బోధించి ఆకట్టుకొని, అష్టప్రసాద కళలను అనుగ్రహించి, దేవిని ప్రాణమునందు నెలకొనునట్లు చేయునే!!

1091. శరీరము వెన్నెముకలోని మధ్యనాడియగు సుషుమ్నానాడిలో నెలకొన్న దేవి దయాహృదయురాలు. ప్రాణముతో కలిసి నెలకొన్న మోహమను అజ్ఞానమును సమూలముగా తొలగించి కుండలినీయందు నెలకొన్న బాల, మూలాధార చక్రము నుండి ఉత్పన్నమగు మూలవాయువును సక్రమపరచి (ప్రకాశమండలములలో శిరస్సు – సహస్రమున) నెలకొనునట్లు సహాయపడి వెనుదిరుగును. ఇటువంటి దేవిని నీవు గ్రహించి దర్శించుదువు గాక!!

(ప్రకాశమండలములో నెలకొనునది అమృతముగా – పరమానందముగా చెప్పబడి యున్నది.)

1092. ఉపదేశించబడిన హృదయ మంత్రము అర్థమెరిగి, శిరస్సు పీఠములో నెలకొని యున్న త్రిపురాదేవికి "నమ" అని చెప్పి నమస్కరించండి. వెదురు స్థూపమువలె నున్న వెన్నెముకలోని మధ్యనాడి సుషుమ్నలో నిలబడి మీ ఆహుతిని "స్వాహా" అని స్వీకరించును. శిరస్సు మధ్యన వెలసియున్నది "శిఖా" మంత్రమని

గ్రహించండి.

(అంగన్యాసములు ఆరింటిలో: 1. హృదయాయనమః, 2. శిరసేస్వాహా, 3. శిఖాయై వషట్, 4. కవచాయ హుం, 5. నేత్రత్రయాయ వౌషట్, 6. అస్త్రాయ ఫట్. మూడింటిని చెప్పబడినది.

హృదయము, శిరస్సు, శిఖలో నెలకొని "నమ", స్వాహా, వషట్ మూడింట మంత్రమహియ పొందుటకు చెప్పబడినది.)

1093. "శిఖా"గా గ్రహించబడిన శిరస్సు మధ్యన అమరిన సహస్రమునందు ప్రకాశము పొందినది "కవచము"గా మారి శరీరమంతటిని ప్రకాశింపజేసి, సూర్య, చంద్ర, అగ్ని కలయికయగు "నేత్రత్రయము" ఆకట్టుకొని, కామాదిషట్వరిష్టములతో అజ్ఞానమును నింపిన వాటిని మార్చి (పరిపక్వమొనర్చి) శూలముగా (అస్త్రము) (శూలినిగా) యోని నుండి కపాలము వరకు ప్రకాశముగా నెలకొన్న దేవిని గ్రహించండి (శూలము గలిగినది కనుక శూలిని).

(అంగన్యాసములోని మిగత మూడింటిని వర్ణించినది.)

1094. చిటికెనవ్రేలును, ఉంగరము వ్రేలును ఒక్కటిగా చేర్చి, వాటిని వంచి, బొటన వ్రేలి ద్వారా అదిమిపట్టి, బొటనవ్రేలిని మధ్యవ్రేలు, చూపుడువ్రేలుతో కలిపి అదిమి పట్టవలెను. ఇది జన్మాంతర కర్మలను తొలగించునదిగా 'చిదాకాశ ముద్రగా' పిలువబడినది. దీనివలన ప్రాణభయము, జగత్తు బంధము తొలుగును. (ఇవియన్నియూ గురుముఖముగా నేర్వవలెనని బోధించినది.)

1095. చిదాకాశముద్రలో చిదాకాశ మంత్రమును జపించుటకు ఇందు చెప్పబడినది. అగ్నితత్త్వమగు "శి"కారములో (పంచాక్షరిలో మధ్య అక్షరము 'శి') 'ఇ'కారము తొలగించి, 'మ'కారమును అర్ధమాత్ర బలముతో అనగా 'మ్'గా, 'శ'తో చేర్చి 'శమ్'గా ఉచ్చరించవలెను. దీనివలన ప్రాణణ (శ్వాస) వశపడును.

1096. ఇట్లు జపించు సాధకునకు ప్రాణణవృద్ధి పొంది, భావించిన శకారముతో శివుడును, యకారముతో ఆత్మ ఒకటిగా జతపడి, దేహములో నున్న మాయను పోగొట్టి 'శంఖు' నాదము వినపడునట్లు చేయును. అట్లు నాదము శరీరములో ఘషించునపుడు దేవి శోభితముగా నెలకొని అనుగ్రహించును.

1097. నెలకొన్న భైరవిదేవి నీలిరంగు శరీరఛాయ గలది. నిశాచరి (హృదయగుహ చీకటిలో చీకటిగా నుండునది). మనస్సు, వాక్కు, కాయములు ఏకమై పరిపక్వ మొందినవారిలో తాను స్వయముగా వెళ్ళి వారిలో నిలబడి అనుగ్రహించు నాయకురాలు. దేవాదిదేవుడైన పరమశివుని యందు తానుండి అనుగ్రహించునది. కావున లోకులైన మీరు ఆమెని స్తుతించి అనుగ్రహము పొందండి.

1098. ఇట్లు చిదాకాశ మంత్రరూపిణియగు దేవి వేదముగాను, అండచరాచరములు గాను, పంచభూతములుగాను, నాలుగు దిశలను తనయందు ఇముడ్చుకొన్నదియు, త్రినేత్రధారిణియు, చీకటి అండములుగాను, ప్రకాశము నిండిన మహామండలము గాను, పలు జన్మలు పొందు జీవులలోని ప్రాణముగాను, జ్యోతిస్వరూపరాలు, చలించు జగత్తుకు చలనశక్తిగాను నున్న పరాశక్తి అన్నీ తానై నెలకొన్నది ఆదిశక్తియే నాయకురాలుగా నున్నదని గ్రహించవలెను.

1099. ఇట్లు అన్నీ తానై ఆదిశక్తి భైరవి ఎప్పటికీ నవయవ్వనరాలుగా, అండచరా చరములను కాపాడు రాణిగా నున్నది. తన మంత్రోపాసన చేయు సాధకుని జ్ఞానములో ఇమిడి శివతత్త్వమును పొందజేయును. అజ్ఞానముతో పొందదగు లౌకిక జన్మలు ఇక లేకుండా చేయును. మాటలతో వివరించలేని అనుగ్రహమును సాధకునకు ఆశీర్వదించును.

(భైరవిదేవి సాధకుని బుద్ధిలో నెలకొని జ్ఞానము పొందించి, శివతత్త్వమేర్పరచి, ఇక పునర్జన్మ లేకుండా ఆశీర్వదించును.)

1100. అందమైన భైరవిదేవి శిఖయందు నెలకొన్న తల్లి. దట్టమైన కనుబొమ్మలు, నల్ల కలువలు వంటి కన్నులు కలది. నేత్రముల నుండి ఆనందబాష్పములు కార్చి ప్రకాశముతో మెరయు ఆనంద సుందరి. ఇట్లు అమరిన శ్రేష్ఠములందు శివతత్త్వమును నెలకొనునట్లు అనుగ్రహించును.

(మనోలయమగునపుడు శివతత్త్వము ఏర్పడును. అదే మనోలయముతో ఆనందమును ఇముడ్చునది శక్తియే. శక్తి శివం ఇట్లు బహిర్గతములైనవి.)

1101. శివంను బహిర్గతము చేసి, దానివలన గలుగు ఫలమును ఎరిగించి, తేట జ్ఞానమును బోధపరచి, నా చిత్తమును వికసింపజేసి, కిరణములతో కూడిన పరంజ్యోతి మహామహుని ప్రకాశింపజేసి నన్ను ఆదుకొని అనుగ్రహించెనే!!

(ఆత్మ పక్వమగుటకు ముందుగా శక్తి ఇమడవలె. పిదప శివుడు బహిర్గతమగునని ఇందు చెప్పబడినది.)

1102. శిరస్సునందు అమరిన సౌందర్యవంతురాలైన త్రిపురాదేవి పెక్కు కోట్ల జీవ రాశులలో ఇమిడి, వాటినంతటని తాను భరించుచున్నది. షోడశకళలను తనయందు వరుసగా గలిగి, ఆకాశమంతటిని వ్యాపించి నెలకొనియున్న సోమ, సూర్య, అగ్నుల మహాప్రకాశమును తానే సృష్టించినది.

1103. సౌందర్యవతి, తపస్సులకు నాయకురాలు, అనుగ్రహ వీక్షణముతో జగత్తులోని మోహమును తొలగించు మనోన్మణిని మెల్లగా స్తుతించి శరణునొందండి. శరణు నొందిన పిదప దుర్భరమైన ఈ పునర్జన్మ మీకు చేరజాలదు.

(మెల్లగా అని చెప్పినది: సాధకులు సాధనలను వేగముగా చేసి, శరీరమును శుష్కింపజేయరాదు. సాధనలన్నీ మెల్లమెల్లగా జేసి, వృద్ధి చెందింపవలెను. శ్రీదేవి ఉపాసకులకు పునర్జన్మ దరిచేరదని వక్కాణించియున్నది.)

1104. వెదురువంటి భుజములు గలది, భుజములపై శిరస్సు మండలములోని పద్మములో నెలకొన్నది, వెన్నెముకలోని మధ్యనాడియగు "చిత్రాణి"లో వెలసినది, నెలవంకను ధరించినది, దివ్యమైన శిఖను గలిగిన శూలిని (శూలమును ధరించినది) నా హృదయమున నెలకొన్న అనుగ్రహరూపిణి.

1105. శ్రేష్ఠమైన దక్షిణమున నెలకొన్న కన్యాకుమారి. ఎవరితోను పోల్చలేని ఏకైక నాయకురాలు. తానే అధిపతి. నా మూడు మలములను తొలగించి, వాటినుండి నన్ను వేరుచేసి, నా చిత్తము ఆమెయందే నెలకొనునట్లు చేసి, ఆమెను స్తోత్రించునట్లుజేసి నన్ను ఆకట్టుకొని నిలచెను.

(శ్రీదేవి భైరవి లౌకిక కామ్యకర్మలు కల్పించి, తానే వాటిని వేరుచేసి, చిత్తము తనయందు పదిలమగునట్లు జేసెనని రచయిత తన స్వీయ అనుభవములను చెప్పుచున్నారు.)

1106. నాడులు మూడు. అవి ఇడనాడి, పింగళనాడి, సుషుమ్నానాడి. వాటికి మధ్యన నాళమువలె నుండునది "చిత్రాణి"నాడిలో ఇమిడిన కుమారి కులకన్య. ఆమె దివ్య పాదముల చలనములతో ఏర్పడు అందెల శబ్దముతో నాదముగా ఏర్పడి, నా చిత్తములో ప్రశాంతముగా నెలకొనియున్నదే!!

(కులకన్య: గుమిగూడిన కన్యలు – ప్రణవములో శక్తులు 64 (8×8=64). శివుడు అకులము – ఏకము – అసంగము.

అందెల శబ్దము: యోగపరిభాషలో మూలాధారములో శక్తులు ఏకమై పరిపక్వమైన కణములు ఒకదానితో ఒకటి చలనక్రియలో ఏర్పడిన రాపిడిచే ఏర్పడు శబ్దము శిరస్సుకు ప్రాకి, నాదముగా ఏర్పడి, ప్రశాంతతను చేకూర్చునది.)

1107. నేను ఆమెను నా చిత్తమునందుంచి యోగనిద్ర చేయునపుడు మనోన్మణిదేవి లేచివచ్చి, శబ్దించు గాజులచేతితో నా కంఠమును బాగుగా నిమిరి, ప్రకాశించుచున్న తన శక్తిని నా కుత్తుకలో ప్రవేశింపజేసి, అయ్యా! నిదురించకు సుమీ!! అని ఉపాయము చెప్పినదే!!

(మూలశక్తి మూలాధారము నుండి ఇడ, పింగళ నాడుల ద్వారా ఊర్ధ్వముగా పైకి లేచి, సుషుమ్నానాడిలో శబ్దించు నాదముగా మారును. కంఠమునకు అధోముఖముగా వెళ్ళదగు ప్రాణశక్తిని వెళ్ళనీయక కుత్తుకనందే నిరోధించి సహస్రదళము, ఆపై బ్రహ్మరంధ్రమునకు ప్రాకించి, అనుగ్రహించునదియు,

నిద్రకాని నిద్రగా చేసి జాగరూకతతో సాధకులు గమనించవలెనని దేవి ఉపాయము చెప్పెనని వివరణ.)

1108. ఉపాయములు చెప్పు తల్లి (దేవి) నా చిత్తమునందే పదిలమైయున్నది. కామాది దుష్టచతుష్టయముల వల్ల ఏర్పడు కీడు నానుండి తొలగించి, దైవమునందు అపారమైన భక్తి, ప్రేమ ఏర్పడునట్లు చేసి, కుక్కవలె తిరుగాడు నా మనస్సును సుషుమ్నయందు నిలకడ పొందునట్లు చేసి, నా ఆశలను అణగద్రొక్కి, భయపడకుమీ!! అని అభయమిచ్చెను.

(దుష్టచతుష్టయములు: కామము, క్రోధము, రాగము, ద్వేషము. రచయిత శ్రీ తిరుమూల నాయనార్ పరమయోగి, మహాసిద్ధుడు, మహాజ్ఞాని, సకల శాస్త్రము లెరిగినవారు. అటువంటి మహాత్ముడు లౌకికుల కొరకు తనను తాను కించపరచుకొని పామరులకు అర్థమగునట్లు లౌకికభాషలే వాడియున్నారని గ్రహించగలరు.)

1109. భయపడకుమీ!! అని చెప్పి అనుగ్రహించు జ్ఞానప్రదాత. తపస్సులకు దర్శన మొసగునది. శుద్ధమైన వాక్కు ప్రదాత. తనయందు శరణునొందిన వారికి భయపడకుమీ అని చెప్పి అభయమొసగు దైవస్వరూపిణి.

(శుద్ధమైన వాక్కు: సూక్ష్మ పరాపశ్యంతి, మధ్యమ, వైఖరినందు (వెన్నెముక చక్ర స్థానములో) జనించు నాదము కంఠమునకు వచ్చునపుడే అవి శుద్ధవాక్కుగా మారును. అనగా నోటినుండి శబ్దముగా వెలువడును. అన్నింటిని అనగా నాదము, శబ్దమును తనయందు ఇముడ్చుకొన్న నాయకురాలు దేవి.)

1110. పుణ్యాత్ములచే స్తుతించబడి అనుగ్రహము నొసగు వీరవనిత. నల్లటి దేహఛాయ గలది. కారణరూపిణి (పంచకృత్యములు జరిపించు జగత్కారణ రూపిణి) నారాయణి. శరీరము, ప్రాణము, జగత్తు వీటినంతటిని లయము చేసుకొను ఘోరస్వరూపురాలు. అటువంటి తల్లి నా చిత్తములో ప్రేమతో ఇమిడి నిలుచున్నదే!! (నారాయణి యోగుల జ్ఞానములో ఇమిడి నిలుచుండును.)

1111. నాదమును బహిర్గతమొనర్చు సౌందర్యకూమారి. నా హృదయమును స్పృజించి, శిరస్సునందు (సహస్రదళ పద్మమున) నెలకొన్న కళలతో కలిసి ఏకమై, చంద్రకళలను (నెలవంక)ను ధరించియున్నది.

(సౌందర్యవతియైన దేవి హృదయమున సృజించి శిరస్సున కళలతో నెలకొని యున్నది. నాదాంతములో శివునితో లయమగునప్పటి వరకు ఆమె కుమారిగా పిలువబడినది.)

1112. నదుటిపైయున్న అర్థచంద్రాకారపు ప్రకాశమునకు శ్రేష్టము కలిగించునదైన

మనోమండలములో వక్షోజములకు మధ్యభాగమున ఇమిడియున్నది. సహస్ర దళమున శివునితో లయమగుటకు తన క్రీడలతో తీగవలె ప్రాకి, అందే నెలకొని యున్నది.

(శిరస్సున యున్న చంద్రమండలములోనున్న శక్తి, శివుని పొందగోరి తాను క్రీడించుచూ కాచుకొనియున్నది.)

1113. నా చిత్తమునందు పద్మపురేకులవలె విప్పారి ఆమె నెలకొనియున్నది. కొండనాలుకకు నాలుగు అంగుళముల పైన తను ఇమిడియున్నది. పక్వము పడిన జ్ఞానమగు శివునితో చేరి ఏకమైయున్నది. అనుగ్రహ తపస్సుచే పొందిన ఫలము వలన ఆమె ఆదిశక్తిగా నాలో నెలకొనియున్నది.

(ఆదిశక్తి చిత్తమయమైన దేవి. చిత్తము పృథివి ముఖముగా అనగా అధోముఖముగా వెళ్ళునపుడది కుండలినీశక్తితో కలిసి, లౌకిక వ్యవహారములను చక్కబెట్టును. అదే చిత్తము శిరస్సుకు ప్రాకి, అందు నెలకొనునపుడు శివంతో చేరి జ్ఞానశక్తిగాను మారి జనులకు వారివారి తపోఫలములను సిద్ధింపజేయును. ఆదిశక్తియే వ్యవహారిగాను, అవ్యవహారిగాను నెలకొని, ఏకమై శివశక్తిగా నున్నది.)

1114. ఆదిశక్తియే – ఆది (అన్నిటికీ మొదటిది), అనాది (తనకు ముందు మరేదియు లేనిదిగా), అకారణి (తనకంటూ తన స్వార్థము కొరకు ఏ కారణము లేనిదిగా), కారణి (అన్నిటికి తానే కారణరూపిణిగా), జ్యోతిలో జ్యోతి, శుభపరసుందరి (పరాజ్ఞానము నొసగు సౌందర్యవతి), మాతా (సుఖమునొసగు తల్లి), సమాధి (సమాధి యోగమును ఇచ్చునది), మనోన్మణి, మంగళరూపిణి నన్ను అనుగ్రహించి, నాలో విడదీయలేనిదిగా వెలసియున్నది.

1115. నాలో విడదీయలేనిదిగా నెలకొని, నన్ను కోరి నిలుచుండెను. అప్పుడు నేను శివరూపిణిగా నున్న దేవిని "నమశివ"తో నమస్కరించితిని. బ్రహ్మ సృష్టికి సామర్థ్యము కూడ ఆమే యగును. నాలో బంధములను త్రెంచివేసెను. నాలోనున్న అన్ని శంకలను తొలగించివేసెను.

(పుస్తక పఠనముతో ఏర్పడిన శంకలన్నీ అనుభవముతో తొలగిపోవును.)

1116. సత్యజ్ఞానము ఎరుగక వట్టి తర్కవాదములు, శంకలతోనే తమ మొత్తము కాలము వెలిబుచ్చిరే ఈ పేదజనులు!! (జ్ఞానశూన్యులు, మూఢులను పేదగా రచయిత పేర్కొనియున్నారు.) కాని ప్రయత్నించువారికి ముక్తినొసగు మొదటి నాయకురాలు. చేపవలె కంటిరెప్ప వాల్చని త్రినేత్రురాలు, ఎర్రని జ్యోతిని ప్రజ్వలించు తల్లి, కరుణతో నిండిన దివ్యముఖముతో మనలో నెలకొనిన ఉన్నతురాలు.

1117. మనస్సు, హృదయము, చాతి మూడింటిలోను (మనోమండలముగా) ముందు

తలంపులకు వాక్కు పుట్టినది. తల్లి పరాశక్తి జన్మించినవారిలో వారి చిత్తము, మనస్సు, బుద్ధి మూడింటి ద్వారా దైవమును తెలుసుకొనజాలక మాయతో మరిపించి యుంచినది. ఇది ఎరిగి అనుగ్రహించగలగిన తల్లిని చిత్తమున పదిలము చేసుకొనినచో, తన శుద్ధమాయతో అవ్యక్తము కానిదానిని (జ్యోతిని) వ్యక్తము చేసి, అనుగ్రహము పొరించు కన్యగా (కన్యాకుమారిగా) పరాశక్తి యున్నది.

1118. ఇట్లు కన్యగానున్న పరాశక్తి ఎప్పటికీ నాశరహితురాలు (శివునితో సహస్ర దళమును చేరని శక్తి, షట్చక్రములలో యున్నంతవరకు ఆమె కన్యయే). ప్రేయసిగా శివునితో ఐక్యము పొంది ఐదుగురికి జన్మమిచ్చెను (బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు). ఆమె శుద్ధవాక్కుతో నాదస్వరూపిణి. ఆ నాదములో వేదములు స్తుతించు శివుడు అచ్చటనున్నాడు. ఇటువంటి మాయయే చీకటిగాను వెలసియున్నదే!! (ఏమి ఆశ్చర్యము!!)

(మూలాధారము నుండి సృష్ట్యాది పంచకృత్యములు జరిగిననూ అది చీకటి మయమైన అజ్ఞానముతో జరిగినదే కదా!!)

1119. శక్తి చీకటిమయమైనది. జ్ఞాన వెలుతురులో వెలుగునది శివం. పుణ్యపురుషులచే గ్రహింపబడునది – శివంతో కలిసిన శివబోధములో గలుగు ఆనందము. ఇట్లు తేటనైన జ్ఞానముతో చిత్తమున నాదములో నెలకొనినచో, నా ఆదినాయకుడైన శివుడు నాదములో ఇమిడి అనుగ్రహమొసగునే!!

(చీకటిని శక్తిగా చెప్పినది – అజ్ఞానముతో కూడిన తత్త్వము. ఇది పరిపక్వమొంది తేట జ్ఞానముతో శివంను కొలిచినచో – అనుగ్రహము గిట్టును.)

1120. ఆది, అనాదిగా వెలసిన పరాశక్తి, అర్థ శరీరములోనున్న పరాపరము. అన్ని దేవతలకు శ్రేష్టమైన, మిన్నయైన నాదశక్తి. అన్నిటినీ తనయందు ఇముడ్చుకొన గలిగిన శక్తివంతురాలు. మనోన్మణి, నిత్యసుమంగళి, మంగళరూపిణి, ఆమెను కొలుచు నా హృదయమునందే ఆమె నెలకొని వ్యాపించియున్నది.

(పరాశక్తిని అర్థ శరీరముగా: అర్థనారీశ్వరతత్త్వము, విడదీయలేని తత్త్వమును చూచించునది. నాదశక్తిని – ఆమె గాజుల శబ్దమును వర్ణించియున్నది.)

1121. నేర్వదగిన విద్యలకెల్ల ఉన్నతమైన, పరమ ఉత్కృష్టమైనది ఆత్మజ్ఞానమేనని వేదము లన్నియూ అనాదిగా వచ్చి ఘోషించినను, లౌకికులు ఎరుగక యున్నారే!! శక్తియే అన్ని జాతిభేదముల (జాతి, మతం, కులం భేదములు) అన్నిటికి కారకురాలు. ఆమే అన్ని భేదతత్త్వములకు మూలముగాను ఉండి, ఆత్మనాయకిగా ఆశీర్వదించు ఆదిశక్తిగా నున్నది.

1122. ఆత్మల వృద్ధురాలు (జీవులకు ఆత్మనాయకి, ఆదిశక్తిగా) వెన్నెముకలో నెలకొని పరిపక్వమొనర్చు వాగీశ్వరి (వాక్కు + ఈశ్వరి) శుభములొసగు దైవమని అందరి నోళ్ళలో కొనియాడబడిన దేవనాయకురాలు. శివంకు తగిన శివవనిత. అందరిచే కోరి స్తుతించబడు ఆదిశక్తి నా పూర్వజన్మ కర్మలను తొలగించి అనుగ్రహించినది. (మంత్రమంతయూ భైరవిదేవిని వృద్ధురాలుగా చెప్పబడినది – దానిని మనము ఆదిశక్తిగా, అనాదిగా గ్రహించగలము.)

1123. నా పూర్వజన్మ కర్మఫలములను తొలగించి ప్రకాశములో వెలసినది. తనయందు శరణు పొందిన వారందరిలో సత్యతత్త్వముగా నెలకొనును. నన్ను పూర్తిగా తన వశపరచుకొనెను. ఈశ్వరుని భర్తగా చేసుకొని, అర్ధనారీశ్వర తత్త్వము పొందిననూ, శివంను చూచు కోణములో ఈమెయూ అనాదియే అగును.

(అనాది: బహుపురాతనమైనది, ఆది అంతము లేనిది. ఇచ్చట శ్రుతిలో చెప్పబడిన కార్యకారణ విలక్షణము – ఏది ముందు, ఏది వెనుక వచ్చినది అన్న వివాదము – చెట్టు ముందా? విత్తు ముందా? కోడి ముందా? గ్రుడ్డు ముందా? ప్రశ్న లేవదీసియున్నది.)

1124. దేవి అన్నిటికి మొదటిది, పురాతనమైనది. తనకని ఏ కారణము లేకపోయిననూ అన్నిటికి ఆమెయే కారకురాలు. వేదము పఠించువారిలో వాగ్దేవిగా నెలకొని, శాశ్వత పరంజ్యోతిగా శివునితో జేరి, రూపమును పంచుకొనియున్నది. పన్నెండు రాశులతో నెలకొన్న సూర్యునివలె ప్రకాశరూపిణిగా, అనుగ్రహప్రదాతగా, శక్తి నెలకొనియున్నదే!!

(శక్తియే శివునికి రూపముగా యున్నది.)

## 7. పూర్ణశక్తి

(శక్తి శివునితో చేరిన పూర్ణశక్తి)

1125. అన్ని భువనముల అంతము, అవి ఎచ్చట ఇమిడిపోవుచున్నవో, అవి ఆది ప్రాణుడైన శివునియందు లయమొందుటయూ, అన్ని జీవరాశులలో స్త్రీ, పురుష లింగభేదములతో ఏర్పడుటయు, అన్నిటిలో శివశక్తుల వృత్తులే జరుపుచున్నవని నేను పరిశీలించి గ్రహించితిని.

(రచయిత పరిశీలించి గ్రహించినవన్నియూ శివుని అనుగ్రహము వలనే జరిగినవి.)

1126. జగత్తు సృష్టి, స్థితి పొందిన పిదప లయము చేయు ప్రక్రియ కూడ పరాశక్తియే చేయుచున్నదని జీవులు ఎరుగజాలరు. కుండలినీశక్తి పరాశక్తి చేరుసరికి అది పూర్ణశక్తి యగును. పుణ్యపురుషులకు వారి జన్మతకు తగ్గట్లు అనుగ్రహించునది ఈ కన్యాకుమారియే. జగత్తుకు వారిని తీసుకువచ్చిన కారణము జీవులను

ఆదుకొని తనలో లయపరచుకొనుటకే!!

(కుండలినీ శక్తి శిరస్సున చేరుసరికి అది పూర్ణత్వము పొంది, శరీరస్పృహ లేకుండా, శ్వాసప్రక్రియలు నిలచిపోయి, కుంభకములో నెలకొనును. ఈ పూర్ణత్వమే ఆత్మ పరముతో లయమగుట.)

1127. కుండలినీశక్తి శిరస్సు చేరుటచే మదగజములగు పంచేంద్రియ చేష్టలును, వాటితో చేరిన మనస్సును, లౌకిక వాసనలను పురికొల్పు రత్నములను పొదిగిన కిరీటము ధరించిన విష్ణువును, స్త్రీ భోగమును పురికొల్పు బ్రహ్మశక్తియు, ప్రేమతో కూడిన శివతత్త్వములో నెలకొనుటచే అన్నియూ వీగిపోయెను.

(కుండలినీశక్తి శిరస్సు సహస్రదళములో చేరుటచే (పరము) స్వాధిష్టానము (బ్రహ్మ – సృష్టికి పురికొల్పు కామవికారములు)న నున్న తత్త్వము, మణిపూర్వక చక్రమున (విష్ణువు – స్థితి పురికొల్పునది – లౌకికవాంఛలు) నున్న తత్త్వములు అన్నియూ ప్రేమమయమైన శివతత్త్వములో చేరుట వలన చేష్టలన్నియూ వీగిపోవును. తత్త్వములన్నిటిని దాటిన స్థితి శివతత్త్వము.)

1128. సుఖభోగములు అనుభవించుటలో ఏర్పడు ఆనందపరవశములో ప్రేమతో ప్రవేశింపగలిగిన నా తండ్రి శివుడును, దుఃఖమయమైన లౌకిక భోగములను అనుభవించునపుడు ఏర్పడు వ్యధలను ఓర్చుకొను శక్తినొసగు తల్లి పరాశక్తియు నా వెన్నెముకలో శివశక్తిగా నెలకొని ఆదుకొనియున్నారు.

(జీవుల లౌకికసుఖములలోను, దుఃఖములోను శివశక్తులు ఇమిడి, పరిపక్వతకు తగ్గట్లు బంధములను త్రెంచి ఆదుకొని రక్షించుచున్నారు.)

1129. తల్లి, తండ్రి సంభోగము వలన గలిగినది ఈ జన్మ అనే భ్రమ వీడి, జన్మకు తొలి కారకులు శుద్ధ మాయాతత్త్వముతో కూడిన తల్లి పరాశక్తి, శివుడు అచ్చట నెలకొనియున్నారు. ఇట్లు తల్లి స్థితి పొంది నాదముతో (శివుడు) ఇమిడి అనుగ్రహించును. ఆమె ఇమిడియున్నది మహాప్రకాశ మండలమును నంది (శివుడు) అని పిలువబడుచున్నది.

(జీవుల యొక్క నిజమైన తల్లిదండ్రులు శివశక్తులే అగుదురు.)

1130. మాలవంటి వెన్నెముక ఆధారములలో స్వాధిష్టానమను పుష్పమున వెలసిన చతుర్ముఖ బ్రహ్మ, సృష్టించిన జగత్తులో జీవుల ఆయుష్షు వంద సంవత్సరములు. బ్రహ్మతో కలిసి కూర్చొనియున్న సరస్వతీదేవి జ్ఞానవాణిగా – వాగ్దేవిగా నెలకొని యున్నది. సృష్టికి – బ్రహ్మకు తోడుగా ఉండి, నాలుకపై పలుకు పరవాక్కుగా వాగీశ్వరిగా, పరాశక్తి ఆజ్ఞను పాలించుచున్నది.

1131. సత్యస్వరూపియగు దైవమునందు తీవ్రమైన నమ్మకము ఏర్పరచుకొని శంకలు,

చింతలను వీడి శుద్ధమాయ యందు నెలకొన్నవారు, పిదప మాయాచేష్టలు అపనమ్మకమును వీడి మనస్సును స్థిరపరచుకొని, నాదమున సూక్ష్మముగా వెలయు పరమును గ్రహించినవారికి, దైవము వారి హృదయములో శాశ్వతముగా ఆసన మేర్పరచుకొనును.

(దైవముతో నిరంతర, గట్టి నమ్మకము ఏర్పరచుకొన్న మదిలో దైవము అమరి పోవును.)

1132. కరుణతో నిండిన తల్లి పరాశక్తి తానే కోరి తత్త్వనాయకురాలుగా నెలకొనియున్నది. ఊర్ధ్వలోకస్తులందరికి గోచరించునట్లు మనోమండలమును ప్రకాశము పొందునట్లు అమర్చినది. ఎర్రని తేనెవంటి తీయని కోరికలతో దేదీప్యమాన ప్రకాశముతో నాట్యము చేయు స్థలము చిదాకాశమని గ్రహించండి.

(చిత్+అంబరము=చిత్+ఆకాశము)

(ప్రకాశమండలములో పరాశక్తి నాట్యమాడి అనుగ్రహ ప్రదాతగా ఉండును.)

1133. పంచ తన్మాత్రలను (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు) అందజేయు పంచ జ్ఞానేంద్రియములు (చెవి, చర్మము, కన్ను, నాలుక, ముక్కు) ఐదును మాయా కార్యములు. వీటికి అతీతముగా శుద్ధమాయతో కూడి శక్తి అనుగ్రహముతో ఇమిడినచో, అది శాశ్వతమైన తత్త్వమును ఎరుగజేయును. శాశ్వతతత్త్వమెరిగి అందే నిర్విరామముగా చిత్తమున పదిలపరుచకొన్నవారిలో శివశక్తులు నెలకొని అన్ని అభీష్టములు నెరవేర్చుదురు.

1134. రాత్రి పగలు అని విభజన లేక (కాలాతీతముగా) చిత్తములో శాశ్వత తత్త్వమును ఇముడ్చుకొన్నవారికి పరమానందము నొసగు నాదశక్తి (శిరస్సున నాదాంతములో) ఎటువంటి ఆర్భాటములు లేక ప్రశాంతముతో శివశక్తులు అనుగ్రహమును పొందించి, వారిని నవయవ్వనులుగా ఉంచును.

(దేశ కాలములు మానవుని ఊహాజనితములేనని శ్రుతులు ఘోషించుచున్నవి. దేశ కాల అతీతముగా శాశ్వత తత్త్వమును (ఆత్మజ్ఞానమును) చిత్తమునందు పదిలపరుచకొన్నవారిని శివశక్తులు వారి శరీరములకు మహానందమునొసగి, క్షీణత లేక, ఎప్పుడూ యవ్వనములో ఉంచుదురు.)

1135. నవయవ్వన శరీరము పొందిన సాధకుడు (చిత్తమున పదిలపరచుకొన్నవారు) తన గమ్యమునకు (బిందు, నాదములకు అతీతముగా దాటి) వెళ్ళి, అందు శక్తి, శివం అనే విభజనను వదిలిపెట్టి, శ్రేష్టమగు శాశ్వత తత్త్వమైన ఆదిమూలమును గ్రహించినవారై (పరాశక్తి యొక్క) తత్పరము తెలుయును.

(నాద, బిందులకు అతీతముగా నాదాంతములో నెలకొన్నవారికి శక్తి, శివం

అనే భేదము లేక శాశ్వత తత్త్వమగు (ఆత్మజ్ఞానమే) తత్+పరముగా–ముక్తికి మార్గము – ఆదిమూలముగా+గమ్యముగా గోచరించును.)

1136. నాదాంతములో వెలసి స్థితి పొందిన పరాశక్తి అనాది, శాశ్వతురాలు. శివునితో కలిసి, జీవులలో నెలకొనిన ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి. అధోముఖముగా వెళ్ళదగు క్రియాశక్తితో కలిసి శ్రేష్టములను, హితములను గైకొని నెలకొనునపుడు మూడింటిని పొందిన పరముగా ముక్తికి మార్గదర్శకురాలుగా మారును.

(జడముగా నున్నది, శివశక్తిగా పూర్ణము పొంది చలనమేర్పడిన శక్తిగా, జగత్తు సృష్టి కొరకు ఇచ్ఛాశక్తిగాను, కార్యవ్యూహం దాల్చునపుడు జ్ఞానశక్తిగాను, అనేక వృత్తులకు తగ్గట్లు కార్యరూపము దాల్చునపుడు క్రియాశక్తిగా నెలకొని జగత్తు, జీవుల అవసరములను తీర్చుచున్నది.)

1137. పుష్పము, సువాసనల వంటిది శక్తి, శివుడు. ఏకముగా జీవుల ఆత్మతత్త్వములో నెలకొనియున్నదని లౌకికులు ఎరుగజాలరు. అట్లు శక్తియు, శివుడు సమానముగా నున్నారని గ్రహించినందున శక్తి వలన గలగిన దివ్యభావనను నా చిత్తములో పదిలపరచి నెలకొనెను.

1138. అట్లు భావనతో చిత్తమున నెలకొన్న శివశక్తి – బిందు (ప్రకాశము), నాదముగా వ్యాపించియున్నారు. ఆ శక్తి చంద్రమండలమునకు నాయకురాలు. ఆరు ఆధారములలో వెలసియున్న తల్లి, సత్వగుణము గలిగినది. అకారము మొదలుకొని అక్షరమాలలో యాబదిఒక్క (51) అక్షరరూపములో నెలకొని వసించునది.

(శివశక్తి నాదబిందుగా విస్తరణ పొంది, అన్ని అక్షరరూపములుగా నున్నది.)

1139. అన్ని జీవరాశులలో మరిపించియుంచిన అమృత క్షీరమును (శిరస్సు–సహస్ర దళమున) కనుగొనుటకు అందరికీ సాధ్యము కాదు. మనోపరిపక్వమొందిన సాధకులు చిత్తశుద్ధితో తమ భ్రూమధ్యమున వెలయు జ్యోతిని అంతరమున గ్రహించి అనుభవము పొందిన సాధకుని వారి హృదయంలో దేవి పదిలమై ఊటవలె అమృతము స్రవింపజేయును.

1140. నన్ను తన బానిసగా చేసుకొనినవాడు శివుడు (సాధకుని తన వశము చేసుకొనుట) అగ్నిస్వరూపుడు – రుద్రజ్యోతిగా (సాధకుని జన్మకర్మ ఫలితములు నాశనమొనర్చి తనలో లయపరచుకొనువాడు) నందిపైనెక్కి స్వారీచేయువాడు. ఈ తత్త్వమును గ్రహించని అధములు వెళ్ళిపొండి!! ఈ సత్యమును చిత్తమునందు గ్రహించినవారు నా (హఠయోగ) సాధకులే!!

1141. పరాశక్తి అన్నిటికీ ఉన్నతమైన తత్త్వములో నెలకొనియున్నది – స్వాధీష్టాన చక్రములోని ఆరు పద్మరేకులలో (ఇది భూమితత్త్వం). భూమితత్త్వమునకు పైన

రెండువందల పదునెనిమిది (218) భువనములు గలవు. ఈమె సహస్రదళమునకు మా పుణ్యము వలన వచ్చి చేరినది. ఈమె భూమితత్త్వములో వెలసిన నాదశక్తియే అగును.

(పూవులోని 6+218=224 రేకులు వేరువేరుగా కనిపించునట్లు జీవుని చుట్టూ యున్న అండకాయములో (ప్రణవములో) 224 భువనములు గలవు. పృథివి (భూమి) అంశయగు స్వాధిష్టానములో 6 రేకులు, పై చక్రముల నుండి సహస్ర దళము వరకున్నది మిగతా 218 రేకులుగా నున్నది.)

1142. పరాపరము ఉన్ననూ, నాదశక్తియే అన్ని వృత్తులు జరిపించుచున్నది. ఈమెయే సర్వశక్తివంతురాలుగా "చిత్ శక్తి" వెలుగు జ్యోతి. ఈమె ఆకాశతత్త్వములో 'పూర్ణశక్తి' వెలసినందును, జగతత్తంతయూ శక్తితో జరుగుతున్నది.
(అన్ని భువనములను పని చేయునట్లు చేయునది ఈ శక్తియే.)

1143. స్వాధిష్టానములో వెలసిన కుండలినీ శక్తి మూలాధారములోనున్న నాలుగు పద్మరేకులలో మొదలిడి మణిపూరకం, అనాహతము, విశుద్ధి, ఆజ్ఞ, సహస్రదళము వరకున్న దానిలో అన్ని వృత్తులలో నవశక్తులుగా వెలసినవి. ఇవియన్నియూ మూలాధారా స్థానమునుండి వివిధ వృత్తులతో పైకి ప్రాకి, జ్యోతిగా సహస్రమున వెలిగినది.

1144. ఆదిశక్తి నెలకొనియున్నది, సహస్రదళ పద్మమైననూ, దానికి ఆధారమైనవి ఇతర చక్రముల నుండి వచ్చినవే. శరీరమును చిదాకాశములో ఇముడ్చునది సహస్రదళ పద్మమే అగును. పైకి ప్రాకించు వృత్తులు చేయునది ముక్కోణముతో కూడిన చతురస్రములో ఇమిడిన ములాధార చక్రమే.

1145. మూలాధార చక్రమునుండి బయలుదేరిన అగ్నిజ్వాలతో కూడిన శక్తి, ఆధార చక్రములన్నిటిలో వ్యాపించి, సుషుమ్ననాడి ద్వారా పైకివెళ్ళు బ్రహ్మరంధ్రమును దాటి ప్రకాశము పొంది, అన్ని చక్రములలో ఆ ప్రకాశమును చొప్పించి నెలకొనును.

1146. పూర్ణశక్తి పది దిశలలో పది ముఖములతో వెలసియున్నది. అందువలన వాయువు అన్ని దిక్కులకు వ్యాపించియున్నది. శిరస్సు వైపు పయనించిన తెల్లటి ముత్యము మరియు సహస్రదళమున నున్న మహాప్రకాశముతో తేనెవంటి తియ్యని రుచి గలిగిన నీరు, అధోముఖ నీటి ప్రవాహము నుండి పైకి వచ్చి, సహస్రదళమును చేరినదే అగును.

1147. నీలివర్ణముతో వెలుగు కన్య, పార్వతీదేవి, మనోన్మణి, కర్రకు చుట్టుకొన్న తీగవలె ఆధారచక్రములను పుష్పమాలగా కలది. నాదతత్త్వములో నెలకొని బంగారుఛాయ

గలిగిన దేహమును తయారుచేసి (పరిపక్వమొనర్చి, ప్రకాశమును చొప్పించి) తనతో నెలకొనియున్న శివుని తత్త్వముతో చేర్చుటకు ఆయత్తమగుచున్నది.

(జీవులను వారి సాధనకు తగ్గట్లు పరిపక్వమొనర్చి శివునియందు లయపరచును.)

1148. ఉత్కృష్టమైన దైవత్వముతో నిండి చతుర్వేదములు ఘోషించు ప్రణవములో నెలకొన్న శక్తి, పగడము వంటి ఎర్రనైన వస్త్రధారిణి, భూమి అడుగుభాగము వరకు తన పాదములు గలది, అఖిలాండములను దాటి, మూడు జ్యోతులను (సోమ, సూర్య, అగ్ని జ్యోతులు) తనయందు ధరించిన పరాశక్తి.

(తల్లి పరాశక్తి అఖిలాండములో (ఊర్ధ్వలోకములు ఏడు + అధోలోకములు ఏడు = పదునాలుగు లోకములు) వ్యాపించిన మహాశక్తి.)

1149. మన భువనాధిపతియైన దైవమును (శివుని) తన శరీరములో ఒకభాగముగా కలది (అర్ధనారీశ్వర తత్త్వము). కోటి అండములను (భువనములు–లోకములు) క్షణమాత్రా కాలమున తన సంకల్పశక్తితో మార్పులు చేయగలది. అన్ని మండలముల యొక్క ప్రకాశమును తనలో ఇముడ్చుకొన్నది. ఇట్లు అన్నిటిని తనయందు ఇముడ్చుకొన్న పరాశక్తిని స్తుతించుచున్నాను.

1150. దాసానుదాసుడైన నేను భువనాధిపతియైన తల్లిని స్తుతించుచున్నాను. నా తపస్సు శక్తిలో నిలుచున్న స్త్రీరూపమూర్తి. నా కోపమును మార్చి శ్రేష్టము నొసగిన ఎర్రని ప్రకాశరూపిణి. యముడుని పారద్రోలు శక్తివంతురాలు.

(భువనాధిపతియైన తల్లి పరాశక్తిని స్తుతించినచో యముడుని పారద్రోలగలము.)

1151. సుషుమ్నలో నాదముగా నెలకొనియున్న పరాశక్తి అన్ని సుఖములను ఇవ్వగలిగిన సుందరి సౌందర్యముతో నిండిన త్రిపురాశక్తి. ఉద్రిక్త గంగానది ప్రవాహము వలె ఉప్పొంగివచ్చు దుఃఖములను సమూలముగా నివర్తించి, శిరస్సుకు చేరండి అని చెప్పి అనుగ్రహించిన తల్లి. తన దాసానుదాసుల పాపములను పోగొట్టి ఆదుకొని అనుగ్రహించిన ఆదిపరాశక్తి.

(శబ్దించు గాజులు–నాదము; సుషుమ్న యందు నాదము–సాధకుని పరిపక్వత తెలుపునది.)

1152. సున్నితమైన సూక్ష్మనాదములో వెలయునది. ప్రాకామ్యములో వెలయు సూక్ష్మ అణువులతో కూడిన ప్రకాశరూపిణి. అనేకులచే స్తోత్రించబడు నాయకురాలు. స్తోత్రించువారి పరిపక్వము తగ్గట్లు ఫలము, అనుగ్రహమొసగునది. అశాశ్వతమైన భోగములకు, మెప్పులకు మురిసిపోవు దేహశక్తి నొసగిన తల్లి, సర్వశక్తివంతమైన నాదశక్తిగా నా మనస్సున ఇమిడి, ఆదుకొని అనుగ్రహించెనే!!

1153. ఆదిపరాశక్తి వలన స్థాపించబడినవాడే నా దైవము (శివుడు). తన సంకల్పనతో

జగత్తు సృష్టి చేయునపుడు తానే ఊర్ధ్వముగా, అధోముఖముగా అంతటా వ్యాపించి, వాటి అంతటిలోను తానే నెలకొని, వాటిలో ప్రాణమును చొప్పించునది కూడ ఆదిపరాశక్తియే. ఆదిపరాశక్తియే స్థాపితమునకు, ప్రాణప్రతిష్ఠకు కారణభూతురాలు. (ఆమే శివునిని కూడ సృష్టించి, పాలించుచున్నది.)

1154. పరాశక్తిని ఎరుగనివారు పలు దేవతలను స్తుతించెదరు. ముక్తినొసగునది మూల కారణముగా వెలయునది ఇదేనని గ్రహించజాలరు. గొట్టమువంటి చిత్రాణినాడి (సుషుమ్నానాడి)లో వెలయు పరాశక్తియే స్థితి పొందునదని ఎరుగని వారందరు పరిపక్వము పొందనివారే అగుదురు.

## 8. ఆధారము - ఆధేయము

(ఆధారము–ఆధారము/దన్ను; ఆధేయము–ఆధారపడినది)

అన్నం–అన్నాదం; ప్రతిష్ఠా–ప్రతిష్ఠితం; ఆధారం–ఆధేయం; తైత్తిరీయ ఉపనిషత్తు – భృగువల్లీలో వివరణలు ఇవ్వబడినవి. అన్నం–తినేది; అన్నాదం–తినబడేది; ప్రతిష్ఠా–ప్రతిష్టమగుట; ప్రతిష్ఠితం–ప్రతితిష్టమైనది.

ఆధారం–ఆధారమైనది. ఆధేయం–ఆధారపడినది; ఆధారం–తల్లిదండ్రులు; ఆధేయం–వారిపై ఆధారపడిన బిడ్డలు; బిడ్డలు పెద్దవారైన పిదప వారు ఆధారమై, వారి తల్లిదండ్రులు ఆధేయం అగుదురు.

1155. నాలుగు రేకులతో కూడిన మూలాధార చక్రము మొదలుకొని ఆరు ఆధార చక్రములలో ఆజ్ఞావరకు (స్వాధీష్టానం, మణిపూరకం, అనాహత, విశుద్ధి, ఆజ్ఞా చక్రముల వరకు) మధ్యన తొంబది నాడులు కర్మించుచున్నవి. వీటి మధ్యననున్న చక్రములలో నున్న రేకులు వరుసగా (6+10+12+16=44) నలుబది నాలుగుగా ఉన్నవి. ఇవి స్త్రీ, పురుష లింగభేదముతో ఆజ్ఞాచక్రములో నెలకొని యున్నది. శక్తియే అన్ని ఆధారములకు ఆధారభూతముగాను, వాటిని మోయు శక్తిగాను నెలకొనియున్నది.

(శక్తియే అన్ని ఆధారములలో నెలకొని, వాటిని మోయునదిగా ఉన్నది.)

1156. కర్మించు శక్తిగా సహస్రమున నెలకొని తన పూర్ణశక్తితో అన్నిటిని వీక్షించు శక్తిగా నెలకొని, వేదములో చెప్పబడిన ఆత్మతత్త్వమును బోధించి, పంచేంద్రియముల వలన కలుగు కీడును తేటపరచి (పరిపక్వమును బోధించి), వాటి చేష్టలను నిరోధించి, సాధకుని అనుగ్రహించి వెలసిన స్త్రీశక్తి పరాశక్తి.

1157. పంచేంద్రియముల చేష్టలను నిరోధించిన సౌందర్యవతి బుద్ధిపూర్వకముగా ఎరుగవలసిన తత్త్వమును బోధించి (శివుని చేరకుండునపుడు పరాశక్తిగా వెలసి), శివుని చేరి బోధించుటలో దేహఉపాధిని వీడి శివునితో అర్ధనారీశ్వర తత్త్వములో

పూర్ణశక్తిగా వెలుగొంది, సాధకుని విధివిన్యాసములను (కర్మఫలితములు), మలములను తొలగించి దేహభావన లేని తెల్లటి ఆకాశతత్త్వముతో ఆదుకొనుచున్నది.

(పరాశక్తి తన స్త్రీ అంశమున నున్ననూ సరి, శివునితో కలిసి (పూర్ణశక్తిగా) అర్ధనారీశ్వర తత్త్వముతో నున్ననూ అన్నిటినీ తనే వీక్షించి అనుగ్రహము నొసగుచున్నది.)

1158. చిదాకాశ తత్త్వములో వెలయు దైవము (శివుడు) ప్రేమమూర్తియైన దేవి - సువాసనలు, తేనెలు నిండిన పుష్పములు కొప్పున ధరించిన పరాశక్తితో కలిసి ఏకమైయున్నాడు. మాయాతత్త్వమునకు లొంగని శివుడు దేవితో కలిసి భక్తుల కోరికలకు తగ్గట్లు దర్శనమిచ్చిననూ, దేవికి తన శరీరములో అర్ధభాగము ఇచ్చినందున స్వాభావికమగు స్త్రీతత్త్వము తనలో గలిగియున్నాడు.

1159. స్త్రీగా సృష్టించబడిన వాటిలో స్త్రీతత్త్వమొకటే ఇమిడియున్నదను భావన అజ్ఞానమును సూచించునది. పరాశక్తిగా నెలకొన్న దేవిలో పురుషతత్త్వమును కూడ ఇమిడియున్నది (మంత్రము 1157, తానే అన్నింటిని వీక్షించి పరిపాలించుట). అట్లే పురుషతత్త్వములో స్త్రీతత్త్వము ఇమిడి కర్మించుచున్నది (మంత్రము 1158లో చెప్పినట్లు). ఇట్లు స్వాభావికముగనే స్త్రీతత్త్వము, పురుష తత్త్వము కలిసి కర్మించుటను చిత్తమున గ్రహించిన సాధకుడు తన సాధనలో మౌనము ఏర్పడును (వాక్కుకు ఇక పనిలేక పోవును).

(శివశక్తులు ఒక్కటై, సాధకుల చిత్తమున లయమగునపుడు మౌనము సిద్ధించును. పరమానందములో ఇక వాక్కు పనియుండదు.)

1160. మౌనాతీతము, శుద్ధతత్త్వము, నిష్కళంకము, జ్యోతిస్వరూపుడైన పరమాత్మతో, మనోన్మణి, స్త్రీశక్తి, తీక్షణలేని ప్రకాశ కిరణములతో కూడిన తల్లి పరాశక్తి కలిసి ఏకమై పూర్ణశక్తిగా ఎటువంటి కొరతలేక సాధకుని చిత్తములో నెలకొని పరమానందమును వారిలో ఏర్పచును.

(మనస్సు ప్రశాంతమైనపుడు చైతన్యం ప్రకాశించును.)

1161. నవయవ్వనురాలు మనోన్మణి, శివునితో చేరి జగత్తంతటికి వ్యాపించి, వాటికి ఆధారముగాను నెలకొని, పంచకృత్యములను జరిపించి, అంతటా తానైన స్త్రీగాను, పురుషశక్తిగా నెలకొని వేదముల కంతటికీ నాయకురాలుగా, శివశక్తిగా సాధకుల చిత్తములో నెలకొని పరమానందమును గలిగించుచున్నదే!!

(పంచకృత్యములు: జగత్తు సృష్టి, స్థితి, తిరోభావం, అనుగ్రహం, లయం.)

1162. పరిపక్వమొందిన చిత్తము గలిగిన సాధకునిలో శివుడు ఆనందము పొంగి

పొరులునట్లు చేసి, జీవాత్మలకు తగ్గట్లు ఆశీర్వదించి, వారిలో ఇమిడి, అన్ని లోకములు వారిలో ఇముడునట్లు చేసి, పరాశక్తికి భుజములకు భుజములుగా తోడుండి, అన్ని జగత్ కార్యములకు భోగిగాయున్నాడు.

(పరిపక్వమొందిన జీవాత్మలకు తోడుగా ఉండి, శివశక్తులు ఏకమై భోగిగా అనుగ్రహించుచున్నాడు.)

1163. ఎత్తైన వక్షోజములు, సన్నని నడుము, అవసరము తగ్గట్లు వ్యాపించి సంకోచించగల పాామువంటి శరీరము గలది, పరిశుద్ధ వాక్కు గలది, నెమలి ఈకలవంటి సున్నితమైన పాదపద్మములు గలదినగు సౌందర్యవతి పరాశక్తితో ఏకమై ఉండుటచే గలిగిన అనుభవమును మాటలతో వర్ణించుటకు శక్యముగాదు.

(సాధుకునికి పరాశక్తితో గలిగిన పరమానందమును వర్ణించి చెప్పుటకు అలవికాదు. అనగా అనిర్వచనీయమైన అనుభూతి.)

1164. పరాశక్తితో ఏకమైన సాధకునికి ఆమె పరిపూర్ణతత్త్వమును గ్రహించుటకు అంత సులభముగాదు. గ్రహించినా చెప్పుటకు అలవికాదు. ఆమె పీఠము మహా అగ్నితో కూడిన మహామండలము. కొలుచుటకు వీలుకానిదిగా అచ్చట పెక్కుమంది భ్రమించియున్నారు. కర్మభోగములను అధిగమించుటకు ఎవ్వరివల్ల సాధ్యము కానట్లు పరాశక్తి నెలకొనియున్నది. ఇటువంటి మహత్తరమైన, ఎదురించలేని శక్తులతో కలిసి మనోన్మణి నెలకొని అండచరాచరములను పాలించుచున్నది.

(మనోన్మణియే జీవులకు కర్మఫల భోగములను ఇచ్చి పరిపాలించుచున్నది.)

1165. మనోన్మణియే అండచరాచరములలో నెలకొని వాటిని పాలించు శక్తిగా, పంచ భూతములకు ఆధారముగా ఆకాశతత్త్వములో ఇమిడి, ఉష్ణమును నొసగు సూర్యుడుగా, చల్లదనమిచ్చు చంద్రునిగా, ఆమె కరుణతో కురిపించు వర్షముగా, శిరస్సు ఉత్తరభాగములో నెలకొన్న శీతల సముద్రముగాను, సముద్రములో నెలకొన్న బడబాగ్నిగాను (కామవాయువు) నెలకొని అన్నిటికీ ఆధారభూతముగా నున్నది.

(శిరస్సు ఉత్తరభాగమును – కైలాసంగా చెప్పబడినది. బడబాగ్ని – సముద్రము మధ్యనుండు ఉష్ణజ్వాలతో కూడిన అగ్ని. బడబాగ్ని – కామవాయువు అను నామము కూడ గలదు.)

1166. త్రినేత్రధారియగు పరాశక్తిని తమ చిత్తమున నిలుపుకున్న జ్ఞానులు, భూలోక వాసులను కించపరచక లోకసంగ్రహము కొరకు సత్యమెరిగి, దైవసత్త్వ గుణములతో, మహద్భావనతో నుండి, లోకభోగముల మధ్యనున్ననూ వాటికి అతీతముగాను మెలగి, ఊర్ధ్వలోకస్తులగు దేవతలు, ఋషులు, సిద్ధులు, జ్ఞానులు

మొదలగువారిని తమ జ్ఞానముతో దర్శించుచుందురు.

1167. దర్శించుచున్నవారి చిత్తములో నెలకొని అష్టదిక్కులందు వ్యాపించి నవయవ్వనరాలైన పరాశక్తి, ఆదినుండి అష్టదిక్కులను పరిపాలించు మహాశక్తిగా, ఆకాశమండలములో నుండి అందరిని వీక్షించు శక్తిగా, అందరు సువాసన పుష్పము లర్చించి స్తుతించు శక్తిగా, అన్ని దిక్కుల నుండి ఆమెను స్తోత్రించునదిగా అమరియున్నదా పరాశక్తి.

(యోగపరిభాషలో కుండలినీ నుండి బయలుదేరి సహస్రదళమును చేరుకొన్న జీవశక్తి నాదబిందుగా అచ్చట అష్టదిక్కులకు వ్యాపించిన శక్తిగా, అందరి ద్వారా స్తుతించబడదగిన శక్తిగా నెలకొనియున్నది.)

1168. ఊర్ధ్వమున అష్టదిక్కులకు వ్యాపించిన శక్తిగా పేర్కొన్నది, నెలవంక చంద్రుని బోలినది. ఈ దేహభువనమున ఎర్రటిఛాయతో వెలుగుచున్నది. చంద్రుని షోడశ కళలైన పదహారుతో (16) ఇమిడి, జ్వలించుచున్న స్థానము శిరస్సే అగును (సహస్రదళ పటలము). ఈ స్థానము స్తుతించదగిన పరాశక్తి స్థితియగును.

(సహస్రదళ పద్మమున షోడశ కళలతో చంద్రమండలములో నెలకొన్న జీవశక్తియే పరాశక్తి స్థానముగా, అందరి ద్వారా స్తుతించబడదగినదిగా చెప్పబడినది.)

1169. సహస్రదళమున నెలకొన్న పరాశక్తి పెక్కు నామములతో, బహురూపములలో పేరొన్నబడి, అన్నిటికి ఆధారభూతముగా (త్రాశక్తి), కారణముగా జ్ఞానులలో ఇమిడి, అజ్ఞానమును దరిచేరనీయని శక్తిగా (రాశక్తి), గురుశక్తిగా – బోధించు శక్తిగా బహురూపములో నెలకొని కార్యములను నిర్వహించుచున్నది.

(రుద్రయామళ (మంత్రశాస్త్రము) ఆగమములలో త్రాశక్తి = కారణ, ఆధారముగా గలది; రాశక్తి = అజ్ఞానమును ఛేదించునది; గురుశక్తి = అన్నిటిని బోధించు శక్తిగా బహురూపములు చెప్పబడియున్నది.)

1170. బహురూపములో నెలకొన్న పరాశక్తి ఏడులోకములలో యోగిని శక్తులుగా యుండి, లోకవృత్తులు జరిపించుచున్నది. కాని చిత్తమున ఈశుడు (శివుడు) నెలకొన్న కాలమములో భోగమాది విషయముతో చేరి (స్త్రీ భోగము, లోకభోగము, విద్యాభోగము) 'పరము' అన్న నామము పొందినది.

(ఉన్నతుడైన ఈశునితో కలియునపుడు (బుద్ధిలో నెలకొనునపుడు) అన్ని వృత్తులు నడిపించు 'పరము'గా పేరొందినది.

ఏడు లోకములు: ఆరు ఆధారచక్రములు + సహస్రదళపటలము.)

1171. కార్యరూపిణి పరాశక్తి శివునితో కలిసి ఏకమై నాలో నెలకొనునపుడు, ఆకాశ తత్త్వములో కలియునదైన ఆ చేరిక భోగముగా మార్చినది, సౌందర్యవతియగు

మనోన్మణియే. కాని బుద్ధిపూర్వకముగా గ్రహించినదేమనగా భోగమే యోగమగును. శక్తియే భోగ, యోగ అనుగ్రహ ప్రదాత.

(ఆకాశతత్త్వములో కలియునది: సహస్రదళమునకు చేరిన జీవుని యోగశక్తి 'పరమ'గు శివముతో చేరునపుడు, అది యోగశక్తిగా బుద్ధిలో గ్రహించబడును. శక్తియే భోగము, యోగములను అనుగ్రహించును.)

(యోగ పరిభాషలో: ఆవరణశక్తిగా జీవునిలో నెలకొన్న మహామాయయను (తిరోభావం) అజ్ఞానము జీవునికి అన్ని భోగములు కల్పించి, వాటియందు మునుగునట్లు జేసిననూ, గురుబోధ వలన, శాస్త్రఅధ్యయనము వలన అజ్ఞానము వీడి జ్ఞానము పొంది (బుద్ధిలో మార్పు) అనాత్మయగు దేహేంద్రియ మనోబుద్ధులు వీడి, చిత్తము ఆత్మ పరమగునపుడు భోగములన్నియూ యోగముగా మారును. సాధకుడు తానే శివం అగును, మహాజ్ఞానిగా పేరొందును.)

1172. మహాయోగముగా శ్రేష్టశక్తిగా, ప్రజ్వలించు జ్యోతిగా నెలకొనియున్నదా పరాశక్తి – భ్రూమధ్యమునందు. ఆ యోగశక్తి వెలసినది దక్షిణదిక్కు – కుడికంటిలో. ఆ యోగశక్తియే ఉదర మధ్యభాగముగా మణిపూరక చక్రములో సూర్యునిగా వెలసి యున్నది. మరియు ఆమె మహాశక్తి నొసగు చంద్రునిగాను, ఉత్తరదిక్కున ఎడమ కంటిలో వెలసియున్నదని గ్రహించండి.

(పరాశక్తి నెలకొన్న స్థానములు చెప్పబడినవి.)

1173. పెల్లుబికిన మహాశక్తి ప్రకాశము శిరస్సున సహస్రదళ పటలమునందు నెలకొన్నదిగా, మహాప్రకాశముతో కలుయునపుడు జీవుని మాయామలములన్ని కాల్చబడి, దైవము యొక్క నాదము, ప్రకాశముతో కలిసి ఉద్రిక్తమై అందరిని తనవైపు ఆకర్షించగలిగిన శక్తిగా, దేవి శబ్దించు గాజులు ధరించిన పరాశక్తి సుషుమ్నానాడి ద్వారా వృత్తులు చేయుచున్నదే!!

(కుండలినీశక్తి రూపిణి సహస్రమున నున్న శివతత్త్వముతో కలిసిన మహా ప్రకాశముతో నొప్పారు తత్త్వము – జీవతత్త్వము ఆత్మజ్ఞానములో ఇముడునపుడు జీవుని మాయలు, అజ్ఞానములు, ఆవరణములన్ని తొలగిపోవును. దేహభావనలు, భ్రమలు తొలగి శాశ్వతత్త్వము నెలకొనును.

శాశ్వతతత్త్వము = ఆత్మ = బ్రహ్మం = అధిష్టానం = పరమేశాం అన్నీ ఒక్కటే.)

1174. పరాశక్తి షట్చక్రస్థానములలో నెలకొనినదే కాక, అకార కళలగు తొమ్మిదింటిలో నెలకొని వృత్తులు సలిపి, పదునాలుగు భువనములందు (14 లోకములలో) వ్యాపించి, అకార కళల ద్వారా విస్తరించిన ప్రకాశములో తానే నెలకొని, అందరికీ తాను సుఖమునొసగు బంధముగాను, మోక్షము నొసగు పరముగాను నెలకొని యున్నది.

(అకారకళలు తొమ్మిది: అకారము, ఉకారము, మకారము, బిందు, అర్ధచంద్రుడు, నిరోధిని, నాదము, నాదాంతము, శక్తి. పరాశక్తియే బంధమేర్పచునది, మరియు మోక్షము అనుగ్రహించునది.)

1175. పరాశక్తి ఎటువంటి కళంకము, కొరత లేనిదై, ఇరువదిఏడు శుద్ధ తత్త్వములతో ఇమిడి, శిరస్సున స్పందనరూపముగా ఉండును. దీనిని గ్రహించిన సాధకుడు తన మంత్ర, తపో, సాధన ఫలితముగా తనకు పరాశక్తి తెల్లని త్రినేత్రిగా, గదాధారిగా దర్శనమొసగును. ఈమె అన్ని తత్త్వములకు అనాది (మొదటిది – సనాతనమైనది – పురాతనమైనది.)

1176. పరాశక్తి తన మూడుముద్రలతో వెలయునది – అగ్ని, సూర్య, చంద్ర మండల తత్త్వములలో ఇమిడియున్నది. తానే తత్త్వములతో ఇమిడియూ, వాటికి అతీతముగాను, అనగా తత్త్వములకు అసంగముగాను, ఈశ్వరతత్త్వమును తనలో ఇముడ్చుకొన్న పరాపరముగాను ఉండి, పరమానందము నొసగునదియు, అల్పానందము నొసగునది తానే అగును (ఇంద్రియ విషయములే అల్పానందము).
(పరాపరమును గ్రహించుటకు జ్ఞానమొక్కటే మార్గము. ఇతరే ప్రమాణములు పనికిరావు. అన్నిటిని తనలో ఇముడ్చుకొన్ననూ తాను మాత్రము – అసంగురాలు. ఈ మంత్రములో పరాశక్తినే పరాపరం – పరబ్రహ్మం – శుద్ధతత్త్వం – బ్రహ్మ తత్త్వముగా – అన్నిటికీ ఆధారముగా ఉన్ననూ తాను మాత్రము అసంగముగా చెప్పబడినది.)

1177. తాజా పుష్పముల తేనెవంటి అల్పానందము నొసగు పరాశక్తి చెరకుగడవంటి వెన్నెముకలో తాను స్వాధిష్టానములో నెలకొనియున్నది. సాధకునకు ఎర్రని కుంకుమఛాయతో దర్శనమిచ్చు దేవి అంకుశముగాను, బంధముగాను తానే కోరి అఖిలముగా యున్నదని గ్రహించండి.
(స్వాధిష్టానము ఇచ్చను, సృష్టిని పురికొల్పు పృథివి స్థానము – చతుర్ముఖ బ్రహ్మ స్థానము – ఇందులో పరాశక్తి ఇమిడి జ్ఞానులకు ఇంద్రియములను అణగద్రొక్కు అంకుశముగాను, అజ్ఞానులకు బంధములు ఏర్పరచు ఇచ్ఛగా నున్నదని చెప్పబడినది.)

1178. జీవుల ఉచ్ఛ్వాస, నిశ్వాసలకు మనస్సును అతీతముగా నెలకొనియున్నదీ మనోన్మణి. భూతగణనాథుల సహాయముతో ఈ జగత్తును నడిపించుచున్నది. జ్ఞానాతీతుడైన శివునికి తల్లిగా, పుత్రిగా, భార్యగా వెలసియున్నది.
(పంచేంద్రియముల ప్రమాణములకు గాని, మనో అంతఃకరణముల ద్వారాగాని గ్రహింపజాలనిది – పరాశక్తి మనోన్మణి.

**“న చక్షుర్గచ్ఛతి, న వాగ్గచ్ఛతి, న మనః”** – కేనోపనిషత్తు శ్రుతి వాక్యము. కళ్ళు, వాక్కు, మనస్సు, ఆమె వద్దకు వెళ్ళలేవు. అనగా ఇంద్రియ జ్ఞానములచే పరాశక్తిని (పరాపరమగు పరబ్రహ్మం) గ్రహించజాలము. జగజ్జనని కరుణారసముతో అన్నిటిని ఆదుకొను తల్లిగా, వృత్తులు సలుపుటలో పరాపరమునుండి వేరుపడి జగత్కార్యములు జరిపించుటలో పుత్రిగా, శివశక్తులు ఏకమై అర్థనారీశ్వర తత్త్వమును బోధపరుచుటలో భార్యగా వెలసియున్నది.)

1179. పైన చెప్పినట్లు పరాశక్తి శివునికి భార్యగా, అన్ని తత్త్వములలో శక్తితత్త్వముగాను దర్శనమిచ్చుచూ, కారణ కార్యముగాను (జగత్తు సృష్టికి కారణముగాను, అన్నిటిలో తానే నెలకొన్న కార్యములుగాను) ఇట్లు కలియికలో పూర్ణప్రకాశరాలుగా, పురాతనరాలుగా, ఆదిగా నెలకొని అండములంతటిలో వ్యాపించిన మహాశక్తిగా, పది దిశలందు సర్వవ్యాపిగా విస్తరించియున్నది.

1180. పది ముఖములు గలది మన పరాశక్తి. జీవులు పరిపక్వమొంది తనలో ఐక్యమగుట కొరకు ఆరు అంగములతో కూడిన నాలుగు వేదములను నొసగి, తానే అన్నిటికి ఆధారమై, శివునితో ఏకమై శాశ్వత తత్త్వమును బోధించు శక్తిగా నున్నదని గ్రహించండి.

(చతుర్వేదములు – ఋక్, యజుర్, సామ, అధర్వణ వేదములు
షడాంగములు – శిక్షా, వ్యాకరణము, ఛందస్సు, జ్యోతిష్యము, నిరుక్తము, కల్పం.
యోగ పరిభాషలో నాలుగు వేదములను నాలుగు రేకులు గలిగిన మూలాధార చక్రపద్మము; ఆరు అంగములనునది ఆరురేకులు గల స్వాధీష్టాన చక్రపద్మము. కుండలినీలో మొదలిడి సహస్రదళ పటలము చేరుకొన్న జీవశక్తి శివునిలో ఏకమై శాశ్వతత్త్వమును పొందునది. జీవతత్త్వము ఆత్మలో నెలకొనుట.)

1181. ఇట్లు పైన చెప్పబడిన తల్లి పరాశక్తి అన్ని శక్తులతో నిండినది జీవుల భ్రూమధ్యమున నెలకొన్నది. శ్రేష్టమైన ఏడులోకములలో వ్యాపించిన ఉన్నతురాలు. అమృతము నిండిన సూర్యచంద్రులను వక్షోజములుగా గలది. మహాజ్యోతి స్వరూపిణి. ఆమె అన్యముగా శోభిల్లునది. (విడిగా – అసంగముగా)

1182. ఆమె అన్యముగా నిలుచున్ననూ శివునితో విడదీయలేని అనుబంధమున్న పేదరాలు. ధ్యానములో భ్రూమధ్యమునందు నెలకొన్న కోమలమైన తీగవంటిది. బుద్ధిలో ప్రజ్ఞగా నెలకొన్నది. జ్ఞానమునొసగు శక్తిగా ఆమె జ్ఞానస్వరూపిగా యున్నది. (పరాశక్తి జ్ఞానస్వరూపిణి యగును.)

1183. బుద్ధిలో నెలకొన్న జ్ఞానస్వరూపియగు పరాశక్తి జీవుల అంతఃకరణమగు మనస్సులో మొదట నెలకొని, వారిని జ్ఞానము వైపు వెళ్ళనీయక కామ్యకర్మలతో

విషయవాసనల ద్వారా వంచనలను పురికొల్పు పంచజ్ఞానేంద్రియముల చేష్టల నుండి కాపాడి (అనగా వారిలో నున్న ఆవరణశక్తిని నిర్మూలించి) వారి ప్రాణముతో ప్రాణముగా తోడుండి, ధ్యానజపతపాదులతో పొందదగిన పరమానందమును కరుణతో అనుగ్రహించు దానశీలిని నా పరాశక్తి.

1184. తానే కోరివచ్చి ఆనందమనుగ్రహించునది (భోగమహాశక్తి) మనస్సున ఇమిడి సుఖమునొసగునదని ఎవరు గ్రహించజాలరు. అట్లు ఇమిడిన పుత్రిక పరాశక్తి. పుష్పము, వర్ణముల వలె విడదీయలేని అనుబంధము సాధకునితో ఏర్పరచుకొని సుఖముల నొసగుచున్నది.

1185. కోరివచ్చి నా మనస్సున నెలకొన్న పరాశక్తి, నాలో సంపూర్ణముగా ఇమిడి నా మదిని పరిపక్వమొనర్చి, నిర్విరామము నాలో పదిలమై, నాలోని నిరోధకములను తొలగించి (చిత్తభ్రమలు, విషయవాసనలే నిరోధకములు), నాలో శాశ్వతముగా నెలకొన్నది ఆమె యొక్క సర్వవ్యాపకశక్తిని సూచించునది.

1186. "ఇది కావాలి, అది కావాలి" యని కామ్య, వస్తువాంఛలు వీడి, పరాశక్తిని స్తుతించి, ధ్యానించి, సహస్రదళ పద్మములో ఇముడ్చుకొనినచో విధి రాసిన రాతలను (పూర్వజన్మ కర్మఫలితముల సమ్మేళనమగు ప్రారబ్ధమును) కూడ జయించగలము. సహస్రదళ పద్మమగు చంద్రమండలములో పరాశక్తి అమరి చెప్పిన మండలములు మూడుయగును.

(నిర్విరామ ధ్యాన, జపాదులచే (మంత్రము 612 చెప్పినట్లు) జీవశక్తిని – మూలాధార చక్రములో నున్న – అగ్నిమండలము నుండి ఎగబ్రాకించి సూర్య మండలములగు షట్చక్రములు దాటించి, శిరస్సున గల సహస్రదళమగు చంద్ర మండలములో ఇముడునట్లు చేసిన యోగులు, జ్ఞానులకు ఆమె అన్ని కర్మ ఫలితములు (సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలు) నశించునట్లు చేసి అనుగ్రహించు నా పరాశక్తి. **"క్షీయంతే సర్వకర్మాణి తస్మిన్ దృష్టే పరావరే"** – శ్రుతివాక్యము.)

1187. మోహిని (పరాశక్తిని మోహినిగా పిలువబడినది) చేరు మండలములు మూడు, అవి – అగ్ని, సూర్య, చంద్ర మండలములు. పన్నెండు సూర్యకళలతో నిండి షట్చక్రములు దాటి, శిరస్సున వెలసిన శుద్ధమాయతో కూడిన పరాశక్తి నెలకొని యున్నచోట చంద్రమండల ప్రదేశమైన సహస్రదళ పద్మము.

(చంద్రమండల ప్రకాశముతో తను నెలకొనునపుడు జీవుని లౌకిక ప్రజ్ఞలన్నీ – ఆలోచనలు, భావనలు, ఇంద్రియవాసనలు వీగిపోవును. లౌకిక భావనలగు మోహమును పురికొల్పుటచే – మోహిని.)

1188. చంద్రమండలములో ఉదయించు నాదము పర్వతముపై ప్రాకునట్లు ప్రాకి,

మెదడు భాగము వెనుకనున్న చిన్న మెదడుకు చేరి అచ్చటనుండి స్పందనము ద్వారా కంఠమునకు, పిదప హృదయ స్పందనలు కల్పించి మరలా అది చంద్రకళతో కపాలము క్రిందభాగమును చేరును.

1189. చంద్రకళలగు పదహారు కళలే సృష్టికి మూలకారణము. వేలసంఖ్యలోనున్న మార్పులకు లోనుగాక, చిత్తము-మనస్సు సమతుల్యము పొందుటచే, అది మహా సౌందర్యము, సుగంధము నిండిన స్థానమగును. ఈ స్థానమును అంత్యముగా తాను కోరి వెలసియున్నది.

(పరాశక్తి అంతము, ఆదిగాను, పదహారు కళలతో (జీవతత్త్వము తెలుపునది) మనోలయము పొందిన జీవుని సహస్రమున నెలకొనియున్నది.)

1190. సాధకుని సహస్రమున కోరి నెలకొన్న పరాశక్తి, సాధకునికి శ్రేష్టమగు తత్త్వములను బోధించి, వానిని ఉన్నతునుని చేయదలచి, అనుగ్రహించి పాలించుచున్నది. అన్ని భువన లోకస్తులు స్తుతించుచున్న ఆమెను పట్టువీడక ఉండవలెనని సాధకునికి మహాఉపారిగా అతనిలో నెలకొనియున్నది.

(తనయందే మనోలయము పొందిన సాధకుని తను రక్షకురాలుగా ఉండి కాపాడుచున్నది.)

1191. పరాశక్తి శివునితో ఐక్యమై, బొటనవ్రేలు పరిమాణములో సాధకుని హృదయమున నెలకొని సృష్టించనెంచి, జీవుల శరీరతత్త్వము, ప్రాణతత్త్వములను కల్పించి (బాహ్య, అంతర తత్త్వములు) సూర్య, చంద్రులను వక్షోజములుగా గల పరాశక్తి తన ఐదుగురు కుమారులతో కలిసి తమ శక్తితో జగత్తునకు సృష్ట్యాది పంచకార్యములను నిర్వహించిరి.

(ఐదుగురు కుమారులు: బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు.
సృష్ట్యాది పంచకార్యములు: సృష్టి, స్థితి, లయ, తిరోభావం, అనుగ్రహం.
బొటనవ్రేలు పరిమాణం: హృదయమందున్న ఆత్మగా నెలకొనినది.)

1192. పంచకృత్యములు నొనర్చిన శక్తిని తలంచి, బాహ్యాపూజలు చేయుటకంటే, శివశక్తులను అంతరమున నెలకొల్పి అంతర్దృష్టితో సాధకుడు చేసినచో, మూలాధారమున ఉప్పొంగు మూలాగ్ని-జీవశక్తి షట్చక్రముల ద్వారా పైకి ప్రాకి సుషుమ్ననాడి ద్వారా సహస్రదళ పద్మము చేరి, పరమానందభరితమును కల్పించి, ప్రేమకు పరాకాష్టగా శక్తితో నెలకొనును.

1193. సహస్రదళమునకు చేరిన జీవశక్తి తన వ్యాపకశక్తిని చంద్రకళల ద్వారా షట్చక్రములలోను నెలకొని పరమానందమును ఒనగూర్చును. శరీరతత్త్వమును మార్చి అనగా చంద్రకళ సహాయముతో ప్రణవముతో చేర్చి, సహస్రదళ పద్మముతో

(ఓంకారమున) ఇమిడినచో జీవతత్త్వము వీగి ఆత్మతత్త్వములో నెలకొనునట్లై అది మేలిముత్యమువలె శిరస్సున ప్రకాశించును.

(ఆత్మతత్త్వములో నెలకొన్న సాధకునకు ఇక సాధ్యము, సాధనలు మరి యికవేమి ఉండజాలదు. శివతత్త్వము, ఆత్మతత్త్వము ఒక్కటై ప్రకాశముతో కూడిన ముత్యమగును. జీవఈశ్వర ఐక్యమునూ చూచించునది. ఇది అద్వైతభావన. ఆత్మ సాక్షాత్కారమునందు ద్రష్ట, దృష్టి, దృశ్యము ఏవియూ మిగలవు.)

1194. మేలిముత్యము వంటి వదనము (తెల్లని ముఖము) గలది నా పరాశక్తి. సోమ, సూర్య, అగ్నులను త్రినేత్రములుగా గలది. మహాశక్తివంతురాలు. బహుసామర్థ్యము గలది. భక్తులకు తగిన సాకారము (సగుణరూపిణి) గలది. జటాధారి – ప్రకాశ కిరణములను జటాఝూటమునందు గలది. పది కరణములు (చేతులు) గలది. పరాపరమగు శివుని చుట్టూ తిరుగు చలనశక్తి. విద్కవి – జ్ఞానమునకు పరాకాష్ట (విద్ = జ్ఞానము, ఎరుగుట). ఇటువంటి తత్త్వముల పరాశక్తి నా మనస్సున ఇమిడి నా అంతటా వ్యాపించియున్నది.

1195. నాలో వ్యాపించియున్న పరాశక్తి మూడు మండలములలో వ్యాపించిన శక్తిగా అగ్నిమండలమును (మూలాగ్నిలో) తన పాదములుగా గలది. సూర్యమండలమును తన శరీరముగా గలది. చంద్రమండలమును ముఖము, శిరస్సుగా గలది. ఇట్లు త్రిమండల నాయకిగా వెలసిన పరాశక్తి, మనము వద్దన్ననూ మనలను వదిలివెళ్ళని అంతర్జ్యోతిగా ప్రకాశించునే!!

1196. అంతర్జ్యోతిగా వెలసిన పరాశక్తి తన ప్రకాశమును ఆరు ఆధారములలో చొప్పించి, తన శక్తిని నెలకొల్పియున్నది. మూలాధార చక్రము నుండి అనాహత చక్రము (హృదయం) వరకు తెల్లని ప్రకాశమును నింపిన శక్తి తన శక్తిని బహిర్గతము చేయకుండా విశుద్ధి (కంఠము) నుండి పైకి వెళ్ళునపుడు తన ఆనందతత్త్వమును తెలిపించి, సహస్రదళ పటములో అమృతమును కురిపించును.

1197. విశుద్ధి చక్రము మొదలుకొని బ్రహ్మరంధ్రము వరకు వ్యాపించిన ప్రకాశశక్తి సహస్రదళమున సదాశివుడగు – పరమ గురువునందు ఇముడును. అచ్చట ఆనందము వెలయును. ఆ ఆనందతత్త్వమే శివుని పచ్చని పాదపద్మములగును. ఆనందమే ఆతని స్వరూపము. ఇట్లు ఆనందతత్త్వమునే పరాశక్తి షట్చక్రములకు అందించును.

(మొదట విషయానందము నిచ్చు తల్లి పరాశక్తి, పిదప శివునితో చేరి పరమానందం నొసగును.)

1198. కుండలినీ శక్తి మొదలుకొని త్రిమూర్తులును – బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు,

ఆరు ఆధారచక్రములలో వెలసిన శక్తులును, చంద్రకళలగు పదహారు తత్త్వములతో కూడినదియు, ఆనందమున నెలకొన్న సదాశివుని పత్నియూ, మంత్రరాజగు ఈశానుడును కలిసి అందరూ స్తుతించుటచే పరాశక్తి నెలకొని అనుగ్రహించు చున్నది.

(ఈశానుడు: శిరస్సున ఈశాన్యదిక్కున వెలయు శివుడు. అందరూ ఆమె యందు శరణు పొందుటచే అనుగ్రహించుచున్నది.)

1199. శక్తి, సాధకులకులందరికీ అనుగ్రహము పాలించగలిగిన బాలాశక్తి. ఆమెను గ్రహించి సాధనలు చేసినచో, ఆమె ముక్తినొసగు నాయకురాలుగా వెలయును. ఈ సత్యతత్త్వమెరుగని మూఢులు వ్యర్థ ప్రలాపాలతో పాపులుగా మారి మొరుగుచున్న కుక్కలవలె గగ్గోలు పెడుచున్నారే!!

(వితండ, తర్కవాదనలు వీడి తగిన సాధనలతో సత్యతత్త్వమెరిగి ముక్తిని పొందవలెను.)

1200. దేవస్వరూపిణియగు పరాశక్తి పాదపద్మములను దర్శించు వారెవరు? ఆమెను ప్రకాశరూపిణిగా దర్శించి, స్తుతించి, ధ్యానము చేయువారికి, వర్షించదగిన నల్లటి మేఘముల వంటి శిరోజములు గలదియు, తామరపద్మముల వంటి ఎర్రనైన పాదములను వారి శిరస్సుపై మోపి అనుగ్రహించునే!!

1201. పరాశక్తిని ధ్యానము చేయు విధి విధానములు ఇందు చెప్పబడినవి: చిత్తములో నిర్విరామముగా ఆమెను నెలకొల్పుకొని, శిరస్సుకు ఆదియైన భ్రూమధ్యమున స్థిరము చేసుకొని, ప్రకాశమును సహస్రదళమునకు చేర్చి – కుండలినీ జీవశక్తి పైకి ప్రాకించి సహస్రమున ఐక్యపరచి, లౌకిక కామ్యకర్మల చేష్టలను వీడి ఆమెను ధ్యానించి, నాదముతో కూడి నెలకొని, సమాధియందు నెలకొందురు గాక!!

1202. సమాధి స్థితిలో ధ్యానము చేయు సాధకులకు ఆమె అనుగ్రహము నొసగుటలో మొదటి నాయకి. సృజించి చేయు శివాది మంత్రోచ్చారణలో కోరి నెలకొను శక్తి. భ్రూమధ్యమునందు నెలకొనియున్న శక్తి. నవాది భేదములను తనలో ఇముడ్చుకొనియున్న మహాశక్తి. ఉవాది తత్త్వమగు చంద్రమండలమును (సహస్ర దళపద్మము) కోశముగా చేసుకొని నెలకొన్న శక్తివంతురాలు.

(శివాది మంత్రము = శివా = శక్తిబీజము – శివాయనమః, శివయనమః = శివబీజము.

నవాది భేదములు = తొమ్మిది భేద తత్త్వములు: బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివం, నాదము, బిందు (ప్రకాశము) శక్తి, శివం.

ఉవాది తత్త్వము = 'ఉ'కారము = చంద్రుని కళలు – చంద్రమండలము. సహస్ర

దళమును చంద్రమండలముగా పిలువునది. సమాధి ధ్యానములో పరాశక్తి చంద్రకళలుగా నెలకొనును.)

1203. సమాధి ధ్యానములో నిర్విరామముగా కొనసాగినచో, పరాశక్తి సాధకునిలో నిరంతరము నిలచి పరమానందమును నొసగునదే కాక, శివుని అనుగ్రహమును సహస్రదళమందు ఏర్పడునట్లు చేసి, శివతత్త్వమును, చతుర్వేదజ్ఞాన తత్త్వమును క్షణకాలములో గ్రహించునట్లు చేసి అనుగ్రహించును.

1204. శ్రేష్టమగు రెండు విధములైన ఫలములు పొందుట, ద్వికర్మ ఫలములగు పాపము, పుణ్యము నివర్తింపజేసియు, మహాసౌందర్యవతియు, కోమలాంగియునైన పరాశక్తి యొక్క అనుగ్రహ వీక్షణములు సాధకునికి ఏర్పడి, మాయాతత్త్వములన్నీ తొలగిపోయి, శక్తితత్త్వము – తన తత్త్వముతో ఏకమై ధ్యానించు పద్ధతి ఇదియే యగును.

(పరాశక్తిని అంతరమున నెలకొనునట్లు చేసుకొనుట.)

1205. నీకు ఆనందము గలుగు సమయమున నీ మనస్సు ధ్యానములో రమించవలెను. శక్తియు, నీ మనోలయము వేరుగాదని, రెండు ఏకమని భావించవలెను. ఇట్లు చిత్తములో పరాశక్తిని పదిలపరచుకొనిన యెడల భూమిపై సంపూర్ణ ఆయుర్వంతులుగా ఉండుటకు ఆమె అనుగ్రహించుటయే కాక దైవీక అష్టగుణములతో వర్థిల్లజేయును.

(వేదశాస్త్రాది గుణములు: శుశ్రూష, శ్రవణం, గ్రహణం, ధారణం, ఊహ, అపోహ, అర్థవిజ్ఞానం, తత్త్వజ్ఞానం. ఇది శాస్త్రసమ్మతమైన బ్రహ్మాభావస్థితి. **“యస్య బ్రహ్మణి రమ్యతే చిత్తం, నందతి, నందతి, నందతి ఏవ”** – ఆదిశంకరుల వాక్య. ఎవరి చిత్తం బ్రహ్మమునందు రమించునో వానికి ఆనందమే ఆనందం.)

1206. తాబేలు తన శిరస్సును, నాలుగు కాళ్ళుయగు పంచములను ఎట్లు లోపలికి లాగుకొనునో, అట్లే సాధకుడు బాహ్యముగా వెళ్ళదగు పంచేంద్రియములను నిరోధించి, ‘ఓం’ ప్రణవం అంతరమున నెలకొల్పి కంఠము పైభాగమున ధ్యానించినచో మహాసౌందర్యవతియైన పరాశక్తిని దర్శించును. ఆమె తన సోమ చంద్ర సువాసన మండలము (పద్మములో) నెలకొన్నది గ్రహించగలరు.

1207. మూలాధారమునుండి బ్రహ్మరంధ్రము వరకు వ్యాపించిన “చిత్రాణి” నాడిలో ఇమిడిన శక్తి, జీవులలో బంధములను (పాశము) త్రెంచునది, బంధముల నుండి తప్పించునదైన అంకుశమును గలిగి రక్షించుచున్నది. వీటి సంగమములో అమృత కలశములు గలిగి “శివా” (శక్తిబీజము) ఉచ్చరించుట వలన ఆమెను బంగారు ఛాయతో నిండిన సహస్రదళ పద్మములో వీక్షించనగును.

1208. ఇట్లు బంగారుఛాయతో నిండిన సహస్రదళమున ఇమిడిన శక్తిని బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు ఆమె చుట్టూ మూగి, తమతమ పదవులను పొందిరి. కాముడు (మన్మధుడు), వాని తమ్ముడు సాముడు (బుధుడు–బంధము ఏర్పరచువాడు), సూర్యుడు, అగ్ని, చంద్రుడు, పరాశక్తి చుట్టూ నిలబడి స్తుతించి అనుగ్రహము పొందిరి.

1209. నెలవంకను శిరస్సున దాల్చినది, శూలి – సోమ, సూర్య, అగ్ని తత్త్వములను త్రిశూలముగా చేసుకొని చేతబూనిన వనిత. కపాలి – శిరస్సు కపాలమున వెలయునది. ఊర్ధ్వముగా ప్రాకిన తీగవంటిది – మూలాధార చక్రము నుండి బ్రహ్మరంధ్రము వరకు మధ్యనాడిలో ప్రాకియున్నది. నిర్మలి – ఎటువంటి మలిన విక్షేపములు లేనిది. ధీరవనిత. మధ్యనాడిలో సుషుమ్నలో నెలకొని జ్ఞానము నొసగునదైన పరాశక్తి దివ్యనాట్యమాడుటచే అండచరాచరములకు నాయకురాలుగా వెలసియున్నది.

1210. ఆకాశతత్త్వము మొదలు పృథివీతత్త్వ పర్యంతముగా నున్నది. స్వర్ణకుండలము ధరించిన పరాశక్తి తప్ప వేరు స్థితిని పొందినవారెవరు లేరు. శివుడు శక్తిగానున్న కారణమేమనగా స్త్రీ, పురుషులుగా సృష్టి కారణార్థమే.

(ఆకాశతత్త్వము నుండి పంచభూత సృష్టి మొదలిడి ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి జలము, జలము నుండి అగ్ని, అగ్ని నుండి పృథివి (భూమి) తత్త్వములు ఏర్పడినవి. పృథివి నుండి అన్నము, అన్నము నుండి స్త్రీ, పురుషుల సృష్టి జరిగినదని శ్రుతివాక్యము. అన్నియూ అండములను రక్షించు శక్తి రూపములే.)

1211. శివుడు త్రాగిన హాలాహలవిషము పరాశక్తి అమృతము. శివుడు పొందిన పదవి కూడ పరాశక్తియే అగును. ఉత్కృష్టమైన ధ్యానము వలన గలుగు పరమానందము పరాశక్తియే. అన్ని ఆధారములకు తానే ఆధారభూతమైనది పరాశక్తి, కోరివచ్చి సహస్రదళ పద్మములో నెలకొనినదే!!

1212. ఉత్కృష్టమైన ధ్యానజపాదులు పైపైకి మరింత వృద్ధియగునట్లు తోడ్పడునది పరాశక్తి. ప్రణవనాదముతో అన్ని వృత్తులు జరుగుచున్నవని ఎరుగనివారు చెడి నశించుదురు. అన్నమయకోశమగు శరీరములో మూలాధార చక్రములోనున్న నాలుగు పద్మరేకులను సృజించి, ధ్యానించి, సాధన పరిపక్వమొందిన వారికి శిరస్సు మధ్యన (సహస్రదళమున) ప్రణవముగాను, అన్నరసంగాను పరాశక్తి వెలయును.

(సహస్రమున అమృతము నొసగునదే కాక, పుష్టిని కూర్చు అన్నరసంగాను పరాశక్తి నెలకొనియున్నది.)

1213. అన్నమయకోశములోని అన్నముగా శక్తియున్నది. అన్నమును జీర్ణించు శక్తిగా అగ్నిగుండముగాను - జఠరాగ్నిగా, శక్తి జీవుని ఉదరభాగమున అగ్నిరూపు దాల్చియున్నది. ఇది సాధకుడు ఎరిగి తగిన "నమశివ" మంత్రోచ్చారణతో ధ్యాన నిమగ్నులైనచో నాయకురాలు పరాశక్తి తన శక్తిని వ్యాపింపజేసి అనుగ్రహించునే!! (అన్నమును హవిస్సువలె గుండమునందు శివార్పణ చేయు వారికి పరాశక్తి జ్యోతిరూపిణిగా నెలకొనును.)

1214. సాధకుని అంతరమున వ్యాపించిన జ్యోతిగా వెలసిన తల్లి పరాశక్తి చంద్రుని వంటి చల్లని, తెల్లని స్ఫటికమువంటిది. తెల్లని పాలరాతితో చెక్కిన శిల్పమువంటి శరీరము గలది. శ్రేష్టమైన ముత్యమువలె ప్రకాశించు తత్త్వమున్నది. ఉంగరాల కురులు గలిగిన సౌందర్యస్వరూపిణి. ఆమె సాధకునిలో వ్యాపించి షోడశకళామయ తత్త్వముతో ఇమిడి వృత్తులు సలుపుచున్నది.

1215. పరాశక్తి రుద్రునితో కలిసి ఏకమై నిలుచున్నది (కుండలినీ శక్తి + రుద్రుడు), ప్రాణము, ప్రజ్ఞగా కలిసి నిలుచున్నది. బంధము, జ్ఞానముగాను కలిసి నిలుచున్నది తానే. కాలముగాను నెలకొని, తాను మాత్రము దానికి అతీతముగా ఎప్పటి నవయవ్వన సౌందర్యవతిగా శోభిల్లు కన్యగాయున్నది.

(పరాశక్తి అన్నింటా తానే ప్రాణముగా, మతిగా, ప్రజ్ఞలుగా బంధమేర్పచునది, జ్ఞానమొసగునది, బంధవిమోచనమునకు కాలస్వరూపిణిగాను, నెలకొని అన్నిటి కారణ క్రియాశక్తిగా నున్నది. శరీర, జగత్తు వృత్తులు సలుపునపుడు వ్యావహారిక స్థాయిలో అపరాప్రకృతిగా నెలకొనియున్నది.)

1216. కాలాతీతురాలు - తానే కాలముగాను, కాలమునకు అతీతముగాను నున్నది. మనోసంకల్పములను (విహితములైనవి) పూర్తిగావించు అనుకూలవతి. విచ్ఛిన్నములు, వికారములు లేనిదిగా ఏకమైనది. మాలిని - ఉమాదేవి (నారాయణుని చెల్లెలు) మాకులినీ - మహాకుండలినీ శక్తి, మంత్రచండిక - దుష్టశక్తులను సమూలముగా పెకలించివేయు మంత్రస్వరూపిణి చండికాదేవి, పాలిని - పరిపాలించుటలో శివునితో సరిభాగమై సాధకులను (యోగులు, జ్ఞానులను) రక్షించునది.

(ఇట్లు పలువిధములుగా పరాశక్తి జీవులను రక్షించుచున్నది.)

1217. శివునికి సరిభాగముగా నున్న పరాశక్తి బంగారుఛాయతో నిండిన కిరణములను తన కేశములుగా గలది. శివునితో ఏకమైననూ ఒకే హృదయము (ఆలోచనలు) గలది. దశదిశలకు, ప్రజ్ఞలకు ఆధారభూతమైనది. మోహము గలిగించు పంచముఖి (పంచ విధములైన వాంఛలను ఏర్పరచునది) త్రినేత్రి - అన్ని

ముఖములందు త్రినేత్రములు గలది. అజ్ఞానమను చీకటిని ఛేదించి వెళ్ళు ప్రణవముగా వెలసి శివునితో భాగస్తురాలైయున్నది.

1218. పరాశక్తి సాధకుని ఆత్మతో కూడి ముప్పదిఆరు తత్త్వములతో (36) ఇమిడి, వృత్తులు సలుపునపుడు గుత్తులుగా నుండు అన్ని పంచమములతో కూడి, ఆ గుత్తులతో కూడుకొన్న పదునెనిమిది (18) దేవగణనాధులతో కూడి ఆదియూ, అంతముగా పరాశక్తి నెలకొనియున్నదే!!

(ముప్పది ఆరు తత్త్వములు: మంత్రము 1125లో వివరణ గలదు. అన్ని పంచములు: పంచభూతములు, పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, పంచ తన్మాత్రలు. పంచకళలు: కళ, కాలము, నియతి, మాయ, పురుషుడు. ఇట్లు అన్ని పంచమములు గుత్తులుగా నున్నవని చెప్పబడినది.

పదునెనిమిది (18) దేవగణనాధులు: 1. దేవతలు (దేవలోకస్తులు), 2. సిద్ధులు, 3. అసురులు, 4. దైత్యులు, 5. గరుడులు, 6. కిన్నెరలు, 7. కింపురుషులు, 8. నిర్తులు, 9. గంధర్వులు, 10. యక్షులు, 11. విజ్ఞానులు, 12. భూతగణాలు, 13. పిశాచరులు, 14. అంతరులు, 15. యోగులు, 16. నాగులు, 17. ఆకాశవర్తులు, 18. నక్షత్రనాధులు. వీరందరిలోను పరాశక్తి ఇమిడి వృత్తులు సలుపుచున్నది.)

1219. పరాశక్తి అన్నింటా ఇమిడి, ఆమె కాలముగాను, కళలుగాను, అన్ని ఆధార చక్రములలో నెలకొన్న యాబదిఒక్క (51) అక్షర తత్త్వసమూహముగా, వాటిలో ప్రాణశక్తిగాను, సాధకునిలో ప్రాణమునకు ప్రాణముగా తానే ఏర్పడి, శివుని తత్త్వముతో కూడి అన్నింటా వారే కలిసియున్నారే!!

(బ్రహ్మమును తెలుసుకున్న సాధకుడు తాను బ్రహ్మం అగును – శ్రుతి వాక్యము **"యో బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి"**.)

1220. శక్తి, శివుడు సహస్రదళ పద్మములో ఇమిడి అనుగ్రహము పాలించిననూ, సాధకుని మనస్సులో ఏర్పడు భావనలకు, సంకల్పం తగ్గట్లు ఆయా ఆధార చక్రములో శక్తి ఇమిడి, వారికి అనుగ్రహించుచూ వృత్తులు సలుపుచున్నది.

(పరాశక్తి భక్తుల భావనలకు తగ్గట్లు షట్చక్ర స్థానములలో, సహస్రదళ పద్మమున, దానికి ఊర్ధ్వముగానున్న ద్వాదశాంతములో (కపాల బ్రహ్మరంధ్రము) మొత్తము ఎనిమిది (6+1+1) స్థానములో ఇమిడి, తన భక్తులను అనుగ్రహించుచున్నది.)

1221. నాలో ప్రత్యక్షముగా పరాశక్తి సుషుమ్నలో ఊర్ధ్వముఖముతో నిలిచినది. కావున షట్చక్ర స్థానములతో గూడ సహస్రదళము కలిపి ఏడు స్థానములలో ప్రాణిణగా నెలకొనినది. కావున ప్రాణవాయువు తొమ్మిది వాయువులతో కలిసి ఊర్ధ్వముగా

వెళ్ళినది. ఇదొక్కటే బహుశ్రేష్ఠమైనది, శాశ్వతమైనదని ప్రకటించి, తానే అందులో ఇమిడి నిలబడినది. (దశవాయువులలో ధనంజయ వాయువు తప్ప మిగతా (9) వాయువులు).

(ఊర్ధ్వగతి పొందిన ప్రాణణ (శ్వాస)కు శాశ్వతత్త్వము గలుగును. ఆ శాశ్వతత్త్వమే జీవునికి పరమపూజ్యమగు పరంధామము, అమృతమయమైన శక్తిస్థానమగును.)

1222. ఊర్ధ్వగతి పొందిన ప్రాణణ (శ్వాస) ప్రణవ మంత్రముగా (ఓంకారముగా) పైకి ప్రాకును – సహస్రదళ పద్మమును చేరుకొనును. ఇట్లు సహస్రము చేరుకొనుటయే ముక్తితత్త్వమగును. అపుడు పరాశక్తి శివుని ముఖముగా పైకి వెళ్ళి అఖండమును కోరిన జీవుని తోడ్పడినది, శివునితో కలియుటకు కోరివెళ్ళిన కాముకి తత్త్వమును బోలినది.

(దేహరథమును నడిపించు రథసారధులుగా సూతుడు–సూతకిగా శివుని, పరాశక్తిని వర్ణించియున్నారు రచయిత శ్రీ తిరుమూలర్.)

1223. ఊర్ధ్వమున సహస్రదళ పద్మమున అగ్నిగా, ఆదిశక్తిగా వెలసియున్నది. మహేశ్వరుడు నెలకొన్న మర్త్యలోకము (భూలోకము) మొదలు వాయు, ఆకాశ మండలములుగాను, సూర్య, చంద్ర, అగ్నులుగాను, తాను వెలసియున్నది. జీవునికి కవచముగాను, జీవుని నిజతత్త్వమును మరిపించు ఆవరణశక్తిగాను, అన్ని వృత్తులు చేయునదిగా సౌందర్యరాశి పరాశక్తి జీవుని కోదండములో (వెన్నెముక మధ్యనాడిలో – సుషుమ్ననాడి) నెలకొనియున్నదే!!

(జీవుని ఉన్నతి కోరి పరాశక్తి అధోమండలములలో ఇమిడి, జ్ఞానమును పురికొల్పి, పరిపక్వమొందించుచున్నది.)

1224. పరాశక్తి కోదండములో (వెన్నెముక) నెలకొన్న మనోన్మణిగా, అన్నిటికి కారణముగా యున్న యాభది (50) అక్షరములలో (మూలాధారము మొదలు షట్చక్ర స్థానములోని) బీజాక్షరములుగా ఇమిడి, ఊర్ధ్వముననున్న పరాపరముతో (పరమశివునితో) వెలసిన పరముగా (శుద్ధచిత్‌గా) వెలసి, జీవులకు పంచకృత్యములు ఒనర్చుచున్నది.

(కోదండమున వెలయు మనోన్మణియే పంచకృత్యములగు – సృష్టి, స్థితి, లయం, తిరోభావం, అనుగ్రహం వృత్తులు సలుపుచున్నది.)

1225. తాను మోహినిగా (ఇచ్ఛను పురికొల్పునది) దానికి సంబంధించిన యోగినిగా (కర్మించుశక్తి – ఫలము నిచ్చునది) నెలకొన్ననూ, ఈ రెండింటికి అతీతముగా వెళ్ళి అనుగ్రహముతో తన పాదపద్మములందు శరణునొందినవారు, ప్రాణముగా నెలకొనియున్న శివునిగా మారుదురు. ఆ స్థితియే శ్రేష్టమగు పరమశివం.

(సాధకుడు మోహం, మమకార, అహంకారములు వీడి, దేహేంద్రియ మనోబుద్ధులు కల్పించు కర్తృత్వ, భోక్తృత్వ భావనల రహితమై (అనాత్మ తత్త్వములు త్యజించి) ఆత్మతో నెలకొనునపుడు తానే శివంమగును. ఆ స్థితిని పరమశివంగా పిలువబడినది. ఆత్మ=బ్రహ్మం. **"అహం బ్రహ్మోస్మి"** – శ్రుతివాక్యము.
**"నారాయణోహం, నరకాంతకోహం, పురాంతకోహం, పురుషోహమీశః నిరీశ్వరోహం, నిరహంచ నిర్మమః"** – వివేక చూడామణి–495. తానే నారాయణుడు, కృష్ణుడు, త్రిపురాసులను సంహరించినవాడు, ఈశ్వరుడు, అహంకార, మకారములు లేనివాడు అగును.)

1226. సహస్రదళ పద్మముతో ఏకమైన సాధకుడు (ఆత్మలో నెలకొనుట) ఆనంద మోహినియైన పరాశక్తితో ఏకమై హిరణ్యప్రకాశముతో నిండిన (బంగారువర్ణం గల పసుపు ప్రకాశ కిరణములలో) శివునితో కలిసి మౌనంలో ఉంచి బోధించును. అదియే ప్రణవ మార్గమగు అకార, ఉకార, మకారము అంత్యతిక తత్త్వమగును. (సహస్రదళ పద్మము చేరుకొన్న ప్రణవ తత్త్వమునకు మౌనమే పరాకాష్ట. "అ, ఉ, మ" అక్షరముల కలయిక ప్రణవమగు "ఓం"కారము. 'ఓం'కారము యొక్క ముగింపు – నిశ్శబ్దం. మౌనం. ఆ నిశ్శబ్దం = తురీయం; తురీయం = ఆత్మ, **"బ్రహ్మం, చైతన్యం, సాక్షి. ప్రపంచోపశమం, శాంతం, శివమ్, అద్వైతం, సఆత్మా సవిజ్ఞేయ"** – మాండూక్యభాష్యం.)

1227. లౌకికులకు శుభములొనగూర్చు అధ్యాత్మిక తత్త్వములను తన పతితో కలిసి బోధించునది. ఎవరికైనను తను సులభ లభ్యురాలు. వాక్కు, మనస్సు ఏకమైనపుడు అందు కలిగించు తేటజ్ఞానము వంటిది ఆమె అనుగ్రహము.
(సాధకుని సత్త్వ ప్రధానమైన వాక్కు, మనస్సులో తాను ఇమిడి, జ్ఞానమును నొసగునది ఆ పరాశక్తి.)

1228. పంచేంద్రియముల ద్వారా పొందు విషయ పరిజ్ఞానములన్నియూ అల్పజ్ఞానమగును. పంచేంద్రియముల ప్రజ్ఞలు, అంతఃకరణముల విషయ గ్రాహ్యములన్నియూ అశాశ్వతములే. వీటి ద్వారా కాక ప్రాణముతో కలిసి నెలకొనియున్న ఆత్మ తత్త్వములో నెలకొనుటయే శాశ్వత పరిజ్ఞానము, మహాజ్ఞానమగు శివంతో కలిసి నెలకొనుటయే శుద్ధ సన్మార్గమగును.
(ఆత్మ, శివం. ఇంద్రియ ప్రజ్ఞలకు, అంతఃకరణములతో గ్రహించబడునది కాదు. దేహేంద్రియ మనోబుద్ధులన్నియూ అపరాప్రకృతికి చెందినది. ఆత్మ, శివం, బ్రహ్మతత్త్వము శాశ్వతము, సత్యమైన పరాప్రకృతికి చెందినది. ఇది ఏ ప్రమాణములకు గోచరము కాదు. శబ్ద (ఓంకారం) శ్రుతి ప్రమాణము (శాస్త్రం)

ద్వారా శ్రోత్రీయ బ్రహ్మనిష్ఠయైన గురువు ద్వారా మాత్రము గ్రహింపబడునదే తప్ప అన్యముల వలనకాదు.)

1229. సన్మార్గమును ఆచరించుట ఉన్నతినొసగు ధర్మమార్గము. దుర్మార్గములన్నిటిని అది తరిమివేయును. ధర్మమార్గమును ఆచరించుటచే నిబద్ధతతో కూడిన నడత అలవడును. ఆ సన్మార్గములో జ్ఞానశక్తి నొసగునది కూడ ఆ పరాశక్తియే అగును. (పరాశక్తియే జ్ఞానశక్తి నొసగి సాధకులను అనుగ్రహించుచున్నది.)

1230. శక్తిని, ఆత్మను రెండింటిని తనలో ఇముడ్చు శివుడు వీరు మూవురు తప్ప, ముక్తి యొక్క అంత్యము గ్రహించు వారెవరులేరు. అత్తి పువ్వును చూచిన వారెవరూ లేరు!! అత్తి కాయగా రూపొంది ఫలమగునట్లు, మూలాధార చక్రము నుండి బయలుదేరిన జీవశక్తి గూఢముగా పరిపక్వమొంది, వెన్నెముక మధ్యనాడి ద్వారా పైకిప్రాకి సహస్రము చేరి ఫలమొందించి, శివభక్తులుగా చేర్చుకొనును.

1231. అది, ఇది అని పలువిధములైన ప్రయత్నములతో కాలమును వెలిబుచ్చక, అమృతము (బ్రహ్మానందమును) నొసగునదైన చిత్రాణి నాడి (మధ్యనాడి) ద్వారా సహస్రదళమును చేరుకొని పరాశక్తి అనుగ్రహముతో చంద్రమండలమునకు అధిపతియగు శివుని చేరగలిగిన సాధకునకు తన విధిని కూడ మార్చుకోగలడు. (విధివశమున చిక్కుకొనక అనుగ్రహముతో తనకు విధించిన కర్మఫలితములను కూడ మార్చుకోగల సామర్థ్యము పొందును.)

1232. సర్వదా జయము గలిగించు పరాశక్తి – సత్యజ్ఞానమును ఎరిగినవారు తనను, తన విధివిన్యాసములను గెలువగలరు. మహామాయను, కర్మఫల సమూహమును, బంధకత్వమును గెలవగలరు. పంచజ్ఞానేంద్రియముల ప్రజ్ఞలు, పంచభూతాత్మకముల తన్మాత్రలగు – శబ్ద, స్పర్శ, రూప, రస, గంధముల ద్వారా ఇచ్ఛలను పురికొల్పునవిని గెలవగలరు.

(పరాశక్తి సత్యజ్ఞాన మెరిగినవారు సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలను గెలవగలిగి, కర్మఫల రహితము చేసుకొందురు. సంచిత: జన్మజన్మలుగా మనలో పోగుబడిన కర్మలు. ప్రారబ్ధం: సంచితలను అనుసరించి అనుభవిస్తున్న ఈ జన్మ – ప్రస్తుతం. ఆగామి: ప్రారబ్ధములో కొత్తగా పుడుతున్న కర్మలు (రాబోవు జన్మకు సంచితమగును.)

1233. సత్యజ్ఞానమును గ్రహించినవారు దానికి నెలవైన యాబది అక్షరములలో నెలకొన్న శివతత్త్వమును "పరమం" – పరంపరగా వచ్చుచున్న అనాది తత్త్వము – ఇదియే పరమాత్మ. కాని అపరాప్రకృతి వలన ఏర్పడిన దేహము గలిగిన జీవునికి ఇచ్ఛను (కాముడు–మన్మథుడు) పురికొల్పి ప్రేరేపించినది కూడ శివుడే. ఇది సత్యము.

1234. శక్తితో శివుడు ఏకమైన జ్ఞానమును పొందిన జ్ఞానులకు మూలము లేకుండనే సంకల్పముతో అన్నియూ ఏర్పడినవి. అట్లే యాబది అక్షరముల సముదాయములో నెలకొన్న శక్తులు జీవుని (జ్ఞానుల చిత్తములో) బుద్ధిలో నెలకొని వారివారి సంకల్పములకు తగినట్లు వస్తుప్రపంచము ఏర్పడునట్లు చేసుకొందురు.

(జ్ఞానులు చిత్తవృత్తికి తగ్గట్లు వస్తు ప్రపంచమేర్పరచుకొనగలరు. మూలము లేకుండ: విత్తనము వెదజల్లుట లేకుండా, సంకల్పమాత్రాన సృష్టించబడిన వస్తు ప్రపంచము. **"పరమాత్మ సంకల్ప మాత్రమున జగత్తును సృష్టించెను"** – శ్రుతి వాక్యము.)

1235. పరిపక్వమొందిన ఆత్మ (జ్ఞానుల ఆత్మ) ఆజ్ఞాచక్రములో నెలకొన్న శక్తితోడుగా, శివశక్తులుగా జీవునిలో (జ్ఞానుల ఆత్మలో) నెలకొనుటచే, ఊర్ధ్వలోకస్తులు, దేవతలు వచ్చి స్తుతించి, పొగడి, నమస్కరించిరి. అచ్చట వెగటులేని అమృతము (బ్రహ్మానందము) ఇచ్చు శుక్లపక్షమి నెలవంకవలె పరాశక్తి నెలకొని అనుగ్రహించెను.

1236. వెగటులేని అమృతముగా నెలకొన్న పరాశక్తి జ్ఞానులను తనవలె శక్తి స్వరూపులుగా మార్చివేయుచున్నది. దీర్ఘమైన కురులు గలిగిన పరాశక్తి జ్ఞానుల సకల దోషములను నివర్తించి, గంగాజలము వలె నిర్మలమొనరించి, చల్లని వెన్నెల కురిపించు నెలవంకగా, మహాతపస్సులైన జ్ఞానులలో ఎప్పుడు వెదజల్లు నక్షత్ర ప్రకాశముగాను (ఆత్మజ్యోతిగా) నెలకొనియున్నది.

1237. అట్లు నక్షత్రప్రకాశజ్యోతిగా నెలకొన్న పరాశక్తి, జ్ఞానుల చిత్తములో ఇముడటచే వారు మహాప్రకాశమండలముగా (చంద్రమండలము) మారి చిత్తమునందు సంకల్పించిన మాత్రాన అన్నియూ నెరవేరి ప్రతిఫలమొనర్చును. వారిలో వారివారి చిత్తసంకల్పన తగ్గట్లు అన్ని రకములైన జ్ఞానములు సిద్ధించి వారికి అన్నీ సాధకము లగునట్లు చేయును.

(పరాశక్తిని తనలో పదిలపరచుకొన్నవారికి సకల జ్ఞానోదయములు, సాధకములు గలుగును.)

1238. లౌకికరహితమై, చిత్తమును ఆత్మజ్ఞానములో పదిలపరచుకొన్న జ్ఞానులకు అన్ని తత్త్వములు బోధపడి, కోరిన రూపం పొందుదురు. వారిలో శక్తి నెలకొని తామే పరాశక్తియగుదురు. అందమైన లేడివంటి కన్నులు గల పరాశక్తి మన్మధుడు బోలిన పరమశివునితో కలిసి ఎదురుగా ప్రత్యక్షమై, ఆత్మలో భేదరహితమైన తత్త్వము గ్రహింపజేసి అనుగ్రహించుదురు.

(సాధకుడు (జ్ఞానులు) పరాశక్తిని తనలో ఇముడ్చుకొనుటచే ఆమెతో విడదీయలేని

తత్త్వముగల పరమశివుడు కూడ వచ్చి నెలకొనును.)

1239. పరాశక్తి సాధకునిలో నెలకొని జ్ఞానముగాను, జ్ఞానాతీతమైన ప్రణవంగాను, అణువులో అణువుగా (పరమాణువుగా), మాయను కల్పించునదిగాను, అన్నిటికి ఉన్నతమైనదిగా అమరియున్నది. ఎర్రని ప్రకాశము గలిగినది, శివుడు కోరు మహాసౌందర్యవతి. అన్నీ గ్రహింపబడునదిగాను (శివానందం) గ్రహింపబడుటకు తగిన మార్గముగాను పరాశక్తి ఉన్నది.

1240. ఇట్లు అన్ని తత్త్వములకు తానై నిలిచిన పరాశక్తి, క్షణకాలమునైననూ వీడియుండక ప్రణవస్వరూపుడగు శివునితో ఏకమైన ఆమె సూక్ష్మతత్త్వమెరిగి ధ్యానించువారికి ఏ మాత్రము క్షీణతలేని శాశ్వత జ్ఞానము పొందగలరు.

1241. బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు (చక్రస్థానాధిపతులు) మోహమును కల్పించువారు. ప్రణవ స్వరూపుడైన శివంలో తొమ్మిది ఇమిడినచో, తేనెను కడుపార త్రాగి మత్తు పొందిన తేనెటీగ వలె, శివశక్తుల తత్త్వమును పొందగలరు.

(దేహతత్త్వము వీడి ఆత్మతత్త్వములో నెలకొని అమృతము (తేనె) పొందుట. ద్వాదశాంత తత్త్వమునకు అతీతమైన చంద్రమండలప్రకాశమగు పరాపరమును పొందగలరు. వివరణ:

1. మూలాధార చక్రస్థానం – సూర్యమండలము – విఘ్నేశ్వరుడు అధిపతి; 2. స్వాధీష్టానము – బ్రహ్మ; 3. మణిపూరకం – విష్ణువు; 4. అనాహతము – రుద్రుడు; 5. విశుద్ధి – మహేశ్వరుడు; 6. ఆజ్ఞా – సదాశివుడు; 7. సహస్రదళ పద్మము – పరా; 8. ద్వాదశాంతము – బ్రహ్మరంధ్రమునకు 12 అంగుళం పైకి – పరము; 9. చంద్రమండలము – ద్వాదశాంతము పైన ఆకాశములో నెలకొన్నది – పరాపరం.)

1242. సహస్రదళ పద్మములో ఇమిడిన శక్తితో కూడిన శివుని నమస్కరించి, స్తుతించు తత్త్వములను లోకులకు బోధపరచండి. అట్లు చేసినచో ఇంద్రుడు, అష్టదిక్పాలకులు, దేవతలు, అసురులు వచ్చి మీ పాదములకు నమస్కరించుదురు.

(శివశక్తులను పొందు యోగతత్త్వములను ఇతరులకు బోధపరచినతో సాధకుని (జ్ఞానము పొందినవారి) పాదములకు అందరూ వచ్చి నమస్కరించుదురు. లోక సంగ్రహము కొరకు ఉన్న జ్ఞానియే చలనదైవము – దేవాలయములోని దైవము అచల దైవము – శ్రుతివాక్యము.)

1243. నిర్విరామముగా ఉచ్చరించబడు దివ్యమంత్రము, సుగంధ పుష్పములు, ధూపము, ఆకర్షించు వాసన ద్రవ్యములు, చీకటిని పారద్రోలు దీపముతో, జగత్తున

పార్వతిదేవికి చేయబడు పూజావిధానము మొదలగునవి యజ్ఞయాగాదుల ద్వారా హవిస్సును స్వీకరించు దైవమునకు అర్పించు అర్చనగా మారును.
(విడదీయలేని అనుబంధముతో నున్నందున "పరా" అయిన శక్తికి చేయున వన్నియూ "పరము"నకు చేరును.)

1244. శక్తిని ఒక వంతు పొంది, జగత్తును భరించు (ఆధారముగా నుండి) శివుడు, ఆమె వలన కలిగిన సృష్టిని (అవ్యక్తమైన జగత్తును) స్థితి పొందించి, శ్రేష్టమైనవాడుగా, క్షీణములేని (అక్షరుడు) వాడుగా తాను నెలకొనియున్నాడు. అందమైన చిలుకను తన భుజములపై పెట్టుకొని ఉంగరాల కొప్పును గలిగిన పార్వతిదేవి పరమును తనయందు ఒక భాగముగా గలిగిన ఆ పరాశక్తియే కావున శివునితో కలిసి స్తుతించండి.
(శివశక్తి ఇద్దరూ విడదీయలేని అర్థనారీశ్వరి తత్త్వము. కావున వారిని కలిపి కొలువ (స్తుతించ) వలెను. చిలుక – నాదముతో పోల్చబడినది.)

1245. శక్తిని కొలుచువారిని లోకులు మాతృమూర్తిగా కొలిచెదరు (శక్తిని నిరంతర ధ్యానాదులతో సాధకుడు (జ్ఞాని) తానే శక్తిగా మారిపోవుట). నల్లటి తీగవంటి శరీరము గలది – ఉమాదేవి. శరణు కోరినవారిని రక్షించు నాయకి. త్రికిరణముల జ్వాలను ప్రశరింపజేయు త్రినేత్రి. ఆమెను స్తుతించి ఉన్నతి పొందుగాక!! బంగారు వంటి పాదములు గల స్త్రీలు నీ యొక్క (జ్ఞాని యొక్క) పాదములను కోరివచ్చి నమస్కరింతురు.

1246. అన్ని ఆధారచక్రములలో విస్తరించియున్న పరాశక్తి యొక్క జ్వాల, మాలవలె ఏర్పడి, అది అధోముఖముగా వెళ్ళక (వెళ్ళనీయక) ఊర్ధ్వముఖముగా అనగా వెన్నెముకలోని సుషుమ్నానాడి ద్వారా కంఠమునకు ప్రాకి కొండనాలుక చేరి, అచ్చుట శబ్దించు నాదముగా మారి, సహస్రము చేరి సత్ఫలితముల నొసగును.
(మూలాధారమున జీవశక్తికి పురికొల్పబడిన కామ (ఇచ్ఛలు) వినోదములు త్రోసిపుచ్చి, శిరస్సుకు ప్రాకించిన సాధకునికి (జ్ఞానికి) లౌకిక వాంఛలకు అతీతముగా ఎదిగి, సహస్రమున జ్ఞానసిద్ధి పొందదగు నాదముగా మారును.

1247. జగత్తు సృష్టికి ఆదినుండి దైవము జ్యోతిస్వరూపుడుగా నెలకొన్నవాడు. ప్రేమకు చిహ్నముగా నా అంతరమున వెలసియున్నాడు. విషమతత్వములను తొలగించి, సత్త్వప్రధానుడై నా శిరస్సున జఠాధారిగా, గంగను ధరించి, ప్రకాశమండలమగు ఉమతో (శక్తితో) కలిసియున్ననూ, తను ఏకస్వరూపుడే అగును.

1248. అండచరాచరము లంతటిలో నున్న జీవరాశులను సృష్టించి, వాటిలో నందీశ్వరుడు తానే ఇమడియున్న తత్త్వమును బాగుగా పరిశీలించి చూచినచో,

శబ్దించు గాజులు గలిగియున్న ఉమాదేవితో తాను కోరి ఏకమై నిలుచున్నది వట్టి మాయయే అగును.

(నందీశ్వరుడు=శివుడు, తానే అన్నిటికి మూలకారణమైన ఆధారభూతముగా నున్ననూ, తాను శక్తితో కలిసి జగత్తు సృష్టించెనని చెప్పుట మాయతో కలిసి చేసినదే అగును. **"పరబ్రహ్మం మాయతో కలిసి జగత్సృష్టి, జీవసృష్టి చేసెను"** – శ్రుతివాక్యము. బ్రహ్మ+మాయ=ఈశ్వరుడు. ఈశ్వరుడే కారణప్రపంచము, కారణ జీవుడునకు మూలము.)

1249. జగత్తు, జీవ, సృష్టి కోరి జటాధారియైన శివుడు మాయతో కలిసి ఏకమై సృష్టించి, తన పాదములను జీవుని ప్రకాశమండలములో ఉంచి, సూక్ష్మముగా వానిలో నెలకొని* (ఆత్మగా), వాడే దేహతత్త్వములతో నిండిన మహాశక్తి సమూహముతో కలిసి, వివిధ జీవుల సృష్టించదగు కారణభూతుడుగాను, ఆధారముగాను, పిదప జీవులలో తన పాదములు ఉంచుటచే వారిని ఆదుకొని, పరిపక్వపరచి, అనుగ్రహించి, తనలో లయచేసుకొను ఆధేయముగాను ఉన్నాడు. ఆధార, ఆధేయములు ఈశ్వరుడే అగును.

(*"**సోకామయత: బహుస్యాం ప్రజాయే యేతిః**" శ్రుతివాక్యం. తానే కోరి జీవ, జగత్తు సృష్టించి, అందులో నెలకొనెను. మహాశక్తి సమూహమనునది: ముప్పది ఆరు దేహతత్త్వములతో (శక్తులు) నిండి, జగత్తులో వ్యవహారము నడుపుచున్నాడు. జీవుని ప్రకాశమండలమనునది: సహస్రదళ పద్మములో శుద్ధ సత్త్వగా, ఆత్మగా, కూటస్థుడుగా, చిత్‌గా యున్నది.)

1250. తాను వేరు, నేను వేరు కాదని గ్రహించితిని. భువనాధిపతియైన ఈశ్వరుని సృజించియుంటిని. దానివలన నాలో అఖండాకార స్థితిని పొందితిని. భువనాధిపతియైన ఈశుని సృజించి యుండటచే అధోముఖ భువనముల యొక్క సాంగత్యమును వీడితిని. ఆదియైన వాని పాదములు నాపై మోపుటచే వాని అనుగ్రహమును పరిపూర్ణముగా పొందితిని.

(తాను, నేను (రచయిత) వేరుగాదన్న సత్యజ్ఞానమును పొందుటచే అఖండాకార స్థితి పొందినది. **"అహం బ్రహ్మ అస్మి – జీవో బ్రహ్మైవ నా పరః"** నేనే బ్రహ్మం – జీవాత్మ బ్రహ్మం వేరుగాదు – శ్రుతివాక్యం. జీవునికి ముందుగా బంధమును కల్పించి, వానిని పరిపక్వమొనరించి, బంధములు త్రెంచి, అనుగ్రహించునది ఈశుడే అగును.)

1251. నవశక్తులలో మహత్తును గలిగియున్నది మనోన్మణియే. ఆమెను తోడుగా చేసుకొన్నవారు పరమేశ్వరుని వద్ద క్షీణతలేని అన్ని సౌలభ్యములు పొందనగును.

నేర్చిన విద్యల ఫలితములను సమున్నతముగా గ్రహించినవారు ఎవరనగా శ్రేష్టమైన బంగారు మండలములో వెలయు ఈశుని పాదపద్మములే గమ్యమని చేరుకొన్నవారు.

(శాశ్వతమైన, శ్రేష్టమైన, సత్యజ్ఞానము (ఆత్మజ్ఞానము) పొందుటయే విద్యా ఫలితము.)

1252. సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడైన నా నాయకుని (శివుడు)తో కలిసి నా హృదయములో కోరినెలకొనినది, శ్రేష్టమగు శక్తిరూపము ఏడు (7) భువనములలో వెలసినదని కొందరు చెప్పుదురు. కాని శీతల మండలముగా నొప్పారు నా సహస్రదళ పద్మములో కరుణతో నెలకొనుటకు కారణము నా అమ్మయే!! (పరాశక్తియే)

1253. ఏడవ భువన నాయకురాలు (సహస్రదళ నాయకురాలు) తల్లి మనోన్మణియే. శ్రేష్టమును ఒనగూర్చి జ్ఞానస్వరూపిణిగా వెలుగొందునది. ఈ జన్మమెత్తిన శరీరమును (క్షేత్రముగా చెప్పబడినది) పరిపక్వమొనర్చి ఆ క్షేత్రమునందే నెలకొని నిర్విరామముగా రక్షించుచున్నది.

(శ్రేష్టమగు సహస్రదళమున ప్రకాశమండలములో అమరియున్నది.)

1254. దేహసృష్టి కారణార్థము తల్లి పరాశక్తి. తండ్రి శివుడు ప్రేమతో కలిసిరే తప్ప నాలో నెలకొన్నది ఎవరూ పూర్తిగా ఎరుగజాలరు. శివుడు, శక్తి నేను (ఆత్మతత్త్వము) ఒక్కటిగా ఉన్న తరుణములో, విడదీయలేని అనుబంధముతో, నిర్విరామముగా శివశక్తులు నాలో వెలసినందున వారిని సదా నాయందు సృజించియుందును.

***

ఈ ఆధార, ఆధేయ అధ్యాయమంతయు తల్లి పరాశక్తియే చరాచర జగత్తంతటికి ఆధారముగాను, తానే వాటికి ఆధేయముగా ఉండి, ఆమెయే భోగరూపిణి, యోగరూపిణి, జ్ఞానరూపిణిగా వెలసియున్నది. భోగమే యోగమగుటను విశదీకపరచియున్నారు రచయిత శ్రీ తిరుమూలర్.

షట్చక్రస్థానములలో నెలకొన్న భోగతత్త్వములతో కూడిన జీవశక్తి సహస్రదళమున ఇముడునపుడు పరముతో ఐక్యమై, జీవుడే పరమగుటను వక్కాణించియున్నారు. యమ నియమాదులు, ఆసన, ప్రాణయామ ప్రత్యాహారధారణ, ధ్యాన సమాధులు – గురు ముఖముగా నేర్చిన సాధకుడు తన జీవశక్తి–కుండలినీ సహస్రమున చేర్చుటచే గలుగు సిద్ధి మహోన్నతమైనదియు, ఆ సాధకుడే జ్ఞానిగా ఎదిగి, ఎల్లరుకు పూజ్యుడగునని, అందరిచే స్తుతింపబడునని, తానే చలన దైవమగునని, శివం అగునని నొక్కి వక్కాణించి యున్నారు శ్రీ తిరుమూలర్.

ఇదే తత్త్వమును శ్రుతుల కూడ పెక్కు ఉపనిషత్తులలో మహావాక్యముల ద్వారా

అనగా: "బ్రహ్మ సత్యం - జగన్మిథ్యా - జీవోబ్రహ్మైవ నా పరః = బ్రహ్మమొక్కటే సత్యం, ఈ వ్యావహారిక జగత్తు అంతా మిథ్యయే"; బ్రహ్మ, ఆత్మ వేరుగాదు, రెండూ ఒక్కటే; "తత్త్వమసి" = అది (బ్రహ్మం) నీవుగా ఉన్నావు; "అహం బ్రహ్మాస్మి" = ఆ బ్రహ్మం నేనే; "అయమాత్మ బ్రహ్మ" = నా ఆత్మ బ్రహ్మంమే; ప్రజ్ఞానం బ్రహ్మ = పరం యొక్క ఎరుక - జ్ఞానమే బ్రహ్మం; మనకు బోధించుచున్నది.

శ్రోత్రియ బ్రహ్మనిష్ఠయైన గురువు ద్వారా శ్రుతులను శ్రవణ, మనన, నిదిధ్యాసన, విచారణల ద్వారా గ్రహించి, దేహేంద్రియ మనోబుద్ధులగు "అనాత్మ" తత్త్వమును విడనాడి "ఆత్మ" తత్త్వములో జీవాత్మ నెలకొనునపుడు తానే బ్రహ్మం అగును. శివం, బ్రహ్మం, చైతన్యం అన్నియూ పర్యాయపదములే.

## 9. ఊర్ధ్వముఖచక్రము

ఊర్ధ్వదిశగా ఎగబ్రాకు ప్రకాశముతో కూడిన చక్రము అన్నిటిని తనలో ఇముడ్చుకొను తత్త్వము గలది.

1255. మూలాధారచక్రములోని నాలుగు రేకులతో కూడిన పద్మము బహుప్రకాశవంతమైన దగును. స్థూలబిందు పరిపక్వమొందుటచే ఎగిసిపడు ప్రకాశము శిరస్సున నాదముగా నొప్పారును. ఎగిసిపడు అగ్నికళ శిరస్సునంతట వ్యాపించుటచే దాని మధ్యస్థానమున (చక్రమున) శివం వెలయును.

1256. మూలాధారములోని బీజాక్షరములే "వ,శ,ష,స" మహాబలమైన అక్షరములు. అవి పృథివి నుండి ఆకాశము వరకు వ్యాపించునవగును. ఈ అక్షరములు శిరస్సున చక్రరూపములో నాదముగా నెలకొనును. వాటిని అమర్చు విధానమును చెప్పెదనుగాక!!

(బాహ్యములో శబ్దమన్నది అంతరమున నాదముగా నెలకొనును.)

1257. మూలాధారమున పరిపక్వమొంది పైకి ఎగబ్రాకిన ప్రకాశకిరణములే పన్నెండు సూర్యకళలుగా శిరస్సున వెలుగొందిది. అవి ముందు మంత్రములో చెప్పిన బీజాక్షరములగు వ,శ,ష,స లే అగును. అవి మూలాధారమునుండి విశుద్ధి వరకు ఉన్న ఇడనాడి (చంద్ర), పింగళనాడి (సూర్య), సుషుమ్ననాడి (మధ్య) మూడింటి సమ్మేళనముతో పైకి ఎక్కుటచే, అవి నూటనలుబదినాలుగు (144) ప్రకాశ అణువులతో కూడిన చక్రముగా శిరస్సున వృత్తముగా ఏర్పడును.

(మూలాధారం-4, స్వాధీష్టానం-6, మణిపూరకం-10, అనాహతము-12, విశుద్ధి-16 = మొత్తం 48×3 నాడులతో కలిసి = 144 కళాశక్తులు.)

1258. అట్లు పెళ్ళుబికివచ్చు ప్రకాశకిరణములు శిరస్సున చేరినది ఆ బీజాక్షరములే అగును. ఆ అక్షరములు ప్రకాశముతో కూడిన నాదముగా ఒప్పారును. అట్లు

శిరస్సున చంద్రమండలమునందు వెలసినందున అది భూమండలముల యొక్క (పృథివి) సూక్ష్మతత్త్వముతో కూడినదిగా ఉండును.

1259. అట్లు శిరస్సున వెలసిన చక్రము ప్రపంచముగా విస్తరించినది. అచ్చట ప్రకాశ కోణములు, నాదము ప్రపంచముగా వ్యాపించినది. అందులో నెలకొన్న దైవము యొక్క సంకల్పమే ప్రపంచముగా రూపుదిద్దుకొన్నది. ఆ బీజాక్షరముల సూక్ష్మములే స్థూలరూపముగా మారినది.

(దైవసంకల్ప మాత్రమున సూక్ష్మరూపములే స్థూలముగా రూపొందినది.)

1260. అట్లు విస్తరించినది ప్రకాశకిరణములతో నాదముతో కూడినదై, చక్ర బీజాక్షరములతో కూడి మొట్టమొదట ఏర్పడిన భూతత్వముతో - పృథివి అంశముతో నున్నదాని నుండి అప్పుతత్వము (జలము-నీరు) ఏర్పడినది.

(పృథివి తత్వమును "విశ్వశ్వధారిణి" అని శ్రుతివాక్యము. పృథివి తత్వము పంచభూత తత్వములను అనగా ఆకాశ, వాయువు, అగ్ని, జలతత్వములనినటిని తనయందు ఉంచుకొని అన్నిటికి ఆధారభూతముగా నున్నది.)

1261. నీరుగా ఆ చక్రము విస్తరించినది. పిదప నీటినుండి అగ్నితత్త్వముగాను, అగ్ని తత్త్వము నుండి వాయువు తత్త్వముగాను, వాయువు నుండి ఆకాశతత్త్వముగా ఏర్పడినది. ఇవియన్నియు ఆ ప్రకాశమండలము ద్వారా వ్యాపించినవే అగును.

1262. ఇట్లు ఏర్పడిన ఆకాశతత్త్వము యొక్క బీజాక్షరము ఏదనగా - మూలాధారము నుండి వచ్చిన నూటనలువదినాలుగు అక్షరముల (144) సమ్మేళనములంతటికి మూలమైనది. "అకారకళ"గా నొప్పారు "అ"కారమే. ఇదియే శివానందము. దీనిని బాగుగా గ్రహించండి!!

1263. ఇట్లు గ్రహించబడిన చక్రము దశప్రకాశ వృత్తములుగా గలది. అవి అన్నియూ నాదముతో గలిగి, ఆయా దశ భువన నాయకులతో (షట్చక్ర స్థానముల నాయకులతో కలిసి సూర్య, చంద్ర, అగ్ని, నక్షత్రం) కూడినది. వీటినంతటిని దాటి ఆఖరిది శివసూర్యుడగును. (ఆఖరిదైన శివసూర్యతత్త్వం గ్రహించబడును.)

1264. మొదటి ఆరు స్థానములలో నున్నది (మూలాధారము నుండి ఆజ్ఞాచక్రము వరకు) ప్రణవ అక్షరములైన మూలఅక్షరములు. ఇవి శక్తికి సంబంధించినవి. అటుపై నాలుగు స్థానములు ఆజ్ఞాచక్రమునకు పైనయుండు సూర్య, చంద్ర, అగ్ని, తార (నక్షత్ర మండలములు) ఆత్మజ్యోతికి సంబంధించినవి శివతత్త్వముతో కూడినదైనందువలన అన్నియూ దీనినుండి ఉద్భవించుచున్నవి.

1265. మూలాధార చక్రము నుండి పైకెక్కిన (మంత్రము 1257న చెప్పినట్లు) నూట నలువదినాలుగు (144) కళలుగా వ్యాపించినది. ఆరు ఆధారచక్రములలోని

మధ్యనాడిలో ఉద్భవించినది అగ్నితత్త్వముతో కూడిన నాడియగును. ఆ అక్షరముల సముదాయమంతయూ ఆరు ఆధారచక్రములలో ఇమిడి, అవే ఆదిగాను, అంతముగాను వెలసిల్లినవి.

1266. ముందు మంత్రము చెప్పినట్లు ఆ అక్షరములే అంతముగా నున్నప్పుడు సూక్ష్మముగాను, ఆదిగా (మొదలుగా – షట్చక్రస్థానములోనివిగా) నున్నప్పుడు స్థూలముగాను ఉండి, అంతములో విశుద్ధి (16), ఆజ్ఞా (2) చక్రములలోనివి పదునెనిమిదిగా ముగుయుటచే, పదమూడవ అక్షరమగు (అచ్చులలోని పదమూడవ అక్షరము – 'ఓ') ''ఓ''కారముతో చేరి, దానిపైనున్న చంద్రమండలములో చేరవలెను.
(నాదమును దాటి ఆఖరిదైన శివంను చేరవలెను.)

1267. ఈ విధముగా అమరినది కాలము. మూడువందల అరువది (360) రోజులగును. అట్లే పదిహేను (15) తిథులతో కూడినది పక్షమగును. అట్లే ఋతువులు ఆరు (6), మాసములు పన్నెండుగా (12) వచ్చును. ఇట్లు ఏర్పడినవన్నియూ శివసూర్యుని వలన ఏర్పడినవే అగును.

1268. రాత్రి, పగలు ఆకాశతత్త్వము వలన 30+30=60 గడియలుగా ఉన్నవి. రాశులు కూడ ముప్పది కళలుగా వచ్చును. సంవత్సరమునకు మూడువందల అరువది కళలగును. దీనిని భాగించి చూచినచో సూర్యుడు వెళ్ళు పన్నెండు (12) రాశులు అర్థమగును. (సూర్యుని మార్గమును చెప్పునది.)

1269. ఇట్లు జత కట్టినవి మూడు కాలములుగా (భూత, వర్తమాన, భవిష్యత్) అమరును. మూలాధారము నుండి పైకివచ్చిన జీవశక్తి, అండచరాచరములోని కాలములతో పోల్చబడియున్నది. ఇట్లు పన్నెండు (12) రాశులన్నియూ మూడు విధములుగా అమరినవి.

1270. పైకి వచ్చిన జీవశక్తి, సహస్రదళ పటలము చేరునపుడు, సూర్యుని తత్త్వమగు పన్నెండు (12) కళలు = 12 రాశులతో పోల్చబడి, దానినే బిందుతత్త్వమగు ప్రకాశమండలముగా చెప్పబడినది. ఆ ప్రకాశమునందే నాదము ఏర్పడును. ఇట్లు ప్రకాశము, నాదముతో నిండినదే సహస్రమునందేర్పడిన ఊర్ధ్వచక్రమగును.

1271. సహస్రమున ఊర్ధ్వచక్రములో ఇమిడిన ప్రకాశము, నాదము – అగ్ని, సూర్య, చంద్ర తత్త్వ అక్షరములే అగును. ఆ అక్షరములు ఒక్కొక్క షట్చక్రస్థానములో స్థూలముగా అమరిన అక్షరముల కూర్పు సూక్ష్మముగా మారి స్పందన ఏర్పరచునదిగా మారి, శిరస్సున వెలయు తారతో (నక్షత్రము = ఆత్మ) కలిసి పూర్ణత్వము పొందును.

1272. తార (నక్షత్రము = ఆత్మ) ప్రకాశముగా సహస్రమున వెలసినది ఊర్ధ్వచక్రము. ఈ తార ప్రకాశమునకు పైన వెలుగునదే శివం. తారయే చంద్రుడు, సూర్యుడు, అగ్నులుగా ఏర్పడినవి. ఈ తారయొక్క సమష్టిజ్ఞానమే ఆత్మయగును. తారను వీక్షించునదే సమష్టి ఆత్మతత్త్వముగా చెప్పబడినది.

(అంతరమున ఏర్పడునదే బాహ్యముగా (అండచరాచరములో) తారయే వివిధ రూపములో ఏర్పడినది. తారను చూచునదే = ఆత్మస్వరూపంగా చెప్పబడినది (మంత్రము 860 చూడవలెను).)

1273. ఇట్లు కనిపించు ఊర్ధ్వచక్రములో ప్రకాశము వృద్ధిపొందును. ప్రకాశము చుట్టూ ఉన్న పరిధిలో నాదము కూడ ఉద్భవించి, కనిపించు అగ్నితత్త్వము దీపపుజ్యోతి వలె దర్శనమిచ్చి, పిదప శిరస్సుపైన కారుమేఘమువంటి నల్లటి ప్రకాశము కనిపించును. (కారు = నీలము + నలుపు కలిసినది).

1274. కారు (నల్లటి) మేఘం వంటి ఛాయయే అండరూపములో నున్న జగత్తతంతటిలో కలిసి పృథివి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశ ప్రకాశములుగా వ్యాపించి, వృద్ధి పొంది, సమ్మేళనమై ఒకే ప్రకాశమయముగా విస్తరించియున్నది.

(ఒక్కొక్క పంచభూతముల తన్మాత్రలన్నియూ ప్రకాశరూపము గలిగి, ఊర్ధ్వదిశగా విస్తరించియున్నది.)

1275. ఒక్కొక్క జీవరాశుల చుట్టూ ఆవరించియున్న అండమే (కోశము) జగత్తుంతటికి వ్యాపించి విస్తరించియున్నది. ప్రారబ్ధము ముగుయువరకు ఈ అండము (కోశము) నెలకొనియుండును. ఈ అండకోశము జీవులకు మూలము వంటిది. ఈ అండ కోశము జీవులకు ప్రకాశమైనదై, పుష్టినిచ్చునది.

(జగత్తు సృష్టిలో పదునాలుగు భువనములు అండరూపములో – గ్రుడ్డు రూపములో నున్నదని చెప్పబడినది.)

1276. ప్రకాశము, నాదము సమానమై ఏకమైనపుడు, ఆకాశమయమైన అండకోశమునకు విత్తనము వంటిది. ప్రకాశము తగ్గి నాదము మాత్రము పుంజుకున్నచో, నాదము ప్రకాశము కన్నా ఎనిమిదింతలు (8) శక్తివంతమైన దగును.

(ఆకాశమయమైన అండములో ప్రకాశము, నాదము ఏకమగుట చెప్పబడినది. ఇది బ్రహ్మాండము; మాట, చేతన ఏకమగుటచే వృద్ధి పొందునది – పిండాండము – జీవుడు.

నాదము ఎనిమిదింతలకు కారణము: పంచభూత తన్మాత్రలు (5) + సూర్య, చంద్ర, అగ్ని కళలు (3) = 8 (ఆత్మ)తో చేరుట వలన.)

1277. విత్తనము వంటి ప్రకాశకిరణ అణువులు రెండు రకములుగా ఉన్నవి. ఒక రకము వేగముగా ఊర్ధ్వమునకు వెళ్ళి, అండకోశములో ప్రకాశ, నాదములను ఏర్పరచును. మరొకటి ప్రకాశకిరణములే స్పందన రూపములో నాద అణువులను ఉద్భవింపజేసి, అండకోశములో విస్తరించిన ప్రకాశ మండలములుగా మారును.

1278. ప్రకాశ కిరణములు సదా విస్తరించుట వలన కనీసముగా దాని వీర్యము తగ్గి, దానికి తగ్గట్లు నాదము శక్తి పుంజుకొనును. స్థూలవీర్యమును (స్థూలబిందు) కట్టుబాటు చేసినచో, అది పదహారుగా (షోడశకళలుగా) – చంద్రకళలుగా మారి ప్రకాశకిరణ బీజములుగా ఏర్పడును.

(కొన్ని మంత్రములలో బిందు, ప్రకాశము, వీర్యము (శుక్లము)ను పర్యాయ పదములుగా వాడియున్నారు రచయిత. రచయిత శ్రీ తిరుమూలర్ మహాసిద్ధుడు, మహాయోగి, మహాజ్ఞాని, మహారసవాది (Alchemist). గూఢార్థములపై ఇప్పటికీ పరిశోధనలు జరుగుచునేయున్నవి.)

1279. సృష్టిలో ఉద్భవించినవన్నిటికీ బిందు (వీర్యము – శుక్లం) కారణముగా నున్నది. బిందుతో ఏర్పడినదే ప్రాణము. ఈ జగత్తంతయూ బిందు కారణముగానే నెలకొనియున్నది. ఆ బిందు (ప్రకాశము) ద్వారా శివశక్తుల పాదపద్మములు కూడ గ్రహింపబడును.

1280. అన్ని అక్షరముల సముదాయమేర్పడినది మూలప్రణవమైన బిందు (ప్రకాశ) నాదముల వలనే. అదియే చక్రరూపములో శిరస్సున అమరినది. ఆ ప్రణవముతో కూడినదే ఈ శరీర 'కూర్పు'. అది అన్ని అక్షరములతో కూడిన నాదస్వరూపమైన మంత్రమగును.

(ప్రణవమే నాద, బిందు, చక్రముగా శరీరమున వెలసియున్నది.)

1281. మంత్రచక్రము గురించి చెప్పుట ఏమనగా, అన్ని ఉపాయములు ఆ ప్రణవమగు ప్రకాశవృత్తము లోపల ఇమిడియున్నవే అగును. కంఠమునుండి వెలువడు మాటలలోను (వైఖరి శబ్దము – వాక్కు) రేకులలో గీయబడిన రేఖాశాస్త్రములోను ఏ ప్రయోజనము లేదు. స్పందన రూపములో వెలువడు ప్రణవములోనే అన్నియూ ఉన్నది. (ప్రణవ స్పందనయే ఉపాయముగా తలంచి ధ్యానించవలెను.)

1282. అంతర్ముఖముగా ధ్యానించు ప్రణవ వృత్తములో నెలకొని వెలసినదే మంత్రమగును. రేకులలో గీయబడిన రేఖలతో ఎటువంటి లాభములేదు. తనలో ఏర్పడు నిరోధకములైన అజ్ఞానమునకు చెప్పబడిన మంత్రమే శ్రేష్టమగును.

(ప్రణవచక్ర ధ్యానముతో జీవులకు బంధములేర్పరచు ఆటంకములు తొలగును.)

1283. ఊర్ధ్వచక్రమును గ్రహించువారు శివుని దరిచేరగలరు. వీరికి జనన,

మరణములను పగను (బంధమును) త్రెంచును. చిత్తమునందు పదిలమై రక్షించును. సూక్ష్మాది సూక్ష్మమైన శివతత్త్వమును చూడగలరు. దీనిని అంతర్ముఖముగా గ్రహించువారికి అన్నియూ ఒనగూరును.

1284. పై మంత్రములో చెప్పినట్లు గ్రహించినవారికి చక్రములోనున్న ఆది అక్షరము (మూలము) 'అ'కారమగును. వ్యాపించిన చక్రములో శక్తి అక్షరము 'ఉ'కార మగును. మాయా కార్యములగు పృథివి, జలం, అగ్ని, వాయువులకు ఈ చక్రము ఆధారమైయున్నది. ఇట్లు ఎన్నో విధములుగా, సమ్మేళనములుగా నున్న ఈ చక్రము గురించి చెప్పుటకు శక్యమగునే!!

1285. ఇట్లు చక్రములోని మంత్రాక్షరములు ఆరు రకములైన ఆకర్షణలుగా విస్తరించిననూ (ఆరు ఆకర్షణలు: స్తంభన, మోహనం, ఉచ్చాటనం, విద్వేషం, వశియం, మారణం) అఖరిదైన 'మారణం'నకు తమ దైవానుగ్రహముతో మార్చుకొని, ఆరు విధములైన చర్యలుగా (కార్యములుగా) గ్రహించగలరు.

1286. బ్రహ్మాండములోని జీవరాశులంతటికి అనుగ్రహము పాలించు పరాశక్తి ఈ ఊర్ధ్వచక్రమునకు మొదటి స్థానికురాలు. అట్లు ఆమెను గ్రహించి స్తుతించువారి పగను, బంధములను త్రెంచు అగ్నిస్వరూపిణి. ఆమెను కారణభూతురాలని గ్రహించువారికి ఆమె అనుగ్రహము లేకుండా ఏ కార్యము జరగదని బోధపడును.

1287. తన అంతరమున సృజించి పరిపక్వమొందిన సాధకునకు (జ్ఞానికి) ఆకర్షణలోని అంశములైనవి "స్తంభనం, వశీయం, మారణం" తనంతట తానే వచ్చి చేరును. వీరున్నచోటికి శత్రువులు కూడ వచ్చిచేరి, స్నేహితులగుదురు.

1288. మూలాధారములోని చక్రస్థానమును బాగుగా గ్రహించుదురు గాక!! శ్రేష్టమైన 'అకారము' దాని మధ్య ఉండునదిగా గ్రహించి, చల్లగా నిద్రాణమైయున్న కుండలినీని మూలవాయువుతో సుషుమ్నానాడిలో పైకి లేపి ఊర్ధ్వముగా ప్రాకించుదువు గాక!!

1289. పావు, అర్థ, ముప్పావు, పూర్తిగాయైన ప్రణవము (ఇడనాడి, పింగళనాడి, సుషుమ్న నాడుల ద్వార పయనించిన ప్రణవము శిరస్సుకు చేరుటలో పూర్తియగుటగా చెప్పబడినది) వ్యాపకము చెంది, కామాది షడ్వికారములను వీగిపోవునట్లు చేసియూ, ఇచ్ఛకు తగినట్లు తనను తాను మార్చుకొనుటకు తోడ్పడునే!!
(ప్రణవము చిత్తమునందు పదిలమైనచో కామాది వికారములు తొలగిపోవును.)

1290. నాట్యకారుని (నటరాజు – శివుడు) అక్షరములే ఈ ప్రణవమంత్రము. అతి పురాతనమైనదగు ఈ ప్రణవమంత్రము కొండనాలుకు ప్రదేశములో ఇమిడి శత్రువులను కూడ (షడ్వికారములు) మార్చి అమర్చి, శిరస్సున నుండు సహస్ర

దళపద్మమును విస్తరింపజేసి, ప్రకాశము పొంది వెలసిల్లినది శివం అని గ్రహించి స్తుతించుదురు గాక!!

## 10. భైరవ చక్రము

భైరవుడు – శివుని ఆరువది (64) మూర్తులలో ఒకటి. శత్రుజయమునకు ఇతనిని ఉపాసించుట వాడుకలో నున్నది. ఈతని చక్రము కావున భైరవ చక్రముగా పేరొందినది.

1291. శుక్లపక్షమి ప్రథమతిథి మొదలు షష్టి వరకు షట్చక్రస్థానాలలోనివి గ్రహించి, ఆపైనున్న తిథుల కొన్నిటిలో దోషములను ఎరిగి, అష్టమి తిథిని వదిలిపెట్టి, నవమి తిథినాడు నుదుటి పైభాగమునను, ఏకాదశినాడు కుడిచెవి పైభాగమునను, త్రయోదశినాడు శిరస్సు వెనుకభాగమును, పదునాల్గవ తిథినాడు ఎడమచెవి పైభాగమును, మొత్తము పది (10) స్థానములలో మనస్సు నిలిపి, భైరవుని తలంచి ధ్యానించవలెను.

(షట్చక్రస్థానములు 6 + శిరస్సున 4 స్థానములు = 10)

1292. ధ్యానించువారి మదిలో మెలగు భైరవుడు శూలమును, కపాలమును చేతబూనినవాడు. శత్రువులను పడగొట్టి, వారిపై కరుణ చూపకుండా, వాని ప్రాణమును చీల్చి చెండాడి, వాని శరీరమును బంతిగా ఆడగలరు.

(భైరవుని ఉపాసన చేయువారు శత్రజయము పొందగలరు.)

1293. ఆత్మల భక్తికి తగ్గట్లు దానిని గ్రహించి, వారు కోరినట్లు అనుగ్రహము నొసగుటలో భైరవుడు చాలా శ్రేష్టము. రెండు చేతులలో కపాలము, శూలము గైకొని, మరో రెండు చేతులలో పాశము, డమరుకము గైకొని, మరో రెండు చేతులలో ఖండించిన శిరస్సు, కత్తితో ఆరు చేతులతో నిలిచి భైరవుడు దర్శనమిచ్చుచున్నాడు.

(భైరవుని ధ్యానించదగిన సాకారరూపము చెప్పబడినది.)

1294. భైరవుని ఆరు చేతులలో గల ఆయుధములపై మనస్సు నిలిపి ధ్యానించండి. వాని శరీరము ఎర్రని ఛాయతో నుండును. నిర్మల, నిష్కంళక మనస్సుతో నున్నవారి మదిలో నెలకొనువాడు. ధ్యానమునందు సత్యప్రకాశములో నెలకొని శరీరమునకు అతీతముగా నుండి నీవు పూజింతువు గాక!!

1295. నిత్యపూజలతో భైరవుని వెయ్యిరూప నామములతో జపించుదువు గాక!! పూజకు శ్రేష్టమైన తేనెను అర్పించి పూజించండి. పూజకు చందనము, జవ్వాదు, పునుకు, మొ॥ వాసన ద్రవ్యములు అర్పించి, శత్రుజయము పొందండి.

1296. మనము కోరుకున్నట్లే శత్రువునిలో మహా క్షోభ ఏర్పడును. కోరినట్లే షట్కర్మ విద్య పొందిన పిదప, కోరినట్లు నీవు నడుచుకొందువు గాక (సద్బుద్ధితో ధర్మ బద్ధమైన కర్మలు ఆచరించుట) అపుడు నీవు కోరినవన్నియూ సత్ఫలితములిచ్చునే!!

## 11. శాంభవి మండల చక్రము

శాంభవి - శివశక్తి. శివశక్తి స్వరూపమగు శివలింగమే దేహముగా నిండిన చక్రము గావున శాంభవి చక్రముగా పిలువబడినది.

1297. శాంభవి చక్రనిర్మాణమును ఇందులో చెప్పబడినది. నిలువున, అడ్డముగా ఎనిమిది గళ్ళు గీయుటచే అందు అరువదినాలుగు (8×8=64) గళ్ళు ఏర్పడును. అందు శ్రేష్టమైన బిందు, నాదము, శివుడు, శక్తి రూపములమర్చి, బిందు (ప్రకాశము) శ్రేష్టమును మనమెరిగినచో, లోకులందరు మనల్ని కొలుచు స్థితిని పొందుదుము సుమా!!

1298. శాంభవి మండల చక్రములోని వీధుల విధానమును చెప్పబడినది. లోకస్తులు ఎరుగు ఈ భూమండలమే ఈ చక్రములో చెప్పబడినది. ఏ విధదోషములు లేక వీధులను గీయవలెను.

(గురుముఖముగా నేర్వవలసిన విధివిధానము ఇచ్చట చెప్పబడియున్నది.)

1299. నిలువున అడ్డముగా ఇరువది గీతలుతో పందొమ్మిది

1300. గళ్ళతో కూడినది ఈ చక్రము. దాని మధ్యన నాలుగు లింగము అమరునట్లును, నాలుగు మూలలు, దిక్కులలో నాలుగు లింగములతో కూడి కాళీ ప్రదేశమున నాలుగు పద్మములతో చక్రమును నింపవలెను. గీయబడిన ప్రతి శివలింగములందు "శివాయనమ" పంచాక్షరితో నింపవలెను. మిగతా గదులందు (ద్రవిడ భాషలోని) అచ్చులు, హల్లులు గీయబడియున్న పఠమునకు చూడవలెను.) ఇట్లు గీయబడినది: ముప్పది ఐదు (35) దేహతత్త్వములకు ఆత్మ అతీతమైనదని బోధపడిన సాధకుడు దానిని ఉపాసన చేసి ఎటువంటి కొరత లేక యుండగలడు.

1301. ముందు మంత్రములో చెప్పినట్లు వాక్కులో ఎటువంటి కొరత ఏర్పడదు. ధ్వనించు వీర అందె ధరించిన దైవము యొక్క దివ్యపాదములు పొందు భాగ్యము గలుగును. వేదములు ఘోషించుచునది కూడా ఈ ప్రణవమేయని దృఢనిశ్చయజ్ఞానము పొందినవారికి మరణము లేదన్నది పెద్దల ఉవాచ.

1302. శాంభవీచక్ర ఉపాసన వలన అన్ని ఐశ్వర్యములు గలుగునని చెప్పునదీ మంత్రము. బాహ్యముగా చూడబడు సంపదలన్నియూ, అంతరమున నెలకొన్న దైవము, స్తుతించు ఊరు, ఉప్పొంగు పుణ్యతీర్థము, మంచి భోజనము, మంచిభావన, మంచినిద్ర, తనంతట తానే గలుగు కనకము (బంగారము), ఇవియన్నియూ శాంభవి వలన గలుగును!!

1303. పంచాక్షరి మంత్రోచ్ఛారణతో పైకి లేచిన ప్రకాశము నాదముగా మారి శబ్దించునదిగా శిరస్సున సహస్రదళములోనున్న దైవముతో ఇముడుటచే మనము

తలంచినవన్నింటిని సాధించగలము. లోకములో మరే శత్రువులుండరు.
(చిత్తమునందు పంచాక్షరి "శివాయనమ" పదిలముచే అన్నియూ సిద్ధించును.)

1304. శాంభవి మండల ఉపాసకులకు శత్రువులుండజాలరు. ఇతరులచే నవ్వులపాలు కారు. ఊరివారందరు తనకు సహాయపడుదురు. పాపపుణ్య చక్రభ్రమణము వలన ఏర్పడు పునర్జన్మ గలుగదు. తాము కూడ శాంతశీలముతో, సాత్త్విక గుణముతో ఉందురు.

1305. అందరూ శాంభవిని పంచాక్షరముతో జపించవచ్చును. దీనివలన ఎవరు ఊహించలేని ఆనందరూపమును పొందవచ్చును. పృథివి నుండి ఆకాశము వరకును, సూర్యచంద్ర మండలముగాను, శ్రేష్ఠమైన శరీరములోని ప్రాణముగాను, ప్రాణములోగల భావనగాను, ఆ శాంభవీ నెలకొనియున్నదని గ్రహించగలరు.

1306. "శివాయనమ" అని భావించువారికి నాభి నుండి శిరస్సునకు ప్రణవము ఉద్భవించి పెల్లుబుకును. ఆ ప్రణవమే పంచాక్షరి రూపమైన దైవము యొక్క మొదటిస్థితి. శివం, శక్తి, నాద, బిందు తత్త్వముల నుండియే దేహము ఉత్పన్న మగును. మరల తిరోగమములో శక్తి శివునితో కలిసి అన్ని తత్త్వములతో కూడి బిందు (ప్రకాశము)లోను, బిందునాదములోను లయమగును.
(ప్రణవము ఉత్పన్నమగునపుడు అన్ని తత్త్వములు నాదములో లయమగును.)


## 12. భువనాపతి చక్రము

"భువన" శక్తి యొక్క పేరు. భువనాధిపతి–శక్తి–చక్రము. భువన యొక్క బీజాక్షరములు, చక్రము, ఉపాసన, పూజ ఇందు చెప్పబడినది.

1307. "కకారాది" మొదలు ఐదు అక్షరములు బంగారురంగు గలవి. "హకారాది" మొదలు ఆరు అక్షరములు ఎర్రనిరంగు గలవి. "సకారాది" మొదలు నాలుగు అక్షరములు తెల్లనిరంగు గలవి. ఈ శక్తితత్త్వముతో కూడిన మూడు విధములైన మంత్రములు కామ్యముక్తి నొసగునవే అనగా ఇహం పరమునకు సుఖము లొసగునవే.
("శ్రీ విద్యాతత్త్వము–శక్తి బీజము హ్రీం" దీని తత్త్వములు "హః=శివ బీజము; ర్=అగ్నిబీజం; ఈ=మహామయా బీజం; మ్=బిందు". ఈ కలయిక "హ్రీం".
"కకారాది" అన్నది శక్తిబీజం "హ్రీం", కలసి "క, ఏ, ఈ, ల" 5 అక్షరములు.
"హకారాది" అన్నది శక్తితో కలసి "హ్రీం, హ, స, క, హ, ల" 6 అక్షరములు.
"సకారాది" శక్తితో కలసి "హ్రీం, స, క, ల" అను నాలుగు అక్షరములు.

పై పదిహేను అక్షరముల సమూహం శ్రీ భువనేశ్వరిదేవి యొక్క బీజాక్షరము లగును. దీనినే "పంచదశాక్షరి" మంత్రమని చెప్పుదురు. మూలాధారములో "హ కారము", హృదయమున "ర కారము", భ్రూమధ్యమున "ఈ కారము", శిరస్సున "హ్రీం కారము" న్యాసము చేయవలెను - దేవి భాగవతం.)

1308. నేను పరిశోధించి చెప్పునదేమనగా (రచయిత) ఈ పరాశక్తికి మించిన దైవము మరొకటి లేదు. కావున నేను (రచయిత) చెప్పునది వినుడు. వర్షమువలె అనుగ్రహమును వర్షించునదీ త్రికోణచక్రమును చిత్తమునందు పదిలపరచి ధ్యానించువారికి మంచి మనస్సు, సుఖప్రాప్తి, ముక్తియూ గిట్టును. ఇదియే శివ స్వరూపమని కూడ ఎరుగుము.




1309. ఏకత్వమైన పరాశక్తి దైవమునకు (శివునికి) అంగమగును. ఆమె దివ్యశరీరము పరావిద్య. అది ముక్తిని, సిద్ధిని ఇచ్చును. పరాశక్తి ఒంటరిదైననూ, శివగురుతో నెలకొని నిలుచునపుడు ఆమె అష్ట (8) శక్తులుగా వెలసియున్నది.
(పరాశక్తి వ్యవహారము నడుపునపుడు అష్టకార్య భేదములతో క్రియాశక్తిగా మారును.)

1310. ఇట్లున్న అష్టవిధములైన శక్తులు అష్టాంగములైన యోగమునకు అంగములగును. నాదాంతమును గ్రహించిన, అనుభవమైనవారికి ఈ ఎనిమిది ఒక మిశ్రమమే అగును. ఇచ్ఛను పురికొల్పించి భోగములో దించు వీర్యము తొలగిపోయినది. స్త్రీ భోగములో ఆసక్తియున్న మూఢులకు దొరకక వీగిపోయినది.
(శుక్రజయము సాధించినవారికి ఈ భువనవిద్యా సత్ఫలితమొసగును.)

1311. అన్ని విధములైన సత్ఫలితములు ఒనగూర్చునది ఈ యంత్రరాజమగు భువనాపతి చక్రదివ్యరూపము. దానిని బాగుగా గురోపదేశము వలన పొంది, అభ్యసించి, దానిని శరీరములో నిలుపుకొనుటకు మంచి సాధన చేయవలెను. అంగన్యాసములు చేసి, నీ పునర్జన్మ వేరు వీగిపోవునట్లు (తొలగిపోవునట్లు) రాగిరేకుపై షట్కోణమును వ్రాయుదువు గాక!!
(అంగన్యాసము: తన చేతివేళ్ళతో దేహ అంగములను శివాంగములుగా భావించి, ఒక్కొక్క అంగమును మంత్రోచ్చారణతో తాకుట.)

1312. షట్కోణమును రాగిరేకుపై వ్రాసి, అందు మధ్య "హ్రీం, శ్రీం" బీజాక్షరములను వ్రాసి, ఆ కోణముపైనున్న ఆరు శిఖలలో "హ్రీం" కారము వ్రాసి, ఆరు శిఖలపై అందమైన ఒక వృత్తము గీసి, అందులో 16 అచ్చులు అకార మొదలుకొని

వ్రాయవలెను.

1313. 16 అచ్చులు వ్రాసిన ఎనిమిది భాగములపై (రెండేసి అక్షరములు ఒక భాగము చొప్పున) తామరరేకుల వలె గీసి, లోపల అకారము, ఉకారమును కలిపిన అక్షరముతో "హ్రీం" అక్షరము వ్రాసి, తామరరేకుల పైభాగములో "క్రోం, హ్రీం" వ్రాసి, దాని వామభాగము (ఎడమభాగము)న "హం, క్రోం" అని ద్వారపాలకుల వలె వ్రాయవలెను.

1314. ఎడమవైపు వ్రాసినట్లే కుడివైపున కూడ "హం, క్రోం" అని ద్వారపాలకులను వ్రాయవలెను. అన్ని తామరరేకుల పైభాగమున మాలారూపమున శ్రేష్ఠమైనదగు "క్రోం, హ్రీం" వ్రాసి, పుష్పములతో భువనాపతి చక్రమును శ్రద్ధతో పూజించుదురు గాక!! (భువనాపతి చక్రనిర్మాణమును చెప్పబడినది.)

1315. పూజించునపుడు భువనాపతిని, మన కామాది దోషములు నివర్తియై, చిత్తము నందు తాను పదిలము కావలెనని ప్రార్థించి, దానికి తగిన మంత్రోచ్చారణతో ఆవాహనము చేసి, పిదప ప్రాణప్రతిష్ఠ చేసి ఆమెను నిలిపి, ప్రకాశము పొందునట్లు ధ్యానించుదువు గాక!! (అంతరపూజ చెప్పబడినది.)

1316. ఎర్రని శరీరఛాయ గలిగినదైన దేవి ఎర్రని పట్టుచీర ధరించి, చేతిలో అభయ వరదములైన అంకుశమును, పాశమును ధరించి, దివ్యశరీరముపై రత్నాభరణములు ధరించి, శ్రేష్ఠమైన కిరీటము ధరించి ప్రత్యక్షమగును!!

1317. దేహాతీతమై (శరీరభావన వీగి) ఆత్మానుభూతితో స్తోత్రించి, పూజించి, క్షీరాన్నముతో మంత్రము జపించి, నాలుగు దిక్కులందును "నారదాయ స్వాహా" అని మంత్రము జపించి నివేదించి, శ్రేష్ఠమగు ప్రసాదమును స్వీకరించుము!!

1318. ప్రసాదము సేవించుటకు ముందు దేవిని (భువనేశ్వరిని) ఉద్వేగావహనము (దేవి తనలో కలిసిపోయినట్లు భావన) చేసి, హృదయకమలమునందు పదిల పరుచుకొని, అచ్చట ఎవ్వరికీ దృగ్గోచరము కాని యంత్రరాజుని పదిలపరచుకొని ధ్యానించుదువేని, నీవు తలంచినవన్నియూ నీకు ఒనగూరునట్లు అనుగ్రహించును ఆ దేవి!!

(మంత్రరాజు, యంత్రరాజు అనునవి శరీరములో నెలకొన్న ఈశాన (శివం) మూర్తి యొక్క పరిభాష. "ప్రణవము (ఓం)" ఎట్లు ఏకాక్షరమో, అట్లే "హ్రీం" భువనేశ్వరి యొక్క ఏకాక్షరబీజము.)

## 13. నవాక్షరి చక్రము

నవాక్షరి చక్రము = తొమ్మిది బీజాక్షరముల సమ్మేళనము. ఇది దేవిమంత్రము అమరిన చక్రము – ఏకాక్షరమే తొమ్మిది అక్షరములుగా మారి రూపొందినది.

1319. నవాక్షరి చక్రము గురించి నేను చెప్పునదేమనగా: శ్రేష్టము నొనగూర్చు ఏకాక్షరమే తొమ్మిది అక్షరములతో కూడిన దేవి మంత్రమగును. ఈ తొమ్మిది ఎనభైఒక్క (81) అక్షరములుగా విస్తరించియున్నది (9×9=81). అది "క్లీ" మొదలు "సౌం" వరకు యుండును. ఈ క్రింది వరుసక్రమము తొమ్మిది చక్రనిర్మాణమమరును. (నవాక్షరి క్రమము = "క్లీం, శ్రీం, హ్రీం, ఐం, కౌం, క్రీం, హౌం, ఔం, సౌం".)

1320. "సౌం, ఔం, హౌం" మొదలుతో "క్రీం, కౌం, ఐం" కలిపి "హ్రీం, శ్రీం" అని, వీనితో "క్లీం" మంత్రమును బీజము (మూలము)గా గ్రహించి, శ్రేష్టమగు అంతరము నుండి భావనతో "శివాయనమ" అని ఉచ్చరించుదువు గాక!! (బీజాక్షరముల మంత్రోచ్చారణ, చక్రనిర్మాణము, ఉపాసన్నియూ గురుముఖోప దేశముల ద్వారా నేర్చి, సాధనకు ప్రయత్నించవలెను. విషయ పరిజ్ఞానమునకు మాత్రమే ఇచ్చట ఇవ్వబడినదని మా మనవి.)

1321. నవాక్షరి మంత్రము నేను (రచయిత) నేర్చిన "శ్రీవిద్య" యగును. దీనివలన సర్వవిధములైన శుభములు గలుగును. దీనిని నాలుకపై ఉచ్ఛారణతో నవాక్షరి శక్తి అన్ని శుభములు ఒనగూర్చును.

1322. జ్ఞానము, విద్య మొదలగు శుభములొసగును. కీడు గలిగించు పూర్వజన్మ కర్మలు – సంచితకర్మలు నీ నుండి తొలగిపోవును. ఈ జన్మలో తెలియక చేసిన కర్మలు వీగిపోవునట్లు చేసి, వరములొసగును. జ్యోతి ప్రకాశమును కూడ దర్శించ అనుగ్రహమొసగును.
(అజ్ఞానమగు చీకటిని తొలగించి జ్ఞానజ్యోతిని దర్శింపజేయును.)

1323. నవాక్షరి చక్రమును రాగి, వెండి, బంగారురేకులలో తయారుచేయండి. మనస్సున ధ్యానించి మొదలుపెట్టవలెను. అట్లు చేయుట వలన మిమ్మల్ని ఆవరించియున్న కర్మలను జయించగలరు. మీరు నివసించుచున్న భూమండలము మీకు జయము గలిగించును. మీ ధ్యానదృఢమునకు తగ్గట్లు ఈ చక్రము నిలకడ పొందును.

1324. "శ్రీం" మొదలుతో "క్లీం" మార్చిమార్చి విడువక ధ్యానించండి. ఇట్లు ధ్యానించునపుడు ఆదిగాయున్న మూలతత్త్వము గ్రహించబడును. అక్షింతలు, లేతగరికలు వేసి ధ్యానించి పూజించండి. మీ అర్చనకు సంతసించి దేవి దర్శమిచ్చును.

1325. మీకు దర్శనమిచ్చి అనుగ్రహించు ఆ పరాశక్తి ఏ రంగులో నుండునన్నచో, గాఢమైన నీలిశరీరఛాయ గలిగినది. ఆ రంగులో దర్శనభాగ్యము పొంది స్తుతించు వారికి సమస్తము చేకూర్చును. కనుక ఆమెకు తగ్గట్లు నీవు నడుచుకొందువు గాక!!

1326. ఈ జగత్తులోని అన్ని శుభములు ఒనగూరును. కాలుడు (యముడు) నిర్ణయించిన

ఆయుర్కాలము త్రోసిపోవును. సూర్యుని కిరణములు వ్యాపించునట్లు నీ కీర్తి వ్యాపించును. కనుక ఆమె నీలో పదిలమగునట్లు నీవు నడుచుకొందువు గాక!!

1327. బంగారము, వెండి, రత్నాలు మొదలగునవి తామే వచ్చి చేరును. పరాశక్తి అనుగ్రహము, జ్ఞానము పొందగలము. దేవతల సుఖజీవితమును సిద్ధించును. నీవు ఆమెను పొందదగు మార్గమును గ్రహించి అవలంబించుదువు గాక!!

1328. నవాక్షరి మంత్రోచ్చారణతో దేవతలగుట కొందరు జ్ఞానులు ఎరుగుదురు. ఆమెను గ్రహించిన దేవతలకు దేవదేవుడైన పరమేశ్వరుడు కూడ అనుగ్రహించును. ఉద్రిక్తముగా ప్రవహించుచున్న గంగా ప్రవాహదిశను కూడ మార్చి, అమర్చిన పరమేశ్వరుని అనుగ్రహము పొందుటకు నీవు ప్రయత్నించుదువు గాక!!

1329. మీరు ఉపాసించు నవాక్షరి చక్రమున ఇమిడిన బీజాక్షరములు అన్ని భువనములకు శ్రేష్టమైన "హ్రీం" మొదలు "శ్రీం" వరకున్నవి. దీనిని మంత్రోచ్ఛారణ చేసి పుష్పమాల ధరించిన ప్రసిద్ధియైన పరాశక్తిని నల్లటి మేఘమండలములో (శిరస్సున) దర్శించుదురు గాక!!

1330. సాటిలేని నాయకురాలగు పరాశక్తిని అనుగ్రహముతో దర్శించండి. అందరిని ఆకర్షించగలిగిన ముఖవర్చస్సు పొందగలరు. పరమమైన పరమశివునికి కూడ ఆధారముగానున్న పరాశక్తియే అనాది, సనాతనమని స్తుతించి, చిత్తమున పదిల పరచుకొందురు గాక!!

1331. మీరు పరాశక్తి ద్వారా పొందదగు ఉన్నతి ఏదనగా: దేశమును పరిపాలించు రాజు కూడ మన వశమగును. మనకింక శత్రువు లుండజాలరు. కావున భగవంతుని కూడ తన గూటిలో ఉంచుకొన్న పరాశక్తిని స్తోత్రించుదురు గాక!!

1332. అష్టదిక్కులను పరిపాలించు నాయకురాలగు నవాక్షరి శక్తిని స్తుతించండి. అన్ని అండములలో నివసించు దేవతలు కూడ ఏమాత్రమని తలంచి, ఆ కాంక్షను విడవండి. పునర్జన్మతో ఈ భువికి రావడము త్యజించండి (పునర్జన్మ రహితము చేసుకొనుట). నాయకురాలి ఎర్రని దివ్యపాదముల యందు శరణు పొందండి!! (దేహభావన (అనాత్మతత్త్వము వీడి) తొలగించుకొనవలెను.)

1333. పరాశక్తిని నిర్విరామముగా స్తుతించువారై, దేవి దివ్యమంత్రములు నాలుక కదలని మంత్రోచ్ఛారణతో, వారి దృష్టియంతయూ అంతర్ముఖమైనదిగా నుండుటచే వారు దేవి దివ్యజ్ఞానము పొందుదురు.

1334. "ఐం" బీజాక్షరము మొదటిదిగా ఉద్భవించి, వృద్ధి పొందిన చక్రమగును. "ఐం" మొదలుగా ఏర్పడి మిగతా బీజాక్షరములతో "హ్రీం" గా ముగియును. "అకారము"ను బీజాక్షరముగా గలిగిన శివునితో, శక్తిని చేర్చి మహామాయకు

నాయకురాలుగా ఆమెను నీవు స్తుతించెదవు గాక!!

1335. స్తుతించబడు శక్తియే వాగీశ్వరిగా (వాక్కుతో స్తుతించుటచే) అన్ని వేద ఆగమములు విభజించి ఘోషించుచున్నవి. వాటినంతటిని మన నాలుక ద్వారా సాధన చేయుటకు అనుగ్రహించునదై కొండనాలుక లోపల ఇమిడి యున్నదానిని దర్శించండి!!

1336. ఇటువంటి చక్రరాజమును ఎవరేని తమ నాలుకపై పదిలపరచుకొనినచో (నాలుక చలనము లేక ఉచ్చరించుట), దానిపై నున్న బీజాక్షరములు నటరాజుని (శివుని) స్వరూపమునకు చెందినది. దీనివలన బంగారుసభలో వీక్షించుచున్న శివుని 'సభావిద్య'' జనుల కైవసమై, నవాక్షరి కరుణను పొందినవారై జగత్తును జయించగలరు.

1337. బహుసున్నితమైనది, సత్యజ్ఞానమైనదానిని గురు ఉపదేశానుగ్రహముతో నిర్విరామముగా ధ్యానించిన యెడల, వ్యావహారిక జగత్తందు ఏర్పడు సుఖదుఃఖములు, అనుకూల ప్రతికూల దినములన్నియూ శుభదినములుగా మారిపోవును.

1338. అటువంటి వాని నాలుకపై చెప్పిన శుభములన్నీ ఏర్పడితీరును. చెప్పింది చెప్పినట్లే అన్ని శుభములు కొనసాగును. వాగీశ్వరి అతని నాలుకపై స్థిరమై, అన్ని విద్యలకు తానే వాగ్దేవియై ఈ జగత్తునందు శత్రువులు కూడ లేకుండ పోవును.

1339. శత్రుత్వమును నిర్మూలించు "కౌం" మొదలు "ఐం"తో ముగియు ఈ ఉపాసన. చక్రమును బాగుగా గ్రహించి ఉపాసన చేసినవారు ఇతరులను ద్వేషించరు. ఇతరులు కూడ వీరిని ద్వేషించరు. అనేక రకములుగా దర్శనమిచ్చిననూ అవి వేరువేరు గాదు – అన్నియూ ఏకత్వమే. భేదములు లేనందున ఇతరులు వీరికి నమస్కరించుదురు.

1340. తత్త్వ నాయకురాలుని అందరూ నమస్కరించుదురు. కావున అటువంటి సజ్జనులందరు ఆమెయందు శరణు పొందియుందురు. కామవాంఛలు, అజ్ఞానము, మోహం తొలగిపోవును. తలంచినవి, చెప్పినవన్నియూ నెరవేరును. (పరాశక్తి ఉపాసనతో త్రిదోషములు నివృత్తియై శుభములేర్పడును.)

1341. శక్తి ఉపాసన చేసినవారికి తన మాటలే శాసనములగును. తాను తలంచినది చెప్పునది ఒకటగును – మనస్సు, వాక్కు ప్రతిష్ఠమగును. అటువంటి సాధకుడు శివతాండవమును చూచు భాగ్యము పొందును. అట్లు స్తుతించి నాయకుడగును.

1342. సకల ప్రాణులకు ఆమె తల్లియగును. అన్నిటికి జన్మనిచ్చిన సౌందర్యవతి యగును.

ఆమె దివ్యపాదపద్మములను స్తుతించి, నమస్కరించినచో, మనయొక్క కర్మ ఫలితములు తొలగి, పుణ్యము చేకూరును.

1343. శక్తి ఉపాసకుడు జగత్తంతటికి పుణ్యపురుషుడగును. గొప్ప గౌరవ మర్యాదలతో అందరితో కలివిడిగా మెలగును. కరుణ నిండినవాడుగా జగత్తంతటికి ఇష్టుడుగా మారి అనుగ్రహింపబడును.

1344. ఈ చక్రము యొక్క బీజము "క్రీం" మొదలు "కౌం" వరకుండును. ఆ చక్రము తానే అని భావన గలిగి గ్రహించువారికి, అజ్ఞానమగు అడవిలో చీకటితో ఏకమైన పరాశక్తి, తానే జ్ఞానస్వరూపిణియై, జ్ఞానమొసగు శక్తిగా ప్రకాశముతో వారిలో వెలసిల్లును.

1345. ప్రకాశముగా నొప్పారు పరాశక్తి మన చిత్తమునందు పదిలమైనచో (నెలకొనినచో) బ్రహ్మానందమును పొందవచ్చును. మరియు సత్యజ్ఞానమేదన్న వివేకము, అనాత్మ తత్త్వమును విడదీయగల సామర్థ్యమును అనుగ్రహించును. సమృద్ధిగా వర్షమును, సంపదను గలుగజేయునే – ఆమెను ఇట్లు గ్రహించినవారికి,

1346. బీజాక్షరములు నింపిన చక్రమును సద్భావనతో పూజించి గ్రహించుదురు గాక!! ఈ ఉపాసనతో జగత్తున గలిగిన జన్మ దుఃఖములన్నియూ తొలగిపోవును. శత్రువులను నిరోధించగల రారాజు కూడ వచ్చి నమస్కరించునట్లు చేయును. మనస్సును వేధించు మనోవేదన ఇక ఏర్పడజాలదు.

1347. ఈ చక్రఉపాసకులకు ఇక శోకము ఉండదు. అంతర శరీరమున బంగారు ప్రకాశము వృద్ధి చెందును. అహింస పాటించుటచే ఇక పునర్జన్మ గలిగించు గర్భవాసముండదు. సకల జీవరాశులకి దీనికి మించి గమ్యము (సద్గతి–ముక్తి) మరేదీ లేదు.

1348. ఇట్లు ఉపాసన చేసి ధ్యానించువారిలో అంతర ప్రకాశము తాండవించును. ఆగామి కర్మలు ఇక ఏర్పడజాలవు. ఇతనిలో పెళ్ళుబుకివచ్చు అంతర ప్రకాశము తానున్న ప్రదేశమంతయూ వ్యాపించును. ఇట్లు వ్యాపించుటచే చీకటి అజ్ఞానము తొలగి, ప్రకాశము పొంది, అచ్చట నున్నవారందరిని జ్ఞానమయులుగా మార్చును. (ఒక జ్ఞాని యొక్క లోకసంగ్రహము చెప్పబడినది.)

1349. ప్రకాశముతో నిండిన బీజాక్షరము "హౌం" మొదలు "క్రీం" చివరిదై, బీజాక్షరములతో సంతోషము ఏర్పరచు చక్రమును గ్రహించి, దర్శించినవారికి తేటనైన జ్ఞానము, చిత్తము ఏర్పడును. స్తుతించి నమస్కరించవలసిన పంచాక్షరముతో కూడిన నవాక్షరి ఇదేయగును.

(చక్రము యొక్క బీజములు చెప్పబడినది.)

1350. సదాశివమూర్తికి అనుగ్రహశక్తిగా వెలుయునది ఈమెయే. ఈమే అధోముఖశక్తిగా జీవులలో సామర్థ్యమును నింపునది. ఈమే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధమను ప్రజ్ఞలు జీవులలో ఏర్పరచునది. ఈమె నిరాకారరూపిణిగా అన్ని జీవులను తనలో ఇముడ్చుకొనియున్నది.

1351. తనలో ఇముడ్చుకొన్న శక్తి భూమండలమునకే కాక అన్నిటికి తాను ఆధారభూతమై, నాలో స్థితిపొంది వెలసియున్నది. ఆమెను మట్టిలో (పృథివి), నీటిలో (జలం), ప్రకాశములో (అగ్ని), గాలిలో (వాయువు), ఆకాశమండలములో, కంటిలో, దేహతత్త్వములో కలసియున్నది చూడనగును.
(పంచభూత తత్త్వమంతటిలో ఆమె ఇమిడి అనన్యముగా ఉన్నది.)

1352. శక్తి ప్రాణములో ప్రాణముగా కలిసి, జీవరాశులంతటికి వారి వ్యవహారములు చేయుచున్నది. ఆమెను పొందవలెనన్న తృష్ణ ఉన్నవారికి ఎటువంటి జీవభేదములు లేక సహాయపడుచున్నది. జీవులలో సామర్థ్యమును కల్పించునది కూడ ఆమెయే. కావున ఆమెయందు నిర్విరామముగా చిత్తము ఉంచి నిలబడుదువుగాక!!

1353. ఇట్లు ఉపాసన చేయు సాధకునకు ఏడు భువనములు (లోకములు) ఒక్కటిగా తోచును. అన్ని జీవరాశులలో తాను నెలకొనునది గ్రహించగలరు (**"మదాత్మ సర్వభూతాత్మ"** – శ్రుతివాక్యము). జగత్తునందు వెలయు అన్ని గుణరాశులు తనలో నెలకొన్నట్లు తలంచును. జీవరాశుల కర్మఫలితములను–విధిని తొలగించ గలిగిన సత్యస్వరూపిణిగా వెలయును.
(సత్యజ్ఞానము/ఆత్మజ్ఞానము పొంది విశ్వరూప ఈశ్వరతత్త్వముతో అన్నిటిలో తాను, అన్నియూ తనలో గాంచును.)

1354. సత్యస్వరూపమైన "ఔం" బీజాక్షరముతో మొదలై "హౌం"తో ముగియునది. హస్తామలకమైన ఈ చక్రనిర్మాణము శివునితో కూడిన అమృతేశ్వరి అన్ని శుభము లొనగూర్చునదిగా శరీరములోనే అమరియున్నది.
(చక్రబీజ నిర్మాణము బాహ్యముగా ప్రమాణముగాను, అంతరమున (శరీరములో) మూలాధారము నుండి బ్రహ్మరంధ్రము వరకు ప్రమేయముగా నెలకొనియున్నది.)

1355. ముందు చెప్పినట్లు మూలాధారము మొదలు బ్రహ్మరంధ్రము వరకు జ్యోతి రూపముగా వెలయు ఆ అమృతేశ్వరితో మూలవాయువుని సహస్రమునకు చేర్చిన పిదప, ప్రతిదినమూ ఒక్కొక్క కొత్త అనుభూతులు పొంది, సాధకునకు దేహతత్త్వము చిరకాలము నిలుచును. (శరీరమునకు క్షీణత ఉండదు.)

1356. మూలాధారము నుండి ఊర్ధ్వముగా ప్రాకివచ్చిన ప్రకాశమును దర్శించిన పిదప, ఇక ఎటువంటి కీడు ఏర్పడదు. దేశ, ప్రదేశ, భేదముండజాలదు. కాలభేదము

లేనందున ముందు, పిమ్మట, మీద, క్రింద భేదభావన గలుగదు. అమృతేశ్వరిని దర్శించిన పిదప ప్రపంచము యొక్క దుఃఖమిశ్రతత్త్వము ఉండజాలదు. దీనిని బాగుగా గ్రహించి ఉన్నతి పొందండి!!

1357. అంతటా వ్యాపించిన విశ్వేశ్వర తత్త్వమును ఇచ్చట అమృతేశ్వరితో పోల్చబడినది. అంతటా దేవి వ్యాపించి, తానై యుండుటచే జగత్తు సృష్టిని త్రోసిపుచ్చినది. జగత్తునందు నేర్చినవన్నియూ బట్టబయలైనది (అరూపమై). తానే అంతటా విస్తరించి యుండుటచే ఇక మిగులు చోటు (స్థలము) లేకపోయినది (సంచరించుటకు వేరే స్థలము లేకపోయినది). ఇక తాను అను తత్త్వము వీగిపోయినది. విరక్తికి, చంచలనమునకు ఇక తావులేదు. కావున నీవు అచంచలుడవై నిలుచుందువు గాక!!

1358. ఇట్లు ఉన్నతి, అనుభూతి పొందిన సాధకునకు సప్త (7) సముద్రములు, సప్త లోకములు, వాని ముందు నిలుచును. మనస్సున తలంచినవన్ని వానిముందు నిలబడును. అమృతేశ్వరి తనలో స్థితి పొందుటచే శిరస్సున ప్రకాశము వెలసిల్లును.

1359. బోధపరచు ప్రకాశముగా నొప్పారు బీజాక్షరము "సౌం" మొదలు "ఔం" వరకు ముగింపుతో ఉన్న చక్రనిర్మాణము ఆత్మతత్త్వమును బోధపరుచునది. అందులో ఇమిడియున్న మెరుపుతీగ వంటిదైన శక్తి వలన బోధపరచిన తత్త్వమును నీవు గ్రహించినవాడవై వర్ధిల్లుదువు గాక!!

1360. ఇట్లు గ్రహించిన తత్త్వమే అన్నిటికన్నా మిన్నయైన (ఆత్మవిద్య) తత్త్వమగును. దీనివలన గ్రహించబడున దేమనగా అంతటా ఆమెయే నెలకొనియున్నది. ఇట్లు గ్రహించిన సత్యజ్ఞానమును ఎరిగినవారే శక్తిని బాగుగా గ్రహించినవారగుదురు. (చక్రములో బీజాక్షరములో నున్న శక్తి అంతటా వ్యాపించియున్నది.)

1361. తాను ఆకాశతత్త్వము వలె అంతటా విస్తరించియున్నది. సర్వవ్యాపకమైన ఆమె పరమాకాశముగా నిలుచున్నది. తాను సకలమునై, తానే లయకారకురాలిగా నున్నది. (తాను జగత్తు వస్తువులను సృష్టించి, అన్నిటిని తనలో లయపరచు కొంటున్నది. జగత్తు సృష్టిలోని అన్ని అండములు తానేయగును.)

1362. అండములన్నిటిలో నున్న ఆమెను కొలుచుటకు శక్యము కానిదిగా నెలకొని యున్నది. పిండశరీరములో కూడ జ్ఞానమునకు ప్రతీకగా శిరస్సున వెలసియున్నది. హోమం చేయు హోమగుండము ద్వారా పెక్కు శుభములు పొందిననూ, కంఠమునకు పైన నెలకొన్నదానిని గ్రహించలేక ఉన్నారే!!

(పిండ శరీరములో వెలసిన శక్తిని గ్రహించి, స్తుతించవలెనన్న మంత్రము.)

1363. సముద్రము ఆవరించిన జగత్తంతటిలో పరాశక్తి కలిసియున్నదని గ్రహించని

వారు, శరీరములో నెలకొనియున్న ప్రాణము ఒకనాడు శరీరమును వీడి పోవునని గ్రహించక, అందెల శబ్దమెరుగక (నాదశబ్ద మెరుగక), క్షుద్రదేవతలందు శరణు పొందినవారు, జ్ఞానము లేక తమ తలవ్రాత (విధి ప్రకారము) ప్రకారము భారము మోయువారే!!

1364. నవాక్షరి చక్రనిర్మాణము ఇచ్చట చెప్పబడినది: ఓ జింకా! (సంబోధనాశైలి) స్వయంభుగా ఉద్భవించిన ఆ చక్రనిర్మాణమేమనగా శ్రేష్ఠమును ఒనగూర్చు పది (10) రేఖలు నిలువున, అడ్డముగా గీసినచో, ఓ తేనె!! అందులో తొమ్మిది (9) గదులతో, నిలువున, అడ్డముగా మొత్తము ఎనభైఒక్క (81) గదులు ఏర్పడును.

1365. నవాక్షరి చక్రము యొక్క రంగు చెప్పబడినది: నెలకొన్న చక్రము గురించి చెప్పుట ఏమనగా గదులకు బాహ్యముగా నున్నదానిని చంద్రమండలము – పసుపు వర్ణముగాను; గదులకు గీయబడిన రేఖలు ఎర్రవర్ణముగాను; కరుణా మయురాలైన శక్తి యొక్క బీజాక్షరములు గల గదులు పచ్చవర్ణముగాను ఏర్పరచవలెను.

1366. ఈ చక్రమును వెడల్పైన చెట్టుబెరడుపై వ్రాసి, పరాశక్తి యొక్క శక్తి బీజాక్షరములతో ఎనభైఒక్క (81) గదులలో నింపవలెను. ఉప్పులేని పొంగళిలో నెయ్యి కలిపి నైవేద్యము సమర్పించి, హోమము చేసి, ప్రాణాహుతి చేయవలెను.

1367. ఈ యంత్రములో (చక్రనిర్మాణము దేవత బీజాక్షరములతో నిండినదై, ఉపాసన, పూజ, నైవేద్యము పిదప యంత్రముగా పిలువబడును) నెలకొన్న పరాశక్తిని ఎటువంటి చంచలనములు లేక మనస్సున గ్రహించి ఉపాసనలు చేసినచో, ధ్యానము మొదలుపెట్టిన నాటినుంచే శుభసూచనలు మొదలగును. నెలకొన్న బ్రహ్మాది దేవతలు అనుగ్రహముతో గూడ గమ్యమగు శివతత్త్వము కూడ వచ్చి నెలకొనును.

1368. ఈ యంత్రముపై మెత్తటి చందనము, కుంకుమపూవు, కస్తూరితో కొన్ని వాసన ద్రవ్యములను చేర్చి, జవ్వాదు, పునుగు, పచ్చకర్పూరము, గోరోచనము, మంచునీరు తొమ్మిది రకములైన వాసన ద్రవ్యములను చేర్చి, మెత్తగా నూరి, యంత్రముపై పూతగా రాయవలెను.

1369. బంగారువంటి పరాశక్తియందు చిత్తము ఉంచి, మహాతపస్సు చేచినచో సున్నిత, లేత వక్షోజములతో సౌమ్య పరాశక్తి ఇమిడిన నవాక్షరియైన మంత్రబీజములు వేలకొలది వృద్ధియై, ఎన్నో రూపములను దాల్చును గాక!!

1370. చిత్తమున వెలుగు ప్రకాశరూపిణి, నా తల్లిదండ్రులైన ఆ నవాక్షరీ మంత్రదేవికి ఆరు కరములు (చేతులు) గలది. దీవిటి, మహాశూలము, అంకుశము, పాశము,

ధనుస్సు, బాణము - ఆరు ఆయుధములు ఆరు చేతులతో గలిగినది. మొదటి మంత్రమైన "క్లీం" బీజముతో ఉపాసకునికి దర్శనమిచ్చును.

1371. యోగినీ శక్తులు అరువది నాలుగుగా (64) ఉండిరి. కన్యలు ఎనమండుగురుగా ఉండిరి (వామ, జేష్ట, రౌద్రి, కాళీ, కలవికరణీ, బలవికరణీ, బలప్రధమణీ, సర్వభూత ధమణీ (8)). రెండు కరములందు ధనుస్సు, బాణము బూనియుండిరి. యోగినీ శక్తులు నవాక్షరీ చక్రమును చూచునట్లు దానిచుట్టూ నిలబడిరి.

1372. బంగారముతో చేయబడిన చెవికమ్మలు, కిరీటము, వస్త్రము మొదలగునవితో చూడబడు మూర్తములో అగ్నిని దివ్యశరీరముగా గలిగి, అనాదిగా జ్యోతిని తన స్థలముగా చేసుకొని వెలసిన శక్తి అర్హులకు దర్శనమిచ్చును!!

1373. ఈ విధముగా ఆమె తత్త్వమును మనస్సున గ్రహించి, దర్శించినవారికి తను అంతటా వ్యాపించి కరుణ రసమును వర్షించును. పిదప అంతటా వ్యాపించిన నాదము, ప్రకాశము ఉదయించును. పిదప శరీరభావన తొలగించి, చక్రదర్శన ప్రాప్తిని (సహస్రదళ చక్రమున నెలకొనుట) అనుగ్రహించును.

1374. మహాప్రకాశబింబమైన పరాశక్తి, సత్యమైన తత్త్వ (ఆత్మ) జ్ఞానమును గురువు ద్వారా గ్రహించునట్లు చేయును. జీవులకు దైవీసంపత్తి, సత్త్వగుణములను బోధ పడునట్లు చేసి, జ్ఞానమును కల్పించి "నివృత్తి" మార్గమును అనుగ్రహించును. ("నివృత్తి" మార్గము సాధకులకు త్యాగపటిమను పురికొల్పి, జ్ఞానమార్గము వైపు పోనిచ్చి, ముముక్షత్వము గలిగించును. "ప్రవృత్తి" మార్గము లౌకికమోహము పురికొల్పి బంధము లేర్పరచును. **"పురుషార్థములోని ధర్మార్థ కామములు మూడు ప్రేయస్సులనియు, చివరిదైన మోక్షము శ్రేయస్సు"** అనియు శ్రుతివాక్యము.)

1375. మహాప్రకాశబింబమై, మహాజ్యోతిరూపిణిగా శ్రేష్టమగు ప్రకాశముగా వెలసిల్లిన నాయకురాలు (నాయకి) నల్లటి మేఘవర్ణముతో కన్యయై, బంగారువర్ణమైన పృథివితత్త్వ ప్రకాశముతో అంతటా విస్తరించి నెలకొన్నదే!!

1376. పరాశక్తి పైకెత్తిన రెండు హస్తములలో తామర, కలువలతో దర్శనమిచ్చి, మరో రెండు హస్తములలో అభయవరద ముద్రతో సౌందర్యరూపిణియై అనుగ్రహించు వక్షోజములు ముత్యములు, పగడములతో నిండినదై, చిన్నచిన్న గంటలు పొదిగిన వస్త్రము ధరించి వెలసియున్నదే!!

1377. మాణిక్యము పొదిగిన కిరీటము శిరస్సున, పాదమున గండపేరండము ధరించిన పరాశక్తి తల్లి అనుగ్రహించుటలో ఆమెకు సాటి మరెవరూ లేరు. ప్రేమతో తనయందు శరణునొందిన వారి చిత్తమున అనుగ్రహమును నింపి, స్తుతించు వారికి పరగతి నొసగును.

1378. చక్రము (యంత్రములో) చుట్టూ అంతర్ముఖులుగా నిలబడిన అరువది (60) శక్తులు నవ్యకన్యలుగా గుమిగూడినవారై నిలబడి, పుష్పించిన పుష్పములను రెండు చేతులతో తీసుకొని శ్రేష్ఠులైన యోగులు కోరు "శ్రీం" బీజాక్షరము సంపదగా ఆమె వెలసియున్నది.

1379. ఇట్లు సంపదమూర్తియైన పరాశక్తిని ధ్యానించి, బాహ్యము వెళ్ళునదగు మనస్సును నిరోధించి, ఒక్క సంవత్సరము బంధముల యొక్క భారము వదలి, ధ్యానించు వారికి శివసూర్యుని యందు నెలకొని చర్యలు కొనసాగించగలరు.

1380. మూలాధారచక్రము నుండి పైకిలేచిన జీవశక్తి నాలుగు రేకుల తామర గుండా పైకివెళ్ళి మహాప్రకాశబింబముగా సహస్రదళమునకు చేరి, పరిపూర్ణశక్తిగా రూపొంది, మూలాధారము నుండి ద్వాదశాంతము వరకు ప్రకాశమండలముగా మార్చివేసినది!!

1381. ఇట్లు జ్యోతిమండలములో అమరిన పరాశక్తి కోరి యాబదిఆరు (56) వివిధశక్తులుగా, యాబదియారు అక్షరములుగాను, ఆమె యాబదిఆరు విధ అనుగ్రహశక్తి రూపములుగా నెలకొని, యాబదిఆరు విధముల స్థితి కార్యములను జరుపుచున్నది. (యాబది ఆరు విధ శక్తులను ఆగమములు వర్ణించుచున్నవి.)

1382. అగ్నిమంట బోలిన కిరీటము, పాదములతో అంతటా వ్యాపించిన జ్యోతిగా, అందు తెల్లటి ముత్యమువంటి శరీరము గలదియు, రెండు చేతులందు చిలుకను, జ్ఞానముద్రను గలిగినదై, పైకెత్తిన చేతులందు పాశమును, అంకుశమును గలిగినదై యున్నది ఆ పరాశక్తి.

1383. పాశమును వేరును (బంధమును ఏర్పరచునదైన వేరు) సమూలముగా పెకలించి వేసి, ప్రేమతో చిత్తమున ధ్యానించండి. ఐదు సంవత్సరముల సాధనలతో కీడు గలిగించు దుష్ఫలితములన్నియూ తొలగిపోవును. పిదప వారు భువిపై అమరిన శివమగుదురు.

(చిత్తమున భవబంధములు తొలగించుకొని ప్రేమ నెలకొనినచో తామే శివమగుదురు.)

1384. పరాశక్తి అనుగ్రహము పొందుటలో ఎటువంటి నిరోధకము లేక నాదదర్శనము తనలో ఏర్పడినచో, ఆకాశమండలములో జ్యోతి ప్రకాశించి "హ్రీం"కార బీజముతో శక్తిమండలము ఏర్పడును.

1385. అట్లు ఏర్పడిన "హ్రీం" మండలములోని జ్యోతిని దర్శించి, అందు మనస్సును నిలుపుకొనండి!! అది క్రింద నుండి (వెన్నెముకలోని మూలాధార చక్రస్థానము) పెళ్ళుబుకి పైకి వచ్చినందున, వెన్నెముకలో నిలకడ పొందినన్నిటికి శక్తితత్త్వమే ఆధారమైనది.

1386. ఆధారముగా నెలకొన్న నాభిస్థాన కమలం నుండి పైకి ప్రాకు జీవశక్తిని పరాశక్తి సృజించియే యున్నది. దుఃఖమయమైన జన్మమును జన్మరహితము చేసి, అణిగియున్న నాదమును శక్తివంతము చేసి, పైకి ప్రాకునట్లు చేయును.
(నాభిస్థానము, స్వాతిస్థానములు రెండు సహజముగా అధోముఖ ప్రవృత్తి గలిగినవి. అనగా జీవునికి లౌకికఇచ్ఛలు పురికొల్పి, సృష్టికి కారణములు అగును. కావున అవి నాదమును బలహీనపరచును. పరాశక్తి అట్లు కానీయక నిరోధించి, నాదమునకు శక్తినిచ్చి పైకి ప్రాకునట్లు జేయును.)

1387. శ్రేష్టమైన మణులు ధరించిన వాగీశ్వరిగా (వాక్కుకు అధిపతి), బంగారు కిరీటము, బంగారు వస్త్రము ధరించిన లక్ష్మీగాను, నాలుక (విద్యలకు)కు నాయకురాలైన తెల్లని ప్రకాశముతో మెరయు సరస్వతిగాను, ఆత్మలకు నాయకురాలైన మనోన్మణిగా సహస్రారదళమున వెలసిల్లియున్నది.

1388. పరాశక్తిని కొలుచుటకు ముందు ఇడనాడి, పింగళనాడుల శ్వాసలు బాహ్యముగా వెళ్ళి, వృత్తులు చేయు విధానమును పరాశక్తి ఉపాసనలకు పిదప అవి బాహ్యముగా వెళ్ళక దేహమునందే రెండు అమృతకలశములుగా మార్చి ఇమిడినది. సహస్రారమును దర్శించు భాగ్యము పొందినది ఈ కారణసంభూతురాలగు పరాశక్తి వలననే.

1389. కారణభూతురాలుగా ఆమెకు బీజాక్షరములు యాబదిరెండు (52) (మాతృ/ శక్తి బీజములు - 51 + ప్రణవము - 1 = 52). కారణిగా వాటి యొక్క వృత్తులు చేయించునది యాబదిరెండు శక్తులు. ఆ కారణియే చక్రమునందు (యంత్రమునందు) గూఢముగా అమరి, జీవుల వృత్తులు సలిపి, జీవులకు దర్శన భాగ్యమిచ్చి అనుగ్రహించుచున్నది.

1390. సర్వకారణియగు పరాశక్తి సహస్రదళమునందు స్థితి పొందినది దర్శించి, ఒక్క సంవత్సరము పాటు నిర్విరామముగా సాధన చేసినచో, వ్రతము సఫలమగుటయే కాక, పరాకాశములో శివసూర్యుని సాధకుడు దర్శించనగును.

1391. చిత్తము లౌకిక బంధముతో వ్యవహరించునపుడు ఈ పరాశక్తి జీవుల హృదయమున నుండి వృత్తులు సలిపినది. అదే తాను తత్త్వనాయకురాలుగా అయినప్పుడు జీవులలో అనాదిగా వచ్చుచున్న జన్మబంధముల కర్మఫల సమూహము త్రెంచి, అనుగ్రహించి నా చిత్తమున శుభములొనగూర్చునదిగా పదిలమైనది.

1392. ఇట్లున్న పరాశక్తి తన అష్ట కరములలో (8) పద్మము, చిలుక, కత్తి, పాశము, ప్రకాశము, డాలు, ధనుస్సు, బాణము - ఎనిమిది ధరించి ఉత్కృష్టరూపిణిగా

నాట్యమాడుచుండెను.
తత్త్వపరిభాషలో పద్మము–వివేకము; చిలుక–నాదము; కత్తి–అధర్మాన్ని వధించుట; పాశము–ఆశల తాడు; ప్రకాశము–జ్యోతి; డాలు–కీడును నిరోధించు; ధనుస్సు–ఆత్మసాధన; బాణము–జీవ, శివ ఐక్యము మొ॥ అష్టములు.

1393. పరాశక్తి వర్ణన కొనసాగుచున్నది: ఆమె స్వర్ణకిరీటము ధరించి, ముత్యాలహారము, పగడపుమాల, పట్టు వస్త్రములు ధరించి, విశాల వక్షోజాలపై రత్నమాణిక్యములు ధరించి నెలకొన్న పరాశక్తి పచ్చశరీరఛాయ గలిగినది.

1394. పచ్చఛాయ గలిగిన ఈమెకు శక్తులు నలువది ఎనిమిది (48). ఈమెకు తోడున్న కన్యలు ఎనమండుగురు (8), పుష్పమాలలు వక్షోజములపై ధరించి, ఆమె చుట్టూ కాపలాగా అమరి, సన్నటి నడుము గలిగి పరాశక్తి శుభములను వీక్షించుచుండిరి.

1395. మూలాధారమునకు ఆధారమైన జ్యోతిని స్వరూపముగా గలిగినదియగు శక్తిని సుషుమ్నానాడి ద్వారా ఎరిగి, ఆ మూలశక్తిని సహస్రారమునకు ఎక్కించునట్లు సాధనలు చేసినచో, నీవు ప్రేమికునికి తోడు వెళ్ళు ప్రేయసివలె ఆకాశమార్గమున (మండలమునకు) వెళ్ళుదువు గాక!!

1396. అధోముఖ శక్తులన్ని ఊర్ధ్వమున నెలకొన్నది వర్ణించబడినది: నాభికి–హృదయ స్థానము మధ్యన వెలసిల్లు సూర్యుడు, కంటిలో వెలుగు చంద్రునితో చేరుటచే నాదశక్తిగా వెలసిల్లు జ్ఞానసూర్యుడగును. అట్లైన పిదప అదే జ్ఞానసూర్యుడు చంద్రమండలమున (శిరస్సు) విస్తరించియున్నదని గ్రహించవలెను.

1397. కంటికి పైభాగమున వెలసిన శక్తికి దశదిశలందు దశముఖములు గలది. తాపమును ఏర్పరచువాడైన సూర్యుడు చంద్రమండలములో నెలకొనియుండుటచే అణిగిమణిగి ఉండుటచే, కీడు గలిగించగలిగిన దశనాడులు అణిగిపోయినవి. ఇట్లు జీవులలో నున్న ఆశాపాశములను త్రెంచుటకు శక్తి తన శూలమును ప్రయోగించినది.

1398. పదునెనిమిది (18) చేతులతో మహాశక్తిగా మహిషాసురుని సంహరించిన శక్తిని (పురాణములలో చెప్పినవన్నియూ తత్త్వనిరూపనములేనని గ్రహించవలెను) వివరించినది: త్రిశూలము, దుడ్డుకర్ర, ప్రకాశించు ఖడ్గము, ప్రకాశించు జ్ఞాన శూలము, బాణము, డమరుకము, చిలుక, ధనుస్సు, కాలము, పుష్పము, పాశము, అగ్నిపాత్ర, కత్తి, శంఖు, అభయవరద ముద్ర ధరించిన చేతులతో వెలసియున్నది.

1399. ఉపాసకుని మనస్సున నెలకొన్న శక్తులు నలువదినాలుగు (44). అట్లే మనస్సున నెలకొన్న కన్యలు కూడ నలువది నలుగురు (44). మనస్సున సృజించి, వారు సహస్రారమున నెలకొనిరి. లౌకిక వాసనలను దాటి, మనస్సు అతీతముగా

ఉండునపుడు తల్లి పరాశక్తి నెలకొని దర్శనమిచ్చును.

1400. అట్లు సృజించి నిలిచిన పరాశక్తి స్వర్ణకిరీటముతో రత్నములు, ముత్యములు, పగడములు పొదిగిన కంఠాభరణము ధరించి, విశాలమైన నడుముపై పట్టు వస్త్రముతో, పాదమునకు బంగారు అందె ధరించి బాలారూపమున దర్శనమిచ్చెను.

1401. ఇట్లు దర్శనమిచ్చిన శక్తి నిరంతరముగా నెలకొని, శ్రేష్టమగు అణిమాది శక్తియై, పూర్వపు అజ్ఞానమును సమూలముగా త్రెంచివేసి, ప్రకాశవంతురాలుగా వెలసి యున్నదానిని గ్రహించినవారికి తాను జ్యోతియై సత్యజ్ఞానము ఏర్పరచును.

1402. శ్రేష్టముగా నొప్పారు అధోముఖ సహస్రదళము (శిరస్సున ఆజ్ఞాచక్రం) ఒకటి ఉన్నది. అచ్చట వెలసినదే సదాశివ నాయకురాలగు మనోన్మణి. ఆమెకు సదాశివుడువలె ఐదు ముఖములు గలవు. కరములు మొత్తము పది గలది.

1403. సదాశివ నాయకురాలి రూపవర్ణన చెప్పబడినది: మేలిరత్నము, త్రిశూలము, కపాలము, చిలుక, పెక్కు మణులతో నున్న నాగము, అగ్నిపాత్ర, ఖడ్గము, బంతి, మాణిక్యము వంటి తామర, డమరుకమును బూనినదై, మణులతోను, స్వర్ణములతో అలంకరించబడిన శక్తి.

1404. పూజకు అర్హులై స్తుతించబడు శక్తులు నలువది (40), ప్రేమతో నెలకొన్న పరాశక్తి నలువది (40) కన్యలతో సహస్రార దళచక్రమున కోరి నెలకొన్నది. కీడులేవి గలుగక ఉండునట్లు తాను కోరి సంతసించి వెలసిల్లియున్నది. (శ్రీ చక్రము యొక్క 40 త్రికోణ చక్రశక్తులను ఇందు పరిభాషగా చెప్పబడినది.)

1405. శిరస్సున నెలకొన్న ప్రణవనాథ రూపమైనది జ్యోతిగా, భారమైన ఈ శరీరము నుండియే శరీరమునకు అతీతముగా ఎదిగినది, అదే తనకు ఆధారభూతమని ఖచ్చితబుద్ధితో భావించి, మనోలయము పొందినవారికి, భువినుండి నీటిని పీల్చుకొన్న నల్లని మేఘము వలె పరాశక్తి శిరస్సున దర్శనమిచ్చును.

1406. పృథివి నుండి జనించిన "అకార", "ఉకార"ములు (స్వాధిష్టానమునందుండి) ఆకాశమున వెలసిన "శివాయనమ" (శిరస్సు సహస్రారమున ప్రణవ నాదముగా) కంటిలో వెలసినది (అంతఃచక్షువులలో నాదబిందుగా, సూర్య, చంద్రులుగా) అన్ని వట్టి దర్శించుటకు మాత్రమే కాదని, పరాశక్తి సాధకుని అనుగ్రహించి తన పాదపద్మములందు చేర్చుకొనుటకే అగును.

1407. ముందు చెప్పినట్లు పైకెదిగిన పరాశక్తి చంద్రకళ యందు నెలకొని, అమృత పయోధరిగా (వక్షోజములతో), అగ్నికంఠములో ఇడ, పింగళ కళలతో, స్వాధిష్టానము నుండి వృత్తులు సలిపిన శుక్లశోణితములే పైకి వచ్చి, శిరస్సు సహస్రదళమున అమృతమయము చేసినది.

1408. తామరవలె చల్లనైన నీటిలో తెల్లని ముత్యప్రకాశముగా, ఆనందమయముగా వెలుగొందు క్షీణతలేని పరాశక్తి, అందమైన అమృతము వంటి శరీరఛాయ గలిగి స్ఫటికమువలె తెల్లని ప్రకాశముతో దర్శనమిచ్చును.

1409. కీడు గలిగించని ముప్పదిఆరు (36) శక్తులు ఆశ్రయించుటకు తగినవారైన కన్యలుగా ఉండిరి. చక్రమును నివాసముగా చేసుకొన్నవారు, చక్రరేకులలో కూడియున్న వీరు, కాలాతీతముగా ఉండి, పరాశక్తి చుట్టూ నిలబడిరి.

1410. 1405వ మంత్రములో చెప్పబడినట్లు ప్రణవము బుద్ధితత్త్వములో శివనాదముగా నెలకొని నిలచినది. దాని ప్రకాశము - జ్యోతిని మనస్సున నిర్విరామముగా నిలిపి ఒక్క సంవత్సరపు సాధనతో పూర్తి ఫలసిద్ధి పొందవచ్చునే!!

1411. ఆకాశములో నెలకొన్న అన్ని అండములలో నివసించువారు అనగా దేవతలు భూమండలములో నివసించు వారివలె సాధకుని వద్దకు వచ్చి నమస్కరింతురు. నారాయణుడు పొందు శుభఫలములు పొందుదురే కాని, అనారోగ్యము లాంటి దుఃఖమిశ్రితములు కావుకదా!!

(పరాశక్తి ఉపాసనతో సాధకుని గల్గు సిద్ధిని శ్రేష్టముగా చెప్పబడినది.)

1412. అధోముఖముగా నున్న మూలాధారశక్తియైన కుండలినీ, “ఉకారము”తో (శక్తి అంశము) ఇమిడి, ఇడనాడిలో వెలసి పైకి ప్రకాశముగా ప్రాకినదై, సహస్రారమున స్థితిపొంది, మనస్సున కోరినవన్నీ నెరవేర్చదగు కల్పవృక్షమైనది. ఆమెయే సకల సిద్ధులు అనుగ్రహించు బంగారుతీగ ఆయెను.

1413. అటువంటి బంగారుతీగ వంటి పరాశక్తిని ఉపాసించినచో, కీడును పురికొల్పు అహంకారము తొలగిపోవును. స్థితి పొందిన మహాప్రకాశ పరాకాశమునందు అల్లుకుపోయినట్లున్న పేద (పరాశక్తి) వెలసినది దర్శించనగును.

(పరాశక్తిని రచయిత “పేద”గా వర్ణించియున్నాడు. మెత్తని, సున్నిత మనస్కురాలు. తల్లి మనస్సు ఎప్పుడు తన బిడ్డలపై సున్నితముగా, దయామయురాలై యుండునన్న భావన.)

1414. పేద పరాశక్తిది అన్ని జీవరాశులను రక్షించు మాతృత్వ (తల్లియే) అందమే. ఈ తత్త్వమునకు శివుడు తండ్రియగును. ఈమెకు భువి ఒక తిలకమగును. కొన్ని శక్తులు కూడుకొని యుండుటచే శిరస్సునందు వెలుగొందుచున్నది.

1415. కూడియున్న శక్తులు ముప్పది రెండు (32). కన్యలగు ముప్పది రెండు వికసించిన సహస్రదళ పద్మరేకులలో నెలకొని తమను సాధకులు ఎట్లు తలచెదరో, అట్లు వారికి సహస్రారమున దర్శనమొసగుతూ నిలబడిరి.

1416. “నవాక్షరి” చక్రములో నున్న శక్తులు నటరాజుని (శివుని) ప్రకాశమును దర్శించి,

ఊర్ధ్వ సహస్రదళములో నెలకొనిరి. నటరాజుడే వీరికి కారకుడుగా (కారణకర్తగా) ఉండెను. వీరు ఎవరని వేద ఆగమములలో వెతికినచో, అది మరెవరు కాదు, నా మనస్సున (రచయిత) నెలకొని అనుగ్రహించు శివశక్తులే అగుదురు. (సాధకుని చిత్తములో పదిలమైనది శివశక్తి స్వరూపమే.)

1417. **"శివశక్తులు తాము ఒకరి చిత్తమున నెలకొన్న పిదప ఇక లేమియన్నది లేదు. ఇటువంటి వారు వేరెవరి వద్దకు వెళ్ళి ఆశ్రయించరు. వీరికి దేవతలు కూడ సమానులు కాజాలరు. శివశక్తులే వీరి యొక్క ఆత్మలో నెలకొని, స్థితి పొందుటచే వీరులేని చోటు మరేది యుండజాలదు".**

(సకల అండ చరాచరములన్నీ పరబ్రహ్మంతో నిండినదై, అది తప్ప మరేదియూ లేదు.)

1418. తత్త్వములకు రాజైన ఆత్మని అరువది నాలుగు (64) దారపు పోగులతో పేనినది. సర్వాత్మకమైన ప్రణవము అరువది నాలుగు (64) ప్రకాశ కిరణములతో కూడినది. అట్లే ఆత్మ 64 కళలలో నెలకొన్నది. ప్రణవములో నాద, బిందుగా జీవుడు, శివుడు ఇద్దరూ ఇమిడియున్నారు.

(జీవాత్మ = పరమాత్మ ఒక్కటే; జీవాత్మ = బ్రహ్మం ఒక్కటే;
ప్రణవకళలు అరువది నాలుగు (64). వివరణ: అకార కళ-10; ఉకార కళ-16; మకార కళ-24; బిందు కళ-4; నాద కళ-10.)

నాల్గవ తంత్రము సమాప్తము

ఓం తత్సత్

సర్వం శివార్పణమస్తు

# ఐదవ తంత్రము

## 1. శుద్ధశైవము

శుద్ధశైవము అనబడునది ఏ ఆచారములు లేని దైవము, జీవుడు, బంధమును ఎరిగి, బంధమును తొలగించుకొనుటకు దైవము యొద్ద శరణు పొందుట. ఇందు శుద్ధ శైవము, అశుద్ధశైవము, మార్గశైవము, తీవ్రశుద్ధ శైవము అను నాలుగు రకములుగా ఉన్నది.

1419. ఒక ఊరు, ప్రదేశము, జగత్తును ఏకముచేసి సృష్టించిన సర్వజ్ఞుడైన దైవము యొక్క సామర్థ్యమును చెప్పవలెనన్న – ఒక మేరు పర్వతముతో త్రిలోకములను సృష్టించి, దానిని పరిపాలించు తత్త్వమును నాలుగు విధములైన శైవములను ఏర్పరచినవన్నింటినీ చెప్పవలెను.
(జగత్తు సృష్టి కారణభూతుడును, తానే జగత్తుగాను ఉన్నది శివుడు. దైవము (శివుడు) జగత్తు సృష్టికి నిమిత్త కారణము, ఉపాదాన కారణముగాను ఉండి, తన మహత్వము కొలుచుటకు వీలుకానిదిగా ఉన్నాడు.)

1420. సత్తు (ఉనికి–శాశ్వతం), అసత్తు (ఉనికి లేని–అశాశ్వతం) రెండు తత్త్వములుగా కలిసియున్న దానిని విడదీసి గ్రహించి చిత్ (జ్ఞానము), అచిత్ (అజ్ఞానము)తో చేరకుండునట్లు విడదీసి, శుద్ధమాయ (ఈశ్వరతత్త్వము), అశుద్ధమాయలను (జీవతత్త్వము) గ్రహించి వాటికి అతీతముగా ఎదిగి, శాశ్వతమైన పరముతో (బ్రహ్మత్వము/ఆత్మతత్త్వముతో) నెలకొని యున్నవారే శుద్ధశైవులగుదురు.
(ఆత్మానాత్మ విచారణతో, నిత్యానిత్య వస్తువివేకముతో, బంధములు తొలగించుకొని ఆత్మతత్త్వములో నెలకొనుటయే శుద్ధశైవ తత్త్వమగును. ఇది నిరాకారతత్త్వముతో, నిర్గుణబ్రహ్మతో ఇమిడియుండు తత్త్వమగును.)

1421. నేర్వదగినవన్నింటిని నేర్చిన పిదప, పదహారు కళలతో నిండిన చంద్రకళల తత్త్వమెరిగి శివయోగము సాధన చేసి, అందు శ్రేష్టముగా వెలసిల్లు విధివిధానములను గ్రహించి, మాయాబంధములను త్రెంచి పరమపదమునందు నెలకొనియున్నవారే ఉత్కృష్టమైన బ్రహ్మతత్త్వమును ఎరిగిన శైవసిద్ధాంతు లనబడుదురు.
(దేహేంద్రియ మనోబుద్ధులకు అతీతముగా ఎదిగి ఆత్మతత్త్వముతో నెలకొని యుండునదే శుద్ధశైవ సిద్ధాంతం.)

1422. వేదాంతమని పిలువబడునది శుద్ధశైవ సిద్ధాంతమే. నాదాంతమును దర్శించినవారు, జగత్తును సాక్షిగా చూచువారు (మాయాబంధములో చిక్కుకొనక ఆత్మను విడదీసి చూచు తత్త్వము) ఎటువంటి చంచలనము లేనివారు, జీవతత్త్వమును శివబోధ తత్త్వముగా చూచువారు, నాదాంతమునందు శివదర్శనము చేయుదురు.

## 2. అశుద్ధశైవము

(కాయిక, మానసిక పూజలు, కర్మలు, ఉపాసనలు చేయువారు)

1423. దైవము యొక్క సాకార రూపమును పూజించి, స్తోత్రించి, శరీరమున కంఠాభరణములు, చెవికి కుండలములు ధరించి, నెత్తికి విభూతి, పుష్పమాలలు ధరించి, పూజాకర్మలు, ఉపాసనలు చేయువారి యొక్క బాహ్యరూపమగును. (దైవమును సాకార రూపములో పూజించుట, ఉపాసించుట.)

1424. చెవికి బంగారు కుండలములు ధరించి, రెండు మూడు అంగవస్త్రములు ధరించి, ఇతరులకు ఉపదేశించు మార్గమును ఎంచుకొని, శైవ ఆగమములను పాఠము వలె ఇతరులకు, కోరువారికి బోధించుచూ వచ్చువారు శాస్త్రప్రావీణ్యతతో మెలగువారు.

(బాహ్యగంభీరముతో, అనుభవ శూన్యముతో ఇతరులకు బోధించువారిని వివరించి యున్నది ఈ మంత్రము.)

1425. ఖండములు తొమ్మిదింటిని (9) చూచినవారే అసలు దర్శించిన వారగుదురు (ప్రణవములో ఇమిడిన పృథివి, అప్పు, అగ్ని, వాయువు, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, అగ్ని, తార (నక్షత్రం) శరీరములో నెలకొనియున్నది దర్శించినవారు.) ఖండములు తొమ్మిదింటిని (9) గ్రహించినవారే (బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు, నాద, బిందు, శక్తి, శివంను శరీరముగా ఉన్నవని గ్రహించినవారు "శివం"ను ఎరుగగలరు. ఇట్లు తొమ్మిది భేదములుగా ఉన్నవన్నీ మన శరీరములో నెలకొనియున్నదని దర్శించినవారే తీవ్ర శుద్ధశైవులగుదురు. (ఆ పరమాత్మ సర్వము తానై యున్నాడని గ్రహించుట.)

1426. జ్ఞాని జగత్తునందున్న అన్ని శాస్త్రగ్రంథములను, మౌనతత్త్వమును (ప్రణవము ఉపదేశించు మౌనం – తురీయస్థితి), అష్టమాదిసిద్ధులను, సర్వలోకముల యొక్క తత్త్వజ్ఞానమును, ఉపనిషత్తుల సూక్ష్మమును, "శివం"ను, తన ఆత్మతత్త్వమును, గ్రహించిన సామర్థ్యమున్నవాడగును.

## 3. మార్గశైవము

మార్గశైవమని చెప్పునది: శైవమార్గములో నిలబడి, వేదాంత సిద్ధాంత సూక్ష్మములను గ్రహించి, ఆత్మబోధను శ్రవణము చేసి, శివబోధమునందు స్థితి పొందినవారు.

1427. బంగారు రుద్రాక్షలు ధరించి, నుదుట విభూతి రాసుకొనునది శివసాధన. శ్రేష్ఠమగు పంచాక్షరి (న,మ,శి,వా,య) ఉపాసన చేయునది జ్ఞానసాధన. దుర్మార్గులతో చేరక సజ్జనులతో చేరియుండుట సత్సంగసాధన. మహాశుద్ధశైవ తత్త్వమును

ఆచరించువారు సన్మార్గసాధన యగును.

1428. అన్ని బంధములు తొలగించుకొన్న జ్ఞాని ప్రజ్వలించు జ్ఞానభూపతి (రారాజు). వేదాంత సిద్ధాంతములు ఉపదేశించు శోకరహితమైన జ్ఞానోదయుడు. సత్యమైన ముక్తి పొందినవాడు. శ్రేష్టమగు శుద్ధశైవమునందు భక్తి సలుపువాడు, నిత్యుడు (శాశ్వతుడు).

(శ్రేష్టమైన శుద్ధశైవమును, వేదాంత సిద్ధాంతములను అభేదముగా గ్రహించినవాడు అసలైన జ్ఞాని. జ్ఞాని అన్నింటా భేదరహితుడు.)

1429. శుద్ధశైవులకు ఆగమములే వారికి గ్రంథములు. ఆగమములు తొమ్మిది (కారణము, కామ్యము, వీరము, చింతము, వాదుళము, యామళము, కాలోత్తరము, శుప్రభేదము, మకుటము). ఇవి విస్తరించి ఇరువది ఎనిమిదిగా (28) ఏర్పడినది. అవి శైవము, రౌద్రం, ఆరిడం అని మూడు విధములు. ఇవి ఎటువంటి భేదభావన లేని వేదాంత సిద్ధాంతములై శుద్ధశైవులకు సాధకముగా ముగియును.

(జ్ఞానపుత్రులకు – శైవము; రుద్రులకు – రౌద్రం; సనత్ కుమారులకు – ఆరిడము అనుగ్రహించబడినవి.)

1430. కేవలస్థితిలో (జన్మకు పూర్వము) జాగ్రత, స్వప్న, సుషుప్తి యను మూడును, శుద్ధ స్థితిలో (జన్మ పిదప) జాగ్రత, స్వప్న, తురీయం, తురీయాతీతముయను నాల్గింటిలో కలిసి ఏడు అవస్థలును, సత్, అసత్‌లకు అతీతముగా నున్నది ఆ పరాపరయే. జీవులను చైతన్యపరచు శ్రేష్ట పరాపరముగాను, జీవుల ప్రాణమునకు ప్రాణముగా నెలకొన్న పరాపరముగాను, శివునికి అన్ని విధములుగా తోడుండి అనుగ్రహము పొరించుచున్నది ఆ శక్తిస్వరూపిణి.

1431. సత్, అసత్‌లకు అతీతముగా నెలకొన్న జ్ఞానుల శక్తియే వారి స్వరూపమై; జ్ఞానము, అజ్ఞానము వీడిన శివోహంగాను (శరీరస్పృహ వీడిన స్థితి); ద్వంద భావనలు లేని స్థితిలో మునిగియున్నవారికి సర్వసిద్ధులకు ఒనగూరి సర్వశ్రేష్టు లగుదురు. "అహం"మే శివమగుట. "శివోహం". (శివః + అహం)

1432. తన శరీరస్పృహయు, పరశివత్వము, సదాశివతత్త్వము, పతి (ఈశ్వర), పశు (జంతు), పాశము (బంధము) అనాదిగా వచ్చు కర్మవాసనలు విముక్తి పొందు విధివిధానముల ఉపాయములను గ్రహించిన (ఎరిగి)వారే సన్మార్గ శుద్ధశైవులు.

1433. ఆత్మబోధము వీడి పరిపూర్ణమైన శివంలో చిత్తమును ఉంచి, శాస్త్ర (వేదము)మే అత్యంతిక శ్రేష్టమని తలంచి ఆనందముతో, శ్రేష్టమైన ద్వాదశాంతములో శివ భోగములో ఇమిడి, అనాదియైన కారణమును (బ్రహ్మం) శుద్ధశైవులు దర్శించగలరు.

1434. ఆత్మజ్ఞానము యొక్క మహత్వము గ్రహించక, కనీసము యోగమార్గము గొప్పదనము

తెలుసుకొనలేక, శివతత్త్వమును వట్టి శివోహం భావన బూని కాయిక చర్యల వలనే శివత్వము పొందగలమను భావనలో ఉందురు ఈ మార్గశైవులు.

(కాయిక కర్మలే జ్ఞానము, యోగమును గలిగించునను తప్పుడు భావనలో ఉందురు. కాయిక కర్మలగు పూజలు, పునస్కారములు ముక్తి నొసగజాలవు.)

1435. వేదాంతమును గ్రహించినవారు బ్రహ్మవిద్యను ఎరిగిన వారగుదురు. నాదాంతమును దర్శించినవారు పరమహంస యోగులగుదురు. వేదాంతతత్త్వము కాని వేరు సిద్ధాంతములను అనుసరించువారు ప్రకృతితో కూడిన తత్త్వము (జీవసృష్టి – శుక్ర, శోణిత సమ్మేళన తత్త్వము) నాదాంత దర్శనములో శివుని గ్రహించుదురు.

1436. ఆకాశములో సంచరించు మేఘములు ఆకాశమునకు అసంగమగును. కంటితో చూడబడు అన్ని దృశ్యములు కంటితో సంబంధము లేనివే అగును. కావున ఆలోచనలను ఊహకు, భావనలకు అతీతముగా ఉన్నదే ఆ పరబ్రహ్మతత్త్వము. అది జీవుల వాసనాబంధములకు అతీతమైనది.

(జీవుల వారివారి భావనల తగ్గట్టు శివతత్త్వము గోచరించును. పశుతత్త్వము – దేహస్పృహతో ఉన్నవారికి బంధములు వీడజాలవు.)

1437. దైవము యొక్క సత్యతత్త్వమెరిగి, మతాచారాలను వీడిన స్థితియే "సిద్ధాంతసిద్ధి" అనబడును. బ్రహ్మం ఒక్కటే. దైవము వేరు, జీవుడు వేరు అన్న ద్వైతభావ రహితం. నానావిధ వస్తుసమ్మేళనమే జగత్సృష్టియని ఎరిగి, మతాచారములను వీడి, పరాపరము (పరబ్రహ్మం) ఒక్కటే అత్యంతిక శరణుయని తలంచి శివమగుటయే సిద్ధాంతము ద్వారా పొందు సిద్ధియగును.

## 4. తీవ్ర శుద్ధశైవము

తీవ్ర శుద్ధశైవము అన్ని ఉపాధి క్రియలను త్యజించినవారై, జ్ఞానమొక్కటే శ్రేష్టమని తలంచి, ఎటువంటి ఆడంబరములు లేక "తాను అతనుగా" అగు స్థితి పొంది, "శివసాయుజ్యం" పొందువారు. (తాను = జీవుడు; అతను = బ్రహ్మం/శివం)

1438. బాహ్యాడంబరములు (విభూది, రుద్రాక్షలు, కుండలములు, పట్టువస్త్రములు, మొ॥) త్యజించి దైవమునందు చిత్తముంచి, ఇచ్ఛలు ఆసక్తిరహితముగా, జన్మ వాసనామయమైన బంధములగు జీవబోధమును తొలగించుకొన్న (దుఃఖమిశ్రితము లైనవన్నింటిని) వారే శివజ్ఞానము పొందిన తీవ్ర శుద్ధశైవులు.

1439. పంచభూతాత్మక శరీరములోనున్న ఐదింటిని (5) (అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశము), ఆరింటిని (6) (మూలాధారము మొదలు షట్చక్రస్థానములు), ఐదు (5) విభాగములుగా వెలసిల్లు మహామాయ (శివతత్త్వములోనుండు శుద్ధవిద్య, మహేశ్వరం, శతాఖ్యము, నాదము, బిందు)

వీటిని అనుసరించు మిగతా తత్త్వములను తొలగించుకొని, వాటివలన ఏర్పడిన పూర్వజన్మ పటలమందున్న బంధములను నివృత్తింపజేసి, దృఢమైన తన యథార్థస్థితి ఎరుగుటయే కాక అందు నిలకడ (స్థితి/నిష్ఠ) పొందుటయే తీవ్ర శుద్ధశైవ తత్త్వమగును.

1440. పరమేశ్వరుని ద్వారా అనుగ్రహింపబడిన ఆగమములో చెప్పునది (సాలోక్య, సారూప్య, సామీప్య, సాయుజ్యములో) ముక్తిపదమును ఇవ్వజాలదు. జీవన్ముక్తులు దర్శించిన ప్రణవరూపమును గ్రహించునదే శ్రేష్టమైన పరముక్తికి మూలము. దీనిని గ్రహించి ఆత్మతత్త్వమెరిగి, దైవతత్త్వము గ్రహించి, ప్రపంచ బంధములు తొలగించుకొన్నవారే శుద్ధశైవ పదము పొందిన శుద్ధశైవులు.

(ఉపాసనాది కర్మలు వీడి, బంధములు తొలగించుకొని, జ్ఞానమే శ్రేష్టమైనదని గ్రహించినవారే శివపదము పొందుదురు.)

1441. నేను వెతకి పొందవలసినది "శివం" అని గ్రహించిన పిదప నేను "శివం"తో చేరగ, "శివం" వేరు "నేను" వేరను ద్వందము లేని "తత్‌పదమ్" (పరమాత్మ / పరమపదము). "శివుడు" వేరు "నేను" వేరుగాదని, శివుడే నీవు అన్న తత్త్వము గ్రహించి, శివుడు నేను ఏకమైపోతిమి.

(తెలుసుకొనుటకు ప్రయత్నించు "నీవు" ప్రయత్నించి తెలుసుకొనునది "శివం" రెండూ ఒక్కటే. "తత్త్వమసి" – మహావాక్యం – ఛాందోగ్యోపనిషత్ – సామవేదం – "తత్+త్వం+అసి"=అది నీవుగా ఉన్నావు. శివునిలోని బ్రహ్మత్వం జీవునిలోని జీవాత్మ రెండు ఒక్కటే. పరమాత్మ జీవాత్మ రెండు ఒక్క శుద్ధచైతన్యము. అది=తత్పరము.

1442. ఉత్కృష్టమైన, మహోన్నతమైన "తానే అగుట" యను తత్త్వము గ్రహించిన పిదప, పంచేంద్రియ విషయ వాసనామయ చేష్టలుడిగిపోవును. శ్రేష్టమైన జ్ఞానము మహాజ్యోతి ప్రకాశముగా ప్రజ్వలించును. అటు పిమ్మట పరసాయుజ్యస్థితిలో "పతితో" (శివం) ఏకమై నిలుచుందురు. "ఏకమేవ అద్వితీయం".

(శివునితో ఏకమగుటను "పరసాయుజ్యము"గా చెప్పబడినది.

**"ఏకాత్మ ప్రత్యయసారం, ప్రపంచోపశమం, శాంతం, శివం, అద్వైతము. స ఆత్మాః స విజ్ఞేయః"** – మాండూక్యోపనిషద్ – శ్రుతివాక్యము

**"ఏకమేవ అద్వితీయం"** – ఇక రెండు లేదు – ఒక్కటే – శ్రుతివాక్యం)

## 5. చర్యలు

శారీరక కర్మలు: ఊరూరు తిరిగి వెతికి శివుని కీర్తించి, శైవక్షేత్రములను దర్శించి, స్తుతించి, పూజించి, అర్చించి పరవశమగుట.

1443. శివుని పొందుటకు మొదటి అంగముగా ఇటువంటి కాయిక కర్మలు చెప్పబడినవి. వేద ఆగమములను పరిశీలించుచున్న ఓ! కాళాంగి, గంజగిరి, కందురు (శ్రీ తిరుమూలర్ యొక్క శిష్యబృందము) వినండి!! ఈ భూలోకవాసులగు శుద్ధశైవులకు ఇటువంటి కాయిక చర్యలే ప్రాణమువంటిది.

1444. ప్రాణముతో ప్రాణముగా నెలకొన్న దైవమును ఆత్మగా గ్రహించునదే శ్రేష్టమైన జ్ఞానపూజయగును. ప్రాణమునకు ప్రకాశము ఇచ్చు దైవముగా గ్రహించినచో శ్రేష్టమగు యోగపూజ యగును. బాహ్యముగా మూర్తిని ప్రతిష్టించి ప్రాణప్రతిష్ఠ, ఆవాహనము చేసినచో, అది బాహ్యపూజ యగును. బాహ్యముగా చేయు కాయిక కర్మలన్నియు భక్తి, ప్రేమతో నిష్కామకర్మలుగా ఉండవలెను.
(అన్ని ప్రాణులలోనున్నది ఆత్మయే అనునది బుద్ధిపూర్వక ప్రజ్ఞానమగును.)

1445. అన్ని ప్రదేశములు సంచరించి, తీర్థయాత్రలు గావించి, దేవాలయములందే శివుడు నెలకొనియున్నాడని గ్రహించి స్తుతించండి!! స్తుతించి, ప్రణమిల్లండి!! అట్లు ప్రణమిల్లిన, శరణునొందిన చిత్తఏకాగ్రత కూడిన హృదయమును శివుడు తన దేవాలయముగా మార్చుకొనును.

1446. భక్తులు, దాసానుదాసులు, యోగులు, జ్ఞానిని ఇందు వివరించియున్నది. భక్తులు ఆలయ దర్శనములు, పూజాచర్యలతో కాయిక కర్మలు చేయువారు. భక్తితో పరవసించి, కాయిక కర్మలతో మానసిక పూజలు చేసి, దైవసాకార రూపమునకు ఉపచర్యలు సలుపువారు దాసానుదాసులు. యమ, నియమాదులతో అష్టాంగ యోగముల నెరిగి సాధనల ద్వారా యోగం అభ్యసించినవారు యోగులనబడుదురు. దైవమును తన ఆత్మలో దర్శించి సదా ఆ ఆత్మలో రమించువారు జ్ఞానులనబడుదురు. (జ్ఞానులు – ఆత్మానాత్మ విచారణతో, నిత్యానిత్యవస్తు వివేకముతో, తాను దేహేంద్రియ మనోబుద్ధులు కానని గ్రహించి సదా ఆత్మయందు నెలకొన్నవారు.)

1447. సత్యమైన ఆత్మజ్ఞానము పొందినవారు "అతనే తానైనవారు". అష్టాంగయోగ మార్గము ద్వారా సమాధి సిద్ధించినవారు యోగులు. నిర్విరామముగా భక్తితో కాయిక చర్యలు, శివపూజలు చేయుచూ, స్థలయాత్రలు చేయువారు శారీరక చర్యలు చేయువారగుదురు.

1448. కర్మలు, ఉపాసనలు, కాయిక చర్యలు, మానసిక చర్యలు, యోగములన్నియు జ్ఞానమును పురికొల్పు పూజలేయగును. ఈ విధి విధానములతో శ్రేష్టమగు శివుని సాకారభక్తి పిదప నిరాకారభక్తి ఏర్పడును. ఉపాసకులు పరిపక్వము తగ్గట్లు ఎన్నుకొనబడు పూజలగును. ఇవియన్నియూ శ్రేష్టమైన దైవమునకు చేయబడు పూజలని గ్రహించవలెను.

(సరూపభక్తి/సాకార శివభక్తి – కాయిక కర్మలు చేయువారికిని, అరూపభక్తి/నిరాకార భక్తి యోగులు చేయుదరని చెప్పబడినది.)

1449. చర్యలు, క్రియలు, యోగము, జ్ఞానము ద్వారా పొందునది నాలుగు విధములైన చర్యజ్ఞానము, క్రియా జ్ఞానము, యోగజ్ఞానము, జ్ఞానమయమైన నిర్గుణజ్ఞానములు. విస్తరించిన వేదాంత, సిద్ధాంతములగు ఆరువిధ ముక్తిమార్గములను (వేదాంతము, ఆగమాంతము, నాదాంతము, బోధాంతము, యోగాంతము, కళాంతము) శ్రేష్ట నందీశ్వరుడు గురుమండలమగు బంగారు నగరమున నెలకొని, లోకజనులు జ్ఞానము పొందవలెనను సదుద్దేశముతో వారి పరిపక్వము తగ్గట్టు అనుగ్రహించి ఆదుకొనెను.

(నందీశ్వరుడుగా శివునిని పేర్కొనబడినది.)

1450. కాయిక చర్యలతో “సమయ (ద్రైవ) దీక్ష”లో సాధకునికి చిత్తశుద్ధి పొంది, తన పరిమితులను (ఆవరణశక్తి – అజ్ఞానమలము) తేటపరచి దైవమునందు పూర్తిగా శరణు పొందునట్లు చేయునవి. “విశేష దీక్ష” శివమంత్రోపదేశముతో, ఉపాసనతో, శుద్ధి పొందిపజేసి (అజ్ఞానము, కామ్య అహంకారములు తొలగించుకొని) అనుగ్రహించునది. ఇక “నిర్వాణదీక్ష”లో పంచవిధ కళల (నివృత్తి, ప్రతిష్ట, విద్యా, శాంతి, శాంత్యాతీతం) మలములను తొలగించుకొని ఉన్నతికి మార్గము సుగమము చేసుకొనుట. ఇక జ్ఞానదీక్షలో అన్ని స్థితిగతులలో శుద్ధి పొందిన స్థితితో, ఆచార్యుడే సాధకునకు “అభిషేకదీక్ష” నొసగి, సాధకునికి “గురు” స్థానమొసగి, ఇతరులకు సాధకుడు బోధించుటకు మార్గము సుగమము చేయుట.

(ఈ నాలుగు దీక్షలు సాధకుని పరిపక్వము తగ్గట్లు బోధింపబడునవి.)

## 6. క్రియా

దైవమును బాహ్యముగాను, అంతరముననను పూజించునది. కాయిక కర్మతో గూడ మానసిక పూజలు చెప్పబడినవి.

1451. పది దిశలయందు పరమేశ్వరుడు వ్యాపించుయున్నాడు. ఎందు తను లేదన్నది లేదు. అటువంటి నిర్మలుడి దరిచేరి, వాని పద్మచరణములందు శరణు నొందండి!! పైపైకి ఎగసిపడు విధివిన్యాసముల కర్మలగు సముద్రము ఇక మీ దరిచేరదు. ఇది మీ అనుభవరీతిగా చూచుదురు గాక!!

1452. అడవియంతా వ్యాపించు గంధపు సువాసనలతోను, సుగంధ పుష్పములతో అర్చించి పూజించిననూ, దేహభావన తొలగించుకొని ధ్యానించువారికే తప్ప సహస్రదళమున వెలయు నాదస్వరూపి యొక్క పాదపద్మములను చేరజాలరు.

(దేహేంద్రియ మనోబుద్ధులను వీడి, తాను శాశ్వత, శుద్ధచైతన్యమన్న భావనతో

ఆత్మతత్త్వములో నెలకొనవలెనని బోధించునది. బాహ్య పూజల కన్నా అంతర పూజలు శ్రేష్ఠమని చెప్పునది.)

1453. ఆవు లేగదూడను ఉపమానముగా చెప్పబడినది: శ్రేష్ఠమగు లేగదూడ తల్లి ఆవు కొరకు పరితపించునట్లు, ఈశుని పాదపద్మముల కొరకు స్తుతించండి!! అట్లు పరితపించునపుడు జ్ఞానమునకు దారిచూపునట్లు భ్రూమధ్యమున కనువిప్పు గల్గును. దేవలోకస్తులు వచ్చి మిమ్మల్ని నమస్కరింతురు. శ్రేష్ఠమగు వృషభవాహనుడైన ఈశుని అనుగ్రహ పాత్రులగుదురు.

1454. ఇట్లు అష్టదిక్కులు, మండలములందు తన (ఈశుని) ఆనతియని భావించి వృత్తులు సలుపు శక్తిని తనలో ఒక భాగముగా గలిగినవాడు. వాని (ఈశుని) మహత్వమెరిగి స్తుతించుటయే మానవుల యొక్క శ్రేష్టమైన శివసేవ. అటువంటి మహామహుడైన ఈశుని పొందుట మాత్రమే శుద్ధప్రేమ వలననేనని గ్రహించవలెను.
(ప్రదేశము, కాలము ఈశ్వర తత్త్వమే.)

1455. భక్తుడు గురువు ఉపదేశించిన శ్రేష్టమగు దివ్యమంత్రములను ఉచ్ఛరించి, ఉపాసించి, అట్లే సత్ప్రవర్తన అలవర్చుకొని, శుద్ధ అనుగ్రహశక్తి వలన నిష్కళంక ఆత్మజ్ఞాన యోగముచే ఉన్నతి పొంది, అత్యున్నత తత్త్వముతో తనను, సర్వేశ్వరుని గ్రహించునట్లు జ్ఞానము పొందిన చిత్తమే గురు అనుగ్రహముతో శివమగును.

1456. దైవముపై నెలకొన్న భక్తి వలన నిర్విరామముగా దేవునియందు పరితపించి నాద సామీప్యము చేయువాడు, బంగారువన్నెతోనున్న సహస్రదళపద్మమున నెలకొన్నవానిని (ఈశుని) వినయముతో నిలబడి, తనకు అనుగ్రహము మొసగవలెనని ప్రార్థించుటచే దైవము వాని శిరస్సున జ్యోతిరూపముగా వెలసి అనుగ్రహించును.

## 7. యోగము

యోగము: మూలాధారములోని కుండలినీశక్తితో కూడిన ప్రాణను ద్వాదశాంతములో వెలయు శివునితో చేర్చి, ఇముడుట. ఇట్లు చేర్చి ధ్యానించుటచే జ్యోతి దర్శనమగును.

1457. మూలాధారము నుండి మొదలిడి వెన్నెముక ద్వారా బ్రహ్మరంధ్రము వరకు ప్రాకి సత్యరూపుడైన శివునితో నెలకొని, కఱ్ఱవలె ఎటువంటి చలనములకు లోనుకాక, నిటారుగా ఉండి, గోకిననూ, కదిపిననూ వాటికి స్పందించక, గ్రహించక, లక్ష్యమగు శివుని ధ్యాసలో నున్నవారికి యోగము సిద్ధించును.

1458. అతి సూక్ష్మమైన, అతినిగూఢమైన, కాలానుకూల పరిస్థితులలో గ్రహింపవలసిన శివతత్త్వమును గ్రహించుటకు తప్పిపోయినచో, క్షీరసముద్రములో పవళించిన నారాయణుడు మరియు బ్రహ్మ మొ॥ దేవతలు బాహ్యముగా వెతకుటచే యుగ

యుగాంతములైననూ వారికి అందక శివుడు బహుఉన్నత స్థితిలో ఉండువాడగును. (కాలము తనే, కాలాతీతము తనే, యోగమునకు సూక్ష్మమగు కాలానూకూల (శివుని బాహ్యముగా వెతకక) పరిస్థితులకు తగ్గట్లు అంతరమున వెతకవలెను.)

1459. పుష్పములో సువాసన ఇమిడియున్నట్లు (ఇది సహజత్వం) జీవునిలో సహజముగానే శివతత్త్వము నెలకొనియున్నది. గీసిన చిత్రపటములో అచేతనతత్త్వముగా ఉన్నదాని సూక్ష్మమును గ్రహించగలిగిన వారికి, పునుగుపిల్లి కర్రదూలముతో రుద్దుకొనుటచే దాని సువాసన కర్రదూలమున కెక్కినట్లు, శివతత్త్వము బహిర్గతమగును!! (పునుగుపిల్లి పుష్పగంధములు ఉపమాన, ఉపమేయములతో చెప్పబడినదంతయూ జీవునిలోని సహజత్వము (శివతత్త్వం), వాని సంసిద్ధత, పరిపక్వతకు తగ్గట్లు ప్రకాశము బహిర్గతమగును.)

1460. ఉన్నతి పొందితిమన్నవారు, అంతర తత్త్వమును గ్రహించనివారే అగుదురు. ఇచ్ఛను (ఆసక్తి) పురికొల్పు (స్వాధిష్టానచక్ర అధిపతి చంద్రుని స్థూలస్థితి – కామఇచ్ఛ) నందీశ్వరుని చిత్తమున పదిలపరచి తేటజ్ఞానం పొంది (అజ్ఞానమును తొలగించుకొని) అనాదిగా వచ్చుచున్న పెక్కు జన్మాంతర కర్మజనితములను తొలగించుకొనుటయే మూలవిత్తనమగును (కారణత్వము ఏర్పరచు విత్తనము). (**"కర్మలే జన్మకు కారణము – శరీరము కర్మజనితము"** – శ్రుతివాక్యము.)

1461. వ్యాకరణ, సాహిత్య జ్ఞానముతో అరువది నాలుగు (64) కళల ప్రావీణ్యతతో, కర్మజనితములైన బంధములతో ఏర్పడిన జన్మమును, జన్మరహిత చేయజాలము. అధోముఖము వెళ్ళు (నాశనమునకు) సోమ, సూర్యాగ్నుల వశపరచుకొని, పక్వపరచి శిరస్సునకు తీసుకువెళ్ళుటచే జ్యోతిని పొందగలిగితిని. (సోమ, సూర్య, అగ్నులను పరిపక్వమొనర్చి, శిరస్సున పదిలపరచితినని రచయిత చెప్పుచున్నారు.)

1462. పరిపక్వమొనర్చి శిరస్సున కోరి నెలకొను యోగమే – సత్యమైన తపస్సు. ఇట్లు కోరి శివతత్త్వముతో నెలకొనుటయే – మహావాక్యసారము. (తత్వమసి = తత్ + త్వం + అసి = అది నీవుగా ఉన్నావు (అది నీవే). ఈ తత్త్వమే కోరి ఊర్థ్వలోకస్తులగుదురు – దేవశరీరము దాల్చినవారగుదురు.)

1463. శరీరములో అగ్నితత్త్వముగా నెలకొని ఉష్ణమును పుట్టించి అనుగ్రహించుచున్నాడు ఆ పరమేశ్వరుడు. ఈ అగ్నియే స్త్రీ పురుషుల కలయికలో అగ్నితత్త్వముగా నెలకొనునది. అటువంటి అగ్నిని గ్రహించి రక్షించుకొని, ఊర్థ్వముగా ప్రవహింపజేసి (శిరస్సున చేర్చినచో)నచో జన్మమును ఏర్పరచని ప్రకాశము పొందనగును. ఇది చేయుటకు తప్పిపోయినచో, నరకతత్త్వమునకు దారిచూపును.

(అనగా: తప్పిపోయినచో పునర్జన్మకు దారితీయును.)

1464. ధర్మాత్ములైన రారాజులు, గొప్ప తపస్సంపన్నులు, ఎన్నో వేలమంది జనులు ఈ తత్వమెరుగక ప్రాణములు విడిచిరి. ఈ యోగమును అనుసరించి, ఆచరించిన సిద్ధులు, జ్ఞానులు, దేవతలైన మూవురు (బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు) శ్రేష్టమగు పరమశివుడు తప్ప వేరే దేవతలెవరూ శ్రేయస్సును నొసగజాలరని గ్రహించి శివుని యందు శరణునొందిరి.

1465. యోగికి యోగాది కర్మలు మూడింటితో – చర్యలు, క్రియలు (బాహ్యాంతర కర్మ, ఉపాసనలతో) యోగముతో ఉన్నతి సాధించుదురు. అట్లు ఉన్నతి పొందినవారు అన్ని క్రియలయందు క్రియలును, క్రియలందు చర్యలను గ్రహించువారే. ఆసక్తి వీడినదే (నిష్కామ కర్మలు) అసలైన చర్యలగును. అట్లు వెలసిన ప్రకాశ మండలములో శివాదిత్యుని (శివసూర్యుని) యందు భక్తిని, శ్రేష్టమైన ప్రేమను ఉంచితిని.

1466. యోగములో మతాచార సంప్రదాయములే "మతదీక్ష". అష్టాంగయోగములో అవలంబించునదే "విశేష దీక్ష" యోగములో పరోదయము (పర+ఉదయము) పరం యొక్క దర్శనము పొందుటయే "నిర్వాణదీక్ష". ప్రకాశము వలన (జ్యోతిరూప దర్శనము – శిరస్సునందు గ్రహించునది) సిద్ధులు గలుగునది "అభిషేక దీక్ష". యోగసిద్ధులలో నాలుగు విధమైన దీక్షలు చెప్పబడినది.

## 8. జ్ఞానము

జ్ఞానము: పతిని (పరమేశ్వరుని) సృజించియుండుట. చిత్తమునందు గ్రహించుట. జ్ఞానం, జ్ఞేయం, జ్ఞాతు మూడు నశించి ఏకమైన స్థితియే జ్ఞానము. ఈ జ్ఞానమే ముక్తికి దారిచూపు సింహద్వారము.

1467. జ్ఞానమును మించిన అనుగ్రహ దైవతత్త్వము మరెందులేదు. జ్ఞానము నొసగని మతాచారములు కూడ మంచివి కావు. జ్ఞానమునకు వ్యతిరేకమైన వన్నియూ శ్రేష్టముక్తి నొసగజాలవు. జ్ఞానముతో వెలుగొందువారే జనులలో మిక్కిలి శ్రేష్టులు.

1468. నాదము నాదరూపమైన మనస్సును, ఆ మనస్సు ఏర్పరచు బుద్ధి, బుద్ధి పురికొల్పు అహంకారము, చిత్తమని పిలువబడు ఈ మూడును, వివిధ ఆలోచనలను కల్పించునవే. వీటికి వలన గలుగునదై నాదమునకు అతీతముగా ఎదిగిన జ్ఞానులు పొందిన తత్త్వమే శుద్ధ సన్మార్గమగును.

(సన్మార్గమున నిలబడు జ్ఞానులు ఆలోచనలు లేని నాదాంతములో నెలకొన్నవారు.)

1469. తన చిత్తమునందు నెలకొన్న సంకల్పలోకము, తన పరిస్థితులలో బాహ్యముగా ఏర్పడిన లోకమును, ప్రేమతో తనకు అన్నీ అనుగ్రహముగా అమరినవని తలంచుదురు జ్ఞానులు. ఇట్లు ఏర్పడిన జ్ఞానము, దానివలన ఏర్పడిన శివభావన,

పిదప గ్రహింపబడవలసిన ప్రేమతత్త్వమును (శివం) పొందుదురు.
(అనుగ్రహమైన ప్రేమతత్త్వమే గ్రహింపవలసిన శివతత్త్వం – ప్రేమే శివం.)

1470. ఎటువంటి మార్పులేని జ్ఞానమును దృఢముగా, తేటగా గ్రహించినవారికి, తన చుట్టూయున్న ప్రదేశమే బ్రహ్మ పదార్థమగును. చలనముగాను, అచలముగాను కనబడు జగత్తంతయూ, తనకు శ్రేష్టమగు ఆచారములన్నిటిని నొసగును. (జ్ఞానులే బ్రహ్మపదార్థమగునపుడు వారికి కనిపించునవన్నియూ శ్రేష్టములుగానే ఉండును.)

1471. జ్ఞానము, వినయము, ప్రేమ ఈ మూడింటి సమ్మేళనముతో నెలకొన్నవారే శివుని యందు విరామము లేని తత్త్వముతో నెలకొన్నవారగును. ఇట్లు ఎటువంటి బాహ్యాడంబరములు లేక (శివుని) ధ్వనించు పాదపద్మముల దరిచేరినవారే, తత్త్వ జ్ఞానచిత్తముతో నెలకొన్నవారు. వారి శిరస్సున నీటి గలగల శబ్దమును సృజించనగును. (బాహ్యాడంబరములన్నియు విషమ సూచికలే అగును.)

1472. చిత్తమునందు జ్ఞానము ముదిరి ఉన్నతస్థితిలో నాదము ఉద్భవించి ముఖము నందు వర్చస్సు ప్రతిబింబించును. నెలవంక మండలములోని (శిరస్సున సోమ వృత్తములోని ప్రకాశమును) జ్యోతిని దర్శించి, జన్మకు కారణమైన కామ్యలను తొలగించుకొన్న శరీరము గలవాడై, వాటికతీతముగా జ్యోతిస్వరూపుడగును.

1473. జ్ఞానికి తన ఆచరణలే జ్ఞానములో జ్ఞానము, జ్ఞానములో యోగము, జ్ఞానములో క్రియలు, జ్ఞానములో చర్యలగు నాలుగు తోడగును. అనుభవము ముదిరి ప్రణవ సిద్ధితో మౌనం వహించిన మౌనికి ఇవేమీ అక్కరలేదు. ముందుగా పరవశము పొందిన ప్రకాశము రూపములో (శిరస్సున) నున్న శక్తి, జ్ఞానమును ఇచ్చివేయును. ఇట్లు కానివారు అనగా ఆధారచక్రములలో కొట్టుమిట్టాడు వారికి చర్యలు, క్రియలు అవసరములగును.

1474. జ్ఞానికి ముందు మంత్రములో చెప్పినట్లు నాలుగు విధములైన స్థితులు జ్ఞానముతోనే సిద్ధించును. జ్ఞానములో జ్ఞానము "నేను" (అంతర), "నాది" (బాహ్య) అహంకార, మమకారములేని తత్త్వము గలిగినది. జ్ఞానములో యోగమనునది నాదాంతములోని శ్రేష్టజ్యోతిని దర్శించునది. జ్ఞానములో క్రియలు సద్గతిని కోరునది.

1475. పొందిన జ్ఞానములో పై నాల్గింటిని గలిగిన జ్ఞాని పుణ్యకర్మములతో ఏర్పడు పుణ్యములకు, పాపకార్యములతో ఏర్పడు కీడు ఫలితములకు అతీతముగా ఉన్న వాడగును. శ్రేష్టమగు ఆనందతత్త్వ జ్ఞానము యొక్క ఎల్లలు (పరిమితులు) దాటిన వాడగును. అతనే దృఢమైన మలదోషముల నుండి నివృత్తి పొందిన శివముక్తుడు, సిద్ధుడగును. (పరిపూర్ణ సిద్ధి పొందినవాడు.)

1476. సత్యతత్త్వ మెరిగిన జ్ఞాని సత్యస్వరూపి వలె తాను కూడ ప్రకాశ స్వరూపుడేనని గ్రహించును. అట్లు ప్రకాశముగా వెలుగొందునదే జ్ఞానములో "విశేషదీక్ష" యగును. శుభఫలితములను పొందగోరునది, అనుగ్రహించునది, జ్ఞానములో "నిర్వాణదీక్ష" యగును. గురుమండలములో (శిరస్సు సహస్రమున) వికల్పము లేని తత్త్వముతో ఏకమగుట "జ్ఞానాభిషేక"మగును.

## 9. సన్మార్గము

(ఈశ్వరభావన)

1477. చెప్పబడు సన్మార్గమనునది తత్పదమగు శివతత్త్వమును శిరస్సు సహస్రదళమున ఏర్పడు జ్యోతిని దర్శించునది. కోపమును విడచి శివయోగములో నిలకడ పొందు చిత్తమున్నవారు కాలుని (యముని) జయించి అనుగ్రహమొసగు శివతత్త్వమునందు (ఆత్మతత్త్వములో) రమించువారు.

1478. శైవతత్త్వమునకు మహాశ్రేష్టము ఒనగూర్చు నాయకుడు నందీశ్వరుడు (శివుడు). శ్రేయస్సు నొనగూర్చు (ఆత్మలకు) గురుతత్వమొకటి గలదు (గురోపదేశము ద్వారా పొందు జ్ఞానము). ఆ దైవశివతత్త్వమే సన్మార్గ ఆదేశమగును. దీనితో చేరి ఉన్నతి సాధించవలెనని లోకులకు ఏర్పరచి ఇచ్చియున్నాడు.

1479. దర్శించుటకు, పూజించుటకు, ధ్యానించుటకు, సృజించుటకు, పాదపద్మములను శిరస్సుపై దాల్చుటకు, గురుభక్తి చేయు ఆత్మసాధకులకు (నిర్గుణబ్రహ్మాయైన శివుడు అఖండమూర్తి, వానిని గ్రహించుటకు కష్టము కావున గురుభక్తితో, తోడుతో, గురువే శివం అని తలంచి) గురువే శివం నెరిగించి, సన్మార్గముతో ముక్తిని పొందుటకు సహాయకారిగా యుండును.

1480. "శివం"ను అఖండవ్యాపియైన బ్రహ్మపదార్థముగా ఎరుగనివారు మనోతేటము పొందనివారే అగుదురు. తేటనైన జ్ఞానము పొందకుండుటచే శివుని వ్యాపకతత్త్వము పొందజాలరు. వారు "శివం" కాజాలరు. కావున జన్మరహితము కాజాలక పునర్జన్మలు వారికి ఏర్పడును.
(అంతటా వ్యాపించిన బ్రహ్మత్వము, ఆత్మతత్త్వమును గ్రహించకుండుటచే జన్మ రహితము మరియు జన్మసాఫల్యమగు జీవన్ముక్తి బడయజాలరు.)

1481. "తాను అతనగుట" సన్మార్గముతో పొందనగునని చెప్పు మంత్రం. శుద్ధ ఆత్మయైన తాను శివమగుట: తనయందు జన్మజన్మలుగా నిబిడమైన అహంకారము, కామ్యము, మాయ, మాయేయము, తిరోధానము పంచమలములు తొలగించుకొని, "మౌనం"మగు ప్రణవముతో (ఓంకారముతో) ముక్తుడగుటయూ, నిష్కళంక జ్ఞానానుభూతి ఆనందము పొందుటయూ, తాను శివమగుట – తాననునది

వీగిపోవుటయే శుద్ధ సన్మార్గమగును. “మౌనం = తురీయం (ఆత్మ)”. (దేహభావన తొలగించుకొనుట.)

1482. సన్మార్గుల ముఖమే శివుడు ఉపదేశించు పీఠము. సన్మార్గులు ఉన్నచోటు దేవాలయమగును. సన్మార్గుల సమూహమును దర్శించుటయే శివదర్శనమగును. ఈ సన్మార్గులలోని విభాగములను చెప్పుచున్నాను – వినండి!!
(విభాగములు: సహమార్గము, సత్పుత్రమార్గము, దాస్యమార్గం.)

1483. సన్మార్గసాధన శివతత్త్వ జ్ఞానము పొందునది (జ్ఞేయం). సన్మార్గము కాని నీచ సాధనలన్నీ అజ్ఞానులకగును. దుర్మార్గమును వీడి “తురీయం”లో నిలబడి మలనివృత్తి చేసుకొన్నవారికి సన్మార్గమే “తాను అతనగుట” శ్రేష్టతత్త్వమగును.

1484. సన్మార్గము దారిని అనుసరించుచూవచ్చు శ్రేష్ట సాధకులకు, తదుపరి చెప్పబడు మూడు మార్గములు బహుసులభమగును. శివతత్త్వములో ఇముడునదే వారికి శ్రేష్టమార్గమని కోరునది. ఇదియే వేదము చెప్పు ప్రణవమార్గమని తలంచి ఆచరించండి!!
(మౌనం = అకార, ఉకార, మకార, విలక్షణ – అమాత్ర – నిశ్శబ్దం – తురీయం – బ్రహ్మ – అహమస్మి – మాండూక్యభాష్యం)

1485. “తనకు” వేరైన బంధములను, ఆ బంధములతో ఏర్పడిన కర్మలను, కర్మల వలన ఏర్పడిన జనన మరణముల అవస్థలను, వీటికంతటికి హేతువైన మూల ప్రకృతియు, వీటియంతటితో ముడివేయబడిన జ్ఞానమును, వీటితో “తన” తత్త్వము (ఆత్మతత్త్వము)ను గ్రహించి దర్శించినవారు సన్మార్గులు.
(సన్మార్గులు బంధములన్నీ వీడిన తత్త్వముతో శివతత్త్వం తానని గ్రహించువారు.)

1486. ఆత్మను (పశు) దేహభావన (పాశము) బంధము నుండి విడదీసి, పతితో (శివం) చేర్చి, పరిపక్వమొందని మనస్సును పండించి (పక్వమొనర్చి) శాశ్వతమైన ఆత్మ జ్ఞానములో ఇమిడి, అచంచలమైన సమాధిలో నిష్ఠలో ఉండుటయే శుద్ధ సన్మార్గమగును.

1487. సన్మార్గములో పొందునది సన్మార్గమే యగును. అందరికి జీవన విధానము సన్మార్గమే తప్ప వేరేదియూ కాదు. జీవన సన్మార్గములో సన్మార్గతత్త్వమెరిగినవారికి, వారి సన్మార్గతత్త్వమే అన్ని మహాయోగ సిద్ధులను కల్పించి అనుగ్రహించును.

## 10. సహమార్గము

(సఖ్యతాభావన)

1488. జ్ఞానతత్త్వమును సఖ్యతా తత్త్వముతో పొందదగినది. రాజమార్గమైన ఇది పిదప ముక్తిని, సిద్ధిని ఒసగునది. దీనికన్నా అధమ మార్గములన్నియూ జన్మమరణములను

ఇచ్చి కొనసాగించునే కాని జ్ఞానమును ఏర్పరచి దృఢమును ఏర్పరచగలదా? (ఏర్పరచదు)

1489. శిరస్సుపై పన్నెండు అంగుళములలో నెలకొన్న మార్గమును అనుసరించనివారు, ద్వాదశాంతములో వెలుగొందిన గురుమండలమగు జ్యోతిమండలము, అందు వెలయు శివుని, అతను బోధించు మతాచార్యములను గ్రహించనివారే అగుదురు. అతని ఇంట లక్ష్మీదేవి నిలకడ పొందక తొలగిపోవును. మరణములేని జీవితమును కూడ పొందలేరు.

(ప్రసాదతత్త్వమగు ద్వాదశాంతమును గ్రహించినవారు మరణము లేనిది – జీవన్ముక్తి పొందగలరు.)

1490. ద్వాదశాంతములో నిలకడ పొందినవారు యోగసమాధి సిద్ధించినవారు. ఈ స్థితియందు ప్రపంచమంతయూ సూక్ష్మముగా తన లోపల నెలకొనియుండును. ఆ యోగసమాధిలో శివుడు, శక్తి వెలయుదురు. దీనిని కోరి అందే నిర్విరామముగా నెలకొన్నవారు సిద్ధులనబడుదురు.

1491. యోగము, భోగము రెండూ యోగులకు గలుగును. యోగముతో శివరూపము పొందుదురు (శివసారూప్యము). కావున భూలోకములోని చతుర్విధ పురుషార్థములగు – ధర్మ, అర్థ, కామ, మోక్షములు సిద్ధించును. క్షీణత లేకపోవుటచే యోగికి భోగము, యోగము పొందనగును.

(యవ్వనములో సుఖము, ముదిమిలో ముక్తియూ సిద్ధించును.)

1492. ఆధార పరిశోధనలచే నాడిశుద్ధి పొంది (యోగ గురోపదేశముతో ఆధారచక్ర స్థానముల తత్త్వమెరిగి ఇడ, పింగళ, సుషుమ్న నాడుల చలనముల నెరిగి శుద్ధి పొందుట), మేధ (అకారము) మొదలుగా గల పదహారు కళలతో వెలుగొందు ఆకాశతత్త్వములో (శిరస్సున) జ్యోతిని గ్రహించి, అందు జ్ఞానమునకు ఆలయమగు ఆత్మను, తన్మాత్రలు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు), పంచేంద్రియములు, బుద్ధిని గ్రహించి, సహజధోరణియగు అధోముఖ చలనములను తొలగించుకొని నిలకడగా స్థితి పొందుటయే సహమార్గమగును.

1493. ఆత్మను అధోముఖముగా తీసుకువెళ్ళు పంచజ్ఞానేంద్రియములను మనస్సు (బుద్ధితో) యను పదునైన కత్తితో అణచి పాలించుదురు. అప్పుడు పదునెనిమిది (18) గణములను (శివగణనాధులను) శాసించు ఒక్కడు (శివుడు) నా చిత్తమునందు పదిలమై నిలుచుండెను.

(ఇంద్రియముల విషయ వాసనలను అణచి శాసించు యోగుల చిత్తమున శివుడు నెలకొనును.)

1494. శ్రేష్ఠమైన పండువలె పండిన తత్త్వమున్నవారికి (సహమార్గులకు) మంచి పండువంటి ఆనందమొనగూర్చు సత్యరూపమగును. మనస్సు పండి అంతరాత్మానందము సదా పొందువారికి, పండును పిండి రసం తీసిఇచ్చునట్లు వృధాతత్త్వములను తొలగించి, తాను యందు (శివుడు) ఇమిడి అనుగ్రహించును!!

## 11. సత్పుత్రమార్గము

(కాయిక కర్మలతో, తండ్రి కుమారుల బాంధవ్యము)

1495. ఈ సత్పుత్రమార్గము క్రియామార్గములో నిలబడునది. సహమార్గమును యోగము ఇచ్చునదై, రెండింటిని అనగా సహమార్గము, సత్పుత్రమార్గము దాటి వెళ్ళిన యోగశక్తి తోడై నెలకొనునపుడు సన్మార్గులు పొందునది జ్ఞానమే అగును.

1496. పూజించుట, పారాయణము చేయుట, దైవము స్తుతించుట, మంత్రం జపించుట, కోరిక లేని తపస్సు ఆచరించుట, సత్యము పలుకుట, కామాది షడ్అరిష్టము (కామము, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు) తొలగించుకొనుట, ప్రేమతో సదా "హంసం" భావనలో నెలకొనుటయను అష్టగుణములతో కూడినది ఈ సత్పుత్ర మార్గము.

1497. ఆరు కాళ్ళుయున్న కందిరీగ తేనెను స్వీకరించుటకు ఎన్నో పుష్పములపై వాలి అల్లాడును. కాని తెల్లని హంసపక్షి తామరపుష్పమును వదిలి మరే అందమైన పుష్పముల దరిచేరదు. అట్లే క్రియాయోగులు శ్రేష్టమైన పుష్పములతో శివుని పూజించుదురు. కాని ఇతరులు కొంచెమైన శివుని పూజించక వేరు మార్గములలో వెళ్ళి నశించుదురు!!

1498. జన్మసముద్రమునకు శివుని యొక్క పాదపద్మముల నీడయే అనుగ్రహ ఒడ్డుయగును. హరుని ఆజ్ఞలో నిలబడడమే (రక్షించదగు) మహా ఒడ్డుయగును. దివ్యపాదము లనబడు ఒడ్డుకు చేరుకొను అన్ని జీవరాశులకు ఏకైక రారాజుయై, ఏడు లోకములను రక్షించి, ఆదుకొను దైవము ఆ శివమహామహుడు.

(ఆ శివమహామహుడే అన్ని జీవరాశులకు ఒడ్డుగా ఉండి ఆదుకొనుచున్నాడు.)

1499. దైవమును వినయముతో స్తుతించిన యెడల జీవులను ఆదరించి అనుగ్రహించునన్న వివరణ: మనోభావనలో ఉన్నతి పొంది, పాదపద్మములను పూజించి, ఆనందమును రుచి చూచి, తమ శరీరము పులాంకితము చెంది, పరమేశ్వరునికే విన్నపము చేయండి!! భయపడి ముందు ఎత్తు జన్మలకు కూడ అది ఫలమును ఒనగూర్చును. దిగజారిన స్థితిలో ఆదుకొన ప్రార్థించిన యెడల, తన్ను ఆదుకొనువాడిగా మార్చుకొనుచున్నాడు.

1500. మన పరంపురుషుడైన పరమేశ్వరుని నేను నిలచి నమస్కరింతును. భూమిని నా

శరీరమంతయు తాకునట్లు (సాష్టాంగ నమస్కారము) పడి నమస్కరింతును. నేను ఎప్పుడూ శ్రేష్ఠమైన పరంజ్యోతిని నమస్కరింతును. మీరు కూడ శ్రేష్ఠపుష్పములను శివునిపై జల్లి స్తుతించండి. ఇట్లు ప్రతిదినము పూజించి నమస్కరించువారికి దేవదేవుడైన పరమేశ్వరుడు తానే వచ్చి వారి చిత్తములో నెలకొని అనుగ్రహించును.

1501. ముక్తి నొసగగల సత్పుత్రమార్గమునకు సింహద్వారముగా ఉండునది – చర్యల తత్త్వమే. పూర్వకర్మ జన్మములతో రూపము దిద్దుకొన్న ఈ జన్మవాసులారా వినండి!! గర్భసంచిలో చొప్పించు కర్మఫలిత సమూహములను అణగద్రొక్కగల మహాదేవుని స్తుతించి, నమస్కరించండి. దేశమంతా ఆనందము నెలకొని యుండండి. (ఈ దేహము – కర్మానుసారి; కనుక కర్మఫలిత తీక్షత తగ్గుటకు దైవమును ప్రతిదిన చర్యలతో ప్రార్థించవలెను.)

## 12. దాస్యమార్గము

(దాస్యమార్గము – సేవామార్గము)

1502. చేయుటకు సులభ పద్ధతులగు దేవాలయములందు దీపములను వెలిగించుట, పూవులు త్రెంపి సేకరించడము, నేలను అలికి శుభ్రపరచుట, గుడి ప్రాకారము ఊడవడము, దైవమును స్తోత్రించుట, పూజాసమయములలో గుడిగంటలు మ్రోగించడము, తిరుమంజనము (పసుపునీరు) సేకరించి జల్లడము, ఇటువంటి పుణ్యకార్యములను సేవచేయుటయే దాసమార్గ మనబడును.

1503. ఆది పరతత్త్వము అది, ఇదియను సంశయమును విడనాడండి. ఇదియే పరమాత్మ యని నిశ్చయము చేసుకొని కొలుచువారు ఎచ్చటలేరు. కాని మీకు కర్మానుసారము ఏది కొలువవలెనని అనుగ్రహించబడినదో ఆ నాయకునే ప్రేమతో కొలవండి. అదియే మన మనస్సందేర్పడిన సంశయమును తొలగించు మార్గము.

1504. చంద్రుని వలన ఉద్భవించిన (సృజించడము) అధోముఖ ధోరణిని, పిదప సూర్యుని వలన ఉద్భవించిన (బుద్ధిపూర్వకము) దానిని అణగద్రొక్కుదును. (పై రెండింటిని దాటిన) దృఢజ్ఞానముతో అంతటా వ్యాపించిన నాయకుని చిత్తమునందు తలంచుదును గాక!! దేవదేవుడైన వానిని ప్రతిదినము నమస్కరింతును గాక!! ఇట్లు స్తుతించడము ద్వారా అన్ని విధములైన పూజలకు స్వస్తి పలుకునట్లగును. (మనస్సుకు, బుద్ధికి అతీతమైన వానిని ఎప్పుడూ స్తుతించవలెను.)

1505. ఊర్ధ్వలోకస్థులగు దేవతలు పరమేశ్వరుని సహస్రనామములతో అర్చించి పూజించుదురు. కాని హృదయము పూరించునట్లు చిత్తమునందు నిలుపుకొని ప్రేమతో కంటికి కంటివలె పూజించిన దాసులకు నాదమయమైన నాయకుడు (శివుడు) ప్రేమతో వచ్చి, నెలకొని అనుగ్రహించును.

1506. పారాయణముతో, పూజలతో, సుగంధ పుష్పములతో అర్చించి పూజించిననూ, పాచిపట్టిన చెఱువులో రాయి విసిరిన పిదప మరలా పాచి మూసుకున్నట్లు తేటకాని మనస్సులో నిష్కళంకుడైన ఈశుని గ్రహించుట, నిర్విరామముగా కొలువదగు మనస్సుకే సాధ్యముకాని అన్యులు గ్రహించజాలరు.
(దేవదేవుని అనుగ్రహము పొందుట తేటకాని మనస్సుకు సాధ్యపడదు. పాదపద్మము లందు ప్రేమతో నిర్విరామముగా చిత్తమున నెలకొన్నవారికే అనుగ్రహం దక్కును.)

## 13. సాలోక్యం

(దేవలోకము దరిచేరుట)

1507. సాలోక్యం, సామీప్యం, సారూప్యం, సాయుజ్యం, ఈ నాలుగు రకములైన ముక్తిని, సరిగై (చర్యలు), కిరిగై (క్రియలు), యోగ, జ్ఞానముల ద్వారా పొందనగును (అమరును). చర్యలు ద్వారా దైవము యొక్క లోకము దరిచేరి వాని సమీపమున ఉండగలరు. ఆ లోకము చేరినవారు ఆతని రూపము నొందురు. దైవమునందు లయము కాక అంతటా వ్యాపించిన ప్రకాశ దైవరూపముతో ఉండగలరు.

1508. మత సంస్కార సంప్రదాయములందు మొట్టమొదటిదగు క్రియలలో తన చిత్తము నందు దైవమును ఉంచి పూజించుట. మరింత విశేషమనునది దైవంయొక్క మంత్రోచ్ఛారణ. సంస్కారములలో మూలమంత్ర తత్వార్థములు గ్రహించుట నిర్వాణ దీక్షయగును. దైవమును చిత్తమందు పదిలపరుచుకొని సమాధిలో నిలకడ పొందునది అభిషేక దీక్షయగును.
(దీనినే కాశ్మీర శైవమునందు ఇచ్ఛోపాయం, క్రియోపాయం, జ్ఞానోపాయం, ఆనందోపాయంగా వివరణలు గలవు.)

## 14. సామీప్యం

(దైవ సమీపమున ఉండుట)

1509. (సాలోక్యము – దైవము యొక్క లోకములో ఉండుట; సామీప్యము – దైవము యొక్క సమీపమున ఉండుట; సారూప్యము – దైవము రూపమునే దాల్చుట; సాయుజ్యము – దైవముతో ఐక్యము చెందుట. పై మూడు పదముక్తియూ, ఆఖరిదైన సాయుజ్యము పరముక్తి పరముతో ఐక్యత.)
సాలోక్యములో పశుని పాశములు – బంధములు వీడకుండుటచే అది పునర్జన్మను కల్పించును. సామీప్యములో ఆ బంధమే ఆశీర్వదించబడిన అనుగ్రహమగును. సారూప్యములో ఆ బంధమే మరింత శ్రేష్టత నిచ్చును. సాయుజ్యములో పాశము – బంధములు పూర్తిగా కరిగిపోయి, పతితో (శివునితో) ఐక్యమగుదురు.

## 15. సారూప్యము

(దేవుని రూపమును దాల్చుట)

1510. స్థితి పొందిన సారూప్యము యోగమునందు ఎనిమిదవదైన సమాధిస్థితిలో పొందదగినది. ఇటువంటి జ్ఞానసిద్ధి సమాధిలో తప్ప వేరెందును లభించదు. ఈ తత్త్వమునందు శరీర అవయవముల అన్ని శరీరశుద్ధి ఏర్పడిన స్థితి. ఇందు ఇతని శరీరము నిష్కళంక యోగముతో పరిపక్వత పొందినదగును.

(ఇందు కోరి దైవముయొక్క ప్రకాశముతో తనను అభేదముగా భావించి యుండుట.)

1511. మేరుపర్వతమును తాను ఆస్వాదించునపుడే, జగత్తులోని చరాచర శక్తులన్నీ (చలన, అచనల శక్తులన్నియూ) మేరువలె బంగారువన్నె పొంది, నాదతత్త్వముతో వెలయు గురుమండలము పొంది, కైలాసములోని పతి (శివుని) యొక్క మహాప్రకాశ రూపమును పొందుదురు.

(మేరుతో చేరునవన్నీ బంగారము అగునట్లు, శివంతో చేరినది తానే శివరూపమగుట.)

## 16. సాయుజ్యము

(దైవముతో ద్వైతము వీడి ఏకమగుట)

1512. శైవము అనునది శివునితో నెలకొనియుండుట. శివతత్త్వమును సృజించి, అందు వెలయు శివునితో చేరియున్న స్థితి. సమాధిలో (బాహ్యంగా) ఉండకపోయిననూ, శివుడు ఎల్లప్పుడు తనలో ప్రకాశించుచున్నాడని రమించి యుండుట (అంతర సమాధిస్థితి). శివునిలో నెలకొని, శివునిలో ఐక్యమై, శివానందము పొందిన స్థితి.

(1. శివతత్త్వము సృజించి, చేరియున్న స్థితి, 2. అంతర సమాధితో తనలో రమించి యున్న స్థితి, 3. శివునిలో పూర్తిగా ఐక్యమైన (ఇక తిరిగిరాని స్థితి) – ఆనందస్థితి.)

1513. జాగ్రదావస్థలో తనను తాను మరచియున్న సాయుజ్యము (జాగ్రతాతీతం) ఉపశాంత సాయుజ్యము – ఇష్టాఇష్టములు లేని స్థితి. శివ సాయుజ్యం – శివునితో ద్వైతము లేక ఏకమగుట (లయమగుట). ఈ లయ సాయుజ్యములోనే ఎల్లలులేని బ్రహ్మానందము పొందు స్థితి.

(ఈ బ్రహ్మానందముతో ఇక తిరిగిరాని స్థితి పొందుట.)

## 17. శక్తినిపాతము

శక్తినిపాతము – శక్తిస్వరూపిణి శ్రేష్టముగా పదిలమగుట. ఆత్మను అజ్ఞానము వైపు మళ్ళించుచున్న బంధ, మలశక్తులను నివృత్తింపజేసి, అందు శక్తి నెలకొనుటయే శక్తినిపాతము. బుద్ధిలో జ్ఞానము ప్రకాశించును. బుద్ధి పరిపక్వత తగ్గట్లు పదిలమగును.

1. మందము – స్వల్పబుద్ధితో గ్రహించినవాడు.
2. మందతరం – మందముగా ఉండి మంత్రములను ఉపాసించువాడు.
3. తీవ్రం – యోగాభ్యాసములు చేసి తీవ్రతను పొందినవాడు.
4. తీవ్రతరం – జ్ఞానమార్గములను అనుసరించువాడు.

**మందము**

1514. స్వాధీష్టానముతో (కామ, బంధ ఇచ్ఛలను పురికొల్పునది) సంబంధమున్న మూలాధార స్థానములోని కుండలినీశక్తి, గుడ్డి ముదుసలి యొక్క తత్త్వంలోని (అజ్ఞానములోనున్న ఆత్మకు జ్ఞానము పురికొల్పుటకు) గుడ్డితనము తొలగించి, నిజతత్వమెరిగించి (పతి, పశు, పాశము – శివతత్త్వము, పశుతత్త్వము (దేహభావన), బంధకత్వమును గ్రహింపజేసి – జ్ఞానమును తేటపరచి) తన సత్యజ్ఞానము బోధించి, తనలో చేర్చుకొన్నదే!!
(శక్తి జ్ఞానమొసగి జీవులను ఆదుకొన్నది.)

1515. ఆనందమిచ్చు స్థానమేదని పరిశీలించినచో, శివుని గ్రహించబడు స్థానముగాను, గ్రహించువారికి ఆనందమొసగునదిగాను, తేనెవలె తియ్యదనమును గ్రహించ దగినవారికి గోవులు కోరివెళ్ళి మేయదగు పచ్చటి పెరటివైపు నున్న వెనుకభాగమే. (వెనుక భాగమును మూలాధారమునకు పోల్చబడినది – బంధములు ఏర్పరచిన మూలాధారచక్ర స్థానమే తేట జ్ఞానము పొంది గ్రహించినవారికి, అమృతము నొసగునది – అమృతము = మహానందస్థితి).

1516. అహంకార మలమును తొలగింపజేసి, లెక్కలేనన్ని జన్మలను నివృత్తింపజేసి, అనుగ్రహింపబడిన దానినుండి ఎప్పటికీ వీడిపోకుండా రక్షించి ఆదిశక్తి అనుగ్రహించును. ఉన్మత్తము తీరలేని దేవతల నాయకుడగు శివునితో శక్తి ఇమిడి, ఎప్పటికీ స్థితి పొందునట్లు బ్రహ్మానందము తొలగిపోకుండా చూచి, జీవుల శరీరమును కాపాడి అనుగ్రహించును.

1517. చీకటి గదిలో దీపము వెలుగుతో అన్ని వస్తుసముదాయమును గ్రహించునట్లు, అజ్ఞానముతో నిండిన శరీరములో అనుగ్రహశక్తి ప్రకాశముతో శివతత్త్వమును తేటగా ఎరుగగలరు. (శివశక్తులను గ్రహింపగలరు.)

**మందతరం**

1518. శక్తి ఊర్ధ్వముగా వెళ్ళి (కుండలినీ శిరస్సుకు ప్రాకి) ఆత్మ వ్యాపకముతో తన వ్యాపకమును ఇమిడ్చి, అహంకారముల మత్తులోనున్న స్థితిని పోగొట్టి, కామ్యములను (ఇచ్ఛ, కోరికల ఆసక్తి, సంకల్పము, మొ॥) తొలగించి, ఆనందమేర్పరచి, అజ్ఞాన తత్త్వము వీడిన స్థితిలో శివతత్త్వ గుణములను పదిలపరచి, అనుగ్రహమయముగా

మార్చును ఆ జ్ఞానశక్తి స్వరూపిణి.

1519. పూర్వము స్త్రీలతో చేరి ఆనందమనుభవించిన పురుషులు (కుండలినీశక్తి యొక్క మహత్వము, దాని పోకడ) దానిని మార్చి అమర్చవలసిన ఉపాయము తెలియనివారే (అధోముఖ ధోరణి నుండి ఊర్ధ్వముఖమునకు ప్రాకించు ఉపాయము). అట్లు ఆ ఉపాయము ఎరిగినవారికి, ఇక వెంబడించు జన్మలు, వాటి బాధలుండజాలవు.

1520. ఎరుపు (స్వాధీష్ఠానము – బ్రహ్మ), నలుపు (మణిపూరకం – విష్ణువు), తెలుపు (అనాహతము – రుద్రుడు), పచ్చ (విశుద్ధి – మహేశ్వరుడు) రంగులు సృష్టి, స్థితి, లయము, తిరోధానం (మరిపించుట) చేయుచున్నవని గ్రహించినవారు దైవమును (శివం) పొందగలరు. ఈ దైవమే (అహంకారమగు) మదగజము యొక్క చర్మమును వొలిచి తాను ధరించినవాడని గ్రహించి (శివపురాణంలో ఈ కథ గలదు) వానిపై ప్రేమను సలిపి, అనుగ్రహపాత్రులు కావండి!!
(దైవమును పొందగోరువారు అహంకారమల చీకటిని పారద్రోలి ప్రేమతో వాని అనుగ్రహపాత్రులు కావలెను.)

1521. జగత్తున అండచరాచరములలో ఎన్నో జీవభేదములు (జీవరాశులు) సృష్టించబడి, ఎన్నోసార్లు క్షీణించిననూ, శక్తియూ, శివుడునూ అక్షరతత్త్వమును (క్షీణతలేని) పొందియున్నారు. అటు వారిని ప్రతిదినము ప్రాతకాలమున ధ్యానించు భక్తునికి ఆ శివశక్తులే వారిలో నెలకొని ఎటువంటి కర్మలు, సేవలు చేయవలెనని బోధపరచుదురు. (దైవ ఇచ్ఛను పురికొల్పుదురు.)

1522. శరీరములో నెలకొన్న సూర్య, చంద్రాదుల తోడుతో వెళ్ళి ఆ ప్రకాశమును దర్శించితిని. అటువంటి జ్యోతిప్రకాశము పురాతనమైన శివతత్త్వమగు బింబ ప్రకాశములో ముగుయును. ఝుంకారధ్వనితో (నాదము) ధ్వనించు సహస్రదళమున జటాఝూటములు ప్రకాశకిరణములుగా ప్రజ్వలించు ఆ పరమేశ్వరుని యందు స్థితి పొంది దర్శించినవారికి వారి చిత్తమున అజ్ఞానమను చీకటి తొలగించి అనుగ్రహించును.

## తీవ్రం

1523. ప్రతి తండ్రికి ఆనంద (విషయానందం) మొనగూర్చు ముద్దుల కూతురు వలె, (ప్రతి తండ్రికి తన కూతురు ఒక దేవకన్యయే అన్న నానుడి) సాధనకరణముగా గలుగు విషయానందము వలె, జగత్తుకు తండ్రియగు పరమేశ్వరుడు జీవులలో కొన్ని జన్మములతో ఏర్పడిన కర్మజనితములను, వాటి కరణములను తొలగించి, వారి చిత్తమున నిలచి, అడ్డంకులు తొలగించి, స్థిరమగును. ఆ శివమహామహుని పొందు భాగ్యమును (శివఫలము) మీరు పొందండి!!

1524. కోయపిల్లయగు (శివపురాణములో పార్వతిదేవి కోయపిల్లగా అవతరించి తీవ్ర తపస్సు ఆచరించి, శివుని పెండ్లాడుట) నవయవ్వనరాలైన కోమలవల్లి (పార్వతి పేరు) ని శ్రేష్టముగా పూజ చేసినవారికి ఆమె జన్మరహితము చేసి మహాతపస్సు ఫలమనుగ్రహించును. అజ్ఞానమునకు కారణముగా గల మరిపించు తత్త్వము (ఆవరణ శక్తి–తిరోధానం) తొలగించి, ఎల్లప్పుడు తన ధ్యాసతో ఉండునట్లు అనుగ్రహించును.

1525. అష్టదిక్కులను పరిపాలించు నాయకుడగు శివుని, పద్మములు, ఇతర పుష్పములతో కూడిన పుష్పమాలను చుట్టుకొనియున్న శక్తితో స్థితి పొంది ధ్యానించండి!! అందు ఇమిడి ధ్యానించువారికి మత్తులాంటి నిద్రను పురికొల్పు నీలి ప్రకాశమును దర్శింపజేసి అనుగ్రహించును.

1526. ఇట్లు శక్తితో ఇమిడి అనుగ్రహము పొందినవారి వలన ఇతరులకు కూడ జ్ఞానము సిద్ధించును. వాని పై పుష్పములు జల్లి, స్తుతించుదురు. ఈ విధమైన శ్రేష్టతను పొందినవారు తనను ఇతరులు స్తుతించిననూ అహం, గర్వమును వీడినవారై సమత్వబుద్ధితో యుందురు. ఇటువంటివారు జగత్తంతటిని చుట్టిరాగల సామర్థ్యమును పొందుదురు.

(పై నాలుగు మంత్రములలో "శక్తినిపాతం" యొక్క మహిమ యోగపరిభాషను లౌకికముగా ఉపమాన ఉపమేయములలో వర్ణించబడినది. ముద్దుల కూతురు – విషయానందకరణముగా; కోయపిల్ల తపస్సు – కుండలినీ శక్తిని శిరస్సుకు ప్రాకించి ధ్యానించుట; పద్మములతో కూడిన పుష్పమాలను – చిత్రానినాడి ఆధారచక్రము మధ్య వంపులతో చుట్టుకొనియుండుట; శక్తి అనుగ్రహము పొందినవారిని పూజించుట – శక్తి శిరస్సున శివంతో కలిసిపోవునపుడు పొందునదే సమత్వబుద్ధి, దేశసంచార యోగసిద్ధులు; వివరణలన్నియూ కుండలినీయోగశక్తి గురించి యని గ్రహించవలెను.)

## తీవ్రతరం

1527. శుభ ఫలితములను, కీడు ఫలితములను సమబుద్ధితో స్వీకరించు సమయమున, శ్రేష్టమైన అనుగ్రహాశక్తి గురుమండలములో (శిరస్సున) నెలకొని, ఆత్మప్రకాశము పొందుటకుగాను ఆమె కొన్ని అడ్డంకులను తొలగించి జ్ఞానమొసగి అనుగ్రహించును. తన పరిశ్రమతో నెరవేరునది ఏదియూ లేదన్న భావనతో అన్నియూ ఈశ్వర ప్రసాదబుద్ధి అనియున్నవానికి ముమ్మలములు (అహంకారములు, కామ్యములు, అజ్ఞానమలములు) తొలగిపోయి "శివం"గా వెలుగొందును.

(శుభ ఫలితములతో "రాగము", కీడు ఫలితములతో "ద్వేషము" లేనివాడై అన్నీ

ఈశ్వరకృపయన్న భావనతో సమత్వబుద్ధితో ఉండుట.)

1528. రాత్రి, పగలు లేనిచోట (నాదము ఉత్పన్నమగు శిరస్సున) నెలకొని, నాదముగా శబ్దించు శక్తిని ధ్యానించి, నాదము లేని నాదముతో ఆమెయందు లయమైనచో, పరాపర నాయకియగు ఆమె ఇతనిలో ప్రేమతో ఇమిడ్చి పాలించును.

(శక్తిని ధ్యానించువారికి వారి ఆత్మలో అనన్యముగా ఇమిడి, అనుగ్రహించి, పరిపాలించును. నాదము లేని నాదతత్త్వము: అశబ్దము, అమాత్ర, నిశ్శబ్దము, అదే తురీయస్థితి. ఆ స్థితియే "అద్వైతం, శివం, అచ్యుతం, సఆత్మః, సవిజ్ఞేయః" – మాండూక్యభాష్యం.)

1529. సంధ్యాకాలములో ప్రకాశమును గలిగించు జ్యోతిగాను / చంద్రుడుగాను, ప్రాతః సమయమున ప్రకాశమును గలిగించు సూర్యునిగాను, మహోన్నతమైన "పరంజ్యోతి"గాను నున్న పరమేశ్వరుడు ఉన్నతమైన సత్యజ్ఞానమును అనుగ్రహించిన నాయకుడు. నా చిత్తమునందు పదిలమై, ఇమిడి, ఈ జడశరీరతత్త్వ మెరిగించి, ప్రకాశింపజేసెను. (అనుగ్రహించబడిన శరీరము "శివజ్యోతి"మయమగును.)

## 18. బాహ్యమత దూషణ

బాహ్యముగా దైవమును వెతకు తత్వమును బాహ్యమతముగా చెప్పబడినది. బాహ్యమతం జన్మరహితమును బోధింపజాలదు.

1530. మందలుగా ఏర్పడిన ఆరు మతములు కాయములో (శరీరములో) నెలకొన్న దైవమును దర్శింప సహాయము చేయజాలవు. కావున ఆ మతములను అనుసరించువారు మోహమను గొయ్యిలో పడుదురు. పైగా భార్య, సంతతియను బంధములో చిక్కుకొని అవస్థలు పడుదురు.

1531. అంతటా వ్యాపించినవాడు, జీవులలో వారి హృదయమున నెలకొని, తానున్నది మరిపించియున్నాడు. దానమొసగుటలో పరమదయాళుడు. శిరస్సు సహస్రదళము నందు శక్తితో కూడి నెలకొన్నవాడు. నవద్వార శరీరములో ప్రవేశించి పైకి ప్రాకివెళ్ళిన (ఊర్ధ్వముఖముగా శిరస్సుకు) దొంగల నాయకుడు. వాని వివిధ వృత్తులను లోకులు సరిగ్గా గ్రహించజాలరు.

(సర్వజ్ఞుడు, సర్వవ్యాపియై అన్ని జీవులలో నెలకొని చైతన్యపరచు ఈశ్వరుని "దొంగ" అన్న సంబోధన ప్రేమతో, భక్తితో పిలుచు "నిందాస్తుతి".)

1532. ఆత్మతో కలిసి ఆత్మగా ఉన్నాడన్న జ్ఞానము గలిగిన శ్రేష్టమైన జ్ఞానికి ఈశుడు వారి ఆత్మలో నెలకొని అనుగ్రహించును. ఆత్మకు అన్యముగా ఉండి ప్రాణమును రక్షించుచున్నాడన్న భేదభావన గల భక్తునికి ఈశుడు బాహ్యముగా ఉండి, వానిని అనుగ్రహించును. అంతరమున లేడు, బాహ్యముగాను లేడన్న నాస్తికవాదులకు

రెండింటిలోను లేనివాడే అగును.

1533. ఆరు మతతత్త్వములు ఎరిగినవారు కూడ దైవమును ఉన్నదున్నట్లు ఎరుగజాలరు. ఆరు మత సిద్ధాంతములు కూడ అతను కాదు. కావున దైవమును తెలుసుకొను జ్ఞానమును తేటపరచుకొనండి. తేటజ్ఞానము పొందిన పిదప మార్పులేని ఈశుని దివ్యపాదము దరిచేరగలరు.

(ఆరు బాహ్యమత విభాగములు: భైరవం, శమనము, పంచారాత్రము, భాట్టాచార్యము, ప్రపంచాయుతము, శూన్యవాదము.)

1534. ఈ జగత్తునందు సర్వవ్యాపియైన శివుని తప్ప వేరన్యవస్తువు ఏదియూ లేదు. ఆత్మలో మరిగియున్న "శివం"ను అనుభవములో పొందునదే తపస్సు అనబడును. ఈ జ్ఞానమును ఎరుగ బాహ్యమతములను ఆచరించుట వృథాయే అగును. తపస్సు ఫలమును అందుకోవలెనన్న ఆశయమున్నవారు గురుమండలములో నెలకొన్న శివుని దరిచేరండి!!

(తపస్సు అనునది తనయందు ఇమిడి దాగియున్న "పరం"ను గ్రహించునదే.)

1535. దైవమును వెతకగోరి ఆరు మతములను అనుసరించువారు, దేవలోకమునకు వెళ్ళుటకు ప్రాధేయపడువారే. ఆ మోహమున చిక్కుకొని నశించుదురు. వారు దేవదేవుడైన పరమేశ్వరుని పొంది, జన్మరహిత చేసుకొనుటను గ్రహించనివారే అగుదురు.

(దేవలోకములు, స్వర్గలోకప్రాప్తి యన్నియూ జన్మరహితము నొనగూర్చలేవు. కావున ఆత్మజ్ఞానముతో పరమునందు నెలకొనుటయే శ్రేష్టము. **"క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి"** – శ్రుతివాక్యము. కర్మజనిత పుణ్యఫలములన్నియూ క్షీణించిన వెంటనే భూలోకమునకు త్రోయబడుదురు.)

1536. "శివగతి"యే శ్రేష్టమైన తత్త్వము. మిగతావన్నియూ "భవగతి" (బంధములేర్పరచి జన్మమునకు దారితీయునవే). అవి మలములతో కూడుకొన్నవి కావున "తపగతి"తో తనను గ్రహించినవాడు (తనలోనున్న శివతత్త్వ మెరిగిన) తప్ప, మిగతా మూవురు "అవగతి" (బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మొ॥ అన్యతత్వమునకు లోనగువారే) పాలగువారే!!

1537. చెప్పవలసి వచ్చినచో వంద మతములు గలవు. చెప్పిన ఆరు మతములు గూడ వాటికి లోనైనవే. చెప్పిన, చెప్పవలసిన మతములకంతటికీ అంత్యము (ఆఖరిదైనది, గమ్యము) "శివతత్త్వం". అవును!! ఇదియే ముక్తినొసగు తత్త్వమగును.

1538. అర్థమెరుగక, గ్రహించక, గాడిదల వలె అరచువారు మూఢులు. శ్రేష్టమగు శుద్ధ శివతత్త్వము సర్వవ్యాపియై నిలుచుచున్నది. ఉన్ననూ తమయందున్న అజ్ఞానముచే,

మలములచే శివుని స్తుతింపజాలరు. ఈ సత్యమెరుగక, మత్తుచే (మోహం) జన్మ మరణములలో చిక్కుకొని పరిభ్రమణం చెందుచుందురు.

1539. జ్ఞానశాస్త్రములు చదివి తేటజ్ఞానము పొందినవారు కాని, తేటజ్ఞానము పొందక భక్తిమార్గమున నున్నవారైననూ సరే, ద్వందములు గ్రహించి (శుభ, కీడు కర్మ ఫలితములు నెరిగి) సుషుమ్ననాడి ద్వారా గమ్యమగు బ్రహ్మరంధ్రము చేరి అందు నెలకొన్నవారే సంశయము తొలగిన (జన్మ, మరణముల గురించి వ్యధలేనివారు) "పరతత్వ" మెరిగినవారు.

1540. కాయిక కర్మలు, తీర్థయాత్రలు చేయు భక్తులకు దేవాలయములలో దర్శనమిచ్చువాడు, తనలో ఇమిడియున్నాడని ఎరుగువారికి అట్లే లోనుండి బంధములను విముక్తి చేయగలవాని పేరు "నందీశ్వరుడు" (శివుడు). చిత్తఏకాగ్రతతో ధ్యానించువారికి "శుద్ధజ్యోతి"గా బహిర్గతమగువాడు, "మాయగాడు" (మోహం, బంధములు వీడని వారికి గోచరము కాక మరిగియున్నవాడు), మాయాకర్షణల పట్టు, బంధములను వీడనివారికి, పొందిన జన్మమునందే సత్ఫలితము పొందనివారే అగుదురు. (సకామ కర్మయోగులకు ఏకరూప ఈశ్వరుడుగాను, ఆత్మతత్త్వ మెరిగినవారికి నిర్గుణ ఈశ్వరునిగా ఉన్నాడు.)

1541. సద్గతి మార్గమును అవలంబించుచున్నవారికి, దానిని గ్రహించక జీవించు వారికి, ఇద్దరికీ విత్తనమగు శరీరము ఒక్కటే (విషయ భోగము, భోక్తయగు శరీరము ఒక్కటే). భూమండలమునందు జన్మమరణములు పొందుట ఒక తత్త్వము. గురోపదేశానుగ్రహముతో ప్రాణమును బ్రహ్మమయపరచుట మరొక తత్త్వము. ఈ తత్త్వము గ్రహించి అఖండాకారములో నెలకొనుటకు ప్రయత్నించకున్నారు ఈ పామరులు!! (రచయిత వాపోవుచున్నారు.)

1542. శ్రేష్ట తపస్సంపన్నులందరు మహాదేవుడే తమను సృజింపజేసి పాలించుచున్నా డందురు. నాదమయముగా స్పందన (శిరస్సున) రూపములో గోచరించు, సృజింపజేయు నందీశ్వరుని (శివుని) ఎటువంటి భేదబుద్ధి లేక ఆ స్పందననే తనుయని గ్రహించువారికి ఆదియగు ఆ తత్త్వములోనే (నాదతత్త్వములో) అనుగ్రహించును.

1543. అన్ని ఆచార సంప్రదాయములకు నాయకుడైన, అన్నిటికీ సనాతనుడైనవాడు భక్తి తత్త్వమును కోరువారికి వారి మనోమండలములో నెలకొనును. మేలైన, శ్రేష్టమైన మార్గమును అవలంబించువారికి వారి చిత్తములో పదిలమగును. అట్లుకాక, కోరుకొను సమయమున బహిర్గతము కాలేదన్నచో, వాని తత్త్వము గ్రహించుట జటిలమే యగును!!

1544. వాడు (శివుడు) ఫలప్రదాత. కోరువారిని ఆదరించువాడు. ప్రకాశవంతుడు. దేవతలందరికి నాయకుడైనవాడై, అందరిచే స్తుతించబడువాడు. నీ సంశయము తొలగించుకొని వానిని స్తుతించుదువు గాక!! నిర్మల ప్రకాశించు రత్నము పోలిన జ్యోతిస్వరూపుడు. వాడు నిర్ణయించి నెలకొల్పిన ధర్మమార్గములన్నియూ బహు శ్రేష్ఠములైనవి సుమా!!

1545. మతాచార సంప్రదాయములలో ఇది మంచిది, అది మంచిదని ఈ జనులు చెప్పు ఈ మాయమాటలు త్రోసిపుచ్చుము!! నాదాంతమున వెలయు శివుని దరి చేరండి. కర్మజనితమైన ఈ శరీర మాయామలములను దాటి ప్రణవ దేహము పొందుదువు గాక!!

(ఆచార సంప్రదాయములు దాటి, ముమ్మలములను తొలగించుకొని ప్రణవ దేహం పొందవలె.)

1546. ముందు మంత్రములో చెప్పినట్లు నాదాంత తత్త్వములో నెలకొనిన దేవతలు, మహర్షులు, మునులు మొదలగువారు ఇదే శ్రేష్ఠమైన తత్త్వమని గ్రహించి "శివం"యై స్తుతించబడిరి. అట్లుండగా జనులు సూచించు ఇతర మార్గములలో వెళ్ళి "శివతత్త్వం" పొందక ఇక్కట్లు పాలగుట ఎందులకో?

1547. పొందవలసిన, గ్రహించదగిన తత్త్వము – అంతర్ముఖులై అంతరమున నెలకొన్న జ్యోతిని గ్రహించుటయే – ఇది ఏ మార్పులేని (నిర్వికారమైనది) శాశ్వత తత్త్వమగును. మన మలములు, కామ్యకర్మలను తొలగించునదైన ఈ తత్త్వమును జనులు గ్రహింప జాలకున్నారే!! ఏమీ పేదప్రజలు! (జ్ఞానశూన్యులను పేదలుగా పేర్కొనబడినది.)

1548. దైవమును పొందదగు తత్త్వము పైన చెప్పిన నాదతత్త్వము – ప్రసాద తత్త్వము ఒక్కటే. కాని ప్రపంచబంధములు ఏర్పరచుకొని నడుచువారు కొన్ని కల్పనా కథలు వినుదురు. జన్మబంధ చక్రములో తగుల్కొన్నవారు వారి ప్రపంచబంధములు విడిపించుకొందురేని వారు అందరిచే స్తుతించబడుదురు.

1549. శిరస్సున నెలకొని, శివతత్త్వమెరిగి, ఆ తపస్సు సఫలమగునపుడు, కర్మఫలముల యొక్క విధివిన్యాసములు తొలగిపోయి, బంధములు ఏర్పరచుచున్న సకల కీడులు నివృత్తియై, బ్రహ్మరంధ్రము ద్వారా ఆ దేవదేవుడు (శివుడు) బహిర్గతమగును. (శివతత్త్వ తపస్సులో బంధవిమోచనమై శివుని పొందగలుగుట.)

## 19. నిరాకారము

రూపము లేనిది – అరూప ఈశ్వరభక్తి, ధ్యానం – నిర్గుణబ్రహ్మం – దైవము చేతనగా అన్నింటా కలిసియున్నదని చెప్పు వివరణ

1550. హిమాలయ పర్వతము వలె గొప్ప ప్రశంసనీయమైన దేవాంశము పొందినవారు,

వారి లక్షణములకు తగ్గట్లు ఆరు మత సంప్రదాయ పద్ధతులను ఏర్పరచిరి. ఆ కాలములోనే వేదాధ్యయనము చేసి పొందితిమని చాటుకొన్నారు. కాని ఆది పరం (పరమేశ్వరుడు) ఓర్పు, త్యాగశీలతయున్న జ్ఞానుల మదిలో కలిసి నెలకొని యున్నాడని గ్రహించవలెను.

1551. శిష్యుల హిరణ్యమండలమున (జ్ఞానుల శిరస్సున గల బంగారు సహస్రదళమున) నెలకొన్న శివుడే వారితో అనన్యముగా ఏకమై వెలయుటచే, ఆ జ్ఞానులు భువియందే "శివం" అగుదురు. అట్లుకాక శ్రేష్టనివృత్తి మార్గమును ఆచరించనివారు (అనగా శివుని అన్యముగా భావించువారు) దుఃఖములతో ఈ భువినందు కొట్టుమిట్టాడుదురు.

1552. లేమి గురించి చింతించువారును (ధనము, బుద్ధి, సామర్థ్యము, శాంతి లేమి, మొ॥), భద్రత గురించి చింతించువారును (సంపద, ఉద్యోగము, పదవి, బంధుజన బలము) చింతించుట మాని, మహామహుడైన శివుని తలంచి అంతర్ముఖులై ధ్యానించినచో, వారి దుఃఖములను నివర్తి చేయడమే కాక, దేవతలే స్తుతించదగిన స్థానము నేర్పరచి, జన్మరహితము చేయునే!!

1553. దైవము సుదూరముగా నున్నాడని భావించు భక్తులకు వాడు వారికి తోడు నీడై వారియందే నెలకొనియుండి సహాయపడుచున్నాడని గ్రహించజాలరు. భువియందున్న భోగ విలాసవస్తు మోహమున పడి, బంధ, అసంతృప్తి, దుఃఖమిశ్రితత్వమును అనుభవించుచుందురు. పై రెండు వర్గముల వారు అజ్ఞానముతో ప్రపంచవస్తు మోహముచే జన్మచక్రమున పడుదురు. కాని దైవము మనయందే ఉన్నాడని, వాడు అనన్యముగా ఎందో లేదని సృజించినవారు ప్రతిఫలము ఎదురుచూడక వర్షించు మేఘమువలె వారు లోకులకు సహాయపడుదురు.

1554. బుద్ధిలో బుద్ధిగా (జ్ఞానముగా) నెలకొని అనుభవింపజేయు శివుడను తెప్పతో (ఓంకార ప్రణవమను తెప్పతో సంసార సాగరమును దాటించుట) విధితో నిండిన (కర్మ ఫలితములతో నిండినది) కారణ శరీరములో పదిలమైన వాసనలను క్షీణింప జేయునది, అఖండాకార మహాజ్యోతి స్తంభమని గ్రహించిన పిదప కూడ, కీడు బంధములకు దారితీయు చెడువాసనలను వదలనివారు శివమహామహుని పాద పద్మములను (జ్ఞాననిష్ఠలో నిలబడనివారే) తలంచనివారే అగుదురు.

1555. స్థితి పొందిన శివతత్త్వము మనస్సులో (భావనలు, ఆలోచనలు గలిగించు మనోమయకోశము) నెలకొన్ననూ, జనులు గ్రహించక హేళన చేయుదురు. ఇట్లు హేళన చేయువాడు సత్యతత్త్వమెరగనివారే. అట్లు హేళన చేయక మనస్సున నెలకొల్పి స్తుతించండి!! అట్లు స్తుతించుటచే దేనికి సాటిలేని "శివం"ను పొంది మనస్సే శివతత్త్వమై నిలబడును.

(నిరాకార పరబ్రహ్మ తత్త్వమే శారీరక మనస్సున ఆత్మగా నెలకొనునది.)

1556. పై మంత్రములో చెప్పినట్లు జీవులు ప్రణవముతో శివతత్త్వమెరిగినపుడు, తన తత్త్వము (దేహ-వ్యష్టి తత్త్వము) తొలగిపోయి, సమష్టి తత్త్వముతో ఏకమై వెలుగొందుదురు. కాలానుగుణముగా తన దేహము క్షీణించునన్న మనోవ్యథ కూడ ఉండజాలదు. జన్మరహితము పొందుదురు. మోహము కల్పించు మతాచార సంప్రదాయములన్నియూ వీగిపోవును (అక్కరకు రాదు).

(భువియందు శివతత్త్వము పొందిన జీవులు బ్రహ్మాండ జగత్తుకు చెందిన సమష్టి తత్త్వముతో ఏకమై, నిర్గుణబ్రహ్మమగుదురు. ఈ స్థితియే జీవన్ముక్తి - ఇక జీవుడు ఈశ్వరుడు వేరుగాదు. జీవాత్మ = పరమాత్మ. ఏకత్వము - అద్వైతము.)

## 20. అంతర మతం

జీవునిలో వెలుగు శివజ్యోతిని గ్రహింపజేయునది ప్రకాశశ్రేష్ఠ తత్త్వజ్ఞానము లేక శుద్ధ శైవ సన్మార్గము. ఆచార సంప్రదాయములన్నిటిని మతముగా పేర్కొనియున్నారు.

1557. దేవతలకు, జీవులైన మనకు తన కరణములిచ్చి ప్రపంచమున ఇమిడ్చి సుఖానుభవములను అనుభవించునట్లు చేసినది అనాదియైన బహుసనాతనుడు. అంతర మతములన్నియూ తన పాదపద్మములకు చేరునట్లు చేయుటయే కాక వాటితో కలిసి అంతటా వ్యాపించియున్నవాడే "ఆది పరాపరుడు" (పరమేశ్వరుడు).

(ఆరు అంతర మతములు: శైవము, వైష్ణవము, శాక్తము, సౌరము, గాణాపత్యము, కౌమారములను శుద్ధశైవము అంగీకరించి బాహ్యామతములైన ఆరింటిని (మ:1533) త్రోసిపుచ్చుచున్నది.)

1558. ఒకే ఊరికి వెళ్ళుటకు ఆరు మార్గములున్నట్లు, ఆరు మతములు ఒకే తత్త్వమును పొందగోరుచున్నవి. ఇది ఉత్తమము, అది అధమమని చెప్పువారు పర్వతమును చూచి కుక్కలు మొరుగునట్లే!!

1559. శ్రేష్ఠము నొనగూర్చు శుద్ధశైవ మతమునకు గొప్ప నాయకుడు, జీవులకు ముక్తి పొందుటకు గాను ప్రాణముతో ప్రాణముగా నెలకొన్న జ్యోతి - నందీశ్వరుడు (శివుడు). సత్యజ్ఞానము (ఆత్మజ్ఞానము)ను గ్రహించినవారికి మిక్కిలి ఇష్టుడు. ప్రేమను పురికొల్పు ఆ జగన్నాయకుడైన వారి దరిచేరి ముక్తి పొందుదురు గాక!!

1560. పరమేశ్వరుడు జీవులు ముక్తి పొందుటకుగాను అమర్చిన తత్త్వముతో, అతను నెలకొల్పిన సనాతన ధర్మమార్గమున వెళ్ళి, ఆ జీవుడే శివుడని గ్రహించువారికి (అతను ఇతనే - "జీవో బ్రహ్మైవ నా పరః" - శ్రుతివాక్యము) అతను నెలకొల్పిన శైవతత్త సత్యజ్ఞానము ద్వారా దర్శనమిచ్చుట అతని కర్తవ్యమగును.

1561. అట్లు జీవులు ముక్తి పొందుటకు గాను ఏర్పడిన మతతత్త్వములు జీవులను

తనంతట అవే శిఖరమునకు చేర్చజాలవు. జీవుడు చేసిన పుణ్యఫల ఆధారముగాను, మరియు జీవులు ఉన్నతిని సాధించుటకుగాను ఆధారముగా ఉండి సహాయపడునది శివానుగ్రహము కూడ తోడగును.

1562. హరుని పొందుటకు గాను దారిని గ్రహించిన వాడగు నేను (రచయిత) ఆ కాలములో ఎన్నో వేరుతత్త్వములను వెతకి వెతకి వేసారియై బలిష్ఠమైన మనోమయ సముద్రమును (సంశయములతో కూడిన మహాచంచల భావనా పరంపర) దాటి శ్రేష్ఠమైన తత్త్వమును గ్రహించుటకు సహాయకారిగా ఉండినది "ఆ పరంజ్యోతి"యే!!

1563. విచారణలతో, అనుభవానుసారముగాను పొందినదేమనగా శివుడే పరమాత్మ అని తేటజ్ఞానము గలిగియుండటమే శివతత్త్వం. బాహ్యామతములు అనుసరించిన వారు కూడ అంత్యమున ఈ తత్త్వమునకే వచ్చిచేరిరి. ఇక అంతర మతములు అనుసరించినవారు కూడ వారి పరిపక్వతకు తగ్గట్లు వారివారి అండములకు (లోకములకు) వెళ్ళుటకు సహాయపడినది ఈ శివతత్త్వమే. ఈ విధముగా శివతత్త్వం జన్మరహితము కల్పించి ముక్తిని ప్రసాదించునని గ్రహించండి!!

1564. బాహ్యావిషయములపై వెళ్ళు మనస్సును అంతరముననున్న శివునిపై లయమగునట్లు చేయండి. అందులకు మూలాధారమునుండి ఊర్ధ్వముగా వెళ్ళు "శి"కారమును గ్రహింపజేయునదైన పంచాక్షరమును ధ్యానించండి!! (మూలాధారములో "వ, శ, ష, స" బీజములు ఇమిడియున్నవి. అందు "వ, శ" మాత్రము శివమంత్రముగాను అమరి, "శివయనమ"గాను పంచాక్షరి మూలమంత్రమున గల "న, మ, శి, వా, య"లోని "శి"కారము బీజముగా ఉదయించును.) హరునితో లయమై ఈ సాధనను చేస్తూ రండి. నుదిటి ఎదురుగా "ఎర్రని జ్యోతి" దర్శనమగును.

1565. యోగదర్శనము చేయువారలకు మెరుపువంటి ప్రకాశముగా దర్శనమిచ్చును. వైదికులు చేయు హోమాగ్నిలో ఎర్రని అగ్నిజ్వాలగా దర్శనమిచ్చును. ఆది పరాపరుడు (అనాదియైనవాడు) ఏ రూపమున వాని కొలిచిన ఆ రూపములోనే వారికి దర్శనమిచ్చును. "పరా"జ్ఞానముతో ప్రకాశరూపమున దర్శించునదే హరుని తత్త్వమగు శుద్ధశైవ తత్త్వమగును.

1566. విచారణతో ప్రకాశతత్త్వమే బహుశ్రేష్ఠమైనదని తేటజ్ఞానము పొందనివారికి ఆత్మ విషయములు పలు విధములుగా గోచరించుచూ (సత్యజ్ఞానమును మరిపించియుంచు మాయా ఆవరణశక్తి వలన) వారు చేరకుండునట్లు చేయును. దీనికి అతీతముగా దూరి (వివేక వైరాగ్యములతో) హరుని పాదపద్మములను పట్టుకొని వానితో కలిసి, ఇముడుటచే గలుగునది బ్రహ్మానందమే అగును.

1567. శైవమతమునకు మహోన్నతమైన నాయకుడు నంది (శివుడు). ఆత్మలు ఉన్నతి

పొందవలెనని ప్రకాశతత్త్వ మనుగ్రహించెను. ఇదియే దైవత్వము నిండిన శివతత్త్వపు శుద్ధ సన్మార్గము. దీనిని గ్రహించి పట్టుకొని ఉన్నతి పొందుటకు జనులకు అనుగ్రహించెను.

(ఉన్నతి అనగా గమ్యము – పరమపద సోపానము – ముక్తి.)

1568. ఈ తపస్సు మంచిది, ఆ తపస్సు మంచిదను భేదజ్ఞానము గలిగిన జ్ఞానశూన్యులను చూచి మా యొక్క నందీ నవ్వును, ఏ తపస్సైననేమి? ఎందు జన్మించిననేమి? అభేదముగా తలచి గ్రహించిన వారికి ముక్తియను ఊరుని చేరుకొనునట్లు చేయును నా నందీ (శివుడు).

1569. సదాశివుడు తన పంచముఖములతో అన్ని జీవరాశులలో ఇమిడి వృత్తులు సలుపును. ఆ పరాపరునకు తన ఐదు (5) ముఖములతో కూడ (తత్పురుషం, అఘోరం, సద్యోజాతం, వామదేవం, ఈశానం) అధోముఖముతో కలిసి ఆరు ముఖములగును. సదాశివుని గ్రహించి ధ్యానించువారికి సదాశివుని ఆరుముఖములు ఏకమై ఒక్క ముఖమైపోవును. శివుని గ్రహించి ధ్యానించని వారికి అధోముఖము అధోప్రవృత్తినే కోరివెళ్ళును. (అదోముఖముగా వెళ్ళునది మానవ నైజముతో కూడిన మాయావలలో, ఆకర్షణలో చిక్కుకొనుట.)

1570. ఆదిపరాపరుడైన శివుడు బ్రహ్మాండమంతటిలో అనగా ఏడేడు పదునాలుగు లోకములను కొలిచి అందు నెలకొన్నవాడు. అలలుతో కూడిన సముద్రమంతటిలోను, భువిలో సకల జీవరాశులలోను కలిసి నిలుచున్నవాడు. అటువంటి శివునితో కలిసి అభేదముగా నిలుచున్న పరాశక్తి, ఆదిలో సృష్టికి, అంత్యమున లయమునకు తోడ్పాటుగా ఉన్నది.

(శివుని గ్రహించునపుడు ప్రాణశక్తి శిరస్సున సహస్రదళముతో చేరునపుడు అధోముఖ ప్రవృత్తి వీగిపోవును. అట్లు కానిచో అదే అధోముఖము వీర్యము పొంది లయమునకు తోడ్పడును.)

1571. బాగుగా పరిశీలించి చూచినవారు (విచారణతో గ్రహించినవారు) మహాజ్ఞానము పొంది యోగులు, జ్ఞానులైనారు. పరిశోధనలతో గ్రహించుటకు వీలుకాని వారికి శైవమే మార్గదర్శి అయ్యెను. వాని పాదపద్మములను పట్టుకొనుటచే నేను (రచయిత) అనుగ్రహింపబడితిని. కావున నేను ఈ జన్మములోనే ముక్తియగు మహానందమును దర్శించితిని (పొందితిని).

1572. ఈ జన్మమున శరీరమును ధరించినది దైవమును దర్శించుట కొరకేయని జనులు ఎరుగకున్నారు. గ్రహించుటకు దుర్లభమగు "ఏకం" అగు ఆకాశతత్త్వమును ఆరు ఆధారచక్రములలో చొప్పించి, గ్రహించుటకు వీలుకాని ఆరు కోశములతో

అనుభవము పొందునట్లు చేసి, గ్రహించుటకు వీలుకాక శివుడు ఆకాశతత్త్వముగా అండములో (శరీరములో) నెలకొనియున్నాడు.

(ఆరు ఆధారచక్రములు: వెన్నెముకలోని ఆరు చక్రస్థానములు – వాటి అధి దేవతలు – వారి ఉపాధులు.

ఆరు కోశములు – ఆత్మ ఉపాధులు: భూతాత్మ, అంతరాత్మ, తత్వాత్మ, జీవాత్మ, మంత్రాత్మ, పరమాత్మ (6). దీనినే తైతిరీయ ఉపనిషత్తు నందు బ్రహ్మానందవల్లీలో పంచకోశ వివేకముగా చెప్పబడినది.

"అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములు"గా గ్రహించి "నేతి, నేతి" అన్న జ్ఞానముతో – అనగా ఇది కాదు, ఇది కాదు అని త్రోసిపుచ్చి, బ్రహ్మానంద స్వరూపతఃను ఇదేయని నిర్ణయించి ఆత్మతత్త్వములో నెలకొనుట, తదనుసారముగా "జీవన్ముక్తి పొందుట మానవుని ధ్యేయం కావలెనని బోధించునది".)

ఐదవ తంత్రము సమాప్తము

ఓం తత్సత్

సర్వం శివార్పణమస్తు

# ఆరవ తంత్రము

## 1. శివగురు దర్శనము

శివగురు దర్శనము చిత్తమున భావనారూపములో శివుని దర్శించుట. ఆ గురునాథుడే ప్రణవ ఉపదేశముతో దోషములను నివర్తింపజేసి, నిజతత్త్వమును గ్రహింపజేయును. దీనిని "సద్యోనిర్వాణ దీక్ష"గా పిలువబడుచున్నది.

1573. భక్తిని కల్పించి, పాదపద్మములను నమస్కరింపజేసి, ప్రణవబోధతో పదిలమైన దోషములను నివర్తింపజేసి, సత్తు, అసత్తు, సదసత్తుగా ఉన్న నిజతత్త్వములను లోపల నెలకొని గ్రహింపజేయుటచే, చిత్తమున నెలకొన్న దైవమే గురువగును. (ప్రణవ ఉపాసకులకు అసత్తు అను "బంధము", సద్‌సత్తుగా ఉన్న పశు (దేహ భావన) సత్తుయగు "శివం" గ్రహింపబడును.)

1574. అహంకారముతో కప్పియుంచిన ఈ జీవుని మాయామలమును కట్టి, అహంకారమును తొలగించి, దేహమే తానన్న ప్రీతిని త్రెంచి, ఎటువంటి వికారము లేని తత్త్వమును ఎరిగించి, ఉపాసకుని ప్రకాశమండలములో (శిరస్సున వెలుగు) నెలకొన్నది "నిరాకార సద్గురువే" కదా!! (వికారములు లేనిది: ఎటువంటి మార్పు లేనిది, సత్యం, శాశ్వతమైనది.)

1575. అణిమాది అష్టసిద్ధులును, సాధకుని శివంగా మార్చదగు పరిపక్వమును, అష్టశక్తి సిద్ధుల శ్రేష్టతను - (వామం, జేష్టం, రౌద్రి, కాళీ, కళవికరణి, బలవికరణి, సర్వభూత దమని, బలప్రమదని), యోగముతో (కుండలినీ) గలుగు శక్తియూ, మంత్రోచ్ఛారణ ధ్యానాదులతో గలుగు జ్ఞానము, దైవమునందు గలుగు ఎనలేని భక్తియూ "శివగురు" (చిత్తమున నున్న) అనుగ్రహముతో దక్కునదే!!

1576. బ్రహ్మాండములకు అవతల ఉన్నవాడే (224 భువనములను దాటి), ఈ జగత్తు నందు మాయగా ఇమిడి నెలకొనియున్నాడు. సజ్జనుల హృదయమున నెలకొని అనుగ్రహించుచూ, ఈ భువియందు అందరూ ఉన్నతి పొందవలెనన్న ఆశయముతో అనుగ్రహమొసగువాడును, ప్రణవస్వరూపములో గురువుగా నెలకొనియున్నది "శివం"మే అగును.

1577. దైవముగా, శుద్ధగురువుగానున్న శివుడు, ఆగమములలో చెప్పబడిన పతి, పశు, పాశము, (ఈశ్వరుడు, జీవుడు (దేహభావన), జగత్తు - బంధము, సంసార మలముతో నిండినది) మూడింటి తత్త్వములను గ్రహింపజేసి, ఉపదేశముతో నాశము కాని జీవునిలోని బంధములను తొలగించి, ఆ గురుపరాపరుడు (శివుడు) ప్రేమతో ముక్తినంతటిని సంపూర్ణముగా అనుగ్రహించునే!!

(ప్రేమతో, పరిపక్వత, అర్హత తగ్గట్టు గురువుగా వచ్చి శివుడు అనుగ్రహించును.)

1578. శుద్ధ శివంమే జీవులయొక్క మలదోషములను, బంధములను గురువుగా వచ్చి తొలగించును. అటువంటి మహానుగ్రహము తోడుగా ఉండడము మూఢులు గ్రహింపజాలరు. మిథ్యాజగత్తు యొక్క శుభభోగములను అనుభవించుచూ, బంధములలో చిక్కుకొన్నవారు గురువులను తమతో పోల్చిచూచుకొందురు (అంటే గురువు కూడా తనలాంటివారేనని భావించు తత్త్వము). శివానుగ్రహముతో నున్న పుణ్యాత్ములు ఆ శివుడే గురువుగా వచ్చారని గ్రహింతురు.

(గురువు తన శిష్యుని బంధములను తొలగించి శివుని గ్రహింపజేయుదురు. ఈ క్రియనే "సద్యోనిర్వాణ దీక్ష" యందురు.)

1579. జ్ఞానముతో మిథ్యాతత్త్వము తొలగునదియూ, పృథివి తత్త్వపు అధోముఖ ఆకర్షణ (అనగా లౌకికవృత్తులపై ఆసక్తి)యూ, శివమైన తానొనగూర్చు సహాయములునూ, అరువది నాలుగు (64) కళలతో ఏర్పడు మోహజ్ఞానము (జ్ఞానముతో ఏర్పడు మోహం) శివానుగ్రహము పొందినవారు గ్రహించుదురే కాని మరెవ్వరు గ్రహించ గలరు? (ఇతరులు గ్రహించజాలరు) (గురువుతో అజ్ఞానము, అధ్యాస, అపోహలన్నీ తొలగును.)

1580. శివుడే శివజ్ఞానిగా అమరినందున, తనకు ఉపదేశమొనర్చినది శివుడేనన్న చిత్తముతో (పదిలమైనది) వాని పాదపద్మములందు శరణునొందిన వారికి శివునితో సఖ్యతను, ముక్తిని పొందుదురు. ఇక వారు జన్మరహితమై శివలోకమునకు వెళ్ళి చేరుదురు. (గురోపదేశము అన్నిటిని ఒనగూర్చునదని గ్రహించవలెను.)

1581. నా గురుమండలములో వెలయుచున్న నందీ (ప్రకాశమండలమగు శిరస్సు సహస్ర దళమున) గురువే శివుడని ఉపదేశించెను. గురుమండలమే శివుడై జీవులకు నాయకుడుగా ఉన్నాడు. గురుమండలమే వాక్కు, మనస్సులకు అతీతమైన రారాజు అగును. ఇట్లు గురుమండలములో వెలయు శివంను సామాన్యులు ఎరుగజాలరు.

1582. జీవుని చిత్తము, తన వద్దకు వచ్చునవన్నిటిని తనలో పదిలపరచుకొనును. అనుగ్రహశక్తి దానిలో పదిలమైన వారికి ఆ ఎర్రని ప్రకాశమే అన్నిటిని గ్రహింప జేయును. అదే తత్త్వముతో చిత్తము నంతటిని అన్యములకు కాక శివునికే చోటు గలిగించినచో, శివుడే దానియందు (చిత్తమునందు) కూర్చుండిపోవును!!

(చిత్తమున అన్యవిషయ వాసనలకు చోటునీయక శివుని పదిలము చేయుటయే శ్రేష్టమైన తపస్సు.)

1583. గురుమండలమున స్థిరముగా వెలయుచున్నది శివుడేయన్న స్పృహయూ, ఆ నందీశ్వరుడు అన్నిటికీ నాయకుడన్న సత్యమును ఎరిగినవారు (గ్రహించినవారు)

లేరు. ఆకాశాంశముగా గురుమండలములో నెలకొనియున్నదా శివుడేనన్న ఆనందము పొందినవారికి ఆ నందీయే శివసూర్యుడుగా జ్యోతిరూపమున దర్శన మిచ్చును.

1584. పై మంత్రములో చెప్పినట్లు దైవానుగ్రహ జ్ఞానము పొందుటయూ, దాని ఫలితముగా మోక్షము పొందుటయూ, ఆ శ్రేయస్సుతో (శ్రేష్ఠతతో) మాసులేని నిర్మలత్వము, అజ్ఞానము వీగిపోయిన సత్యజ్ఞానమగు వేదాంతబోధమును (సత్యజ్ఞాన వేదాంత బోధము: "తత్త్వమసి = తత్ + త్వం + అసి = అదే నీవుగా ఉన్నావు" – ఇదే వేదాంత మహావాక్యము – ఛాందోగ్యోపనిషత్తు) మొదలగునవి, గురునాధుడే మానవ చొక్కా ధరించి (శరీరము దాల్చి) రాకుండిన యెడల గ్రహించుట సాధ్యపడక పోయుండునే!!

1585. శివునియందు నిర్విరామ భక్తియూ, దానితో జ్ఞానము పొంది తీరవలె కాంక్ష గలిగిన వైరాగ్యము, ముక్తి పొందుటకు సాధనములగును (సాధనా చతుస్సంపత్తిలో ముముక్షత్వపు కాంక్ష). దీనివలన శివమే తానన్న భావన (చిత్తమున) ముదిరి, ముక్తికి హేతువైన జ్ఞానముదయించి, ఆ జ్ఞానపంట శక్తి అనుగ్రహముతో సులభముగా పండి ముక్తికి సాధ్యమగును.

(శివ గురువానుగ్రహముతో భక్తి, వైరాగ్య, జ్ఞానములతో ముక్తి గిట్టును.)

1586. ఈ భువియందు తాను ముక్తి నొందవలెనన్న ఉద్దేశ్యముతో ఇవ్వబడిన ఈ లింగ (స్త్రీ, పురుష భేదరూపమైన శరీరము) జన్మమున, ముందే నాకు సహకారిగా అమరిన దైవము జ్ఞానము పొందు తరుణములో తానే నాలో దర్శనమయ్యెను. అట్లు నా నాయకుని పొందుటకు తోడుగా ఉండినది నా మనస్సే యగును.

(మనస్సు అఖండమున పదిలమగునపుడు దైవము జీవునిలో దర్శనమిచ్చి అనుగ్రహించును.)

1587. అఖండమైన శివజ్ఞానము తేటయగుటచే శ్రేష్టమైన సిద్ధులు ఒనగూరును. అటువంటి శివజ్ఞానము మరింత పదిలమగుటచే ముక్తి లభించును. శివమైన జ్ఞానమే శివపరముతో ఏకమై (తత్త్వములన్నిటినీ దాటిన జీవాత్మ పరంతో ఏకమగుట) "శివానందము" పొందజేయును.

1588. నేను (రచయిత) శాస్త్రజ్ఞానముతో పొందినవన్నిటినీ అనుభవముల రూపము గ్రహించితిని. శివుని యందు నిలకడ పొంది, శివధ్యానముతో శివును అనుగ్రహము పొందితిని. మూఢుల సాంగత్యము పూర్తిగా త్యజించితిని. కావున ఈ జన్మమును వీగిపోవునట్లు చేసితిని. (అనగా పునర్జన్మ రహితం చేసుకొంటినని రచయిత చెప్పుచున్నారు.)

1589. కర్మజనిత ఫలితముల వలన ఈ భువియందు పుట్టిన సకల జీవులను తాను ధరించియున్న (మోయుచున్నాడు) నాయకుడు ఎట్లు తాను జీవులలో ఇమిడి వృత్తులు చేయుచున్నాడని ఎవరివల్ల గాని, ఏ రూపమునైనను గ్రహించుటకు సాధ్యము కాదు. జీవులు గ్రహించలేనట్లు వారి ఆటంకములు తొలగించి, తన గర్భమున (శివుని) ఉంచుకొన్నది నేను కనుగొంటిని. (224 భువనములకు తాను ఆధారముగా ఉండి, వాటిలోనున్న సకలమును మోయుచున్నాడు.)

## 2. దివ్యపాదములు పొందుట

దివ్యపాదములు తన శిరస్సున దాల్చుట: అనుగ్రహము దీక్ష పొందుట. యోగ పరిభాషలో కుండలినీ జీవశక్తి శిరస్సు సహస్రదళమున చేరియుండి నెలకొనుటయే శివ పరము పొందుటగా చెప్పబడినది.

1590. దివ్యానుగ్రహముతో దైవమునందు పెళ్ళుబుకిన ఎనలేని ప్రేమతో, ప్రేమే స్వరూపముగా గల దైవమునందు నిర్విరామముగా ప్రేమతో స్థితి పొందినచో, ఎర్రని జ్యోతి పైకి ఎగబ్రాకి శిరస్సున నెలకొని (మూలాధార చక్రము నుండి ఎర్రని ప్రకాశము సుషుమ్నానాడి ద్వారా పైకి ప్రాకి భ్రూమధ్యపు జ్ఞాననేత్రము ద్వారా బ్రహ్మరంధ్రమును చేరి అందు నెలకొనుట) కోరిన గురుపదం పొందుటచే బ్రహ్మానందము గలుగును.

1591. దైవము దివ్యానుగ్రహమును ఇచ్చిన వెంటనే (కుండలినీ శక్తి శిరస్సునకు చేరిన వెంటనే) బాహ్యవిషయేంద్రియ వాసనలో మునిగియున్న నాకు జ్ఞానమునొసగిన నా నాయకుడు, జ్ఞానమను కత్తితో అజ్ఞానమును వేరుచేయదగిన సామర్థ్యమునిచ్చి, "ముక్తితో ముగింపులేని కాలతత్త్వమును నీవు జయించుదువు గాక!!"యని ఆశీర్వదించి, భూతత్వచక్రమగు స్వాధిష్ఠానము నుండి (లౌకిక కామ్యములను పురికొల్పు స్థానము) దివ్యశక్తిని (పైకి ప్రాకించి) ఆనందమునొసగునట్లు నా శిరస్సున పదిలపరచెను!!

(క్షీణించదగిన శరీరమును క్షీణత లేనిదిగా మార్చునదే కాలతత్త్వమును జయించుట.)

1592. నన్ను శివుడు వచ్చి ఆకట్టుకొని అతని వలె నన్ను చేసుకొన్న పిదప, శివస్వరూపమైన నాలో పూర్వముండిన నాలుగు తత్త్వములు (బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు) నానుండి తొలగింపజేసి, నాలో సదాశివమూర్తి వెలుగొంది (ఈ తత్త్వమును "అణుసదా శివపదం" అని పేరు) తన యొక్క దివ్యత్వమును నేను పొందితినన్న నిజమును నందీశ్వరుడు నాలో స్థాపించెను.

1593. పై మంత్రములో చెప్పిన అనుభవము పొందిన పిదప, వాక్కు రహితమై ప్రజ్ఞలు రహితమై, తానున్నానన్న భావన కూడ తొలగిపోయి, తేట నీటివలె చలనము లేక

నున్న శివతత్త్వము దాటి, ఎల్లలు లేని శబ్దాది చత్వారి వాక్కులను దాటి (పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి ఆధారచక్ర శబ్దములు) తన స్వరూపముతో ఏకమై జన్మ, మరణముల ఎల్లలగు ప్రణవమును దాటితిని.

(ప్రణవమును దాటుట: తురీయస్థితిని దాటి తురీయాతీత స్థితియగు నాదాంతమున పరమాత్మలో నెలకొనుట.)

1594. దీక్ష ఇచ్చిన గురువు శిష్యుని యొక్క శరీరత్రయకారణ అడ్డంకులకు తొలగించి (స్థూల, సూక్ష్మ, కారణ శరీరములకు కారణముగా యున్నవాటిని) శ్రేష్ఠమైన ప్రాణమును గురువు అందు పదిలము చేసి (ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములను దాటించి) సర్వజ్ఞుడైన, నాయకుడైన, శివునిలో మౌనయోగంలో లయమగు (సమాధి)నట్లు చేసి, నన్ను ఆకట్టుకొని అనుగ్రహించెను.

1595. ముందు మంత్రములో చెప్పినట్లు వాక్కు రహితమైన మౌనానందస్థితిలో పరమానందమును అనుభవింపజేసి, "పశుతత్త్వము"లను (దేహభావన, 'నేను" అను - అహంకారము) తొలగించి, జ్ఞానమును పదిలపరిచి, ఉష్ణరహితమైన చంద్రమండల జ్యోతిలో మనస్సు, వాక్కు, కాయములను వీగిపోవునట్లు చేసి, "పతితత్త్వము" పదిలపరిచి, తన దివ్యచరణములను నాపై దాల్చునట్లు చేసి, నన్ను ఆకట్టుకొనెను. (శివానందము పొందినవారికి వాక్కు, మనస్సు, మొ॥ లౌకిక ఇంద్రియ ప్రజ్ఞలు వీగిపోవును. శివపదము గ్రహించుటకు ఇవి ఏవీ పనిచేయవు. **"నతత్ర చక్షుర్గచ్ఛతి, న వాగ్గచ్ఛతి నో మనః"** - శ్రుతివాక్యము - కేనోపనిషత్తు. కళ్ళు, వాక్కు, మనస్సు, గ్రహించజాలదు.)

1596. నా ఆత్మలోను, దృక్పథములోను, నా శిరస్సుపై దివ్యానుగ్రహమును పదిలము చేసిన పరాపరమగు నా గురునాథుడు అధోముఖ ధోరణిలో నుండు కుండలినీశక్తిని ఊర్ధ్వగతి పొందునట్లు చేసి, సత్యజ్ఞానము బోధించి, ఏఏ వృత్తులు, ఉపాధులు పొందవలెనో అట్లు సక్రమపరచినది ఇతరులకు వివరించ శక్యము కానిదే!!

(గురువానుగ్రహముతో పొందిన దివ్యానుభవము వర్ణించుటకు సాధ్యముగాదు.)

1597. నా శిరస్సుపై తన పాదపద్మములు ఉంచి దీక్ష పొందించి (సంకల్పముతో దీక్ష నొసగుట) జ్ఞాన, అనుగ్రహదీక్ష సలిపి (శిష్యునికి చూపుతో, స్పర్శతో, మనస్సుతో జ్ఞానదీక్ష నిచ్చి పదిలము చేయుట) సర్వవాపియైన నా నందీమహామహుడు గురు రూపమున వచ్చిన నాయకుడు, నన్నాదుకొన్న రారాజు. వాని వలన నేను (రచయిత) నా జన్మకు కారణములైన నా పూర్వకర్మలను రాలిపోవునట్లు (తొలగిపోవునట్లు) దారిని కనుగొంటినే!!

1598. దివ్యచరణముల జ్ఞానదీక్ష జీవుని "శివమయము" చేయును. దివ్యచరణ జ్ఞానదీక్ష

"శివలోకము"నకు చేర్పించును. దివ్యచరణ జ్ఞానదీక్ష జీవుని ఇంతకాలము బంధించి యుంచిన మలమును పోగొట్టును. దివ్యచరణ జ్ఞానదీక్షయే సర్వవ్యాప్తి జ్ఞానమై, సకల సిద్ధులను, ముక్తిని ప్రసాదించును.

1599. శ్రేష్టతతో నెలకొన్న గురునాధుడు అధోముఖ ధోరణిని మార్చి ఊర్ధ్వముఖముగా చేయకుండినచో (లౌకికతత్త్వముతో నున్న జీవశక్తిని శిరస్సులో పదిలము చేయుట) పూర్వకర్మ వాసనలన్నియూ అజ్ఞానముతో కూడి మాయలో ముంచివేయును. అట్లు కాక అమృతము నొసగునదైన (బ్రహ్మానందమును) ఎఱ్ఱటి ప్రకాశముతో నెలకొన్న సదాశివుడు (శిరస్సున) తన దివ్యచరణములను నాపై ఉంచి, తనను వీడకుండునట్లు నన్ను అనుగ్రహించి ధరించెను. (తనను ధరించెనని రచయిత చెప్పుచున్నారు. అఖండములో నెలకొనునట్లు చేయుటయే "ధరించుట".)

1600. శబ్దించు కాలిఅందెలు గలిగిన పాదపద్మములు నా శిరస్సుపై దాల్చునట్లు దివ్యానుగ్రహము పొందితిని. నారాయణుడు కూడ ఎరుగజాలడు. తెల్లని అగ్ని మండలములో నెలకొన్న ఆదిపరాపరుడు నా దేహబంధమును తొలగించి నా సుషుమ్న ద్వారా శిరస్సున ప్రకాశముతో "శివం"గా నెలకొనెను!!
(దివ్యానుగ్రహముతో అరూపమూర్తిగా (నిర్గుణరూపం) అఖండములో ఏకమై శివంగా నెలకొనుట.)

1601. పట్టాభిషిక్తుడైన రారాజు త్రిలోకములను పాలించవచ్చు కాని దివ్యానుగ్రహము పొందిన రారాజు యొక్క ఆనందము ఎల్లలు లేనివి. కిరీటము ధరించిన దేవతలు కూడా ఈశునియందు శరణునొంది దోషరహితము చేసుకొన్న వారే సుమా!!
(ఈశ్వరానుగ్రహము పొందినవారు శాశ్వతానందమును పొందుదురు.)

1602. నా చిత్తమున (మనోమండలమున) ఈశుని దివ్య పాదపద్మములను పదిలము చేసుకొంటిని. దానివలన అసత్యమును (అశాశ్వతము, జడం, మిథ్యా, వికారములు, మొ॥) సత్యమని (శాశ్వతత్త్వమని) మురిపించి కామాగ్నిని పురికొల్పి బాహ్యముగా వెళ్ళదగు మనస్సును నిరోధించి (మనస్సు యొక్క గారడిని), ద్వందములతో పడు అవస్థలను మార్చి, వేదము యొక్క అంత్యము (వేదాంత సారమును) జ్ఞానమును పొందితిని. (గురు ముఖముగా శిష్యుడు పొందదగినదే "తత్త్వమసి" మహావాక్య సారము. "అది (బ్రహ్మం) నీవుగాయున్నావు". జ్ఞానమును పొందిన శిష్యుడు అనుగుణముగా "అహం బ్రహ్మోస్మి" చెప్పగలుగుట. అహం + బ్రహ్మ + అస్మి = నేను బ్రహ్మంగా ఉన్నాను.)

1603. శివగురు దివ్యపాదములు తన శిరస్సుపై ధరించుట వలన నాదము, బిందు (ప్రకాశముతో)తో శాశ్వతమైన ఆనందస్థితిని స్థిరము చేసుకొనగలము. ఇట్లు శివగురు

పాదపద్మములను ధరించు పద్ధతియే బహుప్రాచీనమైన, అనాదిగా వచ్చి జీవుని ఆదుకొని, శాశ్వతానందమును (అమృతత్త్వము) నొసగు తత్త్వమగును.

1604. తన్ను తలచినవారికి రక్షించు మంత్రముగాను, జన్మకర్మలను తొలగించదగు ఔషధముగాను, దివ్యానుగ్రహమును పొందదగు క్రియాఫల రూపముగాను, అనుగ్రహము పొందినవారికి నిలకడయగు (శాశ్వతస్థితి) స్థానముగాను, శ్రేష్టము పొందుటచే గలుగు సౌందర్యముగాను, ముక్తినొసగగల శ్రేష్టతత్త్వముగాను, ఇవ్వగలిగినది నా పరం యొక్క (పరమేశ్వరుని యొక్క) దివ్యపాద పద్మములే అగును.

(శివగురువుగా సకలమును గలుగజేసి, తనలో ఐక్యపరచుకొనుటయే – జీవ ఈశ్వర ఐక్యవాక్యమును చూచించు వేదాంతసారము చెప్పు అధ్యాయము.)

## 3. జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము

జ్ఞాత = తెలుసుకొనువాడు; జ్ఞానము = తెలుసుకొనునది; జ్ఞేయం = తెలుసుకొనబడే వస్తువు; తెలుసుకొనువాడు = ఆత్మ; తెలుసుకొనబడునది = శివజ్ఞానము; తెలుసుకొనబడు వస్తువు = శివం.

1605. ఆత్మ నిర్విరామముగా శివానందమగు “జ్ఞేయం–శివం”నందు నిలకడ పొందుటచే, అనాదిగా నున్న అహంకారమలము (“నేను” అనుభావన) మరిపించియున్నదానిని తొలగించుకొని, తన పూర్వతత్త్వమును విడనాడి, ఆ శివానందములో స్థితి పొందుటయే, తనను విడచి వెళ్ళని శాశ్వతానంద అమృతమును పొందిన స్థితియగును. (జ్ఞః = ఎరుగవలసిన తత్త్వము – “పరం”ను, “చిత్”ను)

(ఆత్మ శివంతో ఐక్యమైన పిదప పొందదగు పరవశత్వ ఆనందస్థితి. ఇది గురుకృప వలన, శ్రవణ, మనన, నిదిధ్యాసనము వలన నిష్ఠ చేకూరునది.)

1606. జ్ఞేయంను (శివంను) గ్రహించినవారికి అన్ని విధములైన సత్యజ్ఞానము వచ్చి చేరును. గ్రహించవలసిన గ్రహించుటచే ఆత్మ, దానివలె (శివం వలె) మారిపోవును. అదే ముక్తియగును. జ్ఞేయవస్తువైన “శివం”ను విడదీయలేని “శక్తి”ని గ్రహించిన వారికి ఆ సమ్మేళనతో ఆత్మజ్ఞానము యొక్క లక్షణమెరుగుదురు.

(“శివం, శక్తి, ఆత్మ”ల నిజతత్త్వమైన “పరతత్త్వ”మెరుగుదురు.)

1607. సత్యతత్త్వమొక్కటే “నేను” అన్న ఆత్మగాను “అతను” అను శివంగాను రెండుగా ఉన్నవి. “నేను” అతనిని నా ప్రకాశములో దర్శించి, నేనుగా ఉన్న పుష్పమును వానికి అర్పించినచో (యోగపరిభాషలో సహస్రదళ పద్మము అధోముఖ ధోరణి నుండి ఊర్ధ్వముఖముగా చేసి పరంలో నెలకొనునపుడు) “నేను” అన్నది “అతను” అన్నది ఇక లేక, ఒక్కటై వెలుగొందునే!! (“అతను” తానైపోవుట ఏర్పడును.)

1608. నా జడతత్త్వములు వీగిపోవునట్లు చేసి శివునికి ఉపకారము చేయదగు ముప్పది ఆరు (36) తత్త్వములు వృత్తులను మార్చి నిలకడ (స్థితి) పొందునట్లు చేసి, లోక ప్రజలు ప్రశంసించునట్లు "పరం" యొక్క వ్యాపకములో నన్ను నిలిపి (యోగ పరిభాషలో: చంద్రమండల (శిరస్సు) ప్రకాశములోనున్న అనంత, అనాధ, అనాశ్రిత, శమన, ఉన్మన శ్రేష్టకళలతో నెలకొనుట), ఆ అనుభవము తగ్గట్లు నన్ను "శివం" అగునట్లు చేసి, నా గురునాధుడు నా అభద్రతాభావనను (మరణభయం) తొలగించి, నన్ను ఆకట్టుకొనెను!! (గురునాధుడు = శివుడు)

1609. శివదీక్షకు ముందు అఖండమును ఎరుగని మూఢులవలె, శివదీక్షకు పిదప స్వల్పజ్ఞానము, అజ్ఞానములను మార్చి అమర్చి అనుగ్రహించిన నా గురునాధుడు నందీశ్వరుడు, తానన్న ఆత్మను "పరం"గా చేసి, "తత్" పదతత్త్వము అన్యము కాదని, "శివం"యే అని బోధపరచెను. (తత్ = అతడు, పరం, శివం, పరమశివుడు.)

1610. చర్మచక్షువులతో చూడబడుటకు అతీతదృశ్యముగాను (ప్రజ్ఞలు) చెవితో వినబడుటకు అతీత ప్రజ్ఞలుగాను నున్న మార్పులేని శివానందము, ఐక్యమై మరలా వీడుటకు వీలుకానిదియు, దోషరహిత (పవిత్ర, మలినము లేని) బంధమును, నాదాంతములో వెలసిల్లిన శుద్ధ జ్ఞానమును, "ఇక చూచి పొందుదువు గాక!!" అని చెప్పి చూపించి నన్ను నందీశ్వరుడు అనుగ్రహించెనే!!
(**"ప్రతిబోధవిదితం మతం – అమృతం"** శ్రుతివాక్యము – ప్రతి చైతన్యస్థితిలోను అమరత్వము గ్రహించినవాడే జ్ఞానం పొందినవాడు. ఆత్మజ్ఞానముతో శక్తి, శివ జ్ఞానముతో అమరత్వము ప్రాప్తించును.)

1611. మౌనస్థితి చేకూరిన వారికి ముక్తియూ గిట్టును (మనోనాశన స్థితిలో). మౌనం చేకూరిన వారికి సకల సిద్ధులు చేకూరును (అణిమాది సిద్ధులు). మౌనం చేకూరిన వారికి మూగభాష వచ్చి చేరును (అజప–సోహం = "సో" ఉచ్ఛ్వాసగాను; "హం" నిశ్వాసగాను; శ్వాసలే ఉపాసనగా మారిన స్థితి). మౌనం చేకూరిన వారికి పంచకృత్యములు చేయుదురే!! (పంచవృత్తులు – సృష్టి, స్థితి, తిరోధానం, అనుగ్రహం, లయములు.)

1612. చూచువాడు, చూచుట, చూడబడునది (బాహ్యప్రపంచము = దృష్యము; చూచుటకు = కన్ను; కన్నుతో మనస్సు చూచువాడు = ఆత్మ లేక సాక్షి) మూడునూ సాధనలు సాధ్యంతో పొందునది. సాధ్యం గిట్టినప్పుడు ఇక సాధనలు అక్కరకు రావు. ఇడ, పింగళ నాడుల ద్వారా వెళ్ళు శ్వాసలను సుషుమ్ననాడి ద్వారా పైకి ప్రాకించి కొండనాలుకపై నాలుగు అంగుళముల నిడివిలో సంచరించునట్లు చేయుటచే, ఇంతవరకు అనుభవించిన విషయానందములు తొలగి, నిలకడగా ప్రకాశ

మండలములో స్థితి పొంది, గురుపాద కృపతో బంధముల నుండి విముక్తి పొంది, ఇక జీవన్ముక్తులగుదురు.

(ప్రాణజయము పొంది, సమాధి స్థితిలో, మనోనాశముతో, బంధముల నుండి విడిపోయిన స్థితిలో ప్రకాశముతో కలిసి జీవన్ముక్తులగుట.)

1613. స్థూల స్వరూప సిద్ధములగు బిందు, నాదము, సతాక్యము మూడునూ శ్రేష్టమగు శక్తి నెలకొనియున్న గుర్తింపు అంశములు. దీనిని బాగుగా గ్రహించిన పరమ జ్ఞాని శబ్దించుచూ నాట్యమాడు శివుడే "జ్ఞేయం"గా తలంచి తన తత్త్వములు (శరీరతత్త్వములన్నింటిని త్రోసిపుచ్చి) కాదని, మూలపురుషుడైన "పరం"తో "జ్ఞాత"గా కలిసి ఏకమైపోవునే!!

**("బ్రహ్మవిత్ ఆప్నోతి పరమ్"** – శ్రుతివాక్యము. బ్రహ్మ లేక ఆత్మజ్ఞానము పొందిన వాడు తానే "పరం" అగును. ఆత్మ = బ్రహ్మం.)

## 4. సన్న్యాసము

దైవమునందు ప్రేమ, ప్రీతితో సాధారణరీతిలో కోరి తన బుద్ధితో ఆశాపాశములను తొలగించుకొని, పిదప వివేకముతో ఆశలకు మూలకారణమైన ఇచ్ఛను (ఆసక్తి) త్రెంచుకొనుట.

1614. జననమరణ ద్వంద్వములను తొలగించి, లౌకిక సుఖభోగములను సహజసిద్ధముగా సన్న్యసించుటకు (విడనాడుటకు) అనుగ్రహించిన ప్రకాశరూపుడైన వానిని నిర్విరామముగా నాదోపాసన చేయువారలకు పరమశివుడు శివలోకప్రాప్తి అనుగ్రహించును!!

1615. జననము (కర్మఫలిత శరీరము), మరణము (ప్రారబ్ధకర్మలు ముగియుటచే) పలు విధ అజ్ఞానముల వలన యమ, నియమాదులను మరచి, కర్మలు చేయుట వలన ఏర్పడినవే. ఆవరణ తొలగి (తిరోధానం – అజ్ఞానము తొలగి) శివానుగ్రహముతో శక్తి శ్రేష్టముగా వచ్చి నెలకొనుటచే కర్మలు, బంధములు తొలగిన జీవునిలో ప్రకాశజ్యోతి ఏర్పడి అనుగ్రహించబడును.

1616. (శివుడు) ధర్మాత్ముడు, జన్మమరణములు లేని అనాదియైనవాడు, తల్లితండ్రి లేనివాడు – ఏకాత్ముడు, నివాసము స్మశానము (జీవులకు అంతిమ నివాసము), భుజించుటకు భిక్ష, వాడు సన్న్యాసి అని ఎరుగండీ!! కావున బంధములను తొలగించుకొన్నవాడు, జన్మరహితము చేసుకొన్న ఉన్మత్తుడగును. (పిచ్చివాడు – లౌకికదృష్టిలో పిచ్చివాడు.)

1617. అనాదియైన శివుడు జీవుల సద్గతి ఉద్దేశించి కొన్ని ధర్మబద్ధమైన తత్త్వములను ఏర్పరచెను (నియమాదులు). అట్లే విషపుముల్లు వలె ఉన్న కొన్ని నిషేధ తత్త్వములు కూడ ఏర్పరచెను (యమము). ధర్మనిబద్ధతలో నిలవకపోయినచో (పాటించ

కుండినచో) ఆ విషపుముల్లు హృదయమున గుచ్చుకొని (నిషేధములు ఏర్పరచు కీడు) మహాకీడు కలిగించును. అట్లే ధర్మనిబద్ధతతో మెలగువారికి ఎటువంటి కీడు (హాని) కలుగదు సుమా!!

1618. నిరంతరము నాట్యమాడుచూ దివ్యప్రకాశమండములో వెలయుచున్న ఆ దివ్య పాదములను నేను ఎన్నడూ వీడక తపస్సు చేయుతున్నవాడను. కావున అజ్ఞానముతో ఏర్పడు కీడును, నియమాదులచే ధర్మనిబద్ధతతో గలుగు శ్రేష్టమును నేను గ్రహించి యుండుట వలన ఈ దేహపంచేంద్రియ విషయ వాసనలచే గలుగు ఫలితములకు బాధ్యుడు కాను.

1619. జ్ఞానసాధన చేయువాడు (గురుముఖముగా జ్ఞానసాధనలు గ్రహించి, అజ్ఞాన, అపోహలు తొలగించుకొని జ్ఞానముతో శిరస్సున ప్రకాశమును దర్శించుట) కోరి సాధనలను నిర్విరామముగా చేయుచూ సూక్ష్మమును గ్రహించి ఆ జ్ఞానసాధనతో (శిరస్సున) ఆకాశమండలములో నీలిరంగు పుష్పము (జ్యోతి) పుష్పించుటచే, దాని వలన తను అనుగ్రహమును, శక్తిని ప్రకాశములో దర్శించెను. ఇకపై జ్ఞానసాధకుడు దర్శించిన అనుగ్రహములో నెలకొనియుండెను.
(సాధన, సాధ్యంలో సాధ్యం గిట్టిన పిదప ఇక సాధనలతో పనిలేదు. సాధకునకు "సాధ్యం"మే అంతిమ లక్ష్యము, గమ్యము కూడ. "శివం" అంతిమ లక్ష్యము. సాధనలన్నియూ తనంతట తామే వీగిపోవును. చర్య, క్రియా, యోగము, జ్ఞానములో నాల్గవదైన జ్ఞానము ఫలసిద్ధి పొందిన పిదప మొదటి మూడుతో ఇక పనియుండదు. ఆ జ్ఞానమే అన్నిటిని సమకూర్చును. మిథ్యాతత్త్వములన్నీ తొలగిపోయి సత్య స్వరూపమును దర్శింపజేయును. శిరస్సే ఆకాశతత్త్వము.)

1620. సహజముగా ఆ (పరమేశ్వరుడు) మహామహుడు రాగద్వేషములు లేనివాడు – దేశ, కాల, వస్తువులకు అతీతుడు. త్యాగశీలుడు (కర్మఫల త్యాగము చేసిన వారికి – ఈశ్వరార్పణ బుద్ధితో నిష్కామకర్మలు చేసినవారికి) మిక్కిలి ఆప్తుడు. అన్నియూ తానైనవాడు (సర్వజ్ఞుడు). కావున ఎందును ఆసక్తిరహితుడు. అజ్ఞానమను చీకటిని తొలగించుకొన్నవారికి తన జ్ఞాననేత్రముతో అనుగ్రహించువాడు. భూతత్వమగు కామఇచ్ఛలను త్యజించిన వారికి తన పాదపద్మములు వారి శిరస్సున మోపును. (అనగా వారు శివసతాఖ్యము పొందుదురు.)

1621. పాము ఒకటి (కుండలినీ సర్పము – శరీరము అన్ని క్రియలకు ఇదే శక్తి), పడగలు ఐదు (పంచజ్ఞానేంద్రియములు – కన్ను, చెవి, త్వక్, ముక్కు, నోరు), వాటి పడగలు నాల్గింటితో (మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములగు నాల్గింటితో జ్ఞానేంద్రియ వాసనలగు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను గ్రహించి ప్రాణశక్తి

యగు జీవాత్మకు తెలియచేయుచున్నది) పుట్టలో ఇమిడి నెలకొనియున్నది. రెండుగా శివతత్త్వమే ఆత్మ వ్యాపకములో ఇమిడియున్నది. స్థూల, సూక్ష్మ శరీరములుగా రెండుగా ఉన్నది. ఇంద్రియ వాసనలకు అతీతముగా ఎదిగిన కుండలినీ జీవశక్తియే (తన ఆటలను నిలిపి) శిరస్సున శ్రేష్ట శివంతో నిలిచి ఏకమైనపుడు ద్వంద్వశరీరము వీగిపోయి, ఏకశరీరమై శాశ్వతత్త్వమును పొందును.

(శిరస్సున చిదాకాశ తత్త్వములో పరముతో నెలకొనునపుడు అఖండ వ్యాపకమై, ప్రపంచమును త్యజించుట ఏర్పడుచున్నది.)

1622. అన్నింటినీ త్యజించినవారికి (సన్న్యసించినవారికి) పునర్జన్మ రహితమొనర్చుటలో ఆదిపరాపరుడుగాను (శివుడు), శివుని ఏకముగా గ్రహించి పరిపక్వత పొందిన వారికి బహుసులభ లభ్యుడుగాను, శివానుగ్రహమే జీవుల పరిపక్వతకు తగ్గట్లు వారికి అనుగ్రహమొసగుటలో బహువిధ ప్రయోజనములతో కూడినదైన శివతత్త్వం మన ఊహకు అందగలదో? (అందజాలదు.) (శివం నందు లయం కోరినవారికి లయమునూ, భోగము కోరినవారికి భోగమునూ, పదవి అధికారములు కోరిన వారికి అధికారమునూ అనుగ్రహించగలది శివతత్త్వము.)

1623. దేహభావన తొలగిపోయిన వెంటనే గమ్యం దర్శనమగుటచే, నవద్వారముల గుండా ఏర్పడిన ప్రజ్ఞలన్నియూ విడిపోవును. చంద్రమండలముతో సంయమము పొందుటచే దేహమను చొక్కా అనుభవము ముగిసిపోయినది. తీపిని రుచి చూపిన ప్రపంచము ఇక చేదుగా మారిపోవును. ఇంతవరకు దేహముతో చెలాయించిన ఆత్మ శిరస్సున పరముతో చేరి సహస్రదళమును దేవాలయముగా మార్చివేసెను. (సహస్రదళ పద్మములో ఆత్మ పరముతో నెలకొనునపుడు ప్రపంచవాసనలన్నియూ వీగిపోయి చేదగును.)

## 5. తపస్సు

తనలో మరిగి ఇమిడియున్న సత్యతత్త్వమును గ్రహించగోరి, దైవమునందు నిర్విరామముగా కొనసాగించు ధ్యానస్థితియే తపస్సు.

1624. శివుని యందు మనోలయము పొందిన ఉత్తములు దుఃఖభరితమైన ప్రపంచమును చూచి చలింపజాలరు. వారికి యమభయముండజాలదు. వారికి కష్టనష్టములు ఉండవు. రాత్రి, పగలన్న భేదభావనలుండవు. బంధములు తొలగించుకొన్న వారగుటచే వారికి మరే విషయములు లాభించజాలవు.

(దుఃఖమయ ప్రపంచములోనున్ననూ దుఃఖరహితమొనర్చునది దైవమునందు లయము పొందుటయే.)

1625. నా శ్రేష్టమగు ప్రాణము శరీరముతో కలిసి జన్మించిన తీరు పరిశీలించినచో అది

శరీరముతో కలిసి ప్రపంచమును అనుభవించుట కొరకేయని గ్రహించదగును. తపస్సు యొక్క శ్రేష్టతత్త్వమును శివానుగ్రహము పొందినవారికే తప్ప ఇతరులు గ్రహించజాలరు (ఎరుగలేరు). (తపస్విలు ఈ ప్రపంచము నందు జన్మమునకు, పరిస్థితులకు మూలకారణము స్వీయకర్మ ఫలములేయని ఎరుగుదురు.)

1626. ప్రపంచసుఖభోగముల కొరకు వెంపర్లాడుచూ, వాటి కొరకు భిక్షమెత్తినట్లు తిరుగాడుచున్న మనుజులు జన్మకారణమును ఎరుగనివారే సుమా!! ఇట్లుకాక దైవమును మరువక నిర్విరామముగా తపస్సు చేయువారికి శ్రేష్టముతో కూడిన సంపదయూ, పునర్జన్మ రహితము నొనగూర్చు మహత్వమును పొందుదురు!! (నిర్విరామముగా దైవమునందు చిత్తమును పదిలపరచి, తపస్సు చేయువారు ఇహములోనే అన్నీ పొందగలరు.)

1627. ఒంటరిగా ఉండి, శివతత్త్వముపై ధ్యాస వదలక, పటిష్టమైన దీక్షతో, శ్రేష్టమైన తపస్సునందు వైరాగ్యము బూని చేయువారికి, వారి మనస్సు మార్చవలెనని ప్రయత్నించు ఇంద్రుడు, దేవాది దేవతలు ఎవరూ వచ్చిననూ, వారి మనస్సు మార్చుకొనక, వాటికి లొంగక, దృఢసంకల్పముతో శివునియందే చిత్తముంచిన వారగుదురు.

(ఇతర ప్రలోభాలకు లోనుకాక, సదా శివధ్యాసలో ఉండువారు.)

1628. పరిపక్వమొందిన ఆత్మలను శీఘ్రముగా వచ్చి ఆదుకొను ఆ చంద్రమండల నాయకుడు (శివుడు) తపస్సు చేయనివారికి మరిగియుండియూ, తపస్సు చేయు వారికి ప్రత్యక్షముగాను దర్శనమిచ్చును. ఇది అంతర్ముఖులకే తప్ప బహిర్ముఖులకు దర్శనమివ్వడు. అంతటా వ్యాపించిన ప్రకాశ కిరణములతో కూడిన జటాఝూటము గలిగినవాడు, బంగారువంటి ఛాయ గలిగినవాడు, శ్రేష్టతపస్సంపన్నులకే తప్ప ఇతరులకు దొరకనివాడు.

1629. పరిపక్వమొందిన ఆత్మలు పొందు పరసుఖమును ముందే వచ్చి నియతితో అనుగ్రహించిన నా నాయకుడు (శివుడు) ముక్తినొసగు కాలతరుణమును గ్రహించి వచ్చి ఆదుకొనును. అట్లు ఆ ప్రాణనాధుడు వచ్చి ఆదుకొనుట మనోదృఢ సంకల్పము వలనే ఏర్పడినది సుమా!!

1630. తపస్సంపన్నులు ఎట్టి పరిస్థితులలోనూ తమ స్థితిని దిగజార్చరు. నాయకుని దర్శించిన తపస్సంపన్నులు, మదగజ పరివారములతో రాజ్యాంగముల కొరకు పోరు సలుపు యుద్ధసమయములలో మధ్యలోనున్ననూ, అనుగ్రహముతో పొందదగు జ్ఞానమును, జ్ఞేయమును (శివుని పొందదగినది) గురించి నిశ్చలమైన సంకల్పముతో ఉందురు.

1631. శాస్త్రపఠనమను డాంభికము వదిలిపెట్టి, క్షణకాలమైనా బాహ్యముగా వెళ్ళు మనస్సును అంతర్ముఖముగా చేసినచో, ఆ దృష్టి పచ్చి చెట్టుపై ఒక మేకును కొట్టినట్లు గట్టిగా పదిలమగును (పచ్చి చెట్టుకు మేకు సులభముగా దిగును). ఆ పదిలము పలు జన్మకర్మ ఫలితములను సమూలముగా తొలగించివేయును.

1632. జ్ఞానము పొందగోరు వారందరికి తపస్సు ఆవశ్యకమే. జ్ఞానసమాధి చేకూరిన పిదప ఎటువంటి సాధనలు అక్కరలేదు. సహజ మార్గమనుసరించు గృహస్థులకు తపస్సు అక్కరలేదు (అనగా జాగ్రదావస్థలో చిత్తమును చిదాకాశమునందు పదిల పరచి తన్ను తాను మరచియున్న స్థితి – జాగ్రదాతీతము). తన్ను తాను తెలుసుకొన్న వానికి (స్వరూప తత్త్వమును గ్రహించిన వారికి) తపస్సు అక్కరలేదు.

(చిదాకాశములో పదిలము: అనాత్మయను శరీరమును (దేహేంద్రియ మనోబుద్ధులు) వీడి, తాను నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్తపురుషుడని తన ఆత్మలో నెలకొనియుండుట. మిథ్యాతత్త్వం వీడి సత్యతత్త్వంలో నుండుట.

స్వరూప తత్త్వము: తాను ఆత్మయని, బ్రహ్మతత్త్వమని, ఆత్మ, బ్రహ్మం ఏకమని తాను ఎప్పటికీ, ఎట్టి పరిస్థితులలోను దేహభావన కాదని గ్రహించిన స్థితి. దీనినే **"బ్రహ్మభావమ"**ని శ్రుతులు ఘోషించుచున్నవి.)

## 6. తపస్సును దూషించుట

తపస్సు ఒక క్రతువు. తపస్సు ఓర్పును, సహనమును చేకూర్చుతుంది. "కష్ట సహిష్ణుత్వం ఇతి తపః" అని చెప్పబడియున్నది. చర్య, క్రియలు, ఎంత ముఖ్యమో, తపస్సు కూడా అంతే ముఖ్యము. తపస్సు, స్వాధ్యాయనము (శాస్త్రపఠనము), సత్యవ్రతం, మనుజునికి అత్యంత ముఖ్య నియమములు. కావున తపస్సును అక్కరలేదని చెప్పుట దూషణమే అగును. ఏది అక్కర, అక్కరలేదు, ఎప్పుడు అనే విషయములో బహుసూక్ష్మమైన తేడాను సాధకుడు గ్రహించవలెను. కొన్ని అపోహలు, అధ్యాసలు దూషణకు దారితీయును. కావున బహుజాగరూకతతో ఉండవలెను.

1633. ప్రాణముతో ప్రాణముగా నెలకొన్న దైవము నీలో పదిలమైన పిదప ఎటువంటి శాస్త్రపఠనము అక్కరకు రాదు. సత్యస్వరూపుడే (శివుడే) నీలో పదిలమైన పిదప ప్రేమ సలుపునదేమి ఇకలేదు. తనను మరచిన సమాధి గిట్టిన పిదప ఇక మరణమనునది లేదు. మనస్సు బాహ్యావిషయ వాసనలపై వెళ్ళక నిరోధించిన స్థితి పొందిన పిదప మరెక్కడికి వెళ్ళవలసినది లేదు. (మనోనిగ్రహము, సమాధి చేకూరిన వారికి ఇక ద్వంద్వములు లేక ఏకమైన స్థితి పొందుదురు.)

1634. సత్యతత్త్వము గ్రహించిన పిదప శాస్త్రపఠనఘోష అక్కరలేదు. సత్యస్వరూపములో సమాధి చేకూరిన పిదప నాదసామీప్యం కూడ అక్కరకు రాదు. ఇట్లు నిలచిన

మనస్సులో ఎటువంటి మలిన, వికారములుండవు (బాహ్యావిషయములపై వెళ్ళనందున). చిత్తము లేదు – ఇక ఆలోచనలు లేనందున (ఆలోచనలు ప్రవాహము లేనందున – ఇష్టాఇష్టములు, రాగద్వేష, కామక్రోధములు వీగిపోయిన స్థితి – నిష్ట.)

1635. సత్యమైన తపస్సు బూనినవారే నిజమైన తపోఫలము పొందుదురు. ఇటువంటి తపోఫలము పొందినవారే వారి శిష్యులకు సత్యతత్త్వమును బోధించగలరు. వీరే సనాతనమైన, అనాదియైన, సూక్ష్మదేహతత్త్వము స్ఫురింపజేయగలరు. కావున వీరే భూలోకమునకు, ఊర్ధ్వలోకమునకు శ్రేష్టులగుదురు. (సూక్ష్మదేహతత్త్వ బోధనలలో ప్రకాశమును పొందిన దేహము – దేహిగా మారుట – దివ్యశరీరమగుట.)

1636. శివానుగ్రహముతో ఏకత్వముగా నిలచిన తపస్సు ద్వారా పరనాద స్వరూపుని (శివుని) పాదపద్మములను దర్శించితిని. చాలాకాలము నిలచిన ఆ తపస్సు ద్వారా "శివగతి"ని పొందితిని. ఇట్లు అన్ని ఇంద్రియకరణములను వశపరచుకొని ఇమిడి చేయునదే తపస్సు. ఇట్లు కాక, ఇంద్రియవాసనలకు వశపడిపోయిన ఈ లౌకిక ప్రజలు ఏ తపస్సు చేసినట్లు?

1637. దృఢసంకల్పముతో మనస్సులో చెలరేగు సప్తసముద్రములగు వాటిని దాటి (సప్త సముద్రములు: రాగ, ద్వేష, మోహ, మద, చింత, తాపములు, అపోహలు, మొ॥), తపస్సంపన్నుల దారిలో వెళ్ళి, వారితో సఖ్యత పొంది, వారి మాటలు విని, వారిని అనుసరించినచో, పునర్జన్మ రహితము పొందుటయే కాక, నందీశ్వరుని (శివుని) ముఖాముఖిగా దర్శనము పొంది శివతత్త్వము పొందుదురే!!

1638. మనోకోశము నుండి (దృఢసంకల్పముతో) జ్ఞానఖడ్గము తీసి, ప్రపంచ వాసనలను (తొలగించి) సమూలముగా నరికి, శివునియందు అన్యోన్యముగా ఇమిడి, బాహ్యముగా వెళ్ళు పంచేంద్రియ విషయవాసనలను నిరోధించినచో తపస్సు నందు దర్శించదగు శివప్రకాశమే తన ప్రకాశముగా మారును.

1639. ఇట్లు జీవుని బుద్ధిలో జ్ఞానముగా నెలకొన్న దైవము, జీవునిలో భక్తిని ఏర్పరచును. పైబడి దాసానుదాసులను (జ్ఞానులను – తపస్సంపన్నులను) అనుసరించుటచే ముక్తియూ గిట్టును. అట్లు "మునీశ్వరుడు" (ముని, ఋషి) అన్న పేరు పొందించి "సత్" పదమునందు (సత్యమునందు) నెలకొనునట్లు చేయునది ఈ తపస్సు అగును.

1640. పత్రములు, పుష్పములు సేకరించితిని. పుష్పములను మాలలుగా కట్టితిని నా దైవము కొరకు. ఆకాశము నుండి గంగాదేవి సహజ ప్రవాహమును చూడకుంటిని. శ్రేష్టములగు గ్రంథపఠనములు కూడ ఎటువంటి ఫలితమొసగలేదు. కాని నా శిరస్సున చంద్రకళ వెలయునట్లు చేసినది ఈ తపస్సు ఒక్కటేయని గ్రహించితిని

సుమా!! (బాహ్యక్రియలేవి శివదర్శన మొసగుజాలవు.)

1641. వ్యాపించిన ప్రకాశ కిరణములు గొప్పగా అమరిన ఆ మహాతపస్వికి, ఎటువంటి కీడు, దుఃఖములు ప్రాప్తించకుండునట్లు ఈశుడు రక్షించి అనుగ్రహించును. ఎటువంటి కీడు గలుగుజేయని తపస్సు యొక్క మహత్వమును పరిశీలించినచో అది దేహమును పునర్జన్మ రహితము చేసినది, మనోఏకాగ్రత, మనోనిగ్రహముల వలనే గలిగినవని బోధపడును. (తపస్సంపన్నులకు వారి కఠిన మనోఏకాగ్రత, మనోనిగ్రహముల వలనే అన్ని అనుగ్రహములగు దుఃఖరహితము, భక్తి, ముక్తి, పునర్జన్మ రహితములన్నీ చేకూరును.)

1642. నాడుల (ఇడ, పింగళ నాడుల, సుషుమ్నానాడి) చలనములు గ్రహించి తపస్సు చేయనివాడు, కడుపుకు ఆహారము కొరకు వెంపర్లాడుచూ దుఃఖపడునట్లు, నదిలో మొసళ్ళకు భయపడి పారిపోయి ఎలుగుబంటికి ఎదురైనట్లే (చేటుకు ఎదురగుట) అగును. (నాడుల చలనము ఎరుగని తపస్సును – శాస్త్రపఠనము లేని తపస్సుగా కొన్ని గ్రంథములలో చెప్పబడినది.)

1643. శివయోగము ద్వారా "శివఫలము" పండి, అది తినుటకు పరిపక్వమైనట్లు, శరీరమున ప్రాణశక్తి పలు విధములుగా సంచరించుచున్ననూ, దానిని సక్రమపరచి, ఆ ప్రాణశక్తి భ్రూమధ్యమున వెళ్ళు సుషుమ్నానాడిలో స్థితి పొందునట్లు చేసినవారికి శ్వాసచలనములు తగ్గిపోయి, ఊర్ధ్వసహస్రదళమున లయమైపోవును.
(సహస్రదళమున మనోలయము పొందినవారికి శ్వాసచలనము తగ్గిపోవును.)

1644. చిత్తము శివమైనపుడు శివుని కొరకు చేయు తపస్సు ఇక అక్కరలేదు. చిత్తమే శివమైన శివయోగుల సాంగత్యము గలిగినచో, వారియొక్క చిత్తము శివమగుటయే కాక, సిద్ధియూ, ముక్తియూ గలుగును. కావున చిత్తమే శివమగుటచే పూర్వము చేసిన తపస్సు యొక్క ప్రతిఫలమగును.

## 7. అనుగ్రహముతో జ్ఞానము ఏర్పడుట

1645. శివమహామహుని (పరమేశ్వరుని) అనుగ్రహము గిట్టినచో గొప్ప సంపద గలుగును (ధనలక్ష్మి). వాని అనుగ్రహముతో శ్రేష్టమైన జ్ఞానము గలుగును. వాని అనుగ్రహముతో పేరు, ప్రతిష్ఠలు వచ్చిచేరును. వాని అనుగ్రహముతో మనము వానివలె దైవత్వము పొందనగును. (భక్తుడు కోరినట్లు అనుగ్రహించబడును.)

1646. చర్యలు ద్వారా జ్ఞానము బహిర్గతమగునని తలంచి తమిళ మండల క్షేత్రములలో తిరిగితిరిగి వేసారి అయినారు కొందరు. కాని జ్ఞానులు ఈ సత్యమును తమ దేహములోనే నున్న ఏకమైన శివుడే పలువిధములుగా పంచకృత్యములు చేయుచున్నాడని గ్రహించి, ఉన్న స్థలమునందే అఖండమును ధ్యానించి,

మహత్త్వమును పొందిరి.

1647. ఈ భువిలో పుణ్యము, పాపము అని రెండు గలవు. ఇవియే సుఖము, దుఃఖములకు కారణమని జ్ఞానులు గ్రహించెదరు. ఇట్లు గ్రహించినదే, వీటికి కారణతత్త్వములను వేరుతో పెకలించి వేసినచో, అటు పిమ్మట కర్మఫలితములు తొలగిపోయిన, వీగిపోయిన స్థితిలో దైవమును గ్రహించి పట్టుకొందురు గాక!!

1648. కర్మఫలితములు ముగియు తరుణములో, తొలగిపోయిన స్థితిలో శివుడు తన శక్తిని స్థాపించి ఆదుకొని అనుగ్రహించును. ఆ స్థితిలో ఎటువంటి ప్రపంచ ఆటంకములు గలుగకుండా చూచి, నిలబడి, జీవుని వెనుక (మరిగియుండి) నుండి అనుగ్రహించి పునర్జన్మను తొలగించును. వాడే ముందునుండి (బహిర్గతమై) ముక్తి నొసగి నన్ను ఆదుకొనును.

1649. శివుని అనుగ్రహముతో కొందరు దైవరూపము పొందిరి. శివుని అనుగ్రహముతో కొందరు దైవతత్త్వములన్నిటినీ పొందిరి. శివుని అనుగ్రహముతో కొందరు సంపూర్ణ కర్మఫలరహితులై యుండిరి. శివానుగ్రహ మహత్త్వము చెప్పవలెనన్న పైన చెప్పిన వారందరూ శివలోకవాసులైరి. (శివానుగ్రహముతో శివలోకమే పొందగలము.)

1650. పుణ్యఫలమనునది నా తండ్రియైన శివమహామహుని (పరమేశ్వరుని) దివ్యపాద పద్మములను దాల్చుటయే. దీపపు ప్రకాశము వలె నాలో జ్ఞానము ఉదయించెను. భూలోకములో జ్ఞానులుగా ఉండడము, ఊర్ధ్వలోకములో దేవతరూపములో ఉండుటయో అన్నియూ నా తండ్రియగు శివుని అనుగ్రహము పొందినపుడే గలుగును.

1651. శరీరమను రథమును మనస్సు అను రథసారథి నడుపగా, క్షీణింపదగిన తత్త్వములతో నిండిన ఈ జీవుల బుద్ధిలో ప్రకాశమును నింపి నిలిచిన నిర్మలుడైన సదాశివుడు గురువుగా వచ్చి అనుగ్రహము పారించినచో, శివజ్ఞానుల కూటమిలో ఒక్కడైన (జ్ఞాని) ఇతను అతనుగా "శివరూపము" పొందును.

1652. శివలోక జ్ఞానముతో జన్మించినచో, జన్మమెత్తిన శరీరముతోనే శివలోకము చేరదగు శ్రేష్ఠమైన తపస్సును బూనుదురు. శివలోకములోని హరుని పాదపద్మములను బొందుదురు. శివలోకములోని శివశక్తుల అనుగ్రహమును బడయుదురు.

1653. సూర్యుని ఆకర్షించదగు సూర్యకాంతి రాయి (చెకుముకి రాయి – Flint) అగ్ని తత్త్వముతో నిండినది. చంద్రుని ఆకర్షించు చంద్రముఖిరాయి ముత్యమువంటి నీటితత్త్వమును గలది. అగ్నిరాయి మంటలను ఏర్పరచు (అగ్నిరాయి భూతత్త్వముతో నిండిన మంట – లౌకిక మోహమును ఏర్పరచును) తత్త్వము గలది. కాని శివతత్త్వమే అన్ని తత్త్వములను తనలో లాగుకొని ఎప్పటికి చల్లని అందమైన తత్త్వముగా వెలుగొందువాడు. (యోగ పరిభాషలో "శివం" శరీరములోని సోమ సూర్యాగ్నుల

నాడుల తత్త్వములను తనలో ఇముడ్చుకొని వాటికి అతీతముగా శిరస్సున సహస్ర దళమున వెలయువాడు.)

1654. నా లక్ష్యరూపుడు, వానితో సఖ్యత, నా గురునాధుడైన శివునిలో నెలకొనుటకు నేను వెతకుదును గాక!! వెతకి శివునితో చేరుదును గాక!! వానితో కూడి శబ్దించుచున్న పాదపద్మము చేరువరకు, శరీరమును వదిలి ప్రాణమును విడదీసి, వానిని గ్రహించు వరకు ప్రయత్నించుదును గాక!! (సత్యస్వరూపుని గ్రహించుటకు మిథ్యాతత్త్వము లన్నిటిని త్రోసిపుచ్చుట చెప్పబడినది.)
(రచయిత శ్రీ తిరుమూలర్ మహాయోగి, మహాసిద్ధుడు, మహాజ్ఞాని. తను ఒక పామరుడు వలె, లోక సంగ్రహము కొరకు, వారి ఉన్నతి కొరకు, సామాన్య ప్రజవలె వాపోయి, తన వినమ్రతను చాటుకొంటున్నారు.)

## 8. నకిలీవేషము (పోలి)

1655. నకిలీవేషము వేసుకొని ఆడంబరములతో తిరుగాడి కడుపును ఆహారములతో నింపుకొందురు. ప్రయోజనములు లేని వేషధారణలతో లౌకికులతో తిరుగాడుదురు మూర్ఖులు! పోలి వేషముతో శివుని తలంచి నాట్యమాడి, పాటలు పాడి, కన్నీరు కార్చి, పిచ్చివానివలె సంతసించి, ఎంత వెతికిననూ శివుని పాదపద్మములను చూడజాలడు సుమా!!

1656. శివజ్ఞానము లేని జ్ఞానశూన్యులు నకిలీ వేషధారులు – పోలి స్వామీజీలు ఈ దేశమునందు హీనవృత్తులు చేయుచూ, భిక్షగైకొని కాలము వెళ్ళబుచ్చుచుండుటచే దేశము, దేశప్రతిష్ట దిగజారును. కావున ఇటువంటి హీనప్రవృత్తులను మానుకొనడము మహాశ్రేయస్కరము.

1657. సుఖములుగాని, దుఃఖములుగాని ఆయా దేశప్రజలు చేసిన పుణ్యకర్మములు, పాపకర్మములు బట్టి ఏర్పడునని పెద్దల వాక్కు. కావున రాజ్యపరిపాలన చేయు రాజు దీనిని బాగుగా గ్రహించి, ప్రతిరోజు రాగ్యములో ఇటువంటి నకిలీ వేషధారులను సక్రమ, మంచి మార్గములో నడిపించినచో దేశమునకు క్షేమమేర్పడును.

1658. నిమ్నకులస్థులు ఉన్నతస్థితి పొందగోరి వేషము ధరించుదురు. దాసానుదాసులుగా తరతరాలుగా వచ్చువారు దైవప్రీతి పొందవలెనన్న కోరికతో వేషము ధరించుదురు. నిషిద్ధకర్మలు, కీడుకర్మలు చేయు చండాలురు ఎప్పటికైనను వారిని బహిష్కరించే తీరవలెను. (ఆచరించు నిషిద్ధ, కామ్య కర్మలు వలననే చండాలురులు కాని, జన్మతగా కాదని గ్రహించవలెను.)

1659. నకిలీవేషము ధరించి తపస్సు చేయువారు నరకమునకు పోవుదురు. అట్లు పోలి తపస్సు చేయువారు ఏ కాలముననైనను పుణ్యపురుషులు కాలేరు. పోలి తపస్సు, సత్యమైన తపస్సు ఒనగూర్చు కొన్ని భోగములను సమకూర్చి, భోగ్యములను అనుభవింపజేయవచ్చును. కాని సత్యజ్ఞానముతోనే తపస్సు యొక్క నిజమైన లాభములు సిద్ధించును.

1660. నకిలీ వేషము ధరించి కడుపును నింపుకొందురు. కాని నిజమైన తపస్సును బూనినవారు సహజముగా దేహపరిరక్షణ కొరకు భిక్ష స్వీకరించుదురు. (జ్ఞానులు భిక్ష స్వీకరించవచ్చునను ధర్మము గలదు – ప్రతి గృహస్థుడు జ్ఞానులకు భిక్ష నొసగవలెనను ధర్మనియతి గలదు – ఇది శాస్త్రసమ్మతము.) నకిలీవేషమును నిజ వేషముగా వేసుకొన్ననూ, ఆ వేషమునకు తగిన న్యాయము చేకూర్చినచో ఆ నకిలీ వేషధారణయే ఉన్నతికి దారితీయును.

(ఏ మాత్రముననైన సత్యమునకు దారితీయు జీవుని బుద్ధిలో గలుగు సద్భావన వాని ఉన్నతికి దారిచూపి సద్గతిని పొందించును.)

## 9. తపోవేషము

తపస్సు యొక్క చిహ్నములు: విభూది, రుద్రాక్షము, కుండలములు, మొ॥ ధరించుట.

1661. తపశ్రేష్టులే అసలైన, ఉన్నత వేషము ధరించినవారు. అట్లుకాక నకిలీవేషధారణతో ఉన్నవారు హత్య చేయగలిగిన మహాపాతకులు. అంతటి నీచులు వేషమునకు తగనివారు. నిజతపో వేషములు నిజతపస్విలుకే తప్ప ఇతరులు అర్హత లేనివారే.

1662. శివచిహ్నములలో మొట్టమొదటిది విభూది ధారణ, చెవులకు (రాగి) తామ్ర

1663. కుండలములు, కంఠమున రుద్రాక్షమాల, ఇవి వేద ఆగమములను పఠించినవారి చిహ్నములు. ఇక శివయోగి సాధనలను పరిశీలించినచో, అవి యోగి నడుమునకు గట్టి వస్త్రము, చేతికి పెద్ద సంచి (జోలి), నెమలి పింఛము వలె విస్తరించిన జటాఝూటము, శరీరమంతటికి పూసిన విభూది ధారణ, చేతిలో కపాలము (భిక్షకు), కుడిచేతిలో నిడివైన బెత్తమువంటి కర్ర.

1664. చెవులకు ధరించిన కుండలములు, కంఠమున రుద్రాక్షమాల (32 రుద్రాక్షలతో చేసినది) శివ, శివనాదఘోష, శబ్దించు తెల్లని శంఖం, ఆరుపూసలతో కూర్చిన మణికట్టు (కామాది షడ్అరిష్టములను కట్టడి చేసిన గుర్తుగా) కపాలపాత్ర, పాదుకలు, శివయోగాసనము చేయుటకు తగిన ఆసనవస్తువు (జింకచర్మము/దర్భాసనము/ఉన్ని /కంబలి వస్త్రము, మొ॥) చేతిదండలకు గట్టి పట్టి, ముంజేతికి యోగదండములు మొ॥ పది సాధనములు శివయోగికి చిహ్నములు.

## 10. విభూది

1665. జంధ్యము, పిలక ధరించుటలోని సత్యమును మూఢులు ఎరుగజాలరు. జంధ్యము (త్రినాడులు – ఇడ, పింగళ, సుషుమ్న నాడుల సమ్మేళనము) ధరించుట వేదాంతమును తెలుపునది. ఇక పిలక వేదాంతజ్ఞానమును గ్రహించుటకు తెలుపునది (బ్రహ్మజ్ఞానమును చిత్తమునందు సదా పదిలపరచుకొన్నవారు). బ్రహ్మస్వరూపమును (శివతత్త్వము) ద్వైతరహితమైన ఏకములో అనగా పరము, జీవాత్మ ఏకముగా దర్శించువారు – వీరే బ్రహ్మదర్శకులు. ఇట్లు ఏకముగా దర్శించువారు ఓంకారముతో బ్రహ్మముతో ఏకమగుదురు.

(ఓంకారము నాదముతో బ్రహ్మంతో ఏకమై తెల్లని ప్రకాశముతో నెలకొనుటయే, తెల్లని విభూదిని ప్రతీకగా శైవులు భావించెదరు.)

1666. ఎముకలను (పుర్రెలు మాలను) మాలగా ధరించిన శివమహామహుడు కవచము వలె (వస్త్రము వలె) తన శరీరమంతటికీ విభూది రాసుకొనియున్నాడు. అట్లే మీరు కూడా రక్షించు రక్షణ కవచముగా విభూదిని మీ శరీరమంతట రాసుకొని సంతోష పడినచో, మీకు ఎప్పటికీ ఎటువంటి కీడులు గలుగజాలదు సుమా!! ఇంకా పూర్వ పాపములు తొలగి, శివగతి పొందుదురు. అన్నిటికన్నా మిన్నగా శివమహామహుని శింగారమైన పాదపద్మములను చేరుదురు.

1667. రావి, మర్రి, అత్తి వృక్షముల సమిధలు హోమగుండములోని అగ్నిలో రూపము మారి (మండి బూడిద అగుట) విభూదిగా అగును. ఇటువంటి విభూది ధారణ చేసినవారు నిరవయుడు (అవయవము లేనివాడు), నిర్మలుడునగు (మలినము లేనివాడు) శివుని పాదపద్మములను గ్రహించి అనుభవించు నియతి గలవారగుదురు. మరియూ వారే రూపుమారిన బ్రహ్మకులస్థులగుదురు. (సదా బ్రహ్మజ్ఞానములో నుండుటచే.)

## 11. జ్ఞానవేషము

జ్ఞానము సాధనలతో జ్ఞానముపొంది అనుగ్రహింపబడినవారి వేషధారణ

1668. శివజ్ఞానము లేక శివజ్ఞానుల వలె వేషము బూని తిరుగాడువారు నరకమును పొందుదురు. సత్యమైన శివజ్ఞానము గలిగినవారు శివజ్ఞానుల వేషము ధరించకున్ననూ, వారు ముక్తపురుషులే అగుదురు. శివజ్ఞానము పొందవలెనన్న తీవ్రకాంక్ష గలవారు దిగంబరుడైన శివుని (అవయవమాన, అవమాన అభిమానములు లేక సదా ప్రకాశములో నెలకొన్నవాడు) ప్రకాశములో సర్వ కాలములయందు ఇమిడియుందురు.

1669. కపట జ్ఞానులు వేషములు ధరించి ఏ లాభము పొందలేరు. సత్యజ్ఞానులు అనుగ్రహము పొందియుండుటచే వారు ఏ వేషము ధరించుటలో ఆసక్తి చూపరు. పరిపక్వమైన బుద్ధి, భావనలు గలిగినవారై సంప్రదాయ పద్ధతులను రక్షించువారై యుందురు. అట్లు అనుభవజ్ఞానము పొందిన సంప్రదాయ జ్ఞానులు మౌనం వహించియుందురు.

1670. శివజ్ఞానులకు గాని, శివయోగులకు గాని బాహ్యాడంబరములు, బాహ్యసాధనలేవీ అక్కరకు రావు. వారి బాహ్యసాధనలగు నాలుగు (4) విభూది, రుద్రాక్షలు, జటాఝుటము, పంచాక్షరి గాని ఏవీ అక్కరలేదు. లేనననగా వారెల్లపుడు అసాధరణమైన, ఉత్కృష్టమైన పరమాత్మను వారి అంతరమున నెలకొల్పియుందురు. (వారు పరబ్రహ్మంను అంతరమున పదిలపరుచుకొని, అందే రమించుచుందురు.)

1671. మంత్రదండములను త్రిప్పు జ్ఞానులు (మాయవిద్యలు నేర్చిన పోలి జ్ఞానులు) ఉరికంబము చుట్టూ అరుస్తూ తిరుగుచున్న కుక్కలు వంటివారు. పైగా వారు గ్రద్దలువలె అమాయక ప్రజలను పొడిచి పొడిచి తినువారు. కాని శివజ్ఞానులు శరీరముతో ఉన్ననూ, పంచేంద్రియప్రజ్ఞలు గలిగియున్ననూ, భోగములను విడచి (ఆసక్తి లేక కోరికలను త్యజించినవారు) చచ్చినవారివలె తిరుగాడుదురు.

1672. సత్యజ్ఞానమును పొందినవారు ఎప్పటికీ సత్య శివజ్ఞానులే. అనుగ్రహము పొందిన వారు, దానిని సదా అనుష్ఠించువారు, శివుని తమ చిత్తమున సదా నిలుపుకొన్నవారే సత్యజ్ఞానులు. అట్లు కాక, ఆ అర్హత లేనివారు శివజ్ఞానులు కాజాలరు సుమా!! వారు ధరించిన వేషములు శివధారణ కాజాలదు. శివ పాదపద్మముల అనుగ్రహము పొందినవారే సత్యజ్ఞానులు తప్ప మిగతా వారెవరూ శివదాసులు కాలేరు.

1673. (వేషము యొక్క తత్వమెరిగి ధరించినవారికి అదే వారికి జ్ఞానసాధనమగునే!!) సత్య శివజ్ఞానులకు వారి వేషమే అందము చేకూర్చి లాభించును. తాను ధరించిన వేషతత్త్వమెరుగుటచే అదే కాలానుగుణముగా శివయోగమగును. శివజ్ఞాన సాధనమై జ్ఞానమును అనుగ్రహించును. ఇది ఎరుగనివారికి (జ్ఞానసాధన యని) వట్టి వేషము మాత్రము మిగులును.

1674. శివజ్ఞాని జ్ఞానముతో జ్ఞానమగు నాల్గవస్థితిని చేరుకొనును (నాలుగు స్థితులు – చర్యలు, క్రియలు, యోగము, జ్ఞానము). అఖండ స్వరూపుడగు శివుడు జ్ఞాని శరీరములో నెలకొనుటచే జ్ఞాని శరీరమే ఒక శివాలయమగును. శివజ్ఞాని మౌనముతో ముక్తుడు, సిద్ధుడుగా వెలసిల్లును (నిష్ఠతో చేకూరినది). ఇట్లు కాని మిగతా తపస్వులకు ఇది చేకూరునా? (చేకూరదు). (మౌనం = ప్రణవోపాసనలో అంత్యంతిక స్థితి మౌనము.)

1675. తానన్న భావన తొలగిపోయి, తానే శివమైన స్థితిలో ప్రపంచములోని త్రికాల, ప్రకృతి తత్త్వములన్నీ తానెరుగు సామర్థ్యము పొంది, పరిపక్వమొందిన జీవులకు తన దృష్టితోనైన, స్పర్శతోనైన జ్ఞానమునొసగి (లోకసంగ్రహనార్థము) ఆదుకొని, అనుగ్రహించు తత్వము పొందినది మౌనముతో (ప్రణవసిద్ధి) నందీశ్వరుని అనుగ్రహము (పదముక్తి = శివపదవి) పొందినవారికే సాధ్యమగును.
(శివజ్ఞానులు అంతిమముగా పొందదగు శివపదవి (సాధక ముద్రలు) చెప్పబడినది.)

## 12. శివవేషము

శివవేషము: తాము శివుని నిష్ఠలో నిలబడు శివమై, తమకని ఏ కర్మలు లేనివారై యుండుట.

1676. తమను శివునికి అర్పించుకొని అన్నీ ఆతని ఆజ్ఞలన్న భావనలో ఉండువారు: శివానుగ్రహముతో దేహము, వస్తువులు, ఆత్మ మూడింటిని హరునికి (శివునికి) అర్పించిన దాసులై, తన శరీరములో వెలుగుచున్న హిరణ్య (బంగారు) ప్రకాశమును గ్రహించి, చీకటియగు అజ్ఞానము తొలగించుకొని కర్తృత్వరహితముగా యుండువారే తేటనైన జ్ఞానము పొందిన శివవేషధారులు.

1677. దేహమునకు ధరించు వేషధారణలన్నియూ ప్రకాశతత్త్వమగు ఆత్మకు చెందజాలవు. దేహమును విడచి ప్రాణము వెళ్ళిపోయినపుడు దేహమునకు ఇన్నాళ్ళు అంటిపెట్టుకొనియున్న వేషములన్నియూ నిష్ప్రయోజనమై తొలగిపోవును. దేహము అసత్తు వస్తువనియూ (అనాత్మ తత్త్వము), ఆత్మ సత్తువని గ్రహించనివారు, సముద్రములో అటుఇటు తేలియాడుచూ అల్లాడు కర్రదూలము వంటివారే సుమా!! (పునరపి జననము, పునరపి మరణములో కొట్టుమిట్టాడువారే!)

1678. అహంకారమునకు కార్యరూపమైన మోహమును విడచి, దాని పర్యవసానమున గలుగు చీకటియగు అజ్ఞానమును తొలగించుకొని, బలిష్టమైన మనస్సు యొక్క ఆలోచనా ప్రవాహమును విడచి, మీనమువంటి కన్నులు గల స్త్రీల ఆలింగనములను త్యజించి, సజ్జన సాంగత్యములో తమను ఐక్యపరచుకొని, వారివలె తామై, తమకని ఎటువంటి చర్యలు లేక ఉందురు శివవేషధారులు.

1679. ఓ మానవులారా!! పరిగెత్తుచున్న గుర్రమును (ఆలోచనా ప్రవాహమును కట్టడి చేయు) కళ్ళెముతో గట్టిగా పట్టి నిలపండి!! వేషములు మాత్రము ధరించి ఏమి సాధించగలరు? వద్దు. ప్రయోజనములేని వేషములను వీడండి. మన నాయకుడైన నంది (శివుడు) నెలకొనియున్న గురుమండలములో (శిరస్సు – సహస్రదళమున) మనస్సును (బుద్ధిని) పదిలపరచండి. మీరు కోరి వెతుకు అమృతస్వరూపుడగు (బ్రహ్మానంద స్థితిని) శివుని చేరగలరు. (శ్వాస చలన కట్టడి హఠయోగ సాధన.

కాని యోగసాధనకు మనోలయము. మనోలయము ద్వారా ప్రాణణ కట్టడి - మనస్సు ఆలోచనా ప్రవాహమును నిలిపి, సహస్రదళమందు పదిలమగునపుడు అమృతస్థితి - బ్రహ్మానందస్థితి పొందుట. ఇదే శివజ్ఞానుల స్థితి.)

## 13. అపక్వుడు (అర్హత లేమి - పరిపక్వత లేమి)

1680. అజ్ఞానమును జ్ఞానము పొందిన గురువు వద్ద తొలగించుకొనరు. అజ్ఞానమును వీడని గురువుని ఆశ్రయింతురు. అది ఒక గ్రుడ్డివాడు మరొక గ్రుడ్డివానితో కలిసి ఆడునట్లే. ఇట్లు ఇద్దరు గ్రుడ్డివారు కలిసి గోతిలో పడునట్లే సుమా!!

1681. మనుజుడు తలంచువన్నింటిని కారణశరీరము ప్రతిఫలింపజేయును. ఆలోచనా మహాప్రవాహముతో ఉన్నవారు కారణశరీరము యొక్క నీడను కూడ కనీసము (తత్వమును) ఎరుగజాలరు. తలంపులతో, చిత్తభ్రమతో ఏర్పడిన ఫలితములను (మంచి, చెడు) కూడ మార్చుకొనజాలరు. అజ్ఞానముతో కామ్యఇచ్ఛలకు తగినట్లు ప్రవర్తించి తలంపులను మరింత పెంచుకొని జటిలము చేసుకొందురు. (బాహ్యావృత్తుల తలంపుల ప్రవాహమే చిత్తభ్రమను ఏర్పరచి చిత్తశుద్ధి, చిత్తఏకాగ్రత లను చెడుపును.)

1682. (పరిపక్వము లేనివారు గ్రహించజాలరు) జాగ్రత్త పడుటకొరకు - "ఏయ్, ఏయ్" అని పిలిచినా "ఏమిటి?" అని మారు పలికి అడగకుందురు మూర్ఖులు (ఇది లోక ప్రవర్తన). శిశువు నోట్లో తల్లి స్తనముంచినచో అమృతము స్రవించును. ఇది కూడ గ్రహింపజాలని మూర్ఖులు గలరు. అట్లు తల్లివలె అమృతమునొసగి ఆదుకొనునట్లు చేయువాడు ఆ నిరాకారుడే అగును (శివుడే).

1683. దృఢనిశ్చయముతోనున్న ఓ గొప్ప మనస్సు గలవారా! వినుము. నోటితో ఒకటి చెప్పి, మనస్సుతో ఏదో ఆలోచించి, చేతితో ఏదో చెయ్యకండి సుమా!! త్రికరణ శుద్ధితో ఆచరించినచో నీవు శివాగ్నిని పొందినవాడని నేను చెప్పుదును. అట్లు తేటనైన పరిపక్వమొందిన వారిని పిచ్చివారితో చేరికయని ఎవ్వరు చెప్పరు సుమా!! (మనోవాక్కాయ శుద్ధియే - త్రికరణశుద్ధితో చేయవలెననుట.)

1684. పంచమహా పాతకములు (హత్య, స్తేయం (దొంగతనము), కల్లు (మద్యము సేవించుట), కామము (కామవాంఛతో చెడుపుట), అసత్యము (పలుకుట) మొదలగునవి చేయువారు భయపడునట్లు తగిన సమయములో రాజు వారిని మహాదండన నొసగి రాజ్యమునుండి వెడలగొట్టవలెను. అట్లు చేయనిచో దేశము క్షామము యొక్క కోరలకు చిక్కుకొని మొత్తము దేశము పాడైపోవును.

1685. తపస్సు నందు గొప్ప స్థితి పొందిన తపస్సంపన్నులకు కూడ వారికి ప్రారబ్ధకర్మలు వలన కొన్ని కీడులు గలుగును. ఇవి శివానుగ్రహముతో తొలగిపోవలెసినవే! (పూర్వ

కర్మలన్నీ అనుభవింపబడి నాశనమై జన్మరహితం ఏర్పరచుటకే అని గ్రహించవలెను). ఇది దేవతలు కూడ ఎరుగజాలరు. తపశ్శక్తితో ఉన్నత స్థితి పొంది ఎరుగనివారు మరలా జన్మదుఃఖములలో పడి అవస్థలు పడుదురు.

1686. అపరిపక్వమొందిన వాని గుణములు తెలుపునది: ఇతరులను కోపించుట, వ్యర్థమును ఆలోచించుట, కామ్యకర్మలు చేయుట, తినుట, రుచి చూచుట, కీడులు గలిగించుట, హీనపరచుట, పొగడుట, తన గొప్పలను చాటుకొనుట, మొదలగు తొమ్మిది గుణములు దైవచింతనలకు పనికిరావు.

1687. సూర్యోదయము రుచించదు. చిదాకాశములో రమింపజాలరు. అనుకూలత్వ మొనర్చు చిదాకాశ దృష్టిలో నిలువజాలరు. బహు జాగరూకతో బాహ్యా సంచారములను మాని, అంతర్ముఖులు కావండి. అంతరమున దృష్టి సలుపుటచే చీకటిని (అజ్ఞానము) తొలగించదగిన ప్రకాశము (శివప్రకాశము) అదే అగును సుమా!!

1688. అనాదిగా వచ్చుచున్న దేహాభిమానమును ("నేను, నాది" అన్న మమకారము, రాగ ద్వేషములు) అహంకారమలమును తొలగించుకొనుటకు మార్గమెరిగి, మల దోషములను నివృత్తింప జేయుటకు, ముక్తి కొరకును, ఉన్నతి కొరకు పాటుపడని పిచ్చి శిష్యులకు (దృఢ, మనోవైరాగ్యములు లేనివారు) జ్ఞానమును బోధించరాదు. (దేహ, ప్రపంచ బంధములను వీడక, ముక్తియందు ఆసక్తిలేని శిష్యులకు జ్ఞానమును బోధించరాదన్న సూచన.)

1689. శరీరములో స్థితి పొందిన పంచమలములను (అహంకారము, కామ్యకర్మలు, మాయ, మాయేయము, తిరోధానం (ఆవరణశక్తి – సత్యమును మరిపించుట)) తొలగించుకొనుటకు ఆసక్తి లేనివాడు, శరీరములో నెలకొనియున్న కామాది షడరిష్టాల (6) (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాదులు) నుండి విడిపించుకొననివాడును, అబద్ధాలాడువాడును, జన్మమరణములందు వెరవనివాడును అగు శిష్యుడు జ్ఞానదీక్షకు అనర్హుడని త్రోసిపుచ్చవలెను. (ఇటువంటి పరిపక్వత లేని శిష్యుడు జ్ఞానమునకు, శిష్యరికమునకు కూడ అర్హుడు కాజాలడు.)

## 14. పక్వుడు

గురు ఉపదేశానుసారమును పాటించి, పరిపక్వత పొందినవాడు – అర్హుడు

1690. పూజపునస్కారములు చేయు పరిపక్వత గలిగిన శిష్యుడు వేద (శ్రుతి) ఆగమముల విధానములను గ్రహించి, ఎటువంటి దోషములు లేని శ్రేష్టమైన గురువు దరిచేరి, అతని ప్రీతి పొంది, గురోపదేశము పొంది, పాటించి, సద్గతి పొందవలెనను

ఆసక్తి గలవాడగును. ఇట్లు కానివారు కోరి నాశనము తెచ్చుకొనువారే సుమా!!

1691. ఓ పరమాత్మ!! నిన్ను కోరి (జ్ఞానతృష్ణతో) నా చంచలనములను వీడితిని సుమా!! ప్రపంచ (లౌకిక) జీవితములో అలుపెరిగితిని. ఇక ఎవరితోను సఖ్యత చేయజాలను. నా పూర్వజన్మ కర్మవాసనా ఫలితములను నానుండి తొలగించి, జన్మజదుఃఖములను నివారించి, సంతోషముతో నన్ను ఆకట్టుకొని అనుగ్రహించుదువు గాక!!

1692. శిష్యుడు చంచలములలో నున్నప్పుడే శ్రేష్టజ్ఞానమును (పరవిద్య) బోధించు తత్వమగు జ్యోతిప్రకాశమును గురువు శిష్యుని శిరస్సు – సహస్రదళమున పదిలపరచి, బాహ్యా, చంచలముగానున్న ఆలోచనలను ఏకపరచి (చిత్త ఏకాగ్రత పొందించి) తనతో ఇమిడియున్న శిష్యుని అనుగ్రహించి ఆదుకొనును. (పరిపక్వత పొందిన శిష్యునికి గురువు జ్ఞానదీక్ష నొసగుట.)

1693. పొందితే శ్రేష్టగురువును (శ్రోత్రియ బ్రహ్మనిష్ఠయైన గురువును – అనగా వేదాంత వేదాగమములు బోధించు గురువు) పొందవలె. నీ వద్దనున్న వస్తు, దేహ, ఆత్మలను గురువుకు కానుకగా ఇవ్వవలె. నిర్విరామముగా అతను చూపిన మార్గములో నిలువవలె. అట్లున్నచో తేటనైన "శివపదము" గ్రహింపబడును. (శిష్యుడు గురువుకు తన త్రివిధములు దేహ, ఆత్మ, వస్తువులను అర్పించుకొనవలెను.)

1694. స్వాతీ, విశాఖ నక్షత్రములు వృశ్చికము, కర్కాటకము లగ్నములతో కూడిన శుభ దినములందు గురుముఖముగా ఉపదేశము పొంది, శాస్త్రోక్తముగా, నియతితో, న్యాయముగా సత్యస్వరూపుని గ్రహించవలెనే తప్ప దీనికి కారణములు ఆదిని గ్రహించ సాధ్యము కాదు.

1695. గురు ఉపదేశముతో గలిగిన ఉపాయమను రత్నము (మహామణి)ను పొంది, చిత్తమునందు పదిలపరచుకొన్నచో, ప్రకాశముతో నిండిన దైవదర్శనముచే, కోరి తెచ్చుకున్న కోరికలు, బలిష్టమైన ప్రారబ్ధకర్మలు తొలగిపోయి, పరమాత్ముని దివ్య పాదముల నాదస్పృహ గలిగి అనుగ్రహము పొందగలరు.

1696. పరిపక్వమొందిన శిష్యుని గుణములు తెలుపునది: సత్వగుణవంతుడుగా, పరతత్వమును (శివతత్వమును) ధ్యానించి, ఆస్తికుల ఎన్నో బోధలతో చెప్పబడిన వాటిలో (ద్వైతభావనలలో చెప్పినవాటిలో) సత్యమును గ్రహించి, ప్రారబ్ధముతో ముడివేయబడిన జన్మకారణములకు భయపడి, శ్రేష్టమైన ధర్మమార్గమును ఆచరించువాడే సత్యమైన పక్వపడిన శిష్యుడగును.

1697. ప్రపంచమునందు సత్తుగా (నిత్యముగాను, క్షీణత లేకయున్నది), అసత్తుగా ఉన్నది (అనిత్యముగా, క్షీణింపదగినది) ఏవని ఆలోచించి గ్రహించి, చిత్తములో శివుని పదిలపరచి శివానుగ్రహమును గ్రహించి, నిత్యమైన శివునియందు శివజ్ఞానము

పొందగోరి, సవినయముతో, ఆనందమే రూపముగా నున్న శివశక్తియొక్క ఇచ్ఛకు తగినట్లు తనను పరిపక్వపరచుకన్నవాడే సత్యశీలుడైన అసలైన శిష్యుడు.

1698. గురునాధుడే దైవమును గ్రహింపజేయగలడు: గురునాధుడు తన పాదపద్మములు శిష్యుని శిరస్సుపై దాల్చుటకు అనుగ్రహించుటచే ఆ గురురూపమును తన శిరస్సుపై దాల్చి ధ్యానించుటచే, మాయాజన్మము తొలగిపోవునట్లు చేయగల అనుగ్రహశక్తిని పొందినవాడే జ్ఞానశిష్యుడగును.

1699. శిష్యుడు శ్రేష్టమైన అనుభవ జ్ఞానములో మరింత ఆసక్తుడైనందున, ఇంతవరకు తాను అనుభవింపని మధురానుభూతి శివునియందు గలుగగా, తానింతవరకు పొందని శీలము (సత్ప్రవర్తన), నోము (వ్రతము/దీక్ష/సాధన), ప్రేమ (జ్ఞానేచ్ఛ), జ్ఞానము నగు నాల్గింటిని పొందెను. దివ్యపాదపద్మముల దీక్ష జ్ఞానానుభవము పొందిన పిదప పొందినదని గ్రహించును.

1700. గ్రహింపబడజేయునది శక్తినిపాతము (శక్తి అనుగ్రహము) మెండుగానున్న పరిపక్వులకే పొందనగును. పశువులకు (పశుతత్వము – దేహభావనయున్న ప్రజలందరిని పశుతత్వమే యని పిలువబడుట) సహాయపడు పరాశక్తిని తలంచి, ఒకదానికొకటి పరస్పరము బంధము లేని, పరాపరుడైన శివుని ఎల్లలు లోపలికి శిష్యుని తీసుకువెళ్ళి గుణములను తెలుపు తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణములను గ్రహించునట్లు అనుగ్రహించును.

(గురువు తన శిష్యునకు సహస్రదళమును, దానికి అవతలయున్న ద్వాదశాంతమును,

తూర్పు – తత్పురుషం – భ్రూమధ్యము

దక్షిణము – అఘోరం – కుడిప్రక్క

ఉత్తరము – వామదేవం – ఎడమప్రక్క

పడమర – సద్యోజాతం – వెనుక మెదడు

ఊర్ధ్వం – ఈశానం – శిరస్సుకు పైన

శివుని పంచముఖ తత్వములను బోధించి పరం – శివుడు; అపరం – శక్తితో కూడిన శివం తేటపరచి గ్రహింపజేయునది.)

1701. (గురువు శిష్యునికి అఖండమును బోధించి, అందు స్థితి పొందునట్లు చేయునదే సత్యమైన జ్ఞానబోధ) ఉపదేశ గురువు పాదములకు ప్రణామమొనర్చి, ఐదు విధములైన నమస్కారములు జేసి (ఏకాంగము, త్రియంగము, పంచాంగము, సాష్టాంగము, అష్టాంగం), తన దోషములు తెలియజేసి, గురుమహత్వమును స్తుతించి, వేడుకొనిన పిదప, గురువు తన శిష్యుని “బంధములతో నిండియున్న ఈ శరీరము నీవు కాదని, నీవు అఖండ స్వరూపుడైన “శివం” అగుదువు” అని

బోధించి, శివతత్త్వజ్ఞానం, ఆత్మతత్త్వజ్ఞానం ఒక్కటేనని గ్రహింపజేయునదే శుద్ధ సన్మార్గ ఉపదేశ గురువు యొక్క లక్షణము.

(**"తత్త్వమసి"** = తత్ + త్వం + అసి = అది (శివం) నీవుగా ఉన్నావు; **"జీవో బ్రహ్మైవ నా పరః"** = జీవుడు బ్రహ్మ వేరుగాదు, ఒక్కటే; – శ్రుతివాక్యములు)

1702. కోరికలు త్యజించుట, ఆసక్తి రహితమే వేదాంతమగుటచే, ప్రపంచ వ్యవహారములకు సహాయకారిగా యుండు ఇంద్రియముల చేష్టలను మార్చి, శైవసిద్ధాంత తత్త్వమును అవలంభించుచూ, ఆసక్తిని త్యజించిన శ్రేష్ట వేదాంతియగు గురుపాదములందుచేరి నమస్కరించు సంప్రదాయ తత్వమున్నవాడే శ్రేష్టమైన పక్వమొందిన శిష్యుడగును.

1703. సత్వగుణము, సత్యము, దయ, వివేకము, ప్రేమ గుణములతో ఉపదేశ సద్గురువు పాదములను వీడక నీడవలె వెంటాడి, సత్యమైన పరబ్రహ్మజ్ఞానమును తేటగా గ్రహించుటచే మహా అద్భుతములే గలుగును. ఇటువంటి అన్ని అర్హతలున్న శిష్యుడే పరిపక్వమొందిన శిష్యుడు.

(సత్వగుణము: ఎల్లప్పుడు ఆధ్యాత్మిక చింతన, సన్మార్గ ప్రవర్తన, ధర్మనియతి.
సత్యము: ఎల్లప్పుడు సత్యమునే పలుకుట, సత్యం ఆచరించుట.
దయ: భేదరహితం, జీవరాశులందు దయాభావన.
వివేకము: నిత్యానిత్య వస్తువివేకము, ఆత్మానాత్మ వివేకవైరాగ్యములు.
ప్రేమ: అన్ని జీవరాశుల యెడ ప్రేమభావన.
తేటగా గ్రహించుట: నిస్సంశయ జ్ఞానము గలుగుట (గురువు తోడు వలన).
మహా అద్భుతములు: సత్యజ్ఞానము పొందుటచే బంధములు వీడిన (కోరికలు, ఆసక్తిరహిత) స్థితిలో ఆత్మానందము – అమృతత్వము పొందుట. పరిపక్వమొందిన శిష్యుని లక్షణములు చెప్పబడినది.)

ఆరవ తంత్రము సమాప్తము
ఓం తత్సత్
సర్వం శివార్పణమస్తు

ఈ గ్రంథరాజమును తొమ్మిది తంత్రములుగా విభజించబడియున్నదని ముందే వివరణలు చూచితిమి. మొదటి ఐదు తంత్రములు వరుసగా వేదముల వలె కర్మకాండను బోధించునదియూ, కడపటి నాలుగు తంత్రములగు 6,7,8,9 జ్ఞానకాండను బోధించుచున్నది.

తిరుమంత్రమాలయని పిలువబడు ఈ **తిరుమంత్రము**ను రచించిన శ్రీ తిరుమూల నాయనార్ 63. నాయన్మార్లులలో బహుశ్రేష్టుడు మరియూ ప్రఖ్యాతి గాంచినవారు. స్వయముగా పరమేశ్వరుని నుండే ఉపదేశములను పొందినవారు. ఇతను బోధించిన ధర్మార్థమోక్ష సాధనలు ఎంతటి ఉన్నతమో, అట్లే ఒక సాధారణ ప్రజ పరిపక్వతను పెంపొందించుకొనుటకుగాను కొన్ని శివపూజలు కూడ ముఖ్యత్వము ఇచ్చి ఉపదేశించి యున్నారు.

మొదటి తంత్రములో జీవనమునకు అతిముఖ్యముగా పాఠించవలసిన ధర్మమార్గమును బోధించి, రెండవ తంత్రములో దైవ (ఈశ్వర) తత్త్వమును, దాని శ్రేష్ఠతను చెప్పి, దైవమును పొందు మార్గమును మూడవ తంత్రములో విశదీకరించి, పిదప నాల్గవ తంత్రములో క్రియాపద్ధతిలో చక్రములను (యంత్రములు) గీసి, ఎట్లు పూజించవలెననే పద్ధతులను బోధించి, ఐదవ తంత్రములో మతసంస్కార భేదములను విశదీకపరచి, గురు ముఖముగా పొందవలసిన శ్రేష్టతను నొక్కివక్కాణించి, ఆరవ తంత్రములో గురుతత్త్వమును విశదీకరించి, శివుడే గురువుగా వచ్చి పరిపక్వత పొందిన భక్తుని ఆదుకొని, అనుగ్రహించునని బోధించియున్నారు.

ఇక ఏడు, ఎనిమిది, తొమ్మిది తంత్రములలో వేద, ఆగమ విధివిధానములను వివరించి చెప్పుటలో శ్రీ తిరుమూల నాయనార్ తనకు సరిపాటి మరెవ్వరూ లేరని నిరూపించుకొనిరి. ఇక తంత్రములోనికి వెళ్ళుదుము గాక...

# ఏడవ తంత్రము

## 1. ఆరు ఆధారములు

1704. నాలుగు రేకులుగల పద్మం రూపములో నుండు మూలాధారస్థానం, ఆరు రేకులు గల పద్మం రూపములో నుండు స్వాధిష్ఠానము, పది రేకులు గల పద్మం రూపములో నుండు మణిపూరకస్థానం, పన్నెండు రేకులు గల పద్మం రూపములో నుండు అనాహతము, వీటికి పైన పదహారు రేకులు గలిగిన పద్మంబోలిన విశుద్ధిస్థానం, మొత్తము ఐదుస్థానములతో మూలాధారస్థాన దర్శనము నుండి ముగియు స్థానములో రెండు రేకులతో నుండు పద్మము ఆజ్ఞాస్థానమును దాటినచో పరమశివుని పాద పద్మములను దర్శించనగును.

పైన చెప్పినవన్నియూ జీవుని వెన్నెముకలోని ఆధారచక్ర స్థానములు.

| **ఆధారచక్రములు** | **చక్రబీజాక్షరములు** | **చక్ర ఆకారం** | **అధిపతి** | **శరీరములో** |
|---|---|---|---|---|
| 1. మూలాధారం | వ,శ,షస (4) | త్రిభుజం | విఘ్నేశ్వర | కుండలినీ స్థానం |
| 2. స్వాధీష్టానం | బ,భ,మ,య,ర,ల (6) | చతురస్రం | బ్రహ్మ | లింగస్థానం |
| 3. మణిపూరకం | డ,ఢ,ణ,త,థ,ద,ధ,న,ప,ఫ (10) | అర్థవృత్తం | విష్ణువు | నాభిస్థానం |
| 4. అనాహతం | క,ఖ,గ,ఘ,ఙ,చ,ఛ,జ,ఝ,ఞ,ట,ఠ (12) | త్రిభుజం | రుద్రుడు | హృదయం |
| 5. విశుద్ధి | అ,ఆ,ఇ,ఈ,ఉ,ఊ,ఋ,ౠ,..,..,<br>ఏ,ఐ,ఓ,ఔ,అం,అః (16) | షట్కోణం | మహేశ్వర | కంఠము |
| 6. ఆజ్ఞా | హ, క్ష (2) | వృత్తం | సదాశివుడు | భ్రూమధ్యం |

1705. పరమశివుడు పదహారు కళలకు అతీతస్థితిలో వెలుగుచున్నది వర్ణించబడినది: నాదతత్త్వములో ఇమిడిన పన్నెండు కళలతో కూడిన సూర్యమండలము (శిరస్సున ఇవి సమాంతరముగా నున్నది), మేధస్సు మొదలైన పదహారు కళలతో కూడిన చంద్రమండలమునకు (ఇది మూలాధారము నుండి ఆజ్ఞాచక్రము వరకు నిలువున ఉన్నది) ఆఖరిదైన నాదాంతములో (శిరస్సునకు పైన – శరీరము ముగియుచోట) వెలయు పరాశక్తితో బుద్ధిపూర్వకముగా ప్రసాదతత్త్వముతో వికారరహితమైన అద్వైత, ఆధారతీతస్థితిలో పరమశివుడు గ్రహింపబడును.

1706. ముందు మంత్రములో చెప్పిన ప్రసాదతత్త్వములో ముందు, వెనుక, క్రింద, మీద అన్న తారతమ్యములకు అతీతముగా ఒకే ప్రకాశమును దర్శించునపుడు, అతనే తానైన స్థితిలో భగవద్గుణములు ఆరును (ఆసక్తిరహితము, ఈశత్వము, కీర్తి, ఐశ్వర్యము, జ్ఞానము, వీర్యము) జగత్తంతా వ్యాపించి, నిండిన పరమాత్మ నల్లటి మేఘములను మోయు కల్పవృక్షమువలె (కోరినవన్నీ అనుగ్రహించి) వర్షించునే!

1707. ఆధారములను శోధన చేయుటలో (మంతోచ్చారణతో ఇడ, పింగళ నాడులు శుద్ధి చేయుట – న్యాసమని గ్రహించవలెను). నాడిశుద్ధి ఏర్పడి శాంత్యాతీత స్థితి (ప్రజ్ఞలు వాటి చేష్టలు తొలగుటచే)లో మేధా మొదలగు పదహారు కళలకు అంత్యమున ప్రకాశము ఏర్పడును. పిదప బోధాలయస్థితిలో (జ్ఞానాలయమగు) ఆత్మలో నెలకొని బాహ్యముగా వెళ్ళదగు పంచప్రజ్ఞలు, అంతఃకరణములు, బుద్ధి మొదలగునవి అధోముఖ ధోరణిని వదిలి నిలుచున్న స్థితియే **సహమార్గమని** (సఖ్యతాస్థితి) పేరు. (ఆధారములు శుద్ధిచేసి ఆత్మలో నెలకొనియుండుటచే **సహమార్గము**.)

1708. మేధా మొదలగు పదహారు కళలలోని ప్రణవయోగముతో నిలచి పురికొల్పినచో, కుండలినీశక్తి మూలాధారమును దాటి అధ్వాశక్తితో (నాడిశుద్ధి పొందుట – మంత్రోచ్చారణలతో) వీర్యము స్థానముగా నెలకొన్న కళలను దిశానిర్దేశము చేసి

(క్రమమార్గమున) పైకి ప్రాకించినచో (శిరస్సు–సహస్రంకు) షట్చక్ర స్థానములలో ప్రకాశము నిండుకొని శరీరమునకు సుఖమేర్పరచును. (క్షీణత లేకుండుట.)
(అథ్వాశక్తి విభాగములు: మంత్రము, పదము, తీరు, భువనం, తత్వం, కళ.)

1709. షట్చక్ర ఆధారస్థానములతో ఏర్పడినదే ఈ శరీరము యొక్క కూర్పు. షట్చక్ర స్థానముల వివరణలను (ముందు చెప్పినట్లు) గ్రహించి పైకి వెళ్ళండి! ఆ ఆధారచక్రములలో నెలకొన్న యాబది (50) అక్షరములను దాటి వెళ్ళినచో, అందు నిగూఢముగా నెలకొనియున్న ఏకాక్షరమగు నాదమయముతో గూడినదే ప్రణవమగును – **ఓం**కారం.
(ఆధారచక్ర ధ్యానముల వలన వ్యాపించిన 50 అక్షర సమూహమే ఏకమై **ఓం**కార నాదమగును.)

1710. స్థూలముగా ఏర్పడిన ఈ దేహము క్షీణించదగినది. సూక్ష్మశరీరము నుండి ఏర్పడినదైననూ, ఈ స్థూలశరీరమును విడచి సూక్ష్మము వెళ్ళిపోవును (సూక్ష్మ శరీరమునకు క్షీణత లేదు). అట్లున్ననూ స్థూలములో సూక్ష్మముగా ఇమిడియున్నదీ యాబది (50) అక్షరములు యాబది తత్త్వములుగా ఆరు ఆధారములలో విస్తరించి, క్షీణించదగిన స్థూలశరీరములో వృత్తులు చేయుచూ, వాటికి అతీతముగా ప్రణవముగాను నెలకొనియున్నది.

1711. చక్రస్థానములోని పద్మములను పరిశోధించి చూచినచో హృదయ పద్మమునకు పైగానున్న విశుద్ధి స్థానమగు కంఠమున పదహారు రేకులుగా నెలకొనియున్నది. ఇందు శుద్ధమైన జ్ఞానము (బుద్ధిపూర్వక) **శివానందం** నెలకొనియుండుటచే (కంఠము నుండి పైభాగమంతయూ నిరాధారమైన శాంతి స్థితి), అది అంతటా వ్యాపించిన సరిసాటిలేని జ్ఞానముగా (శివానంద తత్త్వము) పొందునదిగా వెలసిల్లును. (పూర్ణత్వము పొందుట.)

## 2. అండలింగము

అండమనగా జగత్తు, లింగమనగా గుర్తు. జగత్తే శివుని గుర్తు.

1712. జగత్తుకు కారణముగా నున్నది లింగమేనని అందరూ ఎరుగుదురు. కాని అష్ట దిక్కులకు వ్యాపించియున్నది **అండలింగము**ను పేరుకూడ శివునిదే. అరువది నాలుగు (64) కళలతో కూడిన (**అకార** కళ–10, **ఉకార** కళ–16, **మకార** కళ–24, **బిందు** కళ–4, **నాద** కళ–10) ప్రణవము కూడ లింగతత్త్వమే అగును. జగత్తంతటికీ కారణముగా నున్నది కూడ శివతత్త్వ లింగరూపమే!!

1713. ఈ జగత్తు ఉద్భవించినది తన శక్తి (విభజించలేని తత్త్వం)తోనే; ఈ జగత్తంతా తన శక్తిరూపము దాల్చి అంతటా నెలకొనియున్నది; ఈ జగత్తంతా తన శక్తి

గుణములే పొందియున్నది. ఈ జగత్తంతా తనయొక్క రూపమగు **సదాశివ**మే సుమా!!

(ఈ తత్త్వము శివుని యొక్క సారూప్యతత్త్వము, నిరాకార తత్త్వము, **లింగము**ను బోధించునది.)

1714. భోగమును, ముక్తిని (మోక్షము), దానికి తగ్గ జ్ఞానమును, తగిన సిద్ధియూ (సుఖము), శరీరము, పృథివి మొదలు నాదము వరకున్న ముప్పదిఆరు (36) తత్త్వములుగాను, వీటికి అతీతముగానున్న ఏకత్వమును అనుగ్రహించునది ఆ సదాశివమే అగును. ఆగమములు బోధించు ఆధ్వామూర్తియగు ఆరును (6) శివమే అగును.

1715. లెక్కలేనన్ని దేవతలు నా పరమశివుని పూజించిరి. **ఓ దక్షిణదేశము నుండి సువాసనలు, చల్లని కమ్మని గాలులు వీచు శివరూపమా, నీ అందమే అందము** అని పొగడి ప్రశంసించిరి. కాని నా మహామహుడు (పరమశివుడు) అన్ని అందములను దాటి వాటికి అతీతముగా నెలకొని కాపాడుచూ అనుగ్రహము పాలించుచున్నాడన్న సత్యమును వీరు (దేవతలు) ఎరుగురు సుమీ!!

1716. మహాప్రకాశరూపుడగు అగ్నిలో బ్రహ్మ, విష్ణువు, దేవతల గురువగు ప్రజాపతులలో ప్రకాశరూపముగానున్న సూర్యునిలో, ఇంద్రునిలో, కంటిలోని వెలుగువలె నెలకొని, అన్ని దేవతలలో చంద్రుని ప్రకాశమువలె నెలకొని, అన్నింటా జ్యోతులన్నిటికీ జ్యోతిగా ప్రకాశించుచూ ఆ పరాపరముగా నున్నది శివంమే అగును.

(**శివం**కు పుట్టుక లేదు. అనాదిగా యున్నదే ఆ బ్రహ్మం, సాక్షిచైతన్యముగా, అచ్యుతం, శాంతం, అద్వైతము – **"నమ్రియతే నజాయతే", "జ్యోతిషాం జ్యోతి"** – శ్రుతి వాక్యములు.)

1717. శివమహామహుడు **స్థావరలింగము** (స్థాపించిన లింగము)గా నెలకొని అనుగ్రహించు నాయకుడు. **మాపరాలింగము**గా (శరీరము నందే జ్ఞానరూపిగా నెలకొనియున్నాడన్న విషయమును) గ్రహించి కొలుచువారు లేరు. అట్లు సత్యమును గ్రహించి, కొలుచు వారికి, వారే పద్మములో స్థాపించిన బంగారు ధ్వజస్థంభము అగుదురు.

(శివజ్ఞానము ఆత్మలో నెలకొనుటచే, శరీర హృదయపద్మమున వెలసిన బంగారు ధ్వజస్థంభమైపోవును – శరీరము దేవాలయమగుట.)

1718. హరుని రూపములను గ్రహింపనెంచిన వారికి దేవాలయములో గర్భగృహపు విమానము ఆతని (శివుని) స్థూలలింగమగును. అందులో నెలకొన్న శివలింగము సూక్ష్మలింగమగును. లింగమునకు ముందున్న బలిపీఠము ఆతని పత్రలింగమగును. (నందికి వెనుకనున్న బలిపీఠము పత్రాకారములో నుండును – తామరాకు వలె.)

1719. లింగమును అమర్చుటకు తగిన వస్తువులను చెప్పబడినది: ముత్యములు,

మాణిక్యము, పగడము చెక్కిన తీర్చిదిద్దిన గట్టి కలప, శిల్పము, విభూది, మరకతము, శివాగమము, అన్నం, బియ్యము, పుష్పములు, మట్టి మొదలగునవి కావలసిన సాధన వస్తువులు.

1720. లింగపూజకు క్రింది వస్తువులను కూడ అమర్చియూ పూజించవచ్చునని చెప్పబడినది: గట్టి పెరుగు, నెయ్యి, పాలు, మంగళమైన ఆవుపేడ, శుద్ధి చేయబడిన రాగి, అగ్ని, పాదరసము, శంఖు, బాగుగా కాలిన ఇటుక, అందమైన బిల్వము (పత్రము లేక కలప), బంగారు మొదలగు వాటిని శివలింగముగా తలంచి, పూజించ వచ్చును. ఒక్కొక్క విధమైన పూజకు ఒక్కొక్క ఫలితము లభించును.

1721. నాలుగు వర్ణములు వారు పూజించదగ్గ లింగములను ఇందు చెప్పబడినది: బ్రాహ్మణులకు స్ఫటిక లింగము (శుద్ధము–సత్యం–ఆకాశతత్వము) పూజించ తగినది. క్షత్రియులకు (రాజులకు) బంగారు లింగము (పసుపు–రజో–అగ్ని) అర్చించ తగినది. వైశ్యులకు మరకత లింగము (పచ్చ–రజో–జలము) పూజింప దగినది. శూద్రులకు మట్టి లింగము (వ్యవసాయం–తమస్సు–పృథివి) పూజింప దగినది.

1722. ముందు మంత్రములో చెప్పినట్లు శివుని లింగరూపములో ఆతని సర్వవ్యాపకత్వము దానిలో సృజించితిని. ఎటువంటి విధమునైనను గ్రహింపబడజాలని ఈశుని, బుద్ధిపూర్వకమగు సత్యజ్ఞానముతో పృథివి, అప్పు, అగ్ని, వాయువు, ఆకాశము, సూర్య, చంద్ర, ఆత్మగా అష్టమూర్తులుగా ఉన్నాడని గ్రహించుటచే, అతనే (శివుడు) అఖండ వ్యాపకముగా ఉన్ననూ, నా శరీరమునే దేవాలయముగా చేసుకొని నాలో నెలకొని అనుగ్రహించెను.

1723. ముందు చేసిన పాపకర్మ ఫలితములను తొలగించువాడును, లయ సమయములో అన్నిటిని తనలో ఇముడ్చుకోగలిగిన పుణ్యాత్ముడు శివుడే అగును. సర్వదా వ్యాపించిన ఈ జగత్తంతా అతనిలో ఇమిడియున్నదని గ్రహించినవారికి, ఇమిడిన ఈ క్షీణించ దగిన శరీరమే మహాప్రకాశము పొంది వెలసిల్లును.

(ఆసక్తిరహిత, మనోనాశన పొందినవారిలో శివుడే కోరి నెలకొనును.)

1724. పుష్పములతో ఆధారమాలగా ధరించిన ఆతని పాదపద్మములు పృథివి, ప్రకాశముతో నిండిన గంగ ధరించిన ఆతని దివ్య జటాఝూటము ఆకాశమగును. అన్నింటా తాను నెలకొనియున్నదే ఆకాశతత్త్వమగును. ఇదే ఆదిగా, అనాదిగా నున్న ఆదిభగవానుడైన శివుని సర్వవ్యాపకమును ఆవరించిన శివుని దివ్యశరీరము.

(శివుడు అన్ని ఇమిడిన ఆకాశతత్త్వము; పరమేశాం నుండి ఆకాశము, ఆకాశం నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలము, జలము నుండి పృథివి ఉద్భవించినది – శ్రుతివాక్యము. కావున అన్నిటిని తనలో ఇముడ్చుకొన్న

ఆకాశముగా పోల్చబడినది. (బ్రహ్మాండమే ఆతని శరీరము.)

1725. పృథివియే శక్తిపీఠముగాను అతని లింగమునకు ఆధారముగాను, ఆకాశమంతట నెలకొనియున్నది. తీరమును ఉధృక్తముగా తాకుచున్న సముద్రపు అలలే ఆతని స్నానపుగట్టు. పర్వతములపై తేలియాడు మేఘముల సమూహమే ఆతని తిరుమంజన తీర్థము. ఆకాశములో తేలియాడు నక్షత్రముల కూటమియే ఆతని అండలింగమునకు మాలయగును. ఎల్లలు లేని, పరిమితులు లేని మహావ్యాపకమైన అష్టదిక్కులు ఆతనికి వస్త్రధారణ.

## 3. పిండలింగము

శరీరమే పిండము – శరీరమే లింగాకారం – పిండలింగముగా భావించబడినది

1726. మానవ శరీరరూపమే శివలింగము. మానవశరీరం చుట్టూ ఆవరించియున్నది చిదాకాశ తత్త్వమే (చిత్+ఆకాశము). మానవశరీరము సదాశివుని సాకార దివ్య శరీరరూపము. మానవశరీరములోని ప్రతి చలనము ఆ నటరాజుని (శివుని) నాట్యమే అగును.

1727. లయ క్రమానుసారములో పృథివి జలములోను, జలము అగ్నిలోను, అగ్ని వాయువులోను, వాయువు ఆకాశములోను లయమై ఇమిడిపోవును. అట్లే వాటి తన్మాత్రలగు గంధము, రుచి, రూపము, స్పర్శ, శబ్దం అదే క్రమములో లయమగును. కావున వీటి అధీశుడైన సర్వభూత నాయకుడైన శివునియందు శరణునొంది స్తుతించండి. అట్లు చేసినచో క్షీణించదగిన ఈ శరీరము క్షీణించక సూక్ష్మతత్త్వములో నెలకొనును!!

1728. శరీరమను దేవాలయము పుట్టినప్పుడే బ్రహ్మాది దేవతలగు ఐదుగురు వారివారి ద్వారములలో ఇమిడిపోయి (బ్రహ్మ–పృథివి అంశము – ముక్కు–గంధము తన్మాత్ర; విష్ణువు–జలం–నాలుక–రుచి; రుద్రుడు–అగ్ని–కన్ను–రూపము; మహేశ్వరుడు–వాయువు–చర్మం–స్పర్శ; సదాశివుడు–ఆకాశము–చెవి–శబ్దం) వారికి నిర్ణయించబడిన పంచకృత్యములను (వృత్తులు) చేయ అనుగ్రహించిరి. శ్రేష్టమగు, మహోన్నత నాయకుడగు శివుడు నా హృదయమున ప్రవేశించుటచే ఆ దేవతల పంచకృత్యములన్నీ తనదేనని శివుడు నెంచి అనుగ్రహము పాలించెను!!

1729. మాయొక్క మహానంది, ఈ దేహమునే తను నివసించదగ్గ దేవాలయముగా చేసుకొని, శ్రేష్టమైన చతుర్వేదముల ద్వారా తన ఉనికిని చాటి, ఈ దేహముననున్న పది నాడులు, కార్యములను శుద్ధిచేసి, పంచ ఇంద్రియ విషయవృత్తులను సక్రమ పరచి వాటి ద్వారములలో తానే ఇమిడి అనుగ్రహించెను!!

(శివుడే దేహమును తన దేవాలయముగా మార్చి వృత్తులు చేసి అనుగ్రహించెను.)

## 4. సదాశివలింగము

1730. దివ్యానుగ్రహముతో కూడిన దివ్యపాదములు భూమిని తాకునట్లునూ, కీర్తించదగ్గ పదిచేతులు దశదిక్కులను వ్యాపించియూ (4 దిక్కులు+4 మూలలు+ఊర్ధ్వ +అధో), సర్వమునూ చూడగలిగిన పంచముఖములును, ఎర్రనైన పదిహేను కళ్ళు (పంచ ముఖములు×త్రినేత్రములు=15) మహాప్రకాశముతో కూడిన ముత్యమువంటి తెల్లనైన రంగు కలిగిన సదాశివుని ధ్యానించుదురుగాక!!
(శివ పంచముఖములు = సద్యోజాతం, అఘోరం తత్పురుషం, వామదేవం, ఈశానం)

1731. బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడునూ, వీరికి పైగా పంచముఖములతో కూడిన సదాశివుడు, నాదము, బిందు, ఆధారశక్తిగాయున్న కుండలినీ శక్తియూ, ఆఖరిగాయున్న శివునికి సాధారణముగా వీరందరిని **సదాశివ**మనియే పిలువబడు చున్నది. (ఈ సదాశివ నామముతో నున్నదే ఆధారశక్తితో కలిసి దేహమునకు పంచకృత్యములొనరించుచున్నది.)

1732. సదాశివమే శివునికి శక్తిగా వివరించబడినది: సదాశివమను శక్తితో పంచకళలైన – నివృత్తి, ప్రతిష్ఠ, విద్యా, శాంతి, శాంత్యాతీతం మొ॥ పంచవృత్తులు చేయుచున్నవి. ఈ పంచకళలలోనే శివసూర్యుడు ఏర్పడి, వాటి కిరణములతో మొత్తము అండకోశమును ప్రకాశింపజేసి (శుద్ధచైతన్యముగా), అష్టదిక్కులకు అధో, ఊర్ధ్వములకునూ వ్యాపించి మహాప్రకాశముగా వెలసిల్లును.
(బాహ్యచైతన్యము జగత్తునంతటికీ వ్యాపించినది.)

1733. అండకోశములో పైన చెప్పిన దిశలందే ఆరు అంగములతో నెలకొనియున్నది (ఆరు అంగములు: శీక్షా, కల్పం, వ్యాకరణము, చంధస్సు, నిరుక్తం, జ్యోతిషం). ఆ దిశలందే చతుర్వేద (ఋక్, యజుర్, సామ, అధర్వణ) జ్ఞానము ఇమిడియున్నది. అందే వేదములలో చెప్పబడిన ఆచరణలు కర్మకాండ, జ్ఞానకాండ మార్గములు ఉన్నవి. అందే మతసంప్రదాయ సంస్కారజ్ఞానము ఇమిడియున్నది.
(అండకోశములో నున్నవన్నియూ సదాశివజ్ఞాన సముదాయములే.)

1734. సంప్రదాయ జ్ఞానములో చెప్పబడిన పది అవస్థలుగాను (జాగ్రదా, స్వప్నం, సుషుప్తి, తురీయం, తుర్యాతీతం – ఆజ్ఞాచక్రం నుండి మూలాధారం వరకు, మరలా మూలాధారం నుండి ఆజ్ఞాచక్రం వరకు) సూర్యుని పన్నెండు రాశులుగాను, చంద్రకళలైన పదహారును ఈ అండకోశములో సదాశివమూర్తియే స్థూలముగాను (సాకారమూర్తిగా), సూక్ష్మముగాను (నిరాకారమూర్తిగా) నెలకొని వృత్తులు చేయుచున్నాడు.

(అన్నీ సదాశివమూర్తి యొక్క రూపములేనని వర్ణించి, అండకోశములోనున్న శివుడు ఉన్నతికి ఉపకారము చేయుచున్నాడు.)

1735. సదాశివమూర్తికి ఊర్ధ్వ, తూర్పు, దక్షిణ, ఉత్తర, పడమర అను పంచముఖములు కలవు. ఊర్ధ్వము నుండి వరుసగా ముఖవర్ణం తెల్లటి స్ఫటికరంగు, కుంకుమ వర్ణము, కాటుకవలె నల్లనిరంగు, ఎర్రని రత్నపుష్పమువలె, పాలవలె తెల్లటి రంగులతో నాకు (రచయిత) దర్శనమొసగిన పంచముఖములగును.

1736. సదాశివమూర్తికి ఈశానం మొదలగు పంచముఖములు (మం. 1730) పదిహేను నేత్రములు, పదిచేతులు, పదిచేతులలో పది ఆయుధములు, మొదలగు వాటితో నాలో సదాశివమూర్తి నెలకొనెను.

1737. శివశక్తీ (కుండలినీశక్తి) భూశక్తి. అండము సదాశివుడు. ఆకాశమును, భూమిని ఆవరించినది కూడ అండకోశమే అగును. శక్తియు, శివుడు కలిసి స్థితిపొంది వృత్తులు సలుపుచున్నారు. శక్తిరూపముగాను (సాకారముగాను) శివుడు నిరాకారముగాను నెలకొని ముప్పది ఆరు (36) తత్త్వములుగా వృత్తులు చేయుచున్నారు.

(ఆత్మతత్త్వము = 24 = పంచజ్ఞాన, పంచకర్మేంద్రియ, పంచభూత, పంచతన్మాత్రలు, అంతఃకరణం(4).

విద్యాతత్త్వము = 7 = కాల, కళ, నియతి, రాగ, విద్య, మాయ, పురుషుడు.

శివతత్త్వము = 5 = శివం, శక్తి, శతాక్యం, మహేశ్వరం, శుద్ధవిద్యా.

మంత్రము 125 చూడవలెను.)

1738. తత్త్వములని చెప్పునవన్నియూ అరూపములే (ఆకారము లేనివి). ఆ తత్త్వములే చరాచరమునందు విస్తరించి నెలకొనుటచే అవి రూపములుగా ఉన్నవి. రూపములుగా ఉన్నవి సుఖములను ఒనగూర్చునవి. ఈ తత్త్వములన్నియూ అన్నిటినిలోను ఇమిడి నెలకొనును. ఆ తత్త్వములన్నియూ సదాశివమే కదా!!

(ఆ సదాశివుడే రూపములుగాను (స్థూల జగత్తు, జీవులు, వస్తువులుగా), అరూపము గాను (సూక్ష్మ పంచీకరణముగాను – జగత్తు, జీవులలో) నెలకొనియున్నాడు.

1739. హృదయములో నెలకొన్న ఆ దైవము సదాశివుని స్తుతించండి. మరి ఏ గ్రంథము ద్వారాను గ్రహించబడనివాడుగా నెలకొనియున్నాడు. తమతమ ఉన్నతి కోరి ప్రశంసించు దేవతలవలె కాక తను ఒక వ్యత్యాసమైనవాడు. ఇంతటి నిగర్వి, సౌమ్యుడు నా మనస్సులో దూరి నెలకొనెను!!

(అంతరమున నెలకొన్న సదాశివుని గ్రహించి స్తుతించండి.)

1740. చీకటి ఆవరించిన కంఠము (చీకటి–నల్లని=నీలకంఠుడు) శివుని కుడిచేతిలో

చిన్న గొడ్డలి (శివుని ఆయుధము), ఉంగరాల జటాఝూటములో ప్రకాశించు కిరణములతో వెలుగుచున్న నెలవంక, అనుగ్రహము పాలించుచూ నా చిత్తమునందు పదిలమైన నా ఆదిపరాపరుడు (సదాశివమూర్తి) తేటనైన నా హృదయమును పక్వపరచినది గ్రహించితిని!!

1741. సదాశివమూర్తి పంచముఖముల గుణములను వివరించినదీ మంత్రం: జీవులకు ఉన్నతి అనుగ్రహించగోరి శక్తిగా నెలకొన్న ఈ పంచముఖములు; ఉత్తరము చూచు **వామదేవం** అతి ఉత్తమమైనది. ఇది ఎటువంటి మాటలు లేని మౌనస్థితిని తెలుపునది. పడమర చూచునది **సద్యోజాతం** సృష్టికి మూలమైనది. తూర్పును చూచు **తత్పురుషం** దేహతత్త్వములను బోధించునది. దక్షిణమును చూచు **అఘోరం** దేహమునకు శిరస్సు వంటిది. ఊర్ధ్వమును చూచు **ఈశానం** మకుటమువంటిది.

1742. పవిత్రతను చాటునదైన ఈశానంను **శిరస్సు** మధ్యమున న్యాసము చేయవలెను (న్యాసము=తాకుట). తత్పురుషమును **ముఖము**న న్యాసమును, అఘోరంను **హృదయం**న న్యాసమును, వామదేవంను **లింగము** నందు (శిశ్నము), సద్యోజాతంను **పాదం** నందును న్యాసము చేయవలెను.

(ఈ అంగన్యాసములో ఒక్కొక్క అవయములను తాకి, మనస్సులో ఆ దిక్కు సదాశివమూర్తి ముఖమును తలంచి **నమః** చెప్పి ధ్యానించవలెను.)

1743. హృదయము, శిరస్సు, శిఖ, కవచము, నేత్రములు, అస్త్రములు మొదలగునవి అంగములగును. ఎటువంటి వంచన లేక జీవులకు శుద్ధ మాయాశక్తి బుద్ధి జ్ఞానమొసగును. దీని రంగు పచ్చరంగు. శరీరమంతయు ప్రకాశవంతమగునపుడు (పదకొండు (11) మంత్రోచ్చారణ వలన) ఎర్రని ప్రకాశములో శేఖరి (శేఖరుడు = శ్రేష్టుడు - శేఖరి స్త్రీలింగము) శక్తిగా నెలకొనును. ఆ ప్రకాశములో దేహములో తన (11) ఆయుధములతో నెలకొని ప్రకాశించును.

1744. పరిశీలించినచో హృదయమంత్రమే శివునికి జ్ఞానశక్తియగును. శిరస్సు మంత్రము ఆకాశములో వెలయు పరాశక్తియగును. శిఖామంత్రము ఆదిశక్తిగాను, కవచ మంత్రము పలు రంగులతో కూడిన ఇచ్ఛాశక్తిగాను, నేత్రమంత్రము క్రియాశక్తిగాను వృత్తులు చేయును.

1745. శక్తి చతురస్రములో నెలకొనునపుడు చలనము లేక దృఢత్వముతో నిలుచుండును. అదే శక్తి షట్కోణములో నెలకొనునపుడు నిద్రించును. ఆ శక్తి వృత్తములో నున్నప్పుడు చలనములతో క్రియాశీలనగా యుండును. ఇట్లు కర్మించు, ప్రకాశించు శక్తి సదాశివమే సుమా!!

(శక్తిగా చెప్పబడినవన్నియూ కుండలినీశక్తి షట్చక్ర ఆధారవృత్తులే.)

1746. మహానంది (సదాశివుడు)ని ఎంతకాలము స్తుతించి, కొలిచిననూ ఆ నంది పంచములో (పంచముఖములగు – సద్యోజాతాది ముఖములైదు) పంచబ్రహ్మంగానే వెలుగొందును. మూల (కుండలినీ) వాయువును పైకి ఊర్ధ్వ సహస్రదళమునకు ప్రాకించినచో ఆ నంది తొమ్మిదింటిలోను నెలకొని అనుగ్రహించును.
(తొమ్మిదింటిలో అన్నది: సదాశివమే పంచబ్రహ్మముగాను, నవతరః భేదముగాను (బ్రహ్మ, విష్ణువు, రుద్ర, మహేశ్వర, సదాశివ, నాద, బిందు, శక్తి, శివంగా) ఉండి అనుగ్రహించునన్నది.)

1747. ఈ దేహములో అంతరముగాను, దానికి అతీతముగాను, ప్రాణమునకు ప్రాణముగా సమ్మేళనమై నెలకొని వృత్తులు చేయునది నా ఈశుని తత్త్వమే అగును. ఈ భావనా తత్త్వము నాలో శివపాద పద్మములుగా నెలకొని సూర్య, చంద్రకళలతో కూడి అది సహస్రమునకు చేరునపుడు అది నా చిత్తములో నిలుపుకొని, ధ్యానించి నిలుచుందును!!

1748. జగత్తంతటా మహాప్రకాశముగా వెలుగొందుచున్న పరమేశ్వరుని నేను సృజించితిని. ఈ జీవుల ఉన్నతి కొరకు ఆతనిని ఈ భూమికి (లోక సంగ్రహనార్థము) తీసుకు వచ్చితిని. నా మనస్సగు దేవాలయములో పునీతుడైన ఆ దైవమును నెలకొల్పితిని. ఆ పునీతమే నాదతత్త్వముగా దర్శనమిచ్చుచున్నాడు. ఆ శివసూర్యుని కొలిచి స్తుతించుటచే, అతను నాలో ప్రకాశముగా ఏకమైనాడు!!

1749. అగ్నిమండలము, సూర్యమండలము, చంద్రమండలములగు మూడింటిలోను అగ్నిగా ప్రకాశముతో నెలకొని, నవతరః భేదములతో మధ్యనుండు సదాశివమూర్తిగా ఏడేడు పదునాలుగు (14) లోకములకు ఆధారముగా నుండి, వాటిని మోసి, ఆ సదాశివమే ఆదిగాను, అంతముగాను ఉండి, ఈ శరీరములో చంద్రమండలముగా (శిరస్సు–సహస్రమున) వెలుగొందుచున్నాడు.

1750. పై మంత్రము చెప్పినట్లు గ్రహించినవారికి, ఈ దేహమే (శివజ్ఞానులకు) శివ లింగముగా వెలయును. ఈ దేహమే సదాశివమగును. ఈ దేహమే శక్తి, శివుడు నెలకొన్న శివానంద తత్త్వమగును. ఈ దేహమే అన్నిటికి **తత్పరం** అగును.
(**తత్పరం** జీవుని జీవాత్మ **పరం**తో (శివం) చేరునపుడు, అందు నెలకొనపుడు ఈ ఆత్మయే పరతత్త్వమై **తత్పరం** పొందును.)

1751. ఎవరూ గ్రహింపజాలరు శివమే **అకార** రూపమని. అట్లే **ఉకార**ముగా నెలకొన్నది శక్తియే అన్ని శక్తులలో, వస్తువులలో ఇమిడియున్నది. ఇట్లు శివం, శక్తియే అన్నింటా నెలకొని జగత్తుగా నున్నది. ఈ శివ, శక్తులే శిరస్సున నాదరూపముగా నెలకొని

శబ్దించుచున్నది. (అకార, ఉకారముల కలయికయే నాదమయమై, శిరస్సున ఇమిడి సదాశివముగా ఉన్నది.)

1752. సదాశివలింగము యొక్క పీఠము లేక అడుగుభాగము శబ్దించు **ఓంకార**మగును. లింగము యొక్క కంఠభాగము **మకార**మగును. లింగం యొక్క లోపలి వృత్తము **ఉకార**మగును. లింగము యొక్క పానము **అకార**ముతో నిండిన నాద, బిందులగును. (శివలింగ రూపమే శరీరములోని **అ, ఉ, మ** కారములతో నాద, బిందు సమ్మేళన ప్రణవమగును.)

## 5. ఆత్మలింగము

(ఆత్మయే లింగముగా)

1753. అకారముయైన శివం అన్నిటికి ఆదిగాను, అన్నిటిలోను కలిసి నిలుచున్నాడు. ఉకారమైన శక్తి అన్నిటికీ ఆదిగాను, అన్నిటికిని ప్రాణము పోసి నిలుచుటకు సహాయకారిగా యున్నది. ఇట్లు అకారము శివం అనియూ, ఉకారము శక్తి అనియూ ఎరుగుటచే అకార ఉకారములే లింగరూపమని గ్రహించబడును.

1754. ఆధార ఆధేయముగా నున్న బిందు (అండకోశములో సృష్టికి మూలకారణమై, అందు నెలకొని యున్నదైన బిందు) మేదాది షోడశ కళలైన నాదముతో కలిసి దొంతులు దొంతులుగా వ్యాపించినది. ఆధారబిందు, ఆదిపీఠముగా నాదము నెలకొనియున్నది. ఈ విధముగా కలిసి పైకి ప్రాకుటచే నాదబిందు కలయికగా యున్నది. (మైధునంగా చెప్పబడినది.)
(నాదబిందు కలయికయే ఆత్మలింగముగా చెప్పబడినది.)

1755. శివశక్తి లింగమే సమస్త జగత్తులోని అచలనశక్తి (అచేతన–ఉనికి–అసత్), శివశక్తి లింగమే సమస్త జగత్తులోని చలనశక్తి (చైతన్యం–సత్–చిత్), శివశక్తి లింగమే సదాశివమూర్తి (ఆకాశమండలమును–శిరస్సున), శివశక్తియే తత్‌పరమైన, పుట్టుక లేని ఆది (అజః) అగును.

1756. శివశక్తికి ప్రతిరూపమైన ఆత్మలింగములో మహాప్రకాశమును దర్శించవచ్చును. ఆకాశమండలమున (శిరస్సున) యాబది (50) అక్షరములు ఉద్భవించునది కూడా అక్కడనే. సహస్రదళ పద్మమున నెలకొనియున్న జ్యోతి ప్రకాశముతో శక్తితో (శిరస్సుకు చేరిన బంగారు తీగయను కుండలినీశక్తి) అకారరూపియగు శివుడు కలిసి వెలుగొందును.

1757. ఆత్మలో ఇమిడిన బిందు, నాదములు ఆత్మలింగమగును. (బిందు=ప్రకాశము – అచలమైనది. నాదముతో చేరుటచే అది శబ్దించు చలనముగా మారును) ఆ బిందుపీఠం నాదము లింగమగును. ఈ రెండింటినీ ఆధారముగా చేసుకొనే బ్రహ్మాది

దేవతలు పంచకృత్యములు చేయుచున్నారు (సృష్టి, స్థితి, తిరోధానము, అనుగ్రహం, లయ).

1758. శ్రేష్ఠమైన ఆత్మతత్త్వమే శక్తికి మంచి పీఠమగును. విద్యాతత్త్వముతో ఇమిడిన కంఠమే శక్తికి మంచి కంఠమగును. ఇమిడిన శివతత్త్వమే శక్తికి మంచి లింగమగును. ఆత్మ నెలకొనియున్న ఆకాశతత్త్వమగు (శిరస్సున) సదాశివతత్త్వమే శ్రేష్ఠమైన శక్తి మండలమగును.

1759. శివుని దరిచేరిన ఆత్మ యొక్క మనోమండలములో శివశక్తులు వెలుగొందుదురు. శివుడు నా మనస్సున (చిత్తమున) ఇమిడి, నా ప్రాణమును నిలబెట్టి, మనస్సున బ్రహ్మానందమును పొందునట్లు చేసి, శ్రేష్టతను (శ్రేయస్సు) పొందుటలో ఆ నాయకుడు తన అనుగ్రహముతో నాలో ప్రవేశించి నా సహస్రమున నెలకొని ఆదుకొని అనుగ్రహము పాలించెను కదా!!

1760. పరాపరుడు అగు మహామహుడు, నా తండ్రివంటివాడు, చల్లని నెలవంక ధరించినవాడు, ధరాధరుడు – జగత్తంతటిని తనపై మోయుచున్నవాడు, తన దాసుల (శివభక్తుల) మనస్సగు దేవాలయమున ఇమిడి, శిరస్సు నందు వెలుగొందు శిరాపరుడు, దేవతల శిరస్సునందు ఇమిడిన హరాపరుడు, నా చిత్తమున శాశ్వతముగా నెలకొని అనుగ్రహించెనే!!

1761. పశుతత్త్వముతోనున్న (దేహభావన – అనాత్మతత్త్వము – అహంకార, మమకారాది అజ్ఞానముతో నున్న బంధము) నా మనస్సును తన దేవాలయముగా చేసుకొన్న ఈశుడు, సర్పజటాఝూటమును, అగ్నిని, జలమును (గంగను) దాల్చినవాడు. చేస్తున్న పుణ్యఫలములన్నిటినీ గైకొనువాడునైన ఆతనిని మహానాయకుడు కాదని **నేనే నాయకుడను** అని విర్రవీగుట అజ్ఞానముతో చెప్పు మాటలే అగును. (అనుగ్రహించి చిత్తమున నెలకొన్న ఈశుడే జగదీశ్వరుడు.)

1762. శివుడు అక్కడ నిలుచున్నాడు, ఇక్కడున్నాడు అని ప్రలాపము చేయువారు అష్టదిక్కులందు తిరిగి, వేసారియై వివిధ దేవతలను అర్చింతురు. వాడు నా హృదయమున ప్రాణమునకు ప్రాణముగా ఇమిడియున్నాడు. అటువంటి మహామహుని (శివుని) ఎప్పటికీ నేను స్తుతించుచునే ఉందును సుమా!!

(స్థాపన, ప్రతిష్టలు బాహ్యముగా చేయదగు ప్రవృత్తులు. బాహ్యముగా వెతకుట మాని అంతరమున–హృదయగుహలో, చిత్తమున నెలకొనియున్నదే ఆత్మలింగము యొక్క వివరణ.

**హృదయేః తస్యాశ్శిఖాయామధ్యే పరమాత్మ వ్యవస్థితః** – శ్రుతివాక్యము.

చీకటి హృదయగుహలో అగ్నిజ్వాలాగ్రముగా పరమాత్మ నెలకొనియున్నాడు.)

## 6. జ్ఞానలింగము

1763. రూపం, అరూపం, నిరాకార రూపముగా (రూపముతో కూడిన శివుడు, దృగ్గోచరం కాని శివుడు, శివుని ప్రతీకగా – శివలింగముగా) త్రివిధములుగా శరీరము దాల్చిన పరమశివుడు స్థితిపొందిన జగత్తుకు, అందు నివసించు జీవులన్నిటికీ గురువుగా నిలబడుటకు దీక్ష బూనినవాడు. కోరినవన్నిటిని ఇవ్వగలిగిని కల్పవృక్షమువలె ఇచ్చు సదాశివుడు తనేయగును.

1764. సదాశివునికి క్రిందనున్న బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు రూపము దాల్చినవారు. మధ్యనున్న వానిని (సదాశివుని) విడచి, పైనున్నవి అగు బిందు, నాదము, శక్తి, శివం రూపము లేనివి. మధ్యనున్న సదాశివుడు సాకారనిరాకార రూపముగా (ప్రతీక) నెలకొన్ననూ, ఈ తొమ్మిది తత్త్వములు పరమశివతత్త్వములే యగును.

1765. ఈ తత్త్వములు గలిగినవాడే దేవతలందరికి నాథుడు. అన్ని దిశలలో ముఖములు గలిగినవాడు. ఆ నలుగురికి ప్రాణము వంటివాడు (బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు). నిరాకార రూపుడగు నందీ (సదాశివుడు). ఇటువంటి వానిని ఎవరు మహామహుడని తలంచి, స్తుతింతురో, వారికి అచ్చటనే సదాశివుడు దర్శనమిచ్చును. ఇట్లు వాని పాదపద్మముల దరిచేరండి!!

1766. సంవత్సరము, నెలలు, దినమని కాలపట్టికను తయారుచేసినవాడిని శివసూర్యుడని, సదాశివునితో కూడిన శక్తియని తలంచి, ఇరువురు వేరువేరు గాదని, ఒక్కరేయని స్తుతించి, ధ్యానించినచో రెండు ఫలములు కాక ఒకే ఫలమును పొందనగును. ఇట్లు నా జన్మకర్మలను తొలగించువానిని నేను కొలుచుదును గాక!!

1767. ఆదియైన పరమదైవము సదాశివుడే. బ్రహ్మాండములోనే కాక, జ్ఞానుల ఆకాశ మండలములో (శిరస్సులో) వెలుగొందువాడు. పరంజ్యోతిగా జ్ఞానులచే పూజింప బడువాడు, న్యాయపరిపాలన చేయు మహామహుడు, నిర్మలుడు. ఇటువంటి నా దైవములో సగం భాగము పరాశక్తియున్నది సుమా!!

1768. శక్తికి పైగా పరాశక్తి నెలకొన్న అండకోశమునకు అవతల నిర్మలమైన శివపదముగా ఇచ్చట అన్ని తత్త్వములు స్థితి స్థిరపొందినవిగా వెలుగొందుచూ, దీనికి అవతలకు అవతలగా నెలకొనియున్నదే **శివం** యొక్క సత్యస్థితి (మహోన్నతమైన శివపదం అన్నిటికీ అవతల నెలకొని నిర్గుణంగా, నిర్వికారముగా, శాశ్వతముగా, సత్యరూపంగా ఉన్న జ్ఞానతత్త్వమే జ్ఞానలింగముగా చెప్పునది.)

1769. జ్ఞానలింగమున జ్యోతిప్రకాశముగా సదాశివుడు జగత్తు అంతటా వ్యాపించియూ, బుద్ధిలో సూక్ష్మముగా నెలకొనినది గ్రహింపబడును. గ్రహించబడి, పక్వమొందినచో

(సంస్కృతమైనచో) ఎప్పటికీ క్షీణత లేక ఉండుటకు సాధ్యమగును. పరం దృఢమైనచో (తత్త్వములను దాటి ఆత్మలో రమించుట) ఇంతవరకు శక్తిగా తలంచినవన్నీ శివంమేనని చిత్తమున పదిలమగును.

1770. నా చిత్తమైన సదాశివుడు, నా తల్లియగు ప్రణవశక్తి సమూహములగు శివశక్తి తత్త్వములను గ్రహించుటయే జ్ఞానమగును. ఆ సమూహము నెలకొన్నచోటు (అరువది నాలుగు శక్తి కళలే 64 శరీర తత్త్వములగును) త్రినేత్రమగు భ్రూమధ్యము. శ్రేష్టమైన ముక్కంటియందు (ప్రణవ స్థానము) తనే కోరి నెలకొనెను.

1771. శివశక్తి క్రీడలతో జీవుడు శివానందతత్త్వం పొందునది: శివశక్తి లీలలతో జీవుని ప్రాణములో శుద్ధమాయ, అశుద్ధమాయ కూటమిని విడదీసి, ప్రాణమును పక్వపరచి శుద్ధమాయలో – తురీయం అగు ప్రకాశమండలమును చొప్పించి, దానిని దాటింపజేసి, జీవుని చిత్తములో దూరిన **శివం** జీవునిలో శివానందమేర్పరచి, తన దేవాలయముగా చేసుకొనెను సుమా!!

1772. ఈ ధరణి (భూమి) శివశక్తి క్రీడాస్థలము. శక్తి శివంను (రూపముగా ఏర్పడునది – శక్తి; జ్ఞానముగా ఏర్పడునది – శివం) జ్ఞానమగు శివంమే రూపముతో శక్తియగును. శక్తికి శివం లేక శరీరమునకు ప్రాణముండజాలదు. శక్తియే అవసరమునకు తగ్గట్లు ఏ కాలమునందైననూ రూపము దాల్చును.
(శివంనకు శక్తి రూపమగును. అరూపమగు శివంనకు శక్తి వలన రూపము ధరించును. ఇందు జ్ఞానం, బుద్ధి పర్యాయపదములు.)

## 7. శివలింగము

1773. ఘోషించుచున్న సముద్రముతో ఆవరింపబడిన పృథివి, నీరు, అంతటా వ్యాపించిన వాయువు, ఆ వాయువు నుండి జనించిన అగ్నియూ ఈ నాల్గింటికి కారణభూతమైన ఆకాశముగా, అన్నిటిని నియంత్రించువాడుగా ఒప్పారువానిని (శివుని) ఒక ప్రతీకగా (చిహ్నముగా) పెట్టి స్తుతించు పద్ధతి నేను గ్రహించజాలను.
(పంచభూతులతో నిండిన జగత్తు అంతటా వ్యాపించిన వానిని ఒక్క చిన్న ప్రతీకగా స్తుతించజాలనని రచయిత వాపోవుట.
బ్రహ్మం ఆత్మనుండి ఆకాశము, ఆకాశం నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలము, జలము నుండి పృథివి జనించినవి. పంచభూతములలో నాలుగు ఆకాశమునుండే పుట్టినవి.)

1774. జగత్తు అంతటా వ్యాపించిన శివుని ఒక సరిహద్దు ఏర్పరచి కొలుచు పద్ధతి ఒకటున్నది. ఉప్పొంగి వస్తున్న నీరు అను పద్మము (మణిపూరక చక్రస్థానము) తోడుతో, వాని నామమును నిర్విరామముగా జపించుటచే, జటాధారియైన శివుడు

బాహ్యముగా వెళ్ళజాలక (నవద్వారముల ద్వారా బాహ్యప్రవృత్తికి వెళ్ళక) వీడక, ఇచ్చటనే నిలిచిపోవును.

(స్వాధిష్ఠానము (పృథివి అంశం), మణిపూరకం (నీరు అంశం) ఈ రెండు చక్ర స్థానములే మనుజునికి సృష్టిని, బాహ్యప్రవృత్తిని కల్పించి, మాయతో ముంచునది. ఇది శివుని పంచాక్షరములైన **న, మ** తో కూడినదై, శివుని నిర్విరామముగా కొలుచుటచే శివానుగ్రహం పొందనగును.)

1775. నా ఈశుడే పరమాత్మగా జగత్తంతటికీ ఆదిగా ఉన్నాడని నేను సృజించితిని. వాని దివ్యపాద పద్మములు శ్రేయస్సును ఒనగూర్చునని ఎంచి స్తుతించగా, పంచేంద్రియములను జయించి, వాటికి అతీతముగానున్న శివునిలో నెలకొనుటచే, ఆదిపరాపరుడైన శివుడు నాలో శక్తిని నింపి అనుగ్రహించెనే!!

1776. వికసించిన బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, బలమును చేకూర్చు సదాశివుడు (వికసించిన: శివయోగ సాధనా ఫలముచే వికసించిన చక్రపద్మములు) పరబిందు, పరనాదము, శ్రేయస్సునొసగు శక్తి శివం అను ఈ తొమ్మిది (9) రూపములుగా సాధనా ఫలములను అనుగ్రహించు లింగమే శ్రేష్టమైన పరానందీ (శివుడు).

1777. శివలింగముగా భావించు విధానములు చెప్పబడినవి: శరీరములో మూలాధారము నుండి మధ్యనాడి–సుషుమ్న ద్వారా పైకి ప్రాకు ఎర్రని ప్రకాశముతో కూడినదైన (కుండలినీశక్తి) శక్తి ప్రాణముతో ఏకమై (శిరస్సు సహస్రదళమున) ఉచ్ఛ్వాస, నిశ్శ్వాసలతో కూడిన షట్చక్ర స్థానములలోని ఆధార, నిరాధార కళలతో ఇమిడియూ, వాటికి అతీతముగాను వృత్తులు చేయుచున్నదన్న భావనతో అభ్యసించుటయే శ్రేష్టమైన **పరగతి**గా చెప్పబడినది.

(శరీరములోనే శివలింగముగా అమరిన **శివగతి** భావన.)

## 8. సంప్రదాయము

1778. నందీశ్వరుడు (శ్రేష్టమైన గురువు) తన శిష్యుడు దేహము, వస్తువులు, ఆత్మ మూడింటిని ఉదకముతో (నీటితో) దత్తత ఇచ్చినది పుచ్చుకొని, తరతరములుగా వెంటాడుచున్న శిష్యుని కర్మబంధములను తన **కంటి దీక్ష**తో త్రెంచి, శిష్యుని శిరస్సుపై చేతులు ఉంచి, విశదీకరించి (సూర్య, చంద్రకళలను బోధపరచి) దివ్యపాదముల (శివుని) జ్ఞానము గ్రహింపజేసి, సూక్ష్మభావనలను పురికొల్పి, జన్మ బంధములను తొలగించి అనుగ్రహించెను.

1779. ప్రాణము, శరీరములోనున్న ప్రకాశవంతముగా వెలుగు ఆత్మయే పరం అని గ్రహింపజాలక (తత్త్వములకు అతీతమైనదే **పరం**), పిదప ప్రాణణ (శ్వాస చలనము)

ద్వారా దానిని నడిపించునది శివం, శక్తియని గ్రహించి, ఉన్నతి పొందుటలో గురునాధుడు ఆదుకొని అనుగ్రహించెను. (గురునాధుడు–కార్యగురువు; అంతరమున శిరస్సుతో ప్రకాశించు **శివం** కారణ గురు.)

1780. పశ్చిమదిక్కును ప్రకాశింపజేసిన గురునాధుడు (మెదడు వెనుక భాగము – మస్తిష్క నేత్రము గురువు ద్వారా వలనే తెరిపించబడవలెను) ప్రతిరోజు ఈ ప్రదేశములో తనని (శివం) తలంచమని బోధించి, బ్రహ్మరంధ్రమునకు క్రిందిభాగము కొండనాలుకకు పైభాగమున నున్నదే శ్రేష్టమైన, ఉన్నతమైన **పదం** మగునని గ్రహింపజేసినది దీనిని వాక్కుతో చెప్పనలవి కానిదగును.
(గురువే మోక్షమునకు దారి చూపును.)

1781. గురుకృపతో దోషములన్నియూ నివర్తియై జీవుడు నిర్మలమగుట. అనుభవలేమితో ఇష్టము వచ్చినట్లు ప్రలాపనము లాడుచున్న నన్ను నాలోయున్న దోషములను తొలగించి, నన్ను నా గురునాధుడు శిష్యునిగా కరుణతో స్వీకరించి, నన్ను సమము చేసినది (జీవప్రయత్నం, ఈశ్వరానుగ్రహం నెలకొల్పి) ఒక వ్యాపారి వాణిజ్యము చేసినట్లే సుమా!! (శిష్యుడు త్రికరణశుద్ధితో (మనోవాక్కు కాయంతో) తనను గురువుకి అర్పించుకొనుటచే, గురువు దానికి ప్రతిఫలముగా శివానంద జ్ఞానము బోధించి ఉన్నతునిగా చేయునది.)

1782. జగత్తులో నివసించు సర్వజీవరాశుల (84 లక్షల జీవరాశులు) కంతటికీ నాయకుడైన శివుడు, తనలోనే ప్రణవ స్వరూపముగా (అ, ఉ, మ – జీవ, జగత్తు, పరంగా) ఉన్నాడన్న సత్యమును లోకులు కొంచెమైనను ఎరుగజాలరు. శివానుగ్రహము పొందనీయక ఆటంకపరచు నాలోని అజ్ఞానమును తొలగించి, విశదీకరించి, గ్రహింపజేసి (బ్రహ్మాండంలోని భువనములకు (224 భువనములు) పంచభూతములు వాటి నాయకులకు మూలకారణమైన విత్తనముగా ఉంచువానిని గ్రహింపజేసి, సర్వత్ర వ్యాపించిన శివుని నేను కనుగొంటిని!!

1783. విధివశమున (పూర్వజన్మకర్మ ఫలితముల వలన) ఏర్పడిన శరీరమని, అందు నెలకొన్న జీవాత్మ సమున్నతి పొందవలెనని గ్రహించి, తన జ్ఞానముతో (బుద్ధిపూర్వకముగా) నాదబిందు తత్త్వములే దివ్యపాద పద్మములని భావించి, వాటిని తన శిరస్సుపై పదిలపరచి, అశాశ్వతమైన ఈ శరీరముపై అజ్ఞానము తొలగించుకొన్న స్థితిలో శివుడే జీవునితో కలిసిపోయి, మరిగి **అతనే తానై పోవును**.
(జీవబంధములు తొలగి, అజ్ఞాననివృత్తి యగునపుడు దైవమే జీవునిలో ఇమిడి అనుగ్రహించి, జీవుడే శివానంద తత్త్వమగును.)

1784. శివుడే అన్నిటిని అనుగ్రహించి జీవుని తనలో చేర్చుకొనుట: నేను పరిపక్వమైన

పిదప (సంస్కరించబడిన) నన్ను తనలో చేర్చుకొనెను. నా శరీరము, వస్తు, ఆత్మ (స్థూల, సూక్ష్మ, కారణ శరీరములు) తనదిగా చేసుకొనెను. అన్నిటికీ బలమును చేకూర్చి ఇచ్చినవాడే అన్నీ తనవిగా చేసుకొనెను. ఇట్లు ఇచ్చినవాడే తీసుకొనుటచే నాదని ఇక చెప్పుటకు ఏదియూ లేదు సుమా!!

1785. సూక్ష్మముగా ఇమిడిన ఈ దేహములో దేహి (ప్రాణము)గా ప్రవృత్తులు సలుపు ప్రాణణగా (శ్వాసలు) జీవునిలో నున్న తత్త్వములను గ్రహించి, ఏదో ఒకరోజున కాలుడు (యముడు) ప్రాణమును దేహము నుండి వీడదీసుకొని వెళ్ళిపోవునని గ్రహించి, దేహముతో నున్నప్పుడే వీటిని విడదీసి గ్రహించనివాడు పిశాచమువలె అల్లాడి తిరుగాడును.

1786. శివానందతత్త్వమును సృజించిన జ్ఞానులు జీవ, శివంను గ్రహించినవారు. వీరు దుఃఖములు, బంధములు తొలిగినవారు: శివతత్త్వమును సృజించినవారికి అన్ని లోకములు బోధపడును. అట్లు సృజించినవారికి ఈ వ్యవహారిక జగత్తంతయూ దృశ్యమానముగా తోచి, ఎటువంటి దుఃఖము, భయం, రాగము ఉండదు. ఇట్లు సృజించిన జ్ఞానులు మిథ్యాజగత్తును, తనను, తన నాయకుని బాగుగా గ్రహించిన వారగుదురు.

(**జ్ఞానఫలమేవీతరాగభయక్రోధః** అన్నది శ్రుతివాక్యము.)

1787. సకల స్థితి నుండి (ముప్పది ఆరు (36) తత్త్వములు) శుద్ధస్థితికి (తురీయం) నందీ అనుగ్రహించిన విధము: దేహభావనలో అల్లాడు జీవుని తురీయస్థితియగు ప్రకాశమండలములో (శిరస్సున) ఇముడునట్లు చేసి, ముప్పది ఆరు (36) తత్త్వములతో కూడిన జీవుని శుద్ధతత్త్వములో నెలకొనునట్లు చేసిన నందీశ్వరుని ఎట్లు ఏమని చెప్పి ప్రశంసించుదును?

1788. నేను అన్నది, నీవు అన్నది, నీవు వచ్చి చేరునది అన్న భేదభావనలు ఇక ఉండజాలవు. శరీరముతో ప్రాణము ఇమిడి ఏకమై యున్నట్లు ఆకాశమండలములోని దేవతలు కూడా వచ్చి ఇతనిని స్తుతింతురు. తేనె, దాని మధురమును ఎట్లు విడదీయలేమో అట్లే ఏకమై వెలుగొందుదురు.

(ఈ మంత్రమున **అహం బ్రహ్మోస్మి = నేనే ఆ బ్రహ్మం** అన్న బ్రహ్మాభావన చెప్పబడినది. అది విడదీయలేని తత్త్వమగును. జీవాత్మయే పరమాత్మ; పరమాత్మయే జీవాత్మగా ఉన్నది. దీనిని **మాయ** (అజ్ఞానము) ఆవరణతో మరిపించి, జీవుని బంధములలో తగుల్కొనునట్లు చేయుచున్నది. అజ్ఞానము తొలగించుకొన్న స్థితియే ఆత్మ/బ్రహ్మజ్ఞానం. **జ్ఞానాదేవతు కైవల్యం** = జ్ఞానముతోనే కైవల్యము (ముక్తి) ప్రాప్తించును.

1789. అతనిని (పరమాత్మను) ఇతను (ద్వైతభావనలో ఉండి చర్యలు, క్రియలు చేయువాడు) గ్రహింపజాలడు. గ్రహించవలసిన అతనిని గ్రహించవలసినవాడు తనలో సృజించినచో ఇక రెండు తత్త్వములుగా కాక ఏకత్వమై (అనగా అద్వైతముగా) చూచువాడు, చూడబడు (శివుడు) ఒక్కటైపోవును. ఇట్లు అతనిని (పరమాత్మను) ఇతను (చూచువాడు) సృజించినచో శివంతో చూచువాడు ఏకమై ఇతనే శివమై పోవును. (పంచజ్ఞానేంద్రియ ప్రజ్ఞలు + చత్వారి అంతఃకరణములు + అవస్థాత్రయ అనుభవములన్నియూ మారే అశాశ్వత ప్రజ్ఞలే. ఎప్పటికీ మారని, శాశ్వతమైన, అన్నిటినీ చూచూ సాక్షి – చైతన్యమైన ఎరుకయే ప్రజ్ఞానం. ఈ **ప్రజ్ఞానమే బ్రహ్మ** / శివం / ఆత్మ / పరమేశాం మొ॥.)

1790. శివుడు జీవునితో అద్వైతముగా నెలకొనుటచే జీవుడు శివానందతత్త్వమొందును. **నేను ఈ జీవుడే** అని కరుణతో నెలకొన్న శివుడు, కర్మానుసారియైన ఈ దేహములో ప్రాణముగా నెలకొనియున్నాడన్న భ్రమతో ఉన్న నాపై, ఆకాశములో సంచరించు నల్లటి, దట్టమైన మేఘము వర్షించునట్లు కరుణను నింపి, నాలో నెలకొనెను. కావున నేను వానివలె అంబర నాయకుడునైతిని. (ఆకాశ నాయకుడను నైతిని.)

1791. జీవునిలో ప్రాణమునకు ప్రాణముగా శివుడు నెలకొని మార్పులు చేసి సహకరించును: ఆ మహోన్నతుడైన శివుడు విశాల హృదయముతో తాను వేరు, జీవుడు వేరని తలంచలేదు సుమా!! ఇదే ఈశుని సహజ దయాతత్వము. నిజముగా జీవరాశు లన్నిటినీ మార్పుచేసి (పక్వపరచి) ఉన్నతి కలుగజేయు దేవాదిదేవుడు. నీ దేహము నుండి ప్రాణమును ఎట్లు విడదీయలేమో అట్లు నెలకొనియుండును.

## 9. దివ్యానుగ్రహము ప్రతిష్ఠించుట

(దివ్యపాదముల అనుగ్రహించును సూర్య, చంద్రతత్త్వంల ద్వారా ప్రతిష్ఠించుట)

1792. ప్రతిజీవుడు గ్రహించదగిన తత్త్వములు రెండు. అవి చంద్రతత్త్వము, సూర్యతత్త్వము. ఇటువంటి రెండు తత్త్వముల వలననే ప్రాణమునకు దేహమమరినది. అనుగ్రహమను దైవశక్తిని పొందుటకు చంద్రతత్త్వము ద్వారా ధర్మమును, సూర్యతత్త్వం ద్వారా తపస్సు ఏర్పడియున్నది. ఈ రెండు తత్త్వములు జీవుని మనో పరిపక్వమునకు తగ్గట్లు (సిద్ధత తగ్గట్లు) ప్రతిఫలమొందించును.
(యోగ పరిభాషలో: చంద్రతత్త్వము – షోడశకళల కూడిన దేహము, అహంకారం, మమకారంతో కూడిన అజ్ఞానము–ధర్మము, మొ॥. సూర్యతత్త్వము – జ్ఞానము, తపస్సు, ఆత్మానాత్మ వివేకవిచారణ మొ॥ ఏర్పడియున్నది.)

1793. దివ్యానుగ్రహ ప్రతిష్ఠ అనునది అంతర్ముఖులై ధ్యానించి జ్యోతిని దర్శించునదే అగును. చూచుటకు తేజోవంతుడు, మనస్సునకు రమ్యమైనవాడు, గురు

మండలమున (శిరస్సున) వెలయు నా నందీశ్వరుడు స్పర్శకు, దరిచేరుటకు సుదూరముగా ఉన్నట్లు తోచును. కాని వానిని కోరియున్నవారికి (నిర్విరామముగా అంతర్ముఖులైన వారికి) జ్యోతివలె దర్శనమొసగునే!! అతనిని వీడక అట్లే ఉన్నవారికి వారి మనస్సునందున్న అజ్ఞానమంతయూ తొలగిపోవును సుమా!!

1794. పరంజ్యోతి దర్శనముచే జగత్తులోని సకలము ఎరుగనగును. రాగదోషాలు, అహంకార మమకారాలు తొలగిన స్థితిలో వికర్తుడు (సత్య ఆత్మ / బ్రహ్మ / పరతత్త్వము) దర్శనమగును. నిర్విరామముగా చిత్తమున వానినే నెలకొనునట్లు చేసినచో, జ్ఞానమే స్వరూపమైన స్థితి ఏర్పడి దేవరూపము సిద్ధించును. (దేవతలగుట.)

1795. అజ్ఞానముతో కాలమంతయూ వెళ్ళబుచ్చితిని. నా శివ మహామహుడు గురువుగా వచ్చి, నాలో జ్ఞానమును చొప్పించెను. అట్లు చొప్పించిన పిదప ఆ జ్ఞానముచే తోడుగా చేసుకొని అందు నెలకొనుటచే నాయందే శివుడు శ్రేష్ఠముగా నెలకొని పోయెనే!! (అంతరమున వెలుగు జ్యోతియే **శివం** మని గ్రహించపోవడమే అజ్ఞానము – మహాయోగి, సిద్ధపురుషుడైన రచయిత ఒక సాధారణ మానవుని వలె వాపోవుచూ తన నమ్రత చాటుకొనుచున్నారు – లోకుల కొరకు.)

1796. జీవులలో అనాదిగా పదిలమైన కర్మఫలములు, దోషములు, మల, అజ్ఞానములు నివృత్తియైన పిదప **శివం** తానే బహిర్గతమగును. నేను గ్రహించలేదన్నది, నా పరిపక్వతను నా గురునాధుడైన నందీ ఎరుగును. కావున ఇది గ్రహించి, చిత్తమును దానియందు నిలిపి, హృదయమును ద్రవింపజేసినచో, రోగమును నయపరచు తేనెవలె నాకు ఆనందమును ఆ దేవపరుడు గలుగజేయునే!!

1797. దేహము (స్థూలదేహము) ధరించినపుడే అందు జ్యోతిగా, ప్రాణముగా ఈశుడు నెలకొనియున్నాడని నేనెరుగుదును. ఈ సత్యంను ఊర్ధ్వలోకస్తులు ఎరుగక మందబుద్ధితో నుండిరి (వారికి స్థూలశరీరము లేనందున). దేహమున ఇమిడి, ప్రాణముతో కలిసి (చైతన్యశక్తిగా) వృత్తులు చేయుచున్న జ్యోతిస్వరూపుడున్ని నేను ఎరుగకున్నచో వేరెవరు ఎరుగుదురు?

(మానవుల శరీరధారణ కర్మానుసారి – కర్మఫల క్షీణత కొరకు – ప్రారబ్ధ మనుభవించుటకు – కాని దేవతలకు సూక్ష్మశరీరం భోగానుసారి – వారికి కర్మలు లేవు – **పుణ్యములు క్షీణించిన వెంటనే భూలోకమునకు వచ్చుదురు** – శ్రుతివాక్యము.)

1798. అనుగ్రహమే అంతటా వ్యాపించియున్నదన్న సత్యమును లోకులు ఎరుగజాలరు. అనుగ్రహమును సృజించిన వారికి అది అమృతం వలె (పరమానందము) గ్రహింపబడును. అనుగ్రహముతో అతి సూక్ష్మముగా పంచకృత్యము నివర్తించబడునది ఎరుగజాలరు. ఆ అనుగ్రహశక్తియే అన్ని వృత్తులు చేయుచూ అంతటా వ్యాపించి

యున్నదని ఎవరు ఎరుగుదురు?

1799. జ్ఞానరూపియగు శివునియందు ఇమిడిపోవుటకు తగిన జ్ఞానంను నొసగి, ఇంద్రియముల ద్వారా విషయ వాసనలను చొప్పించి, విషయేంద్రియ జ్ఞానముతో అనుగ్రహము చొప్పించి, ఇంద్రియ కరణముల సహాయము లేకయే శుద్ధజ్ఞానము పొందునట్లు చేసి, శివయోగుల మధ్యన (సత్సంగములో) ఉండునట్లు అనుగ్రహించుటచే శివంను గ్రహించినవారు శివతత్త్వమైరి!!

1800. ఆతని (శివుని) అనుగ్రహము వలనే జన్మించితిని, పెరిగితిని (వృద్ధియైనది). వాని అనుగ్రహముతోనే జన్మబంధములను తొలగించుకొని, ప్రకాశమయ ఆనందమును పొందితిని. ఆ అనుగ్రహముతోనే నందీశ్వరుడు నా అంతరమున ప్రవేశించెను.

1801. ఆతని (శివుని) అనుగ్రహముతోనే అమృతసాగరమున స్నానమాచరించి, నా శిరస్సుపై ఆతని దివ్యపాదములను ఉంచితిని. శివానందముతో శివభోగమును సృజింతిని. ఆతని అనుగ్రహముచే నా చిత్తమున నందీశ్వరుడు ప్రవేశించి అందు నెలకొనెను.

1802. నన్ను పాశములో (బంధములో) చిక్కుకొనునట్లు చేసినది ఆ అనుగ్రహమే. బంధములో చిక్కుకొని విషయములను అనుభవించిన నన్ను బంధమునుండి విడిపించినది కూడా ఆ అనుగ్రహమే. బంధములనుండి విడువడిన నన్ను నాలో ప్రేమను (నింపి) పురికొల్పి శివంతో కలియునట్లు చేసినది కూడా ఆ అనుగ్రహమే. ఆ విడదీయలేని ప్రేమతత్త్వములో నెలకొనునట్లు చేసి ముక్తిని అనుగ్రహించెనే!!

1803. జన్మరహితమును అనుగ్రహించిన ఆ మహామహుడు (శివుడు) జీవుని ఆనందములో ముంచి, ఎప్పటికీ వీడని స్థితిని (సంస్కరించబడిన) అనుగ్రహించిన ఆ కరుణామయుడు, ఎప్పటికీ తరిగిపోని దయాగుణము గలవాడు, ఆదిపరాపరుడు (అనాదియైన పరమేశ్వరుడు ఆదిగా యున్న మహోన్నతుడు) బంధువువలె వచ్చి నా చిత్తములో ఇమిడిపోయెనే!!

1804. నందీశ్వరుడు (శివుడు) కరుణతో అనుగ్రహించి నా చిత్తములో ప్రవేశించెను. అనుగ్రహము లేమితో చీకటిలో (అజ్ఞానములో) మునిగియున్నవారి చిత్తములో ప్రవేశించి ఎరుగించజాలడు. నా చిత్తములో ప్రవేశించి ఆనందమైన శివమై, నా చిత్తము ప్రవేశించినందును నేనునూ ఆనందస్వరూపుడునైతిని.
(**శివం** ఆనందమునే స్వరూపముగా గలవాడు. తాను ఎందుండిన అదే ఆనంద స్వరూపమై జీవులను ఆనందమయముగా చేయును.)

1805. పరిశీలించి చూచినచో, జ్ఞానమయమైన ఆత్మతో గ్రహించబడని మహామాయ

(శుద్ధమాయ)యు, మాయాకార్యములైన అంతఃకరణాది పంచభూతములును, మిగతా ఇంద్రియముల సమూహమును, వాటితో వృత్తులు సలుపు పరాశక్తి, ఆదిశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి మొ॥ పంచశక్తులను గలిగియున్నదనియూ, ఈశుని దివ్యానుగ్రహము వలనే సుమా!!

1806. భూతకార్యములన్నియూ ఆతని (శివుని) అనుగ్రహము చేతనే యైనవి. అవి మల దోషములతో నిండి, అచలనములుగాను, చలనములుగాను నెలకొనియున్నవి. చీకటిగాను, ప్రకాశముగాను అంతటా వ్యాపించిన ఈశునిగా, తన దివ్యానుగ్రహమే తన రూపముగా నెలకొని, అటువంటి దివ్యరూపముగా తప్ప వేరొకటిగా లేదు సుమా!!

1807. ఈశుడే తొమ్మిది (9) భేదములుగా తన్ను విభజించుకొని అనుగ్రహించుచున్నాడన్న వివరణ: శివంగా, శక్తిగా, నాదము, బిందుగా, శ్రేష్టమైన సదాశివుడుగా, మహేశ్వరుడు, రుద్రుడుగా, భవుడగు విష్ణువుగా, బ్రహ్మగా తొమ్మిది భేదముగాను వ్యాపించి నటించుచున్నవాడు శివుడే అగును.
(భవుడు: భవరోగమగు సంసారబంధమును కల్పించుట.)

1808. దివ్యచక్షువులు లేనివారు (అనుగ్రహ ప్రదాతలు కానివారు) చీకటి వస్తువులు (అజ్ఞానపు ఆవరణ) చూడలేరు. శ్రేష్టమైన దృష్టి గలవారెట్లు ప్రకాశమును బాగా చూడగలరో అట్లే, దివ్యానుగ్రహము పొంది దివ్యచక్షువులు గలవారికి హరుడు ప్రతక్షంగా కనిపించును.
(దివ్యచక్షువులు: ఆజ్ఞాచక్రము నందు జ్ఞానచక్షువు తెరవబడుట.)

1809. తానే (శివుడే తన శక్తితో) సకల భువన చరాచర జీవులను సృష్టించి, తానే వాటిని రక్షించి, తానే రక్షించినవాటిని లయపరచి, తానే మరిగియుండి (ఆవరణ శక్తిగా జ్ఞానమును కప్పబడి) తానే వీటంతటినుండి ముక్తినొసగి, తానే సర్వవ్యాపిగా అంతటా నెలకొన్న నాయకుడుగాను ఉన్నాడు సుమా!!

1810. శ్రేష్టతతో నొప్పారు శివం, శక్తి, బిందు, నాదము మొదలగు నాలుగు శివుని అరూపస్థితులగును. తొలగించలేని అరూపమే సదాశివమగును. శాశ్వతమైన స్థానములను ఆక్రమించుకొన్న క్రింది నాలుగు మహేశ్వరం, రుద్రుడు, విష్ణువు, బ్రహ్మ రూపముతో కూడిన స్థితులగును. క్షీణతలేని ఈ తొమ్మిదింటినీ దాటి మరొకటి (ఏకమైనది) శాసించుచున్నది, అది **పరమశివం**మే!!

1811. శివుడు అనుగ్రహించి జీవులలో ఇమిడి, తోడుండి వృత్తులు చేయుచున్నాడు. ఏకమైనవాడు, అక్షరుడుగా (క్షీణత లేనివాడు) తానే అన్నిటిలో నిలబడి, ప్రాణముతో ప్రాణముగా అన్ని జీవరాశులలో ఇమిడి, నా చిత్తములో ప్రేమతత్త్వముగా నెలకొని,

నా తోడుండి, తానే అన్ని చేయుచున్నది - ఒక క్రీడగా ఉన్నదే!!

1812. ప్రేమతో స్థితిపొందిన నిర్మలుడు శివుడు. శక్తితో కలిసి (ప్రణవమగు శుద్ధమాయతో) వృత్తులు చేయుటకే నాదముగా రూపొంది, వ్యాపించి నివృత్యాది పంచకళలతో కూడి (శక్తి-బిందురూపం - 1. నివృత్తి, 2. ప్రతిష్ట, 3. విద్యా, 4. శాంతి, 5. శాంత్యాతీతం) క్షీణతలేని బిందుగా (వ్యక్తాబిందు) వెలసిల్లును.

(శివుని-నాదము-దశ శివకళలతో కూడినది; శక్తి-బిందు-భువన తత్త్వములుగా విస్తరించును.)

1813. పరబిందు తత్త్వముల నుండియే శబ్దప్రపంచము, వస్తుప్రపంచములు మొ॥ అయినవి: సర్వముగా పరవిందు రూపమున నెలకొన్న శక్తియే అన్ని తత్త్వములలో నిండియున్నది. ఆమె నుండియే శుద్ధమాయ, అశుద్ధమాయ ఉద్భవించును. ఈ రెండు విధములైన మాయనుండే దేవతల సమూహము, ప్రణవతత్త్వముతో రూపుదాల్చిన చతుర్వేదములును, లెక్కలేనన్ని అండములును ఉద్భవించును.

## 10. అనుగ్రహ ప్రకాశము

1814. దివ్యానుగ్రహమే గొప్పదని భావించి దానికి తగ్గట్లు తమ ప్రవర్తనను మార్చుకొనని వారు, దివ్యానుగ్రహ అనుభూతిని పొందజాలరు. వారు పంచబంధములనుండి (అహంకారము, కామ్యము, మాయ, మాయేయం, తిరోధానము) విడుపడజాలరు. అనుగ్రహశ్రేష్టతను గ్రహింపకుండుటచే అందులో ఇమడలేరు. దివ్యానుగ్రహముతో పుట్టి, అనుగ్రహమే శ్రేష్టమని తలంచువారే అసలైన గ్రహించినవారగుదురు.

1815. పునర్జన్మ రహితము చేసిన గురునాధుడు (శివుడు) పేరు నందీశ్వరుడు. ఆ నందీశ్వరుడగు పరమశివుడు నాకు వెగటులేని ఆనందమను అమృతమొసగెను. సహస్రనామధారుడైన ఆ మహామహుని ఒక్క నామముతో ఏకమగుటచే అనుగ్రహ ఆనంద సముద్రములో స్నానమాచరించమని నాకు ఆశీర్వదించెను.

1816. వాని అనుగ్రహముతో ఆనందములో మునిగి నాట్యమాడి, స్తుతించి, ఏడ్చి, ఓదార్చబడి శివుని శ్రేష్టతత్త్వమును వెతకి కనుగొంటినే!! కనుగొని ఇమిడిన వెంటనే తన అరూప ప్రకాశమును నాలో చొప్పించి, వాని అనుగ్రహముతో నాలో ఎటువంటి భేదభావము లేక వెలసిల్లెను!!

1817. (నాలో తను ఇముడుటచే) అహంకార మలము, బంధముల వలన ఏర్పడిన శరీరము, దానియొక్క మాయాకార్యములును, మధ్యన ఏర్పడిన కామ్యబంధముల సమూహమును బోధపరచి, **దీనినుండి నీవు విడుపడితివి సుమా!!** అని ఆశీర్వదించుటచే నా దోషభావనలను విడచితిని. వాని నాదములో నేను శరణునొంది, ఆశ్రయించి నిలబడితిని.

1818. పరంజ్యోతిని పొందినచో శివజ్యోతితో జీవునిజ్యోతి కలిసిపోవును: జ్ఞానజ్యోతిని వెలిగించి పరతత్త్వమును గ్రహించండి!! పరంజ్యోతి ముందు శరీరపు కామ్యకర్మల వేదనలు వైదొలగును. పరంజ్యోతిగా బహిర్గతమైన ప్రకాశమును పొందినవారికి శివజ్యోతిలో జీవజ్యోతి కలిసి నెలకొన్నది స్ఫురించనగును.

1819. బాహ్యమైన వెలుగు, చీకటి ఒక కాలములో నశించవలసినవే. కాని అంతర ప్రకాశములో నెలకొన్నవారికి అనుగ్రహ ప్రకాశము ఎప్పటికీ తొలగిపోదు. ప్రకాశములో గ్రహించబడునది బాహ్యము చీకటిని (అజ్ఞానమును) గ్రహించజాలరు. బాహ్యచక్షువులకు బదులుగా అంతర చక్షువులు దర్శించు అంతర అనుగ్రహ ప్రకాశమే **శివం** అగును.

1820. బాహ్యప్రవృత్తిలో మునిగియున్న నాకు నీయొక్క బంగారు ప్రకాశమును నాలో చొప్పించి (బుద్ధి బంగారు ఛాయ గలది) నన్ను నిర్మలునిగా చేసి, ధార్మిక జీవనము బోధించి, ఎవరికి చిక్కని అమృతమును నొసగుటచే, బ్రహ్మాండ ప్రకాశములో నెలకొని భ్రమించియుంటినే!!

1821. అనుగ్రహమను పరంజ్యోతి నాలో నెలకొనుటచే ఆత్మతత్త్వముగాను, దేహతత్త్వము గాను వేరువేరుగా ఉన్న భేదభావన తొలగిపోయి, దేహములోని మనస్సులో ప్రవేశించినది శివప్రకాశమేయన్న తేటజ్ఞానము పొందుటచే, అది **శివగతి** అని గ్రహించండి. (నాదం–శివం–ఆత్మ; బిందు (ప్రకాశం)–శక్తి దేహం; బ్రహ్మాండములో నాదం, ప్రకాశము రెండు కలిసిన సమ్మేళనమే.)

1822. శివుడు ఈ జగత్తున జన్మించి, మరణించెనన్న కథ ఉంటే చెప్పండి చూద్దాం? చచ్చి పుట్టు ఇతర దేవతలను సత్యతత్త్వములన్న భావన వదలండి!! బలిష్టముగా పెరిగిన ఈ దేహమును వదలవలసినదే (కాకులు, గ్రద్ధలకు). శ్రేష్టమైన ప్రాణతత్త్వమును (ఆత్మతత్త్వమన్నది) గ్రహించి తేటపొందుతాం!! ఈ సత్యజ్ఞానమును ఇతరులకు చాటిచెప్పండి!!

## 11. శివపూజ

1823. మానవుని హృదయమే శివ మహామహుని గర్భగృహం (మూలస్థానము). ఈ శరీరమే దేవాలయం. ఆ మహామహుని గాంచుటకు వెళ్ళు సింహద్వారమే నోరు. బాగుగా గ్రహించినవారికి (తేటనైన జ్ఞానము పొందిన జ్ఞానులు) ఆత్మయే శివలింగం. శరీరములో ఇమిడి వంచనలను పురికొల్పు జ్ఞానేంద్రియములు (చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కు – శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములతో విషయవాసలను పురికొల్పునవి) ప్రకాశించు దీపస్తంభములగును.

**(దేహో దేవాలయః ప్రోక్తః జీవోదేవః సనాతనః, త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యం సోహం**

**భావేన పూజయేత్॥** దేహమే దేవుని ఆలయం, జీవులలోని దైవం సనాతనుడు. అజ్ఞాననివృత్తిచే అతడు కనబడును.)

1824. యజ్ఞయాగాదులలో సమర్పింపబడిన నైవేద్యమును (హవిస్సును) స్వీకరించు, విస్తరించిన కిరణములను తన జటాఝూటమునందు గలిగిన శివుడునకు, తగిన వస్తువు (నైవేద్యమునకు) మన వద్ద లేదు. ఉదయమున, సాయంత్రమున నైవేద్య వస్తువుగా ఆతని మనస్సు చల్లబడునట్లు మనము స్తుతించి పాడు పాటలే ఆతనికి హవిస్సు. దానిని నివేదించుము గాక!! స్తుతించి పాడు పాటలే ఆతనికి సమర్పించు పాలు హవిస్సుయగును.

1825. క్షీరమువంటి తీపి పలుకులు పలుకు పరాశక్తి యొక్క భాగస్వామియైన పరాపరుడు (శివుడు) పంచముఖములతో సదాశివమూర్తిగా అతని ఆవాహనము చేసి (శిరస్సు నందు), ఊర్ధ్వముఖమగు ఈశానమూర్తిగా ధ్యానించినచో, శీలుడైన ముఖదారియే జీవునిలో శివంయై ఏకమైపోవును.

1826. శివుని తలంచినంత మాత్రాన, ఆతని గురించి మాట్లాడినంత మాత్రాన చాలదు. నాదస్వరూపుడగు శివుడుని చూచుట అరుదు సుమా!! ఆతని పాదపద్మములను దర్శించ గలవారికి ఆతని నీటితోను, పుష్పములతోను అర్చించిన వారగుదురు. (శివుని నిర్విరామముగా కొలుచువారే ఆతని దర్శనమునకు అర్హులు.)

1827. అభిషేకములతోనూ, అలంకారములోను నెలకొన్న దేవతల మదిలో ఈశుడు నెలకొనుటకు కారణము వారు పంచగవ్యములతోను (గోవుల నుండి పొందిన పాలు, పెరుగు, నెయ్యి, పేడ, మూత్రం అగు ఐదింటితో), షోడశోపచారములతోను నమస్కారముద్రలతో అర్చించినందులకే!!

1828. శివపూజ చేయుటకు గలుగు తలంపే చాలా పుణ్యం. ఆ పుణ్యము పొందుటకు పూవులు, నీరు చాలును. పిదప ఆ మహామహుడైన శివుడు వాటికి సంతసించి, ప్రీతి గలిగి వారిని అనుగ్రహించును. దీనిని గ్రహించని పాపపు జనులు ఎందరో నా నాయకుడగు శివుని పొందకుండానే అజ్ఞానముతో దిగజారిపోవుచున్నారే!! (గమ్యము తెలియక దిగజారిపోవుట.)

1829. శివుడు తొమ్మిది తీర్థములలో (స్థితులలో) నెలకొన్న మహిమను వినుదుము గాక!! అట్లు విని ఉన్నత జ్ఞానము పొందినవారి (శివజ్ఞానము) పాదముల దరిచేరి, నిర్మలముగా సత్యజ్ఞానమును తేటపరచుకొనుము. అట్లు పొందిన జ్ఞానమే **ముక్తియని గ్రహించు** అన్నది ఈ మూలన్ (రచయిత – ఈ తిరుమూలర్) వాక్కు సుమీ!!

1830. సత్యజ్ఞానము సత్సంగమే ముక్తికి మార్గమగును. కాని వారి దారిలో వెళ్ళినను (జ్ఞానుల సత్సంగ గిట్టినను) శ్రేష్టమైన పుష్పములతో, నీటితో పూజచేసి, నేను

మార్పు పొందునట్లు చేసి, ఎటువంటి మరపులేక నిన్ను నిర్విరామముగా స్తుతించు భాగ్యమును గొప్పగా పొందునట్లు అనుగ్రహించు ఓ అమర పరాపరా!! (మరణము లేని (అనాదియైన) పరాపరుడా (పరమేశ్వరా).)

1831. సహస్రనామముతో కూడిన శివునికి ఆతని ప్రియమైన నామముతో (శివ శివ) స్తుతించి ధ్యానించువారికి ఆదిపరాపరుడు దర్శనమగును. అపుడు స్తుతించు దేవతల సమూహము, సదా ఘోషించు సముద్రము, నివసించు భూలోకము నీకు తగినట్లు అమరునే!!

1832. ఆత్మతో నెలకొన్న పంచములన్నిటిని (పంచజ్ఞాన, కర్మేంద్రియములు, పంచప్రాణులు మొ॥) పరిపక్వపరచినది దేవతల సమూహమంతా శివుని స్తుతించగా, తనకు మించిన దైవము లేదనునట్లు నా పరాపరుడు పుష్పములోని తేనెవలె (మాధుర్యముతో) తేటపొందించి (ఉన్నత జ్ఞానము పొందించి) తానే పంచ కృత్యములతో నెలకొనెను. (సర్వ జీవరాశులను తేటపరచి తాను నెలకొనునది.)

1833. పై మంత్రములో చెప్పినట్లు (పుష్పములు, నీరుతో) దట్టమైన మేఘములు వర్షించునట్లు ఊర్ధ్వముఖముగా పైకి ప్రాకి, ఆకాశగంగ నీరు గైకొని, బంధమను పుష్పములలో మునిగియున్న దేవతలు అర్హతలు సాధించలేనిది, మనకి దోషరహితమైన అనుగ్రహమును నా నాయకుడు ఆశీర్వదించును.
(బుద్ధిపూర్వకమైన జ్ఞానమను నీటిని సహస్రమునకు ప్రాకించి **శివం**నందు (ఆత్మ యందు) నెలకొనుట. నీరు = కుండలినీశక్తి; పుష్పములు = ఆధారచక్ర స్థానమల పద్మములు.)

1834. నీటిమండలము నుండి ఉప్పొంగి, విస్తరించిన జటాఝూటముగల సదాశివునిలో (శిరస్సున) నెలకొని, మనస్సు అను ఆకాశమండలములో ఇమిడి, శ్రేష్టమైన పుష్పముతో అర్చించి, తగిన ఫలములను పొందలేరు ఈ బంధములలో చిక్కుకొన్న కపటమూఢులు. పైగా దుఃఖసముద్రములో మునిగిపోవుదురు!!

1835. ప్రవృత్తి మార్గమును (కామ్య కార్యకలాపలములు) పురికొల్పు నీరు (మణిపూరక చక్రం) తత్త్వముతో దుఃఖసముద్రములో మునిగి, పుష్పించని మొగ్గలతో పూజించుదురు. కావున వారు అధోముఖమై, నిందలకు లోనగుదురు. కాని షట్చక్ర స్థానములు దాటి ఊర్ధ్వసహస్రమున నెలకొన్నవారికి శివుడు వారిలో ఇమిడి నెలకొనియుండును.

1836. సత్ఫలితములు ఒనగూర్చు మార్గము ఒకటి గలదు. సత్ఫలమెరిగి నిర్విరామముగా పుష్పములతో కొలుచువారికి హరుడు తానే కోరివచ్చి దర్శనమిచ్చును. ఆ త్రినేత్రములు గలవాని పాదపద్మములను పూజించినచో తానే మార్గమును

(గమ్యమును) చూపించి ఎప్పటికీ దర్శనమిచ్చుచూ నిలబడిపోవును!!

1837. శ్రేష్టమైన పుష్పములు జల్లి, అర్చించి, స్తుతించి, ఆహాకారములు చేసి, నా ఈశుని పాదపద్మములను పూజించుదురు. కాని నా దేహమునందే ఇమిడి (అంతరమున నెలకొన్నవానిని) యున్న దోషరహితమైన స్వరూపముతోను, పరిశుద్ధుడునైన శివుడుని ఎవరు స్తుతించి గ్రహించలేదే!! (బాహ్య ఆహాకారములే తప్ప అంతరమున నెలకొన్నవానిని సృజించలేదు కదా!! అని వాపోవుట.)

1838. దేవతలతో కలిసి పృథివితత్త్వముగా నెలకొని, స్వాధిష్టానములో నుండి ఊర్థ్వముగా వెళ్ళు చక్రములలో పరిశుద్ధమూర్తిగా నెలకొని, బ్రహ్మ, విష్ణువు, రుద్రులు మూవురులో కలిసియూ, వారికి అసంగముగాను, వారికి అతీతముగాను నెలకొని అనుగ్రహించు నా శివుడుని ఎవరు సృజించి గ్రహించగలరు?

1839. శ్రమించదగ్గ వారందరు శ్రేష్టపుష్పములు, నిర్మల జలముగైకొని ఎటువంటి దోషములు లేని ధ్యానముతో ఈశుని ధ్యానించి రెండు కళ్ళతో ఆతని పాదపద్మములను దర్శించి పుష్పములు అర్పించి, వర్షించు మేఘమువలె దివ్యానుగ్రహ ప్రకాశములో ఇమిడి అందే నెలకొందురు గాక!!

(యోగపరిభాషలో చెప్పబడినది: పుష్పములు–ఆధారచక్రస్థానములోని పద్మములలో, కుండలినీశక్తి యను నీటిని ఊర్థ్వముగా ప్రవహింపజేసి, రెండు కళ్ళు – సూర్యకళ, చంద్రకళలతో కూడిన సాధనతో (శ్రమించదగ్గ) చంద్రమండల ప్రకాశములో (శిరస్సు–సహస్రదళమున) ఇమిడి నెలకొనుట. గురుముఖముగా దోషములేని నిస్సంశయ జ్ఞానముతో పొందుట.)

1840. పంచేంద్రియ ప్రజ్ఞలను జయించిన (కామాది చేష్టలు) వారు తమ పూర్వీకులు అనుసరించినట్లు ఆచరించి, శివజ్ఞానులు అనుసరించినరీతిలో చేసినచో, దైవచింతన, దైవోపచారము చేసినట్లై, అందే నిర్విరామముగా నెలకొనుటచే శివుడు మిమ్మల్ని అనుగ్రహించి స్వీకరించును!! ఇది నేను ముందే మీకు ఎన్నోసార్లు చెప్పియుంటిని!!

1841. దైవోపచారములు చేసియూ, అర్పించుకొనియూ, పరమశివుడే స్వయంభుడని స్తుతించియూ, నమస్కరించియూ, ఈ లోకులు దైవము (శివుని) ఎరుగజాలరు. కాని వారివారి మనస్సున ఏర్పడు ఆర్తిని (పలు రకములైన కోరికలు) అంతరము నుండి తొలగించుకొనినచో, అదియే మహాదిశకు (ముక్తికి) దారిచూపు మార్గమగును. (ఆర్తిరహితం, బంధరహితం జ్ఞానమను కంటిని తెరిపించును.)

1842. ఆత్మ నెలకొన్న కమలమగు సహస్రదళ పద్మమునకు పైగా శ్రేయస్సు ఒనగూర్చునది సర్వవ్యాపియై, ప్రకాశకిరణములను తన జటాఝూటమునందు గలిగిన నందీని (శివుడు) పెక్కు మంత్రజపములు ఉచ్చరించుచున్ననూ, కొన్నిటిని పఠనము

చేయుచున్ననూ, శివుడు నెలకొనియున్న నాదాంతమును దర్శింపజేయు మంత్రమును ఈ లోకులు ఎరుగజాలరు సుమీ!!

1843. అష్టజానలతో (సరాసరిగా ఎనిమిది జానలతో కొలవబడ్డ ఈ శరీరము) కూడిన ఈ దేహములో నెలకొన్న మాణిక్యంను దర్శింప, కొలతల నిగూఢ సత్యమును గ్రహించు వారెవ్వరూ లేరు!! స్తుతించి దానిని గ్రహించిన (సత్యమును) సామర్థులకు మాణిక్య మాలాజ్యోతిగా వారి మనస్సున ఇమిడి నెలకొనును.

1844. విశాల హృదయుడైన నందీ, పరపక్వమొనగూర్చు (సంస్కరించగల – అజ్ఞానము తొలగించగల) చక్రసైన్యమును గలిగినవాడు. మహానుగ్రహముతో నా మనస్సున ఇమిడికోరి అనుగ్రహించువాడు. కోరినవారికి కోరినట్లు ఇచ్చు గుణమున్నవాడు. ఆకాశమండలములోని దేవతలు ఆతని ఆధారముతోనే నిలుచుండిరి.

1845. శివపూజతో గలుగు శివజ్ఞానములో శుద్ధి చేయబడు నాలుగు దీక్షలు చెప్పబడినవి (మం. 1476). మత (సంస్కార) దీక్షతో మలదోషములు తొలగి సంస్కరించబడును. విశేషదీక్షతో మంత్రశుద్ధి ఏర్పరచి స్థితి పొందించుట. నిర్వాణదీక్షతో కళాశుద్ధి (సూర్య, చంద్రకళలతో నాడి శుద్ధి), అభిషేక దీక్షతో శివజ్ఞానము పొందజేసి జ్ఞానిగా మార్చుట.

1846. శివుని సత్యస్వరూపునిగా ఎరిగినవారికే శివపూజ సిద్ధించును. శివుని సత్యజ్ఞానముగా ఎరుగక యుగయుగములుగా వెతికిననూ కానరాడు. అక్షరమైన (క్షీణతలేని), శాశ్వతమైన ఆత్మను ఎరుగజాలరు. క్షీరసముద్రమున పవళించిన విష్ణువు, చతుర్ముఖ బ్రహ్మలకు అతీతముగా యుగకాలములోనూ గ్రహింపశక్యము కానివాడైన శివుడు జ్ఞానుల సహస్రదళమున (శిరస్సున) వెలసిల్లియున్నాడు.

## 12. గురుపూజ

సదాశివమూర్తి శిరస్సున నెలకొనినదే గురుమండలముగాను, చక్ర ఆధారములన్నిటిని దాటి నిరాధారమూర్తిని గురువుగా కొలుచుట

1847. మూలాధార పద్మమునుండి తయారగు నందీశ్వరుని పాదములను పట్టుకొని, సుషుమ్నానాడి ద్వారా పైకి ఎగబ్రాకి సహస్రదళ పద్మమును చేరుకొను బోధను గ్రహించి, పూజించి, ఆధారములగు ముప్పది ఆరు (36) తత్త్వములను దాటి (దేహతత్త్వములు) ఆత్మగా నెలకొన్న శ్రేష్టమును గ్రహించి నా మనస్సున నెలకొల్పి స్తుతించుదును.

(కుండలినీ జీవశక్తియే సహస్రదళమునకు చేరినది. శివశక్తిని–శివం పూజించుట.)

1848. అడవి అంతటా సువాసనలతో గుభాళించు చందనము, శ్రేష్టమైన సువాసన పుష్పములు జల్లి అర్చించిననూ, దేహభావన (బంధములను) తొలగించుకొని

జ్ఞానము పొందనివారు, ఎప్పటికీ వెగటు పుట్టించని తేనె మాధుర్యమువలె నొప్పారు సహస్రదళమును చేరుకొనజాలరు.

1849. పొందిన జ్ఞానమునందే స్థితి పొందినచో సత్యస్వరూపమును దర్శింపనగును. అట్లు సత్యజ్ఞానమునందే అమరిన నిష్ఠయే అసలైన అర్చన. ఆ సత్యతత్త్వము అంతరమున నిలకడ పొందినదే (ఎటువంటి ఆటంకములు లేనిది) శ్రేష్టమైన పూజయగును. ఆ దివ్యపాదములందు చేరుటచే తానన్నవి అన్నీ (నేను, నాది అన్న అహంకార, మమకారములన్నీ) చేష్టలు వీగిపోవును.

1850. ఉదయము, మధ్యాహ్నము, సాయంత్రము మూడు పూటలలో దైవము కోరి స్తుతించండి. కోరి **నమ** యను వాని దివ్యనామమును విత్తనమువలె వెదజల్లండి. అట్లు వెదజల్లిన విత్తనము మూడింటిలోను (సూర్య, చంద్ర, అగ్నిమండలములలో) పెరిగి పైరగుటలో స్థితి పొందండి. ఇట్లు పైరైనదే నందీయను నామము గలిగిన నాయకుడు. (**నమశివాయ** యను దివ్యనామ జపముతో శివపైరు పండించవలె.)

1851. శివస్థలములను దర్శించి పూజించుట వలన పుణ్యము నూరింతలగును. శివయోగులున్న సన్నిధిలో శివపూజ చేసినచో పుణ్యము వెయ్యింతలగును. సదా శివధ్యానంలో యుండు యోగులకు భిక్ష నొసగుటచే పుణ్యము కోటిరెట్లు అగును. కాని శివజ్ఞానులకు భిక్ష పెట్టి వారు భుజించునపుడు (ఆ తృప్తిని) కళ్ళార చూచినచో అది విశేషమైన పుణ్యమగును సుమీ!!

1852. ఇందు (చంద్రకళ), భాను (సూర్యకళ)లో ప్రాణణ (శ్వాస) జరిగినపుడు పూజ చేసినచో అసురులకు ప్రీతిని ఒనగూర్చునదగును. చంద్రకళ, సూర్యకళలో ప్రాణణ జరగక స్థితి పొందినచో (సుషుమ్న ద్వారా – భ్రూమధ్యమున స్థితిపొందుట) అట్లు చేయు పూజ నందీకి (శివునికి) చాలా శ్రేష్టమైన పూజగా అమరును.

1853. ఇందు, భానుగా వృత్తులు చేయునవి బిందు, నాదముగా సహస్రదళమునందు స్థితి పొందుటచే, ఎరుక (సృజన) జాగ్రదాతీతములో నెలకొని నందిని పూజించుటయే శ్రేష్టమైన గురుపూజ (గురుమండల పూజ) యగును.

1854. దివ్యానుగ్రహ వ్యాపకములో అణిగిపోయిన క్రియారహితస్థితి: మూలవాయువు (కుండలినీ)ను ఊర్ధ్వముఖముగా ప్రాకించి మనస్సు, ప్రాణణ చలనములను సక్రమ పరచి, అనిత్యమైన పంచభూతాత్మకమైన దేహము, వాటి కరణములు, కరణముల చేష్టలను కట్టడిచేసి, శివానుగ్రహమును సృజించి, ఆనందముగా చేయు పూజయే సదాశివునికి చెందిన పూజయగును.

1855. పగలు (సూర్యకళ), రాత్రి (చంద్రకళ) జరుగునపుడు చేయు పూజ ఈశత్వము (దేవతలకు)నకు చేయు పుష్పపూజగా అమరును. కాని పగలు, రాత్రి కానిదగు

అగ్నికళలో (సుషుమ్ననాడి ద్వారా భ్రూమధ్యమున) జరుగు పూజలన్నిటినీ జటాఝూటములో ప్రకాశకిరణముతో నొప్పారు శివుడు కోరి స్వీకరించునే!!
(ప్రాణిణ ఆజ్ఞాచక్రములో సుషుమ్ననాడి ద్వారా భ్రూమధ్యమున నెలకొని పూజించు పూజయే అతిశ్రేష్టమని చెప్పబడినది.)

1856. ముందు మంత్రములో చెప్పినట్లు రాత్రి, పగలు అన్న భేదము వీడి, జాగ్రదాతీతములో స్థితిపొంది, మరే పరాకు లేక (ఆలోచనా ప్రవాహములు లేక) శివానందమను తేనెను రుచి చూచి త్రాగి, రాత్రి పగలు లేని దివ్యపాదములందే నిలకడ పొంది, రాత్రి పగలులోని మాయలు రెండిటినీ (శుద్ధమాయ, అశుద్ధమాయ) తొలగించుకొని నిలుచుంటిని. (మం. 331 – ఇదే తాత్పర్యం.)

## 13. మహేశ్వరపూజ

1857. చిత్రపటములోనున్న దైవమునకు ఏదైన నైవేద్యము సమర్పించినచో, తిరుగాడు దేవాలయముగా వెలయు శివభక్తులకు ఆ నైవేద్యము వచ్చి చేరజాలదు. కాని అదే నైవేద్యమును తిరుగాడు దేవాలయమునకు (శివభక్తులకు) సమర్పించినచో, అది దేవాలయములోని దైవమునకు తృప్తిని కలుగజేయును!!

1858. ఎటువంటి దోషములు లేని నిర్మల చిత్తముతోనున్న తపస్సంపన్నులు తాము సంతోషముతో భుజించినది త్రిభువనములకు తృప్తిని కలిగించును. వారు స్వీకరించినది త్రిభువనములు స్వీకరించినట్లగునని అష్టదిక్కులకు నాయకుడగు నా నందీ ఎలుగెత్తి చెప్పినాడు!!

1859. ఒక మాత్రను (అకారమును) ఉపాసించి అందు నెలకొన్న శివయోగులకు ఇచ్చిన ఏదైన శ్రేష్టవస్తువు ముమ్మూర్తులకునూ, మూడేడు (3×7=21) తరాలకు అర్పించి నట్లగును సుమా!! దీనిని తేటగా గ్రహించుదువు గాక!!
(శివయోగులకు అర్పించిన దానమహిమ 21 తరాలకు వెళ్ళి చేరునన్నది – అమ్మతరం (7), నాన్నతరం (7), భార్యతరం (7).)

1860. బ్రాహ్మణులకు వెయ్యి ఊర్లు దానమిచ్చి ఏమి లాభం? వెయ్యి గుడిగోపురములు నిర్మించి ఏమి ప్రయోజనం? శివజ్ఞానికి ఒక్క పగటిపూజ భోజనము సమర్పించి పొందు ఫలముతో సరిరాదు పైన చెప్పినవన్నియూ!! ఇది నిశ్చయము సుమా!!

1861. యజ్ఞయాగాదులు నిర్వహించుచూ చతుర్వేదములను ఔపాసన పట్టిన వైదిక బ్రాహ్మణులని పిలువబడువారు కోటిమంది భుజించిననూ, విభూది ధరించిన శివజ్ఞానికి ఒకరికి భోజనము పెట్టవలెనన్న తలంపు మాత్రము ఉండిన చాలదు. అట్లు అగ్నిహోత్రులకు పెట్టుట ఒక పుణ్యమైననూ, అది అతి స్వల్పఫలమే అగును సుమా!!

1862. **తెల్లని జ్యోతి ప్రకాశములో నెలకొన్నవాడా!! ఓ దేవాదిదేవా!!** అని స్తుతించుచూ విభూది ధరించిన శివయోగులు ఈ భువియందు వెలసిన తిరుగాడు దేవతలు. గంగను ధరించిన, ఎర్రని ప్రకాశకిరణములను జటాఝూటమునందు గలిగిన శివుడు ఇతనేయని తలంచి, స్తుతించి, పూజించువారికి వారి జన్మకర్మ ఫలములు లేకుండా పోవును!! (యోగులు, జ్ఞానులకు పూజించుటచే జన్మసాఫల్యమగును.)

1863. శ్రేష్టమైన ప్రకాశమండలమును నాలో నెలకొల్పి, ఆ సన్నిధిలో నన్ను నెలకొన చేసినవాడు **నందీ** అని ప్రశంసించదగ్గ, ప్రకాశకిరణములను తన జటాఝూటములో గలవానిని, నేను చాలా హృదయము కరిగి చెప్పుట ఎందులకనగా, వాని నామమును (శివుని నామము) నిర్విరామముగా తలంచుటకే సుమా!!

1864. క్షీణతను తొలగించుకొన్న శివయోగులకు (సహస్రదళములోని ప్రకాశములో నెలకొని, జీవ అజ్ఞానము తొలగించుకొన్నవారు) పూజించువారికి లౌకిక అజ్ఞానమను చీకటి తొలగును. తొలగించుకొని అందే స్థితి పొందినవారు నిర్మల శివుని దరి చేరుటచే, స్తుతించబడి ఊర్ధ్వముగాయున్న ఏడు లోకములలోను దుఃఖ నివర్తి అగుటయే కాక ఆనందమయము ఏర్పడును.

(సహస్రదళమునకు చేరిన కుండలినీ షట్చక్ర ఆధారములను దాటి పరమానంద మొసగునది.)

1865. భగవంతుని గ్రహించు గుణము ఇసుమంతయూ లేక, మనస్సులో చిరాకుతో పూజించువారు, వట్టి ఉపచారములతో కాలము వెళ్ళబుచ్చువారు, ముఖము చిట్లించుకొని అసంతృప్తితో ఉన్నవారు శివయోగులను స్తుతించుటచే తేటజ్ఞానము పొంది బంధములను త్రెంచుకొనగలరు.

1866. శివయోగులను పూజించుట మహేశ్వరపూజగా చెప్పబడినది: పరిపక్వజ్ఞానము పొందిన (సంస్కరించబడిన) శివయోగులు భుజించిన ఆహారము - రుద్రుడు, బ్రహ్మ, విష్ణువు మూవురు భుజించిన శ్రేష్టతను గలిగినది. తేటనైన చిత్తము గలిగినవారి (శివయోగులు) ఆహారశేషమును (తిని వదిలినది) భుజించినచో ముక్తి (మోక్షం) పొందవచ్చునని మూలన్ చెప్పునది.

(మూలన్ = రచయిత శ్రీ తిరుమూల నాయనార్)

1867. మహేశ్వరులు (శివయోగులు) తమ సాధనలను విరమించక నిర్విరామముగా తపస్సాచరించుదురు. కావున మీరు మీ ప్రారబ్ధకర్మలు తొలగించుకొనుటకు అతనినే ధర్మముగా (పూజ) చేయండి. అట్లు పూజించుటచే, ఆ ధర్మం మీ ప్రారబ్ధము తొలగించుటయే కాక భవిష్యత్తున కలుగు ఆగామికర్మలను, మిగతా యున్న సంచిత కర్మలతో ఏకమవకుండా నశింపజేయును. పిదప జ్ఞానమగు (త్రికర్మ బంధములు

తొలగిపోవుటచే) బంగారు లోకమగును.
(త్రికర్మలు తొలగించి జ్ఞానమొసగునది గురువు వల్లనే సాధ్యం.)

## 14. దాసుల గొప్పతనం

### శివయోగుల శ్రేష్టత

1868. శివయోగులు జీవించు భూమి సుభిక్షముగా ఉండునన్న వివరణ: దశదిశలకు ఆధారభూతమైనవాడును, నాయకుడగు పరాపరము దరిలో అనుగ్రహతత్త్వము గుర్తించిన శివయోగులున్న చోటున (ప్రదేశం) శత్రుభయముండజాలదు. ఋతువులు తప్పక వర్షములు కురియును. ఆ భూమికి ఎటువంటి కొరతలు లేక సుభిక్షమైనదిగా వెలుగొందును.

1869. పూర్వజన్మ పుణ్యఫలముతో ఈ భువియందు జన్మమెత్తి, ఎత్తిన జన్మలోనే ఈ భువియందు మహాతపస్సాచరించి, ఎత్తిన జన్మలోనే శివలోక జ్ఞానప్రాప్తి పొందుదురు. ఆ శివలోకములోని శివశక్తుల అనుగ్రహము పొందుదురు. (మం. 1652 ఇదే తాత్పర్యము గలదు. శివజ్ఞానము పూర్వజన్మ పుణ్యముతో లభించునది.)

1870. లక్ష్యసాధనతో ప్రకాశమండలములోని సహస్రదళమున నెలకొనుటచే, అధో లోకములోనున్న అండములు, ఊర్ధ్వ అండములోనున్న దేవతలు, ఆదియైన పరాపరుడును, అష్టదిక్కులలో నున్నవారు (దిక్పాలక దేవతలు) అందరూ వచ్చి నా చేతులలో ఇమిడిరనగా మనం ఇక ఉన్నతి సాధించినట్లే సుమా!!
(సకల అండములు శివయోగులలో ఇమిడిపోవును.)

1871. సప్తలోకములు, అఖండమును (ఎల్లలు లేని జగత్తు), ప్రాణములన్నియూ, చరాచరములన్నియూ, సకల గుణములునూ, పురాతన వేదములునూ, సృష్టి, స్థితి, లయ మొ॥ వృత్తులు చేయు ఆదియూ, ఆ వృత్తులను సక్రమముగా నడిపించు శివుడునూ, నా వద్ద తప్ప వేరెందు లేరు.
(సకలము శివయోగుల ప్రకాశములో ఇమిడిపోయినదే.)

1872. శివయోగులు అఖండ జ్ఞానమున్నవారు: ఆడ, మగ, నపుంసకుడు అన్న లింగ భేదము లేనిది. అండకోశములో మూయబడి, లోపల జ్యోతిగా వెలుగొందునది ఎవరి చేతను గ్రహింపబడదు. నేత్రకరణముల లేకయే చూచునది, చెవికరణము లేకయే వినునది, జ్యోతులలో జ్యోతిగా వెలుగొందు ఆ పరాపరుని సృజించి గ్రహించునదే జ్ఞానములకెల్ల గొప్ప జ్ఞానమగును.
(పరబ్రహ్మము/ఆత్మను **జ్యోతిషాం జ్యోతి**గా శ్రుతి వాక్యములలో చెప్పబడినది. జ్ఞానేంద్రియములకు, త్రిగుణములకు, లింగభేద, అవస్థాత్రయములకు, అన్ని

ప్రమాణములకు అతీతము. సాక్షి/చైతన్యంగా అన్నిటినీ చూచునది, వినునది, గ్రహించునది. **శ్రోతస్య శ్రోత్రం, మనసోమనః, వాచోహవాచం, ప్రాణస్య ప్రాణః, చక్షుషశ్చక్షుః** – కేనోపనిషత్తు.)

1873. శివయోగుల మహత్వము వర్ణించునది: అండ చరాచరములతో కూడిన ఈ జగత్తున శివయోగులు అజ్ఞాన, మోహరహితులై జ్ఞానమే పరమావధిగా ఉండువారు. కావున వారు ఊర్ధ్వలోకములను పాలించగలరు. వారి భుజములే అష్టదిక్కులగును. వారి దివ్యపాద పద్మములు పాతాళములోనున్నవి. మోహరహితమైన బహిర్రంధ్రమే వారి శిరస్సుయగును. (శివయోగులు నిర్విరామముగా ఆత్మలో నెలకొనుటచే వారే శివమై అఖండములో వ్యాపించియుందురు.)

1874. చిత్తములో శివుడే నెలకొనుటచే, మనస్సు స్వాధీనమైన స్థితిలో వికార రహిత, శోకరహితమై అహంకార, మమకారములు తొలగించుకొన్నవారై యుందురు. ఇట్లుండుటచే పంచతన్మాత్రల ప్రజ్ఞలు మొదలగు అష్టములు తొలగినవారైయుందురు. (అష్టములు: శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు, మనస్సు, బుద్ధి, అహంకారములు(8). ఇవి తొలగుటచే సూక్ష్మశరీరమును కూడ త్యజించగలిగి, ముక్తికి మార్గమును – జీవన్ముక్తులగు సామర్థ్యము పొందగలరు.)

1875. అన్నీ శివమై యున్నారన్నది చిత్తములో పదిలమగునపుడు శివుడే అన్నిటినీ పరిపక్వ పరచును: నాకు తొలగించవలసినది, చేర్చవలసినది, ప్రేమతో కూడిన సఖ్యతను లయముగానున్న ఆదిపరాపరుడు నేను తలంచినంత మాత్రమున అన్నీ ఏర్పరచి, ప్రశంసలు, నిందలు, వాటివలన ఏర్పడు విపరీత భావనలు తొలగించి, నా ప్రాణమగు భూమి (క్షేత్రము–దేహము)ని దున్ని పరిపక్వపరచెను!!

1876. నా తల్లి తరపున ఏడు జన్మములును, తండ్రి తరపున ఏడు జన్మములును అనాదియగు శివునికి బానిసయని రాసియిచ్చిన తాళపత్రమును, జగత్సృష్టికి కారణభూతుడు, ఏకమైనవాడునగు నా నాయకుడు రాసియిచ్చెను. దీనికి మేఘశ్యాముడగు విష్ణువు సాక్షిగా పత్రములో సంతకము చేసెను.
(శివునికి శివయోగులు బానిసగా ఉండుట.)

1877. శివయోగులు కఠిన సాధనలచే సాధ్యం (శివతత్త్వపు మహిమ) చేకూరిన పిదప ఆ స్థితినుండి దిగజాలరు: శివుడు, నిశ్సంసయ జ్ఞానముతో తనే ఆదియని భావించి, తమ చిత్తములో నిలుపుకొన్న శివయోగుల మదిలో శాశ్వతముగా ఇమడి నెలకొనును. తననే స్తుతించి, సదా కొలుచువారి ఇచ్ఛలను తాను కోరి నెరవేర్చును. తననే సర్వమని భావించి వృత్తులు చేయువారి మదిలో ఆదిపరాపరుడుగా నెలకొని అనుగ్రహించును. ఇట్లు నిర్విరామముగా తలంచువారి మది నుండి ఎప్పుడైన

వీడిపోవునా ఏమి! (వీడిపోదు)

1878. శివయోగులపై తన దివ్యపాదములను ఉంచి బంగారు ప్రకాశమును అనుగ్రహించును: దేవతల శిరస్సున వెలుగొందు ప్రకాశకిరణములో నెలకొన్న పరమేశ్వరుడు, తన పాదములకు చేయు సేవలన్నిటని శివయోగులపై ఉంచి అనుగ్రహించెను. వారి దేహము జీర్ణోద్ధారణ పిదప సృజనతో నెలకొని, ప్రకాశ మండలములో (పరిపాలించు తత్త్వమును) జటాఝూటమును గలిగిన ఆ నాయకుడు వారికి సత్ఫలము పొందునట్లు చేయును. (సత్ఫలము: ముక్తి, జీవన్ముక్తి.)

1879. శివయోగులు ఆ సృజనలోనే ఉండడము గొప్ప తపస్సగును: శివయోగులు జ్ఞానము పొందకముందు శివుని సాకారరూపమును స్తుతించి సుఖమును పొందినది ఒక బానిసత్వమగును. కాని పరమేశ్వరుని ప్రకాశమండలములో, తన దివ్యచరణము దాల్చిన సృజనతో ఉండడమే మహాతపస్సుతో సమానము.

1880. శివయోగులు తన దరిచేరి ప్రేమ సలిపినవారిని (భక్తులను) శివునిని వారు స్తుతించునట్లు చేయగలరు. ఆ భక్తులు శివయోగులను నిర్విరామముగా కొలిచినను, శివతత్త్వము (శివయోగుల మహత్వము వలన) భక్తులలో నెలకొని అనుగ్రహము పాలించును. (శివయోగులకు చేయు పూజలు శివతత్త్వము పొందజేయును.)

1881. భూమిని, దానిలో నివసించు ప్రజలను ఉద్ధరింపగోరి ఎనిమిది (8) విధములగు దేవగణనాధులు కోరి, ప్రియముతో ఈ భువికి వచ్చుదురు. వారి రాకతో భూమి అష్టదిక్కులు ఆకాశమువలె ప్రజ్వలింపగా, పన్నెండు విధములుగా ఎల్లలులేని సుఖములను గలుగజేయును.

1882. శివయోగులు నివసించు ప్రదేశమే జ్ఞానులు నివసించు ప్రదేశమగును. అవయోగం (వికల్పములు, విఘ్నములు) లేని జ్ఞానమును గలుగజేయును. నవయోగం (కొత్త యోగం సిద్ధించి) గలిగించి సర్వసుఖములు గలుగజేయును. భవయోగం (సంసార చక్రము) పారద్రోలి పునర్జన్మ రహితముజేసి పరలోకం ప్రాప్తింపజేయును.

1883. ఉత్కృష్టమైన శివజ్ఞానమును పొందియుండుటచే శివయోగులు పెక్కు అండములను తామే సృష్టించగలరు. ఈ జ్ఞానముచే వాటికి అతీతముగాను ఉండగలరు. వివిధ అండములలో జీవించు దేవతలవలె వీరును మరణమును జయించినవారగుదురు (జీవన్ముక్తులు). ఇటువంటివారే సత్యమైన శివజ్ఞానులగుదురు (సత్యస్వరూపత్వ మెరిగినవారు). (దేహేంద్రియ మనోబుద్ధులను త్రోసిపుచ్చి ఆత్మతత్త్వములో (స్వస్వరూపంలో) నెలకొని యుండువారు.)

## 15. భోజన విధానం

1884. లోకములో అష్టదిక్కులలో శివయోగులకు సమర్పించు భోజనమును వారు దానిని అమృతమని గైకొని సేవించుదురు. ఏలననగా (దేహమే దేవాలయం-క్షేత్రము) ఈ క్షేత్రమును రక్షింపగోరి. అట్లు క్షేత్రమని తలంచి రక్షింపకుండినచో క్షేత్రము పాడైపోవును. కనుక పాడైపోవుటకు విడువజాలరు.
(దేహమును రక్షించుకొనుటకు మాత్రమే శివయోగులు భుజించుదురు.)

1885. ఆ శివుడే దేవాలయముగానున్న దేహములో అమరియున్నాడన్న స్పృజనలో ఉండుటచే, శివయోగులు ఆ నాయకుని కొరకు మధ్యాహ్నమువేళ (ఒకపూట) భిక్ష గ్రహించి, భేదరహిత జ్ఞానము పొందియుండుటచే (భోజనరుచులను గ్రహించక), ఆసక్తి విడనాడి, ఏకాంతములో తామెక్కి (సహస్రదళమున) నెలకొనియుందురు.

## 16. భిక్షా విధానం

1886. ఈ దేహమును పాత్రలో విత్తనము యొకటి (శుక్రము) గలదు. విత్తనము వెదజల్లిన పిదప దానిని కాపాడుటకు కంచె (సహస్రదళము) ఒకటి గలదు. శిరస్సుయందు (ఆజ్ఞాచక్ర ధ్యానము వలన) పంట పండినపుడు (నిస్సంశయ జ్ఞానముతో) ఊర్ధ్వ సహస్రదళమున నెలకొని ఫలము పొందలేనివారు ఇచ్ఛకు తగ్గట్లు బాహ్యముగా భిక్ష గైకొనుట ఎందులకో? ఏమి ఈ పాపం!!

1887. బ్రహ్మ శిరస్సుతో శివుడు భిక్షను స్వీకరించెను. ధర్మమును (జ్ఞానమును) నెలకొన జేయుటకు భిక్షను స్వీకరించెను. బ్రహ్మ శిరస్సును చూపి శ్రేయస్సు కొరకే భిక్షను స్వీకరించెను. ఆ బ్రహ్మ పరమగుట కొరకే భిక్షను స్వీకరించెను.
(బ్రహ్మ, శిరస్సు, ధర్మము, శ్రేయస్సు, పరమగుట మొదలగు పదములన్నియూ యోగపరిభాషలో స్వాధిష్ఠానమధిపతి బ్రహ్మ-సృష్టి మూలకారకుని, ఊర్ధ్వముఖముగా సహస్రదళమునకు ప్రాకించి, ధర్మమును ప్రతిష్టించి, జీవునికి శ్రేయస్సు ఒనగూర్చి, పరముతో ఐక్యపరచి, పరమానందం పొందించుట. కుండలినీని ప్రకాశ మండలమునకు ప్రాకించి అనుగ్రహించుట.)

1888. అంతటా వ్యాపించిన ఈ ఏడు లోకములను సృష్టించిన ఆ పరాపరుడు (శివుడు), లోకుల వద్ద భిక్షను స్వీకరించి భుజించుట ఎందులకో? అని అందురు. ఎందులకనగా తనను తన శివభక్తులు నిర్విరామముగా తమ చిత్తమున నిలిపి కొలుచుచున్నారని, వారి భిక్ష స్వీకరించి తన దివ్యపాదములతో వారికి అనుగ్రహించుట కొరకే!!

1889. శివభక్తులు తన దివ్యచరణములను చేరుకొనుటకు అనుగ్రహించి ఆదుకొనును: శివభక్తులు వారి సాధన ప్రయత్నములో తాను తోడుండి సహాయపడును. శ్రేష్టులకు

(శివభక్తులకు) తన ఆనందమయమును ఇచ్చి అనుగ్రహించును. తానే వారికి శరణాలయముగా నెలకొనును. ఇట్లంతా ఆదుకొని అనుగ్రహించువానిని **ఏమీ తెలియని అజ్ఞాని** యని అనగలమా?

1890. శివయోగులు అగ్నితో దహింపజేయు ఆకలిని, ఆసక్తిని, కోపమును తొలగించుకొన్న వారైయుందురు. శరీరసుఖములను కోరజాలరు. భూలోకవాసము గాని, స్వర్గలోక వాసముగాని కోరక, శివమహామహుని కోరి కోరి శివతత్త్వమునందే ఐక్యమగుటకు ఆయత్తమగుదురు.

1891. తమ అనుభవములు ఏది కాదని, అంతా ఈశ్వర ప్రసాదమని తలంచుట: సత్యమైన ఆత్మజ్ఞానము పొంది, జ్ఞానమును తేటపరచుకొన్నవారు కూడా కొన్ని సమయములలో దానధర్మ పుణ్యఫలమును ఆశించుదురు. కాని శివయోగులు తపస్సంపన్నులు, నిస్సంశయ జ్ఞానముతో భిక్షకు వెళ్ళక అంతా ఈశ్వరకృపయని తలంచి యుండుటచే లోకులందరు అతని వద్దకు వెళ్ళి అనుగ్రహము పొందునట్లు చేయబడును.

## 17. ముద్రల భేదములు

శాంభవీ, ఖేచరీ మొదలగు ముద్రల భేదము

1892. పదకొండు కరణముల (కర్మేంద్రియలు–5, జ్ఞానేంద్రియములు–5, మనస్సు–1 = 11) మార్పులకు (అనగా జీవబోధం దారిన వెళ్ళక శివబోధంనకు మారుట) తోడగు ముద్రలు అమృతము స్రవించు మౌనభాషలో పదిలపరచి (ప్రణవభాష–అ, ఉ, మ, నాద, బిందు) అంతటికీ శ్రేష్టమైన నందీ దివ్యపాదములను పొందనిచ్చి, ఆహాకారములన్నీ అణిగిపోయి మేలైన స్థితియగు ముక్తిని పొందనిచ్చును.

1893. మూడు రకములైన తురీయములు ఇమిడిపోవు స్థానమై (జీవతురీయం, పర తురీయం, శివతురీయం) జీవతురీయంలో పై మంత్రములో చెప్పిన కర్మ, జ్ఞానేంద్రియముల కరణములు + మనస్సు మొ॥ (11) పనిచేయవు. పరతురీయంలో 36 దేహతత్త్వములు పనిచేయవు. కాని ఆత్మతత్త్వము ఉండును. శివతురీయంలో ఆత్మతత్త్వము తానన్నది కోల్పోయి **శివం**తో లయమై ఏకమైయుండును (అద్వైతస్థితి–ఆత్మ బ్రహ్మం ఒక్కటైన స్థితి). చాతుర్యముగా మాట్లాడగల నాలుకను అణిచి, **శాంభవి**, **ఖేచరీ**లో నెలకొని (శాంభవీ–కంటిచూపును నాసికాగ్రమున నిలిపి ధ్యానించు పద్ధతి; ఖేచరీ–కంటిచూపును భ్రూమధ్యమున నిలిపి క్రమముగా సహస్రమునకు ప్రాకి, అందు నిలిపి ధ్యానించు పద్ధతి), తద్వారా జ్ఞానమును పొందజేయ ముద్రలగును.

1894. శాంభవీ ముద్ర అనుగ్రహమును, ఖేచరీ ముద్ర జ్ఞానమును ఒనగూర్చు వివరణలు: శాంభవీ ముద్ర నందీశ్వరుని అనుగ్రహమొనగూర్చి, దేహమును అనుసరించి వచ్చు భవరోగమగు పునర్జన్మను తొలగించి అనుగ్రహించును. ఖేచరీ ముద్ర ప్రణవముతో కూడినదైనందున శివయోగులగు మనము సాధన చేసి, శివజ్ఞానమును పొందదగు ముద్రలగును.

1895. ఆధారములలో వెలయుచున్నది సదాశివమగును. ఆధారరహితమై – నిరాధారముగా ఉండి జ్ఞానమొసగునది పరమశివుడగును. కావున సాకారరూపములో నున్నవారిని (బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సాకార సదాశివుడు) దాటిన స్థితియే మౌనస్థితి (సహస్రమున నెలకొనుట). ఇదే ముక్తాంతముక్తి. ముక్తికి అత్యంతమైనది.

1896. వాక్కు, మనస్సు రెండును వృత్తులు లేక ఉండునదే మౌనస్థితియగును. నోరు మాత్రము మాట్లాడకుండినచో అది మూగస్థితియగును. వాక్కుతో మనస్సు వృత్తి రహితమైనదే శుద్ధి చేయబడిన తత్త్వమగును. అట్లు శుద్ధి చేయబడు తత్త్వమును ఎందరు ఎరుగుదురు?

1897. యోగము కైవసమై సత్ఫలితమైనదని చెప్పుట, అణిమాది అష్టసిద్ధులు తన వశమైనపుడే. దైవముతో ఐక్యమగు జ్ఞానముద్రలు ఏవని పరిశీలించినచో, వేదములలో చెప్పబడిన ఖేచరీ, శాంభవీ శ్రేష్టత పొందినవిగా చెప్పబడి, యోగసిద్ధికి మాత్రము ఖేచరీనే ప్రసిద్ధిగా చెప్పబడినది.

1898. ఖేచరీ యోగసిద్ధిని వర్ణించబడినది: యోగియనువాడు అష్టమాసిద్ధులను పొంది అనుగ్రహ ప్రకాశవాసనతో ఉందురు (నాద సామీప్యములో నెలకొని – శిరస్సున సహస్రమునకు చేరినది). అతనే భోగిగాను పురుషార్థములను (ధర్మ, అర్థ, కామ, మోక్షం) బాగుగా ఎరిగినవాడు. తనకు షట్చక్రస్థానాధిపతులు, శక్తియూ సహకరించును. అతనే ఏకమైన **శివం**తో కలిసి ఇమిడి ఏకమై నిలుచుండును.

1899. యోగతత్త్వములలో చెప్పబడు పన్నెండు (12), ద్వాదశ కళలతో కూడిన సూర్య ప్రసాదతత్త్వము, పదహారు (16) షోడశ కళలతో కూడిన చంద్రప్రసాద తత్త్వము అను రెండురకములు. వీటివలన జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు వాటి కామాది వాసననతో వెళ్ళక, వాటిపై కాంక్ష తొలగియుండును. ఈ స్థితియే ఎటువంటి దోషములేని వేదాంత సిద్ధాంత స్థితియగును. దైవమును భావనతో కూడి చిత్తములో పదిలమైనది శుద్ధ శైవమగును.

1900. ముద్రల వలన మనోచనలము, ప్రాణచలనము నియంత్రించబడును: **మౌనముద్ర** ముక్తి పొందుటకు గాను, **జ్ఞానముద్ర** (ఖేచరీ) గురుస్థానమున (శిరస్సున గురు మండలము) ఇముడునదిగాను, **తేనెముద్ర** (శైవ) సిద్ధాంతమును (శాంభవీ)

తెలుపునదియూ, **కానిముద్ర** (సరం, శ్వాసచలనము) గాలిని నిలుపు ముద్రలగును (నియంత్రించగలవు).

1901. శ్రేష్ఠతత్త్వమగు కంఠస్థానమును ఆధారముగా చేసుకొని ప్రాణవాయువు (మూల వాయువు-కుండలినీ) శిరస్సు-శిఖర స్థానమునకు వెళ్ళును. పుష్పతత్త్వమగు సహస్ర దళపద్మమునకు చేరి అచ్చట బంగారు వన్నె పొందును. దానిని పైగా వెళ్ళి తెల్లని (చంద్ర) ప్రకాశమండలముగా వెలుగొందును. వాయుతత్త్వముగా ప్రాణణ (శ్వాస) చలనములతో చిత్తము శుద్ధియగును.
(సహస్రదళ పద్మమున చేరి (శుద్ధిపొంది) ఉన్నతి పొందవలెను.)

## 18. పూర్ణగుహతత్త్వ సమాధి

పూర్ణసిద్ధి పొంది గమ్యముతో నెలకొనుట

1902. శివయోగులు ప్రారబ్ధము ఖర్చుచేయుటకుగాను ధరించిన ఈ భోగదేహము చాలించిన పిదప, వారి ఆత్మ షోడశకళలతో కూడిన శుక్లపక్షమిలో దేవతలలో కొంతకాలము ఉండి, ప్రకాశముతో కూడిన సూర్యమండలములో కొంతకాలము గడిపి, తడబాటులేని పితృలోకములో కొంతకాలము గడిపి, కడపట శశిమండలమును (చంద్ర) చేరుకొనును.

1903. పై మంత్రములో చెప్పినట్లు సమాధి చేకూరక శరీరమును విడచిన వియోగి కర్మఫలములు తగ్గట్లు ఊర్ధ్వలోకములో కొంతకాలముండి, మరల భూమిలో జన్మించి ప్రారబ్ధకర్మలు అనుభవించి, దైవానుగ్రహము తోడుతో మహాయోగమును బూని జన్మను ముక్తితో పూర్తిచేయుదురు.

1904. శివయోగి లోకులతో కూడి శ్రేయస్సు గలిగించు సత్కర్మలు చేయుచూ, అన్నిటికీ మించిన శివయోగమును సాధనలతో జ్యోతిప్రకాశమును తమలో పొందుటకు ముందుగా తమ శరీరమును **కాయసిద్ధి** చేసి శ్రేష్టమైనదిగా మార్చుకొనుదురు.

1905. శివజ్ఞానము పొందిన శివయోగులు దేవతలచే స్తుతింపబడుదురు: శివయోగులగు జ్ఞానులు యోగం పూర్తికాకముందే మరణించినచో వారు తపోలోకము చేరుకొని అందు కొంతకాలముండి, పిదప జన్మించి, శివయోగం ద్వారా శివజ్ఞానము పొంది నిలకడగా ప్రకాశమండలములో వెలుగొందుదురు. వారు దేవతలచే స్తుతించబడిన పుణ్యపురుషులగుదురు.

1906. పూర్ణత్వము పొందిన శివజ్ఞాని మౌనసమాధిలో నెలకొని ముక్తి పొందుదురు: ఎటువంటి కొరతలు లేని, దోషములు లేని శివజ్ఞానులు శరీరమును విడిచినచో, తానన్న స్పృహలేని మౌనసమాధిలో నెలకొని (ఏకత్వం) శివతత్త్వమును పొంది

యుందురు. కావున వారు మరొక శరీరమును ధరించరు. నిర్మలమై, ముక్తులై లోకవాసనల రహితమైయుందురు.

(అనగా జీవన్ముక్తులై మరణాంతరము విదేహముక్తి పొందుదురు.)

1907. శివజ్ఞానులు మరణించిననూ, త్రిమలములను తొలగించుకొని శివతత్త్వముతో ఏకమైనవారే: మరణించిన పిదప గలుగు ఫలము ఏమనగా, మరణించి సిద్ధి పొందినదే. అట్లు సత్ఫలము చేకూరినవారికి మరణించిననూ, వారు లోకములో నివసించువారే అగుదురు. ఏలననగా అసత్తుయగు ముమ్మలములను (అహంకారము, కామ్యము, మాయ మూడింటిని) నాశనము చేసుకొని **శివం**లో లయమైనవారు.

1908. ప్రణవయోగము ద్వారా శక్తులు పొందిన శివజ్ఞానికి, ఆ పరమశివుడే ఆతనిని సర్వశక్తిమంతుని చేసి అనుగ్రహము పాలించుటచే ఆ జ్ఞానికి ఎంతమంది శిష్యులున్ననూ వారికి కూడా ఆ అనుగ్రహమును గలిగించి, ఆ జ్ఞాని తన ఇచ్ఛకు తగ్గట్లు శిష్యుల దేహమును నిర్మలదేహముగా మార్చివేయును.

(శివానుగ్రహము పొందిన జ్ఞాని తన శిష్యుల శరీరమును కూడా శివరూపముగా మార్చివేయగలరు.)

1909. ఈశుని రూపము ధరించిన శివజ్ఞాని అఖండములో ఉన్నవన్నిటినీ ఎరుగగలరు: అంతటా నెలకొన్న **శివం** అనుగ్రహంతో నెలకొన్న శివజ్ఞానికి అంతటా శివుడే కనిపించును. అంతటా నెలకొన్న పంచభూతములను తనలో ఇముడ్చుకొన్న ఆకాశము వలె, ఈశుని తనలో నెలకొనుజేసుకొన్న శివజ్ఞాని తన శరీరప్రజ్ఞలు తొలగించుకొని అఖండములో వెలసిల్లును.

## 19. సమాధి క్రియలు

శివజ్ఞాని శరీరము విడచిన పిదప చేయవలసిన సంస్కారములు

1910. శివజ్ఞాని మరణాంతరము శరీరమును అగ్నికి ఆహుతి కానీయక సమాధి చేయవలె: క్షీణతలేని శివజ్ఞాని శరీరమును దహింపజేసి ఉడికి నశించినచో, దేశప్రజలంతా ప్రచండమైన జ్వరముతో బాధపడుదురు. సరైన గమనింపు లేక చెడి క్రుళ్ళి, కుక్కలు నక్కలకు ఆహారమైనచో ఆ దేశము అంతర్ కలహములకు లోనై, యుద్ధము ఏర్పడి ప్రజలు చనిపోయి కుక్కలు, నక్కలకు ఆహారమగుదురు.

1911. శివజ్ఞాని యొక్క దేహము అగ్నికి ఆహుతియైనచో, శివుడు నెలకొన్న శివాలయమునకే నిప్పుపెట్టి కాల్చినట్లగును. దేశమునందు వర్షములు కురియవు. జగత్తంతా క్షామము ఏర్పడును. లెక్కలేనన్ని రాజులు తమ రాజరికము కోల్పోవుదురు.

1912. శివజ్ఞాని యొక్క దేహమును పూడ్చుట మహాపుణ్యమగును. అట్లుకాక దేహమును కాల్చినచో దేశమునకు నాశనమేర్పడును. ఆ దేహమును మట్టిలో పూడ్చక నశింప జేసినచో, దేశమునకు అలంకార భంగమేర్పడును. జగత్తంతా అగ్నికి ఆహుతియగును.

1913. శివజ్ఞాని శాశ్వతానందమును (క్షీణతలేని తత్త్వము) తనలో పొందియుండి దేహమును విడిచినందున, ఆ దేహమునకు మట్టిలో ఒక గుహవంటిది (సమాధి) ఏర్పరచి అమర్చినచో (భూమి త్రవ్వి ఒక గదివంటిది ఏర్పరచి), ఆ దేశము సౌందర్యముతో నిండిన రాజు, ప్రజలు ఎల్లలులేని అమితానందము పొంది ఈశ్వరానుగ్రహము కూడా పొందగలరు.

1914. సమాధి (గుహ) కొలతలు చెప్పబడినవి: గుహ ఆకారము త్రిభుజము; ఒక్కొక్క పక్క మూడు అడుగులు నిడివి, వెడల్పు. లోతు–ఐదు అడుగులు. తపస్సు చేయుటకు కూర్చున్నట్లు అడుగుభాగము సమముచేసి, జన్మరహితం చేసుకొన్న శివజ్ఞాని శరీరమును పద్మాసనములో కూర్చుండబెట్టవలెను.

1915. భూమిలో గుహ ఏర్పరచుటకు అనువైన స్థలములు: సమాధి చేయవలసిన స్థలము తన ఇంటి (శివజ్ఞాని ఇంటి) పరిసరములలో, రహదారి ప్రక్కన, చెఱువు కరకట్ట వద్ద, నదీతీరములు, పూవుల తోట లేక నగరమున ఉత్తమ ప్రదేశము, అందమైన (జనసంచారముతో కూడినది) అడవి, ఎత్తైన పర్వతలోయ మొ॥ ప్రదేశములే అనువైనవి.

1916. సమాధికి మరొక విధమైన కొలతలు కూడ చెప్పబడినవి: ఐదు (5) అడుగుల సమముగా అన్ని ప్రక్కల (చతురస్రాకార) నిడివి, వెడల్పు సమానముగా, తొమ్మిది అడుగుల లోతులో బాగా చదును చేసిన భూమిలో మూడు అడుగుల త్రిభుజము ఏర్పరచి అందు సమాధి చేయుట మరొక పద్ధతి అగును.

1917. గుహలో (సమాధిలో) వేయవలసిన వస్తువులు చెప్పబడినవి: పంచలోహములు (బంగారు, వెండి, రాగి, సీసము, ఇనుము), నవమణులు (వజ్రము, వైడూర్యం, మాణిక్యం, మరకతం, పగడం, గోమేధికం, పుష్పరాగం, ముత్యం, గురువింద) గుహలోని భూభాగములో వేసి, చదునుచేసి, దానిపై ఆసనమేర్పరచి, దర్భను వేసి సమము చేసి, దానిపై దివ్యవిభూది చల్లి, దానిపై స్వర్ణ సున్నం వేసి మెత్తగా చేయవలెను (స్వర్ణ సున్నం = బంగారుపొడి + పసుపుపొడి మిశ్రమం. సువాసన ద్రవ్యముల పొడిని చేర్చి కలిపి తయారుచేసినది; ఈ మిశ్రమవర్ణన శ్రీ మాణిక్య వాచగర్ వ్రాసిన **తిరువాచగం**లో చూడగలరు (అధ్యాయం 9, దివ్యబంగారు పొడి). కొన్ని శుభకార్యములకు వాడుదురు.)

1918. నాలుగు అడుగుల చతురస్రాకారములో సమము చేసిన మట్టముపై సువాసనలతో నిండిన పుష్పములు, చందనము, కస్తూరి చల్లి, పునుగు, పన్నీరు కలిపిన జలమును చల్లి, ప్రకాశముతో కూడిన దీపమొకటి వెలిగించవలెను.

1919. దివ్యవిభూదిని బహుదట్టముగా శరీరమంతటికీ పూసి, జ్ఞాని శరీరమును పద్మాసనములో కూర్చొండబెట్టి, వాసన పుష్పములు, గడ్డిపరకలు, వాసన ద్రవ్యముల పొడి, దివ్యవిభూదిని దట్టముగా పైన చల్లి, గుహ మీద నుండి నాలుగు ప్రక్కలకు మట్టిని పోసి కప్పి సమము చేయవలెను.

1920. అట్లు మూసిన పిదప నాలుగు ప్రక్కలను సమము చేసి, దానిపై పేలాలు (మురియలు – బియ్యంలో వేరే రకం) అన్నం, కొబ్బరిబొండాంలను దానిపై ఉంచి, శివజ్ఞాని యొక్క పాదుకలు (చెప్పులు), ఆతని కమ్మలు, ఆతని ముఖము, కళ్ళు (జ్ఞాని ఆకార జ్ఞాపికలు) ఉంచి, దానిపై ఉత్తరీయంతో (అంగవస్త్రం) కప్పివేయవలెను.

1921. అలంకారము చేసిన పిదప ఉపచారము చేయుట వివరించినది: దివ్యవిభూతి, వాసన ద్రవ్యముల పొడి చల్లిన పిదప దర్భలు, బిల్వము, పుష్పములతో పాదసేవ, ఆచమనం, అర్ఘ్యం సమర్పించి భూమిపై మూడుకు మూడు (3×3×3) అడుగుల ఎత్తులో చతురస్రములో పీఠము ఏర్పరచవలెను.

1922. పీఠము సమాధిపై ఏర్పరచిన పిదప, రావిమొక్క లేక శివలింగము ఏదోఒకటి స్థాపించి, ఆ సమాధి శ్రేష్టమగు ఉత్తరదిక్కు గాని లేక తూర్పుదిక్కు గాని చూచునట్లుగా అమర్చి, ప్రియముతో షోడశోపచారములు (16) శిష్యుడు చేసి భక్తితో కొలువవలెను.

## 20. బిందుత్పన్నము

బిందు ఉత్పన్నమైన వివరణ: అండం ఉత్పత్తికి కారణమైన బిందును, పిండము ఉత్పత్తికి కారణమైన విందును (శుక్రము) వివరణ చెప్పబడినది.

1923. సృష్టికాలములో బిందు నుండి ఉత్పన్నమైన తత్త్వములు చెప్పబడినవి: సృష్టికాలములో బిందు నుండియే శ్రేష్టమగు కుండలినీయూ మరియూ సృష్టికి కారణమైన పరమకాయ మండలము నుండి బిందు కార్యములైన తొమ్మిది భేదములగు బ్రహ్మాది మొదలగువారు, వారి శక్తులతో, వారు వృత్తులు చేయుటకుగాను అంతఃకరణమలు (4), పంచ కళలు (5), వైఖరాది శబ్దములు (4) పుట్టినవి.

(శివభేదములు (9), శక్తి భేదములు (9) నవశక్తులుగా, పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి (4) శబ్దములు; పంచకళలు: నివర్తి, ప్రతిష్ట, విద్యా, శాంతి, శాంత్యాతీం (5) మొదలగునవి.)

1924. బిందు కార్యముల వలన బ్రహ్మాది ఐదుగురు వారి పంచతత్త్వములతో కూడి (పరాపరం, పర, ఇచ్ఛ, జ్ఞానము, క్రియ) ఇరువది ఐదుగాను (5×5=25) శరీరంలో

నెలకొని వృత్తులు చేయుదురు. ఇవే నాదభేదముల వలన ఆరు, ఆరుగా విభజించ బడును. దీనివలన సాకారములతోనున్న బ్రహ్మ, విష్ణువు, రుద్ర, మహేశ్వరుడగు నలుగురు మిగతా తత్త్వములలో ఇముడుదురు. ఇట్లు ఆరు, ఆరైన ముప్పదిఆరు తత్త్వములుగా వృత్తులు చేయుదురు.

1925. సృష్టించబడ్డ అన్ని భేదములు **పరబిందు** (ఉత్కృష్టమైన ప్రకాశమండలము) వలన ఏర్పడినవే. సృష్టిని ఏర్పరచిన (1) శుద్ధమాయ, (2) వాక్‌శక్తి, (3) తత్‌పరం (శివ, శక్తి), శ్రేష్టమును పురికొల్పు ప్రణవముతో కూడిన (4) కుండలినీయూ ఈ నాలుగు బిందు శక్తిలో నెలకొని వెలుగొందును.
(**పరబిందు** నుండియే ఈ నాలుగు ఏర్పడినవి.)

1926. నెలకొన్న నివృత్తి మొ॥ పంచకళలు **అకార** కళలో ఇముడును. శ్రేష్టమగు **ఉకార**ము **మకారం**లో ఇముడును. బిందు (కుండలినీ) దోషములేక ఊర్ధ్వమునకు ప్రాకి నాదాంతములో నెలకొని, అంతఃకరణమగు మనస్సుతో కూడి మనస్సుతోనే అంతమగును.

1927. **పరాపరుడే** శుద్ధమాయతో కలిసి ప్రపంచసృష్టి కారణభూతుడై సృష్టించి, అనుగ్రహించు విత్తనము అగును. ఆదియూ, అంతముగా నున్నది ఆ పరాపరమే. (పరాపరం/పరబ్రహ్మం/పరమేశ్వరుడు/శుద్ధ చైతన్యం/ప్రకాశము/జ్యోతిషాం జ్యోతి మొ॥ అన్నియూ దానికి పర్యాయ పదములే) అన్నిటినీ సృష్టించునది అదే. అంతమునకు మూలముగా నున్నది అదే. అదే శుద్ధమాయకు కారణ, కార్యముల నొసగి (సృష్టి మొదలగు వాటిని ఏర్పరచి) పంచకృత్యములగు (సృష్టి, స్థితి, తిరోధానం, అనుగ్రహం, లయ – 5) ఐదు వృత్తులు చేయించు బీజమగును (విత్తనం).
(సృష్టించబడ్డ అన్నియూ ప్రళయకాలములో ఒక్కొక్కటిగా వరుసక్రమముగా **పరాపరం** నందు లయమగును.)

1928. బీజమగు ఆ బిందు వీర్యము (సామర్థ్యము) గలిగియుండుటచే, అఖండముగాను, అండముగాను నెలకొని ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథివి మొ॥ పంచభూతములను కార్యమాయతో సృష్టించి, అందు ఇమిడి, బిందుగా వాటికి అంతరములోను, వాటికి బాహ్యముగాను నెలకొనియున్నది.
(బ్రహ్మాండములో అఖండముగాను, చరాచర జగత్తులో పిండాండముగాను, కారణ, కార్యమాయగాను అనగా **పరాపరుడే – పరబ్రహ్మం**గా సృష్టికి నిమిత్త, ఉపాదాన కారణముగాను, జడ జగత్తులో **సత్**గాను – సద్రూపముగాను, జీవరాశులలో సత్, చిత్ – చిద్రూపముగాను తానే అన్నిటికీ మూలకారణమై తానే కోరి అవన్నియునై యున్నది. **సోకామయత బహుస్యాం ప్రజాయేయేతి** – తైత్తిరీయం ఉప॥)

1929. బాహ్యములోను, అంతరములోను (శరీరములో) నెలకొనియున్న బిందు యొక్క రంగు తెల్లన. నాదముగా నెలకొన్నప్పుడు అది ఎర్రగా యుండును. బిందు నాదముగా కలిసి నెలకొన్నప్పుడు శివశక్తిగా పదిలమగును. ఈ ప్రక్రియ వలన దేహంనకు ఆయుష్షు, సామర్థ్యము, ముక్తి గలుగును. (నాదబిందు కళాది నమోనమః – శివశక్తిగా – పరమానందం – శాశ్వతత్త్వము – ముక్తి గలుగుననుట.)

1930. దేహమునకు బాహ్యముగానున్న ప్రకాశజ్యోతియే దోషములు లేని వస్త్రము, కుండ రూపములు దాల్చినట్లు (వస్త్రము=కార్యము, కారణము=నూలు, దారపుపోగు; కుండ=కార్యము, కారణము=మట్టి) స్థితిపొందిన పంచకళల కారణమునకు కార్యముగా ప్రపంచమంతయూ ఉద్భవించి వ్యాపించజేసినది ఆ మహామయయే అగును.

1931. అఖండములో బీజముగా నెలకొన్న నంది శివమే, పిండములో విందు/బిందుగా (వీర్యము/శుక్రముగా) నెలకొన్నది గ్రహించిలేదు ఈ లోకులు. లౌకిక కామ్యములతో నిండిన స్వాధిష్టాన పద్మములో హంసగా (**హం, సం – అజపగా** వీర్యమును దోషరహితము చేయగలిగిన) నున్నవాడే, పరమాకాశములో వెలయు పుణ్యాత్ముడగు శివుడేయగును.

1932. విత్తనము లేక మొలక లేదు. కావున మొలక ఆ విత్తనము నుండియే మొలకెత్తును గాని వేరు దాని నుండి కాదు. విత్తనమును మొలకను వేర్వేరుగా తలంచక, ఒక్క వస్తువుగానే గ్రహించవలెను. అట్లే విందు/బిందును శివంగానే ఒక్కటిగా భావించవలెను.

1933. అన్నము నుండి దేహము, రక్తము, మనస్సు ఏర్పడునది: భుజించిన ఆహారముతో ఏర్పడునది ప్రాణమును ధరించిన దేహము, మనస్సు, మలము అను మూడు పుష్టి పొందిన దేహముతో మనస్సుయూ, ముందుగా భుజించిన ఆహారసారముతో రక్తము ఏర్పడును.

1934. శరీరములో వీర్యము (శుక్రము) తయారగునది చెప్పబడినది: సప్తధాతువులుగా మారిన అన్నసారములో (రక్తము, శోషరసం (తెల్ల రక్తకణముల ధాతు), ఎముక, చర్మము, మాంసం, మెదడు, వీర్యము (శుక్రము), శుక్రము మూడురోజులలో మార్పు చెంది, ఒక చిన్న బిందువువలె – చిన్న మంచుబిందు గడ్డిపరక కొనలో అతుక్కునట్లు తయారై, మూడేడు దినములలో ($3\times7=21$) 21 దినములలో వృద్ధి పొందును.

1935. శుక్రజయము, శుక్రవినాశము చెప్పబడినది: శుక్రముగా మార్పు చెందినది శరీరమునందే మూడు రోజులుండి, శరీరములో మనోమండలమగు ప్రకాశ

మండలముగా మారును. దివ్యపాదములందు దృష్టి సలిపినవారికి ప్రకాశమండలము నిలకడ పొంది వారిలో స్థితిపొందును. అట్లు కాక మాయాలోలుక్తములో (లౌకిక సుఖభోగ కామ్యకర్మలు) పాల్గొనువారికి, వారి మనస్సుతో కూడ ప్రకాశమండలము కూడా నశించిపోవును.

1936. శుక్రవ్యయముతో దేహము చెడి నశించును: శుక్రనాశనము వలన ఏర్పడునది గ్రహించజాలరు (పలు రక్తపు చుక్కలే ఒక చిన్న శుక్రబిందువుగా తయారగునన్నది) చెడి, నశించు తనను, కాపాడుకొనుటకు తెలియనివారే. నశించు దేహముతో కలిసి చెడుదురు. నశించు తనను వాటి నుండి వేరుపడుటకు తెలియనివారే అగుదురు.

## 21. శుక్రజయము – భోగసర చలనము

బిందు/శుక్రజయము: శుక్రమును వ్యయము కానీయక కాపాడుకొనుట; భోగసర చలనం: సంభోగ సమయములో ప్రాణణ (శ్వాస) చలనము.

1937. మనల్ని కోరి వచ్చు స్త్రీలను మనము వారిని చూడక వెళ్ళిపోవలెను. మనస్సు కరిగిపోవునట్లు మూలాగ్నిని (మూలాధారము నుండి కుండలినీని) పైకి ప్రాకించి, కంటితో చూచు పాపదృష్టిని నాశనము చేసి, మూలమైన భ్రూమధ్యమున దృష్టి నిలిపి గాంచు యోగియే **శివయోగి** యగును.

1938. కామాది చేష్టలలో తగుల్కొనువాడు నశించును: మిక్కిలియగు కామచేష్టలలో చిక్కుకొన్నవాడికి దివ్యానుగ్రహముతో రావలసినవన్నియూ రాక శివయోగము కూడ సిద్ధింపజాలదు. ఆ కామచేష్టలు చేయువాడు మనోవ్యాధికి గురియై, తన దేహపు సహజత్వం చెడి, దేహములోని సప్తధాతువులు ప్రాణమును కాపాడజాలక నశించును.

1939. స్త్రీలతో కలయికకు దినములు చెప్పబడినవి: స్త్రీలయందు వశపడి కలయు వలెనని కోరినచో, అనువైన దినములు చూడవలెను. వరుసక్రమమున మారిమారి వచ్చు **పూర్వపక్షం** (బహిష్టు దినము=అమావాస్య; మొదటిరోజు నుండి 14 రోజులు పూర్వపక్షముగాను; వెనుకటి 14 రోజులు **అపరపక్షం**గా పిలువబడినది), **అపరపక్షం** దినములలో, పూర్వపక్షంలోని మొదటి 8 దినములు కలియుటకు ఉత్తమమైనది కాదు. పూర్వపక్షంలోని కడపటి 6 దినములును + అపరపక్షంలోని మొదటి 6 దినములునూ అనగా ఈ 12 దినములు మాత్రమే కలియుటకు అనువైనదిగా చెప్పబడినది.

1940. యోగులు కలియుటకు కాలము చెప్పబడినది: యోగతత్త్వమును పాటించువారు పూర్వపక్షంలోని మొదటి 6 రోజులును, అపరపక్షంలోని కడపటి 5 రోజులు

(6+5) మొత్తము 11 రోజులు త్యజించి (విడచి) మిగతా రోజులలో కలయవచ్చును. స్త్రీ బహిష్టుయైన పిదప వచ్చు 21 రోజులు స్త్రీ గర్భాశయములోని రేకులు వృద్ధియగుచూ వచ్చును. బహిష్టుయైన రోజునుండి 6 రోజులకు పిదప మిగతా రోజులలో కలవవచ్చును.

1941. సహజముగా బిందు/వీర్యము స్త్రీతో కలియకలో బాగుగా పదిలమవ వలెననగా మంచి ముహూర్తముగా (మూడు ముప్పారు గడియలు – అనగా దాదాపు 1.30 గంట లేక 90 నిముషములు) చెప్పబడిన కాలము ఏదనగా చంద్రుని ప్రభావం తగ్గి సూర్యుని ఆధిపత్యము అగునపుడు (అనగా రాత్రిలో మొదటిజాము కాక రెండవజాములో సూర్యకళలలో శ్వాస చలనం జరుగనపుడు) కామశాస్త్రము చెప్పు రీతిన వీర్యమును విడుచునప్పుడు తలంపు భ్రూమధ్యమున ఉండవలెను.

1942. తలంపును అంతర్ముఖముచేసి (దైవచింతనతో) శ్వాస, ఇంద్రియ ప్రజ్ఞలు, మనస్సు ఏకీకృతము చేసి వీర్యము విడువవలెను: మిక్కిలి ప్రేమతో కూడిన స్త్రీ మోహమును విడచి, మనోనిగ్రహముతో అంతర్ముఖుడై, చలనమును త్యజించి, నిలకడతో కూడ శ్వాసచలనము, మనస్సుతో వీర్యమును విడువవలెను.

1943. స్త్రీల ముఖకవలికలు, ఎత్తైన భుజములు, అంగవంపులు, పగడమువంటి నోరు, వక్షోజములు, బాహ్య అందచందములలో కూడిన స్త్రీ తత్త్వములను పరిగణింపక పురుషుడు కలియుకాలమున తన ప్రజ్ఞలను అంతర్ముఖముచేసి స్త్రీలో వీర్యము విడువవలెను.

1944. భోగకాలమును బట్టి ఏర్పడు పిండము యొక్క మంచిచెడులు గణింపవచ్చును: వీర్యమును స్త్రీ గర్భమున జారవిడిచిన పిదప, జారవిడచిన కాలసమయమున బాగుగా పరిశోధించినచో, గర్భస్థ శిశువు యొక్క జన్మించుదినము, ఆయుస్సు, మరణదినము, గుణములు, కలుగబోవు మంచిచెడులన్నింటినీ గణించి చూడవచ్చును.

1945. గర్భోత్పత్తి విధానమును వివరించునది: పైన చెప్పినవన్నీ ఎరిగిన పిదప, పిండము తనంతట తానే అనగా బాహ్యవిషయములపై ఆధారపడక వృద్ధియగును. వక్షోజముల మార్పులు మొ॥నవి ఏర్పడును. రెండు నెలలు కాలము పిండము శిశువు రూపము దాల్చి గణించినవన్నియూ ఒక్కొక్కటిగా ఎరుగనగును.

1946. విత్తనము (వీర్యము)ను వెదజల్లినవారికే తప్ప విత్తనము వెదజల్లనివారికి ఎటువంటి ఫలము లేదు. విత్తనము యొక్క ఫలమును గ్రహించి ప్రకాశమును చూచువారికే తప్ప ఇతరులు దానిని గ్రహింపజాలరు. బిందు/వీర్యమే ప్రకాశముగా మారుచున్నదని చలనములేక (చపలము లేని జ్ఞానము) గ్రహించువారికి, పెరుగులో వెన్నవలె

ప్రాణములోనున్న శివఫలము గిట్టును (దర్శనమగును).

1947. అభిప్రాయముల వలనే (అనగా కొన్ని జన్మలలో తలంపులు/ఆలోచనలన్నియూ మనోమండలములో సూక్ష్మరూపములో పదిలమైన కారణముగా అవి స్థూలములో భోగభాగ్యములుగా అమరుచున్నదన్న అభిప్రాయమే) బ్రహ్మలిపి (విధి), ఆయుస్సు మొదలగునవిగా ఈశుడు పిండప్రాణములో నెలకొని అందే ఇమిడియున్నాడు. అట్లు విత్తనములో అభిప్రాయముగా నెలకొన్నదే బాహ్యముగా కారణ కార్యములుగా మారి కొన్ని భ్రమలను (లేనిది ఉన్నట్లు కనిపించుట) ఏర్పరచును.
(అనగా జన్మకు కారణమై సూక్ష్మశరీరములో పదిలమైన పూర్వజన్మ వాసనలు.)

1948. బిందు/వీర్య జయముతో పొందదగు ఫలములు: వ్యయము కాని వీర్యము వలన (స్థూల బిందు/వీర్యము వలెనే సామర్థ్యము, ప్రకాశము శరీరమునకు గలుగుచున్నవి). అది ప్రకాశమండలములో ప్రాణముతో చేరి నెలకొనియుండును. నిలకడయైన ప్రాణమునకు అది ఎనలేని శక్తినిచ్చును మరియూ క్షీణతలేని బుద్ధి, తెలివి, జాగరూకత, తపస్సు, జపము, మౌనం, సిద్ధియూ, క్షీణతలేనివన్నింటినీ ఈ స్థూల వీర్యము మూలముగా బడయవచ్చును.
(యోగపరిభాషలో మొలకెత్తని విత్తనముగా వీర్యమును చెప్పబడి, 12 సం॥ సాధనా బలముచే అది గట్టిపడి ప్రకాశముగా శరీరమును ప్రకాశింపజేయును. కావున వీర్యము వ్యయంకాక పరిరక్షింపవలెను.)

1949. స్థూలబిందును/వీర్యమును దాని గమనము మార్చి ప్రకాశమండలములో నెలకొనునట్లు చేయువారే శివయోగులు: స్థూలవీర్యము సాధనతో ఎండి పోవునట్లగుటచే కుండలినీ అగ్నిని పెంపొందించి, అధోముఖముగా కాక పైకి ప్రాకించి, సుషుమ్ననాడి ద్వారా జ్ఞానాగ్నిని రగిల్చి ప్రకాశముగా నెలకొనునట్లు చేసి, చంద్రమండలములో (శిరస్సున) అమృతము సేవించి పదిలపరుచుకొనువారే శివయోగులు.

1950. అటువంటి శివయోగులే మహావీరులుగా పిలువబడిరి: వారే యోగియూ, ఉత్తమ సిద్ధుడు, భోగియూ, జ్ఞానములో అతి ఉన్నతస్థానము పొందినవాడుగానూ, మోహ మేర్పడిననూ నియంత్రించి భుజించువాడునూ, ఉత్కృష్టమైన వీర్యజయము సాధించిన వీరుడగువారు. (వీర్యజయము = వ్యయము కాక పరిరక్షించబడిన.)

1951. శివయోగులకు శివుని శరీరమే తమ శరీరముగా ఏర్పడి (శివుడే యోగులలో నెలకొనుటచే – దేహమే శివుని నిలయమై) శివాగ్నియను ప్రకాశము, భూమండలములోని ప్రజలను కామాగ్నిని పురికొల్పి వినాశమును ఏర్పరచునదైన వీర్యమును మూలాగ్నితో చేర్చి ప్రకాశమును ఏర్పరచునట్లు చేసినచో, అదే

అమృతమైన జ్ఞానము నొసగునదిగా మారిపోవును. (వీర్యము వృధా కానీయక ప్రకాశము పొందుటకు సహకరించునదిగా మార్చుకొనుట.)

1952. జాగ్రదాతీతస్థితి చెప్పబడినది (శివునిలో మనోలయమై, పులకించి తన శరీరమును మరచిన స్థితి): లోకులు వీర్యము యొక్క మహత్వము, శ్రేష్టత తెలియక నాశన మగుచున్నారు. అన్ని ఇంద్రియచేష్టలకు (పంచ జ్ఞానేంద్రియములు + పంచ కర్మేంద్రియములు + మనస్సు మొ॥ చత్వారి అంతఃకరణములు) తాము వశమై మనస్సు, శరీరము చెడి వ్యధ చెందుచున్నారు. జ్ఞానమే స్వరూపమైన భావనతో శివునితో ఏకమై ఇమిడి (తుర్యాతీతములో) ఊర్ధ్వముఖమై ప్రకాశములో నెలకొనుటచే స్థూలవీర్యము మాయమైపోవును.

1953. స్త్రీ సాంగత్యము మాయా సముదాయమని భావించినచో ప్రేమయను కామవాంఛ తొలగిపోవును. కామవాంఛ లేకుండుటచే మరణ భయముండజాలదు. శతకోటి సంవత్సరములు ప్రకాశములో నెలకొనుటచే, అన్ని మలములు వీగిపోవునే!!

1954. బిందును/వీర్యమును జయించినవారు కాలమును జయించిన వారగును. వీర్యమును వృధాచేసి, నశింపజేసినవారు కాలముచే జయించబడి నాశనమగును. వీర్య జయముతో అన్ని కాలములను జయింపగలిగిన (కుండలినీ) శక్తిని మూలవాయువుతో కలిపి ఊర్ధ్వమునకు ప్రవహింపజేసి, బ్రహ్మానందము పొందునది గ్రహింపనివారే సుమా!!

1955. స్త్రీతో కలియుటకు పూర్వము భర్తకు భార్యయందు ప్రేమపూర్వరక వాతావరణము నెలకొనవలెనన్నచో, ఆ స్త్రీ తన ఉదరకోశమున (పొత్తికడుపున) మలము, వాత, పిత్త, శ్లేష్మను తొలగించుకొని శుభ్రపడినవారుగా ఉండవలె.

1956. ఆజ్ఞాచక్రములో ఉత్పన్నమగు నాద, బిందు అధోముఖధోరణిలో వెళ్ళనీయక నిరోధించి, సుషుమ్నానాడిలో నెలకొని బ్రహ్మరంధ్రమును చేరి క్షీరసాగరము వంటి తెల్లని మనోమండల ప్రకాశములో నెలకొని, క్రింది చక్రములలో నున్న లౌకిక బంధములు విడిపించుకొన్నచో, అధోముఖ మోహభ్రమలు తొలగిపోయి వీర్యము గట్టిపడును.

1957. వీర్యము యొక్క పర్యవసానములు ఎరిగినవారు వీర్యజయము సాధించుదురు: వీర్యము ఉత్పన్నమగు విధానము, ఆ వీర్యము ముదిరి ఏర్పరచు ఫలములు గ్రహించలేనివారి పొందదగు వినాశనము, గ్రహించినవారు దానిని నిగ్రహించి, నిరోధించుటచే పొందదగు శ్రేష్టతను, దానిచే పొందదగు నాదము, దాని నానావిధముల భేదములను, పరిశోధించి గ్రహించినవారే వీర్యజయము పొందగలరు.

1958. వీర్యము అను నామము గలిగిన ఆ మహావిద్య నెలకొన్న స్థలము మూలాధారములో,

బీభత్సముగా మండుచున్న కుండలినీ అగ్నితో కోరి దానిని కాల్చి, ఆ శక్తిని భానుమండలము (సూర్య మండలము) మీదుగా పైకి ప్రాకించి, మనోమండలమగు చంద్రమండలమునకు చేర్పించినదో అది చల్లని అమృతమగును!!

(యోగ పరిభాషలో: మూలాధారము, స్వాధీష్టానచక్రములు – అగ్నిమండలము; మణిపూరక, అనాహత చక్రములు – సూర్య మండలము; విశుద్ధి, ఆజ్ఞాచక్రములు – చంద్రమండలము.)

1959. వీర్యజయము పొందిన శివయోగులు అమృతము త్రాగి, అందు మునిగిఉందురు: అమృతమైన చంద్రమండల ప్రకాశములో నెలకొన్న ఆ బిందు/వీర్యము కలిసి ఏకమై, శరీరమంతటికీ అమృతముగా వ్యాపించి, శివాగ్నితో కలిసి, అమృతమయమైన **శివభోగం** గలుగును. అట్లు గలుగుటచే శివయోగులకు అమృతమయమైన సిద్ధి కలుగును. (వీర్యము మూలాధారాగ్నితో కాల్చబడి పునీతము చేయబడినది – శరీరమంతటిలో ప్రకాశముగా నెలకొన్నది.)

1960. వీర్యము స్ఖలించని కలయికే యోగముగా గుర్తించబడును: యోగసాధనతో బిందు/ వీర్యము నాశనరహితముగా కలియునదే. స్త్రీపురుష శరీరములు కలిసిననూ, వీర్యము స్త్రీలో జారవిడువకుండా చేయు భోగమే శివభోగమగును. ఇట్లు శ్రేష్టమైన రీతిలో స్త్రీ భోగవాంఛను తీర్చలేరు ఈ మూఢులు!! ఏమి ఈ అజ్ఞానము!!

1961. యోగులు తమ చిత్తమును సదా ప్రకాశమండలము నెలకొల్పి యుండుటచే, వారు కోరి వీర్యమును వెలువడునట్లు చేయగలరు: యోగతత్వమనుసరించువారు స్త్రీలతో కలిసిననూ, వీర్యమును కామఇచ్ఛతో వదలజాలరు. స్త్రీలు, యోగులను ప్రాణమువలె తలంచి ఆశపడుదురు. అపుడే చాలాకాలము ప్రేమ సలిపిన జంట వలె యోగులు అంగీకరింతురు.

1962. తమ యోగ సాధనాశక్తితో మూలాగ్నిని పైకి ప్రాకించి అమృతం సేపింపజేసినచో, వీర్యజయము ఏర్పడును: మూలాగ్నిని రగిల్చి, పైకి సహస్రమునకు ప్రాకించి, నానావిధములుగా చెదరిపోకుండా వెన్నెముక సుషుమ్నానాడి ద్వారా ఊర్ధ్వమును చేరి, అమృతమును గైకొనుటయే వీర్యజయముగా చెప్పబడును.

1963. చిత్తము శివమయమగుటచే క్షణకాలములో మూలాగ్ని వలన వీర్యము ఎండిపోవును: శిరస్సున (సహస్రమున) బిందు (ప్రకాశము) నాదముగా నెలకొనుటచే, మూలాగ్ని ఉష్ణముచే అన్నియూ దహింపబడి, చిత్తమే శివమయమైనందున ఈ స్థూలదేహమున స్థూలవీర్యము ఎండిపోవును.

1964. విత్తనమును దంచి తినువాడు (వడ్లు దంచి బియ్యంను అన్నముచేసి) విత్తన ఫలమెరుగనివారే. విత్తనమును దంచక కాల్చి తినువాడు కూడ ముందువానివలె

ఫలమెరుగనివాడే!! పై రెండు విధములు గాక విత్తనమును వెదజల్లి (పైరు పండించి, పంట చేతికందుకొని) ఫలమును పదింతలు చేసుకొన్నవాడగను.

(యోగపరిభాషలో: సృష్టి మూలమైన వీర్యమును విత్తనముతో పోల్చబడి, వీర్యము వృధా కానీయకు, కాపాడి, సంరంక్షించి, ఊర్ధ్వసహస్రమునకు చేర్చి, ప్రకాశ మండలములో నెలకొనజేయుటను ఉపమానముగా విత్తనమును చెప్పబడినది.)

1965. అన్నమయకోశమగు శరీరములో వీర్యము ఎండునట్లు చేయు విధానమెరిగి, ప్రాణశక్తియగు వీర్యమును అధోముఖ ధోరణిగా పోనీయక, సహస్రమునకు పోనిచ్చినచో, ఆ వీర్యము జ్వలించు ప్రకాశముతో నాదాంతములో నెలకొని (స్థితి పొంది) శరీరమునందే ఎండిపోయిన రంగులతో కూడిన దివ్యవీర్యమగును.

1966. వీర్య సూక్ష్మమును గ్రహించినవారు చాలాకాలము జీవింపనగును: ప్రజలందరికి అన్నసార వీర్యము, ప్రాణసారమగు వీర్యమును రెండు రకములు కలవు. ప్రాణసారమైన ప్రకాశమండలమును గ్రహించి, అందు స్థితిపొందిన వారికి, బంగారుఛాయ గల ప్రణవదేహసిద్ధియూ, అష్టమహాసిద్ధులు ఒనగూరి, వారి దేహము క్షీణింపక చాలాకాలము జీవించుదురు (వారే శివయోగులు).

1967. **శి**కార ఉపాసనతో ప్రణవములో ఏకమై, ప్రకాశము పొంది, వీర్యజయము ఏర్పడును: పంచాక్షరి యందు శ్రేష్టమైనదగు శికారమును రెండు నేత్రములలో ప్రకాశించు అగ్నియగును. కంఠమునుండి మకారము వెలువడునపుడు **అ,ఉ,మ** మూడునూ ఒకటై భ్రూమధ్యమున అది నెలకొనునపుడు (అ=భ్రూమధ్యము రెండు నేత్రములు **ఉ,మ** పరాశక్తి కళలు) వీర్యజయమగును. అట్లు స్థితి పొందినదే ఉపాసనా మార్గమగును. (యోగపరిభాషలో: **అ**–శివం, అగ్ని, సత్త్వం, జ్ఞానం, భ్రూమధ్య స్థానము. **ఉ,మ**–శక్తికళలు, సూర్యచంద్రకళలు, దేహతత్త్వము, ద్వినేత్రములు.)

1968. ఉపాసనా మార్గములో వెళ్ళి ఆత్మలో నెలకొని అన్నీ తానైన స్థితి: తానే ఉపదేశము (తానే అన్నియూనైన స్థితి) తానే అన్నిటిలో కలిసి ఏకమైనయున్నది. తానన్నది లేక ఇక ఏదియూ లేదు. అత్యుత్తమ స్థితిలోనికి వెళ్ళిన బిందు (ప్రకాశము) మహా ప్రకాశములో (నిరాధార చంద్రమండల ప్రకాశము) నెలకొనునపుడు, కరుణములగు పదునాలుగును (5 జ్ఞానేంద్రియములు + 5 కర్మేంద్రియములు + 4 అంతఃకరణములు) సద్దుమణిగిపోయి అంతరమున లీనమై, పిదప ఆత్మ బుద్ధిపూర్వకముగా అఖండ జ్ఞానములో ఏకమైపోవును.

1969. నాద, బిందు అఖండములో నెలకొన్న స్థితియే **శివోహం**: సూక్ష్మమైన నాద, బిందులుగా నెలకొన్నదే ఈ జగత్తులో పైర్లు, జీవరాశులన్నిటి సృష్టికి కారణమైనది. జీవరాశుల సృష్టికి, లయమునకు కారణమైనది మంత్రమునకు శక్తినిచ్చిన బిందు

నాదములే. కావున బిందు, నాదము లయమైన స్థితియే శివమయమైన స్థితి - **శివోహం**.

1970. మూలాధార అగ్నియే సహస్రమునకు ప్రాకి, నెలకొని శివఫలమగుట: విత్తనమును మరలా మొలకెత్తకుండునట్లు కాల్చి, పక్వపరచి, బాహ్యాముఖమైన మనోచంచలము వీడి, ఏకీకృతము చేసి, సహస్రమున నెలకొనునట్లు చేసి, కీడు కర్మఫలములను తొలగించుకొని పక్వపరచినపుడే **శివఫలము** పక్వపడిన పండుగా మారును.

1971. నాదబిందులు కలిసి ఊర్ధ్వమున నెలకొన్న స్థితిలో చంద్రమండలము ఏర్పడును. పరకాయము ప్రకాశమండలముగా వెలుగొందును. అందు ఉద్భవించిన ప్రణవ మంత్రమే ఆహుతి మంత్రమగును. (శివాగ్నిలో ప్రణవమంత్రముతో చేయబడునదే యాగమునకు వేయు ఆహుతి మంత్రమగును.)

1972. మనస్సు యొక్క సత్త్వభాగము విచారణ ప్రజ్ఞలు గలిగించు నాదమగును. మనస్సు యొక్క అసత్త్వభాగము కోరికలు గలిగించు శుక్రము/వీర్యమగును. మనస్సులోని అసత్త్వములో గలిగినదే వాక్కు, వచనములు. మనస్సున కామవాంఛలు గలిగించినచో స్థూలవీర్యముతో మునిగి నశించుదురు.

(మనస్సు సత్త్వభావనతో శివుని స్తుతించినచో నాదముగా వెలయుదురు. కాని జడప్రపంచంతో చేరినచో స్థూలవీర్యము వలన, దాని వాసనలకు లోనై నాశనమునకు గురి అగుదురు. వారివారి ఇచ్ఛలే కారణభూతములు.)

1973. నాదాంతమునకు వెళ్ళిన జీవుడు శివునితో ఏకమగును: నాదము, దానిని గ్రహించదగ్గ మనస్సు (శబ్దమును గ్రహించదగ్గ మనస్సు), వట్టి మనస్సుతో శివుడున్న స్థానమును గ్రహించజాలరు ఈ మనుజులు. దానిని ఉన్నదున్నట్లు గ్రహించువారికి (జ్ఞానులు) ఆ ఉన్నచోటే శివస్థలమని, అదే **శివం** అని బోధపడును.

(శబ్దము = శబ్దప్రపంచమగు మాయా భువనములు; సత్త్వమనస్సు = శబ్దమును నాదముగా గ్రహించగల ప్రజ్ఞాజ్ఞానము; **ప్రజ్ఞానం బ్రహ్మ = బ్రహ్మం/శివం** - శ్రుతి వాక్యము, ఐతరేయ ఉప॥)

1974. దేహమున పంచభూతములు కొలువైన స్థానములు: పాదము మొదలుకొని స్వాధిష్టానము వరకు - పృథివీ/భూమి అంశం; నాభిస్థానము-మణిపూరకం-అప్పు/జల అంశం; హృదయస్థానము - అనాహతం - అగ్ని అంశం; కంఠస్థానము - విశుద్ధి - వాయువు అంశం; కంఠస్థానము పైబడిన స్థానము - రెండు భ్రూమధ్యము - ఆజ్ఞా - ఆకాశము అంశం.

## 22. ఆదిత్యుని స్థితి - అండాదిత్యుడు

సూర్యుని స్థితి - సూర్యుడు బ్రహ్మాండమున నెలకొన్న స్థితి వివరణ

1975. సూర్యుడు మొదలగు ప్రకాశరూపముగా వెలుగొందు దేవతలందరూ తెల్లని మంచుతో ఆవరింపబడిన మేరుపర్వతమును ప్రదక్షిణము చేసుకొనుటకు కారణ మేమనగా, ప్రకాశస్వరూపుడైన మన ఈశుని దివ్యచరణములు ద్వారా ప్రకాశమును తాము పొందవలెనన్న కోరికతో, గిరిప్రదక్షిణము చేయుచూ నమస్కరించుటయే వారు చేయు తపస్సు అగును.

(శివుని ద్వారానే సమస్త దేవతలు ప్రకాశము పొందిరి.)

1976. సూర్యుడే నారాయణుడగును. జీవరాశులంతటిలో స్థితిగా, శరణార్థుడుగానున్న పుణ్యనాథుడైన శివుడే సూర్యుడు. పగ (ద్వేష)రహితమై సప్తలోకములకు శ్రేయస్సు ఒనగూర్చునది సూర్యుడే అగును. సకల జీవరాశులకు ఆదియైయున్నది అతనే అగును.

1977. సూర్యుని ప్రేమతో ఆతని సహస్రనామములతో స్తుతించిన యెడల, జీవులలో వెలుగు జ్యోతిలో ప్రకాశమును నింపి వెలుగొందును. సూర్యుని తలంచి వైదికులు చేయు జపములు, దేవతలు పఠించు స్తోత్రములు అన్నియూ ఆది నుండి (శివుని) ప్రేమతో కూడిన ప్రకాశము పొందుటకే సుమీ!!

1978. తానే (సూర్యుడే) జగత్తునకు తత్త్వస్వరూపుడు (తత్త్వములు అతనే). తానే జగత్తునకు శక్తిగానున్నాడు. తానే జగత్తునకు శంభువుడు (శివుడు)గా ఉన్నాడు. తానే ఈ జగత్తునకు చల్లదనమిచ్చు చంద్రుడుగా ఉన్నాడు.

1979. బ్రహ్మాండమున నెలకొన్న సూర్యుడే పిండములో (దేహాంతరమున) నెలకొన్న స్థానముల వివరణ: మూలాధార-ముక్కోణ చక్రముపై, షట్కోణ చక్రమగు స్వాధిష్ఠానముపై, ద్వివృత్తములతో కూడిన మణిపూరక చక్రముపై, పదహారు రేకులతో కూడిన పద్మము ఉండు విశుద్ధి చక్రమునకు పైగానూ, ఎటువంటి దోషము లేక ఉదయించువాడే సూర్యుడు.

1980. మూలాధారపు ముక్కోణ చక్రము నుండి పైకి ప్రాకిన సూర్యుడు షోడశకళలతో వెలుగొందునది: సూర్యుడు మూలాధార చక్రస్థానములోనున్న ముక్కోణ చక్రములో వెలసి, శ్రేష్టముగా తన ఉనికిని ప్రకాశకిరణములతో చాటుకొనును. తను నాలుగు చక్రములను దాటుకొని దుఃఖము ఏర్పచు బావివంటి విశుద్ధి చక్రమును దాటిన వెంటనే, పైకి వచ్చిన సూర్యుడు షోడశకళలతో కూడిన చంద్రమండలముగా అమరును. (నాభిస్థానము: ప్రణవములోని అకారము; హృదయమగు అనాహతములో ఉకారము; కంఠమున విశుద్ధిలో మకారము; వీటియంతటిని దాటినదే ఆజ్ఞా

చక్రములో బిందుప్రకాశముగాను, సహస్రమున నాదముగా పదహారు కళలతో వెలుగొందును.)

1981. సూర్యుని దాటిన పిదప వేదార్థము బోధపడును: సూర్యుని పొందిన పిదప లౌకిక జ్ఞానము నశించిపోవును. ఛేదించి నాలుగునూ చెదిరిపోయినవి (లోకజ్ఞానము ఏర్పరచిన పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరీ వాక్కులు) శక్తి తన ప్రకాశముతో నెలకొని బోధించు వేదార్థమును మీరు గ్రహింపజాలకున్నారే!!

(వేదార్థము: నీవే ఆ ప్రకాశము; ఆ ప్రకాశమే **శివం**; తత్+త్వం+అసి – శ్రుతి వాక్యము – చాందోగ్య ఉప॥; **అది నీవే అగును** ఆత్మజ్ఞానము ఏర్పడినచో లోకజ్ఞానము, అనుభవం, కర్మలు అన్నీ వీగిపోవును.

**"భిద్యంతే హృదయగ్రంధిః, చిద్యంతే సర్వసంశయాః, క్షీయన్తే చాస్య కర్మాణి, తస్మిన్ దృష్టే పరావరే"** – ముండక ఉప॥.)

1982. స్వాధీష్ఠానము క్రిందనున్న మూలాధారము నుండి పైకివచ్చు మార్గము సూర్యునిది. యోగులు తప్ప మరెవరూ చూచుటకు సాధ్యపడదు. అట్లు ఎవరిచేతనూ చూడశక్యముగాని సూర్యుడు నీటి స్థానమగు మణిపూరకమునకు పైగా అగ్నిస్థానమగు అనాహతమునకు మధ్యభాగమున ఉదయించువాడగును.

1983. ముందు చెప్పబడినట్లు మూలాధార పృథివిని ఛేదించి, స్వాధీష్ఠానము వచ్చి, చక్రములను దాటుకొని ఆకాశ అంశమైన ఆజ్ఞాచక్రమును ఛేదించి, శరీరమునకు ఆవల ప్రకాశముగా నిలుచును. రెండు నేత్రదృష్టిని గలిగిన ఆజ్ఞాచక్రములో భ్రమింపజేయు ఆనందముతో మన ధ్యానము తగ్గట్లు మనలో సృజన ఏర్పరచి నిలుచును.

1984. మూలాధార పృథివిని ఛేదించుకొని వచ్చు సూర్యుని, ఈ లౌకికజ్ఞానముతోగాని పుస్తక పఠనముతోగాని ఎవరూ గ్రహింపలేరు. శివుడు అమరిన మహామేరు పర్వతమును సూర్యుడు చుట్టివచ్చుచున్నాడందురు ఈ లౌకికులు. కాని మహామేరు పర్వతము శిరస్సేయని ఎరిగినవారు, దేహమున సూర్యుడు చుట్టివచ్చు విధానమును గ్రహింపగలరు.

## 23. పిండాదిత్యుడు

దేహమున వెలయు ఆదిత్యుడు

1985. నిలుచుట, కూర్చొనుట, నడచుట, పడుకొనుట మొదలగు కార్యములు చేయునపుడు పిల్లఏనుగు రూపమైన నా ప్రణవదైవము నా తలంపున ఎప్పుడూ నిలచి (మనస్సున) యుండుటచే నా మలములన్నీ తొలగించబడి, నా వెన్నెముక ద్వారా పైకి ప్రాకి (అధోముఖముగా వెళ్ళక) జయము గలిగించునదై వ్యాపించిన ప్రకాశకిరణములు

గల సూర్యుడు దర్శనమగును.

(మనస్సు వాని ధ్యాసతోయున్నవారికి సహస్రమున సూర్యుడు దర్శనమిచ్చును.)

1986. సూర్యుడు ఊర్ధ్వముఖముగా పైకి ప్రాకి స్థితిపొందు స్థానము ఈశాన్యదిక్కు (అనగా కుడికంటిలో - ఇదే ఉత్తరాయణము). అచ్చట స్థితిపొంది ఊర్ధ్వసహస్రములో నెలకొని ప్రకాశమును నింపినది గ్రహించినవారే జ్ఞానులు. ఈ నిజతత్త్వమును ఎరుగక ప్రమాదములో నున్నవారు లోకప్రజలు. క్రిందనున్న సూర్యుని పైకి ప్రాకించుటకు తెలియనివారు మాయాలోక భ్రమలో ఉండువారే యగును.

1987. మూలాధారము నుండి బయలుదేరిన సూర్యుడు దేహమను ప్రపంచమును చుట్టి వచ్చి, స్థితిపొందు స్థలము ఈశాన్యదిక్కుయగు కుడికంటి ద్వారా సహస్రమును చేరుకొనునదే. ఇది గ్రహింపజాలకున్నారే!! దీనిని గ్రహించిన జ్ఞానమున్నవారికి, నా మనస్సులోని ప్రేమ వారి కొరకై పరితపించును సుమా!!

## 24. మనో ఆదిత్యుడు

మనోమండలమున వెలయు ఆదిత్యుడు

1988. మండుచున్న అగ్నికిరణములతో కూడిన సూర్యుడునూ, ప్రకాశవంతముగా చల్లని మంచుకిరణములను ప్రసరింపజేయు చంద్రుడునూ, మారి నిలబడి, కిరణములను బాగుగా విస్తరింపజేసి వృత్తులు చేయుట వలన నిలబడిన నా ప్రాణముతో కలిసి ఏకమై, ఒక్క కిరణముగా ఏర్పడి పూర్ణమైనదే పున్నమి (పౌర్ణమి) అనబడును.

(సహస్రమునకు చేరిన రెండూ సూర్య, చంద్రులు వారి వృత్తగమనము మార్చబడి, బ్రహ్మరంధ్రము చేరుసరి ఒక్క కిరణముగా పూర్ణమగుట.)

1989. సూర్యచంద్రులను కలిపిన ఉపాయము తెలిసినవారు **శివం** అగుదురు: ముందుగా సూర్యకళలో చంద్రకళ కలియుటయు, పిదప చంద్రుని ఆధిపత్యములో చంద్రకళలో సూర్యుడు కలియుటయు పూజించు విధానమగును. ఈ రెండు కళలు కలిసి ఊర్ధ్వసహస్రమున నెలకొనుటలో తేటజ్ఞానము పొందినవారు **శివం**యే అగుదురు.

(మొదట మూలాధార అగ్నితో చంద్రుడు కలియుటచే కుడికంటిలో సూర్యుడు ఉదయించును. పిదప మూలాధార అగ్నితో సూర్యుడు కలియునపుడు చంద్రుడు ఎడమకంటిలో ఉదయించును. ఈ రెండు కలిసి సహస్రమున నెలకొనునది మూడవ దశలో చిత్తము తేటనై శివమే అగుదురు. ఇదే సోమసూర్యాగ్నిగా చెప్పబడినది.)

1990. మూలాగ్నితో (కుండిలినీ) సూర్య, చంద్రులు కలిసి పూర్ణత్వమేర్పడును. చంద్రుడు, సూర్యుడు, మూలాగ్ని కలయికే మనోమండలమగును. అట్లు ఒకటగు మనోమండలముతో తార (నక్షత్రము) చేరి నాలుగు కళలుతో ఉన్నదని చెప్పుదురు.

కాని సూర్యుడు, చంద్రుడు, మూలాగ్ని కలిసినది ఒక్కటే; అదే కడపటి పూర్ణత్వమని గ్రహించుదురు గాక!!

1991. అగ్నిమండలమును, సూర్యమండలమును దాటి నెలకొనినదే చంద్రమండల ప్రకాశము. ఒక అండమేనని అగ్నిమండలమునే తలంచు కామవృత్తులు, ఇచ్ఛలున్న ప్రజలు ఎవరికీ ఇది అర్థము కాని విషయమే అగును. శిరస్సుకు పైగా నెలకొనియున్న బ్రహ్మాండము ఒకటి గలదని, ఉన్నతి పొంది ప్రకాశమును గ్రహించగలగిన వారెవరూ? అట్లు ఆ స్థితి ఉన్నదని గ్రహించినవారికే ఈ ప్రకాశమును గ్రహించగలరు.

1992. మనోమండలములోనున్న సూర్యుడు పృథివ్యాది తొమ్మిదింటిలోను (పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, సూర్య, చంద్ర, అగ్ని, తార) నెలకొనియుండి దేహమును ప్రపంచమును ప్రదక్షిణము చేయుచున్నాడు. ఈ తొమ్మిది తత్త్వములు (అంశములు) ఈశుడగు నందీ స్థితియేయని ఎరుగజాలరు. ఇట్లు తొమ్మిది అంశములుగా ఆత్మ నెలకొన్నదని ఎరుగనివారు శివానుగ్రహము లేనివారే సుమా!! ఎటువంటి సుఖములు లేక చీకటిలో (అజ్ఞానములో) చిక్కి అండకాయమును పొందియున్నారు.

## 25. జ్ఞానాదిత్యుడు

(జ్ఞానసూర్యుడు)

1993. జ్ఞానసూర్యుడు ఉదయించు విధానము చెప్పబడినది: బిందు ఒక్కటే స్థూలముగా నున్నప్పుడు అపరముగా (వీర్యముగా), సూక్ష్మముగా ఉన్నప్పుడు పరంగా (ప్రకాశముగా) విభజించబడి, ఆ అపరమే (స్థూలబిందు) ఊర్ధ్వమునకు ప్రాకినపుడు పరనాదమై, శ్రేష్టమైన నివృత్యాది పంచకళలు అయి, జ్ఞానసూర్యుడు అరుణోదయమైనట్లు మనస్సున ఉదయించును.

1994. మనస్సులో ఉదయించు నాదమే అరుణోదయం: మనోమండలమగు మనస్సున అరుణోదయంతో ఏర్పడు శబ్దమే తేటనైన పరనాదము యొక్క వృత్తియగుటచే, ప్రదాతయైన శివానుగ్రహముతో వైఖరి మొదలగు వాక్కులే పరబిందుతో కూడి పంచకళలలో నెలకొని నిలుచుండును.

(వాక్కులు: స్థూలవైఖరి, సూక్ష్మవైఖరి, మధ్యమ, పశ్యంతి, పరా మొ॥ 5ను నివృత్తియగు పంచకళలలో నెలకొనియుండును.)

1995. జ్ఞానసూర్యుడే స్పందన రూపముగా అన్ని దిశలందు బహిర్గతమగు సదాశివుడగును: దేవాదిదేవుడైన శివుడే దశ దిశలందు (అష్టదిశలు+అధో+ఊర్ధ్వం=10) ఉదయించును. పూర్వీకులు ఈతని (శివుని) మూడు తత్త్వములుగా ఉన్నవాడనియు (వేదకాలములో), పిదప వచ్చినవారు ఈతని నాల్గురిలో మధ్యనున్నవాడిగా (బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు,

మహేశ్వరునిలో మధ్యగా సదాశివుడుగా) నున్నాడనిరి. కాని ఊర్ధ్వలోకస్తులు మాత్రము శివుని తమ శ్రేష్టమైన నాయకుడనిరి.

1996. సకల భువనములంతటికీ నాయకుడైన శివుడు, కల్పనావస్తువు కాదు సుమీ!! నిజముగా ఉన్నవాడే!! కటిక చీకటిని (అజ్ఞానమును) పారద్రోలు సూర్య, చంద్ర, అగ్నులతో కూడినవాడు. దేహచీకటిని (దేహాభిమానము, రాగ, ద్వేష, అహంకారం, మమకారాది అనాత్మతత్త్వము–అజ్ఞాన మలములు) పారద్రోలు జ్ఞాన నందీ నా షట్చక్రస్థానమలమును పారద్రోలుటకు నాలో నెలకొని ఉదయించెను (ఉద్భవించెను.)

1997. ఉత్కృష్టమైన మండు ప్రకాశకిరణములు గలిగిన శివుడు తన ప్రకాశమును దేహము నందు నింపి అజ్ఞానమను చీకటిని తొలగించును. తియ్యదనముతో నిండిన అమృత ఫలమును తినిపించును. తియ్యని పండిన పండువలె నిలుచున్న ఆ కైలాసాధిపతి మహోన్నతమైన ప్రకాశకిరణములతో నా శిరస్సున నెలకొనియున్నాడు.

1998. మహోన్నతమైన ప్రకాశము అన్నిటిలో ఇమిడియున్నందున అన్నిటికీ ఇదే శ్రేష్టమైనది: అనుభవజ్ఞానముగా, జ్ఞానరూపునిగా ఆత్మలో నిండియున్న ప్రకాశుడైన శివుడు, తానిముడుటకు ఎటువంటి ఆటంకము లేక అన్ని భువనములకు వ్యాపించి నిలుచున్నాడు. సూర్యుని వెలుతురు పడనిచోట కూడా తన ప్రకాశమును నింపి నిలుచుండును. ఇదియే అన్నిటికీ శ్రేష్టమని, అధీనమని ఎవరు ఎరుగగలరు? (శివప్రకాశమే అన్నిటికీ అధిష్టానమని ఎందరు ఎరుగుదురు?)

1999. జ్ఞానాదిత్యుని గ్రహించువారికి సర్వజ్ఞానతత్త్వము ఒనగూరును: పృథివి స్థాన పద్మము నుండి పైకి లేచు సూర్యుడు, మనోమండలములో జ్ఞానసూర్యుడుగా వెలుగొందును. ఉన్నచోటు నుండే అనుభవ జ్ఞానముతో గ్రహించు జ్ఞానికి (ఉన్నదున్నట్లు సత్యజ్ఞానమును గ్రహించుట) ఉన్న స్థలమునుండే ఉన్న స్థితిలో సకలమును తెలుసుకో గలిగిన సామర్థ్యమును పొందగలరు. (సర్వజ్ఞత ఏర్పడును.)

2000. జ్ఞానాదిత్యుని త్రిమూర్తులు కొలిచి, స్తుతించిరి: నాభి, నేత్రము, నాసిక, భ్రూమధ్యము, శిరస్సు నందు ప్రకాశకిరణములతో వెలుగు జ్యోతిని దేవతలైన మూవురు రుద్రుడు, విష్ణువు, బ్రహ్మ గ్రహించియుండిరి.

## 26. శివాదిత్యుడు

(శివసూర్యుడు)

2001. శివసూర్యుని ఎదుట అజ్ఞానవీర్యము వీగిపోవును: శివసూర్యునికి వ్యతిరేకమైనది బంధ అజ్ఞానము, దాని వలన కలుగు పర్యవసానములు శివప్రకాశము వలన అవి అణగి, మణిగియుండును. సూర్యుడు ఉదయించుటకు పూర్వం అరుణోదయం గలుగునట్లే బంధమను అజ్ఞానచీకటి తొలగిపోవును.

2002. శివసూర్యుడు అంతటా వ్యాపించిన తత్త్వమే: నీరుతో నిండిన ఘటములో (కుండలో) సూర్యుడు కనిపించిననూ ఆ ఘటము మూయుట వలన తన ప్రకాశము మూయబడదు. అట్లే నీలకంఠుడు (శివుడు) కోరి నెలకొన్న ఈ దేహములో ఇమిడి అణగియున్నాడు. (శివతత్త్వము/చైతన్యము సూర్యుని కాంతివలె అంతటా వ్యాపించి, అందులో ఇమిడియూ ఉన్నది.)

2003. శివమైన తానే విస్తరించిన కిరణములు గలిగిన సూర్యుడు, చంద్రుడు, అగ్నిగాను కలిసి ఒకటిగాను, నెలకొని, తానే దేహతత్త్వమగు బ్రహ్మ, విష్ణువు, రుద్రుడుగాను, ప్రాణతత్త్వమైన (మహేశ్వరుడు, సదాశివునిగాను) విడదీయలేనిదిగా సమ్మేళనమై, తానే ఆకాశముగాను, దాని ప్రకాశముగానే కాకుండా చీకటిగాను ఉన్నాడు. (శివుడే దేహం, ప్రాణము, ఆకాశము, వెలుగు, చీకటిగాను ఉన్నాడు.)

2004. దైవత్వముతో నిండిన ప్రకాశము గలిగిన శివాగ్నియు, సూర్యుడు, చంద్రుడు, భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము మొదలగువన్నియూ శివుడు ధరించిన దివ్యదేహములగును. ఈ దివ్యదేహమును ఆధారముగా గల సకల చరాచరములకు (జగత్తు, జీవరాశులు) ఐదుగురిగాను (పంచబ్రహ్మలుగా: తత్పురుషం, అఘోరం, సద్యోజాతం, వామదేవం, ఈశానం), ఆరు అంగములుగాను (హృదయం, శిరస్సు, శిఖా, నేత్రత్రయం, కవచం, అస్త్రం) నెలకొని వృత్తులు చేయుచున్నాడు.

## 27. పశు వివరణ

(పశు–జీవబంధము–కట్టబడినది)

2005. సృజించినంత మాత్రమున గ్రహింపబడు ఏకమైన నాయకుడు, ఎవరిని ఎడతెరిపి లేక వేదములు ఘోషించుచున్నవో, నాలో ఇమిడి, నెలకొని సదా వెలుగుచున్న ఆ జ్యోతిని **హంస**రూపుడని తెలుసుకొంటిని. (దైవము ప్రజ్ఞారూపుడు – **ప్రజ్ఞానం బ్రహ్మ** – శ్రుతివాక్యము, ఐతరేయ ఉప॥)

2006. జీవుని జీవితములో రెండు హంసలు ఉన్నవి. అవి నది ఒడ్డున నిలబడియున్నవి. రెండునూ ఒకటి నుండి ఒకటి వేరగునదిగాదు, విడదీయలేనిది. తన నిజతత్త్వమును శివమని హంస గ్రహించక, తాను వేరని గ్రహించినచో, జీవుడైన హంసకు శివముక్తి గలుగజాలదు. (నదిఒడ్డు = అశాశ్వతమైన జీవజీవన విధానము; ఆత్మ, అనాత్మ తత్త్వములను వివరించబడినది. తాను ఎప్పటికీ ఆత్మతత్త్వమే. అనాత్మయైన దేహేంద్రియ మనోబుద్ధులు ఎప్పటికీ కానని, దృఢమైన సంకల్పము గలిగి యుండవలెను. దేహమునకే షడ్వరిష్టాలు. ఆత్మకు కానేరదు. ఆత్మ ఎప్పటికీ శాశ్వతమన్న బ్రహ్మభావనలో నెలకొని యుండవలెను. అనగా తన స్వస్వరూపమును

ఎరుగకుండుటయే అజ్ఞానము. అదే సంసారమలమన్న ఎరుకతో అజ్ఞానమును పారద్రోలవలెను.)

## 28. పురుషుడు

2007. వైఖరియాది (పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి మొ॥) వాక్కులను, మాయాది మలములను, అశాశ్వతమైన భోగవాసనలను, పురుషాడాది భేదములును, జన్మ బంధమును త్రెంచు ఆత్మజ్ఞానమును, క్రియావిశేషములను, సాక్షిగా నిలబడి జీవాత్మలు సాధనలతో ఉన్నతి పొందవలెనన్న సత్సంకల్పముతో అనాదిగా ఈశుడు (శివుడు) చేసి అనుగ్రహించినదే సుమా!! (జీవుడు సాధనలతో ఆత్మజ్ఞానము పొందుటయే గతిదాయకము – గమ్యము)

2008. అణువులలో అణువుగా నున్నది వేలసంఖ్యలలో కూర్చి, ఆ వేల అణువులో ఒక్క అణువు తత్త్వపు ఎరుకతో దాని దరిచేరినవారికి, అణువులలో అణువుగానున్న ఆదిపరాపరుడు, బహుసూక్ష్మమైన ఆ పరాపురుషుడున్ని పొందగలరు సుమా!! (అణువులలో అణువుగా ఉన్నదే ఆ పరాపురుషుడు.)

2009. ఆత్మ యొక్క సత్యతత్త్వమెరుగుటచే **శివగతి** చేకూరును. రావిచెట్టు విత్తనములో దాని శాఖలు, కొమ్మలు, ఊడలు నిండిన చెట్టు ఉన్నట్లు, ఆత్మను అనుగ్రహము తోడుతో దానిని సంస్కరించినచో, అజ్ఞానముతో ఏర్పడినదైన దుఃఖమును ఉద్రిక్తము చేయగల చీకటిని పూర్తిగా పారద్రోలగలిగి, నాట్యకారుడు (శివుడు) అనుగ్రహించిన **శివగతి** పొందగలరు. (ఆత్మలో బంధము ఏర్పరచునది. బంధవిముక్తి, మోక్షము ఇమిడియున్నది.)

2010. ఆ పరాపరుని తత్త్వమెరిగినవారు వాని వ్యాపకమును కూడ ఎరుగగలరు: అణువులో అతను, అతనిలో అణువును (ఆత్మలో శివుడు స్థితిపొంది యుండుటయూ; శివునిలో చివరకు ఆత్మ నెలకొనుటయూ) విడదీయలేనట్లు కలిసియున్నదని గ్రహించినవారికి మహామహుడైన ఈశుడు సర్వవ్యాపకుడై, సర్వాంతర్యామిగా, చరాచరములంతటిలో వ్యాపించి నెలకొన్నది గ్రహించగలరు.

## 29. జీవుడు (ఆత్మ)

2011. కోటానుకోట్ల జీవప్రకాశ అణువుల పరివారమే ఒక పురుషత్వ అణువు పరిమాణ మగును: ఆత్మయొక్క పరిమాణము పోల్చి చెప్పవలెనన్నచో, గోవుయొక్క కొసరోమమును వంద భాగములు చేసి, అందులో ఒక ముక్కను వేయి ముక్కలు చేసినచో, ఆత్మ పరిమాణము పశువు యొక్క రోమము ముక్కలో ఒక లక్షవ వంతుకు పోలిక అగును.

2012. మహోన్నతమైన **శివం**ను సూక్ష్మాది సూక్ష్మమైన ఈ ఆత్మ తన తపస్సుతో గ్రహించ గలదు. నా నాయకుడు (శివుడు) దేవతలందరిలోను మహోన్నతుడు. ఉన్ననూ, తన కరుణా హృదయముతో ప్రాణి దేహమున ప్రాణముతో కలిసి నెలకొనియున్నాడు. దేవతలచేత కొలవబడలేని మహాదేవుడు వాడు. ఐననూ, ఆత్మ నానొనరించు తపస్సు చేత ఆతనిని గ్రహించగలుగును. (దేవతలు వారి కళలుతో ఇమిడి వృత్తులు చేయువారు. కాని శివుడు **శాంత్యాతీత** స్థితిలో వెలయువాడు. కావున గ్రహించ బడనవాడుగా చెప్పబడినది.)

2013. యోగము అభ్యసించుటకు శ్రేష్టమైన గురోపదేశము (శ్రోత్రియబ్రహ్మ నిష్ఠయైన గురువు) చేసినచో, యోగాభ్యాసముతో నిర్విరామసాధనలు చేయలేనివారై యున్ననూ, వారి పూర్వజన్మ సత్కర్మ ఫలితముల వలన ఆ జీవుడు పిదప తన అనుభవముతోనే తనలో శివరూపము పొందగలరు. (గురోపదేశము వలననే పూర్వజన్మ కర్మఫలములు సఫలమొంది ఈ జన్మలోనే శివరూపసిద్ధి పొందగలరు.)

2014. గురు అనుగ్రహము ద్వారా మాయా ఉపాధులన్నియూ తొలగిపోయి జ్ఞానము నెలకొనుట: ప్రాణము, మాయాకార్యముల, దుఃఖమిశ్రితములలో తగులుకొని దాని వశమైపోవును. జ్ఞానమే స్వరూపముగా గల గురువు (శివోహం భావనలో నుండి – బ్రహ్మనిష్ఠలో నుండు గురువు) చేతనతత్త్వమును పురికొల్పినచో, మాయా కార్యముల చేష్టలుడిగిపోయి (తొలగిపోయి) ప్రాణము యొక్క చేష్టలు అభ్యాస సాధనలచే పక్వపడి తురీయం స్థితిలోనికి చేరి, జ్ఞానస్వరూపముగా వెలయును. (తురీయం = దేహభావన వీడి ఆత్మతత్త్వములో నెలకొనుట.)

## 30. పశువు – జీవుడు

(కట్టబడిన ప్రాణం / జీవుడు)

2015. నేర్చిన పశువులు ఎంత అరిచి తిరిగిననూ (వేద ఆగమములు చదివి, అనుభవము లేమితో ప్రగల్భాలాడువారు) గొప్ప మర్యాదలు పొందు పశువులు ఎంత మేసిననూ (రాజాదరణతో మర్యాదలు, బిరుదులు, సన్మానములు పొంది గొప్పగా తిరుగాడువారు) శ్రేష్టమైన పశువు యొక్క చెంబు పాలు చాలును (అనుభవజ్ఞుని జ్ఞానమే లోకమునకు శ్రేయస్సు ఒనగూర్చును). మిగతా పశువులన్నీయూ లోకమునకు బంజరు ఆవులు వంటిదే. (మిట్ట వేదాంతపు మాటలతో కాలము వెల్లబుచ్చువారు లోకశ్రేయస్సుకు పనికిరారు.)

2016. పెరటిలో మేయు పశువులు ఏమి చేయగలవు? (స్వాధీష్టాన చక్రములో కామ ఇచ్ఛలు పురికొల్పుటలో మనస్సుంచినవారు ఏమి సాధించగలరు?) ఎల్లలు దాటించి వాటిని సక్రమపరచి (కామ ఎల్లలను దాటించి, ఈశ్వరతత్త్వములో నెలకొని ఉన్నతి

పొందగోరి) శ్రేష్టతను పొందునట్లు చేయనిచో, (శివజ్ఞానుల మధ్య మెలగునట్లు చేయనిచో) ఆ పశువులు పెరటిలో ఉంచిన అలవాట్లను మార్చుకొనజాలవు. (కామ ఇచ్ఛలను మార్చుకొనజాలరు.) (అనుభవజ్ఞుల జ్ఞానుల సహాయము చేతనే సత్య తత్త్వమును పొందగలము.)

## 31. బోధకుడు

(జ్ఞాని: శివజ్ఞానమును అనుభవములో దర్శించినవారు)

2017. అనుభవజ్ఞుడైన జ్ఞాని శిష్యునికి దేహభావనను తొలగించి శివానందత్వము నొసగును: జీవుడని, శివుడని రెండు పదార్థములుగా లేవు. జీవుడు జీవతత్త్వములో నెలకొని యున్నంతవరకు శివతత్త్వమును పొందజాలడు. జీవుడు తన జీవతత్త్వమును మార్చుటచే అఖండ జ్ఞానము పొందిన పిదప జీవుడు అన్న పేరు తొలగిపోయి **శివం** అన్న నామముతో వెలయును. (జీవతత్త్వం మార్చుటచే: కామకలాపాలు, అనాత్మపై ప్రేమాభిమానములు, రాగద్వేషములు తొలగించుకొని పరిపక్వత నొందినది.)

2018. జ్ఞానప్రకాశముగా వెలుగొందు నటరాజుడు (శివుడు) హృదయమునందు జ్యోతిగా అన్ని జీవరాశులలో నెలకొని, బాగుగా పడగ విప్పి ఆడు నాగుపాము శీర్షముపై ఏర్పడు నాగరత్నంవలె (నాగమునకు పరిపక్వత పొందిన పిదప రత్నం/మాణిక్యం తన శిరస్సుపై ఏర్పడునట్లు) సకల జీవరాశులకు శివుడు తేటపరచు లోక పర్యవేక్షుడగును.

2019. జీవుడు అఖండ జ్ఞానము పొందిన పిదప సర్వజ్ఞుడగును: అఖండ జ్ఞానముతో తన అజ్ఞానతత్త్వము తొలగించుకొన్నవాడై పంచేంద్రియ వాసనలను కాల్చి, అఖండ జ్ఞానముతో అన్నిటినీ గ్రహించగలిగిన శక్తి పొంది, వాడే జ్ఞానరూపుడై అన్ని జీవరాశులలో నెలకొన్న జ్ఞానియగును. బుద్ధిపూర్వకమైన జ్ఞానము తనే అగును.

2020. ముప్పదిఆరు తత్త్వములు (దేహతత్త్వములు=36) ఎరుగకయున్న నాకు, వాటి తత్త్వములను నా గురునాథుని రూపములో నందీ బోధించి అనుగ్రహించెను. ఆ ముప్పదిఆరు తత్త్వములను బోధపరచిన పిదప, ఆ తత్త్వములన్నిటికీ అతీతముగా తను నిలబడి నాకు దర్శనమిచ్చెను. (రచయిత శ్రీ తిరుమూలర్ మహాజ్ఞాని, మహాయోగి. లోకుల కొరకు తను అజ్ఞానములో నున్నట్లు తన నమ్రతను చాటుకొను చున్నారు.)

2021. శివునిలో నుండి విడదీయలేని అనుగ్రహ ప్రదాతను గ్రహించలేరు. కీడును గలిగించు పంచమలములు (జ్ఞానేంద్రియ ప్రజ్ఞాసమూహము) తమలో నెలకొని యున్నవని గ్రహింపజాలరు. శరీరమును శుష్కింపజేయు తపస్సులను బూని బుద్ధిని పాడుచేసుకొనుచున్నారు. నవమైన తత్త్వములతో (శ్రేష్టమైన/శ్రేయస్సు ఒనగూర్చు)

శివతత్త్వమును గ్రహించజాలకున్నారే!! (ఏమీ అజ్ఞానం.)

2022. తన దినచర్యగా శివుడు జీవులగు మనకు చేయు అనుగ్రహ చర్యలను తలంచి చూడజాలరు. తన దినచర్యగా మనయొక్క కర్మఫలితములకు తగ్గట్లు సుఖ, దుఃఖములను మొసగునది గ్రహింపజాలరు. తన దినచర్యగా శివుడు ఉత్తములకు అనుగ్రహము నొసగునది కూడ గ్రహింపక, తమతమ కీడు కర్మఫలితముచే గలుగు బంధములందు చిక్కుకొని తపించుచున్నారే!! ఎంతటి అజ్ఞానం!!

## 32. పంచేంద్రియములను అణచు మహత్వం

2023. ఇంద్రియములు బలిష్టముగా నున్నప్పుడే యోగము చేసి వాటిని అణచి ఉంచుట ఉత్తమము: మదముతో నిండిన పంచేంద్రియములను ఐదు మదగజములు గలవు. ఇవి దేహమునకు శ్రేష్టత ఇవ్వగలగు చంద్రమండలమునకు (యోగసాధనకు) కట్టుబడటము లేదు. దీనిని అణచగల మావటి (ఆత్మ), పంచేంద్రియముల ప్రభావము క్షీణించిన పిదప దేహమును సక్రమపరచినట్లు (యోగం చేకూరినట్లు) నేను ఎప్పుడూ వినలేదు సుమా!!

2024. ప్రాణణ (శ్వాస) చలనమును మార్చినచో మనస్సు, ఇంద్రియప్రజ్ఞలకు లోనుకాదు: శ్రద్ధతో కొంతకాలము ప్రాణాభ్యాస సాధనలు చేసి, ప్రాణణ (శ్వాస) యొక్క చలనమును సాధనతో ఆత్మయను మావటి చేతికిచ్చినచో, వేగముగా దూసుకువెళ్ళు పంచేంద్రియ మృగములు వెళ్ళక కట్టడి చేయబడి, అవి వాటి ఇష్టానుసారము వెళ్ళజాలవు. (కట్టడి చేసిన పిదప మనస్సు వాటి దారిన వెళ్ళదు.)

2025. పంచభూత స్థానములు ఐదు. జ్ఞానేంద్రియములైన పక్షులు ఐదు. అవి మేయు తన్మాత్రలగు ప్రజ్ఞలు ఐదు. కర్మేంద్రియములు ఐదు. అవి వృత్తులు చేయునదైన వాసనలు ఐదు. మాయాది సమూహము ఒకటి. జ్ఞానమను బెత్తముతో నడిపించు కాపరి (ఆత్మ) ఒకడు. వాడు చింతించి తిరిగి తిరిగి వెళ్ళిపోవు ద్వారములు తొమ్మిది. (నవద్వారములు: రెండుకళ్ళు, రెండు చెవులు, రెండు నాసిక రంధ్రములు, నోరు, మూత్రపురీశాదుల ద్వారములు.)

2026. మనస్సు బాహ్యాప్రవర్తనలను మాని అంతర్ముఖమైనచో దైవమును దర్శించగలరు: దేహమను అడవిలో ఐదు సింహములు గలవు (పంచప్రజ్ఞలు). ఆ ఐదున్నూ బాహ్యముగా వెళ్ళి విషయములను గ్రహించి అంతరమునకు వచ్చిచేరును. విషయ వాసనలపై మనస్సు వెళ్ళనీయక కరణములను (కన్ను, చెవి, ముక్కు, నాలుక, చర్మము) కట్టడి చేసినచో తప్పక దైవమును పొందగలరు!!

2027. ఐదు ఇంద్రియములగు మంత్రులు, వారి ఆదేశానుసారముగా పనిచేయు తొంబది ఆరు తత్త్వములు వారి పిల్లలుగా వచ్చి మనలను పరిపాలించుదురు. ఆ ఐదుగురును

ఐదు తాపములను మనపై ఉత్కృష్టము చేసినచో, మనచే ఆ ఐదుగురిని శాంతింప జేయలేము సుమా!!

2028. ప్రతిరోజు స్వయంప్రకాశముగా వెలుగు శివజ్యోతిని స్తుతించనైతిని! దివ్యానుగ్రహము ఇవ్వగల మహాతల్లి (శక్తి) అచ్చటనున్నదని గ్రహింపనైతిని! పంచేంద్రియ ప్రజ్ఞలను కట్టడిచేసి పరిపాలించు తత్త్వమెరుగకుంటినే!! మరణమునకు తీసుకువెళ్ళు గుర్రంపైనెక్కి స్వారీ చేయుచుంటినే!! (దేహక్షీణత ఏర్పరచదగు ఇంద్రియచర్యలకు లోనైతినని రచయిత వాపోవుచున్నారు.)

2029. ఈ దేహమునకు పెక్కు రకములైన వ్యధలను ఏర్పరచునదైన మనస్సులో ఉత్పన్నమైన పలురకముల కామ్యకలాపాల వెంట పరుగులు తీసినచో కీడే కలుగును. ఈ ప్రాణము మనస్సు వెళ్ళురీతిన వెళ్ళక నిగ్రహింపబడినచో, కామ్యకోరికలు లేని మనస్సులో మహానందమును చవిచూడగలము.

2030. చంద్రమండల స్థానములో (శిరస్సు-సహస్రమున) మనస్సు పదిలమైనపుడు అధోముఖ ధోరణి ఉండజాలదు: ఈ జగత్తులోని జనులందరికి వారివారి పుణ్య భావనలకు తగ్గట్లు వారి జీవితము లేర్పడును. శివుని సర్వదా స్తుతించు పుణ్యము ఏర్పరచుకొన్నవారికి ఊర్ధ్వలోకము అమరును. చంద్రమండలములో నెలకొని యుండు తత్త్వముబట్టి మానవుని జీవితము అమరును. అధోముఖ ధోరణి వీడుట ఏలనగా ఇటువంటి ఉన్నతమైన నిధిని పొందుటకే కదా!!

## 33. పంచేంద్రియములను అణగద్రొక్కు విధానము

2031. చంద్రమండల ప్రకాశమములో ఆత్మ నెలకొనునపుడు విషయవాసనలచే గలుగు పునర్జన్మ ఇక ఉండదు: ఒక మూర ఎత్తులో, అర్థమూర వెడల్పులో ఒక చెరువు గలదు. ఆ చెరువు వృత్తముగా బాగా లోతుగా ఉండుటచే నీరునిండి (విషయ వాసనలను) చేపలతో నిండియున్నది (శిరస్సులోని మనోమండలములను చెరువుతో పోల్చబడి, పెక్కు విషయవాసనలే చేపలు చెప్పబడినది). బెస్తవాడు (శివుడు) వలను విసిరెను. అందులో చాలా చేపలు చిక్కుకొన్నవి. ఇక నాకు జన్మదుఃఖము తొలగి పోయినది సుమా!! (శివానుగ్రహముచే విషయవాసనల నుండి విడుపడునట్లు చేసి, జన్మరహితము పొందెనని రచయిత చెప్పుచున్నారు.)

2032. ఇంద్రియ నిగ్రహముతో కామ్యముల రహితమే ప్రాణజయం పొందగలరు: అజ్ఞానముతో కప్పబడిన ఈ దేహములో ఇంద్రియములు చాలా ఉద్రిక్తముగా వృత్తులు చేయుచున్నవి. వాటిని నిగ్రహించుకొన్నవాడే అమరుడగును. దేహములో భుజించుట, శరీరవాంఛలగు రెండు సుఖములలో మనస్సు నెలకొనియుండు వరకు దేహములో శ్వాసచలనము జరుగుతూ ఉండును. (శ్వాసలయము సిద్ధింపదు.)

2033. ఇంద్రియములైందింటిని **అణచవలె, అణచవలె**నని పురికొల్పువాడు మూఢులు. అట్లు ఐదింటిని అణగద్రొక్కుటకు దేవతలు లేరు. ఐదింటిని అణగద్రొక్కినచో అచ్చట **అచేతనం** నెలకొనును (జడం అగును) కాబట్టి ఐదింటినీ అణచుదగు జ్ఞానమును వివేక పూర్వకముగా తెలుసుకొంటిని. (జ్ఞానమయమైన శివుని వివేకముతో, బుద్ధితో గ్రహించుటయే ఉపాయము.)

2034. ప్రణవజ్ఞానములో బుద్ధి నెలకొనునపుడు ఏనుగువంటి మదఇంద్రియములు వశపడును: ఇంద్రియములగు మదగజములు మూడింతలై ఉద్రిక్తములగుచున్నవి. వాటిని అణచుటకు కోటను ఏర్పరచితిని (బుద్ధిపూర్వకముగా). ఉన్నా దానినుండి తప్పించుకొనిపోయి (బాహ్యప్రవృత్తులలోని వాసనలకు లోనై) బయటకి వెళ్ళిపోయి, చెరకుపంటను (ఆధ్యాత్మికతను) నాశనము చేసి తిరుగాడుచున్నవే!!

2035. ఐదింటిలో లయమైనచో (అ, ఉ, మ కారములు, బిందు, నాద–ప్రణవం) అదే గమ్యస్థానమగును (నాదాంతస్థితి). ఐదింటిలో లయమగుటయే మహాతపస్సగును. ఐదింటిలో లయమగుటయే శివపదమగును. ఈ ఐదింటిలో లయమై నెలకొన్నవారే అనుగ్రహవంతులు.

2036. చిత్తము శివమయమైనచో లౌకికచింతలు క్రుంగిపోవును: ప్రగల్భాలాడి ఏమి ప్రయోజనము? ఎండమావివలె కనిపించి మాయయగు ప్రపంచమును తలంచి ఏమి లాభము? అంతటా వ్యాపించిన వస్తుప్రపంచమునకు విత్తనము మనస్సే. మనస్సన దాని గురించి తలంచు కొద్ది అది (వస్తుప్రపంచం) మరింత విస్తరించును. వాటిని తలంచక శివునియందు మనస్సు ఉంచినచో, వస్తుప్రపంచము తనంతట తానే కృంగిపోవును. బాగుగా గ్రహించినవారికి ఇంతే, (ఇదే) సత్యమని ఎరుగుదురు.

2037. బ్రహ్మరంధ్రములో మనస్సు నిలుపుటయే ఇంద్రియములను కట్టడిచేయు ఉపాయ మగును: బంధముల వెంట పరుగిడక పరిపక్వము పొందవలసిన జీవుడు బాహ్య ప్రవృత్తిలో వెళ్ళి చెడనీయక అడ్డుకొని కరుణతో జీవుని శివజ్ఞానుల సమూహములో ఉంచి, పంచతలల నాగమువలె పంచచేష్టలు (పంచేంద్రియ విషయవాసనలు) తాను జీవునిలో నెలకొనుటచే అవి వీగిపోయి, బ్రహ్మరంధ్రములో నెలకొనునట్లు చేసి ఆనందమయమును గలుగజేయును.

2038. జ్ఞానేంద్రియ ప్రజ్ఞలు సహస్రదళ పద్మమున లయమగుటచే మహానందమును పొందగలరు: పంచభూతములు తమ స్థూలరూపమును మార్చి సూక్ష్మరూపములో ఐదు వివిధ ప్రకాశములున్నవి ఏకమై ఊర్ధ్వసహస్రమున – నేతవస్త్రముచే కట్టబడినట్లు అందు ఇమిడినచో, ఆనందస్థితి యగు అనుగ్రహము పొందగలరు. ఇదే బహు పురాతనమైన యోగతత్త్వమగును.

2039. నందిని (శివుని) తలంచి మనోదేవాలయమగు సహస్రమున చిత్తముంచి స్తుతించ వలెను: నడయాడు నందిని తలంచి (సకల జీవరాశులలో ప్రాణముగా నెలకొన్న శివుని తలంచి) వస్తుప్రపంచములో నడయాడు మనస్సును కొద్దికొద్దిగా నిగ్రహించి, ఊర్ధ్వసహస్రమున నెలకొని అందు పదిలము చేసినచో, శిరస్సు యొక్క దక్షిణదిశలో మనోఆలయము అమరును.

2040. ముందు చెప్పిన మంత్రసాధనతో కొనిన నిమిషములు, గంటలు, రోజులు గడచి పోయిన పిదప ప్రపంచవస్తు సముదాయమంతయూ నీటిపై రాతలవలె తొలగిపోయి, వాటిపైనున్న విషయ మమకారములను కొద్దికొద్దిగా తొలగించి, జయించిన పిదప కొండంత దుఃఖమేర్పడిననూ చలించక ఓర్చుకోగలరు.

2041. పునీతుని సాకారమును (శివుని రూపమును) మనస్సున తలంచి స్తుతించి, విషయ వాసనలలో తిరుగాడు వాటిని (ఇంద్రియములను) వెనక్కులాగి, పూజించి, నాలుగు దిశలకు నాయకుని తలంచి అమృతము స్రవించు మనస్సున నిలిపిన ఆనంద మొందుదమే!!

2042. ఆకారముగా నెలకొన్న ఈ దేహమున (అండకోశములో) మనస్సే అన్నిటికీ సకలముగా నున్నది. దేహమును కోసుకుతినే ఐదుగురిని (పంచప్రజ్ఞావృత్తులు) ఎవరూ ఎరుగక ఉన్నారు. నవ్వులాటగా ఈ ప్రపంచవాసనలను తలంచి పలువురు పలువిధములుగా మాట్లాడుకుంటున్నారే తప్ప, అండకోశ చీకటి ఎల్లలు దాటి రాలేకుండా ఉన్నారే!!

2043. అంతరమున దైవచింతనలో నుండువారికి బాహ్యేంద్రి ఆశలు ఇబ్బందిపెట్టదు: పంచేంద్రియములు వశమైన పిదప ఇక విడుచుట మరేమీ లేదు. అంతరమున నెలకొనియున్న ఆ సర్వేశ్వరుని సహజస్థితిలో స్తుతించండి. అట్లు కానిచో ఇంద్రియ వాసనలు ఆశలకు తగ్గట్లు పురికొల్పి అశాశ్వతమునకు దారితీసి అధోగతి పాలుచేయును సుమా!!

## 34. అసద్గురుతత్త్వం

సన్మార్గమెరుగని గురువు

2044. శివానుభవము లేని మూఢుడు సత్యజ్ఞానమును గ్రహింప ఎరుగనివారు, వేదాగమములలో చెప్పబడు ముడులను (నిగూఢ, క్లిష్ట తత్త్వములను విడదీసి చూడగల) గ్రహించి, విశదీకరించ లేనివారును, అణకువ లేనివారును, పరనింద చేయువారును, దేహభావనలో ఉండు వీరు **అసద్గురు** అని పిలువబడుదురు.

2045. మంత్ర, తంత్ర, మహాయోగం (శివయోగం), బంధము, ముక్తి మొ॥ వాటిని గ్రహించి, అనుభవము పొందినవారిని, మనస్సున ధ్యానించి నిశ్శంసయ, సత్య

జ్ఞానమును పొందక, ఉదరపోషణ కొరకు తిరుగాడు గురువులును **అసద్గురువు**లని పిలువబడుదురు.

2046. బ్రహ్మానందమును పొందుటకు మార్గమెరుగనివారు మూఢులు. బుద్ధిలేని పనులు చేయువారైన అతిమూఢులను, కామాది షడ్వరిష్టములను తొలగించుకొనని అధములు, పాపులకు సత్యమును బోధించక అసత్తును (అజ్ఞానము, అశాశ్వతత్త్వం) బోధించువారును, శ్రేష్టగురువు కాజాలరు సుమీ!! వారు **అసద్గురు**లే. (షడ్వరిష్టములు: కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యం.)

2047. లౌకిక వాసనలు, ఆలోచనలు తొలగించుకొనక బోధించినచో, తత్భావం చెడును (శివభావన శ్రేష్టత కోల్పోయి కృంగిపోవును). తనకే శత్రువగును (శత్రుభావన, లౌకికభోగ వాసనలు ఒకదానికొకటి విరుద్ధమైనందున కీడు ఏర్పరచును). ఇటువంటి గురువులున్న రాజ్యమునకు, రాజుకు కీడు గలుగును. ముందే ఇది నంది (శివుడు) నోటినుండి జాలువారినదే!!

2048. కళ్ళు లేనివారికి కఱ్ఱ తోడునిచ్చిన గుడ్డివాడు దారి తెలియక గోతిలో పడును. దాని పిదప దారి చూపినవాడు కూడా పడును. ఒకరి తర్వాత ఒకరు అదే గోతిలో పడుదురు. అట్లే జ్ఞానము బోధపడని శిష్యుడు, అసద్గురుతో చేరి ఇద్దరూ అజ్ఞానములో పడుదురు. (కామజయము పొందనివారు శివయోగం బోధ చేయలేరు. మంత్రము 1680 చూడవలెను.)

## 35. సద్గురువుతత్త్వం

(సత్యం బోధించు గురువు)

2049. ప్రజ్ఞ/జ్ఞానము/సత్యంను బోధించు నాయకుడే సద్గురువు (శిష్యుని శిరస్సున శివపాద తత్త్వం నెలకొనునట్లు చేయు సామర్థ్యుడు). జ్ఞానము బోధించి తనను తెలుసుకొన జేయువాడే సద్గురువు (జీవుని యదార్థ స్వరూపము ఎరుగునట్లు చేయుట). జ్ఞానము బోధించి తత్త్వాతీత స్థితి పొందజేయువాడే సద్గురువు (దేహేంద్రియ ముప్పదిఆరు (36) తత్త్వములు దాటి ఆత్మగా జీవునిలో నెలకొనియున్నదని తెలిపి) జ్ఞానము బోధించి బంధవిముక్తి చేయువాడే సద్గురువు. (బంధతత్త్వములను ఎరిగించి వాటి నుండి విడుపడుటకు ఉపాయము చెప్పి జ్ఞానముచే రెండు ఫలితములు పొందునట్లు చేయుట. 1) ఆత్మ, అనాత్మ తత్త్వములను విడదీసి బోధించి, అనాత్మ నుండి విడుపడుటకు ఉపాయము చెప్పుట. 2) తత్త్వాతీత స్థితియగు ఆత్మలో నెలకొని శిష్యుని రమించునట్లు చేయుట సద్గురువు ముఖ్యలక్షణము.)

2050. సద్గురువు శిష్యుని కర్మఫలితములను పోగొట్టి జన్మదుఃఖము తొలగించుట: తన వద్ద బోధ (ఉపదేశము) పొందిన శిష్యుల కర్మలు తొలగించి, దానివలన కలుగు

విధివిన్యాసములు గలుగకుండునట్లు శిరస్సునందు తన పాదమును ఉంచి, యముని పరివారము అతనిని సమీపింపకుండునట్లు చేయును.

2051. గురువు అనుగ్రహముతో జన్మము ఇక ఉండదు: నల్లటి ఇనుము రసవాదముతో (Alchemist) బంగారుగా మారిన పిదప ఎట్లు మరలా ఇనుముగా మారజాలదో, పరిపక్వపడిన గురువు యొక్క అనుగ్రహము పొందిన శిష్యునికి ఇక పునర్జన్మము ఉండజాలదు.

2052. ఆర్భాటములు లేక అనుభవమున్న గురువే సద్గురువు: బంధములను నివృత్తింపజేసి, పరమేశ్వరునితో (పరంతో) తనకున్న సంబంధమును సాధనలతో గ్రహించి, ముమ్మలముల (అహంకారం, కామ్యకర్మలు, మాయ) సముదాయమును తొలగించుకొనదగిన అనుభవజ్ఞుడే సద్గురువు. ఆర్భాటములు ప్రగల్భాలాడువారు కాదు సుమీ!!

2053. ప్రేమస్వరూపముగా నెలకొన్న నిర్మలుడు, దోషరహితమైన ప్రేమను చొప్పించగల సామర్థ్యమున్నవాడు, నిత్యుడు (శాశ్వతుడు), శుద్ధుడు, శిష్యుని గుణతత్త్వములను గ్రహించగలిగినవాడు, శరణునొందిన శిష్యునికి అనుగ్రహించి ఉపదేశము ఇచ్చువాడే ఉన్నతుడైన గురువగును.

2054. శిష్యునికి గురువే **శివగతి** ప్రాప్తింపజేయగలరు: రసవాద ప్రక్రియలో లోహముపై ముప్పుపడిన స్థలమంతా బంగారుగా మారునట్లు, గురు పాదస్పర్శ పడిన శిష్యుడు ముమ్మలములు తొలగించుకొని **శివగతి** పొందగలడు. (ముప్పు: రసవాద ప్రక్రియలో పాదరసముతో కలిపిన కొన్ని లవణముల, మూలికల మిశ్రమం.)

2055. సద్గురువు తానే శివమై వెలసియున్నారు. అతని ప్రత్యక్షమున శిష్యుడు ఆత్మ స్వరూపమును గ్రహించి, తేటజ్ఞానమును బోధపరచుకొనినచో, దేహములో నెలకొనియున్న జ్ఞానమే అన్ని తత్త్వములకు అతీతమైన శివతత్త్వమని ఎరిగి, రెండు వేరుగాదు, ఒక్కటేనన్న గ్రహణ పొందును. (ఆ శివుడే మాంసదేహ రూపముతోనున్న శివుడగును.)

2056. అనుభవజ్ఞుడైన గురువే శిష్యుడిని నాదములో నెలకొనునట్లు చేయును: వచ్చుట (జన్మ), పోవుట (మరణం) అనునది లేక అమరుడుగా నెలకొను తత్త్వమును కామఇచ్ఛలు గలవారికి లభ్యముకాని తత్త్వమే. కాని నా నంది మహామహుడు బోధించు తత్త్వము శ్రేయస్సు ఒనగూర్చునదియూనై, అనుభవజ్ఞుడైన గురువు ద్వారా ఉపదేశము పొంది, నాదములో నెలకొనును.

2057. శివోహం భావనలో ఉండు గురువు శిష్యుని మలము నివృత్తించి శివునితో చేర్చును: గురువన్నవారు వేదఆగమములలో చెప్పబడిన **పరం** (ఆత్మతత్త్వము)లో నెలకొని

**శివోహం** అని భావించి, వేరెటువంటి అన్యభావనలు లేక శిష్యుని దేహమోహ బంధములను తొలగించి, అంతరమున నెలకొనియున్న కారణగురువుతో (శివునితో) తన శిష్యుని ఐక్యపరుచును.

2058. **సత్** అయిన శివం, **అసత్** అయిన మాయ; **సత్**తో కూడి సత్‌గాను, **అసత్**తో కూడి అసత్తుగానున్న మూలతత్త్వములను బోధపరచి, **చిత్** అగు ఆత్మయూ (జ్ఞానము), అచిత్ యగు దేహములోని ముప్పదిఆరు (36) తత్త్వములతో కూడినది (అజ్ఞానం) బోధపరచి, శివపరముతో చేర్చి, శుద్ధమాయ, అశుద్ధమాయలను తొలగించి, సుఖమైన మాటను చెప్పువాడే (శ్రేయస్సు గలుగజేయు ప్రణవోపదేశము) అనుగ్రహ గురువని చెప్పబడుదురు.

2059. జీవులలో పంచమలములతో కప్పబడిన బంధమును (పంచమలములు = అహంకారము, కామ్యము, మాయ, మాయేయం, తిరోదాయి) తొలగించగలిగిన నాయకుని (శివుని) దివ్యపాదములు భక్తితో శిరస్సుపై దాల్చుటచే, చుట్టూ అల్లుకు పోయిన బేధభావనలను (అజ్ఞానము) తురీయం మూడింటితో కాల్చి (3 తురీయం: జీవతురీయం, పరతురీయం, శివతురీయం – వీటి వివరణ తరువాతి అధ్యాయంలో చూడవలెను) **తత్‌పరం** అగు శివతత్త్వం పొందువారే శ్రేష్టమైన సాధకుడగును.

2060. పరిపక్వమొందిన జీవుడుకి పునర్జన్మ రహితం చేయునది కూడ శివశక్తి అనుగ్రహ లీలయే: అన్ని జీవరాశులలో సుఖభోగ (కామ) ఇచ్ఛను పురికొల్పి, ఇంద్రియేచ్ఛ పొందునట్లు చేసినదియూ, పిదప దైవము, దేవి వారి మనస్సున ఇమిడి, వారి ఇంద్రియేచ్ఛలను తొలగించి శ్రేష్టమైన ప్రాణముగా మార్చి, మరుజన్మం లేకుండా వారిని అనుగ్రహించినది కూడ శివగతి క్రీడావినోదమే సుమా!!

2061. ముక్తినొసగు శివుని చర్యలు చెప్పబడినవి: హీనజన్మలు కల్పించి, పిదప దానినుండి రక్షించి, విధిభోగములను అనుభవించజేసి, పదముక్తి పొందజేసి, పదవి భోగములను జీవులను జన్మల సముద్రములో పడునట్లు చేసి, పిదప జ్ఞానం (శివబోధనం)తో బయపడునట్లు జేసి, ఆదియందు (పరంనందు) మౌనంలో నెలకొనునట్లు చేసి, కడపట ముక్తినొసగునది శివుని వృత్తులగును. (హీన, ఉన్నత జన్మలు కల్పించువాడు, విషయభోగవాంఛలలో ముంచువాడును, పిదప వాటినుండి తప్పింపజేసి జ్ఞానముతో ముక్తినొసగువాడు శివుడేయగును.)

2062. తండ్రి (పరమేశ్వరుడు) పంచకృత్యములతో క్రీడించు స్థలము ఈ దేహము. జ్ఞానముతో అజ్ఞానమును పోగొట్టి తేటపరచిన జీవుని మలములను పోగొట్టి శుద్ధ పరచి, సత్ అంశమైన తనవలె మార్చుకొనుటకే పంచకృత్యముల క్రీడ (సృష్టి, స్థితి, లయ, తిరోధానం, అనుగ్రహం) చేయుచున్నాడు. (సత్=శివం; చిత్=జ్ఞానము; అచిత్=అజ్ఞానము.)

2063. **ఈశత్వము**కన్నా ఉన్నతి పొందుటకు మరేదియూ లేదు. బంధములలో ఉన్నప్పుడు శివమహామహుని పట్టుకొనండి (బంధముల తీవ్రత తగ్గును). అట్లు వానితో ప్రేమ బంధముతో నెలకొనిననూ, వాటికి అంటని నిర్మలుడు. అతను నెలకొన్న బంధమయమైన దేశములన్నిటినీ తన ప్రకాశముతో ప్రకాశింపజేయును.

2064. ఎర్రటి మాణిక్యమాల వలె ప్రజ్వలించుచున్న భ్రూమధ్యమున మేలిబంగారు వలె (అపరంజి) శివుడు నెలకొని అమృతమను బ్రహ్మానందము వెలయునట్లు చేసినది గ్రహించినవారు, పునర్జన్మ రహితమైన తత్త్వమును గ్రహించినవారు. అట్లు గ్రహించనివారు జంతువులవలె అన్నపానాదులకు జీవించువారే!!

2065. జీవతత్త్వము తొలగుటకు రెండు మాయను బోధించువాడే శివుడగును. అసత్తుతో సత్తు, అసత్తు తొలగుటకు (జీవభావన) కట్టుబడిన బంధములన్నీ తెగి, తొలగి పోవుటకు శుద్ధమాయ, అశుద్ధమాయను బోధపరచి, అణవుగానున్న ఆత్మను ఎరుగునట్లు (గ్రహించునట్లు) ప్రణవ ఉపదేశము చేయువాడు శివుడగును.

2066. మూలాధారము మొదలు షట్చక్రస్థానములను దాటుకొని వచ్చు ప్రయాణములో మలములన్నిటినీ నివృత్తింపజేసి, నిర్విరామ (నాదఘోషతో) శివనామ జపముతో అజ్ఞానమును తొలగించుకొని, పశువుయొక్క (జీవులయొక్క) సహజ బంధములన్నీ వీడునట్లు చేసుకొనుటనూ, ముక్తి పొందునట్లు ఉపదేశించు పరమశివుడే గురువగును. (బంధమలమును, అజ్ఞానచీకటిని తొలగింపజేసి ముక్తినొసగువాడు పరమశివుడే.)

## 36. అపవిత్రమైన ప్రవర్తన

2067. మనల్ని పర్యవేక్షించు వారెవరూ లేరనుకొని కొన్ని వంచనలు పలువురు చేయుదురు. అన్నిటిని పర్యవేక్షించుచున్న దైవము లేనిచోటు ఏదియూ లేదు. లోకులు చేయు అన్ని కార్యములను తాను పర్యవేక్షించుచూ అంతటా నెలకొనియున్నాడు దైవము. కంటిని (భ్రూమధ్యస్థానమున దృష్టి నిలిపి) చూచు తత్త్వమున్నవారు వంచన చేష్టల నుండి తొలగి ఉందురు!!

2068. నల్లని కంఠము కలిగిన నీలకంఠుడు–శివుడు (కంఠమునకు క్రింద చీకటి – అధోముఖ ప్రవర్తన; కంఠమునకు పైన ఊర్ధ్వముఖ ప్రవర్తన) మహాసముద్రములతో ఆవరించియున్న భూమిపై పెక్కు జనులు అసత్యప్రవచనములాడుచు తిరుగాడు చున్నారు (అశాస్త్రీయమైన విషయములను చెప్పుట). కాని సత్యప్రవచనములాడినచో (శాస్త్రసమ్మతమైన సత్యతత్త్వమును బోధపరచుట) ఊర్ధ్వలోకములోనున్న దేవతలు కూడ వారిని స్తుతించునట్లు చేయును. ఈ జగత్తుని సృష్టించిన అతను (శివుడు) సత్యమును, అసత్యమును రెంటినీ ఎరుగగలడు సుమా!!

2069. భక్తిని వెలకు అమ్ముకొనుట దుశ్చర్య: భక్తిని వెలకి అమ్మి పూట గడుపుచున్నవారికి, వారి మదము వల్లనే మరింత జన్మములు గలుగుచున్నవి!! విత్తనము చితికిపోయినచో పంట పండజాలదు (కామాది చేష్టలతో దేహము చెడనీయక). కాని అతీతుడైన ఉన్నత్తునికి (దైవమునందు చిత్తముంచినవాడు) ఎప్పటికీ జన్మ ఉండజాలదు!!

2070. **ఉత్తరము, ఉత్తరము** అందురు కొందరు (కైలాసమూర్తి, తీర్థం, స్థలం). కాని ఉత్తరమునందేమీ లేదు. జ్ఞానము లేనివారే అక్కడికి వెళ్ళమని పురికొల్పుదురు. ఉత్తరమున వెలసిన స్థలమంతా జ్ఞాని అంతర్హృదయమున ఇమిడి నెలకొని యున్నదే!! (శిరస్సే కైలాసం.)

2071. ప్రాణమును దేహముతో చేర్చి ఏర్పరచినవాడును, దేహమునందు తానే ఇమిడి తన దేశముగా చేసుకొని, దేహమునందే వృత్తులుచేయు నందిని (శివుని) గ్రహింపక బాహ్యముగా దేశమంతా తిరిగి వెతికి అల్లాడుదురు. వాడు (శివుడు) వారివారి దేహమునందే ఇమిడి నెలకొన్నదన్న సత్యమెరుగజాలకున్నారే!! ఏమి అజ్ఞానము.

2072. దైవము అంతరమున పర్యవేక్షకుడుగా నెలకొని సుఖములను అనుగ్రహించు చున్నాడు: పర్యవేక్షకుడుగా ఉండి చిత్రనాడియగు అగ్నిగా ఉన్నాడు (మూలాధారము నుండి బ్రహ్మరంధ్రము వరకు ఉండు చిత్రనాడి వెన్నెముకలోని మధ్యనాడి – సుషుమ్నతోనుండు అగ్నినాడి) పర్యవేక్షకుడుగా ఉండి, వారివారి మనస్సులో ఉన్నాడు. పర్యవేక్షకుడుగా ఉండి వారి దేహము, మనస్సు కలిపించిన తత్త్వమును గ్రహింప చేయుచున్నాడు. పర్యవేక్షించు ప్రేమికుడు వాడే సుమా!!

(శివునియందు ప్రేమయుంచినవారికి తానే ప్రేమికుడుగాను ఉన్నాడు.)

2073. విద్యావంతులు మొదలగువారు అనుభవలేమితో ఈశుని గ్రహింపజాలరు: కన్యలు ఒక చెర (కామ వశపడి వారి వెంటవెళ్ళుట) విద్యాసంపన్నము ఒక చెర. శరీరమును శుష్కింపజేసి చేయు మహాతపస్సు ఒక చెర. స్వస్వరూప మెరుగకుండుటయు ఒక చెర. (తత్త్వవిచారణతో, అనుభవముతో తన ఆత్మతత్త్వమును ఎరుగకుండుట). ఇటువంటి నలువురు ఈశుని తత్త్వమెరగనివారే!!

(సర్వవిద్యాధికము గర్వమును, అసూయ, రాగ, ద్వేషములకు దారితీయును. ఆత్మ జ్ఞానము కానిదన్నియూ **అవిద్య**యే. అట్లే శరీరమును శుష్కింపజేయు కర్మలు యోగసిద్ధి పొందనీయవు. మధ్యే మార్గమవలంబించవలెననునది జ్ఞానుల ఉవాచ.)

2074. కంటిచూపును శుక్లపటలముతో మూయబడినవారికి వారి చీకటియే కంటి దృష్టి (సరిగ్గా చూడలేరని భావన). శివప్రకాశం అంతటా వ్యాపించియున్ననూ చర్మ చక్షువులతో ఈ లౌకికులు చూడజాలరు. చూడజాలనివారికి చూచుతత్త్వమిచ్చునది ఆ దైవమే. చర్మచక్షువులతో చూడలేనిది జ్ఞానచక్షువులతో చూచువారు వారి కీడులను

తొలగించుకొన్నవారే సుమా!!

2075. ఉన్మత్తునికి ఔషధము సేవనచే తన ప్రకృతి (సహజత్వం) పొందినట్లు, కంటి శుక్ల పటలమును తొలగించి దృష్టిని (చూపును) సరిచేసినట్లు, నంది కరుణతో చిత్తము తేటపొందితిని, చేష్టలుడిగితిని. (శివానుగ్రహముతో తేట (జ్ఞానం) పొంది, అధోముఖ భావన వీడి, శివతత్త్వములో నెలకొనుట.)

2076. ప్రాణమయుడుకి చెందిన అష్టమూర్తులు (పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, సూర్య, చంద్ర, ఆత్మ) పరామయుని చెందిన శక్తులని గ్రహించక, సురామయతత్త్వములో (సురాపానము, కీడుచర్యలు చేయువారు) మునిగియుండువారు, నిరామయతత్త్వపు (సంపూర్ణ అరోగ్య, ఆయుష్షులు) తలంపులు లేనివారే సుమా!! (సుఖకరమైన ఆలోచనలు లేక లౌకిక కామ్యవాంఛలలో ఉండువారు.)

2077. దైవమును వేరుగా గ్రహించువారు ఏకత్వమును గ్రహించనివారే: జీవుడు, శివుడు రెండుగా ఉన్న తత్త్వములు చేరికతో ఏకమై, శివమైనవారికి ఒకటి, రెండు అన్న భేదభావనలు ఉండజాలవు. అట్లుకాక ఒకటి రెండన్న భేదభావన గలవారికి అన్యోన్యగా నెలకొన్నది (విడదీయలేనిదిగా). ఒక్కటిగా కాక రెండుగానే ఎప్పటికీ నిలచిపోవును. (భేదభావన ఒక దుర్భావన.)

2078. లౌకికులు ప్రాణమునకు దేహమునకున్న సంబంధమెరుగజాలరు: శ్వాస నిలబడి పోయినచో ప్రజ్ఞలన్నీ ఏమగును? వాటికి తగిన జ్ఞానము లేకపోవుటచే స్పర్శ జ్ఞానముతో కూడిన దేహము క్రింద పడిపోవును. ప్రాణము దేహములతో కలిసియున్న ఈ ప్రజ్ఞయగు శివపైరు దేహాంతరమున మనస్సులో నెలకొన్నదని ఈ లోకులు గ్రహింపజాలరు.

2079. ప్రాణము శరీరములో వేరుగానున్ననూ అది ప్రజ్ఞగా (ఎరుక/అవగాహన) అంతటా వ్యాపించియున్నది. ప్రాణం ఎటువంటిదని ఎరిగినచో ప్రజ్ఞ అవగాహన పొందనగును. శరీరమంతటినీ వ్యాపించియున్నది ప్రాణం కాదు - ప్రజ్ఞయే (జ్ఞానముగా). ఈ ప్రజ్ఞానములో మరిగి ఇమిడియున్న శివుని ఎవరూ గ్రహించ జాలరు. (**ప్రజ్ఞానమే బ్రహ్మం** - శ్రుతివాక్యం. ప్రజ్ఞానమే అంతటా వ్యాపించిన శివం/బ్రహ్మం/పరమేశాం.)

2080. జగత్తు నిలకడకు ఇరుసు-మేకుగా నున్నవాడును, ప్రకాశములో నెలకొని శ్రేష్ఠ జ్ఞానస్వరూపిగానున్న దైవము (శివుడు), పృథివ్యాది పంచభూతములుగాను, వాటిలోని తత్త్వములుగాను, బాహ్యాంతరములో నెలకొన్న సిద్ధుడుగాను, కొన్ని వాక్కురూప (మంత్రోపాసన స్పందనలకు ముగ్ధులగు దేవతలు) శక్తులలో నెలకొన్న దేవతల నాయకుడుగా నున్నవానిని - శిరస్సున బిందునాదముగా (ప్రణవ ఉపాసనచే)

గ్రహించుటయే తన స్వస్వరూపమును తెలుసుకొనదగు జ్ఞానమగును.

2081. తానే అంతముగా (ప్రళయములో అన్నీ తనయందే ఇముడుటచే) సాటిలేని స్వయంజ్యోతిగా, తానే జగత్తుకు సర్వజ్ఞుడుగా, నిలుచున్న ప్రకాశముతో కూడిన జ్యోతిగా, నాయకుని ఎల్లలులేని కరుణతో సకల శ్రేయస్సు ఒనగూరును. కామ కలాపాలతో పొందదగు అల్పసుఖములను నీవు త్యజించుదువు గాక!!
(అల్పసుఖమునకు ముగింపు ఉండును. కాని బ్రహ్మానందమునకు ముగింపు లేదు.)

2082. నీకు ముందుగానే తాను (శివుడు) శరీరములో ప్రాణముగా నెలకొని, ప్రకాశ మండలములో (శిరస్సున) ఇమిడి, వెలసిన దైవము యొక్క ఉద్దేశ్యము (జీవుడు సద్గతి పొందవలెనన్నది) ఎవ్వరూ గ్రహించలేరు. జీవుడు తన నామము చెడి ఆతని (శివుని) నామము పొందుటవలన, తన నాయకుని తత్త్వము (శివతత్త్వం) తనకు గలుగునే!! (జీవుని నామము తొలగి శివనామము ఏర్పడవలె.)

2083. ఇంద్రియములు, అంతఃకరణములు, సూక్ష్మశరీరములన్నియూ ఏర్పడినది ప్రాణము వలన కాదు. మహత్తు వలన (ప్రకృతి మాయ వలన) ఉద్భవించినవి. తత్పురుషుడు ఐదు విధముగా నెలకొనును (కళ, కాలము, నియతి, విద్యా, రాగము). అనాదిగా నున్న ఆత్మ ముప్పదిఆరు (36) తత్త్వములకు అతీతముగా, అంత్యముగా నెలకొని యున్నది సుమా!!

## 37. కీడును తలంచి దుఃఖించుట

2084. ఒక్కొక్క క్షణము వారి జీవితకాలము హరించుకు పోతున్నదని గ్రహింపజాలకున్నారు ఈ పాపులు. కర్మవాసనలను విత్తనములను కూడబెట్టుదురు. విత్తనములను వెదజల్లి, పండించి (కర్మభోగములను) అనుభవించుదురు. తమ కర్మభోగ విషయవాసనలచే ఏర్పడదగు దుఃఖమును, కీడును గుర్తింపజాలరు. మహా ఉగ్రరూపముగా మండుచున్న అగ్నిలో పడి నశించుచుందురు.
(జీవిత కాలమున్నపుడే కర్మవాసనలను తొలగించుకొనవలెను.)

2085. జీవితకాలము కరిగిపోవుట చూచియూ జనులు ఎటువంటి లక్ష్యము లేక మాటలతో కాలము వెల్లబుచ్చుచున్నారే తప్ప ధర్మాత్ముడైన, అఖండములో నిర్మలుడుగా నెలకొన్న వాని పాదపద్మములు స్తుతించి, ఆదిగా, ప్రేమస్వరూపముగా ఉన్నవానియందు ప్రేమ సలిపి పాత్రులు కాక, నశించుచున్నారే!!

2086. అప్పు చేసియైన బియ్యం పొంది, దంచి, అన్నము వండి, వంచనలతో నిండిన ఇంద్రియములను తృప్తి పొందించి, దేహమును పెంచి పోషించుదురు. దేహమే ఆత్మయని తలంచి తిరుగాడుదురు అజ్ఞానులు. ఒకనాడు పర్వతలోయలో దట్టముగా పెరిగిన వృక్షదూలములకు ఈ శరీరము ఆహుతి యగునని గ్రహింపజాలకున్నారే!!

2087. ఆ కాలములో సనకాది నలువురు (సనక, సనాతన, సనంద, సనత్కుమార) కైలాసములో ఉండి, బాగుగా విస్తరించిన మఱ్ఱిచెట్టు క్రింద కూర్చున్న పరమేశ్వరుని నుండి తత్త్వబోధ పొందిరి. శివతత్త్వమును గ్రహించక అల్పవిషయములను మాట్లాడుచున్న ప్రజలు తమ సహజజీవ బోధనలో నెలకొని కాటికి కాలు చాచుచున్నారు.

2088. శాశ్వతమైన కీర్తిప్రతిష్టలను, తపోఫలమును ఎల్లప్పుడు మన దైవము ఈశుడు తన దాసులకు అనుగ్రహించును. అట్లుకాక లోకులు దైవము ఇదని, అదని వ్యర్థ మాటలాడి, తమ స్థితి చెడుపుకొని నశించుచున్నారు.

2089. ఆనందములోనే పుట్టి, ఆనంద పరిస్థితులలోనే పెరిగి, ఆనందతత్త్వమగు శివతత్త్వం శాశ్వతానందమును గలుగుజేయునన్నది మరచి, బాహ్యఆనందము కూటిలోను, బట్టలోను, గృహములోను ఉన్నదని తలంచి, దుఃఖములను తెచ్చుకొని అజ్ఞానమగు నిద్రమత్తులో ఉన్నారే!! (జన్మ, స్థితి, లయములన్నియూ ఈశ్వరానుగ్రహమే!!)

2090. శ్రేష్టమైన మానవ జన్మమెత్తి జన్మ సార్థకఫలమును పొంద మరచుచున్నారు: పొందదగిన జన్మను ఈశ్వరానుగ్రహముచే పొందిననూ పొందదగిన దివ్యశివ పాదపద్మములను పొందకుండానే, పొందదగిన శాశ్వతానంద తత్త్వమును పొందక ప్రాణులవలె నశించుచున్నారు.

2091. ఉత్సాహము, ప్రేమ నిండిన మనస్సు, యవ్వనము, బాగుగా గలిగియున్న కాలములో సుఖభోగ సమయమున మార్పు గలుగజేయునదైన ప్రియంక యోగముతో కామాది చేష్టలతో స్థితిపొంది, మాధవుడగు శివుని తలంచి ఆనందమనుభవింప మరచి, నశించిపోవుచున్నారు ఈ జనులు.

(ఉత్సాహము, ప్రేమ, యవ్వనమున్నప్పుడు యోగము అభ్యసించవలె.)

2092. అంతరమున నెలకొన్న దైవసత్య తత్త్వమును యవ్వనులోనే గ్రహించక వ్యర్థము చేసుకొనుచున్నారు: యవ్వన సూర్యునివలె ప్రకాశించును. అట్లు అగ్నిమండలములో వెలయు నాయకుడు (శివుడు) మూలాధార, స్వాధిష్ఠాన పద్మంలో వెలయు రుద్రజ్యోతి రెండు ఒక్కటే. ఈ తత్త్వము విచారణ చేయక కాలము గడుపుట మూఢత్వమే!!

2093. గురువు చూపిన మార్గముననుసరించి గురి (లక్ష్యం – భ్రూమధ్యస్థానమున ధ్యాస యుంచి మేలుకొనుట)తో శివుని చేరజాలరు. పుస్తకపఠన జ్ఞానముతో వ్యర్థముగా తిరుగుదురే తప్ప శివుని దరిచేరజాలరు. దైవము అనుగ్రహించిన ఉపకారములను తలంచి దైవమును స్తుతింపజాలరు. వ్యర్థమాటలు, ఆటలాడు వీరు పొందదగు లాభమేమిటి?

2094. చిత్తమున నెలకొని శ్రేష్టముగా ప్రజ్వలించు జ్యోతిని, మనలోపల ఎఱ్ఱని ప్రకాశముతో

నొప్పారు శివుడే అని తలంచి, ప్రతిదినము నిద్రపోవువరకు స్తుతించండి (దినచర్య ముగుయు వరకు). అట్లు స్తుతించని యెడల పంచేంద్రియములన్నియూ కట్టు విడిపించిన మదగజములవలె తిరుగాడును సుమా!!

2095. జంతువులు, మానవులు, దేవతలు, పక్షులు సకల జీవరాశులన్నియూ దైవము నందు ప్రేమ సలిపి తమతమ వృత్తులు చేయుచున్నవి. మహాతపస్సు చేసి జ్ఞానము పొందినవారు (జ్ఞానులు) వారి భావనలోనే కాక సదా చిత్తములో పదిలపరచుకొనియూ, ఆనందముతో పరుగులిడియూ, దర్శించిన ఫలము పొందురు. (యోగపరిభాషలో జ్ఞానప్రకాశము పొంది నిష్ఠతో నెలకొనుట. జీవశక్తిని భూతత్త్వము నుండి ఊర్ధ్వ సహస్రమునకు పరుగు పెట్టించుట, సహస్రమున నెలకొన్న పిదప జ్యోతిదర్శన ఫలము పొందుట.)

2096. అధర్మపరులు బంగారు శ్రేష్టత గ్రహించజాలనట్లు, దైవమును జ్యోతిస్వరూపునిగా గ్రహించి కొలువజాలరు. ఆదిపరాపరుడని, అమర పరాపరుడని, అనాదియని, నేను (రచయిత) నా చిత్తమున పదిలపరచి స్తుతించుచున్నాను.

2097. సమృద్ధిగా తేనె కలిగియున్న పుష్పములపై సంచరించి తేనె సేకరించు తేనెటీగలు అలసి, అలసి పుష్పములపై తిరుగాడుచున్నవే తప్ప అరుదైన మహాతేనె నొకటి ఉన్నదని గ్రహించి చవిచూడజాలకున్నవే!! (శిరస్సున శివానుగ్రహముతో స్రవించు అరుదైన తేనె చవిచూడక జనులున్నారేయని వాపోవుట.)

2098. దైవగ్రహణ లేక, దైవచింతన లేక ఎంతోకాలము గడిచిపోయినవి. దేవతలందరికి నాయకుడు దేవాదిదేవుడైన వాడు ప్రేమలో నెలకొనియున్నాడు సుమా!! జగత్తులోని సకల జీవరాశులకు ప్రాణములో ప్రాణముగా ఉన్నాడు. అట్లున్ననూ ఈ మూఢులు వానిని గ్రహించజాలక తప్పిపోవుచున్నారే!! (దిగజారి పోవుచున్నారే!!)

2099. జీవితాంతము అధోముఖ ధోరణిలో నెలకొని (కామ్య కార్యకలాపాలు) యముని సమూహము వెంట వెళ్ళుదురు. నిర్ణయించిన కాలగడువు (ఆయుస్సు) నిష్ఫలముగా కరిగిపోవుచున్నది. దానికి భయపడి ఏమి చేయగలరు? ఓదార్పు కావలెనన్నచో ఉడుకుతున్న గంజిలో గరిటె పెట్టి తీసుకోండి. (మూలాగ్నిని – కుండలినీ శక్తిని – సుషుమ్న ద్వారా సహస్రమునకు ప్రాకించి తేనెయను అమృతమును సేవించి దీర్ఘకాలముండు ఉపాయము చెప్పబడినది.)

2100. నదీతీరములో రెండు కరకట్టలు వెంబడి మంచి పైరు పండిననూ (రెండు కరకట్టలు = సూర్యచంద్రకళలు; మంచిపైరు = శుక్రజయము) వరదలు వచ్చి కొట్టుకుపోయే ముందే (వయస్సు పైబడి ఆయుస్సు కరిగిపోవుటకు ముందే) పర్వతమునకు చేర్చి (దేవానుగ్రహముతో శిరస్సున నెలకొనుట)నచో ఎటువంటి నష్టము గలుగజాలదే!!

వయస్సుకు తగ్గ చర్మముడతలు, రోమములు పండిపోవుట ఏర్పడవు.

2101. ఆదిసృష్టిని గ్రహించినవానిని (దేహతత్త్వములో ప్రాణము ఇమిడిన సృష్ట్యాదిని గ్రహించిన దైవము), చీకటి, పగలు, రాత్రిని గ్రహించినవానిని (అజ్ఞానచీకటి దాని తత్త్వమెరిగిన వాడు), తానే స్వయంజ్యోతిగా వెలుగువానిని, కుండలినీ యోగసాధనలతో ఉన్నతి సాధించినవారు గ్రహించదగు దైవమును గ్రహించజాలకుండా ప్రపంచవాసనలలో మునిగి జనులు చెడిపోవుచున్నారే.

## 38. హితోపదేశము

2102. పునర్జన్మ రహితము చేయువానిని నిర్విరామముగా స్తుతించవలెను: తిరోభావన ప్రవృత్తి (సత్యజ్ఞానమును మరిపించి యుంచినది)ని కల్పించిన దైవము తన సృష్టితో ఏర్పరచిన భూలోకములో అశాశ్వతమైనది ఈ దేహము. అంతిమకాలము వరకు దైవము నిర్విరామముగా స్తుతించుదురు గాక!! జీవించుకాలములోని దుఃఖ సమూహమును తొలగించుకొనుటకు శ్రేష్టమైన శివతత్త్వమును చిత్తములో నిలుపుకొందురు గాక!!

2103. దైవమును నిర్విరామముగా స్తుతించుటయే కాక వానిని సృజించవలెను: వీలైనంత వరకు చిత్తమును శివుని యందుంచండి! వీలైనంతవరకు సత్యతత్త్వమును (ఆత్మ, శివతత్త్వము–శాశ్వతత్త్వము) ఇతరులకు బోధించండి. అట్లు చేయనిచో దైవము, మోక్షము అనునవి ఏవియూ లేదని వాదించుచుందురు. (ఆ కాలములోనే దైవము, మోక్షము లేదని వాదించు నాస్తికులుండిరి). దైవము సర్వవ్యాపి. కాబట్టి శివతత్త్వమును సృజించ అలవరచుకొని, పదిలపరచుకొందురు గాక!!

2104. **ఒక్కటే కులం – ఒక్కడే దైవం** మంచివన్నిటినీ తలచుదురు గాక!! మీకు యముడు లేడు. మీరు సిగ్గు పడకుండా వెళ్ళి కలిసిపోవు గతి (గమ్యం) వేరు లేదు. కావున దైవచింతనలో సదా నెలకొని, ఎటువంటి చంచలములు లేక స్థితిపొంది, దైవము నందు శరణు పొందుదురు గాక!! (గతి = శివగతి శాశ్వతత్త్వం పొందింపజేయునది.)

2105. సహస్రమున నెలకొన్న శివుని దరిచేరి కాలుని (యముని) జయింపనగును: అందరూ మహోన్నతముగా స్తుతించుచున్న కైలాసనాధుని (శివుని) నాల్గురి మధ్య నిలుచున్న నమ్మకస్తుని (శిరస్సున నాలుగు దిక్కులకు మధ్య నిలుచున్న ఈశానమూర్తిని – తత్పురుషం, అఘోరం, సద్యోజాతం, వామదేవం – మధ్యన ఈశానముఖం) ఉచ్ఛ్వాస, నిశ్వాసలతో కూడిన ఈ దేహములో నెలకొన్న కాలుని తన్ని త్రోయువాడిని చిత్తమున పదిలపరచుకొని ఉన్నతి పొందుదురు గాక!!

2106. శివుని దరిచేరినచో ముమ్మలములను తొలగించుకొని పునర్జన్మ రహితము చేసుకొన వచ్చును: ఈ దేహమును వదిలిన పిదప మరొక దేహములో ప్రవేశించునదన్నది

(పునర్జన్మ) లేక, ముక్తిని పొందదగు తత్త్వమును కోరండి. దేనివల్ల ఈ శరీరము వచ్చినదన్న సంగతిని (జన్మకారణము) పరిశోధించి చూచినచో దైవానుగ్రహము పొందనగును.

2107. జీవుల కోరిక ప్రకారమే వారికి తోడుగా ఉండి వెళ్ళదగు నాయకుడు – శివుడు (ఇష్టదేవతా ప్రార్థనలకు తగ్గట్లు వారికి వారి దైవరూపము ద్వారానే ప్రతిఫలము అనుగ్రహించుట) పక్వపడునట్లు చేసి ఆనందం అనుగ్రహించు వాడగుటచే, మరణించు కాలము వరకు వానిని తలవండీ!! అపుడు ఆ మహామహుడు పునర్జన్మ రహితము చేసి అవతలి ఒడ్డుకు చేర్చునే!!

2108. దేహమును విడిచివెళ్ళు ఈ జీవుడు జీవించిన ఫలము పొందవలెనన్నచో కనీసము మరణకాలము నందైననూ ఈశుని తలవండీ!! దానివలన శ్రేష్ఠమైన **శివగతి** ప్రాప్తించును. పిదప పునర్జన్మ రహితమై మహాలోకము గిట్టును. (శివసాయుజ్యము.)

2109. సత్సంగములో కలిసియూ, లేక ఏకాంతముగానో కొలవండీ (పూజ కార్యక్రమాలు, ఏకాంత ధ్యానము, యోగము మొ॥ వాటితో). నా దైవము దేహాంతరములో నెలకొని యున్నాడన్న స్పృహతో వాడి దివ్యపాదముల దరిచేరండి. చేరి జ్ఞానముతో తేట పొందినచో, లేగదూడ గలిగిన తల్లిగోవు ఎట్లు పాలు స్రవింపజేయునో, అట్లు ఈశుడు **శివజ్యోతి**ని జీవునికి ప్రసరింపజేయును.

2110. యోగసాధనతో శిరస్సున సహస్రమున పదిలమైనచో శివరూప పొందనగును: వైదొలగిపోవు జీవుడు (శరీరము నుండి) సాధనతో నిరాధారస్థితియగు సహస్రము చేరుకొనునపుడు నాదబిందును బ్రహ్మరంధ్రమున నిలిపి ధ్యానించండీ. కర్మలు తొలగి పోవును. క్షీణించని కీర్తియున్న ఈశుడు మిమ్మల్ని దేవతలతో చేర్చి మహోన్నతిని పొందజేయును.

2111. ఈశుని జ్యోతిగా ధ్యానించువారికి వారి కర్మఫలములు తొలగిపోవును. **ఓ జ్యోతిరూపా! ఓ మహోన్నతుడా! ఓ ప్రాణనాథ!** అని కొలిచి తెల్లటి ప్రకాశమును ముఖములో దర్శించినవారు దేవతలైరి. గంగను జటాఝూటమునందు ధరించిన దివ్యపాదుని (శివుని) కొలిచినవారికి ఇక కర్మలు, కర్మఫలములుండజాలవు.

2112. దుఃఖములకు దారితీయు బంధముల వెంట పరుగిడక ఈశుని తలంచి ధ్యానించండి!! లెక్కలేనన్ని పునర్జన్మలు ఎత్తి మరలా దుఃఖములకు దారితీయు బంధములలో తగుల్కొని తిరుగాడుచున్నారే!! మన దైవము దరిచేరి ఆనందమును పొందండి. వానిపై ప్రేమ సలిపి ధ్యానించుదురు గాక!! అప్పుడు సత్యజ్ఞానము (ఆత్మ/సత్యం/ శాశ్వతం) పొంది, వాని సత్య(దైవ) తత్త్వమెరుగగలరు సుమా!!

2113. పునర్జన్మను తొలగించుకొన దలచినవారికి సత్యజ్ఞానం గిట్టును: పునర్జన్మను

తొలగించుకొని శివుని దరి (మోక్షము) చేరవలెనన్నవారికి (ముముక్షత్వం పొందవలెనన్న తీవ్రకాంక్ష) ఆచరించవలసిన సత్యతపస్సు ఒకటి గలదు. దరిచేరవలెనన్న గమ్యం కూడ (శివగతి) ఒకటున్నది. దానివలన పొందదగు సత్యతత్త్వం ఒకటున్నది.

2114. శివుడు తన దరిచేరిన వారికి ఆనందమొసగి జన్మరహితము చేయును: (దరి: షట్చక్రములు దాటి సహస్రమున నెలకొనువారికి – ఆత్మజ్ఞానం పొందినవారికి) అట్లు చేరనివారికి దుఃఖమొసగగల పునర్జన్మను ప్రసాదించును. తన దరిచేరిన వారికి స్వర్ణ కాలిఅందె ధరించిన తన స్వర్ణ పాదములను చూపి నాదమును వినిపించును. అట్లు చేరినవారు నాదసామీప్యము పొంది, దేవతల సమూహముతో చేరి, వారిలో ఒకరుగా అగుదురు.

2115. ముక్తి, జ్ఞానము నొసగి వాటికి సహకారిగాయున్న **ముత్తమిళ** నాధుడుని (మూడు + తమిళ వాఙ్మయము = కవిత్వం, సంగీతము, నాటకము) ఎంతోమంది బాహ్యముగానే కొలుచుచున్నారే. కాని వాడు, పాలలో నెయ్యి మరిగియున్నట్లు మరిగియుండు నిర్మలుని, జ్యోతిస్వరూపుడని గ్రహించక, ప్రేమించక, అంతరమున నెలకొనజేసుకొని స్తుతింపనైతిరి!! (కవిత్వం = వచన, పద్యము; సంగీతం = రాగ, తాళ, సాహిత్యం; నాట్యం, నాటకం.)

2116. జీవరాశులన్నియూ జనన, మరణములకు లోనగుటచే సత్యంను ఎరుగజాలకున్నవి: అన్నీ నియమించువాడైన నిర్మలుడు – శివుడు. జీవరాశులలో భువన భోగములను కల్పించుచున్నాడు. కాలపరిమితిని ఎవ్వరూ గ్రహించజాలరు. జన్మలోనికి దూకుటయే తప్ప, శివంయను పరమాత్మను గ్రహించకే నశించుచున్నారు.

2117. మరణసమయమున దైవచింతన అజ్ఞానులకు అంత సులభమార్గము కాజాలదు: భూలోక జీవితము ఎంతో దుఃఖమైనను మరణకాలములో సత్వ ఎర్రని ప్రకాశరూపుని (శివుని) **ఓ విజ్ఞానమునొసగు వికర్తా** అని కొలిచిననూ, మనస్సు ద్రవించి కొలిచిననూ, లౌకికబంధ విముక్తి పొందక నిర్మలుని పొందజాలరు సుమా!!

2118. వంచనతో ఉన్నవారికి కాక, సత్భావము, సత్ప్రవర్తన ఉన్నవారికే సిద్ధి గలుగును: సన్మార్గగురువుని ఒక వంచకుడు ఆశ్రయించినచో ఆ దేశములో క్షామము ఏర్పడును. వాడిని చూచి దైవమే భయపడును. కఠినమైన నరకములో వాడిని త్రోయును. వంచనలేని సత్పురుషులకే సిద్ధి లభించును.

2119. సద్గురువుతోనే **శివగతి** ప్రాప్తించును: లెక్కలేనన్ని దేవతలు క్రియాచర్యలతో (కర్మ, ఉపాసనలతో) శివుని కొలిచిరి. అట్లు వానిని కొలిచి సాధించిన ఫలమేమి లేదు. వాని దరిచేరగల జ్ఞానతత్త్వమును ఉపదేశించు సద్గురువుని ఆశ్రయించి, స్తుతించినచో **శివగతి**ని పొందగలరు సుమా!!

2120. నరులు (మానవులు), సురులు (దేవతలు) బంధపాశ వలలో చిక్కుకొని నశించు చుండుట చూచి, గురువు అగు జ్ఞాని బంధపాశ వల నుండి విముక్తి పొందజేయు వారైనచో, **నీవు పరముతో గూడిన పరమే అగుదువని** శిష్యునికి బోధించుటకన్నా మరేదియూ లేదు సుమా!!

(సురులగు–దేవతలు కూడ పుణ్యఫలము క్షీణించిన వెనుక భూలోకమునకు రావలసినదే – మరలా బంధములలో చిక్కుకొందురు. **క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి** – శ్రుతివాక్యము. నీవు పరముతో కూడిన పరమే = **తత్త్వమసి** మహావాక్యం.

తత్ = పరం, పరబ్రహ్మం, శివం, పరమేశ్వరుడు, సత్యం, శాశ్వతం

త్వం = జీవునిలోని ఆత్మతత్త్వము పరిపక్వమొందిన జీవాత్మ

అసి = ఉన్నావు. పరం అగు బ్రహ్మం జీవునిలో నున్న ఆత్మతత్త్వము రెండూ ఒక్కటేనన్న సద్గురువు ఉపదేశము.)

2121. శివుడే గురువు రూపమున వచ్చి కర్మలు నశించుపోవునట్లు అనుగ్రహించును: గురువుగా వచ్చి ఆదుకొన్న సాటిలేని నాయకుడు (శివుడు) వానిపై ప్రేమ సలిపియున్న శిష్యుని దినకర్మలు తొలగునట్లు చేసి, నీరుతో (గంగతో ఇమిడియున్న) పొడవైన జటలుతో ఎర్రని ప్రకాశముతో వెలుగు దైవము తన రూపముతో వచ్చి దర్శనమొసగి ఆదుకొని, అలలువలె వచ్చు సర్వకర్మలను (త్రికర్మలు – సంచిత, ప్రారబ్ధ, ఆగామి) నశింపజేసెను.

ఏడవ తంత్రము సమాప్తము

ఓం తత్సత్

సర్వం శివార్పణమస్తు

# ఎనిమిదవ తంత్రము

## 1. దేహములోని పంచభేదములు

(దేహభేదమనునది అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములైదు.)

2122. శరీరమున అన్నమయకోశము అను ఒక సంచి కలదు. అందు ఎన్నో సరుకులతో నిండిన (కర్మలతో) ప్రాణమయకోశము గలదు. ఇదియే కాక మరొక సంచి మనోమయ కోశము అనునది గలదు. ఈ కాయములో నెలకొన్న దొంగ (మనోమయ కోశము) ఈ కాయమును విడిచి వెళ్ళినచో మాయతో కూడిన అన్నమయ కోశము, ప్రాణమయ కోశములు మట్టిలో కలిసిపోవును.

2123. పరమేశ్వరుడు అమర్చి ఇచ్చిన ఈ దేహములో స్థూల, సూక్ష్మ దేహములు రెండుగా ఉన్నవి. శుద్ధమైన సూక్ష్మదేహముగా చెప్పునవి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధము, బుద్ధి, మనస్సు, అహంకారములగు అష్టములు (8) పురియష్టకములు.

2124. ముందు మంత్రములో చెప్పినట్లు ఎనిమింటిలో శబ్దాది పంచముల నుండి పంచేంద్రియాల పుట్టినవి (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధముల తన్మాత్రల నుండి పంచ ఇంద్రియములగు చెవి, చర్మము, కన్ను, నోరు, ముక్కు ఏర్పడినవి). మిగతా మూడును అంతఃకరణములైనవి (మనస్సు, బుద్ధి, అహంకారము - అంతఃకరణములు). వీటితో చేరిన బంధములు వాటికి ఇంద్రియప్రజ్ఞలుగా నెలకొనినవి. శివానుగ్రహము వీటిని స్థూలదేహముతో చేర్చియూ, విడదీసియూ అనుగ్రహించునే!! (త్రినేత్రుడు బంధకూర్పు, బంధవిముక్తి గలిగించగలడు.)

2125. స్థూలదేహము కూర్పు అన్నమయకోశము రక్తాదితో ఏర్పడినది. భుజించిన ఆహారము యొక్క సారము రక్తము, మాంసము, చర్మము, నరములు, ఎముక, మజ్జ, కొవ్వుతో మెదడు, వీర్యము మొదలగునవి ఏర్పడి, వాటి ఉపాధులతో దుఃఖమును ఏర్పరచు కార్యములే తప్ప మరేమీ కాదు.

2126. పరమేశ్వరుని దివ్యమహత్వంను ఎవరెరుగగలరు? దేహమునే తన స్థలముగా చేసుకొని వెలసినది ఎరుగు వారెవరు? ఎవరెరుగుదురు? అరువది (60) తత్వములుగాను, ఎనిమిది విశేష తత్వములుగాను నెలకొనియున్నది ఎవరెరుగుదురు? తానే మూలముగా (మూలాధార చక్రములో) నెలకొని అన్నిటికీ ఆధారముగా నుండునది.

(పృథివిభూత పంచీకరణముతో ఏర్పడు స్థూలశరీర అంశములు (5): అస్థి, మాంసము, చర్మము, నాడి (నరములు), రోమములు; జలభూత పంచీకరణముతో

(5): మూత్రము, లాలాజలము (ఉమ్మి), స్వేదము (చమట), రక్తము, శుక్రము (వీర్యము); అగ్నిభూత పంచీకరణముతో (5): ఆకలి, దాహము, నిద్ర, ఆయాసం, మైధునం; వాయుభూత పంచీకరణముతో (5): పరుగు, నడుచుట, ఎగరడం, నిలుచుట, పడుకొనుట; ఆకాశభూత పంచీకరణముతో (5): మోహం, ఆశ, ద్వేషం, భయం, సిగ్గు. ఈ ఇరువది ఐదుతో (25) + కర్మేంద్రియములు (5), వాయువులు (10), నాడులు (10), వాక్కులు (4), ఏషనలు (3), గుణములు (3) మొత్తము అరువది (60) దేహతత్వములును; విశేష తత్వములగు పంచజ్ఞానేంద్రియములు తన్మాత్రలు (5), అంతఃకరణములు (3) మొత్తము ఎనిమిదింటిలో సూక్ష్మముగా నెలకొని వెలసిన పరమేశ్వరుడు అన్నిటికీ ఆధారముగా యున్నాడు.)

2127. ఎనిమిది జానలతో నిర్మింపబడిన శరీరములో నెలకొని (ప్రతి ఒక్కరి శరీరము వారి చేతి జానలతో కొలిచిన ఎనిమిది జానలే పొడవుండును) బాహ్య, అంతర కరణములతో కప్పి మరిపించి, అరువది ఎనిమిది తత్వములు కూర్పుతో తయారైనది. ఒకదానితో ఒకటి కలిపి స్థూలశరీరములో సూక్ష్మశరీరము ఇమిడియున్నది.

2128. ఈ స్థూలశరీరముతో స్థూలము కానివగు ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములగు నాలుగు, దేహములో ప్రాణముగా నెలకొన్నదే జీవుడగును. ఈ జీవుడే పరముతో కూడిన బ్రహ్మంలో నెలకొనును (జీవుడు జీవతత్వములకు అతీతముగా ఎదిగిన స్థితిలో). ఆ బ్రహ్మం అన్ని జీవరాశుల ప్రాణముతో కలిసి నెలకొనియున్న దానిని, వాటికి అతీతముగా ఎదిగి నెలకొను మార్గము ఎవరెరుగుదురు?

(జీవుడు అనాత్మయగు పంచకోశములో నెలకొనియూ, అవి తాను కానని గ్రహించి వాటికి అతీతముగా ఎదిగి, పరముతో (ఆత్మ తత్వములో) నెలకొనుట ఎరిగిన వారెందరు?)

2129. షట్చక్ర ఆధారస్థానములను జీవశక్తి (కుండలినీ) దాటివెళ్ళి సహస్రదళమును మధ్యనాడి ద్వారా (సుషుమ్నతో) చేరుకొన్నచో, దశవాయువులు అష్టములగు కళలు – శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు + మనస్సు, బుద్ధి, అహంకారములు (8) వృత్తులు ఇక శరీరములో అణిగిపోవును. ఈ పదునెనిమిది కళలతో కూడినదే జీవునిలో స్థూలశరీరముగా పనిచేయుచున్నవి.

2130. జీవుని దివ్యచక్షువులు రెండు భావనలుగా (ఆత్మ, అనాత్మ భావనలు) కాక ఏకభావన మగునపుడు స్థూలశరీరస్థితి (భావన) వీగిపోవును. సత్యమనునట్లు (శాశ్వతమైనట్లు) కనిపించు ఈ స్థూలశరీరము, అసత్యముగా కనిపించని పంచకోశాదులు కూడిన అంతఃకరణములగు అష్టములు (కంటికి కనబడని సూక్ష్మశరీరము) తుల్యమును

బోధపరచు శరీరముతో ఏకమగునపుడు (జీవశక్తి సుషుమ్నానాడి ద్వారా సహస్రమునకు చేరిన పిదప) ఈ శరీరస్థితి అణిగిపోవును.

2131. యుద్ధగుర్రములు మహావేగముతో పరుగిడియూ, దూకియూ గతికి (గమ్యమునకు) వెళ్ళునట్లు సూక్ష్మశరీరము సమీపమునకునూ, దూరముగాను వెళ్ళదగు సామర్థ్యము గలది. ఎట్లు ఎన్ని వస్త్రములు మార్చి మార్చి ధరించుటచే శరీరమునకు ఎటువంటి కీడు గలగదో, అట్లే సూక్ష్మశరీరము ఎటువంటి కీడు గలుగకుండా గమ్యమునకు వెళ్ళి రాగలదు.

2132. నాగుపాము ఎట్లు కుబుసము వదిలి (పై చర్మమును వదిలించుకొనుట) వెళ్ళునట్లునూ, ఎట్లు అండజము (గ్రుడ్డులో పొదిగిన జీవి) గ్రుడ్డు వదిలి వెళ్ళిపోవునట్లునూ, స్వప్నములో చూచినవన్నీ జాగ్రదావస్థలో మరచిపోవునట్లునూ ప్రాణము వెళ్ళిపోవును (స్థూలశరీరము వదిలిన ప్రాణము). హరుని అనుగ్రహముతో వెళ్ళి అర్హత తగ్గట్లు ద్విలాభములను తినును సుమా!!
(శివానుగ్రహముతో స్థూలశరీరము వదిలిన ప్రాణము తన పుణ్యపాపకర్మల ఫలితములకు తగ్గట్లు స్వర్గం, నరకంనకు వెళ్ళి అనుభవించును.)

2133. ఈ శరీరమెత్తిన ప్రయోజనము అనుభవించిన పిదప స్థూలశరీరము విడిచి సూక్ష్మశరీరములో ఇమిడి స్వర్గ, నరక ప్రయోజనములను అనుభవించును. పూర్వజన్మ కర్మల (సంచితకర్మలు) ఫలితములు సూక్ష్మశరీరములో ఇమిడి, పరకాయ యోగివలె (పరకాయ ప్రవేశము చేసి సంచరించిన పిదప మరలా వచ్చి తన శరీరమును దాల్చునట్లు) ఈ పిండము శరీరము దాల్చియూ, చచ్చియూ, అనగా జనన, మరణములు పొంది జీవచక్ర భ్రమణములో పడి తిరిగి, తిరిగి అల్లాడును.

2134. స్థూలశరీరమున్నప్పుడే **తత్పదము**ను తనలో దర్శించినవారు వారి జన్మలను మార్చుకోగలరు. తాను (జీవుడు) అతనగు తత్వం – తత్+పదం=తత్పదము (శివతత్వము)ను తనలో నెలకొనునట్లు చేసుకొన్నవారు జన్మకు కారణమగు సహజ గుణధర్మములను మార్చుకొని, పరమును పొందగలరు. (శ్రేష్టమైన తత్వము పొందగలరు.) ఇట్లు దర్శించి, మార్చుకొనుట తెలియని వారందరూ కర్మలు తగ్గట్లు భూమిలో జన్మచక్ర బంధములో చిక్కుకుని స్వర్గం, నరకం అనుభవించుదురు.

2135. శివతత్వములను చిత్తమునందు పదిలపరచుకొనుటచే ఈ శరీరము శివ తనువగును. (తనువు = శరీరము – తెలుగుభాషలో తమిళభాషలో రెంటిలో శరీరమును సూచించును) దేహతత్వములను మరచియుండుటచే జ్ఞాని శరీరము శివుని వశమగును. సహస్రమున నెలకొల్పుకొన్న శివయోగికి నాద, బిందుగా ప్రకాశ శరీరమగును. మౌనం దాల్చిన ప్రణవయోగులకు ముమ్మలములు

తొలగిపోయి **శివసాయుజ్యము** పొందుదురు.

(జ్ఞాని, యోగులకు మూవురికి శరీరములు శివ వశమగునన్న వివరణ.)

2136. విజ్ఞానులకు వారి అహంకారమే తనువగును (బుద్ధి అహంకార డాంభీకం). ప్రళయకారులకు మాయయే తనువని చెప్పుదురు. సకలురు (అజ్ఞానముతో కూడినవారు) కర్మలే దేహమందురు. సత్యపురుషులగు శివయోగులకు అఖండ శివమే తనువుగా అమరును. (కర్మలు = కర్మలచే ఏర్పడిన భోగభాగ్యవస్తువులు.)

2137. ఈ శరీరము మలముతో ఏర్పడినదని గ్రహించి త్రోసిపుచ్చని మూఢులు ఇదే శ్రేష్టమైనదని తలంచుచున్నవారిని చూచుచున్నారు కదా!! ఈ శరీరమే లాభము లన్నిటినీ చేకూర్చునన్న భావనతో యుండువారు పైబడి పైబడి ఈ భువియందు జన్మించుచునే ఉందురు సుమా!!

(దేహబంధము తొలగించుకొన్నవారికే జ్ఞానము గిట్టును.)

2138. మంచిమాటలు మాట్లాడు వాక్కు, మంచినే కోరి మంచినే చిత్తమునందు పదిల పరచుకొని పరిపక్వత పొందినవారిలో (సద్భావన, సత్ప్రవర్తనలు అలవరచుకొన్నవారు) విమలుడు (ఎటువంటి మలినము, కల్మషం లేని శివుడు) నెలకొని అనుగ్రహించును. అట్లుకాక చెవితో వినుట (మంచివి కానివి), మనోవికారములకు తగ్గట్లు వెళ్ళదగు (అంతఃకరణముల ప్రలోభములకు లొంగిపోయినవారు) వారు పీడించదగిన దరిద్రమునకు లోనగుదురు.

## 2. శరీరము త్యజించుట

(త్యజించుట: దేహభావన వీడుట)

2139. చిత్తమును శిరస్సుపైన యుంచినచో దేహభావన తెగిపోవును. సుఖములు ఒనగూర్చు కామ్యకర్మ విషయాదులను పురికొల్పు మాటలు, ఆకాశతత్వముతో వెళ్ళదగు ప్రాణము పురికొల్పు శబ్దములు, కర్మాను సంధామియగు శరీరములో నెలకొన్న మనస్సు ఇవియన్నియూ శిరస్సుపైన స్థితిపొందునట్లు చేసినచో శరీరపు ప్రజ్ఞలు మరిగిపోవును – దేహభావన తొలగిపోవును.

2140. క్షీణించదగిన ఈ శరీరములో అమరియున్న చెవి, కన్ను మొదలగు కరణములన్నియూ క్షీణించదగినవే. కాలానుగుణముగా చేయు వ్రతములు, దానములు, పెక్కు భాషలు మాట్లాడదగు మాటలు, ఇడ పింగళ నాడులు మొదలగునవి అన్నియూ ముగియవలసినవే (క్షీణించ వలసినవే). కావున ఇవి ఏవియూ క్షీణించదగిన శరీరమునకు తోడుగా ఉండజాలవు సుమా!!

2141. మనస్సున రావి ఆకువలె నెలకొన్న స్త్రీల నడుపుపై, వక్షోజములపై మునిగియున్న కామవాంఛలను త్రోసిపుచ్చి, పర్వతమువలె స్థితిపొందిన, చలనములేని చిత్తమును

శివునియందు ఉంచి కొలిచినచో, శ్రేష్టమైన ప్రకాశము తనలో నెలకొని వెలసిల్లునే!!
(రావి ఆకు దృఢమునకు ప్రతీక.)

## 3. అవస్థల భేదము – అధోముఖ ధోరణి

(అవస్థల భేదము: జీవుడు శరీరముతో ఉన్నప్పుడు ఏర్పడు అవస్థలగు జాగ్రద, స్వప్న, సుషుప్తి (గాఢనిద్ర), తురీయం, తురీయాతీతం అను ఐదు (5). జాగ్రదావస్థలో ఉన్నప్పుడు అధోముఖ ధోరణి – దేహ ప్రవృత్తుల, దేహభావనల వివరణ)

2142. ఇరువది ఐదు (25) కరణములతో కూడిన జీవుడు భ్రూమధ్యమున నెలకొనునపుడు – అది **జాగ్రదావస్థ**. అలవడిన పదునాలుగు (14) కరణములు జీవుడు కంఠములో నెలకొనునపుడు అది **స్వప్నావస్థ**. అసత్యమెరగని పురుషుడు హృదయమున నెలకొను నపుడు అది **సుషుప్తి** (గాఢనిద్ర). క్షీణత లేని ఆత్మ నాభియందు నెలకొనునపుడు అది **తురీయం**.

(ఆత్మ దేహమును ధరించినపుడు అది **పురుషుడు**. అదే నాదబిందు (ప్రకాశం)లో నెలకొన్నపుడు అది **జీవుడు**. దేనితోను సంగత్వమవక ఒంటరిగా ఉన్నప్పుడు అది **ఆత్మ**గా పిలువబడుచున్నది. ఇక దేహకరణములు, దేహస్థానం, చక్రస్థానముల వివరణ:

25 కరణములు: 5 కర్మేంద్రియములు, 5 జ్ఞానేంద్రియములు, 10 వాయువులు, 4 అంతఃకరణములు, పురుషుడు 1 = (25); భ్రూమధ్యస్థానము – ఆజ్ఞాచక్రము; 14 కరణములు: దశవాయువులు (10) + అంతఃకరణములు (4); కంఠస్థానం – విశుద్ధిచక్రం; పురుషుడు ప్రాణవాయువు చిత్తమున నెలకొనునపుడు సుషుప్తి – హృదయస్థానం – అనాహతచక్రం;

ఏకముగా ప్రాణముతో మాత్రమే నాభిలో నెలకొనునపుడు – తురీయం – నాభిస్థానం – మణిపూరకచక్రం.)

2143. జాగ్రదావస్థలో ముప్పదిఆరు (36) తత్వములతో కూడినది ఐదుగా (శుద్ధ విద్యా, మహేశ్వరం, శతాక్యం, శక్తి, శివ – శివతత్వములు–5) స్వప్నవస్థలో నాలుగుగా (మహేశ్వరం, శతాక్యం, శక్తి, శివం) సుషుప్తిలో మూడుగా (శతాక్యం, శక్తి, శివం) నెలకొని, తురీయంలో రెండుగా (శక్తి, శివం) వృత్తులు సలిపి తానే (శివుడు) ఏకముగాను అన్నిటికీ మొదలుగాను, శుద్ధవిద్యాతత్వముతో కూడిన నియతియాది వృత్తులు సలిపి అన్నిటికీ అంతముగాను ఉన్నాడని తెలుసుకొనండి!!

(దేహతత్వములగు (జాగ్రదావస్థలో చెప్పినది) 24 తత్వములు + శివతత్వములు 5 + విద్యాతత్వములు 7 = 36 తత్వములు.

నియతియాది: శుద్ధవిద్యా తత్వములోని అంశములు 7 = కాలం, కళలు, నియతి,

రాగ, విద్య, మాయ, పురుషుడు – 7).

ఐదు అవస్థలలోను శివతత్త్వములే ఆదిగాను, అంత్యముగాను ఉన్నవి.)

2144. ఇందు కరణములతో గూడిన వాటి వృత్తులు కూడ చేర్చబడినది. జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు పదింటితో, వాటి విషయాది తన్మాత్రలగు వృత్తులు (జ్ఞానేంద్రియములకు: శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు (5), కర్మేంద్రియములకు: వాక్కు, చేతులతో చేయుట, కాళ్ళతో నడచుట, మల, మూత్రములు విసర్జించుట (5)) పదింటితో శరీరములో దాగియున్న వాయువులు పదింటితో, అంతఃకరణములు నాల్గింటితో, ఆత్మ చేరి మొత్తము ముప్పదిఐదు (35)గా బంధములను చేర్చునదైన జాగ్రదావస్థ స్థితియని చెప్పబడియున్నది. (10 + 10 + 10 + 4 + 1 = 35)

2145. పంచభూతముల యొక్క రంగులు చెప్పబడినవి: పృథివి రంగు – మేలిబంగారు రంగు; జలం రంగు – తెలుపు; అగ్ని – ఎర్రని ఎరుపు; రక్షించు వాయువు – నలుపు వర్ణం (మేఘవర్ణం); ఆకాశము – ధూమవర్ణం (పొగ); ఇట్లు పంచభూతములు పై రంగులు గలిగి వృత్తులు సలుపును.

2146. జాగ్రదావస్థలో దేహతత్త్వములు వాటి తాత్వీకములు తొంబది ఆరుగా (96) చెప్పబడినవి: పంచభూతములు ఐదింటితో పంచజ్ఞాన, కర్మేంద్రియములు అన్నియూ జీవుని బంధములో ఇరుక్కొన్నట్లు చేయునవే!! వీటిలో చేరునవైన మల దోషాదులకు కారణకర్తలగాయున్నవి జాగ్రదావస్థతో మొత్తం తొంబది ఆరు (96) అగును. (మంత్రము 2143లోని 36ను, మంత్రము 2120లోని 60 కలిపి మొత్తం 96 అయినవి.)

2147. జాగ్రదాస్థానము చెప్పవలెనన్నచో, ఆత్మతత్త్వములగు ఏనుగులు ఇరువది ఐదింటితో (25) పంచేంద్రియ వాసనలగు ఐదు (5) పదాది దళమును, శబ్దాది పంచ (5) గుర్రములను, పురుషునితో కలిపి ముప్పది ఆరు (36)ను భ్రూమధ్యమున నెలకొన్నదగును. వైఖరియాది వాచ్ఛక్తి నాలుగును బయటికి వెళ్ళు మార్గములు తొమ్మిదియగును.

2148. దేహములో ప్రాణమున్నప్పుడే జీవుని తత్త్వమెరిగి సాధించవలెను: ప్రాణమయ కోశము, మనోమయ కోశములన్నియూ అన్నమయకోశ దేహములో నెలకొని యున్నవి: ఈ స్థూల శరీరములో ప్రాణముగా నెలకొని ఉన్న తత్త్వమును ఎరుగజాల కున్నారు. శరీరమునకు ప్రాణమునకు ఉన్న సంబంధం ఎరుగకుండుటచే వారు ఒక కుక్క మఠములో ప్రవేశించి, బయటకు వచ్చుటకు దారి తెలియక అల్లాడునట్లు తిరుగాడుచున్నారే!!

2149. దేహమును దీర్ఘకాలమునకు పక్వపరచి యుంచుకొనుటకు అజ్ఞానులు ఎరుగజాలరు.

లోపలికి, బయటికి తిరుగాడు ప్రాణ, అపాణములను **అజప**తో మార్చి అంతర్ముఖముగా నెలకొనునట్లు చేసినచో, కామజయం పొంది (కామాది చేష్టలు అణిగి) సుషుమ్న ద్వారా (సహస్రమున) శివుని దరిచేరినచో, దేహము క్షీణించక ప్రకాశముతో నిండిన రూపమై కలకాలముండును.

2150. నాభియందు మరిగి దాగియున్న **అకారకళ** కొంచెము కొంచెముగా విస్తరించి పదునాలుగవదైన **అనాశ్రిత కళ** (దేహముపై నెలకొను కళ) వరకు వ్యాపించిన ఉపాయమును నాలో నెలకొల్పి శివుడు నాకు గ్రహింపజేసెను. అట్లు నెలకొల్పిన కళలు జ్ఞానముతో సామాన్య అరువది (60) తత్వములు ప్రకాశములేని ఒకదానిని నా మనస్సున దాచియుంచెనే!!

2151. పృథివి అంశముతో కూడిన పద్మమగు స్వాధిష్ఠాన చక్రమునకు సమీపమున జల అంశముతో కూడిన మణిపూరక చక్రపద్మం గలదు. దాని సమీపమున బంగారు చాయ గలిగిన మూలాగ్నియూ గలదు. ఇందున్న మూలవాయువు ఊర్ధ్వమునకు ప్రాకి ఆకాశతత్వముతో చేరును. అప్పుడు మనస్సు, బుద్ధి, అహంకారములన్నిటిని దాటి వెళ్ళుటచే **భూతజయం** పూర్తియగును.

(పృథివీ అంశమైన మూలాగ్నిని సహస్రమున నెలకొనజేయుటయే **భూతజయము**గా పేర్కొనబడినది.)

2152. సృష్ట్యాదిలో మొదట సృష్టించబడిన ఆకాశమునకు ఒక్క కుమారుడు – శబ్దం; ఆకాశమునుండి సృష్టించబడిన వాయువుకు ఇద్దరు కుమారులు – శబ్దం, స్పర్శ; వాయువు నుండి పుట్టిన అగ్నికి మూవురు – శబ్దం, స్పర్శ, రూపము; అగ్ని నుండి పుట్టిన జలంనకు నలువురు – శబ్దం, స్పర్శ, రూపము, రుచి; జలం నుండి పుట్టిన పృథివికి ఐదుగురు – శబ్దం, స్పర్శ, రూపము, రుచి, వాసన; ఇట్లు ఏర్పడిన కుమారులు పంచభూతములు (పంచ తన్మాత్రలు) సృష్ట్యాదిలో లేవు. శివుని **చిత్‌శక్తి** సృష్టిని చేయగోరి ఐదుగా విస్తరించి వాటిలో నెలకొనియూ, వాటికి వేరుగా, అతీతముగాను నిలుచున్నది. (శివుని అనుగ్రహమే **చిత్‌శక్తి** (మాయా) జగత్తును సృష్టించగోరి, సృష్టించి, తానూ అందే నెలకొనియున్నది – **"సో కామయతః బహుస్యాం ప్రజాయేయేతి"** – శ్రుతివాక్యం.)

2153. పంచజ్ఞానేంద్రియములు, వాటి తన్మాత్రలతో కూడినదైన అనుభవములు పదింటితో చత్వారి అంతఃకరణములు (4) కూడినదై ఎన్నో అనుభవములు పొందిన జీవునిలో శివుడు జాగ్రదావస్థలోనూ, జగత్తులోనూ తానై నిలచి వెలసియున్నాడు.

(శివుడే ఆత్మగా అంతటా ఉండునది.)

2154. ముందు మంత్రములలో చెప్పిన వివరములగు జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ వాసనల

పదింటిని వదిలివేసి అంతరమున వెలసియున్న చత్వారి అంతఃకరణములతో (మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారం) భ్రూమధ్యమున ఈ శరీరముతో అనుభవ రూపము పొందిన వాసనామయమైన వాటిని కంఠమునకు పైభాగమున చూచునదే **స్వప్నం** అగును.

2155. ఇందు **సుషుప్తి**ని (గాఢనిద్రను) వివరించునది: ముందు మంత్రములో చెప్పినట్లు కంఠమును వదిలి ఆత్మ హృదయములో ఒక్క చిత్తముతో ప్రవేశించి అహంకారము (నేను, నాది అన్న భావనలు) తొలగి, మనస్సు, బుద్ధి తొలగిపోయి, దేనితోనూ సంగత్వము లేక ప్రపంచమును అవ్యక్తస్థితిలో (విభజించి గ్రహించలేని తత్వం), దేహము తన వశము కోల్పోయిన స్థితియే **సుషుప్తి** అని పిలువబడును.

2156. ఆత్మ గొప్పగా మూల ప్రకృతితో కలిసి నెలకొన్నదే **తురీయస్థితి**: సుషుమ్నతో కలిసిన సుషుప్తి స్థితి హృదయమునందు ప్రాణణతో చిత్తము, పురుషుడు మూడు కరణములతో అనుభవము పొందును. ముందే కలిసిన చిత్తము, ప్రాణణల జ్ఞానము తొలగి నాభికమలమునందు గొప్పదగు మూలప్రకృతితో కలిసి పురుషుడు నెలకొను స్థితియే **తురీయం**.

2157. ఆత్మ అవిద్యను తొలగించుకొన్న స్థితియే **తురియాతీతం**: నాభికమలమును దాటి మూలాధారచక్ర **తురియాతీత** స్థితిలో ఆకాశమండల తత్వము చేతబూని పృథివీ తత్వము త్యజించి, నాదమయమైన (శబ్ద రూపములైనవి) సంకల్పవాసనలను దాటి, దేహకార్యములగు అవిద్యను (అజ్ఞానము) తొలగించుకొని ఆత్మ మూగవానిగా (మౌనంలో) నిలుచుండును. (ఆకాశమండలతత్వం = ప్రకాశముతో కూడినది.)

2158. మూగ అక్షరముతో మాట్లాడు అక్షరజ్ఞానము పొందినచో, (**మకారము** పలుకుటకు వీలుకాదు - అర్థమాత్ర అక్షరము దానితో కలిసి "అ, ఉ కారములు"లగు స్థూల ప్రణవ జ్ఞానములో నెలకొన్నచో, తాబేలువలె లోపల ఐదును అణిగిపోవును. (తాబేలు ముడుచుకొన్నపుడు తన ఐదు అంగములు లోపలికి లాక్కొనునట్లు - మన పంచేంద్రియములు వృత్తులు చేయజాలవు). అప్పుడు ఆత్మ ప్రణవములో నెలకొని (సూక్ష్మమగు నాదబిందులో) వెలసిల్లును. అప్పుడు ఆ స్థితిలో అహంకారము తొలగిపోయినది గ్రహించగలము సుమా!! (ఈ మంత్రము ప్రణవయోగులకును, ముందు మంత్రము సామాన్యులకు చెప్పబడినది.)

(1. జాగ్రదావస్థ - ప్రాణవృత్తి భ్రూమధ్యం - ఆజ్ఞాచక్రం - కరణములు, ప్రజ్ఞలు రెండూ పూర్తిగా పనిచేయును - సదాశివ గ్రంథి.

2. స్వప్నం - కంఠస్థానం - విశుద్ధి చక్రం - కరణములు పనిచేయవు. ప్రజ్ఞలు పనిచేయును - మహేశ్వర గ్రంథి.

3. సుషుప్తి – హృదయస్థానం – అనాహతచక్రం – కరణములు, ప్రజ్ఞలు పనిచేయవు. కాని శక్తి నింపి మేలుకొలుపును – రుద్రగ్రంధి.

4. తురీయం – నాభిస్థానం – మణిపూరక చక్రం – కరణములు, ప్రజ్ఞలు పని చేయవు. శక్తి నింపిన పిదప మెలకువ రాదు – విష్ణుగ్రంధి.

5. తురీయాతీతం – మూలాధారం – సమాధిస్థితి – మౌనస్థితి – గొప్ప ప్రజ్ఞ గలుగును. ఏవీ పనిచేయవు.)

2159. వృత్తి కరణములు పనిచేయని స్థితియగు తురీయాతీత స్థితిలో (సమాధి) అనుభవము గురించి చెప్పజాలము: పై మంత్రములో చెప్పబడిన ప్రణవయోగులకు తురీయస్థితి **నిర్మల జాగ్రదము**. నక్కలగు పదునాలుగు విషము త్రాగి చచ్చినవి (వంచనలు చేయు జ్ఞాన, కర్మేంద్రియ వృత్తులు పది + అంతఃకరణములు నాలుగు = 14 అణిగిపోయినవి; విషము = నీలి ప్రకాశములో చచ్చుబడిపోయినవి.) వేగముతో పరిగెత్తు గుర్రము పైకి ఎగిరిపోయినది (మూలవాయువు ఊర్ధ్వమునకు ప్రాకి సహస్రమున నెలకొన్నది). ఇక తురీయం దాటిన తురీయాతీతమును చెప్పనలవి కాదు సుమా!!

2160. సకల జీవరాశులు సంస్కృతం పొందువరుకు (పరిపక్వత పొందువరుకు) పై అవస్థలతో జన్మచక్రములో పడి భ్రమించుచుండును: మారని పంచమలములతో (అహంకారము, కామ్యము, మాయ, మాయేయం, తిరోధానం) కూడి పంచ అవస్థల యందు అవస్థపడును. వేరైన మాయ కారణముతో ఏర్పడిన ప్రాణము ఈ శరీరములో నెలకొన్నదానికి ముగింపులేదు. అన్ని జీవులు పుట్టియూ గిట్టుచునే ఉండును (పునరపి మరణం, పునరపి జననం) ముగింపులేని విధివిశముతో దుఃఖపడుచునే ఉండును.

2161. శివజ్ఞానముతో పంచావస్థలు తొలగి జన్మ ముగింపు పొందును: కర్మఫల భోగములను పురికొల్పు మాయ జీవుని ప్రారబ్ధమనుభవింపజేయును. కాని శివుని అనుగ్రహము పొందినచో, అదే ముక్తినొసగును. ముక్తి పొందవలసిన జీవుడు పిండస్థితిలోనే దివ్యానుగ్రహము పొందియుండుటచే నిర్విరామ శివజ్ఞానధ్యాసతో నేరుగా ముక్తి పొందును. (జీవుని మాయ అంటజాలదు.)

2162. ఆత్మ పరమగునంతవరకు పై పంచావస్థలు అవస్థలను (ఇక్కట్లను) కల్పించుచునే ఉండును: అనాదిగా బంధములలో చిక్కుకొన్న జీవునికి అహంకార మమకారములే సత్య ఎరుకను మరిపించియుంచును. దీనివలన ఇంద్రియ కరణవృత్తులలో నెలకొని **కేవలస్థితి** (శుద్ధతత్వము) స్థిరముగా పొందజాలక పంచావస్థలందే మునిగి తేలుచుండును.

2163. ఆచార్యుడు పాఠములు బోధించునపుడు నిద్రపోవు తన విద్యార్థిని బెత్తముతో లేపునట్లు, శివుడు తన సఖ్యతతో అనాదిగా వస్తున్న అహంకారమలముతో కూడిన విద్యార్థిని తన శుద్ధమాయతో ప్రకాశమును చొప్పించి అనుగ్రహించి లేపునే!!

2164. "మేఘముతో కూడిన మందాకినీ (ఆకాశగంగ) నీరును, ఘటములోనున్న నీరు ఒక్కటే"నన్న అజ్ఞానులు జ్ఞానులవలె పలుకు మాటలువలె, శ్రేష్టమగు "బ్రహ్మం ఆత్మ ఒక్కటే" అన్న భావనకు విరుద్ధముగా ఈ శరీరనాయకుడు (ఆత్మ) పక్వపడునంత వరకు పై పంచావస్థలలో తిరుగాడుచునే ఉండును.

2165. జీవుడు సహస్రమునకు చేరి శివంలో నెలకొనునంతవరకు జన్మలుండును: పృథివి తత్త్వమును తన స్థానముగా చేసుకొన్న జీవుడు శ్వాస గుర్రమునెక్కి (మూలవాయువు – శ్వాసచర్యలతో) అందమైన ఊర్ధ్వసహస్రమును చేరినపుడు అధోముఖధోరణిలో నుండు ఐదుగురు (బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు) వారిని చేరినవారును, నాదతత్త్వములో కలిసిపోయి నిదురించిరే!! (వారి చేష్టలు అణిగిపోయి, నిర్వీర్యము చెందిరి.)

(సదాశివ చక్రమగు "ఆజ్ఞా" వరకు జన్మలలో మునిగి తేలుదురు. దానిని దాటిన స్థితియగు శాంత్యాతీత–శివతత్త్వములో నెలకొనునపుడు ఇక పునర్జన్మలుండజాలవు.)

2166. బాహ్యచక్షువులకు కానరాని మలములను శుద్ధావస్థలో మలము ఏర్పడుటకు కారణములను పరిశీలించి వాటిని తొలగింపదలచి నిర్మల జాగ్రదములో (జీవుడు పక్వమొందిన స్థితి) ఆ పంచమలములను దర్శించి (ఎరుకతో తొలగించుకొను గ్రహణ) తన ముఖమునకు ముఖముగా ముందు వెలయు శివునిని వీడియుండక నెలకొనుస్థితియే **అక్షయస్థితి** (క్షీణములేని స్థితి) యగును.

(పంచమలములు: అహంకారము, కామ్యకర్మలు, అజ్ఞానబంధము (విధి), రాగము, ద్వేషము – సూక్ష్మశరీరములో మరిగియుండునవి. పరముతో ఇముడునదే క్షీణత లేని స్థితి.)

## 4. మధ్య జాగ్రదావస్థ

(ముందు అధ్యాయములో జాగ్రదావస్థలో భ్రూమధ్యమునుండి అధోముఖ ధోరణితో మూలాధారం చేరుకొని పంచావస్థలను దర్శించునది. ఈ అధ్యాయములో మధ్య జాగ్రదావస్థలో భ్రూమధ్యము నందుండే పంచావస్థలను దర్శించునది. అనగా: జాగ్రదావస్థలో జాగ్రదము, జాగ్రదావస్థలో స్వప్నం, జాగ్రదావస్థలో సుషుప్తి, జాగ్రదావస్థలో తురీయం, జాగ్రదావస్థలో తురీయాతీతములగు భేదములు చెప్పబడినవి.)

2167. జాగ్రదావస్థలోని జాగ్రదములో **తిరోధానశక్తి**తో ఆత్మ దాని తత్త్వములను గ్రహింప జాలకుండా మరిపించి నిలుచుండును. జాగ్రదావస్థలోని స్వప్నంలో ఆత్మ

**మామాయ**గా మాయాకార్యములలో మునిగి నిలుచుచుండును. జాగ్రదావస్థలోని సుషుప్తిలో కరణములు పరికరములన్నీ విశ్రాంతితో తానే కోరి **తత్సామ్యం** అదిగానే (ఆత్మసాక్షిగా చూచుచూ) నిలుచుచుండును. జాగ్రదావస్థలోని తురీయంలో కోరి తన స్థితి వదిలించుకొని **మాయ**కు వశపడి నిలుచుచుండును.

2168. మాయా ఆత్మకు కళ మొదలగువాటిని పురికొల్పి లేవును. దీనిచే రాగము మొదలగువాటికి తగ్గట్లు జీవతురీయం నెలకొనును. పిదప సుషుప్తి, స్వప్నం, జాగ్రద స్థితులందు నెలకొని **సకల** స్థితి పొందిన ఆత్మగా అయినది.
(జాగ్రదావస్థలోని జాగ్రదములో కరణములన్నియూ నెలకొనినవని చెప్పబడినది.)

2169. **సకల** స్థితిలోని ఆత్మ పుట్టు గుడ్డివానివలె దీర్ఘకాల సాధనలను చేయునన్న వివరణ:
సకలురు: పుట్టు గుడ్డివారు కావున దీర్ఘకాల సాధనలతో తత్త్వమెరుగువారు.
ప్రళయాలురు: జన్మించిన పిదప మధ్యన గుడ్డియైనవారు కావున స్వల్పకాల సాధనలతో తత్త్వమెరుగువారు.
విజ్ఞానలురు: జన్మతగా కన్నులున్నవారు కావున పుట్టుకతో జ్ఞానముగలిగి, ఎత్తిన జన్మలో సత్ఫలితము, ప్రయోజనం పొందువారు.
సాధనలతో జ్ఞానము పొందుటను గుడ్డిని ఉపమానముగా చెప్పబడినది. పుట్టుకతో గుడ్డివాడును, మధ్యలో గుడ్డియైన వారిరువునూ నడుచుకొని వెళ్ళునపుడు నడకదారి గ్రహించి వెళ్ళుటయూ, సక్రమము దారినెరిగి తగిన కఱ్ఱతోడుతో వెళ్ళువారునూ అగు ఈ మూడువర్గములో ఉన్న జీవులు తమతమ కర్మలందే నెలకొందురు సుమా!!

2170. సాలెపురుగు అది నేసిన (కట్టిన) గూటి మధ్యభాగములో నెలకొని దాని దగ్గరకు వచ్చు క్రిమికీటకాదులను భక్షించునట్లు, పరమేశ్వరుడు పంచప్రజ్ఞలు వచ్చి చేరు మెదడు వెనుక భాగమున నెలకొని (ఇచ్చట సద్యోజాతమూర్తిగా దేహధర్మమును ఎరుగుచున్నాడన్నది – ఆగమవాక్కు) శబ్దాది పంచప్రజ్ఞలను (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు) అనుభవించుచున్నాడు.

2171. ఇమడ్చవలసిన ఇరువది ఐదు (25) తత్త్వములను జాగ్రదావస్థలో ఇమిడ్చి, వాటిలోనే ఉపాయముతో సర్వవ్యాపియై (శివుడు) నెలకొని (జీవుల ఉన్నతి కోరి వారికి తోడుండి పక్వపరచుట) యున్నవానిని "భిక్షా!! (ఆదిభిక్షువు శివుడు) మహోన్నతుడా!! ఓ జన్మరహితా!!" అని నిర్విరామముగా స్తుతించి వానిని నచ్చి (ఇష్టపడి) వాని అనుగ్రహం పొంది నేను (రచయిత) ఉన్నతి పొందితినే!!
(శివుడే జీవుని ఆత్మతత్త్వములో ఇమిడి, తోడుండి, జీవుల ఉన్నతిని అనుగ్రహించు చున్నాడు.)

2172. జాగ్రదావస్థయందు ఇరువది ఎనిమిది (28) తత్త్వములు వృత్తులు చేయుచున్నవని

వేదాంతము చెప్పుచున్నది: కాని పై ఆత్మతత్త్వములగు ఇరువది నాలుగుతో పురుషుడు చేరి 25 అయినట్లే కాక వేరుగా పై ఈ ఇరువది ఐదుతో ఆత్మ పరంవ్యోమము (పరమాకాశము – నిర్వచించలేని తత్త్వము)తో కూర్చి నెలకొన్నట్లుగా బ్రహ్మావాదులు చెప్పిరి. ఇట్లు ఈ ఇరువది ఎనిమిదియూ (28) వేదాంత తత్త్వములగును. (పంచజ్ఞాన, పంచకర్మేంద్రియులు (10), పంచప్రాణం + పంచతన్మాత్రలు (10), అంతఃకరణములు (4) = 24+1=25.)

2173. ఆత్మ నెలకొన్న ఈ దేహములో ఇడ, పింగళ నాడులతో కూడి (24) సక్రమముగా నెలకొని, సత్త్వగుణముతో ఇమిడి, మూలాధార చక్రము మొదలుకొనియున్న చక్రస్థానంలోని సందిగ్ధ ముడులను విప్పి, ఊర్ధ్వమునకు ప్రాకి, సహస్రమున నెలకొనుటచే కాలాతీత తత్త్వమగు శివుని పాదములను దర్శించనగును!!

2174. దశ నాడులును, శ్రేష్టత కల్పించు దశ వాయువులును, మూలాధారము మొదలుకొని ఊర్ధ్వముగా వెళ్ళు సుషుమ్ననాడిలో ఇమిడి, నెలకొని, భ్రూమధ్యమున నెలకొన్నచో, కామ కలయికతో పొందు ఆనందరసమును, శ్రేష్టమును గలుగచేయు మనస్సు ఈ దేహమునకు ఏర్పడునే!!

2175. జీవులకు వారివారి పక్వతకు తగ్గట్లు దైవము (నంది) కర్మలు, భోగములు కల్పించి, దానిని తొలగించియూ అనుగ్రహించును: స్థితి పొందవలసినవిని స్థితి పొందించును. నశించవలసినవిని నశింపజేయును. తొలగించ వలసినవన్నియూ తొలగింప జేయును. చొప్పించవలసిన వన్నిటినీ చొప్పించును. కావున నంది జీవులకు అనుభవము, కర్మలు, ఫలితములు కల్పించి సాక్షిగా చూచుచుండును. ఇట్లు వారివారికి తగ్గట్లు (పరిపక్వత, ఆత్మోన్నతి) సమకూర్చు కరుణామయుడు సుమా!!

2176. పంచజ్ఞానేంద్రియ, పంచకర్మేంద్రియములు పదింటితో, వాటి వృత్తులు పదింటితో అంతఃకరణములు నాలుగు, అందు నెలకొన్న జీవుడు (పురుషుడు) శిరస్సును ముట్టడిచేయు ప్రాణణ (శ్వాస), శ్రేష్టమైన వ్యోమము (శిరస్సులోని ఆకాశతత్త్వము), దేహము దాటి పైన నెలకొన్న తురీయాతీతం (పరమేశాం/బ్రహ్మ/ఈశ్వర) 4 తత్త్వములతో చేర్చి మొత్తము ఇరువది ఎనిమిదైనది (28) వేదాంత తత్త్వములగును. (10 + 10+ 4+ 4 = 28 వేదాంత తత్త్వములుగా చెప్పబడినది.)

2177. ఆత్మ తురీయాతీత స్థితిలో ప్రాణణ (శ్వాస) లయ పొందుటచే తత్త్వములను వదిలించుకొని నిలుచును: మూలవాయువు ఊర్ధ్వసహస్రమునకు చేరి ద్వాదశాంతము చేరుసరికి దేహ శ్వాసచర్యలు జీవుని స్వాధీనములో ఇముడును. శరీరతత్త్వము దాటి వెళ్ళుటచే శరీరములోని జ్ఞాన, కర్మేంద్రియములు దాటి వృత్తులు మొత్తము (20) సద్దుమణిగి, పై మంత్రములో చెప్పిన మిగతా ఎనిమిదియూ

ద్వాదశాంతములో అణగిపోయి, అన్ని తత్వములు వీగిపోయిన స్థితిలో పంచమలములు వీడి, ఆత్మ ఒక్కటే మిగులును.

2178. మొత్తము తత్వములను విడివిడిగా లెక్కపెట్టినచో అవి మొత్తము నాలుగుకోట్ల నలభై ఎనిమిదివేల ఐదువందలు (4,00,48,500 – శ్వాసల చలన, నిరోధ తత్వములుగా స్థితి పొందునది) తత్వములుగా ఇముడును. వీటిని మరింత పరిశీలించి చూచినచో అవి తొంబది ఆరు తత్వము (96)లో ఇముడును. వాటిని మరింత కుదించినచో ఇరువది ఐదు (25)లో అణుగును.

2179. వేర్వేరు మతాచారములకు వివిధ తత్వముల సంఖ్య చెప్పబడినది: మాయయొక్క కార్యములగు ఈ దేహతత్వములు సాధారణముగా తొంబది ఆరు (96). శ్రేష్టమైన శైవులకు అవి ముప్పది ఆరు (36). వేదాంతులకు ఇరువది ఎనిమది (28), వైష్ణవులకు ఇరువది నాలుగు (24), మాయావాదులకు ఆత్మతత్వముతో కూడిన మాయతో చేర్చి ఇరువది ఐదు (25)గా వివిధ సంఖ్యలు చెప్పబడినవి.

2180. సకల తత్వములను తన వశమున చేర్చి అణగినట్లు చేసినచో మహాసామర్థ్యము పొందినవారుగా ఉండవచ్చును. కాని ప్రాణజయము పొందుటచే అన్ని అసత్యములు (మిథ్యాభావన భ్రమలు) తొలగిపోవును. దీనిని బోధపరచునది సృజింప జేయునది ప్రణవంలోని 'అ'కార తత్వ అక్షరమగును.

("అ"కారం – ప్రణవ ఉపాసనలో మొదటి అక్షరము – శివతత్వం – అకారం ఉదయింప జేసినచో ప్రణవయోగమను ప్రాణజయం గలుగును.)

2181. దేహతత్వములన్నియూ జ్ఞానము లేనివే; ఆత్మ ఒక్కటే జ్ఞానముతో కూడినది: ముప్పది ఆరు (36) తత్వములున్ననూ అందు ఆత్మ నెలకొనలేనపుడు అవి జ్ఞానము లేనివే సుమా!! అట్లున్ననూ వాటిని ఎరిగిన నేను, నన్ను ఎరుగకనే ఉంటిని. అపుడు నా గురునాథుడు – నందీ, "నీవు ఎరుగు సామర్థ్యమున్నవాడేనని" నన్ను అనుగ్రహించెను. దీనిచే నేను గ్రహించువాడే/ఎరిగినవాడే నని గ్రహించితిని సుమా!!

2182. జాగ్రదాది తత్వములు దాటి వెళ్ళునపుడు మలదోషములు నివృత్తియై శివంతో ఏకమగును: జాగ్రదలో జాగ్రదాది పంచతత్వములు ఐదుతో (జాగ్రద, స్వప్న, సుషుప్తి, తురీయం, తురీయాతీతం) శివతత్వములు ఐదును (శుద్ధ విద్యా, మహేశ్వరం, శతాక్యం, బిందునాదము) అందే నెలకొనియుండును. మలములతో కూడినదియూ, వాటికి కారణముగా నున్నవాటిని జాగ్రదావస్థ – పంచతత్వములతో సక్రమముగా నివృత్తింపజేసినచో, వాటితో నెలకొన్న అసత్యములగు (మిథ్యాభావనలు) ముప్పది ఆరు (36) తత్వములు తొలగింపబడి జీవాత్మ ప్రణవ తత్వముతో నిలచి శివంతో ఏకమై నిలుచుండును.

2183. బ్రహ్మకు అహంకారము, కామ్యము (కర్మలు), మాయ, మాయేయం, తిరోధాయి మొదలగు పంచమలములు కలవు. విష్ణువునకు అహంకారము, కర్మలు, మాయ, తిరోధాయి మొదలగు నాలుగు కలవు. హరునికి అహంకారం, కర్మ, తిరోధాయి అను మూడు కలవు. మహేశ్వరుని అహంకారము, తిరోధాయి రెండే కలవు. సదాశివునికి అహంకారము మాత్రమే ఉన్నది సుమా!!

## 5. అద్వాలు (మార్గములు)

(మంత్రము, పదం, వర్ణం, భువనం, తత్త్వము, కళ – ఇవి ఆరు మార్గములు. వీటిలో మంత్రము, పదం, వర్ణము **శబ్ద ప్రపంచము**. భువనం, తత్త్వం, కళలు **వస్తు ప్రపంచము**. ఇవి కర్మలను చేయుటకునూ, కర్మలను అనుభవించజేయు మార్గములగును.)

2184. తత్త్వములు ముప్పది ఆరు (36). మంత్రములు ఏడు రకములుగా ముగియును (నమః, స్వాహా, వషట్, హుం, వౌషట్, ఫట్, స్వధాః). సత్యమును నేర్పు వర్ణ మాలాక్షరములు యాబది ఒక్కటి (51). భువనములు రెండువందల ఇరువది నాలుగు (224). పదములు ఎనభై ఒక్కటి (81). కళలు ఐదు (5). ఇవి సృష్టిలో వచ్చినవి.

(**శబ్ద ప్రపంచము**గా చెప్పబడిన మూడు మంత్రము, పదం, వర్ణం ఒకదానికొకటి సూక్ష్మములు. భువనము (ప్రపంచం), తత్త్వములు (కరణములు), కళలు (నివృత్తియాది పంచకళలు). **వస్తు ప్రపంచం** లయమగునపుడు ఇవియన్నియూ శివశక్తిలోను, శక్తి (అనుగ్రహము) కడపట శివంలో లయమగును.)

2185. ఆరు మార్గముల సహజత్వమును గ్రహించి పిదప వాటి ఫలములను చెప్పబడినది: ఇమడదగిన సోమ సూర్యాగ్నుల మండల శ్రేష్టతలను గ్రహించి, మూలాగ్నిని ఊర్ధ్వమునకు ప్రాకించుటలో తమ శరీరములోని ఇరువది ఐదు తత్త్వముల (25) సహత్వము నెరిగి చేరుదురు. అట్లు గ్రహించి సహస్రదళ పద్మమును చేరు మార్గముల నెరిగి చేరుకొన్న పిదప, తత్త్వముల దారిని మరలా వెళ్ళనివారై యుందురు. (చేరుకొన్న పిదప తత్త్వములను త్రోసిపుచ్చిరి.)

2186. జాగ్రదావస్థలోని జాగ్రదాది పంచావస్థలో శివతత్త్వమును గ్రహించుటయే పరమావధిగా ఉండి, స్థూలశరీరపు ఎల్లయైన బ్రహ్మరంధ్రము చేరుకొని, దానిపై నున్న తురీయాతీతమగు ద్వాదశాంతములో శివతాండమును దర్శించి పొందుటలో తానే శుద్ధ విద్యాతత్త్వాదితో ఆత్మశివ, శక్తితో చేరి శివమగును.

(జీవుడు “తాను” అన్నది విడచినపుడు తానే శివమగును. “శివాయనమ” పంచాక్షరిలో “న, మ” లౌకిక సుఖానుభవములను నొసగి, వాటితో కలుగు కర్మ ఫలములను అనుభవించజేయునది. “తాను అన్న అహం వీడిన జీవుడు తత్త్వాతీతుడై

పరముతో చేరి "శివాయ" శివ, శక్తి, జీవుడుగా వెలుగొందును. పిదప జీవుడు (య) శక్తిలోను, (వ) శక్తి శివంలోను ఐక్యమై ఆఖరున "శి", "శివం" ఒక్కటే మిగులును. ఇదే అద్వైతస్థితి – వేదములు ఘోషించునది. మార్గములెన్నైన లక్ష్యము ఒక్కటే. గమ్యమొక్కటే – అదే శివం.)

## 6. శుద్ధ జాగ్రదలోని పంచ అవస్థలు

2187. శుద్ధ జాగ్రదాది పంచ అవస్థలలోనూ స్థూలతత్వములే సూక్ష్మమైనవిగా కనిపించును. అట్లే ఇరువది ఐదు (25) తత్వములు బిందు (ప్రకాశము) శక్తియగును. తన ప్రాణము బిందుప్రకాశములో నెలకొని బహిర్గతమగునపుడు జాగ్రదలోనే స్వప్నమువలె స్థూలస్థితులన్నిటినీ చూచు విధానమగును.
(భ్రూమధ్యమునకు, చిన్న మెదడుకు మధ్యభాగమున ప్రకాశమండలము ఏర్పడి జీవునకు తన సహజస్థితియే లేనట్లు అనిపించి స్వప్నంవలె అనిపించునన్న భావన.)

2188. జాగ్రదావస్థలో అతీతములగునపుడు స్థితులు వివరించినది: జాగ్రదావస్థలో తురీయాతీతం చేరుకొన్నవారు పసిబిడ్డడువలె యుందురు. జాగ్రదావస్థలో తురీయం చేరుకొన్నవారు తపస్విగాను, స్వల్ప లౌకికజ్ఞానము గలిగియుందురు. జాగ్రదావస్థలో సుషుప్తి చేరుకొన్నవారు పెరిగి యవ్వనప్రాయము అందుకొన్నవారు. జాగ్రదావస్థలో స్వప్నస్థితి చేరుకొన్నవారు మంచివన్నిటినీ చేయువారు.
(తురీయాతీతం = లౌకికవాంఛలపై ఆసక్తిలేని బిడ్డడువలె; తురీయం = లక్ష్యం వైపు ప్రయత్నించువారు; సుషుప్తి = సాధనలు చేయుటకు పూనుకొన్నవారు; స్వప్నం = మంచికార్యములు చేయు ఆసక్తియున్నవారు.)

2189. జాగ్రదావస్థలోని అతీతముల మహత్వము తెలుపునది: జాగ్రదతో తురీయాతీతమునకు చేరినవారు క్రియలతో శ్రేష్టత పొందునదైన శివతత్వమును సృజించియుందురు. అటువంటివారిలో విడదీయలేని సహరూప యోగమగు శివతత్వమే యగును. నిరంతర సాధనలచే వారిలో శ్రేష్టమైన విద్యా, శ్రేష్టమైన దివ్యరూపము, శ్రేష్టమైన సద్గుణములు కనిపించును. అటువంటివారి బుద్ధిలో (జ్ఞానంతో) అండములోని చరాచరములన్నీ గ్రహింపబడును.

2190. ఆదియైన పరమశివం, శివం, శక్తి, సదాశివం, మహేశ్వరుడుగాను, శుద్ధ విద్యా తత్వములన్నియూ అగు విద్యా, కళ, కాలము, నియతి మొదలగువాటితోనూ, విధానములతో అంత్యముగాను వానిలో నెలకొనియున్నారని గ్రహించుము సుమా!!

2191. జ్యోతి ప్రకాశముతో నిండిన శివం, శక్తి, సదాశివం, మహేశ్వరం, శుద్ధ విద్యయూ (5) రాగం, కళ, కాలము, నియతి, విద్యా, మామాయ, పురుషుడగు విద్యాతత్వములు ఏడింటితో (7) ఆత్మతత్వములు ఇరువది నాలుగుతో కూడిన ముప్పది ఆరు ((36)

తత్త్వములు. (ఆత్మ తత్త్వములు 24 + శివతత్త్వములు 5 + విద్యాతత్త్వములు 7 = 36.)

2192. అహంకారం, మాయ, కర్మలు యగు ముమ్మలములు వరిగింజలోని ఊక, పొట్టు, మొలకలగును. ఆత్మ శివంవలె వ్యాపకము చెందలేక ఊక, పొట్టు మొదలగువాటితో మూయబడిన వరిగింజవలె లోపల యుండును. కావున నీ చుట్టూ మూసియున్న వాటిని తొలగించుకొని దివ్యపాదములను పొందుదువు గాక!!
(అహంకారము = నేను, నాదను భావనలు; మాయ = అజ్ఞానము; కర్మలు = బంధములు ఏర్పరచు కామ్యకర్మలు; వీటిని తొలగించుకొన్నచో ఆత్మతత్త్వము నెరుగగలము.)

2193. జీవుడు బాహ్యప్రవృత్తులు మాని అంతరమున దైవమును సృజించవలెను: పశువులు ఎన్నో రంగులతో ఉన్ననూ అవి ఇచ్చు పాలు ఒకే రంగు – తెలుపు. ఆ పశువులు పెక్కు సంఖ్యలో యున్ననూ వాటిని మేపు కాపరి ఒక్కడే. పశువుల కాపరి వాటిని మేపునది నిలిపిన యెడల పశువులు కాపరి చుట్టూ గుమిగూడి వానిని వదలక నిలుచుండిపోవునే!! (విషయవాసనలు, బంధములే = పశువులు; కాపరి = ఆత్మ.)

2194. దేహములోని కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు, మనస్సు, తేజస్సుతో కూడిన బుద్ధి, చిత్తము బహుబలీయమైన అహంకారములగు అంతఃకరణములన్నియూ అజ్ఞానముతో నెలకొనుటచే చెడును. వీటిలో చిక్కుకొన్న ప్రాణము మరింత వాటి ప్రభావమునకు లోనైనచో, ఆ ప్రాణము అధఃపాతాళమునకు త్రోయబడి దుఃఖ మనుభవించును!! (ఆత్మ అజ్ఞానముతో చేరినచో ఉన్నతి సాధించజాలదు.)

2195. మూలాధారములో పురుషుడు నెలకొనునది తనను తాను గ్రహించలేని తురీయాతీత స్థితి. నాభిస్థానములో పురుషుడు నెలకొనునపుడు ప్రణవముగా వెలుగు అకార కళలో కోరి నిలుచుండును. హృదయమున పురుషుడు సుషుప్తిలో ఉన్నప్పుడు కామ్యవాసనలతో ఉండును. ఆ వాసనలే జీవునికి అనుభవములుగా స్వప్న, జాగ్రదలుగా మారును. (పురుషుని అధోముఖ ధోరణి చెప్పబడినది.)

2196. శుద్ధ జాగ్రదావస్థలలో స్వప్నం, సుషుప్తిలు లేవు. ఇట్లు స్వప్నం సుషుప్తి లేకుండా నెలకొనుటచే అచ్చట నాద, బిందులు ఉత్పన్నమై గ్రహించబడును. ఇందు అనుభవము పొంది నాద బిందులను మాయ ఆత్మతో కలియజేయును. పిదప జాగ్రదావస్థలో తురీయం, తురీయాతీతంలు వచ్చి నెలకొనును.

2197. నిర్మల (శుద్ధ) జాగ్రదావస్థలో విద్యాతత్త్వము ఏడు (7)లోని పురుషుడు తీసివేసి మిగతా ఆరింటితో (6) శివతత్త్వములు (5) చేరినదే పదకొండు (11) జాగ్రదావస్థలో వృత్తులు సలుపును.

(36 మొత్తము తత్వములలోని ఆత్మతత్వము 24, పురుషుడు 1 తీసివేసినచో (11) వృత్తులు చేయును. శుద్ధ జాగ్రదా స్వప్నంలో శివతత్వములైదు (5) మాత్రమే పనిచేయును. ఇక శుద్ధ జాగ్రదా సుషుప్తిలో శుద్ధమాయ ఒక్కటే వృత్తి చేయును.)

2198. శుద్ధ తురీయంలో పురుషుడు అధోముఖుడు; ఆత్మ ఊర్ధ్వముఖుడు దేహఫలము ఏమియూ లేదు: మాయలో వెలుగు పురుషుడు నిర్మల తురీయంలో ఆ సమూహమును విడచి తానూ అచ్చట ఉండక, పురుషునికి అతీతముగా ఉండు బిందుమండలములో (ప్రకాశమండలములో) ఆత్మలో రమించుటచే, నెలకొన్న ఆత్మకు ఈ దేహము వలన ఎటువంటి లాభము లేదు సుమా!!

2199. ఆత్మ నిర్మల జాగ్రదాతీత స్థితిలో శివజ్యోతి ప్రకాశముతో వెలయును: జాగ్రదాతీత స్థితి = మెలుకవలోనే తన్నుతాను మరచిన స్థితి. జాగ్రదాలో తురీయాతీత స్థితిలో జ్ఞానమే స్వరూపముగా ఉండు ఆత్మ, ఆ స్థితి దాటి అతీతముగా వెళ్ళి పురాతనమైన శివజ్యోతి ప్రకాశములో కలిసి ప్రకాశముగా వెలుగొందును.

2200. పురుషుని అధోముఖ స్థితిని వర్ణించుచున్నది: జాగ్రదావస్థలో వృత్తులు చేయునవి ముప్పది ఐదు (35). (కర్మేంద్రియ కరణములు (5), వాటి వృత్తులు (5) = 10; జ్ఞానేంద్రియములు (5), వాటి తన్మాత్రమలు (5) = 10; దశవాయువులు 10; అంతఃకరణములు (4), పురుషుడు (1) = 35.) కంఠములో ఇరువది ఐదు (25) (కరణములు వాటి వృత్తులు (10) చేర్చక (35–10=25) ఇది స్వప్నస్థితి. అశాశ్వతమైన శరీరమును తనదిగా చేసుకొన్న పురుషుడు, ప్రాణం, చిత్తము (3) కలిసినదే సుషుప్తి స్థితియగును. నాభియందు దేహము, ప్రాణము (2) కలిసినదే తురీయస్థితి.

2201. స్థూలదేహపు అధోముఖ ధోరణి పైన చెప్పినట్లు ఇందు సూక్ష్మదేహపు అధోముఖ ధోరణి వర్ణన: జాగ్రదలో పురుషుని పంచతన్మాత్రలతో మనస్సు, బుద్ధి, అహంకారముతో ఎనిమిది (5+3) ఉండును. స్వప్నంలో పురుషునిలో నెలకొనునది మనస్సు, బుద్ధి, అహంకారమగు మూడే అగును. సుషుప్తిలో బుద్ధి, అహంకారము రెండే పురుషుడు కలిసియుండును. తురీయంలో పురుషునితో అహంకార మొక్కటే కలిసియుండును.

2202. జాగ్రదావస్థలోని జాగ్రదలో అన్ని ప్రజ్ఞల జ్ఞానము శ్రేష్టముగా వెలయును. ప్రజ్ఞలతో సంబంధము లేక వాటి విషయవాసనలతో కలిసి యుండటము జాగ్రదలో స్వప్నం స్థితి. ఆ వాసనలను పరిచియున్న స్థితి జాగ్రదలో సుషుప్తి స్థితి. దేనితోను సంగత్వము లేక నిలుచున్న స్థితి తురీయం అగును. జాగ్రదలో అతీతస్థితి శివానుభవం ఒక్కటే అగును.

2203. స్వప్నంలో జాగ్రదలో చూచునట్లు చూచునది స్వప్నంలో జాగ్రదావస్థ. స్వప్నంలో చూచినది మరచిన స్థితి స్వప్నంలో స్వప్నం అగును. స్వప్నంలో చూసినవన్నిటినీ చూచియూ చూడనట్లున్న స్థితి స్వప్నంలో సుషుప్తి యగును. స్వప్నంలో చూచిన వాటితో చూడనివాటిని అనుమానంతో (అనుమాన ప్రమాణం ద్వారా) గ్రహించునది స్వప్నంలోని తురీయస్థితి.

(స్వప్నంలోని జాగ్రదాది పంచస్థితులు జీవాత్మ అనుభవం చెప్పబడినది.)

2204. సుషుప్తిలో పంచస్థితులలో ఆత్మానుభవం చెప్పబడినది: సుషుప్తిలో జాగ్రద అనునది ఏది ఏర్పడని నిద్రయగును (మనస్సు లేని, దేని గురించి తలంపులు లేని). సుషుప్తిలో స్వప్నం యనునది ఆత్మ తన నిజతత్వమును చూస్తూ ఉండడము (ఆత్మ సాక్షిగా నిలబడియుండుట) సుషుప్తిలో సుషుప్తి బుద్ధిజ్ఞానంచే నశించిన స్థితి (శివబోధంచే జీవబోధం నశించిన స్థితి) సుషుప్తిలో తురీయం నిర్వచించలేని (చెప్పనలవికాని) శూన్యస్థితి.

2205. తురీయంలో జాగ్రదాది పంచావస్థలలో ఆత్మానుభవం చెప్పబడినది: తురీయంలో జాగ్రదావస్థ శ్రేయస్సు గలిగించు శివప్రజ్ఞలో నెలకొనుట (గురోపదేశముతో బంధ శరీరమును త్రోసిపుచ్చి ఆత్మతత్వమెరుగటయే శ్రేష్టజ్ఞానమని గ్రహించి సర్వదా శివధ్యాసలో నుండుట – దేహభావనయగు అనాత్మ తత్వమును దాటి ఆత్మ తత్వములో నెలకొనియుండుట). తురీయంలో స్వప్నం – శిరస్సు సహస్రమును దాటి అండాకాశములో గ్రహించునది (శరీరమును ఆక్రమించుకొని వృత్తులు సలుపు పంచకోశములను ప్రవిలాపము చేయునది). తురీయంలో సుషుప్తి–వ్యోమ తురీయమగును (నిరాధార ఆకాశములో శిరస్సుకు పైనున్న ద్వాదశాంతములో నెలకొని శరీరమును మరచిన/విడచిన స్థితి). తురీయంలో తురీయం = అన్ని తత్వములను దాటుటచే తనను పరమని గ్రహించుట (ఇది పరములో నెలకొన్న స్థితి). (ఈ మంత్రములో శుద్ధావస్థలలో జీవాత్మ ప్రయాణం చెప్పబడినది. ద్వాదశాంతము: బ్రహ్మరంధ్రమునకు పైన 12 అంగుళముల ఎత్తులో.)

2206. తురీయాతీత స్థితిలోని జాగ్రదాది అవస్థలలో ఆత్మానుభవం వివరణ: అతీతములో జాగ్రద – ఆత్మజ్ఞానము శివజ్ఞానములో ఇమిడి నెలకొనియున్నదని గ్రహించిన స్థితి; అతీతంలో స్వప్నం – అట్లు గ్రహించబడిన జ్ఞానము గ్రహించిన సామర్థ్య మందగించిన, మరచిన స్థితి. అతీతంలో సుషుప్తి – జీవాత్మ జ్ఞానము శివజ్ఞానములో నెలకొని గ్రహించుట మాని, తనకు తానే నిలుచుండుట. అతీతములో తురీయం – తన జ్ఞానమని వేరులేదని గ్రహించిన స్థితి. (అనగా ఏకమైన స్థితి – అద్వైతస్థితి.)

2207. ఆత్మ పొందు శ్రేష్టస్థితియగు పరమపద స్థితి వివరించినది: పరాకాశమువలె

తాను అంతటా నెలకొని (సర్వవ్యాపకుడై) పంచమలములను తొలగించుకొనినవాడై, జ్ఞానమే తన స్వరూపముగా మారి శివుని కోరి చేరినవాడై, తానన్నది ఇక లేక అంతటా నెలకొనిన తత్వముగా, మేలైన సూక్ష్మ తత్వముగా వెలయు 'వర్ణం' – ప్రణవ దేహమును పొందును. (వర్ణము = స్థూలశబ్దమునకు ముందు ఉదయించు సూక్ష్మ చలన రూపములో పరా, పశ్యంతి, మధ్యమ చక్రస్థానములు దాటి వైఖరిలో (కంఠస్థానములో) సూక్ష్మమునుండి స్థూలవైఖరిగా మారి శబ్దముగా మారును. ఇది అక్షర శబ్దమునకు, భావశబ్దమునకు అతీతమైనది. సూక్ష్మరూపముగా ఉండి స్థూలశబ్దముగా మారుట.)

2208. నిర్మల తురీయంలో తాను అతనగు మహత్వపు వివరణ: ముప్పది ఆరు (36) తత్వములలో ఇరువది ఐదు (25) తొలగిన స్థితి – జాగ్రదం; మరో ఆరు తత్వములు తొలగినది – స్వప్నం; మరో ఐదు తొలగినది – సుషుప్తి; పూర్తిగా తగ్గి తత్వములు ముగియును. ఇవే జాగ్రదలో – జాగ్రద, స్వప్నం, సుషుప్తి. పిదప స్థూల, సూక్ష్మములు శుద్ధమాయతో ఉత్పన్నమగును. దానివలన తురీయస్థితిలో తత్వములకు అతీతముగా నాయకునివలె తాను అతనై (పరము) నిలుచును.

2209. ఆత్మజ్ఞానము యొక్క విశిష్టతను వివరించినది: (పరములో నెలకొనుట (ఆత్మ తత్వములో)యే పరమదేయమని బోధపడిన పిదప) ఈ సత్యమును ఇన్నాళ్ళు నేను గ్రహించనైతిని. ఈ సత్యమును ఎరిగి పిదప మరేమీ ఎరుగవలసినది లేదు సుమా!! అఖండ పరమగు ఈ జ్ఞానము పొందిన పిదప, ఇదే మనము పొందవలసిన స్థితియని గ్రహించి అతనైపోతిని!!

(శుద్ధావస్థలో ఆత్మతత్వములో నెలకొనుట తప్ప మరేదీ శ్రేష్టము కాజాలదు.)

2210. శివుడు అన్నింటా తానే నెలకొని అనుగ్రహించుట: అన్ని జీవరాశులలో ప్రాణముగా ఇమిడి, రూపముగాను, అరూపముగాను (ఆకార, నిరాకారములుగా) రూపము గలిగిన జీవరాశులకు తేటను బోధపరచు జ్ఞానముగాను, అన్నిటా నెలకొన్న సర్వరూపిగా, అన్ని సుఖభోగములను జీవులకు అనుగ్రహించు శక్తిగా, నాయకుడుగా ఉన్న శివుడు జగత్తు, జీవుడు, కరణములుగా వాటికి వృత్తులు చేయకున్నచో, అవియన్నియూ చీకటిలో నశించిపోవునే!!

(జ్ఞానము పొందలేక అజ్ఞానములో నశించిపోవునే.)

2211. ఈశుడు జీవాత్మలను తత్వములలో ఇమిడ్చినది, వాటి మలములను త్రెంచుటకే: ఈశుడు జీవులలోని అనాదిగా వస్తున్న మలమును పోగొట్టుటకు జీవాత్మపై కరుణతో, శక్తితో చేరి వారి ప్రాణముగా నిలచి, అనాదిగా బంధములను ఏర్పరచు పంచ మల సమూహముగాను, ముప్పది ఆరు (36) తత్వభేదములను సృష్టించి, వాటి

వృత్తులు చేయుటకు బాహ్యకరణములు, అంతఃకరణములను ప్రాణముతో చేర్చి ఇమిడ్చెను.

2212. జాగ్రదాతీత స్థితిలో అహంకార మలము తొలగినచో శివానుగ్రహం గిట్టును: జాగ్రదాతీత స్థితిలో అహంకార మలమగు "తానన్న" భావన ఆత్మ (జీవుడు) గలిగియుండును. జాగ్రదాతీతంలో ప్రకాశమండలములో ఆత్మ నెలకొన్నచో, అహంకారమలము వీగిపోయి, అనుగ్రహము నెలకొని "పరము" వీనిలో నెలకొనును సుమా!!

2213. అహంకారమలదోషం తొలగి చంద్రమండల ప్రకాశము పొందినచో "శివపరం" గిట్టును: జీవాత్మతో అనాదిగా మలదోషములు వస్తూ ఉండటముచే శివతత్వము మహామాయచే మరిపించి యుంచినది (మహామాయ తన "ఆవరణ" శక్తిచే సత్య తత్వమును మరిపించి యుంచినది). మలదోషము వలన తేటనైన సత్యజ్ఞాను ఎరుగకుండెను. మలదోషముచే శివుడు కూడ మరిగియున్నాడు. జీవాత్మతో నెలకొన్న మలదోషము నివృత్తింపజేసినచో శుద్ధ విద్యయగు చంద్రప్రకాశము గిట్టును.

2214. మంచి చెడులను విభజించి జూడనీయక భ్రమ కల్పించు సింహములు మూడు ఉన్నవి (కామము (శరీరవాంఛ), కోపము, అజ్ఞానము). పరిహాసింపజేసి వంచనలు కల్పించు నక్కలు నాలుగున్నవి (మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారం). వధ చేయదగిన ఐదు ఏనుగులు మనస్సుతో కూడియున్నది. (ఇంద్రియ విషయ వాసనలను చవిచూచు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధము) జ్ఞానేంద్రియములు ఐదు శత్రువులగు మనస్సుకు రెండు గుణములు గలవు (బాహ్యము, అంతరమునకు వెళ్ళదగు సహజత్వము).

2215. ఎలుగెత్తి అరచు ఆ పదునెనిమిదియూ (దశ వాయువులు + పంచ జ్ఞానేంద్రియ తన్మాత్రలు + మనస్సు, బుద్ధి, అహంకారము = 18) చలించు, భ్రమించదగ్గ మనస్సునూ వాటికి భయపడి, గజగడలాడి పోవుటకు ముందే నీవు సత్యతత్వమను (ఆత్మ తత్వమును) గ్రహించి, అందు నెలకొన్నచో, పైన చెప్పిన పదునెనిమిది మొదలగునవి భయపడి తొలగినపుడు ఆత్మ నాయకుడు (శివుడు) బహిర్గతమై అనుగ్రహించునే!!

2216. ఇంద్రియములన్నీ తమ కరణములను విడచి, మరచిన స్థితియే నిర్మల సుషుప్తి అమరును: జాగ్రదావస్థలో జ్ఞాన, కర్మేంద్రియములు వాటి విషయములగు పదిని విడచి, స్వప్నంలో ప్రవేశించి, అంతఃకరణములతో మెదడు ముందు భాగమున తలంపులను మరచి, మనస్సును మనోమండలములో స్థితి పొందినచో, ఎటువంటి ఆలోచనలు లేక మరచిన జీవుడు నిర్మల సుషుప్తిలో నెలకొనును.

2217. నిర్మల సుషుప్తిలో గురు అనుగ్రహముతో జీవుడు తురీయావస్థలో నెలకొని, జగత్తులోని నియమాదులైన (నియము, ధారణ, ధ్యానం మొదలగు) వాటిని పొంది, తురీయాతీతమగు సమాధిస్థితి పొంది, కొంతకాలము నిలచి, "పరం" అను నిర్మల నామధేయం పొందును. ("పరం" స్థితి తత్త్వములన్నిటినీ దాటిన స్థితి.)

2218. తురీయాతీతంలో "పరం" స్థితి పొందిన జీవుడు (ఆత్మ) శివమై ప్రకాశమై వెలయును: ముందు మంత్రములో చెప్పినట్లు తురీయాతీతమగు ఈశస్థితి పొందినవారు, సమస్త జ్ఞానము పొంది సమస్త లోకములను ఏకపరచి అనుభవించి, సదాశివమూర్తియై మహాశక్తి రూపములైన ఐదింటిని దాటి (బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, సదాశివుడు మూర్తులు = 5) శివంయై, మౌనంలో ప్రణవదేహము పొంది స్వయం ప్రకాశముగా వెలుగొందును. (ప్రణవదేహము పొందుటచే ఏ రూపమైనను దాల్చి, ఏ లోకమునకైనను వెళ్ళి అనుభవించగలరు.)

2219. శరీరములో ముమ్మండలములలోని మాయాతత్త్వములకు మహామహుడైన వానిని దర్శించి, అంతరమున నున్నవాటిని మరచి (దాటి), వికసించిన సహస్రదళ పద్మమును దాటి వెళ్ళునపుడు అండములోనివన్నియూ తన అంతరమున వెలయును. (ముమ్మండలములు దాటి, నిరాధార స్థితికి వెళ్ళునపుడు ప్రకాశమయముగా అన్నియూ గోచరించును.)

2220. జ్ఞానేంద్రియములగు పక్షులు (విషయ వాసనలు) ప్రకాశము వచ్చు దిశను (మార్గం) ఎరుగక భ్రమించియున్నవి. దివ్యానుగ్రహశక్తి కూడ వీరి క్రూర అజ్ఞానమును గ్రహించి సహాయపడక భ్రమించి నిలుచుండి పోయినది. నా దైవమగు శివుడు ఇటువంటి వారి అజ్ఞానమును మార్చి అమర్చక, సహాయపడక తాను అలాగే నిలుచుండిపోయెను. కాని సత్యతత్త్వమైన సూక్ష్మమును ఎరిగినవారు తమ శిరస్సునందే వీడక నెలకొన్న శివుని స్థాపించుకొని వెలసిరే!!

(జ్ఞానులు, యోగులు అఖండములో నున్నవన్నియూ అంతరమున సత్యతత్త్వముగా ప్రణవముగా నెలకొనియున్నదని గ్రహించి, దానిని శిరస్సున (సహస్రదళ పద్మమున) పదిలపరచుకొని ఉన్నతి పొందిరి.)

2221. ముందు మంత్రములో చెప్పినట్లు శివం నెలకొన్న సూక్ష్మమెరిగి, తొమ్మిది ఖండములు శరీరములో నెలకొనియున్నవని గ్రహించితిని. భువనాధిపతియైన, అన్నిటికి నాయకుడైన ఆ పరమాత్మను గ్రహించి తొమ్మిది ఖండులను మార్చి అమర్చితిని. దేవాదిదేవుడైన శివుడు నా అంతరమున నెలకొన్నది గ్రహించితిని. వాడు (శివుడు) నా అంతరమగు మనస్సున శాశ్వతముగా నిలుచుండిపోయెనే!!

(తొమ్మిది ఖండములు: శరీరములోని షట్చక్ర స్థానములు (6) + సోమ, సూర్య

అగ్ని మండలములు (3) = 9.)

2222. లోకులు ప్రమిదలో నూనె పోసి, వత్తి వేసి, దీపము వెలిగించునట్లు మూలాధారములోని అగ్నిమండలములోని ప్రకాశము – జ్యోతి మూలవాయువు సాధనతో చేకూరును. అట్లు మూలాధారములో నుండి పైకి ప్రాకిన ప్రకాశము సూర్యమండలము దాటి చంద్రమండలము చేరి, మహా ప్రకాశముగా వెలుగునే!! (మూలాధారంలోని కుండలినీ శక్తిని పెక్కు రకములైన సాధనలచే షట్చక్రములు దాటించి సహస్రమగు చంద్రమండలమునకు చేర్పించి మహాప్రకాశములో వెలిగి స్థితిపొందుట. ముమ్మండలములు: కాలి నుండి నాభి వరకు (మణిపూరక చక్రం) = అగ్ని మండలము; నాభి నుండి కంఠము వరకు (విశుద్ధి చక్రం) = సూర్య మండలము; కంఠము నుండి శిరస్సు వరకు (ఆజ్ఞాచక్రం దాటి సహస్రములో కలసి బ్రహ్మరంధ్రము వరకు) = చంద్ర మండలము – ప్రకాశమండలము.)

2223. సదా అంతరమున ప్రవృత్తితో నెలకొన్న పంచేంద్రియ ప్రజ్ఞలు గలవారు కపాలములో వెలయు ఊర్ధ్వ సహస్రదళ ఆకాశ మండలమును గ్రహించి ఏమని పరిశోధించినచో, ఊర్ధ్వముఖముగా నున్న అంతర ప్రజ్ఞలన్నీ కలియు సంధిలో కంటితో చింతనలో నెలకొనిన తత్వమని బోధపడునే!!
(భ్రూమధ్యమున అంతరదృష్టి సలిపి చింతనలో గ్రహించగలిగిన సత్యతత్వమని బోధపడును.)

2224. సాధారణ చక్షువులకు గోచరించని వాటిని శివుడెరుగును. శివతత్వము నెలకొన జేసికొని, గ్రహించి, ఎరుక పొందనివాడు పూర్ణజ్ఞానము పొందినవాడు కాజాలడు సుమా!! జ్ఞానశూన్యంచే నిండిన ఈ పంచావస్థలలో నున్న జీవుని తనతో చేర్చుకొని, మరిగియుండి పర్యవేక్షించుచూ వస్తున్న పూర్ణజ్ఞాన స్వరూపుడైన శివుని ఎరుగు వారెవరు? (జీవుని పక్వపరచుటకే తాను తోడుండి అనుగ్రహించిన పంచావస్థలని గ్రహించవలెను.)

2225. ఇంతవరకు నిర్మల జాగ్రదావస్థలో తురీయం స్థితిని బోధించితిమి. వ్యోమంలో (తురీయాతీతములో) నెలకొనునది మహాశ్రేష్టమగును సుమా!! (శిరస్సున సహస్ర దళపద్మ స్థానములో నెలకొనునది, దీనినే "వ్యోమము" అందురు) జాగ్రదా, స్వప్నం, సుషుప్తిలన్నియూ త్రోసివేయ వలసినవే!! పిదప తురీయంలో కాలము పరమగు స్థితి చాలా గొప్ప స్థితియగును (పరంతో నెలకొనుటచే కాలాతీతమై జయించిన స్థితి). ఇక తురీయాతీత స్థితి అన్నిటిని దాటిన శ్రేష్టస్థితి యగును.

2226. అశుద్ధమాయతో సంగమమున్న జీవుడు పెక్కు తత్వములలో నెలకొని తిరుగాడును. శుద్ధమాయతో జీవుడు శివతత్వమును పొందుటలో ధ్యాసయుంచును. ఈ సత్యము

నెరగని సకలురు (సామాన్యులు) కేవలావస్థ పొంది, పలు యోనులందు పుట్టి, తిరిగి కొట్టుమిట్టాడుదురు. శుద్ధమాయలో నెలకొన్న నిర్మల తురీయంను దర్శించివారు శివమగుదురు సుమా!!

## 7. కేవల, సకల, శుద్ధ స్థితి

(కేవల స్థితి = ఇంద్రియ గోళకములు కరణములతో చేరని స్థితి.
సకల స్థితి = ఇంద్రియ గోళకములు కరణములతో చేరిన స్థితి.
శుద్ధ స్థితి = ఇంద్రియ గోళకములు కరణములను వీడిన శుద్ధ స్థితి.)

2227. తన సత్యతత్వమెరిగిన శుద్ధుడు, తానేదియూ ఎరుగక యుండు కేవలుడును, వీరిరువురికి భేదమై, అన్నింటిలో కలిసిన సకలురును (సత్తు = శివుడు; అసత్తు = మాయ; సత్తాసత్తు = ఆత్మ జీవాత్మ సత్తుతో కూడి సత్తుగాను, అసత్తుతో కూడి అసత్తుగాను, దేనితో చేరక నిలుచునది సత్తాసత్తు గాను పిలువబడినది). క్రమముగా సత్తుతోను, అసత్తుతోను, సత్తాసత్తుతోను కూడి వారివారి పరిజ్ఞానము (పరిపక్వతకు) తగ్గట్లు నెలకొని నిలుచుందురు.

2228. తనకు తానే శత్రువు, మిత్రుడగును. వాని ఈ జన్మకూ, మరుజన్మకూ కారణము తన వలెనే ఏర్పడును (తానే కారణము, మరెవ్వరు కాదు). తాను చేసిన పుణ్య, పాప కర్మఫలితములను తానే అనుభవించవలె (మరెవ్వరూ భాగస్వామి కాలేరు). తనకు నాయకుడు తానే అగును సుమా!!

(జీవుడు చేసిన కర్మఫలితములకు తగ్గట్లు జన్మ, అనుభవము, దైవత్వము గిట్టును.)

2229. కేవలస్థితిలోనున్న ప్రాణము (కేవలస్థితి జన్మకు రాని స్థితి – అనాది కేవలస్థితి ఇది) శుద్ధమాయతో నెలకొని, పిదప పక్వపడి ఆ మాయ సంగత్వము కారణముగా వివరములను గ్రహించి, అనాదిగా వస్తున్న కర్మఫలితములకు తగ్గట్లు (సంచిత కర్మలు), మాయేయం తోడుతో భువన భోగములను పొందుటకు తను ఇరుక్కున్న ఆశాపాశములతో కూడిన సకలురుగా స్థితి పొందును.

(సకలుర స్థితి = ఇంద్రియ వాసనలతో కూడిన జన్మకు వచ్చు స్థితి.)

2230. పిపీలికాది బ్రహ్మ పర్యంతము జన్మకు లోనగువారు సకలురు: సకలస్థితిలోను ఇంద్రియ కరణములతో వచ్చి వృత్తులు సలుపువారు సకలురు. ఆగమములో చెప్పబడిన ముమ్మలములగు అహంకారం, కర్మలు, మాయ (అజ్ఞానము)లతో కూడినవారు. సాటిలేని బ్రహ్మ, నారాయణుడు మొదలగు పలు దేవతలును, ఈ లోకమున జీవించు మనుజులు, క్రిమి కీటకాదులన్నియూ ఈ సకలురు అగును.

2231. అహంకారం, మాయయను రెండు మలములు మాత్రము గలిగినవారు ప్రళయర్లు: అశుద్ధమాయతో కూడినవారు ప్రళయరులు. ఆ నెలకొన్న అశుద్ధ మాయయే

శరీరముగా గలిగినవారు (అశుద్ధ మాయతో యున్ననూ, ప్రకృతి మాయతో బంధింపబడు కర్మజనితములు లేనివారు – ప్రకృతి మాయను దాటినవారు). మిగతా మాయేయములను విడచినవారు. వారు శివునియందు నెలకొనిన శ్రీకంఠులు, నూటఎనిమిది (108) రుద్రులు అగును.

2232. అహంకార మలము మాత్రమున్నవారు విజ్ఞానకలురు: నెలకొన్న కేవలస్థితిలో అహంకార మలమొక్కటే ఉన్నవారు విజ్ఞానకలురు. వీరిలో విద్యేశ్వరులు, మంత్రేశ్వరులు, మంత్రకేసరులు కలరు. (వీరందరు శుద్ధమాయతో నెలకొని (పక్వపడినవారు) వృత్తులు సలిపి, సదాశివమూర్తిచే అనుగ్రహింపబడినవారు – జీవులకు "తనుకరణము" – తనువు – శరీరకరణము కల్పించువారు) సప్తకోటి (ఏడుకోట్లు) మహామంత్రములను కల్పించిన మంత్రేశ్వరులు వీరు.
(అహంకార మలమనునది: నాది, నేను అన్న సహజభావన.)

2233. మరింత పరిపక్వమొందిన విజ్ఞానకలురు శివునిలో లయమగుదురు: ముందు మంత్రములో చెప్పినట్లు విజ్ఞానకలురు పక్వపడి శివుని అనుగ్రహమునకు పాత్రులగుదురు. ప్రణవ ఉపాసనచే, శ్రేష్టబిందు, నాదములను దాటి, ప్రణవముతో శివునిలో ఇముడటచే, మలదోషములు లేని శుద్ధస్థితిని పొందుదురు.

2234. విజ్ఞానకలురుకి జ్ఞానస్థితిని అనుగ్రహించి శివుడు తనలో చేర్చుకొనును: జ్ఞాన స్వరూపస్థితులు నెలకొనుటలో నాలుగు రకములు, మూడు రకములుగా ఉన్నవి. (మంత్రము: 493 నుండి వరుసగా తాత్పర్యములు చూడగలరు – వివరణలు గలవు) పరిశోధించి చూచినచో ఇవియన్నియూ మాయతో నెలకొన్న ఇచ్ఛాజనితములే అగును. ఉన్ననూ పరిపక్వపడినపుడు ఇచ్ఛలన్నీ తొలగిపోవును. ఆ స్థితిలో ఈశుడే అనుగ్రహించి మలములన్నిటినీ పోగొట్టును.

2235. అసత్యములైన బోధాంతమును (ముప్పది ఆరు తత్వములను) త్రోసిపుచ్చి, వాటి యందు ఇసుమంతైననూ ఇచ్ఛ, బంధము లేని స్థితిలో నిలుచుటచే పొందదగు శివమే తానై, నిత్యమై, చరాచరమై, బట్టబయలులోనున్న మహాప్రకాశములో కలిసి, "వెళ్ళు చేరునది" ఇకలేక తానే ఆ స్థితి పొందుటయే "శుద్ధావస్థ"గా పిలువబడును.

2236. అనాదిగా పశుతత్వముతో కట్టబడిన ఈ జీవాత్మ (పశు + వ్యాధి) అనాదిగా వస్తున్న పంచమలములతో తిరుగాడునదియూ, అనాదిగా వస్తున్న కేవలస్థితినుండి లేపి సకలస్థితి పొందించినచో, అనాదిగా వస్తున్న పునర్జన్మలను తొలగించినదై ఆత్మ "శుద్ధావస్థ"లో నెలకొనినదగును.

2237. అంతరమున శుద్ధావస్థలో నెలకొన్న కేవలురు (పర ప్రకాశముతో నెలకొన్నవారు) తమ శుద్ధ కేవలస్థితిని దాటి "తత్పరం" శివునితో నెలకొని, తురీయంన తమ

జ్ఞానమును నిలుపుకొని జీవాత్మయగు తనయందే శివమయ తత్త్వమును నిలుపుకొని సృజించిన సత్యవంతులగుదురు. (అంతరమున శుద్ధావస్థయనునది శివునిలో లయము కాకయే మలదోషములను తొలగించుకొన్న శుద్ధావస్థ - తురీయస్థితి.)

2238. పృథివి నుండి పురుషుడు వరకున్న ఇరువది ఐదు (25) ఆత్మ తత్త్వములు (24 + పురుషుడు 1 = 25) జీవాత్మలో ఇముడును. ఆత్మయూ శుద్ధావస్థలో తన సత్య తత్త్వమెరిగి తన సొంత ఇంటిలో ఇముడును. శుద్ధ విద్యయూ (శక్తి) మొదటి మూడింటిలో అనగా శుద్ధ విద్యా, ఈశ్వర, సతాక్యంలో ఇముడును. పిదప శక్తియూ శివునిలో ఇముడును. సృష్టి క్రమములో అట్లే శివుని నుండి శక్తి, శక్తి నుండి మిగతావన్నియూ జనియించునే!!

2239. ఆత్మ శుద్ధస్థితిలో ముప్పదినాలుగు (34) తత్త్వములను దాటి శివశక్తితో ఇమిడి యుండును: శుద్ధావస్థలో ఆత్మ తత్త్వములు-24, పురుషుడు-1, విద్యాతత్త్వములు-6, మొత్తము 31గా నిలుచుచుండును. సత్యమెరిగినచో నెలకొన్న శుద్ధ విద్యయూ, మహేశ్వరము, సతాక్యం మూడును, శ్రేష్ఠ, సత్యమైన యోగముతో భ్రూమధ్యంలో శివ, శక్తులుగా దర్శించి, ఇరువది ఎనిమిది (28) తత్త్వములలో ఇముడునే!! (ఆత్మ తత్త్వములు 24 + పురుషుడు 1 + 3 = 28; శుద్ధవిద్యలో ఆత్మ ఇమిడి నెలకొనుటచే విద్యాతత్త్వములు ఆరును (6) వృత్తులు లేనివగును - కార్యములు లేనివగును - పరిగణించలేదు.)

2240. అహంకారమలము మాత్రము గలిగి, మిగతా మాయ, కర్మలు తెలియనివారు విజ్ఞాన కేవలురు అగును. అహంకారము, మాయతో నెలకొన్నవారు ప్రళయాలురు. స్థూలదేహమును చూచుచూ, అంతర్ముఖులు కాక, బాహ్యముఖులై అహంకారము, మాయ, కర్మల ప్రవృత్తులలో లీనమైనవారు సకలురు అగును.

2241. విజ్ఞానకలురు అహంకార దోషమున్నవారు. ప్రళయాలురు అహంకారముతో, మాయ దోషములున్నవారు. సకలురు అహంకారం, మాయ, కర్మల దోషములు ఉన్నవారు. ఇవే వీరి మలదోషములు.

2242. కేవలస్థితిలో (జ్ఞానస్థితిలో) విజ్ఞానకలురు శక్తితో నెలకొనియుందురు: జ్ఞానస్వరూప స్థితిలో ఉన్నతిని అందుకొన్న విజ్ఞానకలురు, ఆ జ్ఞానరూపం బిందుశక్తి వలన పెళ్ళుబికిన కేవలస్థితిలో సకలస్థితులను పొందిన కారణము ప్రణవ స్వరూపశక్తిని వలన గ్రహించిన సత్యమువలెనే సుమా!!
(మామాయాశక్తితో నెలకొన్న ప్రణవశక్తిని గ్రహించుటచే అశాశ్వతమైన శరీరములో సత్య స్వరూపియగు శక్తి నెలకొనియుండునది.)

2243. ప్రళయాలురు నూట ఎనిమిది (108) రుద్రులగుదురు: అశుద్ధమాయతో కొట్టు

మిట్టాడు ప్రళయాలురు ఆ మాయ వారిని బంధించకుండా ఉండునట్లు నిలచి, అహంకారముతో కూడిన స్థితిలో ఇచ్ఛను (కామ్యములు) పురికొల్పు శుద్ధమాయతో ఇమిడి నెలకొనుటచే నూట ఎనిమిది (108) రుద్రులుగా అగుదురే!!

2244. ముమ్మలములు గలిగి అందే మునిగియున్న సకల జనులు సకలురు అగును. దేవతలు, అసురులు, మానవులు, సత్యశీలి కాని బ్రహ్మయూ, చరాచర ప్రపంచ మంతటికి విస్తరించిన జీవరాశులు, క్రిమికీటకాదులు వరకు జన్మచక్ర బంధమున తగుల్కొని తిరుగాడు వారందరు సకలురే అగుదురు. (సత్యశీలి కాని బ్రహ్మ: పరమేశ్వరుని శిఖను దర్శించకయే దర్శించితినని అబద్ధము లాడిన బ్రహ్మ.)

2245. శుద్ధస్థితి పొందిన జీవాత్మలు శివసూర్యుని ప్రకాశముతో వారి ముమ్మలములను, చీకటిని పోగొట్టుకొందురు: శుద్ధావస్థలో నెలకొన్న సకల వర్గమువారు ముమ్మలములలో నిత్యమైనదైన అహంకారమును, అనిత్యములైన మాయ, కర్మలు తొలగించుకొనుటకు మరియూ వీటిలో ఒక్కొక్కదానిలో స్థితిపొందిన ఆశలన్నియూ, మోహం నిండిన చీకటియూ, శివసూర్యుని ప్రకాశము వలన తొలగించబడి శుద్ధులగుదురు!!

2246. శుద్ధకేవలస్థితియే ముక్తిస్థితి: తత్ కేవలస్థితి – బ్రహ్మం/శివంలో నెలకొనిన స్థితి. వెనకబడిన సకలస్థితిలో కళ మొదలగు తత్వములన్ని తొలగిపోవును (వదిలిపోవును). ప్రణవ ఉపాసనతో నిలచి జ్ఞానస్వరూప దర్శనము పొందునది శుద్ధావస్థలో నిర్మల జాగ్రదమగును. ఇట్లు తాను బ్రహ్మం/శివంలో నెలకొనునది తనను తాను పరిశుద్ధము చేసుకొన్నదే సుమా!! ("తత్ కేవల" స్థితిలో తానొక్కడై నిలుచుండును – శివం, జీవాత్మ ఒక్కటై నిలుచును.)

2247. శుద్ధ కేవలస్థితి వర్ణన: కేవలస్థితిలోనున్న ఆత్మ బుద్ధికి అతీతుడై, దేహభావన (అనాత్మ తత్వము) వీడినవాడై, వ్యామోహం కల్పించువాటిని వీడినవాడై (త్రిగుణ ఆహార్యములు లేని) చేరవలసిన గమ్యం ఇక లేనివాడై, నిత్యుడై (శాశ్వతుడై), కళాతీతుడై (కళాతత్త్వములు – అశుద్ధమాయను దాటినవాడు), తత్వరహితుడై (అన్ని తత్వములు లేనివాడై), భోగరహితుడై (భోగభాగ్యములకు అతీతుడై), అకర్తగా (ఉన్ననూ లేనివానివలె కర్మరహితుడై), మలవ్యాపియై (అహంకార మలముచే వ్యాపింపబడినవాడై) యుండును. (దీనినే "అహంస్ఫురణ" అందురు.)

2248. సకలురులలో శుద్ధులు ప్రళయాలరులు – వర్ణన: ప్రకాశమండలమును, దానిని మరిపించు మాయయూ, దానిని బహిర్గతము చేయు సత్కర్మలు, దానిలో వెలయు జ్ఞానమునూ, శరీరములో శక్తి మేరకు (పరిపక్వత తగ్గట్లు) అమరును. బిందు మండల ప్రకాశములో సత్యజ్ఞానముతో నెలకొనువారు ప్రళయాలురు. వీరు

ప్రపంచములో జన్మకు లోనై పిదప పరిశుద్ధపడిన ఆత్మలు.

2249. కేవలస్థితిలో వివిధ స్థితులను చెప్పుటలో కేవల కేవలం, కేవల సకలం, కేవల శుద్ధం అని మూడు రకములు. పురికొల్పు సకలములో సకల కేవలం, సకల సకలం, సకల శుద్ధం అనునవి మూడు. శ్రేష్టమగు శుద్ధంలో శుద్ధ కేవలం, శుద్ధ సకలం, శుద్ధ శుద్ధం అనునవి మూడు. ఈ స్థితులందు నెలకొని పరిశోధించు వారికి తొమ్మిది రకములైనున్నవి.

(కేవలాది స్థితులలో తొమ్మిది భేదములు గలదు – కేవలం = శుద్ధం.)

2250. కేవలములోని మూడు స్థితులందు ఆత్మానుభవము చెప్పబడినది: కరణములను విడచి నిద్రించునట్లున్న స్థితి కేవలములో కేవలం (మనస్సునందు రూపములను విడచిన అరూపస్థితి యగును). ప్రకాశమండలములో ఇమిడి జ్ఞానము తగ్గక నిలుచుండునది కేవలములో సకలం (యోగులు తమను చుట్టుకొనియున్న చీకటి (అజ్ఞానము) మండలమును దాటి ప్రకాశమండలములో ఎటువంటి జ్ఞానక్షీణత లేక నిలుచున్నవారు). ఎటువంటి దోషములు లేని అఖండ జ్ఞానము గలిగి తననూ, ఈ జగత్తును జ్ఞానపూర్వకముగా గ్రహించి, ఎరిగి ఉన్న స్థితి కేవలములోని శుద్ధం అగును. ఈ స్థితియందు పరమశివుడే ముక్తినొసగు మూర్తియగును. వీరు శుద్ధ దేహముతోనున్న "విజ్ఞానకలురు".

2251. సకలస్థితిలో ఆత్మానుభవమును మూడు విధములు: సకలములో కేవలము జాగ్రదాతీతం (నాదముతో నాదాంతమున ఇమిడియుండుట – ఇంద్రియ కరణములు వృత్తులు సలుపకుండుట) సకలములో సకలము మెలకువలో నుండుటయే (ఇది సాధారణ జాగ్రదావస్థ). సకలములో శుద్ధం తత్‌పరావస్థ (జాగ్రదాస్థితిలో జ్ఞానేంద్రియములు ప్రణవఘోషలో లయమైన స్థితి – నాదోపాసనతో నెలకొనియుండుట.)

2252. శుద్ధస్థితిలో ఆత్మానుభవము మూడు విధముల వివరణ: శుద్ధంలో శుద్ధమే మలదోషములు నివృత్తింపబడి కొలువబడు శివమగు స్థితి. శుద్ధంలో కేవలము కొలువబడు ఉపశాంతస్థితి (ఇంద్రియ కరణములను విడచి, మలదోషములను నివృత్తింపగోరి దైవవ్యాపకములో వ్యాపియై, అలలు లేని నీరువలె నిశ్చలస్థితి) శుద్ధంలో సకలం తురీయా విలాసస్థితి. (తనను, తన దైవమును గ్రహించి, ఆ దైవానుగ్రహమునందే నిలుచున్న స్థితి.)

2253. శుద్ధావస్థలో జాగ్రదాది పంచావస్థలందు శివతత్త్వము యొక్క వివరణ: జాగ్రదలో – జాగ్రదాస్థితిలో భ్రూమధ్యమున శివతత్త్వములైదును, జాగ్రదలో – స్వప్నంలో వెనుక మెదడునందు మహేశ్వరం, సతాక్యం శక్తి, శివమగు నాలుగును, జాగ్రదలో

– సుషుప్తిలో శిరస్సునందు సతాక్యం, శక్తి, శివంమగు మూడును, జాగ్రదావస్థ – తురీయంలో నిరాధారములో శక్తి, శివంమగు రెండునూ, జాగ్రదావస్థ – తురీయాతీతంలో వెళ్ళి పొందునది శివం ఒక్కటేయై సుఖానంద మొసగును (శివానందము మొసగునది). ఇట్లు పంచమల దోషములను నివృత్తింప వృత్తులు సలిపి శివుడు ఆత్మ (జీవాత్మ)లను ఆదుకొని అనుగ్రహించునే!!

2254. ఆత్మ శుద్ధ జాగ్రదాతీత స్థితిలో మల, గుణ దోషములు అంటజాలవు. ముందు మంత్రములో చెప్పినట్లు ఆత్మ జాగ్రదాతీత స్థితిలో శివునియందు లయమగుటచే అహంకార మలదోషము తొలగిపోవును. జాగ్రదాతీత స్థితిలో "పరావస్థ" కూడా తొలగిపోవును. (పరావస్థ = పరంతో నెలకొన్న నాదస్థితి – ఇది కూడ ఒక ఉపాధియే! కనుక నాదాంతములో నాదతత్వము కూడ తొలగిపోవును.) పరోపాధితో ఉప శాంతమైన పూర్ణమైన శాంతము చేకూరును. నాదాంత తత్వములో నిలబడు ఆత్మ ఇక మల, గుణ దోషములను చూచునా? (చూడజాలదు)

2255. బద్ధం (మలదోషములచే కట్టబడిన/బంధించబడిన స్థితి), మోక్షం (వాటి నుండి విడపడిన విమోచన స్థితి), తురీయం (స్వరూపమెరిగిన స్థితి), శుద్ధా తురీయాతీతము దాటిన స్థితిలో నెలకొనునపుడు శివం జీవాత్మని తనలో చేర్చి అనుగ్రహించుటచే (ఎరుక పొందుటచే) జీవుని అంతఃకరణములు, బాహ్యేంద్రియ కరణములన్నీ తమతమ కర్మలు, చేష్టలు ఉడిగిపోవును!!

2256. శివుడు జీవాత్మలను అనుగ్రహించి ఆదుకొనుటకే వారిలో బద్ధం, మోక్షం రెంటిని కల్పించియున్నాడు: జీవులలో ఇమిడ్చిన బద్ధం (బంధం), మోక్షం రెండునూ హరుని అనుగ్రహముచే అమరినవే!! ఆ శివుని వినోదలీలలకు గురియగు జీవులు శుద్ధ స్థితి (పరిశుభ్రము) పొందుటకేనని ఎరుగవలెను. అట్లు పొందినస్థితిలో జీవుడు దైవతత్వములో నెలకొని వెలసిల్లును.

2257. పంచమలములు గలిగినవారు తమకు తామే గొప్పని భావించు సకలురులు. పంచమల దోషబంధము కట్టుబడిన వారైనందువలన వారు ఆ తీవ్రకర్మలను తొలగించుకొనవలెను సుమా!! ఈ పంచమలము గలిగినవారు స్వర్గలోకమునే కోరి పొందుదురు (అనగా మోక్ష ఆపేక్ష లేనివారై యుండుట). ఈ పంచమలము గలిగినవారిని హరుడు బాగా ఎరుగును సుమా!! (అనగా వారు హరుని కోరకున్ననూ హరుడు వారిని ఎరుగును.)

2258. గర్భస్థితియందే అతీతంలో (కేవల తురీయాతీత స్థితి) ఆత్మకు శివశక్తి తన మాయను కల్పించును. పిదప తురీయంలో ఆ ఆత్మకు కోరిక వాసనలను భుజింప (భోక్తృత్వము) ఆశను పురికొల్పును. భ్రూమధ్యము నుండి బ్రహ్మరంధ్రము వరకున్న సహస్రమును

ఆవరించిన అష్టస్థితులుగా సూక్ష్మముగా ఇముడును (అష్టదళ పద్మమును ఆవరించిన అష్టశక్తులుగా ఇముడుట). పిదప అవే త్రిగుణాత్మకముగా మనోమయ కోశముగా మారి స్థూల జాగ్రదస్థితిగా ఏర్పడును.

2259. కేవలాతీతస్థితి నుండి ఆత్మస్థూల స్థితికి వచ్చుటలో పంచమలములను స్వీకరించు వివరణ: కేవల తురీయాతీతంలో అహంకారము తొలగకయే నిలుచుండును ("అహం" నేనన్న స్ఫురణ). పిదప తురీయంలో మాయ (అజ్ఞానం) చొరబడును. కేవల సుషుప్తిలో అశాశ్వత కర్మలు అల్లుకొని నిలుచుండును. కేవలస్వప్నంలో మామేయం వచ్చి నెలకొనును. ఇక కేవల జాగ్రదలో తిరోదాయి (సత్యజ్ఞానమును మరిపించు ఆవరణశక్తి) వచ్చిచేరును. ఇట్లు పంచమలములు ఆత్మను చుట్టుకొనును (జీవాత్మను ఆవరించును).

2260. శుద్ధావస్థ పొందినవారు జన్మకు వచ్చు వివరణ: అతీతంలో శుద్ధ ఆత్మ శివుని బాగుగా గ్రహించియుండును. అటువంటి జీవాత్మలు సృష్టికి వచ్చు తరుణములో శుద్ధమాయతో ఇమిడి, భ్రూమధ్యమున సుషుమ్న ద్వారా తను చేయవలసిన కర్మలను గ్రహించును. కాని ఎల్లప్పుడూ మామాయలో నెలకొని యున్నవారు దైవము యొక్క అనుగ్రహం గురించి పలుకునది సకలురే!!

2261. రూపము దాల్చి (మాయా కార్యమగు దేహమును దాల్చి) భోగ, భాగ్యములను చవిచూచి, పంచభూతములతో చేరి (త్రిగుణాత్మక ప్రకృతితో చేరి) మనస్సాదితో నెలకొని (చత్వారి అంతఃకరణములను గైకొని) వాసనాకర్మలకు లోనై, శబ్దాది తన్మాత్రలను (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధం) గైకొని, పిండముగా ఏర్పడిన జీవుడు సకలావస్థలలో నెలకొని వృత్తులు సలుపును సుమా!!

2262. జ్ఞానము, క్రియలు (ఉపాసనలు, యోగసాధనలచే) సమ్మేళనముచే (దేహకళల తత్వము చిత్తములో) పదిలమైనపుడు ఆనందమొనగూర్చు శ్రేష్టశక్తితో (శక్తినిపాదం) ఇమిడి, గురుదివ్య జ్ఞానోపదేశము ద్వారా బోధింపబడు జ్ఞాన కనువిప్పుచే, మూలమలమును (జీవాత్మను అనాదిగా వెంబడించు వాసనా బంధములను) తొలగించి ఇక పునర్జన్మను కలుగనీయక ఉండునదే శుద్ధ స్థితియగును.
(గురుముఖముగా పొందు జ్ఞానము ద్వారా జీవబంధములను తొలగించుకొనిన స్థితి – దేహభావన వీడి ఆత్మతత్వమును గ్రహించిన స్థితి.)

2263. జీవుడు నిర్మలతురీయాతీతంలో పరమమైన శివునికి స్థానమగుచున్నాడు: ముప్పది ఆరు తత్వములు ద్వారా (36 దేహతత్వములు) ఇరువది ఐదు అవస్థలను దాటి ($5 \times 5$ పంచావస్థలు = 25) నిర్మలతురీయాతీతంలో జీవుడు ఇముడుటచే శుద్ధ శివతత్వములు (శుద్ధవిద్యా, మహేశ్వరం, సతాక్యం, బిందు, నాదము) ఐదును

తొలగిపోయి, ప్రకాశము పొందిన జీవుడు పరమగుటచే శివునికి ఆధేయమగును!!

2264. తన నిజస్వరూపము (ఆత్మతత్త్వము) ఎరుగక తన దేహమే తానన్న భ్రమలో ఉండెను. నిరాధార స్థితిలో సృజించియున్నప్పుడు తానొక ప్రకాశరూపమని గ్రహించెను. తురీయంలో తనకు ఆధారముగానున్నది ప్రకాశమేయని దర్శించెను. అట్లున్న ప్రకాశములో దేహము నెలకొనినదని గ్రహించిననూ మరలా వచ్చి కర్మఫలము లనుభవింప జన్మించగలడు సుమా!! (తురీయంలో జీవుడు వేరు శివం వేరుగా ఉండును. కానీ అఖండమగు ప్రకాశముతో ఒకటగునపుడే ఇక రెండన్నది లేక పునర్జన్మ రహితమైన తురీయాతీత స్థితి తురీయంలో నెలకొనిన స్థితిలో పునర్జన్మ గలదు.)

2265. ఇందు తురీయాతీత స్థితిలో నెలకొను వివరణ: నిర్మల జాగ్రదాతురీయాతీత స్థితి చేకూరినచో, దానిచే ఉత్పన్నమైన శుద్ధతత్వ ఆనందస్థితి ఏర్పడును. భవిష్యత్తులో ఏర్పడు జన్మలు ఇక తొలగిపోవును. మహాత్మ్యంతో నిండిన ముక్తి గిట్టును. ఆ అతీతస్థితిలో వాక్కు, మనస్సు లేకుండా పోవును. (ఆత్మలో రమించిన స్థితిలో వాక్కాది పంచప్రజ్ఞలు, మనస్సాది చత్వారి అంతఃకరణములన్నీ వృత్తులు సలుపజాలవు.)

2266. అతీతస్థితియూ దాటిన పిదప ఆత్మజ్యోతి బహిర్గతమగును. నీటి తత్వమగు జీవుడు అగ్నితత్వమగు ప్రకాశము అఖండ ఆకాశములో వెలయును. నీరు, అగ్ని అందు చేరుట ఎట్లు? (ఆకాశములో నీరు, అగ్ని ఎట్లు కలిసియుండగలవు?) నీరు – శక్తి అంశము, అగ్ని – శివ అంశము. అట్లే ఏకమై నిలుచున్నది!!

(యోగపరిభాషలో: కుండలినీ శక్తియే షట్చక్ర స్థానములను దాటి అనగా మణిపూరక స్థానము – నీరు – నాభి; అనాహతము – రుద్రుడు – అగ్ని – హృదయములను దాటి చంద్రమండలమగు చల్లని చిదాకాశము సహస్రము చేరుకొని ప్రకాశముగా జ్వలించునదే ఆత్మజ్యోతిగా వర్ణించియున్నది.)

2267. మాయ ఒక్కటే త్రిఖండములుగా భేదించి జీవాత్మతో నెలకొనియున్నది: ముప్పది ఆరు (36) తత్వములలో ఇరువది నాలుగు (24) తత్వములు "అశుద్ధం" అగును. మిశ్రమ మాయతో ఇమిడిన విద్యాతత్వములగు ఏడును (7) "శుద్ధాశుద్ధం"లు (శుద్ధం + అశుద్ధం). ఇక వాటితో కూడిన శివతత్వములు ఐదు (5)నూ "శుద్ధం". ఇవియన్నియూ ఆత్మతో నెలకొనుటలో మూడు విధములైన ఖండముగా విభజించబడి ప్రకృతిమాయ, అశుద్ధమాయ, శుద్ధమాయగా ఉన్నవి.

2268. అశుద్ధమాయ దాదివలె (చంటిపిల్లలను పరామర్శించి పోషించునట్లు) శుద్ధమాయ ప్రసవించు తల్లివలె, ఇవి నెలకొనుటలో పరమశివుడు తండ్రిగాయై, ప్రాణము

కేవల సకల స్థితులందు కొట్టుమిట్టాడి ఉన్నతి పొంది (తేటజ్ఞానం) శుద్ధమాయను గైకొని శుద్ధావస్థను పొందును సుమా!! (పరమశివుడు – తండ్రి; శుద్ధమాయ – శక్తి – తల్లి – ఎప్పటికీ వైదొలగని తల్లి (శివంతో చేర్చువరకు); అశుద్ధమాయ – దాది కొంతకాలము వరకు పరామర్శ చేసి వెళ్ళిపోవుట. ప్రాణము, జీవాత్మ, ఆత్మకు పర్యాయపదమే. ఆత్మకు చాయ ప్రాణము కాని ఆత్మతత్వం = శుద్ధం, శాశ్వతం, చైతన్యం, బ్రహ్మం, శివం, ఏకం, అవ్యయం, సారం, సత్యం, అసంగము, అఖండము, అవస్థాత్రయసాక్షి, పంచకోశ విలక్షణం, శరీరత్రయ విలక్షణం, త్రిగుణాతీతం – శ్రుతివాక్యాలు.)

## 8. పరావస్థ

(పరం = శివుడు; పరా = శక్తి; పరావస్థలో శక్తితో నెలకొన్న స్థితి. పరావస్థలో ఆత్మానుభవముల యొక్క వివరణలు. పరాపరం = శక్తితో కూడిన శివం; శివుని అనుగ్రహమే = శక్తి)

2269. శివతత్వము లైదింటిని (5) దాటి అతీతముగానున్న అనాదియగు పరమే దైవమగును. ఇదే అందరిలో మనోమండలములో నెలకొన్నదియూ, నిర్మలమైన దోషరహితమైన, జన్మరహితమైనది (అజః) అగును. ఇది అఖండ తత్వమగుటచే దేహమునందు ఇమిడిన ప్రాణమును వేరుచేయుటకు గాను (దేహమును చూచు ప్రాణము, ప్రాణమును చూచు మనస్సు, మనస్సు చూచు శివుడుగా – తేటపరచుటకు గాను) వంచనతో ఇమిడిన సత్యతత్వమును (వంచన = సత్యమును మరిపించు తిరోధానం) నేను (రచయిత) గ్రహించితిని సుమా!!

2270. పరాశక్తి జీవుని చేయు ఉపకారము: పరాశక్తియే శుద్ధమాయ, అశుద్ధమాయతో కూడి, తన స్థితి చెడనీయక శాంతి కళలలో నెలకొనియున్నది (విజ్ఞానమయ కోశము శాంతి కళలో గలదు). శ్రేష్టమగు ఆనందస్థితిలో ఆ శక్తి ప్రకాశరూపము దాల్చును. ఆ శక్తియే అశుద్ధమాయతో నెలకొని శరీరములోని పంచ జ్ఞానేంద్రియ, కర్మేంద్రియముల ద్వారా వృత్తులు చేయుచున్నది. జీవుడు దేహముతో జరుపు వ్యవహారములన్నిటికీ కారణముగాను యున్నది. (విజ్ఞానము = తేటజ్ఞానము; పరిపక్వపడిన బుద్ధి.)

2271. తత్వములన్నిటినీ దాటి శివశక్తితో నెలకొన్నవారు సర్వజ్ఞానము గలిగిన వారగుదురు: ముప్పది ఆరు తత్వములను దాటినవారే అసలైన జ్ఞానము పొందినవారగుదురు. వారే శక్తి అనుగ్రహమునకు పాత్రులగుదురు. కావున అందు వారికి సర్వజ్ఞానము గిట్టును. దానివలన వారు శివునికి ప్రేమపాత్రులై ఇమిడియుందురు.

2272. పంచజ్ఞానేంద్రియులు, చత్వారి అంతఃకరణములు తమతమ చేష్టలుడిగిపోయి మనోమండలములో అణిగిపోయినపుడు, పంచావస్థల వృత్తులు అణిగిపోవుటచే జ్ఞానపూర్వకమైన ఆత్మ శ్రేష్టశక్తి యొక్క నీలివర్ణములో నెలకొని ఆనందమును ఏర్పరచును!!

2273. నిర్మల జాగ్రదలో ఏర్పడు తురీయమే జీవుని శుద్ధ స్థితియగును. అటువంటి శ్రేష్ట స్థితిలో జాగ్రద, స్వప్నం, సుషుప్తి మూడింటిని దాటి వెళ్ళుటచే, నిర్మల తురీయంలో జీవుడు పరమగును. జీవుడనియూ, శివుడనియూ ఎరుగజాలని ఉన్నతస్థితియే శివం అగుట సుమా!!

2274. ఆ పరంలో జీవాత్మ అన్ని తత్వములను విడిపించుకొన్న స్థితి: నిర్మల జాగ్రదాతీతంలో జీవాత్మ తత్వములను విడిచి పరమగును. ఇట్లు అతీతం నందే చిరకాలము నెలకొన్నచో పరాతీతం ఏర్పడును. ఇట్లు నిష్ఠలో ఇమిడి అతీతంలో నెలకొనలేని తపోధనులు పరం కాలేరు. వారికి ఆ శక్తులు (కామ్యకర్మలు) విడువకుండుటచే వానినుండి బంధములు వైదొలగజాలవు.

2275. పరావస్థయందు జ్ఞానముచే ఆనందము నెలకొనుట వలన మాయవృత్తులు అణగిపోవును: బాగుగా పరిశోధించి చూచినచో దేహమునందు మాయ అంతరముగాను, బాహ్యముగాను ఇమిడి వృత్తులు చేయును. నిర్మల జాగ్రదాతీతములో వాయువు (శ్వాసచలన వృత్తులు) మనస్సు (అంతఃకరణ వృత్తులు) దాటిన స్థితిలో మోహము తొలగుట వలన, శుద్ధమైన జ్ఞానము శివానందమయ మగుటచే, మాయని మూసివేసిన శక్తిగా అమరును సుమా!!

2276. జాగ్రద తురీయాతీత స్థితియగు పరావస్థలో కర్మవాసనలు ఇక లేకయుండును: తురీయం అను అశ్వంపై నున్న జీవుడు శ్రేష్టమగు పరావస్థలో నెలకొనుటచే, ఇంద్రియములగు నక్కలను తరిమికొట్టిన నాథుడుగా (నాథసామీప్యములో నెలకొనుటచే – నాథుడు) అనుభూతి చెంది, ఎటువంటి కర్మలచే బంధింపబడ కుండుటచే వంచన నక్కలనీ దూరముగా నిలబడి ఊళ వేసినవే (అరిచినవి)!!

2277. పరావస్థలో జీవుడు శివునివలె అంతటా వ్యాపించియుండును: ముందు మంత్రములో చెప్పినట్లు జాగ్రదలో అతీతములో నెలకొనునపుడు, అంతటా వ్యాపించిన ఆకాశభూత నాయకుడు జీవునితో కలిసి నిలుచును. ఆ సర్వవ్యాపి జీవునిలో ఇముడచే మాయయగు చీకటి తొలగిపోవును. వెంటనే జీవుడు శివునివలె అఖండరూపమును పొందును.

2278. లౌకికదృష్టి ఉన్నతవరకు మాయ యొక్క విన్యాసములు తొలగజాలవు: జాగ్రదావస్థలో లౌకిక వ్యవహారములన్నీ నడుపుటచే, మాయా కార్యములగు జగత్తు గోచరించును.

అపుడు మాహా బలీయమైన మాయ తను ఉన్నచోటు నుండే అన్నిటితో బంధము ఏర్పరచుకొని, తన వశపరచుకొనును. కాని తురీయంలో జీవుడు నెలకొన్నచో మాయతో కూడిన తురీయమగుటచే మాయ దోషము వైదొలగక అట్లే నిలుచుండును.

2279. నా స్వస్వరూపమెరుగక (ఆత్మతత్వము యొక్క ఆనందస్థితి) దేహమునే నేనన్న బుద్ధిభావనలో ఉంటిని. పిదప నిజతత్వమెరిగి తురీయంలో నిలబడితిని. తన నిజతత్వమెరుగక, శివవ్యాపకములో నెలకొననిచో పునఃజన్మలు తొలగజాలవు. అట్లు అమలుని (శివ) వ్యాపకములో నెలకొనుట వలన మాత్రమే మలదోషములు నివృత్తియగును సుమా!! (తురీయాతీతంలో స్థితి వలననే.)

2280. పిండ స్థితిగతులకు తగ్గట్లు తురీయంలో స్థూల, సూక్ష్మ, విద్యాకళ (కారణ) దేహము లమరును. జన్మ కారణమెరుగకుండు వరకు స్థూల, సూక్ష్మ శరీరముతో జీవుడు పునర్జన్మలను పొందుచునేయుండును. గురువరం పొంది, గురువనుగ్రహం చేకూరిన వారికి సూక్ష్మ, విద్యాదేహం, స్థూలదేహములు విడువడి శివంతో చేరి జీవుడు ఇక ఇద్దరన్నది లేక ఒక్కటై పోవుదురే!! (గురువనుగ్రహం వలనే జ్ఞానము చేకూరును. "జ్ఞానాదేవతు కైవల్యం" – శ్రుతివాక్యము. జ్ఞానము చేతనే ముక్తి గిట్టును.)

2281. ఆత్మకు నిర్మల జాగ్రదాస్థితియను మెలకువ స్థితియూ, దాని పిదప స్వప్నస్థితియూ, దానిని దాటి అతీతస్థితిలో తన్ను మరచిన సుషుప్తియూ, సుషుప్తిని దాటిన స్థితిలో శ్రేష్టమగు తురీయంలో ఆత్మ తన తత్వములను తొలగించుకొన్న అతీతస్థితిలో పరిపక్వపడి, అనుగ్రహముతో పరంతో ఏకమగును. దీనికే ముక్తియను నామము. (ఆత్మకు దేహభావన జ్ఞానము, వాసనామల దోషములు తొలగిన పిదపనే పరం అగును.)

2282. ఈ స్థితినే "పరమానంద భోగము"గా పిలువబడియున్నది: పర తురీయపు జాగ్రద, అంతటా వ్యాపించిన పరతురీయపు స్వప్నం, శ్రేష్టమగు పరమశాంతిలో ఏర్పడునదైన గాఢనిద్రయూ (సుషుప్తి) తొలగి నెలకొను తత్తమే శివతురీయంలో జీవుడు నెలకొని పరమానంద భోగమనుభవించును సుమా!!

2283. వ్యవహార జగత్తును మరచి ఉపశాంతము పొందునదే సత్యమైన సన్యాసమగును: పరావస్థలో నిర్మల జాగ్రదస్థితి పిదప జగత్తు వ్యవహారములను స్వప్నంగా భావించి, నిర్మల సుషుప్తిలో నెలకొనునపుడు జ్ఞానముచే లౌకిక వ్యవహారములను త్రోసిపుచ్చి ఉపశాంతము పొందుటయే నిజమైన సన్యాసమగును. ఈ స్థితిలో జీవుడు శివుని యందు కలిసియుండును. (జీవుడు ఆత్మతో కలిసిపోవునదే శివతురీయంగా చెప్పబడినది.)

2284. జీవతురీయం పరావస్థలో మొదలిడి పరాపరములో కలియు వరకున్నది దశ

స్థితులగును: జీవతురీయం మొదలుకొని శివతురీయం వరకున్న పది స్థితిగతులు తొలగిపోవును. శ్రేష్టమగు పరానంది (శివం)లో ఇముడునపుడు అంతఃకరణము నాలుగును విద్యాతత్వములు ఏడింటిని విడిచి నిలుచుండునే!! (స్వప్నం, సుషుప్తి, తురీయంనకు పైనున్నదే పరావస్థ. ఇది నిర్మల జాగ్రద, నిర్మల స్వప్నం, నిరల్మ సుషుప్తినకుపై నిర్మల తురీయం అమరును. వీటికిపైన శివజాగ్రద, శివస్వప్నం, శివసుషుప్తి, శివతురీయం అమరి దానికి పైనున్న స్థితిలో "అదే నీవగుట'' – "తత్ త్వం అసి" స్థితి.)

2285. అన్నిటికీ మేలైన స్థితి "పరం" – శివం; దానికి మేలైన స్థితి "పరమం". అతి ఉన్నతమైన స్థితి "పరాపరం". పరమశివుని దాటిన స్థితి ఇది "పరబ్రహ్మ". పరశివంమే శివజాగ్రద, శివస్వప్నం, శివసుషుప్తి దాటి పరమంలో ఐక్యమైన మహానంది తత్వం. (జీవునికి అన్ని బంధవాసనలు తొలగి నెలకొన్న స్థితి.)

2286. జీవునిలో అరూపస్థితిలో నున్న పరంలో పరశివ, పరశక్తి, పరనాదం, పరబిందు, సదాశివంయూ, రూపస్థితిలో వృత్తులు సలుపు బ్రహ్మ, విష్ణువు, దేవతల నాయకుడగు రుద్రుడు, మహేశ్వరుడుతో తొమ్మిది (9) మంది యున్నారే!! (నిరాకర, సాకార రూపములో నున్నవి.)

2287. ముందు మంత్రములో చెప్పిన దివ్యరూప, అరూపములన్నియూ జీవునిలో నెలకొని వృత్తులు చేయుచున్నవని లోకులు ఎరుగజాలరు. సముద్రముచే ఆవరించబడిన ఏడు లోకములు నశించిపోవునని వీరు గ్రహించజాలరు. శరీరముతో ప్రాణము నెలకొన్న తత్వమును గ్రహించి, ఉన్నతి పొందజాలరు సుమా!! పైన చెప్పిన రూప, అరూపములను ధ్యానించినచో నిజ స్వస్వరూపశక్తిని పొందగలరో? (పొందలేరని భావన: ఆత్మ తత్వయోగి సత్య స్వస్వరూపజ్ఞానం పొందవలెనను భావన.)

2288. గురోపదేశము పొందిన పిదప మహాతపస్సు యొక్క ఫలమగు సత్య స్వస్వరూప జ్ఞానము బోధపరచి, దయాపరుడు నా దైవము. అనాదియగు కర్మబంధములు తొలగించుకొనునదియూ, వాటి తరుణమును గ్రహింపజేసి, అఖండ వ్యాపకమును ఎరుగునట్లు చేసి, దానివలన ఏర్పడు ఆనందమును పొందింపజేసి ఉన్నతి అనుగ్రహించెనే!!

2289. బంగారు ఆభరణములో బంగారతత్వం మరిగిపోయినది (ఆభరణము చూచునపుడు బంగారం తలంపుకు రాదు) బంగారం తత్వమెరుగునపుడు మరి ఆభరణము మరిగిపోయినది. అట్లే తన నిజతత్వమును మరిపించినది అంతఃకరణములు (అంతఃకరణములు బహిర్ముఖమైనపుడు నిజ ఆత్మతత్వం గోచరించదు). ఆత్మ తత్వము గ్రహించునపుడు అంతఃకరణములన్నీ ఆత్మ వ్యాపకములో ఇమిడిపోవునే!!

(ఆభరణములు కరిగించిన పిదప బంగారమే మిగులును. అట్లే పరావస్థలో అంతఃకరణ చేష్టలుడిగినచో ఆత్మతత్త్వ మెరుగును.)

2290. పై మంత్రములో చెప్పినట్లు కర్ర, కర్రతో చేయబడిన ఏనుగు ఉదహరించబడినది: కర్రను మరిపించినది కర్రతో చేయబడిన మదగజము. కర్రను గ్రహించినపుడు ఏనుగుయను దృశ్యం మరిగిపోయినది. పరంను మరిపించినది పంచభూతాత్మక దృశ్యములన్నియూ, పరంను గ్రహించినపుడు పంచభూతాత్మకములన్నియూ పరంలో అణిగిపోవునే!!

(పై రెండు మంత్రములు కార్యకారణ సంబంధము వివరించు మంత్రములు. వీటిని ఉపనిషత్తులు పెక్కు విధములుగా ఘోషించుచున్నవి. బంగారం – కారణము, ఆభరణములు కార్యము; కర్ర – కారణము, కర్రతో చేయబడిన వస్తువులన్నీ కార్యము; మట్టి కారణము, మట్టితో చేయబడిన కుండ, ప్రమిద, కూజ మొ॥నవి కార్యము. నీరు కారణము, అల, బుడగలు, నురగ, తుంపరులు మొ॥నవి కార్యము. చరాచర జగత్తునందు అన్నీ నామ, రూపములతో వెలసియున్నవే తప్ప సత్యమెరిగినచో వాటి వెనకనున్న కారణం బహిర్గతమగును. దృక్‌దృశ్య వివేకముచే సత్యమైన కారణ మెరుగవలెనను భావన. కారణమెరిగినచో చూచు దృశ్యము లన్నియూ మరిగిపోవును. "బ్రహ్మ సత్యం – జగన్మిథ్యా" అను మహావాక్యం ఈ కోవకు చెందినదే. "వాచాఽఽరంభణం వికారో నామధేయం" సృష్టిలో అన్నియూ నామరూపాలుగా వచ్చిచేరినవే. దానివెనకయున్న సత్యమే కారణము.)

2291. ముప్పది ఆరు తత్త్వములను దాటి, పంచాక్షరిలోని (నమశివాయ) "నమ"లను విడచి, జ్ఞానముతో "య"కారమగు ఆత్మ, తత్త్వములకు అతీతముగా ఎదిగినపుడు, పరతత్త్వములో చివరిదైన ప్రకాశములో వెలుగు తత్పరమగు "శివ"తో నెలకొనుటచే "శివ య" యగు ఆత్మ శివశక్తి ("శివ")లో ఇమిడి నిలుచుటయే "ముక్తి" యనబడును.

("శి"కారం = శివం; "వ"కారం = శక్తి (అనుగ్రహం); "య"కారం = ఆత్మ; "న"కారం = మరపు (తిరోదాయి); "మ"కారం = మలం.)

2292. పరావస్థలో జాగ్రదాది పంచమములు అధోముఖ ధోరణితో అమరును. వాక్కు ప్రపంచంనకు కారణమైన అకారము మొదలగునవి నాదముగా వెలువడును (అకార వ్యాప్తియే – జాగ్రదస్థితి). నాదము ఇమిడి అణిగిపోయినదే స్వప్నం. పరలో నిర్మల సుషుప్తియైన గాఢనిద్ర అమరును. నిర్మల సుషుప్తి నుండి పైకి ఎదిగినదే తురీయం. తురీయంనకు అతీతమైనది పరమంతో చేరిన తురీయాతీత స్థితి – శివతురీయం.

2293. పరమం ప్రకాశములో చిత్తము ఇముడుటచే శివదర్శనం ప్రాప్తించి మలములన్నీ

తొలగిపోవును: పరావస్థలో అనుగ్రహముచే జీవునికి సకల స్థితులలోని బంధములు తొలగి, శుద్ధావస్థలో నెలకొనునట్లు చేయును. ఇట్లు చిత్తము పరావస్థలో నెలకొని నందిని (శివుని) పొందగోరును. అపుడు సంధ్యాకాలపు చీకటి తొలగునట్లు శిరస్సు నందు తెల్లని ప్రకాశము వలన పంచమలములు తొలగిపోవును సుమా!!

2294. సంస్కరించబడిన జీవాత్మ ప్రకాశముతో నెలకొనుటచే అంతటా వ్యాప్తిపొంది, అన్నింటా నెలకొను సామర్థ్యం పొందును: అశుద్ధమాయతో కూడిన పురుషుడు ఆత్మతత్త్వములగు ఇరువది ఐదును (25) సంస్కరించబడిన పిదప, శుద్ధమాయతో దేహమున గల "ఆత్ముడు"గా మారుటచే (విద్యాతత్త్వముతో హద్దులు గలిగిన పురుషుడు పరశుద్ధ తత్త్వముతో ఇముడుటచే "ఆత్ముడు"గా పిలువబడి) అన్నింటా తాను వ్యాప్తి పొంది, అన్నింటిలో తాను నెలకొని శ్రేష్టతత్త్వమును కల్పించు పరావస్థలోనే ఉండునదే శుద్ధస్థితి.

2295. నాదమయమైన శివుడు జీవునితో ఏకమగుటచే రూపముతోనున్న ఉపాదులను తొలగించి, వానిని వీడకయూ నిలుచున్నాడు: పురాతనముగా, అనాదిగా జ్ఞానములో నెలకొన్న నాధుడు పరమేశ్వరుడు. తను జీవాత్మలు తనయందు సలుపు ప్రేమ వలన పరమంను అనుగ్రహించి, వారిలో వీడక నిలుచుండి, వారి ఉపాధులతో ఐక్యమవక, వాటిని తొలగించి నెలకొనుటయే కాక, నాలో (రచయిత) నున్న స్థూల, సూక్ష్మ శరీరముల నుండి విడుపడునట్లు చేసి, నన్ను వీడకయూ నిలుచుండెను. (జీవుని ఉపాధులకు కారణము అజ్ఞానమే. ప్రకాశమయ మగునపుడు ఉపాధులు మాయమగును. పురుషుని తత్త్వములు తొలగినపుడు విద్యాతత్త్వములు తొలగుటచే మిగులునది – శివతత్త్వమే. రూపము కూడ తొలగుటచే శివతత్త్వములోని శుద్ధ విద్యా, మహేశ్వరం, రూప సతాక్యంలు తొలగి అరూపములైన నాద, బిందులే మిగులును.)

## 9. అవస్థలలో త్రిగుణ, నిర్గుణము

(ప్రాణము అవస్థలలో నెలకొనునపుడు సత్త్వ, రజో, తమో, నిర్గుణముల వివరణ)

2296. అవస్థలలో నెలకొన్న ప్రాణమునకు జాగ్రదలో సత్త్వగుణ మమరును. స్వప్నంలో దానికున్న రజోగుణ మమరును. ఇంద్రియ కరణములన్నియూ వృత్తులు సలుపక విశ్రాంతి పొందునది తామస గుణముతో నిండిన సుషుప్తి అగును. ఇంద్రియములు, అంతఃకరణములు వృత్తులు సలుపక, నశించిన స్థితియే దోషరహిత తురీయం యగును. (సకలురుకి ఇంద్రియ కరణములు విశ్రాంతి పొందితే, యోగులకవి నశించును.)

## 10. అండాది భేదము

(అండభేదము: శరీరమే ఒక అండము. ఈ అండకోశములో ప్రకాశమండలము నెలకొని యున్నది. అది శరీరమునకు చైతన్యమొసగి పక్వపడునట్లు చేసి, బ్రహ్మాండము నందు కలియజేయును. బ్రహ్మాండములో ఉన్నవన్నియూ శరీర అండకోశము నందునూ ఇమిడియున్నది. బ్రహ్మాండముననే బహిర్రండముగా పిలువబడినది.)

2297. విశ్వమను అండమును ఆసనముగా చేసికొని దానిపై వెలసియున్న దేవాదిదేవుడైన శివుడు కోరి బ్రహ్మాండములోనూ, విడివిడిగా నెలకొనియున్న అండకోశములందును, ఏడు సముద్రముల ఇసుకరేణువులవలె లెక్కలేనన్నివిగానున్న ప్రకాశకిరణములతో బంగారువన్నెతో ప్రజ్వలించుచున్నాడు.

(ఏడు సముద్రములలోనున్న లెక్కలేనన్ని ఇసుకరేణువులవలె బంగారు ప్రకాశ కిరణములతో విశ్వాంతరాలమున లెక్కలేనన్ని అండములు విడివిడిగా నెలకొని ప్రకాశించుచున్నవి. అట్లే శరీరము అండకోశములో కూడా ప్రకాశమండలము గలదు. ఈ రెండింటినీ తన అధీనములో ఉంచుకొని పరమేశ్వరుడు పీఠమేర్పరచుకొని ఆసీనుడైయున్నాడు.)

2298. అండకోశములో ఆసీనుడైన ఆత్ముడు ఆనందతత్వముగా అన్ని తత్వములకు అతీతుడై ఇమిడియున్నాడు. ఆత్మకు సహాయార్థముగా ఐదు విధములుగా, అండ కోశములో ముప్పది ఆరు దేహతత్వములుగా ఇమిడియూ, వాటికి అతీతముగాను, బాహ్యమున కూడ అంతములేని శక్తి స్వరూపుడుగాను, ఆనందశక్తిగా ఎనిమిది రెట్లుగా (8) వ్యాప్తి చెందియున్నాడు.

(సహాయార్థముగా ఉన్న ఐదు విధములు: శరీరమను అండకోశములో అన్నమయ కోశము = స్థూలశరీరంగా; ప్రాణమయ కోశము + మనోమయ కోశము + విజ్ఞానమయ కోశములు మూడునూ = సూక్ష్మ శరీరముగాను; ఆనందమయ కోశము కారణ శరీరముగాను; ఐదు కోశములు ఆత్మకు జగత్తున వ్యవహారము నడుపుటకు సహాయపడుచున్నవి. కావున ఈ శరీరత్రయము సహకారి – ఉపాధిగా వృత్తులు సలుపుచున్నవి. ఇట్లు సహకారిగాయున్న పంచకోశములతో కూడిన ఈ శరీర త్రయమే (స్థూల, సూక్ష్మ, కారణ శరీరములు) తానే ఆత్మయన్నట్లు జీవునికి భ్రమ కల్పించుచున్నది. కాని సత్యస్వరూపమైన ఆత్మ చైతన్యంవలెనే ఈ శరీరత్రయము వ్యవహార జగత్తున వృత్తులు చేయగలుగుచున్నది. కావున ఆత్మ = ఉపహితం; శరీరత్రయం = ఉపాధి.)

## 11. పదకొండవ అవస్థ (పరావస్థ)

(పదకొండవ అవస్థ అనునది శివతురీయంను తెలుపునది. దీని స్థలము శిరస్సు. ఆత్మలో నెలకొనియుండు దశ లేక అవస్థ)

2299. ఐదవ కళలో అర్ధచంద్రాకారములో భ్రూమధ్యమున వెలుగు అమృతమయమైన చంద్రప్రకాశము (ఇది జీవ తురీయాతీతం) శిరస్సున ఏడవ కళయగు నిరోధిని గ్రహించునపుడు ఆనందము ఏర్పడును (ఇది పర తురీయ జాగ్రదాస్థితి – ఆనంద స్థితి). ఇందు బిందు జయం పొందినదే ఓంకార ప్రణవమగును. తొమ్మిదవ కళలో వంచనతో కూడిన సత్యమును మరిపించి (దేహేంద్రియములే అన్నియూ అన్న భావన కల్పించి) ఇందు సుషుప్తిని అమలుచేయును. ఇక పదకొండవ కళలో (శివ తురీయస్థితి) జీవుడు ఉన్నతి పొంది, శక్తి యనుగ్రహము పొంది, శక్తి యొక్క ఎర్రని పెదిమల ద్వారా "చిలుక పలుకులు" విననగును సుమా!!

2300. ఆత్మతత్వములన్నిటినీ దాటి అతీముగా చిత్తములో నెలకొనునపుడు పంచావస్థలన్నీ తొలగిపోవును: మనస్సు, బుద్ధి, అహంకారములు మూడును చిత్తమును ఇమిడి, ఈ చిత్తముతో శివతత్వము అరూపములైదునూ చేరిన స్థితి (ఆరుగా)నే అతీతస్థితిగా పిలువబడినది (తురీయాతీతం). సుషుప్తిలో అధోముఖ ధోరణిలో మూడు అష్టకములగు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు మనస్సు, బుద్ధి, అహంకారములు (8) వికసించి శరీరభావనలను కల్పించును. జాగ్రద, స్వప్న స్థితిలో విద్యాతత్వములు ఏడునూ (7), అంతఃకరణములు నాలుగునూ (4) కలిసి పదకొండు (11) గా వృత్తులు సలుపును.

2301. శివధ్యాసలో నున్నవారికి విద్యాతత్వములు (7), అంతఃకరణములు (4) కలిపి పదకొండునూ వృత్తులు సలుపజాలవు: ముందు మంత్రములో చెప్పిన పదకొండు వలెనే శరీరమునకు విధి అమరియున్నది. వీటిని వృత్తులు సలుపనీయక అణచి వేసినచో ఇక మిగులునది నందియే (శివమే) అగును. వ్యర్థమైన అంతఃకరణాదుల దారిలో వెళ్ళక నిలుచుటయే శ్రేష్టమని నీవెరుగుదువు గాక!! పిదప శివుని యందు నెలకొనుటయే దృఢమని ఎరిగి సకల శ్రేష్టతలను పొందుదువు గాక!!

## 12. చేర్పు, ఖర్చు (కలియుట, విడుపడుట)

(ఇంద్రియ కరణములతో కలియుట, వాటి నుండి విడిపడుట వివరణ)

2302. ఆత్మ ఇంద్రియ కరణముల నుండి విడిపడి అతీతములో యుండుటయే శుద్ధ స్థితియగును: సత్యస్వరూపమైన ఆత్మ తన కేవలావస్థ నుండి దిగజారి ఇంద్రియ కరణములకు లోనై సకలావస్థలో తగుల్కొనును. కరణములను విడిచిన స్థితియే

అసలైన విడిపడుట యగును. పై రెంటి (కూర్పు, విడిపడుట) నుండి తొలగి అఖండమున నెలకొనునదే ఇక మూడవది. ఆత్మ అతీతములో నెలకొనుటయే శుద్ధ స్థితియగును.

2303. త్రిదోషములలో ఒకటైన కోపమును అణచియుంచుదురు గాక!! వీలైనంతవరకు చిత్తమును దైవము నందు పదిలపరచుదురు గాక!! రాత్రి, పగలనక సదా శివధ్యాసలో నున్నయెడల, రాతివంటి బలమైన అజ్ఞానచీకటి నుండి విడిపడి ప్రకాశము పొందుదురు గాక!!

## 13. నిర్మలావస్థ

(మలదోష రహితమైన స్థితి. ఆత్మ శివధ్యాసలో లీనమై, తనను మరచి, వ్యాపకములో నెలకొన్నదే నిర్మలావస్థ)

2304. నిర్మలావస్థలో నెలకొన్నవారు ప్రణవ దేహము పొంది మరణములేని శ్రేష్టతను పొందగలరు: నిశ్శబ్ద, లోతైన బావిలో (నిశ్శబ్దం = మౌనం; మౌనం = ప్రణవము), మాట్లాడగలిగిన ప్రణవోపాసకుడొకరిలో (ప్రణవోపాసకుడు = తాబేలు) ఇమిడియున్న ఐదింటి (5) (నిర్మల జాగ్రద, నిర్మల స్వప్నం, నిర్మల సుషుప్తి, నిర్మల తురీయం, నిర్మల తురీయాతీతంలో) స్థితిలో సత్య ఆత్మ తత్వములో బుద్ధిపూర్వకముగా జారిపోకుండా దృఢముగా నెలకొన్నచో తాబేలువలె (నెలకొన్న ప్రణవ ఉపాసకుడు) మరింత సహస్ర సంవత్సరములు జీవించగలడు!!

2305. వాయువు, అగ్ని, జలము, పృథివి యన్నియూ కలిసిన ఆకాశము ఐదింటినీ మహేశ్వరుడు, రుద్రుడు, విష్ణువు, బ్రహ్మ మొదలగు సాకార రూపములను పరిపాలించువాడు, నిరాకారుడైనది సదాశివుడు. సాకార రూపులగు పంచభూత దేవతలను వదలి నిరాకారుడైన సదాశివుని తత్వములగు ఐదింటిలో (అరూప సదాశివుడు, బిందు, నాదము, శక్తి, శివం) ఇమిడి నెలకొన్నవారికి ఇక యమభయం (మరణం) లేక, లౌకిక సంకల్ప వికల్పములు లేని శివంనందు నెలకొందురు సుమా!!

2306. నిర్మలావస్థలో ఆత్మ శివమహత్వంలో నెలకొనును: ఆత్మయే శివకుమారుడయ్యెను (జీవుడు – తండ్రియే పుత్రుడగుట). ఇట్లు గొప్పగా కీర్తించు ఈ వేదఘోషను నిజముగా ఈ లౌకికులు ఎరుగజాలరు సుమా!! ఆత్మయే శివకుమారుడగు (జీవుడు శివుని పుత్రుడే) నిర్మలావస్థలో శివం వేరు, జీవుడు వేరన్న భావన లేనందున ఆ స్థితిలో ఇరువది ఐదు (25) తత్వములు కూడ లేదు సుమా!! (దేహభావనలన్నీ తొలగిన స్థితి.)

2307. ఆత్మ తురీయస్థితిలో బ్రహ్మానందమును పొందును: సృష్టి, స్థితి, లయము మూడునూ

దేహేంద్రియ కరణములతో గలుగునదే నిర్మల జాగ్రద, నిర్మల స్వప్నం, నిర్మల సుషుప్తి అగును. వీటికి అతీతముగా జీవుడు (ఆత్మ) సంకల్పరహితమై తురీయ స్థితికి చేరుకొని నిలకడ పొందినపుడు పరిశుద్ధుడై మిక్కిలి ఆనంద ఆనందము (అంతము లేని బ్రహ్మానందము)ను పొందును సుమా!!

2308. నిర్మల తురీయజ్ఞానమే తత్వములన్నిటిని దాటిన "శివగతి" అగును: మాయేయం అగు అన్ని తత్వములు జీవప్రకాశములో ఇముడును. తత్వములు యొక్క బాహ్యాంతరములన్నీ తానై, జీవప్రకాశమై, తురీయంలో పరిశుభ్రమై, ముప్పదిఆరు (36) దేహతత్వములను త్రోసిపుచ్చి వేయును. అప్పుడు ఆత్మ జ్ఞానరూపమై గమ్యమగు శ్రేష్టమైన "శివగతి"ని పొందును.

2309. నిర్మల తురీయావస్థలో కూడ ఆత్మకు కర్మవాసనలు కొంత మిగిలియే ఉండును: అగ్నిలో బాగుగా కాలిన ఇనుమును అగ్ని నుండి తీసివేసిననూ, ఆ ఉష్ణము ఇనుములో మిగిలియే ఉండునట్లు, నిర్మల తురీయములో కరణములను విడిపించుకొన్ననూ, కరణములు జరిపిన పూర్వకర్మ వాసనలు కొంత ఆత్మను విడువక మిగిలియే ఉండును. (ఆగంతుకములన్నీ కొంత నిలచియే యుండును.)

2310. తురీయాతీత స్థితిలోనే అన్ని మలములు వైదొలగును: వేదతత్వములే స్వరూపముగా గల నందీశ్వరుడు (శివుడు) బహిర్గతమగుటచే, ఇంతవరకున్న జాగ్రదాది అవస్థలందు సంక్రమించిన పలు విధిచేష్టలు వైదొలగి, నాదము దాటి నాదాంతములో జీవుడు (ఆత్మ) మలాతీతముగా నెలకొనుటచే ఆత్మ పరమహా తత్వమును పొందును (తానే పరమగును).

2311. ముందు మంత్రములో చెప్పినట్లు నిర్మల తురీయాతీత స్థితిలో సర్వదా నెలకొన్నవారు సకలస్థితికి మరలిననూ, వారిని అనుగ్రహించిన శివశక్తి వారిని విడువక రక్షించును. ఆ నాదమునే ధ్యానవస్తువుగా గైకొనజేసి, లౌకిక భోగవాంఛలందు ఇమడనీయక నాదాంతములో నెలకొనజేసి, సమాధికి తోడ్పడును. శివునితో లయమగుటకు ఆ అనుగ్రహశక్తియే సాధకునకు తోడ్పాటుకు కారణమై ముందుండును.

2312. అన్ని అవస్థలకు దైవానుగ్రహచర్యలే తోడున్నవి: దైవము తన మహత్వముతో జీవరాశులను రెండుగా విభజించెను. ఆడ, మగయనియూ; తాను (శివం), దేహ తత్వములనియూ; తానే అర్ధనారిగా నాలో నెలకొన్నపుడు లౌకిక భోగవాంఛలలో ముంచి, దానినుండి విముక్తి పరచి అఖండములో నెలకొనునట్లుచేసి అనుగ్రహించెను. పైగా నన్ను విడువక అనుగ్రహ కేవలంలో నిలిపి, నా నుండి వైదొలగక తండ్రిగా తోడుండెను.

(రచయిత – తనను శివుడు అనుగ్రహించిన విధము వర్ణించుచున్నారు.)

2313. దైవానుగ్రహము పొందిన జీవరాశులు పునర్జన్మకు రాజాలవు: ఆకులతో నేయబడిన గాలిచక్రము, మండుచున్న దివిటీ యొక్క వృత్తము (అగ్నిరవ్వలు చిందు వృత్తము, సముద్రములోని అలలు, పెరుగుకుండలో చిలుకు కవ్వము మొదలగువన్నియూ తమంతట తాముగా తిరుగజాలవు. అట్లే త్రిప్పు వాడొకడుండుట వలన మలదోషములతో నిండిన జీవుడు స్వర్గ, నరకలోకముల మధ్యన తిరుగాడి కొట్టు మిట్టాడును. జీవునికి దైవానుగ్రహము (ఆత్మజ్ఞానం) చేజిక్కిన వెంటనే ఇక పునర్జన్మ రహితమగును.

2314. శివమహత్త్వము చేజిక్కిన వెంటనే మలదోషములు తొలగునది సూర్యప్రకాశము వలన చంద్రుని ప్రకాశము వైదొలగునట్లగును: ఆత్మ శివమహత్త్వము పొందిన వెంటనే పూర్వకర్మల, మలదోషములు, బంధములన్నీ తొలగిపోవును. దానితోగూడ ఇన్నాళ్ళు తనను మరిపించియున్న శారీరక ఉపాధులు కూడ వైదొలగిపోవును. ఇది భానుని ఉదయముతో సోమప్రకాశము సన్నగిల్లి వైదొలగునట్లే సుమా!!

2315. నిర్మల తురీయంలో అగ్ని, జలము, వాయువు మొదలగు సూక్ష్మ భూతతత్త్వములునూ, సోమ, సూర్యాది కళలునూ, సృష్టిని కల్పించు బ్రహ్మయూ, స్థితికి కారకుడైన నారాయణుడునూ, లయమును కల్పించు రుద్రుడును అందు చేష్టలుడిగి (వృత్తులు చేయజాలక) నెలకొందురు సుమా!!

2316. కర్మానుసారియైన దేహమందే జ్యోతిని దర్శించినవారు ముక్తిని పొందగలరు: మదగజముతో బోలిన ఇంద్రియములను అణచి, బుద్ధిపూర్వకముగా (వివేక వైరాగ్య అభ్యాస సాధనలచే) జ్ఞానమను దీపవృత్తిని వెలిగించి, దర్శించు జీవప్రకాశములో ఇమిడి, మాయాకల్పితమగు ఈ దేహమునందే జ్యోతిని దర్శించువారికి శివ లోకమునకు వెళ్ళుటకు దారి సులభమగును సుమా!!

2317. నిర్మల తురీయంలో ప్రాణశక్తి సహస్రదళమును చేరుటచే అందు నాదముత్పన్న మగును: ఎడమకాలి చలనముతో ప్రాణశక్తి (నాట్యభంగిమలో ఎడమకాలు – చంద్రకళ అంశం పైకి ఎత్తి ఆడునపుడు – శ్వాసక్రియ) పైకి ప్రాకి ఢమరుకం మ్రోగునట్లు, శబ్దించు వేదాగమముల ఘోషవలె ఇంపైన నాదమును నా సహస్ర దళమునందు సృజించితిని సుమా!!

2318. పూర్వజన్మ సుకృతముచే శివజ్ఞానము ప్రాప్తియై తన స్వరూపమెరుగుటచే పునర్జన్మ రహితమగును: పూర్వజన్మలలో పొందిన జ్ఞానసాధనల వలన సాధకము పొంది, ఈ జన్మలో అది ప్రకాశరూపమై జ్వలించి, అఖండమున నెలకొనునది సృజించ నగును. ఇట్లు సృజించుటయే సత్యమైన జ్ఞానమగును. ఇది తప్ప గ్రహింపబడు నన్నియూ జ్ఞానము కాజాలదు సుమా!!

2319. నిర్మల తురీయంలో వృత్తులన్నీ వదిలించుకొన్న స్థితిలో శివానుగ్రహం ప్రాప్తి యగును: చేష్టరహిత స్థితియే – ఇంద్రియ విషయవాసనలు, సంకల్ప వికల్పములు లేనిదే – ఊరక యుండునది – మౌనంతో శివానందమగును. ఈ ఆనందస్థితి పొందిన పిదప మరే యోగం అక్కరకు రాదు. ఇట్లు వృత్తులుడిగిన వారు లౌకికులతో చేరకుందురు. ఇట్లున్నవారికే శివానుగ్రహము గిట్టును.

2320. నిర్మల తురీయాతీత సమాధిలో ప్రకాశవంతమైన శరీరం అమరి చిరకాలము జీవించగలరు: ఆత్మయగు తాను శివానంద సమాధిలో ఇముడటచే ఆత్మను చుట్టుకొని పీడించు మలములు తొలగిపోవును. కట్టబడిన బంధములు తొలగి పోవును. పుర్యష్టకములు తొలగిపోయి శివంతో ఏకమైనపుడు, ఆ శ్రేష్టస్థితిలో దోషరహితమై, ప్రకాశముతో ఇమిడి శరీరము చాలాకాలముండును సుమా!!
(పుర్యష్టకములు = పంచభూతములు + మనస్సు, బుద్ధి, చిత్తం (8); ఉపనిషత్తులలో పుర్యష్టకములు = 1. పంచభూతములు, 2. పంచ కర్మేంద్రియములు, 3. పంచ జ్ఞానేంద్రియములు, 4. పంచ వాయువులు, 5. చత్వారి అంతఃకరణములు, 6. కామ్యములు (కోరిక, వాసనలు), 7. అవిద్యా (అజ్ఞానము), 8. కర్మలు (కర్మ ఫలితములు)గా చెప్పబడినవి.)

2321. నిర్మల తురీయంలో ఆత్మ నుండి విడిపోవని అనుగ్రహశక్తి ఉత్పన్నమగును. ఆ స్థితియందు ఆత్మ నుండి విడిపోవని చీకటియూ, ప్రకాశమును నెలకొనియుండును. ఇన్నాళ్ళు ఆత్మలో నెలకొన్న క్రియలు (ఉపాసనాదులు – చిత్త ఏకాగ్రతకు చేసిన సాధనలు), జ్ఞానము పదిలమయ్యే యుండును. ఇటువంటి మారని బద్ధతతో అనుగ్రహశక్తియూ తోడై నిలుచుండును. (నాదశక్తి సహాయమే ఇవియన్నియూ.)

2322. బద్ధములోనూ, ముక్తిలోనూ తోడై వచ్చునది శక్తియే: బద్ధము = బంధించబడి యున్నది – శక్తిని గ్రహించలేని జ్ఞానము; ముక్తి = బంధమునుండి విడిపడి శక్తిని గ్రహించిన స్థితి. ఇట్లు తోడై సహాయపడునది అనుగ్రహశక్తి. ఇన్నాళ్ళు జీవుని మోహములో ముంచి, పిదప తన సహాయముతో జీవుడు ఆత్మజ్ఞానము పొందునట్లు చేసి, జీవప్రకాశమునకు శివప్రకాశమును అనుగ్రహింపజేయును.

2323. ముప్పదిఆరు (36) తత్వము (దేహతత్వము) లన్నియూ గ్రహించలేనివే అగును. స్వస్వరూప జ్ఞానమును ఎరుగవలసిన వాడైయున్ననూ వాటితో నెలకొన్న నేను, దేనిని ఎరుగకయుంటిని. "ఎరుగవలసిన వాడవు నీవే సుమా – నీవు జడము కాదు" అని శక్తిమూలముగా నన్ను నందీశ్వరుడు గ్రహింపజేసెను. పిదప నేను గ్రహించవలసిన వాడినని బోధపరచుకొని గ్రహింపగలిగితిని.
(ఆత్మ వేరు, దేహతత్వము వేరని గురుముఖతః స్వస్వరూపజ్ఞాన (ఆత్మతత్వం)

మెరిగి, తేటజ్ఞానము పొందితిని – రచయిత ఉవాచ.)

2324. నన్ను వానివలె జేసిన జ్ఞానస్వరూప నాయకుదు (శివుదు), దేవతల సమూహమునకు నాయకుదు, మహారత్నము పొదిగిన మహాజ్యోతియూనైన శివుదు, దోషరహిత ఆత్మతత్వములో అనుగ్రహశక్తిగా, నాదశక్తిగాను ఇమిడి, అరూపుడై (నిరాకారుడై) నాలో నెలకొన్నది నేను దర్శించితిని సుమా!! (కర్మానుసారియైన ఈ దేహమందే శివుని సృజించితినని రచయిత చెప్పుచున్నారు.)

2325. ప్రకాశమనునది, చీకటియనునది, పరం అనునది అన్నియూ పరంలో నెలకొన్న కృపయేయగును. ఆత్మతత్వమే కాక ఆ కృప నొనరించు అనుగ్రహశక్తియూ, తేట జ్ఞానములను దాటి (అతీతమైన స్థితిలో) నాదశక్తి వెలుగొంది శివానందం ఏర్పడును. (ఇంద్రియ ప్రజ్ఞలన్నీ మరిగిపోయి నాదశక్తి ఏర్పడుట.)

2326. అనుగ్రహశక్తితో ఆత్మ నెలకొనునపుడు ఇంద్రియ ప్రజ్ఞలన్నీ తొలగి అఖండ వ్యాపకము పొందును: శివానుగ్రహముతో ఆత్మ తన్మయత్వములో మునిగి మహానందమును పొందును. తను సమాధిస్థితిలో అఖండజ్ఞానము పొంది (నాదాంతములో నిరాధార స్థితిలో నెలకొని) అంతా తానన్న జ్ఞానములో (తాను తప్ప వేరొకటి లేదు – అద్వైతం) సమస్త ప్రజ్ఞలు వీడిపోయిన స్థితిలో “మహావాక్యం” తగ్గట్లు అఖండమూ తానేయగును.
(“తత్త్వమసి”యన్న “అది నీవే” మహావాక్య విచారణ “అ బ్రహ్మంమే నీవు” అన్న జ్ఞానములో సృజించియుండుట.)

2327. ఆత్మతత్వజ్ఞానమును బుద్ధిలేనివారికి బోధించవలదు. బోధించవలదు పూర్వజన్మల కారణముగా స్వతహాగా జ్ఞానము పొందినవారికి. ఆత్మజ్ఞానమును విద్యతో గ్రహించి (గురుముఖతః శ్రవణము, మననము చేసినవారికి) అనుభవము లేనివారికి బోధించ వలెను. ఆ బోధ వారికి అనుభవముతో గూడ తమ స్వస్వరూపతత్వమును గ్రహింపజేయును.

2328. ఆత్మ నిర్మలావస్థలో శివునితో చేరి ఇమిడి పరిశుద్ధమగును: “సత్తు, అసత్తు, సత్తాసత్తు”లన్నీ తానేనన్న ఆత్మ మూలకారకులగు “చిత్, అచిత్, శివచిత్” (జ్ఞానముతో, జ్ఞానశూన్యం, శివజ్ఞానము)లుగా మారి, శుద్ధమాయ, అశుద్ధమాయ, నిర్మల తురీయంలో నెలకొని, అవస్థాత్రయంను (జాగ్రద, స్వప్నం, సుషుప్తిలను) దాటి మలదోషములు నివృత్తి పొందినపుడు శుద్ధులగుదురు.
(ఆత్మతత్వము ఎప్పటికీ అసంగం, నిర్వికారము, శుద్ధం, శరీరత్రయ, అవస్థాత్రయ విలక్షణం.)

2329. ఆత్మ అనుగ్రహశక్తితో నెలకొనుటచే తనను తాను గ్రహించి శివునితో ఇమిడిపోవును:

ఆత్మ తనకు తానుగా తన నిజస్వరూపమును గ్రహింపజాలదు. గ్రహింపజాల కుండుటచే తాను జ్ఞానం లేనివాడును కాదు. తన జ్ఞానం అజ్ఞానములో మునిగి యున్నదని తన స్వస్వరూపజ్ఞానము (సత్యం) పొందిన పిదప గ్రహింపగలడు. ఈ రెండు స్థితిగతులు అనుగ్రహశక్తి పదిలమగునపుడే బోధపడును. ఎరిగిన పిదప తానే శివునితో ఇమిడి మహానందము పొందును సుమా!!

(ఆత్మ ముప్పది ఆరు తత్వములతో చేరియున్నప్పుడు అసత్తుగాను, శక్తి అనుగ్రహంతో ఆత్మ వేరు తత్వములు వేరు అన్నజ్ఞానము పొందినపుడు తానెప్పటికీ "సత్" అని బోధపడి "శివసత్తు"తో ఇమిడిపోవును.)

2330. ముప్పదిఆరు తత్వములు (36) వాటి గుణ, చర్యలను నిశితముగా పరిశీలించి జీవించువారికి, సత్యమైన తత్వజ్ఞానము తమ నిజజీవితములో అమరును. అట్లు తత్వజ్ఞానము పొందిన ఆత్మ శివమయమగును. తత్వజ్ఞానము పదిలమగుటచే శివానందము పొంది "శివగతి" పొందుదురు.

2331. ఆత్మ తన స్వరూపజ్ఞాన మెరిగినచో బంధవిముక్తి పొంది, శివుడు చిత్తమున పదిలమై, శివంమే అగును. శివమగుటచే మలదోషము, వాటి గుణములు నశించి పోవును. పునర్జన్మ ఇక ఉండజాలదు. పిదప ఆత్మ శ్రేష్టమైన ముక్తియూ, సన్మార్గ జ్ఞానమును, జ్ఞానచిహ్నములు ఏర్పడును. (ఆత్మ అసంగం, నిర్వికారము.)

2332. శివుని శరీరమే జ్ఞానచిహ్నము (శివుడు, జీవాత్మ విడదీయలేనిది). తన క్రియలన్నియూ మధ్యభాగమున నుండు హృదయంనందే (సకల తలంపులు హృదయమునందే). జీవాత్మ యొక్క ఇచ్ఛలు శివుని ఇచ్ఛలే. సృష్ట్యాది పంచకర్మలకు (సృష్టి, స్థితి, లయ, తిరోధానం, అనుగ్రహం) ఈ ఇచ్ఛయే కారణభూతమగును. కావున ప్రణవయోగులు వారివారి జ్ఞానములో నెలకొని, తమ ఇచ్ఛలను విడనాడి జ్ఞానముద్రలను పొందినవారు సుమా!!

(ఇచ్ఛలు కర్మలను పురికొల్పి, అందు ముంచి, దానినుండి విడుపడునట్లు చేయున దంతయూ శివానుగ్రహమే.)

2333. ప్రాణమునకు జ్ఞానమే సత్యవస్తువు. ప్రాణమునకు ఇచ్ఛలు అభిమానము. ప్రాణమునకు చర్యలు ప్రాణముతో పెనవేయబడిన మాయ. ఇవి అన్నియూ పరబిందులోని సూక్ష్మములు. వీటంతటిని సృజించజేయువాడు శివంమే అగును. కావున ఇవియన్నియూ ప్రాణము యొక్క చేష్టలుగాదు. అన్నియూ అంతరములోని (మనస్సులో నెలకొన్న) శివుని చేష్టలే సుమా!!

2334. అనాదిగా శివమహాత్వము పొందిన జీవునికి ఇచ్ఛ, క్రియలు, జ్ఞాన మరియు తొలగని శుద్ధాశుద్ధ మాయాకార్యములు వలన జరుగునవే!! ఆ జీవుడు

దోషరహితమైన కారణ కార్యతత్వముల నుండి విడుపడినపుడు, అక్షరమైన (క్షీణతలేని) శాంత్యాతీత కళలో నెలకొని శివం అగును సుమా!!

(శాంత్యాతీత కళ = అఖండ వ్యాపకము; మిగతా కళలన్నియూ దీనిలో ఇముడును. జీవుడు దీనిలో శివునితో నెలకొనుటచే కారణ, కార్య, శుద్ధ, అశుద్ధ, మామేయం మొ॥ ముప్పదిఆరు (36) తత్వముల నుండి విడిపడి సర్వవ్యాపకమొందును.)

2335. శివుడు అన్నింటా కలిసియూ, వేరుగాను (అసంగముగా) తోడుగాను, ఉన్నాడని జ్ఞానులు ఎరుగుదురు: అశాశ్వతమైన కార్యవస్తువగు మాయరూపములోను, శాశ్వతమైన కారణమగు పరబిందులోను (జీవుని పరబిందులోనే అన్ని తత్వములు ఇమిడియున్నవి – అందులో శివుని అంశం కూడ ఉన్నది) శివుడు నెలకొని, అన్ని తానై, తాను అన్నిటికీ వేరుగాను, వాక్కునకు అతీతముగాను, దూరముగాను ఉన్ననూ, శివజ్ఞానముతో వానిని సృజించువారికి ప్రాణమునకు ప్రాణముగా నెలకొనును సుమా!!

2336. శక్తియే జీవులకు లౌకిక భోగభాగ్యములు ఇచ్చి, పిదప దైవము యొక్క ప్రేమకు పాత్రులగునట్లు జేయును: ప్రాణులకు (జీవులు) ఇచ్ఛ కల్పించి, మాయలో ఇమిడ్చినది శక్తియే. ప్రాణులు జ్ఞానమయ మగునపుడు ఇచ్ఛలు నశించిపోవును. దైవమునందు ప్రేమ ఏర్పడునట్లు చేసి ప్రాణులకు తానే తోడుండుట వలన ప్రాణులు లౌకిక ఇచ్ఛలు వదలి శ్రేష్టమైన “శివపదం” పొందుదురు.

2337. దైవతత్వముతో ఇమిడి శివమయమైనవాడు పంచ మలదోషములను తొలగించు కొన్నవారే!! అట్లు ఇమడనివారు జన్మదోషములతో కూడి పంచమలములలో చిక్కుకొని చీకటిలో (అజ్ఞానము – బంధములు) ఉండుదురు. ఇటువంటివారు భూమికి, స్వర్గమునకు, నరకములలో భ్రమించి కొట్టుమిట్టాదురు. ఇట్లు భ్రమింప జేయునది కూడ శివశక్తి వలనేనని ఎరుగజాలరు!!

(తన స్వరూపజ్ఞానము (ఆత్మతత్వం) ఎరుగకుండు వరకు, శివశక్తులే ఇచ్ఛలు, బంధము, దుఃఖములు కల్పించి, వీటి వలన ఎటువంటి ప్రయోజనము లేదని బోధపరచి, తేటజ్ఞానము పొందించి, తోడుండి తనలో ఐక్యపరచుకొనునది వారి అనుగ్రహశక్తియే.)

2338. శుద్ధమాయ, అశుద్ధమాయలో చిక్కుకొని దానికి తగ్గట్లు చర్యలు సలుపునదియూ, శ్రేష్టమగు జ్ఞానశక్తి పొంది, జ్ఞానఫలం అనుభవించునదియూ, లేక లౌకిక ఇచ్ఛలకు తగ్గట్లు భోగభాగ్యములు అనుభవించునదియూ, అన్నియూ శివశక్తుల అనుగ్రహమే సుమా!!

2339. పరిపక్వమొందిన జీవుడు (సంస్కరించబడిన జీవుడు = ఆత్మతత్వమే మేలని

తలంచి అనాత్మను త్యజించినవాడు) ఎటువంటి సుఖము లేని నరకమును విడచినవాడు. పరిపక్వమొందిన వారు స్వర్గమును కూడ త్యజించినవారే. పరిపక్వ మొందినవారు మలసముదాయమును త్రోసిపుచ్చినవారే. వారు శివమయమై పునర్జన్మ రహితము చేసుకొన్నవారే సుమా!! (స్వర్గము కూడ పుణ్యం క్షీణించిన పిదప మర్త్యలోకం (భువికి)నకు త్రోసివేయును.)

2340. మంచిబుద్ధి లేనివారు (వివేక, విచక్షణా జ్ఞానము) ఏది ఉపయోగకరమైనది, ఏది ఉపయోగకరము కానిదని గ్రహించజాలరు. మంచిబుద్ధి గలవారు ఏది ప్రయోజనము, ఏది కానిదని విభజించి చూడగలరు. అట్లు విభజించి చూచునది తేట పొందినపుడు జీవులకు సంభవించు అన్ని చెడులు, మంచిని వాని (శివుని) అనుగ్రహము వలనేనని గ్రహింతురు సుమా!!

2341. అనుగ్రహమునకు శివశక్తి, ఉష్ణతత్వం వీడని అగ్నివలె, వారు వస్తు ప్రపంచముగాను, జ్ఞానప్రపంచము గాను ఉన్నారు. చీకటి, ప్రకాశము, ముమ్మలములన్నియూ శివశక్తుల వికాశమే (వారి వలన వ్యాపకము చెందినదే). ఆ శివశక్తుల అనుగ్రహ శక్తియే శివానందమును గలుగజేయు ఎర్రని ప్రకాశము.

2342. సూర్యకిరణములతో ఎట్లు పుష్పములు వికశించునో, అట్లే శక్తి అనుగ్రహముచే జీవులు ఉన్నతి పొందగలరు: పరిపక్వము తగ్గట్లు జీవుల తత్వమును మార్చి, సూర్యకిరణము ద్వారా పుష్పములు తమ వృత్తులు చేయునట్లు, పుష్పించి, ఫలదీకరణ చెందుట మొ॥ అట్లే శక్తి అనుగ్రహముచే అన్ని అనుకూలముగా మారును. (పుష్పముల వృత్తులు: తొడిమ, మొగ్గ, పుష్పము, కాయ, ఫలదీకరణం మొ॥ పరిణామం చెందునది.)

2343. దృశ్యమాన జగత్తున చూడబడునవన్నియూ భేదం, అభేదం (ఐక్యత), భేదాభేదములు గాను చూడబడుచున్నవి. ప్రకృతి జ్ఞానం, విద్యాజ్ఞానము, ఆత్మజ్ఞానము తేటపడునపుడు నాదము, నాదముతో కూడిన నాదాంతమను స్థితి చేకూరునగు వన్నియూ, ఆత్మానుగ్రహముతో ఏర్పడిన ఇచ్ఛాశక్తి యొక్క కరుణ వలనే సుమా!!

2344. జ్ఞానశక్తి జీవులకు జ్ఞానమును చొప్పించుటకు తోడ్పడి సహాయమొనరించునది: పోలి ఏనుగును ఆడించునట్లు జీవుని శరీరములో ప్రవేశించి ఆడించునట్లు, పంచ భూతములతో వ్యాపించి ఆడించునట్లునూ, సృష్టాది వృత్తులతో భువి, స్వర్గము, నరకములను మొదలగు భేదములలో ఇమిడ్చి, జ్ఞానము పొందునట్లు చేయునదియూ, జీవునిలో ప్రాణము నెలకొని స్థితి పొందించినదియూ, శివానుగ్రహ శక్తితో ఏర్పడినవే సుమా!!
(పోలి ఏనుగు: బొమ్మ ఏనుగులో మనుజులు ప్రవేశించి, ఏనుగును ఆడించునట్లు.)

2345. తత్తములన్నిటినీ దాటిన స్థితిలో ఆత్మ సర్వము ఎరిగి, అఖండములో నెలకొనును: ముప్పది ఆరు తత్వములకు (36) అతీతముగా ఎదిగి, తన స్వరూపజ్ఞానము పొందినపుడు ఆత్మజ్ఞానము పొందినదై, అన్ని జీవరాశులలో తాను నెలకొనుటయూ, అన్ని జీవరాశులు తనలో ఇమిడియున్నట్లునూ దర్శించును. వీటికి అసంగముగాను నెలకొని బట్టబయలులో నెలకొని అఖండమగును. పూర్వమున్న మోహబంధములు తొలగుటచే తేటపొంది అనుగ్రహశక్తితో శివమగును!!

2346. తత్బోధనము పొందుటకు శ్రేష్టమైనది శివుని దివ్యపాదములందు శరణు, ప్రేమయే. పూర్వజన్మ పుణ్యఫలితముగా ఈ జన్మయందు సజ్జన సాంగత్యమేర్పడి, ఆ శైవ మార్గమునే వెళ్ళి, శివజ్ఞానసాధనలతో షట్చక్రస్థానములు దాటి సహస్రమున నిరాధారములో నిలచి శివునిలో చేరుట అమరునే!! (తత్ పద + బోధనం)

2347. శైవ సజ్జనులందరూ శివునితో గూడిన సిద్ధులు, సమాధిలో నెలకొన్నవారే. ఈ శైవ సజ్జనులందరూ శివజ్ఞానమును గ్రహించినవారే. ఈ శైవసజ్జనులందరూ శివుని ఎడ ప్రేమ సలపి శివానందమును అనుభవించుదురు. పిదప వీరు నాదాంతమున నెలకొని శివ అనుగ్రహమును పొందుదురు!!

2348. శుద్ధ కేవల స్థితిలోయున్న వీరు శివుని వేరుగా భావించజాలరు: తానన్నది వేరు, శివుడనునది వేరని భావించుదురు "సకలురు". తాననునది, అతననునది రెండుగా లేదు. రెండు తత్వములు ఒక్కటేయని భావింతురు అనుగ్రహ కేవలస్థితిలో యున్నవారు. ఇట్లు ఆత్మకు దేహభావన తొలగి (తత్వములన్నిటినీ త్రోసిపుచ్చిన) "శివం" అగుట "శుద్ధకేవల" తత్వమగును.

2349. తనలోనే తన సత్యమును (ఆత్మతత్వము = నిత్యం–ఏకం–సత్యం – ఏ వికల్పములు, వికారములు లేనిది) గ్రహించువాడు తత్త్వశుద్ధి పొందిన ఆత్మ; తనలోనే తన నాయకుడైన శివుని గ్రహించి (శివం, బ్రహ్మం, ఆత్మ పర్యాయపదములే) దర్శించనగును; ఇట్లు తనలోనే తన్ను (స్వస్వరూపజ్ఞానం) గ్రహించి నిలుచున్నవారు, తనలోనే తన నాయకుని పొందుటకు శ్రేష్టమగును సుమా!!

2350. శివానుగ్రహం గిట్టలేదని చింతించక జ్ఞానతత్వములో నిలచినచో, శివుడు తానే వచ్చి స్వయంజ్యోతిగా నెలకొనును: ముందు మంత్రములో చెప్పినట్లు అనుగ్రహం ప్రాప్తించలేదని దుఃఖించవలదు. జ్ఞానమార్గమున వెళ్ళి, నెలకొని అనుగ్రహం పొందినచో, ఇన్నాళ్ళూ రెండు కళలను (సూర్యకళ, చంద్రకళలు) నిర్వహించిన ఘనుడు, నా హృదయమున తేజోమయమై, చంద్రమండలములో నెలకొన్నట్లు నీలో కూడా వెలసిల్లును సుమా!!

2351. మట్టి ఒక్కటే పలు విధములైన భాండములుగా మారును (కుండ, ప్రమిద,

పాత్రలు, కూజా మొ॥). అట్లే దైవమొక్కడే, పలు జీవరాశులుగా మారియున్నాడు. కన్ను ఒక్కటే, సర్వమును చూచుచున్నది. కాని తన్ను తాను చూచుకొనజాలదు. అట్లే ఆ మహోన్నతుడు అన్ని జీవరాశులు తానై అన్నిటినీ గ్రహించినవాడైనను (సర్వజ్ఞుడు) తను ఎవరిచేతను గ్రహింపబడడు సుమా!!

(ఇంద్రియ ప్రజ్ఞలకు, ఏ ప్రమాణముల చేతను గ్రహింపబడజాలడు.)

2352. మనస్సులోని శోకమును నివారించి శివుడనుగ్రహించును: దైవము ఏడేడు లోకములలోనున్న జీవరాశులలో ఇమిడి రక్షించుచున్నాడు. చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రతతో ఉన్న తత్వజ్ఞానులు ఈ సత్యమును అనగా ప్రాణమునకు ప్రాణముగా నెలకొన్న తత్వశ్రేష్టతను విశదీకరించి చెప్పుదురు. శివునిని చిత్తమున పదిలపరచు కొననివారికి శివుడు గ్రహింపబడజాలడు. చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత పొందనివారు శివుని పొందగలరో? పొందలేరు సుమా!!

2353. లక్ష్యం ఎరుగనివారు లక్ష్యం పొందజాలరు. లక్ష్యం ఎరుగనివారు దేహముతో గూడిన పెక్కు జన్మలు పొందుదురు. లక్ష్యం ఎరిగి, అందు నెలకొన్నవారికి అదే గ్రహించదగు "హంస" అగును. (లక్ష్యం = అత్మ తత్వమెరుగుట; దేహభావన లున్నంతవరకు పునర్జన్మలు ఏర్పడును; హంస = హం = నేను, సః = అతను (శివం) హంస భావన (అద్వైత భావన) = నేనే అతను; "అహం బ్రహ్మాస్మి" – శ్రుతి మహావాక్యం.)

2354. ద్వైతభావనలో నున్నవారు పునర్జన్మలకు లోనగుదురు. నిర్మల తురీయంలో నెలకొన్నవారు తన్ను మరచి ప్రకాశములో నెలకొని, అమృతత్వస్థితి (మరణము లేని) పొందుదురు: శివానందమును పొందునది దేహమా? ప్రాణమా? ఏది? ఆకాశరూపియగు శక్తిని గ్రహించి అందు నెలకొననివారు, తామే అన్నీ గ్రహించిన వారని ప్రలాపములాడుదురు. ఇట్లున్నవారు పైబడి వచ్చు జన్మలలో తగుల్కొని, జన్మలను తొలగించుకొనుటకు తెలియనివారే సుమా!! (ఆకాశరూపిణి: సహస్ర దళమందు నెలకొన్న శివశక్తి, నాదము, నాదాంతములగు ఆత్మజ్ఞాన తత్వమే.)

**నిర్మల తురీయావస్థ యొక్క సంక్షిప్తం:** ఇది జాగ్రదాది అవస్థాత్రయమును దాటిన స్థితి. ఇది ఆత్మతత్వములో (సమాధి) నెలకొనునది. ఆత్మ ఎప్పటికీ అసంగం, శాశ్వతం, సత్యం, నిర్వికారము, గుణత్రయాతీతం, అఖండం. ఇది స్వతహాగా స్వయంప్రకాశకం, చైతన్యం, సాక్షిగా అన్నిటికీ కారణభూతం. ఆత్మ జగత్తు, శారీరక వ్యవహారములను అనాత్మ (దేహేంద్రియ మనోబుద్ధులు) ద్వారా జరిపించును. కాని ఆత్మ అసంగము, అకర్త, అభోక్త. తానుగా ఏ వృత్తులు సలుపజాలదు. ఇది పారమార్థిక సత్యం. కావున జీవుడు తాను మనోబుద్ధులు కానని, దేహంద్రియములు కానని త్రోసిపుచ్చి, మలదోష త్రయముల నుండి

తనను విడిపించుకొని సత్య, ఆనంతతత్వమగు ఆత్మతత్వములో (సమాధిలో) నెలకొని స్థితి పొందవలెను. అపుడు పారమార్థిక సత్యం బోధపడి, శ్రేష్టత పొంది, పరిపక్వపడిన ఆత్మగా మారి, అమృతత్వమగు పరమానందమును, శాశ్వతత్వంను అనుభవించి, తనను అతనిగా (శివం) ఏకమై, పునర్జన్మ రహితమై, ఇక శివం, తానన్న రెండులేని అద్వైతస్థితి పొందును.

## 14. బుద్ధోదయం

(ఆత్మకు ఇంద్రియ ప్రజ్ఞల ఎరుకయే కాక అన్నిటిలోని సత్యమును గ్రహించగల విజ్ఞానము కూడ గలదు.)

2355. ఆత్మయగు తనను తానెరిగినచో ఎటువంటి కీడు లేకుండును (ఇంద్రియాదుల చాపల్యత కీడు). తనను తాను గ్రహించక నాశనమగుచున్నాడు (ఇంద్రియాదుల విషయ వాసనలలో తగుల్కొని). తనను తాను గ్రహించిన పిదప (ఇంద్రియ కరణములు కాదని త్రోసిపుచ్చి, తానే ఒక ప్రకాశస్వరూపుని) తానే ఒక అర్చించదగ్గ వానిగా వెలసిల్లెను. (లౌకికులందరు అటువంటివారిని పూజించుదురు.)

2356. ముందు మంత్రములో చెప్పినట్టు, ఆత్మజ్ఞానము పొంది తన్ను తానెరిగిన ఆత్మను దేవాదిదేవతలందరూ నమస్కరించెదరు. సింహాసనముపై శివుడే ఆశీనుడైయున్నాడని తలంచి, శంఖనాదము, గాజులు, కాలి అందెలతో శబ్దములు ఏర్పరచియూ, దట్టమైన కురులు గలిగిన పరాశక్తియూ కీర్తనలు పలికినదే!!

2357. అనుగ్రహము పొందిన ఆత్మ తానే ఒక జ్ఞానియని గ్రహింపగలుగును: అన్నిటినీ కరణములు లేకయే గ్రహించగలమన్న ఎరుకలేనివాడినై యున్నప్పుడు, నా నిజ స్వరూపమే జ్ఞానరూపమైనదని నందీ (శివుడు) బోధించెను. నేనొక జ్ఞానస్వరూపుడని, ఇది తప్ప వేరేమీ కాదని నన్ను గ్రహింపజేసెను. నేను స్వతహా జ్ఞానమయుడని గ్రహించి (ఇంద్రియ కరణములను త్యజించిన) జ్ఞానుడై యుంటిని!!

2358. జ్ఞానమునకు క్షీణత (నాశనము) లేదు, పుట్టుకయూ లేదు. జ్ఞానమునకు జ్ఞానం లేమి ఆధారము కాజాలదు. కావున జ్ఞానరూపియైన ఆత్మకు, జ్ఞానప్రకాశుడైన శివుడు తప్ప వేరే ఆధారము లేదు. జ్ఞానము జ్ఞానమునే చివరకు కోరుకొనునని ఉపనిషత్తుల ఉవాచ. (ఇందు జ్ఞానమనునది ఆత్మగా భావించవలెను – జీవాత్మ పరమాత్మతో ఐక్యమునే కోరును.)

2359. పరిశోధించి చూచినచో ఆధారకమలములన్నిటి కంటే శ్రేష్టమైనది అనాహత చక్ర కమలమునకు పైనున్న విశుద్ధి చక్ర కమలమే. కంఠమున వ్యాపించిన ఈ విశుద్ధి చక్రము పదహారు (16) రేకులతో కూడినది. ఇచ్చట శుద్ధమైన ఆత్మజ్ఞానము శివానందముగా అమరి, దానిని దాటి మహాజ్ఞానముతో కలియును.

(సూక్ష్మ శబ్దరూపములో నున్న నాదము చక్రములలో పరా, పశ్యంతి, మధ్యమ స్థానములు దాటుకొని స్థూల శబ్ద రూపముగా విశుద్ధి చక్రంలో "వైఖరి"గా రూపొందును. ఈ వైఖరియే శబ్ద ప్రపంచమునకు నాదముగా (స్థూల, సూక్ష్మ శబ్దములుగా) వెలుగొంది సహస్రమున వెలయు శివునిలో లయమగును.)

2360. శివధ్యాసలో సదా సర్వకాలము నెలకొనియున్నవారి దరి చేరితిని. శుద్ధమాయా కార్యమగు నాదతత్వములో వెలయువానిని (శివుని) నా చిత్తమున పదిలపరచు కొంటిని. ఆ నాయకుడునూ (శివుడు) బంగారు ప్రకాశముతో వెలసిల్లి నాలో నెలకొనెను. ఆ మహా దివ్యత్వము నిండిన దివ్యశరీరముతో పెనవేసుకొని నిలుచుంటిని. అప్పుడు అతను నన్ను "నీవూ గొప్పవాడివే సుమా" అని అనుగ్రహ భాష్యం పలికెను. (సాకార రూపములోనున్న జ్ఞాని చలన దైవము; నిరాకార రూపములో నున్న దైవము స్థిరదైవము.)

2361. ఆత్మజ్ఞానమే మహాశ్రేష్టమైన జ్ఞానమని గ్రహించి అందు ప్రేమ సలపండి. ఆ జ్ఞానము అఖండ జ్ఞానముగా నెలకొన్న శివుడు మీ చిత్తమున పదిలమగును. మీ జ్ఞానము వాని జ్ఞానముగా (అఖండంగా) ఏర్పడినపుడు "అణిమాది సిద్ధులు" తనంతటగా వచ్చి మీలో నెలకొనును. అపుడు శివుడు మీ జ్ఞానమును తన జ్ఞానముగా చేసుకొని అనుగ్రహించును సుమా!!
(ఇంద్రియ ప్రజ్ఞలు = జ్ఞానం; ఆత్మజ్ఞానం = విజ్ఞానం.)

2362. శివజ్ఞానము మీలో నెలకొన్న పిదప లౌకికజ్ఞానము ఎటువంటిదో మీకు బోధపడును: లోకులు జ్ఞానం, జ్ఞానమని ఎడతెరిపి లేకుండా ప్రయాసలు పడుదురు. వారు చెప్పునదంతయూ బుధజ్ఞానము (బంధము కల్పించు బుద్ధి) అజ్ఞానముతో కూడినది. బంధబుద్ధిని తొలగించుకొని, దాటి శివజ్ఞానములో అమరినచో, జీవరాశులందుండు బంధజ్ఞానము ఎంత లక్షణమని బోధపడును సుమా!!

2363. అజ్ఞానం వీడినవాడే మహాజ్ఞానంలో నెలకొని విముక్తి పొందినవాడగును. జ్ఞానమును (ఇంద్రియ ప్రజ్ఞలు) అజ్ఞానంను (బంధము) విడుపించుకొన్నవాడు, ఇంద్రియ ప్రజ్ఞలను దాటి అఖండముతో ఏకమగునపుడు సమస్త జ్ఞానము విజ్ఞానములో నెలకొని ఏకమై, తానే శివజ్ఞానంతో ఏకమై, విముక్తి పొంది, శివంమే అగును సుమా!!

2364. జ్ఞానుల మనస్సే శివుడు నెలకొన్న దేవాలయము: జ్ఞానుల మనస్సే వ్యాప్తి చెందిన ప్రపంచమగును; ఆ మనస్సే మహాతపస్సుతో నిండినది. జ్ఞానుల మనస్సులో ఆది పరాపరుడైన పరమేశ్వరుడు దేవాలయముగా మార్చుకొని వెలసియున్నాడు సుమా!!

2365. నారాయణుడు, బ్రహ్మ, రుద్రుడు యగు త్రిమూర్తులుగా, శరీర ఉత్పత్తికి కారణ

భూతుడైన పరమేశ్వరుడుగా, సుదూరముగాను, అతి సమీపముగాను, అతి మధురమైన చెఱకుగాను, అమృతముగాను వెలసి మధురముగా ఉన్నాడు.

2366. నేను అజ్ఞానపు బంధములో చిక్కుకొని ఉన్నన్నాళ్ళు నా స్వస్వరూప జ్ఞానమును (స్వయం ప్రకాశకము) ఎరుగకయుంటిని. నేను ప్రకాశ స్వరూపుడేనని ఎరిగిన పిదప కూడ పూర్వవాసనా తత్త్వములను (చిత్తమున పదిలమైనవి) గ్రహింపకుండితిని. అట్లు నేను స్వస్వరూప సత్యమును ఎరుగుటలో నా నాయకుడు నాకు తోడుండే అన్నీ (మంచి చెడులను) గ్రహింపజేసి వినుచూ నెలకొనియున్నాడే!!

2367. మాయదీపము మాయను కల్పించుచున్నది (సత్యతత్త్వమును ఎరుగనీయక బంధములలో ముంచునది). శుద్ధదీపము తేజస్సుతో ప్రకాశించును (జ్ఞాన స్వరూపులకు ఆత్మ స్వరూపం ప్రకాశముగా వెలుగుచుండును). కాయ దీపము నిలచి ఉష్ణమును ఏర్పరచును (శరీరములో ఇమిడి జఠరాగ్ని, కామాగ్నిగా ఉండి ఉష్ణమును పుట్టించును). దివ్యదీపమును నేను వెతకుచున్నానే!! (ఆ దివ్యజ్యోతిగా వెలుగొందు దీపమును నేను వెతుకుచున్నాను. అన్ని దీపములు శివుని తత్త్వములే.)

2368. అష్టదిక్కులలోను, ఊర్ధ్వ, అధో దిశలయందు శివజ్యోతిని వెతుకుచున్నాను. ప్రేమే రూపముగా ఉన్నవాని దివ్యపాదముల దరి కోరుచున్నాను. పరమాత్మయే తగిన తోడుయని వానిని స్తుతించి పాడుచున్నాను. కోరికలు లేని మనస్సుతో (నిష్కామ్యముగా) ఆ పరమాత్మతో కలియుచున్నాను.

2369. బ్రహ్మ సృష్టాది మొదలుకొని సృష్టించబడిన జీవరాశులకు, పిదపనే వాటికి అహంకార (నేను, నాదన్న మమకారం) మలము జనించినది. అవి వాటిని హరుని అనుగ్రహముతో తొలగించుకొని, ఆత్మతత్త్వము గ్రహించి, అనాదియైన పరమేశ్వరుని దివ్యపాదములందు ఇమిడి, శివమగుటచే పునర్జన్మ రహితము పొందగలిగితిని!!

## 15. షడాంత్యములు

(ఆరు అంత్యములు: కళాంతం, నాదాంతం, యోగాంతం, బోధాంతం, వేదాంతం, సిద్ధాంతం అనునవి)

2370. వేదములకు అంత్యములైన ఉపనిషత్తుల ఉవాచయూ (ఏకత్వమును బోధించునది), శ్రేష్టమగు సిద్ధాంతము – శైవ ఆగమములలో ముగింపునూ, నాదాంతము – నాదతత్త్వపు ముగింపునూ (ఇది అనుగ్రహముతో గిట్టునది), సద్బోధాంతము – “సత్” విచారణతో ముగియునదియూ (నేనెవరన్న విచారణతో ముగియునది), యోగాంతము – అష్టాంగయోగము వలన గిట్టునదియూ (యమ, నియమాది అష్టాంగయోగం వలన), కళాంతము – పంచకళలకు ముగింపుయూ (నివృత్యాది పంచకళలకు ముగింపుయైన శాంత్యాతకళ పొందునదియూ) ఇట్లు చెప్పబడిన

ఆరు రకములైన అంత్యములు (ఆరు విధమార్గము (సాధన)లైనను సాధ్యమొక్కటే; అనగా లక్ష్యతత్వమొక్కటే సుమా!!)

2371. ఆరు అంత్యములను తనలో గ్రహించువారు మేలైన శుద్ధ తత్వమును ఎరిగిన వారగుదురు. తమలో మలదోషములను నివృత్తించుకొన్నవారే ఆరు అంత్యములను గ్రహించగలరు. ఈ ఆరు అంత్యములను ఎరుగనివారు ప్రపంచములో జరుగు సృష్ట్యాది లయములను ఎరుగజాలరు.

2372. ఆత్మ తురీయంలో పరాపరునితో నెలకొని మలదోషములను నివృత్తించుకొన్నదే వేదాంత, సిద్ధాంత ముగింపు: "నేనే బ్రహ్మం" అన్నది వేదాంతం. శివం నేనన్నది సిద్ధాంతం. నిశ్చలమైన తురీయంలో ఆత్మ తన యదార్థ స్వరూపమగు ప్రకాశమును దర్శించి, తేనెవంటి పరాపరముతో చేరి శివునితో ఇముడుటచే, తన మలదోషములను నివృత్తింప జేసుకొని సిద్ధి పొందును.

(తానగుటయే వేదాంతం – "అహం బ్రహ్మాస్మి" నేనే బ్రహ్మం; "శివత్వమసి" – నీవు శివం అయితివి – సిద్ధాంతం; వాక్యములు రెండైననూ పొందు తత్వమొక్కటే.)

2373. అఖండమైన శివునిలో ఇముడటచే ఆత్మ శివం అగునది సిద్ధాంత లక్ష్యం: ప్రాణం నిర్విరామముగా శివునితో ఇమిడి, నిలిచి, సుదీర్ఘముగా పయనించు మనస్సు, శబ్దాది పంచప్రజ్ఞల నిజతత్వమును బోధపరుచుకొని, శుద్ధమాయ, అశుద్ధమాయ అంటకుండునట్లు జాగ్రత్తపడి, నాయకుడగు అనాదితత్వమును పొందునదే సిద్ధాంత తత్వమగును. (మనస్సు ఇంద్రియ ప్రజ్ఞలతో నెలకొన్నపుడు జగత్తు వ్యవహారములన్నీయూ గలవు. అదే మనస్సు నాదంతములో నెలకొన్నపుడు మనస్సు, ప్రజ్ఞలు, అవస్థాత్రయం, దేహత్రయం అన్నియూ నశించి అఖండమైన శివునిలో నెలకొనుటయే సిద్ధాంత లక్ష్యతత్వము.)

2374. నాదాంతములో నెలకొన్నవారికిక పునర్జన్మలుండవు: పంచకృత్యములతో నెలకొనియున్న బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, తిరోభావన మేర్పరచు మహేశ్వరుడు అనుగ్రహించు సదాశివులందరినీ దాటి అవతలకి, అవతలగా నుండు పరబిందు, పరనాదమును దాటి, ముప్పది ఆరు తత్వములను త్రోసిపుచ్చిన స్థితిలో, అణువొక్కటే (ఆత్మ) ఉండును సుమా!!

(పంచకృత్యములు, దేహతత్వములు తొలగి, సూక్ష్మ తత్వములు నశించుటచే స్థూలమగు కార్యము కూడ నశించి పునర్జన్మలిక ఉండజాలదు.)

2375. ముప్పది ఆరు (36) తత్వములు తొలగిపోయి నాదాంతము యొక్క బోధాంతము ఏర్పడును: ముందు మంత్రములలో చెప్పినట్లు ముప్పదిఆరు (36) తత్వముల ఉపాధుల బంధముల నుండి విడిపడి, తేటపొంది, నాదాంతమును దాటి, పైగా

చీకటిగా నుండి అజ్ఞాన, అహంకార మలములను తొలగించుకొని శివునియందు స్థితి పొంది నిలచినచో నాదాంతమున కీడులేని బోధము సిద్ధించును!!
(గుణత్రయం, అవస్థాత్రయం, దేహత్రయం, పంచభూతాత్మక తన్మాత్రలు, అంతఃకరణములన్నియూ ఆత్మసత్య తత్వమును మరిపించి తామే ఆ ఆత్మయని జీవుని భ్రమింపజేసి బంధములలో ముంచు వివిధ "ఉపాధులు" – "ఉపాధులు" ఎప్పటికీ జడం, మిథ్యాతత్వము, అశాశ్వతములు. ఇవియన్నియూ ఆత్మ ప్రకాశమును, చైతన్యమును అందిపుచ్చుకొని, జీవ, జగత్తులో వృత్తులు, వ్యవహారములు సలుపుచున్నవి. ఆత్మ ఎన్నటికీ శాశ్వతం, సత్యం, శుద్ధం, చైతన్యం, అసంగం, అకర్త, అభోక్త. కావున దేహతత్వములన్నీ "ఉపాధులు", ఆత్మ "ఉపరహితం"గా శ్రుతుల భాష్యం.)

2376. అష్టాంగయోగ మార్గమున వెళ్ళి శివునియందు (శిరస్సున సహస్రదళ పద్మములో) స్థితి పొంది "ఉపశాంతం" పొందుటయే యోగాంతమనునది: జ్ఞానుల ద్వారా బోధింపబడిన యమ, నియమాదుల అష్టాంగములతో యోగమార్గం అవలంభించి, సమాధిలో నెలకొని అందు వికసించిన శివతత్వంలో ఇమిడి, జీవుని బంధములన్నీ తొలగించుకొన్నపుడు "ఉపశాంతం" స్థితిలో ఉండునదే యోగము యొక్క అంత్యమగును. ("ఉపశాంతం" = ఎటువంటి ఆసక్తులు లేని స్థితి.)

2377. నివృత్యాది కళల ద్వారా వెళ్ళి బిందులో ఇమిడి తేట పొందునదే కళాంతమగును: సాధన సిద్ధాంతములో చెప్పబడు కళాంతమును పరిశోధించినచో, త్రోసిపుచ్చవలసిన నివృత్తి మొదలగు కళలు, మేదాది ప్రసాద కళలన్నియూ అంతరమున నెలకొన్న బిందుశక్తిలో ఇముడటయూ, తేటజ్ఞానం పొంది పరిపక్వత పొందుట కొరకే సుమా!!
(తొలగించవలసినవి: నివృత్తి, ప్రతిష్ఠ, విద్యా, శాంతి, శాంత్యాతీతం (5); మేధా, అర్ఘీశం, విషం, బిందు, అర్ధచంద్రం, నిరోధిణి, నాదము, నాదాంతం, శక్తి, వ్యాపినీ, వ్యోమరూపిణి, అనంత, అనాథ, అనాశ్రిత, శమన, ఉన్మణ (16). కొన్ని తమిళ పేర్లకు తెనుగు అనువాదము తెలియలేదు.)

2378. నివృత్యాది, మేధాది కళలను నివృత్తింప జేసుకొనుట గురించి పరిశోధించినచో, ఇవియన్నియూ మరొక సమూహమగు పంచకళలు (5) వలన ఏర్పడినవని బోధపడును. అట్లు గ్రహించినవారు శివుని కృప వలన కలిగిన మంత్రము, తంత్రము, తేటనైన పరిపక్వత, ఉపదేశము, జ్ఞానములగు ఐదింటిలో ఇముడును సుమా!!

(1. మంత్రము: పంచాక్షరి మంత్రోపాసనలు ద్వారా పొందునది.

2. తంత్రము: ముద్రలు, యజ్ఞం, పూజలు మొదలగువాటితో.

3. పరిపక్వత: తేట పొందునది, తత్వవిచారణ, వివేక వైరాగ్యములతో.
4. ఉపదేశము: మౌనోపదేశముతో ఏర్పడునది.
5. జ్ఞానము: జీవ–ఈశ్వర ఐక్యజ్ఞానము – శ్రుతులలో చెప్పినట్లు.
మొదటి రెండు సామాన్యములనియూ, తదుపరి రెండు విశేషములనియూ, వీటితో పొందునది ఐదవదైన జ్ఞానమని చెప్పబడినది.)

2379. అనాదిగా యున్న కళలు ఆగమములు, వేదములేయగును. తంత్రకళల యనునది ఆగమ, శ్రుతులందు చెప్పబడిన విధివిధానములలో నిలబడుట. అనాత్మను కాదని ఆత్మయే సత్యమన్న తేట వివేకము. ఇవే శివుని బోధపరచు తేటనైన బుద్ధి లేక జ్ఞానము అగును.

2380. శివుని కళలను బోధపరచు కొన్నవారు అంత్యమున "మౌన అనుభూతి" పొంది శివం అగుదురు: శివజ్ఞాన కళయనునది మహాజ్యోతి రూపముగా నుండి శివమే యగును. కావున దీని అనుష్టించుచూ వచ్చినవారు అంత్యమున "మౌన అనుభూతి"తో తమను వేరుగా చూచు భ్రమను వదిలించుకొన్న జ్ఞానులగుదురు. వాక్కుకు, మనస్సుకు అందని "మహానంది" శివమే అగుదురు.
(కళాంతమున శివునిలో ఇముడుటచే అక్కడికి మాటలు, మనస్సు వెళ్ళజాలవు. "నవాగ్గచ్ఛతి నమనః" – కేన ఉపనిషత్తు వాక్యం.)

2381. ఆత్మ సమాధియందు జ్ఞానముతో శివమే యగును: సమాధి నిష్ఠయందు నెలకొనుటచే జీవుడు శివం యగును. పెక్కు సాధనలతో ఏర్పడిన కళాంతం, నాదంతం, యోగాంతము, బోధాంతము, వేదాంతం, సిద్ధాంతంలన్నియూ జ్ఞానమై జ్ఞేయ, జ్ఞాతులగును సుమా!!
(జ్ఞానం – దృశ్యం – చూచుట
జ్ఞేయం – దృశ్యవస్తువు – చూడబడు వస్తువు
జ్ఞాతు – దృశ్యం చూచువాడు – దృక్ – చూచువాడు
చూడబడు దృశ్య ప్రపంచమంతయూ మిథ్యయే – అనిత్యం, సవికార తత్వములు: అంత్యముగా చూచు జ్ఞాతు ఎప్పటికీ సత్యం – నిత్యం, నిర్వికారం. చూచువాడే ఎప్పటికీ దృక్. అదే ఆత్మ – సాక్షిగా అన్నీ చూచునది. – త్రికాలేపి తిష్ఠతి. "దృగ్గేవ న తు దృశ్యతే – దృక్దృశ్య వివేకం – ప్రకరణ గ్రంధవివరణ, శంకరభాష్యం.)

2382. గురుముఖత జ్ఞానమును పదిలపరుచకొన్న స్థితిలో శివానందము అమరును: పైన చెప్పిన ఆరు అంత్యములును ప్రేమతత్వములోనే లీనమగును. ఆరు అంత్యములలో పొందదగిన జ్ఞేయంలన్నీ జ్ఞాతులలో (జీవాత్మ) ఇముడును. గురుముఖముగా సత్యరూపమును పదిలపరచుకొని శివం కాని తత్వములను

త్రోసివేయుము!! తేట జ్ఞానముచే శివానంద సత్యము నీకు అమరును గాక!! (జ్ఞానము మౌనంలో అమరును.)

2383. యదార్థముగా ఆరు అంత్యములగు కళలన్నియూ ప్రణవ పంచకములో ఇముడును. యధార్థముగా కళాంతములు 2 పంచకముతోనూ సప్తవిద్యాతత్వములో ముగియును. యధార్థమైన శివకళ ఏకమైన (ప్రణవ) నాదాంతమున ఇముడును. యధార్థముగా అన్ని కళాతత్వములు ఏకమైన "సత్యం"లో ఇముడును.

(ప్రణవ పంచకం: అ, ఉ, మ, బిందు, నాదము;

నివృత్యాది పంచకం: నివృత్తి, ప్రతిష్ఠ, విద్యా, శాంతి, శాంత్యాతీతం;

సాధన పంచకం: మంత్రము, తంత్రం, పరిపక్వత, ఉపదేశం, జ్ఞానం;

నివృత్యాది, సాధన పంచకములన్నీ క్రియా మార్గమున వెళ్ళువారికి, ప్రణవ పంచకం జ్ఞానులకు చెప్పబడినది. అన్ని తత్వములు సత్యస్వరూపమైన, నిత్యమైన నిర్వికారమైన శివంలో / ఆత్మతత్వములో ముగియునవి.)

2384. జీవాత్మలను ఆదుకొనుటకు హరుడు వచ్చి పదిలమైన పిమ్మట, దేవాదిదేవతలు కొలుచు ఆ పరమేశ్వరుని దివ్యచరణములను నా శిరస్సుపై దాల్చి, క్షీణత లేని వేదాంత, సిద్ధాంతముల శ్రేష్టతను నాదముతో బహిర్గతం చేసిన ఆ శివ గురునాధుని గ్రహించండి!! (శిరస్సున సహస్రమునకు చేరిన జీవశక్తి (కుండలినీ) శివునిలో ఇమిడినది గుర్తించి, చిత్తమున పదిలపరచుకొనవలెను.)

2385. జీవాత్మల పరిపక్వత తగ్గట్లు సంస్కారములు అవసరమగును: కొలుచువారికి కొలుచుటకు తగ్గట్లు, శివుడు అనుగ్రహించిన ఆగమములలో బోధించుటకు తగ్గట్లు మాయ, మహామాయ మొదలగు వాటి తత్వములను విశదీకరించునది వేదాంత, సిద్ధాంత తత్వములగును. (మాయ = అశుద్ధమాయ; మహామాయ = శుద్ధమాయ. వీటిని బోధపరిచిన ఆగమ శాస్త్రములు కొంచెము కొంచెముగా జీవుని కామ్య కర్మల నుండి, కర్మ, ఉపాసనల ద్వారా, పిదప నిష్కామ్య కర్మలు చేయించి, వాటి ఫలితములు బోధించి గురుముఖత సత్యరూపమగు శివుని గ్రహింపజేసి, ఆధ్యాత్మిక పరిణామక్రమ సోపానమును బోధించునని చెప్పబడినది.)

2386. వేదాంతము, సిద్ధాంతము రెండునూ మార్పులేని ఒకే తత్వమును బోధించునది. బోధాంతము (ఆత్మజ్ఞానం) ముగింపే జ్ఞానమగును. యోగాంతము సాధారణముగా జ్ఞేయంను తెలుపునది (గ్రహింపవలసిన దానిని తెలుపునది). నాదాంతము బ్రహ్మానందమును ఉదయింపజేసి (ఉత్పన్నం చేసి) శబ్దించునది (సహస్రమున సూక్ష్మనాదంగా). ఇదే అనాదిగా, పురాతనమైన ముద్రయగు ప్రణవ సమాధిలో (మౌనంలో) గిట్టు తత్వమగును సుమా!!

2387. జీవుడు కార్య ఉపాదులగు అనాత్మను (దేహేంద్రియ మనోబుద్ధులు, పంచభూత తత్వములు) వీడి శివం/బ్రహ్మం/ఆత్మ తత్వముతో ఐక్యంయే వేదాంతము: వేదాంత తత్వములో జీవుని గల కార్యఉపాధులగు ఏడింటి సంకెళ్ళనుండి విడుపడిన వెంటనే నాదాంతములో పశుతత్వము (శరీర భావనలు) నశించి "త్వం" పదం ఏర్పడును. ఇంకా కారణ ఉపాధులగు ఏడింటి పట్టుతో ఉన్న సత్యరూపమైన "పరం"యే బోధాంతం యొక్క అంత్యమైన "తత్" పదం అగును. పిదప ఈ రెండింటి సమ్మేళనమే (ఏకమైన స్థితి) "అసి" పదం అమరును.

(సద్గురువు పరిపక్వమొందిన శిష్యుని చెప్పునదే తత్+త్వం+అసి="తత్త్వమసి. అది నీవైనావు = బ్రహ్మం నీవు ఒక్కటే.

7 కార్యఉపాధులు: అజ్ఞానం, ఆవరణం, విక్షేపణం, పరోక్షజ్ఞానం, అధ్యారోప జ్ఞానం, దుఃఖప్రవృత్తి, ఆనందరహితం.

7 కారణ ఉపాధులు: శివం/బ్రహ్మం/పరమేశత్వంనకు చెందిన గుణములు: సర్వజ్ఞత తత్వం, సర్వకారణతత్వం, సర్వేంద్రియామిత్వం, సర్వేశ్వరతత్వం, సర్వసృష్టి, సర్వస్థితి, సర్వసంహారం/లయం.)

2388. శివుడు సప్తాండములను దాటియున్న మహాప్రకాశ మండలముతో కలిసియూ, దానికి అసంగముగాను నెలకొని యున్నాడు: ఏడు అండములు దాటి, వాటిని త్రోసిపుచ్చి, అవతలకు అవతలగా యుండు మహాప్రకాశములో అనాదిగా నెలకొని పరాశక్తిగా, తన స్వరూపంలో అసంగముగాను ఏకముగాను నిలుచున్నవాడే మా మహోన్నత నాయకుడు సుమా!!

2389. శివంను సృజించజేయు నాదమును లక్ష్యంగా చేసుకొని, దైవం అనుగ్రహించిన విహిత కర్మలను తన కర్మలేయని భావించి చేయుచూ, స్తోత్రపాఠములను చదివి అర్చన చేయువారికి ప్రణవ కరణములను (అ, ఉ, మ కార, బిందు నాదములను) దాటించి, చేష్టలను అణగద్రొక్కి, శివుడు నెలకొనును.

(స్తుతించు స్తోత్రములే స్థూల మాయను తొలగించి ప్రణవనాదముతో నాదాంతము దాటగలిగినవారికి జీవ ఉపాధులు వైదొలగి శివుడు వారిలో నెలకొనును.)

2390. అఖండ రూపమగు శివుడై అన్ని తత్వములకు నెలవు: ఏకమగు శివుని గ్రహించ జాలరు. ప్రాణం పోసినవానిని గ్రహించజాలరు. ప్రతి జీవునికి వారివారి పూర్వ జన్మ పుణ్య, పాప కర్మలే కారణమని గ్రహింపజాలరు. వారిలో నెలకొన్న ద్విమాయలను (శుద్ధమాయ, అశుద్ధమాయ) గ్రహింపజాలరు. ఏకముగా నిలుచున్న శివుడే జీవుని అంతరమున నెలకొని ద్వంద్వ కర్మలను తొలగించి, నిరాకారుడుగా, అన్నిటికీ ఆధారభూతుడుగానూ ఉన్నాడు సుమా!!

2391. శక్తులు ద్వారానే శివుడు జీవులకు శివానంద మొసగుచున్నాడు. శివుడు తనను ప్రేమించువారిలో స్థితిపొంది, వారు పరిపక్వ మొందునట్లు వారిలో కొన్ని శక్తులను నింపి, అవియన్నియూ శివసన్నిధి వలన వృత్తులు సలుపునట్లు చేసి, జీవుడు సంకల్పరహితమగు నపుడు వారిలో శివానందం ఏర్పరచును.

(సమస్త ఉపాధులు తొలగి సంకల్ప శూన్యమగునపుడు శివానంద మేర్పడును.)

2392. వేదాంతము నందు జీవుడు, శివుడు ఐక్యమగుటయే "శివసాయుజ్యం" అగును: వేదాంతమునందు చెప్పబడు "త్వం" పదము జీవుని పశుతత్వంను (దేహతత్వం) తెలుపునది. నాదాంతమున ఆ పశుతత్వం సహజముగా తొలగించుకొన్నపుడు జ్ఞానము యొక్క అంత్యమగు "తత్" పదం అగును. జీవుడు, శివుడు అను రెండు, రెండుగా కాక ఏకమగునపుడు (ద్వైతం నుండి అద్వైతంగా మారి) సహజముగా "శివసాయుజ్యము" అగు "అసి" పదమగునే!! (తత్ + త్వం + అసి = తత్త్వమసి)

2393. వేదాంతము, సిద్ధాంతము రెండునూ జీవునికి పునర్జన్మ రహితము చేసుకొని శివం యగుటకు చెప్పునదే. శ్రేయస్సును గలిగించని బ్రహ్మాది నలువురును (బ్రహ్మ, నారాయణుడు, రుద్రుడు, మహేశ్వరుడు - సృష్ట్యాదిని కల్పించువారు) "శివం" అగు తత్వమగు సదాశివమూర్తి (అరూపమూర్తి) యొక్క ఆజ్ఞ మేరకు తమతమ సృష్టి వృత్తులను విడనాడి ఏకమైనచో, భ్రమలు కల్పించు వేదాంతమే జ్ఞానం నొసగు సిద్ధాంతమగును సుమా!!

2394. సిద్ధాంత శైవమునందు జీవునికి ముక్తి చేకూరుటచే, సిద్ధాంతములో నెలకొన్నవారు ముక్తి స్థితియగు శివత్వము పొందినవారగుదురు. సిద్ధాంతము, వేదాంతము రెండు తత్వములు ఎర్రని ప్రకాశుడైన శివుని సూచించునదే!! కావున సిద్ధాంతము, వేదాంతము రెండు శివునినే దర్శింపజేయును.

2395. దోషరహిత వేదాంత, సిద్ధాంతములు జీవునికి, ఈశ్వరునికి ఉన్న సంబంధమును తెలుపునదే!! శివుని పరమంగాను, జీవునిలో నెలకొన్న అంతరముగాను తెలుపును. దోషరహిత వేదాంత, సిద్ధాంతములైనను, ప్రేమ, సఖ్యతతో నెలకొన్న తురీయాతీత స్థితిలో వెలసిన జ్ఞానం శివమేయగును. ఇటువంటి తపస్సంపన్నతతో చేకూరిన శివజ్ఞానంను గ్రహించినవారు మహాతత్వ దర్శినులు సుమా!!

(ప్రేమ, సఖ్యతతో శివునిలో నిర్విరామముగా స్థితి పొందుటను ఒక అవస్థగా రచయిత చెప్పియున్నారు.)

2396. ఆత్మనాద బిందులకు అతీతముగా ఎదిగినపుడు తత్పదమను శివసాయుజ్యం పొందును: ఆత్మ వ్యాపించియున్న ముప్పది ఆరు (36) తత్వములు రూపముగాను, అరూపముగాను ఉన్నవి. ఇందు ఇమిడియున్న బిందు, నాద తత్వములలో

నెలకొన్నవాడు సదాశివుడు. జీవుని నాదాంతమున నున్నది తత్పదమగు సత్యతత్వము. ఈ స్థితిని అందుకొనడమే శివసాయుజ్యమగును.

2397. వేదము, ఆగమముల అంత్యములు ఒక్కటేయగును: ఈ రెండునూ దైవముచే అనుగ్రహించబడిన సత్యదర్శనములగు గ్రంథములు (అపౌరుషేయములు – మానవ కృతులు కావు). వేదములందు సర్వమునూ, ఆగమములందు శ్రేష్టత్వమును తెలుపును (వేదముల పూర్వభాగం – కర్మ, ఉపాసనలు – కర్మకాండ; ఉత్తరభాగం – జ్ఞానము, మోక్షము – జ్ఞానకాండ; ఆగమములు – వేదోక్తమైన శాస్త్రసాంకేతిక విధివిధానములు తెలుపునది). పరమేశ్వరునిచే అనుగ్రహించబడిన పైవాటి అంత్యములు వేర్వేరుయని కొందరందురు. కాని సత్యతత్వ దర్శనము చేసిన మహానుభావులు వీటిలో భేదము లెంచజాలరు (అభేదంగా దర్శించుదురు).

2398. జీవస్థితి వీడి పరంలో నెలకొన్న ఆత్మ మహానందమును పొందును: పరమైన జీవుడు పొందు శివానందమంతయూ "ప్రానందము" (పరంతో పొందు ఆనందము). క్షీణించదగ్గ మాయకు లొంగని ఆనందము, శాంభవీ, ఖేచరి ముద్రల ద్వారా ఏర్పడు ఆనందము, శారీరక నాట్యములో దర్శించదగ్గ ఆనందములగు ఈ మూడు ఆనందములన్నియూ పోలి ఆనందములే సుమా!!

(అనగా మానసిక ఉల్లాసముచే ఏర్పడిన కోశానందములే తప్ప, శాశ్వతానందము నొసగజాలదు – శారీరక, పంచకోశములలో ఐదవదైన ఆత్మకు అతి సమీపమున నున్న ఆనందమయ కోశానందము మనోమండలముతో చేరి అనుభవించు ఆనందము – తైత్తిరీయ ఉపనిషత్తు భాష్యం.)

2399. అతనే (శివుడే) పంచాంత్యకుడు (పంచములకు అంత్యముగా ఉన్నవాడు) వేద ఆగమములను భాషించి, కళలకు ముగింపుగాను ఉన్నాడు: కళాంతము అనునది మేధాది పదహారు కళలును, నివృత్యాది పంచకళలగును. నాదాంతస్థితిలో అకార, ఉకార, మకార, బిందు, నాదములగు పంచకములు. హరుడే ప్రణవముగా నెలకొని వీటికి వృత్తులను చేయించుటచే హరుడు పంచాంత్యకుడయ్యెను. వేద, ఆగమములను అతనే భాషించియున్నాడు సుమా!!

(పంచకళలకు శాంత్యాతీతంను, ప్రణవమునకు నాదాంతమును రెండింటికీ శివుడే ముగింపు.)

2400. వేదాంత, సిద్ధాంత తత్వములతో నెలకొని స్థితిపొందినవారు శివుని దివ్య నాట్యమును దర్శించనగును: పంచకళల అంత్యములు వేరువేరుయని తలంచక, అన్నియూ ఒకే స్థితిని తెలుపునదని వేదాంత, సిద్ధాంత తత్వములో నెలకొన్నవారికి, యోగమునకు ముగింపుయగు సమాధి సిద్ధించును. అట్లు సిద్ధించుటచే

దరాకాశమున (శిరస్సు సహస్రదళమున) హరుని దివ్యనాట్యమును దర్శించనగును.

2401. అనాదిగా వచ్చు జీవ బంధ మలములను తొలగించుకొని సత్యతత్వమును (ఆత్మ తత్వము) గ్రహించునదే శివం అని చెప్పునది వేదాంతము. ఇంద్రియ ప్రజ్ఞలను త్రోసిపుచ్చి, తన సత్యస్వరూప జ్ఞానమెరిగి పరంలో నెలకొని శివస్వరూపమై (సకల తత్వములు, అహంకారాది మలదోషములను వీడి) నీరు పాలుతో కలిసి పాలైపోయినట్లు జీవుడు శివంయై పోవుటను వేదాంతము చెప్పు సత్యతత్వమగును. ("ఆత్మ బ్రహ్మంతో కలిసి బ్రహ్మమై పోవుట"; నీరు తనంతట తాను పాలు కాలేదు. నీరు (జీవ బంధములను తొలగించుకొన్న ఆత్మ) పాలుతో (బ్రహ్మం) చేరి, పాలుగా మారిపోవుట. జీవబంధ మలములతో కూడిన ఆత్మ (నీరు) తనను మార్చుకొనని యెడల నీరుగానే జీవితాంతం ఉండిపోవును. "అహం బ్రహ్మోస్మి" తత్త్వ విచారణ – శ్రుతివాక్యం.)

2402. ప్రాణంను (జీవాత్మ), పరంను, శ్రేష్టమగు శివుని దోషరహితమై నిస్సంశయముగా "నేను అది అయితిని" = "త్వం+తత్+అసి" అని ఎరుగుము. జీవాత్మ తన ఇంద్రియ ప్రజ్ఞలన్నిటిని, మలములను విడిపించుకొని, జ్ఞానమే స్వరూపముగా గల శివంనందు స్థితి పొందునదే నిస్సంశయమైన వేదాంత, సిద్ధాంతమగును.
(తమిళ పద్యములో ప్రాసల కొరకు ప్రాణం, పరం పదము వాడబడినది. ప్రాణం = జీవాత్మయేయని గ్రహించవలెనని మనవి.)

2403. పై మంత్రములో చెప్పినట్లు స్థితిపొందిన (శివంలో) ఆత్మ అఖండ వస్తువైన "అది నేనైతిని" అన్న భావన (సోహం) వైదికులు మహాశ్రేష్టముగా కొలుచు శివయోగమే. సిద్ధాంతము కూడ ఇట్లే భావింపుమని ఘోషించుచున్నది. కావున మహావేదాంతముచే శోధించిన వస్తువే ఈ శ్రేష్టతను అందిపుచ్చుకొన్న ఆగమ గ్రంథములని బోధపడును సుమా!! (సః + అహం = సో + అహం" = "అది నేనైతిని" అని బోధించునదే వేదాంతం.)

2404. వేదములే వేదాంతము సిద్ధాంతములైనవి: వేదములన్నీ ముందు పుట్టినవి. కాని పూర్ణత్వం సంతరించుకొనినది ఆగమములు. ఆత్మకు ప్రాణనాధుడైన దైవము అనుగ్రహించినదే ఈ రెండునూ. అనాదిగా వచ్చిన వేదములన్ని పరిణామ క్రమముగా శ్రేష్టమైన వేదాంతముగాను, సిద్ధాంతముగాను అయినవి.

## 16. పతి పశుపాశం భేదరహితం

(దైవము, ప్రాణం (జీవాత్మ), బంధం వివరణ)

2405. "పశు" – ఆత్మ (జీవాత్మ) అనాదియని జ్ఞానంయను ఎరుక చెపుతున్నది. అన్ని జ్ఞానంకు మూలమైన, నాయకుడైన "పతి" (దైవం) ఆత్మవలె అనాది. జ్ఞానం,

ఎరుకను కట్టివేయు “పాశం” – బంధము కూడా అనాదియే. పశు–జీవాత్మలో మహాజ్ఞానంయగు శివం (పతి) స్థితిపొందినచో, పాశం–బంధం తొలగి జన్మ రహితమగును. (పతి, పశు, పాశం మూడు అనాదియే.

పతి = శుద్ధం, దైవం, శివం, సత్యం, నిర్వికారం, చైతన్యం, బ్రహ్మం.

పశు = దేహభావన గల జీవాత్మ, అశుద్ధమాయ, మలదోషములతో నిండినది.

పాశం = బంధం, కట్టుబడినది, సంసారం, అజ్ఞానం, పాప, పుణ్య ఫలములు.)

2406. పశు బంధము విడిపించుకొన్నచో పతి–నాయకునితో స్థితి పొందును: బ్రహ్మాది మహాదేవతలగు పశువులు పలు కోట్లు గలవు. పశువులను బంధించు పాశం మూడున్నవి – అహంకారం, కామ్యకర్మలు, మాయ (అజ్ఞానం). పశుతత్వం తొలగించుకొని పాశమును త్రెంచివేసినచో, పశువులు పతిని గట్టిగా పట్టుకొని ఇక విడువక నిలుచును.

2407. చర్య, కర్మాది తత్వముతో జ్ఞానము పొంది సాధన చేసినచో పాశం బంధంకట్టు వైదొలగును: బంధముతో కట్టబడిన జీవుడు కామ్యముతో చేయు చర్య, కర్మ, యోగంతో పొందు ఫలములు మూడు. అవి సాలోక్య, సామీప్య, సారూప్యం (ఇవి మోక్షంను ఇవ్వజాలవు). వాటి అంత్యఫలమగు జ్ఞానమును పొంది, నిర్విరామముగా ధ్యాన, తపమాచరించి, నిష్కాకామ్యముగా కొలువవలెను. అట్లు ధ్యానించినచో కుండలో పెట్టబడిన దీపమును తీసి కుండపైన పెట్టి ప్రకాశం పొందినట్లగును సుమా!! (చర్య, కర్మలు, యోగం మూడు తత్వములు కుండలో పెట్టిన దీపము వలె (ఉపమానం). వాటి ద్వారా పొందిన ఫలము జ్ఞానము – కుండపై పెట్టిన దీపము వలె జ్ఞానమను ప్రకాశమును పొందగలము కదా!!)

2408. శివనందు ప్రేమ సలిపినవారికి, వారి బంధము యొక్క తీక్షత తగ్గి దాని లంకె తెగును: జీవాత్మలు బంధముతో కామ్యములు, మాయ, అహంకారము గలిగియుండును. వ్యాపించిన కిరణములు గల జటాఝూటం గలిగిన నందీ (శివుని)ని తన ప్రేమ, సఖ్యతో జ్ఞానులు చిత్తమునందు పదిలపరుచుకొందురు. అట్లు పదిలపరుచకొన్న వారిలో బంధములు ఎట్లు చేష్టలు చేయును? అనాదిగా వచ్చు బంధమైననూ దానిలో మరలా జీవుడు ఎట్లు ఇముడును? (ఇమడజాలడు.)

2409. బంధము తొలగినవారు సత్యమెరిగి, సకల కేవలస్థితి వదిలి, శుద్ధస్థితిని పొందును: శరీరము నుండి దిగిపోయిన విషము ఎట్లు మరలా పైకెక్కజాలదో, అట్లే జ్ఞానము గలిగిన పిదప పశు, పామ బంధతత్వములు తొలగిపోయి, పిదప సత్యమెరిగిన వాడు మరలా అందు ఇమడజాలడు. ఇదివరకు తననూ సకలావస్థలయందు పెనవేసుకొనియున్న ఇంద్రియ ప్రజ్ఞలు, బంధములు తొలగి నిర్మల తురీయాతీత

స్థితిని జ్ఞానులు దర్శించుదురు.

2410. పరిశోధించి చూచినచో, పతి వలన శ్రేష్టత పొందవలసినవగు పశు (దేహభావనతో నున్న జీవాత్మ), పాశము (బంధము) ఎప్పటికీ ఉన్నవే. ఉన్ననూ నిత్యుని (శాశ్వతమైన శివుని) గ్రహించు వారెవరూ లేరు. పశు, పాశము, నిత్యతత్వమునూ, వాటిని తొలగించుకొనునదియూ, ఆశ్రయించిన శైవులకు బోధపరచినది నంది అనుగ్రహమే సుమా!!

2411. పతి, పశు, పాశము దేవాలయములలో గల గుర్తుల వివరణ: దేవాలయ మూలస్థానంలో (గర్భగృహం) నున్న శివలింగం అనుగ్రహశక్తితో కూడిన శివలింగము. లింగం ఎదురుగా ఉన్న బలిష్టమైన వృషభము పశువగును. ఎడమ ప్రక్కగా, వెనుకనూయున్న బలిపీఠములు పాశమగును (బంధం). శివాలయ అమరికను గ్రహించిన యెడల ఇది బోధపడును. (ఇది ఆగమశాస్త్ర సమ్మత సత్యమగును. జీవాత్మయైన పశుపతియగు శివలింగమును చూచుటచే పాశంయగు బంధములు బలియై బలిపీఠముగా వెనుక అమరియున్నది. బంధములను బలి ఇచ్చుటకే ఆలయములో బలిపీఠము ఏర్పడినది.)

2412. పతి, పశు, పాశంను వివరముగా బోధించు జ్ఞానగ్రంథములను అధ్యయనము చేసి, పతి పశు పాశం యొక్క సత్యమును ఎరుగగోరువారికి తత్వములను బోధపరచి, పతి వస్తువు, పశు, పాశం జ్ఞానమునుండి బంధవిముక్తిని జేయును. పతియందు స్థితిపొందిన వారికి పశు, పాశం యొక్క జ్ఞానములు తొలగిపోవును సుమా!!
(పశు (జీవాత్మ), పాశమగు శోకమును కల్పించునదైన బంధమును వీడి, పతియందు స్థితి పొందినచో జీవునికి బంధవిముక్తి గలుగును.)

2413. పతివస్తువైన శివుడుని, పశువైన జీవాత్మను, పాశమగు మలమును ముక్తస్థితిలో పశు, పాశంలను విడిపించుకొను విధానమును బోధపరచుటకు, చంద్రమండలములోని (శిరస్సు సహస్రమున) ఆనంద మహానందిని దర్శించుటకునూ, శుద్ధశైవమునందు స్తోత్రగ్రంథములను ఉంచియున్నాడు సుమా!!
(ప్రకాశరూపుడగు శివుని దర్శించుటకు స్తోత్రపారాయణమే ఉపాయం.)

2414. బుద్ధిపూర్వకముగా ఆధ్యాత్మికతలో విజ్ఞానకులు, ప్రళయాలురులు, సకలురుయను మూడు వర్గములున్నవి. ఇటువంటి పునీత జీవాత్మలు అంతటా ఉండుటకే, సర్వజ్ఞుడైన శివుడు వారిలో ఇమిడియున్నాడు. జీవాత్మల పరిపక్వత తగ్గట్లు వారిని సృష్టించి శివుడు అనుగ్రహించును!!
(జీవాత్మలన్నీ శివవ్యాపకములో అణిగి వృత్తులు సలుపునవే!!)

2415. తత్పరుడు (శివుడు) జీవాత్మల సృష్టికి మొదటి కారణముగా తన సంకల్ప మాత్రమున

చేసి అనుగ్రహించెను: సృష్టి ఆదియందు పరం, శివం, శక్తి అనువాటిని దైవము జీవరాశులలో ఇముడునట్లు జేసినది, వారి నిద్రలో పెట్టినది (సుషుప్తిలో). పిదప సృష్టికి కారణమును, సూక్ష్మమును సంకల్పమాత్రంచే ఆ తత్పరుడు చేసి, శుద్ధ మాయను ఆ మొదటి సృష్టిలో నింపెను.

(ఆత్మ తత్వములతో కలియుటకు ముందున్న స్థితి.)

2416. సూక్ష్మశరీరము సృష్టికి, వాటి వృత్తులను ఈశానమూర్తి చేసి అనుగ్రహించెను: ఇట్లు చేసిన సూక్ష్మములో బిందు, నాదము, శక్తి, శివం, పరం వాటి నిరాకార (అరూపస్థితిలో) స్థితి ఐదింటితో, సూక్ష్మమగు పంచవృత్తులు చేయునది సదాశివ ముఖం గల పరిశుద్ధ ఈశానమూర్తియే అగును సుమా!!

2417. హరుని వ్యాపకములోనే అన్నీ ఇమిడి నెలకొనియున్నవి: నెలకొన్న పరశివం, శక్తి, నాదం, మరియూ పరబిందు, సదాశివం, మహేశ్వరం, రుద్రుడు, నారాయణుడు, బ్రహ్మ మొదలగు తొమ్మిది (9) స్థితులలో నెలకొనునట్లు సృష్టించినది హరుడగు శివుడే సుమా!!

2418. సృష్టి, స్థితి, తనలో చేర్చుకొను నిమిత్తము లయమునూ, తిరోభావము (మరిపించు తత్వము), జీవించునంత కాలము అనుగ్రహముతో కూర్చియూ, జడము వదిలిన (శరీరము చాలించిన) పిదప విదేహముక్తితోనూ, పరమశివుడు సకలురకు అనుగ్రహించు అనాదియగు ఈ పంచకృత్యములు సుమా!!

(జీవించునపుడు జీవన్ముక్తియూ, మరణాంతరము విదేహముక్తి ఇచ్చును.)

2419. శివుడు జీవాత్మలకు సర్వతత్వములతో కూర్చియూ, వాటినుండి బంధవిముక్తియూ కలిగించును: ముప్పదిఆరు తత్వములను కుండలినీ శక్తి నుండి ప్రారంభించి, వేరగు మాయలో శివతత్వము, విద్యాతత్వము, ఆత్మతత్వములని మూడు భాగములుగా చేసి, కడపటగా ఆత్మతత్వములో జీవులకు కొన్ని కరణములను (సాధనములు) కల్పించి, తన అనుగ్రహంతో పతివస్తువును పశు, పాశముల పట్టు నుండి విడిపించును.

2420. జీవులలో పశు, పాశములను కూర్చి మంచి, చెడులను అనుభవింప జేయునది పతియే (ఆ దైవమే): పతి, పశువులో పాశబంధములందు ఇచ్ఛ గలుగునట్లు చేయును. ఆ ఇచ్ఛయే ద్వంద్వకర్మలను చేయనిచ్చి, ద్వంద్వఫలములను పొందునట్లు చేయును. అట్లు పొందించుటచే పాపపుణ్యముల వలన స్వర్గం, నరకములను అనుభవించజేయును. అన్ని దశలందు, "నేను, నేను" అన్న అహంకారము నిలచియే యుండును.

2421. నాదోపాసన వలన అహంకార మలము తొలగి దైవమును పొందవచ్చును:

బంధమాయలో చిక్కి శరీరము కరణములతో కూడినదే అహంకారమగును (నేను, నాదియన్న భావన). అటువంటి మాయలో చిక్కి, అనుభవించి, దాని నుండి విడుపడుటకే దైవము ఏర్పరచెను. అహంకారమలము నశించి, జ్ఞానమును పురికొల్పునది నాదశక్తియే. పరమశివుని పాదపద్మములను చేరుటకు తగిన ఉపాయము ఇదే సుమా!!

2422. నాదోపాసన జీవాత్మలను శుద్ధిచేసి శ్రేష్టతను ఒనగూర్చును: నాదోపాసన జీవాత్మలకు కర్మఫలములను కూర్చియూ, తొలగించియూ, శివబోధను రుచి చూపించు ఉపాయ మగును. అహంకారము తొలగి, ఆసక్తి రహితము చేసి, శుద్ధమగుటకు ఇదే మూలం. మురికి వస్త్రములను నదీతీరము వద్దనున్న ఒంద్రుమట్టితోనే రుద్ది, శుభ్రపరచునట్లు దైవము జీవాత్మలందు బంధములను కూర్చునది వాటినుండి విడిపించి అనుగ్రహించుటకే సుమా!!

2423. బంధములతో కట్టబడిన ప్రాణమే (జీవాత్మ) పశువు. బంధతత్వములను విడిపించుకొన్న స్థితి పరం. బంధములను విడిపించుకొను తరుణములో పతియే శుద్ధబంధుడై నాదముగా వెలయుటచే శుద్ధ బంధములో చిక్కుకొన్న పశువే శుద్ధ పతియగును. (నాదోపాసన చేయు జ్ఞాని నాదాంతమును దర్శించును.)

2424. వేదార్థములో ఉత్తరం (జవాబు) పొందిన సనకాది మహాతపస్సంపన్నులు (శివగురు – శ్రీదక్షిణామూర్తి వద్ద చిన్ముద్ర రహస్యం–యోగార్థము పొందినది) జ్ఞానముద్రలోనే పరమ రహస్యం యున్నదని బోధించబడిరి. చిన్ముద్రలోనే సకల సూక్ష్మం గలదని గ్రహించి తమ సత్యరూపమగు ప్రకాశములో నెలకొని వెలసిరి.

(ఉత్తరం = జవాబు, యోగార్థము అనుగ్రహ శరీరమునందే కలదని గ్రహించుట.)

## పతి, పశు, పాశం యొక్క సంక్షిప్త వివరణ

అఖండ, నిత్య, అద్వయ, నిర్మల, తేజోమయమైన ఆత్మ/శివం/పతిగా పిలువబడినది. జీవుని శరీరము త్రిగుణాత్మక మాయచే ఏర్పడినది. ఈ మాయయొక్క తమోగుణ ప్రధానమైన "ఆవరణశక్తి" జీవుని సత్యస్వరూపమును ఎరుగనీయక సూర్యుని రాహు కప్పివేయునట్లు జీవుని కప్పియుంచును. దీనినే తిరోదాయి, తిరోభావన, తిరోభూతం అందురు. ఉన్నది ఉన్నట్లు ఎరుగకపోవడమే "అగ్రహణం". ఇక తిరోభూతంతో నున్న జీవుడు మోహముచే కప్పబడినపుడు మాయయొక్క మరొక శక్తి రజోగుణ ప్రధానమగు "విక్షేపశక్తి" జీవునికి షడర్టిములు, కామక్రోధాదులను పురికొల్పి ఏది సత్యము కాదో దానినే అనగా దేహేంద్రియ మనోబుద్ధులనే సత్యమని తలపించి భ్రమలో ముంచుటయే "అన్యథాగ్రహణము". ఈ భ్రమలోనున్న జీవుడు సంసార బంధములో తగుల్కొని నానా వ్యధలను అనుభవించును. ఇట్లున్న జీవుని "పశు"యనియు బంధములో ఇరుక్కొన్నది "పాశ"మనియు చెప్పబడినది.

ఇక మాయయొక్క సత్యగుణ ప్రధానమైన తత్త్వము జీవునికి ధర్మమార్గమును తెలియజేసి, విశుద్ధగుణ తత్త్వములను అవలంభింపజేసి జీవునికి బుద్ధిలో భ్రమను తొలగించి, ఆత్మానాత్మ వివేకముచే తన సత్యతత్త్వము ఎరుగునట్లు చేయుటవలన జీవునికి బంధవిముక్తి కలుగును. స్వస్వరూపజ్ఞాన మెరుగుటయే అజ్ఞానమను భ్రమలు, బంధములను తొలగించుకొనుట.

జీవాత్మయగు “పశు” మోహం, బంధములగు “పాశము”ను తొలగించుకొని “పతి”తో ఐక్యమగుటయే జీవిత పరమార్థమని శ్రుతులు ఘోషించుచున్నవి.

## 17. దివ్యచరణములను శిరస్సున గ్రహించుట

(పాదములను శిరస్సులో గ్రహించు వివరణలు)

2425. కాళ్ళను (మూలాధారములోని కుండలినీశక్తి) శిరస్సును (శిరస్సులోని సహస్ర దళమునకు చేరుట) ఏమని హీనులు ఎరుగజాలరు. కాళ్ళు అనగా కుండలినీశక్తి యగును. దానికి కారణము అనుగ్రహశక్తియే. ప్రకాశముతో నిండిన జ్ఞానమే శ్రేష్ఠమైన శిరస్సుయగును. శక్తియైనది జ్ఞానమగు శివుని చేరినచో ప్రాణం (జీవాత్మ) ముక్తి పొందును. (సాధనలతో కుండలినీశక్తి సహస్రదళమునకు ప్రాకి పరంతో చేరి ఐక్యమైన ప్రకాశరూపమొందుట.)

2426. ఈ శరీరమున అట్టడుగునయున్నది శిరస్సుకు చేరుకొనునది హీనులు ఎరుగజాలరు. మూలము శిరస్సునందును, మూలాధారమునందును గలదు. మూలాధారములో నున్నది (కుండలినీశక్తి) శిరస్సుకు చేరుకొను జ్ఞానమును గ్రహించిన జ్ఞానులు అల్పజ్ఞానమును వీడి మహాజ్ఞానమును పొందియుండిరి.

2427. పృథివియందును, అండములందును, బాహ్యముగాను, అంతరముగాను వ్యాప్తి చెంది నెలకొన్న పరమశివుడు, ఆయా అండములందు జీవించు అసురులు, సురులు ఉన్నతి పొందవలెనన్న సద్దుద్దేశ్యముతో తాను పిదప ఈ భూలోకమును సృష్టించెను. వాని నామమే “నందీ”. ఆ మహామహుడు తన దివ్యపాదములను నా శిరస్సుపై దాల్చి అనుగ్రహించెనే!!

2428. నా చిత్తములో నా తండ్రియగు శివుని దివ్యచరణములు పదిలమైయున్నవి. నా మనస్సునూ వాని చరణములను నమస్కరించుచూ యున్నవి. నా చిత్తమును గ్రహించి నన్ను అనుగ్రహించకయున్నచో, నా తండ్రిని నేను గ్రహించజాలనివాడై యుందును సుమా!!

2429. శ్రేష్ఠమైన ఆరు ఆధార ప్రకాశమునకు అవతలకు అవతలగానున్న పరమాకాశములో నా నాయకుడు శివుడు కోరి అచ్చట నెలకొనియున్నాడు. మనస్సుతో ఊహించజాలని, నోటితో వర్ణించజాలని ప్రణవ ప్రకాశమును నాకు సృజింపజేసెను.

పిదప వాని దివ్యచరణములను బిందునాదములుగా నా శిరస్సున దాల్చి నిలిచితిని.

2430. పతిని (శివుని) కాల, ప్రదేశమెరిగి స్తుతించవలెను: పతి వస్తువు నెలకొన్న శిరస్సు నందు చిత్తము పదిలమైనచో, చంద్రుని అనుసరించి (చంద్రకళలో చంద్ర మండలములో మనస్సు నిలిపి) దివ్య పుష్ప పాదపద్మములను స్తుతించినచో, గంగను, తన జటాఝూటమునందు ధరించిన అర్ధనారీశ్వరుడు "గతి"ని (సద్గతి = ముక్తి) పొందించును. వానిని స్తుతించునది కాల, ప్రదేశములను ఎంచి స్తుతించవలెను సుమా!!

2431. దైవమును నిర్విరామముగా స్తుతించువారిని అతను తోడుండి సదా రక్షించును: దైవ దివ్యచరణములను నిర్విరామముగా స్తుతించు వారి మదిలో అమరావతి నాధుడు నెలకొనును. తనను తలంచని వారి మదిలో వారికి కనపడక దాగుండును. అట్లు పక్వపడినవారికే (సంస్కరించబడిన) జీవాత్మలకే తోడుండి రక్షించుచున్నాడు సుమా!!

2432. దైవమును శరీరమునందే దర్శించినవారు ఇప్పుడే ఇక్కడే "శివపదం" పొందుదురు: శరీరమున్నదే దైవం నెలకొన్న (సహస్రదళం) పద్మమొకటి గలదు. దానికి దగ్గరగా స్తుతించుటకు మూడు పద్మములు గలవు (చంద్ర, సూర్య, అగ్ని పుష్పములు. ఎడమకన్ను-చంద్రుడు, కుడికన్ను-సూర్యుడు, భ్రూమధ్యము-అగ్ని). వీటిని స్తుతించుట వలన దైవము యొక్క దివ్యచరణములగు బిందునాదములు (శిరస్సు - సహస్రదళ పద్మమున) ఉద్భవించును. అందే స్థిరత్వము పొంది పదము (పరిపక్వమగుట) మైనవారికి ఇప్పుడే ఇక్కడే "శివపదం" పొందగలరు సుమా!!

2433. దైవ దివ్యచరణములందే నెలకొన్నవారికి అహంకార చీకటి తొలగి ఆనంద మేర్పడును: బిందునాదమగు దివ్యచరణములు నా శిరస్సుపై దాల్చినది అహంకార మలం తొలగించుటకే. లౌకిక కామ్యములందు వాంఛలను నా మనస్సునుండి పారద్రోలుటకునూ, పాలవంటి తెల్లని ప్రకాశము గలిగిన పరమేశ్వరుడు నన్ను వాని బానిసగా చేసుకొనకోరెను. అటుపై నేననుభవించిన శ్రేష్టఫలములను నా వలన చెప్పడం వీలుకాకున్నది. (దివ్యత్వమును వర్ణించుటకునూ, స్వస్వరూప ఆత్మతత్వ మెరిగి అందు నెలకొన్నవారికి ఆత్మ గురించి చెప్పుటకు వీలుకాదు. వాక్కుకు, మనస్సుకు అతీతమది. "నా వాక్గచ్ఛతి న మనః" - శ్రుతివాక్యం - కేనోపనిషత్తు)

2434. తాను కన్నబిడ్డలపై రక్తసంబంధము వలన, వారు చేయు తప్పులను ఎన్నక వారి గుణములను సద్భావనతో పట్టించుకొను తల్లిదండ్రుల వలె, ఈశుని తలవని ప్రాణులను (జీవులను) వారి గుణములకు, పరిపక్వత తగ్గట్లు ఎటువంటి చిరాకు

పడక వారిని తన దగ్గరకు తీసుకుని అనుగ్రహించునే!!
(శివుని పరమ దయాళత్వమును తెలుపునది – జీవులంతటిని తన బిడ్డల వలె చూచు తత్వము.)

## 18. త్రిదోషములు

(కామం, క్రోధము, మోహం (అజ్ఞానం))

2435. త్రిదోషములచే ఏర్పడు దుఃఖములు జీవునికి నాశనమేర్పరుచును: త్రిదోషములు మూడునూ (కామం, క్రోధం, అజ్ఞానం) జీవునికి దుఃఖముల నేర్పరుచును. దీని వలన జీవుడు తన స్వస్వరూపమెరుగక మాయాకార్యమగు మోహ (అజ్ఞాన) చీకటిలో చిక్కియున్నాడు. ఈ త్రిదోషములను తొలగించు కొన్నవారు జనన, మరణములను తొలగించుకొన్నవారగుదురు. అట్లు తొలగించుకొననివారు ఆ త్రిదోషముల మాయలో చిక్కి నాశనమగుదురు.

2436. త్రిదోషము యొక్క నివారణను చూచించునది: కామం (తీవ్రకాంక్ష), క్రోధము, అజ్ఞానమను మోహంలను తొలగించుకొని, జగద్రక్షకుని (శివుని) పాదపద్మములను దృఢముగా పట్టుకొని, గంటానాదమను ప్రణవ తెప్పలో చేరి (నీటిని దాటించు చిన్న పడవ వంటిది) ప్రకాశమును దర్శించినచో, ఈ త్రిదోషములు తొలగిపోవునే!! (తీవ్రకాంక్షతోనున్న విషయ వాసనలు నెరవేరనపుడు కోపము, మోహం ఏర్పడి జీవునికి చిత్తభ్రంశం ఏర్పడి పతనమేర్పడును.)

## 19. త్రిపదం

(తత్, త్వం, అసి పదం – తత్త్వమసి – అది నీవైయున్నావు)

2437. ముప్పదములను గ్రహించినవారు జన్మరహితులగుదురు: సృష్టించబడ్డ “నీవు” అన్న పదం “అది” అన్న పదంతో కూడి నెలకొన్నప్పుడు ఈ త్రిపదములు పొందిన వాడవై జన్మరహితమై, అఖండ వస్తువగును. అట్లు లయమై నెలకొన్నవాడు ఈ జన్మలోనే శరీరము వదిలి శివం అగును. (త్వం = జీవాత్మ; తత్ = పరం; అసి = అయినావు; ఈ మూడింటిని గ్రహించినవాడు “తత్త్వమసి” భావనను తనలో నిలుపుకొన్న “పరాపరుడ”గును (పరం + అపరం). ఈ త్రిపదలయంను తనలో గ్రహించినవాడు “పరం”; గ్రహించనివాడు “అపరం” అగును.

2438. దైవానుగ్రహముతో పొందదగిన నాదోపాసనలో స్థితిపొంది, పంచభూతాత్మకతతో ఏర్పడిన తొంబది ఆరు (96) శరీరకరణ బేధములను నాదాంతస్థితిలో త్రోసిపుచ్చి (తొలగించుకొని), వేదము ఘోషించు “త్వం” పదార్థముయగు “నీవు” పదమగుటయే యథార్థమైన స్థితియగును.

2439. పరః (శక్తిరూపం), పరం (శివం) కలిసి "అసి"యైన స్థితిని వాక్కుచే వర్ణించ అలవికాదు: "తత్‌పదం, త్వం" పదమున్నూ అనుగ్రహముతో ఏర్పడి "అసి" పదమగును. వాక్కాది ప్రమాణములకు అందనిదియూ, ఎటువంటి కొలతలతో చెప్పనలవి కానిదియూయైన పరమేశ్వరుని తత్వం ఊహాజనితములుగా కాక సత్యమైన "అసి" స్థితిలో ఏకమైయున్నాడు.
(పరః (శక్తి) జీవులను బంధములో ముంచి, బంధమునుండి విడిపించి శివునిలో ఐక్యపరుచును.)

2440. జీవుడు, పరం "అసి" పదములో ఇమిడి, ఎటువంటి నిరోధములు లేక శివంతో ఏకమైనచో, ఉపమానములేని పాలు, తేనె, అమృతం కలిసినట్లే. ఈ స్థితియే వాక్కుకు అందని మహానందం మౌనస్థితిలో నెలకొనును.
(వాక్కుతో వివరించలేని ఆత్మకు లాభమగుస్థితి.)

2441. జీవుడు శివం అగుటయే మహావాక్య విచారణ పదమగు "తత్త్వమసి". "త్వం" పదం "తత్" పదంగా మారుట "అసి" స్థితిలో ఉన్నది. శివుని నమ్మిన జీవుడు జీవతత్వములను విడచి, "పరం" అన్న పేరుతో శివుడగుచున్నాడు. శ్రేష్టమగు మహావాక్య సత్యము "అసి" పదమగుటలోనే ఉందని బోధపరచి ఎర్రని ప్రకాశములో చొప్పించి మా నందీశ్వరుడు మమ్మల్ని అనుగ్రహించి ఆదుకొనెను సుమా!!

2442. త్రిపదములను సృజించి నెలకొన్నవారు శివమై వెలసిల్లుదురు: యాబది అక్షరములతో వాక్కు రూపముగానున్న శక్తులని లోకులు ఎరుగజాలరు. ఈ అనుగ్రహమెరిగిన కొందరు ఈ శక్తుల సహాయముతోనే దైవమును పొందగలిగి, త్రిపదములుచే బోధింపబడు దానిని తమలోనే సృజించగలిగి, తమ బిందు నాదములో వెలయు శివమై నెలకొందురు.
("త్వం" పరయోగముచే "తత్"గా నెలకొనుట.)

2443. ఆత్మ పంచేంద్రియ జ్ఞానమును వదిలి, నిర్మల జాగ్రదలో పక్వపడి విజ్ఞానమును పొందుచున్నది. నాదశబ్దంలో పొందు జ్ఞానమే ఆఖరిదైన జాగ్రదాతీతంలో పొందునది. జ్ఞానేంద్రియములగు శబ్దాది ఐదు విషయజ్ఞానములను వదిలినపుడు పరమగును. ఆ పంచేంద్రియ జ్ఞానములు ఒక్కొక్కటిగా (మూడు, రెండు, ఒకటి) విడచినపుడు శివుడు అనాదిగా శ్రేష్టమైన నిర్మల జాగ్రదలో నింపి జీవులను పరిపక్వ పరచుచున్నాడు. (విజ్ఞానము = ఆత్మ / బ్రహ్మజ్ఞానము.)

2444. ఆత్మ తురీయాతీత స్థితిలో నెలకొనడమే "అసి" పదస్థితి. ఆత్మ శ్రేష్టమైన నిర్మల తురీయంలో జాగ్రదావస్థలో నుండి వికసించని కాలములో నిర్మల స్వప్నం అమరును. పిదప అలలు లేని సముద్రమువలె ఎటువంటి చలనములు లేక యుండు స్థితియే

తురీయ సుషుప్తి అగును. శివునియందు స్థితి పొందినపుడు ఈ నిర్మల తురీయం దాటిన స్థితియే "అసి" పదస్థితి. (తురీయాతీత స్థితిలో "శివం" అగుట.)

## 20. త్రిపరములు

(అగ్నిమండలము, సూర్యమండలము, చంద్రమండలములలో ఆత్మ నిలుచుండు స్థితులు)

2445. కుండలినీశక్తి అగ్నిమండలములో నెలకొని జీవులను పక్వపరచుచున్నది. నా శరీరములో సహజముగానే వ్యాపించియున్న మూడు మండలములగు అగ్ని, సూర్య, చంద్రమండల నాయకుడిని లేత తీగవంటి కుండలినీశక్తి ఆధారమై నిలచి, జీవులకు సుఖములను అందించి, అధోముఖం చూచు అగ్నిమండలమును పక్వపరచి సహాయ మొనర్చుచున్నది. (అగ్నిమండలము = మూలాధారము నుండి స్వాధిస్థానం వరకు; సూర్య = నాభి నుండి కంఠము వరకు; చంద్ర = కంఠము నుండి ద్వాదశాంతము వరకు శరీరములో వ్యాపించియున్నది. సుఖం ఒనగూర్చుట = స్వాధీస్థానం బ్రహ్మ అంశం, సృష్టికారకం, జీవసృష్టికి మూలమగు అగ్నిమండలమును శక్తి పరిపాలించి, జీవులు పక్వపడిన పిదప సహస్రమునకు చేర్చుట.)

2446. కుండలినీశక్తి శిరస్సును దాటినపుడు ఆకాశమంతటినీ వ్యాపించి "మహాపరం" అయినది. అందు నెలకొన్న నందీ (శివుడు) కూడ అంతటా పూర్ణంగా వ్యాపించి యున్నాడు. లేగదూడ అరచిన వెంటనే పరుగెత్తి వచ్చు తల్లి ఆవువలె శివుడు అనుగ్రహించి కరుణతో జీవుని చిన్న గుట్టపై పెట్టిన దీపమువలె ప్రకాశింపజేయును.

2447. ముప్పదిఆరు తత్వములను దాటి అవతలకు అవతలగా నుండు ఆ "పరం" చెప్పక చెప్పు ఉపదేశము ఏమనగా (నాదమును తన సాధన శిష్యునిలో సృజింప జేయునది) పరమేశ్వరుడే వేదభగవానుడుగా (వేదార్థము బోధించు గురువుగా – సదాశివమూర్తిగా) బహిర్గతమై ఉపదేశించు పరమ గురువుగా బోధించినదని గ్రహించి, ఆ పరమానందమును రక్షించుకొనవలెను సుమా!!

2448. తత్వములన్నీ శివపరం నందు లయమైనపుడు తత్వముల చేష్టలు అణిగిపోయి, ఆత్మ మేలైన స్థితియగు పరంలో పదిలమగును. అట్లు తత్వబంధములు తొలగుట వలన, నాదస్వరూపమగు శివుని జ్ఞానమే ఆత్మ యొక్క జ్ఞానమగును. జీవబోధం తొలగి శివబంధ మేర్పడును. తొలగించుకొన్నవన్నీ నశించి పరంతో పరమగును.

2449. ఆత్మలకు బంధవిముక్తి గలిగించి శ్రేష్టతను గలుగజేయునది శివుడే: శ్రేష్టస్థితి యగు సదాశివ పదవి పొందినవారు, ఎటువంటి బంధములచే ఇరికించజాలని మేలైన స్థితి పొందినవారగుదురు. అతను శివునితో ఏకమగుటచే మేలైన శివానందముగా వెలయును. ఇట్లు జీవాత్మలకు ఉన్నతి కల్పించునది జ్ఞానరూపుడైన శివుడే అగును.

2450. ఆత్మ ముమ్మండలములను దాటినపుడు "తత్పదం" అగును: (ముమ్మండలములు = అగ్ని, సూర్య, చంద్రమండలములు) నిర్మల జాగ్రదలో కళ, విద్యా, రాగం, పురుషుడు, మాయయగు కళతత్వములు ఐదు (5) తొలగి, క్రియాకరణములు తొలగించుకొని ఆత్మ ఒంటరిగా నిలుచునపుడు జాగ్రద వదలి తురీయాతీతంలో ప్రేమ స్వరూపుడగు శివునితో చేరి ఆత్మ "తత్పదం"లో నెలకొనును.

2451. ముమ్మండలములను త్రోసిపుచ్చి "పరాతీతం" స్థితిలో శివునితో సదా కలసి యుండవలెను: తనను శుద్ధిపరచుకొన్ననూ (అనాత్మ తత్వములను త్రోసిపుచ్చి, ఆత్మతత్వములో సదా నెలకొనుట – తానెప్పటికీ సచ్చిదానంద స్వరూపమని ఎరుగుట), తనలో విశాలమును గాంచిననూ (చిత్తవైశాల్యము) పిదప జీవకరణములన్నీ తొలగిపోయి ఆత్మ స్థితి మారిననూ, కాలపరం (ఆత్మ) "తత్పరం" (శివుడు) ఏకమై, పరాస్థితిలో (శివశక్తి) సదా నెలకొని యుండవలెను సుమా!! (పరాతీత స్థితి = అతీతస్థితి.)

## 21. పరలక్షణం

(పరలక్షణం = పర = ప్రకాశతత్వంను వివరించునది)

2452. ఆత్మ అతీతములో ప్రకాశము పొంది వ్యాపకమొందును: నిర్మల తురీయాతీతంలో నంది (శివుడు) శివవ్యాపకమగు జ్ఞానం గలిగియుండును. ఆత్మ తురీయాతీత స్థితిలో తన జ్ఞానం కోల్పోయి యుండును. ఆత్మ చంద్రమండలములో (శిరస్సు – సహస్రదళములో) నెలకొని అహంకారములులను తొలగించుకొని శివునితో ఏకమై నెలకొనునపుడు, శివుడు జీవాత్మలో పదిలమై తన వ్యాపకమునూ, జ్ఞానమునూ పదిలపరచును. (జీవాత్మ మొదట చిత్తశుద్ధి పొంది, పిదప మలరహితమై, శివునిలో ఏకమై, శివుని వ్యాపకము, జ్ఞానము తనలో ఇముడ్చుకొనును.)

2453. పరమేశ్వరుడు ఆదియూ, అంతమూ లేని నాయకుడు. అతడు పరంజ్యోతి స్వరూపుడై అంతటా వ్యాపించినవాడు. అంతటా వ్యాపించిననూ ధర్మాచరులకు దర్శనమిచ్చి, అట్లుకాని వారికి కనుమరుగై యున్నాడు. అటువంటివాని శివజ్ఞానంను తమలో సృజించినవారు మహాపుణ్యవంతులు సుమా!!

2454. నిర్మల తురీయంలో జీవుడు పరబోధనచే మలరహితమై, శుద్ధి పొంది తురీయాతీతంలో జీవులకు వియోగం (ముక్తి) ఒనగూర్చు ఆకాశములో నాట్యము చేయు శివుని దర్శించనగును. వానిని ప్రణవ వృత్తములో చూచువారికి ఇక ఎటువంటి దోషములండజాలవు సుమా!!
(ప్రణవ వృత్తము: అకార, మకార, ఉకార త్రికళలు రూపం దాల్చి (ధరించి) బిందు, నాదములుగా శిరస్సు – సహస్రదళంలో నిరాధారములో నిలుచునది.)

2455. గంధ వర్ణమగు (పసుపు) నాదములో తెల్లని బిందు వీగిపోయి, ఇమిడిపోవునట్లు, సత్యస్వరూపుడగు పరశివునితో జీవుడు సమగ్రముగా ఇముడుటచే, అసత్యము, అశాశ్వతమైన లౌకిక మనస్సు వీగిపోయి, తలంపులన్నీ తొలగిపోయి, మలరహితమై, పసుపువర్ణ (నాదశక్తి)తో శివమేరు ఎక్కి ఏకమగును.
(శివమేరు = మేరు పర్వతం – శిరస్సు సహస్రదళమునకు చేరిన కుండలినీ శక్తికి తన చేష్టలుండజాలవు.)

2456. శివమేరు ఎక్కిన జీవులకు శివుడు "అసత్తు"ను తొలగించి అనుగ్రహించును: శివమేరులో నాదశక్తితో నెలకొన్న జీవులు తమ తత్వములను తొలగించుకొని, ఇక మిగిలియున్న శుద్ధమాయ, అశుద్ధమాయలను సమూలముగా పెకలించుకొని, ఇక అవి మొలకెత్తనట్లు చేసి, పిదప ద్వాదశాంతములో సత్యరూపమగు శివసూర్యుడుగా వెలయువాడు సంశయములన్నిటిని త్రెంచి నన్ను (రచయిత) తన బానిసగా చేసుకొని అనుగ్రహించెను!!

2457. నంది మహామహుడు జీవులకు తమ స్వరూపమును గ్రహింపజేసి, తన శక్తిని నింపి తత్పరమును అనుగ్రహించును: నా యధార్థ స్వరూపమును గ్రహించునట్లు చేసిన ఆ నంది పెరుమాళ్, తాను గ్రహించినది, గ్రహించలేనిదిని బోధపరచి, పిదప బట్టబయలులో ప్రకాశస్వరూపము వేరుగా బోధపరచి, తన శక్తి ఇచ్చి, తత్పరమును అనుగ్రహించెను. (ప్రకాశస్వరూపం = ఆత్మతత్వము.)

2458. దైవము జీవుని ఆకట్టుకొన్నప్పుడు తాను అంతటా సర్వముగా నున్నది బోధపడును: అంతటా వ్యాపించియూ, సంకోచించియూ, పృథివి, జలం, వాయువులతోనూ, సూర్య, చంద్ర, అగ్నిలుగాను, ధర్మతత్వం, దాని ఫలంగాను, అఖండముగా ఆకాశములో అన్నిటికీ ఆ దైవమొక్కడే ఆధారమై నిలుచున్నాడే!!

2459. పరమే (శక్తియే) జ్ఞానాది బేధములుగా పరంతో (శివం) ఇమిడి పంచకృత్యములు చేయించుచున్నది: నిరాకార రూపముతో నున్న శివునిలో తానే నెలకొన్న శక్తి "తత్పర"గా నిలుచును. ఆ పరయే పరంగానున్న శివునికి శరీరమగును. శ్రేష్టమగు కరణ, భువన భోగములను జీవులకు కల్పించనెంచి, తన (శక్తి) సంకల్పముచే జ్ఞాన, ఇచ్ఛా, క్రియాశక్తి భేదములుగా పరంతో కలిసి, విడిపోకుండా ఉండి, సృష్ట్యాది పంచకృత్యములు చేసి అనుగ్రహించుచున్నది.
(పంచకృత్యములు = సృష్టి, స్థితి, తిరోభావన, అనుగ్రహం, లయం.)

2460. శరీరములో ఊర్ధ్వముగా, అధోముఖముగా వ్యాపించి, శరీరము, చెవి, నోరు, నేత్రము, నాసికగా మొదలగువాటితో రక్షించు బిందు శక్తిగా (ప్రకాశశక్తిగా) పరలో పరగా, నిరాకార శివం, శక్తి, బిందు, నాదములు నాలుగుగా జ్ఞానమును పొందునట్లు

చేసి, అహంకారమును కట్టడిచేసి, జీవుల శ్రేష్టత కొరకు శక్తి పాలించుచున్నది. (బిందుశక్తి పరకు (శక్తికి) కట్టుబడినది కనుక జ్ఞానేంద్రియములను తన శక్తితో పరిపాలించుచున్నది.)

2461. పరశక్తితో నెలకొన్నవారికి మాయ ఉపాదుల చేష్టలు లేవు: పర ప్రకాశము వేర్వేరు అంశములలో కూడినదగుటచే అది ఆరు ఆధారచక్రములో ఇమిడి ఆరు విధములైన ఉపాదులను కల్పించి, వివిధ తత్వములతో కూడుకొన్నట్లు మాయచేయును. మాయాశక్తి తన చేష్టలతో జీవునికి చలనము, శ్వాస, ఆహారము భుజించుట, నిద్ర, మొదలగు సకల జీవవృత్తులు కల్పించును. కాని మాయ కార్యములగు పై తత్వములను దాటి జీవాత్మ పరతో ప్రకాశములో నెలకొనినపుడు ఆత్మతత్వము గిట్టును సుమా!! (ఆత్మతత్వములో నెలకొన్నవారికి జీవ ఉపాదులగు అవస్థాత్రయం, శరీరత్రయం, పంచజ్ఞాన, కర్మేంద్రియ తత్వములు, అంతఃకరణములు మాయ చేష్టలన్నీ వీగిపోవును. ఆత్మతత్వము వీటియంతటికీ విలక్షణం, అసంగం, నిత్యం, శుద్ధం, నిర్వికారము, సచ్చిదానందతత్వం.)

2462. ఆత్మబోధనం వీగి శివప్రకాశమములో నెలకొని స్థితి పొందునదే శ్రేష్టత: తన యొక్క పరం (తత్పదం) సాటిలేని ప్రకాశములో స్థితిపొందినది. అదే శ్రేయస్సు ఒనగూర్చు జ్ఞానతత్వమగును (తత్వములన్నిటిని త్రోసిపుచ్చినది). ఆత్మబోధనం వీగిపోయి తన ప్రకాశమెరిగి (శివప్రకాశములో) నెలకొను స్థితియే ఎనలేని, సాటిలేని స్థితియగును.

2463. తురీయాతీత స్థితిలో నెలకొని కారణతత్వమును నశింపజేయనివారు శుద్ధమవ జాలరు: పురాతన వేదములు శివునికి శ్రేష్టమగు ఆకాశమే శరీరమని చాటుచున్నవి. నెలవంక ధరించిన మహామహుడు నెలకొన్న ఆకాశములో తురీయాతీత స్థితిలో అతని దర్శించి, ఆ పరస్థితిలో శుద్ధమాయను గ్రహించి నెలకొననిచో, జీవుడు శుద్ధమవజాలడు. (ఆకాశము: శిరస్సుయగు చంద్రమండలములోని సహస్రదళ పద్మము; శుద్ధమాయ ఈశ్వరతత్వము. ఇదియే జగత్సృష్టికి కారణభూతమగు చున్నది.)

2464. పరప్రకాశములో నెలకొన్న ఆత్మ, శివతత్వములో స్థితి పొందినదగును. ఆకాశము, వాయువు, అగ్ని, జలం, పృథివి మొదలగునవి లయమగు దేవాలయముగా, "తత్పరం"మే ఆ తురీయస్థితిలో ఏర్పడును. ఆకాశము, వాయువు, అగ్ని, జలం అన్నియూ పృథివిలో ఇమిడి బహిర్గతమగు శక్తియే శివుని రూపమగును. (పంచభూత తత్వములన్నీ శివుని యొక్క శక్తి రూపములే.)

2465. మేరు (ద్వాదశాంతము - శిరస్సుని దాటి పన్నెండు అంగుళములలో) యగు

బట్టబయలులో సర్వత్ర విస్తరించిన ప్రకాశకిరణములతో నొప్పారు శివునియందు స్థితి పొంది నిర్విరామముగా శ్రేష్టమగు శివయోగి తపస్సు ఆచరించినచో, శివుని అనుగ్రహము తనంతట అదే వచ్చిచేరును. **ఆ స్థితి నుండి జారిపోకుండా ఉండండీ!!** ఇది తప్ప చెప్పుటకు వేరేమియూ లేదు సుమా!!

## 22. త్రితురీయములు

(త్రితురీయములు: జీవ, పర, శివ తురీయములు)

2466. జీవుడు కేవల, జాగ్రదాది స్థితులను (కేవల, జాగ్రద, స్వప్న, సుషుప్తి) దాటినది "జీవ తురీయం". జీవునికి తన ఆదియగు పరంలో సకల జాగ్రద, సకల స్వప్నం, సకల సుషుప్తి దాటినది "పర తురీయం". జీవ, పరస్థితులను దాటిన నిర్మల జాగ్రద, నిర్మల స్వప్న, నిర్మల సుషుప్తిలు దాటినది "శివ తురీయం". ఈ శివతురీయం యనునదే మహావాక్య విచారణయగు "త్వంతత్తసి" (త్వం+తత్, అసి) తత్వమగును. ("తత్వమసి" మహావాక్యమే ఇందు జీవపరంగా ఈ మంత్రంలో త్వం+తత్+అసి గా చెప్పబడినది.)

2467 త్వం పదజీవుడు పరతురీయంలో శివావస్థలో నెలకొనును: జీవుడు కేవల, జాగ్రద తురీయంలో స్థితిపొందునదే "త్వం"పదం. సకల జాగ్రద తురీయంలో జీవాత్మ పరతురీయంలో స్థితిపొందును. జీవాత్మ పరస్థితిని దాటి శివస్థితి పొందినపుడు నిర్మల జాగ్రదాదులు ఏర్పడును. శ్రేష్టత పొందినవే ఈ చెప్పబడు జీవ, పర, శివ తురీయ స్థితులగును.

2468. జీవునిలో వెలయు తురీయంలో జాగ్రద, స్వప్న, సుషుప్తి, తురీయంయను నాలుగు గాను, కోరి నెలకొన్న పరతురీయంలో జాగ్రద, స్వప్న, సుషుప్తియగు నాలుగునూ, శ్రేష్టమగు పరమంలో జీవ, పర, శివం చేరుటచే జీవతురీయం, పరతురీయంగా రెండునూ కలిసి పై ఎనిమిదింటితో కలిసి దశస్థితులగునే!!

2469. ముందు మంత్రములో చెప్పినట్లు జీవ, పర, శివ తురీయంలో, శివుని చేరుటకు ఉపదేశ విధానముతో నిలచి, పృథివ్యాది తత్వములు అంతమగు తరుణంలో పరాపరంతో చేరి, అంత్యములగు బిందునాదము చరణములను పట్టుకొని నిలుచుదువు గాక!!

2470. జీవప్రకాశములో వెలయు తురీయస్థితిలో నిర్విరామముగా పట్టువిడువక నిలవండీ!! దీనిని సాధించుటకు వీలు కాలేదని తలంచినచో, నిలచి స్థితి పొందవలసినవిని శాస్త్రగ్రంథ శ్రవణముచే గ్రహించి, ఆలోచించి, పళ్ళు, నాలుక, పెదిమలతో ఉచ్ఛరించుటకు అతీతముగా ఎదిగి శివతత్వమగు నాదములో నెలకొందురు గాక!!

2471. దేహతత్వములగు ముప్పది ఆరింటిని (36) అసత్తుగా పరిగణించి, త్యజించవలెనని

గ్రహించినవారే సత్యతత్త్వ మెరిగినవారు: జీవాత్మలోని అసత్తుయగు ముప్పదిఆరు (36) తత్త్వములను తొలగించుకొని సత్‌రూపమైన పరమై, తనలో నెలకొన్న శుద్ధ మాయ, అశుద్ధమాయలను అనుగ్రహశక్తితో (నాదమయమైనది) ఛిద్రింపజేసి, విడదీయలేని శివశక్తిని పట్టుకొను తత్త్వమెరిగినవారే అంత్యమగు సత్యమును గ్రహించినవారు సుమా!!

2472. జాగ్రదావస్థలో నాలుగవదైన తురీయంలో జీవుని ప్రాణముగా వెలయునది "త్వం" పదమే. దోషములనుండి (కర్మఫలములు) విడిపడి, నిర్మల జాగ్రదలో అంత్యముగా నున్న నాలుగవదైన నిర్మల తురీయం పొందునపుడు, జీవునిలో "పరతురీయం" నెలకొని, దీనిని దాటి తురీయాతీతంలో "తత్పదం" పొందును సుమా!!

2473. త్రితురీయంలను దాటిన స్థితియే శివమగుట: త్రితురీయంలో త్వం పదం తత్పదంలని చెప్పుటవలె, నమ్మదగినదైన మూడవదియగు శివతురీయం శ్రేష్టధామం (పరమపదం) నానావిధంగా చిత్రీకరించు జగత్తును తలంచని అతి సూక్ష్మమైన స్థితియగును. దానికి అవతల నెలకొన్న ఎర్రని ప్రకాశమే ఆత్మలను (జ్ఞానులను) ఆదుకొను శ్రేష్టమైన నందియగును (శివమగును).

## 23. త్రిముక్తిలు

(త్రిముక్తి: జీవ, పర, శివముక్తి)

2474. జీవాత్మ తమ ముక్తి స్థితిని తురీయాతీత స్థితిలో పొందును. జీవాత్మ తన తత్త్వములన్ని విడచి అనుగ్రహస్థితిలో నెలకొనడమే పరముక్తి. శివముక్తి యనునది శివానందమే. త్రివిధ ముక్తులు స్వరూపములోనే ఏర్పడును. ప్రణవ ఉపాసనతో చేష్టలు అణిగి నెలకొనునపుడు నాదాంతమేర్పడును.

(1) జీవన్ముక్తి: నిత్యానిత్య వస్తువివేకముచే అనాత్మ తత్త్వములను, జగత్తును మిథ్యయని భావించి, వివేక, వైరాగ్యములతో, గురోపదేశముతో, గురుముఖతః ఆత్మతత్త్వమెరిగి, జన్మకు కారణమెరిగి, పునర్జన్మలు రహితం చేసుకొన్న స్థితియే జీవన్ముక్తి. (2) పరముక్తి: జీవాత్మ తన తత్త్వములన్నిటిని విడచి, జన్మకు కారణమైన నియతిని దాటి జ్ఞానమయముగా, శివునిలో లయమగుటకు ముందున్న స్థితియే పరముక్తి. (3) శివముక్తి: శరీరమున్నప్పుడే శివానందములో లయమై శరీరమును మరచి, శివంతో లయమై శివానందమనుభవించు స్థితియే శివముక్తి. పై మూవురును శరీరతత్త్వములను, భావనలను విడచినవారే.

2475. జన్మ ప్రయోజనమెరిగి శాశ్వతతత్త్వమగు శివంతో ఇమిడి నెలకొనునదే ముక్తి యగును: జన్మ ప్రయోజనము ఎరుగునంతవరకు ప్రాణమునకు జన్మలు కలుగుచునే యుండును. జన్మ ప్రయోజనము దైవమును ఎరుగుటయే తప్ప వేరొకటి లేదని,

దైవానుగ్రహము పొందుటయే జన్మ ప్రయోజనమని భావించుట. బాహ్యముగా యున్న జగత్తునూ, అంతరమున నున్న ఇంద్రియ కరణములనూ ప్రాణమునకు (జీవాత్మకు) ఒనగూర్చునది ఏమియూ లేదని గ్రహించి, బాహ్యజగత్తునూ, ఇంద్రియ కరణములను త్రోసిపుచ్చి శివునితో ఇముడునదే ముక్తియగును.
(శాశ్వతానందము, భద్రత, శాంతి దైవమునందే పొందవలెను. అవి జీవాత్మలో లేవు. అన్నీ దుఃఖకారకులే.)

2476. చిత్తమున శివుని పదిలపరచుకొని, శివమై త్రిదోష (అహంకారం, కామ్యం, మాయ – అజ్ఞానం), త్రిగుణ (తామస, రజో, సత్వ) రహితమై, తపస్సుతో పొందదగు త్రిముక్తులతో, "తత్త్వమసి" (అది నీవైతివి) అన్న ఉపదేశ (గురోపదేశము) తత్వములో నిలచి, "సోహం" (సః+అహం=అతను నేనే) నన్న భావనలో యుండువారికి, శివం అమలుడుగా (మలరహితమైన) తానే బహిర్గతమై అనుగ్రహించునే!!

2477. సిద్ధి మొదలు సమాధి వరకు అనుగ్రహించునది ఆ శివుడే: బంధములను త్రెంచునది పరమశివుడే. ఇదికాక, సిద్ధులు (అష్టమ సిద్ధులు) ముక్తియూ (మోక్షం), శ్రేష్టమగు శివమగు నిర్మల తురీయాతీతం, త్రిఅగ్నులను (తనలో ఏర్పడునది కామవాంఛ, పరుల మీద ఏర్పడు కోపము – క్రోధం, దైవముపై అగ్రహణంతో మరియూ అన్యధాగ్రహణం – మోహం – అజ్ఞానం) తొలగించునదైన శివానందమునూ, శ్రేష్టమైన సమాధియూ గిట్టును సుమా!!

## 24. త్రిస్వరూపములు

(జీవ, పర, శివ స్వరూపములు)

2478. అహంకారములో బంధీలైన జీవాత్మలను, దైవము తన త్రిస్వరూపములో ఇమిడ్చి పక్వపరచి ముక్తి నొసగుచున్నాడు: అహంకార మలములో కట్టబడిన జీవులను పక్వపరచుటకని కర్మలు, మాయ, మామేయం, తిరోదాయిలను కల్పించి, అహంకారము చెడునట్లు చేసి ద్వందములు (మంచి, చెడులను) సమముగా చూచు "శివోహం" భావన కల్పించి, పైబడి జీవ, పర, శివస్థితి పొందించి, దానినుండి విడిపించి, కడపట అనాదియగు సత్వస్వరూపములో నిలకడ పొందునట్లు చేయును సుమా!! (జీవ, పర, శివ స్వరూపములన్నియూ ప్రకాశ అణుకిరణములే.)

2479. ఆత్మజ్యోతిని దర్శించినవారికి జన్మపీడలు తొలగును: త్రిభువనములందు (ప్రకృతి మాయ, అశుద్ధమాయ, శుద్ధమాయ) మూవురు ఉండు స్థానములు (సకలురు, ప్రళయాకలురు, విజ్ఞానకలురు) వీరి కొరకై పైమూడు మాయలనుండి ముప్పదిఆరు (36) తత్వములు ఏర్పడియున్నవి. పై మూడు మండలములలోనూ ఉద్భవించి నెలకొనియున్నది ఆత్మజ్యోతియే. దీనిని దర్శించినవారికి ఎత్తవలసిన జన్మలెక్కలు

వీగిపోవును. (ఇక పునర్జన్మలు ఉండజాలవు.)

2480. జగత్తు ఉద్భవించినపుడే కొన్ని పుట్టి, లయమైపోయినవి. ఆ లయ క్రమములో జ్యోతిరూపములైన జీవ, పర, శివ ఒక్కటై వెలయును. (ప్రణవమును దాటి జీవుడు పరస్థితిలోను, దీనిని దాటి శివశక్తిలో ఇమిడి అఖండముగా (విభజన లేక) వెలయును. ఈ ప్రక్రియను బాగుగా పరిశోధించి చూచినచో, ఈశుని తత్వము, ఆతని మహత్వము ఎవరెరుగుదురు సుమా!!

2481. దైవము జగత్తునందు సకల జీవరాశులను సృష్టించి, వాటితో ఏకమైయ్యూ, వాటికి వేరుగాను, వాటికి తోడుగాను కలిసియున్నాడు: మహత్వంతో నిండిన దైవము సకల జీవరాశులలో పెద్దవి, చిన్నవి అని సకల భేదములను కల్పించి, తానందు ఆకారుడుగాను, నిరాకారుడుగాను, అపరోక్షముగాను నెలకొని, గురువుగాను, నాదశక్తికి నాయకుడుగాను, జీవులలో సమిష్టి రూపముగాను, జీవులకు తోడుగాను యుండి, వాటిచే గ్రహింపబడకుండాను యున్నాడు.

2482. నందీశ్వరుని దివ్యచరణముల చేతనే జీవుడు మహత్వము పొందును: తెల్లని స్ఫటికము మాణిక్యము దరి చేయుటచే పొందు ప్రకాశము వలె, మాణిక్యము ఎప్పటికీ తన నిజతత్వము కోల్పోక నిలుచుండినట్లునూ, తన తత్వముతోనున్న జీవాత్మ జీవస్వరూపము, పరస్వరూపము, శివస్వరూపములగు శక్తులతో కూడినపుడు సాధారణ స్ఫటికము మాణిక్య ప్రకాశమును పొందినట్లు, జీవుడు శివుని దరిచేరి, శివుని మహత్వము పొందును గాక!!
(మలదోషములతో కూడిన స్థితి – జీవస్వరూపము. మలదోషములను తొలగించుకొని వ్యాపకములో నెలకొన్నది – పరస్వరూపం. శివుని దరిచేరి శివునితో ఇమిడియున్న స్థితి – శివస్వరూపం. స్ఫటికం, మాణిక్యంలు జీవ, ఈశ్వరులకు ఉపమానములు.)

2483. స్ఫటికమువంటి జీవాత్మ మాణిక్యమువంటి శివుని వలన ప్రకాశము పొందినట్లు, శ్రేష్టత పొందగోరి, నెలకొన్న "తత్వమసి" ("అది నీవైతివి") అన్న త్రిపద జ్ఞానముతో త్రిదోషములను (బోధ దోషం, జీవదోషము, శివదోషములు) రహితం చేసి, నిలచి, వాక్కుతో పొందలేని ప్రణవముతోడుతో జ్ఞానముద్రాంత్య అనుభూతితో తన అహంకారము వీగిపోయి జన్మలు తెగిపోవును. (బోధదోషం = తన ఇంద్రియ ప్రజ్ఞలను త్రోసిపుచ్చుట; జీవదోషం = "నేను" అన్న అహంకారం నశింపజేయుట; శివదోషం = నేను వేరు, శివం వేరు అన్న ద్వైతభావన; జ్ఞానముద్ర + అంత్యము = ప్రణవ ఉపాసనతో అంత్యమున ఏర్పడు అనుభూతి.)

2484. శిరస్సు సహస్రమున వెలుగు జ్యోతితో ఐక్యమొందుట: మార్చబడిన తత్వముతో

కూడిన సహస్రదళ పద్మములో వెలుగు జ్యోతితో, మూలాధారము నుండి పైకెగిసిన శక్తి (కుండలినీ శక్తి) నాదముతో ఇమిడినచో అచ్చట "పయోధరి" (అమృతం నొసగు చంద్రమండల ప్రకాశము) బహిర్గతమై, ముందుగా మూసివుంచిన ద్వారములన్నీ తెరువబడును సుమా!! (మార్చబడిన తత్వము = పరిపక్వతతో సంస్కరించబడిన సహస్రదళ పద్మము; అధోముఖము దోరణి నుండి ఊర్ధ్వ ముఖముగా మారుట. కుండలినీ శక్తి సహస్రదళమునకు చేరి నాదములో ఇముడుట.)

## 25. త్రికరణములు

(మనో, వాక్కు, కాయములు)

2485. జీవుడు, పర, శివుడు మూడునూ శరీరము, ప్రాణమువలె వేరైనది గాదు: తాను నెలకొనుటకు గాను స్థూల, సూక్ష్మ, కారణ శరీరములను ఏర్పరచి ఆత్మ ఇమిడినట్లు, తాను ఆ శరీరములన్నీ వేరేయనునట్లు, జీవుడు, పర, శివుడన్నది వేరేనని చెప్పగలమా? చెప్పలేము. (ప్రాణమునకు శరీరమునకు ఉన్న భేదము వంటిది కాదు. జీవుడు, పర, శివుడు మూడు తత్వములు ఒక్కటే – పక్వపడి అన్నీ ఒకటై పోవలసినదే.)

2486. ప్రకాశమగు నేత్రములను మరింత ప్రకాశవంతము చేసి, ప్రణవ (ఓం) ధ్యానముతో మూలాధారము నుండి అగ్నిని పైకి ప్రాకించి, చంద్రకళ, సూర్యకళ ఏకపరచి, సుషుమ్నలో ఇమిడి, అవతలకు అవతలనుండు బట్టబయలులో దృష్టి నిలిపి, ధ్యానముద్రలో తేటయైన, శ్రేష్ఠమైన శివపదం ఏర్పడును. (ఊర్ధ్వ సహస్రమున దృష్టి నిలిపినవారికి కరణములు చేష్టలు అణిగి శిరస్సున ప్రకాశం దర్శనమగును.)

2487. నందీశ్వరుడు జీవాత్మలకు నీరసము పోగొట్టి నిరాధారములో సమాధి సిద్ధించునట్లు అనుగ్రహించును: మనో, వాక్కు, కాయము (శరీరము) కరణముల నీరసము పోగొట్టి, అన్నియూ అరచేతిలో ఇముడునట్లు జ్ఞానసామర్థ్యమును నంది అనుగ్రహించి, శిరస్సులో బోర్లగాయున్న మనోన్మణిని (సహస్రదళ పద్మము) ఊర్ధ్వ ముఖముగా మార్చి సమాధి గిట్టునట్లు అనుగ్రహించెనే!!

## 26. త్రిపదముల శూన్యస్థితి

("త్వం తత్త్వసి" స్థితి వీడిన – శూన్యస్థితి)

2488. "అది"యన్న తత్ పదమును, "నీవు" అన్న త్వం పదమును "అయినావు" అన్న అసి పదమును అనాదియైన ఈ త్రిపదములు నిర్మల తురీయంలో వెలసి, అట్లు వెలసినదానిలో ప్రాణమయమగు జీవ, పర, శివుడు నిలుచుండును. ఈ మూడు

పదముల సమ్మేళనమే "త్వంతత్తసి" యగును.

2489. త్వంతత్తసి పదములో మలము, గుణములు తొలగిన స్థితిలో ఆత్మ ప్రకాశమొందును: త్వంతత్తసిలో అనాదియగు కామ్యము, మాయ, అహంకారములునూ, అనాదియగు గుణత్రయములగు తమో, రజో, సత్వములునూ, మల, గుణదోషములు నివృత్తియైనచో శివుడు బహిర్గతమై, ఎట్లు పూర్ణచంద్రోదయముతో చీకటి తొలగిపోవునట్లు ఆత్మ ప్రకాశమొందును సుమా!!

2490. "త్వంతత్తసి" ని శివుని ఎదుట "తత్త్వమసి" అని ఉచ్ఛరించవలెను. "త్వంతత్తసి" యను వాచ్యార్థమును శ్వాసతో కలిపి చేయుటచే "య"కారము (జీవుడు) నెలకొనునట్లు చేసి, అంత్యములేని ఆ మహావాక్యమును ఉచ్ఛ్వాసలో నిలిపి శివుని ముందుగా పెట్టి "తత్త్వమసి" యని జపింపవలెను సుమా!! (పంచాక్షరిలో శి=శివుడు; వా=శక్తి; య=జీవుడు; తత్=శివుడు; త్వం=జీవుడు; అసి=అయియున్నాడు; "అది నీవైయున్నావు" మహావాక్యము విచారణ – చాంద్యోగ ఉపనిషత్.)

2491. ముందు మంత్రములో చెప్పినట్లు శివుని (తత్) ముందు పెట్టి, చంద్రమండలములో నెలకొనునట్లు చేసి, ప్రణవ మంత్రోపదేశమును చిత్తశుద్ధితో జపించి, సహస్రదళము నందు నెలకొనునట్లు చేసి, అందు స్థితిపొంది, సత్యరూపుడగు శివునికి బానిసనని భావించినచో ఆనందమయమగు ఆత్మ వెలయును సుమా!!

2492. సహస్రదళ పద్మము వికసించి, ప్రకాశము పొందిన పిదపయే "పర" పదము బోధపడును. ఇదియూ నిరాధారస్థితిలో ఏర్పడు ప్రకాశమే. ఇచ్చట శాంతి ఏర్పడును: మాయతో కూడుకొన్న త్వం (జీవుడు) పదము, శ్రేష్టముగా పరంనందు వెలయు పరపదం, శాంతిని కోరి నెలకొను అసి పదమునూ మహావాక్య విచారణ యగును. "నీవు అది అయితివి" అని శ్వాస ద్వారా సృజించనగును.

2493. దేశ, కాల, వస్తు భేదము తొలగినపుడు జీవుడు శివమగును: దేవదత్తుని యందు కాలము, దేశము త్రోసిపుచ్చినచో, "అతనే ఇతను" అన్నట్లు, దేహమున మాయ వీడినచో "అది నీవైతివి" అని అందురు. అపుడు సత్యజ్ఞానమగు జీవుడు పరమై శివమగును. (వేదాంతమునందు చెప్పబడు పరిభాష – ఒకరిని చెప్పునపుడు "దేవదత్త" నామంను, "వాడే వీడు" అనుటకు ఉదాహరణ కొరకు వాడబడినది. దేశ, కాల, వస్తు, మల, గుణ రహితమైన జీవుడు సచ్చిదానంద స్వరూపుడే.)

2494. జీవుడు త్వంతత్తసిలో మల, గుణరహితమై అకారవాసిగా ప్రణవమును దాటి నెలకొనును (శూన్యం): తామస, రాజస, సత్వమను త్రిగుణములునూ, కామ్యము, మాయ, అహంకారమను త్రిమలములునూ, ప్రణవమగు అకార, ఉకార, మకారములచే వైదొలగును. జీవుడు అకారముగా (అఖండముగా) స్థూల, సూక్ష్మ,

కారణ శరీరములను దాటి వెలయు తురీయంలో (నిశ్శబ్దం – మౌనం – అమాత్రగా – అన్నిటికీ విలక్షణముగా, సాక్షిగా నున్నది. శూన్యం అనునది నిజముగా శూన్యస్థితి గాదు, అన్నిటినీ దాటిన ప్రణవాతీత స్థితి.)

**మరింత వివరణ:**

త్రోసిపుచ్చుట, తొలగించుకొనుట, త్యజించుట ఇవియన్నియూ అనాత్మయైన దేహేంద్రియ మనోబుద్ధుల తత్వములకు చెప్పబడినవి. వ్యవహార జగత్తునందు కొన్ని తత్వములను భౌతికముగా తొలగించలేము. ఏలనగా జీవుడు (జీవాత్మ) ఆత్మానాత్మల మేలుకలయిక. అనాత్మ తత్వములన్నియూ జడం. అది ఆత్మ ఉనికి (సన్నిధి) వలన ఆత్మ నుండి చైతన్యంను అరువు తెచ్చుకొని తన అన్ని వృత్తులు చేయగలుగుచున్నది. కొన్ని ఉపాధుల (వృత్తులు) చేత తానే ఆత్మ అన్నట్లు కూడ వ్యవహరించుచున్నది. అనాత్మ ఎప్పటికీ "పరతంత్రము".

కాని ఆత్మ ఎన్నటికీ స్వతంత్రం, అసంగము, సర్వఅధిష్టానం, చైతన్యము. కాని ఆత్మ తనంతట తానుగా ఏమీ చేయజాలదు. దీనిది నిష్క్రియ. ఆత్మ ప్రకటితమగుటకు ఒక మాధ్యమము కావలెను (జీవరాశి/జీవాత్మ). ఆత్మ అనాత్మ తోడుతో జీవుడుగా శారీరక, జగత్తు వ్యవహారములను నిర్వహించుచున్నది.

అనాత్మయైన జీవుడు దేహతత్వములతో మామేకమై సంసార బంధములలో మునిగి పోతున్నాడు. దీనిని ఎరిగిన వివేకి తగిన సాధనలగు కర్మ, ఉపాసన, జప, తపాదులచే చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత పొంది, జ్ఞాన అర్హత పొంది, గురోపదేశముతో, గురుముఖతః శాస్త్రశ్రవణ, మనన, నిదిధ్యాసనములు చేసి జ్ఞానము, చిత్తవైశాల్యత (సమత్వ భావన) పొంది, తానెప్పటికీ అనాత్మ తత్వముగాదని, ఎప్పటికీ సచ్చిదానందమని బుద్ధిపూర్వకముగా ఎరిగి (Intelectually paradigm shift) వ్యవహారములన్నిటినీ దూరముగా ఉంచును.

జ్ఞానికి, అజ్ఞానికి వ్యవహారములన్నియూ, జగత్తునందు సమానమే. కాని జ్ఞాని సాధనలచే సత్యతత్వమును ఎరుగును. అజ్ఞాని దానిని ఎరుగక వ్యవహార తత్వములందే లీనమై వాటితో మామేకం చెంది, సంసార బంధములలో చిక్కుకొని జననమరణ చక్రమునందు కొట్టు మిట్టాడును.

జ్ఞాని సత్యతత్వమును ఎరిగి నిర్విరామముగా పారమార్థికసత్యంలో ఆత్మ/శివ తత్వములో నెలకొనుటచే అంత్యముగా "శివం" అగును.

## 27. త్రివిధ నాశనములు (శూన్యమగుట)

(మూడు విధములైన నాశనములు: మాయ నాశనం = ఆత్మ తత్వములన్నిటిని దాటిన స్థితి; బోధనాశనము = జీవబోధన వృత్తి నాశనం; ఉపశాంత నాశనం = ఉపశాంతములో

"పర" బయలులో నెలకొనుట (దీనినే వ్యోమనాశనమందురు - శూన్యం ఏర్పడుట.))

2495. జ్ఞానవిచారణతో మాయ కార్యములగు విద్యాతత్వములగు ఏడును (7) అసత్యములని ఎరుగుటచే నిజస్వరూపమెరిగి తన దేహప్రజ్ఞలును (మాయ నాశనం - తత్వశుద్ధియగుట), కార్యములకు అనాదియగు కారణములగు ఎరిగి, శివస్థితులు ఏడింటిని గ్రహించుటచే ఏర్పడు జీవబోధనం వీడుట, (జీవబోధ నాశనం - ఆత్మశుద్ధి), కార్య, కారణముల ఇమిడిన వాసనలను (మంచి, చెడులు, ఆసక్తి) గ్రహించుటచే ఏర్పడు ఉపశాంతం వీడుట, పై మూడు జీవాత్మను వీడుట వలన జన్మలు తొలగును.

(మాయశూన్యం, బోధశూన్యం, ఉపశాంతశూన్యం వలన జన్మరహితమగును.)

2496. మాయనాశనం, జీవనాశనం, ఉపశాంతనాశనం మూడునూ పరజ్ఞానమునకు అడ్డు తొలగించునవి. శివశక్తి అనుగ్రహముతో జీవుడు తన వ్యాపకము వదిలి పరస్థితి పొంది అహంకారం వదిలి, శివవ్యాపకములో తనను ఇముడ్చుకొనుట. ఇటువంటి శుద్ధమైన శివస్వరూపములో అణిగి నిలుచుటయే "తత్త్వమసి" మహావాక్యం యొక్క అంత్యమగును. (తత్వరహితమై, బోధరహితమై, ఆసక్తిరహితమై సర్వవ్యాపకములో నెలకొనుటయే "తత్త్వమసి" మహావాక్య అర్థము - అది నీవైయున్నావు.)

2497. నందీశ్వరుని శ్రేష్ట అనుగ్రహముతో త్రినాశనములను దాటి శివవ్యాపకములో ఇముడుట: తనకు ఉపమానం లేని పరబిందు మండలము ఎరుగనగును. నాయకుడగు నందీశ్వరుని దివ్యచరణములలో నెలకొనుటయే, అదే గమ్యమని తలంచి త్రినాశనములు చేసుకొని, వాటిని వట్టి ఊహలే అని గ్రహించి, దానికి అవ్వల (దాటిన స్థితి) నున్న ఊహించలేని స్థితిలో ఇమిడి నిలుచున్నాను సుమా!!

2498. వివేకము గలవారు త్రినాశనము దాటి తురీయాతీత స్థితిలో ఇమిడి నెలకొందురు: తురీయంను దాటి వెళ్ళుటకునూ, త్రినాశనములు చేసుకొని ఉచ్ఛస్థితికి వెళ్ళలేమని అవివేకులు చెప్పుదురు. కాని వివేకులు శ్రేష్టమైన, మేలైన స్థితి ఆ పరంమేనని నమస్కరించి, స్తుతించి, ఆ త్రినాశన దాటిన స్థితే గమ్యం, శ్రేష్టం అందురు.

(ఈ స్థితిలో సర్వవ్యాపకములో నెలకొనుటచే అన్నిటిని ఎరుగు జ్ఞానముదయించును. ఇది శివశతాక్యములో ఉత్పన్నమైనది. "**బహి ప్రజ్ఞలగు విశ్వ-విరాట్ జంటనూ, అంతః ప్రజ్ఞలగు తైజస-హిరణ్యగర్భ జంటనూ, ప్రజ్ఞానఘనః యగు ప్రాజ్ఞ-అంతర్యామిని (ఈశ్వరుడు) జంటనూ దాటిన స్థితియే తురీయం. అది అమాత్ర (అ, ఉ, మ - దాటిన స్థితి) - అవ్యవహారం - ప్రపంచోపశమం - శాంతం - శివః - అద్వైతః - సః ఆత్మా సఃవిజ్ఞేయః**" - మాండూక్యోపనిషత్.

"బహిప్రజ్ఞ = జాగ్రదావస్థ; అంతఃప్రజ్ఞ = స్వప్నం; ప్రజ్ఞానఘనః = సుషుప్తి. పైన మూడు జంటలుగా చెప్పబడినవి "స్థూల, సూక్ష్మ, కారణ – శరీర, ప్రపంచములు (6)).

2499. ముప్పదిఆరు (36) తత్వములను తొలగించుకొనిన ఆత్మ పరం సహాయముతో శివునిలో ఐక్యమగును – ఇదే పంచాక్షరి మూలం తత్వములు తొలగించుకొని, "న, మ" విడచి (న – తిరోభావన, మ – మలము) దివ్య అనుగ్రహశక్తియగు పరం "య" జీవాత్మని అంత్యమగు శివశక్తితో చేర్చును. ఆహా!! ఇదికదా గ్రహించలేని సత్య "పంచాక్షరి" సూక్ష్మతత్వము!! (మంత్రము 941లో నమశివాయ – శరీర వివరణ కలదు.)

2500. మనోమండలమే దేహము అనుకొని, దేహమే మనోమండలమని తలంచుటయూ, ఈ రెండింటి సత్యమును యదార్థముగా ఎరుగు జ్ఞానులకు పల్లము లేదు, మిట్టయూ లేదు. కార్య, కారణ, ఉపశాంత నాశనములు లేవు. మనస్సు కూడ లేదు. ప్రకృతి ఆధిపత్యము లేనందున దేహధర్మములు దాటి నెలకొనును.

(మనోమండలము గుణదోషములతో కూడినది. పంచకోశములగు అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములలో మూడవది యగును. ఇది జీవుని సంకల్పం, ఇచ్ఛలతో పురికొల్పును. త్రిగుణాతక్మమైనది. దీనిది కోశానందమే. శాశ్వతానందం ఇవ్వజాలదు. ఆత్మపంచకోశ విలక్షణము; పల్లము = దిగజార్చునది – నరకం; మిట్ట = ఉన్నతి – స్వర్గం.)

## 28. కార్య, కారణ ఉపాధి

(జీవబంధం, పరబంధంలే కార్య, కారణ బంధములు. ఈ బంధములే ఉపాధులు)

2501. కార్య, కారణ ఉపాధులు తొలగినచో ఆత్మ శివమగును: దుఃఖమును ఏర్పరచునదైన మాయకార్యమగు విద్యాతత్వములు ఏడూనూ (7), నెలకొన్న "పర" ఉపాధులగు శివతత్వము ఏడునూ (7), (శుద్ధ విద్యా, ఈశ్వరుడు, మహేశ్వరుడు, బిందు, నాదం, శివ, శక్తి) కార్య, కారణ స్థితుల నుండి వైదొలగునపుడు పంచాక్షరి నెలకొనును. అట్లు తొలగిన స్థితిలో ఆత్మ శివమగును.

2502. తత్వములను తొలగి జీవుడు తురీయంలో సృజించినపుడు "త్వం" పదస్థితి యగును: చిత్తములో శివుని పదిలపరచుకొని జీవాత్మను బంధించియున్న కార్య ఉపాధులు ముప్పదిఆరు (36) తత్వములు తొలగి, తత్వములకు వేరై నిర్మల జాగ్రదలోను, స్వప్నంలోను సృజించి, సుషుప్తిలో (నిద్రలో) జారిపోక, శ్రేష్టమగు తురీయం స్థితిపొందిన జీవుడే "త్వం" పదమగును.

2503. త్రిపదములలో – ఓంకారమగు ప్రణవములో 'అ'కారము జీవుడు. 'ఉ'కారం –

అహంకార రహిత పరం, 'మ'కారము శివమై నిలుచుండును. ఇక 'శివాయ' పదములో 'శి'కారం – శివుడు, 'వ'కారము – పరం, 'య'కారం – జీవుడని పిలువబడును.

2504. జీవుల పరిపక్వస్థితియూ, దైవము యొక్క కరుణ వలనే కార్యోపాధులు తొలుగును: ప్రాణమునకు ప్రాణముగా ఉండి ముక్తిని, పూర్ణత్వము నొసగునదియూ, కారణ ఉపాధులను తొలగించునదియూ, జీవుల పరిపక్వ స్థితియూ, తోడుగా నిలచిన దైవము యొక్క కరుణ వలననే తప్ప, జీవులను అనాదిగా బంధించియున్న అహంకారమును తొలగించుట ఎవ్వరికీ సాధ్యము కాదు.

2505. ఆత్మ (జీవాత్మ) కారణ, కార్యములను దాటిన స్థితిలో పరమాత్మలో నెలకొనును: కార్య ఉపాధులు ఏడింటిలోను అహంకార మలము వలన పశుతత్వముతో జీవుడు మోహంలో పడియుండును. కారణ ఉపాధులగు ఏడింటిలో జీవుడు ప్రకాశమును గ్రహించుటచే మేలైన శివునిలో నెలకొనును. కార్యముగా ఉన్నవియూ, కారణముగా ఉన్నవియూ, కేవల ఊహాజనితములే. "అసి" పద అర్థము గ్రహించి, అందు అనుభవము పొందునపుడు అది దాటి మేలైన, శ్రేష్టమైన పరంగా ఉన్నదానిలో వెలయును. (కార్య ఉపాధులు = విద్యాతత్వములు (7), కారణ ఉపాధులు = శివతత్వములు (7).)

## 29. ఉపశాంతం

(ఇష్టాయిష్ట, ఆసక్తి రహిత స్థితి)

2506. శివజ్ఞానమే ముక్తి పొందుటకు విత్తు (విత్తనం). శివుని యెడ తనను మరచి నెలకొనునదే భక్తికి విత్తనము. శివపరము తానైనదే సిద్ధికి విత్తనము. తన ఉపశాంతమే (ఇష్టము, అయిష్టములేని ఆసక్తి రహితమైన స్థితియే) శక్తికి విత్తనము.

2507. కార్య ఉపాధులు ఏడు మాయలో కరిగిపోవును (లయమగును). కారణ ఉపాధులు ఏడు ప్రాకాయమైన శివునిలో లయమగును. కార్య, కారణ ఉపాధుల వాసనల బంధము వీడినచో, మహత్వం నిండిన ఉపశాంత ఫలసిద్ధి గిట్టును.

2508. జాగ్రదాతీత స్థితిలో ఆత్మ పరమై శివశక్తిలో ఇమిడి నెలకొనునదే ఉపశాంతమగును: ముందు మంత్రములో చెప్పినట్లు తత్వములు దాటి తురీయం స్థితిలో నిలుచుటయే ఆత్మశుద్ధి యగును. తత్వములు లయమైన పిమ్మట దేహమునందు "పరం" బహిర్గతమగును. ఆ పరం తనతోనున్న శివశక్తిని వీడక వ్యాత్తమే (అణుగుట) ఉపశాంతమగును. (శివతురీయంలో నిలుచుట.)

2509. ఉపశాంతము పొందుటకు ఐదు మెట్లు చెప్పబడినవి: ఆత్మ ముప్పది ఆరు (36) తత్వరహితమై బంధము వీడి నిలుచుట. స్వతసిద్ధమైన తన స్వరూపమును ఎరుగుట.

స్వస్వరూప జ్ఞానము పొందిన పిమ్మట శుద్ధి పొందుట, మాటలతో వర్ణించలేని జాగ్రదాతీతంను పొందుట. గురుపరునితో (పరాపరంలో నెలకొన్న శివునిలో) అణిగి నెలకొనవలెను. ఇదే తత్వములకు విరుద్ధమైన ఉపశాంతమగును. (తత్వముల వెంట వెళ్ళక శివుని వెంట వెళ్ళుట.)

2510. పైన చెప్పిన ఐదింటితో మరొక ఐదు (5) మెట్లు: తనకు లభ్యమైన ఉపశాంతం నెలకొనుటచే పొందిన శివానందమును త్రోసిపుచ్చుట, తానన్న భావన తొలగించు కొనుట, ఆనందమైన స్థితియగు మౌనం పొంది, దానిని త్యజించుట మొదలగునవి దశ మెట్లు అగును. (1. తత్వరహితం, 2. స్వస్వరూప మెరుగుట, 3. దానిని త్రోసిపుచ్చుట, 4. జాగ్రదాతీతం, 5. శివునిలో అణిగి నెలకొనుట, 6. శివమగుట, 7. శివానందంనూ త్యజించుట, 8. తానన్న భావన (అహం) త్రెంచుట, 9. ఆనందస్థితి పొందుట, 10. ఆనందస్థితిని కూడా త్యజించుట.)

2511. ఉపశాంతస్థితిలో ఆత్మానుభవము: పరప్రకాశములో వ్యాప్తం చెంది (అణిగి/ఇమిడి), పరంతో ఏకమై, పొర తొలగి లోతైన సముద్రపు నీరు వలె, గురోపదేశమును గ్రహించి శివానందమును అనుభవించు ఆత్మ, చెప్పనలవికాని బ్రహ్మానందమునొంది జన్మ సముద్రమును ఈదినవాడగును.

## 30. బాహ్యప్రవర్తన

(అంతర్ముఖులై బాహ్యప్రవర్తన మానవలెను)

2512. నీలకంఠ పెరుమాళ్‌ను అంతర్ముఖులై పొందవలె: చంద్రునిలో కనిపించు కుందేలును చంపుటకు రత్నం పొదిగిన కత్తిని పట్టుకొని వెళ్ళినట్లు బాహ్యముగా నీలకంఠ పెరుమాళ్ళను దర్శింపనలవి కాదు. ఉపశాంతస్థితిని పొందితమని డాంభీకము చాటుకొందురు. వీరు అంతర్ముఖులు కాక వట్టి డాంభీకము చేయుచూ తిరుగువారే సుమా!!

2513. నల్లటి కాళ్ళు కలిగిన గరుడపక్షి ఆకాశములో తిరుగాడునపుడు, నల్లటి త్రాచుపాము ఎట్లు నల్లటి నీటిలో దాగుండిపోవునో, అట్లు ఓ మనసా! గొప్పలు చాటక ఊరుకొందువు గాక! ఉద్రిక్తముగా ఉప్పొంగు సముద్రపు అలలో నదీజలము కలసి అణిగిపోవునట్లు సుమా!!

2514. బాహ్యముగా శత్రువులను జయించుటకంటే అంతరమున నున్న శత్రువులను జయించుటయే నిజమైన ధీరత్వము: శత్రువులతో యుద్ధభూమిలో యుద్ధము చేసి చంపుట, అల్పతనముతో చేయు ధీరత్వమగును. ఉపశాంత స్థితిలో తపస్సు సఫలమైనచో, జనులు కోరువన్నిటిని ఇవ్వగల దేవతయగును!!

2515. శివుని తప్ప మిగత దేవతలను కోరుకొనవలదు! సకల లోకములకు ఈశుడే

మహానాయకుడని, కరుణాసముద్రమని స్తుతించినచో, పదునెనిమిది (18) గణనాథులు వచ్చి నీ చరణములను నమస్కరించుదురు. ఆ విధముగా దైవమును స్తుతించి ఆనందమొందుదువు గాక!!

2516. నాకన్నా, నా ప్రాణముకన్నా మేలైన శివమహామహుని, బంగారము కన్నా, రత్నము వంటి ప్రకాశరూపుని, అన్ని జీవరాశులలో నెలకొన్న ప్రాణముగా నున్నవానిని, అంత్యములేని సామర్థమున్న వికర్తను, నీవు నీ చిత్తములో నిలుపుకొన్నచో, వాడు నీకంటే అధికమైన ప్రేమతో నిన్నాదుకొని అనుగ్రహించును సుమా!!

2517. శివుని చిత్తములో నిలుపుకొన్నచో, పంచప్రజ్ఞలు ఏకమగును: నిలుచున్ననూ, కూర్చున్ననూ, పడుకొన్ననూ, నిర్మలశివుని తలంచి స్తుతించుదువేని, పంచప్రజ్ఞా వాటములను నశింపజేసి, వాటి వాసనలను విడివిడిగా చూచు తత్త్వమును నశింపజేసి, వాటినన్నటిని ఏకముగా చూచు శివతత్త్వమొనగూరును సుమా!!

2518. దైవమును నిర్విరామముగా ధ్యానించు జ్ఞానులను దేవాదిదేవతలు కూడ స్తుతించ కోరుదురు: జీవునిలో సృజనకు సృజనగా ఉండి, సమస్త లోకములుగాను, సప్తలోకస్తులు స్తుతించదగ్గ, వారికి జ్ఞానముగా ఉండియూ, నా పరమాత్మ అర్హత గలవారి జ్ఞానములోనూ ఇమిడియున్నాడు. నిర్విరామముగా ధ్యానములో నిమగ్నులైన జ్ఞానులను దేవలోకస్తులు కూడ వారి ఉన్నతి కొరకు స్తుతించకోరుదురు సుమా!!

2519. దైవ దివ్యచరణములందు అంతర్ముఖులైనవారు పరం అగుదురు: దేవలోకవాసులు కూడ బాహ్యముగా గ్రహించలేని పరమాత్మ, ప్రాతఃకాలమున నేత్రద్వయమును అంతర్ముఖముగా దృష్టి సలపి మూడుపూటలు (ఉదయం, మధ్యాహ్నం, సంధ్యా) నీవు స్తుతించినచో, శ్రేష్టమగు పరం అగు తత్త్వం నీవు పొందుదువు సుమా!!

2520. పరమేశ్వరుడు ఏకమై, ఏడు లోకములకూ వ్యాపించియున్నాడు. వాని దివ్య చరణములను పదిలము చేసుకొన్నవారికి, పిదప అనుగ్రహము నొసగువాడయ్యెను. ఎటువంటి వికారము లేని మనస్సు సలిపినవారికి జ్ఞానముగా వెలుగొందును. ఎప్పటికీ వాడిపోని సహస్రదళ పద్మములో ఇమిడి నిలుచుండు కీర్తి గలవాడు అతనే!!

2521. నా తండ్రియగు శివమహామహుని బంగారు దివ్య చరణములను స్తుతించి నమస్కరించుచున్నాను. ఆ స్తుతుల వలన ఏర్పడినదే నాలో వెలుగు ప్రకాశమణి యగును. అది ప్రాణణతో ఏర్పడిన అంతర ప్రకాశమగును. దానివలన శరీరమునకు శ్రేష్టస్థితి ఒనగూర్చు నాదము శబ్దించెను. అపుడు దైవము నెలకొన్న దివ్యసభను దర్శించితిని.

2522. నా సహస్రదళమున ఆతనిని వెతకి, అందు తను నెలకొనియున్నాడని కనుగొన

గలిగితిని. ఇట్లు శరీరమునందే వెలసిన వానిని అంతర్ముఖులై కనుగొను వారెవరు లేరు. ఈ అస్థిపంజరమును మోస్తున్న బ్రహ్మదండము (వెన్నెముక) ద్వారా పైకి ఎగబాకి సహస్రము చేరుకొని, వాని దివ్యకోళమును కన్నులు మూసియే గాంచితిని. సప్తలోకములను గాంచితిని.

2523. సహస్రదళమున నెలకొన్నవారికి శివుడు వీరుడై దర్శింపజేయును: శివుని స్తుతించుటచే ఏర్పడునది జ్ఞానముతో శివానందమను తేనె స్రవించు సహస్రదళమును గ్రహించి, దేహమును దాటి నిరాధారములో చిత్తమును పదిల పరచుకొనువారికి, ఆకాశమును శరీరముగా గల వీరుడుని దర్శింపనగును.

2524. నిరాధారమైన చంద్రమండలములో చిత్తము ఉంచి నెలకొన్న మహాతపస్సులకు, జ్ఞానముతో వెలుగు జ్ఞానరూపుడైన శివుడు, పరమానందమొసగువాడై, అటువంటి శివజ్ఞానములో తన జ్ఞానము కలిసి ఏకమై, ఉపశాంతము ఏర్పడినది. అట్లు ఏర్పడినది మలదోష రహితమై దివ్యచరణములందు పరమశాంతి పొందినదగును.

2525. శివుని చిత్తమునందు పదిలపరుచుకొన్నవారు జన్మరహితమై అక్షయ (క్షీణించని) మగుదురు: పదముక్తి మూడింటిని దోషమని గ్రహించి, విడచి (పదముక్తి: సాలోకము, సామీప్యము, సారూప్యము) లౌకికభోగములను పురికొల్పు మాయచీకటిని విడచి, మదము విడచి, అహంకారము (నేను, నాదియను భావనలగు అంతర, బాహ్య బంధములు) విడచి, ఇష్టాఇష్టములు విడచి (ఆసక్తిరహితమై) నెలకొన్నవారు శివ సిద్ధులగుదురు. (శివసాయుజ్యము – రాగ, ద్వేష రహితమై, స్వర్గం, నరకం పొందగల కారణమును నశింపచేసుకొన్నవారు శివంలో ఏకమగుదురు.)

2526. శివసిద్ధులు అఖండ వ్యాపకమగు శివుని దర్శించినవారు. శ్రేష్టమగు శివధ్యాసలో స్థితిపొంది శుద్ధ, అశుద్ధ మాయతో బంధింపబడక నీటిని అంటని తామరాకువలె బంధరహితమై యుందురు. ఇటువంటి జీవాత్మ ముక్తులుగా ముందు చెప్పినట్లు శివసాయుజ్యం స్థితి అందుకొన్నవారు. మూలాధారములో వెలయు కుండలినీశక్తిని వశపరచుకొని, సహస్రదళమునకు చేర్చి, సదాశివతత్వమును అందుకొన్నవారు.

## 31. అష్టదళ కమల త్రిగుణావస్థ

(జీవుని శిరస్సున నెలకొన్న అష్టదళ పద్మము యొక్క తామస, రజో, సత్వ గుణములతో కూడిన అవస్థలు)

2527. శిరస్సు సహస్రమున నున్న అష్టదళ పద్మరేకులలో అష్టదిక్పాలకులు నెలకొని రక్షించుచున్నారు: బోర్లపడియున్న సహస్రము యొక్క అష్టరేకులలో సూర్యుడు ఉదయించు తూర్పున ఇంద్రుడు, ఆగ్నేయములో అగ్ని, దక్షిణమున యముడు, నైరుతిలో నిర్ృతి, పడమట వరుణుడు, వాయవ్యమున వాయువు, ఉత్తరమున

కుబేరుడు, ఈశాన్యములో ఈశానుడు నియమించి (పాలకులను ఏర్పరచి) శిరస్సు చుట్టూ రక్షించుచున్నారు.

2528. శిరస్సున నెలకొన్న సహస్రమున తామర అష్టరేకులతో కూడినది. మహత్వమైన ఈ మాయదేహములోని వెన్నెముక మధ్యన "చిత్రాణి"యను నామముతో సుషుమ్న నాడిలో ఇమిడియున్న జ్యోతిని ప్రజ్వలింపజేసి ఉన్నతి పొందగోరి పైకి లేపుదురుగాక!!

2529. బోర్లపడియున్న సహస్రదళ తామరలో సూర్య, చంద్ర, అగ్నికళలు ఇమిడియున్నవి. ఈ మూడింటిలోని జ్యోతి వలన సహస్రదళము విస్తరింపజేసి, దాని మధ్య దైవము నిలుచుచున్నాడు. అట్లు విస్తరించిన రేకులలో సూర్యకళ, చంద్రకళలు నెలకొని సహస్రము విస్తరించుటచే ఆ ప్రకాశకిరణములచే దేహము స్వప్నదృశ్యం వలే లేకుండా పోవును.

2530. శరీరంలో ఆరు ఆధారచక్రములో ద్వారా పైకి వెళ్ళదగు భావనయగు నీరు వెళ్ళి చేరు బ్రహ్మరంధ్రమను ఒక చెరువు గలదు. ఆరు చక్రస్థానములకు ఏకం చేయగల "శివగతి" యున్నది. ఇది బహు సూక్ష్మమైన జ్యోతిస్థానమగును. దీనిని ఏకము చేయగల కుండలినీశక్తితో కూడ, దానికి వేరుగాను శివం అక్కడ నున్నది.

2531. అష్టదిక్కులు, అష్టదిక్పాలకులు, అష్టదిక్పాలకుల రథములు, అష్టమూర్తిగా నిలుచున్న పరమేశ్వరుడు, కర్మేంద్రియములైదు (5), జ్ఞానేంద్రియములైదు (5), మనస్సు, బుద్ధితో (2) పన్నెండు (12)తో కూడి నిలుచుటచే బోర్లపడియున్న అష్టదళ పద్మము ఊర్ధ్వముగా మారి వికసించి నెలకొనును.

(అష్టమూర్తిగా: పృథివి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం, సూర్య, చంద్ర అగ్నులు.)

2532. ఊర్ధ్వసహస్రమున ఆత్మ గ్రహించబడునపుడు దైవముతో ఏకమగు తత్వము గలిగియుండును: అష్టదళ తామరలో ఏడుదిక్కు రేకులు జీవుడు నెలకొను జీవస్థితి – రూప/ఆకారస్థితి. ఎనిమిదవ స్థితి ఈశానంలో "పరం" స్థితి – అరూప/నిరాకార స్థితి. మధ్యస్థానం తొమ్మిదవదిలో తత్వములను అంతము చేయగలిగిన సదాశివుడు "పరం, అపరము"గాను యున్నాడు. ఊర్ధ్వమును చూచు పదవస్థితి అహంకార రహితమైన ఆత్మ శివునితో ఇమిడినది శ్రేష్టస్థితియగును.

2533. జీవులకు శుభము లొనగూర్చుటకు పలు యుగములను కల్పించు గుణము లున్నవాడు (శివ) సూర్యుడునూ దైవమగును. శుభములేర్పరచునదై యుగములు నివృత్యాది పంచకళలు (నివృత్తి, ప్రతిష్ట, విద్యా, శాంతి, శాంత్యాతీతము)తో చేయు సంహారము జీవుని అండకోశములో చేయునదగును. ఆ యుగమందునూ, ఆ యుగములను దాటి వాటికి అతీతముగాను మహాసంహారములోనూ ఉండునది ఆ (శివ) భగవానుడే సుమా!!

(పలు యుగములు కల్పించిన కరుణామయుడుగాను, మహాసంహారము (లయ మొందించుట –యుగాంతం) చేయువాడు శివుడేయగును.)

2534. బంధపాశములతో చుట్టబడిన ఈ ప్రపంచములో అష్టమూర్తులుగా చెలాయించువాడు శివుడే. అష్టదిక్కులలో తిరుగాడు దిక్పాలకుల దేవతల సమూహముతో అగ్ని, వర్షములు గలిగించుటకు ఆకాశమును ఏర్పరచి, పరమాకాశముతో బంధమేర్పరుచుకొనియూ ఉన్నాడు.

2535. అటువంటి పరమేశ్వరుడు కోరి నెలకొనియున్నది సహస్రదళ పద్మములో: ప్రకాశ కిరణముల జలపాతంలో ఇమిడి శిరస్సు అను పర్వతముపై, నది లేకుండానే నిండిపోవు చెరువొకటి (బ్రహ్మరంధ్రము) గలదు. అచ్చట బురద లేకుండా పూచిన ఒక తామరపుష్పము గలదు (సహస్రారము). అందు కోరి నెలకొనియున్నాడు. (కిరణ జలపాతం – షట్చక్ర స్థానముల ద్వారా పైకి ప్రాకిన కుండలినీశక్తి; బురద లేని – మలదోష రహితం.)

2536. శివుని దివ్యత్వము పొందినవారు సదా శివధ్యాసలోనే యుందురు: మనస్సు, వాక్కు, కాయము (త్రికరణశుద్ధితో) లతో నిలుచున్ననూ, పలు రకములైన జగత్తు వ్యవహారములు జరిపిననూ, మాట్లాడిననూ, తమ ఇంద్రియ ప్రజ్ఞలను జయించి, సహస్రమునందు చిత్తముంచి మరే ధ్యాస లేకుండా, ఎచ్చటికి వెళ్ళిననూ, వచ్చిననూ దైవచింతన గలిగినవారు శివదివ్యత్వము గలిగిన వారగుదురు.

(సత్య, స్వస్వరూప జ్ఞానమెరిగి, అనాత్మతత్త్వములగు పంచభూతాత్మక శరీరభావన లను వదలి, నిత్యము నిర్విరామముగా ఆత్మతత్త్వములో నెలకొనుట – పారమార్థిక సత్యమెరిగి, అందు నెలకొని శివదివ్యత్వము పొందుదురు.)

## 32. నవావస్థలు – నవాభిమాని

("జీవ, పర, శివ"లు అవస్థాత్రయంలో నెలకొనుట: జీవజాగ్రద, జీవస్వప్నం, జీవసుషుప్తి (3); పరజాగ్రద, పరస్వప్నం, పరసుషుప్తి (3); శివజాగ్రద, శివస్వప్నం, శివసుషుప్తి (3); ఈ తొమ్మిదింటితో ఏర్పడు అభిమానం)

2537. "త్వం" పదస్థితిలో విశ్వ, తైజస, ప్రాజ్ఞులనియూ, "తత్" పద (పర) స్థితిలో విరాట్, హిరణ్యగర్భ, అవ్యాకృతుడు (అంతర్యామి) అనియూ, "అసి" పదస్థితిలో హృదయుడు, ప్రజాపత్యుడు, శాంతన్ అనియూ, జీవ అభిమాని నామధేయము లగును. (విశ్వ – జాగ్రదలో స్థూలదేహ జీవుడు; తైజస – స్వప్నంలో సూక్ష్మదేహ జీవుడు; ప్రాజ్ఞ – సుషుప్తిలో కారణదేహ జీవుడు; పై మూడును వ్యష్టిపరమైన జీవుని స్థితి.

విరాట్ – స్థూలశరీరమనకు కారణకర్త; హిరణ్యగర్భ – సూక్ష్మశరీరమునకు కారణకర్త;

అవ్యాకృతుడు – కారణశరీరమనకు కారణకర్త; ఈ మూడు సమష్టితో జీవుని స్థితి. హృదయుడు – తామసగుణ ప్రవృత్తి గలిగినవాడు; ప్రజాపత్యుడు – రాజస గుణప్రవృత్తి గలవాడు; శాంతన్ – సత్వగుణ ప్రవృతి గలవాడు. పై తొమ్మిది జీవుని అభిమాన స్థితులగును.)

2538. పై తొమ్మిది అవస్థలను దాటిన తురీయంలో జీవుడు సత్యస్వస్వరూపమెరుగును: జీవ, పర, శివ జాగ్రదాది స్థితులు నవ – తొమ్మిది రకములగుటచే, జన్మ కారణములైన మల, గుణ దోష బంధములను త్రెంచి, నెలకొనదగిన శ్రేష్ట తపస్సు బూని నిర్వికారమైన సత్యజ్ఞానమగు జీవ, శివ భేదరహితమైన తురీయంలో నెలకొనుటయే జీవుని సత్యస్థితియగును.

2539. శివుని నిర్విరామధ్యాసచే తొమ్మిది అవస్థల అంత్యమున జీవునికి శివమహాతత్వము చేకూరును: జీవుడు శివుని నిర్విరామముగా చిత్తమున ధ్యానించుట వలన జీవుని స్వతత్వం నశించిపోవును. జన్మకారకములైన త్రివిధ మలదోషములు తొలగిపోయి, తొమ్మిదిగా చెప్పబడిన వాటికి అంత్యమున శివజ్ఞానం పొంది తపస్సుచే ఒనగూరునదైన తానన్నది తొలగి “శివం”యై వెలయును.

2540. జీవుల పదునెనిమిది (18) స్థితులలో నెలకొనియూ, తప్పించునదియూ శివుడే యగును: ముందు మంత్రములో చెప్పిన తొమ్మిది స్థితులలో నెలకొను తత్వములే కాక మాటలకందని మరొక తొమ్మిది (9) వేరుగాయున్నవి. ఇట్లు ముందు చెప్పిన తొమ్మిదితో పిదప చెప్పబోవు తొమ్మిదితో కలిసి పదునెనిమిది (18) తొలగించుకొని జీవులను తనవలె మార్చుట శివుని ప్రత్యేకత యగును సుమా!!

2541. ఆనందమొన గూర్చునదైన పదునాలుగు (14) విద్యలను (వేదములు 4, ఉపాంగములు 4, అంగములు 6 = 14) పరమేశ్వరుడు ఉన్నతికొరకు అనుగ్రహించినవేయని గ్రహించి, వాని నిజతత్వమెరిగి, రాత్రి, పగలు చిత్తమున పదిలపరచుకొని నిర్విరామముగా స్తుతించి నిలుచుదురు గాక!! దీనివలన కర్మ ఫలములను సమూలము నశింపజేసి అనుగ్రహించును సుమా!!

2542. సుదీర్ఘకాలముగా ఉన్నతి పొందుటకు మార్గనిర్దేశకములు ఎన్నో ఉన్నవి. ఆయా మార్గదర్శకములు పొందుటకు దైవములు ఎన్నో ఉన్నవి. వివిధ మార్గదర్శకములు ద్వారా పొందదగు ఫలములు ఎన్నో ఉన్నవి. వాటితో పగలు, రాత్రియనక నిర్విరామముగా స్తుతించువారికి తగ్గట్లు వారివారి మార్గము, కాలమునకు తగ్గట్లే వచ్చి నిలచి అనుగ్రహించునా పరమేశ్వరుడు సుమా!!

2543. ఆదియైన పరాపరుడు నవభేదరూపుడై జీవులను అనుగ్రహించును: ఆదియగు పరాపరుడైన పరమేశ్వరుడు 1. పరాపరం, 2. జ్యోతిపరం, 3. ప్రాణం,

4. వాక్కు, 5. తత్వములు, 6. కళలు, 7. శుద్ధమాయ, 8. అశుద్ధమాయ, 9. ముక్తిగా తొమ్మిది భేదములుగా ఆదిశక్తిగా నిలిచి అనుగ్రహించును సుమా!!

2544. పరిపక్వమొందనివారు జననమరణ చక్రములో చిక్కుకొని భ్రమించుచుందురు: జీవులకు పరిశోధన జ్ఞానముచే పొందలేని సత్యతత్వమును వివేక, విచారణ అనుభవముతో పొందునట్లు చేసి, స్వర్గము, నరకమును వేరువేరుగా ఉంచి, భూమిపై జననము, జీవులకు అనుగ్రహ హేతువును అమర్చియున్నాడు. ఈ సత్యమును గ్రహించనివారు కామ్యకర్మ ఫలముతో జనన, మరణ పొందు జీవులుగా మిగిలియుందురు.

2545. జీవుడు తొమ్మిదింటిని దాటి శివతురీయంలో నెలకొని శివమహాతత్వమొందును: పై నవవిధ అవస్థలలో జీవుడు అభిమానించి నిలచి, ఆ తొమ్మిది స్థితులను దాటి నెలకొనియున్న జీవ, పర, శివ తురీయంలోని శివుని పొంది ఎర్రని ప్రకాశమైన "శివం" యగుటయే సర్వసిద్ధాంత సిద్ధియగును. (ఇదే శైవ సిద్ధాంత తత్వమగును.)

## 33. శుద్ధాశుద్ధం

(శుద్ధం, అశుద్ధ, శుద్ధాశుద్ధం – అంతశ్శుద్ధి)

2546. నాసిక కొన నుండి ఆరు (6) అంగుళముల ఎత్తులో ఈశుడు నెలకొనియున్నాడని ఎవరు ఎరుగజాలరు. వాని గురించి వ్యాఖ్యానించిన మహావేదములు, ఆ అవ్యక్త స్వరూపము గురించి (నిరాకారత్వము గురించి) యూ, దాని తత్వములు గురించియూ చెప్పినది గ్రహించవలెను సుమా!!

2547. జీవులు చేయు ఒక్కొక్క కర్మలును, చేయువాని తలంపులు, కర్తుత్వం, చేయు విధానము బట్టియే అమరియున్నవి. ఇట్లు చేయు కర్మలు జన్మకు కారణమగు ఫలములని గ్రహించి, చేయు పనులలో కర్తుత్వం లేక (అనగా అకర్తగా) ప్రేమతో, తన విద్యుక్తధర్మమని భావించి చేయుటచే కర్మ క్షయమగును (అనగా కర్మఫల బంధములు ఏర్పడవు).

2548. మాయయగు తెర, జీవులను మరిపించి, వేద పదార్థమును (ఈశ్వరతత్వమును) మరిగి యుంచినది. ఆ మాయయగు తెర తొలగినపుడు ఆ పదార్థము బహిర్గత మగును. మాయను తొలగించి ఆ పదార్థమును గ్రహించువానికి (సత్యతత్వమెరిగిన అధికారికి) కాయము లేదు (శరీరము లేదు), మనస్సాది భావనలు లేవు.

2549. భ్రూమధ్యమునకు చేరి, కపాలద్వారము తెరచి, ప్రవేశించి, భ్రూమధ్యము అంతరమున (లోపలి భాగము) కొండనాలుకయందు దివ్యప్రకాశము గనుకొని, అధోముఖ ధోరణిని నిరోధించి, అచ్చటనున్న అగ్నికళలను మరింత ప్రకాశింపజేసి, మనస్సును నీచచేష్టలు చేయనీయక నిరోధించునదే సాధనా ఫలమగును.

2550. శరీరములో నెలకొని సహాయపడు శివుని గ్రహించి అంతర్ముఖులై స్తుతించుట శ్రేష్టబుద్ధి గలవారు: శరీరమునందే నెలకొని సూక్ష్మదేహముతో సంబంధమేర్పరచు వానిని, శరీరములోనే అగ్నిగా యుండు శివుని దేశాంతరములు తిరిగి బాహ్యముగా కొలుచువారు శరీరములో నెలకొని, సహాయమొనర్చుచున్న శివుని గ్రహించనివారే సుమా!!

2551. అశుద్ధమైన శరీరమును దాల్చియున్నదే ఒక అశౌచమగును: అంటరానితనమును అశౌచమని అందురు బుద్ధిహీనులు. మైల ఎచ్చట నున్నదని ఎవరూ గ్రహించలేరు. మైల అనేది ఏమి? ఎచ్చటనున్నదని గ్రహించినచో, మానవశరీరమే ఒక మైల కూపముతో ఏర్పడినదని గ్రహించుదురు సుమా!!

2552. తత్వజ్ఞానముతో తన్ను తానెరిగినవారికి అశుద్ధము అనునది లేదు. హరునికి అర్చించువారికి అశౌచము లేదు. మూలాగ్నిని పైకి లేపి ప్రకాశమును దర్శించు అగ్నికార్యము చేయువారికి అశౌచము లేదు. శ్రేష్టమగు వేదార్థమును గ్రహించిన జ్ఞానికి అశౌచము అసలే లేదు. (అగ్నికార్యము - మూలాధారములోని కుండలినీ శక్తిని పైకి లేపి సహస్రారమునకు చేర్చు చర్య.)

2553. హరుని స్తుతించి నమస్కరించువారికి సహస్రమున ప్రకాశము ఉత్పన్నమై, అంతశ్శుద్ధి మొదలిడును. కూపములో పడి, కామసల్లాపములతో వీర్యక్షయం చేయువారు యోగశాస్త్రతత్వ మెరుగనివారే. కాని షట్చక్రస్థానతత్వ మెరిగి అధోముఖ ధోరణి నిరోధించి ఊర్ధ్వసహస్రమున నెలకొన్నవారు శివంను దర్శించి శుద్ధి, శ్రేష్టత పొందిన వారగుదురు సుమా!!

2554. జ్ఞానాగ్ని వలన జ్ఞాననేత్రం - భ్రూమధ్యనున్న మూడవది ప్రకాశము పొంది మరింత ప్రకాశించును. ఇటువంటి అగ్ని ఉత్పన్నతకు ఆధారము ఎచ్చట నున్నదని ఎవరూ ఎరుగజాలరు. జ్ఞాననేత్రజనిత అగ్నిని గ్రహించినవారు శుద్ధమైన అగ్నితత్వ మెరిగి శుద్ధి పొందినవారే సుమా!!

2555. భ్రూమధ్యమున నెలకొన్న శివుడు ఓంకారార్థమును తేటపరచి ఇంద్రియ కరణములను అణగద్రొక్కును: భ్రూమధ్యమున వెలసిన శుద్ధమణి (ప్రకాశముతో నొప్పారు శివుడు) కర్మలను నివారించుట కొరకే. ఆ శుద్ధమణి ప్రకాశించుట వలన నాథుని దివ్యనామము బహిర్గతమగును (ఓంకారం). ఆ మణి ఇంద్రియ కరణములను తొలగునట్లు చేసి, అష్టమహాసిద్ధులు సమకూర్చును. ఈ శుద్ధమణి మౌనాక్షరపు పీఠమగును సుమా!! (మౌనం - శివ తురీయం.)

2556. నా తండ్రి పరమేశ్వరుడు కోరి పొందు వస్తువుగా, పుణ్యపురుషుడుగా ఉన్నాడు. వాని మహత్వమును ఎరిగి స్తుతించి, కొలుచు దాసులు గాకుండినచో, స్వర్గము,

నరకము, భూమియను కూపములో పడి పరిభ్రమించుటయే కాక మోహముతో నిండిన అశుద్ధమైనవారే సుమా!!

2557. విధి, కర్మల కారణము, వాటి ఫలము గ్రహించి తొలగించుకొననివారు బుద్ధిహీనులే: మోహముచే జీవులు అసత్తును, మాయను గ్రహించి, దాని ఫలితముచే విముక్తి పొందగలమన్న గుర్తు ఎరుగజాలరు. జ్ఞానము, వేదవిజ్ఞానములను బోధించు వాటితో కర్మరహితమై ముక్తి పొందగలమన్న తేట, పరిపక్వతను గ్రహింపజాలరు. చెడు కర్మలచే బంధమేర్పరచుకొన్న జీవులు దాని కారణము, పర్యావసానమును ఏవీ ఎరుగజాలరు సుమా!!

## 34. మోక్షనింద

(మోక్షం అనునది అసలే లేదని దూషించుట)

2558. పరగతి (మోక్షం) అనునది లేదని తిరస్కరించుదురు. నరగతి (నరకం)యే వారి విధి - లోకులు దీనిని బాగుగా ఎరుగుదురు. భిక్ష గతి - ఇంటి ఇంటికి వెళ్ళి భిక్షము ఎత్తుదురు. తురగతి (తురగం - గుర్రం) - ప్రతిదినము గుర్రము వలె పరుగెత్తి అల్లాడి, భిక్ష స్వీకరించి భుజించుదురు.

2559. గురోపదేశముతో గుర్తెరిగి (గమ్యమెరిగి) దైవముతో ఏకమవనివారు, దైవమునందు ధ్యాస లేనివారై, గ్రంథపఠనములతో అలంకారమైన మాటలు మాట్లాదురు. దైవము జీవాత్మలకు ఒనరించిన తోడు, సహాయములను తలంచి స్తుతింపజాలరు. ఇట్లు ఆటలు, పాటలతో కాలము వెళ్ళబుచ్చువారికి విముక్తి గలుగునా? (గలుగనేరదు.)

2560. మనస్సులోని భావనలు బాహ్యముగా, అంతరముగా వెళ్ళివచ్చుచున్నవి. అట్లు వెళ్ళివచ్చునన్నిటిని నిరోధించి, స్థితి పొందినదే దైవమని తలంచి, మనోలయం అయినచోటును నా నాయకుడిని పిలిచితిని. అట్లు వానిని పట్టుకొనిన స్థితిలో నా జీవబోధ తొలగినపుడు, అదే తానని బహిర్గతమై అనుగ్రహించెను సుమా!! (సంకల్ప, భావనల రహితమైన మనస్సు స్థితిపొందినచో దైవము బహిర్గతమై అనుగ్రహించును.)

2561. జీవబోధం తొలగిన స్థితిలో జన్మ సముద్రము దాటించుటకు దైవము నావ వలె ఉండి తోడ్పడును: మిట్ట ప్రదేశములో నిలువని నీరు వలె, శరీరములో నెలకొన్న నిలకడ లేని మనస్సుకు తన అనుగ్రహమును పారించి, సముద్రములో ఆటంకము లేక వెళ్ళదగు నావతో ఒడ్డు చేరునట్లు, అగ్నిరూపమున నున్న శివుడు బహిర్గతమై నిలుచున్నాడే!!

2562. తటాకములో ఈదుటకు ఎట్లు తామర కాండములు అడ్డు తగులునో, అట్లే పరగతి లేదని వాదించువారు అడ్డు పడుదురు. అటువంటివారు పరం వేరెందో

నున్నదని తలంచి బాహ్యమున వెతకుదురు. పొందవలసిన దారి చూపిననూ, దానిని చూడలేని (గ్రహించలేని) మూఢులు. వారు సన్మార్గములో వెళ్ళక దుర్మార్గంలో వెళ్ళి చెడుతున్నారే!! ఎంతటి అజ్ఞానం!!

2563. అజ్ఞానముచే కప్పబడని మనుజులు (జ్ఞానులు) నందీశ్వరుడు తమయందే యున్నాడని తలంచి అందు ఇముడుదురు. కాని అజ్ఞానులు అడవిలోనూ, పర్వతము లందునూ, పచ్చికబయలులోనూ తిరుగాడి మహామహుని గ్రహించక నశించుచున్నారు!!

2564. జ్ఞానులు అగ్నికళలలో నెలకొని శివునితో ఇముడుదురు: మరణానంతరము జీవయాత్ర దక్షిణదిక్కుగా నరకమునకునూ, ఉత్తరదిక్కుగా స్వర్గమునూ పయనించును (ఉత్తరాయనం, దక్షిణాయనం, శుక్లగతి, కృష్ణగతి). కాని క్షీణతలేని అమరత్వము పొందినవారు తూర్పు దిక్కుగా జ్ఞాననేత్రమునకునూ, పడమట దిక్కుగా తిరోభావన నేత్రమునకు పయనించుదురు. ఈ రెండింటికి మధ్య భాగమున కొండనాలుకకు పై భాగమున మంత్రభాగము గలదు. అందు అగ్నికళలతో ప్రకాశము పొంది వెలయుదురు.

2565. జ్ఞానులను దూషించినవారు కోరి దుర్మార్గముతో మునిగియుందురు: మోహముతో ఎవరేని చూచిననూ, ఎవరేమన్ననూ తపస్సంపన్నులు వాటిని మనస్సున ఉంచుకొన జాలరు (ధారణ చేయరు). కాని వారికి కోపము గలుగునట్లు చేసినచో, వారేమి సంకల్పించకుండిననూ, దూషించినవారు దుర్మార్గముతో చెడి నశించుదురు.

## 35. లక్షణత్రయం

(మూడు రకములైన లక్షణములు: (1) త్రోసిపుచ్చిన లక్షణము: "గంగ గ్రామమువద్ద" అన్న పదములో గంగానది ఒడ్డున నున్న గ్రామము వద్ద – గంగను వదిలి దాని ఒడ్డున ఉన్న గ్రామమును చెప్పుట. (2) త్రోసిపుచ్చని లక్షణము: "ఎరుపు, నలుపు రెండింటిలో" వెళ్ళు వాహనముల గురించి వీడక లక్షణమును, రంగును తెలుపునది. (3) త్రోసిపుచ్చిన, త్రోసిపుచ్చని లక్షణము: "ఆ దేవదత్తుడే వాడే వీడు" – ఉదా: ఢిల్లీలో కలెక్టరుగా ఉద్యోగం చేసిన దేవదత్తుడే పదవి విరమణ పొంది ఇపుడు మద్రాసులో కనిపించువాడు. కావున వాడే వీడు. ఇదే వీడిన, వీడని లక్షణము. పై మూడు జహలక్షణం, అజహల్లక్షణం, జహదజహలక్షణం లగును. ఒక ప్రమాణమును నిరూపించుటకు గాను తర్కమును వాడి, దానిచే తత్త్వనిరూపణము గలిగి నిస్సంశయజ్ఞానము పొందుట.

శ్రుతి సమ్మత మరిన్ని ప్రమాణములు గలవు. అవి (1) ప్రత్యక్ష ప్రమాణం. (2) అనుమాన ప్రమాణం. (3) అర్థాపత్తి. (4) ఉపమానం. (5) అనుపలబ్ధి. (6) శబ్దప్రమాణం (a) లౌకిక శబ్ద: అపరావిద్యయగు రసాయన, గణిత, భౌతిక శాస్త్రములు. (b) వైదిక శబ్ద:

అపౌరుషేయ శాస్త్రము – శ్రుతులు – గురుముఖతః నేర్వవలసినవి.)

2566. వీడిన లక్షణము – "ఆత్మ వ్యోమములో వెళ్ళును" (ఆత్మకి రాక, పోకలు లేవు. అది ఆగమాపాయి. సూక్ష్మ, కారణ శరీరములు ఆకాశమున వెళ్ళును గాని, ఆత్మ సర్వమయము. కావున ఇది వీడిన – త్రోసిపుచ్చిన లక్షణము). వీడని లక్షణము – "ఆత్మ ఉపశాంతములో నెలకొనును" (ఉపశాంతములో ఆత్మకి సుఖ అనుభవ ముండును. ఆత్మ వ్యవహారిక, దుఃఖ మిశ్రితములలో నుండుకొనియే ఉపశాంత స్థితిలో ఆనందమనుభవించునది. ఇది వీడని లక్షణమగును). వీడిన విడువని లక్షణము – ఆత్మ శబ్దాది – విషయములతో నెలకొనియుండును (శబ్దాది పంచ ప్రజ్ఞలు ఆత్మకి అంటజాలవు కనుక వాటిని ఒక విధముగా విడచియూ, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు ఒక విధముగా గ్రహించుటలోను నున్నది కావున విడచి, వీడని లక్షణముగా చెప్పబడియున్నది). పైన చెప్పినవన్నియూ తత్త్వవిచారణకునూ, శోధనకునూ ప్రయోగించి నిరూపణము పొందుట.

2567. ధనస్సులో అస్త్రమను జీవుని వింటినారిలో ఎక్కుపెట్టి లక్ష్యమును ఛేదించి (లక్ష్యం – ఆత్మ) నచో, జీవుని చంపదలచి కాచుకొనియున్న జ్ఞానేంద్రియములగు పంచ మదగజములు నశించినవి. ధనస్సు నుండి విడువడిన జీవునికి ప్రకాశమగు రత్నము పోలిన శివుడు ఎదురై దర్శనమొసగునే!! (స్వస్వరూప స్థితిని పొందు మార్గమును, జీవఈశ్వర ఐక్యబోధతో జీవుడు సత్యశివ తత్త్వములో నెలకొనుట. ధనుస్సు – వెన్నెముక ద్వారా సహస్రము చేరుకొనుట.)

## 36. తత్త్వమసి వాక్యము

(చతుర్వేదములలోనున్న నాలుగు మహా వాక్యములలో ఇది ఒకటి. "తత్త్వమసి". "తత్ + త్వం + అసి = అది నీవైయున్నావు". ఇది సామవేదంనకు చెందిన ఛాందోగ్యపనిషత్తు లోనిది. ఇది గురువు పరిపక్వమొందిన శిష్యునకు బోధించునది)

2568. జీవుడు పరమమైన శివం అగుటయే తత్త్వమసి అర్థము: జీవుడు శివతురీయంలో నెలకొని దేహతత్త్వములను విడచిన స్థితియే "త్వం" పదమగును. దానికి మేలైన పరంతో నెలకొనియుండు స్థితియే "తత్" పదమగును. ఈ స్థితిలో జీవుడు శివ తురీయంలో నెలకొనియుండుటచే "అసి" పదమగును. జీవుడు ఇందు అన్ని తత్త్వములను తొలగించుకొన్న నిజస్థితియగును. ("అది నీవే".)

2569. ముప్పదిఆరు (36) తత్త్వములను వీడిన ఆత్మ త్వంపదమగు శుద్ధస్థితి. అది ఉప శాంతములో మరింత మేలైన తర్పదం అగును. శ్రేష్టమగు జీవుడు దీనిని దాటి శివగతి (ప్రసాదస్థితి)లో త్వంతత్తసి (త్వం+తత్+అసి) గాను మారినది "తత్త్వమసి" అర్థమే అగును. (శివగతి – ప్రసాదస్థితి – చరమస్థితి – అంత్యము.)

2570. "త్వంతత్తసి" పదధారణయగు జీవుడే శివం అగును: వాడే వీడన్న దేవదత్తుడు, విడచి, విడువని లక్షణమగును. త్వంతత్తసియను త్రిపదములతో కూడిన నిజశాంతం పొందిన జీవుడగును. అట్లు ఉన్నతి పొందిన జీవుడే పరమైన శివం అగును. (సోయం – సః + అయం. దేవదత్తుడు, వాడే ఈ దేవదత్తుడు.)

2571. వేదాంతం బోధించు "తత్త్వమసి"యూ, శైవసిద్ధాంతము బోధించు "త్వంతత్తసి"యూ ఒక్కటే అగును: త్వం+తత్+అసి యే "త్వంతత్తసి". తపోఫలమగు "తత్త్వమసి" వేదాంత భాషయగును. వేదాంత అంత్యము సిద్ధాంతమే అదే "నీవు శివమగుచున్నావు" అని. ఇవి వట్టి అన్వయమయినవే సుమా!! (భేదము లేదు.)

2572. మూడు తురీయంలు (జీవ, పర, శివ) దాటిన స్థితిలో యుండునదే శివం: జీవ తురీయంలో నెలకొనియున్నది చెప్పనలవికాని జీవబోధన యగును. ఇదే మేలైన స్థితియని చెప్పుదురు దీనిని గ్రహించనివారు. ఇది పరస్థితియని ఎరుగజాలరు. పరమునకు మేలైన పరంయైన శివుడు ఉదయించుట అదొక దివ్యభూమియని ఎవరెరుగుదురు? ఎరుగజాలరు సుమా!!
(దివ్యభూమి = మూడు తురీయంలు దాటిన స్థితి.)

2573. త్వం పద జీవుడు త్రిపదములతో పరిపక్వపడి శివమగును: త్వం పదం, తత్పదం, అసి పదంలు మూడును మూడు తురీయంలకు పైన జీవుడు శివుని కోరుటచే, నీయొక్క పదం యైన త్వం పదం పరిపక్వపడును. అపుడు జీవుడు పరమై, ఎఱ్రని ప్రకాశముతో కూడిన శివం అగును.

2574. ప్రణవోపదేశ చింతనచే జీవుడు శివునిలో నెలకొనును: జీవునికి తురీయంలో ఏర్పడిన ఆనందము, శ్రేష్టమగు నాదము ఉదయించు ప్రణవ ఉపదేశముచే గలిగినదని ఎరిగి, ఈ సత్యమును హృదయమున చింతన చేసినచో, ఆ సత్య తత్త్వములో నెలకొన్న శివుడు దర్శనమొసగి అనుగ్రహించునే!!

2575. జాగ్రదాది పంచములను (జాగ్రద, స్వప్నం, సుషుప్తి, తురీయం, తురీయాతీతము) నాదమునకు ముందుంచి, వాటికి భిన్నమైన మలములను వెనక ఉంచి ఉన్నతి పొందుటలో, పిదప శుద్ధమైన తన పయనమగు శివగతిలో సత్తుకు ఆదియగు ఉపశాంతము నెలకొనును. అచ్చట మనస్సు, వాక్కులకు అతీతముగా ఉన్న శివుని దరిచేరండి!! (నాదోపాసనచే పంచావస్థలను దాటిన ఉపశాంతముతో శివుని దర్శించవలెను. శివతత్వము = "న చక్షుర్గచ్ఛతి, నవాగ్గచ్ఛతి న మనః" – ఆత్మ తత్వము – శ్రుతివాక్యము.)

2576. బాహ్యమనునది లేక అంతటా పూర్ణముగా నున్నది (అఖండమైనది – ఎల్లలు లేనిది). దానికి వాక్కు, గుణములు లేనందున నామము లేనిది. దానికి ఎటువంటి

వృత్తులు లేనందున దానిని ఊహతో గ్రహించజాలము – చింతనకు అందజాలదు. ఎటువంటి కారణము లేకయే (జీవుల కొరకు) తన్ను తాను బహిర్గతము చేసుకొను అనుగ్రహతత్వము గలది.

2577. "అది నీవైతివి" = తత్త్వమసి మహావాక్యము గురువు ఉపదేశముతో శిష్యునికి బోధించునది. "నేను అది అయితిని" అని శిష్యుడు భావించుట. తన బంధ తత్వములను తొలగించుకొన్న స్థితి. శ్రేష్టమైన నంది అనుగ్రహము పొందించి శివంగా చేయును. అట్లు అయిన పిదప క్షీణత లేని ఆనందమే ఆనందము (బ్రహ్మానందమగును).

2578. జీవుడు శివమగుటకు ప్రణవమే శివమగుటకు ముఖ్యకారణము: ప్రాణం పరమగుటయూ, ఉన్నతమైన పరస్థితి పొందిన జీవుడు, గ్రహించబడు శ్రేష్టమైన శివంగాను, వేదత్రయంనందు (ఋక్, యజర్, సామవేదములలో చెప్పబడిన మహావాక్యములు) స్తుతించబడిన పరాపరముగాను కొనియాడబడినది – జీవుల వాక్కునకు అతీతముగా నున్న ప్రణవ స్వరూపమే అగును.

2579. వాక్కు, నాసిక, భ్రూమధ్యము, బ్రహ్మరంధ్రములో ఇమిడి, నాసిక మొదలుకొని బ్రహ్మరంధ్రము వరకు నెలకొనియున్నది ప్రణవము. తల్లినాడియైన సుషుమ్నలో నెలకొన్న నాదము మొదలు సకలస్థితిలో వెలయు తత్వములునూ, జీవుడు కోరుచున్న ప్రకాశము (బిడ్డడు తల్లిని కోరి చేరుకొనునట్లు) ముందుగా చెప్పబడిన ఐదింటిలో ప్రాణకళగా ప్రాకి శివగతి ఏర్పడును సుమా!!

2580. అల్పజ్ఞానము (ఇంద్రియప్రజ్ఞలు), అజ్ఞానము (మాయ, పొరపాటు – అగ్రహణం, అన్యధాగ్రహణము) రెంటిని తొలగించుకొని, జ్ఞానమే స్వరూపముగా, అఖండముగా, అంతటా వ్యాపించి నెలకొన్న శివునిని పట్టు వదలక అతనే నాయకుడిని తలంచి కోరి స్తుతించవలెనను సూక్ష్మము ఎరుగనివారు శివుని తమలో నిలుపుకొనుటకు తెలియనివారే సుమా!!

2581. లౌకికులు గ్రహించునది సుఖమొనగూర్చు అప్పు (జల) తత్వము, అనల (అగ్ని) తత్వములు. కాని జ్ఞానులు (నిజతత్వ మెరిగినవారు) ఎరుగుదురు జలతత్వము ఎట్లు ఈ శరీరములో కలిసియున్నదని. జ్ఞానస్వరూపుడు (శివుడు) అచ్చట కలసి నెలకొనలేదన్నచో, జీవుని అల్పజ్ఞానముతో (ఇంద్రియజ్ఞానముతో) మహాజ్ఞానమగు విజ్ఞానమును గ్రహించుటకు సాధ్యము కాదు సుమా!! (షట్చక్రస్థానములో మణిపూరకం–జలతత్వము; స్వాధిష్టానం–పృధివి; మూలాధారము–మూలాగ్ని–అగ్నితత్వము; ఈ మూడును జీవునికి సుఖభోగ స్థానములు. నిజ జలతత్వం–సహస్రమున తటాకము; నిజఅగ్ని–సహస్రమున జ్ఞానాగ్ని.)

2582. అతీతములోను అసంగముగా నుండువాడు నందీశ్వరుడు. అతీతములో ఇంద్రియ ప్రజ్ఞలు తొలగుటచే గ్రహించబడనిదిగా కనిపించును. ఆత్మ (అభోక్తగా – విషయ తత్వములు విడుచుటచే విషయభోగములు కూడ లేదు). చంద్రమండలములో అజ్ఞానచీకటి తొలగించుకొని దైవమహత్వముతో ఏకమైన ప్రాణముగా శివస్థితిలో నెలకొని, ఆ స్థితిలో పరంయను నామధేయముతో వెలయును సుమా!!
(చంద్రమండలము – శిరస్సున సహస్రారము.)

2583. దైవచింతనతో సదా ఉండుట వలన దైవభావనలే నెలకొనును: దేవాదిదేవుడైన వాని దివ్యచరణములను స్తుతించి, వాని ముందు నిలబడి, శిరస్సు వంచి నమస్కరించుటచే ఈశుడు నాముందు బహిర్గతమై, "నా దివ్యచరణములు కొలుచుటచే నీవు అది అయితివి" అన్న భావన నాలో కల్పించి, "ఇప్పుడు నీవు మహత్వ విధానమును దర్శించుదువు గాక"!! అని ఆశీర్వదించెను నా త్రినేత్రుడు.

2584. నిర్మలుడుయైన శివుడు జీవుని తన దాసునిగా చేసుకొని మలరహితమొనర్చును: నిర్మల దివ్యదేహము గలవాడగు దైవము అజః (జన్మము లేనివాడు) నా మనస్సున నెలకొని "వీడు నా దాసుడు" అని దాసునిగా స్వీకరించి, బంగారుఛాయ గలిగినవాడు దేవాది దేవతలచే స్తుతించబడినవాడు ఆ దైవము "నీవు మలరహితుడవు కమ్ము!!" అని రహితముచేసి అనుగ్రహించెను సుమా!!

2585. దైవానుగ్రహము పొందిన పిదప నేను బంధపాశ సమూహములను వదిలి అంతర్జ్యోతిని కనుగొని, నా మనస్సు, శరీరమును వదిలి సర్వవ్యాపకములో ఎగిరినది. ఉన్ననూ, వానిని నా మదినుండి వీడక ఉన్న నన్ను దైవము జన్మరహితుని చేసి అక్షరతత్వం (క్షీణతలేని)ను అనుగ్రహించెను!!

2586. శరీరం, నోరు, నేత్రం, నాసిక, చెవియగు పంచజ్ఞానేంద్రియములు బాహ్యముగా వాటితో అంతకరణములు నాలుగు అంతరమున మిగత ఉపాది తత్వములతో అఖిల జీవతత్వములన్నియూ దైవసంకల్పముతో జరుగుట వలన, వాడే వీటినన్నిటిని పరిపాలించి, చేయదగిన కరములు, చెప్పదగిన వాక్కు విడిగా లేక తన శరీరమే జ్ఞానముగా అంతటా వ్యాపించి, పూర్ణత్వముగా దర్శన మిచ్చుచున్నాడు.

## 37. విశ్వగ్రాసం

(విశ్వం = అఖిలము, ప్రపంచము; గ్రాసం = ఆహారం, ముద్ద, కబళం; విశ్వగ్రాసం = ప్రపంచమే ఒక కబళంగా మ్రింగబడును. దైవము యొక్క మహత్తులో అఖిలము మ్రింగబడును – ప్రళయమున పరబ్రహ్మంలో అన్నియూ లయమొందును.)

2587. ఛాయ రూపములో మరిగిపోవునట్లు, నీటిబుడగ నీటిలో కరిగి కలిసిపోవునట్లు, అగ్నిలో పడిన కర్పూరము మాయమై పోవునట్లు, స్థూలముగా కన్పించు ఈ

శరీరాదులన్నియూ ఆ పరంలో కలిసిపోవును సుమా!!
(అఖిలము పరబ్రహ్మంలో లయమై పోవుట.)

2588. శరీరము, ప్రాణము విడదీయ బంధముతో ఏకమగుటచే, అందు పరస్థితిలో శివశక్తులతో కలియును. శరీర సంకెళ్ళు నుండి దాటిన ప్రాణము శివంతో అంతటా వ్యాప్తి పొంది నెలకొని ఆది, అంతములు లేని శివవ్యాపకములో ఏకమగును!!
(ప్రకాశము పొందిన జీవాత్మ శివుని వలె సర్వవ్యాపకంలో కలిసిపోవును.)

2589. కరణములు వికసించిన స్థితిలో జగత్తు గోచరమగును. కరణములన్నియూ ముకిలిత మగునపుడు జగత్తు దృశ్యములు ఏవీ కానరావు: పంచజ్ఞానేంద్రియములు, పరిపక్వ పడని (సంస్కరించబడని) మనస్సాది అంతఃకరణములు, పురుషుడు ఐదునూ నిలకడ లేక జగత్తు వ్యవహారములలో వికసించుయూ, ముకిలితమై యున్నంతవరకూ చరమును, అచరములనూ (చలించునవి, చలనము లేనివి) త్రోసిపుచ్చలేము.
(కరణములు, మనస్సు బాహ్య వ్యవహారములో మునిగియున్నంతవరకు చరాచరములు గోచరించక మానవు. శివునిలో లయమై అంతర్ముఖమైనపుడు అన్నియూ మరిగిపోవును.)

2590. పరముతో ఏకమైన జీవుడు పరతత్వముచే పొందగలుగును (తన జీవతత్వము కనుమరుగవును): తత్వములను విడచిన, ఆత్మ పరముతో స్థితి పొందినపుడు అంతటా వ్యాపకమై నిలుచుండును. అంతటా నెలకొన్న పూర్ణముగా వెలయును. ఎందెందు ఏఏ వృత్తులు సలుపవలెనో అనగా సృష్టి, లయములను చేయగలుగు సామర్థ్యము పొందియుండును. ఈ విధముగానే నేను శివానుగ్రహము పొంది జీవించువాడునైతిని సుమా!!

2591. తత్వ విచారణతో కొలువలేనిదగు జ్ఞానము శివవ్యాపకములో అఖండ జ్ఞానమగు తురీయ జ్ఞానము (శివజ్ఞానం) పొందును. మనస్సు దృఢముగా స్థితిపొంది యుండుటచే, సకల భోగవిషయములను త్యజించి, పరమగు శివంతో ఏకమగుటచే దృఢస్థితిలో వెలయు చిదాకాశము (శూన్యం – బట్టబయలు) రూపమగును.

2592. ఎర్రగా కాలుతున్న ఇనుము తనపై పడిన నీటిబొట్టును లోపలికి లాక్కొనునట్లు శ్రేష్టమైన పరము అధోముఖ ధోరణిని తొలగించి, బలిమి పొందుటకుగాను మూడు అడ్డంకులు (జీవ, శక్తి, శివ) మ్రింగి (తొలగించి) నెలకొన్న నందీశ్వరుడు నా హృదయములో ఉన్నాడు సుమా!!

2593. నల్లటి పుచ్చి నిండిన వెలగపండు వలె జీవుడు (పుచ్చి నిండిన వెలగపండులో పెంకు మాత్రము మిగులును) ఉన్నతి పొంది పరముతో ఏకమైనది (అన్ని జీవ తత్వములను తొలగించి (మ్రింగివేసి) జీవుని శుద్ధి చేయును). అటువంటి జీవుడు

శివతురీయంలో స్థితి పొందినచో జీవస్వభావములన్నీ విడుపించుకొని పరమేశ్వరునిచే మార్పు చేయబడి, శివుని వశము అగును. (శివుడు అఖిలమును మ్రింగియూ అసంగముగా ఏ వికారములు లేనివాడై యుండును.)

2594. శివుడు మాత్రము ఆదిగాను, అఖిలముగాను, అంత్యముగాను ఉన్నాడు. జీవులలో వారివారి మేలైన స్థితిలోనున్న పరములో నెలకొనియున్నాడు. వానిని దరిచేరిన వారికి పరమునకు క్రిందనున్న స్వల్న, అధోతత్వములుండును. చూచువాడు, దృశ్యము, చూడబడునది వీటి అంత్యమున నందీశ్వరుడు బహిర్గతమైనది, సత్వతత్వంగా నెలకొనియున్నది మనచే గ్రహింపబడజాలదు సుమా!!

## 38. సత్యము

(అసత్య తత్త్వమును వీడి సత్యతత్త్వముతో చేరుట)

2595. దివ్యోపదేశములైనవి ఈ పంచములు: అగ్ని, మలము, దోషము, జీవుడు, మేలి బంగారం (అపరంజి): దివ్యోపదేశములగు – మలము తొలగించు విధానము చెప్పవలెనన్న అగ్నిలో వేసి (పుటం వేసి) కిలిము దోషమును తొలగించి మేలి బంగారము చేయుట వంటిది. మలదోషములు తొలగవలెనని దైవమును చిత్తమున నుంచి ధ్యానించుటచే చీకటిని తొలగించబడి ఎర్రని ప్రకాశజ్యోతిగా వెలయును. (ఇందు కంసాలి అపరంజి చేయు పద్ధతితో పోల్చబడినది – మలదోష నివారణ. శివుని నిర్విరామ ధ్యానముచే దోషములు తొలగి ఎర్రని ప్రకాశం దర్శనమగును.)

2596. అన్ని జ్ఞానముల కన్నా మహత్వముతో నిండిన శివజ్ఞానమును వదిలి, లౌకిక ప్రజ్ఞలతో పొందు లౌకిక జ్ఞానముతో పొందు లాభము ఏదియూ లేదు. అన్ని జ్ఞానములకన్నా మిన్నయైనది మహాతత్వ జ్ఞానము. అది తానేనని భావించుటచే పొందదగు లాభము గ్రహించినచో, అన్నిటినీ గ్రహించదగిన జ్ఞానపూర్ణముగా "శివం"యైన జీవుడని చెప్పవచ్చును సుమా!! ("ఏ జ్ఞానము పొందితే మరే జ్ఞానము పొందనవసరము లేదో అదే మహత్వమైన ఆత్మ/శివ/బ్రహ్మజ్ఞానం" – శ్రుతివాక్యము.)

2597. శిరస్సున నెలకొన్న మేరుపర్వతముపై నిలచి నిర్విరామ ధ్యానము చేసితిని. దివ్యత్వము పారించు పార్వతిదేవితో పరమేశ్వరుడున్నది (అర్ధనారీశ్వరుని) దర్శించితిని. కర్మఫలములతో విధిననుభవించు జన్మలను దాటితిని. చంద్రకళతో వెలుగొందు ఆ దొంగను కనుగొంటినే!!

2598. తానే నిరాధారమైన జగత్తుకు ఆధారభూతుడగు నాయకుడు. తానే జగత్తు యొక్క సర్వతత్వములుగా నిలుచుచున్నాడు. తనవల్లనే జగత్తుకు వర్ష సమృద్ధి గలుగుచున్నదని వేదములు ఘోషించుచున్నవి. హృదయము కలిగి ద్రవించు వారి మదిలో స్థితిపొంది నెలకొనును!!

2599. అటువంటివాని దివ్యానుగ్రహము పొందుట ఎట్లనినచో? ప్రపంచ బాహ్య విషయ వాసనలతో పోరు (యుద్ధము) సలిపి, ప్రపంచమోహంను పట్టియున్న చింతనను మార్చి, శివజ్ఞానముతో చిత్తమును దైవమునందుంచి, శ్రేష్టమైన సత్యతత్త్వమగు శివుని దివ్యచరణములను పట్టుకొని స్తుతించుటయే సుమా!!

2600. సత్యతత్త్వమును కోరువారి మదిలో నెలకొని బంధములను త్రెంచి అనుగ్రహించును ఆ శివుడు: సత్యతత్త్వముతో నున్నవారి విధిలోనూ, ప్రాణములో కలిసి నెలకొని, లౌకిక విషయ బాహ్యప్రవర్తనతో ఉన్నవారికి శివుడు దూరముగా ఉండియూ, వానిని పొందు విధానము గ్రహించి దరిచేరినవారికి, వారి బంధములు త్రెంచువాడుగా, వారి శరీరములో, ప్రాణములో ఇమిడి వారికి ఆనందమొసగు వాడుగా నున్నాడే!! (సత్యతత్త్వముతో ఉండి దరిచేరినవారికే శివుడు అనుగ్రహించును.)

2601. సత్యతత్త్వమగు శివునితో విడదీయలేని బంధము ఏర్పరచుకొన్నవారితో తానే కలిసి నెలకొనును. లౌకిక విషయవాసనతో ఉండువారి దరిచేరకనున్న పునీతుడు (నిర్మలుడు) వాడు. సుషుమ్నానాడిలో ప్రాణశక్తి నిలిపి పైకి ప్రాకి శివ మహామహుని భ్రూమధ్యమున ధ్యానించువారి మనస్సుననే వానిని పొందగలము.

2602. ముందు మంత్రములో చెప్పినట్లు శిరస్సులో ప్రాణశక్తి వచ్చి ముట్టడి చేయునపుడు పగలు, రాత్రి రెండుపూటలు ధ్యానముచే శివుని చిత్తమున పదిలపరచుకొని చింతన చేసినచో, శిరస్సులో నాయకుడుగా వెలుగొందును. నిలకడలేని, అశాశ్వతమైన (మిథ్యా) బాహ్యప్రపంచ విషయములతో వెళ్ళక స్థితి పొందినచో నాయకుడు (శివుడు) కపాలద్వారం ద్వారా (బ్రహ్మరంధ్రము) బహిర్గతమగును.

2603. ముందు రెండు మంత్రములలో చెప్పినట్లు ప్రాణశక్తి జయం పొందునది, పొందక పోవునది శివానుగ్రహము బట్టి యుండును. ఈ తత్త్వము మాత్రము బహుశ్రేష్ట మైనదియూ, జీవులు ఉన్నతి పొందవలెనన్న సదుద్దేశముతో నందీశ్వరునిచే అనుగ్రహించబడినది. అసత్య పరిణామము (మోసపూరితమగు)నకు దారిచూపు నవ ద్వారములు మూసి స్థితి పొందినచో, సత్యతత్త్వముతో నెలకొని వాశితో గుర్రపు స్వారీ చేయగలరు!! (నవ ద్వారములు: రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు నాసిక ద్వారములు, నోరు, మూత్ర పురీషాదులు రెండు = 9; గుర్రపుస్వారి = ఇది యోగపరిభాష – శ్వాసకళలకు గుర్రపుస్వారియని చెప్పబడినది – వాశి (శ్వాస). శివుని వాహనముగా చెప్పుట – ఇది పంచాక్షరము "శివాయనమ" లోనిదే.)

2604. అసత్యతత్త్వమును (కామవాంఛతో నున్న విషయం) తొలగించుకొన్నవారికే దైవము

స్థితిపొందును: సుషుమ్నానాడిలో కలిసియున్నవాడు, చింతనలో నెలకొన్న నందీ, మనస్సుతో కలిసి శరీరములో నెలకొన్నవాడు, వేదములకు ఆదియైనవాడు, అసత్యమైనదితో (బాహ్య విషయవాంఛలు, కామ్యకర్మలు, రాగద్వేషములతో కూడుకొన్నవాడు) కలిసియున్నవారికి బహిర్గతము కాని నిమలుడు, అసత్యతత్వమును తొలగించుకొన్నవారిలో (సత్యతత్త్వమెరిగి అందు స్థితి పొందినవారిలో) ఆశ్రయించి నెలకొనును సుమా!!

2605. సత్యమైన తాళమును శరీరముతో పదిలపరచిన నందీశ్వరుడు చేతిలోనున్న తాళముతో తెరచిచూచుట ఎరుగజాలరు. అసత్యమైన తాళమగు దుఃఖపూరిత శరీరభావన త్రోసిపుచ్చినచో, అందు పొందునదే మహత్వము నిండిన దివ్యస్థితి యగును. (సత్యతాళము = అంతరమున సహస్రమున నున్న శివతత్వము. చేతితాళము = సుషుమ్నానాడి ద్వారా సహస్రమును చేరు ఉపాయము.)

2606. జీవులు దైవమును సృజించి స్తుతించినచో, సహస్రమున అనుగ్రహించును: ఉన్నతి కోరు జీవులైన మీరందరూ దైవమును సృజించి స్తుతించండి!! అపుడు సత్యస్వరూపుని సన్మార్గతత్వమబ్బును. దృఢముతో అసత్యశరీర భావనలను తొలగించుకొన్నచో, అయ్యడు (దైవం-శివుడు) అచ్చట స్థితిపొంది వెలయును సుమా!!

2607. మనస్సును రమ్యపరచు సహస్రదళ పద్మములో వాసనతో కూడిన ఫలమొకటి కలదు (శివఫలం). ఆ ఫలమును విషయవాసనలతో నిండిన పక్షులు పొడిచి తినుటకు వీలుకాదు. ఆ విషయవాసనలగు పక్షులను పారద్రోలుటకు జీవశక్తిని పైకి ప్రాకించు అస్త్రముతో చేదించినచో, బంగారుఛాయ గల ప్రకాశముతో కూడిన శివగతి పొందనగును సుమా!!

2608. మోహమును కల్పించునదైన పంచేంద్రియ ప్రజ్ఞవాసనలను త్రెంచి, చంచలమును, కలతను పోగొట్టు శివుని అనుసరించండి!! వేరు దైవమున్నదన్న అన్యభావన లేక శివుడే మహామహుడని భావించి అనుసరించినచో, ఉన్నతి పొందితిమన్న మనస్సును ఆతనితో ఏకపరచినట్లగును సుమా!!

2609. ఇట్లు శివుని మనస్సున స్థితి పొందించుకున్న వారికి జ్ఞానభూమికపై శివగతి ప్రాప్తించును. మనస్సుతో ప్రపంచ బంధములలో ఇరుక్కొనక, శివుని పట్టు విడువక చింతన చేయువారికి (ధ్యానించువారికి) శివం నెలకొను సూక్ష్మశరీరము కూడ (స్థూల, సూక్ష్మశరీరములు) వశమగును. ప్రపంచ భావనరహిత ధ్యానముతో జ్ఞానభూమికపై శివుని అనుగ్రహము గిట్టును!!

ఈ అధ్యాయమంతయూ సత్యము-సత్యతత్వ స్వరూపమగు ఆత్మ/శివం/బ్రహ్మం గురించియూ, జీవుని పారమార్థికస్థాయి గురించి వివరణ. ఇక అసత్యము - మిథ్యా

జగత్తు విషయాలపై మోహం, అనాత్మతత్త్వమైన దేహేంద్రియ మనోబుద్ధులే ఆత్మయని పొరబడుట. సత్యము గ్రహించకపోవుట (అగ్రహణము) సత్యము కాని దానిని సత్యమని పొరబడుట (అన్యధాగ్రహణము). ఇవియన్నియూ అసత్యమగు అజ్ఞానము – అవిద్యా, మాయా కల్పితములు. జీవుని తమో, రజో ప్రధానములై మోహంలో ముంచియుంచునది. పై అజ్ఞానమునుండి విడువడి మంచి సాధనతో సత్యతత్త్వమగు పారమార్థిక సత్యములో నెలకొనుటచే దైవానుగ్రహము పొందవచ్చునని, బాహ్యదృష్టిని త్రోసిపుచ్చి అంతర్దృష్టిపై మనస్సు స్థితి పొందవలెనను వివరణ.

## 39. జ్ఞాని వృత్తులు

(స్వస్వరూప, సత్యజ్ఞానమెరిగిన జ్ఞానియొక్క వృత్తులు)

2610. జ్ఞానులు పంచప్రజ్ఞలపై ఆశ లేనందున కర్మఫలముచే గలుగు దుఃఖముండజాలదు: మంచిని నొసగదగు పంచప్రజ్ఞల (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు) తత్త్వమును పరిశోధించినచో, మంచిని ఇవ్వగల స్వస్వరూపము గ్రహించిన తత్త్వజ్ఞానులు (తన్ను తానెరిగి జ్ఞానులు) ముందు జన్మలో చేసిన కర్మల ఫలితములను (సంచితకర్మలు) ముందుగా అనుభవించి (ప్రారబ్ధకర్మ) ముగించుదురు. పిదప ఈ జన్మలో చేయు కర్మఫలితలములను (ఆగామికర్మ) గ్రహించి వాటికి లోనగక, వాటిని తొలగించుటకు ప్రయత్నించుదురు.

2611. తన సత్యతత్త్వమెరిగిన తత్త్వజ్ఞానులు పూర్వజన్మ కర్మబంధముల ముడిని ముందుగా విప్పి తొలగించుకొందురు. శిరస్సున వెలయు శివుని అనుగ్రహముచే ముందు రాబోయే కర్మఫలములు ఉత్పన్నమగుటకు ముందే నశింపజేయుదురు. (బంధమేర్పడుటకు ముందే ఆగామి కర్మఫలములను నశింపజేసుకొందురు.)

2612. జ్ఞానులు సాధనలతో, త్రికరణములతో పొందదగు బంధమును తొలగించుకొందురు: జీవులలో మనస్సు, వాక్కు, కాయముల ద్వారా బలమైన బంధములు వచ్చిచేరును. ఈ త్రికరణములతో బాహ్యప్రవృత్తి మాని, శివునితో బంధమేర్పరచుకొన్నచో (శివధ్యాసతో) వారిని కర్మఫలములు బంధించజాలవు. సాధనలచే వారు త్రికరణముల చేష్టలను నిగ్రహించుకొని మౌనంగా ఉందురు. తన్ను ఎటువంటి బంధములో ఇరికించకుండా ఏర్పరచుకొన్నవారే జ్ఞానులు!!

## 40. ఆసక్తి త్రెంచుట

(ఆశ పుట్టకుండా సమూలముగా త్రెంచుట)

2613. వాశి (ప్రాణణ–శ్వాస), సూది (భ్రూమధ్యము)ల గురించి మాట్లాడి, దానిని ఇతరులకు బోధపరచుటలో ఎటువంటి లాభము (ఫలము) పొందలేరు. ఆశను

(విషయవాంఛ), ప్రేమలను (బంధపాశము) తొలగించండి!! అట్లు తొలగించిన యెడల ఈశుడున్న స్థానము సులభముగా గ్రహింపబడును సుమా!!

2614. దైవము ఇంటి గోడలలోనూ, భవనములలోనూ ఉన్నవాడు కాడు. మండపములలో ఉన్నవాడు కాడు. కూటములలోను, గదులలోనూ ఉన్నవాడు కాడు. ఆలయములలో నున్నాడన్నది కూడ కాదు. వేషము ధరించినవారిలో నుండువాడు కాడు. కాని వాడు ఆశను త్యజించిన వారి మనస్సులో ఇమిడి వారి అంతరమున నెలకొనియే వారిని చైతన్యపరచి ముక్తినొసగును.

(కూటము = పాత ఇండ్లయందు రెండు గదులకు మధ్యనుండు విశాల స్థలము – ప్రస్తుతం హాలు అని పిలువవచ్చును.)

2615. ఎటువంటి ఆశయైనను వెంటనే విడిచివేయండి!!
ఈశునిపై కూడ ఆశను పెట్టకండి!!
ఆశ పడను, పడను దుఃఖములు వెంటాడును!!
ఆశను విడువ, విడువ ఆనందము అగునే!!

2616. పంచేంద్రియ ప్రజ్ఞలు ఐదునూ (5) జీవులను ప్రపంచమువైపు పురికొల్పి దుఃఖ మేర్పరచి, దుర్మార్గపు, కీడుచేష్టలకు దారిచూపుటచే, వాటిపై ఆశను వదిలించుకొని, సత్యజ్ఞానమును పట్టుకొని జీవులు తమ నిజస్థితిని గ్రహించు మార్గమును పొందవలెను సుమా!!

2617. పొంగి, ఉప్పెనగా మారిన సముద్రము ఊరినంతా ముంచునట్లు, పలువిధములైన ఆశలతో నిండి, సుఖదుఃఖములతో మునిగి పలు దేవతలు కూడ నశించిరి. వాంఛల సముద్రములో మునగక, వాటిని త్యజించి, జన్మరహితం చేసుకొనినచో, వారికి ఈశుడు ఆనందసముద్రములో నిలకడగా నిలచి ధరించి నిలుచున్నాడు.

(ధరించి = ఆధారముగా నిలబడియుండుట.)

2618. సుదీర్ఘముగా ద్వంద కర్మలు, త్రిమలములు, బంధపాశముల కట్టుతో ఏర్పడిన చేష్టలు, వాటిని తొలగించి శుద్ధియగుటయూ, పిదప సృష్ట్యాది పంచవృత్తులను తొలగించి, సర్వము అనుగ్రహమయము చేసి, నిర్విరామ శివధ్యాసలో నిలుచుటయే జ్ఞానులు చేయు శుద్ధస్థితి యగును.

2619. జీవులు స్వరూపజ్ఞానము గ్రహించి శివుని పట్టుకొన్నపుడు ప్రేమస్వరూపులుగా నెలకొందురు: జీవుడు తన సత్యస్వరూప జ్ఞానమే ప్రకాశమయమైనదని గ్రహించి అందు సృజించినపుడు సిద్ధియూ, ముక్తియూ అమరును. స్త్రీవాంఛ త్యజించి స్థితిపొందునపుడు, అష్టమహాసిద్ధులు ఒనగూరును. ఈ దృఢస్థితి పొందిన జ్ఞానులు దేహము విడచి శివుని అనుగ్రహము పొంది, శివుని ప్రేమలో ఐక్యమగుదురు.

(శివుడే ప్రేమస్వరూపుడు – "ప్రేమే శివం" ఈ గ్రంథము యొక్క ఏకవాక్యము.)

2620. శివంగా ఈ జీవుడు స్థితిపొంది, దైవప్రేమకు పాత్రుడై, శివుడుగా మారి "పతి" స్థానం పొందుతున్నాడన్న సత్యము ఈ లోకులు ఎరుగజాలరు. కాని జీవుడు శివుడేయగును సుమా!! పలు రకములైన జన్మలు పొందునది, పలు భువనములందు (లోకములందు) ప్రవేశించునదియూ సత్యతత్వమెరగక అసత్యతత్వములను (మాయ కల్పిత భ్రాంతి జన్యములు) పట్టుకొన్నపుడే సుమా!!

2621. ఈ ప్రపంచమంతయూ జీవులను మంటగొల్పునదైన దుఃఖమయమైన స్థూల శరీరము దాల్చునట్లు చేయుటయూ, చల్లదనమేర్పరచునదైన దుఃఖము తొలగించునట్లు చేయుటయూ, స్థితి పొందునట్లు చేయునదైన మరో జన్మములో ఇరికించుటయూ, ఈ పంచవృత్తులు చేయు బ్రహ్మాది దేవతలను జ్ఞానులు కోరజాలరు. అవియన్నీ దుఃఖపూరితమగుటచే వాటిని నలిపి, పొడిచేసి, శరీరములో నెలకొన్న చిత్రాణినాడి ద్వారా సహస్రము చేరి శివమగుదురు.

2622. ఉన్నతి పొందితిమి, సాధించితిమి అని అందురు. కాని సత్యమార్గమును ఎరుగ జాలరు. శుద్ధతామరలో నెలకొని యున్నాడు ఆ నందీశ్వరుడు. శుద్ధచిత్తములో తేట జ్ఞానము పొందినచో, అదే పునర్జన్మ రహితమునకు కారణ విత్తనమగును సుమా!! (మూలాధారములో నెలకొన్న జీవశక్తిని సహస్రదళ పద్మమునకు చేర్చునదే జన్మరహితం చేసుకొను ఉపాయము.)

## 41. భక్తితత్వం

(అనంత శివునియందు భక్తి గలిగియుండుట)

2623. జీవులకు ముక్తినొసగు జ్ఞానమంత్ర (ఓం) స్వరూపుడుగా యున్న నాయకుడు, క్షీణతలేని దేవతలను పరిపాలించువాడును, శుద్ధుడు, శుద్ధ, సత్యతత్వముగా జ్యోతిగాయున్న పరమేశ్వరుడు భక్తులచే స్తుతించబడు పశుపతి (జీవులకు నాయకుడు)గా యున్నాడు.

2624. దాసునికి దాసుడిగా, దాసానుదాసుడిగా వానియందు నేను దాసుడనైతిని. అట్లు దాసానుదాసుడనై వారిచే శివ దివ్యజ్ఞానము పొందితిని. నన్ను అతను దాసులలో ఒకనిగా అంగీకరించి చేర్చుకొనెను సుమా!!

2625. తనయందు ధ్యాసతో యున్నవారికి నీటికన్నా చల్లనగాను, బాహ్యప్రవృతిత గలిగిన వారికి అగ్నికన్నా ఉష్ణముతో కాల్చువాడిని, ఎవరు ఈ తత్వములు నెరుగుదురు? లోకులకు ఉన్నతి నొసగు న్యాయవంతుడు. అటువంటి వాడు నా చిత్తమున ఉమాపతిగా నెలకొన్నాడే!!

2626. వానిని గురుముఖతః పొందు జ్ఞానముచే ఈశ్వరుని యందు భక్తితో మాత్రమే

పొందగలము: ఏడేడు లోకస్తులు ఒకటై పరిశోధించిననూ గ్రహింపబడజాలనివాడు, నా నాయకుడు ఉత్పన్నమై, బహిర్గతమైనచోటు ఎవరెరుగుదురు? శివునియందు భక్తి సలిపి ఊర్ధ్వ సహస్రదళమును గురుముఖతః గ్రహించి, గురుసహాయముతో పొందగలుగునే తప్ప, ముక్తి గురించి చెప్పుటకు ఎవరు ముందుకు రాగలరు? (ఎవరికీ సాధ్యము కాదు.)

2627. ఊర్ధ్వలోకస్తులు కూడ దర్శింపజాలని శివుడు భక్తునికి శరీరములోనే లేగదూడను కోరి తల్లి ఆవు వచ్చినట్లు అమరును: లేగదూడ తల్లి ఆవు కొరకు పరితపించునట్లు, నేను దూడవలె నా నాథుని కోరి భక్తితో పిలిచితిని. ఊర్ధ్వలోకస్తులుకు కూడ అదృశ్యరూపుడగువాడు, నా కోరికపై నా చిత్తమున బహిర్గతమైనాడే!!

2628. మలదోష బంధములతో ఇమిడియున్న జీవుడు జన్మరహితము చేసుకొనుటకు తెలియనివారు (సఫలము కానివారు) ముక్తిమార్గమున పయనించు జీవుడు కూడ శివధ్యాస తప్ప మరే చర్యలుండవు. వీరిరువురికి శివుడు అనుగ్రహించి మలరహితము చేసి, జన్మకారణ మెరిగించి, మలరహితము ముందే చేసుకొన్నవారికి దివ్యానుగ్రహము కల్పించును. కావున దైవమునందు భక్తి సలుపుటయే తప్ప జీవులకు మరే చర్యలుండజాలవు సుమా!!
(భక్తులు లిరువురుకీ శివుడు సమానముగా అనుగ్రహించును.)

2629. శరీరమే కల్పముగా (కాయకల్పం – మందు – దీర్ఘకాల శరీరపుష్టికి), పాము శరీరశక్తిగా (కుండలినీ శక్తి – వెన్నెముకలోని పాము), కోయలు అందెలు శబ్దించగా (సహస్రమున ధ్వనించు నాదశబ్దం) తేనెను కార్చు పద్మమున (సహస్రదళ పద్మములోని తేనె – మధురము – ఆనందము) నందీశ్వరుని స్తుతించుటచే సఫలమైనది కావున నా మనస్సు ఇతర దైవములపై వెళ్ళజాలదు సుమా!!
(అన్ని సిద్ధ, యోగ, జ్ఞానమార్గములన్నిటికీ భక్తియే పరాకాష్ట)

2630. మూలాధారమున నున్న అగ్నియే సహస్రమునకు చేరి జ్యోతిగా వెలుగొందుచున్నది: జీవులకు సర్వదా తోడున్న నందీశ్వరుడు దేవతలకు కూడ నాయకుడగును. వాని తోడుంచుకొని జన్మరహితము పొందండి!! వాని అన్యోన్యత తోడుగైకొని వాని దివ్యచరణములను చిత్తమున పదిలపరచుకొనండి!! వాడు తోడై అగ్నిగా – దివ్య ప్రకాశముగా నీలో అనుగ్రహించును.

2631. ప్రకాశ మండలములోనున్న దేవతలను అణిచి ఉంచినదియూ, చీకటి మండలములోని అసురుల త్రిపురములను కాల్చిన నాయకుడు, నాదమయుడైనవాడు, వీర్యకోశమున వెలయువాడు అగు దైవము కర్మానుసారియగు ఈ శరీరమునందే వెలసియున్నాడని గ్రహించి జ్ఞానులు స్తుతించిరి!!

2632. నిరాధార దీక్ష గురించి సూక్ష్మముగా చెప్పబడినది: కుండలినీశక్తిని సహస్రదళము చేర్చు తత్వము గ్రహించి స్థితిపొందుటయూ, దానిని గ్రహించక కీడు ఒనగూర్చు ఇంద్రియ కరణముతో సమ్మేళనమగుటయూ, రెంటిని దైవము ముందే ఏర్పరచి యున్నాడు. వీటిని గ్రహించిన నేను నా చిత్తమును ప్రకాశవంతము చేసుకొంటిని. వానిని శిరమను పర్వతముపై, భ్రూమధ్యము నుండి బ్రహ్మరంధ్రము వరకునూ, వికసించిన సహస్రదళ పద్మములోనూ, మూలాధార అగ్ని కొలిమిలోనూ, మనో మండలమను మనస్సులోనూ, ధ్యానించి నిమగ్నుడైయుంటిని సుమా!!

(1. శిరస్సులో సృజించియుండుట, 2. ప్రాణశక్తిని సహస్రమునకు చేర్చుట, 3. సాధనచే సహస్రదళ పద్మమును వికసింపచేయుట – శరీరసిద్ధి ఉపాయ వివరణలు మూడవ అధ్యాయంలో చెప్పబడినవి.)

కర్మలయందు నిష్కామకర్మలు చిత్తశుద్ధిని, యోగమునందు చిత్త ఏకాగ్రతను, జ్ఞానమునందు చిత్తవైశాల్యము, వివేక విచారణలతో జ్ఞాననిష్ఠలో నిలబడుటకు అన్నిటికీ అనన్యభక్తి తత్వమే అంతర్లీనమై చాపక్రింద నీరువలె యున్నది. భక్తియే పరాకాష్ట.

## 42. ముముక్షత్వం

(ముక్తిపై తీవ్రమైన ఆసక్తి. జీవన్ముక్తి పొందుట)

2633. దైవమునందు నిర్విరామ ధ్యాసయే సత్యమైన తపస్సని సత్యతత్వజ్ఞానులు అందురు: ముక్తిస్థితికి కారకములైన పరమేశ్వరుని పూర్తి అనుగ్రహము పొందిన జీవుడు, ముప్పది ఆరు (36) తత్వములను తనకు వేరైనదని తలంచి తొలగించుకొని తత్వశుద్ధి పొందియూ, తన కర్తవ్యము శివధ్యాస తప్ప మరేదియూ కాదనియూ, కర్మఫలము తొలగించుకొను నిజమైన భక్తిలో నెలకొన్నవారు శ్రేష్ట శివానందమగు సత్యతత్వమును గ్రహించిన జ్ఞానులు సుమా!!

2634. శివమను పండు కోరిన బాహ్యపక్షి (ఇన్నాళ్ళూ అధోముఖ–బాహ్యధోరణిలో నున్న జీవుడు) మనోమండలములో వెలయు శివుడను పండు కోరి నిర్విరామధ్యాసలో నుండి, కంఠమునకు పైగా వెలయు అగ్నిచే భ్రూమధ్యమున దీపమును వెలిగించి నపుడు, ఆ నలుగురు చేష్టలుడిగి (మనస్సాది అంతఃకరణములు – నాలుగు) శివానంద తత్వములో మునిగిపోవును సుమా!!

## 43. శోధన

(విచారణ)

(గురువనుగ్రహముతో నేర్వదగు సత్యతత్వమే – శోధన. వివేక విచారణులతో పొందదగు శ్రేష్టతత్వము)

2635. అందరికన్నా శ్రేష్టుడగు నందీశ్వరుడుని మౌన ఆనందస్థితిలో వాని దివ్యచరణముల కరుణానంద కడలిలో శరణు నొందితిమి. అన్ని రకములైన మాయ సంబంధితముల నుండి దాటించి, వాటి నుండి వేరుపరచి, ఊరకయుండుమని ఆజ్ఞాపించినదే – శోధనయగును. (ఊరకయుండునది = చేష్టలుడిగిన, మౌన, మనోనిశ్చలతత్వం.)

2636. సర్వజ్ఞుడు, శ్రేష్టమగు వేదములు ఘోషించు ప్రణవములో నెలకొన్నవాడు, మేలైన దేవతలకు కూడ దేవాదిదేవుడగువాడు, పంచేంద్రియ జ్ఞానములను దాటి (అతీతముగా) అఖండములో నెలకొని అపారజ్ఞానము పొందినవాడునగు గుణాదిశయములు గల గురునాధునిలో నేను నెలకొనియుంటిని సుమా!! (శివగురు = నందీశ్వరుడు.)

2637. శివజ్ఞానము మీలో నెలకొన్న పిదప లౌకికజ్ఞానము ఎటువంటిదో మీకు బోధపడును: లోకులు జ్ఞానం, జ్ఞానమని ఎడతెరిపి లేకుండా ప్రయాసలు పడుదురు. వారు చెప్పునదంతయూ బుధజ్ఞానము (బంధము కల్పించు బుద్ధి) అజ్ఞానముతో కూడినది. బంధబుద్ధిని తొలగించుకొని, దాటి శివజ్ఞానములో అమరినచో, జీవరాశులందుండు బంధజ్ఞానము ఎంత లక్షణమని బోధపడును సుమా!!

2638. శోధనకు పిదప చిత్తఏకాగ్రతతో దివ్యానుగ్రహముతో నిలుచుటయే శివానంద తత్వములో నెలకొననగును: శోధనకు పిదప ఇంద్రియ ప్రజ్ఞలను త్రోసిపుచ్చి, వాటి గుర్తెరిగి, మలదోషములతో కూడుకొన్న అధోతత్వములను త్రోసిపుచ్చి, ఏకాగ్రత చిత్తముతో శ్రేష్టమగు నందీశ్వరుని అనుగ్రహముతో ఐక్యమై, ఏకముగా (తాను, నేనను బేధము విడచి) కలిసి పోవుటయే శివానందమును పొందుటయగును.

2639. నా దైవము గాలిలో విడదీయలైని స్పర్శవలె, చెరకులో ఇమిడియున్న తీపివలె, పాలలో మరిగియున్న నెయ్యివలె, పండులో కలిసియున్న తీపివలె, పుష్పములో నెలకొన్న గంధము (సువానస)వలె, జీవులకు తోడుగా, రక్షకుడిగా ఉండి అన్నిటిలో కలిసియున్నాడు సుమా!!

2640. కోరి వికర్తయగు పరమేశ్వరుని దరిచేరి, హిమరూపమగు కైలాసనాధుని చేరిన బంగారు తీగవంటి ఉమాదేవివలె, కోరిక గల మనస్సున్నవారికి నా ప్రాణనాధుడు జ్యోతిరూపుడై వెలసి స్థితిపొందును సుమా!! (యోగ పరిభాషలో కుండలినీశక్తి కోరి సహస్రమునకు చేరి జ్యోతిప్రకాశమయమగుట.)

2641. జీవబోధనం నశించి, మనస్సు నశించిన స్థితిలో శివం వచ్చి నెలకొనును: నాదమయుడగు నందీశ్వరుడు శిరస్సున వెలయు చిదాకాశ – బట్టబయలులో వచ్చి నా మనోమండలమును ఆలయముగా చేసుకొని బహిర్గతమయ్యెను. అట్లు దర్శనమిచ్చినందుకు నా ప్రాణనాథుడు వచ్చేసాడని ఎంచి, నా జీవబోధనమును తొలగి నిలుచుంటిని. అట్లు నిలుచుటలో నా చింతనలో శివుడు శ్రేష్టముగా నెలకొని యున్నది దర్శించగలిగితిని.

2642. హృదయమున నెలకొన్న మహామహుని గుర్తించి దరిచేరిన వారికి శ్రేష్టతను ఒనగూర్చును: సత్, చిత్, ఆనందము గుణాదిశయములు గలవానిని, తత్వస్వరూపుడుగా ఉన్నవాడును, తపస్సంపన్నులకు శ్రేష్టమును ఒనగూర్చువాడును, మధ్యభాగమగు హృదమున నెలకొన్న నందీశ్వరుని, క్షీణతలన్నిటినీ దాటి పరిశుద్ధుడుగా నెలకొన్న దైవము దరిచేరండి!! అట్లు దరిచేరిని వారికి కోటానుకోట్ల జీవరాశులలో మిమ్ములను శ్రేష్టునిగా చేయును సుమా!!

2643. శివగురు అద్వైతశోధన చేసి సత్యతత్వమును చూపును: వెంటవచ్చి అద్వైతశోధన చేసినపుడే మేలైన నాథుడగు పరమేశ్వరుడే తోడుగా ఉండెను. పరముగాను, అపరముగాను నున్న ఆ మహామహుడు అన్నింటా ఇమిడి నెలకొన్నది దర్శించితిని. పైగా వాటికీ అతీతముగా, దాటి నెలకొనుటకునూ తాను తోడుగా ఉండి సహాయపడెను సుమా!!

2644. శివగురునాథుడు శిష్యుడికి ఇహము, పరము, ఆనందమునకు తోడై ఉండి అనుగ్రహించును: దేవతలు కూడ గ్రహించజాలని ఆ పరమాత్మ ఎఱ్ఱని ప్రకాశత్వమును చొప్పించును. ఆ దారిలో తనే తండ్రీ, తల్లి, సఖుడుగా, ఇష్టుడుగా ఉండి సహాయపడును. నాకు దారి చూపించి శివలోకమునకు కూడ కొనిపోయి అచ్చట ఉంచును. ఈ విధములుగా నందీ నాకు సహాయపడును సుమా!!

2645. శోధన చేసిన పిదప శిష్యునిలో జ్ఞానమేర్పరచి, అజ్ఞానమును తొలగించును: జ్ఞానమను కత్తిని బయటకు తీసి అజ్ఞానమను చీకటిని తొలగించి, అనుగ్రహించి ఉత్కృష్టమైన తన తత్వము నాలో ఇమిడ్చి, దేవాదిదేవుడైన తన సన్నిధిలో ఉంచు కొనెను. అట్లు ఉంచుకొనుటలో సర్వ అజ్ఞాన సమూహమును తొలగించబడిన దగును.

2646. శివగురువుచే గ్రహించిన శిష్యుడు శివుడగును: శివగురువుచే అనుగ్రహించబడిన జ్ఞానమగు కత్తి నా మనస్సును చేతితో తీసిన వెంటనే, నన్ను వేధించు వారెవరూ లేకుండా పోయిరి!! శివధ్యాసకు అన్యమైనదానిని తగు విచారణతో నా మనస్సును శోధించితిని. అపుడు ఆదిమూర్తియగు శివుడు నెలకొన్న శివంగా వీడు అగును!!

(శివంగా జీవాత్మ మారిపోవును.)

2647. శోధన చేసిన శిష్యుడు మలరహితుడై శివమగును: శివగురువు బోధచే జన్మ మూలకారణమగు బంధమును, అనిర్వచనమైన, అరూపమైన, అనాదియగు మాయను, కర్మఫలానుబంధములను, అనిశ్చితము, సంశయములను, కర్మానుసారి యైన పెక్కు పునర్జన్మలను, విపరీత భావనలను తొలగించబడి, సంస్కరించబడి తీవ్రశోధన చేసినవారు తర్పదముగా - శివంగా మార్పు చెందుదురు.

2648. గురునాధుని ప్రణవోపదేశముతో క్షీణరహితమైనది: వాక్కుచే శబ్దించని ప్రణవోప దేశమును నాలో సృజింపజేసెను నా గురునాధుడు. ఎల్లలు లేని గ్రంథపఠనాదులను సమూలముగా త్రెంచి, తెరలుతో కప్పియున్న ఈ దేహము క్షీణింపక అనుగ్రహించి, మలదోష రహితము చేయుటచే తర్పదము (శివం) నెలకొనెను.

(తెరలు: దేహములో ఇమిడియున్న అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములు జీవాత్మను గ్రహించజాలక కల్పియుంచిన తెరలు; శబ్దించని ప్రణవము: మౌనవాఖ్యానం - అమాత్రతత్వము - అక్షరము లేనిది - అకార, ఉకార, మకారములను దాటిన నిశ్శబ్దము.)

ఎనిమిదవ తంత్రము సమాప్తము

ఓం తత్సత్

సర్వం శివార్పణమస్తు

# తొమ్మిదవ తంత్రము

ఈ తంత్రమునందు రచయిత జ్ఞానస్వరూపమును మరింత వివరణలతో విశదీకరించియున్నారు. గురుమఠములో ప్రకాశముగా నెలకొను తత్వమును, శరీరమునందే ఇమిడినదిగా, శిరం, ధ్యాస, చింతనలో జ్ఞానగురువుగా ఉన్నాడని చెప్పి, ప్రణవ స్వరూపుడగు శివునిలో నెలకొనుటయే ప్రణవ సమాధి అని బోధపరచి, పిదప స్థూల, సూక్ష్మ, అతిసూక్ష్మ పంచాక్షరీలు వివరణలు చెప్పియున్నారు. పై మూడు విధ పంచాక్షరీలతో గలుగు ఫలము శివదర్శనములుగా, ఆరు రకములైన శివనాట్యములుగా పేర్కొని, వాటితో గలుగు నాదాంతములో నెలకొను ఫలమును విశదీకరించి, వ్యష్టిస్థితితో సమిష్టిస్థితిలో ఆకాశతత్వం పొందునదియూ, పిదప జ్ఞానోదయమై జ్ఞానము పూర్ణస్థితి పొంది, సత్యస్వస్వరూప జ్ఞానముతో ద్వంద్వములు లేని స్థితితో శివరూపమును పొంది, "తానే అతనై" జీవన్ముక్తుడై, కర్మ బంధములను తొలగించుకొని పునర్జన్మరహితమగు తత్వమును వివిధ అధ్యాయాలుగా రచయిత వివరించియున్నారు.

ఇక "శూన్యసంభాషణ" అధ్యాయము తిరుమంత్రము అంతటికీ మకుటము వంటిది. ఇందు రచయిత జ్ఞానతత్వమును మరిపించి సాధనలు, సాధన ఫలములను విడివిడిగా వివరించి, వైరాగ్యము ఏర్పరచి శివఫలము పొందు విధమును వివరించుయున్నారు. మౌనసమాధి వివరణలు, నిష్ఠలో నెలకొని, తన్ను మరచి అఖండములో నెలకొనుటయూ, ఈ స్థితిలో అన్నీ తనలో ఇమిడినవే తప్ప త్రోసిపుచ్చవలసినది ఏదియూ మిగులజాలదు (Inclusiveness) అని బోధపరచి మనస్సు, వాయుచలనము అణిగిన స్థితిలో "సర్వవ్యాప్తి"లో జీవాత్మ శివంయై అనంతవ్యాప్తం పొందినది. ఈ తొమ్మిదవ తంత్రమునందు బహుకోణములలో రసవంతమైన ప్రాసలతో రచయిత విశదీకరించియున్నారు.

ఇక తంత్రములోనికి వెళ్ళుదాం....

## 1. గురుమఠ దర్శనము

(గురు = ప్రకాశము; మఠము = స్థలము; ప్రకాశము దర్శనమగు స్థలము)

2649. బలియూ (నైవేద్యము) అవియూ (హవిస్సు) సమర్పించి, ఆహుతులచే ఏర్పడిన హోమాగ్ని పైకెగసి పొగ అంతటా ఆవరించియూ, వేదపఠన శబ్దముచే జరుగునదంతయూ మన పరమేశ్వరుని ప్రీత్యార్థము చేయునదేనని తలంచి, మనస్ఫూర్తిగా చేయబడు తత్వములో గురుస్వరూపముగా కనబడు ప్రకాశమును దర్శించినవారు దైవ దివ్యచరణములందు నెలకొన్న ప్రపంచ (బాహ్య) ప్రవృత్తులను వదిలించుకొన్నవారే సుమా!!

2650. శివం నెలకొనుటకు జీవుడే స్థానము: జీవుడు లేకుండినచో శివం వచ్చుటకు వేరే

స్థలము లేదు. నిజమెరిగినచో శివునికి వేరేదైన స్థలమున్నదా? వానికి (శివునికి) వీడి (జీవుడి) హృదయమే స్థానమని గ్రహించియూ, వాడు బాహ్యముగా ఎక్కడో (వేరేగా) నున్నాడని తలచి చెప్పుచున్నారే!! ఎంతటి అజ్ఞానము!!

(శివుడు = కారణము; జీవుడు = కార్యము; కార్యము లేకుండినచో కారణ హోదా లేదు.)

2651. శివుని దివ్యచరణములను గ్రహించినవారు సర్వమును గ్రహించగల జ్ఞానతత్వం ఏర్పడును: బుద్ధిపూర్వక జ్ఞానముతో సహస్రదళ పద్మమును గ్రహించిన పిదప శివుని పుష్పములతో అలంకరించబడిన దివ్యచరణములను నాలో కనుగొంటిని!! వెతకి వెతకి అల్లాడిననూ కానరాని నా మహామహుడు మనోమండలమగు – నా మనస్సునే ఆలయముగా చేసుకున్నాడే! చరాచర జగత్తుగాను, నా ప్రాణముగాను యున్నది సృజించితిని సుమా!!

2652. దైవము బహిర్గతమైన ఆసనము ఏది, పర్వతమేదని నేను తెలియపరచుదును గాక!! చిత్తమగు గుహయూ, ఆ గుహ ఎచ్చట నున్నదని నేను తెలియపరచుదును గాక!! ఆరు ఆధారములు ఏవని వాటి (అజ్ఞానమను) అడవి ఎచ్చట నున్నదని తెలియపరచుదును గాక!! వీటి గురించి పదునాలుగు (14) లోకస్తులకు నేను తెలియపరచుదును గాక!!

2653. ముఖము పీఠము (ఎత్తైన స్థలము – గురుముఖమే దైవము యొక్క పీఠము), గురుశరీరమే దైవము యొక్క ఆశ్రమము. మనస్సులో మెదలు సద్భావనలే సత్సంగ సభ్యులు. ఇతరులకు చేయు ఉపకారములు, సచ్చింతనలు పలు దివ్య దృశ్యమానములు. అంతరమే పరమధామము (మేలైన ఉనికి). అరూప ఈశ్వరుని కొలుచు నామములే లెక్కలేనన్ని చర్యలు (సత్కర్మలు). చిదంబరమే (చిత్ + అంబరము = చిత్ ఆకాశము) దివ్యగుహ. ఇవియన్నియూ వానిని మోయు ఆధారములు సుమా!!

2654. అంతర్ముఖులైన జ్ఞానులకు చెప్పవలెనన్నచో, అంతర్ముఖమున వెలయు ఆత్మయే దైవము యొక్క పీఠము. అదే అన్ని తత్వములకు ఆధారము. లోకస్వరూపియగు శక్తియే అన్నిటికీ ఉనికి (స్థానము) యగును. ప్రపంచమునకు కారణభూతుడైన దైవమే అన్నిటినీ పరిపాలించు శివమగును.

(పై రెండు మంత్రములు దైవము యొక్క బాహ్య, అంతరరూపములను విశదీకపరుచునవి.)

2655. ద్వంద మాయలచే (అశుద్ధ, శుద్ధ) మరిపించబడిన ఆత్మతత్వము గ్రహింపబడజాలదు. కాయములో నెలకొన్న పంచతెరలు విడువడినచో, ఆత్మయగు శుద్ధ సత్య

ప్రకాశతత్త్వము బహిర్గతమై, ఆ ప్రకాశస్వరూపములో స్థితిపొందిన జ్ఞానులు త్రిపుటిని తొలగించుకొన్న శ్రేష్టులు సుమా!! (పంచకోశ విలక్షణమగు పరంజ్యోతిని దర్శించినవారు త్రిపుటి జ్ఞానము తొలగించుకొన్న శ్రేష్టమైనవారు.)

(పంచతెరలు: శరీరములో నెలకొన్న అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములు – ఐదు తెరలు ఆత్మను కప్పియుంచునవి; వీటిని ప్రవిలాపనము చేసి సత్య ఆత్మతత్త్వమును గ్రహించినచో త్రిపుటి (చూచువాడు (దృక్), చూడబడునది (వస్తువు), చూచుట (దృశ్యము) తొలగి శ్రేష్టమగు ప్రణవతత్త్వం (ఆత్మ) గ్రహించిన వాడగును; జీవ, జగత్తు, ఈశ్వర తత్త్వములో దృశ్యమానమగు జగత్తును తొలగించిన పిదప జీవ, ఈశ్వర మాత్రమే మిగులును. పిదప ప్రణవ నిష్టతో స్థితిపొందిన జ్ఞానులు జీవ తొలగి ఈశ్వరునిలో లయమై ఏకత్వము – శివం అగుదురు.)

## 2. జ్ఞానగురు దర్శనము

(జ్ఞానగురు = బాహ్యగురువు గురించి ఆరవ మంత్రమలో "శివగురు"గా చెప్పబడినది; ఇచ్చట జ్ఞానగురు అంతరమున నెలకొన్న స్వప్రకాశ మండలములో (భ్రూమధ్యము తెరవబడి) దర్శించు పరమశివుడే గురువుగా అనుగ్రహించునది.)

2656. జ్ఞానగురువు తత్త్వములను విడనాడిన శిష్యునికి పరమానందత్వమును అనుగ్రహించి మహానందములో ముంచును: ముప్పది ఆరు (36) తత్త్వములు అణిగిన స్థితిలో శివుడు బహిర్గతమై ఆత్మను తనలో ఇముడ్చుకొనును. ఆ స్థితి పొందిన పిమ్మట మేలైన శివపదము పొంది, దీని ఫలముతో లౌకిక విషయ వాసనలను విడచి, శ్రేష్టతత్త్వమొనగూర్చు శివభోగమమరును.

(బ్రహ్మానందమును పొందును; శివపరము = జీవుని పరముగా చేయుట.)

2657. జీవ, పర, శివ తురీయములను దాటి నెలకొన్న జ్ఞానము మహాప్రకాశముతో నిండినదై, శ్రేష్టమగు పరమశివుడే సర్వమునై వచ్చుట, పోవుటనన్నది లేనిదైన స్థానములోనున్న ఉన్నతమైన గురుపదము గురించి చెప్పుటకు అలవికాదు.

(జీవుడు తురీయాతీతములో నెలకొను స్థితిని మాటలు వర్ణించజాలవు. అదొక మౌనస్థితి; వచ్చుట, పోవుట లేనన్నది = పునర్జన్మల రహితం; ఆత్మతత్త్వము అనాగమాపాయి – శాశ్వత, సత్యతత్త్వం – "త్రికాలేపి తిష్టతి".)

2658. తల్లివంటి నందీశ్వరుని దివ్యపాద పద్మములను నా శిరస్సుపై దాల్చితిని. నోరువంటి గోపుర ద్వారములో స్తుతించుటకు నోరును గలిగితిని. విత్తుయగు బీజమును చూచుటకుగాను, నేత్రములను (జ్ఞాననేత్రములను) గలిగితిని. శుభచర్యలు చేయుటకుగాను నా చిత్తమును గలిగితిని. (శుభచర్యలు – జ్ఞానసాధనలకు ఉపయుక్తమగు

భూమికలుగా చెప్పబడిన – శిరస్సు, శ్రద్ధ, చిత్తము; మాటలు, వినుట, చూచుట, మనస్సు అంతయూ శివమయమే – "శ్రోత్రస్య శ్రోత్రం, మనసో మనః, వాచోహవాచం, ప్రాణస్య ప్రాణః" శ్రుతివాక్యము – కేన ఉప॥.)

2659. గరుడ ఉపాసకుడు మంత్రము పఠించిన మాత్రమున పామువిషయం దిగిపోయి ప్రాణభయము తప్పినట్లు, జ్ఞానసాధనతో జ్ఞానగురువును ధ్యానించిన వెంటనే త్రిమలములు తొలగించబడి మహాప్రకాశబింబమైన శివం అగును సుమా!!

2660. శివ గురునాధుని భూమికలేవని ఈ లౌకికులు ఎరుగజాలరు. శివగురునాధుని స్థానము గ్రహించినవారికి (జ్ఞానవిచారణతో జీవుడేనన్న స్పృహతో) ఆ మహామహుడు శాశ్వతముగా వారి మనస్సులో అమరిపోవును (కూర్చుండిపోవునని చెప్పబడినది) సుమా!! ("ఈశ్వరో గురురాత్మేతి" – శ్రుతివాక్యము.)

2661. ముఖము ముందు కనిపించు ప్రకాశమును గ్రహించునదియూ గ్రహించక పోవుటయూ మారి మారి వచ్చుచున్న జాగ్రదాది స్వప్న, సుషుప్తి వలననే (మెలకువలో అన్నీ గ్రహించుట, నిద్రలో ఏదీ గ్రహించకపోవుట). జీవ, పర, శివ తురీయములు మూడింటిని దాటి వెళ్ళిన పిదప జాగ్రదాది అవస్థాత్రయం వీగిపోవును. అప్పుడు నందీశ్వరుడగు గురునాధుడు శిష్యునికి ప్రణవదేహము పొందునట్లు అనుగ్రహించును.

2662. చంద్రమండలముగా వెలయు భ్రూమధ్యమున, సువాసనలను పసిగట్టగలగిన నాసికల పైభాగమునున్న పద్మములో యున్న శక్తి ఎటువంటి బంధములు లేని రూపము గలది. ఇటువంటి బంధరహితము చేయగలగిన శక్తిని ధ్యానించి నీవు పట్టుకొందువు గాక!! (ఆజ్ఞా చక్రధారిణియగు శక్తిని చంద్రభూమి, జటాధారి, సాధ్వియను పెక్కు నామములు రచయితచే చెప్పబడి, బంధములను త్రెంచు శక్తిగా ఇంతకు పూర్వమే చెప్పబడినది.)

2663. తత్వములన్నిటినీ దాటించి శిష్యునికి అనుగ్రహించునది పరమగురువు: భ్రూమధ్య ధ్యానముచే ఏడులోకములు (షట్చక్ర స్థానము + సహస్రదళము) ఉన్నతి పొందునట్లు పరమగురువు మనస్సులో బహిర్గతమై, తాను ఆకాశవ్యాపకమున (సహస్రదళములో) నిలచి పృథివి (స్వాధిష్ఠానం)లో ప్రవేశించెను. శిరస్సున నెలకొనియే అష్టదిక్పాలకుల చేష్టలు తొలగించెను. అట్లు వనములో ప్రవేశించిన (అజ్ఞాన తత్వములను అడవి) ఆతని ఊరు ఉత్తరము అగును.

2664. జీవుడు పంచకోశములకు అతీతమగునపుడు ప్రసాదతత్వము, దశకార్యసిద్ధికి దారితీయును: ముందటి వరకు జీవుడు అన్నమయకోశాదులనే తానని నమ్మియుండెను. అవియన్నియూ జీవుడగు పక్షి నివసించు అడవియగును. కాని

ఇవి తాను కాదని ఎరిగి తనకు వేరైన మార్గమగు షోడశకళలు మార్గమున్నదని గ్రహించి, సత్యమును గ్రహింపచేయగల దశకార్యములు బోధపడును.
(పంచకోశములు: అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములు; షోడశకళలు = ప్రసాదతత్త్వము – పదహారు కళలను మంత్రసాధనలతో దాటి గ్రహించబడునది. దశకార్యస్థితులు గురుముఖముగా నేర్వవలసినవి.)

2665. జీవులు పరిపక్వపడిన తరుణములో వానితో కలిసియూ, తరువాత వానినుండి వైదొలగక నెలకొన్న ప్రాణనాథుడైన నందీశ్వరుడు, తననే చిత్తమునందు పదిల పరచుకొన్నవారికి జీవబోధము నశించునట్లు చేయును. నంది జ్యోతితో కలిసిపోయి సృజించువారికి ఇన్నాళ్ళు వారిని పీడించుచున్న విధివిన్యాసములు తొలగిపోయి ద్వంద్వములకు మూలమైన మాయయూ నశించును.

2666. శివజ్ఞానమును గ్రహింపజేయు శివమహామహుని మన జీవితములోనే గ్రహించ వచ్చును. దానిచే మిక్కిలి బలమైన బంధపాశములను మిగలిపోకుండా త్రెంచివేసి, బంధములను పురికొల్పువాటి దిక్కు వెళ్ళకుండా శివుని నిర్విరామచింతన చేసినచో శివతత్త్వములో నెలకొని స్థితి పొందగలము సుమా!!
(బంధపాశములను తగ్గించుకొనుట, అనుగ్రహం పెంపొందించుకొనుట శివుని పొందు మార్గములు.)

2667. గురు మార్గదర్శకముతో జ్యోతిప్రకాశమును దర్శించినవారు చిన్నవారైననూ వారు జ్ఞానవృద్ధులే: గురు మార్గదర్శకముతో సాధకుడు శివుని సదా చింతన చేయుటచే, శివుడు కూడ వానినే తలంచుచుండును. అట్లు భ్రూమధ్యమున జ్యోతిని దర్శించిన అనుగ్రహవంతులు జాతిపరముగా, వయస్సు పరముగా చిన్నవారైననూ నిర్విరామముగా శివధ్యాసలో యుండుటచే వారు శ్రేష్టమైన జ్ఞానవృద్ధులే సుమా!!

2668. సదా శివచింతనలో యుండువారు శివుని ప్రేమకు పాత్రులగుదురు: శివుని సదా స్తుతించు సాధకుడు తన సాధన కాలములో, ఏదైన ఆటంకము గలిగినచో అది చెడు విధిఫలమని గ్రహించవలె. అట్లున్ననూ అన్నిటికీ కారణభూతుడైన ఆది పరాపరుడు (పరమేశ్వరుడు) నిర్విరామ తపస్సంపన్నులను కోరి తన ప్రేమకు పాత్రులుగా చేసుకొనును.

2669. శివధ్యాసలో నిర్విరామముగా ఉండువారు ప్రపంచ వ్యవహార బంధములన్నిటినీ త్రోసిపుచ్చినవారే: శివధ్యానములో నుండువారు శివుని సృజించి, వానినుండి విడువడక యుందురు. వారు లౌకిక వ్యవహార వృత్తులను త్యజించినవారై, విషయముల, వ్యవహార బంధములు లేక వాటిపై ఆసక్తి లేకయూ ఉందురు.

అటువంటివారిని శివమహామహుడు వీడక తానే తోడైయుండును.

2670. జ్ఞానగురోపదేశముచే జీవప్రకాశములో శివప్రకాశము వెలుగును: పచ్చరంగుపై ఎర్రనిరంగు వేసినచో మరొక రంగు వచ్చునట్లు (మరకతము, మాణిక్యము ఉపమానములు), తగిన సమయములో గురోపదేశము పొందిన సన్మార్గ శిష్యునికి మరొక అర్హత ఏర్పడినట్లు, ఈ పొందిన ప్రకాశము భ్రూమధ్యమున ఏర్పడినదే. సుందరజ్యోతిలో ఇమిడిన జ్యోతియే అగును. (జీవుడు కార్యబ్రహ్మం, పరమాత్ముడు కారణబ్రహ్మం – కారణము కార్యమంతటా నిండి, కలిసిపోయినది. "పూర్ణమదః పూర్ణమిదం, పూర్ణాత్ పూర్ణముదచ్యతే" – శ్రుతివాక్యం.)

2671. జ్ఞానగురువు స్థితి వర్ణన – శివుడే గురువులో నెలకొని గురుముఖతః అన్నీ బోధించును: భుజించు నోరుగా, శరీరముగా, ప్రాణముగా పలుకు మాటలుగా, చూచు నేత్రములుగా, దృష్టిగా, జ్ఞానగురువులో శివుడు నెలకొని ఇమిడిపోవును. ఇక పృథివిగా, జలముగా, అగ్నిగా, వాయువుగా, ఆకాశముగా పంచభూతములుగా నెలకొనియూ, జ్ఞానస్వరూపుడుగా, దేహములో ఇమిడియూ, దేహధర్మములను వీడియూ (వాటికి అతీతంగా, అసంగముగా) జ్ఞానగురువులో నెలకొనియున్నాడు.

2672. ప్రపంచమంతయూ తమ నాయకుడని "పతి"యని స్తుతించును. పరమశివుని ఆజ్ఞ వలనే శివశక్తులు ఈ ప్రపంచవృత్తులు చేయుచున్నవి. అతను మహా ఆకాశములో (విశ్వము – అఖండంగా) నెలకొని, తనను స్తుతించి, నమస్కరించు దాసుల (శివజ్ఞానులు) పరిపక్వత, అర్హత తగ్గట్లు ఆకాశతత్వము (పతితత్వం) నొసగి అనుగ్రహించును. (పశుపతి = జీవరాశులకు "పతి".)

2673. బుద్ధిమంతులు ఆకాశనాథుడగు శివాజ్ఞను శిరసావహించి అనుగ్రహలబ్ధి పొందుదురు: సర్వత్రా వ్యాపించి, ఉన్నతి పొందిన లోకములన్నీ అంబరనాథుని (అంబరము = ఆకాశము) అనుగ్రహమే తప్ప వేరేమియూ గ్రహింపలేమని బుద్ధిమంతులు చెప్పుదురు. ఇక ఆకాశవాసులైన దేవతలు, అసురులు ఈ తత్వమును గ్రహించని, దర్శించనివారే!! కాని ఆ మహామహుని అనుగ్రహము పొందినవారే ఆతని దర్శించగలరు సుమా!!

2674. పశుతత్వముగల జీవాత్మలు శివానుగ్రహము పొందిన పిమ్మట మిగతావారు వచ్చి నమస్కరించునట్లు నాయకునిచేసి, తమ నాలుకతో స్తుతించునట్లు నమస్కరించునట్లునూ నందీశ్వరుడు అనుగ్రహించెను. అందుచే మేమిక వేరే దైవమును నమస్కరించజాలము. శివుడొక్కడే ఇతర దేవతలను ఆజ్ఞాపించి నడిపించుచున్నాడన్న తేట పొందితిమి. చిత్తము తేటయైనది. మేమే ఇక ప్రజలు నమస్కరించు వస్తువైతిమి.

## 3. ప్రణవ సమాధి

(ఓంకారములో లయమొందుట; ప్రణవము స్థూల, సూక్ష్మములని రెండు విధములు. అకార, ఉకార, మకారములు స్థూలప్రణవం. బిందు, నాదముల గ్రహణ సూక్ష్మ ప్రణవం. ప్రణవంను గ్రహించి ప్రేమతత్త్వముతో అణిగిపోవుటయే ప్రణవసమాధి)

2675. అకార, ఉకార, మకార మూడు అక్షరములతో కూడిన ప్రణవము స్థూల ప్రణవం – శరీరమునకు స్వరూపమానంద మేర్పరచునది – రక్షించి పాలించునది. ఇక ఆపైనున్నది సూక్ష్మప్రణవమగు బిందు, నాదములు – పరాశక్తి రూపములు. జ్ఞానముద్ర మార్గమునకు (గురోపదేశము పిమ్మట గ్రహించబడునది) కారణము ఈ సూక్ష్మప్రణవమే. ఈ మేలైన సూక్ష్మప్రణవమును గ్రహించునదే వేదాంత తత్త్వమగును.

2676. ఓంకారము గ్రహించి ఉపాసన చేసినవారు ముక్తి, సిద్ధులు పొందుదురు: ఓంకారమను ప్రణవములో ఒక భాష గలదు (మౌనభాష – అమాత్ర – నిశబ్దము ఉదయించును). ఓంకారములో రూపము, అరూపులు గలవు ("అ, ఉ, మ"లు రూపములు; "అమాత్ర" అరూపము). ఓంకారములో ఫలభేదమున్నది (స్థూల, సూక్ష్మ ప్రణవ ఉపాసనచే గలుగు ఫలభేదము). ఇంతటి శ్రేష్టమైన ప్రణవముతో ముక్తియూ, సిద్ధియూ రెండూ గలుగును!!

2677. అఖండమైన ప్రణవమునుండే పంచభూతములు, చరాచరములు ఉద్భవించినవి. ప్రణవమునకు అతీతములో సకలురు, ప్రళాయకలురు, విజ్ఞానకలురులగు ప్రాణవర్గము కలదు. ఓంకారమే జీవ, పర, శివరూపములు సుమా!!

2678. పరబ్రహ్మ పదార్థమైన అ (బ్రహ్మ), ఉ (విష్ణువు), మ (రుద్రుడు) స్థితి దాటి బిందు (మహేశ్వరం), నాదము (సదాశివం)లో నెలకొనునపుడేర్పడు సుఖవ్యాపకస్థితి, దానిలో సంక్షిప్తమైన స్థితియే చరముగాను, అచరముగాను ప్రపంచములో నున్నది. బృహద్ధకముగా (పెద్దదిగా) కనిపించు ప్రపంచమంతా నాదబ్రహ్మ రూపమగును. ఈ సత్యమును జ్ఞానము పొందినవారు మాత్రమే గ్రహించగలరు.

2679. ప్రణవ ఉపదేశముతో సన్మార్గతత్త్వములో మనస్సు శివం నందు పదిలమై ప్రాణణ (శ్వాస) అణగును: మోహ మనస్సుతో ప్రాణణ (శ్వాస) చలనముండుటచే అది అల్లాడును (నిలకడ లేమితో). మోహం తొలగి జ్ఞానగురువుచే గ్రహింపబడి తేట పొందినపుడు ప్రకాశతత్త్వము నెలకొనును (మనస్సు నిలకడతో వాయుచలనము అణగును). వీటికి కావలసినది స్థలము (సహస్రదళము). చెరువు (సహస్రదళ పద్మము), తపస్సు, చిత్తము. ఇట్లు సన్మార్గ ఉపదేశముతో శుభమేర్పడును సుమా!!

2680. ప్రణవయోగమును అభ్యసించు సన్మార్గులు ఆధారచక్రములను దాటి ప్రేమ

స్వరూపములో నెలకొన్నవారు: షోడశ మార్గములో (పదహారు కళల తత్త్వము) వెళ్ళు సన్మార్గులు ద్వాదశాంతములో వెలయు బట్టబయలగు అంత్యములో నిలచి, కోదండమగు ప్రణవమును దాటి, జ్ఞాననిలయమగు ప్రేమతత్త్వములో అంత్యముగా స్థితిపొందుదురు. (ప్రేమే శివం.)

## 4. ప్రకాశము (జ్యోతి)

(శివుడు ప్రకాశము; జీవుడు ప్రకాశవస్తువే; జీవప్రకాశము శివమహా ప్రకాశములో స్థితిపొంది, గ్రహించినపుడు పునర్జన్మరహితమగును)

2681. ఆత్మ ప్రకాశమును సృజించి స్థితిపొందినపుడు జీవభావన కనుమరుగైపోవును. కనుమరుగు కాక జీవభావన అట్లే ఉండినచో, పునర్జన్మ ఏర్పడును. ఆత్మ ప్రకాశమును చిత్తమున గ్రహించునపుడు మహాప్రకాశముగా ప్రజ్వలించును. ఆ ప్రకాశము నిలచి, అదికూడ కరిగిపోవునపుడు శివం గ్రహింపబడును.

2682. ఆత్మజ్యోతిలో ఇమిడిన వారికి పెక్కు సామర్థ్యములు గలుగును: ఆత్మజ్యోతిలో స్థితి పొందినవారు అష్టభువనములకు (లోకములకు) వెళ్ళు సామర్థ్యము పొందుదురు. వారి హృదయములో అఖండమైన ప్రకాశము నెలకొని బాహ్య చీకటిని తొలగించగలదు. సూర్యుని ప్రకాశముతో తామర విచ్చుకొన్నట్లు (వికసించునది – సహస్రదళ పద్మము) చీకటియను అజ్ఞానము, మలదోషములను పోగొట్టి ఆ మహామహుడు నెలకొన్నాడే!!

2683. మహాప్రకాశుడగు శివుడు జీవుని ప్రకాశములో ఇమిడి శుభములొనగూర్చును: దైవము జ్యోతి అనుగ్రహముచే జీవుని ఆత్మలో నెలకొని ప్రకాశవంతమైన, అంతటా వ్యాపించిన సూర్య, చంద్ర, అగ్నికిరణములతో తేజోవంతమైన ప్రకాశముగా ఆత్మలో ప్రకాశించినది. ఇట్లు తేజోవంతమైన ప్రకాశముగా వెలిగినది ఏలనన్నచో శివుడే తన ప్రకాశముతో జీవునిలో నెలకొని వెలసినందుకే!!

2684. ప్రకాశమునే తన స్వరూపముగా గలిగిన శివుడు అజః (జన్మ లేనివాడు). ప్రకాశించుచున్న సూర్యచంద్రులు వాని నేత్రములు. జ్ఞానప్రకాశముతో ప్రజ్వలించుచున్న అగ్ని వాని మూడవ నేత్రము (భ్రూమధ్యం), ఇట్లు మూడు విధములుగా ప్రకాశించుచున్నవే జ్ఞానుల శరీరములో ఇముడును. (శివానుగ్రహముతో జ్ఞానులు త్రినేత్రములతో ప్రకాశించుదురు.)

2685. శిరస్సున (సహస్రమున) వెలయు ప్రకాశము ఊర్ధ్వప్రకాశముగా ఆకాశ అంశముతో కూడినది. ఇక దానిని క్రిందనున్న మారుత ప్రకాశం – వాయువు అంశము గలిగినది. క్షీరప్రకాశము (పాలు) పునరర్పుత్తి కలుగజేయు మూలాగ్నియగు కామాగ్ని. జలప్రకాశము నీటి అంశముతో కూడిన అపానమున వెన్నెముక షట్చక్ర స్థానములో

సుషుమ్ననాడి గుండా పైకి ప్రాకించి సహస్రమును చేర్చునది. ఊర్ధ్వమునకు చేరుకొన్నది పృథివి, జల, అగ్ని, వాయువు, ఆకాశ, పంచభూత తత్త్వప్రకాశములతో కూడినదై శిరస్సున మహాప్రకాశముగా ఏకముగా వెలుగును.

2686. మెరుపువంటి తెల్లని శుద్ధప్రకాశము (శివుడు), శ్రేష్టమైన ఎర్రని ప్రకాశము (శక్తి), "పర" జ్ఞానముతో పొందు ఆత్మ ప్రకాశము, షట్చక్ర స్థానములలో నెలకొన్న షట్ప్రకాశము, వ్యవహార జగత్తును నడిపించు ఇచ్ఛాశక్తియూ ఇవియన్నియూ కలిసి ఒకే ప్రకాశముగా అనుగ్రహించబడును సుమా!!

2687. శివుడు ప్రణవరూపుడుగా ఉండి దేహమునకు సామర్థ్యము నొసగువాడగును: మెరుపువలె మెరియు ప్రకాశము ఆత్మలో మరిగిపోయి శివప్రకాశముగా విరాజిల్లు శివుని సర్వదా తలవండీ!! అప్పుడు చిత్తమున నెలకొన్నవాడు దేహమంతటికీ వ్యాప్తం పొంది జీవులకు ప్రాణశక్తిగా నెలకొని శ్రేష్టతను ఒనగూర్చి అనుగ్రహించును సుమా!! (శివుడే దేహాంగములలో ఇమిడి ఆయా వృత్తులు సలిపి తోడున్నాడు 2671)

2688. స్వతగా ప్రకాశతత్త్వమును పొందియున్నది జీవుడు (ఆత్మ). అది గ్రహించక అజ్ఞాన ప్రవృత్తితో చీకటిలో మునిగియున్నది. కాని చిత్తమున ప్రకాశరూపుడగు శివుని పదిలపరచుకొన్నవారికి మహాప్రకాశం అనుగ్రహించి అతనిలో నెలకొనును. ఉప్పునీరు ప్రవహించు మార్గమున ఉత్పన్నమగు విషమును కూడ మార్చి, అమర్చినది, తాను (శివుడు) కంఠమున నెలకొని తన సంకల్పముతో మార్చి అమర్చినదే సుమా!!

(ఉప్పునీటిలో ప్రవహించు విషము = వీర్యము; కామకలాపాలు ఆత్మతత్త్వంను చెడుపు విషము; కంఠము = ప్రణవము ఉదయించు స్థానము.)

2689. ప్రకృతిలో మహా ప్రకాశముగా ఏది వెలసినదో అదే ఈశానుడు (శివుడు - సూర్య, చంద్ర, అగ్ని ప్రకాశములన్నీ ఏకమై మనోమండలములో వెలసిన ఈశానమూర్తిగా). శివుని యందు ఇమిడిన శక్తి కూడ శివానుకూలముగా వృత్తులు సలుపును. శక్తి వశమున జరుగు సోమ, సూర్యాగ్నులు మూడును విస్తరించిన ప్రకాశముగా దర్శమిచ్చి, మనస్సున అవియన్నియూ ఏకమైన ప్రకాశమే శివునికి తోడుగా నిలుచుండినదగును.

2690. మనోమండలములో వెలయు ప్రకాశము జీవుని సూక్ష్మశరీరములో ఇమిడిన శివుడేయగును. అందు శివుని వీడకయుండి మాణిక్యము వంటి ప్రకాశము గలది. మెరుపుతీగ వలె ఆకాశములో ఒక వెలుగు వెలిగి ఇమిడినదియూ, ఆకాశమంతా ఒక చుట్టు భ్రమించి జీవుని ప్రకాశకిరణములతో కలిసి నెలకొనినది.

(శివ ప్రకాశము జీవుని ప్రకాశములో కలిసి నెలకొనుట.)

2691. శివుడు జీవుని మనోమండలములో నెలకొని తన ప్రకాశముతో అజ్ఞానచీకటిని పారద్రోలును. బహిర్గతమైన ప్రకాశముతో వికర్తగా జీవుని మాయలో ఇమిడి చీకటియను అజ్ఞానములో నాట్యమాడి, తాను అజ్ఞానచీకటిలో కలిసిపోయినట్లు నటించి, తన మహాప్రకాశమును జీవునిలో చొప్పించి మనస్సున తాను స్థితిపొందెనే!! (నిశిరాత్రిలో నాట్యమాడు నాథుడని శివునికి నామము.)

2692. జీవాత్మ సహస్రదళము దాటి అతీతముగా వెళ్ళునపుడు మాయాది మలదోషములన్నీ తొలగిపోవును: జ్ఞానసాధనతో జీవుడు, ఆదియైన పరమాత్మ అమరుడైన రుద్ర జ్యోతితో (మూలాధారములోనున్న రుద్రుడు సాధనతో సహస్రదళము చేరుట) సహస్రదళ పద్మములో ఇముడుటచే, ఆత్మజ్యోతిని పొంది, దానికి అవ్వలనున్న మహాప్రకాశములో నెలకొనును. ఈ ప్రక్రియలో ఆదియగు పరమాత్మ జీవుని మాయలనుండి దాటించును.

2693. ఈ లౌకికులు కారణకర్తను “ఉన్నది”యనియూ “లేదు”యనియూ ప్రలాపములు పలుకుదురు. ఆత్మకు పైగా ఒక అనాదియగు పరబ్రహ్మ తత్వమొకటి లేదని చెప్పువారికి శివగతి కలుగునా? అట్లున్నది చూచి ఎరుగజాలమన్నవారికి కూడ జ్ఞానసాధనతో ఆకాశమయమగు మనోమండలములో వారికి తగిన ప్రకాశములో దైవము తిళ్ళైనాథుడు – చిదంబరములో (చిత్ + అంబరము) దర్శనమొసగును సుమా!! (నాస్తికులు కూడ తగిన సాధనతో వారి మనస్సునందే దర్శించనగును.)

2694. సాధకుడు అంతర్ముఖుడగునపుడు ప్రకాశము దర్శించి జీవన్ముక్తుడగును: సాధకుడు అంతర్ముఖుడగునపుడు సూర్యుడు వంటి ఏకమైన జ్యోతిరూపముగా మహాప్రకాశముగా ఈశుడు దర్శనమొసగును. ఆ ప్రకాశదర్శనంతో వానిలో మాయాది చీకటియన్నియూ తొలగిపోయి, శరీరముతోనున్న జ్ఞానసన్యాసి అగును – జీవన్ముక్తుడగును సుమా!!

2695. నివురుగప్పిన నిప్పువలె జీవబంధములను తొలగించి సాధకునిలో దైవము నెలకొని యుండును: ఎర్రని పగడము వంటి శరీరఛాయ గలిగినవాడును, దానిపై తెల్లని ప్రకాశము విరాజిల్లియూ, ముదిరిన పగడమువంటి తేజస్సు గలిగిన ఆది పరాపరుడగు శివుడు, దానిలో కలిసియున్న నల్లని మచ్చల (మలదోష బంధం – నల్లని) చీకటిని తొలగించి, ప్రకాశించు ఎర్రని పగడపు రంగుతో నాలో ఇమిడి నెలకొనెను సుమా!!

2696. జీవులు పక్వపడినపుడు పుష్పములోని సువాసన అంతటా వ్యాపించునట్లు తాము వ్యాపించి నెలకొందురు: ఆకాశములో శివుడు నిలుచుండెను. అచ్చట దేవతలు

కూడ నిలుచుండిరి. కాని శివప్రకాశమును వారు దర్శించనైతిరి. వారు అచ్చటనుండి మానవులను లోకమువైపు పంపుచుండిరి. కాని శివానుగ్రహము పొందినవారు పరిపక్వమై వారియొక్క ద్వందకర్మలు (సంచిత, ఆగామి) తొలగించుకొన్న పిదప పుష్పములు సువాసన వెదజల్లునట్లు సర్వవ్యాపకమైరి.

2697. జీవుడు శివునితో నెలకొని శివవ్యాపకమును పొందును: తానే (శివుడు) జగత్తుకు, దేవతలకు నాయకుడు. తానే జీవులకు ముక్తినొసగువాడు. వేరెవరూ కాదు. ఇంత పెద్ద భూమండలమునకు నాయకుడుగా ఆ శివుడే ఆకాశరూపములో స్థితిపొంది యున్నాడు. అపుడు జీవుడు పరమై అంతటా తానే వ్యాపకతత్వము పొందును సుమా!!

## 5. స్థూల పంచాక్షరం

(మూలాధారము నుండి షట్చక్ర స్థాములో నెలకొనియున్నదగు "నమశివాయ" శరీరములో నిలుచు స్థితి. ఇది క్రియల ద్వారా స్తుతింపబడునది. ఇది స్థూలపంచాక్షరం. వేదతత్వముల ద్వారా బాహ్యముగా స్తుతించబడునది "నమశివాయ". ఆగమశాస్త్ర ప్రకారము ధ్యానింపబడునది "శివాయనమ" యగును. ఇది మానసిక జపమునకు తోడ్పడి శరీరములో అతి సూక్ష్మచలనములు (Vibrations) ఏర్పరచి దైవమును దేహములో ఇముడునట్లు చేయునది)

2698. యాబది (50) అక్షరములే అన్ని వేదములు. యాబది అక్షరములే అన్ని ఆగమములు. యాబది అక్షరములు శరీరములో నెలకొని నిగూఢముగా యున్నదని ఎరిగినచో, ఆ యాబది అక్షరములే "పంచాక్షరి" యగును.

(యాబది అక్షరములు షట్చక్రములలో నెలకొన్న వివరణ:

**అక్షరములు స్థానం**

| | | | | | |
|---|---|---|---|---|---|
| మూలాధారం | 4 | గుదమునకు | "ఓం" | విఘ్నేశ్వరుడు అధిదేవత | |
| స్వాధిష్ఠానం | 6 | లింగం | "న" | పృథివి | బ్రహ్మ అధిదేవత |
| మణిపూరకం | 10 | నాభి | "మ" | జలం | విష్ణువు అధిదేవత |
| అనాహతం | 12 | హృదయం | "శి" | అగ్ని | రుద్రుడు అధిదేవత |
| విశుద్ధి | 16 | కంఠము | "వా" | వాయు | మహేశ్వరుడు అధిదేవత |
| ఆజ్ఞా | 2 | భ్రూమధ్యం | "య" | ఆకాశం | సదాశివం అధిదేవత |
| | ---- | | | | |
| | 50 | | | | |
| | ---- | | | | |

యాబది అక్షరముల ఫలము పంచాక్షరి ఫలము ఒక్కటేయగును.)

2699. అక్షరములలో "అకారము" మొదలుకొని యాబది ఒక్క (51) అక్షరములై, "ఉకారము" మొదలుకొని స్థితిపొంది, "మకారము"తో అంత్యము పొంది అర్ధమాత్రగా పైకివెళ్ళి, "నకారము"తో మొదలగు నందీశ్వరుని నామము "నమశివాయ"యే!! (ముందు మంత్రము యాబది అక్షరములు చెప్పబడి, ఈ మంత్రమున యాబది ఒక్క (51) అక్షరములు చెప్పునది – ప్రణవమగు "ఓం" కారము కలపడముచే.)

2700. అన్ని శబ్దములకు సారముగా వెలయు "పంచాక్షరి"ని జపించినచో "నమశివాయ" అను దైవము దర్శించనగును: అకార మొదలు అచ్చులు పదహారుతో కలిసిన "పర"యను శివశక్తి (విడదీయలేని శక్తి), పర నుండి విడుపడిన హల్లులకు ముప్పది ఐదు అక్షరములను పనిచేయించు బ్రహ్మీ మొ॥ అష్టశక్తులు (బ్రహ్మీ, వైష్ణవీ, రౌద్రి, కాళీ, కలవికరణీ, బలవికరణీ, బలప్రదమణి, సర్వభూతమణి = 8)తో కలిసి ప్రకాశముతో నొప్పారు శివుడి యొక్క శైవాగమము నొసగిన "శివాయనమ" మహా అంకుశమగును. దీనిని గ్రహించినవారు వేదము చెప్పు నకారాది "నమశివాయ" స్పృహ మూలాధారము మొదలుకొని దేహములో ఇముడును.

2701. నోటితో ఉచ్ఛరించబడిన "నమశివాయ" భ్రూమధ్యము, కంఠము, హృదయము, నాభి, లింగము మొదలగు వాటితో పైనుండి క్రిందకు మూలాధారమును చేరుకొనును (మ. 2698 వివరణ చూడగలరు). మూలాధారము చేరిన శబ్దతరంగములు వెన్నెముక ద్వారా ఆకాశ అంశమగు సహస్రదళము చేరుటచే అంత్యమగు "నమశివాయ"యను జ్యోతి ఈ ఐదు స్థలమునందు వెలుగును.

(నోటిలో ఉచ్ఛరించబడిన పంచాక్షరం అధోముఖ ధోరణిలో మూలాధారము వరకు వెళ్ళి, అక్కడ నుండి వెన్నెముకలోని సుషుమ్నానాడి ద్వారా పైకి ఎగబ్రాకి సహస్రమున బిందునాదముగా ప్రకాశముగా వేదాగమమ జ్ఞానముతో వెలుగొందును.)

2702. జీవులకు మరణకాలములో రక్షణగా ఉండునది పంచాక్షరమే: ఏడురంగుల కిరణములు శిరస్సుపై ప్రకాశవంతముగా వెలసి, ఇంద్రియ కరణములను త్యజించిన యోగి ప్రాణశక్తి శిరస్సులో నెలకొనునపుడు, సహజమరణము ఏర్పడునపుడు ప్రాణము వీడివెళ్ళునపుడు రక్షణ కాపలా ఉండునది ఈ పంచాక్షరమే సుమా!!

(ఏడు రంగులు: ఊదా, నీలం, లేతనీలం, పచ్చ, పసుపు, ఆరంజి, ఎరుపు.)

2703. పంచాక్షరము ఉచ్చరించుట వలన శ్రేష్టమై ప్రకాశముగా వెలుగు మంత్రమును సృజించనగును: సూర్యుడు, చంద్రుడు (సూర్యచంద్ర కళలు) శ్రేష్టమై పైకి ప్రాకునపుడు అందముతో కూడి ప్రకాశముగా వెలుగు మంత్రమును (శివాయనమ) ఎవరూ గ్రహించజాలకున్నారు. ఎర్రని ప్రకాశముగా వెలుగు ఆ కుండలినీశక్తి (తల్లి అంశము)

పంచాక్షరము నోటిలో శ్రేష్టముగా జపించుట చేకూరునే!!
(సూర్య, చంద్ర కళల ద్వారా "శివాయనమ" పంచాక్షర ఉచ్చారణతో శక్తి (తల్లి) అంశయగు కుండలినీశక్తి పైకి ప్రాకి సహస్రము చేరునది. శివ = శివుడు; శివా = శక్తి; "శివాయనమ" శక్తి ఉచ్చారణతో జడమగు షట్చక్రస్థానములు క్రియాశక్తి పొంది చైతన్యవంతమై వేదాగమములు చెప్పు "నమశివాయ" బహిర్గతమగును.)

2704. తేటనైన అమృత ప్రకాశము నెలకొనుటకు "శివాయనమ" అనియూ, అంతరమున ప్రకాశము పొందుటకు ఒక్కసారి జపించండీ!! ఇట్లు ప్రవాహము వలె ప్రవహించదగ్గ శివప్రకాశమును కోరి పొందనివారు, పైకెగసిన నీటిబిందువులు నీటిలోనే పడిపోవునట్లు జననమరణ చక్రబంధములో చిక్కుకొందురు సుమా!!

2705. పంచాక్షరి ధ్యానముతో ప్రకాశం వృద్ధిపొంది చీకటి తొలగి జన్మలు వైతొలగును: సద్గురువు ముఖతః ప్రకాశతత్వమెరిగి, జన్మకు కారణమగు బంధములను త్రెంచి, జన్మగలుగు కారణములకు అడ్డువేసి, అనుగ్రహ సిద్ధితత్వమును చూపించునది పంచాక్షరమే!!

2706. మనస్సు చంచలమగునపుడు, చెడుకర్మ ఫలితములచే దుఃఖమేర్పడునపుడు, నీయందు పదిలమైయున్న నందీ పంచాక్షరమును జపించుదువు గాక!! నీ కోరిక మన్నించి, నీకు తోడును ఏర్పరచునది నీవు గ్రహింపనగును. ఇటువంటి స్పృహ పొందగలిగినవారికి తపోఫలమగు శివరూపం గిట్టును సుమా!!

2707. ప్రతిరోజు నిద్రకుపక్రమించు ముందుగా దివ్యపంచాక్షరిని జపించుచూ, తన కంఠముగుండా బ్రహ్మరంధ్రమునకు వెళ్ళు ఊర్ధ్వగతి స్పృహను ఏర్పరచి, శివుని యందు శరణాగతి పొంది స్థితిపొందినచో, మంచు పటలమువలె తెల్లని రంగుతో సహస్రారమున వెలుగుచున్న పంచాక్షరిలో వెలయు శివానుగ్రహము పొందగలరు.

2708. సర్వత్రా వ్యాపించి భూతత్వమంతటినీ మోయుచూ, అంతటికీ ఆధారభూతముగా నిలచి, రాత్రి పగలనక వృత్తులు సలుపు శక్తిగా బాహ్యముగాను, అంతరముగా నెలకొని చేయుచున్న ఆ శివమహామహుని పంచాక్షర మహిమను గ్రహించనివారగు పేదప్రజలు (జ్ఞానశూన్యులు), వారి అజ్ఞానచీకటిని తొలగించుటకు ఎవరికైనా వీలగునా!! (వీలుకాదు)

## 6. సూక్ష్మ పంచాక్షరం

(ప్రకాశమును సృజించి "శివాయనమ" జపించుటయే సూక్ష్మ పంచాక్షరం. ఇది ప్రకాశమును దర్శించిన సద్గురువు శిష్యునికి చేయు ఉపదేశమగును.)

2709. మా శివమహామహుని గురించి ఎగతాళి చేయుచూ, వాదించువారు (దైవము లేదన్న భావనతో కుతర్కవాదము చేయువారు) అజ్ఞానులు. అట్లుకాక వానిని ప్రకాశ

రూపుడని గ్రహించి, వానియందు కరిగిన మనస్సుతో నున్నవారికి వాడే ప్రకాశ రూపుడుగా దర్శనమిచ్చునని వానిని తలంచి స్తుతించండీ!! అప్పుడు రసవాది గుళికతో రాగిని బంగారంగా చేయునట్లు, వాడు మలదోషములన్నిటినీ తొలగించి శరీరమును బంగారు ప్రకాశముగా మార్చును!!

(గుళిక = రసవాది (Alchemist) వాడు ముప్పు – రసాయనములతో కలిసిన పాదరసమిశ్రం – రాగిని బంగారుముక్కగా మార్చు ప్రక్రియ – ముప్పుతో ఏ లోహమునైన ఉన్నత లోహముగా మార్చుట. సీసమును వెండిగా మార్చుట.)

2710. "శివాయనమ" యను దివ్యపంచాక్షరమే శివుడు, శక్తి, జీవుడు ఆడించు మాయ (అజ్ఞానం) మలముయగును. ఈ జపముతో దుఃఖమేర్పరచు పంచమలములు వైదొలగును. (పంచమలములు: అహంకారము, కర్మలు, మాయ, మాయేయం, తిరోభావన) శికార, వకారములగు శివశక్తితో యకారమగు జీవుడు కలియుటచే దుఃఖము, బంధములేర్పరచునవన్నీ అంటక తొలగిపోవును సుమా!!

2711. శివ, శక్తి స్వరూపములే "శివాయనమ"యను పంచాక్షరి. శి = శివుడు, వా = శక్తి, య = జీవుడు, న = తిరోదాయి (తిరోభావన), మ = మలముయని నిలుచును. జీవుడు శికారమును మొదలుగా ఉచ్ఛరించుటచే మలములన్నిటినీ పారద్రోలి, పునర్జన్మ తొలగి పరశివమగునే!! (శివయనమ = శివపంచాక్షరి; శివాయనమ = శక్తి పంచాక్షరి.)

2712. "శివాయ"యను ప్రకాశమును జపించుటచే చీకటి (అజ్ఞానము, మలం) తొలగును: పై మంత్రములో చెప్పినట్లు "నమ" ఉచ్చారణతో మలమను చీకటి తొలగును. ఆదియగు శికారముతో వాకార శక్తితో ప్రకాశవంతమైన, దోషరహితమైన శివ జ్ఞానోదయం జీవుని సిద్ధియగును!! కావున "శివాయ"ను జపించండీ!! ఇదే మలదోష రహితమైన స్థితి సుమా!!

2713. "శివాయనమ"యని జపించుటచే జీవుడు సమాధిస్థితి అందుకొనును: నకారముతో జాగ్రదాది అవస్థలో మునిగి తిరోభావన పొంది (మరిపించు తత్వము), త్వమాది శక్తియొక్క దేహవృత్తులు సలిపి అంత్యస్ఫురణ పొంది, సమాధి తురీయం తనలోనే సృజించి, నమాధి సమాధితో "శివాయనమ" జపముతో జీవుడు శివమగును సుమా!!

2714. ఆత్మప్రకాశమును సృజించి స్థితిపొందినపుడు నవశక్తుల వృత్తులు ఇక ఉండజాలదు: అనుగ్రహ భేదమగు నవశక్తుల భేద సమూహము శివంతో కలియుటచే, ఆత్మను దేహంతో కలిసినట్లు చేసినవారగుదురు. దేహం మాయలో స్థితిపొందును. త్రిమలము తొలగిపోవుటకును, శివాయ యను ప్రకాశము పొందుటకుగాను స్తుతించండి!!

అనాది కర్మలంతటినీ తొలగించునది ఆ శివాయ యను అక్షరములే!! (నవశక్తులచే దేహవృత్తులు ఇమిడిన పంచకోశములు, త్రిమలములు; సర్వకర్మలు తొలగించుకొనుటకు "శివాయ"యే అగును!!)

2715. "శివశివ" యను మహామంత్రోచ్చారణ చేయువారు శివరూపముగా వెలయుదురు: "శివశివ"యని ఆ పరమాత్మని తలవనివారు మూగవారే!! శివశివయని ధ్యానించు వారికి మనస్సు, శ్వాసయు లయమగును!! శివశివ యొక్క శ్రేష్టతను గ్రహించినవారు శివుడగుటకు దివ్యానుగ్రహము పొందినవారగుదురు!! (శివశివ యనునది శైవాగమపు మహామంత్రోచ్చారణ యగును. "శివాయనమ", "శివాయ", "శివశివ" ఉచ్చరించు విధానములగును.)

2716. "శివశివ" యను దివ్యనామమును ఉచ్చరించనివారు మహాపాతకులగుదురు. శివశివ యని పలికిన వెంటనే సుదీర్ఘ పాపములు కూడ తొలగిపోవును. శివశివ యని నిర్విరామ ధ్యానముచే దేవతలగుదురు (దేవ శరీరం పొందుదురు). శివశివ యను ధ్యానముచే శివగతి పొందుదురు!!

2717. "నమశివయ" యను నామమును శిరస్సున నిలిపి ధ్యానించువారికి ప్రకాశము వృద్ధిపొంది మరుజన్మలు తొలగిపోవును: నమ యను నామమును కంఠప్రదేశమున నిలిపి, శివ యను నామమును శిరస్సున (మనోమండలము) నిలిపి ధ్యానించువారికి భవము (పాపములు) తరిగిపోవును. సంశయ, చంచలములు, అజ్ఞానములు తొలగును. మరుజన్మలు ఇక ఉండజాలవు.
("య"కారమగు జీవుడు పాపములు, అజ్ఞానములు తొలగి శివగతి పొందును.)

## 7. అతి సూక్ష్మ పంచాక్షరం

(శివాయ, శివశివ యనునది అతి సూక్ష్మ పంచాక్షరం)

2718. "శివాయనమ" యని చిత్తమున పదిలపరచుకొనినచో బాహ్యప్రవర్తనలు మాని అంతర్ముఖులై అంతర్స్థితి పొంది "న, మ" మలదోషములు తొలగి, శివునికి బానిసలై, శివాయ, శివశివ ధ్యానముచే (పెక్కుమార్లు) చిత్తమున సంశయ, చలనములు తొలగిపోయి ఆనందము ఏర్పడును.
(మలములు తొలగిన జీవుడు శివునిలో వెలసి ఆనందమొందును.)

2719. అతి సూక్ష్మ పంచాక్షరి జపముతో, స్ఫురణతో మూలాధారములోని అగ్ని, సూర్య మండలములను చేధించి వెళ్ళి, భుజములకు పైభాగములనున్న చంద్రమండలములో పంచప్రజ్ఞలను నెలకొనునట్లు చేసి, బాహ్యస్ఫురణ లేక యోగనిద్రలో స్థితిపొందిన వానికి శివుని హృదయస్థానములో నెలకొనునట్లు చేసి శివుని నుండి వీడని స్థితి పొందును!! (నాభి వరకు అగ్నిమండలము = మూలాధారము, స్వాధిష్టానం,

మణిపూరకం; నాభినుండి కంఠము వరకు = సూర్యమండలము – అనాహతం, విశుద్ధి; కంఠము పైభాగము నుండి బ్రహ్మరంధ్రము వరకు = చంద్రమండలము – ఆజ్ఞాచక్రం, సహస్రారము.)

2720. “శి”కారమను బీజాక్షరమే జీవులను ముక్తియను ఒడ్డుకు చేర్చు తెప్పయగును: వేదాంతము, ఆగమములు, వేద అంగములు క్రమపద్ధతిలో పఠించిననూ, అవన్నియూ మా శివమహామహుని పంచాక్షరములలోని శికారములో నున్నవే!! నిస్సంశయముగా ఆ ఒక్క అక్షర సత్యమెరిగి సాధన చేసినచో, అదే ముక్తియను ఒడ్డు చేర్చగల శ్రేష్టమగు తెప్పయగును సుమా!! (వేదాంగములు (6) – శీక్షా, కల్పం, వ్యాకరణం, చందస్సు, జ్యోతిష్యం, నిరుక్తం.)

2721. పంచాక్షరం అజ్ఞానుల తలవ్రాతను (విధి) కూడ మార్చగలదు: అనాదిగానే ఈ పంచాక్షరమను ఫలము ముదిరి, పండై (పక్వపడి) యున్నది. కాని ఆ ఫలమును తినుటకుగాను ఆలోచించి గ్రహించదగ్గ జ్ఞానము లేకయున్నారు. మూఢులు దాని ప్రయోజనమెరుగక అవి వట్టి అక్షరములేనన్న భ్రమలో యున్నారు. అది వారి తలవ్రాతను (విధిని) కూడ మార్చగల అక్షరములని గ్రహించజాలక యున్నారు సుమా!!

## 8. దివ్య నాట్య దర్శనము

(దివ్య నాట్యం = ప్రకాశకశక్తి యొక్క చలనము (Light Energy) విశ్వమంతా చలనములోనే యున్నది. ప్రతి అణువు ప్రతిక్షణం కదులుతూనేయున్నది. సృష్టి, స్థితి, లయములు కూడా చలనము వలనే ఏర్పడుచున్నవి. ఈ విశ్వచలనమంతటికీ తానే మూల కారణమని, తన చలనము వలనే చరాచరములన్నీ భ్రమణము చెంది, తమతమ వృత్తులు చేయుచున్నవని పరమేశ్వరుడు బోధించు తత్వమే తాను నాట్యభంగిమలో నటరాజుగా సర్వదా చలించుచూ, జగత్తు కార్యములను నడిపించుచున్నాడు. వానిని పంచాక్షరముతో జపించుట వలన వాని దివ్యనాట్యం దర్శనమగును. వాని ప్రకాశకశక్తిని నీలో సృజించగలవు.)

2722. శివుడు అఖండ వ్యాపకముగా అన్నిటిలో కలిసియుండుటచే పంచవృత్తులు జరుగుచున్నవి: శివుడు అఖండముగా వ్యాపించియుండుటచే ఆతని శక్తి కూడ అఖండములో నిండియున్నది. అంతటా చిదంబరమే (చిత్ + అంబరము = చిదాకాశము). అంతటా ఆతని దివ్యనాట్యమే (దివ్య చలనము). అఖండముగా వ్యాపించియుండుటచే శివుడే అన్నిటిలో నెలకొని సృష్ట్యాది (సృష్టి, స్థితి, లయ, తిరోభావం, అనుగ్రహము) పంచవృత్తులు చేయుచున్నాడు.

2723. శివుడు శివానందమొసగు ఐదు విషయములైన నాట్యభంగిమలను అనుగ్రహించెను: శివానందమొసగు నాట్యము, అక్షరబ్రహ్మమగు ప్రణవ సుందర నాట్యము, శిరస్సున

బంగారు ప్రకాశములో ఆడు నాట్యము, నుదుట ఎదురుగా దర్శనమగు బంగారుఛాయ నాట్యము మాటలతో చెప్పనలవి కాని పరవశస్థితి నొసగు నాట్యములను ఆడు శ్రేష్ట పరంజ్యోతియగు జ్ఞానమే. బింబముగాగల శివుని ఎవరు ఎరుగగలరు? (ఎవ్వరూ ఎరుగలేరు.)

## శివానంద నాట్యం

2724. పరమేశ్వరుని ఉనికి ఆనందము. ఆ ఉనికితో నాట్యము: తనకు సాటిలేని, క్షీణత లేని, అంతములేని, "సత్"యగు ఆనందమే అతనున్న స్థలము. ఇదే సదానందము. ఈ తేనెవంటి ఆనందము చిందు ఆనందనాట్యమును దర్శించినవారు శివజ్ఞానము దాటి నెలకొనియున్న పరమేశ్వరునికి నంభిగా (దాసుడుగా/శివభక్తుడుగా)నై, ఆనందమే దివ్యనాట్యమాడు స్థలమగును.

2725. శివుని నాట్యముచే యన్నియూ ఆనందముగానే ముగియును: నాట్యమాడు రంగస్థలము (చిత్ ఆకాశము) ఒక ఆనందం. నాట్యమునకు పాడు లయపాటలు ఒక ఆనందము. పెక్కు రాపిడిలు (అణువులు ఒకదానితో ఒకటి చలనముచే ఏర్పడిన రాపిడిలు) ఒక ఆనందము. పఠించు స్తోత్రములు ఒక ఆనందం. ఆనంద మొసగు నాట్యమునూ, విశ్వంలోని అఖిల చరాచరములన్నియూ శివునికి ఆనంద మొనగూర్చునవే.

2726. జ్ఞానమే మహాప్రకాశముగా వెలుగొందు పరంనూ (శివుడు), తత్వములను విడచిన జీవాత్మయైన పరంనూ (జీవుడు), జీవరాశులన్నిటిని ప్రేమగా చూచుకొని పరిపాలించు శివగామి (శివశక్తి) నెలకొన్న పరంనూ, ఈ మూడింటినీ అంతరమున సృజించి తేటపొందిన ఆనంద పరవశులకు శివానంద నాట్యఫలమగును సుమా!!

2727. నిరాకారుడైన పరమేశ్వరుడు శక్తిని తోడుంచుకొని పంచవృత్తులు చేయుటకుగాను శివుడుగా నాట్యమాడుచున్నాడు: నిరాకారుడైన వాడు జీవుల కొరకు రూపము దాల్చి ఆడు నాట్యములు ఐదు. అట్లు తాను నాట్యమాడే పంచవృత్తులు చేయుచున్నాడు. ఆ పంచవృత్తులు కూడ తన సృష్టిచే కల్పించబడి, తేనెలొలుకు ఉమాదేవికి భాగస్వామిగా నాట్యము చేయుచున్నాడు సుమా!!

2728. భూతాండము (పంచభూతములు నెలకొన్న అండము), భేదాండము (పంచభూత పంచీకృతముతో ఏర్పడిన అండము), భోగాండము (ద్వంద కర్మలచే పొందదగు అండము), యోగాండము (యోగఫలానుగ్రహముతో పొందు అండము), పిత్రాండం (పునరుర్పుత్తి కాలములో జీవులు పొందదగు అండము), ముక్తాండము (ముక్తి పొందిన ముక్తులుండు అండము), మోహాండము (మోహముతో కూడి దేహము విడచిన జీవులుండు అండము), దేహాండము (భూతశరీరముతో జీవులుండు

అండము), దాహాండము (దాహం, ఆకలిదప్పులున్న అండము). ఈ తొమ్మిది అండముల సృష్టియంతయూ పంచవృత్తులు సలుపు "తర్పరం" (శివుని యొక్క) ఏకాంతమగును (ఏకత్వములో లీనవైనవే). ఇవి విడిగాయున్నప్పుడు బ్రహ్మాండమగును (విశ్వం అగును) సుమా!!

(పరమశివుని శరీరమే విశ్వం – అన్నీ అందులో ఇమిడినవే.)

2729. వేదములు నాట్యం చేయగా, ఆగమములు నాట్యమాడగా, గీతములు నాట్యమాడగా నెలకొన్న సప్తఅండములు నాట్యమాడగా (షట్చక్ర స్థానము + సహస్రారం) పంచ భూతములు నాట్యమాడగా, భువనములంతయూ నాట్యమాడగా (లోకం 224 భువనములు) నాదముతో నెలకొని ఆడెనే నాట్యకారుడు (శివుడు) జ్ఞానాంద నాట్యము. (నాట్యములన్నీ జ్ఞానముతో నెలకొన్న చలనములు – స్పందనలు. ప్రతి చలనము – స్పందన నాట్యముగా చెప్పబడియున్నది.)

2730. చిత్తమూర్తియగు శివుడు భూతములలో, ప్రజ్ఞలలో, వేదాగమములలో కలిసి అంతటినీ ఆడించుచున్నాడు: పంచభూతములలో, పంచప్రజ్ఞలలో, పంచకరణములలో, పంచవేదములలో, పెక్కు ఆగమములలో, ఉపాసనాది చర్యల యందునూ, అండబోధములైదింటిలో కలిసి, వాటియంతటిలో సృజించి, చిత్తమూర్తిగా శివుడు వాటిని ఆడించుచున్నాడు. (చిత్తన్" అని శివుని చెప్పబడినది = సర్వజీవరాశులలో "చిత్"మయముగా నెలకొని చైతన్యపరచి ఆడించుచున్నాడు.)

2731. ప్రకాశరూపముతో సంచరించువారు (దేవతలు), ఊర్ధ్వలోకస్తులు, మానవులు, జ్ఞానరూపమున సంచరించు సిద్ధులు, గంధర్వులు, త్రిమూర్తులగు బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఆదిగాయున్న ముప్పదిమూడు (33) దేవతలు (ద్వాదశ ఆదిత్యులు (12), ఏకాదశ రుద్రులు (11), అష్టవసువులు (8), అశ్వినీ దేవతలు ఇద్దరు (వీరిరువురు దేవతలకు వైద్యులు) మొత్తం 33). తాపసులు, సప్తఋషులు, మత సంస్కారములు, జీవరాశులు (చరములు), స్థిరమైన జీవరాశులు (అచరం) ఇవియన్నియూ మా మహామహుడు శివుడు ఆడగా ఆడుచున్నవి. (శివాజ్ఞచే ఇవియన్నియూ చలనము చెంది ఆడుచున్నవి – తమ వృత్తులు చేయుచున్నవి.)

## సుందరనాట్యం

(ప్రణవనాదమునందాడు సుందరనాట్యం)

2732. మానవుని అండకోశములో చలించు వివరణ: అండముల ఏడింటికి అవలకు అవలగా (మూలధారము నుండి షట్చక్రస్థానము + సహస్రారము కలిసి = ఏడు) సదాశివుడు నెలకొన్న సహస్రారమునకు పైగా శక్తిస్థానములో, నీలకంఠుడు కరుణయే తన రూపముగా గలిగి, అందు తనలో విడిగాయున్న శక్తిరూపిణి దర్శింపజేయునట్లు

దివ్య నాట్యమాడెను సుమా!! (కంఠము క్రిందనున్న చీకటిలోనున్న రుద్రుడే సహస్రమున – ఆకాశమండములో నెలకొని నాట్యమాడుట.)

2733. నటరాజుడు ఆడిన నాట్యవిధములు తను ఆడిన స్థలముల వివరణ: (ప్రాచీన ద్రవిడభాషకు (3000 సం॥ పూర్వపు) తగిన తెలుగు పదములను ఇవ్వశక్యము కాలేదు) కోడుకట్టి, పండారంగము, కోడు, సంగారములతో ఎనిమిది రకములైన నాట్యములతో ఐదు విధములు, ఆరు విధములు కూడ కలిసి, ఇడ, పింగళ, సుషుమ్నానాడి ద్వారా దర్శించి, ఇక దేవదారువనములో తిళ్ళై (చిదంబరము)లోను, ఆలవనం (మర్రిచెట్ల వనము)లోను నాట్యమాడి నటరాజు పెరుమాళ్ళు వెలిసెను. (ఎనిమిది రకములైన నాట్యం = శివుడు అష్టమూర్తుల రూపములో ఆడినవి. ఐదు రకములైన నాట్యం = నివృత్త్యాది పంచకళలతో ఆడినవి. ఆరు రకములైన నాట్యం = షట్చక్ర స్థానముల ఆరింటిలో ఆడినవి.)

2734. బ్రహ్మాండమగు విశ్వంలోనే పరాశక్తి దివ్యపాదములు అమర్చియున్నది. బ్రహ్మాండమగు విశ్వంలోనే విస్తరించిన ప్రకాశములో ఈశుడు నిండియున్నాడు. బ్రహ్మాండమగు విశ్వంలోనే అంతటా వ్యాపించిన నాదము గలదు. బ్రహ్మాండమగు విశ్వంలోనే నాదమయుడగు పరం (శివుడు) నాట్యమాడి అనుగ్రహించుచున్నాడు.

2735. అంకుశం వంటి పెళ్ళుబుకుచున్న నాదసామీప్యము వలన జీవుని జ్ఞానములో ఇమిడిన "దమ్‌తీమ్" యను తాళశబ్దములు మ్రోగుటచే శంకరుడు సుషుమ్నయగు మూలనాడిలో స్థితిపొంది నాట్యమాడు కాలములో, జీవుని మనస్సు బాహ్యావిషయ వాసనలందు వెళ్ళక అణిగిపోవును.

2736. నాదమయుడగు శివపరమాత్మ జీవుల అజ్ఞానము పోగొట్టుటకు తానే కోరి నాట్యమాడి, పిదప వారిలో నవ (9) నాట్యమాడి, జీవుల అడవియను అజ్ఞాన చీకటిలో కోరి నాట్యమాడి, వారి చిత్తమున ఇమిడి నాట్యమాడి, త్రిసంధిలో నాట్యమాడి (త్రిసంధి = భ్రూమధ్యమున), అంత్యములేని జ్ఞానములో నాట్యమాడి, నా జీవబోధమును (దేహభావన/వృత్తులు) తొలగించి అనుగ్రహించెను నా ప్రాణనాధుడగు శివుడు. (నవనాట్యంలు = రూపముతో (4), అరూపముగా (4), అరూప రూపముతో (1) = 9.)

2737. శివుడు నెలకొనియుండుటచే (ఉనికి / సన్నిధి వలన) శక్తులన్నీ వృత్తులు చేయుచున్నవి: శక్తులైదునూ (5), శివభేదములైదును (5), అష్టమూర్తులు ఎనిమిది (8) లయమగు స్థితిలో (ముక్తులుగా), ఆ స్థితిజ్ఞానముతో నిలుచు స్థితిలో అష్టస్థితులను (8), అణిమాది అష్టమహా సిద్ధులు (8), అష్టమూర్తులు నెలకొనుటలో స్థితిపొందు అష్టములు (8), శుద్ధి ప్రక్రియలు అష్టములు (8)లందు దైవము శివుడు

నాట్యమాడుచున్నాడు. (శుద్ధి (8) = నిరీక్షణం, ప్రోక్షణం, థాడణం, అభ్యగం, తాళత్రయం, దిగ్బంధము, అవకుండణం, తేనెముద్ర (8); శక్తులు (5) = బ్రహ్మీ, వైష్ణవి, రౌద్రి, కాళీ, మనోన్మణి (5); శివభేదములు - బ్రహ్మ, విష్ణువు, రుద్ర, మహేశ్వర, సదాశివం.)

2738. మేఘములు ఏడును, సప్తసముద్రములును, సప్తదీవులు, దేహములు ఏడును, స్థావరములు ఏడును, శివాంశభూతులు ఏడును, దాహములు ఏడును, శాంతులు ఏడును, ఇవియన్నియూ శివపరమాత్మ దివ్యపాదములందు అణిగిపోవును సుమా!! (పాఠకులకు నా సవినయ మనవి: దాదాపు 3000 సం॥లకు పూర్వం ప్రాచీన ద్రవిడభాషలో వ్రాయబడిన ఈ గ్రంథరాజములో వాడబడిన కొన్ని నామములు యథాతథముగా వాడబడినవి. తెలుగు నామములు వీటికి వ్రాయశక్యము కాలేదు. రచయిత శ్రీ తిరుమూలనాయనార్ జీవితగాథలో తిరుమంత్రము గ్రంథవివరణలో ప్రాచీనతను చూడగలరు.)

సప్తమేఘములు: ఆవర్తం, పుట్కలం, సంగారము, ఆచవనం, నీర్కారి, చొర్కారి, శిలావర్షం (7).

సప్తసముద్రములు: ఉప్పుసముద్రం, కరుప్పన్ చారుసముద్రం, మధుసముద్రం, నెయ్యిసముద్రం, పెరుగు సముద్రం, పాలసముద్రం, శుద్ధనీటి సముద్రం (7).

సప్తదీవులు: నావలదీవి, ఇరళిదీవి, కుశదీవి, క్రౌంచదీవి, లవణదీవి, తెంగదీవి, పుట్కరదీవి (7).

సప్తదేహములు: దేవతలు, మానవులు, జంతువులు, పక్షులు, ప్రాకునవి, జల ప్రాణులు, చెట్లు (7).

సప్త శివాంశభూతములు: బ్రహ్మ, విష్ణువు, రుద్ర, మహేశ్వర, సదాశివ, నాదం, శివం (7).

## స్వర్ణపది నాట్యం

(శిరస్సున బంగారువర్ణ కాంతి పదిలమైన పిదప దర్శించదగ్గ శివనాట్యం - ఇదే పొన్ అంబలనాట్యం = బంగారు చంద్రశేఖరుని నాట్యం)

2739. నాలుగు దిక్కులలో మరియూ ఊర్ధ్వముగాను నెలకొని, శ్రేష్టమైన పంచముఖములతో వెలసి (తూర్పు - తత్పురుషం, దక్షిణ - అఘోరం, పడమర - సద్యోజాతం, ఉత్తర - వామదేవం, ఊర్ధ్వం - ఈశానం (5) ముఖములతో) శ్రేష్టమగు బ్రహ్మానందము నొసగుదగు తొమ్మిది భేదములతో (రూపము - 4 + అరూపం - 4 + అరూప రూపం - 1 = 9) మేలైన స్థితియగు తర్పరముగా శివుడు నిలచి నాట్యమాడి అనుగ్రహించును సుమా!!

2740. శివానందమును తమలో సృజించినవారే శివుని దాసానుదాసులు. శివపరమాత్మలో అణిగి స్థితిపొందినవారే శివదాసులు. శివ దివ్యచరణములు ఆనందమును అనుభవించినవారే శివదాసులు. సహస్రదళమున బంగారు ప్రకాశ నాట్యమును దర్శించినవారే శివదాసులు.

2741. శివనాట్య దర్శనముచే మనస్సు ఇంద్రియ విషయవాసనల ప్రక్క వెళ్ళక అణిగి పోవును: ఇంద్రియముల వశమై అణగకయున్న నా మనస్సును అణచునట్లు తన దివ్యచరణములను నా శిరస్సుపై పదిలపరచి, జీవశక్తి ప్రకాశము పొందునట్లు నాలో ప్రకాశమును ఇమిడ్చి, ఆ ప్రకాసములో నాట్యమాడుచు శ్రేష్టత ఒనగూర్చు నా నటరాజుడు, గీసిన చిత్రమువలె నన్ను అచలము చేసి నా మనస్సున నెలకొని స్థితిపొందెనే!! (శివుని దివ్యపాదములు: సహస్రమున నెలకొన్న జీవశక్తి ప్రకాశ జ్ఞానమును, శబ్దజ్ఞానమును రెండింటిని అనుగ్రహించగలదు.)

2742. ఆకాశమునందు నాట్యము చేయువాడు, ఉత్తమ నాట్యకారుడు, బంగారు ప్రకాశములో వెలసి జీవులకు శ్రేష్టత కల్పించు సేవక నాట్యకారుడు, సంబంధ నాట్యకారుడు, తత్పరమగు నాట్యకారుడు, ఆనందము పొందుటకుగాను నా ప్రేమలో నెలకొన జేసుకొంటిని సుమా!!

2743. మాణిక్య నాట్యకారుడు, ప్రతిష్టతిళ్ళై నాట్యకారుడు, పెక్కు ప్రకాశములతో (సహస్ర దళపద్మమున) వెలుగు నాట్యకారుడు, అల్లబడిన జ్యోతికిరణములతో శివానంద మొసగు నాట్యకారుడు, అపరంజి (మేలిబంగారు) ఛాయతో ఆడు నాట్యకారుడు, ఇట్లు పెక్కు విధములుగా ఆడువానిని పూర్తిగా గ్రహించి ఎవరు వర్ణించగలరు?

2744. దివ్యనాట్యము దర్శించిన శివజ్ఞానుల శరీరానుభవములు: ఉన్నతస్థితి ఒనగూర్చునదగు శివనాట్యమును సహస్రదళ పద్మములో దర్శించి వాని పాద పద్మములను ప్రేమతో సృజించినవారికి, మహానందమును, మిక్కిలి భయమును, భక్తితో పరవశమై క్రిందపడుటయూ, లేచుటయూ, శరీర నీరసము, ఇంద్రియ ప్రజ్ఞలు తొలగుటచే తన్ను తాను మరచు స్థితియూ, పర్యవసానముగా తన సామర్థ్యము తగ్గుటయూ ఏర్పడును.

2745. శివనాట్యమును చిదాకాశములో (సహస్రదళము) దర్శించుట వలన బాహ్యముగా వెతకునది తొలుగును. చింతన క్రూరత్వము తొలగి సౌమ్యత పొందును. శరీర నీరసము, బాధలు తొలగును. ప్రాణణ (శ్వాస) శుద్ధియగుటచే బుద్ధి తేటనై యోగస్థితి అందుకొనును. పంచేంద్రియ ప్రజ్ఞలు వైదొలుగును. మనస్సులోని ఆశలు తెగిపోవును. మనస్సున పరమానందము నెలకొనును. వీటిచే ప్రాణం (జీవాత్మ) శివనాట్యము చూడగోరు కోరిక మరింత ముదురును.

2746. జీవులను అజ్ఞానస్థితి నుండి తరలించుటకే శివుడు చిదాకాశమున నాట్యమాడు చున్నాడు: శివుడు కాళితో నాట్యమాడి, బంగారు పర్వతముపై నాట్యమాడి, దెయ్యాలతో నాట్యమాడి, భూమిపై నాట్యమాడి, అంతటా నిండియున్న నీటిలో, అగ్నిలో, వాయువులో, సర్వత్రా వ్యాపించిన ఆకాశములో నాట్యమాడి, జీవులు దీర్ఘకాలము ఆయుస్సుమంతులగుటకు గాను తాను చిదాకాశములో నాట్యమాడుచున్న నాథుడు!!

2747. శివభూమియగు హృదయము, సహస్రదళమందు దైవమును తలంచి స్తుతించినచో శిరస్సున నక్షత్రముల వంటి ప్రకాశము దర్శనమగును: సహస్రమగు మేరు పర్వతమున సుషుమ్ననాడి, ఇడనాడి, పింగళనాడి మూడునూ, పైనున్న ఆకాశములో భూమి ఎట్లు కలియక నిలుచున్నదో, అట్లే లంకయను ఈ దేహము కలియక నిలుచుండును. ఇడకళ, పింగళకళ నాడులు రెండూ హృదయమగు "తిళ్ళైవనం" (హృదయగుహ)ను చుట్టివచ్చి శీతలముతో అమరిన సహస్రదళమునకు పైకి ప్రాకి సుషుమ్ననాడితో కలిసి వెలయును. కావున హృదయము, సహస్రదళము రెండునూ దైవము నెలకొన్న స్థలములే (శివభూమికలే) అగును సుమా!!

(శీతలముతో నిండినది = చంద్రమండల అంశము – సహస్రదళము.)

2748. భూమి, మేరు పర్వతము, మేరుకి దక్షిణభాగమగు మూడు, వరుసగా ఇడనాడి, సుషుమ్ననాడి, పింగళనాడులు. ఇడనాడి, పింగళనాడులు చలనముచే ప్రకాశశక్తి పొంది సుషుమ్ననాడిలో కలిసినపుడు అర్ధచంద్రాకారమును ధరించిన శివమహామహుడు నాట్యమాడు "తిరువంబళము" అగును. ఈ తిరువంబళమే భూతాండమునకు ఎల్లలు (సరిహద్దులు) అగును సుమా!!

(భూమి అంశము – స్వాధీష్ఠాన చక్రము – నెలవంక చిహ్నం – ఇడనాడి,
మేరు దక్షిణభాగము – శిరస్సు ఎడమభాగం – పింగళనాడి,
మేరు – శిరస్సు సహస్రదళము పర్వతముగా కొలుచుట,
భూతాండము – పంచభూత శరీరమగు అండకోశము.)

## బంగారుతిళ్ళై నాట్యం

(షట్చక్ర స్థానముల సమిష్టి ప్రకాశమే ఏకమై నుదుట ముందు బంగారువన్నెలో దర్శనమగుటయే బంగారుతిళ్ళై నాట్యం)

2749. అండములు ఏడు ఆ బంగారు బింబం పదిలమైనదై, అనాదియగు పంచ ఆకాశములు వాడు నాట్యమాడు స్థలమై, వెన్నెముక అడుగునున్న అగ్నిశక్తియే బంగారువన్నె చంద్రబింబమై, ఆ పరంజ్యోతి స్వరూపుడైన పరమాత్ముడు నాట్యమును కోరి ఆడుచున్నాడు. (అండములు (7) = షట్చక్ర స్థానములు + సహస్రదళము;

ఆకాశములు (5) = భూతాకాశం, గుణమయ ఆకాశం, గుణరహిత ఆకాశం, సూర్యాకాశం, చిదాకాశం; పొన్ అంబలము = బంగారువన్నె చంద్రబింబము.)

2750. శివుడు దక్షిణముఖుడై, ఉమాదేవితో నాట్యమాడి జీవులకు ఆనందమొనర్చుచున్నాడు: గురువానందముతో పొందిన ఆనందముగా వెలయు చంద్రకళ ప్రకాశం, శ్రేష్ఠ గుణమై శిరస్సానందముగా ఉన్నతి పొంది, దక్షిణ ముఖముగా పురానంద భోగుడుగా (శరీరమునకు ఆనందమొనర్చు) ఉమాదేవితో కూడి నిత్యము ఆనందమొనగూర్చు (జీవులకు) నాట్యము ఆడెను సుమా!! (గురువు ఆనందం = గురోపదేశముతో పొందినది; శిరస్సానందం = సహస్రమునకు చేరిన పిదప పొందు ఆనందం; దక్షిణదిక్కు = శిరస్సుకు కుడిభాగం.)

2751. ఆదిపరాపరుడు (పరమేశ్వరుడు) నాట్యమాడగా, చంద్రమండల కిరణ ప్రకాశము నాట్యమాడగా, ప్రకాశకిరణములతో కూడిన జటాఝూటం నాట్యమాడగా, జీవులు ఉన్మత్తులై నిష్క్రియగా నాట్యమాడగా, అర్ధచంద్రాకారము ధరించిన నీలిప్రకాశం నాట్యమాడగా, తన నాదశక్తితో నాదాంతస్థితిలో నాట్యమాడెనా శివుడు!!

2752. చిదాకాశములో నాట్యము దర్శించినవాడు జ్ఞానాంతమును పొందినవారు: జీవులు ఉన్నతి పొందుట కొరకు వారి చిదాకాశములో మేలైన నాట్యమాడినది పరమేశ్వరుడు అఖిలాండములో ఆడిన నాట్యమగును. ఇదియే ఎర్రని ప్రకాశతత్వమగును. చిదాకాశ మహాప్రకాశములో స్థితిపొందినచో, మీయొక్క పర స్థితి మేలైన జ్ఞాన అంత్యమును పొందినది నిజమగును సుమా!!

2753. శివనాట్యము అఖిలాండమును నిర్వహించగలదు: పరం (శివం) తన రెండు పాదములతో, బాహ్యముగా నున్న ఇరువది ఒక్క (21) లోకములను, దానిలో ఇమిడిన ఏడు అండములను, వీటికి సాధకముగాయున్న 108 మతాచారములు, వీటిలో సూక్ష్మముగా నాధము నాదాంతములో నాట్యాంతమును శివశక్తితో చేరి నాట్యమాడును. (యోగ పరిభాషలో: సూర్య, చంద్ర, సుషుమ్ననాడులు మూడు విభాగములై, ఏడు చక్రములలో (6 చక్రం + సహస్రం) ఇమిడి, 108 నాడులు సహాయపడి సహస్రదళములో నాదముగా నాదాంతమును చవిచూచునది శివశక్తి అనుగ్రహం వలనే.)

2754. శరీరమునందున్న ఇడనాడి, పింగళనాడి, శిరస్సున హిమపర్వతమువలె వెలయు శీతలము, శిరస్సు కుడిభాగమున లంకవంటి ద్వీపమొకటి గలదు. మధ్యనాడి యగు సుషుమ్నతో పరప్రకాశము దర్శించినవారికి మేరు అగును. అన్నిటికీ తల్లివేరు వంటిది హృదయాకాశములో నున్న తిళ్ళైవనం (అజ్ఞానమనే వేరున్న స్థలం)ను దాటి వెళ్ళి, సహస్రము చేరువారు పరంతో నెలకొని (శివజ్ఞానంతో) శివమగుదురు.

(లంక వంటి ద్వీపము: శరీరమునకు విడిగా వెలుగు బంగారు ప్రకాశం (శివం) దాటి వెళ్ళునది: యోగసాధన మార్గముతో పరిపక్వత పొందినది.)

2755. వేదాగమములు, మహా పర్వతములు, మహానదులు గలిగిన భారతదేశం పుణ్యభూమి యగును: భారతదేశ దక్షిణమున కన్యాకుమారి, కావేరియూ, వీటికి వేరుగా ప్రసిద్ధి గాంచిన నవ తీర్థములు, సప్త పర్వతములు గలిగి, ప్రశంసింపదగు శ్రేష్టమైన వేదములు, ఆగమములు ఉద్భవించుటచే ఈ నిలకడ పొందిన భూమిలోని దక్షిణ భాగము పరిశుద్ధమైనదగును సుమా!!

(నవ తీర్థములు: గంగ, యమున, సరస్వతి, నర్మద, సింధు, తుంగభద్ర, గోదావరి, కృష్ణ, తామ్రపర్ణి (9); పర్వతములు (7): కైలాసం, హిమాలయం, మందారం, వింధ్యా, నిడధం, హేమకూటం, నీలగిరి (7). ఈ భారతభూమి పుణ్యభూమి యగును.)

2756. ఎటువంటి కీడు లేని, దోషరహితుడైన దేవాదిదేవుడగు పరమేశ్వరుడు నాదములో నాట్యమాడి, నాలుగు పాదములతో (క్రియా, చర్య, యోగ, జ్ఞాన పాదములు) నాట్యమాడి, వేదములందు నాట్యమాడి, అగ్నికళలతో నాట్యమాడి, జీవుని భేద తత్వములలో నాట్యమాడి, భువనములంతటిలో (224 భువనములలో) నెలకొని నాట్యమాడెనే!!

2757. దేవతల జ్ఞానములో నాట్యమాడి, తిరువంబళ్ములో (దివ్య ఆకాశము – చిదాకాశము) నాట్యమాడి, మూవురితో (త్రిమూర్తులు) నాట్యమాడి, ముని జనంతో నాట్యమాడి, భావనలో నాట్యమాడి, శ్రేష్టమగు పరాశక్తితో కలిసి నాట్యమాడి, దేవాలయమగు జీవుల ఆత్మలో నెలకొని నాట్యమాడుచున్నాడీ నటరాజుడు (శివుడు).

2758. ఆరు ముఖములకు అధిపతి తానేనని (శివుని పంచముఖములతో తన అధోముఖంతో = 6) మత సంస్కారములు ఘోషించు గురునాధుడు తానేనని, శిరస్సు దక్షిణముననున్న ఆకాశ అంశములో ఆత్మస్వరూపమును గ్రహించిన సాధకునిలో పరమేశ్వరుడు వేరుగా కాక తానే గ్రహించువాడుగా నున్నాడు.

(కుడికంటి మీద నున్న ప్రకాశమును ఆత్మస్వరూపముగా గ్రహించుట; గ్రహించునది గ్రహించువాడు ఏకమగును. "ధృక్, దృశ్యము ఏకమగును" – శ్రుతివాక్యము.)

2759. ఆకాశమే నాట్యరంగ స్థలముగా, దానిపై నా పరం (శివుడు) నాట్యమాడును. సూర్యచంద్రుల దివ్యరూపముల నుండి అణుకిరణముల ప్రజ్వలనే ఆకాశమగును. ఈ ఆకాశంలో పంచములు (అకార, ఉకార, మకార, బిందు, నాదములు) చంద్రకళలో తన స్థితిని ఇముడ్చిన శివమహామహుడు మహా ప్రకాశముగా అనుగ్రహించును!!

2760. శివనాట్యమును చిత్తమున దర్శించువారికి సర్వసంశయములు తొలగి జ్ఞానము తేటనగును: నాట్యభంగిమలో తన దివ్యపాదమును ఎత్తినపుడు ఉదయించు నాద శబ్దము, అచ్చట వినబడు స్తోత్రపాటలునూ, పలు రకములైన నాట్యభంగిమలునూ, నెలకొని ఆడు ప్రకాశమయుడగు శివుని నాట్యముచే నా (రచయిత) మనస్సున చెలరేగిన సంశయములన్నీ తొలగి తేటపొందితినే!!

2761. హృదయమునుండి పైకెగసిన ప్రాణశక్తి శరీరమంతటికీ ప్రాకి ప్రకాశవంతమగునట్లు వెలసి, ఎర్రని ప్రకాశముగా (మాణిక్యం వంటి) నటరాజు, ప్రకాశరూపుడుగా, గురుస్వరూపుడుగా దేహప్రాణములలో కలిసియూ, అండకోశమును దాటియూ నెలకొని వెలసియున్నాడు.

(నటరాజుని నాట్యముచే అండకోశమంతా ప్రకాశవంతమగును.)

## అద్భుత నాట్యం

(చెప్పనలవికాని పరవశముతో ఆడు నాట్యభంగిమలు)

2762. జ్ఞానగురువు యొక్క దివ్యశరీరమే ధ్యానించు రూపప్రకాశ శివమగును. ఆ దివ్యరూపమే త్రిపురియై, పరాశక్తిగాను, రూపముగా, అరూపముగాను ఉమాదేవి నెలకొనినదగును.

2763. జ్ఞానమును ఇచ్చు తత్వమనునదేమనగా శిరస్సుకు ముందు భాగమున ఆకాశ మండలములోనున్న ప్రకాశమును ధ్యానించు రూపమేయగును. అప్పుడా రూపము మరిగిపోయి అరూపమగును. దానియందే నిలకడగా స్థితిపొంది జ్ఞానతత్వ మార్గములో వెళ్ళువారికి అనుగ్రహశక్తి పదిలమగును. ఇదే ఆ తత్వస్థితి యగును!!

2764. మీరు శిరస్సుపై పన్నెండు అంగుళముల ఎత్తులోనున్న ద్వాదశాంతమగు బట్టబయలులో, అధోముఖ ప్రాణను కట్టడిచేసి ఊర్ధ్వముఖస్తులై దైవమును ధ్యానించిన ఎడల నాదములో ఇమిడిన నాదాంతనాధుడు గ్రహింపబడును. అదే ఆ నాథుడు కోరి నాట్యమాడు స్థలం తిరువంబళము – దివ్య ఆకాశము/బట్టబయలు. (నుదుటకెదురుగా దర్శించదగ్గ ప్రకాశం తిరు చిట్రంబళం – ఇది జీవుని జ్ఞానస్థితి – దివ్య చిన్న ఆకాశం; కాని శిరస్సు బ్రహ్మరంధ్రమునకు పైభాగంలో ద్వాదశాంతంలో దర్శించదగినది తిరువంబళం – దివ్యమహాకాశము – దైవము ఆత్మలో ఇమిడిన పిదప పొందు అనుభవము.)

2765. ఆకాశమనునది వాయువునకు, మేఘమునకు, మెరుపులకు, ఇంద్రధనస్సుకు, పిడుగునకు చోటు కల్పించి తాను పక్వతపొంది వెలయునట్లు, దైవము కూడ ఆనందమును నొసగుటలో ఆరు ప్రకాశములతో (షట్చక్రస్థాన ప్రకాశములు) కలిసియూ, వాటికి వేరుగాను నెలకొని ప్రకాశస్వరూపుడుగా జీవులకు గోచరము

కాక మరిగియుండి అనుగ్రహించుచున్నాడు!!

2766. పంచభూత ప్రకాశ అణువులలో, దశదిక్కులలో, గ్రహించి పొందదగు జ్ఞానమునకు అతీతముగా నున్నది శివానందము. అది మాయలు (శుద్ధ, అశుద్ధ) రెంటిని దాటినవారు గాంచదగ్గ మా నాయకుని నాట్యదర్శనమగును.

2767. నటరాజు కలిసి వెలసినది శక్తియొక్క పలురంగులతో ప్రకాశించు గాజులలో (సహస్రదళంలో), నటరాజు కలిసి వెలసినది దోషరహిత (తెల్లని) ఆనందములో, నటరాజు కలిసి వెలసినది దోషరహిత (శుద్ధ) జ్ఞానంలో, నటరాజు, నటరాణి (శక్తి) కలిసి వెలసినది ఏకమైన నాట్యమునకు అతీతముగాను!!

2768. శివుడు, శక్తి జీవరాశులంతటికీ శ్రేయస్సు ఒనగూర్చుటకే తాము నాట్యమాడు చున్నారు: జీవుల శ్రేష్టత కొరకే శక్తియూ, శివుడు జీవులలో నెలకొని వారిని వీడక యున్నారు. వారు నా జీవప్రకాశంలో కలిసి వెలసినది సృజించితిని!! మలదోషములు, తిరోభావనలతో కలిసియున్న జీవకోటికంతటికీ మలము, మరపు పోగొట్టుట కొరకే శివశక్తి నాట్యమాడుచున్నారని గ్రహించితిని!!
(మాయ కల్పితములగు మలము దోషములగు – విక్షేపశక్తి; తిరోభావన – ఆవరణశక్తి – ఇది సత్యమును ఎరుగనీయక మరిపించు శక్తి; ఈ రెండు జీవునికి అనాదిగా వచ్చు ఉపాధులగును. వీటిని తొలగించు నిమిత్తమే శివశక్తి నాట్యం.)

2769. జీవుడు శివుడు కలిసి ఏకమైన స్థితియే ఆనంద అద్భుతనాట్యం: జీవులు పొందగోరు సకల రూపములు శక్తిరూపములే యగును. జీవుల జ్ఞానంలో సత్తుగా, చిత్తుగా, ఆనందముగా నెలకొన్నది ఉమాదేవి యొక్క శరీరమగును. శక్తిరూపము జీవులలో వెలసి, జీవుడు శివుడు కలియుటచే ఏర్పడిన ఆనందమే ఒక అద్భుత నాట్యమగును సుమా!!

2770. గురువు చూపిన మార్గమున నిలచి సాధన చేసినచో చిత్రంబళమును దర్శించి స్తుతించనగును: గురువానుగ్రహముతో నుదుట భ్రూమధ్యమున నిలపి సాధన చేసినచో తలంచిన మంత్రం ప్రకాశం పొందును. కావున జీవుడు పట్టుకొనవలసిన "పరమం" ఉన్న స్థానమదేనని ఎరిగి జ్ఞానాకాశము చేరుకొంటిని సుమా!!

2771. అండములన్నియూ సూక్ష్మముగా అమరి, బ్రహ్మాది దేవతలు ఐదుగురు, వెన్నెముకలో నెలకొనియున్న కుండలినీశక్తి పార్వతిదేవియై, శంభునికి శక్తిగానై రెండు ఆసనములగును (సాధ్వీ, శాంభవి నామములతో). ఈ ఏడును నాట్యరంగమునకు అనువైన స్థలముగా ఎంచి, జ్యోతిగా ప్రకాశించు శివుడు తన నాట్యమును కోరి ఆడెనే!! (సర్వ అండములు మొదలు (అఖిలాండము) శక్తి వరకు (జీవశక్తి) శివుడు ఆసనముగా చేసుకొనియున్నాడు.)

2772. చిదాకాశ బట్టబయలులో ప్రకాశవంతముగా వెలుగు సహస్రదళ పద్మమునకు శ్రేష్టత ఒనగూర్చునదియూ, నాలుగు రేకులే సహస్రదళముగా విస్తరించి, రెండువందల పది భువనములలో వెలయునదియూ, ఇట్లు నిమిరిన నిలబడిన మండలమే శివనాట్యమునకు తగిన స్థలమగును. (మూలాధార చక్రంలో నాలుగు రేకులతో నున్న శక్తియే సహస్రదళమునకు ప్రాకి, వంద రేకులతో దర్శనమిచ్చునది. నిమిరి నిలబడుట: అధోముఖ పద్మమే సాధనచే ఊర్ధ్వముఖ పద్మముగా మారును. మ. 525నకు పోలినది.)

2773. అండముల అంత్యములు ఏడు (ఆధారచక్రంలు + సహస్రదళం), పిండాంత్యములు ఏడు (దేవతలు, మానవులు, జంతువులు, జలచరములు, ప్రాకునవి, ఎగురునవి, చెట్లు), ఆవరించిన దిశాంత్యములు ఏడు (శుద్ధ ఆకాశములో నెలకొను ప్రకాశ కిరణ తరంగములు ఏడు), లింగమూర్తులు ఏడు (బ్రహ్మాది చక్రదేవతలు 5 + బిందు, నాదములు), నా అండనాయకుడు శివుడు నాట్యం చేయు స్థలములగును.

2774. నటరాజుని శరీరము ఆకాశమయమైనది. ఆ ఆకాశతత్వములో ఇమిడిన చీకటి (అజ్ఞానం – మలం) యే రాక్షసుడు. తన అంగవస్త్రంగా కనిపించు అష్టదిక్కులు తన చేతులు. జీవులపై తానను(గహించు త్రినే(త్రములును సోమ, సూర్య, అగ్నులగును. మహాకాశ (జ్ఞానాకాశపు) బట్టబయలులో నాట్యమాడుచున్నాడే!! (రాక్షసుడు: నటరాజు నాట్యభంగిమలో తన కుడికాలు క్రింద కనిపించు మనిషి రూపము – అజ్ఞానమలమును అణగద్రొక్కి తాను నాట్యము చేయుటకు ప్రతీక.)

2775. అఖిల చరాచరములు ఆదిపురుషునికి అంబళమగును (ఆకాశమగును). చలించునది, చలించనిదన్నియూ ఆతని అంశమే. తాను నాట్యమాడు అంబళమే ఆతని దివ్యపాదములగును. అది పంచభూతులను సూక్ష్మముగా ధరించిన ఆకాశ ప్రకాశస్థితి. అదే ఆతని పంచాక్షరము కూడ!!

2776. బలిష్టమైన పెద్ద ఢంకావాద్యం, పిల్లనగ్రోవి ఓంకారనాదంను శబ్దించగా, అందే స్థితిపొందిన జ్ఞానులు ఆ శబ్దమే ఆదిపరాపరుడని గ్రహింపగా, మహామహుని స్తోత్రించుచూ నిలుచున్న గణనాధులు, భూతనాధులు సంగీతం పాడునదే శ్రేష్ట శివుని పండారనాట్యమగును సుమా!!

(శైవ సిద్ధాంతశాస్త్రం ప్రకారము: త్రిపుర సంహారమైన పిదప ఏర్పడిన తెల్లని భస్మంను తన శరీరమంతా రాసుకొని నాట్యమాడెను – పండారనాట్యం; పండారం = భాషా ప్రయోక్తముగా వాడునది – తెల్లని విభూదిని శరీరమంతా రాసుకొని శివదాసులు ఇళ్ళకు వెళ్ళి భిక్ష స్వీకరింతురు; ఇటువంటివారి సమూహమును “పండారం” అందురు.)

2777. శిరస్సున సోమవృత్తం ఏర్పడినవారిని దేవతలు కూడ స్తుతించుదురు: అండముల అంతరమున్న దేవతలు, అండములకు బాహ్యముగానున్న దేవతలు, అలలుతో నిండిన సముద్రములచే ఆవరింపబడిన లోకములోనున్న దేవతలు, పుండరీకపదంలో బంగారు ఆకాశనాట్యమును గాంచి సేవించి, స్తుతించి, పరగతి పొందుదురు సుమా!! (పుండరీకపదం = తెల్లని తామర - శిరస్సు సహస్రదళ పద్మములో శివంను దర్శించినవారు - శివగతి పొందుట.)

2778. శివనాట్యంలో ప్రణవ ప్రకాశమును, ప్రణవ నాదమును దర్శించిన, వినినవారు బ్రహ్మానందం పొందుదురు: చింతపండును చూచిన వెంటనే నోటిలో నీరు స్రవించునట్లు, శివానందంనొసగు దివ్యనాట్యం శిరస్సున దర్శించినవారికి ఆనంద పరవశముతో కన్నీరు కారును. నీరసించిన మనస్సు కూడ ప్రేమతో కరుగును. అంతర చక్షువులు గ్రహించదగు శివుని ప్రకాశనాట్యం ఆనందమయం చేకూర్చును.

2779. (నాట్యదర్శనము కొనసాగుతుంది) శివనాట్యం దర్శించి పరవశముతో క్రిందపడి పోవునది కూడ శివానందమే. శివనాట్య ప్రకాశతో ఉన్మత్తునివలె తన్ను మరచిన స్థితి పొందును. అందరచే స్తుతించబడు ఈ దివ్యనాట్యం దర్శించునదే శ్రేష్టమగు స్థితియగును. దర్శించుటయే కాక ప్రణవనాదమును విని నాదాంతము చేరుకొన్న వారికే ఇది గిట్టును.

2780. నటరాజు అగ్నికుండ, ఢమరుకం, రుద్రాక్షమాల, పాశము, అంకుశం, శూలం, కపాలము మొ॥వాటిని చేతబూని, పరజ్ఞానము, అపరాజ్ఞానము అనుగ్రహించ నీలిప్రకాశశక్తితో ఉమాదేవి ఒక భాగస్వామిగా చేసుకొని మార్పుచేయ నాట్యమాడు చున్నాడే!! (ఇహలోక ఫలములను కోరియూ, సిద్ధులు పొందగోరియూ చేయు సాధనలు శక్తి యొక్క అపరజ్ఞానం గలుగుజేయును. నిష్కామ్య కర్మలచే ముముక్షత్వం పొందగోరునది పరజ్ఞానము పొందగలుగును.)

2781. నాట్యమునకు తగ్గట్లు పదకొండు కరణములు సరైన పద్ధతిలో అమరునట్లు, పాదములోని అందెలు, చేతిలో ఢమరుకం శబ్దించగా, నాట్యములో ఉద్భవించు నాదమే జీవునికి మేలైన సద్గతిని కల్గించునదై, నందీశ్వరుడు అంతరముగాను, బాహ్యముగాను నెలకొని నాట్యమాడెనే!!

2782. నటరాజుడు నవభేదములు మొదలుకొని ఆనందనాట్యమాడెను: తొమ్మిది భేదములతో (రూపములు-4, అరూపములు-4, రూపఅరూపం-1 = 9) నాట్యమాడగా, అష్టదిక్కులు వాటి అంతర్దిశలతో పదహారు కోణంలలో నాట్యమాడగా, భక్తిమార్గములగు ఆరింటిలో (గానాపత్యము, కౌమారము, శాక్తం, సౌరం, కాళాముఖులు, శైవం) నాట్యమాడగా, సుఖములొనగూర్చు ఏడు ఆధార

చక్రములు, ఏడు దర్శనములు, యాబదిఆరు దేశములు నాట్యమాడగా, అక్షర రూపములైన యాబది శక్తులతో శివమహామహుడు శివానంద నాట్యమాడి అనుగ్రహించెను!! (కాళాముఖులు: బహుప్రాచీన శైవ ఆగమ సిద్ధాంతులు.)

2783. నటరాజుడు సంగీతములోను ఇమిడి వెలసియున్నాడు: స్వరాలు ఏడింటిలో (షడ్జమం, రిషభం, గాంధారం, మధ్యమం, పంచమం, దైవతం, నిషాదం – 7), స్వర అక్షరములు ఏడునూ (స, రి, గ, మ, ప, ద, ని) మరింతకు దించబడి ఏకమైనదిగా అమరినదే ప్రణవం అగును. ఈ విధముగా సంగీతంలోను సన్మార్గంగా వెలయునది నా పరంజ్యోతి స్వరూపుడు. ఏడు స్వరాలతో నాట్యమాడి సంగీతమును అనుగ్రహించెను సుమా!!

2784. మూడు మండలములందు పంచాక్షర రూపమై (అ, ఉ, మకార బిందు, నాదములుగా ఏర్పడిన శబ్దములు ఆకాశములో వ్యాపించునపుడు వృత్తాకారరూపమై) మూడువందల అరువదిగా (360) మూడు మండలములలోనున్నదే ఆరు ఆధారములై (అగ్ని, సూర్య, చంద్ర మండలములే ఆరు ఆధారచక్రములలో), స్థూల, సూక్ష్మముగా పన్నెండు ఆధారములకు మూలముగా, అకార, ఉకార, మకారములు ఏకమైన ప్రణవములో కోరి నాట్యమాడెనే!!

2785. క్షీణించగల దేవతల శిరస్సుపై తన దివ్యచరణములుంచిన, తెల్లని ప్రకాశములో వెలుగు ఈశుని పాదపద్మములే తన్ను కోరి ప్రేమ సలుపువారి మదిలోనూ ఇమిడి, నెలకొని, కల్పవృక్షమువలె కోరినవారికి తగిన వరములిచ్చి, భూమిని దాటి ఆకాశములో నెలకొనియున్నాడు సుమా!!

2786. మహాప్రకాశ బింబములో ఆడు ఈశునికి తగ్గట్లు అన్ని భువనములు ఆడును. మా ధ్యాన పరిపక్వతకు తగ్గట్లు మా చిత్తమున ఆడును. తను మాలో నాట్యమాడుటచే సకల భూతములు ఆడి, తమ వృత్తులు సలిపి వాటినుండి వైదొలగును. ఇట్లు అగ్నిగోళముగా ప్రకాశించువాని నాట్యము దర్శించి సాధకుడు ధన్యుడగును!!

2787. మూఢులు ఆదిపరాపరుడు (వట్టి) నాట్యము చేసెనని యందురు. ఆదిపరాపరుని నాట్యమును (గూఢార్థమును) గ్రహింపజాలరు (దర్శింపజాలరు). అట్లు ఆది పరాపరుని నాట్యమును గ్రహించిన పిదప, ఒక దివ్యానుగ్రహశక్తియే అట్లు వారిని దర్శింపజేసినదని ఎరుగుదురు సుమా!!

2788. జీవుడు, శివుడు, నవభేదములతో కూడినదై, రెండు పదములగు త్వంపదం, తత్పదంలతో కూడి, సుఖమొనగూర్చునదైన అసి పదంతో కలిసి నాట్యము చేయును. జీవులకు దుఃఖమేర్పరచునదైన కామకలాపాలు పురికొల్పు కాళితో కలిసి నాట్యము చేసినది జీవుల యెడ అమితమైన కరుణ, ప్రేమ వలనే సుమా!!

(నవభేదముల వివరణ ముందు మంత్రములలో కలదు.)

2789. (ఆనంద శివనాట్యముచే) సకల తత్వములు నాట్యమాడగా, బ్రహ్మాది దేవతలకు అంత్యముడైన సదాశివుడు నాట్యమాడగా, అన్నింటినీ పదిలము చేసికొను చిత్తము నాట్యమాడగా, శివశక్తులు ఏకమై నాట్యమాడగా, స్థితిపొందిన సకల చరాచరములు నాట్యమాడగా, వేదస్వరూపములన్నీ నాట్యమాడగా, ఆనందనాట్యము ఆడెనే శివుడు.

2790. పతంజలి, వ్యాఘ్రపాదులు ఇరువురూ దర్శించునట్లు శివుడు ఆకాశమునందు రూపముతోను, అరూపముగాను, అనుగ్రహశక్తిలో జ్ఞానరూపుగాను, అనుగ్రహము నొసగునదే తన కర్తవ్యమని తలంచి అనుగ్రహ నాట్యమాడెను.

(దివ్యచరణములందు శరణునొందిన వారికే శివనాట్యం దర్శించనగును.)

2791. శివనాట్యంచే జీవుల తత్వములన్నీ తొలగించబడి నాదాంతము సద్గతి గిట్టును. శివుడు నాట్యం ఆడగా, విడదీయలేని శక్తియూ ఆతనితో ఆడగా, శ్రేయస్సు ఒనగూర్చని తత్వములు నాట్యం చేయగా, చలనములేని ఆకాశము కూడ ఆడగా, నవభేద తత్వములను (రూపారూపములు-9) దాటిన నాదాంతములో నాట్యమాడగా, వేదాంత సిద్ధాంతములో శివుడు నాట్యమాడునది దర్శించనగునే!!

2792. నాదము యొక్క అంత్యములోను (నాదాంతములో), చతుర్బోధ అంత్యములోను (చతుర్విధ పురుషార్థములలోని - మోక్షము), వేదములోని అంత్యమును (వేదాంతము - జ్ఞానకాండలో), ఆత్మతత్వ - శివతత్వాంతములో (సిద్ధాంతతత్వ అంత్యములో), ధాతుజయము (శుక్లజయము)తో గిట్టు నాద అనుసంధానమగు నాదబ్రహ్మం లన్నియూ శివనాట్యమే అగును. (నాదాంత, బోధాంత, వేదాంత, సిద్దాంత, యోగములచే పొందు నాదము శివనాట్యమే అగును.)

2793. బ్రహ్మాది పంచదేవతలు సృష్ట్యాది కర్మలగు జీవుల జన్మలు నివృత్తియై అంత్యమునకు వచ్చుటయూ, తపస్సంపన్నులకు (జీవుల) పాశబంధములు తొలగుటయూ, తపస్సుచే పొందు ఫలమగు శివానంద జ్ఞానమగు శివనాట్యంనూ, పరమం అగు శివుడు అంతటా నెలకొని ఆడు నాట్యమేయగును.

(జీవుడు మలదోష నివృత్తియైన పిదపనే శివనాట్యంను దర్శించగలుగును.)

2794. శివుడు నన్ను ఆదుకొన్నపుడు నాతోడుండి నిలచి అనుగ్రహించెను. చిరుదేవతల బారినుండి తప్పించెను. వికర్తా అని వాని నామమును ఉచ్చరించి పిలిచినపుడు బహిర్గతమై దర్శనమిచ్చెను. సోమ, సూర్య, అగ్ని ప్రకాశములతో వెలుగొందు నా శివుడు నన్ను అనుగ్రహించి ఆదుకొనెను. (వికర్త = మార్పుచేయువాడు; జీవుడు బంధపాశములలో నున్నప్పుడు అగ్ని, సూర్య మండలముల ప్రభావములతో నున్నది కూడ శివుడే. అగ్ని, సూర్య మండలములు దాటి చంద్ర (సోమ) మండలమగు

శిరస్సు చేరుకొనునది శివుడే.)

2795. జీవులకు లౌకిక భోగములిచ్చి వారితో కలిసియున్నదియూ, వాటినుండి వేరుపరచి ఆదుకొని అనుగ్రహించునది శివుడే: నాదమును దాటి నాదాంతస్థితిలో స్థితిపొందిన అనాదియైన వేదానంభి శివుడు పుష్పతత్వమునందే ఇమిడి జీవులకు లౌకిక భోగములు అనుభవించజేసెను. కాని వాడు వేరుపరచవలసిన వాటిని వేరుపరచి, జీవుల యెడ భేదపడకుండా వారితోనే కలిసుండి అనుగ్రహించెను సుమా!!
(నంభి = శివభక్తులకు బిరుదు – నమ్మకమున్నవాడు / విశ్వసించువాడు; పుష్పతత్వం = మూలాధార, స్వాధీష్ఠాన చక్రస్థానంలోని పుష్పరేకులు – లౌకిక వాంఛలు ఏర్పరచు చక్రస్థానములు; జీవులనుండి తత్వములను, బంధపాశములను వేరుపరచి)

2796. తన ఆనంద నాట్యముచే జీవుల తత్వములను తొలగించి ఆనందమేర్పచును: ఆనందం ఆనందం అని మూఢులు పలుకుదురు. ఆనంద మహత్వం నిండిన నాట్యమును ఎవరూ గ్రహించజాలరు. ఆనందమే స్వరూపముగా గల శివనాట్యము గ్రహించిన పిదప, తానే యా ఆనందస్థితియని, తత్వములన్నీ తొలగించుకొనిన అంత్యమని, అదే శాశ్వత సత్య, ఆనందస్థితియని ఎరుగుదురు సుమా!!
(ఇన్నాళ్ళు ఆత్మతో అనాదిగా నెలకొన్న తత్వసమూహం తొలగుటచే ఆత్మశుద్ధ, సత్యతత్వము గోచరించును; అదే తన నిజ ఆనంద, అక్షర స్థితి.)

2797. శివనాట్యభంగిమలో "శి, వా, య, న, మ" అక్షరార్థములు చెప్పబడినవి: జీవుడు తత్వములన్నిటినీ వదిలి సంస్కరించు కరమునకు 'శి' ప్రతీకగాను; తపోధనులను చేరదీయు పుష్పముల వంటి అనుగ్రహ కరమునకు 'వా' ప్రతీకగాను; భయపడ వలదని చెప్పు అభయ బంగారుకరముగా 'య' ప్రతీకగా; శుద్ధి చేయుటకుగాను అగ్ని ధరించిన కరమునకు 'న' ప్రతీకగా; సర్వ మలదోషములను అణగద్రొక్కిన (కుడిపాదం క్రిందనున్న రాక్షసుడు) నాట్యభంగిమకు 'మ' ప్రతీకగా నటరాజు నాట్యమాడుచున్నాడు.

2798. పంచాక్షరము నటరాజుని రూపముగా తలంచి స్తుతించవలెను. ఢమరుకం ధరించిన కుడిహస్తమే – 'శి', విసిరి ఆడు ఎడమహస్తం – 'వా', తనలో ఇమిడిన అభయహస్తం – 'య', అగ్నిని (శుద్ధికి) ధరించి ఆడు హస్తం – 'న', పునర్జన్మ మలమును అణగ ద్రొక్కి ఆడు కమల (ఊనిన) పాదము – 'మ', రూపశివునిగా స్తుతించుదువు గాక!!

2799. హరుని నాట్యభంగిమలు జీవుల కొరకు చేయు పంచవృత్తులగును. హరుని ఢమరుక శబ్దముచే సృష్టియూ, చేతుల అభయ భంగిమలతో స్థితియూ, అగ్నిని చేతబూనినది సంహారము (తనలో లయం) నకునూ, తాను ఊనిన కుడిపాదముతో

తిరోదాయియూ (తిరోభావన – ఆవరణ), పైకెత్తియాడు ఎడమపాదముతో అనుగ్రహ శక్తిని నొసగుచున్నాడే!!

2800. ప్రజ్వలించు అగ్నిబింబమే జీవప్రకాశము అంతమున జ్యోతిగా వెలసి, శివుని చూచిన వెంటనే ఆ కోమలకన్య (శక్తి) త్రిమూర్తులు మూవురి వృత్తులు ముగిసి శివునిలో లయమగుటను గాంచెను (స్థూల వృత్తులు చేయు బ్రహ్మ, విష్ణువు, రుద్రులు సూక్ష్మమైన మహేశ్వర సదాశివంలో లయమగుటయూ; జీవుని అగ్ని, సూర్యమండల ప్రకాశములు చంద్రమండల ప్రకాశములో ఇముడట). శిరస్సుపై వేదస్వరూపమైన నాదము మ్రోగినది!! (శివశక్తి అనుగ్రహంచే సృష్ట్యాది వృత్తులు వారి పరిపాలనలు జీవునిలో అంతమగును.)

2801. నందీశ్వరుడు! నాతండ్రి! జ్ఞానమయుడైన నాయకుడు!! ఓంకార మంత్రములో ఇమిడినవాడు! దానిని దాటి అతీతముగా ఆకాశ అంతముగాను, ద్వాదశాంతములో వెలసిన పరసుందర నాట్యకారుడుని – నటరాజుని ఏమని వర్ణించగలను సుమా!! (ఇదని మాటలతో ఆ మహామహుని వర్ణించజాలము.)

2802. సింహము వంటి గురునాథుడైన నందీశ్వరుడుని, చిదాకాశమున వెలయు దివ్యదేహుని ఎవరూ ఎరుగలేరు. వాని దేహము అధోచక్రములందు అగ్నివలె ఎర్రగాను, శిరస్సున తెల్లని ప్రకాశముతో వెలుగు తత్వమున్నదియూ, ప్రకాశతత్వమే స్వరూపముగా గలవాడును, అదే జీవులకు ఆశ్రయించదగినదిగా యున్నది!!

2803. జీవుడు పరాశక్తి అనుగ్రహముచే హరునితో ఏకమై జ్ఞానరూపుడగును: శివుని శక్తియే తత్పరముగా నిలచి వృత్తులు చేయును. అదే పరంనకు ప్రాణమునకు (జీవాత్మకు) సంబంధ మేర్పరచునది. ఇదే ఇచ్ఛాది భేదములను జరిపించునది (జీవునికి ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తిగా జరిపి పక్వపరుచును). అట్లు పరిపక్వపరచి అనుగ్రహశక్తిని నింపి హరుని ప్రేమకు పాత్రునిగా చేసి, హరునితో జ్ఞానరూపునిగా చేయును. ('పర'యను అనుగ్రహశక్తి జీవునికి సకల వృత్తులు చేయించి, పక్వపరచి, పిదప 'పరమం'తో (శివునితో) ఏకపరచి, శివరూపునిగా జేయును; పర=శక్తి; పరమం=శివం.)

## 9. ఆకాశంలో స్థితిపొందుట

(దివ్యనాట్య దర్శనము పిదప చేష్టలుడిగిన స్థితిలో ఉండుటయే పరమాకాశ ప్రకాశములో నెలకొనియుండుట)

2804. మనోమండలములో ఓంకారముగా నెలకొనిన ఈశుడగువానిని, అచ్చటనే అగ్నిగా ప్రకాశించువానిని, అచ్చటనే నీతిమంతుడై వెలయువానిని, మనస్సును ఆవరించియున్న దేహమే ఆకాశమగును. (మనస్సు నందు శివం ఓంకారముగా

వెలయును; ప్రణవములోని అకారము – అహంకారము, ఉ – బుద్ధి, మ – మనస్సు, బిందు – చిత్తం, నాదము – హృదయం; హృదయం మనస్సుకు మూలం, హృదయం భ్రూమధ్యమునకు, సహస్రారమునకు సంబంధము గలదు.)

2805. మహా భూమండలము వాని దేహమై, దేహములో ఆవిరించుయున్న అండకోశములై, అండమునకు అవతలనున్న ప్రకాశముగా నిలిచియున్న ఈశుడు, అతని సాకార స్థితియే మహాభూభాగముగా యుండి, దానిని మోస్తున్నాడు. వాని అనుగ్రహమే నిరాకారముగా స్థితిపొందిన ఆదిపరాపరుడగును.

2806. పరమాకాశములో మనస్సు ఇమిడి స్థితిపొందినపుడు దేహస్ఫురణ తొలగిపోవును: జీవుని దేహములో ఆవరించియున్న ప్రకాశము అఖండ ప్రకాశముతో నెలకొనునపుడు, దేహములోని అంతఃకరణ ప్రజ్ఞలచే చాటుకొనునది వీగిపోయి, జీవప్రకాశము పరమాకాశ ప్రకాశముతో కలిసిపోవునపుడు, దేహనిర్మాణ కూర్పు తమ స్థితులు కోల్పోయి దేహమే మహాప్రకాశతత్వమొందును.

2807. అల్పసుఖానుభవము గలిగించు స్త్రీభోగమునందు, కామాగ్నిని పురికొల్పినవాడే పరంజ్యోతిగా, ఆనందమయుడుగా వెలసియున్నాడు. ఆ మహామహుడే జీవుడై ప్రేమసలిపి బ్రహ్మ, విష్ణువులు గ్రహించకుండునట్లు మరిగియుండి శ్రేష్టమగు జీవప్రకాశములో స్థితిపొంది నిలుచున్నాడు. (బ్రహ్మ, విష్ణువులే జీవుని సుఖభోగాదులను పురికొల్పు స్వాధీష్ఠాన, మణిపూరకచక్ర స్థానాధిపతులు.)

2808. శిరస్సున వెలయు జీవప్రకాశమునకు జ్ఞానమును ఇచ్చునది అఖండ ప్రకాశమగు శివప్రకాశం. దీనిచే ఇన్నాళ్ళూ జ్ఞానమును ఇచ్చిన సోమ, సూర్య, అగ్నుల ప్రకాశములు సద్దుమణిగిపోవును. అట్లు శివప్రకాశములో ఇమిడి స్థితిపొంది నిర్విరామముగా కొనసాగినచో, జీవుడు శరీరముతో చాలాకాలముండనగును.

2809. పరమాకాశ తత్వమైనవాడు సమస్త దేవతలచే స్తుతింపబడువాడు. పెద్ద కొండచిలువను తన అంగవస్త్రముగా ధరించినవాడు. అతను నిలబడి ఆకాశ మయముగా నెలకొని పిదప జ్ఞానమహాప్రకాశముగా వెలయువాడు. (ఏకాశం = అంగవస్త్రం; మహాశునం = కొండచిలువ – పాము – కుండలినీశక్తికి ప్రతీక.)

2810. దేహములో ప్రాణశక్తిగా యున్నది (జీవశక్తి – వ్యష్టితత్వము) జగత్తంతటిని చలింప జేయు జ్యోతిమయమైన ప్రాణశక్తి (శివశక్తి – సమిష్టితత్వం)తో కలియు కాలమున, కోయిల వంటి పేద – కన్య (శక్తి) మాట్లాడి, శబ్దమును ఏర్పరచి, దేహమంతటికి వ్యాపించినపుడు, ప్రకాశమయమై, నా చిత్తమున నెలకొని, సూక్ష్మశరీరమును వేరుపరచి చూపించినదే!! (శక్తి దేహములో నెలకొని శబ్దించి – నాదమును ఏర్పరచి, దేహమంతటిని చైతన్యపరచి, ఆత్మను, దేహంను వేరుపరచి గ్రహింపజేయుట.)

2811. జీవులు శివస్థితిలో నుండునపుడు, వారిని వీడక నంది నిలుచుండును. జీవులు బాహ్యస్ఫురణలో నుండునపుడు వారిని వీడి నిలుచును. కాని సర్వదా వీడక వెలయు ప్రకాశించుచున్న పరమాకాశమును నందియని గ్రహించిన యెడల శాశ్వతమైన శివానందమును పొందగలరు.

2812. జీవుడు తన వ్యష్టితత్వము వీడి సమిష్టితత్వమగు శివునిలో స్థితిపొంది చేష్టలుడిగినదే – ఆకాశతత్వమగును: బాహ్యముగా కనిపించు ఆకాశతత్వము రెండువందల ఇరువది నాలుగు (224) భువనములకు (లోకములకు) ఆధారభూతమై నెలకొని యున్నది. (ఆకాశతత్వములు (5): భూతాకాశము, గుణమయ ఆకాశము, గుణరహిత ఆకాశము, సూర్యాకాశము, చిదాకాశము). జీవునిలో ఆత్మజ్ఞానమయమై అంతరమున నున్నదే ఆకాశమగును. శ్రేష్టజ్యోతితో నెలకొని శివప్రకాశముగా వెలుగునపుడు మహాపరమాకాశమగును. ఆ శివప్రకాశములో (సమిష్టి) స్థితిపొంది, తన జీవచేష్టలన్నియూ తొలిగనదే జీవులకు (వ్యష్టితత్వం) ఆకాశమగును.

## 10. జ్ఞానోదయం

(తాను వేరు, అతను వేరు అను స్థితి తొలగి, తానే అతనను జ్ఞానము పొందునదే జ్ఞానోదయం – ఇది గురుదీక్ష పొందినవారికి కలుగునది)

2813. మనస్సన్నది పంచజ్ఞానేంద్రియ ప్రజ్ఞలతో కూడినదై, లౌకిక విషయములను అనుభవించునది జాగ్రదావస్థ యగును. ఇక ఆ ప్రజ్ఞలు లేకుండా వాటి వాసనలతో స్వప్నంలో గ్రహించుటచే జాగ్రదవంటి ఆనందము కొంత గలుగును. ఇట్లు జాగ్రద, స్వప్న స్థితులలో పొందు ఆనందముకంటే ప్రజ్ఞలు లేని, దానికి ఆవల ఆనందం మరొకటి కలదందురు. ఇట్లు నంది జీవులకు అనుగ్రహించినది ఆనందములో విషయానందము మరియు శివానందమని రెండుగా ఉన్నవి సుమా!!

(ఆలయ ధ్వజస్తంభము దగ్గరనుండు నంది అన్ని తత్వములు, బాహ్యవిషయములతో ఉండుటచే అది రూపమున పెద్దదిగాను, శివుని గర్భగృహం దగ్గరనుండు నందీశ్వరుడు రూపములో చిన్నది – అనగా సర్వతత్వములు తొలగించబడిన చిన్ననందిగా యుండుట – ఐతీహ్యం.)

2814. ఏనుగు చర్మమును ఒలిచి తనపై కప్పుకొన్నవాడు (అహంకార మలమును చీల్చినవాడు), కపాలమును ఒకచేతిలో పట్టుకొని యున్నవాడు (బ్రహ్మ యొక్క సృష్టి వృత్తిని తొలగించినవాడు), ప్రకాశించుచున్న చంద్రకళను ధరించినవాడు (రుద్రుడుగా ఏకకళతో యున్నవాడు), శ్రేష్టవృత్తులు చేయువాడు, మహాకరుణతో యున్నవాడు యని తలంచితినే తప్ప (శరణునొందితిని) వాడు నల్లనైనవాడా, లేక ఎర్రనైనవాడాయని వానిని నేను పరిశోధించలేదు సుమా!!

2815. క్షీరసముద్రమునందు పెళ్ళుబుకిన అమృతమును దేవతలకిచ్చి తాను విషమును త్రాగిన మహోన్నతుడు. పరిపక్వత పొంది అర్హత సాధించినవారి తపోమార్గమును అవలంభించినచో, బంగారువంటి జ్ఞానమును తానొసగును. కావున శివుని నాదోపాసనతోడుతో మీరు సాధన చేయుదురు గాక!!

2816. శివుని అఖండ ప్రకాశములో నెలకొన్నవారు జ్ఞానోదయం పొందినవారు: ఆత్మ ప్రకాశమిదని గ్రహించి ఆ సన్మార్గమునే వెళ్ళి, జ్ఞానమును వృద్ధి చేసుకొని, ఆత్మ ప్రకాశజ్ఞానములో శివజ్ఞానమును గ్రహించి, శివుని అఖండ ప్రకాశంలో జీవ ప్రకాశమును ఇమడ్చగల సామర్థ్యనకు, ఆత్మప్రకాశమును శివుని చరణములందు ఇమిడ్చి నెలకొన్నవాడగును.

2817. ఆత్మతత్వ సత్యజ్ఞానమెరిగినవారు శివునియందు నెలకొందురు: తత్వములెచ్చట నున్నవో అచ్చట తత్వనాయకుడుండును. తత్వములెచ్చట లేవో అచ్చట తత్వ నాయకుడు లేడు. తత్వజ్ఞానమిదని ఎరిగిన పిదప, తత్వుడుని అక్కడ దర్శించనగును. (ఆత్మ అపుడు శివుని తత్వమొంది శివానందం పొందును.)

2818. సత్యజ్ఞానము వశమైనచో ప్రకాశవంతమైన అమృతము (ఆనందం)లో నెలకొన గలరు: ఆకాశతత్వమొకటి అన్నిటికీ ఆధారభూతమై యున్నదన్న జ్ఞానము వచ్చినపుడు, ఇన్నాళ్ళూ బురదలో నానినదే ఒక అమృతమగును. (స్వాధీష్ఠాన చక్రం – పృథివీ అంశం – శక్తి సహస్రదళము చేరుటచే – శక్తి శరీరమంతటిని ప్రకాశవంతము చేయును.) అది బంగారు ప్రకాశముతో మెరిగి అంతటా వ్యాపించును. ఎర్రని రంగుతో వెలసిన స్వాధిష్ఠాన పుష్పములో ఇమిడిన శివుడే ఇట్లు ప్రకాశించును.

2819. ముత్యములు, వజ్రములు, సముద్రములో సమృద్ధిగా పెరిగిన పగడముల పంటయూ, మేలిబంగారు ఛాయయూ, మాణిక్య ప్రకాశములతో కూడి, నా శిరస్సున, అండమున జ్యోతిగా వెలయు జ్యోతిరూపుని గురించి ఏ తత్వమును చెప్పి, వాడు వేరైనవాడని చెప్పుదును? (శరీరము అంతరములోను, బాహ్యములోను కలిసియున్న జ్యోతిస్వరూపుని వేరుగా నున్నాడని చెప్పజాలము.)

2820. నేను వేరు, శివుడు వేరని భావించి దరిచేరితిని. కాని దరిచేరిన పిదప తాను వేరు, నేను వేరనునది లేదని నా “అహం”ను పోగొట్టి, సత్యతత్వము నాలో ఇమిడ్చి, నన్ను మ్రింగి, తానే జ్ఞానమూర్తిగా నాలో నెలకొనుటచే నేనను తత్వము నాలో తొలగిపోయి నిలుచుంటినే!!

(ద్వైతభావన వీడి అద్వైతములో అభేదముగా ఏకమైన స్థితి.)

2821. శివజ్ఞానము శ్రేష్టమైన దనుటకు నాదాంతములో నెలకొనుటయే. శివజ్ఞానము

శ్రేష్టతత్వమనుటకు ఆత్మతత్వ మెరుగటయే. శివజ్ఞానము శ్రేష్టయోగమనుటకు జీవబోధ వీడి శివబోధలో ఇమిడియుండుటయే. శివజ్ఞానముతో శ్రేష్టప్రణవతత్వం గ్రహించి నాదాంతములో నెలకొనుటయే వేదతత్వమగును.

2822. శివజ్ఞానముతో ఉన్నతి పొందినవారు జ్ఞానమే స్వరూపముగా గల శివుడుని తమ జ్ఞానములో సృజించుదురు: జన్మరహితము చేసుకొనుటకు ప్రయత్నించు ముముక్షువులకు శివజ్ఞానమే వారికి ప్రాణము వంటిది. శివదైవమే వారికి ప్రాణము వంటివాడు. అటువంటివారు ఇముడవలసినది ప్రణవమేయగును. వారి జ్ఞానములో శివుడే జ్ఞానరూపుడుగా వెలయును.

2823. వాని అనుగ్రహమును దర్శించగలిగినవారికి, వారి కంట్లో మాణిక్యముగా ఉండి దర్శింపజేయును. అట్లు దర్శించగలిగనవారికి అమృత సముద్రమును అనుగ్రహించును. అట్లు వానిని దర్శించినవారికి నందీశ్వరుడు వారిని తప్పక రక్షించును. ప్రేమతో వాని దరిచేరిన వారికి వాడు తోడుగా ఉండి సహాయపడును సుమా!!

2824. శివబోధతో జ్ఞానోదయమైనవారి హృదయమున దేవతల సమూహము వచ్చి, ఇమిడి, నెలకొందురు: ఓంకార శబ్దములో వీడక నిలుచున్న నాదమువలె, ఊర్ధ్వలోకస్తులగు దేవతలు కోరు ఎర్రని ప్రకాశములో వెలుగుచున్నదియూ, ఎవ్వరికీ అందక దూరముగా నిలుచున్నవాడును నైన నా నాధుని దివ్యచరణములందు శరణొందినవారి హృదయమున సకల దేవతలు వచ్చి ఇముడుదురు.

## 11. సత్యజ్ఞానానందము

(సత్యజ్ఞానముతో గలుగు ఆనందస్థితి. ఇది అవస్థాత్రయం, తురీయంను దాటిన స్థితిలో గలుగు ఆత్మతత్వ ఆనందమగును)

2825. ఆత్మ తన తత్వములన్నిటినీ విడచి, నాదాంతస్థితిలో శివునిలో నెలకొని ఆనంద మయముగా వెలయును: ప్రకృతిమాయ, శుద్ధమాయ, అశుద్ధమాయ లన్నియూ వీడిన శూన్యస్థితిలో, తత్వములన్నిటినీ వీడి, సమిష్టి జాగ్రదా, స్వప్న, సుషుప్తి స్థితిలోను, వ్యష్టి జాగ్రదా, స్వప్న, సుషుప్తి స్థితులను దాటి తురీయంనకు చేరునపుడు, ఆ తురీయస్థితి శూన్యస్థితి యగుటచే ఇదని వివరించలేని ఆనందముగా, తత్పరమగు శివుడు ఆత్మలో (జీవాత్మలో) నెలకొనుటచే ఆత్మ శివానందమయము నొందును.

2826. త్వం పదము తత్ పదములలో చెప్పిన జీవతురీయం, పరతురీయం వలె, నమ్మకమైన మూడవ తురీయంలో అనగా శివతురీయంలో ఆనందమొనగూరును. ఆత్మ ప్రకృతి వైపు తలంచక దానికి ఆవలనున్న స్థితిలో ఎర్రని ప్రకాశముతో నిండి, జీవులను పక్వపరచుటకు ఆదుకొనువాడు శ్రేష్ఠ నందీశ్వరుడే యగును.

2827. నెలకొన్న సత్యజ్ఞానానందము మాణిక్యము వంటి ప్రకాశము గలదని చెప్పుటకు వీలుగాదు (ఇదని పోల్చి చెప్పుటకు వీలుగాదు). కాని ఈ సత్యజ్ఞాన ఆనందము నీలోత్పలం (కలువపూవు నీలితత్వం), శుద్ధం, నాదము, మెరయు రంగు, సువాసన, శోభ (ప్రకాశించు అందం)ల ఈ ఆరింటి సమ్మేళనమైనది.

2828. శివశక్తులు తనలో నెలకొనుటచే పొందు ఆనందమే మహాశ్రేయస్సుయని గ్రహించునదే పరజ్ఞానమగును. సకల జీవుల సమిష్టి ఆనందమే శివుని మేలైన ఆనందస్థితి. మేలైన రూపముతో శక్తిని వీడక నిలుచున్న శివం ఎట్లు నీలోత్పలంను వీడకయున్న ఆరు సహజ తత్వములను బోలినది సుమా!!
(నీలోత్పల పుష్పం – కలువ – సహజ ఆరు తత్వములు – షట్చక్ర స్థానముల శక్తి ఇమిడిన అండకోశ తత్వములు.)

2829. అందమైన కలువపూవులో రంగు, సువాసన, శోభలు వేరుపడక నిలచుండునట్లు, జీవుడు తత్పరంలో (శివునిలో) వేరుపడక కలిసియుండుటచే, శివంయను తత్వమగు మహావాక్య మహోన్నతుడు సత్యజ్ఞానానందముగా వెలసి అనుగ్రహించెను.

2830. జీవుని తలంపులు శివమయ మగుటచే జీవుడు శివమగును: మాటలు తగ్గట్లు తలంపులు, మనస్సు ప్రేమతో కరుగునట్లు వానిని స్తుతించి, స్తోత్రించి, వానిని మనస్సున పదిలము చేయుటచే, నా నాయకుడగు నందీశ్వరుడు వాని అనుగ్రహమును నాలో చొప్పించి, ఎప్పటికీ మరువకుండా యుండునట్లు నన్ను తనవానిగా చేసెను.

2831. పాలతో తేనె, పండ్లరసములు కలిసి పరిశుద్ధమైన అమృతమువంటి రుచి ఏర్పడినట్లు, తురీయావస్థలను జీవుడు దాటి శివంలో కలియుటచే శరీరములో సర్వ రోమాంకురములోను సత్యజ్ఞాన ఆనందము నిండి పూర్ణత్వమొందును.

2832. అమరత్వము దాటి, జీవునిలో నెలకొన్న అండకోశములు దాటి, నాదతత్వమును దాటి నాదాంతములో నెలకొన్నవాడు శివమహామహుడు. పగడములవంటి పెదిమలు, ముత్యములవంటి పళ్ళు, చల్లని మంచువంటి మాటలు మాట్లాడు స్త్రీ సాంగత్య ఆకర్షణ వలన నీరసము గాక (కామజయ మొందినవాడుగా) ఆ శివ మహామహుడు బాహ్యముగాను, బాహ్యాంతరముగాను శ్రేష్టుడుగా వెలయుచున్నాడే!!

2833. అంతరమున నెలకొన్న ముప్పది ఆరు (36) తత్వములను విడచి, మలము తొలగి శుద్ధమగుటయైన తురీయావస్థలను దాటి, భేదస్థితి తొలగి శివుని చూచుటచే (బాహ్యవిషయములను వదిలిన జీవుడు తురీయంలో శివముఖుడైనపుడు) సత్యజ్ఞాన ఆనందం నెలకొన్న జ్ఞానియగును. (జీవుని ప్రకృతిని చూచు మనస్సు మారవలెను.)

2834. జీవుడు సత్య జ్ఞానానందమందుకొని శివరూపం పొందును: జీవుడు శివం అగు

తరుణంలో జన్మలు ఏర్పరచునదైన అహంకారాది త్రిమలములను తొలగించి, భవమగు ప్రకృతిమాయ, శుద్ధ, అశుద్ధమాయలు మూడింటిని తొలగించుకొని వాటితో నున్న బంధములను త్రెంచివేసి, తపస్సుతో పొందిన సత్యజ్ఞానానందముతో జీవుడు శివం ఏకమైనదగు తురీయాతీతంలోని వెళ్ళి శివరూపం పొందును.

## 12. స్వరూప ఉదయం

(శివరూపం బహిర్గతమగుట – ముక్తి నొసగుట)

2835. పరమాచార్యుడైన శివుడు తత్వములను విడచిన ఆత్మలో స్థితిపొంది, అది ఎరువు పొందునట్లు ఎపుడు దానిని వీడక నెలకొనును. అట్లు ఆత్మస్వరూపంలో స్థితిపొందిన శివుడు శ్రేష్టమైన తురీయస్థితిలో వెలయువాడగును. (ఎరువు పొందుట = పరిపక్వతతో ప్రతిష్ఠమగుట; సహాయకారిగా తను తోడుండుట.)

2836. దేశ, కాల పరిస్థితులను మార్చగలిగినదైన పంచభూతములగు పృథివి, జలము, సర్వదా చలించు వాయువు, అగ్ని, ఆకాశములంతటిలోను కలిసి, వాటికి అతీతముగాను, ఆకాశం దాటి విశ్వంలో నెలకొన్న శివుని ఎల్లలు నిర్ణయించివానిని స్తుతించలేను సుమా!! (శివునికి హద్దులను కల్పించలేము.)

2837. సర్వభువనాధిపతియై అంతటా నెలకొన్నవానిని దేవతలందరూ స్తుతించుదురు: అట్లు వెలయు జ్యోతిస్వరూపుని బ్రహ్మాది దేవతలు "నా దైవమా!" అని నమస్కరించి స్తుతించుదురు. సాటిలేని నా ప్రపంచ నాయకుడగు శివుడు వారి అంతరజ్యోతిలో ఇమిడియుండి, వారి సమిష్టితత్వస్థితిలో భువనములంతటికీ నాయకుడుగా వెలయుచున్నాడే!!

2838. జీవుడు ఉన్నత సంస్కారములను పొందనీయక పాడుచేయు కామాది కరణములగు ఎనిమిది (కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం, భూకాంక్ష, స్వర్ణకాంక్ష (8))తో అహంకార చేష్టలను తొలగించుకొని శివం అందు ఇమిడి స్థితిపొందినవారు దేవతలకు నాయకుడుగానై వెలుగొందురు సుమా!!

2839. బ్రహ్మ, విష్ణువు, రుద్రులు మూవురికి ఏకమైనవాడు రుద్రమూర్తిగా, వారితో కలిసియూ, వారికి వేరుగాయుండి పరిపాలించువాడుగాను, జీవ, పర, శివ తురీయం మూడింటిలోనూ నెలకొని జీవులకు శ్రేయస్సు ఒనగూర్చు తత్వములో నున్నది శివుడేయని వేద ఆగమములు చాటుచున్నవి సుమా!!

2840. శివస్వరూపమును వాని అనుగ్రహము లేక పొందలేము: శివుడు అరూపముగా ఉండుకొనియే సకల రూపములందు నెలకొనును. తనకొక మూలము లేకయే (అనాది కనుక) అన్నిటికీ మూలమగువాడు (తనకని ఏ కారణము లేకున్ననూ, జీవుల కొరకు తానమరుట). అరూపస్థితిని దాటి వెలయు మాయపరుడు. వాడే

గురువుగా జీవునిలో బహిర్గతమై అనుగ్రహించునే తప్ప, వాని అనుగ్రహము లేక వానితో కలవలేము.

(ప్రకాశముగా లేక నాదముగా వెలయుట వాని అనుగ్రహము చేతనే.)

2841. జీవుడు సత్యస్వరూపమును గ్రహించినచో అమరత్వమొందును: శివంను తనలో ఇముడ్చుకొని సర్వదా వానిని తలంచువారికి మనస్సులో నున్న చీకటి తొలగి ప్రకాశము ఆవరించును. అటువంటివారు మరణమును జయించుదురు. వారు దేవశరీరం పొంది వెలుగొందుదురు. అట్లు వాని సత్యతత్వమెరిగి లాభించు వారెవరు ఈ లోకంలో? (శివతత్వం/ఆత్మ స్వస్వరూపజ్ఞాన మెరుగటయే అమరత్వము – మహానందతత్వం.)

2842. పరంజ్యోతియగు మహాప్రకాశ బింబనాథుని పట్టుకొనిన కారణముగా ఆ పరంజ్యోతి నాలో ప్రవేశించి, పిదప ఆ పరంజ్యోతిలో నేను అణిగి, మణిగిపోగా, ఆ పరంజ్యోతియే తన సత్యతత్వంను నాదము ద్వారా అనుగ్రహించినది నేను సృజించితిని సుమా!!

2843. ప్రకృతి స్వభావములగు రూపం, గుణం, కాలము (కాలానుగుణ కర్మలు)లలో నెలకొని, అరుదైన నీలోత్పలంలో వెలయునట్లు ఆదిశక్తి, జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి నాలుగింటితో కలిసి నెలకొని శివస్వరూపమగు గురువు జీవునికి శుభము లొనగూర్చువాడుగా వెలయును సుమా!!

2844. మౌన స్వరూపమైన జీవుడు ప్రణవముచే ప్రకాశవంతుడగును: శివస్వరూపము దర్శించిన జీవుడు మౌనస్థితిలో ఆనందస్వరూపడగును. ఎల్లలు లేని (హద్దులు) అఖండశక్తిని చూచునపుడు అకార, ఉకార, మకార (ప్రణవం) అగుటచే అవి కంఠమున వెలుగొంది ప్రణవ మహాప్రకాశముగా వ్యాపించి వెలయును.

(ప్రణవ అక్షరములు శరీరములో నెలకొనునపుడు “మకారము” అర్ధమాత్ర (మ్)గా కంఠమున పుట్టి, ఓంగా నాదాంతమును చేరుటచే ప్రకాశమును వెదజల్లును.)

2845. కంఠమునందు తలంపులు నిలిపి తపస్సు చేసి, హృదయతామర నుండి వృత్తులు సలుపు క్రియాశక్తి (బాహ్యముగా జీవుని పురికొల్పు వృత్తులు) నాయకుని దాటి, శిరస్సు సహస్రమున గల పరాపరుని ప్రకాశములో నిలుపుటచే పునర్జన్మలు దాటి పరప్రకాశములో మరిగియుండి వృత్తులు చేయువానిని దర్శించితిని సుమా!!

2846. జీవుడు తన గమ్యంను గ్రహించి, వాని దరిచేరుటచే శివరూపం పొందును: చిత్తమున శివుడు ఎట్లు నెలకొని ప్రకాశించుచూ జీవుని ఆదుకొనుటను నేను గ్రహించితిని. నేను చేరవలసిన గమ్యం కూడ అదేనని గ్రహించితిని. ఇక మరే రక్షణ నాకు అవసరము లేదు. ఇక నేను చేరవలసినది మరొకటి లేదు. మనం

చేరవలసిన నాయకునికి "నేను" అని సంబోధించుటలో తప్పేమి లేదు సుమా!! (శివమయమైన పిదప ఏకతత్వమే అగును. "నేను, వాడు" అను సంబోధన ఉండదు. పారమార్థిక సత్యమెరిగి, అందు స్థితిపొందిన జీవుడు సత్య, శాశ్వత, ఆత్మతత్వములో ఇముడుటచే ఇక ద్వైతభావనలు తొలగి అద్వైతం (ఏకత్వము) మగును. సర్వం శివమయం.)

## 13. విధి

(ద్వందకర్మల ఫలితములు. చేసినవి వచ్చి చేరు తత్వం)

2847. తత్త్వజ్ఞానులు కీడుకు దుఃఖమును, సుఖమునకు పొంగిపోవడమునకు లోనవరు: చిత్తమున శివం పదిలమైన తత్త్వజ్ఞానులను పదునైన కత్తితో చెదికిన (హింసించిన) నేమి? చందనం పూత రాసుకొన్ననేమి? తలయందు మేకు దింపిననేమి? విద్వక్తుడు నందీశ్వరుని నియతి ప్రకారము జరిగినదని గ్రహించి తమ స్థితిలో తాముందురు.

2848. సుఖ, దుఃఖములు రెండూ తమ కర్మఫలితము లనుసరించియే యుండును: జీవుడు తన పూర్వజన్మ కర్మల బట్టియే తన సుఖదుఃఖములమురునే తప్ప, ఆకాశనాధుడు (శివుడు) వీటిని (విధిని) అమర్చలేదు. కావున వాని గమ్యమెరిగి వాని దరిచేరినచో, ముందు చేసిన తపోఫలమే మేలైన గతిని ఒసంగును.

2849. సుఖదుఃఖాదులందు కూడ నిర్విరామముగా దైవమునందు చిత్తముంచవలెను: నదీ ప్రవాహములో మట్టి కొట్టుకువచ్చుటచే ఏర్పడు ఎత్తు పల్లములను ఆ నదియే భరించుచున్నదే తప్ప, మరెవరూ ఆ ఎత్తు పల్లములు సరిచేయుట లేదుకదా? అట్లే నేను చేసిన కర్మలకు ఫలములు నేనే భరించవలెనని ఎరిగి, తెల్లని ప్రకాశముతో వెలుగుచున్న నందీశ్వరుని పట్టుకొని చిత్తమునుండి వీడక యుండుదును గాక!!

2850. ఆకాశము నుండి మెరుపులు, పిడుగులు పడిననేమి? మహాసముద్రం పొంగి వినాశము ఏర్పరచిననేమి? కారుచిచ్చు మహామంటలతో రగిలి, శరీరం కాలిపోయిన నేమి? ప్రచండమారుతం (గాలి) వీచి వస్తునాశము ఏర్పరచినేమి? నేను వీటినంతటిని లెక్కచేయక నా నాధుడగు శివుని పట్టు విడువకుందునే!! (సర్వదా వాని ఆశ్రయించి యుండవలె.)

2851. ఎన్ని ఇక్కట్లు ఏర్పడిననూ జ్ఞానసాధనలను నేను విడువలేను: మదపుటేనుగు చంపుటకు వెంబడించిననేమి? పదునైన బాణము శరీరములో దిగి తొలచిననేమి? కాననంలో (అడవిలో) నున్న క్రూరపులి అడ్డగించిననేమి? నా జ్ఞానభూమిలో (భూమికలలో) పరమాత్ముడు నాకు అనుగ్రహించిన జ్ఞానసాధనలను నేను విడువ జాలను సుమా!!

2852. శివజ్ఞానం పొందినవారికి శరీరక్షీణత శంక ఉండజాలదు: ఈ జన్మమెత్తిన శరీరమునకు ఏదైన కీడు ఏర్పడినచో, మరొక శరీరము నొసగు పరమాత్ముదున్నాడు. రాజ్యం చెడిననూ (అతివృష్టి, అనావృష్టితో క్షామము) మనవారికి చెడు లేదు (శివ జ్ఞానులకు కీడు ఏర్పడజాలదు). నివాసము చెడి మరొక నివాసమునకు వెళ్ళునట్లు (గృహమరమత్తులకు మరొక గృహమునందు ప్రవేశించునట్లు మరొక ఉన్నత శరీరము పొందుట వలె – ఉపమానం) శివజ్ఞానము పొందినవారికి నందీశ్వరుడు నొసగు బహుమానం ఇదనని గ్రహించుదురు.

## 14. శివదర్శనం

(నిర్విరామ శివధ్యాసచే శివుడు బహిర్గతమై అనుగ్రహించునది)

2853. పరిశుద్ధమైన మనస్సులో శివుడు శ్రేష్టముగా బహిర్గతమగును: శివుని నిర్విరామముగా తలంచువారి చిత్తమున శివుడు వేరు, తాను వేరన్నది లేదు. శివధ్యాసతో కూడిన చిత్తమునందే శివుడు బహిర్గతమగును. శివజ్ఞానముతో తేట (పరిపక్వత – సంస్కరించబడిన) పొందిన శివజ్ఞానులకు వారి చిత్తమునందే శివుడు స్థితిపొంది నెలకొనియుండును.

2854. వాక్కునకు, మనస్సునకు అతీతమైన వాడిగా వేదములు ఘోషించు శివమహామహుని అనుగ్రహంచే క్షుణ్ణంగా చూడండీ!! అట్లు చూడబడునది బహుసూక్ష్మమైనది, సున్నితమైనది. ఆ తత్వమునకు వచ్చుట, పోవుట అనునదియూ క్షీణతయూ లేదు. ఈ సత్యం గ్రహించినవారికి అదే గమ్యము కూడ!!
(ఆ తత్వము పంచజ్ఞానేంద్రియములకు అగోచరం, అందనిది, అతి సూక్ష్మమైన అణువునకు పరమాణువు వంటిది, అనాగమాపాయి (వచ్చుట, పోవుట లేనిది), అనాది (చావు, పుట్టుకలు, క్షీణత లేనిది), నిత్యం, సత్యం, సత్+చిత్+ఆనందం, తత్పరం, అసంగం, శుద్ధం, నిర్వికారం, నిరంజనం (దోషరహితం), పంచకోశ విలక్షణం, అవస్థాత్రయసాక్షి, శరీరత్రయ విలక్షణం, జ్యోతిషాం జ్యోతి, అదే జన్మకు సార్థకగమ్యం.)

2855. శివుడు సర్వమయుడు, సర్వజ్ఞుడు అగుటచే అన్నిటికీ తానే ఆధారముగా ఉన్నాడు: పరమై, పరాపరుడై, అవ్వలకు అవతలుగా యుండి సర్వజ్ఞుడుగా, సర్వశక్తివంతుడు గాను, జ్యోతిషాం జ్యోతిగాను, తానే అన్నిటికీ ఆధారభూతుడుగాను, జీవునిలో నెలకొన్న ఆరు జ్ఞానములతో (పంచజ్ఞానేంద్రియ ప్రజ్ఞలు + మనస్సు) గోచరం కాని పరమాత్మ జగత్తంతటినీ అనుగ్రహించువాడుగా ఉన్నాడు!!

## 15. శివస్వరూప దర్శనం

(శివస్వరూపం: సత్+చిత్+ఆనందం తత్వస్థితిని గ్రహించునదే శివరూప దర్శనం)

2856. నిర్విరామ పఠనముచే ప్రతిరోమ ద్వారము లందు ఆనందనిల్వలు నిండి, భేదము, అభేదములను అంటని, బాహ్యమున, అంతరమున నిరోధింపబడని ఆనందమే, రూపము, అరూపము, అరూపరూపములగు మూడు స్థితిగతులకు అవ్వలయుండునది, వేదములు చెప్పు (పరబ్రహ్మ తత్వం) శివశ్రేష్ఠ స్వరూపమగును.

2857. శివుడే భావనలంతటిలో నున్ననూ అన్ని తలంపులకు అవ్వలయుండువాడు: భావన శివుడే. ప్రాణము శివుడే. కలయిక శివుడే. భోగఫలము శివుడే. సక్రమ పరచు తలంపులు శివుడే. కాని తలంపులతో వానిని ఇదని గ్రహించజాలము. శివుడే పూలచెండులోని సుగంధముగా ఉండి శివప్రేమ తత్వమునకునూ, లౌకిక ప్రేమతత్వమునకు ఆధారభూతుడుగా ఉన్నాడు.

(పూలచెండు అనునది: స్వాధిష్ఠాన చక్రములోని పద్మరేకుల సుగంధం శివతత్వంనకునూ, లౌకిక తత్వమును రెంటిని పురికొల్పు స్థానము.)

2858. ముందు మంత్రములో చెప్పినట్లు అన్నిటిలో నెలకొన్న శివుని తలవండీ!! ఆతనిని తలంచువారి మదిలో ఇమిడి అన్నిటినీ సఫలము చేయును. అతనే సర్వ సందేహములను (శంకలను) తొలగించగలిగిన వేదస్వరూపుడు. శ్రేష్టతత్వములచే గ్రహింపబడువాడు. ప్రాణములో జ్ఞానస్వరూపుడుగాను శిరస్సున ఇమిడి తేటపరచువాడు సుమా!!

2859. ఆతని దివ్యానుగ్రహముతో స్పష్టత పొందిన కంటిని తెరచి చూచితిని (జ్ఞాననేత్రంతో వీక్షించుట). అట్లు తెరచి చూచుటయూ, నాలో జ్యోతిస్వరూపుడుగా నెలకొన్న సాటిలేని నాయకుడు, బంగారుఛాయవంటి దేహముగలగి జటాఝుటము ధరించిన శివుడే, నన్ను "నీవు జ్ఞానమయుడవైతివి" అని బోధించి అనుగ్రహించెను సుమా!!

2860. సచ్చిదానందమూర్తియగు శివుడు, జీవుడు, నిర్గుణమగునపుడు జ్యోతి స్వరూపుడుగా (ప్రకాశముతో) వెలయును: శివం సత్తుగాను, చిత్తుగాను (చైతన్యం), ఆనందముగాను నిలుచు తత్వమున్నవాడు. జీవుని చిత్తమగు జ్ఞానమండలము త్రిగుణములకు వశపడునపుడు శివానందము నెలకొనజాలదు. జీవులు నిర్గుణము అగునపుడు పరిశుద్ధమగు బ్రహ్మతురీయంలో వెలయుదురు. అటువంటి తురీయంలో శివుడు మహాప్రకాశమయమై వెలయును సుమా!!

2861. శివుని స్వరూపలక్షణము: శివుడు పరం కాదు. పరాపరుడు గాదు. ఉత్సాహముతో గ్రహింపబడువాడు కాదు. శిరస్సున వెలుగు ప్రకాశము కాదు. ధరించి యున్నవాడు గాదు. శివం అన్నింటిలోను ఉండియూ, వాటిలో లేకయూ యున్నాడు. సుఖము

లొనర్చు హరుడు కాదు. అతను ఆనందమునకు అవ్వల యుండువాడు. (అన్నింటిలో కలిసియున్ననూ, వాటికి అతీతముగాను, అసంగముగాను యున్నవాడు.)

2862. ముక్తియూ, సిద్ధియూ చేకూరిన జ్ఞానులు భక్తితో కూడిన పరమానందము పొంది, మహత్వమగు శక్తి పదిలమైనవారై శివతత్వం చేకూరినవారుగా (క్రియాపర్వం తొలగించుకొన్నవారు), వారే బ్రహ్మానందం పొందు జ్ఞానులగుదురు సుమా!! (సుఖానందబోధులు)

2863. తురీయాతీతస్థితి చెప్పుటకు అలవికాని శూన్యస్థితి (జీవ, శివ, పరమను వేరుబాటు లేని తత్వస్థితి). ఈ తురీయాతీతస్థితిని చేరుకొనినచో తలంపులు, మరపులు లేనిదైన మనస్సు ప్రతిష్ఠమై నిలిచిపోవును. తన స్వరూపం తత్వరీతిగా మాయమగును. (తానన్న "అహం" వృత్తులు తననుండి వీడుటచే "అహం స్ఫురణ" ఆత్మగా, సాక్షి చూచును). ఈ అతీతమైన స్థితిని ఎట్లు మాటలతో వర్ణించగలము!!

## 16. ముక్తిభేదము, కర్మ నిర్వాణం

(ముక్తిభేదములు, కర్మల నుండి విముక్తి – కర్మలను త్రెంచుట)

2864. జీవాత్మ చేష్టలుడిగి శివస్వరూపంలో ప్రతిష్టమైన స్థితియే ముక్తి: వేదములందు చెప్పబడిన ముక్తియనునది తురీయస్థితిలో సక్రమవిధానముతో ప్రాణం, పరంతో కూడి విడదీయలేనిదిగా శివంతో స్థితిపొందినదగును. అపుడు ఆత్మస్వరూపమగు పరం శివస్వరూపములో లయమగుటచే దోషరహితమైన నిర్వాణస్థితి ఏర్పడును. (ఆత్మ నన్నిటినీ సాక్షిగా చూచునది. చూడబడునది కాదు.)

2865. సాధన ఫలమనునది శివంలో ప్రతిష్టయై మౌనస్థితిని అందుకొన్నవారు: బాహ్య బంధములను విడచినవారే పరబ్రహ్మ తత్వమును పట్టుకొన్నవారు. విద్యాధిక సాధనానంతరమున సత్యశివజ్ఞానము గ్రహించి దానిని దర్శించినవారు జ్ఞాననేత్రము గలిగినవారై, శివజ్యోతిలో స్థితిపొంది ప్రకాశముతో ఏకమైనవారు, ఇక వ్యర్థప్రలాపనలు (మాటలు లేని స్థితి) లేని స్థితిలో నిలుచుందురు.
(బంధములు విడచి శివప్రకాశముతో ఏకమైన స్థితిలో చత్వారి వాక్కాదులకు ఇక పనియుండదు – మౌనస్థితిలో యుందురు; విద్యాధిక సాధనలు = శ్రుతి ప్రమాణమగు సాధన చతుష్టయం, సాధన షట్కసంపత్తి మొ॥ ఒనగూరిన అధికారి గురుముఖతఃగా పొందిన జ్ఞానోదయంచే – జీవ ఈశ్వర ఐక్యజ్ఞానం గ్రహించినది.)

## 17. శూన్య సంభాషణ

(జ్ఞానవస్తువును గూఢముగా చెప్పుట. జ్ఞానసాధనలు, సాధన ఫలములు గూఢముగా యున్ననూ వాటి వివరణలు చదువరులకు ఆనందం నొనగూర్చునదే!!)

2866. మానవదేహ కూర్పు ఒక జూదము ఆడు పలకవంటిది. జూదమునకు ఉపయోగించు పగడకాయలు (దుఃఖమును ఏర్పరుచునవి) పంచమములుగా యున్నవి (పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, పంచప్రాణులు మొ॥). నేత్రములు మూడుగా (ఇచ్ఛా, క్రియా, జ్ఞానముగా), విషయవాసనల సుఖములను అందుకొనునవి యాబదిఒక్క అక్షరములుగా ఆధారములలోనుండి, అందు నెలకొన్న జీవుడు (పురుషుడు) కర్మించుటకు తగ్గట్లు అమరియున్న ఈ మాయతత్వమగు ఇంద్రియముల నిగూఢత్వంను నేనెరుగజాలకున్నానే!!

(దేహాంతరములో నెలకొన్న ఇంద్రియకరణములు అగోచరమగుటచే వాటి తత్వములు గూఢముగా యున్నవని రచయిత వాపోవుచున్నారు; పగడకాయలు = Dice; రచయిత ఒక మహాజ్ఞాని, మహా సిద్ధపురుషుడు, ఋషిపుంగవుడు. అటువంటివారు ఒక సాధారణ మానవునకు ఏర్పడు చంచలత్వం గురించి చెప్పుచున్నారు.)

2867. శివతత్వము పొందుటకుగాను కలుపు మొక్కలను (అహంకారం, కర్మలు, మాయ) వేళ్ళతో పెరికివేయు మార్గమును ఎరుగక యున్నారు. శివతత్వము పొందుటకు మార్పులు, చేర్పులు చేయటకుగాను (అహంకారాది మలములను నివృత్తించుటకు) విధానము గ్రహించినవారికి వారి హృదయమున పెళ్ళుబుకు ప్రేమతత్వమే దానికి మార్గమగును సుమా!!

2868. ఆరు వీధుల మధ్యనున్న సంధిలో (మూలాధార చక్రసంధి) దుఃఖము ఏర్పరచు నాలుగు తాటిచెట్లున్నవి (అజ్ఞానపు చీకటితత్వం). దానిపై ఎక్కుటకు తెలిసినవారు నిచ్చెన వేసి ఎక్కినచో (తాటిచెట్టువంటి వెన్నెముకలో పైకి ప్రాకి సహస్రారము చేరుటకు సూక్ష్మమెరిగినవారు) సముద్రములు ఏడింటినీ చూడనగును. (సహస్ర దళపద్మములో ఏడు సముద్రముల ప్రకాశము. షట్చక్రస్థానం + సహస్రారము = 7 పొంగునది దర్శించనగును) సుమా!!

2869. చక్కని తమిళ ప్రాసలతో నిర్మితమై, పెక్కు ఉపమానములతో నిండిన మంత్రములు. వంగ విత్తనము వెదజల్లగా (బహు సూక్ష్మమైన చిన్నచిన్న యోగసాధనలతో మొదలిడి) కాకర మొలకెత్తినది (వైరాగ్యము పుట్టుట – లౌకిక సుఖములకు వైరాగ్యమొక చేదు తత్వము). కలుపులు తీసి, బాగుగా భూమిని త్రవ్వి, పక్వపరచిన పిదప (దేహతత్వములను తొలగించుకొని పరిపక్వత పొందుటచే నాదము సహస్రారమున

ఉద్భవించుట) గుమ్మడిపూవు పూచినది (బంగారువన్నె ప్రకాశపుష్పము పూచినది). కడపట సంపూర్ణముగా పండిన అరటిపండు లభించినదే!!

(శివం అగు తీపి ఫలము లభ్యమైనదే.)

2870. ఈ పంచభూతాత్మక శరీరములో దైవవిత్తనమొకటి (ఆత్మతత్త్వము) బిందు మండలములో నెలకొనియున్నది. ఈ బిందు మండలమును సక్రమపరచి అమర్చుకొను జ్ఞానమున్నవారు ఎవ్వరూ లేరు! దీనిని గ్రహించుటకు కంఠమున నెలకొన్న నీలకంఠుని చిత్తమున పదిలపరచుకొనిన యెడల ఆత్మతత్త్వము నెలకొన్న ప్రకాశమండలమును నిస్సందేహముగా పొందగలరు సుమా!!

2871. పల్లపు భూమియొకటి గలదు (జీవునిలో ఫలితంలేని సుషుప్తావస్థ). వృధానొనర్చు భూములు రెండున్నవి (జీవునిలోని జాగ్రద, స్వప్న స్థితులు). మరిపించునట్లు చేసి వీటితో మరొకటి కలిసియున్నది (ఆత్మ తిరోభావనతో మరిగియుండి ఈ అవస్థాత్రయంతో కలిసి నెలకొనియున్నది). మనస్సు పెట్టి అచ్చట సేద్యం చేసిన (స్వస్వరూప జ్ఞానమెరిగి తన చిత్తమను భూమిపై శివసేద్యం చేసినచో) నీరు బాగుగా పారి, పంట సమృద్ధిగా పండి చేతికి వచ్చునే!!

(శివానందమగు నీరు పారి జీవన్ముక్తి యగు ఫలము గిట్టును.)

2872. దేహసిద్ధి (కాయకల్ప సాధనలు) కన్నా, జ్ఞానసిద్ధియే శ్రేష్టం: మూడు నాగళ్ళు, ఒక కుంట నేలను (ఇడ, పింగళ, సుషుమ్న నాడులు మూడు – మూలాధారమను భూమిలో) దున్నిన పిదప అవి (వెన్నెముకకు) తాడుతో కట్టబడును. కాని వారు నాగలితో లోతుగా దున్నక నీరసమొందుదురు. (జ్ఞానసాధనతో సక్రమమార్గము గ్రహించి సఫలమొందలేదు) వట్టి బీడుభూములను దున్ని ఏ ఫలమును సాధించగలరు? (సరైన హఠయోగాదులు అనుసరించక విఫలమగుట.)

2873. చంద్ర, సూర్య, అగ్నికళలతో కలిసి ప్రకాశము పొందునదే ఆత్మసాధన: ఆరు ఆధారములను బావినుండి ఇడ, పింగళ కళల సహాయముతో నీటిని చేదగలము. చంద్రకళయను పెద్దవాడు నీటిని చేదియూ, సూర్యకళయను చిన్నవాడు నీటిని పారించియూ (వీర్యమును పారించి), అగ్నికళ అనువాడు పారించిన నీటిని పైరుకు సక్రముగా పారింపక వృధా చేసినది – ఒక వేశ్య పెంచిన కోడిపుంజు వలె సుమా!! (మూలాగ్నిని తగిన సాధనలతో సహస్రారమునకు ప్రాకించక, కామచేష్టలతో పురికొల్పబడిన వాంఛలలో అగ్నితత్త్వమగు వీర్యమును వృధా చేయుట ప్రయోజన కరము కాదు.)

2874. మేపువాడు లేక నిర్లక్ష్యముగా తిరుగాడు పశువులు ఇరువదినాలుగు (దేహతత్త్వములు – 24). కాని బాగుగా పరామర్శించబడిన చిన్న పశువులు ఏడు, మరొక ఐదు

ఉన్నవి (విద్యాతత్త్వములు - 7, శివతత్త్వములు - 5). పిదప ఈ చిన్న పశువులు కడవల నిండా పాలు గొప్పగా స్రవించిననూ, ఏదీ ఇవ్వని నిర్లక్ష్య పశువులే వీడికి (జీవాత్మకు) దొరికినదే? ఎంత ఘోరం! (బ్రహ్మానందం పొందవలసిన ఆత్మ నిర్లక్ష్యముచే అల్పసుఖములకు లోనై, దేహతత్త్వములను వీడక చెడుచున్నదే!!)

2875. పాలు ఇవ్వని పశువులు ఇరువదినాలుగు (దేహతత్త్వములు-24). స్రవించు పశువుల నుండి ఒక్క కడవ పాలు చాలును. వాయురూప పశువులు (ఇడ, పింగళ నాడుల చలన నియంత్రణ) పాలును పిండి, స్వీకరించినచో, పాలు ఇవ్వని పశువులు దరిచేరవు సుమా!! (శ్వాస చలన నియంత్రణచే మనోతత్త్వములు నియంత్రణ పొందును. మనస్సు, శ్వాస ఒకదానితో ఒకటి ఆధారపడినది. మనస్సు నియంత్రించిన శ్వాస చలనం నెమ్మదించును. శ్వాసను అభ్యాసముతో సక్రమ పరచిన మనోచంచలములు వీడును.)

2876. జీవుని అంతరమున శిరస్సు సహస్రదళమున చిన్న ఎర్రని మొగ్గవంటి నాదమును జనింపజేసినది. ఆకాశతత్త్వంతో కూడినదైన దానిలో సత్యతత్త్వమును పదిలపరచి ప్రతిష్ఠింపజేసినచో, జీవుడు ఆ సత్యతత్త్వమును (శివుని) తన సొంతం చేసుకొనెను. (ఈ మంత్రంలో జీవుని కంసాలితో పోల్చబడినది.)

2877. దుఃఖము లొనగూర్చు విధియను పైరు ఈ శరీరమను భూక్షేత్రమున, అధోముఖః ధోరణిగా వెళ్ళు ప్రాణశక్తిని (నీరు) నిరోధించి ఊర్ధ్వముఖముగా చేసి, బాగుగా దున్నగల పశువుల సహాయంతో శివతత్త్వమును చేర్చుకొనినచో శిరస్సున వికసించిన శివపైరు తెల్లని ప్రకాశముతో కూడిన విత్తనము లభ్యమగును!

(బాగుగా దున్నిన పంటభూమిలో మొలకెత్తిన పైరును సక్రమముగా నాటి తగిన నీటిని ప్రవహింపజేసినచో శివం అను తెల్లని విత్తనములు సమృద్ధిగా పొందగలము - ఉపమానం.)

2878. ఇడకళయగు చంద్రకళ సహాయముతో శివచింతన యను ఎరువును వేసి, భావనలను విత్తనములు వెదజల్లి, ఇడ, పింగళనాడుల సహాయముతో శ్వాసగతి యను మొలకలను తగురీతిగా మార్చి అమర్చి, జ్ఞానసాధన యను అన్నమును పదపరచి భుజించగలిగినవారు శివపదమగు ఎర్రని బియ్యమును పొందు విధానమగును! (శ్వాసకళల సాయముతో, ప్రణవ ఉపాసనలతో, కొంచెం కొంచెంగా బిందు, నాదతత్త్వంలను పొందు విధానము.)

2879. బాగుగా పంటపండి శ్రేష్టముగా లభించినది (శివతత్త్వం పొందు ఉపాయము ఎరిగినవారికి బిందు మండలములో స్థితియైనది). ఎడున్నర గడియకాలము తదేకముగా నిలిచినది. అట్లు తదేకము నిలిచి, నిలిచి, నిలిచి (దీర్ఘకాలము

నిలిచినది) నెలకొన్నవారికి అది మూడురెట్లు ఆనందమును ఒనగూర్చును సుమా!! (ఆకాశమండల ప్రకాశములో స్థితిపొందిన వారికి మూడురెట్లు ఆనందము గలుగును – సహస్రారపు ప్రకాశములో స్థితిపొందుట.)

2880. హఠయోగంను వృద్ధిపరచుకొని జ్ఞానరహితముగా యున్నచో కీడే గలుగును: బంజరుభూమిని సాగుచేయువాని ఉద్దేశము ఏమని గ్రహించలేము. అట్లు సాగు చేయువాడు కూడ తన విధివిధానములను పూర్తిగా ఎరుగజాలరు. అట్లు సాగు చేయువాని ప్రయత్నం విఫలమై తన సాగు విషతీగల (కలుపు తీగలు) మధ్య చిక్కుకొని పాడు అగును. (బంజరుభూమి ఉపమానం = జ్ఞానశూన్యులకు చెప్పబడినది. వారి ఉద్దేశరహితంను ప్రయత్నం లేక వారి శ్రమ వృధాయగును. జ్ఞానమునకు భావన, విచారణలు చాలా ముఖ్యము; విషతీగలకు చిక్కుకొని = కామవాంఛలకు చిక్కుకొని కుండలినీశక్తిని వృధా పరచుకొనుట.)

2881. జీవితములో బద్ధులుగా జేయు బంధపాశ వలయమును శివాగ్నిలో దగ్ధము చేసినచో చీకటియను అజ్ఞానం తొలగి ప్రకాశము నెలకొనును: నాదమును గ్రహించ నీయక వంచనచేయు నక్కలు ఇమిడిన కామమనే సంచిని, బంధపాశముతోను శివాగ్నిలో దగ్ధము చేసి, చాలా కాలము నాదోపాసనలు చేసినచో, ప్రకాశము వృద్ధియై, శక్తికి నిలయమగుటచే శివుడు కూడ వచ్చి నెలకొనును!! (సక్రమయోగము అనుగ్రహమునకు దారితీయును.)

2882. శిరస్సుయగు పర్వతముపై వర్షము కురియగా, ప్రాణమగు జింక గంతులు వేసి యాడగా, ఊర్ధ్వసహస్ర దళము నుండి శివమగు ఎర్రని ఫలములు రాలగా, కమ్మరి కొలిమిలో పోసిన ఎర్రగా మరిగిన ఇనుము వలె ఆ శివుడు హృదయమున ప్రకాశమను అమృతమును ప్రశరింపజేసెను. (కమ్మరి = ఇనుపవృత్తికారుడు)

2883. పంచజ్ఞానేంద్రియములను నిగ్రహించి, అంతర్ముఖులైనచో బ్రహ్మానందము ఒనగూరునే!! బ్రాహ్మణుని యింట పాలిచ్చు పశువులు ఐదున్నవి (పంచ జ్ఞానేంద్రియములు). మేపువాడు లేక వ్యర్థ్యముగా తిరుగాడుచున్నవి (ఇంద్రియములు నియంత్రణ లేక). మేపువాడుండి (ఆత్మ శివమై – మేపువాడు) వాటిని నియంత్రించినచో పశువులు బ్రహ్మానందమను పాలు సమృద్ధిగా ఇచ్చునే!!

2884. అడవి పశువులు ఐదున్నవి (పంచప్రాణములు), సింహములు ముప్పదియున్నవి (పురుషుడు మినహా విద్యాతత్వములతో కూడిన ఆత్మతత్వములు – 30), మామిడి ఫలములు రెండు (దేహ సుఖ, దుఃఖము), దోషరహితమైనవి తొమ్మిది (శ్రవణం, కీర్తనం, స్మరణం, సేవనం, అర్చనం, దాస్యం, వందనం, సఖ్యం, ఆత్మ నివేదనం – 9) ఉన్నవన్నియూ తనలో వశమై, కామాది వికారములు వృద్ధిపొందక, స్థితి

పొంది, జ్ఞానప్రకాశముతో వెలుగుదురు. (దేహతత్వములు తన వశమై నవభక్తి విధానంతో మనస్సు పక్వపడి జ్ఞానముతో వెలుగును.)

2885. అపౌరుషేయములగు వేదముల సూక్ష్మవాక్కు తత్వమగు దానిని (ఓం), యవ్వన శోభతో యుండు కుండలినీ యను కన్య శిరస్సునకు చేరి నాదమును ఏర్పరచి, ఊర్ధ్వసహస్రమను పద్మమున నాదమను తేనెను త్రాగి ఆత్మయను కందిరీగ తేనె మత్తులో ఆనందమనుభవించినదే!!

2886. అశాశ్వతమగు శరీరము సత్యమని భావించి పంచేంద్రియ సుఖభోగములందు ఇముడుచున్నారు: శరీరము నుండి బయటకి వెళ్ళు అపానము, లోపలికి వెళ్ళు ప్రాణవాయువు కలియుచున్న ఈ దేహమును నేరడిచెట్టు ఫలములను భోగమును కల్పించునదియూ, వాటిని అనుభవింపజేయునదియూ నగు ఐదుగురు – పంచ జ్ఞానేంద్రియములు (అగ్నిలో), ఉడికి చెడిపోవుదురు ఈ శరీరమును ఆశ్రయించి ఉన్నారే. ఎంత విడ్డూరం!!

2887. మనస్సను వెదురు అగ్రమున ఏర్పడిన వైరాగ్యంమను చేదు గలదు (మనస్సు దృఢమైనది కాదు. అందులకే వెదురుతో పోల్చిబడినది). ఆ చేదుకు సంబంధించిన తాటిచెట్టు (వెన్నెముక)కు దిగువన ఒక పాము గలదు (మూలాధార కుండలినీ). ఆ పామును తరిమి పైకి ప్రాకించి అమృతము త్రాగనైతిరి. కావున ఆ వైరాగ్యమను చేదు పుట్టి నిష్ఫలముగా ఉండిపోయినదే!! (యోగసాధనలకు వైరాగ్యము ఆవశ్యకము. కుండలినీ జీవశక్తి సహస్రారమునకు ప్రాకించి అమృతం సేవించుటకు వైరాగ్యము ఉపయోగపడనిచో అటువంటి వైరాగ్యం నిష్ఫలమే కదా!!)

2888. ఆత్మ ఇమిడిన దేహము దశనాడులు మొదలగువాటితో కూర్చబడి పంచావస్థలకు లోనగు తత్వము గలది: పెద్దపులులు పది (దశనాడుల పేర్లు గ్రంథ ఆరంభ మంత్రములలో వివరణ చూడగలరు), ఏనుగులు పదిహేను (పంచభూతములు + పంచ తన్మాత్రలు + పంచప్రజ్ఞలు = 15), జాలము చేయువారు ఐదుగురు (పంచ జ్ఞానేంద్రియములు), వినోదకులు పదిమంది (దశవాయువులతో వినోదము చేయువారు), గుణవంతులు మూవురు (సత్త్వ, రజో, తమోగుణస్తులు), వైద్యులు ఆరుగురు (పంచవృత్తులు చేయువారు + శివం = 6, ప్రాణంతో నెలకొన్న వైద్యులు), అన్నిటికీ పైగాయున్నవారు ఐదుగురు (దేహమున ఇమిడి ఆత్మ పంచావస్థతలకు గురియగును – జాగ్రద, స్వప్నం, సుషుప్తి, తురీయం, తురీయాతీతం = 5).

2889. ఈ ఊరిలో రెండు వృషభములున్నవి (ఈ దేహమున ఉచ్ఛ్వాస, నిశ్వాసలు). ఈ రెండు వృషభములకు మేపువాడు ఒక్కడే (జీవుడు ఒక్కడే). రెండు వృషభములను లాగి పట్టినచో (జీవుడు శ్వాసచలనమును నియంత్రించుటకు వాటిని లాగి పట్టినచో),

రెండు వృషభములు కలిసి ఏకమగునే!! (ఉచ్ఛ్వాస, నిశ్శ్వాసలు నియంత్రణకు లోనై, సుషుమ్ననాడిలో ఇమిడి ఏకమగును.)

2890. జ్ఞానసాధకుడు మనోమండలమను తోటలో ఇష్టాఇష్టములు లేక సమత్వబుద్ధితో పరిపక్వపడి, దైవధ్యాసలో మనస్సును పదిలపరచి, పత్తివంటి తెల్లని ప్రకాశము శిరస్సున వెలయునట్లు భావించినచో, అదే ముక్తికి వెళ్ళదగు దారపు నిచ్చెనగా మారి, మూవురి ఊరిలో (బ్రహ్మాది త్రిమూర్తుల దేహమను ఊరిలో) నిత్యము నెలకొని పూర్ణత్వం పొందెనే!! (నిర్విరామ సాధనచే ఆకాశతత్వములో నెలకొని పూర్ణత్వం పొందుట.)

2891. నాదసామీప్యములో స్థితిపొందుటచే అల్పజ్ఞానము గల జీవుడు అజ్ఞానమార్గమున వెళ్ళక కాపాడబడుచున్నాడు: గుడ్లగూబ (అజ్ఞానమునకు ప్రతీక), పాము (కామాగ్ని యగు పాము), చిలుక (ధర్మమునకు ప్రతీక), పిల్లి (అధర్మమునకు ప్రతీక), గోరింక పిట్ట మొదలగునవి దేహపు మనోమండలము వద్ద ఆవరించుయున్నవి. గోరింకను మ్రింగుటకు గుడ్లగూబ సమీపించునపుడు (అజ్ఞానము ధర్మమును నశింపజేయుటకు) జీవుడగు ఎలుక నాదము చేసి శబ్దించుటచే (అజ్ఞానమార్గమున వెళ్ళక జాగ్రత్తపడుట) దాని నోటినుండి తప్పించుకొనెనే!!

2892. సద్గుణములను సర్వదా తలంచి, భాషించియూ యున్న మనస్సు బాహ్యవిషయము లందు వెళ్ళక బుద్ధిలో అణిగియుండును: పంచభూతాక్మమైన ఈ శరీరము త్రిగుణములతో కూడినదై వాసనలతో నిండుటచే జీవుని మనస్సు బాహ్యవిషయము లందే అల్లాడును. అట్లుకాక కొలిమియగు ఈ శరీరములో వాసనలను కలిచివేసినచో, త్రిగుణరహితమై (సత్త్వ, రజో, తమో) జీవుని మనస్సు ఈ కొలిమి శరీరమునుండి బాహ్యముగా వెళ్ళజాలక బుద్ధిలో స్థితియగును.

2893. అజ్ఞానమయముగా నుండు జీవతత్వములతో కూడిన దట్టమైన అడవిలో ప్రవేశించిన జీవుడు శివతత్వమగు చిదాకాశమును దర్శించజాలడు. ఈ శరీరగూటిలో పంచ ప్రాణములను ఐదు గుఱ్ఱములు, తిరోభావనలో ముంచివేయగల షడరిష్టములగు ఆరు ఒంటెలు ప్రవేశించినవి. ఈ తిరోభావనలు లేకుండినచో జీవుడు జీవ, పర, శివ తురీయములను దాటిన స్థితిలో నెలకొనునే!!

(మాయ యొక్క విక్షేప, ఆవరణ శక్తులతో జీవుడు కట్టబడి, రజో, తమో ప్రధానములగు గుణములకు లోనగుచున్నాడు. సత్త్వగుణ ప్రధానమగునపుడు జీవునికి తురీయం ప్రాప్తించును.)

2894. భోజనం సమకూర్చగలది, రత్నాలు పొదిగిన వస్త్రధారణ, నూనెవంటి మెరుపు శరీరము, మెరయు కంఠాభరణము, వడ్డాణం, తలుకుమను గాజులు ధరించిన

స్త్రీలయందు మోహమేర్పడినవారు, బండరాతిపై ఎండబెట్టిన వస్త్రమువలె ఎగిరిపోయి, కామాది షడరిష్టములగు (6) ఆరు బావులలో పోయి పడుదురు సుమా!!

2895. చిదాకాశమగు బట్టబయలులో మనస్సు పదిలపరచి ధ్యానించువారికి పరాశక్తి అనుగ్రహమునకు పాత్రులగుదురు: చెఱువు మధ్యలో ఉండు ద్వీపము వంటిదియూ, శిరస్సులోని పర్వతాగ్రమను (సహస్రదళములోని సరస్సు మధ్యన ఉండునది) చిదాకాశములో మనోవృద్ధిని గమనించదలచి ఉదయం, మధ్యాహ్నము, సాయంత్రము మూడుపూటలు చిత్తముంచి జ్ఞానసాధనలు చేయువారికి, వారి కీడులన్నిటినీ సమూలముగా తొలగించుటకు పరాశక్తి తోడున్నది. ఈ పరాశక్తి తోడులేక శివుని ఊరిని (శివభూమిక) గ్రహించలేము సుమా!!

2896. ధర్మమగు చిలుక, అధర్మమగు గ్రద్ద, సుఖదుఃఖములను మేళతాళములు వాయించగా, మార్పునొందిన స్త్రీలు శివుని మనువాడిరి. దీనివలన వారు తమ తపోఫలము వలన ఆకాశతత్వ దేహమును (బృహత్) పొందిరి. అట్లు పొందిన ఆకాశతత్వములో శివానందము అనుభవించుచుండిరి.

(మార్పునొందిన స్త్రీలు: తపోధనముచే పరిపక్వపడిన/సంస్కరించబడిన జీవులు స్త్రీలింగముగా; శక్తి జీవునితో లయమొందుట.)

2897. జీవుని గమ్యము శివైక్యమే. జీవునిలోని ఇంద్రియములు సత్తాది విషయవాసనలను గ్రహించలేనిచో తన భావనలు వృద్ధియై, ప్రకాశమయమగును: ఇంద్రియములను పక్షులు సత్తాది విషయములతో బంధము ఏర్పరచుకొని, వాటికి లోనై, వాటి విషయానుభవములతో ఏమి ఒనగూరును? (సఫలమొనగూరదు). కాని తపోసాధనలతో మూలాగ్నిని రగిల్చి భావనలను వేడినేతిని భుజించిన యెడల, అండకోశమును ఆవరించియున్న చీకటి వైదొలగి ప్రకాశవంతమగును కదా!! శివతత్వం పొందుటకు ఇదే సుగమనమగునే!!

2898. ఆకులు లేవు (నిర్గుణ బ్రహ్మంలో శబ్ద, స్పర్శరూపాదు పంచములు లేవు), పూవు ఉన్నది (ప్రకాశమగు పద్మము గలదు). కందిరీగ లేదు (విషయ వాసనలను చవిచూడు కందిరీగ లేదు). శిరస్సు లేదు (ఆదియగు నిర్గుణ బ్రహ్మంనకు శిరస్సు లేదు). వేర్లు ఉన్నవి (నిర్గుణబ్రహ్మం సగుణ వేర్లతో సమ్మేళనమైయున్నది). పాదములు లేవు (నిర్గుణ బ్రహ్మంనకు సగుణ పాదములు లేవు). పూలగుత్తు లేదు (పువ్వులు గుత్తులుగా లేవు). కోయుటకు పూవు గలదు (సృజించబడుటకు ప్రకాశమను పూవు గలదు). వేడి శిరస్సు లేదు (కిరణములతో కాల్చబడు శిరస్సు లేదు). వంగిన కొమ్మలు లేవు (కర్మకాండ చర్యలు నిర్గుణబ్రహ్మంనకు లేదు). ఈ మంత్రము నిర్గుణబ్రహ్మ స్వరూపమును తెలుపునది: అశ్వత్థచెట్టుతో పోల్చి, ఆది, అంతము

లేనిది. వేర్లు ఊర్ధ్వముఖముగా ఉండి, శాఖలు క్రిందికి ఉండినదే "సనాతనం, మహత్, శుద్ధం, అమరం, సమస్త లోకాలు ఇందు ఇమిడినవే. దీనికి అతీతము ఏదియూ లేదన్న తత్వం" – శ్రుతివాక్యం – కఠ. ఉప॥.)

2899. సగుణ ఒడ్డును దాటి నిర్గుణబ్రహ్మయగు అశ్వత్థవృక్షము దర్శించి, నిర్గుణబ్రహ్మమగు శివుని సదా ధ్యానించుచుండు వారికి దుఃఖకారణములగు పంచక్లేశంలు (అవిద్యా, అస్మిత (అహంకారం), రాగం, ద్వేషం, అభినివేశం (చిత్తమోహం)) గ్రహించబడి నిర్గుణబ్రహ్మంనందు శరణునొంది సత్ఫలితము పొందుదురు.

2900. దట్టమైన అడవిలో తగుల్కొన్న జీవుడు ఎలుగెత్తి పిలుచుటచే, ఆ కారడవిలోనున్న తెల్లని రక్షకులు (తెల్లని శుద్ధ ప్రకాశం), నల్లని దొంగలగు ఐదుగురిని (పంచ జ్ఞానేంద్రియములు) తరిమిగొట్టుటచే జీవుడు స్వాంతము పొంది, తన గూటికి చేరుకొనెను!! (శివప్రకాశము తోడై ఇంద్రియచేష్టలు దాటి సహస్రములో (తెల్లని శుద్ధ ప్రకాశము) నాదము శబ్దించి స్థితిపొందుట.)

2901. జ్ఞానము, అజ్ఞానములగు తెల్ల కలువలు, ఎర్ర కలువలు పూచిన సంసారమనెడి తటాకము ఒడ్డున నామ, రూపములగు వేము, విషపుచెట్లు గలవు. విషపుచెట్లను త్రోసిపుచ్చి సత్, చిత్, ఆనందమగు అరటిపండు, పటిక పంచదార, తేనెను కలిపి తిని, అనుభవించనివారు మోహమును పురికొల్పు విషయవాంఛలతో గలుగు ఫలమును భుజించి చెడుచున్నారే!! (జీవుడు కీడునొనర్చు నామరూప లౌకిక విషయ భోగములను త్రోసిపుచ్చి శివబోధను గ్రహించవలెను.)

2902. శివుడు నెలకొన్న ఆత్మ (జీవాత్మ పక్వపడుట పూర్వము) పృథివి యొక్క సహజ జీవ సంకల్పమునకు తగ్గట్లు నెలకొని, బంధములో చిక్కుకొని, జీవ స్వరూప ఫలమును మనస్సు ద్వారా అనుభవించును. కుడికంటిపై నెలకొన్న ఆత్మ మనస్సు మూలముగా దుఃఖముతో గూడ సుఖమునూ అనుభవించును. (కుడికంటికి పైభాగమున సూర్యాంశమగు ఆత్మ నెలకొనియున్నది – శ్రుతివాక్యం.)

2903. దైవానుగ్రహము లేక ఆత్మ అఖండ జ్ఞానస్వరూపమును గ్రహింపజాలదు కనుక (జీవాత్మ) పక్వపడుటకు ముందు ఇంద్రియ విషయములతో, అల్పభోగములందు ఇమిడి పరిమితమైన పెరటిలో గ్రాసము మేయు జీవాత్మలగు పశువులను ఆదుకొనుటకు గాను శివుడు వాటి అల్పజ్ఞానము నుండి వేరుపరచు తనయందు ఇముడ్చుకొనును!!

2904. కుడినేత్రమగు విశాల తటాకములో సూర్యకళయగు ఎర్రతామర పూచినది. ఎడమనేత్రమగు లోతైన తటాకములో చంద్రకళయగు నీలికలువ పూచినది. తగిన జ్ఞానసాధనచే రెండింటిని సమ్మేళపరచి సుషుమ్నానాడిలో స్థితిపొందినచో, లోతైన

తటాకములో ఆనందమను పెద్ద కర్బూజీపండు లభ్యమగునే!!

2905. కామాది షడరిష్టములను పక్షులు పంచభూతాత్మక శరీరములో ఇమిడియున్నవి. ఇది శిరస్సు పైభాగము నుండి అధోముఖముగా వంద (100) నాడుల పక్షులుగా విషయవాసనలను చవిచూచుచున్నవి. కాని జీవశక్తి షట్చక్ర ఆధారములను దాటి పైకి ప్రాకినచో దోషరహితమైన (శివుడు వెలయు) పథమును పొందును సుమా!!

2906. పర్యంకయోగ సాధనలచే వీర్యజయమొంది ప్రకాశమును పొందగలరు: పర్యంక యోగచర్యల ద్వారా యోనియను చెఱువులో గుండ్రని భూమిలో పొందిన సుఖానుభవమగు ఊటనీరు పొంగును. వీర్యశక్తిని నిగ్రహించి బయటకి వెళ్ళనీయక మధ్యనాడితో కట్టడి చేసి (వీర్యజయం పొందుట) శరీరమునందే స్థితి పొందునట్లు చేసినచో ప్రకాశము పొందుదురే!!

2907. చిదాకాశమే అన్నిటికీ ఆధారముగా ఉండి అన్ని భావనలు అందే ఉద్భవించును: ప్రపంచమును ఆవరించియున్న సప్తసముద్రములును, ఎత్తైన అష్టపర్వతములును, అంతటినీ కప్పియున్న ఆకాశమును, అగ్ని, జలము, వాయువు సర్వత్రా వ్యాపించిన భూమండల తత్వములను క్షుణ్ణముగా గ్రహించినవారు సుదీర్ఘముగా జీవించగలిగి ఆకాశమే వారికి ఆలయమగును సుమా!!

(ఆ = ఆత్మ; లయం = స్థితిపొందుట; సహస్రదళమే ఆకాశాంశము.)

2908. ఆలింగనముతో (భార్య భర్తలిరువురు) అంతరమున ఉష్ణము జనింపజేసి, గర్భం నందు శరీరమును ఏర్పడుటకు కామచేష్టలు ప్రకంపనలతో పిండమును ఏర్పరచిన పిదప, కూటస్థ పక్షుల (ఇంద్రియ) మోహము నుండి విడదీసి, లౌకిక విషయార్థమున నున్న మనస్సును త్రిపి నిగ్రహ పరచినదే!!

2909. వివాహ వేడుకకు మేళతాళములు (బాజాలు), మంగళ సూత్రములు రెండే నిరూపణలు. కానీ ఈ రెండింటికంటే బలమైనది ఇనుప గడ్డపార (గునపము). మేళతాళము శబ్దించుటయూ, తాళి మెడకు కట్టుకొనుటయూ ఇతరులులకు తెలియజేయుటకే తప్ప, మేళతాళము, తాళి, గడ్డపారలు కన్నా ప్రేమతో నెలకొన్న ఈశ్వరానుగ్రహమే చాలా బలమైనది సుమా!!

2910. అసత్యమగు సవికారపు జగత్తను చేపను చూస్తున్న కొలది అందే నిమగ్నమగుదురు. శివమగు కుందేలును పొందగోరువారు మూడింటిని దాటి (చర్య, క్రియ, యోగములను) కొంచెము కొంచెముగా జ్ఞానము పొందుదురు. వీటిని వదిలి అనవసర తర్కవాదమునకు (కుతర్కవాదం) దిగువారు వేదస్వరూపుడగు నిత్యమైన, సత్యమైన శివంయను ధృవం అగుదురో? కాజాలరు సుమా!!

2911. ఆశలను తుంగగడ్డి, తీగలను బంధపాశములు విరివిగా అల్లుకొని నీరు కనిపించ

నంతగా నిండియున్న (కోరికలు బంధములు నిండిన చిత్తం) చిత్తమను తటాకములో చేపల కొరకు కాచుకు కూర్చున్న కొంగవంటివాడు కాదు నా నాధుడు - శివుడు. ఎటువంటి చలనము లేక నిలుచున్న బండరాతివంటి చిత్తములో నిలుచుండి తటాకములోని జీవుడగు చేపను పట్టువాడు (నా నాధుడు) సుమా!!
(చిత్తశుద్ధియైనచో శివం ఆదుకొనును.)

2912. త్రిమాత్రలగు "అ, ఉ, మ"లతో నిండిన తోటయూ, దానికి పైభాగమున అర్ధమాత్ర అక్షరమగు "మ్"యగు అడవియూ, దేహము, శిరస్సులో ఇమిడిన రెండు తత్వము లగును. దేహము, శిరస్సుయని హద్దులు నెలకొల్పక వృత్తులు చేయువారు శీఘ్రముగా ప్రణవమును దాటి జ్ఞానప్రకాశమగు శివభూమిని చేరగలరు సుమా!!

2913. అఖండ శివంను పొందు తపస్సు సఫలమైనచో ఇక కర్మలను సేద్యంతో పనిలేదు. తలంపులను వర్షము కురవనక్కరలేదు. శివభూమిలో శక్తి నెలకొనుటచే మలదోష జనితమగు విధి ఇక ఉండజాలదు. దోషరహితమగు ప్రకాశ కిరణములతో శివుడు - జటాధారుడు నెలకొని వెలయును సుమా!!

2914. భావనలు చిత్తమున శివమయమై పదిలమైనచో ఇంద్రియజ్ఞానములు పనిచేయవు: జీవుడు నిష్క్రియగా ఉండిననూ ప్రాణశక్తియగు సూర్యుని ఆధిపత్యముచే పన్నెండు (ద్వాదశాదిత్యులు) విధములుగా వృత్తులు చేయును. కాని శరీరమునకు అతీతముగా చల్లని చంద్రమండల ప్రకాశము స్థితిపొందినచో, మధురమగు తేనె - శివఫలము స్రవించి, ఇన్నాళ్ళున్న పంచేంద్రియ జ్ఞానచలనములు, ప్రకంపనలన్నీ అణిగిపోవును!!
(సహస్రదళము - చల్లని చంద్రమండలము.)

2915. ప్రణవమను తెప్ప ఎక్కి, సహస్రదళమగు చంద్రమండలములో నెలకొని మహాఫల మధురమును రుచి చూచుట: ప్రణవమను తెప్ప ఎక్కి చిదాకాశమయమైన సముద్రములో పయనించి, చీకటి తొలగించుకొను వ్యాపారము చేసిన జీవుడు మహాకార్యోన్ముఖుడై నీలిప్రకాశమును (దైవత్వము) పొందగోరి మనోగారడి చేష్టలను విడనాడి, తేనెవంటి మహాఫల మధురతత్వమైన చంద్రమండల చల్లదనములో (అప్పు - జలముతో నిండిన) స్థితిపొందును.

2916. మూడు నదీపాయలతో మూడు అరటి చెట్లున్నవి (తమో, రజో, సత్త్వ గుణ పాయలలో జాగ్రద, స్వప్న, సుషుప్తి అవస్థాత్రయములున్నవి). అవి త్రిమల దోషములతో ఎర్రని ఛాయ గలిగియున్నవి. కాని వీటిని వదిలి శివప్రేమను పదిల పరచుకొన్నవారికి అసత్యమును సత్యముగా మాట్లాడు స్త్రీ కామవాసనలను ఘూణించుచున్ననూ, వారి స్థితి నుండి తప్పిపోక మధ్యస్థములో ఉందురే!!
(మధ్యస్థము = సుషుమ్నలో నెలకొన్నవాడు.)

2917. శివయోగప్రాప్తి దేహతత్వములన్నిటినీ పారద్రోలును: ఆది (మూలాధారము), అంతము (సహస్రారము) గలది అత్తివృక్షం (వెన్నెముక). అంతమగు శీర్షమున వెదురు కన్నులు వలె సోమ, సూర్య, అగ్నుల కళలు మూడున్నవి. ఈ మూడుకళలు ఏకమై ఏకచక్రాధిపత్య జండాను ఎగురవేయుటచే పంచములన్నీ తొలగిపోయినవి (కీడులేర్పరచు పంచజ్ఞాన కర్మేంద్రియములు). విజయచిహ్నముగా శంఖు (వళంబురి శంగు = దక్షిణామూర్తి శంఖు) పూరించబడినదే!!

(దక్షిణామూర్తి శంఖు పూరించుట పుణ్య, దైవకార్యములకు ఉపయోగపడునది. దీనికి కుడిప్రక్కగా కాళీస్థలముండి, పట్టుకొనుటకు వీలుగాయుండును. పాంచజన్య శంఖు ఈ రకము లోనిదే.)

2918. పంది (కోరికలు), పాము (కోపము), పశువు (చెడుతో ఐక్యము), కోతి (చపలత్వము) ఇవియన్నియూ ఏకమైన నక్కల గుంపు (మనోవికార, వంచనల సమూహముతో)ను చక్కగా విశ్లేషించి, గ్రహించి, సమపరచిన చిత్తముతో శివనందు స్థితిపొందిన పిదప జీవుని జీవబాధలన్నీ కొంచెం కొంచెంగా తగ్గుముఖము పట్టునే!!

2919. తామరమొగ్గ వంటిది సహస్రారమున ఒకటి గలదు. జీవతత్వములు వీడునపుడు ఆ మొగ్గ ఊర్ధ్వముఖముగా మారి వికసించునది సృజించనగును. దేహతత్వ బంధ పాశములను తొలగించునపుడే అది ప్రకాశమును దర్శింపజేయును. బంధపాశములలో కూరుకుపోయినవారు ఈ వికసించిన పద్మమును దర్శింపజాలరు సుమా!!

2920. చిదాకాశములో పచ్చని ప్రకాశమును దర్శించినవారు అధోముఖ ఇంద్రియములకు వశపడినవారు: జలము లేక భావనల ప్రవాహములతో కూడుకున్న సహస్రారమను దివ్యభూమిలో మరకత (పచ్చని) ప్రకాశము వెలుగును. జ్ఞానసాధనలు చేసి ఈ సత్యమును గ్రహించజాలరు. అనావృష్టికి లోనైన ప్రాంతములో నీరుయను భావనలు ఏమని బాగుగా విశ్లేషించినచో ఈ నీరు ఇంద్రియములకు వశపడిన మనస్సు యొక్క గారడిచే ఏర్పడినదని, అశాశ్వతమని గ్రహించగలరు సుమా!!

2921. జీవుడు గురుముఖతఃగా అసత్యమైన జగత్తు ఒక మాయకార్యమని గ్రహించినపుడు జనన, మరణములు తొలగి శివమగును: అజ్ఞానముతో కూడిన గుడ్లగూబ జీవుడు గురుముఖతఃగా గ్రహించబడి మాణిక్య ప్రకాశమునకు లోనై, త్రిగుణాత్మకమైన మాయయే ఈ జగత్తని గ్రహించినపుడు, నాగమువంటి కుండలినీశక్తి మధ్యనాడి ద్వారా సహస్రారము చేరి నాదమును ఏర్పరచి స్థితిపొందుటచే, జనన, మరణములను జయించినవాడై శివమగును సుమా!!

(గురుపథమను ప్రకాశమును మాణిక్యముతో పోల్చబడినది.)

2922. అరటిచెట్టు యను సుఖము, సొరకాయ యను దుఃఖములు జీవునికి వచ్చి నెలకొనును: అరటిచెట్టుపై సొరకాయతీగ అల్లుకుపోయిన తీగ మహాబలిమిని పొందును. సుఖములకన్నా దుఃఖములు బలిమియని అందురు. సుఖదుఃఖములు దేహబంధములచే ఏర్పడినవని భావించి, వాటిని నివృత్తించినచో, అరటిచెట్టు వలె సుఖముగా (శివానందముతో) ఉండుటయే శ్రేష్టమగును. (అరటి, సొరచెట్లు రెండింటినీ నరికివేసిననూ, అరటి మాత్రము మరల మొలకెత్తును.)

2923. భూమిని త్రవ్వి, సముద్రనీటిని పారించి, అందు చేపలు పట్టు బెస్తవానికి పెద్ద బలిసిన చేప చేజిక్కినదే!! ఈ ప్రయత్నమును మాని భూమిని త్రవ్వి పైరు పండించినచో తాను చాలా సంపన్నుడగుటయేగాక అందరికీ ఆహారము లభ్యమగును కదా!! (స్వాధిష్ఠానమను భూమిలో సముద్రపు ఉప్పునీరుయను వీర్యము పారించి, లాభించుటకంటే, వీర్యజయమొంది, పక్వపడినచో శివమను సంపదయూ, అమృతానందము వశమగునే!!)

2924. శబ్దించుటచే శరీరములో స్పందనలు ఏర్పడి దేహము వృద్ధియగును (ఇది బ్రహ్మ సృష్టిని కుమ్మరితో పోల్చబడినది – నెలవంక చంద్రుని అంశమగును). ఇందు పిలుచుటకుగాను శంఖునాదం శబ్దించును. ఆ మార్గముననే వెళ్ళి నాథుని ఆనందమును జీవుడు పొందనగును. చంద్రకళ, సూర్యకళలు ఏకమై సుషుమ్నతో శివపదము పొందునపుడు కుమ్మరి, మంత్రిపదవి ఏకమే సుమా!!

2925. విషయవాసనలు జ్ఞానసాధనకు నిరోధకములని గ్రహించి, వాటిని త్యజించవలెను: దేహమను ఛత్రమును (గొడుగు) వదిలి చిత్తమగు దేవాలయపు బ్రరై నాదసామీప్యము గోరి వెళ్ళినది. కాని లౌకిక విషయాదులను సైన్యమును తలంచినపుడు చిత్తము నాదసామీప్యం వదిలి దేహము వంక చూచినది. ఆత్మవశములోనున్న బుద్ధియను మంత్రి సత్యమును బోధపరచుటచే, లౌకికులు వలె నవద్వారముల మార్గమున వెళ్ళక శరీరమునకు అతీతమై వెలిగినదే!!

2926. బయటకి వెళ్ళు అష్టములు (అకార కళయగు చంద్రకళ – 8), లోపలికి ప్రవేశించునది పదునెనిమిది (సూర్యకళ – 18) కళలతో నవద్వారములు వృత్తులు చేయుట వలన కుండలినీయూ, చంద్రకళలును, నివృత్యాది చతురకళలును (నివృత్తి, ప్రతిష్ట, విద్యా, శాంతి) సమ్మేళనమై స్వారీచేయు శివుని గ్రహించి ఉన్నతి పొందకుండినచో పందికన్నా అధమమైన స్థితి పొందుదురు!!

2927. శివానుగ్రహము పొందిన జీవునికి తన విషయవాసనలన్నీ తనంతట అవే తొలగి పోవును: కామాది షడరిష్టములతో పచ్చని పాచిపట్టి నెలకొన్న చిత్తమను చెరువును, మోహవలయముతో నున్న జీవుడగు కొంగ విషయానుభవములను చేపలను

తినును. ప్రకాశమయ ధ్వజం గలిగిన శివుడను మహావీరుని తోడు దొరికినపుడు బంధపాశములన్నియూ పటాపంచలై తొలగిపోవును!!

2928. జ్ఞానసాధనలతో స్థితిపొంది, బాహ్యదృష్టిని వదిలినవారిని శివుడు నాదమును బహిర్గతముచేసి ఆదుకొనును: కుంభము వలెనున్న శిరస్సు పర్వతముపై సహస్ర దళమను ఒక కొమ్ము గలదు. ఆ కొమ్ముపై ప్రాణణయను వాయువు ముట్టడించును. అచ్చట శివానందమను పద్మములో శివం అగు కందిరీగ నాదమును ఝుంకారించి జీవునితో కలిసి నెలకొనును.

2929. జీవుడు ఉన్నతి పొందవలెనన్న తన్ను శివుని సొంతం చేయవలె: వీణ, పిల్లనగ్రోవి నాదములు రెండు కలిసి శబ్దించగా, శివుడు నెలకొని సక్రమముగా కేవల కుంభమును పొందునట్లు చేసెను. అప్పుడు జీవుడు తన్ను తాను శివుని అర్పించుకొనుటయూ, అతని నుండి అనుగ్రహము పొందుటయూ ఒక వ్యాపారరీతిగా (ఇచ్చి పుచ్చుకోవడములు) జరిగినది మన హక్కులను ఆ శివమయ పరచుటకే సుమా!!

2930. శివానంద మొసగువారితో ఇచ్చి, ఇచ్చి వ్యాపారము చేయుట, తురీయభూమిలో వెళ్ళి సృజించుట (అహం స్ఫురణ)కే!! తప్ప పరిశోధనలు, విశ్లేషణలతో గ్రహింపబడు తత్త్వం కాదది. చంద్రమండల ప్రకాశము పొంది చీకటియే తన సహజ స్వరూపమని గ్రహించినవారు తురీయభూమి స్థితిపొంది సత్యమును గ్రహించి, బాహ్యమును త్యజించినవారే సుమా!! (ఆత్మ ప్రకాశము గోచరించుటకు ముందు సహజమైన చీకటి, శూన్యమే కనబడును. ఆత్మతత్త్వము సృజించబడునదే (తనకు తానుగా) తప్ప ఎటువంటి ప్రత్యక్ష, పరోక్ష ప్రమాణములకు గోచరించబడదు.)

2931. సహస్రదళ పద్మములో బంగారుఛాయలో మధ్యన ఊదారంగుతో జీవునిలో శివుడు నెలకొని స్థితిపొందును: బంగారుఛాయ పద్మములో ఊదారంగు పుప్పొడి రేణువులు చుట్టూ వెదజల్లబడి, దోషరహితమైన స్థితిలో శివుడు నెలకొనును. ఇది శివుడే కోరి ప్రేమించి జీవునిలో నెలకొన్న శివభూమియగును.

2932. దైవమే తోడుండి పక్వపరచి పంచకోశములను దాటించును: ఆత్మతో ఇమిడిన దేహతత్త్వములన్నియూ తమతమ ఇష్టానుసారముగా ప్రవర్తించి, దేహములో తమ చేష్టలు ద్వారా అగ్నిని రగిల్చి నిలుచుండును. అపుడు దైవము వాటి తత్త్వ సరిహద్దులను ఎరిగించి (వినాశరహితం చేసి) వాటి బారినుండి తప్పించి, పంచకోశ చేష్టల నుండి తప్పించి నిలబెట్టును సుమా!! (శరీరత్రయమే పంచకోశములు ద్వారా వృత్తులు చేయును; అన్నమయకోశము = స్థూలశరీరం, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములు మూడు = సూక్ష్మశరీరం, ఆనందమయకోశం = కారణ

శరీరం; కాని ఆత్మ శివతత్త్వము, శరీరత్రయ, పంచకోశముల విలక్షణం; అవస్థాత్రయముల సాక్షి – అన్ని అవస్థలను తానే సాక్షియుండి అన్నిటినీ చూచునది. ఎప్పటికీ అది చూచునదే తప్ప ఎవరిచేతను చూడబడునది కాదు – శ్రుతివాక్యము.)

2933. జ్ఞానసాధనలు చేసి మామిడిపండుయను నిష్ఠ చేకూరనిచో, బాహ్యముగా వెళ్ళి నక్కచేష్టలు (చర్య, క్రియాదులు) చేసినచో, ఏమి లాభము? నాధుని తలంచి, వాని ధ్యాసతో నిష్ఠ కొరకు ఏకాగ్రతతో చేయవలె. ఉపదేశము ఇచ్చిన గురువు సాధనకుని నిష్ట చేకూరలేదన్నచో ఏమి చేయగలరు?

2934. సూర్యోదయము (ప్రకాశము కనిపించినంతనే) అయిన వెంటనే శివతత్త్వమగు పక్షులు శబ్దించి (నాదము ఏర్పరచి)నవి. ఆ ప్రకాశము ఏర్పడినంతనే అనుగ్రహాశక్తి శిరస్సున స్థితిపొందగా, శబ్దము ఏర్పరచిన ఆ అనుగ్రహశక్తితో జీవుడు పరభోగము నందు నెలకొనును. జీవుడు సదా ప్రకాశముతో నెలకొనియుండుటచే ఉదయించుట, అస్తమయయములు ఇక ఉండవు కదా!!

2935. జీవుడు బ్రహ్మాది ఐదుగురు నుండి విడుపడునపుడు శివమగును: చిదాకాశ మహా ప్రకాశతత్త్వములో జీవుని చేర్చుటకుగాను ప్రణవమను ఒక తెప్పగలదు. కానీ ఈ ప్రణవమను తెప్ప (నది దాటించుటకు) గోచరము కానీయక బ్రహ్మాది ఐదుగురు నెలకొని యున్నారు. తనను ఇచ్చి (జీవుడు తన్ను సమర్పించుకొని) శివుని పొందు వాణిజ్యము చేసిన యెడల, తనతో ఉన్న తత్త్వములు తొలగిపోయి ఇది అది అగునే!! (జీవుడు శివమగునే.)

ఈ శూన్య సంభాషణ అధ్యాయమంతయు బాహ్య వ్యవహారములను పెక్కు ఉపమాన, ఉపమేయములతో పోల్చబడి సత్య, నిత్యతత్త్వమైన, నిగూఢమైన, పారమార్థిక సత్యం గురించే చెప్పబడినది. సత్య స్వస్వరూపజ్ఞాన మెరుగుటయే జీవిత పరమార్థమని, గమ్యమని బోధించి యున్నది.

జీవుడు స్వప్నప్రపంచములో ఉన్నంతవరకు కలయంతయూ సత్యమని భావించును. కల చెడి మెలుకువ వచ్చునపుడు తాను కలగంటినని తలంచును. అట్లే జీవుడు జాగ్రదావస్థలో, వ్యవహార జగత్తులో వృత్తులు సలుపునంతవరకు శరీరం, జగత్తు సత్యమని భావించి వాటితో మామేకమై, దేహేంద్రియ మనోబుద్ధులన్నీ, జగత్తు విషయవాసనలన్నీ సత్యమని భావించి భ్రమపడును (అన్యథా గ్రహణము).

ఇవి మాయయొక్క విక్షేపణశక్తి, ఆవరణశక్తుల యొక్క గారడియనియూ, మాయా కల్పిత దేశకాల కలనా వైచిత్ర చిత్రీకృతమని గ్రహించినపుడు ఈ వ్యవహార జగత్తు వృత్తులను త్రోసిపుచ్చి, పారమార్థిక సత్యతత్త్వమును గ్రహించనగును.

గురుముఖతఃగా గ్రహించబడు ఈ పారమార్థిక సత్యము ఆత్మనాత్మ వివేకముచే

తన నిజస్వరూపమగు ఆత్మతత్వమును గ్రహించును. తన సత్య, శాశ్వత తత్వమే శివ/బ్రహ్మ/ఆత్మ తత్వమని, శాశ్వత ఆనంద, శాంతి, భద్రతలకు నెలవని బోధపడును.

"ఈ బ్రహ్మ/శివ/ఆత్మతత్వము: సత్, చిత్, ఆనంద స్వరూపము, విశుద్ధం, పరము, స్వతఃసిద్ధం, నిత్య ఆనందరసం, నిరంతరం, ప్రత్యక్ అభిన్నం, జయతి – ఎపుడూ జయప్రకాశమై ఉండునది. నిర్వికారము, మాయాతీతం, నిర్గుణం, సత్యం, జ్ఞానం, అనంతమైనది" – శ్రుతివాక్యము.

ఈ ఆత్మతత్వ మెరుగుటయే జీవిత పరమార్థం, భక్తికి, సాధనలకు పరాకాష్ఠ.

## 18. మౌనసమాధి

(మౌనంలో స్థితిపొందుట. సహజనిష్ఠ. ఇది ప్రణవయోగంతో చేకూరునది)

2936. మౌనసమాధి చేకూరినవారికి ఎటువంటి అవరోధులు లేని సహజనిష్ఠలో నెలకొందురు: ప్రణవయోగములో నిలుచున్నారు, ఉన్నారు, వెళుచున్నారన్నది లేవు (ప్రణవయోగికి ఆసనము, కాలము, దిక్కులను హద్దులు లేవు). నాదాంతస్థితిలో చిత్తము ఇమిడి యుండుటయే మౌనసమాధి. శిరస్సు చిదాకాశ మహాప్రకాశములో బుద్ధిజ్ఞానములకు అతీతమైన శివాంశమొకటి గలదు. నాదము ద్వారా వెళ్ళి నాదాంతమును పొందువారి దారి, గమ్యము ఇదే సుమా!!

2937. చూపించుటకు ప్రతీకలో లేక గుర్తులో లేనిదగు, అన్నిటికీ అతీతతత్వమగు శివ కారణతత్వమును గ్రంథపఠనముతో గ్రహించునది కాదు. ఈ సత్యతత్వము శ్రేష్ట శ్రోత్రియబ్రహ్మ నిష్ఠయైన గురువు ద్వారా గ్రహించబడునదే తప్ప, మేకపోతు కంఠము నందు వ్రేలాడు వ్యర్థచర్మము వలె వ్యర్థ గ్రంథపఠనముతో పొందునది కాదు.

2938. మౌనసమాధి చేకూరినవారు ఇతరులకు కూడ ప్రణవదీక్ష ఇవ్వగలరు: శివధ్యాసలో ఇమిడి సదా అందే స్థితిపొందినవారు ఉన్న ప్రదేశమునుండే అన్నిటినీ గ్రహించగలరు (సర్వజ్ఞత). అట్టివారికి శోకముండజాలదు (బంధము, శోకం, వర్జితం). ఇటువంటి జ్ఞానము పొందినవారు ఇతరులను కూడ గ్రహించునట్లు చేసి, అట్లు గ్రహించిన శిష్యులు స్వీయానుభవముతో శివుని దర్శించుదురు.

2939. నా మరపులో కూడ అతనేయున్నాడు. అటువంటి మాయాలోక నాయకుడు వాడు. పునర్జన్మ రహితుడైన మహాఅనుగ్రహవంతుడు. సకలశ్రేష్టత గలిగినవాడు. శివశక్తియై నిదురకాని కలయికలో నిదురించువాడు.

2940. మౌనసమాధి సిద్ధించినవారు మూడు తురీయంలను (జీవ, పర, శివ) దాటి శివానుభవములోని జ్యోతిలో వెలయుదురు. జీవతురీయం – దేహతత్వములను విడచినది; పరతురీయం – ఆత్మానందమును దాటునది; శివతురీయం – నాద

బిందులకు అతీతమైన సృజనలో నెలకొని మాటలతో వర్ణించజాలని స్థితిలో వెలయుట.

2941. శివుని గురించి వర్ణన: నిరాకారుడు, అన్నమయ కోశముతో వృద్ధియైన మాంస శరీరము లేనివాడు, ఎటువంటి దోషము లేనివాడు. కీడు చేయు తలంపు లేనివాడు. దేవాదిదేవుడు. సాటిలేనివాడు, భూతగణనాథుల సైన్యము గలవాడు, అన్నిటికీ తాను ఆధారభూతుడుగా యున్ననూ, తాను మాత్రము నిరాధారుడు (దేనిపై ఆధారపడనివాడు). ఇటువంటివాడు నా మనస్సున వచ్చి నెలకొనెనే!!

2942. ఎత్తిన జన్మనందే శివుని దర్శించి స్తుతించు వారెవరూ లేరు. కాని అష్టదిక్కులందున్న వారు శివుడు అందరిలోనూ ఇమిడియున్నాడని తలంచి స్తుతించుచున్నారు. అండములను దాటి ఎల్లలు లేని మహా శివానందమును సాధకులు పొంది అనుభవించు విధివిధానములను గ్రహించజాలక ఉన్నారే!! ఎంతటి దౌర్భాగ్యం!!

2943. జ్ఞానసాధకులు పరాపర పదార్థమును తమలో సృజించవచ్చునే తప్ప పూర్తిగా దాని తత్వమెరుగ సాధ్యము కాదు: శివుడు నవతత్వ భేదములుగాయున్న పరమం కాదు. సదాశివుడు (అరూపరూప ఈశ్వరుడు) కాడు. అరూపుడు గాడు. సకల నిలమైనవాడు గాడు. వాడు ఆశ్చర్యకరమైన మధురానుభూతి వలె ఆత్మభావనలో నిజముగా నెలకొని ఆనందమొసగునే!!

2944. ముఖములోని నేత్రములతో దృశ్య విషయవస్తువులను చూచి ఆనందించు మూఢులారా! అంతర్ముఖముగా అంతర చక్షువులతో చూచి ఆనందించునదే శివానందమగును. తన కడుపున పుట్టిన కూతురికి తాను భర్తతో పొందిన సుఖానుభవమును నోటితో చెప్పుమన్న ఆ తల్లి ఏమని తన అనుభవమును చెప్పగలదు? చెప్పనలవి కాదు. (శివానందము అంతరమున సృజించునదే తప్ప మాటలతో, చేతలతో ఇతరులకు చెప్పనలవి కాదు.)

2945. అప్పులో (నీటిలో) ఉప్పు కలిసిపోయి నీరుగా కనిపించుటనట్లే అద్వైత శివుడు ఆత్మలో నెలకొని, ఆత్మపరగాను, శివుడు పరాపరముగా ఉన్ననూ రెండునూ కాక కలిసిపోయినట్లు, "తత్త్వమసి" మహావాక్యములో మూడవదియైన "అసి" పదము నశించి, కలిసిపోయి ఏకమైనట్లే సుమా!! (సమిష్టి తత్వమగు "తత్" బ్రహ్మా, వ్యష్టి తత్వమగు "త్వం", ఆత్మ కలిసిపోవుటచే "అసి" పదము లేకుండా పోయిన – ఏకమైన స్థితి.)

2946. జీవుడు ప్రపంచ భోగములు అశాశ్వతమని, అసత్యమని తలంచి త్రోసిపుచ్చినపుడే శివభోగమమరును: చూచువారికి దృశ్యప్రపంచమంతయూ విషముష్టి ఫలమువలె బహు ఆకర్షణీయముగా గోచరించును. కాని ఆ ఫలము తిన్న తరువాత దాని

చేదు తెలుయునట్లు దృశ్యప్రపంచానుభవం పిదప అది చేదని గ్రహింపబడును. కన్య పుష్పవతియై పూర్ణాకృతి పొంది పక్వపడి భర్తకు తోడగునట్లు జీవుడు బాహ్యమును త్రోసిపుచ్చి పక్వపడినపుడే శివభోగము వానిలో అమరును. (విషముష్టి ఫలము – NUX VOMICA – విషమునకు ప్రతీక.)

2947. వీధి మధ్యన నంది నెలకొనెను (దేహతత్వ సమూహమధ్యన నిలచి విధి నిర్వహించు ఆత్మలో శివుడు వెలసెను). సంధి, సమాధులన్నీ అవే తొలగిపోయినవి (సంస్కారములు, సమాధిలో నెలకొనుటవన్నీ అవసరము లేకపోయినవి). నాభిలో ఉద్భవించిన జ్యోతిని నా బుద్ధిపూర్వకముగా సృజించి శివునితో ఏకమైతిని.

2948. జ్ఞానసాధనలతో నీరసించక నాదసామీప్యముతో నాదాంతమును పొందవలెను: తాను తత్వములకు వేరైన వాడినని గ్రహించి, ఎటువంటి చంచలము లేక నాద సామీప్యముతో, ఉత్కృష్టమాయకు లోనగక దానిని త్రోసిపుచ్చి, ఊహాగానములను వదిలి (అపోహలు, అభావములను వీడి) జ్యోతియైన శివునిలో నెలకొంటిని.

2949. ఎప్పటికీ వాడిపోని పుష్పమును దేవతలు కోరజాలరు (సహస్రదళ పద్మము – చేయు సాధనలు). ధర్మతత్వములను ప్రతిదినము సాధన చేయుటచే శ్రేష్టమగు ఎర్రని ప్రకాశములో నెలకొని, అందు స్రవించు అమృతమును త్రాగజాలరు (దేవతలు భోగభూమియగు స్వర్గములోనుండుటచే శివానందభోగమునందు ఆసక్తి చూపజాలరు).

2950. గురువు, శిష్యుడు ఏకమైన స్థితిలో శివుడు జీవుని భావనలో స్థితియై నెలకొనును (సంపూర్ణ గురువు అనుగ్రహం పొందినవారిలో): కామవాంఛలతో నిండిన ఇద్దరు ప్రేమికులు మాటలు అదని, ఇదని సంభాషణలతో వారిలో అకస్మాత్తుగా కామకోరికలు పెళ్ళుబుకును. కాని సాధనానుకూలముతో అహంకారమును దాటి నెలకొన్న గురువుని దర్శించినచో తేనెలొలుకు పుష్పమాలను ధరించి పసుపు ప్రకాశమయుడైన శివుడు శాశ్వతానందంను ఒనగూర్చును కదా!!

2951. శివానుభవముతో తనలోని అహంకార మమకారాదులు తొలగి నశించును. శివానుభవముతో "నేను" నశించినది. ధనం నశించినది. శరీరం నశించినది. ప్రాణం నశించినది. అంతరమున నెలకొన్న సూక్ష్మశరీర బంధము నశించినది. మనస్సు నశించినది. నా అహం నశించినది. ఇవి ఎట్లు చెడినవని నాకు తెలియకున్నదే!!

2952. శివంతో ఏకమై ఇముడుటచే నా దృక్పథము మారిపోయినదే: మాయ చీకటియగు తత్వములు వెంట వెళ్ళక (దృష్టి సలుపక), శివప్రకాశమును నిస్సంశయముగా ఎరిగి, శివునిలో ఇమిడిన జీవుడన్న అన్యభావనలు లేక నెలకొని, అనుగ్రహముతో

అన్ని స్థితిగతులు చెడి నశించి, శివ పాదపద్మముల దరిచేరి దోషరహితమై, బండరాయి వంటి నిశ్చలత్వముతో నా మనస్సు స్థితి పొందినదే!!

2953. ఏకమైన పిదప (శివునిలో) నా అంతరమున సృజించితినే పరాపరమును. సృజించితినే శివగతిని. సృజించితినే గ్రహింపబడునదైన (ఎరుక) ప్రజ్ఞానమును. సృజించి (దైవములో ఇమిడి) నేను పలు యుగములను దర్శించితినే!!

## 19. హద్దులు లేని శ్రేష్టత

(జీవాత్మ తనను గ్రహించి శివునిలో ఇముడునదే ఎల్లలు లేని సర్వవ్యాపక శ్రేష్టతత్వము పొందును. బ్రహ్మ స్వరూపలక్షణములోని "అనంతత్వము". దేశ, కాల, వస్తు పరిమితి లేని అనంతతత్వము అది. హద్దులు లేనిది)

2954. తత్వములను దాటిన ఆత్మ పరవస్తువగు శివునితో ఐక్యమైన పిదప మరి ఎవరితో చేరగలదు? తానే అతనైన పిదప (అఖండ స్థితిలో) మరి ఎవరిని గురించి తలంచ గలదు? కామఇచ్ఛని జయించిన కళ్ళు మరి ఏ ప్రకృతి ఇచ్ఛలను కోరగలదు? మీరే మీ బుద్ధిలో నెలకొని చెప్పండి!!

(జీవాత్మ తన ఎల్లలు దాటి అఖండమైన శివునియందు ఐక్యమగుటచే విశుద్ధమై, అద్వైతమై, నిర్వికారమై వెలయును: ఇక తలంపులు, మరపులు ఉండజాలవు.)

2955. మాటలతో చెప్పనలవి కాని అఖండ శివంను పరిమితులు ఏర్పరచి చెప్ప యత్నించుట మూఢత్వమే యగును. అఖండ శివుని ఎల్లలు ఏర్పరచి చెప్పగలమా? పాచివర్జిత శుద్ధనీటిని చూచునట్లు, తేటపొంది పక్వపడిన వారికి ప్రకాశ కిరణములు గలిగి జటాధరుడు, శివమహామహుడు ఎటువంటి దాపరికము లేక బహిర్గతమగును!!

2956. మనోసంకల్పములు వీగిపోయిన జీవాత్మ తన యదార్థ స్వరూపములో స్థితిపొంది నిలుచుటయే ఎల్లలు దాటిన శ్రేష్టతయగును: మనోసంకల్పమే పెద్ద మాయ. ఈ సంకల్పమే మోహమును ఏర్పరచును. మనస్సు ద్వారా సృష్టించబడిన సంకల్పములను నశింపజేయుటయే తప్ప వేరేదియూ లేదు. దీని తరువాత ఇక నశింపజేయుటకు ఏదియూ మిగలదు. జీవాత్మ తన స్వరూపతత్వములో నెలకొని యుండుటయే శ్రేష్టతత్వమగును.

## 20. ఐక్యమైనవారి సహజత్వం

(శివునిలో ఐక్యమైనవారి గుణాతిశయములు)

2957. నందీశ్వరుని జ్ఞానమును దృఢముగా తమలో పదిలపరచుకొని, ప్రేమతత్వములో స్థితిపొందినవారికి ఇక మలములు లేవు. కీడు లేదు. మాన అభిమానములు

లేవు. గుణత్రయములగు తామస, రాజస, సాత్విక గుణదోషములు లేవు. కావున తనకు స్వార్థచింతన ఉండజాలదు (శివానంద ప్రేమలో మునిగినవారికి ఏ దోషము లంటవు).

2958. శ్రేయస్సు పూర్ణత్వం ఒనగూర్చు శివుని దర్శించితిని. పునర్జన్మ రహితుడనైతిని. బంధపాశములను తొలగించుకొంటిని. శివునిలో జీవబోధ తొలగి నిలచితిని. శివునిలో ఇమిడి స్థితిపొందుటచే ఇక సాధనలతో పొందదగు వేటినీ కోరనైతిని. (శివతత్త్వములో ఇమిడిన వారు మరే తత్త్వములను కోరజాలరు.)

2959. శివభూమిలో స్థితిపొందినవారు సంపూర్ణత్వములో వెలయుదురు: మరలో పిండిన చెరకురసము, పాలు, బెల్లము, పచ్చని బయలులో పారు సెలయేటి నీరున్న శివభూమిలో నెమలి ఈకలలోనున్న కన్నులు వంటి అందమైన ప్రకాశ కిరణములను వెదజల్లు పరాశక్తి వలన ఈ పుణ్యభూమిలో నెలకొన్నవారికి ఎటువంటి కొరత లుండజాలవు. (సంకల్పమాత్రమున పొందుటచే ఏ కొరతలుండవు.)

2960. శివుని అఖండ వ్యాపకములో నెలకొన్న పిదప తత్త్వములు, జ్ఞానము పొందవలసినది ఏదీ యుండదు: అన్ని జీవతత్త్వములను దాటించి శ్రేష్ఠమగు శివుడు నా చిత్తములో నెలకొనెను. కావున మరే తత్త్వములకు నేను బద్ధుడు కాజాలను. ఆ శివభూమిలో స్థితిపొందుటచే ఇక తత్త్వముల ద్వారా పొందునది మరేమియూ లేదు.

2961. బ్రహ్మచే ఏర్పరచిన జన్మబంధమును విడదీసి వేసితిని. శివగతిని చేరు తత్త్వమును నేను గ్రహించితిని. నా విధిని పదునైన మనస్సు అను కత్తితో కోసివేసితిని. నా స్థూల, సూక్ష్మ, కారణ శరీర పురములను నశింపజేసి గమ్యము వైపు పయనించు చున్నాను. (పదునైన మనస్సు – వివేకము, విచక్షణా జ్ఞానము – జ్ఞానఖడ్గము.)

2962. గ్రహించి దర్శించితిని!! జగత్తంతటికి ఒక మహాప్రకాశరూపములో నున్న దైవమును గ్రహించి దర్శించితిని!! అదే జగత్తుకి ప్రాణమని (వ్యష్టి రూపమునకు జీవునిలో ఇమిడిన ప్రాణంగా) సమిష్టిలో జగత్తుకు శివుడు ప్రాణముగా నిర్వహించుట. గ్రహించి పొందితిని. నమశివాయ యను శివఫలమును. ఇటువంటి శివఫలమును తిన్న నాకు శివతత్త్వ మధురరుచి బాగుగా బోధపడినదే!!

2963. ఆదియూ, అంతము లేని (అనంతమైన) పరంజ్యోతి స్వరూపుని ఐక్యపరచుకొన్న వారికి వారి చిత్తములో పదిలమై చీకటిని పారద్రోలి అనుగ్రహించును: ప్రకాశమగు చంద్రుని, పామును (కుండలినీశక్తి) ధరించిన జటాధారి శివుడు వచ్చి నన్ను ఆదుకొన్న స్వయంజ్యోతి స్వరూపుడు. ఆది మధ్యాంతములు లేని సత్యస్వరూపుడు. నా చిత్తములో నెలకొని మోహమను చీకటిని త్రెంచెను!!

2964. అనాది మా ఈశుడు. బ్రహ్మ, విష్ణువులను సృష్టించి, వారి తత్త్వములో ఇమిడిన

సూక్ష్మమును గ్రహించువారు లేరు. కాని బ్రహ్మాదుల కార్యములగు దేహతత్త్వములను దాటి మనోశూన్య స్థితికి (ఎటువంటి సంకల్ప వికల్పములు లేని, ఆసక్తిలేని స్థితి) చేరుకొన్నచో తొండము అచ్చట ఆసనమై వెలయును.

(తొండము – ఏనుగు తొండము ప్రణవమునకు ప్రతీక – ప్రణవ స్వరూపమే తన ఆకారముగానున్న శివుడు జీవుని చిత్తమును ఆసనముగా చేసుకొని వెలయును.)

2965. తల్లి తండ్రియగు దైవము నాయందు ప్రేమ సలిపి రక్షింపకున్నచో నా కన్నతల్లి తండ్రులు ఎట్లు నన్ను రక్షించగలరు? కావున తల్లితండ్రుల తోడుతో నేనుండి, శక్తి శివుని యందు ప్రేమ సలిపి, వారిని స్తుతించి నిలుచుంటిని సుమా!!

2966. శివునిలో ఐక్యమైనవారికి అన్ని సంకల్పములు నెరవేరును: శివదర్శనమైన నాలో (సాక్షాత్కారము) భూమితో కూడిన సముద్రములును, ఎత్తైన పర్వతశిఖరమును, ఊర్ధ్వలోకస్తులును, ఊర్ధ్వలోక నాయకులగు బ్రహ్మాది దేవతలును, ఆదిశక్తియూ, అష్ట దిక్పాలకులునూ వచ్చి నా చేతులలో ఇమిడిరి!! నేనిప్పుడు వారందరికన్నా అతీతుడుగా (ఉన్నతుడుగా) నిలుచుంటినే!!

2967. శివునిలో ఇమిడినవారే సర్వవ్యాప్తులై, దేవతల సమూహంగా ఉందురు. వారే మేరుపర్వతముగాను, ఆదియూగా, శరీరముగా, ప్రాణముగా, తత్త్వములుగాను, వారే రూపము దాటిన నాయకుడుగా వెలుగొందుదురు.

2968. యముడు వచ్చినయెడల నా జ్ఞానఖడ్గముతో వానిని బలముగా కొట్టుదును. శివుడు వచ్చినచో వాని మహాప్రకాశముతో కలిసి నెలకొందును. భవబంధములకు కారణమగు విధిని ముందే త్రెంచివేసితిని (పునర్జన్మలకు కారణములగు ద్వంద కర్మఫలితము). తపస్సుతో ఒనగూరిన సచ్చిత్తమునకు (శివానంద మహానుభూతి పొందిన చిత్తము) ఎదురెవరైన ఉన్నారా? (మహాతపస్సంపన్నులగు జ్ఞానులకు ఎదురేదీ ఉండదు కదా!!)

2969. చిత్తం శివమయమై మలత్రయములను దాటినవారు శుద్ధ శివమగుదురు. వారు మలబంధములను త్రెంచివేసినవారు. అటువంటి జ్ఞానులు సర్వదా నాదపర బిందులో స్థితిపొంది యుండుటచే శబ్దము ఏర్పరచు వాదప్రతివాదములు, ఘర్షణలు, ఆందోళనలు చేయరు.

2970. తలంచుట మరలా మరచుట అనునవి లేక సర్వదా శివుని చిత్తమున తలంచి నెలకొన చేసుకొన్నవారికి వారి కర్మఫలములన్ని త్రెంచివేయు విమలుడగు శివుడు వెలయును. కాని వానిని విడచి విడచి తలంచువారికి వారిని వదిలి దూరముగా వెళ్ళిపోవును సుమా!! (దృఢచిత్త ఏకాగ్రత, నిర్విరామధ్యాస లేని మదిలో నిలువజాలడు.)

2971. సర్వవ్యాపియగు శివమహామహుని కోరి “ఓ శివమహామహుడా!” యని ఎలుగెత్తి పిలిచి, స్తుతించిన వెంటనే “ఇదో ఇక్కడ ఉన్నానని” నా ఎదుట నిలిచెను. బంధములు కల్పించు నాయకుడుగాను, వాటిని తొలగించుమూర్తిగా నున్న నిత్యతత్వ మహామహుని స్తుతించి నిలుచున్నానే!!

2972. జ్ఞానసాధనలతో ఉన్నవారు శివుని సర్వవ్యాపకత్వమును గ్రహింపగలరు: పరమాధిపతిని స్తుతించి నమస్కరించి నిలుచున్నాను. అతనే పరమాత్మయని తేట పొంది నిలుచుంటిని. ఇక ఆతనిపై మరొక దైవముండునని తలంచజాలను. నా శరీరములో స్థితిపొందిన ఆదియైన శివుని నేను సృజించి నిలిచితిని. నేను జీవబోధను తొలగించుకొని అతనితో స్థితిపొందుటచే ఆతని అఖండ వ్యాపకత్వమును గ్రహించితిని సుమా!!

2973. నా మనోమండలమున శివుడు నెలకొన్నాడని గ్రహించి, సృజించి, ఆతని దివ్య చరణములందు ఇమిడి, పూర్వజన్మ కర్మలు, వాటి కారణములను నశింపజేసి, తనకని ఒక మనస్సులేని (తన ఇష్టాఇష్టములు లేని) నా నాయకుడు నా తలవిధి తొలగింపచేసి తత్వములను త్రెంచెను సుమా!!

2974. శివగురునాధుడు నా మనస్సును నెలకొని మార్పులన్నిటినీ తొలగించెను. జరావ్యాధులు లేని శరీరమునను గ్రహించి కాలహద్దులు చెరపి ఆదుకొని అనుగ్రహించెను. నాలో మార్పు చేయుటచే నన్ను వెంబడించిన దుఃఖసముదాయమును నశింపజేసితిని. అపుడు నాలో శివుడు ప్రకాశించి వెలుగొందెను.

2975. శివుడు తన దేవతల సముహముతో ప్రకాశమముగా నా మనస్సున నెలకొని జన్మకారణములగు బంధములను త్రెంచెను. నా తండ్రి నన్ను ఆదుకొన్న ఆదిపెరుమాళ్. తాను నన్ను ఆదుకొని నా మనస్సున ఇట్లు ఇమిడిపోయెను సుమా!!

2976. శివానందమను తేనెను రుచి చూచినవారు ఇక లౌకిక విషయములు వారికి రుచించజాలవు. చెరకువంటి కామవాంఛ, తేనెవంటి దాని రుచియూ కలిసిన ఈ కాయములో, పరిమళించు సువాసనయగు శివానందమును కోరి, దేహధర్మములు దాటి భావనాతీతములో శివంలో నెలకొనునపుడు కామమను చెరకు వెగటు పుట్టించి, తేనెయగు దాని రుచి పుల్లగా మారి రుచించజాలదు సుమా!!
(దేహధర్మములు = జీవబోధ తత్వములు వైదొలగి)

2977. శివమహిమను స్తుతించి, సర్వం శివార్పణ చేసినవారికి జన్మపీడ వదలును. అనాదిగా వచ్చు జన్మలలో చర్యలు, క్రియలు (సాధన, సంస్కారములు) చేసి వాటిని దాటించి నన్ను కరుణించి, నాపై ప్రేమ సలిపిన శివుని స్తుతించి నేను చేయు

కర్మలన్నిటినీ శివార్పణము చేయుటచే నా భావికర్మలను నశింపచేసి పునర్జన్మ లేకుండా చేసి అనుగ్రహించెను. (నిష్కామ్యకర్మలచే, ఈశ్వరార్పణతో చేయు కర్మలచే అకర్తగా మారుటచే సంచిత, ఆగామికర్మలు జనించక, జన్మపీడ వదులును.)

2978. లౌకిక స్థితిగతుల నుండి ఉన్నతి సాధించినవారికి మూలాధార అగ్నిశక్తి పొంగి పైకిప్రాకి సహస్రదళమునకు చేరును. సహస్రదళ పద్మములో వెలుగు జ్యోతికి భావనలను నేతితో నింపి ప్రకాశము వృద్ధిచేయుటచే, భువనాధిపతియైన నాయకులు రాలు "ప్రాశక్తి" ఇమిడి నెలకొనెను. జీవబోధము నశించి శివానుభవము గిట్టినదే!! (లౌకిక వాంఛలు నుండి దాటినవారికి శివమహానందము గలుగును.)

2979. అధోస్థితియగు కామస్థితి మారుటచే బహుసూక్ష్మమైన సహస్రదళము గ్రహించ బడును. ఈ స్థితిలో షట్చక్ర స్థానములు దాటి, జీవశక్తి సహస్రదళము చేరి శివగతి పొందును. సూర్యచంద్రులను తన వక్షోజములుగా గలిగిన ప్రాశక్తి చూడామణి ధరించి నెలకొనుటచే శక్తితో శివం వెలయును.
(ఈ మంత్రము 2530 పోలినది. రెండూ ఒకే అర్థము ఇచ్చునది.)

2980. జ్ఞానసాధకుడు శివుని యందు అపరిమిత ప్రేమతో పులకరించిపోవుట: ప్రేమతో దైవమునందు కరిగిపోవుదును. వాని స్తోత్రమును పాడుదును. నా ఎముకలు కరుగునట్లు రాత్రి, పగలనక స్తుతించుదును. బంగారుమణి వంటి నా ఈశ్వర పెరుమాళ్‌ని నాలో ఇముడుటగాను సాధన కృషిచేసి, నా సొంతము చేసుకొందును.

2981. కేవల కుంభకములో ప్రాణణ (శ్వాస) తత్వముల నుండి విడుపడి పరముతో స్థితిపొందుటచే అమరునది: మనస్సు వికసించి అణిగిపోయినదే మహాతపస్సు (లౌకిక వాంఛల రహితం). మనస్సు వికసించి అణిగిపోయినదే వాయువు (శ్వాస చలనము తగ్గుట). మనస్సు వికసించి అణిగిపోయినదే భువిప్రాణులందు (చిత్త వైశాల్యముతో సమత్వభావన). మనస్సు వికసించి వాక్కు నశించినదే ముక్తి (మాటలు లేని మౌనస్థితిలో అమరు పరమానంద స్థితియగు ముక్తి).
(జీవశక్తి పరముతో ఐక్యమగునపుడు ప్రాణవాయువు, అపానవాయువులు శిరస్సున లయమగుటచే ఏర్పడు స్థితి. వికసించి అణుగునది = వ్యవహారజగత్తులో సర్వ అనుభవము పొందిన మనస్సు లయమగుటచే ఏర్పడినది.)

## 21. స్తోత్రము

2982. చర్మనేత్రములకు గోచరము కాని దైవమను మాయగాడిని (మరిగియుండి వృత్తులు చేయువాడు) పట్టుకొనుటకు మనస్సను రథము ఎక్కి ఊరంతా తిరిగి కనుగొనక ప్రలాపములాడుదురు. నేను కూడ అటులనే పలు ప్రదేశములను తిరిగి నా దైవమును కనుగొనలేక మెరుపువంటి క్షణికమైన ఈ దేహాంతరమునందే కనుగొంటినే!!

(దేహము శివభూమికగా చెప్పబడినది.)

2983. పూర్వజన్మలందు దైవమును స్తుతించినవారికి ఈ జన్మలో నిలకడనైన స్థితి పొందుదురు: కొండంత ఎత్తుగా నున్న మదగజములను ఎక్కి పరివారముతో, మధురమైన సంగీతము గానము వింటూ వెళ్ళువారెవరనగా చాలా కాలానుకూలముగా (పూర్వజన్మల పుణ్యకర్మలతో) మహానాథుడగు శివుని దివ్యనామము స్తుతించి, ప్రార్థించి ఉన్నతి పొందినవారు సుమా!!

(యోగపరిభాషలో: ప్రణవయోగం చేకూరుటకు, సహస్రదళమందు సాత్వీక "అహం" సృజించుటకు, నాదము చేకూరుటకు పూర్వ పుణ్యకర్మలు తోడగువలెను.)

2984. ముత్యములలో మేలిముత్యముగా, సంతోషము గల్గించు ఉదయ సూర్యునిగా, దేవాదిదేవత లందరు కొలుచు శ్రేష్టదైవముగా నున్నవాడైన నా తండ్రిని చూడక వట్టి ప్రలాపములాడు నన్ను లోకులు పిచ్చివాడని చెప్పుచున్నారే!!

2985. నాలో ప్రవేశించి ఇమిడి నెలకొనెనే – ఆ పుణ్యమూర్తి (శుభములొన గూర్చువాడు). నాలో నెలకొనెనే – ఆ సర్వజ్ఞుడు (సకల జ్ఞానము గలిగినవాడు). నాలో ఇమిడి నెలకొనెనే – తన దాసానుదాసుల హృదయములో. అట్లు నాలో ఇమిడి నెలకొన్న దైవమును సదా స్తుతించి పూజింతునే!!

2986. భూత అద్దములతో (చర్మ నేత్రములతో) చూడ శక్యముగానివాడును, శిరస్సున నెలకొని యున్నవాడును, వేద అద్దముతో (జ్ఞాననేత్రములతో, జ్ఞానవిచారణలతో) చూడబడును. ధర్మబద్ధులై, ధర్మనియతితో ఉన్నవారికి వారి మనోమండలమున వెలయును. గీతం అద్దములో (ఉద్గీతమును) ఉద్భవించిన నాదమయుని (శివుని) సృజించి స్తుతించుచున్నాను. (ఉద్గీతం = మానసీక నాదముతో మొదలిడిన ప్రణవ నాదము నాదాంతముగా మారును.)

2987. శివనామమును నిర్విరామముగా జపించి, చిత్తమున పదిలపరచుకొన్నవారికి కామ్య ఆసక్తులు వైదొలగును: నాథుని దివ్యనామమును ఒక వెయ్యిమార్లు (లెక్కలేనన్ని విని వెయ్యిగా చెప్పబడినది) జపించండి! వెయ్యి విధములైన సుఖములను పొందుదురు! శిరస్సున చిత్తమును పదిలపరచి జ్ఞానసాధన చేసినవారికి వెయ్యి ఆశలనుండి విడుపడుదురు సుమా!!

2988. శివుని దివ్యచరణముల జ్ఞానము అన్నిటికన్నా శ్రేష్టమైన జ్ఞానము: శివమహామహుని జ్ఞానముతో పొగడి, స్తుతించుచున్నాను. నా శిరస్సునందే వాని దివ్యచరణములగు నాదబిందులను సృజించితిని! అందువలన శివయోగమును అందరూ గ్రహించునట్లు చాటుచున్నాను! నేను ఆ దివ్యచరణములే నా నాయకుడని స్తుతించి నమస్కరించు చున్నాను.

2989. జ్ఞానసాధనతో ప్రకాశమండలము సృజించబడి శివానందములో నెలకొందురు: పలు రకములైన సేవలు, సాధనలు చేసి నందీశ్వరుని దరిచేరండి! షట్చక్ర స్థానములలోని మధ్యనాడి గుండా సహస్రారము చేరి, ఆకాశమండలవాసులను నమస్కరించి, ఏకమైన స్థితిలో శివానందమును కోరినంత (వెగటు పుట్టని) అనుభవించి ఆనందమొందవచ్చును సుమా!!

2990. ఫలితములు ఎదురుచూచి చేయు కర్మలు ఆనందమొసగజాలవు: శివధ్యాసలోనున్న శివదాసులకు వారిని కోరి శివుడు వారి మనస్సులో నెలకొనును. కాని ఇంద్రాది దేవతలను వేడుకొన్నచో, వారికి కామ్యకర్మలతో పొందదగు సుఖభోగములు, దేవస్త్రీల గానము దొరకవచ్చునే తప్ప, దేవలోకమునకు అవ్వలనున్న శివగతి గిట్టునా? (గిట్టజాలదు.)

2991. మట్టిలో కలిసిపోయిన నీరువలె, మనుజులు లౌకిక బాహ్యవ్యవహారములతో మనస్సు కూరుకుపోయి, దైవతత్వము ఇదని గ్రహించజాలకున్నారు. చెరువులో నున్న నీటిని మరొక పాత్రలో పోసి తేట చూచునట్లు, తేట పక్వపడిన చిత్తములో శివుని పదిలపరచినచో చిత్తం శివమయమగును సుమా!!

2992. సత్యతత్వ స్వరూపియగు శివుని కోరి స్థితిపొందిన సాధకునకు కరతలామలకము వలె తాను వెలయును. కావున అటువంటి శుద్ధుని, పవిత్రతకే నెలవైన దేవాదిదేవుని కోరి వానిలో నెలకొని బాహ్యతత్వములను త్యజించితిని సుమా!!
(కరతలామలకము = చేతిలోనున్న ఉసిరికాయవలె – చేతిలో ఫలం లభ్యమైనట్లు.)

2993. ఇన్నాళ్ళు నెలకొనియున్న తత్వములను త్యజించి పరిమితము లేని శ్రేయస్సు ఒనగూర్చు జ్ఞానమును పొందితిని. నిస్సంశయజ్ఞానముతో శివరూపము పొంది, చీకటి మలములను పారద్రోలితిని. పొగతో లేచు భూతలము దాటి పుణ్యపురుషుని చేరితిని (చక్రస్థాన మూలాధార అగ్నిని ప్రకాశమయ సహస్రమునకు చేర్చుట). వేరుపరచి (దేహము వేరు, దేహి వేరని బోధపరచి) గ్రహింపజేసిన దాత వాడు. (శివుడు అనుగ్రహ ప్రదాత.)

2994. దాతలందరికి దాత నాయకుడు (శివుడు). ప్రకాశమండలనాయకుడు. ప్రకాశముగా ఒప్పారు కిరణములతో కూడిన జటాఝుటమును గలిగి వేదములకు ఆది. వంచనలతో నున్న ప్రజలు గ్రహించజాలక జీవుల హృదయములో మరిగియుండి ఆదుకొనువాడు. (వంచనలు = మనోశుద్ధి లేనివారు.)

2995. పరిపాలించు దివ్యచరణములను ఇచ్చి ఆదుకొని అనుగ్రహించిన దైవమును ప్రతిదినము నిర్విరామముగా సన్మార్గమున నిలచి స్తుతించువారికి కీడులు, దోషములు జ్ఞానఖడ్గంతో తొలగించబడినవి. నేను ప్రకాశము పొందుటయే

ధ్యేయముగా ఈ బాహ్యస్ఫురణలను వదిలి నిలిచితిని. (శివధ్యాసతో నున్నవారికి శివుడు తోడుండి బాహ్యవిషయములను వదిలించును.)

2996. మనస్సు కరిగి శివచరణ ధ్యాసతో నున్నవారికి, బాహ్యస్ఫురణ తొలగించబడిన ధీరులు ఉండు వీరస్వర్గమమరును. దివ్యచరణములు ద్వారా పుణ్యలోకము ప్రాప్తించును. తేటజ్ఞానము పొందినవారికి దివ్యచరణములే దివ్యతీర్థములగును. (శివుని దివ్యచరణములే భక్తులకు ఆర్తి, జన్మకర్మలు తొలగించునదే కాక అవే దివ్యతీర్థములు, పుణ్యలోకములగును.)

2997. ఈ శరీరమును ఆవరించియున్న మనోమండల చీకటిని తొలగించి అనుగ్రహించెను. తనకొక శరీరము లేక అందరిలో జ్ఞానమయమై వెలుగు బోధకుడు (శివ గురునాధుడు). జీవునిలో నెలకొన్న అరటిపండు (అజ్ఞానమునకు ప్రతీక)ను తాను తిని, జీవులకు జ్ఞానమొసగువాడు. పానకజ్యోతిని (శివానందమను పానకము వంటివాడు) నేను పట్టుకొని నిలచితిని సుమా!!

2998. చిదాకాశ ప్రకాశమే జీవుల బ్రహ్మలిపి వర్ణమగును. అదే దేవతలు నివసించు ప్రదేశము కూడ. అచ్చట సదా ప్రవహించు ఆకాశగంగ యున్నది – అదే స్తుతించ దగినది. అదే జన్మకర్మల ఫలములను త్రెంచు స్థలమగును. అదే అనుగ్రహశక్తిని దాటిన స్థలమగును. జగత్తుకి అంత్యస్థితి కూడ అదేనగును.
(బాహ్య వ్యవహారములంతటికీ అదే అంత్యము – చిదాకాశ ప్రకాశమే శక్తిపీఠమై జీవులు విధిని దాటించి వెలయునది.)

2999. చిదాకాశ ప్రకాశములో మేలైన దేవతలుండు స్థానము. దానికి క్రింది స్థానము శ్రేష్టతపస్వులది. దుఃఖములను అనుభవించు మనుష్యులది దానికి క్రిందిస్థానము. ఇట్లు జ్ఞానస్వరూపుడుగా ఆసీనమై బిల్వమాలలతో అలంకరించబడిన జటాధారి శివుడు జీవులకు ఏది సముచితమో అది చేసి అనుగ్రహించును సుమా!!

3000. ఆవరింపబడిన నల్లటి సముద్రములో ఉద్భవించిన విషమును ద్రావిన నీలకంఠుడు. ఏడేడు పదునాలుగు లోకములకు విత్తుగా (కారణముగా) నున్ననూ, తనకు ఏ జన్మలేనివాడు (అజః). అతను దట్టమైన అడవి, జలపాతములున్న కైలాసములో (శిరస్సు) వెలయువాడు. అతనే సకల శ్రేయస్సును ఒనగూర్చునదైన పంచాక్షరములో వెలయు రాజగును.

3001. జగత్తునకు ప్రాణముగా, పృథివిగా, వీచు వాయువుగా, ప్రజ్వలించు అగ్నిగా, ఆది పరాయణుడుగా (ఆదిపురుషుడుగాను), గొప్పగా ఆవరించిన మేఘముగా, నీరుగా, అన్నిటిని లయంచేయువాడుగా, అన్నివైపుల ఆసీనులైన దిక్పాలకులకు నాయకుడుగా ఉండి అనుగ్రహించుచున్నాడు.

3002. అగ్ని, సూర్యుల తత్వమెరిగి వాటిలో ఈశుడు ఇమిడియున్నాడు. అదే విధముగా మారుతి తత్వమెరిగి (వాయువు) అందులో ఇమిడియున్నాడు. చంద్రమండల తత్వమెరిగి అందులో నెలకొనియున్నాడు. చంద్రమండల తత్వమగు జ్ఞానము జీవునిలో వృద్ధియగునట్లు తోడ్పడును సుమా!!

3003. పంచభూతములను తనలో లయపరచుకొను శివుడు ఆశ్రయించినది జీవుల హృదయములో: స్థూలరూపములో నున్న పంచభూతములన్నియూ వాటి తత్వములతో సూక్ష్మముగా శివజ్యోతిలో ఇమిడియున్నవి. జగత్తుతో బద్ధులైన జీవులకు గమ్యము, ఆశ్రయము శివుడే అగును. తనచే కల్పించబడిన ఈ జగత్తుకంతటికీ తానే పరాపరుడు. జీవులు పక్వపడునట్లు తానే వారిలో నెలకొని ఆదుకొనును.

3004. తేటలేని, పక్వపడనివారు శివుని అఖండతత్వంను గ్రహింపలేరు: ముత్యమువలె మెరయు విశ్వాంతరాలమే శివుని దివ్యకిరీటము. ఏడులోకములు ఆతని దివ్యరూపము. ఆతని దివ్యపాదములు ఏడు అథపాతాలము వరకు చొచ్చుకుపోయి నిలుచున్నవి. మందబుద్ధులు ఈ సత్యంను ప్రశంసించి గ్రహింపజాలరు.

3005. ఆ ఆదిపరాపరుడే మనయొక్క పరం. అతనే ముక్తినొసగి జ్యోతిగా జగత్తులో ప్రకాశించువాడు. అతనే సోమ, సూర్య, అగ్నులు మూడుగా వెలయువాడు. అతనే ఆదిపరాపరుడుగా ఊర్ధ్వఅండలములకు మీదగాను, అధోఅండములకు క్రిందగాను, ఈ లోకములంతటికీ మధ్యగాను నెలకొనియున్నాడు.

3006. నాదస్వరూపుడై, దాసానుదాసులకు ముక్తికి మార్గదర్శకుడుగాను యున్నాడు: అండలములను ఉద్భవింపజేసి అందు వృత్తులు కల్పించిననూ వాటికి అతీతముగా శ్రేష్టత గలిగినవాడు. పిండాండమంతటినీ (రూపస్థితులుగా నెలకొన్నది) దాటిన మహా సూక్ష్మపురుషుడు. శివదాసులు కోరి దివ్యపాదముల శబ్దమును వినునపుడు, వారికి మార్గమును చూపి, వారికి తోడుగా వెళ్ళువాడు.

3007. గూఢచర్య దృష్టితో (నిగూఢతత్వము లన్నింటిలో స్థితిపొంది) మహాసముద్రములతో ఆవరింపజేసి, భూమండలమంతటిలో ఈశుడు నెలకొని జీవుల జీవనము కొరకునూ, ఫలము పొందునట్లు, అన్నిటినీ తాను ముందే సృష్టించి సమకూర్చి, లోకములోనున్న జీవులను రక్షించు సదుద్దేశముతో తాను బంగారు ప్రకాశములో వెలసి నిలచెను సుమా!!

3008. పరుడుగా, అపరుడుగా నెలకొని పలురకములైన కర్మలలో ఇమిడి, స్థూలముగా, సూక్ష్మముగా, సమస్త భువనములను మోయుచూ, వాటిని రక్షించుచూ యున్న ఆ ధరాధరుని తత్వము లోకులు ఎరుగకయున్నారు. అన్నింటా వ్యాపించిననూ తాను మాత్రము నిరాధరుడుగా ఆత్మలో ఇమిడియూ, దానికి అతీతముగాను నెలకొని యున్నాడు. (ధరాధరుడు = భూమిని మోయువాడు.)

3009. స్థూల, సూక్ష్మ శరీరములలో శివం పూర్ణత్వముతో నిండియుండుటచే స్తుతించుటకు వేరొక దైవము అక్కరలేదు. ఆధారమగు దేహము, ఆధారము దాటిన నాదము, నాదాంతములు, ప్రాణమునకు వేరుగా నుండి అఖండరూపుడగు అతనే శ్రేష్టదైవము. అతనే స్థూల, సూక్ష్మములను ఏకపరచు ప్రాణణ (శ్వాస)గా కలిసియున్నాడు.

3010. శివమహామహుడే జగత్సృష్టికి కారణముగా ఉండి తోడ్పడును: ఆవరించిన దశ దిక్కులు శివుడే అయినందున, మరి అతనికి వేరుగా బాహ్యముగా వేరొక దైవమున్నదని చెప్పవలదు! ఓ మనుజులారా! పొగ పైకిప్రాకి కనిపించినది అచ్చట అగ్ని ఉండుట వలనే సుమా!! అట్లే సృష్టించబడ్డ అన్ని మా ఆదిపరుడైన శివుని నుండియే ఉత్పన్నమైనవి సుమా!!

3011. ఏడేడు పదునాలుగు లోకములలో తానిమిడియుండి, వాటికి వేరుగాను నెలకొనియున్న శివుడు లౌకికుల దృష్టికి కానరాడు, దర్శనము ఇవ్వజాలడు. శివుడే పలు జీవవర్గములలో ప్రాణశక్తిగా ఇమిడి, వృత్తులు చేయుచూ, నిర్వహించుచూ, లౌకికులు నమ్మునట్లు వ్యవహారజగత్తునకు పాత్రుడుగా వెలసియున్నాడు.
(వ్యవహార జగత్తులోని అనుభవము, వ్యవహారములు, వినియోగ, ప్రయోజనములకు శివుడే కార్యకర్త. అన్నియూ అనుభవమైన పిదప వాటిని త్రోసిపుచ్చి అతీతముగా ఎదిగిన స్థితి – శివతత్వము.)

3012. కళలు మూడింటిని దాటి (ఆగమశాస్త్ర ప్రకారము దైవమును పొందుటకు తంత్రకళ, మంత్రకళ, ఉపదేశ కళలున్నవి. తంత్రకళ – సత్యస్వరూపమును నిగూఢముగా మరిపించి చెప్పునది. ఇది చర్యలు, క్రియల ద్వారా ఇష్టదైవ ప్రార్థన, సంస్కారములు. మంత్రకళ – మంత్రోపాసనలతో, మనోనిగ్రహముతో, చిత్తఏకాగ్రతతో పొందు దైవఫలములు. ఉపదేశకళ – గురోపదేశముతో, గురుముఖతః దేహము వేరు, దేహి వేరు అని బోధపరచుకొని, దేహబంధము విడనాడి, దేహిలో స్థితిపొందుట. ఇది సత్యతత్వ జ్ఞానసాధన.) అవ్వల నెలకొన్న నాయకుని కోరి పట్టుకొని నిలవండీ!! అతనే సకలతత్వనాథుడు. వెల కట్టలేనివాడు. వానిని దేవతల సమూహములో ఒకరిగా చెప్పుట తగదు. అట్లున్నవానిని సర్వదా మీ చిత్తమున తలంచినచో, తను మీలో శ్రేష్టముగా నెలకొనును సుమా!!

3013. పెక్కు తరాలుగా బ్రహ్మసృష్టికి కారణమైన పూర్వకర్మల బంధమును నశింపజేసెను. నారాయణుని స్థితికి కారణమైన ప్రేమపాశమును తొలగించి, తపోహఠ యోగాదుల సాధనలతో ఏర్పడు శారీరక కష్టములను విడిపించి నన్ను ఉన్నతి పొందునట్లు చేసి, ప్రేమతో ఆదుకొని అనుగ్రహించెను సుమా!!

3014. ఈశుడు శివజ్యోతిగా అష్టదిక్కులలో వెలసి ప్రకాశమును ప్రశరింపజేయుచున్నాడు.

నాదమే అన్నిటికీ కారణమైనట్లు తాను వెలసి, తానే ఏకముగా ప్రకాశమయుడై, తొమ్మిది ఖండములగు పృథివి, అప్పు, తేయు, వాయు, ఆకాశము, సూర్య, చంద్ర, అగ్ని, ఆత్మలో పుష్పములోని సువాసనవలె మరిగి నెలకొనియున్నాడు. ("ఏకమేవ అద్వీతయం" – శివుడే సృష్టి, స్థితి, లయకారకుడుగా నున్ననూ అన్నింటికీ అతీతముగా, అసంగుడు "మయ్యేవ సకలం జాతం, మయిసర్వం ప్రతిష్టతం"గా యున్నాడు.)

3015. నా దైవము దృగ్గోచరము కానందున అతను లేదనలేము!! చర్మచక్షువులతో చూడ శక్యము గానివాడు. కఠిన హృదయములలో తమ కఠినత్వము పోగొట్టుకొనినచో వారిలో నెలకొని బహిర్గతమగువాడు. తను అనాది, పరిశుద్ధుడు, అవికారి, నిర్మలమైన మాణిక్యం, మాటలతో చెప్పనలవికాని జ్యోతిస్వరూపుడు. జీవులందు నిలచి అనుగ్రహించుచున్నాడు.

3016. మనస్సున ఇమిడియున్నాడు. జీవులకు బాహ్యముగా జగత్తులోనూ స్థితిపొంది యున్నాడు. జటాధరుడైన నందీశ్వరుడు, ఇంద్రియములను వృత్తులు సలుపునట్లు చేయు దొంగనాయకుడు వాడే. పలు రకములైన దానధర్మములు చేసి, వానిని సర్వదా చింతనతో పదిలపరచుకొనువారికి వారి పునర్జన్మలను సముద్రమును త్రెంచి వెలయువాడగును.

3017. ఒకరికొకరు విరోధులైయున్న దేవతలు, దానవులు కూడ శివుని ప్రతిదినము స్తోత్రించి శబ్దించు దివ్యచరణములను నమస్కరించుచున్నారు. కాని తన దాసులకు అంతరమున, బాహ్యమున, వారికి ఉపయోగపడునట్లు వారి హృదయమున నిలచి, వారి దేహము వేరు, ప్రాణము వేరని బోధపరచి (దేహతత్వము, ఆత్మతత్వము వేరని), వారి భావనలో (బుద్ధిలో) నెలకొని జ్యోతిగా వెలుగుచున్నాడే!!

3018. శివమహామహుడు దృశ్యజగత్తునకు అతీతముగా జీవులకు మహానందము నొసగి అనుగ్రహించుచున్నాడు: భూతాకాశ బాహ్యములో మాత్రము నెలకొన్నవాడు కాదు. తన మహాసూర్య ఆకాశం, చిదాకాశంమను ఆకాశరూపములో ఉన్నవాడు. చర్మచక్షువులకు గోచరము కాదు. కాని అంతరచ్చక్షువులచే గ్రహింపబడువాడు. చిత్తశుద్ధి లేక పఠించు స్తోత్రములచే గ్రహింపబడువాడు కాదు. చిత్తశుద్ధితో వానిపై ప్రేమ సలపువారిచే గ్రహింపబడి అనుగ్రహించువాడు. జీవులు పొందు సకల ఆనందములకు కార్య, కారణ, కర్త మా పరముడు (శివుడు).

3019. మా పరమేశ్వరుడు ఉత్తముడు. ఉత్తములు పొందు పరమానంద సముద్రము అతను. ముత్యము వంటి తెల్లని జ్యోతిప్రకాశకుడు. గాఢమైన నీలిప్రకాశకుడు. శివజ్ఞానులు సర్వదా ఈశుని తమలో చింతన చేయుదురు. కాని సిద్ధులు పొందినవారు (అష్టమహాసిద్ధులు) దేవతలు తమ బుద్ధితో, పరిశోధనలచే గ్రహింప

జాలరు. (ఇచ్చట దేవతలు – సుఖభోగములలో మునిగి యున్నవారు – లక్ష్యార్థము – శివుడు బుద్ధిచే, పరిశోధనలచే గ్రహింపబడజాలడు.)

3020. ప్రేయస్సు, శ్రేయస్సులను గ్రహించి శ్రేయస్సును పదిలపరచుకొన్నచో ఉన్నతి పొందనగును: ఏ రంగులు తమకెదురుగా కనబడునో ఆ రంగున ఈశుడు దర్శన మిచ్చును. ధర్మబద్ధత, ధర్మనియతి ఎంతవరకో అంత ఆనందమును నొసగును. దురలవాట్లు ఆచరించుటచే ఎంత ఉధృక్తమో అంత పాపములు పెరుగును. ఇట్లు సత్యస్థితిని బాహ్యముగా చూచుచున్ననూ మనుజులు శ్రేష్టత్వమును పాటించడము లేదే!!

3021. మహాకారుణ్య వర్షము కురిపించు నా దైవము ఈ భూతలములో నున్నాడు. ఊర్ధ్వములో నున్నాడు. అంతటాయున్నాడు. అన్ని భువనములలో నిండి నెలకొన్న పుణ్యమూర్తి ఆతను (పూర్ణత్వము పొంది). అతను జీవుల కారుచీకటియగు అజ్ఞానములోనూ ఇమిడియున్నాడు. జ్ఞానప్రకాశముతో సూర్యునివలె ప్రకాశించు వాడునూ అతనే!!

3022. భావన రూపమయుడగు శివుడు జీవుల భావనలలో నెలకొని ఆదుకొనును: భావనలే బహుశ్రేష్టమైనచో, బహుసూక్ష్మముగా మహామహుడు గ్రహింపబడును. ఆ మహామహుని గ్రహింపబడునది కూడ బహు సూక్ష్మతత్వమే యగును. దేహము, భావనలు, అండకాశములతో వెలసి శివప్రకాశములో స్థితిపొందియున్నాడు.

3023. తన సర్వశక్తితో, సర్వవ్యాప్తితో ఏడు లోకములను ధరించియున్నాడు. తన సర్వ శక్తితో అణువుకన్నా పరమాణువుగా నెలకొనియున్నాడు. తన సర్వవ్యాప్తితో అష్ట పర్వతములను దాటి నెలకొనియున్నాడు. తన సర్వవ్యాప్తితో విశాల సముద్రములలో వ్యాపించియున్నాడు.

3024. శివుడు తపస్సంపన్నుల ఉన్నతి తగ్గట్లు వారిలో స్థితిపొందును: నా దైవమగు శివ మహామహుడు భూలోకస్తులను, ఊర్ధ్వలోకస్తుల ఉన్నతి కొరకు శ్రేష్టత గలిగిన వాడైననూ, అతను ఈ జీవుల అల్పశరీరములోని భావనలో సమ్మిళతమై నెలకొని యున్నాడు. ఊర్ధ్వలోకస్తులచే గ్రహింపబడని మహాప్రకాశరూపుడు మహాదేవుడు. భూలోకస్తులు చేయు తపస్సు సంపన్నత తగ్గట్లు తానే కోరి గ్రహింపబడువాడుగా యున్నాడు సుమా!! (సర్వజ్ఞుడు, సర్వశక్తి, సర్వవ్యాప్తియైన శివుడు అల్పజీవుల ప్రాణములో, భావనలో ఇమిడియూ, వారి తపోపరిపక్వత తగ్గట్లు వారిని ఆదుకొని అనుగ్రహించును.)

3025. పిండమగు ఈ దేహమున మర్రిచెట్టు విత్తనమువలె పైకి వచ్చు జీవశక్తి బాగుగా పెరిగి మహావృక్షమై, పక్వపడి పండి, ప్రకాశ కిరణములతో వెలుగొందినది. దీనిని

గ్రహించిన బుద్ధిమంతులు దీనిని అనుభవించి ఉన్నతి పొంది వెలసిరి. కాని ఇది గ్రహించని మూఢులు దేహమే శ్రేష్టమని భావించి, మోహంతో, బంధములలో చిక్కుకొని చెడి నశించుచున్నారే!! ఎంత అజ్ఞానం!!
(దేహేంద్రియ మనోబుద్ధులే శ్రేష్టమన్న భావన అనాత్మతత్వము. దీనిని దాటి శరీరత్రయ విలక్షణం, అవస్థాత్రయ సాక్షియగు ఆత్మను తనలో గ్రహించి రాగ, ద్వేష, బంధములను త్రోసిపుచ్చి స్థితిపొంది, జనన, మరణచక్రము బారినుండి దాటునదే సత్య, శాశ్వత శివతత్వములో నెలకొనునది.)

## 22. సర్వవ్యాపి

(సర్వవ్యాప్తం పొందిన తత్వము)

3026. జ్ఞానసాధనలతో శివానుభవము గిట్టును. ఇదేకాక ఆత్మ విచారణతో పొందు జ్ఞానము, మాయ ఉపాదులచే ఏర్పడిన బారి దేహం తన వశమగునట్లు చేయును. అపుడు దేహంలో నున్న విషయ వాసనలు నశించును. పిదప ఆత్మ యొక్క వ్యాపకము అమరును. (శివజ్ఞానానుభవంతో జీవుని ఆత్మ సర్వవ్యాపకత్వము పొందును.)

3027. జీవుడు సర్వజ్ఞుడు, సర్వవ్యాపి యగును: నేను సృజించి ఎరిగిన శివం సర్వదా, అన్నిటిలోను నెలకొని యుండుటచే నేను వెళ్ళి చేరుటన్నది లేదు. శిరస్సున నున్న ఆకాశమండలమును ఎరిగి స్తుతించి స్థితిపొందినచో అదే శ్రేష్టమై వెలయును. అపుడు శరీరతత్వ మెరిగి అంతరమున వెలుగు ప్రకాశమయమైన జ్యోతిని, తన యదార్థతత్వమును (సత్య ఆత్మతత్వము) గ్రహించినవారికి అన్నిటినీ పొందగల సర్వజ్ఞత, సర్వవ్యాప్తి సామర్థ్యము గిట్టును.

3028. అంతరజ్యోతిని దర్శించి దైవముతో ఏకమగుట: సముద్రఅలల వలె అంత్యము లేని దుఃఖములను ఏర్పరచు ఈ లోకజీవనములో, దేహముతో జీవించునపుడే జీవులు తమ అంతరమున వెలుగు జ్యోతిని గ్రహించి స్థితిపొంది, అచ్చట వెలుగు శివుని సృజించినచో సముద్ర అలలవంటి దుఃఖమును దాటి ఒడ్డుకు చేరగలరు సుమా!!

3029. శివుడు జీవులను తన కరుణతో ఆదుకొని అనుగ్రహించును: సోమసూర్యాగ్నులగు త్రివిధ అగ్నులకు ప్రకాశము ఇచ్చువాడైన దేవదేవుడు వాటికి శరీరముగాను వెలసి యున్నాడు. పైన చెప్పిన త్రివిధ ప్రకాశములకు మించినదైన "జ్యోతిషాం జ్యోతి"గా పరంజ్యోతిగా జగత్తంతా వ్యాప్తి చెందినదిగా ఆ మహామహుడు జీవులను కరుణించి వారికి తోడుగా వెళ్ళు సూక్ష్మమైనవాడు.

3030. విధివశమైన జీవుడు దైవమునందు శరణునొందిన మహాప్రకాశముతో స్థితి పొందనగును: లౌకిక జీవన విధానములో పడి కొట్టుమిట్టాడి, దుఃఖములను

అనుభవించిన జీవుడు, అంత్యమున దైవమునందు శరణునొందుటచే దైవము తన కర్తవ్యముగా తలంచి రక్షించును. అంతరమున వెలుగు బంగారు ప్రకాశ ఈశానమూర్తిని సృజించినచో శిరస్సున మహాప్రకాశకుడుగా తాను నెలకొనును!!

3031. బంధమేర్పరచునదైన ఏదైనా ఉన్నదన్నచో మిక్కిలి శ్రేష్టమైన శివమయ మగుటయే. అది అంతటా నెలకొని సూర్య, చంద్ర, అగ్నులు మూడు ప్రకాశములుగాను, నుదుటి భ్రూమధ్యమును తలంచు వారికి దాని ఉనికిని గ్రహింపజేసి స్థితి పొందును. తలంచువారు కూడ ప్రకాశముతో నొప్పారి తపోశ్రేష్టులుగా వెలుగుదురు. (ఆజ్ఞాచక్రమున జ్ఞానరూపుడుగా వెలుగొందును.)

3032. శివమైన జీవుడు అన్ని శబ్దములకు నాధుడై, శబ్దస్వరూపుడై వెలుగును: ముందు మంత్రములో చెప్పినట్లు శివమైన జీవుడు రూపముతో నున్న దేవతయగును. దశ దిక్కులను తానే నిర్వహించగలడు! నీటితో ఆవరించబడిన ఏడు లోకములకు వ్యాప్తిపొంది తన వశమగును. పైగా తను ప్రపంచమంతటిని గ్రహించి చెప్పగల వాక్పటిమను పొందును.

3033. తనకు రాకపోకలు యన్నది లేక (అనాగమాపాయి) దాసులకు తాను ఆగమాపాయిని కల్పించును: సూక్ష్మమైన గరుడ దృష్టి గలిగి సప్తలోకములను వీక్షించి, వేగముగా వెళ్ళి దాసుల దుఃఖము నివర్తి చేయు లోకనాయకుడు, నిర్మలుడు, జన్మము లేనివాడు (అజః) మా నాయకుడు. తనకి రాకపోకలు లేకున్ననూ, దాసులకు రాకపోకలు కల్పించు సామర్థ్యుడు.

3034. శివజ్ఞానులందు నెలకొన్న శివుడు ప్రకాశ కిరణములు ప్రశరించు జటాధారి. ఆతని శరీరము బంగారువన్నెతో మెరయును. అతను జగత్తుకు అసంగుడైననూ, సర్వజగత్తుతో వ్యవహరించువాడు (సర్వజ్ఞుడు). ఎందునూ వైదొలగనివాడు (తోడుండు వాడు), చావు పుట్టుకలు లేనివాడు. సప్తలోకములకు అసంగుడుగా నున్ననూ సప్తలోకములను కలిసి నిర్వహించువాడు (సర్వవ్యాపి).

3035. భావనలు అతనే, ప్రాణము అతనే, విషయగ్రహణ అతనే, చవిచూచు ఇంద్రియ ప్రజ్ఞలు అతనే. ఇట్లు వెంటాడు అతడు మనస్సుకు, ప్రమాణములకు గోచరము కాదు. అతను పుష్పములోని సువాసనవలె అంతటా వ్యాపించి అనుగ్రహించువాడు.

3036. శివుడు మహాజ్ఞాన స్వరూపుడు కనుక సర్వజ్ఞానములు అతనిలోనే యున్నవి: నా శివమహామహునికి విద్యతో పొందవలసినదేదియూ లేదు. జీవుల కొసగవలసిన అన్ని జ్ఞానములు తన వద్దనే గలిగినవాడు. వెల కట్టలేని, శ్రేష్టమైన వేదికులు చెప్పు పలు వేదార్థములందు ఇమిడి, వ్యాప్తి చెందియున్నాడు.

3037. శివుడు ఆకాశమయమై, సప్తలోకములకు అవ్వల, అతను పృథివిగా, సప్త సముద్రములు ఆవరించిన చల్లదనము ఇచ్చువాడుగా, వానియందు శరణునొందు

వారి కుడికంటిలో వెలుగువాడుగా, జీవులయందు కలిసి నెలకొనియున్నాడే!!

3038. శివుడే అన్నిటికీ ఆధారభూతుడై నిలిచి అనుగ్రహించుచున్నాడు. శివుడు నిలిచెనే! బ్రహ్మ విష్ణువులు తానై! నిలిచెనే! భూమి ఆకాశములుగా. నిలిచెనే! మేరు పర్వతముగాను, సప్తసముద్రములుగాను! నిలిచెనే! సాధకులకు శ్రేష్టమైన ఫలమును (జ్ఞానఫలానుగ్రహం) నొసగువాడుగా!!

3039. మా శివుడు సకల భువనాధిపతి! పుణ్యమూర్తి! సకల జీవరాశులకు రక్షకుడు! అతనే సకల జీవవర్గములుగాను యున్నాడు. ఇటువంటి మహామహుడే నాయకుడని శివజ్ఞానులు కోరి నిలుచున్నారు. (జీవవర్గము లన్నిటిలోను ప్రాణమునకు ప్రాణముగా ఇమిడి రక్షించుచున్నాడు.)

3040. శివుడు ప్రాణ, అపానవాయువులను నిర్వహించుచూ, కంటిలో దృష్టిగా వెలయువాడు: జీవుని చర్మనేత్రములో నున్న దోషరహితమైన ప్రాణణగా, అండాకాశములో విస్తరించిన కిరణములు గల చంద్రుడుగా, భూతలముపై నెలకొని వృత్తులు చేయు అపానవాయువుగా నిలుచున్నవాడు. కంటిలో దృష్టిగాను వెలసి యున్నాడు సుమా!!

3041. అంకెలుగా, అక్షరములుగా (ప్రణవాక్షరములుగా), గురోపదేశముతో చేయు సాధనలను సృష్టించి అనుగ్రహించిన పరముడుగా, అంతర్చక్షువులతో చూడదగు తత్వముగా, జీవుని భావనలో నెలకొని, దేహతత్వములను మార్చి అమర్చి, అది (శివుడు) ఇదై (జీవునిలో స్థితిపొంది), సాటిలేని సత్ఫలములను అనుగ్రహించు వాడగును సుమా!! (జీవ ఈశ్వర ఐక్యబోధన)

3042. ఆవరించియున్న అష్టదిక్కులు, అండము, పాతాళము, సృష్టించినవన్నియూ తనలో లయమగునట్లు, బంగారురంగుతో జ్ఞానరూపిగా మెరసి ప్రకాశించు జటాధారి (శివుడు) అన్నింటిలో సూక్ష్మముగా, అన్ని తత్వములలో కలిసి నెలకొనియున్నాడు సుమా!! (శివుడు అన్ని తత్వములలో ఇమిడియూ, వాటిని జీవుని నుండి వేరుపరచి అనుగ్రహించువాడుగాను యున్నాడు.)

3043. పలు విధములైన తత్వములుగా తను ఉన్నది భూలోకవాసులు ఎరుగుదురు. కాని ఆతని సత్యతత్వమును గ్రహించువారు ఎవ్వరూ లేరు. అతను సుదూరముగా, అతిదగ్గరగాను యున్నాడు. తనలో ఎటువంటి మార్పులేని (నిర్వికారి)వాడుగా జీవులకు సుఖము లొనగూర్చువానిగా, అనాదిగా నున్నాడు మా శివుడు. పలు తత్వములుగా ఉండుటయే కాక వాటికి అతీతముగాను నెలకొనియున్న తత్వమగును సుమా!!

3044. అన్ని జీవులలోని జ్ఞానమునకు జ్ఞానరూపుడుగా, అతనే అతి పురాతనుడుగా,

నెలకొన్ననూ అతను నిలుచున్న స్థితిని జీవులకు ఏ ప్రమాణముల చేతను గ్రహింపబడనివాడు. నెలకొన్న అష్టభువనములందున్న సకల జీవరాశులను తానెరుగును సుమా!! (అష్టభువనములు = పంచభూతము + సూర్య, చంద్ర, అగ్ని = 8.)

3045. జలము, పృథివి, ఆకాశము, అగ్ని, వాయువులగు పంచభూతములవి (వరుస క్రమము పద్యములోనిది) యన్నియూ నెలకొన్న శరీరమునకు ఆధారభూతుడుగా, స్థితిపొందిన జ్యోతిమయుడుగా నున్నాడు. వానిపేరు పరాపరుడు. అణువునకు అణువుగా నున్నవాడు నా దైవము. సకల తత్వములతో కూడి క్షీణత లేనివాడు.

3046. మూలన్ (శ్రీ తిరుమూల నాయనార్ – గ్రంథరచయిత) పలికిన ఈ మూడువేల తమిళ పద్యములు, మూలన్ పలికిన మూడువందల మంత్ర పద్యములు, మూలన్ పలికిన ముప్పది ఉపదేశ పద్యములు (మొదటి తంత్రంలో – మొదటి విభాగము – ఉపదేశము – 30 పద్యముల కూర్పు), తను అనుగ్రహించిన పై మూడు విధ పద్యములు ఒకటే యగును (ఒక్క తత్వమును సూచించునదే).

## 23. ఆశీర్వచనములు

3047. వర్థిల్లుగాక, వర్థిల్లుగాక!! నా నందీశ్వరుని దివ్యపాదములు.

వర్థిల్లుగాక, వర్థిల్లు గాక!! నా మలములను త్రెంచిన దివ్యపాదములు.

వర్థిల్లుగాక, వర్థిల్లుగాక!! సత్య జ్ఞానమును నొసగిన దివ్యపాదములు.

వర్థిల్లుగాక, వర్థిల్లుగాక!! నిర్మలుడగు వాని దివ్యపాదములు.

(పై మంత్రము శివ గురునాథుని వర్థిల్లమని కోరడము – శివ గురునాథుడే శివుడు కనుక శివునికే చెందును.)

"తిరుచ్చిట్రంభళం" – దివ్యచైతన్యము నీయందు పదిలమగుగాక!!
శివానుగ్రహమునకు పాత్రులగుగాక!!
శ్రీ తిరుమూల నాయనార్ అనుగ్రహం మీయందు పదిలమగుగాక!!

తొమ్మిదవ తంత్రము సమాప్తము
తిరుమంత్ర గ్రంథము సంపూర్ణం
సర్వం శివార్పణమస్తు – ఓం తత్సత్
ప్రేమే శివం – శుభం భూయాత్
సర్వేజనాః సుఖినోభవంతు
శ్రీ

# స్వీయ పరిచయము



శెవ్వాన రంగనాయకులు కృష్ణారావు M.Com., P.G.D.C.A, (ICWA) పుట్టి పెరిగినది, చదువుకున్నది మద్రాసులో. తండ్రి, తాతగార్లు శ్రీకాకుళము జిల్లాలోని హిరమండల తాలూక సువలై గ్రామస్తులు, పిదప మద్రాసుకు వలస. నా ఉద్యోగము Binny Ltd. మద్రాసు, కోయంబత్తూరులోను, కాస్ట్ అక్కౌంటింగ్ సీనియర్ మేనేజర్‌గా పనిచేసి పదవి విరమణ అనంతరము విశాఖపట్టణములో స్థిర నివాసము. పెద్దలు వంద సం॥ల పైగా మద్రాసులో నివాసము వలన తమిళ భాషలో పట్టుతో, అచ్చతేనె తెనుగుపై ప్రేమతో, మాతృభాషాభిమానము వలన, తెలుగువారికి సాహితి రంగమున చేయదగిన సహాయము చేయగోరి, నేను చేసిన చిన్న ప్రయత్నము. ఇది వరకే మా గురువుగారి ఆనతి ప్రకారము, తను రచించిన తమిళములోని **"సాంఖ్యయోగము"**ను మరియు **తిరుక్కురళ్, తిరుప్పావై-తిరుపల్లాండు, తిరువాచకం**, ప్రస్తుతం **తిరుమంత్రము** నాచే తెలుగున అనువదించబడినదని సవినయముగా తెలియజేస్తున్నాను.

E-mail ID: sevvanakrishna@yahoo.com

Cell: 9704655002